త్యాగరాజ గేయార్థకుంచిక

(త్యాగరాజ కృతుల వివరణము)

వివరణకర్త

"సంగీత సాహిత్య కళానిధి"

నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు



త్యాగరాజ గేయార్థకుంచిక

(త్యాగరాజ కృతుల వివరణము)

వివరణకర్త :

'గానకళా ప్రపూర్ణ'
'సంగీత కళాసాగర'
'హరికథా చూడామణి'
'సంగీత సాహిత్య కళానిధి'
నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు

ప్రచురణ : జనవరి 2011
ప్రతులు : 500

మూల్యము : రూ.300/-

(సర్వహక్కులు ప్రకాశకులవి)

దొరకు స్థలము :

ఎమ్.ఎస్.ఎన్. మూర్తి
49-4-2, లలితానగర్
విశాఖపట్టణం - 530016
ఫోన్ : 0891-750590

ప్రింటింగ్ :

రామకృష్ణా ప్రింటర్స్ ప్రై. లిమిటెడ్
✆ : 712272,740222



కీ॥ శే॥ యడవల్లి రామచంద్ర రావు గారికి

ఈ గ్రంథము అంకితం



త్యాగరాజ గేయార్థకుంచిక

వివరణకర్త

'గానకళా ప్రపూర్ణ'

'సంగీత సాహిత్య కళానిధి'

నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు

ఉ॥ ఏయెడ నైహికార్థముల నేగకనీక నిజాంతరంగమ్ము
బాయని భక్తి రామపద పంకజభృంగముగా నొనర్చి రా
గాయిత రత్నమాలికల నందముగా ధరియింపజేసి యా
ప్యాయన మందజేసిన బుధాగ్రణి త్యాగయ సంస్మరించెదన్.

ఉ॥ త్యాగయ కీర్తనాళిగల యర్థములన్ లిఖియించుటన్నచో
సాగర తీర్థమెత్తుటకు జాలిన దుష్కరకృత్యమైననున్
నాగురుతా వగాహనమునన్‌గల కొందరు ప్రోత్సహించుటన్
దూగితి నీ పనిన్ జరుపదోడగుగావుత నాతడే యికన్॥

- నా మాట -

శ్రీ త్యాగరాజ స్వామి వారి కృతులకు అర్థ వివరణం వ్రాసే గురుతరభారం నేనిప్పుడు వహించవలసి వచ్చినది. ఈ పని అత్యవసరమా? నా ఉద్దేశ్యంలో కాదు. గాయక విద్వాంసులు చేసే పాట కచ్చేరీలకు అవసరంలేదు. వారికున్న జ్ఞాన పరిధిలో పాట కచేరీలు జరిగిపోతూ ఉంటాయి. అర్థము పూర్తిగా తెలిసి పాడినందువలన పెరిగే డిమాండు లేదు, అర్థ జ్ఞానం లేక పాడినందువలన తరిగేది లేదు. కాని అర్థ వివరణ ప్రయత్నాలు కొన్ని జరిగినవి. 55 సంవత్సరాల క్రితం రాజమండ్రి గౌతమీ విద్యాపీఠంవారు కీ। శే। కల్లూరి వీరభద్ర శాస్త్రి గారిచేత ఈ పని చేయించి ప్రకాశింపచేశారు. ఆగ్రంథం చాలా ఉపయోగపడినట్లు చాలామంది భావించారు, కొంత నిజం లేకపోలేదు. కాని నా దృష్టిలో కొంత గ్రంథ విస్తారము అచ్చటచ్చట పరిష్కారావశ్యకత గోచరించినది నాకు. ఇవి ఎత్తిచూపటమే నన్ను ఈ బరువులో ఇరికించినది. నన్ను ప్రధానంగా ఈ పనికి ప్రోద్బలంచేసినది నా శిష్యుడు చి॥ ముట్నూరి శ్రీనివాస నరసింహమూర్తి. అధమ పక్షం 5 సంవత్సరాలనుంచి నాకు ఇతని ప్రోద్బలం ఎక్కువైనది. ఇది తప్పలేదు. దిగాను. ఈ పని ఒక్క సంవత్సరం పట్టవచ్చును. 21వ శతాబ్దం మొదటి భాగంలో ఇది వెలుగు చూడవచ్చును. అయ్యగారి కృతులు పలు విధములుగ నున్నవి. కొన్నిటికి తాత్పర్యము వ్రాసిన చాలును. కొన్నిటికి ప్రతి పదార్థము వ్రాసి తాత్పర్యము వ్రాసిన చాలును. కొన్ని కృతులు వ్యాఖ్యానింపవలసి యున్నవి. కొన్ని రామాయణార్థములతో ముడిపడి

వివరింపతగి యున్నవి. కొన్ని వేదోపనిషదర్థములు కలిగి యున్నవి. మొత్తము మీద ఈ పని సామాన్యము సులభమును కాదు. అయినను నెత్తిపైన భారమును వేసుకొన్నాను. మల్లినాథసూరి కాళిదాస కావ్య వ్యాఖ్యానమునకు పూనుకొన్నప్పుడు 'భారతీ కాళిదాసస్య కువ్యాఖ్యావిషమూర్ఛితా ఏషా సంజీవనీ టీకా తామద్యోజ్జీవ యిష్యతి' = కాళిదాసుని వాక్కు ఇంతకుముందు కొన్ని కువ్యాఖ్యలనెడి విషముచే మూర్ఛిల్లినది. నా సంజీవనీ వ్యాఖ్యదాని నిప్పుడు బ్రతికింపగలదు. అన్నాడు. ఇట్టి పరిస్థితి కూడ నాకెదురు కావచ్చును. పండితులు మాత్సర్యము వీడి సామాన్యులు తత్త్వదృష్టికొరకు పఠించిన నా శ్రమ ఫలించును.

'త్యాగరాజ కీర్తనలు' సవ్యాఖ్యానము అని 1948లో రాజమండ్రి ఆంధ్రగాన కళాపరిషత్తు కీ। శే। విస్సా అప్పారావు గారి సంపాదకత్వములో కీ। శే। కల్లూరి వీరభద్రశాస్త్రి గారి వ్యాఖ్యానముతో ప్రచురింపబడినది. వ్యాఖ్యానము చాల విస్తృతముగా నున్నది. ప్రతిపదార్థమునందు వ్యాఖ్యానమునందును ఎడనెడ పరిష్కారములు నాకు గోచరించినవి. వాటి ఉపన్యాసమే నా శిష్యునిచే నాపై నీ భారమును పెట్టించినది. మల్లినాథసూరి తన వ్యాఖ్యానమును గూర్చి 'నామూలం లిఖ్యతే కించి న్నానపేక్షిత ముచ్యతే' = మూలమున లేని దానిని వ్రాయను. అవసరము లేనిదానిని చెప్పను' అనినాడు. ఈ మార్గము నా కాలంబనీయము. వీరభద్రశాస్త్రిగారు కీర్తనలకు అకారాద్యనుక్రమణికను పాటించినారు. నేనును అదియే అనుసరించుచున్నాను. ఇక సుమారు 30 ఏండ్ల క్రింద త్యాగరాజకృతులు అనే పేరుతో 27 కృతులను ఎవరో ప్రచురించినారు. అవి త్యాగరాజశైలికి అన్ని విధములా దూరముగా నుండుటచేత వాటిని పరిహరించుచున్నాను. అవి ఇందుచేర్చితే త్యాగరాజున కపచారమని నాభావము. వీరభద్రశాస్త్రిగారి గ్రంథములో క్రింద ఫుట్ నోట్‌లో పాఠాంతరము అని కొన్ని సూచనలు చేసిరి. వాటిలో కొన్ని పాఠాంతరములని వ్రాసినవే అసలు పాఠములనే నా అభిప్రాయము ప్రకారమే అసలు పాఠముగా వ్రాసి పాఠాంతర సూచనలు చెయ్యలేదు. అది ఉపయోగములేని పని. మరియు గేయచందస్సు ననుసరించి పంక్తుల విభాగము పంక్తిలో తాళవిభాగానుసారముగా చుక్కలు పెట్టితిని. నేను మూలముగా కృతులను వీరభద్రశాస్త్రిగారి గ్రంథము నుండి గ్రహించితిని. దానిలో ఎక్కడనైనా మాత్రాధిక్యము మాత్రాలోపము తోచిన ఆ సవరణలు చేసితిని.

మరియు నా మిత్రులు కీ॥ శే॥ యడవల్లి రామచంద్రరావు గారి సతీమణి వెంకట మహాలక్ష్మిగారు, కుమారులు లీలాధర రామమూర్తి, సుబ్రహ్మణ్యం, కుమార్తె చి॥ సౌ॥ దేవరకొండ తార ఈ గ్రంథ ముద్రణ వ్యయమును రామార్పణముగా నర్పించిరి. త్యాగరాజ వరదుడగు శ్రీ రామచంద్రుడు అందరికిని ఆయురారోగ్య భాగ్యము లిచ్చి రక్షించుగాక అని ఆశాసనము చేయుచున్నాను.

విజయవాడ
20-12-2000

ఇట్లు
నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు

విషయసూచిక

సంఖ్య	కృతి	రాగము	తాళము	పుట
	ఘనరాగపంచరత్న కృతులు			
1	జగదానందకారకా	నాట	ఆది	1
2	దుడుకుగల	గౌళ	ఆది	3
3	సాధించెనే	ఆరభి	ఆది	4
4	కనకనరుచిరా	వరాళి	ఆది	6
5	ఎందరో	శ్రీ	ఆది	8
	కృతుల అకారాది పట్టిక			
6	అందుండకనే	పంతువరాళి	త్రిపుట	10
7	అంబనిను నమ్మితి	ఆరభి	ఆది	11
8	అట్లబలుకుదువు	అఠాణ	ఆది	12
9	అటుకారాదని	మనోరంజని	ఆది	13
10	అడిగి సుఖము	మధ్యమావతి	చాపు	14
11	అడుగువరముల	ఆరభి	చాపు	16
12	అతడే ధన్యుడురా	కాపి	చాపు	17
13	అదికాదుభజన	యదుకుల కాంభోజి	ఆది	19
14	అనాథుడనుగాను	జింగ్లా	ఆది	19
15	అన్యాయముసేయకురా	కాపి	ఆది	20
16	అనుపమగుణాంబుధి	అఠాణ	జంపె	22
17	అనురాగములేని	సరస్వతి	రూపకము	23
18	అపరాధములనోర్వ	రసాళి	ఆది	24
19	అపరాధములమాన్పి	దర్బారు	జంపె	25
20	అప్పరామభక్తి	పంతువరాళి	రూపకము	26
21	అభిమానములేదేమి	ఆంధాళి	చాపు	27
22	అమ్మధర్మసంవర్ధని	అఠాణ	ఆది	28
23	అమ్మరావమ్మ	కల్యాణి	జంపె	30
24	అలకలల్లలాడగగని	మధ్యమావతి	రూపకము	31
25	అల్లకల్లోలమాయెనమ్మ	సౌరాష్ట్రము	ఆది	32
26	ఆడమోడిగలదే	చారుకేశి	ఆది	33

27	ఆదయశ్రీరఘువర	ఆహిరి	ఆది	34
28	ఆనందమానంద	భైరవి	ఆది	35
29	ఆనందసాగర	గరుడధ్వని	దేశాది	37
30	ఆరగింపవే	తోడి	రూపకము	37
31	ఆడువారమెల్ల	యదుకులకాంభోజి	చాపు	38
32	ఇంకాదయరాకుంటే	నారాయణగౌళ	ఆది	39
33	ఇకకావలసినదేమి	బలహంస	ఆది	40
34	ఇతరదైవముల	ఛాయాతరంగిణి	రూపకము	41
35	ఇదినీకు మేరగాదురా	పున్నాగవరాళి	ఆది	42
36	ఇది సమయమురా	ఛాయానాట	ఆది	43
37	ఇదే భాగ్యము	కన్నడ	త్రిపుట	44
38	ఇన్నాళ్లుదయ	నారాయణగౌళ	చాపు	45
39	ఇన్నాళ్లునన్నేలి	ఘంట	త్రిపుట	46
40	ఇలలో ప్రణతార్తి	అఠాణ	ఆది	48
41	ఇంతయోచనైతే	ఘంట	ఆది	49
42	ఇంతకన్నానంద	బిలహరి	రూపకము	50
43	ఇంతకన్నదెల్పతరమా	సావేరి	చాపు	51
44	ఇంతనుచు వర్ణింప	గుండక్రియ	ఆది	52
45	ఇంతభాగ్యమని	పున్నాగవరాళి	చాపు	53
46	ఇందుకాపుట్టించితివి	భైరవి	ఆది	55
47	ఇందుకా ఈతనువును	ముఖారి	చాపు	56
48	ఇన్నాళ్లవలె	దేశికతోడి	చాపు	58
49	ఈవసుధ	శహన	ఆది	59
50	ఈవరకుజూచినది	శంకరాభరణము	ఆది	61
51	ఈశపాహిమాం	కల్యాణి	రూపకము	62
52	ఇపుడైనను దలచినారా	ఆరభి	చాపు	64
53	ఇంతతామసమైతే	సావేరి	చాపు	65
54	ఇంతసౌఖ్యమని	కాపి	ఆది	66
55	ఇందుకా ఈతనువు	పున్నాగవరాళి	చాపు	68
56	ఇందుకేమి సేతునమ్మ	వరాళి	చాపు	70
57	ఉపచారము	భైరవి	ఆది	74
58	ఉపచారముజేసేవారు	భైరవి	రూపకము	75

59	ఉన్నతావున	ఘంట	చాపు	77
60	ఉండేది రాముడొకడు	హరికాంభోజి	రూపకము	78
61	ఊరకేగల్గునా	శహన	చాపు	79
62	ఎటుల కాపాడుదువో	ఆహిరి	త్రిపుట	80
63	ఎటులబ్రోతువో	చక్రవాకము	త్రిపుట	82
64	ఎటులైనభక్తి	శ్యామ	చాపు	82
65	ఎట్లాదొరికితివో	వసంత	ఆది	84
66	ఎదుటనిలచితే	శంకరాభరణము	ఆది	85
67	ఎన్నగమనసుకు	నీలాంబరి	ఆది	86
68	ఎన్నడుజూతునో	కళావతి	ఆది	87
69	ఎన్నాళ్లు నీదోవ	కాపి	చాపు	89
70	ఎన్నాళ్లు తిరిగేది	మాళవశ్రీ	ఆది	92
71	ఎన్నాళ్లూరకే	పంతువరాళి	చాపు	93
72	ఎవరని	దేవామృతవర్షిణి	ఆది	95
73	ఎవరిచ్చిరిరా	మధ్యమావతి	ఆది	96
74	ఎవరికై అవతార	దేవమనోహరి	చాపు	97
75	ఎవరితోనేదెల్పుదు	మానవతి	దేశాది	99
76	ఎవరుతెలియగ	తోడి	రూపకము	100
77	ఎవరు తెలియబొయ్యేరు	పున్నాగవరాళి	చాపు	101
78	ఎవరురానినువినా	మోహన	చాపు	102
79	ఎవ్వరేరామయ్య	గాంగేయభూషణి	దేశాది	104
80	ఎవరైనలేరాపెద్దలు	సిద్ధసేన	దేశాది	104
81	ఎట్లకనుగొందునో	ఘంట	చాపు	105
82	ఎన్నడోరక్షించితే	సౌరాష్ట్ర	ఆది	106
83	ఎవరిమాటవిన్నావో	కాంభోజి	ఆది	108
84	ఎవరుమనకు	దేవగాంధారి	ఆది	109
85	ఏటియోచనలు	కిరణావళి	ఆది	110
86	ఏటిజన్మమిది	వరాళి	చాపు	111
87	ఏతావున నేర్చితివో	యదుకులకాంభోజి	ఆది	111
88	ఏతావునరా	కల్యాణి	దేశాది	112
89	ఏదారిసంచరింతురా	శృతిరంజని	దేశాది	113
90	ఏదినీబాహుబల	కాపి	ఆది	114

91	ఏనాటినోముఫలమో	భైరవి	ఆది	115
92	ఏపనికోజన్మించితి	అసావేరి	దేశాది	116
93	ఏపాపముజేసితి	అఠాణ	త్రిపుట	117
94	ఏమని మాట్లాడితివో	తోడి	ఆది	119
95	ఏమందునే	శ్రీమణి	ఆది	121
96	ఏమనిపొగడుదురా	వీరవసంతము	ఆది	121
97	ఏమిజేసితేనేమి	తోడి	చాపు	121
98	ఏమినేరమో	శంకరాభరణము	ఆది	123
99	ఏమిదోవ	సారంగ	ఆది	123
100	ఏరామునినమ్మితినో	వకుళాభరణము	త్రిపుట	124
101	ఏల తెలియలేరో	దర్బారు	త్రిపుట	126
102	ఏలనీదయరాదు	అఠాణ	ఆది	128
103	ఏవరమడుగుదురా	కల్యాణి	రూపకము	129
104	ఏవితమునైన	శంకరాభరణము	ఆది	133
105	ఏహిత్రిజగదీశ	సారంగ	చాపు	134
106	ఏనోమునోచితిమో	పున్నాగవరాళి	రూపకము	135
107	ఏమనినెరనమ్మి	సౌరాష్ట్రము	చాపు	136
108	ఏమనివేగింతునే	హుసేని	ఆది	137
109	ఏమేమొతెలియక	సౌరాష్ట్రము	చాపు	138
110	ఏలావతార	ముఖారి	ఆది	139
111	ఎంతముద్దో	బిందుమాలిని	ఆది	141
112	ఎంతనినేవర్ణింతును	ముఖారి	రూపకము	142
113	ఎంతనేర్చినా	శుద్ధధన్యాసి	ఆది	143
114	ఎంతరానీ	హరికాంభోజి	దేశాది	144
115	ఎంతవేడుకొందు	సరస్వతీమనోహరి	దేశాది	145
116	ఎంతభాగ్యమో	సారంగ	దేశాది	145
117	ఎందుకుదయరాదు	తోడి	త్రిపుట	146
118	ఎందుకొగలింతురా	శుద్ధదేశి	ఆది	147
119	ఎందుకునిర్దయ	హరికాంభోజి	దేశాది	147
120	ఎందుకుపెద్దల	శంకరాభరణము	దేశాది	148
121	ఎందుకోబాగ	మోహన	ఆది	149
122	ఎందుదాగినాడో	తోడి	త్రిపుట	150

123	ఎందుబోయెరా	ధన్యాసి	రూపకము	151
124	ఎందుండివెడలితివో	దర్బారు	త్రిపుట	153
125	ఎంతనుచువర్ణింతు	సౌరాష్ట్రము	చాపు	153
126	ఎంతనుచుసైరింతును	యదుకులకాంభోజి	ఆది	155
127	ఎంతపాపినైతి	గౌళిపంతు	చాపు	156
128	ఎందుకీచలము	శంకరాభరణము	త్రిపుట	157
129	ఎందుకోనీమనసు	కల్యాణి	ఆది	158
130	ఒకపారిజూడగ	కలావతి	ఆది	159
131	ఒకమాట	హరికాంభోజి	రూపకము	160
132	ఒరులనాడుకోవలసిన	శుద్ధసావేరి	ఆది	161
133	ఓరంగశాయీ	కాంభోజి	ఆది	163
134	ఓరజూపు	కన్నడగౌళ	ఆది	164
135	ఓరమారమణ	కేదారము	ఆది	165
136	ఓరాజీవాక్ష	ఆరభి	చాపు	166
137	ఓరామ ఓరామ	ఆరభి	ఆది	167
138	ఓరామరామ	నాగగాంధారి	చాపు	169
139	ఓజగన్నాధా	కేదారగౌళ	ఆది	170
140	ఓడనుజరిపే	సారంగ	ఆది	171
141	కడతేరరాదా	తోడి	దేశాది	171
142	కదలేవాడు	నారాయణగౌళ	ఆది	172
143	కనుగొంటిని	బిలహరి	దేశాది	173
144	కనుగొనుసౌఖ్యము	నాయకి	రూపకము	174
145	కమలాప్తకుల	బృందావనసారంగ	దేశాది	174
146	కరుణాజలధే	నాదనామక్రియ	ఆది	175
147	కరుణజూడవమ్మ	తోడి	ఆది	176
148	కరుణాజలధీ	కేదారగౌళ	చాపు	182
149	కరుణాసముద్రా	దేవగాంధారి	ఆది	183
150	కరుణజూడవయ్యా	సారంగ	ఆది	184
151	కళలనేర్చినా	దీపకము	దేశాది	185
152	కలిగియుంటే	కీరవాణి	ఆది	186
153	కలినరులకు	కుంతలవరాళి	దేశాది	187
154	కలుగునా	పూర్ణలలిత	ఆది	188

155	కట్టుజేసినావు	అఠాణ	ఆది	189
156	కద్దనువారికి	తోడి	ఆది	190
157	కన్నతల్లి	సావేరి	ఆది	191
158	కన్నతండ్రినాపై	దేవమనోహరి	ఆది	192
159	కర్మమే	సావేరి	చాపు	193
160	కనులుతాకని	కల్యాణవసంతము	రూపకము	194
161	కమలభవుడు	కల్యాణి	చాపు	195
162	కరుణ ఏలాగంటే	వరాళి	ఆది	195
163	కంటజూడుమీ	వాచస్పతి	దేశాది	196
164	కారుబారు	ముఖారి	ఆది	197
165	కారువేల్పులు	కల్యాణి	ఆది	198
166	కాలహరణ	శుద్ధసావేరి	రూపకము	198
167	కాసిచ్చేదే	గౌళిపంతు	ఆది	200
168	కులబిరుదును	దేవమనోహరి	రూపకము	201
169	కువలయదళ	నాటకురంజి	ఆది	201
170	కృపజూచుటకు	ఛాయాతరంగిణి	ఆది	202
171	కృపాలవాల	నాదవరాంగిణి	ఆది	203
172	కృష్ణామాకేమి	పున్నాగవరాళి	చాపు	204
173	కొనియాడే	కోకిలధ్వని	ఆది	205
174	కొలువమరెగదా	తోడి	ఆది	206
175	కొలువైయున్నాడే	భైరవి	ఆది	208
176	కోటినదులు	తోడి	ఆది	209
177	కోరిసేవింపరారే	ఖరహరప్రియ	ఆది	210
178	గట్టిగానునను	బేగడ	ఆది(త్రిశ్రగతి)	211
179	గతమోహాశ్రితపాలా	శంకరాభరణము	రూపకము	212
180	గతినీవని	తోడి	ఆది	213
181	గంధముపుయ్యరుగా	పున్నాగవరాళి	ఆది	214
182	గానమూర్తే	గానమూర్తి	ఆది	215
183	గారవింపరాదా	ఘంట	రూపకము	215
184	గిరిపైనెలకొన్న	శహన	ఆది	216
185	గిరిరాజసుతా	బంగాళ	ఆది	217
186	గీతార్థము	సురటి	ఆది	218

187	గురులేక	గౌరీమనోహరి	జంపె	219
188	గ్రహబలమేమి	రేవగుప్తి	దేశాది	220
189	ఘుమఘుమ	సౌరాష్ట్రము	చాపు	221
190	చక్కని రాజమార్గమే	ఖరహరప్రియ	ఆది	222
191	చనితోడితేవే	హరికాంభోజి	ఆది	223
192	చలమేలరా	మార్గహిందోళము	ఆది	224
193	చల్లగనాతో	వేగవాహిని	ఆది	224
194	చల్లరేరామచంద్రునిపై	ఆహిరి	మిశ్రచాపు	225
195	చాలకల్లలాడుకొన్న	ఆరభి	ఆది	226
196	చాలుచాలు	సావేరి	రూపకము	227
197	చిత్రరత్నమయ	ఖరహరప్రియ	ఆది	228
198	చింతిస్తున్నాడే	ముఖారి	ఆది	229
199	చిన్ననాడె	కళానిధి	దేశాది	230
200	చూతామురారె	ఆరభి	రూపకము	230
201	చూడరేచెలులార	పంతువరాళి	చాపు	231
202	చూతామురారే యీవేడ్కను	కాపి	చాపు	232
203	చెడేబుద్ధిమానురా	అఠాణ	ఆది	233
204	చెంతనేసదా	కుంతలవరాళి	ఆది	234
205	చెలిమినిజలజాక్షు	యదుకులకాంభోజి	ఆది	235
206	చేతులార	ఖరహరప్రియ	ఆది	236
207	చేరరావదేమిరా	రీతిగౌళ	ఆది	237
208	చేసినదెల్ల	తోడి	ఆది	237
209	జయజయసీతారామ్	సావేరి	చాపు	238
210	జయజయ శ్రీరఘురామ	గౌరి	ఆది	239
211	జనకజాసమేత	అసావేరి	రూపకము	240
212	జానకీరమణ	శుద్ధసీమంతిని	ఆది	241
213	జ్ఞానమొసగరాదా	పూర్వికల్యాణి	రూపకము	242
214	తనవారితనము	బేగడ	ఆది	243
215	తనమీదనే	భూషావళి	ఆది	243
216	తత్త్వమెరుగతరమా	గరుడధ్వని	రూపకము	244
217	తప్పిబ్రతికి	తోడి	రూపకము	245
218	తలచినంతనే	ముఖారి	ఆది	246

219	తలిదండ్రులు	బలహంస	ఆది	247
220	తవదాసోహం	పున్నాగవరాళి	ఆది	248
221	తనయందేప్రేమ	భైరవి	చాపు	248
222	తనలోనే ధ్యానించి	దేవగాంధారి	ఆది	249
223	తనయునిబ్రోవ	భైరవి	ఆది	250
224	తప్పగనేవచ్చునా	శుద్ధబంగాళ	రూపకము	251
225	తీరునా నాలోని	సావేరి	జంపె	252
226	తులసీదళములచే	మాయామాళవగౌళ	రూపకము	253
227	తులసి జగజ్జననీ	సావేరి	రూపకము	253
228	తులసీబిల్వ	కేదారగౌళ	ఆది	254
229	తులసెమ్మ	దేవగాంధారి	ఆది	254
230	తెరదీయగరాదా	గౌళిపంతు	ఆది	255
231	తెలియలేరురామ	ధేనుక	ఆది	256
232	తెలిసిరామచింతనతో	పూర్ణచంద్రిక	ఆది	257
233	తొలినేజేసిన	శుద్ధబంగాళ	ఆది	259
234	తొలిజన్మమున	బిలహరి	జంపె	259
235	తొలినేనుజేసిన	కోకిలధ్వని	ఆది	260
236	దండముబెట్టేనురా	బలహంస	ఆది	261
237	దయలేనిబ్రతుకు	నాయకి	జంపె	261
238	దయరానీదయరానీ	మోహన	ఆది	262
239	దయజూచుటకిది	గానవారిధి	ఆది	263
240	దరిదాపులేక	సావేరి	ఆది	263
241	దరినితెలుసుకొంటి	శుద్ధసావేరి	ఆది	264
242	దర్శనము	కేదారగౌళ	జంపె	266
243	దయసేయవయ్య	యదుకులకాంభోజి	ఆది	267
244	దశరథనందన	అసావేరి	ఆది	268
245	దాచుకోవలెనా	తోడి	జంపె	269
246	దాశరధీ	తోడి	ఆది	270
247	దాశరధే	కోకిలప్రియ	ఆది	271
248	దినమణివంశ	హరికాంభోజి	ఆది	271
249	దీనజనావన	భూపాల	చాపు	272
250	దుర్మార్గచరాధములను	రంజని	రూపకము	273

251	దేవరామ	సౌరాష్ట్రము	రూపకము	274
252	దేవాధిదేవ	సింధురామక్రియ	ఆది	275
253	దేవీశ్రీతులశమ్మ	మాయామాళవగౌళ	ఆది	276
254	దేవశ్రీతపస్వీర్ధ	మధ్యమావతి	త్రిపుట	277
255	దేహితవపద	శహన	ఆది	278
256	ద్వైతముసుఖమా	రీతిగౌళ	ఆది	279
257	దొరకునా	బిలహరి	ఆది	280
258	దొరకునా అని సురల	తోడి	రూపకము	282
259	ధరనునీసరిదైవము	వరాళి	ఆది	283
260	ధర్మాత్మనన్నిపుడు	కేదారగౌళ	జంపె	284
261	ధ్యానమేవరమైన	ధన్యాసి	ఆది	285
262	నగుమోముగనలేని	ఆభేరి	ఆది	286
263	నడచినడచి	ఖరహరప్రియ	ఆది	287
264	నన్నువిడచి	రీతిగౌళ	చాపు	288
265	నన్నుబ్రోవ	ఆభోగి	ఆది	289
266	ననుపాలింప	మోహన	ఆది	289
267	ననుగన్నతల్లి	సింధుకన్నడ	ఆది	290
268	నన్నుబ్రోవకను	శంకరాభరణము	చాపు	291
269	నమోనమోరాఘవాయ	దేశికతోడి	త్రిశ్రలఘువు	292
270	నమ్మకనే	అసావేరి	రూపకము	293
271	నమ్మివచ్చిన	కల్యాణి	రూపకము	294
272	నరసింహా	బిలహరి	త్రిపుట	295
273	నళినలోచన	మధ్యమావతి	చాపు	296
274	నాజీవాధార	బిలహరి	ఆది	298
275	నాటిమాట	దేవక్రియ	ఆది	299
276	నాడాడినమాట	జనరంజని	త్రిపుట	300
277	నాధాబ్రోవవే	భైరవి	ఆది	300
278	నాదలోలుడై	కల్యాణవసంతము	రూపకము	301
279	నాదతనుమనిశం	చిత్తరంజని	ఆది	302
280	నాదసుధారసంబిలను	ఆరభి	రూపకము	303
281	నాదుపైబలికేరు	మధ్యమావతి	జంపె	304
282	నాదోపాసన	బేగడ	ఆది	306

283	నామకుసుమములచే	శ్రీరాగము	ఆది	307
284	నామొరాలకింపవేమి	దేవగాంధారి	రూపకము	307
285	నామొరలనువిని	ఆరభి	ఆది	309
286	నాయెడవంచన	నభోమణి	ఆది	309
287	నారదగురుస్వామీ	దర్బారు	ఆది	310
288	నారదగానలోల	అఠాణ	రూపకము	311
289	నారాయణహరి	యమునాకల్యాణి	ఆది	312
290	నారదముని	పంతువరాళి	చాపు	314
291	నిజముగనీమహిమ	శహన	ఆది	315
292	నిజమర్మములను	ఉమాభరణము	ఆది	315
293	నిధిచాలసుఖమా	కల్యాణి	త్రిపుట	317
294	నిన్ననవలసినదేమి	కల్యాణి	చాపు	318
295	నిన్నాడనేల	కన్నడ	ఆది	319
296	నినువినాసుఖముగాన	తోడి	రూపకము	320
297	నినువినానామదెందు	నవరసకన్నడ	రూపకము	321
298	నిన్నేనెరనమ్మినాను	ఆరభి	చాపు	322
299	నిన్నేభజన	నాట	ఆది	323
300	నిన్నేనెరనమ్మినానురా	పంతువరాళి	రూపకము	323
301	నిరవధిసుఖద	రవిచంద్రిక	ఆది	324
302	నిజమైతేముందర	భైరవి	చాపు	325
303	నిత్యరూప	కాపి	రూపకము	326
304	నీకుతనకు	బేగడ	త్రిపుట	327
305	నీకెవరిబోధన	శుద్ధసావేరి	ఆది	328
306	నీకే తెలియకపోతే	ఆనందభైరవి	ఆది	328
307	నీకేదయరాక	నీలాంబరి	చాపు	329
308	నీచిత్తము నిర్మలము	ధన్యాసి	చాపు	330
309	నీచిత్తము నాభాగ్యమయ్యా	విజయవసంతము	ఆది	331
310	నీదయరావలెగాక	తోడి	ఆది	332
311	నీదయరాదా	వసంతభైరవి	రూపకము	333
312	నీదయచే	యదుకులకాంభోజి	ఆది	334
313	నీదాసానుదాసుడ	హమీర్‌కల్యాణి	ఆది	335
314	నీపదపంకజములను	బేగడ	ఆది	335

315	నీభజన	నాయకి	ఆది	337
316	నీభక్తి భాగ్యసుధా	జయమనోహరి	రూపకము	337
317	నీముద్దుమోము	కమలామనోహరి	ఆది	338
318	నీవంటిదైవమును	తోడి	ఆది	339
319	నీవాడనేగాన	సారంగ	జంపె	341
320	నీవేరాకులధనము	బేగడ	చాపు	342
321	నీవేగాని	బిలహరి	చాపు	343
322	నీదయగల్గుటే	రీతిగౌళ	ఆది	345
323	నీవంటిదైవము	భైరవి	ఆది	346
324	నీవుబ్రోవవలెనమ్మ	సావేరి	ఆది	346
325	నీవేకన్నడజేసితే	సౌరాష్ట్రము	చాపు	348
326	నెనరుంచరా	సింహవాహిని	ఆది	349
327	నెనరుంచినాను	మాళవి	ఆది	350
328	నేనెందువెదకుదురా	కర్నాటకబేహాగ్	ఆది	351
329	నేపాగడకుంటే	వరాళి	జంపె	351
330	నేమొరబెట్టితే	రూపవతి	త్రిపుట	352
331	నేరమారామ	సౌరాష్ట్రము	ఆది	352
332	నోరేమిశ్రీరామ	వరాళి	ఆది	353
333	ప్రక్కలనిలబడి	ఖరహరప్రియ	త్రిపుట	354
334	పదవినీసద్భక్తి	సాళగభైరవి	ఆది	355
335	పరమపావన	పంతువరాళి	చాపు	356
336	పరమాత్ముడు	వాగధీశ్వరి	ఆది	357
337	పరలోకభయము	మందారి	ఆది	358
338	పరలోకసాధనమే	పూర్వికల్యాణి	ఆది	359
339	పరాకుజేసిన	జుజావళి	ఆది	360
340	పరాకునీకేలరా రామ	కిరణావళి	ఆది	360
341	పరాశక్తి	సావేరి	ఆది	361
342	పరిహాసకమా	వనస్పతి	రూపకము	362
343	పరిపాలయ	రీతిగౌళ	ఆది	363
344	పరిపాలయ దాశరథే	దర్బారు	చాపు	364
345	పరితాపము	మనోహరి	రూపకము	365
346	పరిపూర్ణకామ	పూర్వికల్యాణి	రూపకము	366

347	పలుకవేమి	పూర్ణచంద్రిక	ఆది	366
348	పలుకకండచక్కెర	నవరసకన్నడ	ఆది	368
349	పట్టివిడువరాదు	మంజరి	ఆది	368
350	పరిపాలయమాం	దర్బారు	చాపు	369
351	పలుకవేమిపతితపావనా	ఆరభి	త్రిశ్రలఘువు	370
352	పాలయశ్రీరఘువీర	దేవగాంధారి	ఆది	371
353	పాలింతువో	కాంతామణి	ఆది	372
354	పాహికల్యాణ	పున్నాగవరాళి	చాపు	373
355	పాహిమాంహరే	సౌరాష్ట్రము	రూపకము	374
356	పాహిరామదూత	వసంతవరాళి	రూపకము	375
357	పాహిరామరామయనుచు	ఖరహరప్రియ	త్రిశ్రలఘువు	376
358	పాహిమాం శ్రీరామచంద్ర	కాపి	చాపు	377
359	పాహిరామచంద్రరాఘవా	యదుకులకాంభోజి	త్రిశ్రలఘువు	378
360	పాహిరమారమణ	వరాళి	ఆది	379
361	పాహికల్యాణరామ	కాపి	ఆది	380
362	పాహిపరమాత్మ	వరాళి	ఆది	381
363	పాహిపాహిదీనబంధో	సౌరాష్ట్రము	జంపె	382
364	పాహిరామచంద్ర	శంకరాభరణము	ఆది	383
365	ప్రాణనాథ	శూలిని	ఆది	384
366	ప్రారబ్ధమిట్లుండగా	స్వరావళి	జంపె	384
367	పెరుగుపాలు	ఘంట	ఆది	385
368	పొద్దుపాయ్యేని	తోడి	చాపు	387
369	ఫణిపతిశాయీ	ఝంకారధ్వని	ఆది	389
370	బంటురీతి	హంసనాదం	ఆది	390
371	బలముకులము	సావేరి	రూపకము	391
372	బాగాయెనయ్య	చంద్రజ్యోతి	ఆది	392
373	బాలేబాలేందుభూషణి	రీతిగౌళ	ఆది	392
374	బుద్ధిరాదు	శంకరాభరణము	చాపు	393
375	బృందావనలోల	తోడి	రూపకము	394
376	బ్రోచేవారెవరే	శ్రీరంజని	ఆది	395
377	బ్రోవభారమా	బహుదారి	ఆది	396
378	భక్తిబిచ్చమియ్యవే	శంకరాభరణము	రూపకము	397

379	భజనపరుల	సురటి	రూపకము	397
380	భజనసేయరాదా	అఠాణ	రూపకము	398
381	భజనసేయవే	కల్యాణి	రూపకము	399
382	భజరేభజమానస	కన్నడ	చాపు	400
383	భజరే రఘువీరం	కల్యాణి	ఆది	401
384	భవనుత	మోహన	ఆది	403
385	భక్తుని చారిత్రము	బేగడ	ఆది	404
386	భజనజేయుమార్గము	నారాయణి	ఆది	405
387	భజరామం	హుసేని	ఆది	406
388	భవసన్నుత	వరాళి	ఆది	407
389	భువినీదాసుడనే	శ్రీరంజని	ఆది	408
390	మదిలోన	కోలాహలము	ఆది	409
391	మనసా	వర్ధని	రూపకము	410
392	మనసాఎటులోర్తునే	మలయమారుతము	రూపకము	410
393	మనసాశ్రీరాముని	మాధరంజని	ఆది	411
394	మనసాశ్రీరామచంద్రుని	ఈశమనోహరి	ఆది	412
395	మనసునిల్ప	ఆభోగి	ఆది	413
396	మనసులోని	హిందోళము	ఆది	414
397	మనసువిషయ	నాటకురంజి	ఆది	415
398	మనవినివినుమా	జయనారాయణి	ఆది	416
399	మనవి ఆలకించరాదటే	నళినకాంతి	ఆది	416
400	మరకతమణివర్ణ	వరాళి	ఆది	417
401	మరచేవాడనా	కేదారము	ఆది	418
402	మరువకురా	దేవగాంధారి	ఆది	419
403	మరిమరినిన్నే	కాంభోజి	ఆది	420
404	మరియాదగాదురా	శంకరాభరణము	ఆది	421
405	మరియాదగాదయ్యా	భైరవము	ఆది	421
406	మరుగేలరా	జయంతశ్రీ	ఆది	422
407	మహిమదక్కించుకో	ఋషభప్రియ	ఆది	423
408	మనసుస్వాధీన	శంకరాభరణము	చాపు	424
409	మహితప్రవృద్ధ	కాంభోజి	చాపు	425
410	మాకేలరా	రవిచంద్రిక	ఆది	426

411	మాజానకి	కాంభోజి	ఆది	427
412	మాటాడవేమి	నీలాంబరి	ఆది	428
413	మాటిమాటికి	మోహన	త్రిపుట	429
414	మానములేదా	హమీర్‌కల్యాణి	ఆది	430
415	మామవసతతం	జగన్మోహిని	ఆది	431
416	మామవరఘురామ	సారంగ	రూపకము	432
417	మారుబల్క	శ్రీరంజని	ఆది	432
418	మానససంచరరే	పున్నాగవరాళి	చాపు	433
419	మాపాలవెలసి	అసావేరి	ఆది	434
420	మురిపెముగలిగె	ముఖారి	ఆది	435
421	ముచ్చటబ్రహ్మాదులకు	మధ్యమావతి	ఆది	437
422	మేనుచూచి	సరసాంగి	ఆది	439
423	మేరుసమాన	మాయామాళవగౌళ	అది	440
424	మేలుమేలు	సౌరాష్ట్రము	ఆది	440
425	ముద్దుమోము	సూర్యకాంతము	ఆది	443
426	ముందువెనుక	దర్బారు	ఆది	444
427	మునుపేతెలియక	బంగాళ	ఆది	446
428	మునురావణ	తోడి	జంపె	447
429	ముమ్మూర్తులు	అఠాణ	ఆది	448
430	మోసపోకువినవే	గౌళిపంతు	ఆది	449
431	మోహనరామ	మోహన	ఆది	450
432	మోక్షముగలదా	సారమతి	ఆది	452
433	యజ్ఞాదులు	జయమనోహరి	ఆది	453
434	యుక్తముగాను	శ్రీ	ఆది	454
435	యోచనా	దర్బారు	ఆది	456
436	రఘునందనరాజమోహన	శుద్ధదేశి	ఆది	456
437	రఘునందన	కేదారగౌళ	రూపకము	457
438	రఘునాయకా	హంసధ్వని	ఆది	458
439	రఘుపతే	శహన	రూపకము	459
440	రఘువర	పంతువరాళి	ఆది	460
441	రఘువీర	హుసేని	రూపకము	461
442	రమారమణరారా	శంకరాభరణము	ఆది	461

443	రమారమణ	వసంతభైరవి	ఆది	462
444	రమించువారెవరురా	సుపోషిణి	రూపకము	463
445	రాకాశశివదనా	టక్క	ఆది	464
446	రాగసుధారస	ఆందోళిక	ఆది	465
447	రాగరత్నమాలికచే	రీతిగౌళ	రూపకము	466
448	రాజువెడలె	తోడి	రూపకము	467
449	రానిదిరాదు	మణిరంగు	ఆది	467
450	రామబాణ	సావేరి	ఆది	468
451	రామభక్తి	శుద్ధబంగాళ	ఆది	469
452	రామాభిరామ	ధన్యాసి	ఆది	470
453	రామాభిరామ	దర్బారు	చాపు	471
454	రామాభిరామ	సావేరి	జంపె	472
455	రామంభజేహం	సావేరి	ఆది	473
456	రామరామకృష్ణ	గౌళిపంతు	ఆది	474
457	రామరామగోవింద	సౌరాష్ట్రము	ఆది	475
458	రామరామా	ఆనందభైరవి	ఆది	477
459	రామనీసమాన	ఖరహరప్రియ	రూపకము	478
460	రామానీయెడ	ఖరహరప్రియ	ఆది	478
461	రామనామభజరే	మధ్యమావతి	ఆది	479
462	రామకథా	మధ్యమావతి	అది	480
463	రామరఘుకుల	కాపి	చాపు	480
464	రామపాహి	కాపి	చాపు	481
465	రామలోభమేల	దర్బారు	ఆది	483
466	రామానిన్నే	హుసేని	ఆది	483
467	రామరామ	హుసేని	రూపకము	484
468	రామనన్నుబ్రోవరా	హరికాంభోజి	రూపకము	486
469	రామచంద్ర	సురటి	ఆది	486
470	రామదైవమా	సురటి	రూపకము	487
471	రామరామా	మోహన	చాపు	488
472	రామఏవదైవతం	బలహంస	రూపకము	490
473	రామసీతా	బలహంస	ఆది	490
474	రామానీవే	నారాయణి	ఆది	491

475	రామరామ	జంఝూటి	రూపకము	492
476	రామనినువినా	శంకరాభరణము	రూపకము	493
477	రామానీపై	కేదారము	ఆది	494
478	రామశ్రీరామ	వరాళి	ఆది	495
479	రామనీవాదుకొందువో	కల్యాణి	ఆది (త్రిశ్రగతి)	496
480	రామరామ	యమునాకల్యాణి	ఆది	497
481	రారమాయింటిదాక	అసావేరి	ఆది	498
482	రార సీతారమణీ	హిందోళవసంతము	రూపకము	499
483	రారా రఘువీర	అఠాణ	ఆది	500
484	రామా కోదండరామ	భైరవి	ఆది	501
485	రామ కోదండరామ	ఖరహరప్రియ	చాపు	502
486	రామా నినునమ్మిన	మోహన	ఆది	503
487	రామరామ	కల్యాణి	చాపు	504
488	రామరామ	ఘంట	జంపె	505
489	రామసీతా	శంకరాభరణము	ఆది	506
490	రామసమయము	మధ్యమావతి	ఆది	507
491	రాముని మరువకవే	కేదారగౌళ	ఆది	509
492	రారానన్నేలుకోరా	సౌరాష్ట్రము	చాపు	511
493	రూకలుపదివేలున్న	దేశికతోడి	ఆది	512
494	రేమానస	తోడి	రూపకము	513
495	లలితే	భైరవి	ఆది	514
496	లక్షణములుగల	శుద్ధసావేరి	ఆది	515
497	లావణ్యరామ	పూర్ణషడ్జము	రూపకము	517
498	లీలగాను	దుందుభి	దేశాది	518
499	లేకనా	అసావేరి	ఆది	519
500	లేమిదెల్ప	నవనీతము	ఆది	520
501	లోకావనచతురా	బేగడ	ఆది	521
502	వద్దనేవారు	షణ్ముఖప్రియ	ఆది	522
503	వద్దయుండేదే	వరాళి	చాపు	523
504	వందనము	శహన	ఆది	524
505	వరదరాజ	స్వరభూషణి	రూపకము	525
506	వరనారద	విజయశ్రీ	ఆది	526

507	వరశిఖివాహన	సుప్రదీపము	ఆది	527
508	వరాలందుకొమ్మని	ఘుర్జరి	ఆది	528
509	వల్లగాదనక	హరికాంభోజి	రూపకము	529
510	వచ్చునుహరి	కల్యాణి	ఆది	530
511	వరదానవనీతాశా	రాగపంజరము	చాపు	531
512	వరమైన	ఫరజు	చాపు	532
513	వరరాగలయజ్ఞులు	చెంచుకాంభోజి	ఆది	533
514	వరలీలగానలోల	శంకరాభరణము	త్రిశ్రలఘువు	534
515	వాచామగోచరమే	కైకవశి	ఆది	536
516	వాడేరా	పంతువరాళి	ఆది	538
517	వారిజనయన	కేదారగౌళ	ఆది	539
518	వారిధినీకు	తోడి	చాపు	540
519	వాసుదేవయని	కల్యాణి	ఆది	541
520	వారిజనయననీవాడను	కేదారగౌళ	ఆది	543
521	వాసుదేవ	బిలహరి	ఏకతాళము	543
522	విడజాలదురా	జనరంజని	ఆది	544
523	విదులకు	మాయామాళవగౌళ	ఆది	545
524	వినయమునను	సౌరాష్ట్రము	చాపు	546
525	వినతాసుత	జయంతసేన	ఆది	548
526	వినాస	ప్రతాపవరాళి	ఆది	549
527	వినరాదనామనవి	దేవగాంధారి	ఆది	550
528	వినవే ఓమనసా	వివర్ధని	రూపకము	551
529	విధిశక్రాదులకు	యమునాకల్యాణి	రూపకము	551
530	వినతాసుతరారా	హుసేని	ఆది	553
531	విష్ణువాహనుండిదిగో	శంకరాభరణము	రూపకము	554
532	వినాయకునివలెను	మధ్యమావతి	ఆది	555
533	విరాజతురగరాజ	బలహంస	ఆది	556
534	వేణుగానలోలుని	కేదారగౌళ	రూపకము	557
535	వేదవాక్యమని	మోహన	చాపు	557
536	వేంకటేశ	మధ్యమావతి	ఆది	559
537	వేరెవ్వరే	సురటి	ఆది	560
538	శంభోమహాదేవ	పంతువరాళి	రూపకము	560

539	శంభోశివశంకర	శంకరాభరణము	రూపకము	561
540	శరశరసమరైకశూరా	కుంతలవరాళి	ఆది	562
541	శశివదన	చంద్రజ్యోతి	ఆది	563
542	శరణుశరణనుచు	మధ్యమావతి	ఆది	563
543	శివశివశివ	పంతువరాళి	ఆది	565
544	శివేపాహిమాం	కల్యాణి	ఆది	566
545	శాంతములేక	సామ	ఆది	567
546	శృంగారించుకొని	సురటి	ఆది	568
547	శ్యామసుందరాంగ	ధన్యాసి	రూపకము	570
548	శ్రీగణపతిని	సౌరాష్ట్రము	ఆది	570
549	శ్రీకాంత	భవప్రియ	ఆది	571
550	శ్రీజనకతనయే	కలకంఠి	ఆది	572
551	శ్రీజానకీ	ఈశమనోహరి	దేశాది	573
552	శ్రీనారద	కానడ	రూపకము	573
553	శ్రీనారసింహ	ఫలమంజరి	ఆది	574
554	శ్రీపతే	నాగస్వరావళి	ఆది	575
555	శ్రీమానినీ	పూర్ణషడ్జము	ఆది	575
556	శ్రీరఘువర	భైరవి	ఆది	576
557	శ్రీరఘువరాప్రమేయ	కాంభోజి	ఆది	577
558	శ్రీరఘుకుల	హంసధ్వని	ఆది	578
559	శ్రీరమ్యచిత్త	జయమనోహరి	ఆది	579
560	శ్రీరామదాస	ధన్యాసి	చాపు	580
561	శ్రీరామరామ	సావేరి	ఆది	581
562	శ్రీరామచంద్ర	సావేరి	ఆది	582
563	శ్రీరామపాదమా	అమృతవాహిని	ఆది	583
564	శ్రీరామజయరామ	మధ్యమావతి	ఆది	584
565	శ్రీరామజయరామ	యదుకులకాంభోజి	జంపె	585
566	శ్రీరామశ్రీరామ	శహన	ఆది	588
567	శ్రీతులసెమ్మ	దేవగాంధారి	ఆది	589
568	శ్రీనారదమునీ	భైరవి	ఆది	590
569	శ్రీవప్రియ	అఠాణ	ఆది	591

570	శ్రీరఘువర	దేవగాంధారి	ఆది	592
571	శ్రీరఘువర	శంకరాభరణము	ఆది	593
572	శ్రీరామజయరామ	వరాళి	చాపు	595
573	శ్రీరామరామ	పూర్ణచంద్రిక	జంపె	597
574	శ్రీరామరామాశ్రితులము	సావేరి	చాపు	599
575	శ్రీరామ శ్రీరామ	వరాళి	ఆది	601
576	శోభిల్లు	జగన్మోహిని	రూపకము	602
577	సంగీతజ్ఞానము	ధన్యాసి	ఆది	603
578	సంగీతశాస్త్రజ్ఞానము	ముఖారి	ఆది	604
579	సందేహమును	రామప్రియ	ఆది	605
580	సంసారులైతే	సావేరి	ఆది	607
581	సనాతనా	ఫలమంజరి	ఆది	608
582	సమయముదెలిసి	అసావేరి	చాపు	609
583	సమయముఏమరకే	కల్గడ	ఆది	610
584	సముఖాన	కోకిలవరాళి	ఆది	611
585	స్మరణేసుఖము	జనరంజని	ఆది	611
586	సరససామదాన	కాపినారాయణి	ఆది	612
587	సరసీరుహాననా	ముఖారి	ఆది	613
588	సరసీరుహనయనా	బిలహరి	చాపు	614
589	స్వరరాగసుధారస	శంకరాభరణము	ఆది	615
590	సరివారిలోన	భిన్నషడ్జము	ఆది	617
591	సరియెవ్వరే	శ్రీరంజని	ఆది	617
592	సరిజేసి	తీవ్రవాహిని	ఆది	618
593	సత్తలేని	నాగానందిని	ఆది	619
594	సర్వాంతర్యామి	భైరవి	ఆది	619
595	సర్వలోక	హుసేని	త్రిశ్రలఘువు	620
596	సాకేతనికేతన	కన్నడ	రూపకము	621
597	సామజవరగమనా	హిందోళము	ఆది	622
598	సామికిసరిజెప్ప	బేగడ	చాపు	623
599	సార్వభౌమ	రాగపంజరము	ఆది	624
600	సాక్షిలేదనుచు	బంగాళ	ఆది	625

601	సాగరుండు	యమునాకల్యాణి	రూపకము	626
602	సారమేగాని	పంతువరాళి	చాపు	626
603	సారివెడలిన	అసావేరి	ఆది	628
604	సిగ్గుమాలి	కేదారగౌళ	చాపు	630
605	సీతమ్మమాయమ్మ	లలిత	రూపకము	631
606	సీతానాయక	రీతిగౌళ	చాపు	632
607	సీతాపతే	ఖమాసు	ఆది	633
608	సీతాపతి	శంకరాభరణము	ఆది	634
609	సీతావర	దేవగాంధారి	ఆది	634
610	సీతామనోహర	రామమనోహరి	ఆది	636
611	సుఖివవ్వరో	కానడ	ఆది	637
612	సుగుణములే	చక్రవాకము	రూపకము	638
613	సుజనజీవన	ఖమాసు	రూపకము	639
614	సుందరినిన్ను	ఆరభి	చాపు	640
615	సుందరినన్నిందరిలో	బేగడ	రూపకము	641
616	సుందరతర	పంతువరాళి	ఆది	643
617	సుందరి	కల్యాణి	ఆది	644
618	సుధామాధుర్య	సింధురామక్రియ	ఆది	646
619	సుందరదశరధ	కాపి	ఆది	646
620	సుందరేశ్వరుని	శంకరాభరణము	ఆది	647
621	సొగసుగా	శ్రీరంజని	రూపకము	648
622	సొగసుజూడ	కన్నడగౌళ	రూపకము	649
623	హరిదాసులు	యమునాకల్యాణి	ఆది	650
624	హరియనువారికి	తోడి	ఆది	651
625	హరిహరి	పున్నాగవరాళి	ఆది	652
626	క్షీణమై	ముఖారి	ఆది	653
627	క్షీరసాగరవిహారా	ఆనందభైరవి	జంపె	654
628	క్షీరసాగరశయనా	దేవగాంధారి	ఆది	655
629	జయతుజయతు (చూర్ణిక)			656

ఉత్సవ సంప్రదాయ కృతులు

630	హెచ్చరికగారార	యదుకులకాంభోజి	జంపె	657
631	కొలువై యున్నాడే	దేవగాంధారి	ఆది	658
632	సీతాకల్యాణ	శంకరాభరణము	ఖండలఘువు	660
633	నాపాలి	శంకరాభరణము	ఆది	661
634	నగుమోముగలవాని	మధ్యమావతి	ఆది	662
635	జయమంగళం	ఘంట	జంపె	664
636	పతికిహారతి	సురటి	ఆది	665
637	వదనద్యుతి	పంతువరాళి	త్రిపుట	665
638	పూలపాన్పు	ఆహిరి	త్రిశ్రలఘువు	666
639	బడలికదీర	రీతిగౌళ	ఆది	667
640	ఉయ్యాలలూగవయ్య	నీలాంబరి	జంపె	668
641	లాలిలాలియని	హరికాంభోజి	ఆది	670
642	లాలిగుణశాలి	కేదారగౌళ	జంపె	671
643	రామా శ్రీరామ	శంకరాభరణము	ఆది	673
644	లాలియూగవే	నీలాంబరి	రూపకము	674
645	శ్రీరామ రామ రామ	నీలాంబరి	జంపె	675
646	రామరామ	శహన	చాపు	676
647	జోజోరామ	రీతిగౌళ	ఆది	678
648	మేలుకోవయ్య	బౌళి	జంపె	678
649	మేలుకోదయానిధీ	సౌరాష్ట్రము	రూపకము	680
650	రక్షబెట్టరే	భైరవి	ఆది	680
651	మాకులమున	సురటి	చాపు	681
652	జానకీనాయక	ధన్యాసి	ఆది	682
653	మారామచంద్రునికి	కేదారగౌళ	ఆది	683
654	నీనామరూపములకు	సౌరాష్ట్రము	ఆది	684
655	జయమంగళం	మోహన	జంపె	686

1. నాట = ఆది

ప॥ జగదానందకారక – జయజానకీ ప్రాణనాయక

అ॥ గగనాధిప సత్కులజరాజ రాజేశ్వర
సుగుణాకర సురసేవ్య భవ్యదాయక సదా సకల జగ॥

చ॥ అమరతారకానిచయ కుముదహిత! పరిపూర్ణానఘ! సురసుర
భూజదధివయోధివాపహరణ! సుందర తరవదన! సుధామయవచో
బృంద! గోవింద! సానంద! మావరాజరాప్త! శుభరానేక॥ జగ॥

2 నిగమనీరజామృతజపోషకా నిమిషవైరి వారిద సమీరణ!
ఖగతురంగ! సత్కవిహృదాలయ! అగణితవానరాధి పనతాంఘ్రియుగ జగ॥

3 ఇంద్ర నీలమణి సన్నిభాపఘన! చంద్రసూర్యనయనా ప్రమేయ! వా
గింద్ర జనక! సకలేశ! శుభ్రనాగేంద్ర శయన! శమనవైరి సన్నుత॥ జగ॥

4 కరధృతశరజాలా సురమదాపహరణా! వనీసురసురావన!
కవీన బిలజమౌని కృతచరిత్ర! సన్నుత శ్రీ త్యాగరాజనుత! జగ॥

5 సృష్టిస్థిత్యంత కారకా! మితకామిత ఫలదా! సమానగాత్ర! శ
చీపతినుతా! ద్ధి మదహరా! నురాగరాగరాజితకథా సారహిత॥ జగ॥

6 పాదవిజితమౌనిశాప! సవపరిపాల! పరమంత్ర గ్రహణలోల
పరమశాంత చిత్త! జనకజాధిప! సరోజ భవవరదాఖిల॥ జగ॥

7 పురాణ పురుష! నృవరాత్మజా! శ్రితపరాధీన! ఖరవిరాధ రావణ
విరావణానఘ! పరాశరమనోహరా! వికృత! త్యాగరాజసన్నుత॥ జగ॥

8 సజ్జన మానసాబ్ధి సుధాకర! కుసుమ విమాన! సురసారిపుకరాబ్జ
లాలిత చరణ! అవగుణాసురగణమదహరణ! సనాతనాజనుత॥ జగ॥

9 ఓంకార పంజర కీర! పురహర సరోజ భవకేశవాదిరూప!
వాసవరిపు జనకాంతక! కలాధరకలాధరాప్త! ఘృణాకర! శ॥
రణాగత జనపాలన! సుమనోరమణ! నిర్వికార! నిగమ సారతర॥ జగ॥

10 అగణితగుణ! కనకచేల! సాలవిదళనా! రుణాబ్జసమానచరణా!
పారమహిమాద్భుత! సుకవిజనహృత్సదన! సురమునిగణవిహిత! కలశ
నీరనిధిజారమణ! పాపగజనృసింహ! వరత్యాగరాజాదినుత॥ జగ॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు పంచరత్న కృతుల రచనను ప్రత్యేక పద్ధతిలో కొనసాగింపదలచి దానికి శ్రీకారం చుట్టిరి. నిర్విఘ్నపరిసమాప్తికై తన ఇష్టదైవమయిన శ్రీ రామచంద్రుని సర్వోత్కృష్టముగా ప్రకాశింపుమని ఆ శాసనము చేయుట నాటకృతియందలి తాత్పర్యము.

సర్వలోకానందకరుడవై సీతాపతిగా సూర్యవంశమున జనించిన నీకు జయమగు గాక! దేవతలందరు చుక్కలయితే నీ వాచుక్కలలో చంద్రుడవు. కృష్ణావతారమున దధినవనీతములను భక్షించితివి. అందమయిన ముఖము తియ్యని పలుకులు శుభములగు కథలు గలిగిన ఓ మాధవా! సంగీత సుధా ప్రదాయివై, రాక్షసుల నంతమొందించువాడవై సత్కవుల హృదయములయందు నెలకొని యున్నావు. ఇంద్రనీలమణి వంటి మేని మెరుగులతో సూర్యచంద్రులు కనులుకాగా బ్రహ్మకు తండ్రివయిన శేషశాయివి నీవు. కరమున శరచాపములు బట్టి రక్కసుల నుక్కడచి దేవబ్రాహ్మణుల చిక్కులు దీర్చువానిగా నిన్ను వాల్మీకి మహర్షి పాడినాడు. నీవు సృష్టిస్థితిలయకారకుడవు. భక్తుల కామితములను దీర్చువాడవు. ఓ రామా! నీవు సముద్ర మదమునణచినావు. నీ అవతారమున నీ కథలన్నియు అనురాగభరితములు. పాదరజస్సుతో అహల్యాశాపం దీర్చినావు. విశ్వామిత్రుని యాగం రక్షించావు. ఆయన వద్దనుంచి బలాతిబలమంత్రములను పొందినావు. శాంత చిత్తముతో మిథిలకు వచ్చి సీతనాకర్షించి చెట్టబట్టినావు. పురాణ పురుషుడవగు నీవు ఆశ్రిత పరాధీనుడవు కనుక దశరథుని కుమారుడవయి ఖరవిరాధ రవణాదులను పరిమార్చి మహర్షులకు ఆనందము గూర్చినావు. దుష్టులను వధించి సజ్జనుల మనస్సుల కాహ్లాదము గూర్చి హనుమంతుడు పాదము లొత్తుచుండగా పుష్పక విమానమెక్కి అయోధ్యకు వచ్చిన సనాతన పురుషుడవు. నీవు చేసిన ఈ లోకోపకారమునకు బ్రహ్మాది దేవతలు వచ్చి నిన్ను కొనియాడిరి. ఓంకారమునకు అర్థమయిన మహేశ్వరుడవు నీవు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు నీవు మూల ప్రకృతివి. దైవవైరులకు నీవంతకుడవు. శివునకు శ్రీరామనామ జపము ద్వారా నీవాప్తుడవు. కరుణాకరుడవు. శరణాగతవత్సలుడవు. సదా నిర్వికారుడవు. ఓ లక్ష్మీరమణా నీ మహిమలనంతములు. గుణములగణ్యములు. నీ గుణానుభవంచేసే దైవగుణ సంపన్నులకు నీవు పీతాంబరాది దివ్యలాంఛనములతో సాక్షాత్కరించి పాపములను పటాపంచలు చేసే నరసింహుడవు. నీకు జయమగు గాక॥ అని త్యాగయ్యగారు మొదటి కృతిలో పై విశేషణములతో సంబోధించి జయకొట్టినాడు. ఈ కృతి సంస్కృత భాష. సమాస భూయిష్ఠముగా నున్నది కనుక భాషాపరముగా దీని గుణము ఓజోగుణము. సంగీత పరముగా వివిధలయ విన్యాస భరితము. ఈ కృతిలో దేవుని కల్యాణ గుణములు వర్ణింపబడినవి.

2. గౌళ = ఆది

ప॥ దుడుకుగల నన్నేదొరకొడుకు బ్రోచురా ఎంతో దుడుకు॥

అ॥ కడు దుర్విషయా కృష్టుడైగడియ గడియకు నిండారు దుడుకు॥

చ॥ శ్రీ వనితాహృత్కుముదాబ్జ. అవాఙ్మనసగోచర దుడుకు॥

2 సకల భూతములయందునీవై, యుండగా మదిలేక పోయిన దుడుకు॥

3 చిరుతప్రాయముల నాడే భజనా, మృత రసవిహీన కుతర్కుడైన దుడుకు॥

4 పరధనముల కొరకు నొరులమది కరగ బలికి కడుపునింప దిరిగినట్టి దుడుకు॥

5 తనమదిని భువిని సౌఖ్యపు జీవనమే. యనుచుసదా- దినములు గడిపే దుడుకు॥

6 తెలియని నటవిట శూద్రులు. వనితలు. స్వవశమగుటకు పదిశించి. సంతసిల్లి
స్వరలయంబు. లెరుంగకను. శిలాత్ముడయి సుభక్తులకు సమానము దుడుకు॥

7 దృష్టికి సారంబగు లలనా సదనార్భకసేనా మితధనాదులను
దేవాదిదేవ. నెరనమ్మితి గాకను పదాబ్జభజనంబు మరచిన దుడుకు॥

8 చక్కని ముఖ కమలంబునను సదా, నా మదిలో స్మరణలేకనే
దుర్మదాంధజనులకోరి పరితాపములచే తగిలి. నొగిలి దుర్విషయ
దురాశలను. రోయలేక సతత మపరాధియయి చపలచిత్తుడైన దుడుకు॥

9 మానవతను దుర్లభమనుచు నెంచి. పరమానంద మందలేక
మదమత్సర కామలోభ మోహులకు దాసుడయి మోసపోతి గాక
మొదటి కులజుడగుచు భువిని శూద్రుల, పనులు సల్పుచునుంటిని గాక
సరాధములను రోయ సారహీనమతములను సాధింప తారుమారు దుడుకు॥

10 సతులకై కొనాళ్లాస్తికై,సుతులకై కొన్నాళ్లు ధన
తతులకై తిరిగితినయ్యా,త్యాగరాజాప్త ఇటువంటి దుడుకు॥

తాత్పర్యము :

ఈ కృతిలో జీవుని అవగుణములను త్యాగయ్యగారు తనయుందారోపించుకొని ఇట్టి గుణ విహీనుని రక్షించు దొర ఎవరయ్యా అని తన పరితాపమును తన ఇష్టదైవము వద్ద వెలిబుచ్చుచున్నారు.

ఓ రామా! సమస్త జీవులయందు నీవు అంతర్యామివై ఉన్నది ఎరుగనైతిని. బాల్యమునుంచి దుర్విషయముల మీద ఆసక్తితో నిను భజింపకుంటిని. ఇతరుల ధనమును గ్రహింపగోరి వారు కరిగేటట్లు పలికి కడుపు నింపుకొంటున్నాను. ఇహలోక సౌఖ్యమునే నమ్మి పరమును దూరం చేసుకొనుచున్నాను. ఏమీ తెలియని అజ్ఞానులను వశపరచుకొని జ్ఞానములేని నేను, స్వరలయ లెరుగని నేను సంగీత జ్ఞానోపదేశములు చేస్తూ భక్తనటనము చేస్తూ సంతోషంతో తిరుగుచున్నాను. కంటికి అందముగా కనిపించే స్త్రీలను, పుత్రులను, ఇండ్లను నమ్ముకొని నీ భజనము మరచినాను. ఈ హృదయములో నీ ముఖమును స్మరింపక మదించిన కుజనుల నాశ్రయించి దుఃఖములకు లోనై వారిని విడువలేక నిన్నాశ్రయించని అపరాధము కలిగియున్నాను. పరమానందకరమయిన నరజన్మకలిగి దానిని సార్థకము చేసుకొనలేక కామక్రోధాదులకు లోనై నీచకృత్యములు చేస్తూ నిస్సారమయిన మతములలో ప్రవేశించి నీకు దూరమగుచున్నాను. దారేషణ, పుత్రేషణ, ధనేషణములనే ఈ షణత్రయమునకు లోనై కాలమంతయును వ్యర్థపరచినాను. అయ్యో! రామా! నన్నెవడు రక్షింపగలుగునయ్యా! అని త్యాగయ్యగారు రెండవ కృతిలో పశ్చాత్తాపమును జెందినారు. దీనినినైచ్యానుసంధాన మందురు. భగవత్సన్నిధిలో భక్తుడీ అనుసంధానము చేయవలెను.

3. ఆరభి = ఆది

ప॥ సాధించెనే ఓ మనసా॥ సాధించెనే॥

అ॥ బోధించిన సన్మార్గవచనములు
బొంకుజేసి తాపట్టిన పట్టు॥ సాధించెనే॥

చ॥ దేవకీ వసుదేవుల నేగించినటు॥ సాధించెనే॥

2 రంగేశుడు. సద్గంగా జనకుడు. సంగీత సాంప్రదాయకుడు సాధించెనే॥

3 గోపీజన మనోరథ మెసంగలేకనే గేలియుజేసేవాడు॥ సాధించెనే॥

4 వనితల సదా. సాక్కజేయుచును. మ్రొక్కజేసే పరమాత్ముడదియుగాక
యశోద. తనయుడంచు. ముదంబునను. ముద్దుబెట్ట నవ్వుచుండుహరి సాధించెనే॥

5 పరమభక్తవత్సలుడు. సుగుణ పారావారుం. డాజన్మమనముడీ
కలిబాధల. దీర్చువాడ. నుచునే. హృదంబుజమున జూచుచుండగ॥ సాధించెనే॥

6 హరే రామచంద్రా రఘుకులేశ మృదుసుభాష శేషశయన పరనారీ
సోదరాజ విరాజతురగరాజ రాజసుత నిరామయావఘన
సరసీరుహదళాక్ష యనుచు వేడుకొన్న నన్ను తా బ్రోవకను॥ సాధించెనే॥

7 శ్రీ వేంకటేశ సుప్రకాశ. సర్వోన్నత. సజ్జన మానసనికేతన
కనకాంబరధర లసన్మకుటకుండల విరాజిత హరే యనుచునే
పొగడగా త్యాగరాజగేయుడు మానవేంద్రుడయిన రామచంద్రుడు॥ సాధించెనే॥

చ॥ సమయానికి తగుమాటలాడెనే॥
సద్భక్తుల నడతలిట్లనెనే
అమరికగా నా పూజ కొనెనే
అలుగ వద్దనెనే...
విముఖులతోను చేరబోకు మనెనే
వెతగల్గిన తాళు కొమ్మనెనే
దమశమాదిసుఖ దాయకుడౌశ్రీ
త్యాగరాజనుతుడు చెంతరాకనే ॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు మూడవ కృతిలో రాముడు తనయెడ చూపుచున్న నిర్దయత్వమును గూర్చి మనస్సుతో చెప్పుకొనుచున్నారు. భక్తుడు భగవంతుడు తనకు జన్మబంధమును బాపి శీఘ్రముగా సాయుజ్యము నొసంగవలెనని ఉత్కంఠపడును. కాని ఆయుర్దాయము బ్రహ్మ లిఖిత ప్రకారము దీర్ఘముగా నుండును. భక్తిడీ జాగును సహింపలేక భగవంతుని నిష్ఠురములాడును. అది పైకి నిందించుచున్నట్లుండును. ఆ నిందలో గర్భితముగా భగవంతుని లీలా విలాస చేష్టితములుండును. ఈ ప్రక్రియను అలంకారికులు 'వ్యాజనింద' అనెదరు. మూడవది ఔయిన ఆరభిరాగకృతిలో త్యాగయ్యగారు చేసినదిదియే. ఈ వ్యాజనింద భగవద్గుణ గానముగా పర్యవసానము చెందును.

ఓ మనసా! శ్రీ రామచంద్రుడు నన్ను రక్షింపక తనపట్టే సాగించుకొన్నాడు, సాధించినాడు. భగవద్గీతాదులలో 'అనన్య భక్తులను యోగక్షేమములు వహించి రక్షించెదను' ఇత్యాదిగా ఎన్నో మాటలు బోధించి వాటనన్నిటిని బొంకుచేసి నన్ను సాధించినాడు. ఇతడెవడు? రంగేశుడు. రంగస్థలముపై నటించు నటకుని వంటివాడు (శ్రీ రంగనాథుడు) ఇంతేకాదు. లోకమును పవిత్రముజేయు గంగను అట్లే సంగీత

గంగను భువిపై ప్రవహింప జేసినవాడు. మంచిపనులే చేస్తాడు. దానితోనే జీవులను కష్టపెట్టువాడు. దేవకీవసుదేవులకు పుత్రుడై జన్మించి వారికి దూరమై వారిని బాధించినట్లు నన్ను బాధించుచున్నాడు. తనపై ప్రాణములు పెట్టుకొన్న గోపికల వస్త్రములనపహరించి వారిని గేలిచేసిన వాడుకదా! గోపికలను పరవశింపజేసి వారు మ్రొక్కేటట్లు చేసే పరమాత్ముడు. అట్టి పరమాత్మ భావము నెరుగక యశోద తన కొడుకనే భావముతో ముద్దుబెట్టుకుంటే నవ్వి ఆమెను గేలిచేసే హరి అతడు కదా! ఇట్లు చేసినా ఇవి అతని లీలలు. హరి అసలుగుణము భక్తుల దోషములను గుణములుగా భావించుట. ఈ గుణమును వాత్సల్యమందురు. అతని వాత్సల్యము సముద్రమంతది. అతడు ఎట్టి దోషములంటనివాడు. అట్టి భగవానుడు నాకున్న కలియుగ బాధలను తీర్చునని నేను హృదయంలో స్మరిస్తూ సాక్షాత్కరింపజేసుకుంటూ ఉన్నా నన్ను చూడకుండా తనపట్టు సాధించినాడు. ఎన్నో నామములను గుణములను గానం చేస్తూ వేడుకొంటూ ఉన్నా నన్ను రక్షింపక సాధించినాడు గదా। ఓ వేంకటేశ! సుప్రకాశ! సర్వోన్నత! సజ్జనమాన సనికేతన ఇత్యాదిగా నాచే పొగడబడిన మానవోత్తముడయిన రామచంద్రుడు తనపట్టు సాధించుకొన్నాడు. ఇంకా చాలా చాలా చేశాడు. అర్జునునిచే యుద్ధము చేయించుటకు సమయానికి తగుమాటలాడినాడు. ఆ మాటలలో భక్తుల నడవడికలుచెప్పినాడు. నా పూజలు చేకొన్నాడు. స్థితప్రజ్ఞుడు సుఖ దుఃఖాలలో సమముగా నుండవలెనని బోధించినాడు. భక్తి హీనులతో చేరవద్దన్నాడు. శాంతి దాంతి తితిక్ష మొదలగు దైవగుణములను బోధించినాడు. ఇన్ని బోధించి బోధ ప్రకారం నడచుకొన్న నా చెంతకు రాక పట్టు సాధించుకొన్నాడు. అని త్యాగయ్యగారు అరభికృతిలో నిర్వేదమును వెలిబుచ్చినారు. భక్తుని ఈ పరిస్థితిని 'ఆర్తప్రపత్తి' అంటారు.

4. వరాళి = ఆది

ప॥ కనకనరుచిరా – కనక వసన! నిన్ను కనకన॥

అ॥ దినదినమును మన! సున చనవున నిన్ను కనకన॥

చ॥ పాలుగారు మోమున శ్రీ య! పారమహిమ దనరు నిన్ను కనకన॥

2 కలకలమను ముఖ కళ గలిగిన సీత! కులుకుచునునోర
కన్నులను జూచునిను కనకన॥

3 బాలార్క్‌భ సుచేలా మణిమయ మలాలంకృతకంధర సర
సిజాక్ష. వరకపోల సురుచిర కిరీట ధర సంతతంబు మనసారగ॥ కనకన॥

4 సాపత్నిమాతయౌ సురుచిచే కర్ణశూలమైన మాటవీనుల
చురుక్కన తాళక శ్రీహరిని ధ్యానించి సుఖింపగలేదా? అటు కనకన॥

5 మృగమదలలామ శుభనిటాల వరజటాయుమోక్షఫలద పవమాన
సుతుడు నీదు మహిమ దెల్ప సీత తెలిసి వలచి సొక్కలేదా ఆరీతినిన్ను కనకన॥

6 సుఖాస్పద విముఖాంబుధరపవన విదేహమానస విహార ఆప్త
సురభూజ మానిత గుణాంక చిదానంద ఖగతురంగ ధృతరథాంగ
పరమదయాకర కరుణారసవరుణాలయ భయాపహరా శ్రీ రఘుపతే కనకన॥

7 కామించి ప్రేమమీర కరముల। నీదుపాదకమలముల బట్టుకొను
వాడుసాక్షి రామనామ రసికుడు కైలాసనదనుడు సాక్షి
మరియు నారద పరాశర శుక శౌనక పురందర నగజాధరజ
ముఖ్యులు సాక్షిగాద సుఖకలశాంబుధివాసా శ్రితులకే కనకన॥

చ॥ సతతము ప్రేమ పూ। రితుడగు త్యాగరాజ
నుత ముఖజిత కుముద। హిత వరద నిన్ను॥ కనకన॥

తాత్పర్యము :

మూడవ కృతిలో చేసిన వ్యాజనిందకు శ్రీరాముడు ఆనందపడినట్లున్నాడు. త్యాగయ్యగారికి స్వరూపరూప విభవ ఐశ్వర్యములతో సాక్షాత్కరించినాడు. ఆ దివ్యమంగళ విగ్రహాన్ని ఎంతసేపు చూచినా త్యాగయ్యగారికి తనివి దీరుటలేదు. చూడచూడ శ్రీరాముని రుచి (కాంతి) పెరుగుచున్నది. త్యాగయ్యగారి రుచీ పెరుగుచున్నది. ఆ అనుభవమే వరాళి రాగకృతిగా రూపుదిద్దుకొన్నది.

ఓ శ్రీరామా! కనగా కనగా నీ సేవ రుచికరమగచున్నది. చనవు పెరుగుచున్నది. అఖండశోభతో పాలుగారుచున్న నీ ముఖమును చూస్తుంటే కనకన రుచిగా నున్నది. కలకలమని సీత ఓర జూపుల చూచే నీ ముఖము అతి రుచిగా నున్నది. బాలసూర్యుని కాంతి, బంగరు పీతాంబరము కాంతి, మణిహారములకాంతి పుంజీభూతమై నీ సేవ అమృతముగా నున్నది. సవతి తల్లి అయిన సురుచి కర్ణశూలములగు మాటలకు వ్యధ జెందిన ధ్రువుడు శ్రీహరిని సేవించి పరమానందమును పొందెను కదా. కస్తూరీ

తిలకముతో విరాజిల్లు జటాయు మోక్షప్రదుడవు నీవు. అశోక వనమున హనుమంతుడు నీ గుణములు పాడగా సీత పరవశించినది. అట్టిది కదా నీ రూపము, నీ చరితము. నీవు సుఖానికి నిలయము. శత్రువులకు ప్రభంజనమవు. ధ్యానయోగుల కాప్తుడవు కల్పవృక్షమవు. ఆనంద స్వరూపుడవగు గరుడవాహనుడవు నీవు. శంఖ చక్రధారివి నీవు. దయా సముద్రుడవు. రఘువంశ తిలకుడవు. నీ పాదసేవలోని సుఖమునకు హనుమ సాక్షి. నామ స్మరణ సుఖమునకు శివుడు సాక్షి. ఇంద్రాది దేవతలు నారదాది మునులు నీ సాక్షాత్కారానందమునకు సాక్షులు. ఇట్టి నిన్ను ప్రేమతో నేను తలచి కొలుచుచున్నాను. ఈ దర్శనములోని రుచి అంతకంతకు వర్ధిల్లుచున్నది. ఇది త్యాగయ్యగారి సాక్షాత్కారానందము.

5. శ్రీరాగము = ఆది

ప॥ ఎందరో మహానుభావులందరికీ వందనము లెందరో॥

అ॥ చందురు వర్ణుని అంద! చందమును హృదయార
విందమున జూచి బ్రహ్మ నంద మనుభవించువా రెందరో॥

చ॥ సామగానలోల మనసిజలావణ్య ధన్యమూర్ధన్య రెందరో॥

2 మానస వనచరవరసంచారము నిలిపి మూర్తి బాగుగ బొడగనేవా రెందరో॥

3 సరగున పాదములకు స్వాంతమను! సరోజమును సమర్పణము జేయువా రెందరో॥

4 పతితపావనుడనే పరాత్పరుని! గురించి పరమార్థమగు నిజమా
ర్గముతోను బాడుచును సల్లాపముతో స్వరలయాదిరాగముల దెలియువా రెందరో॥

5 హరి గుణమణి మయసరములు గళమున! శోభిల్లు భక్తకోటులిలలో
తెలివితో. చెలిమితో. కరుణ గల్గిజగమెల్లను సుధాదృష్టిచే బ్రోచువా రెందరో॥

6 హాయలు మీర నడలుగల్గు సరసుని! సదా కనుల జూచుచు పులకితశ
రీరులై ఆనందపయోధి! నిమగ్నులయి ముదంబునను యశముగలవా రెందరో॥

7 పరమ భాగవత మౌనివరశశి! విభాకర సనకసనందన
దిగీశ సురకింపురుష కనకకశిపుసుత నారద తుంబురు
పవనసూను బాలచంద్ర ధర శుక! సరోజ భవ భూసురవరులు
పరమపావనులు ఘనులు శాశ్వతులు! కమలభవసుఖము
సదానుభవులుగాక ఎందరో॥

8 నీమేను నామవైభవంబులను నీ పరాక్రమ ధై
ర్యముల శాంతమానసమునీవులను, వచన సత్యమును - రఘువర నీయెడ
సద్భక్తియు జనింపకను దుర్మతములను గల్గజేసినట్టి నీమది
నెరింగి సంతసంబునను గుణభజనానంద కీర్తనము జేయువా రెందరో॥

9 భాగవతరామాయణ గీతాదిశ్రుతి శాస్త్రపురా
ణపు మర్మములన్ శివాది షణ్మతముల గూఢములన్ ముప్పది ముక్కో
టిసురాంతరంగముల భావంబుల నెరిగి భావరాగలయాది సౌఖ్య
ముచే చిరాయువుల్ గలిగి. నిరవధి. సుఖాత్ములై త్యాగరాజాప్తులైన వా రెందరో॥

చ॥ ప్రేమ ముప్పిరి గొనువేళ, నామమును దలచేవారు
రామభక్తుడైన త్యాగ-రాజనుతునికి నిజదాసులైన నా రెందరో॥

తాత్పర్యము :

ముందు కృతిలో రామసాక్షాత్కార సుఖమనుభవించిన సాక్షులను కొద్దిమందిని చివరలో పేర్కొనటం జరిగినది. వారు భగవద్భక్తులు. భగవత్సేవతో పాటిదే భాగవత సేవకూడ అని భాగవత సంప్రదాయం. దీననుసరించి త్యాగయ్యగారు పైకృతిలో చివర వచ్చిన స్ఫూర్తితో భాగవతులకు చివరి శ్రీరాగ కృతిలో వందన సమర్పణ చేస్తున్నారు.

'ప్రహ్లాద నారద పరాశర' అని ఒక భాగవతగోష్ఠి ఉన్నది. వారి అందరిలో ఉన్న ఒక్కొక్క లక్షణాన్ని వర్ణిస్తూ అయ్యగారు వందనమర్పిస్తున్నారు. దీనిని కూడ రామునకే నివేదిస్తున్నారు. ఓ సామగానలోలా! మనసిజలావణ్యా వినుము. మనస్సనే కోతిని అరికట్టి నీ స్వరూపాన్ని చక్కగా దర్శించేవారు, వాడని తమ మనస్సనెడి పద్మమును నీ పాదములయందు సమర్పించినవారు, పతిత పావనుడగు నిన్ను నిజభక్తి మార్గముతో పాడుకొంటూ పరస్పరము భక్తి సల్లాపములు చేసుకొంటూ స్వరరాగ లయమర్మములను తెలుసుకొనేవారు, హరి గుణగానంతో కంఠమును నింపుతూ, తులసీ నళినాక్షమాలలను గళమున ధరించి, భగవద్జ్ఞానము, ఇతరులయెడ మైత్రి దయకలిగి జనులపై అమృతమయ దృష్టిని బరపుచు రక్షించువారు, సుందర గమన విలాసము కలిగిన సరస శ్రీరామ చంద్రుని నిరంతరమును చూచుకొనుచు సంతోషమందుచు భక్త కోటిలో యశస్సు నందినవారు, పరమ భాగవతులు, మౌనివరులు, సూర్యచంద్రులు, సనకసనందనాదులు, దిక్పతులు, దేవతలు, కింపురుషులు, ప్రహ్లాద నారద తుంబురులు, హనుమత్, శివ, శుక, బ్రహ్మలు, బ్రహ్మజ్ఞాన సంపన్నులు, వీరందరు పరమ పావనులు, ఘనులు కాలతత్త్వ మున్నంతవరకుండువారు, బ్రహ్మానంద సుఖాన్ని అనుభవించేవారు

వీరందరకు వందనములు. నీ దివ్య మంగళ విగ్రహ దర్శనము, నీ నామ స్మరణము, నీ పరాక్రమాది గుణముల నెరిగి భజనానందముతో కాలం గడిపేవారు, భాగవత రామాయణాది సద్గ్రంథ పఠనముల ద్వారా సమస్త శాస్త్ర మర్మములు, షణ్మతముల రహస్యములు, సమస్త దేవతల భావములు తెలిసి, వీటి అన్నిటిలో సారము నీవని తెలిసి నిన్ను కీర్తించుకుంటూ అంతులేని ఆనంద సౌఖ్యములు పొందుతూ చిరాయుర్దాయము కలిగినవారు, ప్రేమ అనగా భక్తి, అది ముప్పిరి కాగా నీ నామము స్మరిస్తూ నాకు పరమ పూజ్యకోటిలో చేరిన మహానుభావులెందరో ఉన్నారు. వారందరికి నా వందనములు.

ప్రేమ అనగా భక్తి ఇది ముప్పిరి కొనుట అంటే దృఢపడుట అని సామాన్యముగా చెప్పవచ్చును. ఈ భక్తికి మూడు రూపములున్నవి. పరభక్తి, పరజ్ఞాన, పరమభక్తుల కలయిక అని చెప్పవచ్చును.

ఇట్లు ప్రేమ ముప్పిరిగొన్న భాగవత శ్రేష్ఠులకు అందరికి త్యాగయ్యగారు ఈ శ్రీ రాగ కృతిలో వందన సమర్పణజేసి ధన్యులైనారు. ఈ ప్రణాళికలో కృతకృత్యులయినారు.

6. పంతువరాళి = త్రిపుట (ప్రహ్లాద భక్తి విజయము)

ప॥ అందుండకనే వేగ – వచ్చెదనని నాపై।
నానబెట్టి పోరా॥ అందు॥

చ॥ మందరధర నీ వాప్తులతో గూడి
మరచితే ఏమి సేతునే ఓ రాఘవా॥ అందు॥

చ॥ కనవలెనను వేళ – లేకున్న గన్నీరు
కాలువగా బాఱునే॥
ఇనకులాధిపనీవు. రాను తామసమైతే।
ఇల్లు వాకిలి యౌనే. ఓ రాఘవా॥ అందు॥

2 నిరుపమానంద – శయ్యపై లేకుంటే।
నిమిషము యుగమౌనే॥
పరమాత్మ! నీవుగా నక భ్రమసిన వేళ।
పరులు నవ్వుట కౌనె. ఓ రాఘవా॥ అందు॥

3 పరమభక్తియు నా ప్రా. యము లెల్ల దనుజుల
పాలుగా బోనౌనే॥
వరద శ్రీత్యాగరా. జార్చితపదయుగ
వారిధి ముందరనే. ఓ రాఘవా॥ అందు॥

తాత్పర్యము :

ఇది ప్రహ్లాద భక్తి విజయమందలి కృతి. హిరణ్యకశిపుని భటులు ప్రహ్లాదుని నాగపాశబద్ధుని చేసి సముద్రమున బడవైచిరి. సముద్రుడు మహాభక్తుడగు ప్రహ్లాదునకు స్వాగతమిచ్చి తన అంతఃపురమునకు గొనిపోయి గరుడుని పిలిచి నాగపాశవిముక్తి కలిగించి ప్రహ్లాదునకు షోడశోపచారములు అర్పించి శ్రీమన్నారాయణు నాహ్వానించి ఆయన దర్శనమును కలిగించెను. నారాయణుడు ఒక్కసారి వైకుంఠమున కేగి లక్ష్మితో చెప్పి మరల వచ్చెదనని పోబోవగా ప్రహ్లాదుడు స్వామితో ననిన వాక్యములివి.

'శ్రీహరీ! నీవు వైకుంఠమందే ఉండక త్వరగా వచ్చెదనని నామీద ఒట్టుబెట్టి పోవయ్యా. ఓ మందరధరా! వైకుంఠమందున్న నీ భక్తులను కూడుకొని నీవు నన్ను మరచితే నేనేమి జేతునయ్యా! నిన్ను చూడవలెనని నేను కోరిన సమయములో నీవు లేకుంటే నా కన్నీరు కాలువే అగునయ్యా. ఓ ఇనకులాధిపా! (ఓ సూర్యవంశప్రభువా) నీవు వచ్చుట జాగైతే ఇక్కడ నా ఇల్లు వాకిలి అవుతుంది. (అనగా పెద్ద రచ్చ అవుతుంది) నీ సాక్షాత్కారమనే ఆనందకర శయ్యమీద నేను లేకుంటే నిమిషం యుగమౌతుంది నాకు. ఓ పరమాత్మా! నిన్ను నేను చూడక భ్రమించి పిచ్చివాడనైతే నన్ను జూచి నలుగురు నవ్వెదరయ్యా! నీవు రాకపోతే నా పరమభక్తి, నా వయసు అన్నీ రాక్షసుల పాలవుతాయయ్యా! కనుక ఈ సముద్రుని ముందరనే సముద్రుడు సాక్షిగా త్వరగా వస్తానని నామీద ఒట్టుబెట్టి పోవయ్యా!' అన్నాడు ప్రహ్లాదుడు.

విశేషము = ఇందు ప్రహ్లాదుడు పరమభక్తి అన్నాడు. సాధారణముగా భగవంతుని విషయమున భక్తునకు మూడు దశలుండును. అవి పరభక్తి – పరజ్ఞాన – పరమభక్తులు. పరభక్తి అనగా భగవత్సాక్షాత్కారము కావలెనని దృఢవాంఛ. పరజ్ఞానమనగా ఆ సాక్షాత్కారము కలిగినప్పుడు ఆదర్శనముచేత కలిగిన భగవత్ స్వరూప–రూప–గుణ–విభవ ఐశ్వర్యముల జ్ఞానము. పరమభక్తి అనగా సాక్షాత్కరించిన భగవంతుడు మళ్లీ తనను విడిచిపోవునేమో? అనే భయము. ప్రహ్లాదుడిప్పుడీ దశలో నుండివాపోవుచున్నాడు.

7. ఆరభి = ఆది

ప॥ అంబ నిను నమ్మితినంటే నీ
కనుమానమే మమ్మా॥ అంబ॥

అ॥ శంబరవైరి జనకసోదరి
శరణుజొచ్చి మనసార శ్రీజగ॥ దంబ॥

చ॥ గీర్వాణగణాధారి! అంబ!
శర్వాణి! అఖండాకారి!
పర్వతరాజమనోజ్ఞ కుమారి
నిర్వాహములేక మదిని కోరి॥ అంబ॥

2 సురవైరికదన శౌర్యే!
వరుణాలయ సమగాంభీర్యే!
స్వరజిత కోకిల రవమాధుర్యే!
పరితాపము తాళకను సుచర్యే॥ అంబ॥

3 శర్మదాయకి! గౌరీ దు
ష్కర్మకలుషవన. కుఠారి!
నిర్మల త్యాగ రాజ హృచ్చారి!
ధర్మసంవర్ధని. ఓంకారి॥ అంబ॥

తాత్పర్యము :

శంబవైరి జనక సోదరి = శంబరాసురుని శత్రువగు మన్మథుని తండ్రి అగు శ్రీహరికి చెల్లెలా! గీర్వాణ గణాధారి =దేవతల గణముల కాధారమైన దానా! శర్వాణీ! = శివునిరాణీ! అఖండాకారి = దేశకాల విచ్ఛేదములేని ఆకారముగల దానా! పర్వతరాజమనోజ్ఞ కుమారి = హిమవంతుని ప్రియపుత్రిక అయినదానా! సురవైరి కదనశౌర్యే = రాక్షసులతోడి యుద్ధమందు శౌర్యముగల దానా! సముద్రునితో సమానమయిన గాంభీర్యముగలదానా! కోకిల కన్న మిన్న అగు మాధుర్యముగల కంఠస్వరముగలదానా! శర్మదాయకి! సుఖముల నిచ్చుదానా! గౌరీ = తెల్లని వర్ణము గలదానా! దుష్కర్మ కలుషవన కుఠారీ = పాపములనెడి అడవులకు గొడ్డలి అయినదానా! నిర్మల త్యాగరాజ హృచ్చారీ! = నిర్మల మగు త్యాగరాజుని హృదయమందు సంచరించుదానా! ఓ ధర్మసంవర్ధనీ దేవీ! ఓంకార స్వరూపిణీ! నిన్ను నమ్మితినంటే నీ కనుమానమా? మనసార నిన్ను శరణు జొచ్చినాను. అనన్యగతినై నిన్ను మదిని కోరితి నమ్మా!!

8. అఠాణ = ఆది

ప॥ అట్ల బలుకుదువు – ఇట్లబలుకుదువు
అందుకేమిసేతు రామ! నీ ॥వట్ల॥

అ॥ తొట్ల నర్భకుల – నూతువు మరిమరి
తోచినట్లు గిల్లుదువు – శ్రీరామనీ॥ వట్ల॥

చ॥ జీవుల శిక్షిం – పగనేర్తువు చిరం
జీవులుగా జే – యనేర్తువురా
భావమెరిగి బ్రో – తువు సద్భక్త
భాగధేయశ్రీ – త్యాగరాజనుత॥ అట్ల॥

తాత్పర్యము :

ఓ రామా! అట్లా ఒకసారి పలుకుతావు, ఇట్లా ఒకసారి పలుకుతావు. తొట్లలో పిల్లలనుంచి ఊపుతావు. ఒకసారి గిల్లి ఏడిపిస్తావు. జీవులను శిక్షిస్తావు. కొందరిని చిరంజీవులుగా చేస్తావు. ఒకరిని భావమెరిగి రక్షిస్తావు. ఎట్లయినా నీవు సద్భక్తులకు భాగ్యమవయ్యా! అని త్యాగయ్యగారు భగవల్లీలలను చమత్కరించారు.

విశేషము = జీవు లనేకవిధములుగా నున్నారు. కొందరు సుఖములను కొందరు దుఃఖముల ననుభవిస్తున్నారు. ఇది తొట్లలో ఊపటము, గిల్లి ఏడిపించుట వంటిది. కొందరిని శిక్షిస్తున్నావు. (రావణాదులను) కొందరిని రక్షిస్తున్నావు (విభీషణాదులను) కొందరిని చిరంజీవులను చేస్తున్నావు (హనుమదాదులను) ఇట్లే ఈ సృష్టిలో సుఖ దుఃఖాలనుభవిస్తున్నారు. వీరు భగవంతుని లీలకు పాత్రులు. అయినను ఓరామా నీవు సద్భక్తులకు భాగ్యనిధివే అంటారు అయ్యగారు. అవతారములయందు ఒకసారి అనుగ్రహ భాషణములు చేస్తాడు. ఒకసారి నిగ్రహ భాషణములు చేస్తాడు. దీనినే అట్ల ఇట్ల బలుకుదువనినారు త్యాగయ్యగారు. ఇది లీలాభివర్ణనము.

9. మనోరంజని = ఆది

ప॥ అటుకారాదని పల్క
నభిమానములే – క పోయెనా

అ॥ ఎటులోర్తునునే – దయజూడవయ్య!
ఏ వేల్పుచేయు – చలమో తెలిసి ॥అటు॥

చ॥ వేదశాస్త్రోప – నిషద్విదుడైన
నీదారిని బట్టి – నిజదాసుడైన
నాదుపైన నెప – మెంచితే
న్యాయమా త్యాగ – రాజనుత॥ ॥అటు॥

తాత్పర్యము :

ఓరామా! 'శ్రుతిః స్మృతి ర్మమైవాజ్ఞా యస్తా ముల్లంఘ్యవర్తతే ఆజ్ఞాచ్ఛేదీ మమద్రోహీ' = వేదములు శాస్త్రములు నా ఆజ్ఞలే. వానిని ఉల్లంఘించినవాడు నా ఆజ్ఞ మీరిన ద్రోహి' అని నీవు చెప్పియున్నావు. నేను నీ ఆజ్ఞాకరుడనై వేదశాస్త్రములు చెప్పిన నీ భక్తిని అవలంబించి యున్నాను. ఇట్టి నాపై నీవు నేరము లెన్నుట తగదు రామా! అని 'అటు కారాదని' (నీవు నాపై దయలేక యుండరాదని) నేను పల్కుచున్నాను. వినవు. నీ కభిమానములేదా! అభిమానవంతులు ఎదటివారు చేయు దోషోద్ఘాటనమును సైరింపరు. వారి అభీష్టమును దీర్తురు. నీవు నన్ను రక్షింపకున్నావు. అభిమానములేదా! ఇది ఏ దేవుని ఆగ్రహమో? కదా!

10. మధ్యమావతి = చాపు

వ॥ అడిగి సుఖము లెవ్వ – రనుభవించిరిరా
ఆది మూలమా రామా! ॥అడిగి॥

అ॥ సడలని పాపతి – మిరకోటి సూర్య
సార్వభౌమా! సార – సాక్ష! సద్గుణ! ని॥ న్నడిగి॥

చి॥ ఆశ్రయించివర – మడిగిన సీత
అడవికి బోనాయె॥
ఆశర హరణ! ర – క్కసి ఇష్టమడుగ
అపుడె ముక్కుపోయె. ఓరామా! ని॥ న్నడిగి॥

2 వాసిగనారద – మౌని వరమడుగ!
వానరరూపు డాయె॥
ఆసించి దుర్వాసు – డన్నమడుగ
అపుడే మందమాయె ఓ రామ! ని॥ న్నడిగి॥

3 సుతుని వేడుక జూడ – దేవకి అడుగ – య
శోద జూడనాయె
సతులెల్ల రతి భిక్ష – మడుగ వారివారి
పతులు వీడనాయె. ఓ రామ! ని॥ న్నడిగి॥

4 నీకేదయ బుట్టి – బ్రోతువో బ్రోవవో
నీ గుట్టు బయలాయె
సాకేత ధామ శ్రీ – త్యాగరాజనుత
స్వామి ఏటి మాయ – ఓ రామ! ని॥ న్నడిగి॥

తాత్పర్యము :

సర్వదేవతలకు ఆదిదేవుడవై, పాపములనెడి చీకట్లను తొలగించు సూర్యుడవై, సార్వభౌముడవై, పద్మనేత్రుడవై సకల సద్గుణములతో వెలుగొందు ఓ రామా! నిన్ను వరముల నడిగి ఎవ్వరూ సుఖమనుభవించలేదు. పైగా కష్టాల పాలయ్యారు. గర్భిణి అయిన సీత ఋషివాటికలను చూడగోరి నిన్నడిగి కష్టాల పాలయినది. శూర్పణఖ నిన్ను కోరి ముక్కుచెవులు పోగొట్టుకొనినది. నారదుడు రాజకుమారి తనను వరించుటకై సుందరరూపమును నీవలన కోరుకుని వానరరూపము పొందినాడు. (ఈ కథ పురాణ ప్రసిద్ధము) ద్వైతవనంలో పాండవులను పరాభవింపవలెనని దుర్వాసుడు సపరివారంగా పాండవులను అన్నమడిగితే కృష్ణమహిమచేత వారి కడుపు నిండిపోయి వెళ్ళిపోయినాడు. దేవకి తపస్సు చేసి నిన్ను పుత్రునిగా పొందే వరం కోరితే అది యశోదకు దక్కింది. దేవకికి కారాగారప్రాప్తి కలిగినది. గోపికలు నీ పొందుగోరితే వారిని భర్తలు పరిత్యజించారు. ఈ విధంగా వరమడిగిన వారంతా కష్టాలపాలే అయ్యారు. మరి నీకు అవ్యాజంగా దయకలగవలెను. అది కలుగునో కలగదో? ఇదంతా మాయగా ఉన్నది. అన్నారు త్యాగయ్యగారు వ్యాజనిందా రూపంలో.

విశేషము = ఈ త్యాగయ్యగారి వాక్యముల వలన గ్రహింపవలసిన దేమంటే? భగవంతుని ఏవరమును అడుగరాదు. అందు చేతనే 'నాకు ధర్మాసక్తిలేదు. ధనకాంక్షలేదు. కామోపభోగములపై వాంఛలేదు. అది ఎలా జరుగవలసి ఉంటే అలా జరుగుతాయి. నేను కోరినదొక్కటే. జన్మ జన్మలకు నీ భక్తిని మాత్రమే' అంటారు కులశేఖరులు. భగవంతుని తాను వరమడుగుట అనే ఒక ఉపాయమును భావింపరాదు. అట్లు భావిస్తే కర్తృత్వాహంకారాది దోషము లేర్పడును. అవి కష్టహేతువులగును. ఈ ధర్మసూక్ష్మమును త్యాగయ్యగారు గర్భితంచేసి ఈ కృతిని చెప్పిరి.

11. ఆరభి = చాపు (ప్రహ్లాద భక్తి విజయము)

ప॥ అడుగు వరములని – చ్చెదను
అడుగు వరములనిచ్చెదను

అ॥ అడుగడుగుకునిన్నే – దలచుచున్నాను.
అద్భుతమైన భక్తికి సొక్కినాను॥ అడుగు॥

చ॥ ధనకనకములనె – న్నైన – నీకు
దారాపుత్రులు సాగ– సైన – ఇండ్ల
చనవున నొసగుదు. సంశయమేల
తనువు చిక్కగ నేల – దానవ బాల॥ అడుగు॥

2 అక్రమ దనుజుల – గొట్టి నీ
ఆపదలను బో – గొట్టి
విక్రమమున బహు – విఖ్యాతిగా విధి
శుక్రాదుల పట్ట – ములనొసగెదను॥ అడుగు॥

3 వాజిగజాందోళికములు – నీకు
వరమైన మణి భూష – ణములు
రాజిగ నొసగక – రవతాళలేను
వరత్యాగరాజా – ప్తుడనేను॥ అడుగు॥

తాత్పర్యము :

ఇది ప్రహ్లాద భక్తి విజయములోనిది. ప్రహ్లాదునకు శ్రీహరి సాక్షాత్కరించినాడు. ప్రహ్లాదుడు పరవశించినాడు. శ్రీహరి ప్రహ్లాదుని ఏవైనా వరములు కోరుకొమ్మంటున్నాడు. ఓ ప్రహ్లాదా! నేను నిన్నెప్పుడును స్మరిస్తూ ఉంటాను. (అహం స్మరామిమద్భక్తం = నేను నా భక్తుని స్మరిస్తూ ఉంటాను అని భగవద్వాక్యము. అదీకాక భగవద్గీతలో 'నాయందు మనసు ఉంచినవానిపై నేను మనసుంచెదను' అని కృష్ణవాక్యము) నీ అద్భుత భక్తికి నేను పరవశించాను. నీకు ధన కనకములు కావలెనా? కోరుకో. అక్రమ రాక్షసుల బాధలు పోగొట్టి నీకు చతురంగబలములనిచ్చి బ్రహ్మపదములో ఇంద్రపదవిలో కూరుచుండబెట్టెదను. ఏది కావాలో కోరుకో, అని శ్రీహరి ప్రహ్లాదునితో అన్నాడు.

విశేషము = ఇందొక శంకపొడమును. దీనికి వెనుకనున్నపాటలో భగవానుని వరము కోరరాదనే భావమున్నది. దానికిది విరుద్ధము కాదు. ప్రహ్లాదుడు వరమడుగుటలేదు. హరియే వరములడుగుమని వర మడుగుచున్నాడు. ఆ చరిత్రలో ప్రహ్లాదు డీవరముల నన్నిటిని తిరస్కరించి నీ దర్శనమే చాలు నన్నాడు. భగవదాజ్ఞా తిరస్కార దోషమును ప్రహ్లాదున కంటదు. నాకు కావలసినది నీ సాక్షాత్కారమే అన్నాడు.

12. కాపి = చాపు

ప॥ అతడే ధన్యుడురా ఓ మనసా

అ॥ సతతవాయుసుత. ధృతమగు సీతా
పతిపదయుగమును – సతతము స్మరియించు ॥నతడే॥

చ॥ వెనుకతీక తన – మనసు రంజిల్లగ
ఘనమైన నామకీ – ర్తనపరుడైనట్టి॥ అతడే॥

2 తుంబురు వలె తన – తంబుర బట్టి ద
యాంబుధి సన్నిధా – నంబున నటియించు॥ నతడే॥

3 చాయకు సుజనుల – బాయక తాను ను
పాయమునను ప్రొద్దు – హాయిగ గడపిన॥ యతడే॥

4 కరివరదుని తత్త్వ – మెరుకను మరిగించి
అరిషడ్వర్గమును – పరవలేక తిరుగు॥ నతడే॥

5 ఉల్లపుతాపము – చల్లజేసి అన్ని
కల్లలనుచు నెంచి – సల్లాపమున నుండు॥ నతడే॥

6 ఆర్తిని మరియు ప్ర – వృత్తిని దొలగించే
కీర్తి గలిగిన రామ – మూర్తిని నెరనమ్ము॥ నతడే॥

7 కలుగని నిజ విప్ర – కులమున జన్మించి
నిలువరమగు ముక్తి – ఫలమును జేకొన్న॥ యతడే॥

8 కాసువీసముల – కోసమై యాసతో
వేసము ధరియించి – మోసము జెందని॥ యతడే॥

9 కర్మనిష్ఠుడైన – ధర్మశీలుడైన
శర్మరామనామ – మర్మము దెలిసిన॥ యతడే॥

10 అందముగా నామ – మందరు జేసిన
సుందరరాముని – యందు లక్ష్యము బెట్టు॥ నతడే॥

11 ఇన్నిపాట్లకు స – ర్వోన్నతమౌ సుఖ
మున్న అనుభవించు – కొన్నవాడెవడో॥ అతడే॥

12 రాజసజనులతో – తాజతగూడక
రాజిల్లు శ్రీ త్యాగ – రాజనుతుని నమ్ము॥ నతడే॥

తాత్పర్యము :

త్యాగయ్య గారీ కృతిలో ధన్యుడెవడో, వాని లక్షణములేవో చాలా వివరంగా చెప్పుచున్నారు. హనుమంతు డెప్పుడును సేవించు సీతాపతి పాదములను స్మరించువాడు, వెనకచూపులేకుండా తన మనస్సు ఆనందం జెందే విధంగా నామ స్మరణము చేసేవాడు, తుంబురుని వలె తంబురాబట్టి దయాసముద్రుడైన రామభద్రుని సన్నిధిలో నాట్యమాడే వాడు, సజ్జనుల సాంగత్యము వదలక భగవంతుని ఉపాయముగా నమ్మి ప్రొద్దు గడిపేవాడు, భగవంతని తత్త్వాన్ని జ్ఞానమనే కషాయముతో మరగబెట్టి కామ క్రోధాదులకు వశముగాక తిరిగేవాడు, మనస్సును చల్లగా నుంచుకొని ఇహలోక విషయములు మిథ్య అని తెలుసుకొని భక్తులతో సల్లాపము చేయువాడు, సంసారార్తిని ప్రవృత్తినీ తొలగించే రామమూర్తిని స్మరించేవాడు, నిరుపేద బ్రాహ్మణకులంలో పుట్టి శాశ్వతమైన మోక్షమును పొందినవాడు, ధనముపై ఆశతో ఏవేవో వేషాలువేసి మోసపోనివాడు, కర్మనిష్ఠుడే కానిండు ధర్మశీలుడే కానిండు ఎవడయినా సరే సౌఖ్యప్రదమైన రామనామ మర్మాన్ని తెలిసినవాడు, తియ్యని నామము సుందర రూపము కలిగిన రామచంద్రునిపైననే లక్ష్యము బెట్టుకొన్నవాడు, ఇన్ని పాట్లు పడితే సర్వోత్తమమైన మోక్షము చిక్కుతుంది. దాని ననుభవించినవాడు, రాజసులతో జతగూడక రాముని నమ్ముకొన్నవాడు. ఇన్ని లక్షణములు గలవాడు ధన్యుడు. త్యాగరాజుగారి ఈ భావములే పూర్వాచార్య విరచితమగు ఒక శ్లోకమున 'సత్సంగా ద్భవనిస్స్పృహో గురుముఖా చ్ఛ్రీశం ప్రపద్యాత్మవాన్' = సత్సంగమువలన వైరాగ్యవంతుడై గురువు ద్వారా భగవంతు నాశ్రయించి – మొదలుగా.... 'శ్రీ వైకుంఠ ముపేత్యనిత్యమజడం తస్మిన్ పరబ్రహ్మణః సాయుజ్యంసమవాప్యనందతి సమంతేనైవ ధన్యః పుమాన్' = వైకుంఠము చేరి పరబ్రహ్మసాయుజ్యముపొంది ధన్యుడగు వాడు పరబ్రహ్మముతో శాశ్వతానందమును పొందును' అని చెప్పబడినవి.

13. యదుకుల కాంభోజి = ఆది

ప॥ అదికాదుభజన – మనసా

అ॥ ఎదలో నెంచుటొకటి ప – య్యెదలో గల్గిన చోటొకటి ॥అది॥

చ॥ గొప్పతనమునకై ఆ స – కుత్సిత విషయ పిపాస
మెప్పులకై బహువేషమిడి – ఉప్పతిల్లెదరు త్యాగరాజనుత॥ అది॥

తాత్పర్యము :

భజన అనగా భగవంతుని సేవించుట. ఆ భజన త్రికరణ శుద్ధితో. లోపల ఐహిక విషయములను స్మరిస్తూ బహిరంగంగా నామ స్మరణ చేయుట భజనకాదు. గొప్పతనం కోసం ప్రాకులాడుచు కుత్సిత విషయములపై దాహం కలిగి బహిరంగంగా నలుగురి మెప్పుకోసం అనేక వేషములువేయుట (భక్తవేషములు) భజనకాదు. అంతరంగ బహిరంగములు ఏకమై ధ్యాన స్మరణ కీర్తనములు భగవన్మయమైనప్పుడే అది భజన మగును.

14. జింగ్లా - ఆది

ప॥ అనాథుడనుగాను రామనే॥ ననాథు॥

అ॥ అనాథుడవునీ – వని నిగమజ్ఞుల
సనాతనుల మాట విన్నాను నే॥ ననాథు॥

చ॥ నిరాదరవు జూచి – ఈ కలి
నరాధములనేరు .....
పురాణపురుషా – పురరిపునుత నా
గరాట్సయన త్యా – గరాజనుత నే॥ ననాథు॥

తాత్పర్యము :

త్యాగరాజు రాజా శ్రయము చేయలేదు. మీదుమిక్కిలి రాజాహ్వానమును తిరస్కరించినాడు. దానిని చూచి కలియుగ మానవులు 'ఈ త్యాగయ్యకు రాజరక్షణ కూడా ఉండదు. రాజు కోపిస్తే వీడనాథ అవుతాడు అని అనుకొన్నారు. అనాథ శబ్దమున కర్థమేమంటే నాథుడు లేనివాడు అని. అనగా రక్షించువాడు లేనివాడు, దిక్కులేనివాడు

అని. దీనిని పురస్కరించుకొని త్యాగయ్యగారు రాముని వద్ద చమత్కరించినారు. ఓ పురాణ పురుషా! = నమస్త దేవతలకు కూడ ఆదిమూలమైన వాడా! పురరిపునుత = శివునిచే పొగడ్త గన్నవాడా! నాగరాట్శయన = నాగులకు ప్రభువైన శేషునిపై నిద్రించు ఓరామా! ఈ కలి మానవులు నన్ననాథుడంటున్నారు. నాకేమి? నాకు నీవు నాథుడవు గనుక నేను అనాథుడను గాను. మరి నీవే అనాథుడవయ్యా! అనగా రక్షకులు లేరు. ఇదినేను చెప్పుటలేదు. వేదజ్ఞులయిన పెద్దలు చెప్పినారు. ఆ మాటలు నేను విన్నాను అని తాత్పర్యము.

విశేషము = అనాథుడు అనగా ఒక నీచమయిన విశేషణముగా తోస్తుంది. త్యాగయ్యగారు ఈ విశేషణమును వేదజ్ఞుల వాక్య ప్రమాణముతో రామునకే అన్వయింపజేశారు. ఈ విషయమున భగవంతుని వాక్యముగా ఒక పురాణ శ్లోకమున్నది. 'రుద్రం సమాశ్రితా దేవాః రుద్రో బ్రహ్మాణ మాశ్రితః। బ్రహ్మాసమాశ్రితో మాంహి। నాహం కంచి దుపాశ్రితః' = దేవతలు శివునాశ్రయించిరి. శివుడు బ్రహ్మ నాశ్రయించెను. బ్రహ్మ నన్నాశ్రయించెను. నే నెవరిపినీ ఆశ్రయింపలేదు' అని విష్ణు వాక్యము. సర్వాధికుడు నాథుడవుతాడు. వానికి నాథుడుండడు. అందుచేత వాడనాథుడగును. విష్ణువు సర్వాధికుడని 'న తత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే' = విష్ణువుతో సముడులేడు అధికుడు లేడు = అని వేద వాక్యము. ఈ భావములను పురస్కరించుకొనే త్యాగయ్యగా రీకృతిలో 'పురాణ పురుషా' 'పురరిపునుత' అనే సంబోధనములను సాభిప్రాయముగా వాడినారు.

15. కాపి = ఆది

ప॥ అన్యాయము సేయకురా - రామ (న)'
నన్యునిగా జూడకురా నాయెడ॥ అన్యాయము॥

అ॥ ఎన్నో తప్పులు జేసిన వారిని - రా
జన్య నీవు బ్రో'చినావు కనుకను ॥ అన్యాయము॥

చ॥ జడభరతుడు జిం. కశిశువు నెత్తి
బడలిక దీర్చగ. లేదా
కడలిని మునిగిన. గిరినొక కూర్మము
కాపాడగ లేదా

పుడమిని పాండవ. ద్రోహిని ధర్మ

పుత్రుడు బ్రోవగ లేదా

నడిమి ప్రాయమున. త్యాగరాజనుత

నా పూర్వజు బా. ధ దీర్పలేనని ॥ అన్యాయము॥

తాత్పర్యము :

ఓ రామా ! నాకు నీ వన్యాయము చేయవద్దు. నన్ను పరాయి వానినిగా చూడవద్దు. మా అన్న చాల జబ్బులో నున్నాడు. నడి వయస్సు వాడు. నేను జబ్బును కుదర్చలేనని చెప్పి నన్నన్యాయం చేయకు. నా అన్న తప్పులు చేసి యుండవచ్చును. రామా ! ఎన్నో తప్పులు చేసినవారిని నీవు రక్షించావు కదా ! రక్షించటానికి దయాగుణం కావాలి. ఆగుణంతో జడభరతుడను ముని తపోభంగం అవుతుందని చూడక తన ఎదురుగా బాధ పడుచున్న జింక పిల్ల నెత్తి రక్షించాడు కదా ! సముద్రములో మునిగిపోబోవు చున్న మందరగిరిని కూర్మమవయి నీవు కాపాడలేదా ? అదీ కాక తమకు ద్రోహము తలపెట్టిన అశ్వత్థామను ధర్మరాజు వధింపక వదిలి పెట్టలేదా ? కనుక అపరాధములను క్షమించి నడిమి ప్రాయపు మా అన్నను రక్షింప వయ్యా ! అని త్యాగయ్యగారు రామయ్యను వేడుకొన్నారు.

విశేషము = ఎన్నో తప్పులు చేసిన వారిని నీవు రక్షించావు అని త్యాగయగారనటంలో ఉద్దేశ్యము. విభీషణుడు వచ్చి ఆకసమున నుండి శరణాగతి చేసినాడు. సుగ్రీవాదులు వాని యందు దోషములను (తప్పులను) ఉద్ఘాటించి వధించ వలసినవాడే అని శ్రీరామ చంద్రునకు సూచించారు. అప్పుడు రాముడు ''దోషోయద్యపి తస్యస్యాత్ సతామేత దగర్హితం'' = వానియందు తప్పులున్నను ఆ తప్పులను చూచుట సత్పురుష లక్షణము కాదు'' అంటాడు. ఈ గుణమును పురస్కరించుకొని ''ఎన్నో తప్పులు చేసినవారిని రక్షించావు'' అని రాముని అపరాధ క్షమాగుణమును సూచించారు త్యాగయ్యగారు.

16. అరాణ = జంపె

ప॥ అనుపమగు ణాంబుధి. యని నిన్ను నెరనమ్మి
అనుసరించిన వాడ. నైతి ॥ ... అనుపమ॥

అ॥ మనుపకయె యున్నావు. మనుపతీ వ్రాసి మే
మనుపమా కెవరు వినుమా దయరాని ॥ అనుపమ ॥

చ॥ జనక జామాతవై. జనక జామాత వై
జనక జాలము చాలు. చాలును హరీ ॥ అనుపమ॥

2 కనక పటధర ! నన్ను. కనక పటమేల తను
కనక పఠనము సేతు. గాని వూని ॥ అనుపమ ॥

3 కలలోన నీవేన. కలలోక నాథ ! కో
కల లోకువగ నిచ్చి. గాచినది విని ॥ అనుపమ॥

4 రాజకుల కలశాబ్ధి. రాజసురపాల గజ
రాజ రక్షక త్యాగ. రాజసుత ॥ అనుపమ॥

తాత్పర్యము :

ఓ రామా! నీవు సాటిలేని గుణసముద్రుడవని నిన్ను గాఢంగా నమ్మి నీ భక్తి మార్గాన్ని అనుసరించాను. నీవు నన్ను రక్షించకుండా ఉన్నావు. ఓ మనుపతీ! (మనుపతీ అనగా మను వంశ ప్రభువా అని అర్థము చెప్పిరి. మనువు సూర్యవంశము వాడు. రాముడును సుర్యవంశమువాడు కనుక అట్లర్థము చెప్పిరి. ఇంకొక అర్థమును చెప్పవచ్చును. మను శబ్దమునకు మంత్రమని అర్థము. దాని ప్రకారము ఓ మంత్ర పతీ అని చెప్పవచ్చును. ఎట్లనగా ''రామతారక'' మని ప్రసిద్ధరామ మంత్రమున్నది. దానికి పతి అనగా ఆ మంత్రమున చెప్పబడిన దేవుడు రాముడు. కనుక ఓ మంత్ర పతీ! అని సంబోధించినట్లు భావించవచ్చును) ఓ మనుపతీ! మేము నీకు లేఖ వ్రాసి పంపుటకు మాకెవరున్నారు? ఎవరునులేరు వినవయ్యా! దయరావటంలేదా? నీకు. జనకునకు అల్లుడవయ్యావు. ఓరిమి అనేగుణానికి భూదేవి సమానుడవు. ఓ జనకా! నీ మాయ లికచాలు. ఓ కనకాంబర ధారీ! నను చూచుటకు కపట మేల ? నీవు నను కనక పోతే నేను శరీర ధ్యానము ధనధ్యానమే చేయవలసి ఉంటుంది. అది సద్గతి హేతువు కాదు కదా! అందుచేత నిన్ను స్మరించుట మానను. ఓ సకల లోకనాధా ! కలలో కూడ నిన్నే స్మరిస్తున్నాను. ద్రౌపదికి కోక లిచ్చి రక్షించినది విని నిన్ను నమ్మి

యున్నాను. భూలోకమందున్న రాజకులము అనే సముద్రమునకు నీవు చంద్రుడవు. భూలోక వాసి వైనను స్వర్గలోక వాసులగు దేవతలకు రక్షకుడవు. తిర్యగ్జంతువయిన ఏనుగును గూడ రక్షించిన వాడవు.

విశేషము = ఈ కృతిలో శబ్ద సంబంధమగు ఒక చమత్కారము ప్రతిభాగమందును కలదు. అనుపల్లవిలో తాళాదిలో మనుప అనేది మూడు సార్లు వచ్చినది. మొదటిది మనుపక=రక్షింపక అని అర్థము. రెండవది ''మనుపతీ'' మొదటి మూడక్షరములు పునరావృత్తములై ''తీ'' అక్షరముచేరి అర్థము మారినది. మూడవది మేము+అనుప అని సంధి చేయటంచేట మే మనుప అని మళ్లీ అవే అక్షరాలు పురావృత్తం అయినవి. నంధి విభజన చేస్తే అనుప= పంపుటకు అని అర్థము మారినది. చరణములో జనక+జామాతవై జనకుని జామాతవై (అల్లుడవై) జనకజా-మాతవై, జనకజా=సీత. ఆమెకు మాతవై=తల్లివై అనగా భూమిః జనక=తండ్రీ! అని సంబోధనము. భగవంతునకు భక్తునకు మధ్య పితా పుత్ర సంబంధమున్నది. అందుచే ఈ పిలుపు సమంజసము. జాలము=మోసము, ఈ పదములో మొదటి అక్షరమైన ''జా'' జనక అను పదముచేరి అది కూడ 'జనకజా'' అయినది. ఈ విధంగా అక్షర పునరావృత్తి, విరుపుల భేదము వలన అర్థభేదము వచ్చినది. రెండవ చరణములో కనక-పట-ధర బంగారు వస్త్రమును ధరించిన వాడా! కన-కపట-మేల= చూచుటకు కపట మేల కనక=పఠనము-ధన-స్మరణము అని అక్షరావృత్తి అర్థభేదము నేర్పడినవి. మూడవ చరణములో కలలోన=స్వప్నమందు, ఆ వృత్తం చివరి అక్షరముగా ''స'' తరువాతి ఆ వృత్తంలో కలలో కనాథ చేరి స॥కలలో కనాథ!=అన్ని లోకములకు నాథుడవు అని కో॥ కల-లోకువగ అనునదియు పైదానివలె.

మూడక్షరములును పున రావృత్తములయినవి. ఈ అక్షర పునరావృత్తిని అలంకారా శాస్త్రమందు ''యమకము'' అందురు. ఈ కృతియందు భక్తి భావమునకు భంగము కలిగింపని శబ్ద చమత్కృతి కలదు.

17. సరస్వతి = రూపకము

ప॥ అనురాగము లేని - మనసున సుజ్ఞానము రా ॥ దను॥

అ॥ ఘనులైన అంతర్ - జ్ఞానులకెఱుకే గాని ॥ అను ॥

చ॥ వగవగగా భుజియించు. వారికి తృప్తి యౌరీతి ॥
సగుణ జ్ఞానము పైన. సౌఖ్యము త్యాగరాజనుత ॥ అను॥

తాత్పర్యము :

తా॥ మోక్షసాధనము భక్తి అని ఒక మతము జ్ఞానమని ఒక మతము. భక్తి అనేది శ్రవణ, కీర్తన, స్మరణ, అర్చన, వందనాది క్రియలతో కూడినది. వీటికి ఆలంబముగా భగవంతునకు నామ రూప గుణములుండవలెను. భక్తి రూప ఉపాసనము నందు భగవంతుడు సగుణుడు. ఇక జ్ఞానము అనేది భగవంతుడు నామ రూప గుణములు లేనివానిగా నిష్క్రియముగా, నిరాకారముగా, నిరంజనముగా శుద్ధచైతన్య మాత్రముగా ఎరిగి ఉండుటఃఇంతే. ఇందు పంచ జ్ఞానేంద్రియములకు గాని కర్మేంద్రియములకు గాని పని ఏమీ ఉండదు. మరియు భక్తి మార్గమున రుచికరమయిన శ్రవణము చెయ్యవచ్చును. రుచికరమయిన కీర్తనము స్మరణము చెయ్యవచ్చును.

భక్తి సాధకులు జ్ఞానము భక్తిలేనిచో జనించదు అని చెప్పెదరు. కనుక భక్తి ఆవశ్యక మందురు. జ్ఞానులు భగవద్జ్ఞానమే భక్తికి కారణమందురు. ఎట్లయినను ఆరెండును పరస్పర సహకారములే కాని విరుద్ధములు కావు. భక్తిని ''అనురాగము'' అని ''పూజ్యేష్వనురాగఃభక్తిఃఃః

చ॥ సకలలోకుల ఫలాఫలము లెరిగి
సంరక్షించుచు నుండగ న
న్నొకని బ్రోవ తెలియను కీర్తన సుశతక
మొనర్చుకొన్న త్యాగ రాజుని ॥ అప॥

తాత్పర్యము :

ఘనమైననా అపరాధములను క్షమించే సమయమిది. కృపజూడు. నీ మనసు దయగలది. నేనది తెలియక నీకు జాలికలిగేటట్లు చేసుకొంటున్నానని మొరలు పెట్టుచున్నాను. ఇది నా చపల చిత్తం. అపరాధము. రామా ! నీవు లోకులందరికి ఏ ఏ ఫలము లీయ వలెనో తెలిసి రక్షిస్తూ ఉండగా నన్నొక్కని బ్రోవుమని కీర్తన శతకములను రచించిన నా అపరాధము నోర్వుము. అని భావము.

విశేషము = రక్షణభారము రాముని పైననే ఉండగా తప్పనిసరిగా ఆయన రక్షించు వాడైయుండగా తానొక ప్రార్థనము చేయుట ఒక అపరాధమని త్యాగయ్యగారి తలపు. నిజానికి ప్రార్థనము చేయుట అపరాధముగాదు. ఉపచారమే. కాని ప్రపత్తిని దృష్టిలో పెట్టుకొన్నప్పుడు అపచారము కావచ్చును. ఒక్కసారే ఆత్మ సమర్పణము చేసి ఊరకొనవలెను. మరల మరల ప్రార్థించుట ప్రపత్తి శాస్త్రమునుబట్టి అపచార మగును. పరమ భక్తులు షోడశోపచారాది విధులతో అర్చించి తుద కీ క్రింది విధముగా అనుసంధించెదరు. 'ఉపచారాపదేశేన కృతానహరహ ర్మయా అపచారా నిమాన్ సర్వాన్ క్షమస్వపురుషోత్తమ' = ఓ పురుషోత్తమా! ఉపచారము లనెడి వంకతో నేను నిత్యమును చేయు అపచారముల నన్నిటిని క్షమింపుము అని. ఇదియు నట్లే.

19. దర్బారు = జంపె

ప॥ అపరాధముల మాన్పి – ఆదుకోవయ్యా॥

అ॥ కృపజూచి బ్రోచితే – కీర్తి కలదిక నీకు అప॥

చ॥ అత్యంత మత్సరమ–దాంధుడై సజ్జనుల
నిత్య కర్మములవలె – నిందించుకొన్ననా॥ అప॥

2 చూచువారల కెదుట – సొక్కి జపితుడనైతి
యోచించ నీపాద – యుగళ ధ్యానములేని॥ అప॥

3 స్త్రైణ జనులనుగూడి – వీణాడితిని గాని
ప్రాణహితగుణకథల – బల్కలేనైతినా॥ అప॥

4 శరణు జొచ్చిన నన్ను – కరుణింపవే రామ
వరత్యాగరాజనుత – వశముగా దికనాకు॥ అప॥

తాత్పర్యము :

రామా! నా అపరాధములను మానిపి (నేను చేయకుండజేసి) ఆదుకొనుము. అవి మానిపించి దయచూపి రక్షిస్తే నీకు కీర్తి కలుగుతుంది. మదమాత్సర్యములు గలిగి సజ్జనాపవాదము చేయుచున్నాను నిత్య కర్మలవలె. (స్నానసంధ్యాద్యనుష్ఠానములవలె) మనస్సులో నీ పాద ధ్యానములేక చూచేవారికి కనిపించులాగున వెలికి డంబాచారమును చేయుచు నీనామ జపము చేయుచున్నాను. ఆడవారితో కూడి వీణాడితిని. (వ్యర్థప్రసంగములు చేసితినే) కాని ఓ ప్రాణహిత = ప్రాణమునకు హితుడవయిన రామా! నీ గుణకథలను పలుకనైతిని. ఈ అపరాధములు చేయకుండ నన్ను తీర్చి దిద్దుము. శరణు జొచ్చినాను. నను రక్షింపుము. రక్షించకపోతే ఇక తాళలేను.

విశేషము = ఇందు అయ్యగారు అపరాధములను క్షమింపు మనలేదు. చేయకుండా మాన్పుమన్నారు. 'అంతఃప్రవిష్టశ్శాస్తాజనానాం' = భగవానుడు జనుల లోపల ప్రవేశించి శాసించువాడు' అని వేదము. దాని ప్రకారము లోపల ప్రవేశించి అపరాధ కరణమునుండి బుద్ధిని మరలించమని కోరినారు. అని భావించి తాను చేయని ఊహింపని అపరాధములను తనయం దారోపించుకొని చెప్పినారు. ఇది భక్తుల సంప్రదాయము. 'వీణాడితిని' అన్నారయ్యగారు. దీనికి తెలుగుపరముగా అర్థములేదు. తమిళములో వీణ్ అంటే వ్యర్థము అని అర్థము. అయ్యగారు తమిళపదమును తెనుగు పదమును కలిపి 'వీణాడితిని' అన్నారు. దీనికి వ్యర్థప్రసంగములు చేసితిని అని అర్థము వ్రాయుట జరిగినది. ఇది గమనార్హము.

20. పంతువరాళి = రూపకము

ప॥ అప్ప! రామభక్తి ఎంతో – గొప్పరా మా॥ అప్ప॥

అ॥ త్రిప్పటలను దీర్చి కంటి–రెప్పవలెను గాచు మా॥ అప్ప॥

చ॥ లక్ష్మీదేవి వలచునా – లక్ష్మణుండు కొలుచునా
సూక్ష్మబుద్ధి గల భరతుడు – చూచి చూచి సొలసునా॥ అప్ప॥

2 శబరి ఎంగిలిచ్చినా – చంద్రధరుడు మెచ్చునా।
అబల స్వయంప్రభకు దైవ–మచలపదవి నిచ్చునా॥ అప్ప॥

3 కపి వారిధి తాటునా – కలికి రోట గట్టునా
అపరాధి త్యాగరాజు – కానందము హెచ్చునా॥ అప్ప॥

తాత్పర్యము :

అప్పా! మా అప్పా! (ఇది సామాన్యమానవుని అనునయించి పిలచుట) రామభక్తి చాల గొప్పది. అది త్రిప్పటలను తీర్చుతుంది. త్రిప్పటలనగా అల్పములు అస్థిరములు అయిన ఫలములనుగోరి ఏవేవో కర్మములు చేసి శ్రమ పడుట. రామభక్తి ఉంటే ఆత్రిప్పటలతో పనిలేదు. నిత్యమూ కంటిని అంటి పెట్టుకొని రెప్పలు కంటిని రక్షించినట్లే రామభక్తి జీవుని రక్షిస్తుంది. రామభక్తి (విష్ణుభక్తి – విష్ణు అవతారముల భక్తి) గొప్పది కాకపోతే లక్ష్మీ దేవి ఆయనను వలచి యుండునా? లక్ష్మణుడు ఆభక్తిలోని రుచిని గొప్పతనమును ఎరిగి అరణ్యమునకు కూడ వెంటనంటిపోయి నిత్యకైంకర్యము చేసినాడు. సూక్ష్మబుద్ధి కలిగిన భరతుడు రామాజ్ఞను పాటించి పాదుకాసేవ చేస్తూ రాముడు ఎప్పుడు తిరిగివచ్చునా అని నిరీక్షించునా? రామభక్తి మహిమ చేతనే కదా హనుమ సముద్రము దాటినది. మహాయోగులకు కూడ అందని కృష్ణ పరబ్రహ్మమును యశోద రోటికి కట్టినది ఆభక్తి ప్రభావము చేతనే కదా! అపరాధముచేసిన త్యాగరాజు కూడ రవ్వంతయినా భయములేక నిత్యానందమును పొందుచున్నది రామభక్తిచేతనే కదా!

విశేషము = అపరాధి యమునకు వెరచుచుండును. రామభక్తి కల త్యాగరాజు యమభీతి పొందలేదుకదా మీదు మిక్కిలి ఆనందమనుభవించుచున్నాడు. ఇది రామభక్తి మహిమచేతనేకదా!

'హరిహర మధుసూదన ప్రపన్నా' = భగవద్భక్తులను వదలి పెట్టము' అని భటులకు యముని ఆజ్ఞ.

21. ఆంధాళి = చాపు

ప॥ అభిమానము లేదేమి – నీ
వభినయవచనము – లాడెదేమి॥ అభి॥

చ॥ మాలిమించుకైన లేదా తన్ను
మాలిన ధర్మము – గలదా వన

మాలి నాపై దయ – రాదా పాలు
మాలిన గుణ మిక – నైన బోదా॥ అభి॥

2 కలిమి యుంటే బెట్టు – కోరా కృప
కలుగు ననుచు వేడి – నారా నా
కలువరములు విన – రారా పో
కలు నీకు గలవని – నేనెరుగ లేదా॥ అభి॥

3 రాజు నీవని నమ్మి – నాను గజ
రాజున్న వితమువి – న్నాను రతి
రాజ దాసుల వేడ – లేను త్యాగ
రాజు నీ వాడని పేరు – గొన్నాను॥ అభి॥

తాత్పర్యము :

రామా! నీకు నాపై అభిమానము లేదేమి? (అభిమాన మనగా తనవాడు అను భావము) నీ వాడిన మాటలన్నీ నాటకమేనా? (రామచంద్రుడు విభీషణ శరణాగతి సందర్భములో 'ఒకసారి నీవాడను అంటే వానికభయ మిత్తునని నావ్రతము' అన్నాడు. అదంతయు అభినయమేనా? అని) నీ వాడనైన నన్ను మాలిమితో రక్షించుట లేక ఇంకెవరినో రక్షించుట తనకు మాలిన ధర్మమగును. ఇదెక్కడైనా ఉండునా? ఓవనమాలీ! ఇంకాదయరాదా! నన్ను రక్షించుటలో మందకొడితన మికనైనా పోదా! నీకు సిరి కలిగియున్న మదమున్నట్లయితే ఎవరికైనా పెట్టు. అంతే నన్నుపేక్ష చేస్తే ఏమి తీరుతుంది. నాకలవరింతలు విని రావయ్యా! నీపోకడలు నే నెరుగను. నీవే రాజవని (రక్షకుడని) నమ్మి ఉన్నాను. నీవు గజరాజును రక్షించినది విన్నాను. నీవు రాముడవు. నేను నీ దాసుడను (రామదాసుడను) కనుక కామదాసులను వేడుకొనలేను. నీ దాసుడనని పేరుపొంది ఉన్నాను. అని భావము. ఇందొక ఎత్తిపొడుపుతో కూడిన వ్యాజనింద కలదు.

22. అరాణ = ఆది

ప॥ అమ్మ ధర్మ సంవర్ధని – ఆదుకోవమ్మా! మా॥ అమ్మ॥

అ॥ ఇమ్మహినీసరి ఎవరమ్మా – శివుని కొమ్మ మా॥ అమ్మ॥

చ॥ ధాత్రీధరనాయక ప్రియపుత్రీ – మదన కోటిమంజుల గాత్రి।
అరుణ నీరజదళనేత్రి – నిరుపమశుభగాత్రి

పీఠనిలయేవర – హస్త ధృతవలయే – పరమపవిత్రి।
భక్త పాలన ధురంధరి – వీరశక్తినే నమ్మినా॥ నమ్మ॥

2 అంబ కంబుకంఠి చారు కదంబగహన సంచారిణీ॥
బింబాధరి తటిత్కోటి విభాధరి – దయావారినిధీ।
శంబరారివైరి హృచ్ఛంకరి కౌమారి స్వరజిత
తుంబురునారద సంగీత మాధుర్యే! దురితహారిణి మా॥ అమ్మ॥

3 ధన్యేత్ర్యంబకే మూర్ధన్యే – పరమయోగి హృదయమాన్యే
త్యాగరాజ కులశరణ్యే – పతితపావని – కారుణ్యసాగరి
సదా అపరోక్షము గారాదా – సహ్యకన్యాతీర వాసిని
పరాత్పరి కాత్యాయని – రామసోదరి మా॥ ఆమ్మ॥

తాత్పర్యము :

ఈ కృతిలో ఆదుకోవమ్మ! నీసరి ఎవరమ్మ అని రెండే వాక్యములున్నవి. తక్కిన వన్నియు కేవలం సంస్కృతసంబోధనములు. చరణమునుంచి అర్థములు మాత్రం వ్రాయుచున్నాను. కొండలరాజగు హిమవంతుని ప్రియపుత్రికా! కోటి మన్మధుల వంటి సుందరాకారముగల దానా! ఎఱ్ఱని పద్మముల వంటటి కనులుగల దానా! సాటిలేని శుభమగు దేహముగల దానా! పీఠమునందున్నదానా! చక్కని చేత కంకణము ధరించినదానా! పరమ పవిత్రురాలా! భక్తులను పాలించు బరువును మోయుదానా! వీరశక్తీ! అంబా! శంఖము వంటి కంఠముగల దానా! అందమగు కడిమివనమందు సంచరించుదానా! దొండపండువంటి పెదవిగల దానా! కోటిమెరపుల కాంతిగల దానా! దయాసముద్రురాలా! శివుని హృదయమునకు సౌఖ్యకరురాలా! కౌమారీ! తంబురునారదుల స్వరమాధుర్యమునుమించిన కంఠస్వరమాధుర్యముగల దానా! పాపములను బోగొట్టుదానా! ధన్యురాలా! మూడు కన్నులు గలదానా! శ్రేష్ఠురాలా! పరమ యోగుల హృదయములయందు పూజింపబడుదానా! త్యాగరాజ కులమునకు రక్షకురాలా! పతితపావని! కారుణ్యసాగరి! ఎప్పుడును సాక్షాత్కరింపరాదా! కావేరీతీరమున నివసించుదేవీ! పరాత్పరి! కాత్యాయని! నా ఇష్టదైవమగు శ్రీరామునకు చెల్లెలా.

నోట్ : ఈ కృతి యందు ఛందోలోపములు కొన్ని కనవచ్చుచున్నవి. పరిష్కారమునకు అందలేదు.

23. కల్యాణి = జంపె

ప॥ అమ్మ రావమ్మ తుల- సెమ్మ మముబాలింప
వమ్మ సతతము పదము- లేనమ్మినా నమ్మ॥ అమ్మ॥

అ॥ నెమ్మదిని నీ విహప- రమ్ము లొసగుదువనుచు।
కమ్మవిల్తుని తండ్రి - కలనైన బాయడట॥ అమ్మ॥

చ॥ నీ మృదు తనువునుగని - నీ పరిమళమును గని।
నీ మహత్వమును గని - నీరజాక్షి....
తామరసదళ నేత్రి - త్యాగరాజుని మిత్రి
ప్రేమతో శిరమునను - బెట్టుకొన్నాడట॥ అమ్మ॥

తాత్పర్యము :

అమ్మా! తులసీ! ఎప్పుడూ నీ పదములే నమ్ముకొన్న మమ్ము పాలించుటకు రావమ్మా! శ్రీమహావిష్ణువు నీవు ఇహలోక పరలోకఫలములను నీభక్తుల కిచ్చెదవని నిన్ను కలలోనైనా ఎడబాయడమ్మా! నీ మెత్తని శరీరమును చూచి నీ చక్కని పరిమళమును జూచి నీ గొప్పదనమును జూచి నీ నాథుడు నిన్ను నెత్తిన ధరించెను గదమ్మా!

విశేషము = భగవత్పూజాపుష్పములలో తులసి చాల ముఖ్యమయినది. విష్ణుదేవునకు తులసి అత్యంత ప్రీతికరము. ఏదయినా దాని తరువాతనే. తులసి లక్ష్మీదేవి అంశమట. అందుచేతనే దాని కంత ప్రాధాన్యము. కృష్ణాష్టోత్తర శతనామావళిలో 'తులసీ దామ భూషితః' = తులసి దండలు ధరించువాడని. భక్తులు తులసి పూసల మాలలను కంఠమున ధరింతురు. అట్టి భక్తులు లోకమును పవిత్రమొనర్తురని 'యేకంఠలగ్నతులసీ నలినాక్షమాలాః। తే.... భువన మాశు పవిత్రయంతి' = విష్ణువు పురాణమున చెప్పబడినది. తులసితో విష్ణుదేవుని తప్ప ఇతరులను పూజింపకూడదన్నట్లు శాస్త్రము కూడ నున్నది. సత్యభామ ధన కనక వస్తువాహనములు పెట్టినా తులదూగని కృష్ణుడు రుక్మిణి వేసిన ఒక తులసీ దళమునకు తులదూగినట్లు భాగవతగాథ. త్యాగయ్యగా రీవిషయములను హృదయమందుంచుకొనే 'నీ మహత్వముగని' అన్నారు. 'లక్ష్మీదేవి, విష్ణువే అవతారమెత్తినా దానికి తగిన అవతారము తానును ఎత్తి ఆయన నెడబాయదు? అని విష్ణుపురాణ వాక్యము. ఆ విధంగా విష్ణువు సాలగ్రామశిలావతారమైతే లక్ష్మీదేవి తులసి అవతారమై ఆయనకు పూజాద్రవ్యమైనది. ఇంతకథ ఉన్నది.

గమనింపవలసినది చరణములో 'తామరసదళనేత్రి' 'త్యాగరాజుని మిత్రి' అని ఉన్నది. ఇవి తులసీ సంబోధనములు. వీరభద్రశాస్త్రిగారు నేత్రి మిత్రి అనుట తప్పు నేత్ర మిత్ర అనవలసియుండును. కనుక అట్లుగాక నేత్రుడు మిత్రుడు అని విష్ణుపరముగా నుండుట ఒప్పు అన్నారు. నిజమే సాధారణుగా స్త్రీప్రత్యయము ఒకచోట ఙీప్‌వచ్చి 'బింబోష్ఠి' అని ఒకచోట టాప్ వచ్చి 'నేత్ర' అని ఉంటుంది. సాధారణంగా ఙీప్ ప్రత్యయము స్త్రీపరముగా చెవికి సరిపడి ఉంటుంది. ఆ విధంగా త్యాగయ్యగారు 'తామరస దళనేత్రి'ని సరిపుచ్చుకొన్నారు. ఈ సంపుటములోనే 2వ కృతిలో 'అంబనిను' అనుదానిలో 'అఖండాకారి' 'త్యాగరాజ హృచ్చారి' అనేవి పురుష సంబోధనములుగాని స్త్రీ సంబోధనములు కావు. ఇకారాంతములుగా ఆ రెండు ఉండటముచేత వ్యాకరణ మొప్పకపోయినా త్యాగయ్యగారు అనుమతించు కొన్నారు. ఇందులో 'తామరసదళనేత్రి' 'మిత్రి' త్యాగయ్యగారు సరిపుచ్చుకున్నారు. అదికాక నేత్రుడు మిత్రుడు అని పాడితే సంగీత సౌలభ్యంపోతుంది. పాటించవలసినది సంగీతమే. త్యాగరాజు కొన్నిచోట్ల ఆయన స్వాతంత్ర్యం వహిస్తాడు. దానిని మనం అంగీకరించాలి. గాయకుల నోటబడి మారిన శబ్దాలను గూర్చే ఆలోచించి పరిష్కరింపవలసి ఉంటే పరిష్కరించాలి. మరినేత్రుడు మిత్రుడు అనిలేకపోతే ఆ వాక్యములో కర్తృపదము లోపించునుకదా అని సందేహము రావచ్చును. కాని అనుపల్లవిలోని 'కమ్మవిల్తుని తండ్రి' అనేదే చరణములోనికి కర్తృపదముగా ఆక్షిప్తమగును. ఇది శాస్త్రమర్యాద.

24. మధ్యమావతి = రూపకము

ప॥ అలక లల్లలాడగ గని – ఆరాణ్ముని ఎటుపొంగెనో ॥అలక॥

అ॥ చెలువు మీర గనుమారీ – చుని మదమణచే వేళ॥ అలక॥

చ॥ ముని కనుసైగ దెలిసి శివ–ధనువును విరచే సమయ
మున త్యాగరాజ విను–తుని మోమున రంజిల్లు॥.... అలక॥

తాత్పర్యము :

ఇది మారీచుని కొట్టే సమయములో శివధనుర్భంగం చేసే వేళలో రాముని ముంగురు లల్లలాడినవి. ఆ సమయమున విశ్వామిత్రుడు ఆ దృశ్యమును చూచి ఆనందముతో పొంగెనట.

25. సౌరాష్ట్రము = ఆది (నౌకాచరితము)

ప॥ అల్లకల్లోల మాయె-నమ్మ యమునా దేవి మా
ఆర్తులెల్ల దీర్పుమా - అమ్మ..... అల్ల।

అ॥ మొల్లలచే బూజించి - మ్రొక్కెదము బ్రోవుమమ్మ॥ అల్ల॥

చ॥ మారు బారికి దాళ-లేక, ఈ రాజుకు
మారుని దెచ్చితి మిం-దాక,
తారుమారాయె బ్రతుకు-తత్తళించున దెందాక॥ అల్ల॥

2 గాలివానలు నిండాయె. మాపనులెల్ల-గేలిసేయుట కెడమాయె॥
మాలిమితో గని మ-మ్మేలుచు నెడబాయనాయె॥ అల్ల॥

3 సొమ్ములెల్ల నీ కొసగెద - మమ్మా, యమునాదేవి యీ
సుముఖుని గట్టుజేర్పవమ్మ ....
ఎమ్మెకాని బలిమిని - ఏలదెచ్చితిమమ్మ॥ అల్ల॥

4 నలినభవుడు వ్రాసిన-వ్రాలు, ఎటులైనగాని
నాథుడు బ్రతికి యుండిన-చాలు ....
ప్రళయము లయ్యేనే-పని జేసిన భామలు॥ అల్ల॥

5 దేహముల నొసగెద-మమ్మ, ఓదేవీ కృష్ణ
దేవుని గట్టు జేర్పు - మమ్మ ....
మోహనాంగుని మేము-మోసపుచ్చితి మమ్మ॥ అల్ల॥

6 మేమొక్క టెంచబోతి-మమ్మా మాపాలిదేవు
డేమేమో ఎంచుకొన్నా-డమ్మా
రామరో! శ్రీత్యాగ-రాజాప్తుని బాయమమ్మా॥ అల్ల॥

తాత్పర్యము :

ఈ కృతి త్యాగరాజ నౌకాచరితములోనిది. గోపికలు కృష్ణుని యందు పరమప్రేమ కలిగియున్నారు. సౌందర్యగర్వం కలిగియున్నారు. కృష్ణుడు దీనిని బోగొట్టదలచినాడు. ఒకరోజున గోపికలు కృష్ణునితో కలిసి యమున ఒడ్డున ఉండగా యమునలో ఒక వెండినౌక కనిపిస్తుంది. గోపికలకు దానియందు విహరించే కోరిక కలుగుతుంది.

ఎట్టకేలకు కృష్ణునితో కూడి నౌకను నడపటం ప్రారంభిస్తారు. కృష్ణుడు తమ సౌందర్యానికి బందీ అయినాడని గర్వపడతారు. అష్టమదములలో ఇది రూపమదము. నౌక నడుస్తోంది. అంతలో గాలి వడగండ్లవాన ప్రారంభమై నౌక అల్లకల్లోలం అవుతుంది. మునిగిపోబోతుంది. అప్పుడు గోపికలు ఆర్తితో యమునానది నీ విధంగా ప్రార్థిస్తారు. అమ్మా! యమునాదేవీ! నౌక అల్లకల్లోలం అవుతోంది. మా ఆర్తులు దీర్చవమ్మా! మల్లెపువ్వుల నిన్ను పూజిస్తాము. మ్రొక్కుతాము. రక్షించు. మన్మథబాధకు తాళలేక మానందరాజు కుమారుడైన ఈ కృష్ణుని తీసుకొని వచ్చాము. ఇప్పుడు మాబ్రతుకులు తారుమా రగుచున్నవి. మా బ్రతుకులు నీటిపాలు, నవ్వులపాలు అవుతున్నాయి. ప్రేమతో మమ్ము ఏలుతూనే కృష్ణుడు మమ్ము ఎడబాసి పోతున్నాడు. మా నగలన్నీ నీ కర్పిస్తాము. మా కృష్ణుని గట్టుజేర్చు. అయ్యో తల్లీ! ఈ మోహనాంగుని మాతో ఏల తెచ్చితిమమ్మా! తానొకటి తలచితే దైవ మింకొకటి తలచుచున్నాడే? ఏది ఏమయినా కానీ! వీడు బ్రతికి బయటపడితే చాలు. మాపని ప్రళయం సృష్టించింది. మా శరీరములు నీ కర్పిస్తాము. కృష్ణుని ఒడ్డెక్కించు. అయ్యో! మేము వీనిని మోసపుచ్చాము. ఓనదీమతల్లీ! మేము వీని నెడబాసి బ్రతుకలేము. అని గోపికలు యమునను ప్రార్థించారు.

విశేషము = దీని అంతరార్థము. నది సంసారము. దీనిని దాటించు నౌక భక్తి. గోపికలు జీవులు. కృష్ణుడు భగవానుడు. భక్తికి విచ్ఛేదము కలిగించు కామక్రోధాదులే గాలి, వాన, దేహాత్మాభిమాన భ్రాంతి వదలి శరణాగతి చేయుటచే నౌక ఒడ్డుచేరుతుంది. ఇది నౌకాచరితము యొక్క స్వాపదేశార్థము.

26. చారుకేశి = ఆది

ప॥ ఆడమోడిగలదే – రామయ్య మాట॥ లాడ॥

అ॥ తోడు నీడనీవే–యనుచు సద్భక్తి
తో గూడి పదములు – బట్టిన మాట॥ లాడ॥

చ॥ చదువులన్ని దెలి–సి శంకరాంశుడై
సదయు డాశుగ – సంభవుడు మ్రొక్క
కదలు తమ్ముని బల్క–గా జేసితివి
గాకను త్యాగరాజే–పాటి మాట॥ లాడ॥

తాత్పర్యము :

ఓ రామయ్యా! నీకు మాటలాడమోడి కలదే? నీకు ఒకరితో మాట్లాడుటకు మోడి బింకము (నేను ప్రభువును తక్కువ వారితో మాట్లాడను అనెడి రాజస స్వభావము) కలదే? అని ఆశ్చర్యము. నేను నీవు నా తోడునీడ అని నమ్మి భక్తితో నీ పాదములు పట్టుకొన్నాను. అయినా నాతో నీవు ఆడమోడి చేయుచున్నావు. ఔనులే. చదువులన్నీ తెలిసినవాడు, శంకరుని అంశముతో జన్మించిన ఆశుగ సంభవుడు (వాయు పుత్రుడు = హనుమంతుడు) సుగ్రీవుడు పంపగా వచ్చి మ్రొక్కి నిలువబడగా నీవు మాటలాడక నీతమ్ముడైన లక్ష్మణునితో మాట్లాడించినావు. అంతటి హనుమంతునితోనే మాటలాడుటకు మోడి చేసినావు. ఈ త్యాగరాజు ఏ పాటిలే! అని భావము. ఇది ఒక ఎత్తిపొడుపు.

27. ఆహిరి = ఆది

ప॥ *ఆదయ శ్రీరఘువరనేడేల- రాదయా ఓ దయాంబుధీ॥* *ఆదయ॥*

అ॥ *మోదముతో సద్భక్తి మర్మమును- బోధనజేసి సదా బ్రోచిననీ॥* *కాదయ॥*

చ॥ *నిన్ను తిట్టికొట్టి హింసబెట్టిన- దన్నియు నన్ననలేదా!*
ఎన్నరాని నిందల తాళమని- మన్నించగలేదా।
అన్నము తాంబూలమొసగి దేహము- మిన్నసేయలేదా।
కన్నతల్లి దండ్రిమేమనుచుత్యా- గరాజునికి బరవస మీలేదా॥ *ఆదయ॥*

తాత్పర్యము :

ఓ రామా! నీవు పూర్వము చూపిన ఆదయనేడు రాదేమయ్యా! అలనాడు కృష్ణావతారమున భక్తి యోగమును బోధించి రక్షించితివి. భక్తునకు నాకును బేధములేదన్నావు. భక్తుని ఎవరైనా తిట్టినా కొట్టినా నాకే తగులును అంటివి. (తిరుప్పాణి అనే హరిజన భక్తుని ఒక అర్చకుడు కొట్టితే ఆ దొబ్బలు రంగనాథుని వీపుపై కనపడినవి. ఇది ప్రసిద్ధమైన కథ. అనగా భక్తులను కొట్టినా తిట్టినా అవి తనకు తగులుతాయని చెప్పినట్లయినదికదా) భగవద్గీతలో నిందను స్తుతిని సమానముగా భావింపమని చెప్పినావు గదా! (ఇదే మన్నించుట) అన్నము తాంబూలమిచ్చి దేహమును మిన్న సేయలేదా (అంటే

భక్తునకు అన్నము తాంబూలమును భగవంతుని గుణములే అని రహస్యము. సామవేదంలో అహమన్నం అహమన్నాదో అని ఉన్నది. అనగా భగవంతునకు భక్తుడన్నమని భక్తునకు భగవంతుడన్నమని. అనగా అనుభవించు పదార్థమని. అరవ ప్రబంధమందు 'వెణ్ణంశోరుమ్ వైత్తలై' మంచి అన్నము తమలపాకు నీవే అని భక్తుల వాక్యమున్నది). నీ గుణములను నాకు అన్నముగా తాంబూలముగా ఇచ్చి ఈ దేహమును పెంచితివి కదా! తల్లిని దండ్రిని నేనే అని బరవస మిచ్చావు గదా! (భరోసా ఇచ్చుట అనే మాట ఇప్పుడు కూడా వాడుకలో వున్నది. అనగా అభయమన్నమాట. ఇన్ని గతకాలములో చేసితివి రామా! ఆదయ ఇప్పుడేమయినది? అని అయ్యగారు రాముని ఈ కృతియందు అడుగుచున్నారు.

28. భైరవి = ఆది (దివ్యనామము)

ప॥ ఆనంద మానంద మాయెనే – బ్ర
హ్మానంద మానంద మాయెనే – బ్ర॥ హ్మానంద॥

చ॥ శ్రీరామ నేధన్యుడ నైతి–నానంద
నీ రధిలో నీద నైతిని॥ ఆనంద॥

2 ఆనాటి మొదలు నిన్నే–వేడితి – దుష్ట
మానవుల చెలిమి – వీడితి నా
మానము నీదుభార–మనుచునే దెలిసితి॥ ఆనంద॥

3 పాపములకు భయ–మందితి – హృ
త్తాపములెల్ల చల్ల– జేసితి రామ
నీపాదము లురమున–నుంచి పూజించనైతి॥ ఆనంద॥

4 కలికి ఆసల రోసి నారము – ఈ
కలికి బ్రతుకు నామసారము – ఇట్లు
పలికి పలికి తొలగి – బాయ విచారము॥ ఆనంద॥

5 ఇలలో సుఖము లేమాయెను – అంటే
కలగన్న భాగ్యము రీ–తాయెను–నిన్ను
కొలిచి ధ్యానించి తెలుసు–కొంటి నీ మాయను॥ ఆనంద॥

6 నీ యందమును గని-సొక్కితి - యెడ
బాయని ప్రేమచేత - జిక్కితి - నా
ప్రాయము లెల్లనీ - పాలుజేసి మ్రొక్కితి॥ ఆనంద॥

7 నలువకైనను హరి-కైనను - చంద్ర
కలను ధరించువాని - కైనను రామ
తలచిన దెల్ల జెప్ప-తరమా నోటికి రా॥ దానంద॥

8 రాజసగుణమును - మానితి రామ
నీజపమును మది-బూనితి - త్యాగ
రాజు చేసిన పుణ్య-రాశియని యెంచితి॥ నానంద॥

తాత్పర్యము :

రామభక్తి మోక్షకారణమైన ఒక గుణము. దీనికి సహాయముగా కొన్ని గుణములు భావములు కర్మములు నుండవలెను. వీటికి వ్యతిరేకమైన గుణభావ కర్మములను మానవుడు విడువ వలెను. త్యాగయ్యగారి కిదే జరిగినది. మోక్షకారణములైన దైవగుణము లబ్బినవి. వ్యతిరేకములైన ఆసుర గుణములు పోయినవి. ఇందువలన ఆయన కానందమయినది. ఆ ఆనందమును రామసన్నిధిలో అయ్యగారు తెలుపుకుంటున్నారు. ఓ రామా! ఆనందము బ్రహ్మానందము. నీ సాక్షాత్కారానందములో ఈదినాను. నీవాడననే పేరు కల్గినది. ఏనాడు నీ భక్తి కలిగినదో ఆనాడు మొదలు నిన్ను స్మరిస్తూనే ఉన్నాను. (భక్తి రెండు విధములు. వర్ధమాన అని పరిసమాప్య అని. అర్ధార్థులు తమ అర్థమునకు భగవద్భక్తినవలంబించి అర్థ సిద్ధి కాగానే భక్తిని వీడుతారు. అది పరి సమాప్య. హృదయమందు నిష్కామభక్తి పుట్టి అది పెరుగుతూ ఉంటే అది వర్ధమాన భక్తి. త్యాగయ్యగారి దీభక్తి. మరియు 'భక్తి పుట్టనినాడు నేను పుట్టలేదు. పుట్టిన తరువాత దానిని మరువలేదు' అని భక్తుల భావము. ఇది ఈ భావము) ఓ రామా! దుర్జనుల స్నేహము వీడినాను. నా మానము (గౌరవము) నీ అధీన మని నమ్మినాను. (దీనినే ప్రపత్తి అందురు) ఇంతకుముందు సంచితములయిన పాపములను గూర్చి భయపడ్డాను. ఇప్పుడు ఆ భయమును వీడి మనసు చల్లపరుచుకొన్నాను ('శరణాగతి చేసినచో వాని సర్వపాపములను తొలగించెదను. శోకింపవద్దు'. అని గీతా వాక్యమున్నది. ఇది గుర్తు ఉంటే భక్తుడు పాపములకు భయపడడు. శరణాగతిని చేసిన వానిని రాబోవుపాపము లంటవు అని శాస్త్రము. ఇప్పుడు త్యాగయ్యగారి దీ నిర్భయస్థితి) రామా! నీ పాదములు వక్ష స్థలమున నుంచుకొన్నాను. పూజించుకొన్నాను. స్త్రీల వాంఛను వదలుకొన్నాను.

కలియుగంలో నీ నామస్మరణమే సారమని తెలుసుకొని నామమును పలికి పలికి విచారమును తొలగించు కొన్నాను. ఐహిక భోగములు కలలోని అనుభవములనే ఈ మాయను తెలుసుకొన్నాను. నీ అందం చూచి పరవశించాను. నీ భక్తి వశమై యున్నాను. బాల్య యౌవన వార్ధకములు నీవశం చేసినాను. ఆనందమైనది. ఈనా ఆనందాన్ని హరి హర బ్రహ్మాదులైనను వర్ణించలేరు. రాజసగుణము వదలి నీ జపము గ్రహించి ఇదంతా నా పుణ్యరాశి అని భావించినాను. అని ఆనందము.

29. గరుడ ధ్వని = దేశాది తాళము

ప॥ ఆనందసా–గర మీదని దే–హము భూబారమే – రామ॥ ఆనంద॥

అ॥ శ్రీనాయకా! అఖిలనైగ మా–శ్రిత సంగీతజ్ఞానమను బ్ర॥ హ్మానంద॥

చ॥ శ్రీ విశ్వనాథ–శ్రీకాంత విధులు–పావన మూర్తులు పాసించలేదా॥
భావించి రాగలయాదుల–భజియించే శ్రీ–త్యాగరాజనుత॥ ఆనంద॥

తాత్పర్యము :

సాధారణంగా లోకంలో 'సంగీత సాహిత్య రసము లెరుగని వాడు తోక కొమ్ములు లేని పశువు' అని ఒక వాడుక ఉన్నది. దీనినే త్యాగయ్యగారు భంగ్యంతరంగా 'ఓ రామా! అన్ని వేదములును ఆశ్రయించిన సంగీత జ్ఞానమనే బ్రహ్మానంద మనుభవించనివాడు భూభారము. (వేదములకు ఉదాత్త అనుదాత్త స్వరములు కలవు. సామవేదము సంగీతమునకు మూలమే. అట్టి సంగీత–ఆనందమందు ఈదని వాడు భూమికి బరువే). పావన మూర్తులయిన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సంగీతోపాసన చేసిరని భావించి నేను దానిని భజించుచున్నాను). అని ('నాదోపాసనయా దేవా బ్రహ్మ విష్ణు మహేశ్వరాః!' = నాదోపాసనచే బ్రహ్మ విష్ణుమహేశ్వరులు ఉపాసింపబడుచున్నారు' అనే సంగీతరత్నాకర శ్లోకము పై విషయమున త్యాగయ్య గారికి ప్రమాణము).

30. తోడి = రూపకము

ప॥ ఆరగింప–వే –పా–లారగింపవే పా॥ లార॥

అ॥ రఘు॥ వీరజనకజాకరప – విత్రితమౌ వెన్నపా॥ లార॥

చ॥ సారమైన దివ్యాన్నము- షడ్రసయుత- భక్షణములు
దారసోద రాదులతో- త్యాగరాజనుత పా॥ లార॥

తాత్పర్యము :

నిత్య పూజావిధులలో నివేదన మున్నది. ఇది చాలా ప్రధానమైనది. ఆ స్థానములో అయ్యగారు రామయ్యకు పాలు నివేదనము చేస్తున్నారు. ఈ పాలు సీత చేతితో పవిత్రము చేయబడినట్లు ఒక విశేషణము చేయబడినది. అది రాముని ముఖోల్లాసము కొరకని భావింపవలెను. పాలేకాక సారమైన దివ్యాన్నములు షడ్రసయుత భక్షణములు కూడ నివేదింపబడినవి. ఈ నివేదనములో త్యాగయ్యగారు రామున కొక ధర్మసూచన చేసినారు. 'ఏకః స్వాదున భుంజీత' = మధుర పదార్థమును తానొక్కడే భుజింపకూడదు' అని ధర్మశాస్త్రము. దీని ననుసరించి దార సోదరాదులతో ఆరగించుమని త్యాగయ్యగారు నివేదించినారు.

విశేషము = పాలు అని మొదట ఉన్నదానికి క్షీరము అర్థము. 'దారసోదరాదులతో' అని కలిపినప్పుడు పాలు అంటే ఒక భాగము అని అర్థము చెప్పవచ్చును.

31. యదుకుల కాంభోజి = చాపు (నౌకాచరితములోనిది)

ప॥ ఆడువార మెల్ల గూడి మన- మాడుదాము హరిని వేడి॥ ఆడు॥

చ॥ కృష్ణుడు నూడగ జల- క్రీడసల్ప మంచిదిన॥ ఆడు॥

2 కమలనేత్రుని బాసి సుఖమారిఓడ- గట్టుజేర్పమన తరమా॥ ఆడు॥

3 రాజకుమారుడు వీడు, నవ- రత్నసొమ్ములు బెట్టినాడు॥ ఆడు॥

4 పసిబిడ్డ గాదటమ్మా వీడు, భయపడునో తెలియదమ్మా॥ ఆడు॥

5 తల్లితో చాడి బల్కుదురే, మన- తలలు వంచ దూరుదురే॥ ఆడు॥

6 మాటకు జోటౌనుగాని, ఆటలు తెలియకపోని॥ ఆడు॥

7 యువతులారా! మీలోనే మీరు- యోచింపప్రొద్దుపాయ్యేనే॥ ఆడు॥

8 చాలు చాలిటు రారమ్మా ఓడ- సలిల మందు ద్రోయరమ్మా॥ ఆడు॥

9 త్యాగరాజాప్తుడు వీడు, వని- తల మాటలు వినలేడు॥ ఆడు॥

తాత్పర్యము :

యమునలో కనపడిన నౌకలో కృష్ణునితోకూడి విహరిద్దామా? కృష్ణుని ఒడ్డున వదలి తామే విహరిద్దామా! అనే ఆలోచనలో అనేక విధములుగా గోపికలు భావించిన భావనలివి. కృష్ణుని వేడుకొని ఒడ్డున నుంచి ఆడువారం మాత్రమే కృష్ణుడు చూస్తూ ఉండగా నౌకా విహారం చేద్దామా? అతనిని వదలి ఏమి సుఖము? ఓడను గట్టును మనము చేర్పగలమా? అదీకాక రాజకుమారుడైన కృష్ణుడు రత్నపు సామ్ములతో ఉన్నాడు. ఒంటరిగా ఒడ్డున వదిలితే ఏమి అపాయమో? చిన్నపిల్లవాడు భయపడతాడేమో? వీడిని ఒంటరిగా వదలితే ఎవరయినా యశోదమ్మతో చెప్పెదరేమో? మనం తలలు వంచుకోవలసి వస్తుంది. మనకు మాటవస్తుంది. సరేలెండు. ఆలోచనలతోనే ప్రొద్దు పోతోంది. వడవను నీటిలోకి వదలుదాం. ఈ కృష్ణుడు మన మాట వినేవాడు కాడు. వీనితో ఎటైనా కష్టమే. అని గోపికలు పలు ఆలోచనలు చేశారు.

32. నారాయణ గౌళ = ఆది

ప॥ ఇంకా దయరాకుంటే – ఎంతని సైరింతురా॥ ఇంకా॥

చ॥ ఆసించిన నన్నేల – అడుగడుగుకు రావేల॥
వాసిగ సీతాలోల – వరదేశిక పరిపాల॥ ఇంకా॥

2 ఎంతని తాళుకుందురా – ఇకనైన రాకుందురా।
ఇంతటికిని బాగందురా. ఎవరిని వేడుకొందురా॥ ఇంకా॥

3 నిర్జరవరులిక లేరా – నీసరి తనకయ్యేరా॥
దుర్జన జలదసమీరా – దొర నీవని యున్నారా॥ ఇంకా॥

4 నయననిందిత సరోజ – నగధర! శ్రీ రఘురాజ।
భయహరా! భక్తసమాజ – పాలిత త్యాగరాజ॥ ఇంకా॥

తాత్పర్యము :

ఓ రామా! ఇప్పటికీ నీదయ రాకున్నది. నేనిక తాళలేనయ్యా. నీరాకకై ఆశించి ఉన్నాను. అడుగడుగుకు నీవు వచ్చి నీకు నాకు వాసిగా (ఖ్యాతిగా) వచ్చి నన్ను రక్షింపవలసియుండగా రావేల! ఓ సీతాలోలా = (ఓ సీతయందాసక్తిగలవాడా) ఓ వరదేశిక పరిపాల! = ఓ శ్రేష్ఠమయిన గురువును పరిపాలించిన వాడా! ఇది విశ్వామిత్రుని

యాగసంరక్షణమని భావింపవచ్చును. విశ్వామిత్రుడు రామునకు బలాతిబలవిద్యలను జృంభకాద్యస్త్రములను ఉపదేశించినాడు కనుక దేశికుడు (గురువు) అయినాడు. ఆయన యజ్ఞమును పరిపాలించుటే ఆయనను పరిపాలించుట. ఇకనేను తాళలేను. నీవు నాయెడ చూపుచున్న స్థితిని ఎవరయినా బాగు అందురా? (అనరు). దేవతలు చాలామంది ఉన్నారు. కాని వారు నాకు నీసాటి అగుదురా? (కారు). దుర్జనులను మేఘములకు వాయువువు. కొండనెత్తిన వాడవు. పద్మములవంటి కనులుగలవాడవు. భయము పోగొట్టువాడవు. రఘువంశమున బుట్టిన ప్రభువువు. భక్త సమాజము గలవాడవు.

విశేషము = భగవంతుడు తన ఇష్టంవచ్చినప్పుడు వచ్చి రక్షిస్తాడులే అని నిశ్చింతగా ఉండుటను దృప్తప్రపత్తి అందురు. భగవంతుడు వచ్చి సంసార విచ్ఛేదము చేయుట జాగయితే, కట్టెపుల్లకు రెండువైపులా అగ్నిజ్వాల ఉండి ఆ మధ్యలో చిక్కుకున్న చీమ వలె తహతహలాడుట ఆర్తప్రపత్తి అందురు. ఈ కృతియందు త్యాగయ్యగారి దీస్థితి.

33. బలహంస = ఆది

ప॥ ఇక కావలసినదేమి మనసా – సుకమున నుండవదేమి॥ ఇక॥

అ॥ అఖిలాండకోటి బ్రహ్మాండనాథు–డంతరంగమున నెలకొనియుండగ॥ నిక॥

చ॥ ముందటి జన్మ–ములను జేసిన అఘ–బృంద విపినముల కా
నందకందుడై–న సీతావతి – నందకాయుధుడై యుండగ॥ నిక॥

2 కామాది లోభమోహ–స్తోమతమమ్ములకును
సోమసూర్యనేత్రుడైన శ్రీ–రామచంద్రుడే నీయందుండగ॥ నిక॥

3 క్షేమాది శుభములను త్యాగరాజ–కామితార్థములను
నేమముతో నిచ్చే దయానిధి – రామభద్రుడె నీయందుండగ॥ నిక॥

తాత్పర్యము :

ఓ మనసా! అఖిలాండకోటి బ్రహ్మాండనాథుడు నీలోనే యున్నాడు. ఇక కావలసిన దేమి? సుఖంగా ఉండు. తొలి పాపములనెడి అడవులు చూచి భయపడుచున్నావా! ఆనందకందుడు (ఆనందమునకు తావు) అయిన రాముడు ఆ అడవులను ఛేదించుటకు నందకమును (విష్ణుదేవుని ఖడ్గము) ధరించి ఉన్నాడు. కామక్రోధాదులు అనెడి చీకట్లకు

భయపడుచున్నావా? చంద్ర సూర్యులను కనులుగా ధరించిన శ్రీరాముడే నీయందున్నాడు. ఇక భయమేమి? క్షేమములను ఇష్టకామములను తప్పక ఇచ్చే రాముడు నీయందున్నాడు. ఇక కావలసినదేమి?

విశేషము = 'యమోవైవస్వతో రాజా హృదయస్థో జనార్దనః। తేనచే దవివాదశ్చే న్మాగంగాం మా కురూ గమః' = ఓరీ నరుడా! అన్నిటినీ నియమిస్తూ సూర్యమండల మందుండి అందరికిని ఆనందకరుడైన విష్ణువు నీయందున్నాడు. ఆయనతో రాజీపడు. (ఆయన ఆజ్ఞను పాటించు) గంగకూ వెళ్ళకు, కురుక్షేత్రానికీ వెళ్ళకు'. అని శాస్త్రమున్నది. దీనిని తెలుసుకొని సుఖముగా నుండుటయే విధి. త్యాగయ్యగారీకృతిలో పై విషయమును సూచించినారు.

34. ఛాయాతరంగిణి - రూపకము

ప॥ ఇతరదైవ ములవలన – ఇలను సౌఖ్యమా రామ॥ ఇతర॥

అ॥ మతభేదము లేక సదా–మదిని మరులు కొన్న తన॥ ఇతర॥

చ॥ మనసు దెలిసి ప్రోచినాను. మరచినాను నీవే
తనవాడన తరుణమిది. త్యాగరాజసన్నుత॥ ఇతర॥

తాత్పర్యము :

'నీవు దప్ప ఇతరదేవులవలన ఇలలో సౌఖ్యమా? (కాదు). కనుక ఇంకొక మతమునకు పోక నామనసులో నిన్నే మరులుకొని ఉన్నాను. కనుక నా కిరదేవతలతో పనిలేదు. రామా! నీవు నాకు చెప్పవలసినది ఒకటున్నది. త్యాగయ్యా! నీ మనసు తెలిసి నిన్ను రక్షించాను. నీవు నావాడవు. అని చెప్పవలసిన సమయమిది, రామా' అని త్యాగయ్యగారు తమ అనన్య భక్తిని చాటుకొన్నారు. ఇది చాల వివరింపవలసియున్నది.

విశేషము = ఇతర దైవములవలన సౌఖ్యమా? అని ప్రశ్న. సౌఖ్యము లేదని సమాధానరూపమగు ప్రశ్న. మరి ఈయన మతమేది? రామభక్తి మతము. అనేది నిర్వివాదము. అనుపల్లవిలోని 'మత భేదములేక' అనే మాట రామమతము కాక ఇంకొక మతము తనకు లేదను విషయము స్పష్టపరుస్తోంది. దేవతలు చాలామంది ఉన్నారు. ఆయా ఫలములను ఈయగలిగినవారై ఉన్నారు. ఆయా దేవతల మతములున్నవి. శంకరభగవత్పాదులు 'ఆరోగ్యం భాస్కరా దిచ్ఛేత్। శ్రియ మిచ్ఛేద్ధుతాశనాత్। ఈశ్వరాద్

జ్ఞాన మన్విచ్ఛేత్, మోక్షమిచ్ఛేత్ జనార్దనాత్' = ఆరోగ్యమును సూర్యునివలన, సంపదను అగ్నిదేవుని వలన, జ్ఞానమును ఈశ్వరుని వలన, మోక్షమును విష్ణువువలన కోరవలెను' అని చెప్పిరి. ఇంకా శంకరులు గీతా వ్యాఖ్యానాదులలో పై వాక్యములను బలపరచునవే ఎన్నో చెప్పిరి. 'మామేవయే ప్రపద్యంతే' వంటి గీతా వ్యాఖ్యానములలో ఇతర దేవతలను ఉపాసించువారు ఆ దేవతలను మాత్రమే చేరుదురు. 'ముముక్షువులయిన వైష్ణవులు కృష్ణునే ఆశ్రయించి కృష్ణుని చేరుదురు' అని శంకరాచార్యులు చెప్పిరి. త్యాగయ్యగారిది తెలియుటచేతను ముముక్షువగుటచేతను మోక్షమే సౌఖ్యమని తెలియుటచేతను నిష్కాముడగుటచేతను మతభేదము లేక రామునే నమ్మియున్నట్లు తెలియవలెను. ఇది ఈకృతికి సరి అయిన తాత్పర్యము.

35. పున్నాగవరాళి = ఆది

ప॥ ఇది నీకు మేరగాదురా శ్రీరామ నా-మది తల్లడిల్లెరా॥ ఇది॥

అ॥ పదిలముగా గొలిచితే - భావము వేరే యుండేది॥ ఇది॥

చ॥ గతిలేనివారి కడ-తేరిచే దైవమని
పతిత పావన న-మ్మితి శ్రీరామ! ని
న్నతి వేగమున వే-డితి సంతతము స
మ్మతి నిన్నేకో-రితి సీతారామ॥ ఇది॥

2 పరమదయాళువని - పాలన సేతువని
సరగున దేవరాయ - కొలిచిన నాపై
కరుణలేదని కన్నీ-రాయె చూచి నీ మనసు
కరుగ దెందుకు రాయ - సీతారామ॥ ఇది॥

3 అన్నిట నిండిన - అద్భుతానందఘన
మన్నన సేయరాదా. శ్రీరామ నీ
కెన్నరాని పుణ్యమురాదా - శ్రీత్యాగరాజ
సన్నుత నీవాడను గాదా - సీతారామ॥ ఇది॥

తాత్పర్యము :

ఓ రామా! నను రక్షించకపోవుట నీకు న్యాయము కాదు. నామనసు తల్లడిల్లుచున్నదయా! నాసేవలో ఏదైన లోపమున్నదేమో! గతిలేని వారిని రక్షించే దైవము నీవని పతిత పావనుడవని తెలిసి జాగుచేయక క్షణము పోనీక నిన్ను కోరితినయ్యా! నా కన్నీరు చూచి అయినా నీ మనసు కరుగదేమయ్యా. నీ వెచటనో ఉంటే నామొర నీకు వినిపించ లేదనవచ్చును. అన్నిటనిండి యుండిన ఆనంద స్వరూపుడవు. బాబూబాబూ నన్ను రక్షించు. నీకెంతయినా పుణ్యముంటుంది. అని అయ్యగారి వేడికోలు.

36. ఛాయానాట = ఆది

ప॥ ఇది సమయమురా – ఇనకుల తిలక॥ ఇది॥

అ॥ విదళిత కలిదు – ర్మదగజ గమన!
మొదట బల్కినది – నిజముగ జేయ॥ ఇది॥

చ॥ కలిపురుషుడు నా–టకమును గట్ట
దలచినాడు శ్రీ–త్యాగరాజనుత
ఖలమతములనే – యాగములకుమే
కలుగనరుల జే–యును దయజూడ॥ నిది సమయము॥

తాత్పర్యము :

ఓ రామా! విదళిత కలి దుర్మద = కలియొక్క దుర్మదమునణచిన వాడా, గజగమన = ఏనుగు నడకవాడా, కలిపురుషుడు విజృంభించినాడు. నాటకము ప్రారంభించినాడు. అనేక దుర్మతములను సృష్టించినాడు. ఆ దుర్మతములనెడి యజ్ఞములకు నరులను మేకలుగా చేసి బలి ఇయ్యదలచినాడు. నరులను ఆదుకొనవలసిన సమయమిది. ఇదివరకు నీవు చెప్పిన మాట 'పవిత్రాణాయ సాధూనాం। వినాశాయచ దుష్కృతాం। ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే = 'సత్పురుషులను రక్షించుటకు, పాపులను సంహరించుటకు, ధర్మమును స్థాపించుటకు ప్రతి యుగమందును అవతరిస్తాను' అని. దానిని నిజముచేయి. అవతరించు. అని త్యాగయ్యగారు చేసిన శాసన మన వచ్చును.

37. కన్నడ - త్రిపుట

ప॥ ఇదే భాగ్యముగా – కేమి యున్నదిరా రామా॥ ఇదే॥

అ॥ సదా నీపద పంకజములను –సమ్మతముగ సేవించునా॥ కిదే॥

చ॥ సుందర దశరథ–నందన! హృదయార
విందమున నిన్నుంచి – తానే బ్రహ్మా
నందమనుభ–వించి అదియు గాక
ఇందుధరు మొద–లందరిని–సుర
బృంద భూసుర–బృందముల తా
నెందుకని యా–నందముగ నీ
యందు భావన. చెందుచుండు – నా॥ కిదే॥

2 ఆశ పాశము దెగ–గోసి యన్నియు మది
రోసి కర్మము బాసి – నిను గరుణా వా
రాశియని పూజ–చేసి దుస్సంగతి
జేసి మేను గాసి – జెందక
శ్రీశ దేవా. ధీశ! నినుకా
శేశనుతుడని – ఆశ నీయెడ
కేశభక్తియు – జేసిన నా॥ కిదే॥

3 భోగిశయన నీ–దేగతి యని బట్టి
రాగాదులతోడి–పూరిత భవ
సాగరమును దాటి–సంతతమును యాగపాల
జాగరూక స–దాగతిజహిత
యోగినుత వే–దాగమాదుల
వేగనుతినిడు భాగ–వత త్యాగరాజున కిదే॥

తాత్పర్యము :

ఎప్పుడు నీపాదములను సేవించుకుంటున్నాను. నాకిదే భాగ్యము. సుందరమైన దశరథనందనుడా! హృదయములో నిన్నుంచి బ్రహ్మానంద మనుభవిస్తూ, దేవతల నందరిని నీయందు భావన చేస్తూ చూచుకుంటున్నాను. ఆశాపాశాలను తెగ కోసినాను. నీవు తక్క ఇతరవిషయములను రోసినాను. కరుణా సముద్రుడవని నినుపూజచేసినాను.

దుర్జనుల మైత్రితో శరీరమును శ్రమపెట్టక ఓ శ్రీశా! కాశీ విశ్వేశ్వరుడు ఆశ వీడక నిన్ను నుతించును. అట్టి ఆశ నీయెడనుంచినోశ భక్తిని చేసినాను. ఇంతకన్న భాగ్యమేమున్నది. ఓ భోగిశయనా! = పాముపై నిదురించుదేవా! నీవేగతి అని పట్టినాను. రాగ ద్వేషాదులతో నిండిన సంసారసాగరమును దాటితిని. విశ్వామిత్రయాగ రక్షకా! హనుమంతునకు హితమైనవాడా! యోగులచే నుతింపబడినవాడా! వేదశాస్త్రములతో నిన్ను స్తోత్రము జేయు భాగవతుడనైన నాకు ఇదే భాగ్యము మరేమి' అని త్యాగయ్యగారు తమ ఆనందమును వ్యక్తపరచినారు.

38. నారాయణ గౌళ = చాపు

ప॥ ఇన్నాళ్లు దయరా-కున్న వైనమేమి?
ఇప్పుడైన దెల్ప-వయ్యా.... ఇన్నాళ్లు॥

అ॥ చిన్ననాటనుండి - నిన్నే గాని నే
నన్యుల నమ్మితి-నా ఓ రామ నీ కిన్నాళ్లు॥

చ॥ అలనాడు తరణి సు-తార్తిని దీర్పను
వెలసి నిల్వగలే-దా, అదియు గాక
బలము జూపలేదా, వాని నేర
ములను దాళుకొని-చెలిమి జేసి పద
ముల భక్తి నీయగ-లేదా నాయందు నీ॥ కిన్నాళ్లు॥

2 ధనగజాశ్వములు తనకు దయసేయు
మని నేనిన్నడిగి - నానా ఇంకనే
కనక మిమ్మని నా-నా, శ్రీరామ నా
మనసున నిను కుల-ధనముగ సంర
క్షణము జేసితిగాని - మరచినానా॥ ఇన్నాళ్లు॥

3 తల్లి దండ్రు లన్న-దమ్ములు నీవని
ఉల్లము రంజిల్ల - పెద్దల తోను
కల్లలాడక మెల్ల - సుమముల నీ
చల్లని పదముల - కొల్లలాడుచు వెద
జల్లితి గాని - త్యాగరాజునిపై నీ॥ కిన్నాళ్లు॥

తాత్పర్యము :

ఓ రామా! ఎంతకాలమునుంచియో నేను నిన్ను దప్ప అన్యులను నమ్మలేదు. ఇన్నాళ్లయినా నీ దయరాని కారణమేమి? ఆనాడు సుగ్రీవుని బాధ తీర్చెదనని ప్రతిజ్ఞచేసి, సప్తసాలములను ఛేదించి నీ బలమును తెలిపి, అతడు నీకు చేసిన వాగ్దానమును మరచి గుహలో నిద్రించి ఉంటే ఆ నేరాన్ని మన్నించి స్నేహమును పెంచి నీ పదభక్తి సుగ్రీవున కిచ్చితివి కదా! నాపై దయరాదేమి? (సుగ్రీవుడు రామకార్యమును మరచి గుహలో సుఖనిద్రపోవుచున్నాడు. అప్పుడు శ్రీరాముడు లక్ష్మణుని బంపి సుగ్రీవునకు కర్తవ్యమును గుర్తుచేసినాడు. అప్పుడు సుగ్రీవుడు సీతాన్వేషణ ప్రయత్నములోనికి దిగినాడు. ఇదే సుగ్రీవునకు తన పదభక్తి నిచ్చుట) ఓ రామా! నేను ధన కనకములను కోరలేదు. చతురంగబలమును కోరలేదు. నిన్నే కులధనముగ భావించి నిన్ను రక్షించుకొంటున్నాను. నిన్ను క్షణమైనా మరువలేదు. తల్లిదండ్రి, అన్నదమ్ములు అందరును నీవే అని తలచి మనసులో ఆనందపడుచున్నాను. పెద్దలవద్ద కల్లమాటలు చెప్పలేదు. మొల్లపూలతో నీ పాదములను పూజించుకొంటున్నాను. ఇంత విధితో ఉన్నా నీ దయరాని కారణమేమయ్యా' అని అయ్యగారు రాముని ప్రశ్నించినారు.

39. ఘంటారాగం = త్రిపుట

ప॥ ఇన్నాళ్లు నన్నేలి – ఎందుకీ గేలి।

అ॥ పన్నుగా నాపాలి–భాగ్యమా వనమాలి॥ ఇన్నాళ్లు॥

చ॥ బాలుడైన నా–పరితాపము జూచి।
తాళుతాళుమని – ధైర్యము బలికి
జాలిదీర వేడ్క – సలుపుచు మరినీ
కీలాగు బుద్ధి అని – క్రీ గంట జూచుచు॥ ఇన్నాళ్లు॥

2 ఎందుబోయిన వెంట–నేగి వత్తు ననుచు॥
ముందు బల్కిన నీ–వెందుబోయితివో
అందగాడ సత్య–సంధుడు నీవైతే
అందరిలో న–న్నాదరించు కొమ్ము॥ ఇన్నాళ్లు॥

3 జాడమాడగ నేను – జానకీ నాయక
వేడగ లేదు గా–వేమారులకు
ఈడు జోడులేని – తోడు నీవే గాని
ఆడితప్పలేని – ఆపద్బాంధవ నీ॥ కిన్నాళ్లు॥

4 ఒక రూపమున బ్రోచి – ఒక రూపమున ఏచి
ఒక రూపమున జూచు–చుంటివిగాని
సుఖదాయక! సత్త–సుంతైన లేదా
అకళంక! త్యాగరా–జార్చిత చరణా॥ ఇన్నాళ్లు॥

తాత్పర్యము :

ఓ వనమాలీ! ఇన్నాళ్లు నన్ను రక్షించావు. ఏలినావు. (మానవ జన్మనిచ్చి భగవద్దర్శనమును, అర్చనవందనములు చేసే ఇంద్రియములనిచ్చి భక్తిని ఇచ్చుటయే ఏలుట) ఇన్నాళ్లును ఏలి ఇప్పుడు గేలి చేయు చున్నావు. (ఈ సంసారములో నుంచుటయే గేలి చేయుట) నాపాలిటి భాగ్యమైన ఓ వనమాలీ! బాలుడనైన నా పరితాపము చూచి (బాలుడనగా గీతాది గ్రంధపఠనము లేని సమయము) తాళుకొమ్మని ధైర్యము బలికినావు. (వీతరాగభయ క్రోధః – దుఃఖేష్వను ద్విగ్నమనాః = భయమును క్రోధమును విడచి దుఃఖము కలిగినప్పుడు తట్టుకొనుము ఇత్యాది గీతా వాక్యములు బలికినావు) నీ కీలాగు బుద్ధి అంటే గీతాసారము తెలిసియుండుటయే అని పలికి ఇప్పుడు అరకంటితో చూచి గేలి చేస్తున్నావు. ఓరీ జీవుడా! నీ వెక్కడకు పోయినా నీ వెంట నేనుంటాను అని చెప్పిన నీవు ఇప్పుడెందు బోయితివి? ('అంతఃప్రవిశ్వ శాస్తాజనానాం' = పరమాత్ముడు లోపల ఉండి శాసించువాడు అని వేద వాక్యము. ఇదే వెంటనుండుట అని భావింపవచ్చును). ఓ అందగాడా! రామా! పై విధముగా ప్రతిజ్ఞ చేసిన నీవు సత్యసంధుడవైతే నన్నాదరించుకో. (ఆదరించుకో అనుటలో ఆంతర్యము. ఆదరించు అంటే ఆ ఫలము త్యాగయ్యగారి దగును. ఆదరించుకో అంటే ఆ ఫలము రామునిదే అగును. భక్తుడేది చేసినా ఏమితలచినా అది తనకు కాదు. పరమాత్మునకే అని అష్టాక్షర మంత్రము చెప్పిన అర్థము. ఈ భావముతో అయ్యగారు ఆదరించుకో అన్నారు). ఓ జానకీపతీ! నేను నీతో జగడ మాడుటలేదు వేడుకొంటున్నాను. నన్ను రక్షించటంలో ఈడు జోడులేని (సాటిలేని) వాడవునీవు. 'మహద్యాపది సంప్రాప్తే స్మర్తవ్యోభగవాన్ హరిః' = గొప్ప ఆపద కలిగినప్పుడు షడ్గుణ పూర్ణుడయిన హరిని స్మరింపవలెను' అని వ్యాసప్రోక్తము. అట్టి ఆపద్బాంధవుడవు సత్యసంధుడవు. గేలిచేయుట న్యాయమా? ఒక

రూపం ధరించి రక్షిస్తావు. ఒకరూపం ధరించి బాధిస్తావు. (లయింపచేస్తావు). ఒక రూపం ధరించి చూస్తావు (సృష్టి చేస్తావు). ఓ సుఖదాయక! నీకు సత్త (ఒకే ఒక రూపముతోనుండుట) లేదా' అని త్యాగయ్యగారు చమత్కారంగా అన్నారు.

విశేషము = చూచుట అనగా సృష్టించుట. దీనికి 'తదైక్షత. బహుస్యాం ప్రజాయేయ' = ఆ బ్రహ్మము సృష్టించినది. బహు రూపములు పొందినది. అనే వేద వాక్యమునందు సృష్టించుటకు చూచినది అని ఉన్నది. దాని ననుసరించి అయ్యగారును అట్లే చెప్పిరి. మరియు భాగవత పురాణ ప్రారంభంలో ఇట్లున్నది. 'సత్యం రజస్తమ ఇతి ప్రకృతే ర్గుణాస్తై। ర్వ్యక్తః పరః పురుష ఏక ఇహాస్యధత్తే। స్థిత్యాదయే హరి విరించి హరేతి సంజ్ఞాః। శ్రేయాంసి తత్ర ఖలు సత్త్వతనో ర్నృణాం స్యుఃII' = ప్రకృతిలో సత్త్వము, రజస్సు, తమస్సు అని మూడు గుణము లున్నవి. పరమ పురుషుడొక్కడే ఆ మూడు గుణములతో కూడిన వాడై రక్షణాదులకొరకు హరి, బ్రహ్మ, హరుడు అనే పేరులు ధరించి యున్నాడు. ఆ మూడిటిలో సత్త్వమూర్తి అయిన వాని నామములు నరులకు శ్రేయస్కరములు' అని. దీని ననుసరించి త్యాగయ్యగా రీకృతి యందలి నాల్గవ చరణమున రాముని 'అకలంక' అని సంబోధించిరి. అనగా రజస్తమస్సులు కాని సత్త్వగుణముల వాడా! అని తాత్పర్యము.

40. అరాణ = ఆది

ప॥ ఇలలో ప్రణతార్తి హరుడనుచు పే
రెవరిడిరే? శంకరుడని నీ॥ కిలలో॥

అ॥ తలచి కరగి చిర-కాలము పదముల
దండమిడిన నా-యెడ దయలేదాయెII ఇలలో॥

చ॥ కరచరణమ్ములు-నొసలు భుజమ్ములు
ధరణి సోకమ్రొ - క్కగలేదా
శరణనుచును మొర-లిడ లేదా పం
చనదీశ త్యాగ-రాజనుత నీ॥ కిలలో॥

తాత్పర్యము :

ఈ కృతి తిరువైయార్ అనే పంచనదక్షేత్రములో వెలసి యున్న శంకరుని స్తుతించు పాట. ఈ దేవునకు 'ప్రణతార్తి హరుడు' అని ఇంకొక పేరున్నది. ఈ పేరులను

పురస్కరించుకొని త్యాగయ్యగారు శివునితో మేల మాడుచున్నారు. ఓ పంచనదీశా! పంచనద క్షేత్రమునకు నాధుడా! నీకు శంకరుడని, ప్రణతార్తిహరుడని పేరు ఎవరు పెట్టిరయ్యా! శంకరుడు అంటే సుఖమును కలుగజేయువాడని, ప్రణతార్తిహరుడంటే ప్రణామము చేసేవారి ఆర్తులను హరించు వాడనియు అర్థము. ఈ లక్షణములు నీలో కనిపించుటలేదు. ఎవరుపెట్టేరయ్యా ఈ పేరులు? ఎందుచేతనంటే నేను ఉత్తప్రణామము మాత్రమే చెయ్యలేదు. మనసార తలచి మనసు ఆర్ద్రమై పెద్దలు విధించిన ప్రకారముగా రెండుచేతులు రెండుకాళ్ళు, వక్షఃస్థలము, నుదురు, రెండు భుజములు నేలకు సోకేవిధంగా సాష్టాంగ దండప్రణామము (ఎనిమిది అవయవములు నేలకు తాకునట్లు కర్రవలె పడుట) చేస్తున్నానే. మానసికంగా స్మరిస్తున్నానే వాచికంగా శరణు అంటూ మొరలు పెట్టుచున్నానే? నామీద నీ దయ వచ్చుటలేదు. ఇక నీ శంకరత్వమెక్కడ? ప్రణతార్తిహరత్వ మెక్కడ? అని వ్యాజనింద చేసినారు.

విశేషము = ఈ క్షేత్రంలో ఒక్క కావేరి మాత్రమే కాదు. వేగై మొదలయిన అయిదు నదుల సంగమక్షేత్రము. అందుచేత ఆ క్షేత్రమును పంచనదము అనిరి. అదే తిరువైయార్ = సంపత్కరమగు ఐదునదుల సంగమమని అరవ భాష పదము.

41. ఘంటారాగము = ఆది

ప॥ ఇంతయోచనైతేనే – నేమి సేయుదురా । ఇంత॥
అ॥ పంకజాక్ష ! నీవంటి– పరమదయానిధి ॥ కింత॥
చ॥ తీరరాని పోరాయె – సారెకు మేను సగమాయె ।
నేరమోమే తెలియదాయె – ఆరడికిక తాళదాయె ॥ ఇంత॥

2 శ్రీపతి! ఎన్నికలలేని – తాపత్రయమున నలసితి గాని ।
పాప గుణములు పురుషుని – రూపమై బాధించె గాని॥ ఇంత॥

3 వాగధిపవంద్య ! ని –న్నేగాని యొరుల నమ్మని
త్యాగరాజుని పైని – బాగాయె శ్రీరామ నీ ॥ కింత॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు, శ్రీరాముడు తనను రక్షించుటకు ఎంతో యోచించుచున్నట్లు (రక్షింతునామానుదునా అని) భావించి ఇంతయోచన అయితే నేనేమి చేయుదును? (ఏమీ చెయ్యలేను) ఓ పంకజాక్ష! నీ వంటి పరమదయానిధికి ఇంత యోచన తగదు. దయ అంటే పరదుఃఖదుఃఖిత్వము. అనగా ఇతరుల దుఃఖమును చూచి దుఃఖపడుట.

రాముడీ గుణము గలవాడు ''వ్యసనేషు మను ష్యాణాం భృశం భవతి దుఃఖితః '' = రాముడు మనుజుల ఆపదలను చూచి చాలా దుఃఖమును పొందువాడు'' అని వాల్మీకి చెప్పెను. అట్టి దయానిధి మాత్రమేకాదు. పరమ దయానిధి, దయాగుణము పరాకాష్ఠకు చెందిన వాడన్నమాట. అట్టినీకు నేను దుఃఖమను భవించుచుంటే యోచించుచుండుట తగని గుణము. కొందరు పురుషులు నన్ను బాధిస్తున్నారు. నా పాపములే పురుషుల రూపముతో బాధించుచున్నవి. (ఒక్క ఆచార్యుడు దైవమును దెల్పువాడు తప్ప తక్కిన దేహబంధువులయిన వారందరు 'విరోధి'' వర్గము అని సంప్రదాయము. వీరందరును సంసార వర్ధకులు. సంసారమున కీడ్చువారు. ఇదియే తనను బాధించుట). ఓరామా! ఈ ఆరడికిక తాళలేనయ్యా! నా నేరమేమిటో తెలియుట లేదు. వారి పోరెక్కువయినది. దానితో శరీరము సగమయినది. లెక్కకు మీరిన తాపములతో అలసిపోవుచున్నాను. శ్రీపతీ! నిన్ను దప్ప నేనితరులను నమ్మలేదు. ఓ వాగధిప వంద్య= బ్రహ్మకు నమస్కరింప దగిన వాడా! శ్రీరామా! యోచన చేయక వెంటనే రక్షింపుమని వేడుకొన్నారు.

42. బిలహరి = రూపకము

ప॥ ఇంతకన్నానందమేమీ – ఓ రామరామా॥ ఇంత॥

అ॥ సంత జనుల కొల్ల – సమ్మతి యుంటే కాని ॥ ఇంత॥

చ॥ ఆడుచు నాదమున–బాడుచు ఎదుటరా ।
వేడుచు మనసున, గూడియుండేది చాలు ॥ ఇంత॥

2 శ్రీహరికీర్తనచే దేహాది ఇంద్రియస
మూహముల మరచి–సోహ మైన దెచాలు॥ ఇంత॥

3 నీజపముల వేళ – నీ జగములు నీవై
రాజిల్లు నయ్యత్యాగ – రాజనుత చరిత ॥ ఇంత॥

తాత్పర్యము :

అయ్యగారు ప్రధానంగా రామనామ జప సమయములో ఈ జగత్తంతా రామ మయముగా సాక్షాత్కరించి ఆనంద మను భవించేవారు. ఆ ఆనందమును వర్ణింపదలచి ఇక రెండు మూడు విషయములను చేర్చినారు. సంతజనుల కొల్ల సమ్మతి అంటే సజ్జనుల యొక్క అంగీకారమని చెప్పవచ్చును. అనగా వారి సాంగత్యము, అది ఉంటే దాని కన్న ఆనంద మేమి? (శంకరాచార్యుల వారి సూక్తి. ''సత్సంగత్వే నిస్సంగత్వం''=

సత్సాంగత్యము ముందుకలిగితే దాని ననుసరించి క్రమంగా జీవన్ముక్తి'' అని) అట్టి ''సంతజనుల సమ్మతి'' ని త్యాగయ్య గారు మహానందంగా భావించారు. ఇంకా భగవంతుని దర్శనం కోరి సంగీతము పాడుచు వేడుచు ఆడుచుంటే ఇంతకన్న ఆనంద మేమున్నది. ఇట్లు శ్రీహరిని కీర్తి స్తూ ఉంటే దేహేంద్రియముల ధ్యాస ఉండదు. అన్ని భగవన్మయము లవుతాయి. అప్పుడు ''సోహం'' ఆ పరమాత్ముడే నేను అనే ఐక్యం కలుగుతుంది. ఇంతకన్న ఆనంద మేమున్నది'' అని అయ్యగారు ఆనందాను భూతిని వివరించారు.

43. సావేరి = చాపు (దివ్య నామము)

ప॥ ఇంతకన్న దెల్ప తరమా–జగ – దీశ్వర నే నీకితరమా – నీతో ॥ ఇంత॥

చ॥ నీటిలోని రాజీవముర రామ– నిను నమ్మి బ్రతుకు జీవమురా ॥ ఇంత॥

2 నీవే తనకిహ పరము రామ – నిను నమ్మిన కాపురము॥ ఇంత॥

3 రజనీశు జూచుకుముదము రీతి–రాజిల్లు నిను జూడముదము॥ ఇంత॥

4 నీకరుణే రాజయోగము రామ–నీ మాయయే రాజభోగము॥ ఇంత॥

5 రాఘవ శుభకరమూర్తే – త్యాగ–రాజు నీవాడని కీర్తే॥ ఇంత॥

తాత్పర్యము :

రామా! ఇంతకంటే నీకేమి చెప్పను? నేను నీకు ఇతరము కాదు. (పరాయివాడను గానని) నిన్ను నమ్మి బ్రతికే జీవము (ఆత్మ) నీటిలో ఉన్న తామరపువ్వు వంటిది. (నీటిలోనుంచి తామరను కోసి ఒడ్డున వేస్తే వాడి ఎండిపోతుంది. ఈ ఎండిపోవుటకు కారణము సూర్యకిరణములే. కాని నీటిలో తామర ఉన్నప్పుడు ఆ సూర్యకిరణములే తామరలు వికసించుటకు కారణము. అట్లే నిన్ను నమ్మి ఉంటే, జీవుని క్రిందికి లాగు సంసారబంధము జీవుని ఏమీ చెయ్యలేదు. జీవుడు తామరవంటి వాడు, భగవద్విశ్వాసము నీరు వంటిది. నీరు తామరను రక్షించినట్లు విశ్వాసము జీవుని రక్షిస్తుంది) ఓ రామా! నాకు నీవే ఇహ పరము. (ఈ లోకపు సంపద, పరలోక సంపద). నిన్ను నమ్మితేనే ఇది కాపురము. (నమ్మకపోతే ఇది అడవియేఅని) కలువ చంద్రునిచే వికసించినట్లు నిన్ను చూచిన నాకు మనోవికాసము కలుగుతుంది. నీ కరుణయే నాకు రాజయోగము. (ఐహికముగా రాజయోగము రాజగుట–పరమార్థముగా యోగీశ్వరులనుభవించే

సాక్షాత్కార యోగము). నీ మాయయే నాకు రాజభోగము. (మాయ అనగా ఈ ప్రకృతి. 'మాయాంతు ప్రకృతిం విద్యాత్। మాయినంతు మహేశ్వరం' = మాయ అనగా ప్రకృతి. మాయకు అధీశ్వరుడు భగవంతుడు. ఇది తెలిస్తే మాయ రాజభోగముగా భాసిస్తుంది. ఇది తెలియక భగవంతుని నమ్మకపోతే ఈ మాయ ఏహ్యమగును. తెలిస్తే ఇదే రాజభోగము. ఓ రాఘవా శుభములను కలిగించు స్వరూపము గలవాడా! నేను నీ వాడను అనునది నాకు పెద్దకీర్తి' అని అయ్యగారు తమ అనుభవమును తెలిపినారు.

44. గుండక్రియ = ఆది

ప॥ ఇంతనుచు వర్ణింప తరమా బ్ర- హ్మేంద్రాదులకైన॥ ఇంతనుచు॥

అ॥ కంతుని గన్నమా చక్కని - కల్యాణ రామా నీ సొగ॥ సింతనుచు॥

చ॥ చల్లని చూపుల - కన్నులు మరి జా
బిల్లి కళల గే- రిన ఆననము
మెల్లని మాటల- భయకరము లివి
యెల్ల సహజమై- న రామ నీ గుణ॥ మింతనుచు॥

2 అన్యుల గోరి ఘోరతపము
లెన్నెన్నో చే- సి వరము లంది మూ
ర్ధన్యు లైనవా- రిమదంబుల రా
జన్య లఘువున న- ణచే పరాక్రమ॥ మింతనుచు॥

3 వాగీశాది- సురకోట్లకు వే
దాగమ శాస్త్రము- లకు గన కూడని
నాగరాజ భూ- షణుడైన శ్రీ
త్యాగరాజ స- న్నుతనీ మహిమ॥ లింతనుచు॥

తాత్పర్యము :

ఇందురాముని రూప గుణ పరాక్రమములు వర్ణింపబడినవి. ఓ కల్యాణరామా! కంతుని=మన్మధుని కన్నతండ్రివి నీవు. నీ సొగసు బ్రహ్మేంద్రాదులకైన వర్ణింపతరము కాదు. (మన్మధుడే చాల సొగసయిన వాడు. వాని తండ్రివి నీవు. ఇక నీ సౌందర్యము వర్ణనాతీతము అని 'కంతుని గన్న' అనేది సాభిప్రాయ విశేషణము) చల్లని చూపులు గల

కన్నులు, చందమామ కళలను మీరిన ముఖము భయమును తీర్చే చల్లని మాటలు. ఇవి నీ గుణములు. వర్ణనాతీతములు. నిన్ను కాక ఇతరుల నాశ్రయించి ఎన్నెన్నో ఘోరతపస్సులు చేసి వరములు పొంది గొప్పవారై మదించిన రావణాదులను అణచిన నీ పరాక్రమ మింత అని వర్ణింపరానిది. బ్రహ్మాదులకు వేదాగమ శాస్త్రములకును, నాగభూషణుడైన శివునిచే నుతింపబడు నీ మహిమ వర్ణనాతీతము.

విశేషము = ఋక్, యజుః, సామ, అధర్వములు వేదములు. పాంచ పరాశర స్మృతి రాత్ర, వైఖానస, పాశుపతములు ఆగమములు, మనుస్మృతి మొదలయినవి శాస్త్రములు. వీటి అన్నిటికి నీమహిమ వర్ణనాతీతము. 'అభయం సర్వభూతేభ్యో దదామ్యేత ద్వ్రతంమమ' = ఆశ్రయించిన వానికి అభయమిచ్చెదనని విభీషణాగమన సమయమున రాముడు చెప్పినవి చల్లని మాటలు.

45. పున్నాగవరాళి = చాపు

ప॥ ఇంత భాగ్యమని నిర్ణయింప – బ్ర–హ్మేంద్రాదులతరమా॥ ఇంత॥

అ॥ ముని॥ చింతనీయ శ్రీ రాఘవ నినుమది–చింతించు సుజనుల
పూజించువారి॥ కింత॥

చ॥ మతిహీనులైన – నె–మ్మది లేని వారైన
అతి పాపకృతులైన ఎన్నటికి స
ద్గతి రాని వారైన – శ్రీరామ
శ్రుతి పురాణనుత – ప్రతిలేని నిను స
న్నుతి సేయు భక్తుల–జతగూడిన వారి॥ కింత॥

2 సారెకు మాయా సం–సారమందు చాల
దూరిన వారైన – కామాదులచే
పూరితమతులైన – సకల వేద
సార నిన్ను మన–సార నమ్మిన సుధా
పూర చిత్తుల సేవ – గోరిన వారి॥ కింత॥

3 భర్మచేల నీదు – మర్మము తెలియని
కర్మమార్గులైన – త్యాగరాజనుత
ధర్మరహితులైన – లోకములు
నిర్మించిన నీదు – శర్మము స్మరియించు
నిర్మల మతులకు – శర్మమెంచిన వారి॥ కింత॥

తాత్పర్యము :

త్యాగయ్యగారిపాటలో భగవద్భక్తుల సాంగత్యము సేవ గలిగిన వారి భాగ్యమింతది అని బ్రహ్మేంద్రాదులకు కూడ నిర్ణయింప శక్యము కానిదని చెప్పుచున్నారు. మతి హీనులైనా సరే, నెమ్మదిలేని వారైనా సరే, పాపాత్ములయినా సరే వారికి, సాటిలేని నిన్ను నమ్మిన భక్తుల జత ఉంటే అదే పరమ భాగ్యము. సంసార బంధములో బాగా చిక్కుకొని కామక్రోధములతో నున్న వారయినా సరే, ఓ రామా నిన్ను నమ్మిన అమృత హృదయులగు భక్తుల సేవ గోరిన వారైతే వారిదే భాగ్యము. నీ భక్తి మార్గము తెలియక కర్మమార్గమును గ్రహించిన వారైనా, ధర్మవిహీనులైనా సరే లోకములను సృష్టించిన నీకు మంగళాశాసనము చేసే భక్తులకు మంగళాశాసనము చేస్తే వారి కన్న భాగ్యము కలదా.

విశేషము = భగవద్భక్తులు, ఎట్టి పుణ్యకర్మాచరణములు లేని వారినైనా ఎట్టి నిహీనుల నయినా రక్షిస్తారు. అట్టి భగవద్భక్తుల సేవా సాంగత్యములు కలవారి భాగ్యమే భాగ్యము అని, భాగవతుల సేవా సాంగత్యములను గూర్చి కొన్ని సూక్తులు. 'యంయం స్పృశతి పాణిభ్యాం। యయం పశ్యతి చక్షుషా। స్థావరాణ్యపిముచ్యంతే కింపున ర్బాంధవాజనాః' = భగవద్భక్తులు ఎవనిని చూచినా ఎవనిని తాకినా వాడు ముక్తుడగును. శిలమొదలయిన స్థావరములుకూడా ముక్తిని పొందును. ఇక ఏదయినా సంబంధము కలవారి సంగతి చెప్పవలెనా? 'పాపిష్ఠః క్షత్ర బంధుశ్చ పుండరీకశ్చపుణ్యకృత్। ఆచార్య వత్తయా ముక్తౌ తస్మాదాచార్యవాన్ భవేత్' = పాపములు చేసిన క్షత్రబంధుడు పుణ్యములు చేసిన పుండరీకుడును ఆచార్యసేవ కలిగియుండుటచే (ఇదే భాగవతసేవ) ముక్తులయిరి' అని. మరియు భక్తులు భగవంతుని యందు మిక్కిలి ప్రేమచేత నీకు శుభమగు కాక 'శ్రీనివాసాయ మంగళం' 'పుణ్యశ్లోకాయ మంగళం' ఇత్యాదిగా మంగళాశాసనం చేస్తారు. వారు భాగవతులు. వారికి మంగళాశాసనం చేస్తే అంతకన్నా భాగ్యమేమి? 'అన్నివ్వులగం' అని గోదాదేవి భగవంతునకు మంగళాశాసనము చేసినది. ఆమెకు 'గోదాయై నిత్యమంగళం' అని ఆమె భక్తులు మంగళాశాసనము చేయుదురు. ఇది సంప్రదాయము. 'నీ నామరూపములకు' అని త్యాగయ్యగారు రామునకు

మంగళాశాసనము చేసిరి. వారి శిష్యులు 'త్యాగరాజాయ మంగళం' అని వారికి చేసిరి. ప్రస్తుతం త్యాగయ్య గారు భాగవత మంగళాశాసనము చేయుట మహా భాగ్యమని చెప్పిరి. మరియొక ఉదాహరణము. పరీక్షిత్తుకు శ్రీశుకుడు చెప్పినది 'ఆరాధనానాం సర్వేషాం విష్ణో రారాధనం పరం। తస్మాత్పరతరం ప్రోక్తం తదీయా రాధనం నృప' = అన్ని ఆరాధనములలో విష్ణుని ఆరాధనము గొప్పది. దానికన్న గొప్పది విష్ణు భక్తుల నారాధించుట అని'.

46. భైరవి = ఆది

ప॥ ఇందుకా పుట్టించితివి న॥ న్నిందుకా॥

అ॥ అందగాడ నన్నేల ఎంతో
అలయించి వేడుక జూచుటకు న॥ న్నిందుకా॥

చ॥ ఓ పరాత్పరరూప నాదు స-
మీపజనులచేత నా పదములను నే
నేప్రొద్దును పరి-తాపమంది. సీ
తావతి నీదుపై - కోపగించ న॥ న్నిందుకా॥

2 దాసపోషక! స-దాసదన దారాది
గోసుతాదుల దు-రాస చేత
కాసాస మించి ఏ-దోసము తెలియని
వేసధరుల సహ-వాసము జేయన॥ న్నిందుకా॥

3 భోగదాప్త సుల-భాగధరణ భవ
రోగహరణ శ్రీ-త్యాగరాజనుత
సోగ కనులతో - బాగుమీరగను
వేగజూడరా - దాగమచర న॥ న్నిందుకా॥

తాత్పర్యము :

ఓ అందగాడా! రామా! నన్ను రక్షించకుండా బాధలపాలుచేసి అలయించి వేడుక చూచుటకా నన్ను పుట్టించినావు? ఓ పరాత్పరా! నా చుట్టు ప్రక్కల ఉన్న జనుల ద్వారా నా కాపదలు కల్పించి అవిపడలేక నేను పరితాపముతో నిన్ను కోపగించుటకా నన్ను

పుట్టించితివి? ఓ దాసపోషకా! = దాసులను రక్షించువాడా! ఎప్పుడును ఇల్లు భార్య పుత్రులు గోవులు వీటిపై వ్యామోహము చేత ధనార్జన పరుడనై, ఇది దోషమని తెలియక భక్తులమని వేషము ధరించే డాంబికులతో సహవాసము చేయుటకు నన్ను పుట్టించితివా? ఓ భోగదా! = భోగముల నిచ్చువాడా! ఆప్తసులభ! = భక్తులకు సులభుడా! అగధరణ! = పర్వత మెత్తినవాడా! భవరోగహరణ! = సంసారమను రోగమును హరించువాడా! త్యాగరాజనుతా! ఆగమచర = వేదములయందు సంచరించువాడా! నీ సోగకనులతో తొందరగా ఒకసారి నన్ను చూడరాదా!

విశేషము = అయ్యగారి కృతులలో భోగద + ఆప్తసులభ + అగధరణ వంటి సంస్కృత పదములతోడి సంబోధనములుండును. అవి తెలుగు గేయములయం దున్నవి కనుక తెలుగు భాషా మర్యాద ననుసరించి సంధి విభాగము చేయవలసి యుండును. కాని త్యాగయ్యగారు అటువంటి చోట్ల సాధారణంగా సంస్కృత భాష ననుసరించి సవర్ణ దీర్ఘ సంధులు చేయుట పరిపాటి. ఇది ఆయన స్వాతంత్ర్యమని, ఆర్షప్రాయమని, భావింపవలెను.

47. ముఖారి = చాపు (దివ్యనామము)

ప॥ ఇందుకా ఈ తనువును బెంచిన॥ దిందుకా॥

చ॥ నీ సేవకు రాక – నీదు చెంతకు రాక
ఆస దాసుడై యిటు–నటు తిరిగే॥ దిందుకా॥

2 నిరతము నీ దృష్టి–నే నార్జించక
ఒరుల భామలను – ఓర జూపులు జూచే॥ దిందుకా॥

3 సారెకు నామ – స్మరణము జేయక
ఊరి మాటలెల్ల – నూరక వదరే॥ దిందుకా॥

4 కరములతో పూజ–గావింపక దాచి
ధరలోన లేని దు–ర్దానములకు జాచే॥ దిందుకా॥

5 వారము నీ క్షేత్ర–వరముల జుట్టక
ఊరికి ముందుగ – పారి పారి తిరిగే॥ దిందుకా॥

6 నీవాడనను పేరు– నిందు వహించక।
నావాడని యముడు – నవ్వుచు బాధించే॥ దిందుకా॥

7 రావయ్య శ్రీ త్యాగ– రాజ వినుత నిన్ను
భావింపక ప్రొద్దు –పార గొట్టుకునే॥ దిందుకా॥

తాత్పర్యము :

రామభక్తికి సంబంధించిన కృత్యములను వదలి వ్యర్థపు పనులతో కాలక్షేపము చేయుటను తనయందారోపించుకొని త్యాగయ్యగారు ఆర్తిబడుచున్నారు. ఓరామా నీ సేవకు రాక నీ సన్నిధికి రాక ధనాశకు దాసుడనై తిరుగుటకా ఈ శరీరమును పెంచినది? నీ మీద దృష్టిని నిలుపక పరస్త్రీలపై నిలుపుటకా ఈ మేను పెంచినది?

నీ నామస్మరణమును చేయక ఊరిలోని వ్యర్థపుమాటలను పలుకుటకా? చేతులను నీ పూజకు చాచక దుర్ధనములను పుచ్చుకొనుటకు చాచుటకా? నీ ఆలయములను సేవించుటకు తిరుగక ఊరిలో బలాదూరు తిరుగుటకా? నిజానికి నేను నీ వాడను. ఈ పేరు వహించక యముడు నావాడని (తన వాడని) నన్ను బాధించుటకా? రావయ్యా రామా! నిన్ను మనస్సున భావింపక వ్యర్థపు భావనలతో ప్రొద్దు పుచ్చేటందుకా? ఈ శరీరమును పెంచినది.

విశేషము = 'విచిత్రా దేహసంపత్తిః ఈశ్వరాయ నివేదితుం' = 'విచిత్రమయిన ఈ దేహసంపద ఈశ్వరార్పణము కొరకే' అని శాస్త్రము. మరియు 'జిహ్వా కీర్తయ కేశవం' = ఓ జిహ్వా! కేశవుని కీర్తించుము. చేతులారా! హరిపూజచేయండి. చరణము లారా! మీరు హరి ఆలయమునకు వెళ్ళుడు' అని మరియు 'కంజాక్షునకు కాని కాయంబు కాయమే' =భగవత్సేవకు ఉపయోగింపని శరీరము శరీరమే కాదు' ఇత్యాది సూక్తులెన్నో కలవు. వీటి ననుసరించి శరీరము అవయవములు మనస్సు భగవంతునకే అంకితము కావలెను. ఇట్లు చేసినవాడు భగవంతుని వాడు. చెయ్యని వానిని యముడు తనవాడని భావించి బాధిస్తాడు. 'కమలనయన వాసుదేవ విష్ణో। ధరణి ధరాచ్యుత శంఖచక్రపాణే। భవశరణ మితీరయంతి యేవై। త్యజ భట దూరతరేణ తాన పాపాన్' = భగవన్నామములను స్మరిస్తూ శరణు జొచ్చిన పుణ్యాత్ములను వదలి పెట్టు. అట్టివాడు నావాడు కాడు. అనగా వాని మీద నాకు అధికారములేదు. అని భటులకు యముని ఆజ్ఞ. భగవంతుని వాడను కాక యమునకు వశమై నరక మనుభవించే టందుకా ఈ శరీరమును పెంచినది? అని త్యాగయ్యగా ర్తి చెందుట ద్వారా మనకుపదేశము చేసినారు.

48. దేశికతోడి = చాపు

ప॥ ఇన్నాళ్లవలె వింతసేయకే నీవాడ–నిపుడైతి ధర్మాంబికే॥ ఇన్నాళ్లు॥

అ॥ అన్యుల నెరనమ్మి టవల్లఫలములే–దమ్మ ఓధర్మాంబికే ఓ జనని॥ ఇన్నాళ్లు॥

చ॥ ఎన్నరాని జననము–లెత్తనాతరమా వ
ద్ధన రాదా ధర్మాంబికే
మనసున విషయాదులంటనీక నన్ను
మన్నించు ధర్మాంబికే ఓజనని॥

2 కామాదిగుణములచేత గాసిలేక
కరుణించు ధర్మాంబికే
నీ మాయల చేత–దగిలింపకే ఓ
నిరుపమ ధర్మాంబికే – ఓ జననీ॥ ఇన్నాళ్లు॥

3 కలువరించిన నన్ను – జూచి నీమనసేల
కరుగదే ధర్మాంబికే
అలరుచు వచ్చు న–ర్భకుని తల్లి రీతి
ఆదుకో ధర్మాంబికే ఓ జననీ॥ ఇన్నాళ్లు॥

4 మలయజగంధి సందడి యని మనసున
మఱవకే ధర్మాంబికే
గిలుకు సొమ్ముల తోను – శిశువుకు పాలు తా
గించిన ధర్మాంబికే ఓ జననీ॥ ఇన్నాళ్లు॥

5 కలకలమని పాల–వెలసి నీ ముఖమును
కనుపింపు ధర్మాంబికే
లలిత గుణములు గల్గు–లలిత విద్యా వి
లాసిని ధర్మాంబికే – ఓ జననీ॥ ఇన్నాళ్లు॥

6 ఆటలకై పలికి–నాడని ఎంచకు
మంబికే ధర్మాంబికే
నాటి మొదలుకొని – నమ్మిన వాడను
నలినాక్షి ధర్మాంబికే ఓ జననీ॥ ఇన్నాళ్లు॥

7 పాదములకు నేను – పలుమారు మ్రొక్కితి
పావని ధర్మాంబికే
పేదసాదల పాలి– భాగ్యము నీవనుచు
నెంచితి ధర్మాంబికే ఓ జనని॥ ఇన్నాళ్లు॥

8 రాజీవ భవునకు – బొగడ తరమాని
రంజని ధర్మాంబికే
రాజశేఖరి! త్యాగ– రాజుని సతతము
రక్షించు ధర్మాంబికే– ఓ జననీ॥ ఇన్నాళ్లు॥

తాత్పర్యము :

ఇది పంచ నదక్షేత్రవాసిని అయిన ధర్మాంబాదేవిని ప్రార్థించుకృతి. ఓ తల్లీ! ఇన్నాళ్లు పెక్కు వింతలు చేశావు. నీపై దృఢ విశ్వాసము కలిగి నీ వాడనై యున్నాను. ఇక వింత సేయకు. ఇక జన్మము లెత్త లేను. జన్మము లెత్తవద్దు అని ఒక మాటచెప్పు. అనగా నీ సాయుజ్య మిమ్మని. జన్మకారణములయిన విషయములను నా మనస్సున నంటనీయకు. కామాదిగుణములు తగిలించి నన్ను గాసి బెట్టకు. నేను నీ కరుణకై కలువరించుచున్నాను. మనసు కరుగదేల ధర్మాంబికా! సంతోషపడుచు చేతులెత్తుకొని పరుగులిడుచువచ్చే పసి బాలుని తల్లి ఆదుకొన్నట్లు నన్నాదుకో. చందన పరిమళముగల తల్లీ! నిన్ను సేవింపవచ్చు భక్తుల సందడిలో నన్ను మరువకు తల్లీ! ధరించిన నగలు గిలుకు గిలుకు మని చప్పుడు కాగా ఒక శిశువుకు పాలిచ్చిన ఓ తల్లీ! (ఇది పురాణ గాథ అయి ఉండవచ్చును) కలకలమని నాపాల వెలసి నీ ముఖమును చూపు తల్లీ! లలితమగు రూపము లలితమగు విద్యలు గల లలితవు నీవు. నేను ఏదో ఆటలకోసం మాటలాడుచున్నా ననుకొనకు. జన్మమెత్తినది మొదలు నిన్ను నమ్మి ఉన్నా పేదసాదల (సంసార బాధితుల) భాగ్యనిధివి నీవని తలచినాను. బ్రహ్మాదులు పొగడలేని మహిమ గల ధర్మాంబికా! ఓ రాజశేఖరీ = (చంద్రుని శిరమందు ధరించినదానా) ఈ త్యాగరాజుని రక్షించవమ్మా తల్లీ.

49. శహన = ఆది

ప॥ ఈ వసుధ నీ వంటి దైవము – నేనెందుగానరా॥ ఈ॥

అ॥ భావుకము గల్గి వర్ధిల్లు! గోపూరి సుందరేశ గిరీశ॥ ఈ॥

చ॥ ఆసచే అరనిమిషము నీపుర-వాస మొనరజేయు వారి మది
వేసట లెల్లను దొలగించి ధన-రాసులు నాయువును
భూసుర భక్తియు తేజమును నొసగి-భువనమందు కీర్తి గల్గజేసే
దాసవరద త్యాగరాజ హృదయని-వాస చిద్విలాస సుందరేశ॥ ఈ॥

తాత్పర్యము :

ఇది గోవూరి సుందరేశ్వర దేవునిపై రచించిన పంచరత్నములలో నొకటి. 'కోవూరి' అనటం తప్పు. ఓ సుందరేశ్వరా! శుభములు కలిగి వర్ధిల్లు దేవా! ఈ వసుధలో నీవంటి దేవుని నేనెక్కడను చూడలేదయ్యా! ఆశకలిగి నీ పురములో అరనిమిషం వాసంచేసినా చాలు. వారి హృదయ బాధను తొలగిస్తావు. ధనములను, ఆయుర్దాయమును, బ్రాహ్మణ భక్తిని, తేజస్సును, లోకంలో మంచికీర్తిని వారికి ఇస్తావు. దాసులకు వరదుడవు. త్యాగరాజు హృదయమున నివసించే చిద్విలాసుడవు.

విశేషము = 'యోవైతాం బ్రహ్మణోవేద। అమృతేనావృతాంపురీం। తస్మైబ్రహ్మచ బ్రహ్మేచ। ఆయుః కీర్తిం ప్రజాందదుః' =ఎవడు మోక్షస్థానమయిన బ్రహ్మపురమును తెలుసుకొనునో వానికి బ్రహ్మ ఆయుస్సును, కీర్తిని, సంతానమును ఇచ్చును' అని వేదవాక్యము. అట్టి స్థానమయిన గోవూరునందు వెలసియున్న బ్రహ్మ సుందరేశ్వరుడే. అత డాయువును కీర్తిని ఇస్తాడు. మరియు త్యాగయ్యగారు 'బ్రాహ్మణ భక్తిని' కూడ ఇచ్చునని విశేషించి చెప్పినారు. బ్రాహ్మణభక్తిని కూడ ఆయురారోగ్యముల వలెనే ఆనాడు కోరుకొనేవా రన్నమాట. దీనికి కారణము 'సర్వా దేవతాః వేదవిది బ్రాహ్మణే వసంతి, తస్మా ద్బ్రాహ్మణేభ్యో వేదవిద్భ్యో దివేదివే నమస్కుర్యాత్' = వేదవేత్త అయిన బ్రాహ్మణుని యందు దేవత లందరును నివసించి యుందురు. కనుక వేదవేత్తలయిన బ్రాహ్మణునకు ప్రతిదినమును నమస్కరింపవలెను' అని వేద విహిత మయిన ధర్మము, ఆనాడు బ్రాహ్మణభక్తి దేవుడిచ్చే ఒక వరము వలె భావింపబడిన దన్నమాట. భోజ మహారాజు తన చంపూరామాయణ ప్రారంభములో 'ఉచ్చైర్గతి జగతి సిద్ధ్యతి ధర్మత శ్చేత్, తస్య ప్రమాచ వచనైః కృతకేతరైశ్చేత్, తేషాం ప్రకాశనదశాచ మహీసురైశ్చేత్, తానంతరేణ నిపతే త్క్వను మత్ప్రణామః' = లోకము యొక్క అభ్యుదయము ధర్మము వలన కనుక, ధర్మములను తెలుపునది వేదములు కనుక, వేదములను ప్రకాశింపజేయువారు బ్రాహ్మణులు కనుక వారికి నమస్కరించుచున్నాను' అని వ్రాసెను. కనుక త్యాగయ్యగారు ఈ కృతిలో బ్రాహ్మణభక్తి ప్రస్తావము చేసిరి.

50. శంకరాభరణం = ఆది

ప॥ ఈ వరకు జూచినది-చాలదా
ఇంకా నా రీతేనా॥ ఈవరకు॥

అ॥ పావనము జేయు-శక్తికణగని
పాపము కలదా - కరివరద న॥ న్నీవరకు॥

చ॥ శ్రీ శరణా శుగా-శన శయన ప
రేశ! నీపద కు-శేశయార్చనము
నేశాయకదు-రాశచే భవ
పాశబద్ధుడై - గాసి తాళని న॥ న్నీవరకు॥

2 పరలోకభయ - విరహితులైన
నరులు నాదుపై - మరి యమాదులు
పరచిన బాధలు - తరముగాక నీ
చరణ యుగళమును - శరణొందిన న॥ న్నీవరకు॥

3 నాగాశన సదా-గమనా! ఘృణా
సాగర నిన్ను - వినా ఎవ్వరు నీ
వేగతి యని-వేగమొరలిడు
త్యాగరాజుని - రాగరహిత న॥ న్నీవరకు॥

తాత్పర్యము :

రామా! ఇంతవరకు నీవు నన్ను పరీక్షించి చూచినది చాలదా? ఇంకా ఆ రీతేనా? నావద్ద పాపము ఉన్నదనుకో నన్ను పావనము చేసే శక్తి నీకున్నది. ఆశక్తికి అణగని పాపము నాకిక ఉంటుందా? శ్రీశరణా = లక్ష్మీదేవికి స్థానమైన వాడా! ఆశుగ-ఆశన-శయన = అశుగా శన శయన! = గాలిని తిను సర్పమున నిద్రించువాడా! పరేశ = పెద్ద దేవతలకును పెద్దవాడా! నీ పద కుశేశయ అర్చనమునే = నీ పాదపద్మముల అర్చనమునే చేయక దురాశతో సంసారపాశమందు చిక్కి బాధను తాళలేని నన్నింతవరకు చూచినది చాలదా? పరలోక భయములేని మానవులు మరియు యముడు మొదలగు వారు బెట్టు బాధలు తాళలేక నీ చరణ యుగళమును = (రెండు పాదములను) శరణుజొచ్చిన నన్నింతవరకు చూచినది చాలదా? ఓ నాగ అశన సదాగమన = పాములను తిను గరుత్మంతునిపై

చరించువాడా! ఘృణా సాగర = కరుణా సముద్రుడా! నీవు గాక నాకెవ్వరు రక్షకులు? ఓ రాగరహిత= రాగ ద్వేషములు లేనివాడా? నీవే గతి అని ఆత్రముతో మొరలు బెట్టుచున్న ఈ త్యాగరాజుని ఇంతవరకు చూచినది చాలదా? అని అయ్యగారు ఆర్తితో వేడుకొన్నారు.

51. కల్యాణి = రూపకము

ప॥ ఈశ పాహిమాం జగ – దీశపాహిమాం॥

అ॥ ఆశరగణ మదహరణ బి–లేశయ భూష సప్త ఋ॥ షీశ॥

చ॥ శ్రీనాధకరార్చిత దొర–కేనా ల్పుల కీదర్శన
మేనాటి తపఃఫలమో – నీ నామము దొరకె
శ్రీ నారదగాన ప్రియ – దీనార్తి నివారణ వర
మానందార్ణవ దేవ కృ–శాను జనక సప్త ఋ॥ షీశ॥

2 వ్యాసార్చిత పాలిత నిజ–దాసభూ లోకకై
లాసంబను వల్కలు నిజ–మే సారెకు గంటి
నీసా టెవరయ్యా–నీ సాక్షాత్కారమ్మున
వేసట లెల్ల దొలగె నే – డేసాఫల్యము జన్మము॥ ఈశ॥

3 సామాదినిగమ సంచర–సోమాగ్నితరణి లోచన
కామాది ఖండన సు–త్రామార్చిత పాద
హేమాచలచాప నిను వి–నామరెవరు ముని మనో
ధామా – త్యాగరాజ – ప్రేమావతార జగ॥ దీశ॥

తాత్పర్యము :

ఈ కృతి భూకైలాసక్షేత్రవాసి అయిన శివుని స్తోత్రరూపము. ఈశ=ఈశ్వరా! పాహిమాం=రక్షించు నన్ను–జగదీశ=అన్నిలోకములకు ప్రభువయినవాడా! నన్ను రక్షించు. ఆశర గణ మదహరణ! = రాక్షస సమూహముల మదమును హరించువాడా! బిలేశయ భూష! = సర్పములు భూషణములయిన వాడా! సప్త ఋషులకు ప్రభువయినవాడా! శ్రీనాధ కర అర్చిత = విష్ణువు యొక్క చేతులతో అర్చింపబడినవాడా! అల్పులకు ఈ నీ దర్శనము దొరకునా? నా కీనాడు దొరకినది. ఇది ఏనాటి తపఃఫలమో? నీ నామము

కూడ దొరకినది. శ్రీ నారద గాన ప్రియ = శ్రీనారదుని సంగీతమందు ఇష్టపడువాడా! దీన ఆర్తి నివారణ! = దీనుల ఆర్తిని నివారించువాడా! పరమ ఆనంద = ఎక్కువగు ఆనందమునకు సముద్రుడా! దేవా! కృశాను-జనక! = అగ్నికి తండ్రి అయినవాడా! (అనగా కంటినుండి అగ్నిని పుట్టించువాడా! అని) వ్యాసుని చేత అర్చింపబడినవాడా! పాలిత నిజదాస! = నీ దాసులను పాలించినవాడా! ఆహా! ఇది భూలోకకైలాస మని ఇదివరలో విన్నాను. ఇప్పుడు చూచినాను. విన్న పలుకులు నిజమే. నీసరి సమాను లెవ్వరును లేరు. నీ సాక్షాత్కారము చేత నా బాధలు తొలగినవి. జన్మ సఫలమయినది. సామము మొదలయిన వేదములయందు సంచరించువాడా! సోమ అగ్ని తరణి లోచన! = చంద్రుడు అగ్ని సూర్యుడు కన్నులయినవాడా! కామ ఆది ఖండన! = కామము మొదలయిన వాటిని ఖండించువాడా! సుత్రామ అర్చిత పాద! = ఇంద్రునిచేత అర్చింపబడిన పాదములు గలవాడా! హేమాచల చాప! = మేరు పర్వతము ధనుస్సయినవాడా! (త్రిపురాసుర సంహారమందు మేరు పర్వతము శివునకు ధనుస్సయినది) నీవు కాక నాకు రక్షకులెవరు? (లేరన్నమాట). ముని మనో ధామ! = మునుల మనస్సునందు నివసించువాడా! త్యాగరాజ ప్రేమ అవతార! = త్యాగరాజు భక్తియే నీ స్వరూపమయిన వాడా! ఈ క్షేత్రమందు సత్పుర్షులు శివుని సేవించుచున్నట్లు భావింపవలెను.

విశేషము = ఈ కృతి పల్లవి ఎత్తుగడనుంచి అనుపల్లవి వరకు సంస్కృత కృతి అనిపించును. చరణములలో సంబోధనములు సంస్కృతంలో ఉండి చిన్న తెలుగు వాక్యములుండును. కనుక ఈ కృతిమణిప్రవాళకృతి (మణులు పగడములు కలిపి కూర్చిన హారమువంటిది). కల్లూరి వీరభద్రశాస్త్రిగారు తమ గ్రంథములో మొదటి చరణములో 'అనాపజనక' = అగ్నికి తండ్రి అయినవాడా! అని అర్థము వ్రాసినారు. ఎంత ఆలోచించినా ఆ శబ్దము అర్థమూ అన్వయించుటలేదు. అంతేకాక కృతి శిల్పమును బాగా పరిశీలిస్తే యతిభంగ దోషము వచ్చినది. అందుచేత తెలుగులో వ్రాసిన అర్థమును అనుసరించి కృశాను జనక అని మార్చటమయినది. ఇంకా చివరి చరణంలో 'సామాది నిగమ సంచార' అనే దానిలో ఒక మాత్ర ఎక్కువ అగుటచేత 'సామాది నిగమ సంచర' అని మార్చట మయినది. 'సంచర' అనేది తప్పుకాదు.

52. ఆరభి = చాపు (ప్రహ్లాద భక్తి విజయము)

ప॥ ఇపుడైనను దలచినారా – స్వామి
కృపకు పాత్రుడనని – కీర్తించినారా॥ ఇపు॥

చ॥ దయచేసినామాట లెల్ల నా
తల్లితో బలికిన కొల్ల
నయముగ వింటి నీ వల్ల – నేడు
నామనసున నెంతో చల్ల – నాయె ఇపు॥

2 ఉన్నతదయ కాస గొంటి – నేను
బన్నములకు పాలైయుంటి
కన్నులారా మిము గంటి – నేడు
కర్ణామృతపు మాట వింటి స్వామి ఇపు॥

3 పలురూపములు తాను బూని నన్ను
బాధించి వేడ్క జూచీని,
పలుమారు నన్ను నేచీని, పుణ్య
పాపము హరిచెంత గాని యేమందు॥ ఇపు॥

4 భూమిని పుట్టగలేను భూయో
భూయో హరిని నమ్మినాను
తామసమును తాళలేను, వర
త్యాగరాజాప్తుడు మదిలోను॥ ఇపు॥

తాత్పర్యము :

త్యాగరాజ స్వామి రచించిన ప్రహ్లాద భక్తి విజయములోని కథ ఇది. తండ్రి భటులు ప్రహ్లాదుని బంధించి సముద్రములో పడవైచినారు. సముద్రుడు ప్రహ్లాదునకు స్వాగత మిచ్చి లోనికి గొనిపోయినాడు. అచ్చట ప్రహ్లాదునకు నారద సాక్షాత్కార మయినది. అప్పుడు ప్రహ్లాదుడు నారదుని ప్రశ్నిస్తున్నాడు. నారదమునివర్యా! తాము వైకుంఠము నుండి వచ్చుచుంటిరి కదా! అచట శ్రీమన్నారాయణుడు ఇప్పుడైన నన్ను తలచుచున్నాడా? నేను తన కృపకు పాత్రుడను అని కీర్తించినాడా? అలనాడు నేను నా తల్లి గర్భమందున్నప్పుడు ఆమెకు మీరు తత్త్వోపదేశం చేసినారు. ఈ రోజున మళ్లీ మీవల్ల

విన్నాను. నా మనస్సు చల్లబడినది. ఉన్నత పదము (మోక్షము)ను పొందటానికి ఆశపడ్డాను. రాక్షసులు పెట్టే బాధల పాలైనాను. కన్నులార నిన్ను దర్శించాను. నీవల్ల చెవులకు అమృతమైన మాట విన్నాను. (హరినిన్ను స్మరిస్తున్నాడు. నీవు తన కృపకు పాత్రుడవు అని చెప్పినాడు. అనే మాట) ఆ హరియే పలురూపాలు ధరించి నన్ను బాధించి వినోదం చూస్తూ ఉన్నాడు. (ఇది ఆయన లీల) (తనను బాధించు రాక్షసులు కూడ విష్ణుస్వరూపులే అని ప్రహ్లాదుని భావము) తనను బాధించిన పాప పుణ్యముల సుఖదుఃఖముల ననుభవించువాడు (భోక్త) హరియే కాని నేను కాను. 'ఇట్టి స్థితిలో నన్నుంచి నన్ననుభవించువాడు ఆహరియే' అని ప్రహ్లాదుని భావము. ఓ నారదమునివర్యా! ఇక నేను భూమిపై జనింపగోరను. సారెసారె హరినే నమ్మియున్నాను. హరి తామసము (జాగు) చేస్తే నేను తాళలేను. మరి ఆయన ఏమనుకొంటున్నాడు. అని నారదుని ఒక మధ్యవర్తిగా భావించి ప్రహ్లాదుడు ప్రశ్నించినాడు.

53. సావేరి = చాపు

ప॥ ఇంత తామసమైతే – ఎంతని సైరింతు
ఏమి జేయుదురామ॥ ఇంత॥

అ॥ కంతు జనక! నన్ను – వింత జేసితే నిన్నూ
రంత నవ్వరా? సీతా – కాంత! నను కరుణింప॥ ఇంత॥

చ॥ రాజీవలోచన – రాజీతో రావేరా?
జీవనము నీవేరా – జీమూతాభతనో!
రాజీవాసన జనక – రాజిల్లు రఘువంశ
రాజరాజ నీవేరా – జీవాధార॥ ఇంత॥

2 సుందరమూర్తీ! నా–యందు దయరాదు నే
నెందు బోదురా నీ–యందు చిత్తము గాని!
ఎందున్నావో రా–కేందుశేఖరనుత నీ
కెందను మాన – మిందువదనా॥ ఇంత॥

55. పున్నాగ వరాళి = చాపు (ప్రహ్లాద భక్తి విజయములోనిది)

ప॥ ఇందుకా ఈతనువు సాకిన దిందుకా॥

అ॥ ఇందు ముఖుడు రాక. హృదయము పగులగ
అందరిలో జాలి – జెందనీ అని అంద ॥ రిందుకా॥

చ॥ పాములకే మేను – బలు గట్టిగా నుండ
ఏమో కారణ మని – ఎంచు చుంటినే ॥ నిందుకా॥

2 మన కేల నెప మని – మన్నించిరో లేక
తనువు బెల్లము గాదు – తాళను దైవ ॥ మిందుకా॥

3 నా జయమును జూచి – నమ్మరే దేవుని ।
రాజిల్లు శ్రీత్యాగ – రాజ వరదుడు తా ॥ నిందుకా॥

తాత్పర్యము :

ప్రహ్లాదుడు తనలో తాను బాధపడుచున్నాడు. ఇందుముఖుడు=చంద్రుని వంటి ముఖముగల తన శ్రీహరి నా వద్దకు రాక పోవుట చేత నా హృదయము పగిలి పోవుచున్నది. లోకు లందరును ప్రహ్లాదుని చూచి జాలిపడనీ అని శ్రీహరి నా శరీరమును రక్షించాడు. ఇందుకా ? పాములు కరచి నప్పుడు నాకు బాధ కలుగలేదు. నా మేను గట్టిగా ఉన్నది. కారణము తెలియలేదు. బ్రతికినాను. స్వామి నన్ను బ్రతికించినది ఇందుకా ? నాకు నా శరీరము బెల్లము కాదు. (బ్రతుకు పై తీపి లేదని) నన్ను బ్రతికించి దర్శన మీయక నన్ను బాధించుటకా? అని ప్రహ్లాదుడు స్వగతముగా బాధపడి నరుల నుద్దేశించి ''హరిభక్తి ప్రభావము వలన పాములు ఏనుగులు నన్నేమియు చేయలేక పోయినవి. ఇది నా విజయము. నా విజయమును చూచి అయినా ఓ నరులారా మీర హరిని నమ్మండి. ఆశ్రయించండి. ఇందుకా? నన్ను రక్షించి ఈ శరీరమును నిలువ బెట్టినది''. అని మళ్లీ స్వగతములోనికి వచ్చినాడు.

విశేషము=నిజానికి భాగవతంలోని ప్రహ్లాదుడు ఇట్లు హరి దర్శనము కాక బాధపడలేదు. బాధలు అతనికి అంటలేదు. ప్రతి వస్తువు నందును హరినే చూచుచు, ప్రతి వస్తువును హరి శరీరముగనే భావించుచు నిత్యానందమును పొందుచూ ఉన్నాడు. ఇందున్న ప్రహ్లాదుడు వ్యాసుని ప్రహ్లాదుడు కాడు, పోతన ప్రహ్లాదుడు కాడు, క్రాంత దర్శి అయిన త్యాగయ్యగారు సృష్టించిన ప్రహ్లాదుడు. ఇందు ప్రహ్లాదుని ఆర్తి

త్యాగయ్యగారిది. సముద్రమున పడవేయబడిన ప్రహ్లాదుడు భాగవతమందు ఒడ్డునకు విసరివేయబడినాడు. సముద్రుడు ప్రహ్లాదుని ఒడ్డునకు విసరుట భాగవతాపచార మని త్యాగయ్యగారు భావించినారు. త్యాగయ్య గారి కల్పనలో సముద్రుడు ప్రహ్లాదునకు స్వాగత మిచ్చి తన అంతఃపురమునకు తోడుకొని పోయి సమస్తోపచారములు చేసినాడు. అక్కడ త్యాగయ్యగారి రాముని దర్శనమును కలిగించినాడు. ఇక్కడ త్యాగయ్య గారి భావన ? పసివాడయిన ప్రహ్లాదునకు సాక్షాత్కరింప వలసినది లోకాభిరామ మయిన (అందరికీ అందమయిన) రాముని రూపము కాని, దంష్ట్రాకరాళ వక్త్రముతో చతుర్దశభువన వాసులకు మహాభయంకర మయిన నరసింహ రూపము కాదు. ఈ చోట త్యాగయ్యగారికి ''నల్లని వాడు పద్మన యనంబుల వాడు'' అనే అతి మనోహరమయిన పోతనగారి పద్యం స్మరణకు వచ్చినది. వచ్చి 'చెలిమిని జలజాక్షు గంటే చెప్పరయ్యా మీరు'' అని ప్రహ్లాదునిచేత గోపికలు చేసిన కృష్ణాన్వేషణము చేయించారు త్యాగయ్యగారు. ఇక్కడ విమర్శకులకు ఒక సందేహము కలుగ వచ్చును. కృతయుగం నాటి ప్రహ్లాదునకు త్రేతాయుగం నాటి రామునిపై కాంక్ష ఏమిటి? క్రమభంగము కాలేదా ? అనే సందేహము. దీనికి సమాధాన మున్నది. '' అత్యంత భక్తి యుక్తానాం నశాస్త్రంనైవచక్రమః'' =మిక్కిలి ఎక్కువ భక్తి కలవారిని శాస్త్రము క్రమము నిర్బంధించవు'' అని. కనుక అత్యంత భక్తి యుక్తుడైన త్యాగయ్య గారు ఈ క్రమమును చూడరు. భక్తి భావ ప్రవాహంలో ఇవన్నీ కొట్టుకు పోతాయి. అదియును గాక కవి కాలము నాటి ఆ అవతారములు భూతకాలంలోనివి అయితే దోషము లేదు. అని శాస్త్రపు అభ్యనుజ్ఞ ఉన్నది. కాగా త్యాగయ్యగారు తమ ఆర్తిని ప్రహ్లాదుని యందారోపించి వివిధముగా భావములను ప్రకటించారు. తుదకు త్యాగయ్యగారు ఆ సముద్రములో ప్రహ్లాదునకు నిత్య సూరులతో కూడికొని యున్న శ్రీ వైకుంఠనాథుని దివ్యదర్శనమును కలుగ జేస్తారు.

ఇందు త్యాగయ్య గారు చేసిన ఇంకొక విశేషము. సముద్రమనగా శ్రీమన్నారాయణుని దివ్యధామము. ఇందు ప్రహ్లాదుడు చేరినాడు. ఇందు చేరిన వాడు ''న చపున రావర్తతే''=మరల తిరిగి భూలోకమునకు రాడు '' అనే వేద వాక్యము ప్రకారంగా ఒడ్డునకు తిరిగి పోలేదు. అందే నారాయణుని దివ్య దర్శనము పొందినాడు. ఇది ముక్తైశ్వర్యము. తాను కోరుకొనిన దిదియే. శాస్త్రజ్ఞానము ద్వారా ముక్తైశ్వర్యము నెఱిగినవాడు త్యాగయ్యగారు. కాని దీనిని తాననుభవించినట్లు చెప్పవచ్చును. కాని ఎన్నో యోగములు కలిగి ఎన్నో అడ్డములు తొలగితే కాని ముక్తైశ్వర్యము లభించదు. ఇది తాననుభవించినట్లు చెప్పుట కన్న ముక్తుడగు ప్రహ్లాదుని

ద్వారా పరిసమాప్తి చేశారు త్యాగయ్యగారు. ''శ్రీ వైకుంఠ ముపేత్య నిత్య మజడం తస్మిన్ పరబ్రహ్మణః సాయుజ్యం సమ వాప్య నందతి సమం తేనైవ ధన్య ః పుమాన్''=ధన్యుడగు వాడు శాశ్వతము జ్ఞానమయమునగు శ్రీ వైకుంఠమును చేరి, అందు పరబ్రహ్మ సాయుజ్యమును పొంది ఆయనతో కూడ ఆనందించును''= అనే వాక్యం ప్రకారముగా పరబ్రహ్మ సాయుజ్యమును కలిగించి ప్రహ్లాదుని కథ పరిసమాప్తం చేయుట జరిగినది. త్యాగయ్య గారు తమ భక్తి భావములను ప్రహ్లాదుని పాత్ర ద్వారా వ్యక్తం చేసిన అతిలోక సుందరమైన ప్రబంధము ''ప్రహ్లాద భక్తి విజయము''.

56. పరాళి = చాపు (నౌకా చరితములోనిది)

ప॥ ఇందు కేమి సేతు మమ్మ కృష్ణు-డెంతో మాట లాడెనమ్మ ॥ ఇందు॥

చ॥ మగువలంటే ఇంతవాదా? కృష్ణ - మానమే ప్రాణము గాదా ॥ ఇందు॥

2 గుసగుసలందేమి వచ్చు నిప్పు-డు సురుంటే ఊరుబోవచ్చు ॥ నిందు॥

3 వనితల గని ఎవ్వరైనా కృష్ణా - వంచనగా బల్క దగునా ॥ ఇందు ॥

4 హఠముసేయ వేళగాదు - ఆత్మ హత్యగాని వేరేలేదు ॥ ఇందు ॥

5 నగ్నముగా నిల్వవశమా కృష్ణా - నలుగురిలో నీకు యశమా॥ ఇందు ॥

6 నామాటలు విని మీరు వేగ - నను గట్టు జేర్ప బోనీరు ॥ ఇందు ॥

7 లలనల పాపము లేమో-యీ-లాగు వ్రాతలుండె నేమో॥ ఇందు ॥

8 వెలకు దీసిన వలపురాదు కాన - వెలదుల ఇక నమ్మరాదు ॥ ఇందు ॥

9 రాజన్య ! ఇటు లెంచ వలదు త్యాగ-రాజవినుత ! ప్రేమ గలదు ॥ ఇందు ॥

తాత్పర్యము :

ఇది త్యాగయ్యగారు రచించిన నౌకా చరితము లోనిది. సందర్భము. గోపికలు కృష్ణునితో కలసి యమునా నదిలో నౌకావిహారము చేయు చున్నారు. కృష్ణుడు తమ సౌందర్యమునకు వశుడైనాడు. అని గర్వము పొంది నారు. అప్పుడే వడగండ్ల వాన గురిసి నౌకకు రంధ్రములు పడినవి. మునిగి పోవుటకు సిద్ధమయినది. మీ రవికలు దీసి

నౌకారంధ్రములు నింపుడు అని కృష్ణుడు చెప్పెను. వారాపని చేసిరి. కాని రవికలు నదీ ప్రవాహములో కొట్టుకొని పోయినవి. గోపికలు కృష్ణుని రక్షింపుమని యమునను ప్రార్థించిరి. గాలి కూడ ఎక్కువయినది. అది కొంచెం తగ్గినది. కాని రంధ్రముల ద్వారా నీరు నౌకలోనికి వచ్చి మునుగుటకు సిద్ధముగా నున్నది. కృష్ణుడప్పుడు గోపికలారా! మీ చీరలు తీసి రంధ్రములు పూడ్చుడని చెప్పెను. ఒక పట్టాన గోపిక లంగీ కరించ లేదు. గోపికలకు కృష్ణునకు సంవాద మయినది. ఈ కృతి ఆ సంవాద రూపము.

పల్లవి

గోపికలు = అయ్యో ! ఇప్పుడేమి చేతుము. కృష్ణుడెంతో అవమాన కరముగ మాటలాడినాడు. ఓ కృష్ణా ! నీకు స్త్రీలంటే ఇంత చులకనా ?

చరణము

కృష్ణుడు = గోపికలారా ! గుసగుస లాడుతున్నారేమి ? జాగుచేసే సమయముకాదు. ప్రాణాలు దక్కితే మన ఊరు చేరుకోవచ్చు.

3 చరణము

గోపికలు = కృష్ణా! సమయము దొరికినది కదా ! అని వనితలమగు మాతో వంచన చేస్తూ మాటలాడ వచ్చునా ?

4 చరణము

కృష్ణుడు = గోపికలారా ! ఇది హఠమునకు (మొండి పట్టుదలకు) సమయముకాదు. హఠం చేస్తే మనకందరికీ ఆత్మ హత్యే అవుతుంది.

5 చరణము

గోపికలు = దిగంబరముగా నలుగురిలో నిలువబడ గలమా కృష్ణా! ఇట్టి సలహా ఇస్తే నీకు మాత్రము కీర్తియా ?

6 చరణము

కృష్ణుడు = గోపికలారా ! నా మాటలు మీరు వినరు. తొందరగా నన్ను గట్టుచేరనివ్వరు అయ్యో.

7 చరణము

గోపికలు= కృష్ణా! మే మాడవారమయిన పాపముచేత నీవు చెప్పిన పని చేయలేక పోతున్నాము. ఈ రోజున మాన భంగమో ప్రాణభంగమో వ్రాసి పెట్టి నట్లున్నది.

8 చరణము

కృష్ణుడు = ప్రేమ కొంటే వచ్చేది కాదు. నా మీద మీకు నిజమైన ప్రేమ లేదు. ఇక స్త్రీలను నమ్మకూడదు.

9 చరణము

గోపికలు = ఓ రాజకుమారా ! అట్లనకుమయ్యా. మాకు నీపై నిజమైన ప్రేమ కలదు. అని కృష్ణ గోపీ సంవాదము.

విశేషము = నౌకా చరితము భాగవతమందున్న గోపికా వస్త్ర పహరణమును దృష్టిలో నుంచుకొని త్యాగరాజు గారు రచించిన గేయనాటక ప్రబంధము. ఇతివృత్తము. గోపికలు కృష్ణుడు కలసి యమునా తీరమునకు వచ్చుట. వారికి యమునలో నవరత్న ఖచితమైన వెండి ఓడ కనిపించుట. గోపికలకు బాలకృష్ణుని ఒడ్డున వదలి తాము నౌకావిహారము చేయదలచుట. కృష్ణుడు తానును వత్తునని కోరగా గోపిక లంగీకరించుట. అందరును కలసి ఓడను జరపుట. నౌక సాగుతుంది. గోపికలకు గర్వ ముద్భవిస్తుంది. గర్వాలాపములు చేస్తూ ఉంటారు. అంతలో వడగండ్ల వాన ప్రారంభమై నౌక చిల్లులు పడుతుంది. ఓడ అల్లకల్లోలం అవుతుంది. నీటిలో మునుగ బోతుంది. కృష్ణుడు గోపికలతో వారి రవికలు తీసి ఓడ చిల్లులను నింప మంటాడు. వారట్లు చేసిరి కాని రవికలు కొట్టుకొని పోయినవి. కృష్ణుడు రంధ్రములు పూడ్చవలెను, మనము బ్రతుకవలెను అంటే మీ చీరలు తీసి నౌకా రంధ్రములు పూడ్చవలసినదే అని చెప్పుతాడు. ఎట్టకేలకు గోపిక లాపని చేస్తారు. అప్పుడు నౌక సురక్షితముగా ఒడ్డు చేరుతుంది. ఇది ఇతివృత్తము. దీని అంతరార్థమిది. గోపికలు జీవులు కృష్ణుడు భగవంతుడు. భగవంతుని లీల వలన జీవులు సంసారమున బడుదురు. సంసారము పెద్ద నదీ ప్రవాహము. దీనిని దాటవలె నంటే భక్తి కావలెను. కులశేఖరులు 'భక్తినావం ప్రయచ్ఛ = హేభగవన్ నేను సంసారమును దాటుటకు భక్తి అనెడు నావ నిమ్ము' అని ప్రార్థించిరి. దాని ప్రకారము భక్తి నావ. యమునలో కనపడిన వెండినావకు నవరత్నములు పొదగబడి యున్నవి. నవరత్నము లేమిటి? దేవునకు జీవునకును మధ్య నవ విధ సంబంధములున్నవి. పితాపుత్ర సంబంధము, రక్ష్యరక్షక సంబంధము, శేషి శేషసంబంధము, భార్య భర్తృ సంబంధము, జ్ఞాతృజ్ఞేయ సంబంధము, స్వస్వామి సంబంధము (సొత్తు సొంతదారుడు అనేది), ఆధార ఆధేయ సంబంధము, శరీర ఆత్మ సంబంధము అని తొమ్మిది సంబంధములు. భక్తి నంటిపెట్టుకొని ఈ నవవిధ సంబంధము లుండును. భక్తి నవలంబించి జీవులు సంసార ప్రవాహములో పయనించినచో ప్రవాహము దాటి అవ్వలి ఒడ్డు చేరుదురు. ఐహికము లయిన కామ క్రోధాదులను గాలితో కూడి శిలావర్షమై భక్తి అనెడి నౌకకు చిల్లులు పడును.

నౌకమునుగును. అప్పుడు భగవంతుని ఆజ్ఞను పాటిస్తే సురక్షితముగా జీవులు ఒడ్డు చేరుదురు. భగవానుడు 'సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ। అహంత్వాసర్వపాపేభ్యోమోక్షయిష్యామి మాశుచః' = అన్ని ధర్మములను పరిత్యజించి నన్నొకనిని శరణాగతి చేయుము. నేను నిన్ను సర్వపాపముల నుండి విడిపింతును' అని చెప్పినాడు. గోపికలు మొదట కొంచెం ఎదురు తిరిగినను తుదకు కృష్ణుని ఆజ్ఞను పాటించి (చీరలతో నౌకా రంధ్రములను పూడ్చి) శరణాగతి చేసి రక్షింపబడిరి. కృష్ణుడు గోపికలను రక్షింపదలచి ఒక సూచన చేసినాడు. దీనికి గోపికలు ఎదురు తిరిగినారు. ఇది శరణాగతి (ప్రపత్తిని) ధ్వంసము చేయును. అప్పుడు ముక్తిలేదు. ప్రపత్తియొక్క లక్షణమేమంటే భగవత్ప్రవృత్తినిరోధక స్వప్రవృత్తినివృత్తి అని శాస్త్రము. అనగా జీవుని రక్షించుటకు భగవంతుడు చేయు ప్రవృత్తిని అడ్డగించు తన ప్రవృత్తి లేకుండుట. తుదకు దీనివలన గోపికలు రక్షింపబడిరి. మరియు ఇంకొక విశేషము. ఈ నౌక, దానిలో విహారము సరే. గాలి శిలావర్షము భగవన్ (కృష్ణ) మాయా కల్పితములు. ఈ మాయను దాటవలెనన్నా కృష్ణ శరణాగతి (ప్రపత్తి) చేస్తేనే దాటుదురు. భగవద్వాక్యము. 'మమ మాయా దురత్యయా। మామేవయే ప్రపద్యంతే। మాయా మేతాంతరంతి తే' = నామాయ దాటరానిది. నన్ను ప్రపత్తి చేసినవారు దానిని దాటగలుగుదురు' అని. ఈ పరమార్థములను తెలుపుటకే త్యాగయ్యగారి నౌకాచరితమును రచించినది. ప్రహ్లాదభక్తి ప్రబంధమందు గోపికా భక్తి ననుభవించినారు. మరియు గోపికా భక్తిని శృంగార మనిరి. వేదాంత దేశికులు చెప్పినట్లు 'ఉచ్చావచై ర్విరహ సంగమజై రుదంతైః। శృంగారయంతి హృదయం గురవ స్త్వదీయాః' = ఆళ్వారులు వివిధ విధములుగా భగవంతుని తోడి విరహమును, సంయోగమును పొందినట్లు భావించుచు తమ హృదయమును శృంగార రసముతో నింపుకొన్నారు' అని. ఆలంకారికులు నవరసములలో శృంగార రసమునకు ప్రాధాన్యమిచ్చిరి. అందును విప్రలంభ (ఎడబాటు) శృంగారమునకు ప్రాధాన్యమిచ్చిరి. ఎందుకనగా విరహమునందు అనేక భావములు పుట్టును. అవి కవి చేతుల్లో రమ్యమగు రూపమును దిద్దుకొని కావ్యమున ప్రవేశించును. అట్టి కావ్యము సహృదయ హృదయా వర్జకమగును. ఈ ప్రబంధ మిట్టిది. త్యాగయ్యగారు రామునితోడి విరహమును, సంయోగమును భావించుకొని అనేక కృతులలో ఖేదా మోదములను పొందినారు. ఇది శృంగారము. ఇది నాయికా నాయకుల శృంగారమయితే సహజసుందరముగా నుండును. అయ్యగారి ప్రబంధమందు సహజ సౌందర్యము కొరకు గోపికా కృష్ణులతో కథ నడిపినారు. ఆలంకారికుల దృష్టిలో శృంగారము, కరుణరసమును ప్రధానములు. 'ఏకోరసః కరుణ ఏవ' అని కొందరు కరుణ రసమునకు ప్రాధాన్యమిచ్చిరి. అయ్యగారు నౌకా చరితమందు అంగరసముగా కరుణ రసమును కూడ ప్రవేశపెట్టిరి. ఇంకొక

విశేషము. ప్రహ్లాద భక్తి విజయములో నరసింహుని పేరు లేక రాముని పేరే ఉన్నది. నౌకా చరితములో అయ్యగారు రాముని పేరెత్తలేదు. ఏకపత్నీవ్రతుడగు రాముని పేరెత్తితే అనౌచిత్య దోషము కలిగి రసాభాసమగును. అయ్యగా రాపని చెయ్యలేదు. గోపికా వస్త్రాపహరణమందు కృష్ణుడు నిష్కారణముగా గోపికల వలువలు హరించుట జరిగినది. ఇందు ఆత్మ రక్షణము కొరకు చీరలతో నౌకా రంధ్రములు పూడ్చుడు అని చెప్పుటలో కృష్ణుని పాత్రకును కూడ అయ్యగా రుదాత్తత కూర్చినారు. దేహాభిమానము మొదలయిన ఆవరణములను తొలగించుట అనే పరమార్థము కామాది విజృంభణమందు శిలావర్షమును ఆరోపించుటచేత గోపికా భక్తిని త్యాగయ్యగారు తా ననుభవించినారు. ఇది ఆయనకు ప్రకృతోపయోగము. అందుచేత ఈ ప్రబంధమంతయును పరిణామాలంకారము చోటుచేసుకొన్నది. 'ఆరోప్యమాణస్య ప్రకృతోపయోగిత్వే పరిణామాలంకారః' = ఒకదానియందు ఇంకొకదాని భావము నారోపించినప్పుడు అది ప్రస్తుత విషయమునకు ఉపయోగించినప్పుడు అది పరిణామాలంకార మనబడును. అని అలంకార శాస్త్రము. అదీకాక చేసిన ఆ ఆరోపము వాచ్యముగా కాక (అనగా భక్తి అనే నౌక అని చెప్పక) వ్యంగ్యమర్యాద చేతనే ధ్వనింపచేయుట చేత ఇది ఉత్తమ ధ్వని కావ్యమయినది. ఇందు వస్తు ధ్వని, అలంకార ధ్వని కూడ నున్నవి. దృశ్యముగా కూడ నౌకా చరితమును ప్రయోగింపవచ్చును. ఇన్ని గుణములతో ఈ నౌకా చరితము అలరారుచున్నది.

57. భైరవి = ఆది

ప॥ ఉపచారములను – చేకొన వయ్యా॥ ఉరగరాజ శయనా ఉప॥

అ॥ చపలాకోటిని భాంబరధర శ్రీ–జానకీపతి! దయచేసినా॥ ఉప॥

చ॥ కపట నాటక సూత్రధారివై – కామిత ఫలమునొసంగే రామ॥
అపరిమిత నవరత్నములు పొదిగిన – అపరంజిగొడుగు నీకే తగునయ్య॥ ఉప॥

2 మెరవు తీగల రీతిని మెరిసే – కరకు బంగారు కాడలమరిన
శరదిందుద్యుతి సమానమౌ–చా – మరయుగములు నీకే తగునయ్య॥ ఉప॥

3 జాజులు సంపగులు మరువము విర – వాజులు కురువేరు వాసనలను వి
రాజమానమగు వ్యజనము త్యాగ – రాజవినుత నీకే తగునయ్య॥ ఉప॥

తాత్పర్యము :

ఉరగ రాజ శయనా! = సర్పములకు రాజయిన శేషునియందు శయనించు వాడా! నా ఉపచారములను స్వీకరింపవయ్యా! చపలా కోటి నిభ అంబర ధర! = కోటి మెరుపుతీగల వలె ప్రకాశించు వస్త్రమును ధరించువాడా! జానకీపతీ! దయచేసి ఉపచారములను స్వీకరించు జగన్నాటకము నాడించు సూత్రధారుడవై భక్తుల కోరిక లీడేర్చురామా! నవరత్నముల గొడుగు నీకే తగినది కనుక అర్పిస్తున్నాను. స్వీకరించు. మెరుపుతీగల వంటి కాడలు (చామరదండములు) కలిగి శరత్తులోని చంద్రునివలె తెల్లగానున్న చామరములను స్వీకరించు. అని ఉపచారములను సమర్పించుట అయినది.

విశేషము = సువర్ణ చ్ఛత్ర చామరములు నీకే తగునంటూ సమర్పించుట జరిగినది. ఎవని దేవునకు వాడు ఈ ఉపచారములను భావనారూపముతో అర్పిస్తాడు. ఇందు నీకే తగును అని చెప్పుచున్నారు. శ్రీ వైకుంఠమున శ్రీమన్నారాయణుని కీలాంఛనము లన్నియు నున్నవి. ఆయన అవతారము తన ఉపాస్యదైవమును అయిన శ్రీ రామునకును (పట్టాభిరామునకును) ఈ సువర్ణ చ్ఛత్రాది లాంఛనము లున్నవి. కనుక ఇవి నీకే తగునని విశేషించి చెప్పుట జరిగినది. మరియు శేషుని పడగల రత్నముల కాంతితో, నీవు ధరించిన బంగారు వలువ కాంతులతోను దిక్కులు ప్రకాశించుచున్నవి. అట్టి నీకే నవరత్నములు పొదిగిన బంగరు గొడుగు, బంగరు కాడల చామరములు తగినవి అనే అభిప్రాయము మనస్సున నుంచుకొని 'ఉరగరాజశయనా' 'చపలా కోటి నిభాంబర' అని సంబోధించుట జరిగినది.

58. భైరవి = రూపకము

ప॥ ఉపచారము జేసే వా-రున్నారని మరువకురా॥ ఉప॥

అ॥ కృపకావలె నని నేనీ - కీర్తిని బల్కుచునుండగ॥ ఉప॥

చ॥ వాకిటనే పదిలముగా - వాతాత్మజు డున్నాడని॥
శ్రీకరులగు నీతమ్ములు - చేరి యున్నారని॥
ఏకాంతమునను జానకి - ఏర్పడి యున్నదని॥
శ్రీకాంతా పరులేలని - శ్రీ త్యాగ రాజార్చిత॥ ఉప॥

తాత్పర్యము :

ఓ రామా! నీ సన్నిధిలో నీకేదో ఉపచారము చేస్తూ ఉండటము నాకు కావాలి. అయితే నీ సోదరులు, హనుమ, సీత నీకుపచారాలన్నీ చేసే వారున్నారు. నేను నీ కృప కావాలి అని కీర్తిస్తూ ఉన్నాను. నన్ను మరువకు. ద్వారంలో హనుమ ఉన్నాడు. సంపత్కరులయిన తమ్ములు నిన్ను చేరే ఉన్నారు. ఏకాంత మందిరములో ఏకాంత సేవకు సీత ఉన్నది. నీకన్నియు సమకూరియున్నవి ఇంక పరులెందుకు అని నన్ను మరువకు రామా! అని త్యాగయ్యగారు వేడుకొన్నారు.

విశేషము = అన్ని ఉపచారాలకు అందరూ ఉన్నారు. నీకృపకోసం నిన్ను అభ్యర్థిస్తూ కీర్తించేవారు లేరు. ఆ పని నేను చేస్తున్నాను. అది మరువకు. 'సతతం కీర్తయంతోమాం' = నన్నెప్పుడును కీర్తించువారు అనిగీత చెప్పిన ప్రకారం నేను కీర్తిస్తున్నాను. భరతాదులెవరికిని కృప కావలెనని కీర్తిని పల్కు అవసరము లేదు. వారు నీ సన్నిధి సేవ కలిగిన పరిపూర్ణులు. నిత్యానంద పూర్ణులు. వారికి దుఃఖము లేదు. పరుల దుఃఖమును తీర్చికలుగు శక్తిని 'కృప' అందురు. అది నీ గుణము. అది కావలసినది నాకు. కృపను కోరి కీర్తించు భక్తుడను నేను. 'అహం స్మరామి మద్భక్తం' = నేను నా భక్తుని స్మరించెదను' = అని నీవు మాట ఇచ్చి ఉన్నావు. అదియును గాక వాల్మీకి నిన్ను 'కృతజ్ఞ స్సత్యసంధశ్చ' = రాముడు కృతజ్ఞుడు (ఒరులు చేసిన మేలును మరవని వాడు) అని నిన్ను గూర్చి చెప్పినాడు. భరతాదులు చేసే ఉపచారములు అప్పటి కప్పుడు తీరిపోయేవి. నేను చేసే నీ కీర్తిగానము శబ్దరూపముగా నిత్యమై నిలచి యుండునది. కనుక ఈనా సేవను మరువకయ్యా! అని వేడుకొన్నారు త్యాగయ్యగారు. 'వాకిటనే పదిలముగా వాతాత్మజుడున్నాడని' దీనికి ఆకరము రామ రహస్యోపనిషత్తు. హనుమంతుడు వాకిలి గాచిన సందర్భములేదు. ఏరామ స్తోత్రములోనూ లేదు. రామరహస్యోపనిషత్తులో హనుమంతుడు సీతారాములను మందిరమున నుంచి తాను వాకిలి కాచుచు సీతారాముల ఏకాంతమునకు భంగము కాకుండా తాను పదిలముగా కాపలాకాయునట. సీతారామ దర్శనమునకై ఎవరయినా వస్తే వారు ఇహలోక సుఖ కాముకులైతే వాటిని తానే ఇచ్చి పంపునట. మోక్షకాముకు లైతేనే అది తానిచ్చునది కాదు అని లోపలకు పంపునట. త్యాగయ్యగారు ఈ రామరహస్యోపనిషత్తును మనస్సున నుంచుకొని యుందురు. త్యాగయ్యగారి కృతులలో ఇట్లు వ్యాఖ్యానింప దగిన కృతులున్నవి.

59. ఘంటారాగము = చాపు (నౌకాచరితము లోనిది)

ప॥ ఉన్నతావున నుండనియ్యదు వాన – ఉరుములైతే వెనుక తియ్యదు॥ ఉన్న॥

చ॥ నుడిగాలి యోడజుట్టి – వడిగా వానలైతే చుట్టి॥ ఉన్న॥

2 ఓడలో రంధ్రము గలిగెయీ–యువిదల కెవ్వరు సలిగె॥ ఉన్న॥

3 కనుల కెందుగాన రాదగు గతి–కాలింది మనకిక మీదు॥ ఉన్న॥

4 మతిపోవుదారి జనిరమ్మా అపుడె – మదమింత వలదంటిమమ్మా॥ ఉన్న॥

5 మన మొక్కచోగూడ రాదు ప్రళయ–మన నిదిగా వేరులేదు॥ ఉన్న॥

6 రాజవదనలు రారమ్మా త్యాగ–రాజ సఖుని జూడరమ్మా॥ ఉన్న॥

తాత్పర్యము :

నౌక బయలుదేరినది. రంధ్రములు పడినవి. ఓడ గాలికి ఊగిపోవుచున్నది. అప్పుడు గోపికల భావము లిట్లున్నవి. అయ్యో! ఈ వాన నావను ఉన్నచోట నుండనిచ్చుటలేదు. ఉరుములు వెనుకబడుటలేదు. సుడిగాలి ఓడను చుట్టివేయుచున్నది. ఓడకు చిల్లులు పడినవి. ఈ స్త్రీలపై ఎవరికి అలుక (కోపము) కలిగినది? కనులకు దారి కనపడుటలేదు. ఇకమనకు యమునా నదియే దిక్కు. ఏమియు నాలోచింపక బుద్ధికి తోచిన రీతిగా బయలుదేరినాము. ఇంత మదము పనికిరాదు కదా! స్త్రీలము మనమొక్కచోట కూడ గూడదు. ఇప్పుడు ప్రళయము వచ్చిపడినది. ఓ చంద్రముఖులారా! కృష్ణుడెక్కడున్నాడో చూడండి' అని గోపికలు వాపోవుచున్నారు.

విశేషము = పై వాక్యము లన్నియు ఏ ఒక్క గోపికవి కావు. ప్రతిగోపికయు ఈ కలిగిన ఆపదకు తాను కారణముకాదు. తక్కినవారు అని భావించుచున్నది. ఇదిలోక సహజము. ఏదయినా ఆపద కలిగినప్పుడు ప్రతివాడును 'నేనప్పుడే చెప్పానుగదా' అని అంటాడు ఏమీ చెప్పక పోయినా, ఇక్కడా అదే జరిగింది. 'స్త్రీ బుద్ధిః ప్రళయంకరీ' = 'స్త్రీల బుద్ధి ప్రళయమును కలిగించును'. 'మగువలు పలువురు గూడిన సుగుణాకర పట్టపగలె చుక్కలు పొడుచున్' అనే సామెతలను కూడ త్యాగయ్యగారు మనసున నుంచుకొని ఆమాటలను గోపికలతో అనిపించారు.

60. హరికాంభోజ = రూపకము

ప॥ ఉండేది రాముడొకడు – ఊరక చెడిపోకుమనస॥ ఉండేది॥

అ॥ చండమార్తాండ మధ్య–మండలమునను చెలంగుచు॥ నుండేది॥

చ॥ తామసాది గుణరహితుడు – ధర్మాత్ముడు సర్వసముడు॥
క్షేమకరుడు త్యాగరాజ–చిత్తహితుడు జగమునిండి॥ ఉండేది॥

తాత్పర్యము :

ఉండేది రాముడొక్కడే అని నమ్మియుండు మనసా! ఈ నమ్మకము లేక ఊరికే చెడిపోకు. వేయికిరణములతో భయంకరముగా ప్రకాశించే సూర్యమండల మధ్యమందు ప్రకాశిస్తూ ఉండే రాముడొక్కడే ఈ జగత్తంతా నిండి ఉన్నాడు. తమోగుణమువంటి గుణములులేనివాడు, ధర్మ స్వరూపుడు. వీడు శత్రువు వీడు మిత్రుడు అనే భేదములేని సర్వసముడు. భక్తులకు క్షేమములు కలుగజేయువాడు. త్యాగరాజు మనస్సునకు హితమైనవాడు. అట్టిరాముని ఒక్కని నమ్మితే నీవు చెడిపోవు అని అయ్యగారిచ్చిన సందేశము.

విశేషము = 'ఉండేది రాముడొకడు' అనే వాక్యము 'ఏక మేవాద్వితీయం బ్రహ్మ' బ్రహ్మము ఒక్కటే రెండవది లేనిది' అనే వేదవాక్యమును గుర్తుకు తెచ్చుచున్నది. కొందరి మతమున శుద్ధ చైతన్య మాత్రమగునది పరబ్రహ్మము. అది నిష్క్రియము, నిర్గుణము, నిర్విశేషము. విష్ణువు మొదలయిన దేవతలు పరబ్రహ్మవాచ్యులు కారు. విష్ణువు సాక్షాత్ పరబ్రహ్మము కాడు. తత్ప్రతి బింబము మాత్రమే అని. కొందరి మతమున నారాయణుడే పరబ్రహ్మము. సత్, బ్రహ్మ, మొదలయిన శబ్దములు నారాయణునే తెలుపునవి. 'ఏక మేవా ద్వితీయం బ్రహ్మ' = బ్రహ్మము ఒక్కటే. 'సదేవ సోమ్య' = సోమ్యుడా! సమస్త సృష్టికి ముందు బ్రహ్మ మొక్కటే ఉన్నది'. ఇత్యాది వేదవాక్యము లన్నియు జగత్కారణాది గుణములు కలిగి సవిశేషుడయిన నారాయణునే తెలుపును. నారాయణుని అవతారములయిన రామకృష్ణాదులకును నారాయణుని విశేషము లన్నియు వర్తించును అని. త్యాగయ్యగారి దీమతము. అందుచేతనే 'ఉండేది రాముడొకడు' అన్నారు. మరియు 'ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణః' అని వైదికులందరును అనుసంధానము చేయు ప్రకారముగా నారాయణుడు సూర్యమండలమధ్యమున వెలుగువాడు. రాముడు నారాయణావతారమే కనుక 'చండమార్తాండ మధ్యమండలమున వెలుగువాడు రాముడు' అని చెప్పిరి. 'తామసాది గుణరహితుడు' అనుదాని వివరము. భగవానుడు

నిర్గుణుడు అనుదానికి నిర్గుణుడనగా హేయగుణములులేనివాడు అని రామానుజా చార్యుల వ్యాఖ్య. 'తామసాది గుణరహితుడు' అనేది ఆవ్యాఖ్య ననుసరించినది. ధర్మాత్ముడు, సర్వసముడు, క్షేమకరుడు అనే విశేషణములు కల్యాణ గుణములు గలవాడు అని సగుణ పరబ్రహ్మముగా శ్రీరాముని త్యాగయ్యగారు కీర్తించినారు. త్యాగరాజచిత్తహితుడు అనగా త్యాగరాజు హృదయమున నుంచబడిన వాడు. అని అర్థము.

61. శహన = చాపు

ప॥ ఊరకే గల్గునా రాముని భక్తి॥ ఊరకే॥

అ॥ సారెకు సంసారమున జొచ్చి-సారమని ఎంచువారి మనసున॥ ఊరకే॥

చ॥ ఆలుసుతులు చుట్టాలు వరసద-నాలు కాయబలాలు కనకధ
నాలు కలవిభవాల కని అస్థి-రాలనే భాగ్యశాలురకు గాక॥ ఊరకే॥

2 మంచివారిని పొడగాంచి సంతతము సే-వించి యామన వాలకించ యాదరిసా
ధించి సర్వము హరియంచు దెలిసి భా-వించి మదిని బూజించువారికి గాక॥ ఊరకే॥

3 రాజసగుణ యుక్త పూజలనొనరించ - కాజసన్నుత! త్యాగ రాజుని జిహ్వాపై
రాజిల్లు వరమంత్ర రాజమును స-దా జపించే మహారాజులకు గాక॥ ఊరకే॥

తాత్పర్యము :

రామభక్తి ఊరకే కలుగునా? కలుగదు. పునర్జన్మ కారణములయిన పనులుచేసి సంసారమున ప్రవేశించి ఇదే సారమనుకునే వారికి రామభక్తి కలుగునా? ఐహికములయిన సంపదలు అన్నియు అల్పములు అస్థిరములు, దేహబంధువులందరు ఆభాస బంధువులు (బంధువులవలె కనపడువారు) అని తలపోసే భాగ్యశాలురకు గాక రామభక్తి ఇతరుల కబ్బునా? సత్పురుషులను సేవించి, వారి ఉపదేశములను విని, ఆ మార్గమును సాధించి, తమకు సమస్తమును హరియే అని భావించి పూజించని వారికి రామభక్తి కలుగునా? ఓ అజసన్నుతా! = బ్రహ్మచే నుతింపబడువాడా! రాజసగుణములతో చేసే పూజలు చేయకుండా పరమశివుని జిహ్వాగ్రమున నర్తించే రామతారక మంత్రమును జపించేవారికి కాక రామభక్తి ఇతరుల కబ్బునా? అని త్యాగయ్య గారు రామభక్తియొక్క దుర్లభత్వమును చెప్పినారు.

విశేషము = 'శ్లో॥ జన్మాంతర సహస్రేషు। తపోయాగక్రియాదిభిః। నరాణాం క్షీణ పాపానాం। కృష్ణే భక్తిః ప్రజాయతే' = వెనుకటి వేయి జన్మలలో చేసిన తపస్సు యాగములు మొదలయిన వాటి ప్రభావము చేత పాపక్షయమైన నరులకు కృష్ణభక్తి పుట్టును. అని శాస్త్రము. దీనినే అయ్యగారు వివరించి భంగ్యంతరముగా చెప్పిరి. దేహబంధువులు అర్థకామములకై నరుని చుట్టుచేరి తమపనులు నెరవేర్చుకొని నరుని అధోగతికి కారకులు. భగవంతుడు మాత్రము నిరుపాధికబంధువు. అనగా ఏవంక ఏకారణమునులేని స్వతస్సిద్ధ బంధువు. ఇది తెలిసిన వారికి రామభక్తి కలుగును. 'సుదూరమపిగంతవ్యం। యత్ర భాగవతాఃస్థితాః' = ఎచ్చట సత్పురుషులు (భాగవతులు) ఉందురో అది చాలా దూరమయినను దర్శింపదగినది' అనెడి శాస్త్రముచేత వారిని సేవింపవలెను. వారి మాటలను వినవలెను. వారి మార్గమున నడువవలెను. అట్టివారికే రామభక్తి కలుగును. నరులు ఆయా ఫలములను కోరి ఈ పూజలను మేమే చేయుచున్నాము. వీని ఫలము మాకే చెందవలెను. అనే భావముతో చేస్తే అది రాజసగుణయుక్త పూజ అగును. అట్లుకాక భగవత్కైంకర్య రూపములుగనే పూజలు చేయవలెను. ఈ పూజల కర్త, ఫల భోక్త భగవానుడే అని భావించి 'కాయేన వాచా.... ఇత్యాది.... నారాయణాయేతి సమర్పయామి' = త్రికరణ శుద్ధిగా నేను జేయునది అంతయును భగవంతునకే అర్పించుచున్నాను' అనే అధ్యవసాయము కలిగి భగవంతునకే ఫల సమర్పణము చేస్తే అది సాత్వికగుణ పూజ అగును. ఇది చేసిన వారికే రామభక్తి కలుగును. అని అన్వయ వ్యతిరేకముల ద్వారా త్యాగయ్యగారు సదుపదేశము చేసిరి. అన్వయ మనగా ఇట్టివారికి రామభక్తి కలుగును, అని చెప్పేది. వ్యతిరేకమనగా ఇట్టివారు కానివారికి రామభక్తి కలుగదు అని చెప్పేది. ఇట్లు త్యాగయ్యగారి కృతుల సంపుట మంతయు ఒక ధర్మసముచ్చయ మని చెప్పవచ్చును.

62. ఆహిరి = త్రిపుట

ప॥ ఎటుల కాపాడుదువో శ్రీరామచంద్ర! న॥ నెటుల॥

అ॥ ఎటుల కాపాడుదు - వో రఘువీర
మటుమాయ సంసార-మందు దగిలిన న॥ నెటుల॥

చ॥ అనుదినమును దార-తనయవర్గముల పా
లనము సేయుట కొరకు - ధనములు గలిగిన
మనుజుల బాడి ఆర్జిం-చిన పైకముల జూచి
తనకు సరిలేదని బిగు-వున దిరిగిన న॥ నెటుల॥

2 కాయజ జనక నా- ప్రాయము లెల్లను
మాయాపూరితులైన- దాయాదుల చేత॥
సాయ పర్యంతము- కాయక్లేశము జెంద
నాయెనుగాని మౌని- ధ్యేయ! నిను దెలియని న॥ న్నెటుల॥

3 సత మని బాంధవుల - జతను నమ్మి మదికి
హితవు లేక యో- పతిత పావన! సం
తతము త్యాగరాజ- హిత! సురనికర పూ
జిత! నిన్నే శరణు జొ- చ్చితిగాని రామ! న॥ న్నెటుల॥

తాత్పర్యము :

ఓ రామచంద్రా! రఘువీర! ఈ మాయ సంసారములో చిక్కుకొనిన నన్నెట్లు కాపాడెదవో? ప్రతిదినమును భార్యాపుత్రుల పోషణము కొరకు ధనమదాంధుల నాశ్రయించి వారి వలన ధనమును సంపాదించి నేను ధనమదాంధుడనయినాను. నన్నెట్లు కాపాడెదవో? ఓ కాయజ జనకా! = మన్మథ జనకా! నా ప్రాయమంతయు మాయావులైన దాయాదులకు చిక్కి సాయంకాలము వరకు శ్రమించటమైనది. నిన్ను తెలుసుకొనే క్షణమే చిక్కలేదు. నన్నెట్లు రక్షించెదవో? ఓ పతితపావనా! సుర నికర పూజిత-దేవతా సమూహములచే పూజింపబడిన వాడా! త్యాగరాజ హితుడా! బంధువుల జతయే శాశ్వతమని నమ్మి మనస్సుకు సుఖం లేకుండా పోయినది. ఇప్పుడు నిన్నే శరణు జొచ్చినాను. కాని ఎట్లు కాపాడెదవో? అని ఒక విచికిత్స!

విశేషణము = త్యాగయ్యగారు, భగవంతుడు తనను కాపాడుటకు అడ్డుపడే కొన్ని దోషములను తనయం దారోపించుకొని ఇట్టి దోషిని నన్నెట్లు కాపాడెదవో అని వ్యధ పడి తుదకు భగవంతుడు తనను కాపాడుటకు హేతువుగా నిన్నే శరణు జొచ్చితిని' అనిరి. కాని ఎట్లు కాపాడెదవో అన్నారు. అన్ని దోషములకు ఈ శరణాగతి గొడ్డలి పెట్టు వంటిది. ఇప్పుడు ఎలా కాపాడుకుంటావో నీ సొత్తును అని ఆత్మార్పణము చేసిన భరోసా. భాగవతుల నివేదనము లిట్లే యుండును. యామునాచార్యులనెడి మహాభక్తుడు తమ 'స్తోత్రరత్న' మను గ్రంథమున ప్రథమ నివేదన మిట్లున్నది. 'న ధర్మనిష్ఠోస్మి నచాత్మవేదీ। న భక్తిమాం స్త్వచ్చరణారవిందే। అకించనో నన్యగతి శ్శరణ్య। త్వత్పాదమూలం శరణం ప్రపద్యే' = ఓ శరణ్యుడా! నేను ధర్మనిష్ఠుడను గాను. ఆత్మ జ్ఞానిని గాను. నీపాద భక్తి కలవాడను కాను. కాని నీ శరణాగతుడను అని, లోపములు దోషములు తనవి ముందు విన్నవించి చివరకు శరణాగతుడనని, ఒక్క ముక్కతో భగవంతుని వశపరచుకొనుట. ఇది విజ్ఞాపన మర్యాద అని తోచుచున్నది.

63. చక్రవాకము = త్రిపుట

ప॥ ఎటుల బ్రోతువో తెలియ–దే కాంతరామయ్య॥ ఎటుల॥

అ॥ కటకట నాచరితము–కర్ణ కఠోర మయ్య॥ ఎటుల॥

చ॥ వట్టి గొడ్డురీతి – భక్షించి తిరిగితి
పుట్టులోభుల నెల్ల–పొట్టకై పాగడితి
దుష్టులతో గూడి–దుష్కృత్యములు సలిపి
రట్టుబడిన త్యాగ–రాజుని దయతో॥ ఎటుల॥

తాత్పర్యము :

తాత్పర్యము సులభమే. మళ్లీ తన దోషములను కొన్ని ఏకరువు బెట్టి ఎట్లు రక్షింతువో తెలియదు. అని.

విశేషము = ఏకాంత రామయ్య అనగా బాగా దగ్గర అయినవాడా! అని భావము. భగవంతుని భక్తులలో రెండు విధముల వారున్నారు. భగవత్పూజాది విధులను భగవదాజ్ఞ అని చేయువా రేకాంతులు. వాటిని భగవన్ముఖోల్లాసకరములని చేయువారు పరమైకాంతులని శాస్త్రమున్నది. మరియు తల్లిదండ్రుల శయన మందిరములో చనుబ్రాలు ద్రావు బాలుడు ఏకాంతుడు. ఆ బాలునికి తలితండ్రులకు కల సంబంధము ఏకాంతము. త్యాగయ్యగారు తనకును రామునకు ఆ సంబంధమును భావించి 'ఏకాంత రామయ్య' అని సంబోధించినారు. మరియు 'ఏకాంతీ వ్యపదేష్టవ్యః। నైవగ్రామ కులాదిభిః। విష్ణునా వ్యపదేష్టవ్యః' = ఏకాంత భక్తుని అతని గ్రామముతో గాని కులముతో గాని ఇంటిపేరుతో గాని పేరుతో గాని వ్యవహరింపకూడదు. విష్ణుసంబంధముతో వ్యవహరింపవలెను' అని శాస్త్రము. రామదాసు, పురందరదాసు, నారాయణ తీర్థులు అనే వ్యవహారము పై శాస్త్రమును బట్టి వచ్చినవే. త్యాగయ్యగారట్టి ఏకాంతి స్థితిని కోరుకొన్నారని చెప్పవచ్చును.

64. శ్యామ = చాపు

ప॥ ఎటులైన భక్తి వ–చ్చుటకే యత్నము సేయ–వేమనసా॥ ఎటు॥

అ॥ మటుమాయ భవమును–మనదని యెంచక
వటపత్ర శయనుని – పాదయుగము నందు॥ ఎటు॥

చ॥ విద్యాగర్వము లేలే నీ వ-విద్యావశముగా నేలే
ఖద్యోతాన్వయ తిల-కుని పురమేలే
బుద్ధ్యాశున తోచదేలే - ఓ మనసా॥ ఎటు॥

2 రామనామము సేయ సిగ్గా? కా-రా-దేమి పుల్కవు పుంటిబుగ్గా?
భామల కడదాటకుమంటే జగ్గా-పామరతనువు నమ్మ నీర్బుగ్గా?॥ ఎటు॥

3 భోగ భాగ్యముల యందు నిజ-భాగవతులుగాని పొందు-రోసి
త్యాగరాజవరదుని నీయందు-బాగుగ ధ్యానించు-భవరోగమందు॥ ఎటు॥

తాత్పర్యము :

ఓ మనసా! నీవు ఏ విధముగా నైనాసరే రామభక్తి అబ్బటానికి ప్రయత్నించు. ఈ మాయ సంసారమును నీది అని భావించకు. వటపత్రశాయి పాదభక్తిని ఎట్లయినా సాధించుకో. నాకు విద్యవచ్చినదని గర్వము చెందకు. అవిద్యకు (అజ్ఞానమునకు) వశముకాకు. ఖద్యోత అన్వయ తిలక పురము = సూర్య వంశమందు శ్రేష్ఠుడైన రాముని పురము (అయోధ్య) దానిని ఏలే బుద్ధి (పరిపాలించే బుద్ధిని) తొందరగా అవలంబించు. రామనామం చెయ్యటానికి సిగ్గా? అట్లు కారాదేమి = అట్లు సిగ్గుపడకూడదేమీ! (అని జాతీయమగు పలుకుబడి) ఏమీ పడకూడదు అని. పల్కవు. రామనామమును పల్కవు పుంటిబుగ్గా? నోటికిపుండా? భామలను కడదాటకుమంటే అతిక్రమించవద్దు అంటే జగ్గా?= మెరిసిపోవుటా? (కాని ఇది అన్వయించుటలేదు). పామరతనువు = అజ్ఞాన పూరితమయిన ఈశరీరము. నీర్‌బుగ్గ = నీటి బుడగ వంటిది. నీటి బుడగ ఇప్పుడు కనిపించి వెంటనే పోవును. ఈ శరీరము ఇట్టిదే. ఇక్కడ బుగ్గా అని దీర్ఘము కాదు 'బుగ్గ' అని హ్రస్వము. (పాటలో దీర్ఘమగును అంతే). భోగభాగ్యములమీద, భాగవతులు కానివారి చెలిమి మీద రోత పుట్టవలెను. ఓ మనసా! త్యాగరాజవరదుడగు రాముని నీలో ధ్యానించు. అదే సంసారమనే రోగమునకు మందు.

విశేషము = ఖద్యోతనాన్వయ తిలకుని పురమేలే బుద్ధి ఆశున తోచదేలే? రాముని పురమేలే బుద్ధి అయోధ్యనేలే బుద్ధి. అనగా తానే రాముడయి అయోధ్య నేలుట. ముక్తుడయి వైకుంఠమును పాలించుట అని అర్థము. 'దేవానాంపూ రయోధ్యా' దేవతల పుర మయోధ్య అని, అదీ వైకుంఠమని ప్రమాణమున్నది. దీనికి మరొక ప్రోద్బలక మున్నది. వాల్మీకి రామాయణములో అటవీ ప్రయాణమునకు ముందు లక్ష్మణునకు సుమిత్ర చేసిన ఆశీర్వచనశ్లోకము 'రామందశరథం దిద్ధి। మాం విద్ధి జనకాత్మజాం। అయోధ్యా మటవీం విద్ధి' = ఓ లక్ష్మణా రాముని విష్ణువుగా తెలుసుకో. సీతను లక్ష్మిగా

తెలుసుకో. అరణ్యమును వైకుంఠమునుగా తెలుసుకో. అనగా లక్ష్మీనారాయణులు ఎక్కడ ఉంటే అదియే వైకుంఠమని అంతరార్థముగా వ్యాఖ్యానము చేసిరి. అందుచేత అయోధ్య అంటే వైకుంఠము, దాని నేలుట అంటే ముక్తుడగుట. వైకుంఠము నేలువాడు నారాయణుడు. ముక్తుడయినవాడు నారాయణ సాయుజ్యము పొందుట చేత ఆయన అధికారములు కొన్ని ముక్తునకు సంక్రమిస్తాయి అని శాస్త్రము. దీనిని బట్టి వైకుంఠమేలుట అని అయ్యగారు అన్నారు. 'భామల కడదాటకు మంటే' అన్యభామలను కోరవద్దు అనే భావము కావచ్చును. ఒక చిత్రమున్నది. అరవ భాషా ప్రబంధములలో విష్ణువును కాక దేవతాంతరములను ఆశ్రయించితిని అనుటకు సంకేతముగా 'మడవారయు మున్నెలాం' = పరకాంతలను కోరితిని. అని అనుటకద్దు. త్యాగయ్యగారి పై మాటకు ఆ భావము చెప్పవలెనా? కాక వివాహమునందు వరునిచేత 'నాతిచరామి' = ధర్మార్థ కామముల యందు నేను ఈ వధువును అతిక్రమించను అని ప్రతిజ్ఞచేయిస్తారు. ఆ ప్రతిజ్ఞను మీరవద్దు అని భావమా? పైన పేర్కొన్నవాటిలో ఏదైనా కావచ్చును. త్యాగయ్యగారి కృతులలో అక్కడక్కడ ఇట్టి గ్రంథగ్రంథులున్నాయి. ఏదో దాటవేయుట నా పద్ధతి కాదు. రాముని 'బాగుగ ధ్యానించు భవరోగమందు' ధ్యానమే 'భవరోగమందు' సంసారరోగమునకు మందు అని దుష్టసమాసము చేసి చెప్పుటకంటే భవరోగమందు = సంసారరోగమునందు అని సప్తమీ విభక్తి అర్థమును చెప్పుటమేలు.

65. వసంత = ఆది

ప॥ ఎట్లా దొరికితివో రామ తన॥ కెట్లా॥

అ॥ చుట్లా రగడియ దోవకు నాదు–పట్లాభిమానము లేకుండగ॥ ఎట్లా॥

చ॥ పాదమహిమో పెద్దలాశీ–ర్వాద బలమొ సుస్వరపు
నాదఫలమొ త్యాగరాజ–ఖేద హర! శ్రీనాథ! తన॥ కెట్లా॥

తాత్పర్యము :

ఓ రామా! చుట్టుపట్ల గడియసేపు నడిచేవరకు నాపట్ల అభిమానము చూపే వారెవరు లేరు. ఇట్టిస్థితిలో నీవు నాకు ఎట్లా దొరికితివయ్యా! ఆహా! నీ పాదముల మహిమో? పెద్దల ఆశీర్వాద బలమో సుస్వరముతో నిన్ను గానము చేసిన ఫలమో? ఓ శ్రీనాథా! నా ఖేదమును హరించు నీవు దొరికితివి. అని త్యాగయ్యగారు రామానుగ్రహమును ఉగ్గడించిరి.

విశేషము = ఈ సంసారమును భక్తులు రోయుచుందురు. ఎటు చూచినా ఇందులో ఎవరు అభిమానులు కనపడరు. ఇది అంతయు ఒక ఎడారిగా తోచును. ఇట్టి స్థితిలో దైవధ్యానమే వారికి పెన్నిధి అగును. దాని వలన భక్తులు ఖేదమును పోగొట్టుకొని ఆనందమను భవింతురు. కులశేఖరులు తమ ముకుందమాలలో 'కరచరణ సరోజే కాంతి మన్నేత్రమీనే। శ్రమముషి భుజ వీచి వ్యాకులే గాధ మార్గే। హరి సరసి వగా హ్యాపీయ తేజో జలౌఘం। భవమరుపరిఖిన్నఃఖేద మద్య త్యజామి॥' = ఈ సంసారమను ఎడారిలో నేను శ్రమ చెందినవాడనై ఇప్పుడు హరి అనెడు సరస్సులో స్నానము చేసి ఆయన తేజస్సనెడి జలమును పానము చేసి ఖేదనమును పోగొట్టుకొనుచున్నాను'. అనిరి. త్యాగయ్యగారి ఈ కీర్తనలోని భావ మిట్టిదే.

66. శంకరాభరణము = ఆది

ప॥ ఎదుట నిలచితే నీదు సామ్మ – లేమి బోవురా

అ॥ నుదుటి వ్రాత గని మట్టు మీరను నా
తరము దెలిసి మోసపోదునా॥ ఎదుట॥

చ॥ సరాసరిగ జూతురా నా అవ–సరాల దెలియుము వరాలడుగజా
లరా సకలదేవరాయ! మనవి వి–నరా ఘహర! సుందరాకారనా॥ ఎదుట॥

2 విదేహజారమణ! దేవ! బ్రోవగ–నిదే సమయ మన్యదేవతలవే
డదే మనసు తెలియదేమి రాఘవ – ఇదేటి శౌర్యము పదేపదేనా॥ ఎదుట॥

3 తరాన దొరకని వరాకు నాయెడ–ను రామ చేసితె సురాసురులు మె
త్తురా ఇపుడు ఈ హరామితనమే–లరా భక్త త్యాగరాజనుత! నా॥ ఎదుట॥

తాత్పర్యము :

రామా! ఒక్కసారి వచ్చి నీవు నా యెదుట నిలిస్తే నీ సొమ్మేమైనా పోతుందా? నా నుదుటి వ్రాత ఏమి ఉంటే అది ప్రాప్తిస్తుంది. మీతిమీరి నిన్నడిగి నీతో కాదనిపించుకొని మోసపోవుదునా? మోసపోను. నీవు ఎదుట నిలిచితే నిన్ను సూటిగా చూస్తాను. నా అవసరాలేమిటో నీవే తెలుసుకో. ఓ సకలదేవరాయా! సమస్త దేవతలకు ప్రభువయినవాడా! అఘహర! = పాపములను హరించువాడా! నేను వరాలడుగలేను. సుందరాకార = సుందరమయిన వాడా! విదేహజారమణ = సీతానాథుడా! నన్ను రక్షించుట కిదే సమయము. అన్యదేవతల వేడదే మనసు. వేడదుకదా మనస్సు అని.

ఇది నీకు తెలియదా ఏమి? ఓ రాఘవా! (భక్తులను ఏచుట) ఇదెట్టి శౌర్యము? మాటిమాటికి నాయెదుట నిలువుము. ఏతరంలోనూ లేని పరాకు నాపై చూపుచున్నావు. ఈ విధంగా చేస్తే నీవు, దేవతలు, రాక్షసులు కూడా నిన్ను మెచ్చరు. నాయెడల నీవు హరాము చేస్తున్నావు. హరాము అనగా సరిగా నడువక గుర్రము చేసే పెంకితనము. త్యాగయ్యగారు దానిని వాడిరి ఇచట.

విశేషము = భక్తులు భగవత్సేవ భగవద్దర్శనము మాత్రమే కోరుకుంటారు. వరాలు కోరరు. ఏమికోరుకోవలెనో వీరికి తెలియదు. ఏమీ కోరక నిర్భర వృత్తితో ఉంటే భక్తుల కేమి అవసరమో తెలిసిన భగవంతుడే వాటిని ప్రసాదిస్తాడు. అందుచేతనే కులశేఖరులు 'నాస్థా ధర్మే నవసునిచయే నైవకామో పభోగే' = నాకు ధర్మార్థ కామములయందు వాంఛలేదు. అవి ఎట్లు కావలసినవి అట్లు జరుగుతాయి' అని, 'త్వత్పాదాంభోరుహయుగ గతా నిశ్చలా భక్తిరస్తు' = నిశ్చలమైన నీ పాదభక్తి కావలెను' అంటారు. త్యాగయ్యగారీపరమార్థమునే ఇందు చాటినారు.

67. నీలాంబరి = ఆది

ప॥ ఎన్నగ మనసుకు రాని- పన్నగశాయి సొగసు
పన్నుగ కనుగొనని- కన్నులేలే కంటి మిన్నులేలే॥ ఎన్నగ॥

చ॥ మోహముతో నీలవారి – వాహకాంతిని గేరిన
శ్రీహరిని కట్టుకొనని- దేహమేలే ఈ గేహమేలే॥ ఎన్నగ॥

2 సరసీజమల్లీ తులసీ- విరవాజి పారిజాత
విరులచే పూజించని – కరములేలే ఈ కాపురములేలే॥ ఎన్నగ॥

3 మాలిమితో త్యాగరాజు – నేలిన రామమూర్తిని
లాలించి పొగడని – నాలికేలే సూత్రమాలికేలే॥ ఎన్నగ॥

తాత్పర్యము :

మనసులో ఊహించుటకు కూడ అందని పన్నగశాయి (శ్రీహరి) యొక్క సొగసును చూడని కన్నులేల? (వ్యర్థమని) కంటి మిన్నులు = పెద్ద బండి చక్రము లేల? (అవి యును వ్యర్థములని). మరియును నల్లని మేఘపు కాంతిని మీరిన శ్రీహరిని కట్టుకొనని ఈ దేహమేల? వ్యర్థము. ఈ గేహమేల? ఈ ఇల్లు వ్యర్థము. శ్రీహరిని తామర,

మల్లె, తులసీ, విరజాజి, పారిజాత పుష్పములతో పూజించని ఈ కరములేల? చేతులేల? ఈ కాపురములేల? అన్నియు వ్యర్థములు. త్యాగరాజు నేలిన శ్రీరాముని ప్రేమతో లాలించి పాగడని నాలుక వ్యర్థము. జప మాలిక వ్యర్థము. రామసేవకు కాని దేహము, సర్వేంద్రియములును వ్యర్థములని తాత్పర్యము. ప్రతివస్తువును ఏల అని చెప్పుచు ప్రక్కన ఇంకొ వస్తువును చెప్పుచు అవి కూడ వ్యర్థములని తాత్పర్యము.

విశేషము = ఈ కృతిలో 'కంటి మిన్నలేలే' అనుచోట శ్రీ వీరభద్ర శాస్త్రి గారు అర్థము కుదురుట లేదు కనుక 'కన్నెమిన్నలేలే' అని మార్చినాము అన్నారు. ఎందుచేతనో వారు భ్రమపడిరి. వారు మార్చినది సరిగా అతకదు అని నా అభిప్రాయము. ప్రకరణ విరుద్ధమది అని నా భావము. ఉన్నది అర్థరహిత మయితే మార్పు అవసరము. అదిలేదు. 'కంటిమిన్న' అంటే పెద్ద బండి చక్రము అని అర్థము చెప్పవచ్చును. అప్పుడు హరిని చూడని కన్నులు పెద్దబండి చక్రములవలె వ్యర్థము అని భావము. పోతనగారి పద్యము 'కంజాక్షునకు గాని కాయంబు కాయమే పవన గుంభిత చర్మ భస్త్రిగాక' అని. శ్రీహరి సేవకు కాని శరీరము శరీరమా? కాదు. మరేమి? పవన గుంభితచర్మ భస్త్రి = గాలి గొట్టిన తోలుతిత్తి' అని భావము. అట్లాగే ఈ త్యాగరాజ కృతిలో పన్నగశాయి సొగసు కనుగొనని కన్నులు బండిచక్రముల వలె వ్యర్థము అని అర్థము కుదురుచున్నది. కనుక మార్పు అనవసరము, ప్రకరణ విరుద్ధము. తరువాత శ్రీహరిని దేహమున కట్టుకొనుట అంటే ధ్యానాదులచేత వశపరచుకొనుట. 'భక్తివశః పురుషః' = భగవానుడు భక్తికి వశమగును' అని ఉనిషద్వాక్యము.

68. కళావతి = ఆది

వ॥ ఎన్నడు జూతునో – ఇనకుల తిలక ని॥ న్నెన్నడు॥

అ॥ పన్నగశయన – భక్తజనావన
పున్నమ చందురు – బోలు ముఖమ్మును॥ ఎన్నడు॥

చ॥ ధరణిజా సౌమిత్రి – భరతశత్రుఘ్న వా
నరయూధపతి–వరు డాంజనేయుడు
కరుణను ఒకరో–కరు వర్ణింప నా
దరణను బిలిచే నిను–త్యాగరాజార్చిత॥ ఎన్నడు॥

తాత్పర్యము :

త్యాగయ్య సపరివారుడయిన రాముని దర్శనము కొరకు తహతహ పడుచున్నారు. ఓ పన్నగ శయనా! భక్తజనావన! నిన్నెన్నడు చూతునో కదా! పున్నమచంద్రుని వంటి నీ ముఖము నెన్నడు చూతునోకదా! సీత లక్ష్మణుడు భరతుడు శత్రుఘ్నుడు సుగ్రీవుడు వరుడగు ఆంజనేయుడు వీరందరు కరుణతో ఒకరొకరు ముందుకు వచ్చి వర్ణిస్తూ ఉండగా పేరుపేరున వారినందరిని ఆదరణతో పిలిచే నిన్ను ఎన్నడు చూతునో కదా! అని ఆర్తిని ప్రకటించినారు ఆయ్యగారు.

విశేషము = రామావతారమునకు మూలకందమగు నారాయణుడు 'వైకుంఠేతు పరేలోకే। శ్రియాసార్ధం జగత్పతిః। ఆస్తే విష్ణు రచింత్యాత్మా। భక్తైర్భాగవతైస్సహ॥' = జగత్పతియగు విష్ణువు ఉత్తమమగు వైకుంఠలోకమున లక్ష్మీదేవితో నిత్యముక్తులగు భక్తులతో భాగవతులతో కూడి యుండును' అని చెప్పబడినది. రామావతారమందును అదే వైభవము. భరతలక్ష్మణాదులందరును కరుణతో వర్ణించుట ఏమి? భగవంతుని యందును భక్తునకు కరుణ ఉండును. కరుణ అనగా మిక్కుటమగు ప్రేమ. ప్రేమ లక్షణ మేమంటే 'ప్రేమ పశ్యతి భయాన్యపదేషు' = ఏ వస్తువుపైన ప్రేమ ఉండునో ఆ వస్తువుకు ఎట్టి కీడు కలుగునో అని నిష్కారణమగు భయము'. ఇది భక్తులకు భగవంతునిపై నుండుట చేతనే మంగళాశాసనము (ఆశీర్వచనము) చేయుదురు. 'రామభద్రాయ మంగళం'= ఈ రూపమే. ఆమంగళాశాసనము గుణ వర్ణనముతో కూడి యుండును. 'ఒకరొకరు వర్ణింప' అంటే ఇది. సుగ్రీవుడు వానరయూథపతి = సేనానాయకుడు మాత్రమే. వానరులలో వరుడు = శ్రేష్ఠుడు ఆంజనేయుడు. త్యాగయ్యగా రిది సూచించినారు. వరుడనగా ఎన్నుకొనబడినవా డని అర్థము. రాము డంగుళీయకము హనుమకే ఇచ్చినాడు. సముద్రతరణమునకు వానరులు హనుమనే ఎన్నుకున్నారు. రావణుడు ఇంతవాడెవడనును లేడని మెచ్చుకొన్నాడు. పట్టాభిషేకానంతరము రాము డందరిని పేరు పేరున పిలిచి బహుమతులిచ్చి తుదకు సీత కొక రత్నహారము నిచ్చి 'ప్రదేహి సుభగేహారం। యస్య తుష్టాసి భామిని!' = ఓ సీతా నీవు ఎవనిని చూచి సంతోషపడుదువో వానికి ఈ హారము నిమ్ము' అంటాడు. ఆమె హనుమ కా హారము నిచ్చినది. ఇన్నిటి చేత వరు డాంజనేయుడు' అని అయ్యగా రన్నారు. వీరందరిని రాముడు ఆదరణతో పిలుచుచున్నాడు. అట్టి ఆనందమయుడగు రాముని ఎన్నడు చూతునో అని. అంతకు ముందు సీతావియోగ స్థితి. తరువాత కూడ అట్టిదే.

ఈ పరివారముతో కూడినదే ఆనందమయస్థితి. పరమాత్ముడు కూడ 'స ఏకాకీ నరమేత' = అతడొక్కడుగా నుండి ఆనందింపడట. వైకుంఠము నందు సపరివారుడై ఆనందించుచున్నాడు. పట్టాభిరాముడు నంతే. అట్టి ఆనందరాముని దర్శనము నయ్యగారు కోరుచున్నారు.

69. కాపి = చాపు

ప॥	ఎన్నాళ్లు నీ దోవజూతు రామ-ఏమని నే ప్రొద్దు త్రోతు॥	నెన్నాళ్లు॥
చ॥	నీకేమనసిచ్చి నేను రామ-నీ మేనని పెంచినాను॥	ఎన్నాళ్లు॥
2	ధరను కర్మములను గోరి యుంటి-దలచు కొన్నది వేరే దారి	ఎ॥
3	అందరివలెనేనీ భువిలో బొమ్మ-లాట లాడుదుగాని మదిలో॥	ఎ॥
4	రామయ్య నలుగురిలోన నా-లో మర్మములు దెలుపవలెనా॥	ఎ॥
5	రసికులకే సరిపోను వట్టి-తనుకులకే హాస్యమౌను॥	ఎ॥
6	తొలిభక్తుల వద్ద కొలువో రావు-కలుగు ధనములకు సెలవో॥	ఎ॥
7	ఎందుకు ఇంక పరాకు రామ-ఇంక దప్పులు బెట్టబోకు॥	ఎ॥
8	ఎంతని రాల్తు కన్నీరు జాలి-ఎవరితో దెలిపితే తీరు॥	ఎ॥
9	తనకే పుట్టిన ఇల్లు నీవు - తప్పక నీ కృప చెల్లు॥	ఎ॥
10	ఆసించినదే తప్పా నీ-కాబుద్ధి వద్దు మా అప్పా॥	ఎ॥
11	కలిమర్మము తెలియలేని నా-వలె గలడా దీను డెందేని॥	ఎ॥
12	పలుమారు నిను దూరుకొంటి ఆ-ఫలము ననుభవించుకొంటి॥	ఎ॥
13	తొలికర్మము రాకపోనా భక్తి-వెలుగుచే దీరకపోనా॥	ఎ॥
14	పూలమ్మి బ్రతికిన వారు రామ-పుల్ల లమ్మ బిల్వరారు॥	ఎ ॥
15	ఆచులకన నీకు గాదా రామ-ఏచుబుద్ధి విడరాదా॥	ఎ॥
16	ఓ జగదీశ! ఖరారే త్యాగ-రాజ నీవాడని పేరే॥	ఎ॥

తాత్పర్యము :

ఇది 16 చరణముల కృతి. ఒక్కొక్క చరణము ఒక్కపంక్తి మాత్రమే. కొద్దిగా ఒక చరణానికి ఇంకొక చరణానికి లింకు కనపడుతుంది. వివరంగా సంఖ్యనిచ్చి వాటి భావములను వ్రాయుచున్నాను.

పల్లవి= ఎంతకాలము నీకై అన్వేషించెదను. ఏ అనుభవముతో కాలము గడిపెదను. (అన్వేషణ మాత్రము మిగిలి ఫలితము శూన్యమగు చున్నదని బాధ). చరణము= నీకేమనసిచ్చి నా శరీరము నీ శరీరమే అని దీనిని పెంచినాను. విశిష్టా ద్వైత మను సంప్రదాయము నందు ప్రకృతి లోనున్న ప్రతి జీవి దేహము, ఆత్మయును భగవంతుని శరీరమనిభావన. జీవునకు దేవునకు శరీర ఆత్మ సంబంధము కలదని, దాని ప్రకారము నా దేహము మనస్సు (ఆత్మ) నీ దేహమని పెంచితిని అని భావము.

2. '' నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మ కృత్'' = ఏజీవుడును ఏదో ఒక కర్మ చేయక క్షణమైనను ఉండడు'' = అనుగీతావాక్యం ప్రకారము కర్మలు చేస్తూ కర్మవశుడనై యున్నాను. కాని నేను మనస్సున కోరినది నీ సంబంధములగు జ్ఞాన భక్తులను. అవి సిద్ధించుట లేదు. కర్మ సంసారకారణ మగుచున్నది.

3. ఈ ప్రపంచ సృష్టిచేసి ఇందలి జీవుల చేత నీవు బొమ్మలాట ఆడిస్తావు. నాపరిస్థితి కూడ బొమ్మలాటలో ఒక భాగంగా పెట్టుకున్నావు.

4. '' చేసిన తప్పు చెప్పితే పోతుంది'' అన్న భావంతో నా తప్పు నీ సన్నిధిలో విన్న వించుకుంటాను. సరే నలుగురిలో చెప్పుకోవటం తప్పదా ? రామా!

5. నిజమయిన భక్తి కలిగి ఆ భక్తి రసమును అనుభవించే రసికులకు నేను సరిపోను. నీ కరుణ కలుగుట కనుక నేను తసుకు= భక్తుని వలె నటించుట చేస్తున్నానేమో ? ఇది నలుగురిలో నీవు నన్న పహాస్యము పాలు చేయుట కాదా !

6. నాకు దర్శన మిచ్చుటకు నీకు తీరిక లేదేమో? '' ప్రహ్లాద నారద పరాశర పుండరీక'' ప్రముఖులయిన పూర్వభక్తులతో కొలువు తీర్చి యుంటివా? లేక నీకున్న ధనరాసులు తరిగి పోతాయి అనియా రాకుంటివి.

7. ఇక పరాకు చెయ్యకు. ఇక నా మీద తప్పులు పెట్టకు. తప్పులు పెట్టేది నీవే. తప్పులు పట్టేది నీవే. గీతా వాక్యం ప్రకారం ''హృదయున నెలకొని సర్వభూతములను చక్రము వలె త్రిప్పుదును''= అని చెప్పుట చేత నీవే నాపై తప్పులు పెట్టుచున్నావు. ఇక పెట్టకు.

8. కన్నీరు రాల్చిరాల్చి నా పని అయినది. ఇంకెంతని రాల్చుదును? ఎవరితో చెప్పుకుంటే నా బాధ తీరుతుంది? (నీకన్న నెవరును లేరని)

9. నాకు నీవు పుట్టిన ఇల్లు ''యతోవా ఇమాని భూతాని జాయంతే= '' ఎవ్వనిచే జనించు జగము'' అనెడి వేదవాక్యము చేత నాకు నీవు పుట్టిన ఇల్లు. నాపై నీ కృప జూపుట చెల్లు= న్యాయము.

10. నీ కృపకై ఆశించాను. ఇదే తప్పా? తప్పుకాదు. తప్పు అనే భావము నీకు వద్దు అప్పా=తండ్రీ.

11. కలియుగంలో నీవు కూడా మారిపోయినావా ? (త్రేతాయుగంలో శరణన్న వారిని రక్షించావు. కలిలో నీవు మారిన మర్మం తెలియని దీనుడను. నావంటి దీనుడుండడు. (ఇంతలోనే పశ్చాత్తాపము చెంది)

12. అయ్యయ్యో ! ఈ విధంగా ముందు నిన్నెన్ని పర్యాయములో నిందించాను. తెలిసినది. దాని ఫలము (నీవు రాకుండుట) ఇప్పుడను భవిస్తున్నాను.

13. అయితే నాకు ధైర్యం కలిగింది నిన్ను నిందించిన కర్మఫలము నేనను భవిస్తున్నాను. ''సాధ్య భక్తిస్తుసాహంత్రీ ప్రార బ్ధస్యాపి భూయసః''=భక్తిని సాధింపవలెను. అది పెద్ద ప్రారబ్ధ కర్మమును పోగొట్టగలదు'' అని నమ్మినాను. ఆ భక్తి వెలుగే నా దోషమును తీర్చుతుంది.

14. పూలమ్మిన చోట కట్టెలమ్మి బ్రతుకుట హీనము. నీవు ''ప్రహ్లాదాది మహా భక్తులను రక్షించావు. అది పూలమ్ముట. నన్ను రక్షించుట పుల్లలమ్ముటకు పిలిచినట్లు భావించావా?

15. ఒక వేళ పైన చెప్పిన విధముగా నీవు భావిస్తే నీకే చులకనగదా ? భగవంతునకు నైర్ఘృణ్య-వైషమ్యములు=దయలేకపోవుట భక్తులలో హెచ్చు తగ్గులు వెదుకుట లేవని పెద్ద కీర్తి కలదు. ఇప్పుడు నాపై నీవు చులకన చూపిస్తే, నీకు పై కీర్తి నశించి నీకే చులకన కాదా ? అందుచేత నన్ను ఏచు= బాధించు బుద్ధి వదలుము.

16. ఏది ఏమైనా ఎట్లు చూచినా నేను నీ వాడను అనేది ఖరారు. ఒక వస్తువును ఇంకొకని పరము చేయునప్పుడు, ఈ వస్తువును నీ అధీనముచేయుచున్నాను. ఇకపై సర్వాధికారములు నీవే. అని పత్రము వ్రాసి ఇచ్చును. ఆ పత్రమును ఖరారు నామా అందురు. త్యాగయ్యగారు తన ఆత్మను రామార్పణము గావించెను. అది ఖరారే. కనుక ''త్యాగరాజు నీ వాడని పేరే'' అన్నారు. ఇట్లు భగవంతునకు ఆత్మ సమర్పణము చేయనివాడు సమస్తపాపములు చేసిన చోరుడని శాస్త్రము. '' అన్యథా సంత మాత్మానం।

యోఽ న్యథా ప్రతి పద్యతే । కింతేన నకృతం పాపం। చోరేణా త్మాపహారి ణా॥= ఒకవిధముగా ఉన్న ఆత్మను (భగవంతుని సొత్తుగా ఉన్న ఆత్మను) ఎవ డింకొక విధముగా (తనదను భావముగా) భావిస్తాడో ? వాడు ఆత్మా పహారము చేసిన దొంగ అగును. ఆ దొంగ సమస్త పాపములును చేసిన వాడగును. ఈ శాస్త్రముననుసరించి భగవత్ప్రపన్నులు భగవానునితో ''నీవాడనని'' చెప్పుదురు. శ్రీరాముడు కూడ విభీషణ శరణాగతి సమయమున సుగ్రీవునితో ''తవాస్మీతిచ యాచతే''=నీవాడనని చెప్పిన చాలును'' అనెను. ఇందు త్యాగయ్యగారు చేసిన దదే. ఖరారే= నిశ్చియమే అనెను.

70. మాకవశ్రీ = ఆది

ప॥ ఎన్నాళ్లు తిరిగేది

అ॥ ఎన్నరాని దేహాలెత్తి – ఈ సంసార గహనమందు
పన్నుగ జోరులరీతి – బరులను ఏగించుచును॥ ఎన్నాళ్లు॥

చ॥ ఉప్పు కప్పురము వరకు – ఉంఛవృత్తిచే నార్జించి
మెప్పులకు బొట్టనింపి – మేమే పెద్దల మనుచు॥ ఎన్నాళ్లు॥

2 రేపటి కూటికి లేదని – రేయి బవలు వెసనమంది
శ్రీపతి పూజలు మఱచి – చేసినట్టి వారి వలెనే॥ ఎన్నాళ్లు॥

3 భ్రమనుగొని ఇరుగు పొరుగు – భక్షింప రమ్మని పిల్వ
అమరుచుకో బూజజపము – నా సాయము జేతుననుచు॥ ఎన్నాళ్లు॥

4 నాయందు ఉండే తప్పులు – నాడె తెలుసు కొంటిగాని
బాయవిడువ మహాను–భావ త్యాగరాజ వినుత॥ ఎన్నాళ్లు॥

తాత్పర్యము :

ప్రస్తుత జన్మను బట్టి గత జన్మలను ఊహించవచ్చు. ఎన్నో దేహాలలో జన్మలెత్తి సంసారమనే అడవిలో బడి చోరుల రీతిగా (ఇంతకు వెనుకటి కృతిలో చెప్పినట్లు ఆత్మా పహారులవలె) పరులను బాధించుచు ఎన్నాళ్లిట్లు తిరిగేది? ఉప్పుమొదలుకొని కర్పూరము వరకును యాచనా వృత్తితో సంపాదించి పొట్టనింపుకొంటూ మెప్పులు పొందుచు మేమే శ్రేష్ఠులమని విర్రవీగుచు ఎన్నాళ్లిట్లా జన్మపరంపరలలో తిరుగ ఉన్నదోకదా! పరమార్థము సంపాదించుకొనక రేపటి కూటికే రేయింబవళ్ళు కష్టించి భగవత్పూజను మరచి పూజచేయువాని వలె నటించుచు ఎన్నాళ్ళు తిరిగేవయ్యా? వీడు మహాభక్తుడని ఇతరులకు భ్రమ గొలిపివారిచ్చే విందులచే గడుపుచు నేను సాయంకాలము వరకు పూజ చేస్తూనే

ఉంటానని డాబులు పలుకుచు ఎన్నాళ్లు తిరిగేది? ఇవన్నీ నాయందుండే తప్పులు. ఇవి తెలుసుకొన్నాను. కాని (వాసనాబలముచేత) విడువలేక పోతున్నాను. ఈ విధంగా ఎంతకాలము తిరిగేది? అని అయ్యగారు ఇతరుల దంభవృత్తిని తనపై ఆరోపించుకొని జన్మరాహిత్యమునకై ఆర్తి పడుచున్నారు.

విశేషము = త్యాగయ్యగారు బహుదాంభికులను చూచిచూచి రోసిరోసి చెప్పిన దీకృతి. అయితే సాధారణమానవునకు కూడ తన తప్పులు తెలియును. కాని వదలలేడు. దానికి కారణము వాసనాబలము. అనగా నిత్యమును చేయుట. పుట్టిన శిశువు పుట్టగానే తల్లిపాలకై వెదకును. దీనికి కారణము పూర్వజన్మల వాసనాబలమే.

71. పంతువరాళి = చాపు

ప॥ ఎన్నా ళ్లూరకే యుందువో చూతాము॥
ఎవరడిగేవారు లేదా? శ్రీరామ॥ ఎ॥

అ॥ కొన్నాళ్లు సాకేత-పురమేల లేదా
కోరిక మునులకు - కొనసాగలేదా॥ ఎ॥

చ॥ సతిమాటల నాలకించి - సద్భక్తకోటుల
సంరక్షించగ లేదా?
మతిమంతుల బ్రోచే-మతము మాదనలేదా?
సతతము శ్రీ త్యాగ-రాజు నమ్మగ లేదా?॥ ఎన్నాళ్లు॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు తనను రక్షించమని పలువిధముల ప్రార్థనలు చేసినా రాముని నుండి తాను కోరిన రక్షణ దొరకటంలేదు. ఆయన ఊరకే ఉన్నాడు. విసిగిన త్యాగయ్యగారు నీవు ఎన్నాళ్లు ఊరకే ఉంటావో మన ఇరువురము చూద్దాము. నిన్నెవరును అడిగేవారులేరా? ఎవరినీ ఎప్పుడూ ఏలకుండా ఉన్నావా అంటే కొన్నాళ్లు అయోధ్య (అయోధ్యాపుర ప్రజలను) ఏలలేదా? అరణ్యంలోనున్న మునులకు నీనుండి వారి కోరికలు నెరవేరలేదా? సీత మాటలను విని కొంతమంది భక్తులను రక్షించలేదా? 'మతిమంతులను రక్షించే మతము మాది' అని నీవు చెప్పలేదా? (చెప్పితివి) నేను నిన్ను నమ్మినవాడను కాదా? అని అయ్యగారి ప్రశ్నలు.

విశేషము = త్యాగయ్యగారికి రాముని పుట్టు పూర్వోత్తరములు అన్నియు తెలుసును. బలహీనతలును తెలుసును. అందుచే ఎన్నాళ్లు ఊరకుందువో చూస్తాను. అని అయ్యగా రొక విధమైన శపథం చేస్తున్నారు. విష్ణువుగా ఆయన స్వభావము లోకరక్షణమే. 'యశ్చ స్వభావో యస్యస్యాత్, తస్యాసౌ దురతిక్రమః' = ఎవనికి ఏది స్వభావమో ఆ స్వభావమును వాడు అతిక్రమింపలేడు అని శాస్త్రము. రామావతార మెత్తినప్పుడును 'యోగక్షేమం వహామ్యహం' = భక్తుల యోగక్షేమములను వహింతును. అనే స్వభావమును వీడలేక పాదచారియై అయోధ్యాపుర ప్రజల యోగక్షేమములరసి వచ్చేవాడట రాముడు. తరువాత పట్టాభిషేకానంతరము 'రామోరామో రామ ఇతి ప్రజానామభవత్ కథాః' అని ఆయన కథను చెప్పుకోని వాడే లేడట. ఆ విధంగా 'కొన్నాళ్ళు సాకేతపురమేలినాడు'. అరణ్యవాసములో మునులకు ప్రతిజ్ఞచేసి రాక్షసవధముచేసి వారిని రక్షించినాడు కదా! అంతేకాక అనంతరావతారమున కృష్ణుడై వారిని గోపికలుగా చేసి వారి కోరికలను కొనసాగ జేసినాడు కదా! మరియు సీత మాటలు విని రామదాసాది భక్తులను రక్షించినాడు కదా! 'మతిమంతులు (శరణాగతి చేయు మనసుగలవారు) విభీషణాదులు. వారిని రక్షించునప్పుడు సుగ్రీవాదు లడ్డుచెప్పినను వినక 'దదా మ్యేతత్ వ్రతం మమ' = శరణాగతులను రక్షించు వ్రతము (మతము) నాది అని చెప్పినాడు. శరణాగతులను రక్షించక ఉండలేకపోవుట రాముని బలహీనత. నమ్మినవారిని రక్షింపకుండలేకపోవుట రాముని బలహీనత. అయ్యగారు తాను త్రికరణశుద్ధిగా నమ్మినవాడు. ఇక రాము డెక్కడకు పోవును. నమ్మకములేని వానికి కూడ నమ్మకము కల్గించి రాముడు రక్షించును. నమ్మకము లేని సుగ్రీవునకు సప్తసాలములను ఛేదించి నమ్మకము కలిగించి రక్షించినాడు. నమ్మిన త్యాగయ్యను రక్షింపక ఊరకుండగలుగునా? ఇట్టి విషయము లెరిగిన అయ్యగారు రాముని ఎన్నాళ్లూరకొనగలవో చూస్తానులే అనిరి. ఇది 'రక్షిష్యతీతి విశ్వాసః' = రాముడు రక్షించును అనెడి విశ్వాసమునకు చిహ్నము. ఈ విశ్వాసము శరణాగతికి కల ఆ రంగములలో నొకటి. రాముని స్వభావమును చూచినా తన విశ్వాసమును చూచినా రాముడు తనను రక్షింపక యూరకొనలేడు. చూద్దామన్నా రయ్యగారు. ఒక సూచన. 'అడిగేవారు లేదా' 'అడిగేవారు' బహువచనము. దీని క్రియ 'లేరా' అని బహువచనమందు ఉండవలెను. ఇది తెలుగుభాష మర్యాద. అరవభాషలో కర్త బహువచనముగాను క్రియ ఏకవచనముగాను ఉంటుంది. అయ్యగారు ప్రాంతీయ శ్రవణ బలముచేత ఇట్లు భిన్న వచనములను ప్రయోగించుటకలదు. దానిని 'లేరా' అని మార్చుటకు వీలులేదు. పాట అంతయు 'లేదా' అనేదానిని అంత్యప్రాసగా కూర్చుటచేత.

72. దేవామృతవర్షిణి = ఆది

ప॥ ఎవరని నిర్ణయించిరిరా-ని॥ న్నెవరని॥

అ॥ శివుడనో మా... - ధవుడనో కమల
భవుడనో పర-బ్రహ్మమనో ని॥ న్నెవరని॥

చ॥ శివమంత్రమునకు మా-జీవము-మా
ధవ మంత్రమునకు - రాజీవము-ఈ
వివరము తెలిసిన-ఘనులకు మ్రొక్కెద
వితరణగుణ త్యాగ-రాజ సన్నుత! ని॥ న్నెవరని॥

తాత్పర్యము :

దేవతలలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురును ప్రధానులు. పరమపురుషుడైన ఒక్కడే పై ముగ్గురి రూపములను ధరించెను. ఇది పురాణ ప్రతిపాదితమైన విషయము. మరి పరమపురుషుడు 'రామ' శబ్దముచేత చెప్పబడుచున్నాడు. శివ మాధవ బ్రహ్మల మూడు రూపములను ధరించిన పరమ పురుషుని ఏమనవలెను? ఎట్లా రాధింపవలెను? ఇది ఒక ప్రశ్న. దీనిని రామ రహస్యోపనిషత్తు ఒక విధముగా 'రామ' నామమును తీసుకొని తీర్చినది. త్యాగయ్యగారి ప్రశ్న ఓరామా? నిన్ను శ్రేష్ఠులు (ఋషులు, ఆచార్యులు) ఎవరని నిర్ణయించినారు? ఎట్లు ఆరాధించినారు? శివుడనా? మాధవుడనియా? బ్రహ్మ అనియా? లేక పరబ్రహ్మమనా? అని ప్రశ్నించి ఒక పొడుపుకథ వంటి దానితో ఒక వివరణ మిస్తున్నారు. శివ పంచాక్షరి మంత్రములో (ఓం నమశ్శివాయ) మ అనేది జీవాక్షరము. ఎందుచేతనంటే 'మ' అనే అక్షరము దానిలో లేకపోతే 'న శివాయ' = 'శుభమునకు కాదు' అని అర్థము వచ్చుచున్నది. అట్లే నారాయణాష్టాక్షరి మంత్రములో (ఓం నమోనారాయణాయ) 'రా' అనేది జీవాక్షరము. ఎందుచేతనంటే రా అనేది దానిలో లేకపోతే 'నాయనాయ' = 'శుభమునకు కాదు' అని అర్థము వచ్చుచున్నది. అట్టి జీవాక్షరములను రెండింటిని చేర్చితే 'మరా' అయినది. అదియే వాల్మీకి కుపదేశింపబడి వ్యత్యస్తమై 'రామ' అయినది. అది వాల్మీకిని కవి బ్రహ్మను చేసి ముక్తి నిచ్చినది. ఈ రామ అను పదము పరబ్రహ్మమునకు పేరుగా 'ఇతి రామ పదేనాసౌ పరబ్రహ్మాభిధీయతే' అనే వాక్యం చెప్పినది. దీనికి ముందు చెప్పిన ప్రకారము 'రామ' అనుపేరు ధరించినవాడు శివకేశవాత్మకుడు అని అర్థమయినది. 'ఈ వివరము తెలిసిన ఘనులకు మ్రొక్కెద' అని త్యాగయ్యగా రన్నారు.

విశేషము = నారాయణుడు సర్వదేవతామయుడు. గజేంద్రమోక్ష ఘట్టమందు 'తత్రాఖిలామరమయో హరి రావిరాసీత్' = 'అచ్చట సమస్త దేవతామయుడగు హరి ఆవిర్భవించెను' అని వ్యాసుడు చెప్పెను. అదియును కాక తైత్తిరీయ నారాయణమునందు నారాయణుని గురించి చెప్పుచు 'స బ్రహ్మా స శివ స్సేంద్రఃస్సోఽక్షరః పరమ స్స్వరాట్' ='అతడే బ్రహ్మ. అతడే శివుడు. అతడే ఇంద్రుడు. అతడే అక్షరుడు (కూటస్థుడు) పరబ్రహ్మము. స్వరాట్టు = స్వయం ప్రకాశుడు' అని చెప్పబడినది. త్యాగయ్యగారీఅర్థమును భంగ్యంతరముగా ప్రశ్నరూపమయిన సమాధానముగా రామరహస్యోపనిషత్తు చెప్పిన జీవాక్షర ద్వయ సంయోజన రూపమయిన చమత్కారమును జోడించి చెప్పినారు.

73. మధ్యమావతి = ఆది

ప॥ ఎవరిచ్చిరిరా శరచాపములు నీ 'కినకులాబ్ధిచంద్ర' ఎవ॥

అ॥ అవతరించువేళ నుండెనో లేక – అడవికేగి ఆర్జించితివో శ్రీరామ నీ॥ కెవ॥

చ॥ ఒకటేసిన పది నూరై వెయ్యై–చకపకలాడి శత్రులనణచేనట॥
విలుని కాకిని బ్రోవత్రిమూర్తులు – వెనుక దీసినారట
సకలనదీపతికై ద్రుమకుల్యల–సంహరించెనట
ప్రకటకీర్తి కల్గిన కోదండ–పాణి! త్యాగరాజ వినుత! నీ॥ కెవ॥

తాత్పర్యము :

ఓ ఇనకురాబ్ధిచంద్ర! సూర్యవంశమనే సముద్రమునకు చంద్రుని వంటివాడా! రామా! నీకు అత్యాశ్చర్యకరమయిన శరచాపములు = విల్లమ్ములు ఎవరిచ్చారయ్యా! అవతరించునప్పుడే ఉన్నాయా? అరణ్యవాసంలో ఆర్జించావా? ఒక బాణం వేస్తే అది పది అయి నూరై వెయ్యై చకపకలాడి శత్రువుల నణచుచున్నది. ఆహా ఎంత ఆశ్చర్యకరము? శరచాపములే కాదు. ఒక దర్భపుల్లను అభిమంత్రించి కాకాసురునిపై ప్రయోగిస్తే అది వానిని ముల్లోకములను త్రిప్పినది. త్రిమూర్తులును దాని నాపలేకపోయిరి. తుదకు 'స పిత్రాచ పరిత్యక్తః రాఘవంశరణం గతః' = 'కాకాసురుడు తండ్రి అయిన ఇంద్రునిచేత కూడ పరిత్యజింపబడి రామునే శరణు జొచ్చెను'. అదీ కాక సకలనదీపతికై = సముద్రుని మీద ప్రయోగించుటకై ఎక్కుపెట్టబడిన బాణము సముద్రుడు శరణువేడితే ఉత్తరసముద్ర మందున్న (ఎంతో చెప్పరాని దూరమందున్న) ద్రుమకుల్యలను సంహరించినది. ఇవన్నీ అత్యాశ్చర్యకరములయిన విషయములు.

'అవతరించువేళ నుండెనో' అని అయ్యగారి ప్రశ్న. రాముడు మాయా-అమానుష విగ్రహుడు. కృష్ణునివలె అవతరించినప్పుడే కనపడకపోయినను ఆయన అతిమానుషత్వము ఆయనను అంటిపెట్టుకొనే ఉంటుంది. అందుచేతనే 'ప్రకృతింస్వామవష్టభ్య సంభవామ్యాత్మమాయయా' = నా స్వభావమును శక్తిని నేను పట్టుకొనియే నే నవతరించెదను' అనే గీతావాక్య ప్రకారం అతిమానుషశక్తి ఆయనను విడువదు. దాని కయ్యగారి ఆశ్చర్యము. అడవికేగి ఆర్జించితివో అని ప్రశ్న ఇది. అరణ్యవాసమున అగస్త్యుడు కొన్నిటి నిచ్చెను. ఈ కథాస్ఫూర్తి ఏమయినను రాముని శరములకు కోదండమునకు అతిమానుషశక్తు లున్నవి. అవి ఒకరిస్తే వచ్చినవి కావు. రాముడు దర్భను తాకినా బ్రహ్మాస్త్రం అవుతుంది. ఏ కోదండమును తాకినా అది శార్ఙ్గమవుతుంది. ఒక్క శరము వేయి శరములవుతుంది. ఇట్లు కాకపోతే ఖరదూషణాదులు పదునాల్గువేలమందిని ఒక్క రాముడు రెప్పపాటులో సంహరించుట సంభవవమగునా? ఈ యుద్ధమును దేవతలు ఋషులు ఆకసమున నిలచి అత్యాశ్చర్యముతో తిలకించిరి కదా! ఈ కృతిలో త్యాగయ్యగారు దానినే స్మరించినారు.

74. దేవమనోహరి = చాపు

ప॥ ఎవరికైఅవతార మెత్తితివో - ఇపుడైన తెలుపవయ్య రామయ్య రామ॥ ఎవరికై॥

అ॥ అవనికి రమ్మని పిలచిన మహారాజు-ఎవడోవానికి మ్రొక్కెద రామయ్య॥ ఎవరికై॥

చ॥ వేద వర్ణనీయ మగునామముతో-విధి రుద్రాదులకు మేల్మియౌ రూపముతో
మోదసదనమగు పటుచరితముతో-మునిరాజవేషియౌ-త్యాగరాజనుత॥ ఎవ॥

తాత్పర్యము :

రాము డవతరించినాడు. ఎవరికై? అనే ప్రశ్నవస్తే ఒకముక్కలో సమాధానంరాదు. త్యాగయ్యగారు చాలాకాలం తర్కించి రామునే అడుగుచున్నారు. ఏమయ్యా! రామయ్యా! నీవు ఎవరికై అవతరించావు? వైకుంఠ దివ్యధామమందున్న నిన్ను ఈ భూమికి రమ్మని పిలిచిన మహారాజు ఎవడయ్యా? తెలుపుము. వానికి చేయెత్తి మ్రొక్కుతాను. నీ నామమును 'ఇతి రామపదేనా సౌ పరబ్రహ్మాభిధీయతే'' = అని రామ అను నామతో పరబ్రహ్మ చెప్పబడుచున్నాడు' అని వేదము పేర్కొన్నది. అట్టి నామమును ధరించినావు. బ్రహ్మ రుద్రులు కూడ నీ రూపమును చూచి మోహింతురు. 'పుంసాంమోహన రూపాయ' = పురుషులకు కూడ మోహమును కలిగించు రూపము కలవాడు' అని

కదా! అట్టి రూపము ధరించి యున్నావు. ఇక చరిత్రము చూడబోతే ఎన్నిసార్లు విన్నా, చదువుకున్నా ఆనందమును పెంచుచున్నది. అట్టి సమర్థమైన చరిత్రము కలిగియున్నావు. అరణ్యవాసమున ముని వేషమును ధరించినావు. ఆ వేషము కూడ చాల మనోహరముగ నున్నది. ఇన్ని వేషములతో ఎవరికై అవతరించినావు? అని ప్రశ్నరూపముగా, అవతార రహస్యమెరిగిన అయ్యగారు ముగ్ధులగు చున్నారు.

విశేషము = సాధారణముగా భగవదవతార ప్రయోజనములు రెండు. శిష్టరక్షణము, దుష్టనాశనము. అయితే శిష్టరక్షణమే భగవానుని ప్రధాన సంకల్పము. ఈ పనిలోనే ఆనుషంగికముగా దుష్టశిక్షణము జరుగును. అని పూర్వాచార్యుల సూక్తి. రావణ బాధలు తీర్చటానికి దేవతలు ప్రార్థిస్తే ఆకారణముగా జరిగిన అవతారమిది. 'అలంచకార కారుణ్యాత్। రఘూణా మన్వయం హరిః' = రఘు వంశమునందు కారుణ్యము వలన ఆ వంశమును హరి అలంకరించినాడు' అని చెప్పబడినది. ఈ వంశపు వారందరును మహారాజులు. ఇక్ష్వాకువు మొదలుకొని ఈ వంశపు ప్రభువులు నారాయణుని తమకుల ధనముగా భావించి అర్చించిరి. అందరును మహారాజులే. రఘుమహారాజు చాలా ప్రధానుడు. అందుచేతనే ఆయన పేరుతో రాముడు 'రాఘవుడు' అనబడినాడు. తరువాత మహారాజు దశరథుడు. రాముని కని మహారా జయినాడు. రాము డవతరించని అంతవరకు ఆయన రాజ్యాదిభోగములు వ్యర్థములని భావించినాడు. అతడు పుత్రకామేష్టి చేసి భగవదర్పణము చేసినాడు. అప్పుడు 'పితరం రోచయామాస తదా దశరథం నృపం' = భగవానుడు దశరథుని తండ్రిగా ఇష్టపడినాడు'. అవతరించినాడు. ఈ ఘట్టమున రఘువు, దశరథుడు, మహారాజులుగా కనపడుచున్నారు. అందుచేతనే పూర్వఋషులు 'శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం' అనిరి. జనకుడు కూడ మహారాజని చెప్పవచ్చును. ఎందుచేతనంటే పురుషకార స్వరూపిణి = అపరాధి అయినను వానిని రక్షింపుమని చెప్పునది. నిత్యానపాయిని = భగవంతుని ఒక్క క్షణమును ఎడబాయనిది అయిన లక్ష్మీదేవిని కూతురుగా కని ఆవాసశుద్ధి నిచ్చి సాక్షాన్నారాయణుడగు రాముని కాళ్లు కడిగి కన్యాదానమును చేసినాడు. ఇందుచేత ఇతడు మహారాజు. ఇంకొక మహారా జున్నాడు. అతడు జటాయువు. అవసాన కాలమందు వ్యథతో మరణించి రాముని వలన పొందవలసిన ఔర్ధ్వదైహికములు = మరణించిన తరువాత పొందవలసినవి. వాటిని పొందని దశరథుని కన్నా అవి రాముని వలన పొంది 'గచ్ఛ లోకా ననుత్తమాన్' = ఉత్తమ లోకములను పొందుము' అని అనిపించుకొని ఉత్తమలోకములను పొందిన జటాయువును పూర్వాచార్యులు మహారాజనిరి. రామావతారము వలన మహారాజులనబడినవా

రింతమంది ఉన్నారు. మరియు అసలు రావణవధము జరిగితే దేవతలు ఊపిరి పీల్చుకుంటారు. కనుక దేవకార్యం నెరవేర్చటం కోసం అవతారము. దీనికోసమే పట్టభంగమయినది. దీనికోసమే అరణ్యవాసము. ఈ సమయములోనే కొంతమంది రాక్షసుల వధతో మునుల రక్షణము. కొంతమంది శాపవిమోచనము (విరాధక బంధులకు) (అంతకుముందు అహల్యా శాపవిమోచము విశ్వామిత్ర యాగ సంరక్షణము) జరిగినవి. ఇట్టివి రామ కథ ప్రారంభనుంచి చివరిదాకా జరుగుచునే యున్నవి. ఈ అవతారము దేవతల కొర కందుమా? దశరథుని కొరకందుమా? మునుల కొరకందుమా? సుగ్రీవుని కొరకందుమా? హనుమ ద్విభీషణులకొరకందుమా? శబరి కొరకందుమా? అందరికొరకును అయి మొత్తము లోక కల్యాణము కొరకయినది. ఈ విశేషములను హృదయ మందుంచుకొని ఎవరికై అవతార మెత్తితివో' అని ప్రశ్నించినారు త్యాగయ్యగారు.

75. మానవతి = దేశాది

ప॥ ఎవరితోనే దెల్పుదు రామ నాలోని జాలిని॥ ఎవ॥

అ॥ కవగొని సదా భజనసేయ–కార్యములన్ని వేరాయ॥ ఎవ॥

చ॥ గణనాథుజేయగోరగా–కడు వానరుండై తీరెగా।
గుణమయ మాయాంబుద సమీర–గోపాల త్యాగరాజనుత॥ ఎవ॥

తాత్పర్యము :

రామా! నాలోని జాలిని ఎవరితో చెప్పుకొందును? జతగూర్చుకొని నిత్యమును నీ భజన చేస్తున్నాను. నీ భజన చేస్తున్న ఫలితం నాకు కనపడుటలేదు. గుణమయమయిన మాయ అనెడి మేఘమునకు వాయువువంటి ఓ గోపాలా! నేను ఒకటి చేస్తే ఇంకొకటి అవుచున్నది. గణపతిని చేయబోతే కోతి బొమ్మ తయారయినట్లున్నది నాపని. అని హాస్యపు సామెతను జోడించినా రయ్యగారు.

విశేషము = కవగొని అనగా జతగూర్చుకొని అని దేనిని? అయ్యగారి భజన స్వరూపము గానము కనుకను అయ్యగారే ఒక కృతిలో 'మృదంగతాళము జతగూర్చి' అని చెప్పినారు కనుక మృదంగతాళములని చెప్పవచ్చును. శ్రుతిలయలని చెప్పవచ్చును. 'సంగీతజ్ఞానము భక్తివినా' అనియును చెప్పిరి కనుక సంగీతమును భక్తిని కవగూర్చి అని చెప్పవచ్చును.

76. తోడి = రూపకము

ప॥ ఎవరు తెలియగ బోయేరు నీ మహిమల॥ నెవరు॥

అ॥ భువిలో వరమౌ నాగ-పురమున గనుగొంటి॥
లవలేశమైనను నీలాయతాక్షి! సామర్థ్యము॥ నెవరు॥

చ॥ కరకు బంగారు వల్వ – గట్టి సాగసు మీర,
కరమున జిలుకను బట్టి – నిర్జరతరు
విరులను కొప్పునిండ జుట్టి – అదియుగాక
హరుని అట్టిట్టా డించినట్టి – నీ లీలలను॥ ఎవరు॥

2 హరిబ్రహ్మాదులు నిను గొల్వ – ఆవేళను
విరిబోణు లందముతో నిల్వ – అమరవర
తరుణులు నాట్యముచే గొల్వ – అన్నియు జూచి
కరుణారసము జిల్క బిల్వ – అట్టి నీదయ॥ ఎవరు॥

3 నాగ భూషణునికి రాణి – వైన నిన్ను వి
నాగతి ఎవరు నీలవేణి – భక్తుల
భాగధేయమైన శర్వాణి – సంతతమును
త్యాగరాజు బల్కినవాణి – ప్రియమైన ని॥ న్నెవరు॥

తాత్పర్యము :

ఇది నాగపట్నమున వేంచేసియున్న నీలాయతాక్షి అనే దేవిపై అయ్యగారు పాడుకొన్నది. అమ్మా! నీ మహిమలను ఎవరు తెలుసుకొన గలుగుదురమ్మా! తెలుసుకొనలేరని. నేను మాత్రం ఈ నాగపట్టణములో తెలుసుకొన గలిగితిని. నీ సామర్థ్యమును లవములో లేశమైనను ఎవరును తెలుసుకొన లేరమ్మా! మేలిమి బంగారపు చీరగట్టి, చిలుకను చేతబట్టి, నిర్జరతరు విరులను = కల్పవృక్షపు పువ్వులను కొప్పున ధరించి ఆ సొగసుతో శివుని ఆడించినట్టి నీ లీలలను ఎవరు తెలియగలుగుదురమ్మా! (ఇక్కడ ఏదో స్థలపురాణ కథ ఉండవచ్చును). హరి, బ్రహ్మ మొదలయిన దేవతలు నిన్ను కొలుచుచుండగా, అందమయిన నీ పరిచారికలు నీ చెంత నిలిచియుండగా అమరవరతరుణులు = అప్సరసలు నాట్యముతో నిన్ను కొలుచుచుండగా, వారి నందరిని నీవు కరుణారసముతో పిలిచే నీ దయను ఎవరు తెలియుదురమ్మా! నాగ భూషణునకు = శివునకు రాణివైన నీవు కాక నాగతి ఎవరు? ఓ నీలవేణీ = నల్లని జడగలదేవీ! భక్తులకు

భాగ్యదేవతవైన ఓ శర్వాణీ = శివుని రాణీ! త్యాగరాజు వాణి = వాక్కు ప్రియమైన = ఇష్టమయిన (త్యాగరాజు చేయుస్తోత్రము ఆమె కిష్టమైనదని) నిన్నెవరు తెలుసుకొన గలుగుదు రమ్మా! అని నీలాయతాక్షిని వేడుకున్నా రయ్యగారు.

77. వున్నాగవరాళి = చాపు

ప॥ ఎవరు తెలియ బొయ్యేరు – వివరములేని పూజలు చేసేరు॥ ఎవరు॥

చ॥ ముదమున బరుల రూకలకు పర–సుదతుల కాశించి తాగూడుటకు
ఉదరము నింపుట కొరకు చాల–ఊరూర తిరిగేరా వరకు॥ ఎవరు॥

2 కొన్న తొత్తులమాటమీర, లేక–అన్నదమ్ముల తల్లిదండ్రుల నేర
మెన్నుటే పనిగాని సారమైన–పన్నగశయన నీ–పదము నమ్మేరా॥ ఎవరు॥

3 ఆలు బిడ్డల నమ్మేరు, వారి–కాశించి పరులకొంపల ముంచేరు।
కాలుని వల్ల నిండారు, రామ–కష్టముజెంది భువిని బుట్టేరు॥ ఎవరు॥

4 పెద్దలతో గల్లలాడి, రామ–బుద్ధిలేని ధనికుల దావేడి
వద్దన్న వారితో మోడి, ఇట్లు–పొద్దుపోవుటెకాని పతితుల గూడి॥ ఎవరు॥

5 ఈసున మరియాదలేదు, నిండు–కాసుగల్గిన వాని కన్నిటవాదు
ఆస నీయెడ గల్గబోదు, నిజ–దాసు లెవరో కనచేతగాదు॥ ఎవరు॥

6 పన్నుగ మనకేశక్తి, యని–అన్ని కల్లలనుచును దొంగభక్తి
అన్న! ఇదేటి విరక్తి, రామ–కన్న తండ్రి యిదా పేదయుక్తి॥ ఎవరు॥

7 యోగులు మేనెరుగలేక, తమ–కే గతియని ధ్యానింతురు గాక
భోగిశయన! ఏలుకోక, రామ–త్యాగరాజునిపై నీ కింక పరాకా॥ ఎవరు॥

తాత్పర్యము :

ఎవరు రామభక్తి మార్గమును తెలుసుకోరు. వివరములేని ఏవేవో పూజలు చేస్తారు. పరధనములకు పరభామలకు ఆశించి పొట్టకై ఊరూరు తిరుగుతారు. కొన్న తొత్తులు (చేసుకొన్న భార్యలు అని భావము కావచ్చును) వారి మాట మీరలేక అన్నదమ్ములపైన తల్లిదండ్రులపైన నేరము లెంచటమేకాని ఓ పన్నగశయనా! సారమైన నీ పాదములను నమ్ముతున్నారా? లేదు. ఆలు బిడ్డలను మాత్రం నమ్ముతున్నారు. వారికోసం పరుల

కొంపలు ముంచుతున్నారు. ఓ రామా ఇట్టి అకృత్యముల వలన యముని బాధలకు గురి యయి తిరిగి భూలోకంలో పుట్టుచున్నారు. ఓ రామా! పెద్దల వద్ద అబద్ధము లాడు చున్నారు. బుద్ధిలేని ధనికులను యాచిస్తున్నారు. అది వద్దని ఎవరయినా హితబోధ చేస్తే వారితో కలహించి భ్రష్టులతో కూడి ఏమీ తెలియకుండా పోతున్నారు. ఈర్ష్యతో మరియాదను పాటించుటలేదు. వీరిలో ఎవరయినా ధనికులుంటే వారు అన్ని విధాలా నింద్యము లయిన పనులు చేస్తున్నారు. ఎవరికిని నీమీద ఆశలేదు. ఎవరును నిజమయిన భక్తులను తెలుసుకోలేక పోవుచున్నారు. యోగు లెవరయినా ఎక్కడయినా ఉంటే ఉందురు గాక వారు నిన్ను గట్టిగా ధ్యానింతురు గాక. సాధారణంగా జనుల పరిస్థితి ఇంతే. ఓ భోగిశయన! మరి నా సంగతేమిటి? నామీద నీ కింకా పరాకేనా? అని త్యాగయ్యగారి ప్రార్థన.

విశేషము = ఋషులు పరమభక్తులు అయినవారు, భగవద్భక్తి శూన్యులై దురాచారపరులై దుర్గతికి సుముఖంగా ఉన్న మానవులను చూచి జాలిపడతారు. వేదవ్యాసమహర్షి 'నారాయణేతి శబ్దోస్తి। వాగస్తి వశవర్తినీ। తథాపి నరకే ఘోరే। పతంతీతికి మద్భుతం' = నారాయణనామ మున్నది. వాక్కు తమ స్వాధీనంలో ఉంటుంది. ఐనా నరులు నరకమున బడుచున్నారే' అని ఆవేదన చెందుతాడు. కులశేఖరులు 'శ్రీనాథ నారాయణ వాసుదేవ। గోవింద దామోదర మాధవేతి। వక్తుంసమర్థోపిన వక్తి కశ్చిత్। అహోనరాణాంవ్యసనాభిముఖ్యం' = భగవన్నామములను ఉచ్చరించుటకు ప్రతివానికిని శక్తి కలదు. కాని ఒక్కడును నామములను పలుకుటలేదు. అయ్యో!! ప్రతివాడును సంసార కష్టములకు ఎదురుగానే వెళ్ళుచున్నాడు' అని జాలి పడిరి. త్యాగయ్యగారును సంసారులను జూచి జాలిపడిరి. వారి పనులను వివరించి జాలిపడిరి.

78. మోహన = చాపు

ప॥ ఎవరురా నిను వినా గతి మాకు ఎవరు॥

అ॥ సవన రక్షక నిత్యో-త్సవ! సీతాపతి॥ ఎవరు॥

చ॥ రాదా నాదుపై నీదయ విన-రాదా మురవైరి గాదా దయ బల్క
రాదా ఇది మరియాదా నాతో-వాదమా నీ భేదమా మాకు॥ ఎవరు॥

2 రాక నన్నేచ న్యాయమా ప-రాకా నేనంటే హేయమా రామ
రాకాశశిముఖ! నీకాశించితి-సాకుమా పుణ్యశ్లోకమా మాకు॥ ఎవరు॥

3 శ్రీశారి గణారాతివి నా-దాశా తెలియకపోతివి ఆప
గేశార్చిత పాలితేశా నవ-కాశమా స్వప్రకాశమా మాకు॥ ఎవరు॥

4 రాజా బిగువునీకేలరా త్యాగ-రాజార్చిత తాళజాలరా
ఈ జాలము సేయ రాజ బ్రోవసం-కోచమా సురభూజమా మాకు॥ ఎవరు॥

తాత్పర్యము :

రామా! నీవు కాక మాకు గతి ఎవరయ్యా! ఎవరును లేరని. నీవు యజ్ఞ రక్షకుడవుకదా! నిత్యోత్సవములు కలవాడవు. సీతాపతివి. నాపై నీ దయరాదా? నామొర వినరాదా? నీవు మురారివి కాదా? నాతో పలుకరాదా? ఇది మరియాదా? నాతో వాదమా? నన్ను భేదంగా చూచుచున్నావు. నా వద్దకు రాక నన్ను బాధిస్తున్నావు. ఇది న్యాయమా? నేను నీకు హేయమా? (అసహ్యమా) ఓ పూర్ణ చంద్రాననా! నేను నీ కరుణ నాశించినాను. నన్ను సాకు. ఓ శ్రీశా = లక్ష్మీనాథా! శత్రు గణములను సంహరించువాడా? సముద్రునిచే అర్చింపబడినవాడా? ఈశ్వరుని పాలించినవాడా? ఓ స్వప్రకాశా! నన్ను రక్షించు అవకాశము నీకు లేదా? ఓ రాజా! నీకు బిగువెందుకు? నీ వివిధంగా మోసం చేస్తే నేను తాళజాలను. భక్తులకు కల్పవృక్షమయిన నీవు నన్ను రక్షింప సంకోచింపకూడదు.

విశేషము = ఇందున్న విశేషణము లన్నియు తనను రక్షించుటకు ఉపయోగపడునవి. ఇచ్చట 'నిత్యోత్సవ' = నిత్యోత్సవము గలవాడా! అనిఆలయమందు మాసోత్సవము, పక్షోత్సవము వారోత్సవము నిత్యోత్సవములు అని కల్పశాస్త్రమున చెప్పబడినవి. త్యాగయ్యగారు తమ ఇంట పంచాయతనమునకు ఆ ఉత్సవము లన్నియు జరుపుచున్నారని ఊహింపవలసి యుండును.

ఒక సూచన = వీరభద్రశాస్త్రి గారు 'సవన రక్షక' అనే దానికి పాఠాంతరముగా 'వేన రక్షక' అని కల్పించి దాని కేదో అర్థము వ్రాసిరి. ఆపాఠాంతరము అన్ని విధాలా తప్పు కనుక దానిని పరిగ్రహింప కూడదు. ఈ అప పాఠమునే కొందరు గ్రహించి అచ్చువేసినారు. కనుక దీనిని సూచించటమైనది.

79. గాంగేయ భూషణి = దేశాది

ప॥ ఎవ్వరే రామయ్య నీ సరి॥ ఎవ్వరే॥

అ॥ రవ్వకు తావులేక సుజనులను- రాజిగ రక్షించేవా॥ రెవ్వరే॥

చ॥ పగవానికి సోదరుడని యెంచక - భక్తి నెరిగి లంకాపట్టణమొసగగా
నగధర! సురభూసుర పూజిత! వర-నాగశయన! త్యాగరాజ వినుత! సరి॥ ఎవ్వరే॥

తాత్పర్యము :

ఓ రామయ్య! నగధర = గోవర్ధనగిరి నెత్తినవాడా! సురభూసురపూజిత = దేవతలచేత బ్రాహ్మణులచేత పూజింప బడిన వాడా! వరనాగశయన = ఆదిశేషునిపై పవళించినవాడా! (రామునకు కృష్ణునకు విష్ణువునకును అభేద మగుట చేత విశేషణములు అందరికి సమానము) నీసాటి ఎవ్వరయ్యా! అపకీర్తికి తావీయకుండ సాధుజనులను సఖ్యముతో రక్షించేవారు నీ సాటి ఎవరయ్యా! పగవాడయిన రావణునకు తమ్ముడని ఎంచక, నిష్కల్మషమయిన భక్తిని తెలిసి విభీషణుని రక్షించినావు. నీ సరి ఎవరయ్యా! అని రక్షణ శీలమును కొనియాడినా రయ్యగారు.

విశేషము = మానవసాధారణమయిన దృష్టితో చూస్తే విభీషణుని రాముడు స్వీకరించుట చాలా ఆశ్చర్యకరము. ఇట్టి వాడింకొక డుండడు. రావణునిపై ఉన్న పగ చాలా పెద్దది. భార్యాపహారముకన్న మించిన పగ ఉండదు. ఆ పరిస్థితిలో పగవాని తమ్ముడు చేజిక్కినాడని ఇంకొకడయితే చంపును. పైగా రాము డింకొక మాటన్నాడు. 'దోషోయద్యపి తస్యస్యాత్, సతామేత దగర్హితం' = విభీషణుని యందు దోషమున్నను సత్పురుషు లాదోషమును గర్హించరు' అని అన్నాడు. శరణాగతుని రక్షింపవలెను అని మాత్రమే రాముని దీక్ష. అందుచేతనే నీసరి ఎవ్వరు?' అని ప్రశించి సరి ఎవ్వరును లేరని నిర్ధరించినా రయ్యగారు.

80. సిద్ధసేన = దేశాది

ప॥ ఎవరైన లేరా పెద్దలు - ఇలలోన దీనుల బ్రోవను॥ ఎవరైన॥

అ॥ భవకాననమున జరించే- బలుగాసి రామునితో దెలుప॥ ఎవరైన॥

చ॥ కలిమానవాధముల కార్యముల్ – కామ మత్సరాదుల కృత్యముల్
చలచిత్తము లేని వారిపుడు – చాల త్యాగరాజ నుతునితో దెల్ప॥ ఎవరైన॥

తాత్పర్యము :

అయ్యో సంసారమనే అడవిలో తిరుగుచు కామక్రోధాదులచేత దష్కృత్యములు చేస్తూ పలుబాధలు చెందే ఈ కలిమానవుల బాధలు దీర్చుమని రామునితో చెప్పే పెద్ద లెవరులేరా? అని అయ్యగారు ఆవేదన చెందుతున్నారు. చలచిత్తులు కాక నిశ్చలభక్తి నిష్ఠ గలిగిన పెద్దలు లేరా?

విశేషము = పెద్దలనగా 'స్వయంతీర్ణః పరాంస్తారయతి' = తాను తరించిన వాడయితే పరులను తరింపజేయును' అని. అందుకని చల చిత్తము లేనివారు అని అయ్యగారు విశేషించిరి.

81. ఘంటా రాగము = చాపు

ప॥ ఎట్ల కనుగొందునో శ్రీహరినినే॥ నెట్ల॥

అ॥ చుట్టరగడియదోవకు నామదిలోని–జాలితెలిపి విభునితో దెల్పువారి॥ నెట్ల॥

చ॥ ధరలో గలుగుసంప–దల రోసి తనువును
మరచి హరిని గూడు మహారాజులకు గాక॥ ఎట్ల॥

2 మలయని మదమున తెలియకుంటినిగాని
అలనాడే సదయుని – అనుసరించకపోతినే॥ ఎట్ల॥

3 చిన్నప్రాయము నాడే – శ్రీహరిపై నాస
గొన్న జీవుడ గాను – కోదండ పాణి నే॥ నెట్ల॥

4 ఈజన్మ మీభాగ్య–మీ సామ్ములెల్ల ప్ర
యోజనమా? త్యాగ–రాజ వినుతుని నే॥ నెట్ల॥

తాత్పర్యము :

శ్రీహరిని నేనెట్లు కనుగొందునోకదా! చిన్ననాడే శ్రీహరిపై ఆశను పెంచుకొని ఆయన మార్గము ననుసరించలేక పోతినే! ఈ జన్మ ఈ భాగ్యము ఈ సామ్మలు వీటి

వలన ప్రయోజనమేమి? లేదు. నామదిని తెలిసి నాజాలిని శ్రీహరితో తెలుపువారు చుట్టుపట్ల ఎవరును కనిపించుటలేదు. అని అయ్యగారి ఆర్తి.

విశేషము = భక్తులు తమ పిన్నవయస్సునుంచే భక్తిని అవలంబించక పోతిమే. పోయిన కాలమంతయు వ్యర్థమైనదే అని బాధపడుదురు. కులశేఖరులును ఇట్లే ఆర్తిపడిరి. 'ప్రాచ్యశ్రీమన్నామ నారాయణాఖ్యం। కేనప్రాపుర్వాఞ్ఛితం పాపినోపి। హానః పూర్వం వాక్ప్రవృత్తానతస్మిన్। తేన ప్రాప్తం గర్భవాసాది దుఃఖం' = క్షేమంకరమైన నారాయణ నామములను పలికి పాపాత్ములు కూడ సద్గతిని పొందుదురు. అయ్యో! అట్టి నామమును ఇంతకు పూర్వము నేను పలుకక గర్భవాసాది దుఃఖములకు గురి అయితినే' అని ఆవేదన జెందిరి! అయ్యగారిదియు ఇట్టి ఆవేదనయే.

82. సౌరాష్ట్ర = ఆది

ప॥ ఎన్నడో రక్షించితే నీ విపు డీవగను నుండవలెనా! ఎన్నడో॥

అ॥ పన్నగశయన! పెద్దల స్వభావమిట్లుండగ బాగుగ నున్నే నీ॥ వెన్నడో॥

చ॥ చీకటి చేతను గాసి జెంది యీ-లోకులు సకల కర్మలకై మన
రాకకొరకు చూచెదరని తెలిపి వి-భాకరుడు మదిని
ప్రాకటముగదా రాను చెల్లునని-వ్యాకులుడై అతి వేగముననను
వేకువజామున తోషము కలుగను-తా కరుణ నరుణుని బనుపలేదా॥ ఎన్నడో॥

2 నీరులేక సజ్జనగణములు మన-దారిని జూచే రనుచు దెలిసి కా
వేరి తాను రాను జెల్లుననుచు వి-చార హృదయురాలై
సారెకు వచ్చు ననుచు సంతోషము-వీరుల కెల్లను గల్గ బడమటి
మారుతచంచలముల బరపి చెలమ-లూర జేయలేదా? రామ॥ ఎన్నడో॥

3 గర్వించిన యా రావణు బాధల-నోర్వలేకను విభీషణుడు నిన్ను
సర్వలోక శరణ్య వందనమన-నిర్వికారుడై నీవు
సర్వదా రక్షించెదననుచును - సార్వభౌమ లంకాధిపత్యమున
సర్వజ్ఞుని లక్ష్మణు నిమ్మనగా - సర్వసన్నుతా! త్యాగరాజనుత॥ ఎన్నడో॥

తాత్పర్యము :

రామా! నీవెప్పుడో రక్షిస్తావు నిజమే. అట్లని నీవు ఈ విధముగా ఔదాసీన్యముతో ఉండవలెనా? ఇది పెద్దల స్వభావము కాదు. చీకటిలో నున్న జనులు సమస్త కృత్యములకై

సూర్యోదయమునకు ఎదురు చూచెదరు. అందుకని తనరాకను తెలుపుచు ముందుగా అరుణుని పంపును కదా! తరువాత కావేరి చూడవయ్యా! నీరు లేక జనులు బాధపడతారని ఆలోచించి పడమరగాలులు వీచగానే అందరును సంతోషపడేటట్లు చెలమలన్నీ నిండునట్లు ప్రవహించినది. తక్కిన వారి సంగతెందుకు? నీవే ఏమి చేసితివో గుర్తు తెచ్చుకో. రావణుడు చేసిన అవమానమును సహించలేక విభీషణుడు నిన్ను శరణు జొచ్చగానే లక్ష్మణుని చేత నీరు తెప్పించి లంకారాజ్యాధిపతిగా చేసితివే. నన్ను ఎన్నడో రక్షిస్తావా? అని అయ్యగారు నిలవదీసిరి.

విశేషము = ఎప్పుడో రక్షించవచ్చునులే అని నీవు జాగుసేయుట పెద్దల మార్గము కాదు. సూర్యుడు తానెప్పుడో ఉదయింపవచ్చునులే అని జాప్యం చేయుటలేదు. తన విధిని గుర్తెరిగి లోకోపకారము కొరకు వేళ తప్పక ఉదయిస్తున్నాడు. తరువాత దేశానికి ఒక తరుణములో నది ఆవిర్భవించి ప్రవహించవలసి యున్నది. అగస్త్యుడు కావేరీ నదిని తన కమండలువులో బంధించి నేను ఆజ్ఞ యిచ్చే అంత వరకును నీవు ఈ కమండలువులోనే ఉండు అని నియమించి ఎక్కడకో వెళ్ళినాడు. దక్షిణదేశవాసులు నీటి కోసం అల్లల్లాడుచున్నారు. నదుల స్వభావమేమంటే 'పరోపకారాయ వహంతి నిమ్న గాః' = నదులు పరోపకారమునకై ప్రవహించును' అని ఆర్యోక్తి. అట్టి కావేరి ఆగకలదా? పడమటి గాలులు వీచిన అదను చూచుకొని భర్త అయిన అగస్త్యుని ఆజ్ఞను కూడలెక్కచేయక కమండలువునుండి నిర్గమించి అఖండముగా ప్రవహించినది. ఇకనీవు. విభీషణుడు శరణన్నాడు. అతనిని స్వీకరిస్తే చాలు. లంకాధిపతిని చెయ్యమని విభీషణుడు నిన్ను కోరలేదు. 'భవద్గతం హిమేరాజ్యం జీవితం చ ధనాని చ' = నా జీవితము నారాజ్యము నా సొమ్ములు నీ అధీనములు అని మాత్రమన్నాడు. ఈ నివేదనము శరణాగతిలోని ఒక అంగమయిన కార్పణ్యము = దైన్యము మాత్రమే. ఇంకా రావణుడు సంహరింపబడలేదు. రావణసంహారము తరువాత విభీషణుని లంకాధిపతిని చెయ్యవచ్చును. దానికి తొందరకూడలేదు. కాని నీవు 'దత్తం మయాద్య భవతే దశకంఠరాజ్యం' నే నిప్పుడే నీకు రావణుని రాజ్యము నిచ్చుచున్నాను' అని లక్ష్మణుని చేత తీర్థమును తెప్పించి అభిషేకించావు. ఇటువంటి నీ విప్పుడు ఎప్పుడో రక్షించవచ్చును అని జాప్యం చేస్తున్నావు. ఇది నీ స్వభావానికి విరుద్ధము. అని త్యాగయ్యగారు గుర్తు చేసినారు.

83. కాంభోజి = ఆది

ప॥ ఎవరి మాట విన్నావో రావో – ఇందులేవో భళిభళి॥ ఎవరి॥

అ॥ అవనిలో ఆర్షేయపౌరుషేయ – మంది చోద్యమెరుగలేనయ్య॥ ఎవరి॥

చ॥ భక్తపరాధీను డనుచు పరమ– భాగవతులచే వింటి
వ్యక్తరూపుడై పలికిన ముచ్చట–యుక్త మను కొంటి
శక్తిగల మహాదేవుడు నీవని – సంతోషముతో నుంటి
సక్త చిత్తుడగు త్యాగరాజనుత–సత్యసంధుడనుకొంటి–ఇలలో॥ ఎవరి॥

తాత్పర్యము :

ఓ రామా! నే నెన్నో మొరలు పెట్టుచున్నాను. నీ దయ రాకున్నది. త్యాగయ్యను రక్షించవద్దు. అని ఎవరయినా నీకు చెప్పితే ఆమాటలు విన్నావా?చాలా దూరమని రాకుంటివా? ఇందులేవా? బలే బాగున్నది లేవయ్యా. ఆర్షేయము పౌరుషేయమును రెండును కలవాడవు. ఎవరి మాటనో నీవు వినుట బాగుగలేదు. నాకాశ్చర్యముగా నున్నది. ఏమియు నెరుగలేకుండ ఉన్నాను. అదియు కాక నీ రూపమును వ్యక్త పరచి నీవు చెప్పిన మాటలు నిజమని నమ్మినాను. గొప్పశక్తిగల గొప్పదేవుడవు నీవు. అని సంతోషముతో నున్నాను. నామనస్సు నీయందే సక్తమయి యున్నది. నీవు సత్యసంధుడవని నమ్మియున్నాను. అని అయ్యగారు తన దృఢ విశ్వాసమును ప్రకటించినారు.

విశేషము = అయ్యగా రిందు మూలవిరాట్టు యొక్కయు అవతారముల యొక్కయు గుణచేష్టితములను స్మరించి అవి ఇప్పుడు కనపడనందుకు ఆశ్చర్యపడుచున్నారు. 'ఎవరిమాట విన్నావో' = విభీషణుడు నలుగురు మంత్రులతో ఆకసమున నుండియే రామునకు నన్ను నివేదించుడు అని సుగ్రీవాదులను కోరినాడు. అప్పుడు సుగ్రీవుడు రామునితో 'వధ్యతామేష తీవ్రేణ దండేన సచివైస్సహ' = విభీషణుని తీవ్రమయిన దండమును విధించి మంత్రులతో సహా వధింపవలసినది' అని చెప్పినాడు. అప్పుడు రాముడు ఆ సుగ్రీవుని మాటను వినలేదు. 'ఓ రామా! ఇప్పు డెవరి మాటనైనా విన్నావా' అని ప్రశ్న. 'ఆర్షేయ పౌరుషేయములు'= ఒక వ్యక్తి యొక్క విశిష్టత అతని ఆర్షేయము పైన (ఋషి సంప్రదాయము) పురుషుని = వంశపు మూలపురుషుని బట్టివచ్చిన దానిపైన ఆధారపడి ఉంటుంది. ఋషి సంప్రదాయము వసిష్ఠ ఋషిది. అందుచేత రామునిది చక్కని ఆర్షేయము. ఇదికాక రఘుమహారాజు గోత్రకర్తగా భావింపబడినాడు. అందుచేత రఘువంశము అని కీర్తి. ఆరఘువు విశ్వజిద్యాగము జేసి కోశమంతయు కొల్ల

పెట్టినవాడు. అతడు మూలపురుషుడు. ఇటువంటి ఆర్షేయ పౌరుషేయములు గలవారు స్వతంత్రులుగా చేయవలసిన విధిని చేసెదరు కాని ఎవరి మాటలో వినరు. అట్లుండ వలసిన రాముడు ఎవరి మాటలో విన్నాడని త్యాగయ్యగారి ఆశ్చర్యము. గజేంద్రుని మొరవిని ''అలవైకుంఠపురమ్ములో'' నున్న వాడు ''సిరికిం జెప్పడు'' అన్నంత వేగముతో ఆవేగముతో వచ్చినాడు శ్రీహరి. అట్టివాడు వచ్చుట లేదు. అందుకని అయ్యగారు. ''రావో'' అని అడిగిరి. '' ఇందులేవో'' అని. అసలు ఆయన రానే అక్కరలేదు. హిరణ్య కశిపుడు '' ఎందుగలడు'' అని అడిగితే ప్రహ్లాదుడు '' ఇందుగల డందు లేడని '' చెప్పితే అప్పటికప్పుడు ''సర్వోపగతడు చక్రి'' అనే మాటను నిజము చేస్తూ అందే ఆవిర్భవించినాడు. అట్టివాడవు రామా ! ''నీ విందు లేవో'' అని అయ్యగారు చోద్యమందిరి. మరియు రాముడు '' భక్త పరాధీనుడు'' అని పరమ భక్తులు చెప్పగా నేను విన్నానయ్యా! అంతే కాక నీవు కృష్ణావతారములో వ్యక్త రూపుడవై=విశ్వరూపమును జూపించి ''మోక్షయిష్యామి మాశుచః''=మోక్షము కలుగ జేసెదను. శోకింపకుము''. అని పలికినావు. దానిని నమ్మియున్నాను. ఆశ్రయింప బడిన దేవుడు ఉదారుడై శక్తిమంతుడై యుండాలి. ఉపనిషత్తు ''పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే''= భగవానుని శక్తి గొప్పది. వివిధ మయినది '' అని చెప్పినది. ఇక నాకేమి లోపము? అని సంతోషముతో నున్నాను. కాని ఇవన్నీ ఎటో పోయి ఇప్పుడు రాక, రక్షించక యున్నావు. అని అయ్యగారు చోద్య మందిరి.

84. దేవగాంధారి = ఆది (నౌకాచరితము లోనిది)

ప॥ ఎవరు మనకు సమాన మెవరిలలో – నింతు లార నేడు ॥ ఎవరు ॥

అ॥ అవని హరి హరబ్రహ్మాది సుర– లాస చే మోస పోయిరి గనుకను ॥ ఎవరు॥

చ॥ నలువ తనయపై మోహము జెంది–నాడు తగిలిపోయె–ముద్దు
లొలుకు శ్రీహరి వలచుచు బృందా–లోలుడై పోయె
చిలువ భూషణుడు దారుకావనపు–చెలుల పాలాయె–గో
కులమున త్యాగ రాజనుతుడు మన–వలల దగిలిపోయె గనుకను॥ ఎవరు॥

తాత్పర్యము :

నౌకావిహారము చేయుచున్న గోపికలు సౌందర్య గర్వముతో ఒకరితో నొక రిట్లనుకొను చున్నారు. మనతో (స్త్రీజాతితో) ఎవరు సమాన మగుదురు? కారని, ఈలోకంలో హరి హర బ్రహ్మలు కూడ స్త్రీవ్యామోహానికి చిక్కి మోసపోయిన వారే.

అలనాడు బ్రహ్మ తన కూతురయిన సరస్వతి మీదనే వ్యామోహ పడినాడు కదా ! శ్రీహరి బృందాదేవి మీద వ్యామోహ పడినాడు కదా! చిలువ భూషణుడు= సర్పములను ధరించిన శివుడు దారుకావనములో ఋషి పత్నులపై వ్యామోహమునకు చిక్కినాడుకదా! ఇక వ్రేపల్లెలో కృష్ణుడు మన వలలో వలపులో చిక్కుకొన్నాడు కదా! మన సాటి ఎవరు ? అని గోపికలు గర్వపడినారు.

85. కిరణావళి = దేశాది

ప॥ ఏటి యోచనలు జేసేవురా। ఎదురు బల్కు వారెవరు లేరురా ॥ ఏటి॥

అ॥ నోటి మాట జార్చగ రాదురా। కోటి వేల్పులలో మేటి యైన నీ॥ వేటి॥

చ॥ మెండు శూరులలో వెనుక దియ్యవని। రెండు మాటలాడువాడు గాదని
అండకోట్ల పాలించు వాడని –చండమౌను లాడ త్యాగరాజ నుత॥ ఏటి॥

తాత్పర్యము :

అయ్యగారికి రాముడేదో ఆలోచిస్తున్నట్లు కనిపించినాడు. అప్పుడు ప్రశ్నిస్తున్నారు. ఏమిరామా! యోచిస్తున్నావు ? (నన్ను వదలి పెట్టే యోచనలు అయి ఉండును) చెయ్యిలే. ఎదురు అడిగేవారు ఎవరును లేరయ్యా నిన్ను. (నేనడుగుతున్నాను) భక్తుల రక్షణమందు ఎన్నో బాసలు చేశావు. ముందే ఆలోచించుకొని నోటి మాట జార్చవలెను. ముప్పది మూడు కోట్ల దేవతలలో మేటి అయిన నీకిది తగదు. తపస్సంపన్నులయిన మునులు సూరాగ్రణి వని, రెండు మాటలు మాటలాడేవాడు కాడని, బ్రహ్మాండ సమూహములను పరిపాలించు వాడని నిన్ను కొనియాడుతూ ఉండగా నీవిట్టి యోచనలు చెయ్యరాదు.

విశేషము = విశ్వామిత్రుడు తన యజ్ఞమును పాలించుటకు రాముని పంప గోరినప్పుడు దశరథుడడ్డు చెప్పినాడు. అప్పుడు విశ్వామిత్రుడు ''అహం వేద్మి మహాత్మానం రామం సత్య పరాక్రమం। వసి ష్ఠోపి మహాతేజాః। యే చేమే తపసి స్థితాః''= ఓదశరథా ! రాముడు మహాత్ముడని, సత్య పరాక్రమము గలవాడని నేనెరుగుదును. అంతేకాదు మహా తపస్సంపన్నులయిన వసిష్ఠాది మునులును (నీ సంస్థాన మందున్న వారు) ఎరుగుదురు. మరియు వాల్మీకి ఒక చోట ''రాముడు'' ద్విర్నాభిభాషతే''= రెండుమాటలు మాట్లాడడు'' అని అన్నాడు. అట్లు మునుల చేత ఎరిగి కొని యాడబడిన నీవు నా రక్షణమునకు సందేహించుట తగదని త్యాగయ్య గారి హిత బోధ ఇది.

86. వరాళి = చాపు

ప॥ ఏటి జన్మమిది హా ॥ ఓ రామ॥ ఏటి॥

అ॥ ఏటి జన్మమిది ఎందుకు కలిగెనొ – ఎంతని సైరింతుహా ! ఓ రామ ॥ ఏటి॥

చ॥ సాటిలేని మారకోటి లావణ్యుని–మాటి మాటికి జూచి మాటలాడని తన॥ కేటి॥

2॥ సారెకు ముత్యాల హార మురము పాలు–గారు మోమును కన్నులార జూడని తన॥కేటి॥

3॥ ఇంగిత మెరిగిన సంగీతలోలుని–పొంగుచు తనివార కౌగలించని తన ॥ కేటి॥

4॥ సాగర శయనుని త్యాగరాజనుతుని – వేగమె జూడగ వేగేని హృదయము॥ ఏటి॥.

తాత్పర్యము :

అయ్యోరామ! ఏమి జన్మమిది? ఎందుకు కలిగినది? కోటి మన్మధుల సౌందర్యము గల నిన్ను మాటిమాటికిని చూస్తూ నీతో మాటలాడ లేని నా ఈ జన్మ మెందుకు ? రొమ్మున ముత్యాలహారము వ్రేలాడగా పాలుగారు నీ మోమును చూడని నాకెందుకీ జన్మము? ఇంగిత మెరిగిన సంగీత లోలుడవు. అట్టి నిన్ను తృప్తి దీరగా కౌగలించ లేని ఈ జన్మ మెందుకు? సాగర శయనుని=సముద్రము నందు పవ్వళించిన నిన్ను చూచుటకు నా హృదయము వేగిర పడుచున్నది. నాయకుని ఎడబాటును సహింపలేని విరహోత్కంఠిత నాయికావస్థను త్యాగయ్యగా రనుభవిస్తున్నారు.

విశేషము = ''ఇంగిత మెరిగిన సంగీత లోలుడు ''రాముడు'' గాంధర్వేచ విశారదః=సంగీతమున కూడ విశారదుడు'' అని చెప్పబడినాడు. ఇంగిత మెరుగుట అనగా పరుల అభిప్రాయ మెరుగుట. ఇది సంగీతము పాడువానికి కావాలి. వినువానికి కూడా కావాలి. కుశలవులు వచ్చి ఆయోధ్యలో రామ సభలో రాముని ఎదుట రామాయణగానం చేశారు. రాముడు వారి ఇంగిత మెరిగి తన ఇంగితము=ముఖ చేష్టలు ప్రకటిస్తూ విన్నాడు. సింహాసనము నుండి ఒక్కొక్క మెట్టే దిగి వచ్చినాడట. త్యాగయ్యగారు దీనిని మనసున నుంచుకొని '' ఇంగిత మెరిగిన సంగీతలోలు'' డన్నారు.

87. యదుకుల కాంభోజి = ఆది

ప॥ ఏతావున నేర్చితివో రామ– ఎందుకింత గాసి ॥ ఏ॥

అ॥ సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న–వాతాత్మాజుల తో నాడే నాటక॥ మే॥

చ॥ ఆలు వజ్రాల సొమ్ములడిగెనో- అనుజులు తల్లిదండ్రులన్న మడిగిరో
శీలు రైన వరభక్తులు పిలిచిరో చిర- కాలము త్యాగరాజ నుత నీ॥ వేతావున॥

తాత్పర్యము :

రాముడు చాలా శ్రమ చెందుతున్నట్లు కనపడినాడు త్యాగయ్య గారికి. తనను రక్షించ కుండ ఉండుటకే రాముడు నాటక మాడుచున్నట్లని పించిన దయ్యగారికి. ప్రశ్నిస్తున్నారు. ఏమయ్యా రామా! ఎక్కడ నేర్చినా వీనాటకము! సీత తమ్ములు హనుమంతుడు వీరితో కలిసి నీవు నాటక మాడుచున్నావు. ఎందుకు బాధ పడుచున్నావు? సీత నిన్ను రత్నాభరణముల నడిదిగినదా ? తమ్ములు తలిదండ్రులు అన్న మడిగినారా? శీలవంతులయిన పరమ భక్తులు ఎవరయినా నిన్ను పిలిచినారా? భార్య తమ్ములు తలిదండ్రులు నగలు అన్నము నడుగుట కల్ల. భక్తులు పిలిచినా ఇప్పుడు నీవు పట్టించుకోవు. ఇక నెందుకు బాధ నటిస్తావు? ఈ నటన లెక్కడ నేర్చినావు? అని నిలవదీసి నారయ్యగారు.

విశేషము= సీత నగలడిగే ఇల్లాలు కాదు. ఆమెకు రాముడు సమకూర్చి నక్కర లేదు. ఆమె సాక్షాత్తు లక్ష్మీదేవి. భరత శత్రుఘ్నులు శంఖ చక్రములు. లక్ష్మణుడు శేషుడు. వీరన్న మడుగరు. నీవు సాక్షాన్నారాయణుడవు కనుక నీకు తలిదండ్రులు లేరు. ఈ అవతారము ఈ పరివారము ఇదంతయు మాయానాటకమని అంతరార్థము.

88. కల్యాణి = దేశాది

ప॥ ఏతావునరా నిలకడ నీకు- ఎంచి చూడ నగపడవు। ఏ॥

అ॥ సీతాగౌరీ వాగీశ్వరియను- స్త్రీరూపము లందా ? గోవిందా॥ ఏ॥

చ॥ భూకమలార్కానిల నభమందా? లోక కోటులందా?
శ్రీకరుడగు త్యాగరాజ కరార్చిత- శివ మాధవ బ్రహ్మాదులయందా॥ ఏ॥

తాత్పర్యము :

ఓరామా! నీకు నిలకడ=స్థానము ఎక్కడ? నిన్ను చూడవలెను అంటే ఎక్కడ అని చూడను? త్రిమూర్తుల భార్యలయిన సీతా =లక్ష్మి పార్వతి సరస్వతుల యందున్నావా? భూ=భూమి, కమల=నీరు, అర్క=సూర్యుడు, అనిల=వాయువు,

నభము= ఆకాశము అనబడే పంచభూతముల యందా? చతుర్దశ భువనముల యందా? శివ విష్ణు బ్రహ్మల యందా ? నీ స్థానము అని అయ్యగారు వీటి అన్నిటియందు నిండి యున్నాడనే భావమును ప్రశ్నరూపంలో వివరించినారు.

విశేషము = భగవంతుడు సర్వవ్యాపకుడు అనే విషయమును విష్ణు, వాసుదేవ నారాయణ శబ్దములు చెప్పును. అదియును గాక ' అంతః ప్రవిష్ట శ్శాస్తా జనానాం విశ్వాత్మా''=లోపల ప్రవేశించి జనులను శాసించు విశ్వాత్మ= అందరికి ఆత్మయైనవాడు'' అని వేదము. మరియు ''య ఏషోంత రాదిత్యే''= భగవానుడు సూర్యుని లోపల నుండును'' అని ఉపనిషత్తు. ''ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే ర్జున తిష్ఠతి''=అర్జునా ! రక్షణ స్వభావము కల భగవంతుడు అన్ని భూతముల యొక్క హృదయమందున్నాడు'' అని భగవద్గీత. ముగురమ్మలు, బ్రహ్మవిష్ణు మహేశ్వరులు కూడ నారాయణుడు సృష్టించిన జనులలోనే చేరుదురు. విష్ణువు అనునది ''మధ్యే విరించి గిరిశం ప్రథమావతారః''=బ్రహ్మశివుల మధ్యలో ఏర్పడిన మొదటి అవతారమట. కనుక త్రిమూర్తుల లోని విష్ణువు కూడా నారాయణుని సృష్టిలోని దేవతల వలెనే పరిగణింప బడినాడు. మరియు ఈ కృతి యందు ''గోవిందా'' అని సంబోధించినారు. ఇందు రాముడు సర్వవ్యాపకుడను విషయము చెప్పవలసినది. దాని ననుసరించి ఈ సంబోధనము. ''గో'' అనే శబ్దానికి చాలా అర్థములున్నవి. ఆవు, ఎద్దు, కన్ను, దిక్కు=దిశ, బాణము, భూమి, వాక్కు, నీరు, కిరణము, స్వర్గము, చంద్రుడు, వజ్రాయుధము అని ఇన్నియున్నవి. గోవిందుడనగా పైన చెప్పిన అన్నిటిని పొందియున్న వాడని అర్థము. ప్రస్తుతార్థమునకు అనువుగా అయ్యగారు '' గోవిందా'' అని సంబోధించినట్లు తెలియవలెను.

89. శృతిరంజని = దేశాది

ప॥ ఏదారి సంచరింతురా – ఇకబల్కరా ... ఏ॥

అ॥ శ్రీదాదిమధ్యాంతరహిత – సీతా సమేత గుణాకర నే॥ నే॥

చ॥ అన్ని తానను మార్గమున జనితే – నన్ను వీడని భారమని ఎంచేవు
తన్ను బ్రోవరా సదా అంటే–ద్వైతుడనేవు త్యాగరాజనుత॥ ఏ॥

తాత్పర్యము :

భగవత్తత్త్వమును తెలుసుకొని ఆశ్రయించటానికి అనేకమతములున్నాయి. అందు ప్రధానముగా రెండు మార్గములు (మతములు) ఉన్నాయి. అవి ద్వైతము, అద్వైతము అని. ద్వైతము = జీవుడు ఈశ్వరుడును రెండు వేరువేరు తత్త్వములు అనునది ద్వైతము. ద్వైతము కానిది అద్వైతము. అనగా జీవుడు ఈశ్వరుడును వేరువేరుకావు ఒక్కటే తత్త్వము అని. తత్త్వమంటే వస్తువు అని. అద్వైతము 'అన్నీతాను' అను భావము కూడ. ఈ మార్గముల మీద ఒక జిజ్ఞాస కలిగినది అయ్యగారికి. కలిగి రామునే ప్రశ్నిస్తున్నారు. ఓ శ్రీద = సంపదల నిచ్చువాడా! ఆది మధ్యాంతరహిత = మొదలు మధ్య తుది లేనివాడా! సీతా సమేత = సీతతో కూడిన వాడా! గుణాకరా = కల్యాణ గుణములకు స్థానమైనవాడా! నేను ఏదారిలో (మతములో) సంచరింపవలెనో చెప్పవయ్యా! అన్నియునేను అనే అద్వైతమార్గంలో నడుద్దామా? అంటే నన్ను వీడని భారము = వదలని బరువు అని ఎంచుతావు. అనగా వేరుకాక శరీరమును అంటిపెట్టుకొని ఉన్న దుష్టాంగము ఏదైనా ఉంటే అది వదలని బరువేకదా! అట్లు భావించెదవా? అదికాక నన్ను రక్షించమని అంటే రక్షించువాడువేరు. రక్షింపబడువాడువేరు. అని నన్ను వేరు చేస్తావేమో? ఏదారి సంచరించవలెనో చెప్పవయ్యా! అని అయ్యగారు చిత్రమయిన ప్రశ్నవేశారు.

విశేషము = ద్వైతమతమున నున్నవారికి అది సరిపడి ఉంటుంది. అద్వైతమందేదో లోపము తోస్తుంది. అద్వైతమున నున్నవారికి అది సరిపడి ఉంటుంది. ద్వైతమం దేదో లోపము కనిపిస్తుంది. ఈ లోపదర్శనమే వాదములకు కలహములకు దారి తీస్తుంది. ఇది గమనించిన పెద్ద లొకమాట అన్నారు. శ్లో॥ 'కేచి దద్వైత మిచ్ఛంతి। ద్వైత మిచ్ఛంతి చాపరే। సమం తత్త్వం నజానంతి। ద్వైతా ద్వైత వివర్జితం॥' = కొందరు అద్వైతమును ఇచ్ఛగింతురు. మరికొందరు ద్వైతము నిచ్ఛగింతురు. కాని ద్వైతము నద్వైతము కాని సమాన తత్వమును తెలియకున్నారు' అని. సర్వసమానుడయిన పరమాత్ముని యందు అన్నిమతములును అన్వయించును. ఈ అన్వయమే భక్తి. అయ్యగా రీకృతియందీ తత్త్వమును తెలిపినారు.

90. కాపి = ఆది

ప॥ ఏది నీ బాహు బలపరాక్రమ – మ్మెన్నాళ్ల కెన్నాళ్లకు ఏది॥

అ॥ ఆదిదేవ! నిజదాసులకు గన–నాసయుండగా కరివరదా॥ ఏది॥

చ॥ కరమున మెరసే శరచాపము ఆ-కలి గొనలేదా
మురఖరశోణితపానము బహుదిన-ములుగా లేదా వాదా?॥ ఏది॥

2 సరసభూసురుల బాధలు విని రో--సము రాలేదా।
మొరలిడగా యోగనిద్దుర నిలిపి-మోముజూపరాదా వాదా॥ ఏది॥

3 వరుస తప్పు బుద్ధులు నీచులకు-వచ్చినది తెలియలేదా?
వెరపులేక తిరి గేరు చాలనుచు - వేగమే శ్రీత్యాగరాజ సన్నుత॥ ఏది॥

తాత్పర్యము :

అయ్యగారు రాముని బాహుబల పరాక్రమములను ఒక్కసారి చూపుమని కోరుచున్నారు. ఓ ఆదిదేవా! కరివరదా! నీ నిజభక్తులు ఒకసారి నీ బాహుబల పరాక్రమములను చూచుటకు ఆశపడుచున్నారు. నీచేతులో తళతళ మెరిసే కోదండానికి బాణములకు ఆకలి కాలేదా? ద్వాపరంలో కృష్ణుడవై మురాసురుని, త్రేతాయుగంలో ఖరాసురుని వధించిన బాణములు వాళ్ల రక్తపానము చేసినవి. అది చాలాకాల మయినది కదా! కనుక వాటికి ఆకలి కాలేదా? ఈ కలిలో సాధు బ్రాహ్మణులకు చాల బాధలు కలుగుచున్నవి. అవి విని నీకు రోషము రాలేదా? రావణ బాధితులైన సురలు ప్రార్థింపగా యోగనిద్రవీడి వారికి ముఖము జూపించి అభయమిచ్చితివి. అట్లే ఇపుడు చేయరాదా? కలి నీచులు ధర్మవిరుద్ధములైన అక్రమ కృత్యములు చేస్తున్నారు. నీకు తెలియరాలేదా? ...ము తలెత్తినపుడు అవతరించెద' నంటివి. ఇదే సమయము. ఏది నీ బాహు ...క్రమము. ప్రదర్శింపుమని త్యాగయ్యగారు బహు ఉత్కంఠతో కోరినారు.

91. భైరవి = ఆది

ఏనాటి నోముఫలమో? ఏదానబలమో? ఏ॥

శ్రీనాథ! బ్రహ్మకైన నీదు - సేవదొరకునా? తనకు గలిగెను॥ ఏ॥

1 నేను గోరు కోర్కు లెల్లను - నేడు తనకు నెరవేరెను!
భానువంశతిలక! నాపాలి-భాగ్యమా! సజ్జన యోగ్యమా! ఏ॥

2 నీదుదాపు నీదు ప్రాపు దొరకెను-నిజముగానే నీ సామ్మైతిని
ఆదిదేవ. ప్రాణనాథ నా-దంకమున నుంచి పూజించ తన॥ కేనాటి॥

3 సుందరరేశ. సుగుణబృంద. దశరథ-నందనారవిందనయన పావన
అందగాడ. త్యాగరాజనుత. సుఖ-మనుభవింప దొరకెరా భళితన॥ కే॥

తాత్పర్యము :

త్యాగయ్యగారికి రామసేవా భాగ్యము లభించినది. ఆ ఆనందమును ఆయన అనుభవించి వర్ణిస్తున్నారు. ఓ శ్రీనాథా! బ్రహ్మకైనను నీసేవ దుర్లభము. అట్టిది నాకు లభించినది. ఇది ఏనాటి నోము ఫలమో? నేను కోరిన కోర్కెలు నెరవేరినవి. ఓ భానువంశతిలక = సూర్యవంశ శ్రేష్ముడా! సాధుజనుల సహవాస యోగ్యుడా! నీ సన్నిధి దొరకినది. నీ ఆశ్రయము దొరకినది. నా పాలిటి భాగ్యమైన నీవే దొరికితివి. ఓ ఆదిదేవ! ఓ ప్రాణనాథ! నిన్ను నాతొడ మీద నుంచుకొని అర్చించే సౌఖ్యము దొరకినది. ఓ సుందరుడా! సుగుణబృంద! దశరథ నందనా! అరవింద నయనా! నీ సేవాసుఖము లభించినది. ఇది ఏనాడు చేసుకొన్న నోముల ఫలమో? దానబలమో! అని అయ్యగారానందములో నోల లాడిరి.

విశేషము = భగవదనుగ్రహము చేత భగవత్సేవారూపములగు అన్ని కోర్కెలు త్యాగయ్యగారికి నెరవేరినవి. దీనికి కారణము గత జన్మలలో చేసిన నోములే దానములే. భగవదనుగ్రహము 'యజ్ఞేన దానేన తపసా అనాశకేన' = యజ్ఞముచేత, దానముచేత, తపస్సు చేత, ఉపవాసాది వ్రతములచేత అని శాస్త్రము. నిజముగా త్యాగయ్యగారు గత జన్మలలోని నోముఫలము వలననో దానబలముచేతనో ఇంతటి రామభక్తుడగుట. రామానుగ్రహపాత్రుడగుట. బహుశః ఈకృతి త్యాగయ్యగారు రామ విగ్రహమునకు తిరుమజ్జనము (అభ్యంజనము) చేసే సమయములో దానిని తొడమీద నుంచుకొనినప్పుడు భావము పొంది పాడిన కృతి అని ఊహింపవచ్చును. అట్టి భక్తునకు 'తస్మిన్ కామా స్సమాహితాః' అన్నట్లు అన్ని కోరికలు నెరవేరినట్లే. ఈ ఆనందమునే ఆయ్యగారు ప్రకటించిరి.

92. అసావేరి = దేశాది

ప॥ ఏ పనికోజన్మించితినని నీ-వెంచవలదు శ్రీరామనే॥ నే॥

అ॥ శ్రీపతి! శ్రీరామచంద్ర నీ-చిత్తానికి తెలియదా నే॥ నేపనికో॥

చ॥ వాల్మీకాదిమునులు వరులు నిను-వర్ణించిన నా ఆశదీరునా॥
మేల్మియైయుండు. సద్భక్తులు - మెచ్చుదురే త్యాగరాజనుత॥ ఏపనికో॥

తాత్పర్యము :

ఓ రామా! నేను ఏపని చేయటానికో జన్మించానని నీ వనుకోవద్దు. ఓ శ్రీపతీ! నేనెందుకు పుట్టితినో నీకు తెలియదా? తెలుసును. నిన్ను వర్ణించుకొనుటకే పుట్టితిని. వాల్మీకి మొదలయిన మహర్షులు నిన్ను వ్రాసి కీర్తించుకొన్నారు. కాని నా ఆశతీరవద్దా? అదియును గాక నే నీపనిచేసిన సద్భక్తులు మెచ్చుదురు. మెచ్చుదురే అనినది ప్రశ్నకాదు. మెచ్చుదురు అని నిశ్చియము ఇక్కడ. భాషలో కాకుస్వరమని యొకటి యున్నది. మెచ్చుదురే అని చివరి అక్షరాన్ని ఉదాత్త స్వరముగా పలికితే ప్రశ్న అవుతుంది. అనుదాత్త స్వరంగా పలికితే నిశ్చియ మవుతుంది. త్యాగయ్యగారి మనస్సులో ఆ కాకు స్వరము అనుదాత్తము.

విశేషము = భోజమహారాజు తాను మళ్ళీ రామాయణ కథను సంగ్రహించి చంపూ కావ్యముగా (గద్యములు పద్యములు కలిగిన కావ్యముగా) రచింపదలచుకొన్నాడు. వాల్మీకి వ్రాసియున్నాడు కదా! ఇక తానెందుకు? అని తానే ప్రశ్నించు కొని ఇట్లు సమాధానము చెప్పినాడు. శ్లో॥ వాల్మీకి గీత రఘుపుంగవ కీర్తి లేశైః। తృప్తిం కరోమి కథమ ప్యధునా బుధానాం। గంగాజలై ర్భువి భగీరథ యత్నలబ్ధైః। కింతర్పణం నవిదధాతి నరః పితృణాం'' = వాల్మీకి వర్ణించిన రాముని కీర్తి నుంచి లేశమును గ్రహించి ఎట్లో పండితులకు తృప్తి కలుగ జేయుదును. భగీరథుని ప్రయత్నముచేత లభించిన గంగాజలములతో నరుడు తన పితృదేవతలకు తర్పణము చేయుచున్నాడు కదా' అని. త్యాగయ్యగారును ఇట్లే చెప్పిరి. నా పుట్టిన ప్రయోజనము రామగానమే. దీనిని సద్భక్తులు మెచ్చెదరు అని.

93. అరాణ = త్రిపుట

ప॥ ఏ పాపము జేసితిరామ నీ-కేపాటైన దయరాదునే॥ నేపాపము॥

అ॥ నీ పాదములను గ-న మొరలిడితే-ఈ పాటున విని విననట్లుండుటనే॥ నే॥

చ॥ నాదరూపుడవని వినినే శ్రీ-నాథ! నిన్ను నమ్మితిని
నాదాపురమున నుండియు-నన్నాదరించక యూరకుండుటకునే॥ నేపాపము॥

2 ఎందుకనుచుసైరింతురా రామ-ముందు వెనుక తోచదురా
ముందునిలిచి పలుకు రా నా-యందునీకు ఈవరకు మరపురా॥ ఏపాపము॥

3 గారవింప దయ రాదా పాలు-గారు మోము జూపరాదా?
యూరకుండుట మరియాదా నా-దూర దెల్పువా రెవ్వరురా! ఏపాపము॥

4 కన్నవారిని వేడినానా? నా-యన్న నిన్నాడుకొన్నానా?
నిన్ను నమ్మిన వాడను గానా? ముని-సన్నుత! కపటము లన్నినాతోనా? ఏపాపము।

5 వినవయ్య ఇనకుల ధనమా? రామా-నిను నమ్మి ఇంక దురితమా భ
వనమున నీకిది ఘనమా నీ-మన సిటువంటి దనుచును దెలుపుమా॥ ఏపా॥

6 సదయుడై ఇంక వరాకా నా-హృదయవాసుడు నీవేకాక
ఇది బుద్ధి యని తెల్పలేక నాడు-మొదలుగాను యూరకున్నావుగాక॥ ఏ॥

7 రాజశేఖర సన్నుతాంగ త్యాగ-రాజ హృదబ్జసు భృంగ
రాజిత కరుణాపాంగ రతి-రాజజనక పావధ్వాంత పతంగ॥ ఏ పాప॥

తాత్పర్యము :

నే నేపాపము జేశానో? నీకు ఇంతయినా దయరావటంలేదు. నీ పాదములను జూపుమని నేను ఎంతో ప్రార్థిస్తున్నాను. నీవు నాదరూపుడవని విని నమ్మి నాదోపాసన ద్వారా నిన్ను అర్చించుకుంటున్నాను. ఆ విధంగా నాకు దగ్గర అయికూడ నీవు నన్నాదరించకుండా ఉన్నావు. ఏ పాపము చేశానో? ముందువెనుకలు తెలియక ఉన్నాను. నా ముందు నిలువుము. నా విషయమును నీకు మతిమరపుకదా! నన్ను గారవించి = మన్నించి పాలుగారు నీమోము జూపు. చూపకుండుట మర్యాద కాదు. ఎవరితోనైనా నీకు చెప్పిద్దామంటే ఇది నా ఊరు కాదుకదా! నేనేమి తప్పుజేశాను? చూచిన అల్పులను వేడుకొన్నానా? నిన్నేమయినా వాటలన్నానా? ముని సన్నుత = మనులచే నుతింపబడినవాడా! నేను నిన్నే నమ్మి యున్నాను. నీ కపట మంతయు నామీద నేనా? ఓ ఇనకుల ధనమా! = సూర్యవంశమునకు కులధనమైనవాడా! నాయందేదయిన పాపమున్నదని యోచించుచున్నావా? నిను నమ్మిన తరువాత పాపము లుండునా? ఉండవు అని. భవనమున నీకిది ఘనమా? అంటే నీ గృహమున నీవు స్థానబలముతో నున్నానని నన్ను అనాదరించుట గొప్పతనమా? అని ఒక విధముగా చెప్పవచ్చును. ఈ అవతారమున ఇట్లుండుట గొప్పతనమా; అనియును చెప్పవచ్చును. దయగలవాడవై యుండి కూడ ఈ పరాకు తగదు. నా హృదయమందు నీకే స్థానము. మరెవ్వరికిని లేదు. నాయం దేదయినా బుద్ధిలోపము ఉంటే నాటి నుంచి అది చెప్పలేక ఊరకున్నావా? రాజశేఖర సన్నుతాంగ = శివునిచే నుతింపబడిన శరీరముగలవాడా! త్యాగరాజ హృదబ్జ

సుభృంగ= త్యాగరాజుని హృదయమనెడి పద్మమందు సంచరించు తుమ్మెదా! రాజిత కరుణాపాంగ= కరుణతో ప్రకాశించు కడగంటి చూపులు గలవాడా! రతిరాజ జనక = మన్మధుని తండ్రీ! పాపధ్వాంతపతంగ = పాపములనెడి చీకట్లకు సూర్యుడా! నేనేపాపము చేసితినో చెప్పవయ్యా! అని.

విశేషము = నాదరూపుడు రాముడు. అనగా నాదమే శబ్దము. రామ, దాశరథి ఇత్యాది శబ్దములు భగవంతుని రూపమును మన మనస్సున నిలుపుచున్నవి. ఈ శబ్దములే కాకపోతే శ్రవణ, మనన, నిదిధ్యాసలేలేవు. కనుక రాముడు నాదరూపుడు. ఆనాదరూపుని నాదముతోనే (నామములతోనే) ఉపాసించుచున్నాము. సంగీత శాస్త్రమున 'నాదోపాసనయా దేవాః। బ్రహ్మ విష్ణు మహేశ్వరాః। భవంత్యుపాసితా నూనం। యస్మాదేతే తదాత్మకాః' = 'బ్రహ్మ విష్ణు మహేశ్వరులు నాదోపాసన ద్వారానే ఉపాసింపబడుచున్నారు. కనుక వారు నాదరూపులు' అని చెప్పబడినది. త్యాగయ్యగారు చెప్పినదిది. 'నాదాపురమున నుండియు నన్నాదరింపకున్నావు' భగవానుడు అంతర్యామియై మన దగ్గరనే ఉంటాడు. కాని దూరమై మనకు కనపడడు. దీనినే ఉపనిషత్తిట్లు చెప్పినది. 'త దంతికే తద్దూరే' = అని. భగవత్తత్త్వము దగ్గర నున్నది, దూరమందున్నది అని. 'ఇనకులధనమా!'' సూర్యవంశ ప్రభువుల కులధనము రాముడని చెప్పవచ్చును. బ్రహ్మ లోకమునుండి ఇక్ష్వాకు మహారాజు నారాయణ మందిరమును భూలోకమునకు తెచ్చుకొని అయోధ్యలో స్థాపించుకొని పూజించి తమ వంశకులధనముగా భావించినాడు. ఆ నారాయణుడే రాముడు. ఆ విధముగా కూడ సూర్యకులమునకు ధనమైనాడు. అంతే కాక త్యాగయ్యగారు రాముని తనకులధనముగా భావించుకొన్నారు.

94. తోడి = ఆది

ప॥ ఏమని మట్లాడితివో రామ–ఎవరి మనసు కేవితమో తెలిసి॥ ఏ॥

అ॥ మామ మరుదు లనుజులు తలిదండ్రులు–భామలు పరిజనులు స్వవశమౌట॥ కే॥

చ॥ రాజులు మునులు సురాసురులు వరది –
గ్రాజులు మరిసూరులు శశధర దిన
రాజులు లోబడినడువను త్యాగ–
రాజవినుత నయభయముగ ముద్దుగ॥ ఏ॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు రాముని మాట్లాడే తీరును గూర్చి ఆనందపడుచున్నారు. రామా! ఆహా! ఏమని మాట్లడితివో? ఎవరి మనస్సుకు ఏ విధంగా మాట్లాడితే నచ్చుతుందో అది తెలిసి మాట్లాడితివి కదయ్యా! మామ మరదులు తమ్ములు తల్లిదండ్రులు స్త్రీలు పరిజనులు వీరందరును నీకు వశం అయ్యేవిధముగా ఏమని మాట్లాడితివయ్యా! అంతేకాదు రాజులు, మునులు, దేవదానవులు, దిక్పాలకులు, పండితులు, అందరు నీకు వశం అయ్యే విధముగా ఏమని మాట్లాడితివయ్యా! మరియు సూర్యచంద్రులు నీ ఆజ్ఞానువర్తులై నడచునట్ల ఏమి మాట్లాడితివో? అని త్యాగయ్యగారు రాముని మాట్లాడు తీరును గని అబ్బురపడినారు.

విశేషము = రామాయణమున 'స్మితపూర్వాభిభాషీచ। పూర్వభాషీచ రాఘవః'' = ఎవరయినా ఎదురు పడినప్పుడు నవ్వుచు తానే రాముడు ముందు పలుకరించెడువాడు' అని చెప్పబడినది. మరియు బంధువులలో ఎవరితో ఎట్లు మాటలాడవలెనో పరిజనులతో ఎట్లు మాటలాడవలెనో వారి వారి మనసెరిగి వారు తనవశం అయేటట్లు మాటలాడుటలో నేర్పరి. పండితులతో పండితవాదము, మునులతో ఆధ్యాత్మిక వాదము, రాజులతో రాజనీతి వాదము ఇట్టి వెన్నో రామాయణమున ఎడనెడ కన్పట్టును. ఉదాహరణమునకు 2, 3, చూపబడుచున్నవి. రాము డరణ్యవాసమునకు సిద్ధమయినాడు. దశరథుని ఆజ్ఞకై వచ్చినాడు. అపుడు దశరథుడు సుమంత్రునితో 'అయోధ్యలోని సంపద లన్నీ రామునితో అడవికి పంపుమని' ఆదేశించినాడు. అపుడు కైకేయి గతుక్కుమన్నది. రాముడది గమనించి అమ్మా! ఒకవేళ అట్లు పంపినచో ఆ సంపదల నన్నిటిని నేను వెంటనే తిరిగి భరతునకే చేర్చుతాను. అన్నాడు. ఆమెస్తిమితపడినది. విభీషణుడు వచ్చి ఆశ్రయించినాడు. సుగ్రీవుడు విభీషణుని వధింపుమని సూచించినాడు. అపుడు నీ సూచన నాకు నచ్చలేదు. నా ఇష్టం వచ్చినట్లు నేను చేస్తాను అని సుగ్రీవునితో అనలేదు రాముడు. మరి ఏమన్నాడు? సుగ్రీవా! నీవు చెప్పిన మాటలు చాలా యుక్తి యుక్తములు. మిత్రుని క్షేమము కోరినవాడు చెప్పవలసిన యుక్తములయిన మాటలు చెప్పినావు. నీవంటి మిత్రుడుండునా? కాని శరణాగతునకు అభయమిచ్చుట నావ్రతము. అని చెప్పినాడు. ఎంత సరసముగా రాముడు సుగ్రీవునకు నచ్చజెప్పినాడో గమనార్హము. ఇదే రాముని మాటతీరు. అయ్యగారు 'సూర్యచంద్రులు నీ ఆజ్ఞ చొప్పున నడచుచుండిరి' అనిరి. 'యస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌతిష్ఠతః' = ఓ గార్గీ! భగవంతుని ఆజ్ఞ చేతనే సూర్యచంద్రులు ఒకరినొకరు పట్టుకొని ఉదయాస్తమయములు చేయుచున్నారు' అని చెప్పబడినది. అయ్యగా రన్నదిదే.

95. శ్రీమణి = ఆది

ప॥ ఏమందు నే విచిత్రమును-ఇలలోన మనుజులాడే॥ దేమందు॥

అ॥ నీ మంత్రమహిమ నెరుంగలేక-సామాన్యులై బల్కేరు నీతో॥ ఏమందు॥

చ॥ తామసంబుచేత తత్వంబు బలుకుచు-కామదాసులై కరుణమాలిమదిని
భూమి సంచరించి పొట్టనింపుచును - తామె పెద్దలంట త్యాగరాజనుత॥ ఏమందు॥

తాత్పర్యము :

రామమంత్ర మహిమ తెలియలేక తామస గుణ ప్రవృత్తికలిగి కామ దాసులై కరుణమాలి తిరుగుతూ తాము పెద్దలమని పలుకుతూ ఉంటారు. అని కలిమానవుల ప్రవృత్తిని చూచి జాలిపడినారు. చాలా సామాన్యము.

96. వీరవసంతము = ఆది

ప॥ ఏమని పొగడుదురా ని-న్నేమని పొగడుదురా

అ॥ శ్రీమ న్నభోమణి వంశల - లామా భువనవాసీ మారామని॥ న్నే॥

చ॥ శివునకు తామసగుణమిచ్చి కమల - భవునకు రాజసగుణమొసగి శచీ
ధవుని గర్వహృదయునిగా జేసిన - దాశరధీ త్యాగరాజ వినుత-ని॥ న్నేమని॥

తాత్పర్యము :

శ్రీమ - - లామా = సూర్యవంశమందు శ్రేష్ఠమయిన వాడా! సమస్తదేవతలకు ఆయాగుణములనిచ్చి నడపుచున్నావు. అని సామాన్యము.

97. తోడి - చాపు

ప॥ ఏమి జేసితే నేమి శ్రీరామ - స్వామికరుణ లేని వారిలలో॥ ఏమి॥

అ॥ కామ మోహదాసులై శ్రీరాముని-కట్టు తెలియలేని వారిలలో॥ ఏమి॥

చ॥ సవము జేసితే నేమి, కలిమికి పుత్రో-త్సవము కల్గితే ఏమి
భువిలో నన్యబీజ జనితుని గొని ఏమి-శివకర శ్రీరాముని దయలేనివా॥ రేమి॥

2 మేడగట్టితే ఏమి అందున లాందర్-జోడు గట్టితే ఏమి
చేడియలను మెప్పించ గలిగిఏమి - ఈడు లేని రాముని దయలేనివా॥ రేమి॥

3 ఇమ్ము గలిగితే నేమి ఇల్లాలికి - సొమ్ము బెట్టితేఏమి
కమ్మవిల్తుని కేళి దెలిసి ఏమి - తమ్మికంటివాని కరుణలేనివారిలలో॥ నేమి॥

4 రాజ్యమేలితే నేమి - బహుజనులలో-పూజ్యులైతే నేమి
ఆజ్యప్రవాహముతో నన్నమిడితే నేమి - పూజ్యుడైన రాముని దయలేనివా॥ రేమి॥

5 గురువు తానై ఏమి-కంటికి మేను-గురువై తోచితే ఏమి
వరమంత్రమన్యుల కుపదేశించితేఏమి-వరత్యాగరాజనుతుని దయలేనివా॥ రేమి॥

తాత్పర్యము :

ఈ లోకంలో ఎన్ని గొప్పపనులు చేసినా, ఎంత సామర్థ్యము గలిగి ఎన్ని సంపదలున్నా, ఎన్ని పదవులున్నా శ్రీరాముని దయలేకపోతే ఇవన్నీ సున్న అని భావము.

విశేషము = అయ్యగారికి పుత్ర సంతానములేదు. దత్తత తీసుకొమ్మని ఎవరో సూచించిరి. రాముని కరుణలేకపోతే ఇవన్నీ వ్యర్థములు అనే భావముతో 'పుత్రోత్సవము కల్గితే ఏమి' 'అన్యబీజ జనితునిగొని ఏమి' = పుత్రుడు కలిగినా వ్యర్థమే, అన్యబీజమునకు పుట్టినవాని కొనినా రాముని దయలేకపోతే వ్యర్థమే అని, ఈ విషయమును మధ్యలో నుంచి అటూ ఇటూ ఇంకా కొన్ని విషయములను చేర్చి సర్వమును వ్యర్థమే అని అయ్యగారు చెప్పిరి. దీనిని తలపించు కులశేఖరుల సూక్తి ఒకటున్నది.

శ్లో॥ ఆమ్నాయాభ్యసనా న్యరణ్యరుదితం వేదవ్రతా న్యన్వహం
మేదశ్ఛేదఫలాని పూర్తవిధయ స్సర్వే హుతం భస్మని
తీర్థానా మవగాహనానిచ గజస్నానం వినా యత్పద
ధ్యానాంభోరుహ సంస్మృతి ర్విజయతే ధ్యేయస్స నారాయణః॥

= భగవత్పాదస్మరణము, భక్తి లేకపోతే వేదాధ్యయనము అరణ్యరోదనమే. ఉపవాసాది వ్రతముల వలన ప్రయోజనము కొవ్వుకరగుట మాత్రమే. చెరువులు త్రవ్వించుట వంటిది బూడిదలో పోసిన నెయ్యే. పుణ్యతీర్థ స్నానములు ఏన్గు చేసిన స్నానమే = ఏనుగు చెరువులో బాగామునిగి శుభ్రమై గట్టుకువచ్చి వెంటనే దుమ్ము తుండముతో పీల్చి నెత్తిన

చల్లుకుంటుంది. ఇక స్నానం చేసిన ఫలితమేది? అని. ఇదే విధముగా రామకృపలేకపోతే సర్వమును వ్యర్థమని అయ్యగారు చెప్పిరి. ఒక చిత్రము. రామకృపలేకపోతే తక్కినవి వ్యర్థములు. రామకృప ఉంటే కూడ తక్కినవి వ్యర్థములు.

98. శంకరాభరణం = ఆది

ప॥ ఏమినేరమో నన్ను బ్రోవ – ఎంతభారమె నావల్ల॥ నేమి॥

అ॥ సామజరాజ వరదుడని మునులలో – సత్కీర్తి కల్గలేదా! నాపై॥ ఏమి॥

చ॥ దీనబంధువని దేవదేవుడని – మానమనుడని ధర్మాత్ముడనుచును
జ్ఞాన ధనులు గుణగానముసేయ బి–రాన జూడవో త్యాగరాజార్చిత నాపై॥ ఏమి॥

తాత్పర్యము :

రామా! ననురక్షించుట నీకు భారముగా తోచుచున్నదా? లేక నాయందు ఏమయినా నేరమున్నదా? గజరాజు నేలినవాడవని, దీనులకు బంధువువని, దేవతలకు దేవుడవని, అభిమానధనుడవని ధర్మాత్ముడవని మునులలో నీకు పెద్దకీర్తి కలిగినది. జ్ఞానులందరును నీ గుణములు గానం చేస్తున్నారు. మరి నన్ను రక్షించే అభిమానము కనపడుటలేదు. ఆ ధర్మమును కనపడుటలేదు. నా నేర మేమిటో తెలుపవలసినదని అయ్యగారు వేడుకుంటున్నారు.

99. సారంగ = ఆది

ప॥ ఏమిదోవ బల్కుమా ఇకను నే–నెందు బోదు శ్రీరామ॥ ఏమి॥

అ॥ రామదాసు వలెనైతే సీతా–భామ మందలించును నీతో తన॥ కేమి॥

చ॥ దట్టిగట్టి కరమున శరచాపము – బట్టి మూలబలమును రావణుతల
గొట్టి నిల్వనావేళ త్రిమూర్తులు – కోరి నుతింపగా॥
అట్టివారి కెదురు బల్కి రాజుకు పట్టియనగ నీకు నాదుపై దయ
బుట్టకారణం బేమి తెలిసె వర–భోగిశయన! త్యాగరాజనుత! తన॥ కేమి॥

తాత్పర్యము :

రాముని దయవచ్చుటలేదు. అయ్యగారికి అనుమానము కలిగింది. ఓ రామా నాకు దారిజెప్పు. నన్ను నీవు రక్షింపవలె నంటే ఏ దారిలో పోవలెనో చెప్పుము. అని అయ్యగా రడిగినారు. ఇంతలో ఒక ఆలోచన వచ్చినది. ఓ రామా! నేను రామదాసు లాగ అయితే సీత నన్ను గురించి రక్షించుమని నీతో చెప్పియుండేది. అట్లు గానయితినే? సరి. త్రిమూర్తులు వచ్చి ఒకవేళ నన్ను రక్షించుమని చెప్పినా నీవు వినవు. అలనాడు రావణుని మూలబలములను సంహరించి రావణుని కూల్చినప్పుడు త్రిమూర్తులు వచ్చి నిను నుతించినారు. అప్పుడు వారికి ఎదురు చెప్పినావు నేను రాజకుమారుడనని. నీకు నాపై దయబుట్టే కారణమేమి? అని ప్రశ్న. వెంటే 'తెలిసె' అని అయ్యగారే చెప్పుకొనిన సమాధానము. ఏమి? రామదాసునివలె నయితే సీత మందలించును, అపుడు రాముడు రక్షించును అని.

విశేషము = రామదాసు గుళ్ళు గోపురాలు కట్టించి తానీషాకు అప్పుపడి చెరసాలలో పడి పలు బాధలకు గురి అయి 'ననుబ్రోవమని చెప్పవే' అని సీతను ప్రార్థిస్తే ఆమె రాముని మందలించినది. అన్ని బాధలు పడవలెనా? రామా అదియా దోవ? అని ప్రశ్నించి నారయ్యగారు. వెంటనే రామాయణమందలి ఇంకొక ఘట్టము స్ఫురించినది. అది రాముని స్థిరచిత్తము. రావణ వధ మయినది. దేవతలందరు సంతోషపడినారు. బ్రహ్మ శివ కేశవులతో వచ్చి రామునితో 'నీవు సాక్షాన్నారాయణుడవు' అన్నాడు. రాముడు 'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజం' = మీ రన్నదేమియును కాదు. నేను మానవుడనని దశరథుని కుమారుడనని రాముడ నని మాత్రమే అనుకొనుచున్నాను అని పలికెను. అట్లు త్రిమూర్తుల మాటకు కూడ ఎదురుబల్కు నిష్కర్ష స్వభావము. రామదాసువంటి ఇక్కట్లు తనకు లేవు. అందుచేత సీతామాత కూడ రాముని మందలించదు. కనుక రాముని కరుణబుట్టే కారణమేదీ కనపడలేదని అయ్యగా రీకృతిలో ఆవేదన తెలియజేసినారు.

100. పకుకాభరణం - త్రిపుట

ప॥ ఏ రాముని నమ్మితినో నే-నే పూల పూజ చేసితినో॥ ఏ॥

అ॥ వారము నిజదాస వరులకు రిపులైన-వారి మదమణచే శ్రీరాముడు గాదో॥ ఏ॥

చ॥ ఏకాంతమున సీత సోకోర్చి జోకొట్ట-కాకాసురుడు చేయు చీకాకు సైరించు॥
కోకమదిని దయలేక బాణమునేసి-ఏకాక్షుజేసిన సీతాపతిగాదో॥ ఏ॥

2 దారపుత్రులవద్ద చేరనీక రవికు-మారుని వెలపట బారదోలి గిరి
జేరజేసినట్టి తారానాయకుని సం-హారము జేసిన శ్రీరాముడు గాదో॥ ఏ॥

3 రోషమునాడు దుర్భాషలను విని వి-భీషణుడావేళ ఘోషించి శరణన
దోషరావణు మద-శోషకుడైన ని-ర్దోషత్యాగరాజ పోషకుండు గాదో॥ ఏ॥

తాత్పర్యము :

త్యాగయ్య రాముని మనసార నమ్మియున్నాడు. ఎటువంటి రాముని తాను నమ్మినాడు? తన నాశ్రయించిన వారి శత్రువుల మదమణచే రాముని నమ్మియున్నాడు. ఈ నమ్మియుండుటయే మహాభాగ్యము. ఆహా ఈ భాగ్య మబ్బినది. పూర్వజన్మమున ఏ పూలతో పూజచేశానో అని అయ్యగారు మహాసంతోష మనుభవించినారు. తాను రాముని భావించిన రీతికి నిదర్శనముగా మూడు కథలను చూపినారు. అరణ్యవాసములో ఏకాంతమందు సీతతొడమీద రాముడు సుఖనిద్రపోవుచున్నాడు. ఆ సమయములో కాకాసురుడు సీత వక్షస్థలమును చీరినాడు. ఇంతలో రాముడు నిదురలేచినాడు. చూచినాడు. సహింపలేకపోయినాడు. 'కఃక్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా' = సీతా! ఎవడు నీకపకారము జేసినవాడు? పడగవిప్పిన పామువో ఎవడు చెలగాటము లాడినవాడు' అని కోపించి దర్భను బ్రహ్మాస్త్రముగా మంత్రించి కాకాసురునిపై వదలినాడు. అది వానిని మూడులోకములు త్రిప్పినది. తుదకు వాడు రాముని శరణుగోరినాడు. రామాస్త్రము వ్యర్థముకాదు కనుక కాకాసురుని ఒక కంటిని ఆ అస్త్రము బలిగా తీసుకొన్నది. (చావు తప్పి కన్నులొట్టపోయినది. అనే సామెతకు ఈ కథయే మూలము). తరువాత వాలి సుగ్రీవుని కిష్కింధకు చేరనీక తరిమికొట్టినాడు. సుగ్రీవుడు గతిలేక ఊరివెలుపలి ఋశ్యమూక పర్వతముపై తల దాచుకొన్నాడు. రాముని ఆశ్రయించినాడు. రాముడు వాలి సంహారము చేసినాడు. మూడవది విభీషణుని కథ. విభీషణుని రావణుడు తూలనాడి విభీషణునికి శత్రువయినాడు. విభీషణుడు రామున కాశ్రితుడైనాడు. ఆశ్రిత విరోధి అయిన రావణుని రాముడు సంహరించినాడు. అయితే ఇక్కడ నొక సందేహము కలుగును. రాముడు రావణుని విభీషణునికై సంహరింపలేదు. సీతకోసమై సంహరించినాడు. అది స్వార్థమే కదా అని. నిజమే. వివరముగా ఆలోచిస్తే సీతాపహరణము వ్యాజమే (వంకే). నిజానికి రావణుని వద్దనున్నది మాయసీత. నీజసీత అగ్నిదేవుని రక్షణలో నున్నది. రావణుడు ఆ సమయమున దిక్కుమొక్కు లేనివాడయినాడు. దానిని వదలి సీతను గైకొనవచ్చును రాముడు. వానిని వధించియే తీరెను. ఇందుకూడ మూలమునకు వెళ్లితే ఆశ్రితులయిన దేవతలకు విరోధి అగుట

చేతనే రావణుని సంహరించినాడు. అనాథుని చేసి విడచి పుచ్చక సంహరించినా డంటే? వాడు సంహరింపబడితేనే విభీషణుడు రాజగుట. అందుచేత నిజభక్తుడయిన విభీషణుని శత్రువగుటచేతనే రావణసంహారము చేయుట పరమార్థము. అని అయ్యగారి అభిప్రాయము. ఇవి మనస్సునందుంచుకొని అట్టి రాముని నమ్ముకొని యున్నాను కదా! 'ఏ పూల పూజచేసితినో' అని. ఇవి 'నామ కుసుమములు' కావచ్చును. 'అహింసా ప్రథమం పుష్పం। పుష్ప మింద్రియ నిగ్రహః' = అహింస అనేది ఒక పుష్పము, ఇంద్రియనిగ్రహ మనేది ఒక పుష్పము' = ఇత్యాదిగా కొన్ని పుష్పములు చెప్పబడినవి. మరియు అయ్యగారు 'నామ కుసుమములచే' అనియు 'సరగున పాదములకు స్వాంతమను సరోజమును' = మనస్సు అనే పద్మమును అర్పించినవారు' అని చెప్పియుండుటచేత ఇట్టి పూలతో పూజించినట్లు ఊహింపవచ్చును.

101. దర్బారు = త్రిపుట

ప॥ ఏల తెలియలేరో రామ ని-న్నేల తెలియలేరో 'పూర్వకర్మ
మేలాగున జేసిరో...' ఏల॥

అ॥ బాలశశాంక కలాలంకృతనుత-నీల వర్ణ సుగుణాలయ నీ మహిమ॥ ఏల॥

చ॥ బాలవయసున శూలధరుని వి-శాలధనువును లీలగా భూ
పాలకులు గనకేల విరచి కు-శాలుగా శ్రీనేలిన ని॥ న్నేల॥

2 నాలుగు నొకపది వేల కంచుర-ధాల సురరిపు మూలబలముల
లీలగా నొక కోలనేసి-కాల యమపురి పాలజేసిన ని॥ న్నేల॥

3 రాజశేఖరు నీజగతిలో - రాజసమ్మున పూజసేయు
రాజులను గజరాజులకు మృగ-రాజ త్యాగరాజనుత ని॥ న్నేల॥

తాత్పర్యము :

ఓ రామా! ఈ కలినరులు నిన్ను తెలుసుకోలేక ఉన్నారు. కారణమేమో? బాలశశాంక కలాలంకృత నుత= బాలచంద్రుని ధరించిన శివునిచే నుతింపబడిన వాడా! నీలవర్ణుడా గుణములకు నెలవయినవాడా! నీమహిమ లెరుగ లేకున్నారు. పిన్నవయసులోనే దొడ్డ శివధనుస్సును రాజులందరు చూచుచుండగా అవలీలగా విరచి సంతోషముగా సీత నేలిన నీమహిమ తెలియకున్నారు. శివపూజను రాజసముతో జేసే రాజులనెడు ఏనుగులకు సింహమయిన వాడ! నిన్నేల తెలియరో? అని అయ్యగారి

ఆశ్చర్యము.

విశేషము = ఈ జగతిలో శివపూజను రాజసముతో చేసే రాజులను సంహరించినాడు. అనగానేమి? ఇచ్చట చాల వివరింపవలసి యున్నది. శివుని పూజించినా, కేశవుని పూజించినా, రాజసములేకనే చేయవలసి యుండును. కీర్తి ప్రతిష్ఠలకై చేసిన పూజలు రాజసములన బడును. కేవలము మోక్షము కోరి చేయు పూజలు సాత్త్వికము లనబడును. 'సాత్త్విక స్సతు విజ్ఞేయస్సవై మోక్షార్థ చింతకః' = ఎవడు మోక్షమును గురించి ఆలోచించునో వాడు సాత్త్వికు డనబడును అనెడి శాస్త్రమును బట్టి మోక్షార్థము చేయుపూజ సాత్త్విక పూజ అనబడును. మతత్రయ ఆచార్యుల ఏకాభిప్రాయమును బట్టి ఆర్షవాక్యములను బట్టి మోక్షమునకు విష్ణుపూజయే విహితము. తక్కిన దేవతలను ఆయా అల్పఫలములకై పూజింతురు. ఇదియే రాజసపూజ. మరియు ఇతరులను సంహరించుటకై అభిచారికాదుల ద్వారా లయకారుడగు శివుని పూజించుట కలదు. ఇది రావణుడు, అశ్వత్థామ చేసిరి. ఇది తామస పూజ అగును. త్యాగయ్యగా రూహించిన రాజసపూజ ఇదియే. లాక్షణికముగా రాజసపూజ తామసపూజయే. ఇది చేసిన రాజులనే ఏనుగులకు సింహము రాముడు. తామసపూజచేసి లోకాపకారకుడైన రావణుని సంహరించినాడు. కృష్ణావతారమున అట్టి అశ్వత్థామను మృత ప్రాయునిగా చేసినాడు. ఈ కథలనే అయ్యగారి మాటలు స్ఫురింపజేయుచున్నవి. మరియు గీతా వాక్యమిట్లున్నది. 'యేత్వన్యదేవతా భక్తా యజంతే శ్రద్ధ యాన్వితాః! తేపి మామేవ కౌంతేయ యజంత్యవిధి పూర్వకం' = ఓ అర్జునా! ఇతర దేవతలను శ్రద్ధతో అర్చించువారైనా నన్నే పూజించినట్లయినది. కాని అది విధి పూర్వకమైన (శాస్త్రవిధి కలిగిన) అర్చన కాదు అని. ఇట్టి పూజ రాజసపూజ అనవచ్చును. మరియు ఫలపరిత్యాగంచేసే పూజసాత్త్వికపూజ అని, కాక ఫలపరిత్యాగము నందు సాత్త్విక త్యాగము, రాజసత్యాగము, తామసత్యాగము అని గీతయందు విభజింపబడినవి. హృదయమందు సహజముగా బుట్టినది హృద్యభక్తి అనబడును. నటనభక్తి సభ్యభక్తి అనబడును. రావణుని శివభక్తి ఇది. రావణు డష్ట దిక్పాలకులపై దండెత్తినాడు. ఈశాన్యదిక్పతి అయిన శివునిచేతిలో చావు దెబ్బలు తిన్నాడు. గతిలేక నీ భక్తుడను అన్నాడు. ఆయన విడచి పెట్టినాడు. ఆనాటి నుంచి రావణుడు 'రాజశేఖరునకు రాజసపూజలు' చేసినాడు. త్యాగయ్యగారి దృష్టిలో రావణుడు 'పరమశాంభవాగ్రేసరుండనుచు పల్కు' వాడేకాని సాత్త్విక భక్తుడుకాడు. ఈ పైమాట 'సరస సామదాన' అనే కృతిలోనిది. పైన చెప్పిన రావణుని విషయము ఉత్తర కాండలో నున్నది. అయ్యగా రిట్టి శివపూజ పనికి రాదన్నారు.

102. అరాణ = ఆది

ప॥ ఏల నీదయరాదు, పరాకుజేసే-వేల సమయము కాదు॥ ఏ॥

అ॥ బాలకనక మయచేల! సుజనపరి-పాల శ్రీరమాలోల! విధృతశర
జాల! శుభద! కరుణాలవాల! ఘన-నీల నవ్యవనమాలికాభరణ॥ ఏల॥

చ॥ రారా దేవాధిదేవ రారా మహానుభావ-రారా రాజీవ నేత్రా! రఘువరపుత్రా।
సారతరసుధా పూరహృదయ పరి-వార జలధిగంభీర దనుజసం
హార మదనసుకుమార బుధజన వి-హార సకలశ్రుతిసార నాదుపై॥ ఏల॥

2 రాజాధిరాజ మునిపూజితాపాదా రవింద-రాజనలోచన శరణ్యా! అతిలావణ్య
రాజధరనుత విరాజవాహ సుర-రాజవందిత పదాజ జనక దిన
రాజకోటి సమతేజ దనుజగజ-రాజ నిచయ మృగరాజ జలజముఖ॥ ఏల॥

3 యాగరక్షణ పరమ భాగవతార్చిత-యోగీంద్ర సుహృద్భావిత! ఆద్యంతరహిత॥
నాగశయన వరనాగవరద పు-న్నాగసుమధర! సదాఘమోచన స
దాగతిజధృతపదాగమాంతచర - రాగ రహిత శ్రీత్యాగరాజనుత॥ ఏల॥

తాత్పర్యము :

ఇందు పల్లవి ఒక తెలుగు వాక్యము. అర్థము సులభమే. తక్కిన వన్నియు సంస్కృత భాషావిశేషణముల తోడి సంబోధనములు.

మొదటి చరణములో రారా అన్నది మాత్రమే తెనుగు. తక్కినవన్నియు సంస్కృత సంబోధనములు. అర్థము వ్రాయదును. బాలుడా! బంగారు వలువవాడా! సుజనులను పాలించువాడా! లక్ష్మీదేవియందు లోలుడా! బాణములను ధరించినవాడా! శుభముల నిచ్చువాడా! కరుణకు పాదయినవాడా! మేఘమువలె నల్లనివాడా! క్రొత్త వనమాలను ధరించినావాడా!

చరణము :

1) దేవాధిదేవుడా! మహానుభావుడా! పద్మనేత్రా! దశరథుని కుమారుడా! సారతరమయిన అమృత హృదయము గల వానరుల పరివారమువాడా! సముద్రమువలె గంభీరుడా! ధనుజసంహారా! మన్మథసుకుమారుడా! పండితులయందు విహరించువాడా! అన్ని వేదముల సారమయినవాడా! నాపై ఏల నీదయరాదు?

2) రాజాధిరాజ! మునులు పూజించిన పాదములవాడా! సూర్యచంద్రులు కనులయినవాడా! జగత్తులకు రక్షకుడా! అతి సుందరుడా! శివనుతా! గరుడవాహనా! ఇంద్రుడు వందనము జేసినవాడా! బ్రహ్మకు తండ్రీ! సూర్యకోటి తేజస్సుకలవాడా! దనుజలనెడి ఏనుగులకు సింహమైనవాడా! పద్మముఖా! నీ దయరావేల?

3) విశ్వామిత్రుని యాగమును రక్షించినవాడా! పరమ భాగవతులర్చించినవాడా! యోగీంద్రుల హృదయము నందు భావింపబడినవాడా! ఆద్యంతములు లేనివాడా! శేషశయనా! కరిరక్షకా! పున్నాగ పుష్పములను ధరించినవాడా! పాపములనుండి విడిపించువాడా! హనుమంతుడు పట్టిన పాదములవాడా! వేదాంతముల యందు చరించువాడా! రాగద్వేషములు లేనివాడా! త్యాగరాజనుత' అని ప్రతిపదార్థము.

విశేషము = రామకృష్ణానందయోగి ఉపదేశించిన ప్రకారము 96 కోట్ల రామనామజపము పూర్తి కాగానే సాక్షాత్కరించిన రాముని వర్ణనమిది. అని పరంపరావార్త. విశ్వామిత్రుని యాగ సంరక్షణమునకు బయలుదేరిన 'ఊనషోడశ వర్షమూర్తి' ఈ రాముడు. పదునారేండ్లు నిండనివాడు అని దశరథుని మాట. ఆ మూర్తి దర్శనమే అయినది. అందుచేతనే అయ్యగారు 'బాల కనకమయచేల' అని సంబోధనము నారంభించినారు. అదియును కాక వేదము 'యువాసువాసాః' యువకుడు మంచి వస్త్రము ధరించినవాడు' అని చెప్పినది. దీని ఎత్తుగడ ఈ వేదవాక్యమును తోపించుచున్నది.

103. కల్యాణి = రూపకము

ప॥ ఏవర మడుగుదురా ని ॥న్నేవర॥

అ॥ పావనమౌ నీపాద – సేవను సేయుటకై
దోవలె భరమైనవి – దేవరా ! ఇందు నే। నేవర॥

చ॥ శ్రీరఘువీర సకలా–ధారక నీమనసున
గోరిన పనులను పాద – సారసముల నామన
సారగ విడవననే – సారతర వైరాగ్యము
సారెకు సతతగతికు – మారుని పాలైనది॥ ఏవర॥

2 నీలఘనాభ! సదా – కాలము నీ భక్తుల
జాలములను గని పరి – పాలన జేయుచు నీ
పోలికగా జూచే–మేలునగల సౌఖ్యము
బాలుడగు రిపుఘ్నుని – పాలై యుండగ నే॥ న్నేవర॥

3 నీ మహిమలను వినగా – నామము దలచగా
భూమిని బదరేఖల – నేమరకను కనగ
తామరసనయన గుణ–ధామ మనసు కరగే
ప్రేమరసము భరత–స్వామి పాలై యుండగ ॥ నేవర॥

4 వారము నీదు మనసు – దారి ననుసరించుచు
నేరము లేకను ఆ–హార సుఘృతులను వి
దారణము జేయు పరి–చారక భాగ్య మలం
కారి యగు సుమిత్రకు–మారుని పాలైనది॥ నేవర॥

5 శ్రీ హరి! భరిత శరస – మూహ! సదా నిను హృ
ద్గేహమునను దు–ర్దాహములను రోసి వి
వాహనుడు నీవను –మోహంబును మరచి
సోహ మను సుఖము వై–దేహిపాలై యుండగ॥ నేవర॥

6 ఈ జగతిని గల సుఖ–రాజిని మరి నిర్జర
రాజపదంబును – ఈ జన్మము నడుగను
రాజవదన త్యాగ–రాజుని మదికెప్పుడు
రాజపథము లై–తే జయమౌనుగాని॥ ఏవర॥

తాత్పర్యము :

ఓ రామా ! నిన్నేవరం అడిగెదనయ్యా పవిత్రం అయిననీ పాదసేవజేసుకొందు మంటే దారి దొరుకుట లేదు. ఇంకేమి అడుగుదును? భక్తున కుండవలసిన లక్షణములలో నీ మనసున కోరినది వైరాగ్యము. నీ పాదములను నేనెప్పుడు విడువను అనే వైరాగ్యము హనుమంతుని పాలయినది. ఓ నీలఘనాభ= నల్లమబ్బువంటి కాంతి గలవాడా! నీ భక్తులను చూచి పరి పాలిస్తూ, నీవు ఆనందముతో చూచే చూపులో గల సౌఖ్యమను భవించుట అందరికంటె పిన్నవాడయిన శత్రుఘ్నుని పాలయినది. ఓ తామరస నయన!= పద్మము వంటి కనులు గలవాడా ! గుణధామ= గుణములకు నిలయమైన వాడా ! నీ

మహిమలను వినుట చేత నాకింకొక కోరిక కలిగినది. భూమిపై నీ పదరేఖలు ఏమరక ఉన్నవి. ఆ పాద రేఖలను చూచుటకు కల ప్రేమరసము భరతుని పాలయినది. నీ మనస్సు నెరిగి నీ ఆకలిని నిద్దురను తీర్చే పరిచర్యా భాగ్యము అలంకారము గలిగిన లక్ష్మణుని పాలయినది. ఓ శ్రీహరీ! భరిత శరసముహ = బాణములను ధరించిన వాడా! ఇతర కోరికలను రోసి నిన్ను హృదయమందు నిలుపుకొని నీవు వివాహనుడవు= గరుడ వాహనుడవు అని తెలిసి నీయెడ నిలుపరాని మోహముతో ''సోహం'' =వాడే నేను అనెడి అద్వైత సుఖమను భవింప వలెనంటే అది సీత పాలయినది. ఏ వర మడుగుదు నయ్యా! ఈ జగత్తులో నున్న ఏ సుఖమును కోరను. దేవేంద్ర పదమును కోరను. ఈ జన్మమునూ కోరను. ఓ రాజ వదనా =చంద్రవదనా! నాకు రాజపథములే జయము. వాటినే కోరుదును. ఇంకే వరమడుగుదును? అడుగను అని అయ్యగారు పరితాప పడినారు.

విశేషము = 1) ''పరమాత్మని యోరక్తః। విరక్తో ఽపరమాత్మని = పరమాత్మ యందు రక్తుడై యుండవలెను. పరమాత్ముడు కాని దానియందు విరక్తుడై యుండవలెను''. అనే శాస్త్రమునకు ఉదాహరణముగా రామపాదముల యందు రక్తి(భక్తి) తదితరముల యందు వైరాగ్యము కలిగి యున్నాడు హనుమంతుడు.

2) మధురాపురమును రాముని కాలమున లవణాసురుడను రాక్షసుడు పరిపాలిస్తూ సజ్జనులను బాధిస్తూ ఉండేవాడు. వారు మొరపెట్టుకున్నారు. రాముడు శత్రుఘ్ననితో వానిని సంహరింప జేసి మధురకు శత్రుఘ్ననే ప్రభువుగా నేర్పరచినాడు. ఆ పురప్రజలందరును రామ భక్తులే. వారిని శత్రుఘ్నుడు పరిపాలించినాడు.

3) వామనావ తారమున త్రివిక్రముడై ఒక పాదముచే భూమిని కొలిచినపుడు భూమిపై త్రివిక్రముని పాదరేఖలు పడినవి. మరల రామావతారమున ఆ పాదరేఖలు పాదుకలపై చిహ్నములై రేఖలుగా పడినవి. ఆ రేఖలను దర్శించువాడు భరతుడు.'' కదాపున శ్శంఖ రధాంగ కల్పక! ధ్వజార విందాంకుశ వజ్రలాంఛనం! త్రివిక్రమ త్వచ్చరణాం బుజద్వయం! మదీయ మూర్ధాన మలం కరిష్యతి'' = ఓ త్రివిక్రముడా! శంఖములు, చక్రములు, కల్ప వృక్షము, పతాకములు, పద్మములు, అంకుశములు వజ్రములు వీటి చిహ్నములతో (రేఖలతో) అలరారు నీ పాదములు నా శిరస్సు నలంకరించుట మరల నెప్పుడోకదా! అనే అర్థముగల ఈ శ్లోకమును విష్ణు ఆలయములలో అర్చకులు శఠగోపము అనే పేరుతో విష్ణు పాద యుగళమును శిరస్సున నుంచునప్పుడు భక్తు లనుసంధించెదరు. అట్టి రేఖల సేవ భరతుని పాలయినది. (రామపాదుకలయం దారేఖలున్నవి. భరతున కారేఖల దర్శనము పదునాలుగేండ్లు నిరంతరమును కలిగినది.)

4) లక్ష్మణుడు తానాహార నిద్రలు లేక ''భవాంస్తుసహవైదేహ్యా, గిరిసానుషు రంస్యతే! అహంసర్వం కరిష్యామి, జాగ్రత స్స్వపతశ్చితే '' = అన్నారామా! నీవు సీతతో కూడి పర్వతసానువుల యందు విహరించుము. నీవు మేలుకొని ఉన్నా నిదురించుచున్నా నీకు సర్వవిధసేవలను చేయుదును అని ప్రతిజ్ఞచేసి ఆ విధముగా కైంకర్యము చేసినాడు. లక్ష్మణుని గూర్చి రామాయణమున ముచ్చటగా చెప్పిన మూడు ముక్కలు.

''లక్ష్మణో లక్ష్మి సంపన్నః''=లక్ష్మణుడు సంపద (రామాసేవ) కలవాడు. ''బాల్యాత్ప్రభృతి సుస్నిగ్ధః'' =బాల్యము నుండియే రామ ప్రేమ కలవాడు. ''గుణై ర్దాస్య ముపాగతః''= రాముని గుణములకు వశమై నేను రాముని దాస్యమును చేకొంటిని'' అనునవి. ఇవేలక్ష్మణుని అలంకారములు ఈ స్ఫూర్తి చేతనే అయ్యగారు ''అలంకారియగు సుమిత్ర కుమారుడు'' అని అన్నారు.

5) ఇరువురు ఒక్కటిగానే భాసించినప్పుడు అది అద్వైత మనబడుతుంది. సీతారాములది అదియే స్థితి. సీత ప్రకృతి రాముడు పురుషుడు. ఈ రెండు తత్త్వములును కలిసి ఒకటిగానే భాసించుచున్నవి. సీత లక్ష్మి, రాముడు నారాయణుడు. వీరివురికి ఎప్పుడును ఎడబాటులేదు. ''రాఘవత్వేభవ త్సీతా –రుక్మిణీ కృష్ణ జన్మని, అన్యేషు చావతారేషు, విష్ణోరేషానపాయినీ'' = లక్ష్మి రామావతారామున సీత అయినది. కృష్ణావతారమున రుక్మిణి అయినది. ఇతర అవతారముల యందును ఆమె హరిని ఎప్పుడును ఎడబాయక యుండును''. అని విష్ణు పురాణవాక్యము. మరియు సీత ''అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభాయధా'' = నేను రాముడును విడదీయలేని వారము. సూర్యుడు నీడ ఎట్లో అట్లు '' అని చెప్పినది. జీవుడు పరబ్రహ్మ సాయుజ్యమును పొందినప్పుడు ''సోహం'' = వాడే నేను '' అని ఆనందించును. సీత రామునితో అట్టి అద్వైతానందమును పొందిన భాగ్యశాలిని. త్యాగయ్యగారు (వీరందరిని భాగ్యములను స్మరించి అది అది వారి వారి పాలయినది. నేనేమి వరమడుగుదును? అని నిర్వేదమును పొందినారు.

6) ఈ ప్రపంచ సుఖములను కోరనన్నాడు, ఇంద్రాది పదములు కూడ కోరలేదు. ఇక కోరిన దేమి? ''రాజ పథమును'' కోరినాడు. ''చక్కనిరాజమార్గము'' భక్తి అని అయ్యగారి భావము. అది అట్లుండనిండు. ఇక్కడ నొక విశేషస్ఫూర్తి ఉన్నది. రాజపథ మనగా భగవద్గీతయందలి ''రాజవిద్యారాజగుహ్యయోగము'' అని ఉన్నది. ''సతతం కీర్తయంతోమాం యతం తశ్చ దృఢవ్రతాః, నమస్యంత శ్చమాం భక్త్యా, నిత్య యుక్తా ఉపాసంతే'' = నిత్య యుక్తులయిన భక్తులు సతతం= సంగీత వాద్యములతో కీర్తించుచున్న వారై మోక్షప్రయత్నపరులై దృఢవ్రతులై నమస్కరించువారై నన్ను ఉపాసింతురు''=అను

విశేషార్థము కల శ్లోకమున్నది. సంగీత వాద్యములతో కీర్తించుట అనునది త్యాగయ్యగారి ప్రత్యేక లక్షణము. అయ్యగారి కృతిలో ఒకదానిలో ''సాగసుగా మృదంగ తాళము'' అనేది ఉన్నది కదా! ఈ భావమును పైన గీతా శ్లోకము బలపరచుచున్నది. కనుక '' రాజపథ''మంటే సంగీతమార్గమని కూడ చెప్పవచ్చును. ''రాజవిద్యా రాజ గుహ్య యోగములోని శ్లోకము బలపరచినది. ఇంతకన్న ఏవరము కోరదగినది? హనుమద్భరత లక్ష్మణాదులకు ఆ యోగములుంటే నా కీయోగమున్నది. నా కింతకన్న వేరే వరమవసరము లేదనియును స్ఫూర్తి యున్నది. భాగవతమున 'నాకపృష్ఠము' ''పారమేష్ఠ్యము'' అను గొప్ప పదములను తిరస్కరించి భగవద్భక్తిని స్వీకరించిన భక్తులున్నారు. త్యాగయ్యగారు ఆ కోవకు చెందిన వారని ఊహింప వచ్చును.

104. శంకరాభరణం = ఆది

ప॥ ఏవితమున నైనగాని న-న్నేలుకో మనసురాదా! రామ ॥ ఏ॥

అ॥ భావించి చూచువట్ల నీవే-బ్రోవవలెను గాని వేరెవరు ॥ ఏ॥

చ॥ పావన రూప పరాత్పర నీపద-సేవను కోరితి యే భూసురులను
నీ వలె గరుణానిధి యై బ్రోచిన-దేవత లెవ్వరురా రామ ॥ ఏ॥

2 దీన దయాపరమూర్తివి నీవని-నే నెరనమ్మితిరా అది గాకను ॥
దానవ గర్వవిదారణ! నేను స-దానిను వేడితిరా రామ॥ ఏ॥

3 సాక్షాత్కారము నీవే నీదుక-టాక్షము లే కెవరు బ్రతికిరి - జగత్
సాక్షియైన జీవన జదళాయ-తాక్ష త్యాగరాజ పక్ష! ఇవు ॥ డేవిత॥

తాత్పర్యము :

ఏవిధముగా నైనా సరే నన్ను నీ వేలుకొనే మనసు రాదా నీకు? బాగా ఆలోచించి చూస్తే నీవే నన్ను రక్షింప వలసి యున్నది. (ఏలనన రక్ష్య రక్షక సంబంధము మన ఇరువురి మధ్య యున్నది) ఓ పావన రూపా! పరాత్పరా! బ్రాహ్మణులను నీ వలె రక్షించు కరుణా నిధి దేవతలలో ఎవ్వడును లేడు. దీనులను బ్రోచు దయామూర్తి అని, అదియుగాక దుష్టదానవ సంహారకుడవని యును అని నేను నెరనమ్మి వేడుకొంటున్నాను. ఓ పద్మ నేత్రా! నా సాక్షాత్కరము నీవే. నా పక్షమున నున్న దేవుడవు నీవే. నీ కటాక్షము లేక సూర్యుడు కూడ జీవింప లేడు కదా! ఇక నేనెక్కడ? కనుక ఏ విధముగా నైనను నన్ను నీవు రక్షింప వలసి యున్నది. అని ప్రార్థన.

విశేషము= రాముడు రాజ్యము చేయు సమయమున బ్రాహ్మణ రక్షణము ప్రధానముగా పెట్టుకొన్నాడు. రామ రాజ్యమున అకాల మరణములు లేవు. ఒక బ్రాహ్మణుని పదునా రేండ్ల కుమారుడు మరణించినాడు. బ్రాహ్మణుడు రాముని వద్ద మొరబెట్టు కొన్నాడు. ఈ అకాల మరణమునకు కారణము శంబూకుని అక్రమ తపస్సు అని గ్రహించిన రాముడు శంబూకుని వధించినాడు. బ్రాహ్మణ బాలుడు నిదుర నుంచి లేచినట్లు లేచినాడు. ఇట్లు ఏ దేవత చేసినాడు. (ఈ విషయమున అధునాతనులు చేయు ధర్మాధర్మ చర్చ అట్లుండనిండు. ఈ కథ ఇట్లు జరిగినట్లు అందరికిని విశ్వాసమే కదా ! దీనిని బట్టి రాముడు చేసిన బ్రాహ్మణ రక్షణము, అట్టిది ఏ ఇతర దేవతయును చేసినట్లు లేక పోవుటయే మనకు ప్రస్తుత విషయము) కృష్ణావతారమున కూడ ఏనాడో మృతిచెందిన బ్రాహ్మణబాలుని, సముద్రమును జొచ్చి బ్రతికించి తెచ్చి బ్రాహ్మణున కొసంగెను. ఇది కూడ ఇక్కడ స్మరింప దగినది. ఇట్టి రక్షణ చేసిన దేవు లెవరును లేరు. జగత్సాక్షియైన సూర్యుడు కూడ రాముని కటాక్షము లేక నిలువ లేడని అయ్యగారి విశ్వాసము. పరమాత్ముని సత్త (ఉనికి) లేక పోతే సూర్యునకు ఉనికి లేదని. '' ఆదిత్యానా మహం విష్ణుః జ్యోతిషాం రవిరశుమాన్॥'' = ఆదిత్యులలో (ద్వాదశాది త్యులలో) నేను విష్ణ వను పేరుగల సూర్యుడను. తేజస్సులలో నేను సూర్యుడను''. అనెడి గీతావాక్యమును బట్టి అంతర్యామిగా సూర్యునకును సత్తా కారణము పరమాత్మ కదా ! ఆ పరమాత్మ రాముడే. అందుచేతనే అయ్యగారిట్లు చెప్పిరి.

105. సారంగ = చాపు

ప॥ ఏహి త్రిజగదీశ శంభో మాం-పాహి పంచన దీశ॥ ఏహి॥

అ॥ వాహినీ శరిపునుత శివసాంబ-దేహి త్వదీయ కరాబ్జావలంబ॥ మేహి॥

చ॥ గంగాధర ధీర నిర్జరరిపు-పుంగవ సంహార
మంగళకర పుర భంగ విధృతసుకు-రంగాప్త హృదయాబ్జ భృంగ శుభాంగ॥ ఏహి॥

2 వారణాజిన చేల, భవోదధి-తారణ సురపాల!
క్రూరలోకా భ్రసమీరణ శుభ్రశ-రీర మామకాఘహర పరాత్పర॥ ఏహి॥

3 రాజశేఖర కరుణా సాగర నగ-రాజాత్మజా రమణ॥
రాజరాజ పరి పూజితపద ! త్యాగ-రాజరూప వృషరాజాధిరాజ॥ ఏహి॥

తాత్పర్యము:

ఇది కేవలము సంస్కృత కృతి. అన్నియును విశేషణ రూపములయిన సంభోధనములే ఇందున్నవి. అందుచేత ప్రతి పదార్థము వ్రాయబడుచున్నది.

త్రిజగదీశ = ముడులోకములకు ప్రభువా! శంభో=సుఖకరుడా! పంచన దీశ=పంచ నదక్షేత్ర ప్రభువా ! ఏహి= రమ్ము, మాం= నన్ను, పాహి=రక్షించుము. వాహినీశరిపునుత= సముద్రునకు శత్రువయిన అగస్త్యునిచే నుతింప బడినవాడా! శివ-సాంబ, త్వదీయకరాబ్జా వలంబం=నీ చేయూతను దేహి= ఇమ్ము. గంగాధర=గంగను ధరించిన వాడా! ధీర. నిర్జరరిపు పుంగవసంహార=రాక్షస పుంగవులను సంహరించిన వాడా ! మంగళకర=శుభములను కలుగ జేయువాడా! పురభంగ=త్రిపురాసురులను గెల్చిన వాడా! విధృత సుకురంగ=లేడిని ధరించిన వాడా! ఆప్తహృదయాబ్జ భృంగ=భక్తుల హృదయమనెడి పద్మమందు తుమ్మెద వలె విహరించు వాడా! శుభాంగ=శుభమగు శరీరము గలవాడా! వారణాజిన చేల= ఏనుగు చర్మమును వస్త్రముగా ధరించిన వాడా! భవోదధితారణ= సంసార సముద్రమును దాటించువాడా, సురపాల=దేవతలను రక్షించినవాడా, క్రూరలోకాభ్రసమీరణ=క్రూరులనెడు మేఘములను వాయువు వలె చెదర గొట్టువాడా! శుభ్రశరీర=తెల్లని మేనివాడా! మామకాఘహర=నా పాపములను హరించు వాడా! పరాత్పర. రాజశేఖర=చంద్రుని తలదాల్చిన వాడా! కరుణాసాగర=దయా సముద్రుడా! నగరాజాత్మజారమణ=పార్వతీ నాథా! రాజరాజ పరిపూజిత పద=కుబేరునిచే పూజింప బడిన పదముల వాడా! త్యాగరాజ రూప (ఈ క్షేత్రాధిపతి త్యాగరాజు) వృషరాజాధి రాజ=నంది కేశ్వరునకు ప్రభువా! ఈ విశేషణములన్నియు అయిన తరువాత రమ్ము, పాలింపుము-అనే క్రియలను అనుసంధించవచ్చును.

106. పున్నాగ వరాళి = రూపకం (నౌకాచరితములోనిది)

ప॥ ఏనోము నోచితి మో చెలుల - మేదాన మొసగితి మో ॥ ఏ॥

అ॥ శ్రీనాథు కొలువ మరె చెలుల-చెక్కిళ్ళ నొత్తుచును
మానక మోవానుచు చం-ద్రానను హృదయమున నుంచ॥ ఏ॥

చ॥ స్త్రీ రత్నములు మనము చెలులు- శ్రీమించు యౌవనము॥
వారి జలోచనుడు చెలుల- పాలాయె గదవమ్మ।
కోరిక లీడేరెను యదు-వీరుని కనులార జూడ ॥ ఏ॥

2 బంగారు సొమ్ములను చెలులు-బాగుగా బెట్టుకొని।
శృంగారాంబరములను చెలులు-చెలువొంద గట్టుకొని
సంగతిగా నంగములు శు-భాంగునికి నొసంగ మన॥ మేనోము॥

3 పొంగారు ఈ నదిలో చెలులు-పొందుగా గుమిగూడి
మంగళాకారునితో చెలులు-మనసార గూడితిమి
రంగపతి యుప్పొంగుచుమన-చెంగటను జెలంగగ మన॥ మేనోము॥

4 వా గీశాద్యమరులకు జెలులు-వర్ణింప తరమౌనె
త్యాగరాజాప్తునితో చెలులు-భోగము లందుచును
బాగుగను తమిరేగగను నయ-రాగము లీలాగు బాడ॥ ఏనోము॥

తాత్పర్యము :

గోపికలు గోపాలునితో నౌకావిహారం ప్రారంభించారు. అందు గోపాలుడు అందరికిని అందరివాడై శృంగారలీలలతో ఆనంద మిచ్చినాడు. అప్పుడు గోపికలు తమలో తామనుకొన్న మాటలివి. మనమేమి నోములు నోచితిమో ఏదానములు చేసితిమో ఈ నాడు శ్రీనాథుని కొలువు దొరికినది. అతని చెక్కిళ్ల నొక్కుచు అధరోష్ఠమును పానము చేయుచు హృదయమున హత్తుకొనే భాగ్యము కలిగినది. మనము స్త్రీరత్నములము. మన గొప్పయౌవనము వారిజాక్షుని పాలయినది. వాడు మనపాలయినాడు. బంగారు నగలు బెట్టుకొని చక్కని చీరలతో అలరారు మన శరీరమును కృష్ణున కర్పించితిమి. మంగళాంగునితో మనసార తమిదీర భోగములనుభవించినాము. ఈ ఆనందమును బ్రహ్మాదులును వర్ణింపలేరు ఇటువంటి ఆనంద మనుభవించినాము. ఏనాటినోము ఫలమో ఏ దానమహిమయో అని గోపికలు అభివర్ణించు కొన్నారు. వారు కృష్ణుని పరబ్రహ్మభావముతో కూడ భజించినారు. వారను భవించినది బ్రహ్మానందము. ఆ పాత్రల ద్వారా అయ్యగారు కూడ ననుభవించినది బ్రహ్మానందమే.

107. సౌరాష్ట్రము = చాపు (నౌకాచరితము లోనిది)

ప॥ ఏమని నెరనమ్మి కొందుము కృష్ణా - ఎందుకింత వాడు॥ ఏమని॥

చ॥ జలకమాడు వేళ వలువలుదాచిమ-మ్మలయింపగలేదా॥ ఏమని॥

2 ముదితల రమ్మని తిలకము లిడిపంట-మోవి నొక్కలేదా॥ ఏమని॥

3 మును నీవు వెన్ననారగించి తరుణుల-మోమున బూయలేదా ॥ ఏమని ॥

4 వదినె గారి చందమున వచ్చి పావడ-వదలించి పోలేదా ॥ ఏమని॥

5 దొరికితివని చాడీ చెప్పబోతే తల్లి-యురమున నుండ లేదా॥ ఏమని ॥

6 కామించి యజ్ఞపత్నులు వేడగ వేణు-గాన మొనర్పలేదా॥ ఏమని ॥

7 ఆనాడు పొంగలి నీకిడి కొన్నాళ్లు-వాన నుండలేదా॥ ఏమని॥

8 ధరను త్యాగరాజ వినుతుని పలుకులు - తప్పిపోదన లేదా॥ ఏమని॥

తాత్పర్యము :

గోపికలు యమున ఒడ్డున కృష్ణునితో ఆనందిచుచుండగా యమునలో వెండి ఓడ కనిపించినది. కృష్ణా! నీవు తిన్నగా నుండవు కనుక నిన్ను ఒడ్డున వదలి మేము నౌకా విహారము చేసి వస్తామన్నారు. కృష్ణుడు పెక్కుబాసలు చేశాడు. అప్పుడు వారు నిన్నెట్లు నమ్ముతాము అని అతడు చేసిన దుడుకు పనులు వర్ణిస్తున్నారు. మేము జలకమాడు చుండగా మా చీరల నపహరించినావు కదా! మాకు తిలకము దిద్దుతానని చెప్పి ముఖము దగ్గరకు లాగి పంటితో పెదవి కొరికితివి కదా ! నీవు వెన్న తిని పోతూ పోతూ మాముఖంనిండ వెన్న బూసి పోయితివి కదా! ఒక గోపిక యొక్క ఆడపడుచు కంఠస్వరముతో ఆమె వెనుక చేరి ఆమె పరికిణీని వదులు చేసి పోయినావు కదా! యజ్ఞ పత్నులు కామించి నీవెంట పడితే వారిని మోసగించి దూరముగా పోయి వేణువు వాయించితివి కదా ! ఇంద్రుని పూజను అడ్డగించి వానికి నివేదించు పదార్థములను నీవార గించుట చేత అతడు కోపించి వానకురిపింపగా చాల కాలము వానలో బాధపడితిమి కదా! నీ మాటలు తప్పవు (సత్యములు) అని చెప్పావు. అన్నీ బొంకులే కదా ! నీవు దొరికితివని నీ తల్లితో మేము చాడీలు చెప్పబోతే మాకు చిక్కకుండ తల్లి రొమ్ములో దూరి యుంటివి. ఇట్టి నిన్నెట్లు నమ్ముదుము? అని గోపిక లనిరి.

108. హుసేని = ఆది (ప్రహ్లాద భక్తి విజయము లోనిది)

ప॥ ఏమని వేగింతునే-శ్రీరామ రామ॥ ఏమని॥

అ॥ ఏమని వేగింతు నెంతని సైరింతు - నాముద్దు దేవుడు నను బాసెనయ్యయో॥ ఏ॥

2 ఆడిన ముచ్చటనా దంతరంగము నిండ- నీడు లేదని యుంటి నిందగా
సరివారిలో॥ ఏ॥

3 ఎడబాయక త్యాగరాజు నేలిన శ్రీహరి తొల్లి- బడలిక లార్చి నాచై బట్టినది
తలచుచు ఏ॥

తాత్పర్యము :

శ్రీహరి సముద్రమునందు ప్రహ్లాదునకు దర్శన మిచ్చి మరల వత్తునని అంతర్ధానమయ్యెను. ప్రహ్లాదు డావియోగమును సహింప లేక భావించిన భావములు. అయ్యో! ఏమని నామదిని బాధింతును? ఎంతకాలమని సహింతును? నా ముద్దు దేవుడు నన్నెడ బాసిపోయినాడు. పాలించినాడు. లాలించినాడు. కౌగిలించినాడు. సుఖములో తేల్చినాడు. ఇంతలో నన్ను పరదేశిని (పరాయి వానిని) చేసి వెళ్లి పోయినాడు! ఆయన నాతో నాడినమాటలన్నీ నామదిలో నున్నవి. నా సాటి ఎవరును లేరను కొంటిని. ఇంతలో నన్ను విడచి వెళ్లెనయ్యయో॥ అని ప్రహ్లాదు డార్తి బడినాడు.

విశేషము= ఇందున్న విరహమును అసలు ప్రహ్లాదు డనుభవింప లేదు. అనేకాను భవముల వలన శ్రీహరి తనను వెన్నంటి రక్షించుచున్నట్లు తనకు తెలియును. అదియును గాక ప్రహ్లాదుడు నిత్య ధ్యానామృతాంబుధి మగ్నుడు. ఆ ప్రహ్లాదునకు హరి ఎడబాటు యొక్క ప్రసక్తియే లేదు. మరి ఇందలి ప్రహ్లాదుని విరహార్తి త్యాగయ్య గారిదే. ఈ లక్షణ మేమంటే భక్తులు భగవంతునితో సంయోగమును విరహమును రెండిటిని అనుభవింతురు. కవి భక్తులయితే ఆ అనుభూతిని మాటల ద్వారా ఆ విష్కరింతురు. ఇంతకు ముందొక సారి మనము చెప్పు కున్నా ఈ విషయమున శ్రీ వేదాంత దేశికుల సూక్తిని ఒక్కసారి మననము చేసుకుందాము. '' ఉచ్చావచై ర్విరహ సంగమజైరుదంతైః! శృంగారయంతి హృదయం గురవ స్త్వదీయాః'' అమ్మా గోదాదేవీ! నీ పూర్వ గురువులు (ఆళ్వారులు) పలువిధములయిన విరహసంయోగముల కథలతో తమహృదయము నలంకరించుకొందురు'' అని. త్యాగయ్యగారు నట్లే విరహమును సంయోగమును అనుభవించిరి. ఇందు ప్రహ్లాదుని పాత్రద్వారా తన విరహార్తినే ఆ విష్కరించిరి.

109. సౌరాష్ట్ర -చాపు (నౌకాచరితము లోనిది)

ప॥ ఏమేమొ తెలియక బలికేరు చెలులార నామీద దయలేక ॥ ఏ॥

చ॥ మును మందరగిరి మునుగ కూర్మమైవీ- పున దాల్చగ లేదా ॥ ఏ॥

2॥ కరిరాజ మకరిచే గాసిజెందగ నేను – కరుణ జూడలేదా॥ ఏ॥

3॥ వెరవక నీరు జొచ్చిన సో మకుని గొట్టి– వేదము తేలేదా ॥ ఏ॥

4॥ కాళిందిలోని కాళియుని మదంబును – కాలనణచ లేదా ॥ ఏ॥

5॥ మకరము గొంపోయిన గురుపుత్రుని – మరి దెచ్చి యొసగ లేదా॥ ఏ॥

6॥ త్యాగరాజునకు సఖుడైన నాదు ప్ర– తాపము వినలేదా॥ ఏ॥

తాత్పర్యము :

నౌకా చరితములో గోపికలు కృష్ణునిపై నమ్మకము లేక అతని దుడుకు పనులన్నీ ఏకరువు పెట్టేరు. కృష్ణుడు తాను చేసిన ఘనకార్యములను ఇందు వివరించు చున్నాడు. ఓ గోపికలారా ! నా మీద, తెలియక నిర్దయగా అపవాదులు వేస్తున్నారు మీరు వినండి. పూర్వము మందర పర్వతము సముద్రమున మునుగ బోవు చుండగా నేను కూర్మమై వీపుపై ధరించితిని కాదా? గజరాజు మకరికి జిక్కినప్పుడు కరుణతో నేను కరిని రక్షించితిని కదా? వేదముల నపహరించి సోమకుడు సముద్రమున డాగి ఉంటే నేను వానిని సంహరించితిని కాదా? యమునలో దుష్టసర్పమైన కాళియుని గర్వమును కాల రాచితిని కాదా? మొసలి సముద్రములోనికి గురుపుత్రుని కొనిపోతే నేను తెచ్చి యిచ్చితిని కాదా? త్యాగరాజు నుతించే నా ప్రతాపము మీరు వినలేదా?

విశేషము = త్యాగరాజునకు సఖుడంటే ఈశ్వరునకు సఖుడు. అట్టినా ప్రతాపము అని అర్థము చేసుకొనవచ్చును. గోపికలతో కృష్ణుడు చెప్పుట ద్వాపరము నాటి మాట కనుక ఇట్లు చెప్పుకొనుట సమంజసము.

110. ముఖారి = ఆది

ప॥ ఏ లావతార మెత్తుకొంటివో, ఏమి కారణమో రాముడై ॥ ఏల॥

చ॥ ఆలము సేయుటకా అయోధ్య–పాలన సేయుటకా ఓ రాఘవ॥ ఏల॥

చ॥ యోగులను జూచుటకా భవ– రోగులను బ్రోచుటకా శత
రాగ రత్నమాలికలు రచించిన – త్యాగరాజునకు వర మొసగుటకా॥ ఏల॥

తాత్పర్యము:

త్యాగయ్యగారు రామునిని ప్రశ్నిస్తున్నారు. రామా అవతారము నేల ఎత్తుకొన్నావయ్యా ? నీ అవతారమునకు కారణమేమయ్యా ? యుద్ధము జేయుటకా? (తాటక మొదలు రావణుని వరకు) లేక అయోధ్యను పరిపాలించుటకా? (కొన్ని వేలేండ్లు పాలించినాడు) యోగులను చూచుటకా? (రక్షించుటకా) సంసారరోగులను తరింప జేయుటకా? లేక నీ పయిన శతరాగ రత్నమాలికలు రచించిన త్యాగయ్యకు వరమొసగుటకా? అని ప్రశ్నలు. కాని ఇవే సమాధానములు.

విశేషము = ఇందు ''రాముడై'' అని ఒక ముడి ఉన్నది. అసలు ప్రశ్న లెందుకు? వీటికై అవతార మెత్తితివి ఆహా! అని చెప్పవచ్చును. ఈ ప్రశ్నలో ఒక ఆంతర్యమున్నది. శ్రీరాముని కన్న ముందు ఈ పేరు పెట్టుకొనుట కలదు. అందుచేతనే మనకు ప్రసిద్ధముగా పరశురాముడున్నాడు. పరశు అనగా గొడ్డలి. దానిని ధరించుట చేత అతడు పరశురాముడు డనబడినాడు. వంశమును బట్టి భృగురాము డనబడినాడు. విష్ణుని అవతారము కూడ. అయినను ఆయనను భగవంతునిగా ధ్యానించినవారు గాని పూజించిన వారు గాని లేరు. ఈ రాముడు లోకాభిరాముడయి వాత్సల్య సౌశీల్యసౌలభ్య లావణ్యాది గుణముల కాలవాలమై సాత్వికగుణముతో అవతరించినాడు. ఉపపదము లేకుండా రాముడు అంటే దశరథరాముడే అగును కాని ఇంకొకడు కాడు. భృగు రాముడు రఘురాముడును ఏక కాలముందున్న వారగుట చేత ఆ నాటి వారే భేదము తెలియుట కొరకు కోదండరాముడని, పరశురాముడని, భృగురాముడని, రఘురాముడని, పేర్లతో వ్యవహరించారు. అసలు ''రామ'' అనే శబ్దమునకు పరబ్రహ్మ మని ''రమంతే యోగినో నంతే। సత్యానందే చిదాత్మని। ఇతి రామ పదేనాసౌ। పరబ్రహ్మాభి ధీయతే॥ = అనంతము, సత్య జ్ఞానానంద మయమును అయిన పరబ్రహ్మము నందు యోగులు రమించుచున్నారు కనుక (ధ్యానించి ఆనంద మనుభవించుచున్నారు కనుక) పరబ్రహ్మము ''రామ'' అనెడి పేరుతో చెప్పబడుచున్నది'' అని ఉపనిషద్వాక్యము. ఆ పరబ్రహ్మము నారాయణుడు. రామావతారమునకు పూర్వము యోగులు తమ హృదయమందు ధ్యానించి ధ్యానగమ్యమగు రూపమును దర్శించుచు రమించెడివారు. సాక్షాత్తు ఆ పరబ్రహ్మమే త్రేతాయుగమున దశరథ రాముడై అవతరించుట జరిగినది. పరబ్రహ్మము '' అజాయమానో బహుధా విజాయతే''= పుట్టుక లేని వాడయ్యును అనేక విధములుగా పుట్టుచున్నాడు''. అని వేద వాక్యము. ఆ పుట్టుటయే అవతారములు

ఎత్తుట. అవతారము లెత్తినప్పుడే నారాయణుడు లోక కల్యాణ కరుడగుచున్నాడు ''స ఉ శ్రేయాన్ భవతి జాయ మానః'' అని వేద వాక్యము. దాని ప్రకారము రామావతార మెత్తినాడు. ఆ రాముని అనేకులు పెక్కు కాలము దర్శించి సంబంధములు కలిగి తరించిరి. ఇట్లవతరించుట ఎవరి కొరకో కాదు. తన కొరకే. వైకుంఠమున భగవానుని కల్యాణ గుణములు అనగా వాత్సల్యాది గుణములు ప్రకాశించు అవకాశము లేదు. అచట దీనులుంటే కద దయాగుణమునకు చోటు ? కనుక ఆయన అవతార మెత్తుట తన కొరకే. కనుకనే త్యాగయ్యగారీ కృతియందు ''అవతార మెత్తితివో'' అనలేదు. ''అవతార మెత్తుకొంటివో'' అన్నారు. వంట చేసినాడు అంటే పరుల కొర కగును. వంట చేసుకొన్నాడు అంటే తన కొరకే అగును. అట్లే రాముడై ''అవతార మెత్తుకొన్నాడు'' అవతారమందలి కృత్యములు కూడ రాముని కొరకే అని త్యాగయ్యగారి అభిప్రాయము. అందుకనే ప్రశ్న రూపములో కృతి సాగినది. వివరించుకుంటే ఇంత రహస్య మున్నది ''త్యాగరాజునకు వరమొసగుట'' అంటే అవతరించి గుణములు కలిగి కథలు నడిపి వర్ణనీయమైన వస్తువు నిచ్చుటయే. దానికా ? దీనికా ? అని ప్రశ్నలు కూడ వాటికి మాత్రమే కాదు. బహు ప్రయోజనములకు అని చెప్పుటకు.

111. బిందు మాలిని = ఆది

ప॥ ఎంత ముద్దో ఎంత సొగసో– ఎవరి వల్ల వర్ణింప దగునే ॥ ఎంత॥

అ॥ ఎంత వారలైనగాని కామ–చింతా క్రాంతులైనారు॥ ఎంత॥

చ॥ అత్తమీద కను లాసకు దాసులు–సత్త భాగవత వేషులైరి॥
దుత్త పాలరుచి దెలియు సామ్యమే–ధురీణు డౌ త్యాగరాజనుతు ॥ డెంత॥

తాత్పర్యము :

త్యాగయ్యగారి రిందు భగవచ్చింతనే లేనివారిని నిరసిస్తున్నారు. త్యాగరాజనుతుడు = రాముడు ఎంత ముద్దుగా నున్నాడో? ఎంత సొగసు నున్నాడో ? అని రాముని ముద్దును సొగసును అభివర్ణించి నేటి మానవులు వీటిని ఎరుగక చెడు మార్గములో తిరుగు చున్నారే? అయ్యో అని నిర్వేద పడుచున్నారు. అత్తమీద కనులు అనగా

మాతృసమాను రాలైన స్త్రీమీదనే చూపులుంచుచున్నారు. ఆశకు దాసు లగుచున్నారు. సత్త అనగా ఉనికి. ఉనికికి భాగవత వేషధారులై ఉన్నారు. నిజ భాగవతులైతే రాముని రుచి తెలిసి యుందురు. పాలుపోసిన దుత్తకు పాలరుచి తెలియనట్లే భక్త వేషధారులైన దాంభికులకు రాముని ముద్దు సాగసు తెలియవు. అని త్యాగయ్యగారు జనులను చూచి నిర్వేదమును వెలిబుచ్చినారు.

112. ముఖారి = రూపకము

ప॥ ఎంతనినే వ-ర్ణింతును శబరీ భాగ్య॥ మెంతని॥

అ॥ దాంతులు వరకాంతలు జగ-మంత నిండి యుండగ ఎంత॥

చ॥ కనులార సేవించి -కమ్మని ఫలముల నొసగి
తనువు పులకరింపగ పా-దయుగములకు మ్రొక్కి
ఇనకుల పతి సముఖంబున-పున రావృత్తి రహిత పద
మును బొందిన త్యాగరాజ-వినుతురాలి పుణ్యంబును॥ ఎంతని॥

తాత్పర్యము :

త్యాగయ్యగారి మనస్సు రామాయణములోని శబరిమీదకు వెళ్లినది. ఆహా! ఏమి ఆమె భాగ్యము!! ఎంతని వర్ణింతును? జగత్తులో ఇంద్రియ నిగ్రహము జేసిన పురుషులెంతో మంది ఉన్నారు. మరియు ఉత్తమ కులమున బుట్టిన ఉత్తమ స్త్రీలున్నారు. వారి కెవ్వరికిని అబ్బని మహా భాగ్యము శబరికి (బోయెత. అదియే ఆమె పేరయినది). ఆమె రాముని కన్నులార సేవించు కొన్నది. కమ్మని పండ్లను ఏరి ఇచ్చినది. ఒడలు పులకరించే టట్లు రామలక్ష్మణుల పాదములకు మ్రొక్కినది. ఇనకులపతి అయిన రాముని సన్నిధిలో పునరావృత్తి లేని మోక్ష పదమును పొందినది. ఏమి బాగ్యము ఏమి భాగ్యము ? అని అయ్యగారు ఆ భాగ్యమును కొనియాడి మన కన్నుల ఎదుట నా దృశ్యమును సాక్షాత్కరింప జేసినారు.

విశేషము = ''పశు ర్మనుష్యః పక్షీవా। యేచ వైష్ణవ సంశ్రయాః। తేనైవ తే సమాయాంతి। తద్విష్ణో ః పరమం పదం'' = పశువు కానిండు, మనుష్యుడు కానిండు, పక్షికానిండు,

పరమ భక్తులను ఆశ్రయించితే పునరావృత్తి రహితమగు విష్ణుని పరమ పదమును పొందుదురు'' అని శాస్త్రము. దీని ననుసరించి శబరి పురుషుడు కాకున్నను ఉత్తమ కుల స్త్రీ కాక పోయినను ఉత్తమ విష్ణు భక్తుడగు మతంగ మహర్షిని ఆశ్రయించి సేవించి నందు వలన రామ దర్శనము, రామ పాద సేవ, ఫలసమర్పణము లభించి ముక్తి పొందినది. మతంగుని వలన రాముని విని రామ దర్శనమునకై నిరీక్షించుటయే శబరి చేసిన తపస్సు. తపస్సు ఫలించినది. శబరి కథలో ఇంతలోతున్నది, అయ్యగారు దీనినే భావించిరి.

113. శుద్ధ ధన్యాసి = ఆది

ప॥ ఎంత నేర్చినా ఎంత జూచినా – ఎంత వారలైనా కాంతాదాసులే॥ ఎంత॥

అ॥ సంతతంబు శ్రీ – కాంత స్వాంతసి–ద్ధాంతమైన మార్గచింత లేనివా॥ రెంత॥

చ॥ పరహింస పర–భామాన్యధన–పరమాన వాప వాద
పరజీవనముల కన్నతమే–భాషింతురయ్య–త్యాగరాజనుత॥ ఎంత॥

తాత్పర్యము :

పరమార్థ చింతలేని వారి పోకడలను ఇందు వర్ణించినారు. ఓ రామా! కలినరులు ఎన్ని శాస్త్రములు చదువుకున్నా ఎంత ప్రపంచ జ్ఞానము సంపాదించినా పరమార్థ చింతలేక కాంతాదాసులై తిరుగు చున్నారు. పరులను హింసించుట, పరభామలను, పరధనములను కోరుట, పరులను నిందించుట, గొప్ప ఐహిక జీవనం కోసం అబద్ధములు పలుకుట వీటితో అధోగతి పాలగు చున్నారే అయ్యో'' అని త్యాగయ్యగారు జాలిపడినారు. ఇది మహా భక్తుల తపన.

విశేషము = శంకర భగవత్పాదు లిట్లే అనిరి. ''బాలస్తావ త్క్రీడాసక్తః। తరుణ స్తావ త్తరుణీసక్తః। వృద్ధ స్తావచ్చింతాసక్తః। పరమే బ్రహ్మణి కోపిన సక్తః''=బాలుడైతే ఆటలలో దగిలి యుండును. యువకుడైతే స్త్రీవ్యామోహమున దగిలియుండును. వృద్ధుడైతే జరాబాధకు చింతలో దగిలి యుండును. పరబ్రహ్మ ధ్యానమున నెవడును దగిలి యుండుట లేదు'' అని. అయ్యగారిదియును ఇదే జాలి.

114. హరికాంభోజి = దేశాది

ప॥	ఎంతరానీ తన కెంత పోనీ, నీ – చింత విడువజాల శ్రీరామ॥	ఎంత॥
అ॥	అంతకారి నీ చెంత చేరి హను– మంతుడై కొలువ లేదా॥	ఎంత॥
చ॥	శేషుడు శివునికి– భూషుడు లక్ష్మణ– వేషియై కొలువ లేదా॥	ఎంత॥
2॥	శిష్టుడు మౌని వరిష్ఠుడు గొప్పవ– సిష్ఠుడు హితుడు కాలేదా ॥	ఎంత॥
3॥	నరవర నీకై సురగణములు వా– నరులై కొలువ లేదా॥	ఎంత॥
4॥	ఆగమోక్తములగు నీ గుణములను – త్యాగరాజు పాడలేదా ॥	ఎంత॥

తాత్పర్యము :

రామా! ఐహికముగా నాకెంత రానీ, ఎంత పోనీ, నాకేమీ ఈ విషయమైన చింతలేదు. నీ చింత(ధ్యానము) మాత్రము విడువ జాలను. ఎందుచేతనంటే దీనిలోని సుఖమంతది. ఏ రూపములో నైనా నీ సేవ చాలా సుఖమయినది. అది తెలిసే కదా ! శివుడు హనుమంతుడై నిన్ను కొలిచినది. అది తెలిసే కదా శివునికి భూషణమైన ఆది శేషుడు లక్ష్మణుడై నిన్ను కొలిచినది. శిష్టాగ్రేసరుడైన వసిష్ఠుడు పురోహితుడై నిన్నుసేవించినది అది తెలిసే కదా!. రామ సేవా మాధుర్యము తెలిసే కదా దేవతలంతా వానరులయి రాముని సేవించినది. ఆ మాధుర్యము తెలిసే వర్ణింపబడిన నీ గుణములను నేను పాడుకొంటున్నది. అని అయ్యగారు తమ అనన్యార్హ భక్తిని రాముని వద్ద నివేదించు కొన్నారు.

విశేషము = హనుమంతుడు ఈశ్వరుని అంశమని పురాణ ప్రసిద్ధి. ఈ శ్వరుడు ''శ్రీరామరామరామేతి। రమేరామే మనోరమే। సహస్ర నామ తత్తుల్యం। రామనామ వరాననే''= ఓ పార్వతీ! నేను శ్రీరామ రామరామ అని జపిస్తూ ఆనందము ననుభవించు చున్నాను. '' అని శంకరుడు పార్వతితో చెప్పినాడు. కనుక ఆ సుఖమెరిగిన ఈ శ్వరుడు హనుమయై ''రాముని చెంత జేరి'' కొలిచినాడు. ఆది శేషుడు వైకుంఠమున స్వామిసన్నిధిలో ''నివాసశయ్యాసన పాదుకాంశుకో పధాన''=నివాసమై(గృహమై) శయ్య అయి, ఆసనమై పాదుకలై, వస్త్రమై తలగడయైసేవించునట. అట్టి శేషుడు లక్ష్మణుడై రాముని సన్నిధిలో నిత్యకైంకర్యరతు డైనాడు. వసిష్ఠుడు ఇక్ష్వాకు మహారాజు నుండి సూర్య వంశమునకు కుల గురువు. త్రికాల వేది అయిన అతడు, నారాయణు డీవంశమున అవతరించు నని తెలిసి రాముని సేవకై అంత వరకు వేచి యుండి రామునకు

హితుడై సేవించినాడు. రావణ బాధితులైన దేవతలు క్షీరసాగరమునకు బోయి నారాయణుని ప్రార్థించినారు. నారయణుడు రాముడై అవతరించెదను. నాకు సహాయముగా మీరందరు వానరులయి జన్మించుడని హరి ఆనతిచ్చెను. దేవతలు అట్లు చేసిరి. వేదోక్తములయిన భగవద్గుణములను త్యాగయ్యగారు కీర్తించుకొను చున్నారు. ''వేద వేద్యే పరే పుంసి। జాతే దశరథా త్మజే। వేదః ప్రాచేతసా దాసీత్। సాక్షా ద్రామాయణాత్మనా'' =వేద వేద్యుడయిన పరమ పురుషుడు దశరథుని కుమారుడై అవతరించుట చేత ఆ వేదము వాల్మీకి వలన రామాయణ రూప మయినది. రామాయణము ననుసరించి త్యాగయ్యగారు రాముని కీర్తించుట చేత వేదోక్త ములగు గుణములు కల పరమ పురుషునే కీర్తించుట అయినది.

115. సరస్వతీ మనోహరి = దేశాది

ప॥ ఎంత వేడుకొందురా ఓరాఘవా–పంతమేలరా ఓ రాఘవా॥ ఎంత॥

అ॥ చింత దీర్చుట–కెంత మోడిరా– అంతరాత్మ నాచెంతరాను ని॥ న్నెంత॥

చ॥ చిత్తమందు నిన్ను–జూచు సౌఖ్యమే– ఉత్తమంబనుచు ఉప్పొంగుచును
సత్తా మాత్రమా–చాలనమ్మితిని– సార్వభౌమ శ్రీత్యాగ రాజనుత॥ ఎంత॥

తాత్పర్యము :

ఓరామా ఎంతకాలము నిన్ను వేడుకొందును? పంతమెందుకు నాపై, ఓ రాఘవా నా చింత దీర్చుటకు నీకు ఏల ఇంత బిగువు? నా అంతరాత్మలో నన్నంటియే ఉన్నావు. అది నాకేమి సుఖము? ఎదుట సాక్షాత్కరించు. నిన్ను మనస్సులో ధ్యానించి చూచుట ఉత్తమమని నమ్మి ఉప్పొంగు చున్నాను. వేదాంతులు ''బ్రహ్మము సన్మాత్ర చిన్మాత్ర నిర్విశేషము'' అని చెప్పుదురు. అది నమ్మి యున్నాను. అయినను నీ స్వరూప సాక్షాత్కార మిచ్చి నా చింత దీర్చుము. అని త్యాగయ్యగారి ప్రార్థనము,

116. సారంగ = దేశాది

ప॥ ఎంత భాగ్యమో మా పాలగల్గితివి – ఎవరీడు ముజ్జగములలో తన॥ కెంత॥

అ॥ చెంతజేరి సౌజన్యుడై పలికి–చింతబాగ దొలగించి బ్రోచితివి॥ ఎంత॥

చ॥ మున్ను మీసమీపమున వెలయు స-న్మునుల నెల్ల నణిమాది లీలలచే
తిన్నగాను పాలనము జేసినట్లు- నన్నుగాచితివి-త్యాగరాజనుత॥ ఎంత॥

తాత్పర్యము :

ఓరామా! నా భాగ్యము ఎంతదో? చాలా గొప్పది. ఈ ముజ్జగములలో సాటి ఎవ్వరును లేరు. నా చెంతజేరి నీ సౌజన్యమును చూపి మాటలాడి దుఃఖమును తొలగించి రక్షించితివి. పూర్వం నీ వద్దకు వచ్చిన మునులను అణిమాది లీలలను జూపి రక్షించితివి. అదేవిధముగా నన్ను రక్షించితివి. నాకెవరు సాటి?

విశేషము = శ్రీరాముడు అరణ్యవాసమున దండ కారణ్యమందు మునులను తాను వెళ్లి దర్శనం చేద్దా మనుకొన్నాడు. ఇంతలో మునులే రాముని ఆశ్రమమునకు వచ్చిరి. అప్పుడు రాముడు ముందుగా వారితో పలికిన మాటలవి. '' ఉపస్థేయై రుపస్థితః'' =నేను మీ వద్దకు రావలసి యుండగా మీరు నా వద్దకు వచ్చితిరి. ఇందుకు ''హ్రీరేషాహి మమాతులా''=నేను చాలా సిగ్గుపడుచున్నాను. అని. ఇక్కడ రాముడు ''అణిమ''ను జూపినాడు. అణిమ అనగా కొద్ది తనము. చూపినది అణిమను. ఇదే ''సౌజన్యము''. రాముడు తనను రక్షించినట్లు ఒక అనుభవమును పొంది రచించిన పాట ఇది.

117. తోడి = త్రిపుట

ప॥ ఎందుకు దయరాదురా - శ్రీరామ చంద్ర నీ కెందుకు॥

అ॥ సందడియని మరచితివో - ఇందు లేవో...నీ కెందుకు॥

చ॥ సారెకు దుర్విషయసారమనుభవించు-వారి చెలిమి జేయనేరక మేను
శ్రీరామ సగమాయె జూచిచూచి- నీరజ దళనయన నిర్మలా పఘన॥ ఎందుకు

2 తీరని భవనీరధి ఆరడి సైరింప-నేరక భయమందగ, పంకజ పత్ర
నీరువిత మల్లాడగ, ఇట్టినను జూచి-నీరదాభ శరీర నిరుపమ శూర॥ ఎందుకు

3 జాగేలయిది సమయమేగాదు జేసితే- ఏగతి బలుకవయ్య శ్రీరామ నీ
వేగాని దారిలేదయ్య, దీన శరణ్య-త్యాగరాజ వినుత తారక చరిత॥ ఎందుకు

తాత్పర్య సంగ్రహము=నీదయ ఎందుకు రాదు. నన్ను సందడిలో మరచితివా! ఈ సంసారములో అల్లలాడు చున్నాను. జాగుచేయకు అని.

118. శుద్ధ దేశి = ఆది

ప॥ ఎందు కౌగలింతురా నే-నెంతని వర్ణింతురా నే॥ నెందు॥

అ॥ అందమైన కుందరదన- ఇందిరా హృన్మందిరా నే॥ నెందు॥

చ॥ నీదు పలుకే పలుకురా రామ- నీదుకులుకే కులుకురా
నీదు తళుకే తళుకురా -నిజమైన త్యాగరాజ నుత॥ ఎందు॥

తాత్పర్యము :

ఓ రామా! అందగాడా! కుందరదనా= మల్లెమొగ్గల వంటి పలు వరుస గలవాడా! నిన్ను ఎందు కౌగలింతును ? (విశ్వమంత యునీరూపమైనప్పడు ఎందు కౌగలింతును అని). వాక్కుల కందని నీ సౌందర్యము నెంత అని వర్ణించను ? ఓ ఇందిరా హృన్మందిరా= లక్ష్మీదేవి హృదయమందు నెలకొన్నవాడా ! నీ పలుకే పలుకు. నీ కులుకే కులుకు. నీ తళుకే= కాంతియే తళుకు. అని అయ్యగారు రాముని సౌందర్యమును వర్ణించిరి.

విశేషము= అయ్యగారికి రాముని కౌగలించు కొన వలెనని ఒక ఓరిక కలిగినది. ఈ స్ఫూర్తి ఎక్కడిది ? దండకారణ్యమందు మునులకు రాముని చూడగనే కౌగలించుకొనవలెనని అభిలాష కలిగినదట. దాని ఫలమే మునులు ద్వాపరమున గోపికలయి జన్మించుట. రాముడు కృష్ణుడయి వారికి తన ఆలింగనము(కౌగలింతను) ఇచ్చుట. కౌగలింత అంటే రాముని సర్వస్వమును. '' ఏష సర్వస్వభూతో మే। పరిష్వంగో హనూమతే'' =నా సర్వస్వము నగు ఈ కౌగిలింత హనుమంతునకు'' అని రాముడు హనుమకు కౌగిలింత నొసగెనట. అయ్యగారు కోరినదిది. సర్వస్వము అనగా ధనకనక వస్తు వాహనాది సమస్త సంపదలు.

119. హరికాంభోజి = దేశాది

ప॥ ఎందుకు నిర్దయ- ఎవరున్నారురా॥ ఎందుకు॥

అ॥ ఇందునిభానన- ఇనకుల చందన॥ ఎం॥

చ॥ పరమ పావన- పరిమళాపఘన॥ ఎం॥

2 నే పర దేశి-బాపవే గాసి ఎం॥

3 ఉడుత భక్తినిగని -యుప్ప తిల్లగ లేదా॥ ఎం॥

4 శత్రుల మిత్రుల-సమముగ జూచేనీ ॥ కెందుకు॥

5 ధరలో నీవై-త్యాగరాజుపై ఎందుకు॥

తాత్పర్యము :

ఓరామా! నాపై నీకు నిర్దయ ఎందుకు? నీకన్న నాకెవరున్నారు? ఓ చంద్ర వదనా ! ఇనకుల చందనా =సూర్య వంశమునందు చందనము వంటివాడా ! ఓ పరమ పావనుడా ! పరి మళాపఘన=చక్కని పరిమళముగల శరీరము గలవాడా! నేను పరదేశిని-నా బాధ తీర్పుము. ఉడుత భక్తికి నీవు సంతసించితివి కదా ! శత్రువులను కూడ మిత్రుల వలె చూచువాడవు కదా ! సమస్తము నిండి యున్న వాడవు. నాపై నిర్దయ ఏల ? అని ప్రార్థనము.

విశేషము =పరదేశి అనగా, శాశ్వతా నందమునిచ్చే రామలోకమున అక్కడ రామ సేవా భాగ్యము గల ముక్త పురుషులతో చేరి ఆనందము ననుభవింప వలసిన తాను దుఃఖమయమయిన ఈ లోకమున నుండుటయే పరదేశ వాసమనే భావముతో ''నే పరదేశి'' అన్నా రయ్యగారు. సేతు బంధన సమయములో ఒక ఉడుత ఇసుకలో పొరలి సముద్రమందు రాల్చినది. ఉడుతను శ్రీరాముడు చేతితో నిమిరెనట. దాని మీద నున్న దయ నామీద లేదా అని. రావణుడు రామునితో యుద్ధము జేయుచు రథముపోయి గుర్రములు పోయి సారథిపోయి చాలాబడలి హడలి పోయినాడు. అప్పుడు రాముడు సులభముగా వానిని వధింప వచ్చును. కాని రాముడు మిత్రునకు చెప్పినట్లు రావణా చాలబడలి ఉన్నావు. ఇంటికి పోయి బడలిక దీర్చుకొని సర్వసన్నాహముతో రేపు యుద్ధమునకు రమ్ము అని చెప్పినాడు. ఇదే శత్రువును మిత్రునిగా చూచుట. పైన చెప్పిన లక్షణములుగల నీవు నాపై నిర్దయ జూపుట న్యాయము కాదని సారాంశము.

120. శంకరాభరణము = దేశాది

ప॥ ఎందుకు పెద్దల వలె బుద్ధీయవు- ఎందుబోదునయ్య రామయ్య ॥ ఎందు॥

అ॥ అందరి వలె దాటిదాటి వదరితి - అందరాని పండాయె గదరా॥ ఎం॥

చ॥ వేద శాస్త్రతత్వార్థము దెలిసి- భేదరహిత వేదాంతము దెలిసి
నాద విద్య మర్మములను దెలిసి-నాథ! త్యాగరాజనుత! నిజముగ॥ ఎం॥

తాత్పర్యము :

ఓరామా! నాకు పెద్దలవంటి బుద్ధిని ఇయ్యవేల? ఈ బుద్ధిని సంపాదించుటకు నేనెక్కడకు వెళ్లను. సామాన్యజను లందరి వలెనే ధర్మము నతిక్రమించి వదరుచున్నాను. వాక్కును అదుపులో ఉంచుకొనేది అందరాని పండయినది. వేద శాస్త్రార్థములను, సంగీత విద్యారహస్యములను అద్వైత బుద్ధిని ప్రసాదించ వలసినది'' అని ప్రార్థన

విశేషము = అయ్యగారు మహాత్ములకున్న బుద్ధి నీయవలసినదిగా రాముని కోరినారు. ''ప్రవృత్తించ నివృత్తించ। కార్యాకార్యేభయాభయే। బంధం మోక్షంచ యావేత్తి। బుద్ధి స్సాపార్థ సాత్త్వికీ = ప్రవృత్తిని, నివృత్తిని, కార్యాకార్యములను, భయాభయములను, బంధమును, మోక్షమును, తెలుసు కొనేది సాత్త్విక బుద్ధి''. ఈ బుద్ధి వేద శాస్త్రములను అధ్యయనం చేస్తే కలుగును. అధ్యయమునకు గురువు కావలెను. ఇది సాధారణ ధర్మము. లోకోత్తరపురుషులకు భగవదనుగ్రహము చేతనే సిద్ధిస్తుంది. కాక త్యాగయ్యగారు రామునియందే గురు భావన చేసినారు. శఠగోపులు అనే భక్తులు 'పత్యుశ్శ్రియః ప్రసాదేన ప్రాప్త సార్వజ్ఞ్య సంపదం' భగవదను గ్రహము చేతనే సర్వజ్ఞులైరి' అని ఉన్నది. అయ్యగారు రాముని అట్టి అనుగ్రహమును కోరినారు.

121. మోహన = ఆది

ప॥ ఎందుకో బాగ తెలియదు

అ॥ అందగాడ శ్రీరామ ఈతను
వష్ఠిర మని ఈకలి మానవుల॥ కెందుకో॥

చ॥ గట్టిగ రాళ్లను గట్టిన గృహముల-మట్టుమితము లేనట్టి పరిజనులు
చుట్టుకొన్న నిజచుట్టాల కొరుల-పట్టుల కతిథులకు
బెట్టలేక తమ పొట్టసాకు కొ-న్నట్టి దేహముల రట్టు సంచులను
గట్టిన ధనముల పెట్టెలతోడను-బెట్టి పాయ్యే మట్టు కనుంగొని॥ ఎం॥

2 కల్లలాడి కడు వల్లము నింపుట- కెల్లవారి ధనమెల్ల జేర్చుకొని
వల్లవాధరుల నెల్ల గనిశునక-పిల్లల వలె దిరిగి

ఒళ్లరోగములు కొల్లగాదగల-దొల్లి పైకములు మెల్లజార-జను
లెల్ల దూర పర మెల్ల బార భువి-మళ్లి పుట్టి ఫల మెల్ల గనుంగొని॥ ఎం॥

3 వంచకుల ననుసరించిన అలమట-ఇంచుకైన సైరించ లేక తమ
సంచిత కర్మము లంచు దెలిసి వే-రెంచు వారల జూచి
మంచువలె ప్రతి ఫలించే సంపద-లంచు గోరకను మంచి త్యాగరా
జించితముగ పూజించి నుతించు ప్ర-పంచ నాథుని భజించు దామనుచు॥ ఎం॥

తాత్పర్యము :

అయ్యో! శ్రీరామా! జను లీదేహము అశాశ్వతమని, ఈ ఇళ్లు అశాశ్వతమని, ఈ పరిజనులను చుట్టాలను పొట్టను పోషించుటకై పెట్టెలతో ధనము కూడ బెట్టి అది అశాశ్వతమని చూస్తూకూడ తెలుసుకొన లేక పోవుచున్నారు. అబద్ధాలతో కడుపు నింపుకొని పరుల ధనమును కూడ బెట్టుకొని స్త్రీల వెంట కుక్కలవలె తిరిగి రోగాల పాలై కూడబెట్టిన ధనము జారి పోగా జనులందరును నిందించగా సద్గతి దూరముకాగా మరల మరల పుట్టి కర్మఫలము లనుభవిస్తూ కూడ తెలియ లేకుండి రేల? వంచన మార్గములు చేపట్టి అలమటిస్తూ భరించలేక కర్మఫలము అనుకొనుచు దీనికన్న వేరుమార్గములో ఉన్నవారిని చూస్తూ కూడ మంచువలె కరగి పోయే ఈ సంపదల మీద ఆశవదలి మంచివాడైన త్యాగరాజు పూజించి నుతించే శ్రీరాముని భజించుదామని ఎందుకో తెలియలేకున్నారు. అని త్యాగయ్యగారు జనులను చూచి ఆవేదన జెందిరి.

విశేషము = భక్తులు భగవద్ధ్యాన సుఖము ననుభవించుచున్నను దీనికి దూరమయి కష్టముల పాలగు వారిని చూచి బాధపడుదురు.

122. తోడి = త్రిపుట

ప॥ ఎందుదాగినాడో ఈడకు రాడో
ఎన్నడు దయవచ్చునో ఓమనసా॥ ఎందు॥

అ॥ ఎందుకు చపలము వినవేనా మనవిని-ముందటి వలె భక్తుల పోషించుట॥ కెందు॥

చ॥ అలనాడు కనకకశిపు నిండారు చలము జేసిసుతుని సకలబా
ధల బెట్టగా మదిని దాళక ని
శ్చలుడైన ప్రహ్లాదు కొరకు కంబములో-పల నుండగలేదా ఆరీతినే॥ డెందు॥

2 మునువారి వాహతనయుడు మద-మున రవిజుని చాల గొట్టగా జూచి
మనసు తాళ జాలలేక ప్రేమ-మున పాలనము సేయ తాళతరువుమరు
గున నిల్వగాలేదా॥ ఆరీతిని నే॥ డెందు॥

3 తొలిజన్మల నాడు జేసిన దుష్కర్మ ముల నణగను జేయ ఆరుశ
త్రుల బట్టి పాడిసేయ అదియుగాక
ఇలలో చంచల రహిత నిజభక్తజ-నులను త్యాగరాజుని రక్షింప నే డెందు॥

తత్పర్యము:

త్యాగయ్యగారు తన మనస్సునకు ఊరట జెప్పు చున్నారు. భగవంతుడు ఈనాడు ఎందు దాగి ఉన్నాడో? ఇక్కడకు రాడేమో? ఓ మనసా చపల మెందుకు? మునుపు హిరణ్య కశిపుడు ప్రహ్లాదుని సకల బాధలు బెట్టగా తాను సహింపలేక స్తంభములో దాగి యున్నాడు కదా? త్రేతాయుగంలో వారివాహన తనయుడు= దేవేంద్రుని కొడుకు (వాలి) రవిజుని = సుగ్రీవుని చాల కొట్టినప్పుడు రాముడు తాను సహింపలేక చెట్టుచాటున దాగి (సుగ్రీవుని రక్షించుటకు) ఉన్నాడు కదా! నా పూర్వకర్మములను బోగొట్టి నా అంతశ్శత్రువులను (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను) రూపు మాపుటకు ఇంకను నిజభక్తులను పాలించుటకు ఎందుదాగినాడో అనగా ఎందో ఒకదానియందు దాగియున్నాడని, దాగియుండి రక్షణమునకు (భక్తుల) సిద్ధముగా నుండునని త్యాగయ్యగారు నిశ్చయ జ్ఞానముతో నున్నారు. ఇది సందేహము కాదు.

విశేషము= 'ఎందుకు చపలము' అనుటలో మనస్సు యొక్క స్వభావము 'చంచలంహి మనః కృష్ణ' = అనినట్లు చపల స్వభావము. అయ్యగారు అది వద్దని మనస్సుకు బోధించిరి. చపల మనగా సందేహమని. 'ఇందుగల డందులేడని సందేహము వలదు' అని చెప్పిన ప్రహ్లాదుని నిశ్చయమే అయ్యగారిది. మరేమంటే దాగియుండి రక్షించుట ఆయన స్వభావము' అని అయ్యగారు చమత్కరించిరి.

123. ధన్యాసి = రూపకం

ప॥ ఎందుబోయెరాదయ- ఇనకుల తిలకా! దయ॥ ఎందు॥

అ॥ ఇందువదన కుందరదన-మందర ధర! నీ దయ॥ ఎందు॥

చ॥ శాంత భూష భక్త పోష-శరణు శేష శాయీ దయ॥ ఎందు॥

2 శ్రిత శరణ్య సురవరేణ్య-కృత సుపుణ్య ధన్యాదయ॥ ఎందు॥

3 నాగరాజ ధర సుతాజ-త్యాగరాజ వరదా! దయ॥ ఎందు

తాత్పర్యము :

ఓరామా! నీదయ ఎక్కడకు బోయినది. ఇంత కంటే తాత్పర్యము ఏమి యులేదు అన్నియు సంబోధనలు మాత్రమున్నవి. వాటి ప్రతి పదార్థము వ్రాయ బడును. ఇందువదన! = చంద్రుని వంటి ముఖము వాడా! కుందరదన= మల్లెమొగ్గల వంటి పలు వరుస వాడా! మందర ధర = మందరమును ధరించినవాడా! శాంతభూష = శాంతరసమే నగయైనవాడా! భక్త పోష = భక్తులను పోషించువాడా! శరణు=శరణంటిని శేషశాయీ!= శేషుని యందు శయనించువాడా! శ్రితశరణ్య = ఆశ్రయించిన వారికి రక్షకుడా! సురవరేణ్య = దేవతలలో శ్రేష్ఠుడా? కృతసుపుణ్య = మంచి పుణ్యములు చేసిన వాడా! ధన్యా! నాగరాజ ధరనుత = సర్పములను ధరించిన శివునిచే నుతింపబడువాడా! అజ= పుట్టుక లేని వాడా! త్యాగరాజ వరదా = త్యాగరాజునకు వరమొసంగిన వాడా!

విశేషము = ఇందు అజ = పుట్టుక లేని వాడా ! అని సంభోదన మున్నది. మరి రామకృష్ణాది జన్మలు కలవు కదా! ఇక అజుడెట్లగును. అని ప్రశ్న పుట్టుచున్నది. సమాధానము. ఇవి జన్మలు కావు. కనుకనే అవతారము లన బడుచున్నవి. అవతారమనగా పై నుండి క్రిందకు దిగి వచ్చుట అని అర్థము. మరియు దేవతలు మొదలుకొని అన్ని జీవులకు వారివారి కర్మములను బట్టి భగవంతున కధీనములై జన్మలు వచ్చుచున్నవి. భగవంతున కట్లు కాదు. 'ఇచ్ఛాగృహీతాభిమతోరు దేహాః' = తన ఇచ్ఛచేత (సంకల్పము చేత) అభిమతమయిన దేహమును గ్రహించువాడు అని చెప్ప బడినది. రామకృష్ణావతారములు దేవతల ప్రార్థనముచే రావణ సంహారము కొరకు భూభారహరణము కొరకును తాను గ్రహించిన అభిమత దేహములు. ఆయా క్లిష్ట పరిస్థితులలో 'తదాత్మానం సృజామ్యహం' = అప్పుడు నేను నన్ను సృష్టించు కొందును' అని చెప్పిన ప్రకారము అవి జన్మలు కావు. ఆత్మ సృష్టి అవతారములు. కనుక అయ్యగారు చెప్పిన 'అజ' అనుదానికి ప్రతిహతి లేదు. ఇంకొక విశేషము = ఇక్కడ వీర భద్రశాస్త్రిగారు 'నాగరాజ ధరను తాజ' అను దానికి నాగరాజ ధర = పర్వతము నెత్తిన వాడా! ను తాజ బ్రహ్మచే నుతింప బడు వాడా! అని అర్థము వ్రాసిరి. ఇది తప్పు. వారేలనో పొరపాటు పడిరి. నేను చెప్పిన అర్థము సాధువు. గమనింప గోరుదును.

124. దర్బారు = త్రిపుట

ప॥ ఎందుండి వెడలితివో - ఏ యూరో నేతెలియ॥
ఇపుడైన దెలుపవయ్యా॥ ఎందుడి॥

అ॥ అందచందము వేరై-విడత లెల్లను త్రిగు-ణాతీతమై యున్నదే కాని శ్రీరామనీ॥ వెందు॥

చ॥ చిటుకంటే అపరాధ చయముల తగిలించే-శివలోకము గాదు॥
వటు రూపడై బలిని వంచించి అణచువాని - వైకుంఠము గాదు
విట వచనము లాడి. శిరము ద్రుంప బడ్డ, విధిలోకము గాదు॥
దిటవు ధర్మము సత్యము-మృదుభాషలు గల్గు. దివ్య రూప త్యాగరాజ నుత॥ ఎందు॥

తాత్పర్యము :

రాముని రూపగుణములను భావించినారు. త్రిమూర్తులలో ఎవనికిని రాముని ధర్మములు లేవు. ఆశ్చర్యముతో అయ్యగారు ప్రశ్నిస్తున్నారు. రామా! నీవే లోకము నుండి వెడలి వచ్చితివయ్యా! శివలోకము నుండియా? కాదు. చిటుకు మంటే అపరాధం అంట గట్టి దండించేవాడు. మరి విష్ణు లోకము నుండి వెడలి వచ్చిన విష్ణువా నీవు? కాదు. విష్ణువు కపట వటు వేషముతో వచ్చి బలిని వంచించినాడు. ఇక బ్రహ్మ లోకము నుండి వెడలి వచ్చితివా? కాదు. అతడు పార్వతీదేవి వివాహ సమయంలో వ్యామోహముతో పార్వతి ముఖమును చూచినాడు. దానితో కోపించి శివుడు బ్రహ్మ తలను నరికినాడు. కనుక ఆలోకము నుండి కాదు. స్థైర్యము, ధర్మము, సత్యము, మృదుమధుర భాషణము, దివ్య రూపమును కలిగి యున్నావు. ఇట్టి నీది ఏలోకము ఏ ఊరు? అని ప్రశ్న. త్రిమూర్తుల కతీతుడు రాముడని భావము. ముగ్గురిలోను లోపములు కనపడుచున్నవి.

విశేషము = చిటుకు మంటే అపరాధ మంట గట్టేది శివుని గుణమనునది పైన నుదాహరించిన బ్రహ్మ కథలోనే యున్నది. రామునిలో అపరాధమును క్షమించుట (కాకాసుర వృత్తాంతమందు) ఏక పత్నీ వ్రతముతో పరస్త్రీని కన్నెత్తి చూడకుండుట, కపటము లేకుండుట స్పష్టముగా కనపడుచున్నవి. ఇవియే అయ్యగారిని లోగొన్నవి.

125. సౌరాష్ట్రము = చాపు

ప॥ ఎంతనుచు వర్ణింతు నే యీ - ఇందిరా రమణుని నే॥ నెంత॥

అ॥ సంతతము నమ్మి సజ్జనుల ఆ-సంత దీర్చు వ-సంత సుకుమారుని॥ ఎంత॥

చ॥ మెరుగు బంగరు చేల-మిరవొంద మరియు నూ-పురములు ఘల్లనగ భక్తులగని॥
కరుణామృతము చల్లగా యోగుల ద-హారములు ఝల్లనగ వేంచేసిన॥ ఎంత॥

2 తిలకము చెలగగ జలజాక్షు డిలను గ-దలు లీవి వినిపింపగ తుంబురునార
దులు గని నుతియింపగ సురలు సుమ-ముల వాన గురియింపగ వేంచేసిన॥ ఎంత॥

3 ఘననీలమును గేరు తనుపై పునుగు చం-దనము పరిమళింపగ బాగయుర
మున ముక్తా మణు లాడగ - త్యాగరాజు-గని చేలాగియ్యగ, వేంచేసిన॥ ఎంత।

తాత్పర్యము :

ఆహా నేను ఎంతని ఏమని వర్ణింప గలుగుదును ఈ ఇందిరా రమణుని = లక్ష్మీ దేవి నాథుని? ఎప్పుడును నమ్మిన వారి ఆశ అంతయు దీర్చే వసంతసుకుమారుని ఎంతని వర్ణింతును? వసంత ఋతువు అందరి ఆశలు దీర్చేది. అందుకే వాల్మీకి 'శ్రీమానయం చైత్రరథః। పుణ్యః పుష్పిత కాననః' = ఈ వసంత ఋతువు పుష్పించిన వనములతో శోభాకరముగా నున్నది' అన్ని వర్ణించినాడు. వసంత ఋతువు అందరికిని ఆహ్లాద కరము. పుష్ప ఫలములతో నిండి కోకిల కూజితములతో తుమ్మెద ఝుంకారములతో సర్వజన మనోరంజకముగా అందరి ఆశలను దీర్చునదై యుండును. త్యాగయ్య గారు సాభిప్రాయముగా 'వసంత సుకుమారుడు' అన్నారు. అట్టి వసంత సుకుమారుడు బంగరు చేలము గట్టి కాలి అందెలు ఘల్లనగా, భక్తులను చూచి కరుణా మృతము చిలుకుచు, యోగుల హృదయములు ఝల్లు అనగా కస్తూరి తిలకము దిద్ది, మేన చందన మలది, తుంబురు నారదులు గానం చేయుచుండగా ముత్యాల రత్నాల హారములు వక్షస్థలమందు అసి యాడుచుండగా నల్లని మబ్బుచాయతో పద్మనేత్రములతో త్యాగరాజునకు చేయూత నిచ్చుటకు కదలి వచ్చే రాముని వర్ణించుట కష్టము అని అయ్యగారి భావనము. రమ్యమగు చిత్రీకరణము.

విశేషము = వసంత సుకుమారుడు వసంత ఋతువు వలె అందగాడు అని ఒక భావము. చైత్ర శుద్ధనవమి ఆయన అవతార శుభదినము కనుక వసంత ఋతువునకు కుమారుడని ఇంకొక భావము. 'యోగుల హృదయములు ఝల్లనుట' ఎందుకు? భయముచేత, అతిలోక సౌందర్యముతో లావణ్యముతో కదలి వస్తున్న రాముని చూడగనే అయ్యయో! ఈ మూర్తిపై ఎవరి దృష్టి పడునో ఎవరి దృష్టి దోషము తగులునో అని గుండె ఝల్లుమనినది. తొల్లి విష్ణుచిత్తులనే భక్తులకు ఇట్టి సాక్షాత్కారము కలిగి ఆయన గుండె ఝల్లుమని ఆదివ్య సౌందర్యమునకు 'శాశ్వతమగు మంగళమగుగాక' అని మంగళాశాసనము చేసిరి. ఆ ప్రబంధమే 'తిరుప్పల్లాండు' అనే తమిళ దివ్య ప్రబంధము.

126. యదుకుల కాంభోజి = ఆది

ప॥ ఎంతనుచు సైరింతును సీతా-కాంత దయ రాదు

అ॥ ముని॥ చింతనీయ! శ్రీరామ చంద్రనా - చెంతరానింక మనసురాదా॥ ఎంత॥

చ॥ సమాన రహితా! సమాన! దాసా! సమాన పాలన నా, మొఱలువే
స మాయెనా సుజనావనా! శుభక-ర! మాప్త పరివారామరవినుతా!
రమారమణ! యితరమా నీకు నే॥ నెంత॥

2 భరాజ ముఖ! వృషభరాజపనుత! ఇ-భరాజ వరద! సదా, భక్తసుల
భ రాజన్య శుభకరా! సతతమో-నిరాజనుత! యవనిరాజపరిచర॥
నిరాతంక నిరామయా! నే॥ నెంతనుచు॥

3 విరాజ వాహన! విరాజమాన క-విరాజ రక్షక! నాతపములన్ని
విరాజసము లేనా, జ్ఞాన మొస-గ రాజజనక! నగ రాజధర! త్యా
గరాజ నుత! నాగ రాజ శయనా॥ ఎంతనుచు॥

తాత్పర్యము :

ఓ సీతా కాంతుడా! శ్రీరామ చంద్రా! ముని చింతనీయ! = మునులకు ధ్యానింప దగినవాడా! నీదయ రాకున్నది. ఎంతని తాళుదును! నాపై దయ జూపుటకు నీ మనసు రాదా! సమాన రహితా = సాటిలేనివాడా! సమాన = అభిమానము కలవాడా! దాసాసమాన పాలన = దాసులను సాటిలేని రీతిగ పాలించువాడా! నా మొరలు వేసమాయేనా? = నేను మొరబెట్టుట వేషముగా నీకు తోచుచున్నదా? సుజనావనా! = సుజనులను రక్షించువాడా! శుభకర = శుభములు గలించువాడా! మాప్త = మా అనగా లక్ష్మీదేవి. ఆమెకు ఆప్తుడా! పరిజనులయిన దేవతలచే నుతింప బడువాడా! రమా రమణ= లక్ష్మీరమణుడా! నీకు నే ఇతరమా? = పరాయివాడనా? (కానని) భ రాజ ముఖ = నక్షత్ర ములకు రాజయిన చంద్రుని వంటి ముఖము గలవాడా! వృషభరాజ పనుత! = వృషభములకు పతి అయిన నందికేశ్వరుని రక్షించు శివునిచే నుతింప బడువాడా! ఇభరాజ వరద! గజరాజునకు వర మిచ్చిన వాడా! సదా భక్త సులభ = ఎప్పుడును భక్తులకు సులభమయిన వాడా! రాజన్య శుభకరా! = రాజులకు శుభకరుడా! అవని రాజ పరిచర!= భూమిని పరిపాలించు రాజులు పరిజనులైన వాడా! (సార్వభౌముడని) నిరాతంక = ఎదురు లేని వాడా! నిరామయా = వ్యాధి లేని వాడా!

(విశ్వామిత్రుడుపదేశించిన బలాతిబల విద్యలచే ఆకలి దప్పులను కూడ జయించిన వాడని) విరాజ వాహన! = వి అనగా పక్షి. వాటి రాజయిన గరుత్మంతుడు వాహనమైన వాడా! విరాజమాన = బాగా ప్రకాశించు వాడా! కవి రాజ రక్షక! = కవిరాజులను రక్షించువాడా! నా తపములన్ని = నేను చేసిన తపస్సు లన్నియును విరాజసము లేనా? బాగా రాజసగుణముతో చేసిన వేనా? (రాజసగుణముతో చేసిన వాటికి భగవదను గ్రహఫలిత ముండదు) జ్ఞాన మొసగరా. అజజనక = బ్రహ్మకు తండ్రియైన వాడా! నగరాజ ధర = పర్వతము నెత్తినవాడా ! త్యాగరాజ నుత = త్యాగరాజుచే నుతింప బడువాడా! నాగరాజ శయనా! = సర్పముల రాజగు శేషుని యందు శయ నించువాడా! ఎంతని సైరింతును అని మొదటి మాటతో అన్వయము.

విశేషము = నీ దయ రాదా 'సీతాకాంత' అని ప్రశ్న, సీతా కాంతుడవై యుండి కూడ దయ జూపకుండుట యుక్తము కాదని, సీతాకాంతు డనగా సీత కిష్టమయిన వాడవు కోరబడిన వాడవు. ఆమెకు కాంతుడ వెప్పుడగుదువు? ఆమె కిష్టమయిన పని భక్తులపై దయ జూపుటయే. రామాయణమున 'తం దృష్ట్వా శత్రు హంతారం మహర్షీణాం సుఖాదహం। పరం ప్రహృష్టా వైదేహీ। భర్తారం పరిషస్వ జే' = శత్రువులను సంహరించి మహర్షులకు సుఖము కలుగ జేసిన రాముని చూచి సీత చాల సంతసించి కౌగలించు కొనినది' అని ఖరాది వధ సందర్భమున నున్నది. దుష్ట సంహారము ద్వారా మహర్షులను రక్షించుటయే సీత సంతోష కారణము. అట్టి సీతకు కాంతుడవై నాపై ఏల దయ జూపవు? అని త్యాగయ్యగారి 'సీతాకాంత' పద ప్రయోగము.

127. గొలిపంతు = చాపు

ప॥ ఎంత పాపినైతి నేమిసేయుదు హా- ఏలాగు తాళుదునే ఓ రామా॥ ఎంత॥

అ॥ అంతదుఃఖములను దీర్చు హరిని జూచి- ఎంతవారైనను బాయ సహింతురే॥ ఎంత॥

చ॥ మచ్చికతో దాను ముచ్చటాడి మోస-పుచ్చి ఏచమది వచ్చెనో కటకటా॥ ఎంత॥

2 ఆసమించి ఆయాస పడను విధి - వ్రాసునా నాముద్దు వేసుని గానమే॥ ఎంత॥

3 సేవ జేయుటే జీవనమనియుంటి-దైవమానా పాలి భాగ్య మిట్లాయెనే॥ ఎంత॥

4 రాజిల్లు శ్రీత్యాగరాజు తాబొంగుచు-బూజించు శ్రీరఘు రాజిందు లేనందు॥ కెంత॥

తాత్పర్యము :

దాదాపు ఈ కీర్తనములన్నియు నిర్వేద మయములే. నేనెంత పాపిని? ఏమి జేతును? సకల దుఃఖములను దీర్చే హరిని ఒకసారి చూచి విడచుట ఎవరైన సహింప గలరా? ఆహరి దర్శనమిచ్చి మాటలాడి అంతర్ధానమైనది నన్ను బాధించుటకా? నేను అత్యాశకు పోయి ఈ విధంగా బాధపడమని బ్రహ్మ వ్రాసెనా ఏమో? ఏడీ నాముద్దుల హరి? సేవ జేయుటే జీవనమని ఎంచితిని. కాని నా భాగ్యమిట్లయినది. నేను నిత్యమును పూజించే నారఘు రాముడేడీ? అని ఆర్తిబడినారు.

128. శంకరాభరణము = త్రిపుట

ప॥ ఎందుకీ చలము నే-నెవరితో దెలుపుదు॥ ఎందు॥

అ॥ కందర్ప జనక నీకే-కాంత జెప్పెనో హరిహరి॥ ఎందు॥

చ॥ కౌ।సల్య జెప్పెనో నీకే -సమ్మతి లేదో -అ
హల్య చెప్పెనో-న-న్నా దరించలేవో॥ ఎందు॥

2 కబరీ భారిణి సీతా-కాంత చెప్పెనో లేక
శబరి చెప్పెనో నీదు -శాంత మెందు బోయె। ఎందు॥

3 బాల యౌస్వయం - ప్రభచెప్పెనో
తాళ నా తరమా - త్యాగ రాజునిపై నీ ॥ కెందు॥

తాత్పర్యము :

ఇదికూడ ఆర్తియే. ఓ కందర్ప జనకా - మన్మధుని తండ్రీ నీకు నాయెడ ఎందుకీ చలము? (కోపము) హరిహరీ? రాముని స్వభావము భక్తులను రక్షించుట. మరి స్వభావ మెట్లు మారినది? ఎవరయినా స్త్రీలు తనమీద నేమైనా చాడీలు చెప్పిరా రామునకు? అని అనుమానము కలిగినది. అయ్యగారికి. ప్రశ్నించుచున్నారు. కౌసల్య చెప్పినదా? అహల్య చెప్పినదా? సీత చెప్పినదా? శబరి చెప్పినదా? స్వయంప్రభ చెప్పినదా? అని అయ్యగా రడిగినారు.

విశేషము = అయ్యగారీ కృతిలో పేర్కొన్న స్త్రీలు రామాయణమందు రామానుగ్రహమును సంపూర్ణముగా పొందిన ఉత్తమ స్త్రీపాత్రలు. మరి అయ్యగారు

ఈ పాత్రలను దురపదేశము చేయువారుగా ఎందు కూహించిరి? ఇందు అయ్యగారు తనను స్త్రీగానే భావించుకొన్నారు. 'స్త్రీప్రాయ మితరం జగత్' = పురుషుడు భగవంతు డొక్కడే. తక్కిన జీవులు స్త్రీలేనట. శరీరపు తొడుగు పోతే అందరు జీవులును భగవదాజ్ఞకు వశములో నుండి భగవంతునకు భోగోప కరణములై స్వాతంత్ర్యములేక పరతంత్రులై భగవంతునకు భార్యలై(భరింప దగిన వారై) యుండుటచే తక్కిన జీవుల యందును స్త్రీత్వమే ఉన్నది. ఇది నిజమయిన స్థితి. స్త్రీ స్వభావ మేమంటే తన భర్త యొక్క ప్రేమలో పాలుపంచుకొను ఇంకొక స్త్రీ ఉండకూడదు. ఒక వేళ ఉన్నట్లయితే ఆమెపై నేరములు చెప్పి తన భర్త కామెను దూరము జేయ ప్రయత్నించును. అట్లే రామాను గ్రహము తమకే పూర్ణముగా నుండవలెననెడి భావముతో కౌసల్యాదులు తనపై ఏవేవో చెప్పిరేమో? అనే భావమును అయ్యగారు వ్యక్త పరచినారు. కౌసల్యను అనుగ్రహించుట కుమారుడై పుట్టుటయే. అహల్య తెలిసి యున్నదే. శబరి తెలిసినదే. సీత భార్య అయినా రాముని భక్త వర్గములో చేరినదే. స్వయంప్రభ. సీతను వెదకు సమయములో వానరులు ఒక పర్వతగుహలో ప్రవేశించినారు. అందు స్వయం ప్రభ అనే రామభక్తురాలున్నది. వానరు లామెను సీత అనుకొన్నారు. ఆమె తన నిజస్థితి చెప్పి వానరుల కాతిథ్య మిచ్చినది. అయ్యగారు ఈ స్త్రీపాత్రలలో ఒక రమ్యభావనము చేసి తమ ఆర్తిని నివేదించిరి.

129. కల్యాణి = ఆది

ప॥ ఎందుకో నీమనసు కరుగదు – ఏమి నేరమో తెలియ॥ దెందుకో॥

అ॥ ఎందు జూచిన గాని దశరథ–నందనుగా భావించిన నాపై॥ ఎందుకో॥

చ॥ సుముఖులైన ఈ లోకులు న న్న–సూయలచే జూచెదరు।
విముఖులై యెంతటి వాడని బహు–విధముల దూరెదరు॥
సుముఖమునకు యోగ్యుడు కాడని మరి –జూడగ నెంచెదరు
గమకమునను రక్షించే వారలు–గారని నిన్నే కోరిన నాపై॥ ఎందుకో॥

2 ధన తనయ కళత్రాదుల జూచి– తమదని భ్రమసెదరు।
వెనుక ముందు తెలియని ఈ ధనికుల – వెంబడి తిరిగెదరు॥
ఇనకుల జలనిధి సోమ! రామ న–న్నిటుల సేయక నీ వెయ్యారు
మనవు లడుగు నాపైని కరుణతో – మన్నించి కాపాడను రామ॥ ఎందుకో॥

3 రాగరహిత శ్రీరామ ఇంతప-రాకు సేయక శర
ణాగతవత్సల! నమ్మితి తారక-నామ పరాత్పర
త్యాగరాజ హృదయ సదనుడని అ-త్యంతము వేడితిరా నీ
వేగతియనుచు రేయి బగలు- వేయి మొరలు బెట్టిన నాపై॥ ఎందుకో॥

తాత్పర్యము :

రామా! నీ మనసు కరుగుట లేదేమయ్యా! నా నేరమేమిటో తెలియకున్నది. నేను నీ మాటలను విశ్వసించక పోతే నేరము. 'మయాతత మిదం సర్వం' 'సర్వత్రగ మచింత్యంచ' = నాచే ఇదియంతయు వ్యాప్తమై యున్నది. నేను సర్వత్ర ఉన్నాను. అనే నీ గీతా వాక్యములు విశ్వసించి అంతారామమయమని భావించిన నాపై నీమనసు కరుగ దెందుకు? ఈ లోకంలో నన్ను కొందరు సుముఖంగా చూచినట్లే చూచి అసూయ పడుచున్నారు. కొందరు విముఖులుగానే ఉంటూ వీడెంత? అని పలు విధములుగా నిందిస్తూ సహవాస యోగ్యుడు కాడని అంటూనే మళ్లీ నన్ను చూస్తూనే ఉంటారు. ఇటువంటి వారెవరును రక్షకులు కారని నిన్నే నమ్మి యున్నాను. డబ్బు, సంతానము, స్త్రీలు వీటిని జూచి తమవి అని భ్రమసే వారివలె నన్ను చేయకు. ఓ ఇనకుల జలనిధి సోమ = సూర్యకుల మనెడి సముద్రమున నుదయించిన చంద్రుడా! నిన్ను వేయి విధాలుగా ప్రార్థిస్తున్నాను. కరుణ జూడుము. ఇక పరాకు వలదు. రేయింబవళ్లు నిన్ను నా హృదయమందుంచి వేల మొరల పెట్టుచున్నాను. ఎందుకు నీ మనసు కరుగదు? అని ప్రార్థించిరి. అయ్యగారి చుట్టు పట్ల నున్న జనులతో కొన్ని అసూయ నిర్లక్ష్యము మొదలయిన వాటిని కొన్ని అనుభవించి ఇది రచించినట్లు తోచుచున్నది.

130. కలావతి = ఆది

ప॥ ఒకపారి జూడగ రాదా॥ ఒక॥

అ॥ శుక మానసార్చి తపాద! సదా। శుద్ధాంతరంగ! ముదంబుతో॥ ఒక॥

చ॥ వరులైన దిగీశులు చంద్రవిభా-కరమౌని వరాదులు రామనీ
కరుణా కటాక్షము చేత వెల-సిరే గాని త్యాగరాజ సన్నుత॥ ఒక॥

తాత్పర్యము :

ఓ శుక మాన సార్చిత పాద! = శుక మహర్షి మనస్సుచేత అర్పింప బడు పాదములు గలవాడా! శుద్ధాంతరంగ! = శుద్ధమయిన మనస్సుగల వాడా! ఒక్కసారి నన్ను చూడరాదా! అష్టదిక్పాలకులు, సూర్య చంద్రులు, మునీశ్వరులు నీకరుణా కటాక్షముచేతనే ప్రకాశము కలిగియున్నారు. అట్టి కటాక్షము నాపై బరపుమని ప్రార్థనము.

విశేషము = సమస్త దేవతలును నారాయణుని చేతనే ప్రకాశము గలిగి యున్నారు. సూర్య చంద్రులకును ఆయన కనులగుట చేతనే ప్రకాశము. ఆయనను ప్రకాశింప జేయువారు లేరు. 'న తద్భాసయతే సూర్యః త ద్ధామ పరమంమమ' = నా స్థానమును సూర్యుడు ప్రకాశింప జేయడు.' అని గీతా వాక్యము మరియు 'బ్రహ్మ శివ శ్శతమఖః పరమ స్స్వారాడి త్యే తేపి యస్య మహిమార్ణవ విప్రుషస్తే' = ఓ నారాయణా ! బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు, పరముడు, స్వరాట్టు అను వీరందరు నీ మహిమ అనెడు సముద్రము యొక్క తుంపరులు' అని చెప్పబడినది. కనుక నారాయణుని కరుణా కటాక్షములతో దిక్పాలకాదులు వెలిసి యున్నారను విషయమును అయ్యగారు తన పరితాపము ద్వారా చెప్పిరి.

131. హరికాంభోజి = రూపకం

ప॥ ఒక మాట– ఒక బాణము – ఒక పత్నీవ్రతుడే మనసా॥ ఒక॥

అ॥ ఒక చిత్తము. గలవాడే – ఒకనాడును మరువకవే ॥ ఒక॥

చ॥ చిరజీవిత్వము నిర్జర–వరసౌఖ్యమొసంగునే॥
ధర బరగే దేవుడే – త్యాగరాజ నుతుడే...॥ ఒక॥

తాత్పర్యము :

రాముని గుణములలో ప్రధానమైనవి. ఒకమాట, ఒక బాణము, ఏకపత్నీ వ్రతము, స్థిరమైన చిత్తము. ఈగుణములుగల రాముని ఏనాడును మరువ వద్దు. అని త్యాగయ్యగారి మానస బోధ. రాముడు భక్తులను రక్షించుటకు వైకుంఠము నుండి క్రిందికి దిగి వచ్చి అవతరించిన దేవుడు. అట్టి దేవుని మరువక ఆశ్రయిస్తే చిరంజీవిత్వము = చాలాకాలము బ్రతికి యుండుట, నిర్జర వరసౌఖ్యము = బ్రహ్మానందము లభించును అని.

విశేషము = 'ద్విశ్శరం నాభిసంధత్తే। రామో ద్విర్నాభిభాషతే'' = రాముడు రెండవ సారి బాణమును సంధింపడు. రెండవ మాట మాట్లాడడు.' అనగా ఒకసారి సంధించిన శరము వ్యర్థము కాదని, ఒకసారి ఇచ్చిన మాటను నిలుపు కొను సత్యవ్రతుడని. ఈగుణములతో ధరను బరగిన దేవుని మరవక ఆశ్రయిస్తే వచ్చే లాభములు చిరంజీవిత్వము బ్రహ్మానందము. ఈ లోకంలో చిరంజీవు లేడుగురున్నారు. 'అశ్వత్థామా బలి ర్వ్యా సో హనుమాంశ్చ విభీషణః। కృపః పరశురామశ్చ। సప్తైతే చిరజీవినః' అని ఏడుగురు. వీరిలో రాముని అనుగ్రహముతో చిరంజీవులయినారు హనుమంతుడు విభీషణుడును. హనుమంతుడు చిరంజీవి అగుటయే కాక రాబోయే కల్పమందు బ్రహ్మ అగుచున్నాడు. ఈ కల్పమందు రామనామ ధ్యానముతో బ్రహ్మానంద మను భవించుచు వచ్చే కల్పమున సాక్షాత్తు బ్రహ్మయే అగుచున్నాడు. ఇక విభీషణుడు. శ్రీరాముడు తమ కుల ధనమయిన శ్రీరంగ మందిరమును విభీషణునకు ప్రసాదించాడు. విభీషణుడు ఇప్పటికిని ఎవరికిని కనపడకుండ రంగనాథుని దర్శించుకుంటాడని ప్రతీతి. రంగనాథుని దర్శనముచే విభీషణుడు బ్రహ్మానంద మనుభవించు చున్నాడు. ఇట్టి చిరంజీవిత్వము నిర్జరవర సౌఖ్యము రామానుగ్రహముచేత హనుమ ద్విభీషణులకు కలిగినదని అయ్యగారి భావమును ఇందు ప్రకటించిరి. పై శ్లోకము నందు చెప్పబడిన తక్కిన చిరంజీవులకు ఈ సౌఖ్యము లేదు.

132. శుద్ధ సావేరి = ఆది

ప॥ ఒరులనాడుకో వలసిన దేమి– పరమ పావనా శ్రీరామ॥ ఒరుల॥

అ॥ పరితాపము తాళక మొరలిడగా – కరుణ లేక నీవేనను జూడగ॥ ఒరుల॥

చ॥ మంచి వారి సహవాసము బాసి – కొంచెపునరుల కొరకు నుతిజేసి
ఎంచిన కార్యము కూడని గాసి స–హించ కుండెడిది నాపేరు వాసి॥ ఒరుల॥

2 రాశి యనుచును నరులను చేబూని–వాసి యుండెదిది భవాని
ఈశ ప్రియ! నేముందు రాని – చేసిన కర్మమనుకోవలె గాని॥ ఒరుల॥

3 దేవ! త్యాగరాజ వినుత! సనక–భావనీయ! రఘుకుల తిలక।
ఈ వరకును నాదుతను వలయక – నీవే తెలుసుకోవలె గాక॥ ఒరుల॥

తాత్పర్యము :

పరమ పావనా! శ్రీరామా! నా పరితాపమును భరించ లేక మొరబెట్టితే కరుణ లేకుండా నన్ను నీవు చూస్తు ఊరకున్నావు. నేనిక ఇతరులను అనవలసిన పనిలేదు. సత్పురుషుల మైత్రిలేకుండా, అల్పులను స్తోత్రం జేసి, కోరిన ఫలము కలిసి రాక బాధతో నుండుట నాపేరు ఫలము. నేనిక ఎవరి ననను? ఓ భవానీశ ప్రియ! శివునకు ప్రియమైన వాడా ! గుంపుగా కొంతమందిని పోగు చేసుకొని నీకు దూరమై ఉండుట, మరియు నేను కొరిన మార్గములో నేను మందుకు రాక పోవుట నే చేసిన కర్మమనుకోవలెను కాని ఒరుల నిందించి ఏమి? ఓదేవ! త్యాగరాజవినుతా! సనక భావనీయ! సనకుని చే భావింప దగిన వాడా ! రఘుకుల తిలక! నీతో మొరలు పెట్టి పెట్టి నా శరీర మలసి పోయినది. నీవే తెలుసుకోవాలి. నేనెవరిని నిందించెదను' అని ఆర్తి. అంతాతన కర్మఫలమను కొన్నారు అయ్యగారు.

విశేషము = సత్పురుషులు తమకు గల్గిన బాధకు ఒరులను నిందింపరు తమ పాప ఫలమే అని భావింతురు. భరతుడు వచ్చి నాడు. పితృమరణము దుర్భరము. అంతకన్నా రామవనవాసవార్త మరీ దుర్భర మైనది. దీని కెవరినీ నిందింపక ఇట్లు అన్నాడు. 'మత్పాపమే వాత్ర నిమిత్త మాసీ। ద్వన ప్రయాణే రఘునందనస్య' = మంధర తప్పుకాదు. ధశరధుని తప్పుకాదు. కైకేయి తప్పుకాదు. రాముడు వనవాసమున కేగుట నా పాపమే కారణము' = అని భావించినాడు భరతుడు. దీనిని తలపించినది అయ్యగారి భావనము.

ఒక సూచన = రెండవ చరణంలో చివరి భవాని అని ఉన్నది. రెండవ లైను ఆశ ప్రియ ఉన్నది. వీర భద్ర శాస్త్రిగారు దీనిని గురించి ఏమీ వ్రాయలేదు. "Foot Note" లేదు ఈ చరణం సందేహం అని ఉన్నది. మధ్యలో 'భవాని' అనేది దేనికీ అన్వయించదు. తరువాత పంక్తిలోని ఆశకు దానికి సంబంధము లేదు. అందుచేత భవానీశ ప్రియ అని మార్చినాను. ఈ సవరణకూడ కొన్ని కారణముల చేత తృప్తి కరమైన సవరణకాదు. అంతకంటే గత్యంతరము లేక స్థితగతి చింతనము చేసి అట్లు సవరణ చేసితిని.

133. కాంభోజి = ఆది

ప॥ ఓరంగ శాయీ! పిలచితే – ఓ యనుచు రారాదా? ఓ॥

అ॥ సారంగ వరుడు చూచి కైలా–సాధిపతి కాలేదా? ఓ॥

చ॥ భూలోక వైకుంఠ మిదియని – నీలోన నీవే యుప్పొంగి
శ్రీలోలుడై యుంటేమా –చింత దీరే దెన్నడో
మేలోర్వలేని జనులలోనే–మిగుల నొగిలి ద్వ్యయరూపమును ము
త్యాల సరుల యురమును గన వచ్చితి – త్యాగరాజ హృద్భూషణ॥ ఓ॥

తాత్పర్యము :

త్యాగయ్య గారు ఒక పర్యాయం శ్రీరంగము వెళ్లినారు. అచట రంగని పై కొన్ని కృతులు రచించిరి. ఇది ఒకటి. ఓరంగ శాయీ! నేను పిలుచుచున్నాను. ఓహో అని పలికి రారాదా! శ్రీరంగ క్షేత్రము భూలోక వైకుంఠ మని నీలో నీవే ఉప్పొంగి లక్ష్మీదేవిపై తమకము కలిగి ఆనందముగానున్నావు. నీవు సుఖముగానే ఉన్నావు. మరి మా దుఃఖములు తీరేది ఎప్పుడు? నా ఊరిలో నా శ్రేయస్సును చూచి ఓర్వలేని జనులతో బాధలు పడి బాధనివారణమునకు నీ దర్శనము చేసి ముత్యాల హారములతో ప్రకాశించు నీవక్ష స్థలమును చూచు కుతూహలముతో వచ్చి పిలుచుచున్నాను. రారాదా? అని ప్రార్థనము.

విశేషము = పిలిచితే ఓహో అని వచ్చుట అంటే చేసిన భక్తిని చూచి, సద్యఃఫలితముగా మోక్షము నిచ్చుట అని లక్షణార్థము లేక వ్యంగ్యార్థము. అయ్యగారు కోరినదిది. ఇది వచ్చుట లేదు. రంగడు జాగుచేయుచున్నాడు. మరి లింగడట్లు జాగు చేయడు. దీని కుదాహరణముగా అయ్యగారొక కథను సూచించినారు.

ఇక్కడ వీర భద్ర శాస్త్రిగారిట్లు వ్రాసిరి. 'అచ్చుప్రతులలో 'సారంధ చరుడు' అని ఉన్నది. అన్వయింపక పోవుటచేత 'సారంగ వరుడు' అని దిద్దట మయినది.' అంటూ ఒక కథ నుదాహరించినారు. 'తొలి జన్మలో ఋచీకుడనుముని మరుజన్మలో తుమ్మెదగా పుట్టి శివస్మరణము చేసి ముక్తిని పొందెను' అని ఒక కథను వ్రాసిరి. తప్పులేదు. అయితే 'సారంధచరుడు' వంటివి వ్యుత్పత్తికి అందక ఒక ప్రత్యేక స్థలమునకు పేరై నిత్యసమాసము అనబడు చుండునవి. ఇట్టివి స్థలపురాణముల యం దెచ్చటనైనా ఉండవచ్చును. పురాణములు వెదకుట కష్టము కదా! కాని శాస్త్రిగారు సూచించిన పాఠమును బట్టి (సారంగ వరుడు) నా కింకొక కథ తోచుచున్నది. సారంగ శబ్దమునకు

నానార్థములున్నవి. ఒక అర్థము ఏనుగు. అప్పుడు 'సారంగవరుడు' అంటే గజరాజు. శ్రీరంగమునకు ఉత్తరతీరమున ఒకమైలు దూరములో 'తిరువానైక్కోయిల్' = ఏనుగు కోవెల అనుక్షేత్రమున్నది. ఇక్కడి దేవుడు జంబుకేశ్వరుడు. పూర్వ మొక ఏనుగు తుండముతో తీర్థము చల్లి శుభ్రము చేసి ఆకులతో శివపూజ చేస్తూ ఉండేది. శ్రీకాళహస్తి కథ వలెనే ఇక్కడ ఒక సాలీడు కూడ శివపూజ చేస్తూ ఉండేది. ఏనుగుకు సాలీడుకు భేదాభిప్రాయము కలిగి సాలీడు ఏనుగు తుండములో దూరినది. ఏనుగు భరించలేక తలను రాతికి వేసి బాదుకొన్నది. చచ్చినది. జంబుకేశ్వరుడు (శివుడు) ఏనుగుకు వెంటనే మోక్ష మిచ్చినాడు. మోక్షముతో ఏనుగు శివునితో సాకారము చెంది శివుడే అయినది. సారంగవరుడు = ఏనుగు, ఏనుగు పేరుతో తిరు = శ్రీకరమగు, యానై = ఏనుగు, కోయిల్= ఆలయము మొత్తము కలిపి' తిరువానై క్కోయిల్. శ్రీరంగమునకు చాల దగ్గరలో నుండుట చేతను ఏనుగు పేరుతోనే ఆక్షేత్ర మేర్పడి యుండుట చేతను, ఆ ఏనుగును జంబుకేశ్వరుడు రక్షించి మోక్షమిచ్చుటచేతను శాస్త్రిగారు చెప్పిన ఋచీకుని తుమ్మెద కథ కన్న ఈ 'తిరువానై క్కోయిల్' కథ ఈ సందర్భములో సమంజసమని నా అభిప్రాయము. 'సారంగ వరుడు చూచి కైలాసాధిపతి కాలేదా? ' అట్లే ఓరంగ శాయీ అని పిలిచితే సద్యఃఫలితముగా నీ సాయుజ్య మియ్య వలసినది అని అయ్యగారి ప్రార్థనము.

134. కన్నడగౌళ = ఆది

ప॥ ఓరజూపు జూచేది న్యాయమా? – ఓ రఘూత్తమా! నీ వంటి వానికి ॥ ఓర॥

అ॥ నీరజాక్ష ! మును నీ దాసులకు – నీకేటి వావులు తెల్పవే॥ ఓర॥

చ॥ మానమించు కైన – నీకు దోచలేక –పోయిన వైనమేమో పుణ్యరూపమా॥
దీన రక్షకా–శ్రిత మానవసం–తాన ! గానలోల! త్యాగరాజనుత॥ ఓర॥

తాత్పర్యము :

ఓ రఘూత్తమా! = ఓ రఘు కులశ్రేష్ఠుడా! ఓరజూపులు చూచుట (నన్ను) నీ వంటి వానికి తగునా? (తగదు). ఓ నీర జాక్ష ! = పద్మముల వంటి కనులు గలవాడా! ముందుగా నీ దాసులకు నీకు మధ్య నున్న బంధుత్వమును బట్టి అభిమానముండును. అటువంటిది ఏమీ కనపడుట లేదు. దీనికి కారణమేమో చెప్పుము. నా పుణ్య

స్వరూపము నీవు. దీన రక్షకుడవు. శ్రితమానవసంతాన! = ఆశ్రయించిన మానవులకు కల్ప వృక్షమవు. (అన్ని కోరికలను తీర్చునది) ఇటువంటి నీవు ఓరజూపు చూచుట న్యాయముకాదు. అని అయ్యగారి ప్రార్థనము.

విశేషము = భగవంతునకు భక్తునకు తొమ్మిది సంబంధములు కలవు. 'పితాచ రక్షక శ్శేషీ భర్తాజ్ఞేయో రమాపతిః। స్వామ్యాధారో మమాత్మాచ భోక్తా చాద్యమనూదితః॥' = తండ్రిగా, రక్షకుడుగా ఆజ్ఞనిచ్చువాడుగా, భరించువాడుగా, తెలియ దగిన వాడుగా, స్వామిగా (ఒక రూపాయి ఒకని చేతిలో నుంటే అ ఆరూపాయికి వాడు స్వామి), ఆధారముగా, ఆత్మగా, అనుభవించువాడుగా తొమ్మిది సంబంధములు (బంధుత్వములు) భగవంతుడు, జీవునితో కలిగి ఉన్నాడు. ఈ విషయము తొలి మంత్రముగా నారాయణాష్టాక్షరి యందు చెప్పబడినది'. దీనిని బట్టి రామునకు త్యాగయ్యగారిని సూటిగాచూచే సంబంధమే కాని నోరజూపు చూడవలపిన పనిలేదు. 'నీకేటి వావులు తెల్పవే' అని త్యాగయ్యగారు బంధుత్వములను గుర్తు చేసినారు. సూటి అగు సంపూర్ణ కటాక్ష దృష్టిని బరపుమని ఆంతర్యము.

135. కేదారము = ఆది

ప॥ ఓ రమారమణ! రామ రామనే – నోర్వజాల రఘు రామా॥ ఓ॥

అ॥ సారసాక్ష! మనసార నమ్మితిని – చేరరాని ఉపచార మాయెగా॥ ఓ॥

చ॥ అంగలార్పుగని పాంగుగాని శ్రీ–రంగని మది కరగంగ లేదుగా॥ ఓ॥

2॥ చుట్టి చుట్టి నాగుట్టు నంగడిని–బెట్టబెసి చెయి బట్టకుండితివి॥ ఓ॥

3॥ మేటియౌపలుకు బోటి పతికి నే–నాటి క్రోధమో తోటివారిలో॥ ఓ॥

4॥ ధీరుడనుచు నిను గోరుకొన్న నీ–వార లీవెసన వార్ధి నుండిరా॥ ఓ॥

5॥ నిన్ను నమ్మినే ఖిన్నుడైతె ఆ–పన్ననరుల కేమున్న దీతరిని॥ ఓ॥

6। మాన రక్షక! పురాన సజ్జనని–దాసు డంచు నిను దానమడిగితిని॥ ఓ॥

7॥ గాన నీకు సరిగానలోల ఇక–గానరారు పెద్దాన బెట్టుదును॥ ఓ॥

8॥ యోగసిద్ధులకు నేగతో యనుచు–వేగతోచదా? త్యాగరాజ నుత॥ ఓ॥

తాత్పర్యము :

ఓరమారమణ! = లక్ష్మీరమణా! నేనిక ఓర్వలేను. ఓ సారసాక్ష! నిన్ను మనసార నమ్మినాను. (నీ దయమాత్రము లేదు) నా ఉపచారము నీ కందుటలేదా? నా అంగలార్పు (మొర) విని రంగనాథు మనస్సు పొంగలేదు, కరుగ లేదు. నా చుట్టుచుట్ట తిరిగినావు. నాగుట్టంతయు తెలుసుకున్నావు. ఇప్పుడునను బజారు కెక్కిస్తున్నావు. నాకు చేయూత మాత్ర మియ్యకున్నావు. మేటి యౌ పలుకుబోటిపతికి = బ్రహ్మకు నా మీద ఎప్పటి క్రోధమో? నా నుదుట ఇలా వ్రాసినాడు. నీవు ధీరుడవు (ఆశ్రిత రక్షణ బుద్ధి గలవాడవు) అని పూర్వము నిన్నా శ్రయించిన వారు నావలె ఆ పత్సముద్రములో ఉన్నారా? నిన్ను నమ్మి నేనీవిధంగా ఖిన్ను డనయితే ఇంక గతి ఏమిటి? సజ్జనులకు మూల పురుషడవని నిన్ను దానం (మోక్షదానం) అడిగినాను. ఓ గాన లోలా! నీ సాటి దేవతలు కానరారు. లేరు. ఇది నేను ఒట్టు బెట్టి చెప్పగలను. సాటిలేని దేవుని నిన్నాశ్రయించినప్పుడు యోగ సిద్ధులకు కలిగేగతి నాకు కలిగించ వలెనని నీకు తోచదా అని అయ్యగారి ప్రార్థన.

విశేషము = రాముని సాటి దైవము లేదని ఆన (ఒట్టు) బెట్టుదును అన్నా రయ్యగారు. దీనినే శపథ మందురు. తాము చెప్పెడి విషయమందు ఎట్టి సందేహము లేనప్పుడు ఇట్టి శపథముతోనే చెప్పుదురు. వేద వ్యాస భగవానుడు పూర్వ మిట్లే 'హేపుత్ర శిష్యాః శృణుత। ఉద్ధృత్యభుజముచ్యతే। వేద శాస్త్రాత్పరం నాస్తి। న దైవం కేశవా త్పరం' = ఓ పుత్రులారా! శిష్యులారా! వినుడు. భుజ మెత్తి చెప్పుచున్నాను. వేదము కన్న నధిక మగు శాస్త్రము లేదు. కేశవుని (విష్ణువు) కన్న అధికుడగు దేవుడు లేడు' అని సభలో చెప్పినాడు. అట్లే అయ్యగారు ఇందు ఆన బెట్టినారు.

136. ఆరభి = చాపు

ప॥ ఓ రాజీ వాక్ష! ఓరజూపులు జూచే – వేరా నే నీకు వేరా॥ ఓ॥

అ॥ నేరనినాపై నేరము లెంచితే – కారాదని పల్కేవారు లేని నన్ను ॥ ఓ॥

చ॥ మక్కువతో నిన్ను మ్రొక్కిన జనులకు– దిక్కునీవై అతిగ్రక్కున బ్రోతువని
ఎక్కువ సుజనుల యొక్క మాటలు విని– చక్కని శ్రీరామ దక్కితి గదరా॥ ఓ॥

2 మితిమేరలేని ప్రకృతిలోన దగిలినే– మతిహీనుడై సన్నుతి సేయనేరక॥
బతిమాలినీవే గతియని నెరన– నమ్మితిగాని నిను మరచితినా సంతతము॥ ఓ॥

3 మావర సుగుణ ఉమావర సన్నుత-దేవర దయచేసి బ్రోవగ రాదా
పావన భక్తజనావన మహాను-భావ త్యాగరాజ భావిత ఇకనన్ను॥ ఓ॥

తాత్పర్యము :

ఇందు తనయందు కొన్నిలోపము లారోపించుకొని రాముడు ఓర జూపు చూచుచున్నందుకు అయ్యగా రార్తి పడిరి. ఇదిచాలు.

విశేషము = 'దక్కితిని' అని. నేను నీకు దక్కితిని అని. భక్తునకు భగవల్లాభము కావలసినట్లే భగవంతునకు ఆత్మలాభము కావలెను. అనగా భక్తలాభము. 'స ఏకాకీ నరమేత' భగవంతుడు ఏకాకిగా అనందింపడు' అని శాస్త్రము. మరియు గీతలో ' ఆర్తుడు, తెలియగోరినవాడు, ప్రయోజనా పేక్షి, జ్ఞాని అనెడు నాలుగు విధముల వారిలో ' ఏకభక్తి ర్విశిష్యతే। ప్రియోహి జ్ఞానినో త్యర్థం। అహం సచమమ ప్రియః' ఉదరా స్సర్వ ఏవైతే। = అందరును ఉదారులే. కాక జ్ఞానికన్న ఏకభక్తి అయినవాడు (తనయందు మాత్రమే గలవాడు) వానికి తాను ప్రియుడు. తనకు వాడు ప్రియుడు' అని గీతలో భగవద్వాక్యము. ఇట్టివారు భగవంతునకు కావలెను. ఇది సమకూర్చుకొనును. దీనినే ఆత్మలాభ మందురు. ఈ విధముగా రామునకు 'దక్కితిని' అని అయ్యగారు చెప్పుకొన్నారు. ఈ కారణముచేత కూడ 'ఓరజూపులు' చూచుట న్యాయము కాదని అయ్యగారి ప్రార్థనము.

137. ఆరభి = ఆది (దివ్యనామము)

ప॥ ఓరామ ఓరామ ఓంకారధామ- ఓరామ ఓరామ యొనరింతు ప్రేమ ఓ॥

చ॥ నామేలు నందరు నవ్వుటకాయ - ఏమని తాళుదు నిక దేవరాయా॥ ఓ॥

2 నన్నే చినందుకు నయమేమి కలిగె-నిన్నే నెరనమ్మితి నీవే నాసలి గె॥ ఓ॥

3 నీకే తగియున్నాను. నిజము నామాట-సాకేతరామా రక్షణ సేయుపూట॥ ఓ॥

4 ధరలోన రక్షకర్తలు లేరు దేవ-మరచితె వెర చితె మాకేమి దోవ॥ ఓ॥

5 ఈ జన్మ మెందుకు ఎవరు తనకేల-రాజీవ నేత్ర దయరానిది మేలా॥ ఓ॥

6 హృదయము చలువైతే ముదము నీపాలు-సుదయాళో వేడయితే సుఖము నీవేలు॥ ఓ॥

7 అత్మకై యొకటైన ఆసించలేదు-పర-మాత్మ నీకని వల్క-మనసేల రాదు॥ ఓ॥

8 నీరైన పాలైన నీకే అనుకొంటి-తీరైన చక్కని దేవ కనుగొంటి॥ ఓ॥

9 నీకాశించితి గాని నిమిషము మాన- ఏకమై నన్నేలుకోకుంటె యాన॥ ఓ॥

10 నీకంటె దొరకునా నిరుపమ గాత్ర ప-రాకేల శ్రీత్యాగరాజుని మిత్ర॥ ఓ॥

తాత్పర్యము :

ఓరామ! ఓంకారధామ! = ఓంకారమందు నివసించువాడా! నీపై ఒనరింతు ప్రేమ= భక్తిని నిల్పుతాను. నా మేలును చూచి అందరును నవ్వుచున్నారయ్య! ఈ పరిహాసము నెట్లు సహింతును? నన్ను బాధించి నందుకు లాభమేమి కలిగినది. (వారికి నీకు). నీకే తగియున్నాను నేను. ఈ లోకంలో రక్షణ జేయువారు లేరు. నీవు మరచితివా? వెరచితివా? నీవే మరచితే వెరచితే మాకిక దారి ఏది? ఇక ఈజన్మము నాకువద్దు. సంసార కారకులయిన ఈ జనులును వద్దు. నీ దయనాపై రాక ఉంటే నీకుగాని నాకు గాని మేలా?' అని అయ్యగారి తీవ్రప్రార్థన. నీవు ఓర చూపు చూడక చల్లగా చూస్తే నా హృదయము చల్లగా నుండును. అప్పుడు నా హృదయము నీకు స్థానము కనుక సంతోషము నీకే. నీవు నన్నురక్షించక పోతే నా హృదయము వేడి అగును. కనుక నీ సుఖమునకు నా సుఖమునకును నీవు నన్నేలుము. నాకై నేను దేనినీ ఆసించలేదు. 'యత్కరోషి యదశ్నాసి తత్కురుష్వ మదర్పణం' = ఏది చేయుదువో, ఏది తినెదవో దానిని నా కర్పణము జేయుము'' అని భగవద్వాక్యము, దాని ననుసరించి నాకై నేనేదియు చేయుట లేదు. కాని నీకు గట్టిగా చెప్పలేక పోవుచున్నాను. నీరైన పాలైన నాకు నీవే అని నమ్మియున్నాను. (దప్పిక తీర్చునది ప్రాణమును నిల్పునది నీవే అని నమ్మియున్నాను. దప్పిక అనగా పరితాపము) నీకై ఆశపడినానేకాని వేరెరుగను. నా కద్వైత సిద్ధిని ప్రసాదించి నన్నేలు కొనుము. ఏలుకొనక పోతే ఒట్టే. నీ కన్న నాకెవరు అని అయ్యగారు ఆత్మ సమర్పణముతో పాటు ఫల సమర్పణముతో పాటు ఆర్తిని నివేదించు కొన్నారు.

విశేషము = ' ఓంకారధామ' = ఓంకారము నందు అకారము, ఉకారము మకారము నున్నవి. 'అ ఇతి నారాయణస్య ప్రథమాభి ధానం' = 'అ' అనునది నారాయణునికి మొదటి పేరు.' అని వేదము. మరియు గీత యందు' అక్షరాణా మకారోస్మి' = అక్షరములలో నేను అకారమును' అని భగవానుడు చెప్పినాడు. ఈ ప్రమాణముల చేత అకారమునకు భగవానుడర్థము. ఇక ' ఉకారేణోచ్యతే లక్ష్మీ' = ఉకారమునకు లక్ష్మి అర్థము. (అనగా ప్రకృతి అని చెప్ప వచ్చును). మకారమునకు

జీవు డర్థము. అక్షరములలో మొదటిదైన అకారమునకు సమస్త ప్రపంచమునకు మొదటివాడైన భగవానుడు అర్థమైనట్లు అక్షరములలో ఇరువది ఐదవ అక్షరమయిన వకారమునకు, ఇరువది ఐదవ తత్త్వమంయిన జీవుడర్థము. వేదము 'పంచవింశోయంపురుషః = ఈ జీవుడు 25వ తత్త్వము అని చెప్పినది. ఇట్లు ఓంకారమునందు ఈశ్వరుడు ప్రకృతి జీవుడును ఇమిడి ఉన్నారు. మొత్తముగా ఇదంతయు చేతనా చేతనాత్మక మయిన ప్రపంచము. ఇదే భగవంతుని స్థానము. అందుచేత 'ఓంకార ధామ' అని సంబోధించినా రయ్యగారు. భక్తులు ధ్యాన సమాధుల చేత ఒడలు మరచి యుందురు. ఇట్టి వారిని చూచి పామరులు పరిహసించెదరు. 'నామేలు నందరు నవ్వుట కాయె' అని అనినారు. 'నీకే తగియున్నాను' అనగా? జీవునకు మూడు లక్షణము లుండవలెను. 1 అనన్యగతికత్వము 2 అనన్యార్హ శరణ్యత్వము, 3 అనన్యార్హ భోగ్యత్వము. 1 ఇంకొక గతి లేకుండుట. ('నీవే తప్పనితః పరంబెరుగ') అనే గజేంద్రుని భావము. 2 ఇంకొకని చేత రక్షింప తగకుండుట. 3 ఇంకొకని అనుభవించుటకు తగకుండుట. ఈ లక్షణములు కలిగిన అయ్యగారు 'నీకే తగియున్నాను' అనిరి. భగవంతుడు భక్తుని అనుభవించును. అందుచేతనే భక్తుడు 'అహ మన్న మహ మన్నం' = ఓ దేవా నీ కనుభవించు పదార్థమును' అని అనుసంధించును. ఈ ఆంతర్యముచేత కూడ 'నీకే తగియున్నాను' అనినారు.

138. నాగగాంధారి = చాపు

ప॥	ఓరామ రామ సర్వోన్నత! నీ కిపు-డోర వంచన ఏలరా ఘృణాకర॥	ఓ॥
చ॥	వేదశిరము లెల్ల నా దరణముతో నీ-వేదైవమని నమ్మగ నమ్మితి॥	ఓ॥
2	పెద్దలైన వారి యొద్దనే సత్యము-కద్దని నమ్మితిని నమ్మితిని॥	ఓ॥
3	బంధురత్నమా! దయాసింధువీవని సత్య-సంధుడ వనుకొంటిని రమ్మంటిని॥	ఓ॥
4	భరతుచర్య సహచరునితో నిండార-గరగుచు బలికితివే కాచితివే॥	ఓ॥
5	సతిమాటలు సదాగతిజుచే వినిన-మ్మతిని గొగలించిన శుభానన॥	ఓ॥
6	మునుభక్త కోటులు గొనియాడ నీవువా-రిని బ్రోచినదిలేదా మరియాద॥	ఓ॥
7	ఈ జగతిని త్యాగరాజుని బ్రోచుట-కీజాలము తాళను ఈ వేళను॥	ఓ॥

తాత్పర్యము :

ఓ రామా! నీవు సర్వోన్నతుడవు. నీవు ఓరచూపుతో వంచన జేయుట ఎందుకు? నీవు ఘృణాకరుడవు = కరుణాకరుడవు. ఉపనిషత్తులన్నియు నీవు దైవమని నమ్మినవి. నేను నమ్మినవి. నేను నమ్మినాను. ఈ సత్యమెరిగిన వారు పెద్దలు (ప్రహ్లాద నారదాదులు). నీవు మాకు బంధు శ్రేష్ఠుడవు. (భక్తునకు భగవంతునకు కల 9 సంబంధములలో పితాపుత్ర సంబంధము గొప్పది. మొదటిది) దానిని బట్టి బంధు రత్నమా! అంటే తండ్రీ అని దయాసముద్రుడవు, సత్యసంధుడవు అని నమ్ముకొన్నాను. నిన్ను రమ్మన్నాను. (తనయుని బ్రోచుటకు తండ్రియే రావలెను) రాము డరణ్యమునకు బయలు దేరి గుహుని పట్టణమున నుండగా భరతుడు ప్రార్థించి తోడ్కొని పోవుటకు వచ్చుచుండగా లక్ష్మణుడు భరతు ననుమానించి యుద్ధ సన్నద్ధుడైనాడు. అప్పుడు నివారించి భరతుని ప్రేమను తెలిపి భరతుని గాచితివి కదా! పూర్వమెంతో మంది భక్తులను రక్షించి పేరు గొన్నావు. ఆ మర్యాద ఇప్పుడు లేదా? అని ప్రార్థనము.

సూచనము = ఇందు 5వ చరణమందు 'సదాకపిజుచే' అని వీరభద్ర శాస్త్రిగారు వ్రాసిరి. అది ఒక విధముగా తప్పు. యతి భంగమగును. కనుక 'సదాగతిజుచే' అని పరిష్కరించుట మైనది.

139. కేదారగౌళ = ఆది

ప॥ ఓ జగన్నాథాయని నే బిలిచితే – ఓయని రారాదా॥ ఓ॥

అ॥ రాజీవనయన రాకేందువదన – రాజిల్లు సీతారమణీ హృత్సదన॥ ఓ॥

చ॥ ఇది వేళగాదు ఇక తాళబోదు–మది నీవే గాని మరి గతి లేదు॥ ఓ॥

2 ఇరవొంద రాక ఇంతపరాకా – దొరనీవేయని తోపిక గాక ॥ ఓ॥

3 లాలించు రాజా! రవికోటితేజా–లీలావతారా పాలిత త్యాగరాజ॥ ఓ॥

తాత్పర్యము :

తాత్పర్యము సులభము. సంబోధములలోనూ విశేషము లేదు.

140. సారంగ = ఆది (నౌకాచరితములోనిది)

ప॥ ఓడను జరిపే ముచ్చట గనరే– ఉవిద లార నేడు॥ ఓడ॥

అ॥ ఆడువారు యమున కాడ కృష్ణని గూడి– ఆడుచు బాడుచు నందరు జూడగ॥ ఓడ॥

చ॥ కొందరు సంకీర్తనములు బాడ– కొంద రానందమున ముద్దులాడ
కొందరు యమునా దేవిని వేడ– కొందరు ముత్యపుసరు లసి యాడ॥ ఓడ॥

2 కొందరు తడబడపాలిండ్లు కదల– కొందరు బంగరు వల్వలు వదల
కొందరు కుటిలాలకములు మెదల– కొందరు పల్కుచు కృష్ణని కథల॥ ఓడ॥

3 కొందరు త్యాగరాజసఖుడే యనగ– కొందరు కస్తురిబొట్టు కరగగ
కొందరు కొప్పుల విరులు జారగ– కొందరు కంకణములు ఘల్లనగ॥ ఓడ॥

తాత్పర్యము :

గోపికలు కృష్ణనితో నౌకావిహారం ప్రారంభించారు. ఆడుచు పాడుచు కొందరు కృష్ణని లీలలు పాడుచున్నారు. కొందరు ముద్దులాడుచున్నారు. కొందరి జరీ వస్త్రములు జారిపోతున్నవి. కొందరి హారా లల్లల్లాడుచున్నవి. ముంగురు లల్లలాడుచున్నవి. కొప్పులనుండి పువ్వులు జారుచున్నవి. నడిపే శ్రమలో కొందరి కస్తురి బొట్టు కరిగిపోతున్నది. తెడ్డువేసి నడపుట వలన చేతిగాజులు గలగలలాడు చున్నవి. ఈ విధంగా ఆనందముతో మైమరచి గోపికలు ఓడను నడుపుచున్నారు. ఇది త్యాగయ్యగారు కల్పించిన రాసక్రీడ.

141. తోడి = దేశాది

ప॥ కడతేరరాదా మనసా॥ కడ॥

అ॥ ఎడలేక భజనజేసి నీ– యెడగల్గు నిజ దబ్బరలను దెలిసి॥ కడ॥

చ॥ ఖలచిత్త లౌకికమనే శృం– ఖల యందు దగలకనే– ఉలూ
ఖలబద్ధునికి నిజదాసుడై– విలసిల్లు త్యాగరాజు మాటవిని॥ కడ॥

తాత్పర్యము :

ఇది త్యాగయ్యగారు చేసిన మానసబోధ! ఓ మనసా! కడతేరరాదా! ఎడతెరిపి లేకుండా రాముని భజన చేసి నీలోనున్న మంచి చెడులను విమర్శించుకొని తరించు. లోకమందలి దుష్టవృత్తి అనే సంకెలకు తగులక, యశోద ఇంట ఉలూఖల బద్ధుడు = రోలునకు కట్టబడిన కృష్ణునకు దాసుడైన త్యాగరాజు చెప్పిన మాటవిని తరించరాదా ఓ మనసా! అని అయ్యగారి ఉపదేశము.

విశేషము = 'ఆత్మనాత్మాన ముద్ధరేత్' = తనను తానే ఉద్ధరించుకొనవలెను అని గీతావాక్యము. దీని ననుసరించి చేసుకొన్న ఆత్మోపదేశమిది.

విశేషము = ఇందు 'ఉలూఖలబద్ధుడు' అనగా రోటికి కట్టబడిన కృష్ణుడు. ఇది భగవంతుని సౌలభ్యానికి పరాకాష్ఠ అయిన లీల. లీలాశుకుడంటాడు. 'వరమిమ ముపదేశ మాద్రియ ధ్వం। నిగమవనేషు నితాంతచారఖిన్నాః। కలయత వరవల్లవీగృహాంతే। ఉపనిషదర్థములూఖలే నిబద్ధం।' = నా చక్కని ఉపదేశమును వినండి. వేదము లనెడు అడవులలో తిరిగి ఎందుకు అలసిపోతారు. చూడండి. ఉపనిషత్సారమయిన ఆ వస్తువు (పరబ్రహ్మము) గోపికల నాయకురాలయిన యశోద ఇంటివద్ద రోట కట్టబడియున్నది' అని. అట్లే ఉలూఖలబద్ధునికి నిజదాసుడైన త్యాగరాజు అని అయ్యగారు చెప్పుకున్నారు.

142. నారాయణగౌళ = ఆది

ప। కదలేవాడు గాడే రాముడు-కథలెన్నోగలవాడే॥ కద॥

అ॥ మొదలే తానైనాడే తుద-మొదలే లేనివా డైనాడే॥ కద॥

చ॥ కల్పన లెన్నడు లేడు సం-కల్పములే గలవాడు-శేష
తల్పశయనుడేవాడు శ్రీ-త్యాగరాజనుతు డైనాడే॥ కద॥

తాత్పర్యము :

రాముని పరతత్త్వమును అయ్యగారు వర్ణించుకొనుచున్నారు. రాముడు కదలేవాడు కాడు. (నిశ్చితత్త్వమని) కథలు చాలా కలవాడు. (అవతరించి చూపినవి) లోకములు లోకస్థులు, ఎవరును లేనప్పుడు అన్నిటికిని మూలకారణమై ఉన్నవాడు. తుదమొదలు రెండునులేనివా డనగా ఒకప్పుడు పుట్టుట కొంతకాలానికి లేక పోవుట లేనివాడు. (వేదము తక్కిన దేవతలకు పుట్టుకలు చెప్పినది. నారాయణనకు చెప్పలేదు). కల్పనలు

లేనివాడు = ఆయన మహిమలు కల్పనగా చెప్పబడినవి కావు. సత్యములని. సంకల్పములేగలవాడు. తక్కిన ఏ దేవతలకైనా సంకల్పము, దాని ప్రక్కన వికల్పము ఉంటుంది. అనగా ఒక పనిని సంకల్పించి అది చేయలేకపోతే విరమించటమో ఇంకొకటి తలపెట్టటమో. ఇట్టి సంకల్ప వికల్పములు అందరికిని ఉండును. నారాయణునకు (రామునకు) మాత్రము వికల్ప ముండదు. అందుచేతనే వేదము 'సత్యకామ, సత్యసంకల్ప' మొదలుగా విశేషించినది. శేషతల్పశయనుడు = ఆదిశేషుడను తల్పముపై (శయ్యపై) నిదురించువాడు. అట్టివాడు శ్రీత్యాగరాజనుతుడు. ఆహా అని అయ్యగారు రాముని మహిమానుభూతిని పొందినారు.

143. బిలహరి = దేశాది

ప॥ కనుగొంటిని శ్రీరాముని నేడు॥ కను॥

అ॥ ఇనకులమందు ఇంపుగానుబుట్టి- ఇలలోన సీతానాయకునినేడు॥ కను॥

చ॥ భరతలక్ష్మణశత్రుఘ్నులు కొలువ - పవమానసుతుడు పాదములు బట్ట
వరులైన సుగ్రీవప్రముఖులు - ప్రణుతిసేయ త్యాగరాజనుతుని నేడు॥ కను॥

తాత్పర్యము :

ఒకప్పుడు తమ్ముని యందు ద్వేషముతో త్యాగయ్యగారి అన్న రామ పంచాయతనమును కావేరిలో పడవైచినాడు. అయ్యగారెంతో ఆర్తి బడినారు. రాముడు కలలో తోచి తన ఉనికిని తెలిపెను. అయ్యగారు కావేరికి చనగా పంచాయతనము ఒడ్డుకు కొట్టుకొని వచ్చినది. అప్పుడు ఆనందముతో పాడిన పాట ఇది. ఆహా! కనుగొంటిని కదా' సూర్యకులమందు పుట్టి సీతను చేపట్టిన రాముని కనుగొంటినికదా! తమ్ములు కొలుచుచుండగా, హనుమ పాదము లొత్తుచుండగా సుగ్రీవాదులు నుతించుచుండగా కొలువుదీర్చియున్న రాముని కనుగొంటిని అని.

విశేషము = దొరకినది పంచాయతనము. అనగా సీతారామ భరత లక్ష్మణ శత్రుఘ్నులు మాత్రమున్నది. అది పంచాయతనము. అయ్యగారు వర్ణించినది పట్టాభిరాముని. ఇందు రామావతారమందలి ముఖ్య ఘట్టము లయిన జననము, కల్యాణము, పట్టాభిషేకములు గర్భితమయి ఉన్నవి. ఇందు హనుమంతుడు సుగ్రీవాదులు ప్రస్తావింపబడినారు. దీనికి 'వామే భూమిసుతా పురస్తు హనుమాన్ పశ్చా

త్సుమిత్రాసుతః! శత్రుఘ్నో భరతశ్చపార్శ్వదళయో ర్వాయ్వాది కోణేషుచ! సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్తారాసుతో జాంబవాన్! మధ్యేనీల సరోజ కోమల రుచిం రామంభజేశ్యామలం' అనే రామధ్యాన శ్లోకము అయ్యగారికి స్ఫూర్తినిచ్చినది.

144. నాయకి = రూపకం

ప॥ కనుగొను సౌఖ్యము – కమలజుకైనను గల్గునా॥ కను॥

అ॥ దనుజవైరియగురాముని– దయగల్గిన వాని వినా॥ కను॥

చ॥ తనువొకచో మనసొకచో– తగిన వేస మొకచోనిడి
జనుల నేచువారికి – జయమగునే త్యాగరాజు॥ కను॥

తాత్పర్యము :

అయ్యగారికి ఒక సాక్షాత్కారము కలిగినది. తన సాధనలో ఇది ఒక జయము అని ఒక ఆనందము కలిగినది. అది గేయమైనది. ఆహా! ఇట్లు రాముని కనులార కనుగొను సౌఖ్యము బ్రహ్మకైనను కలుగుతుందా? (కలుగదు అని) రాక్షసవైరి అయిన రాముని దయ ఉన్న వానికి మాత్రము కలుగును. రాముని దయ కలుగవలెనంటే మనో వాక్, కాయములచేత త్రికరణశుద్ధితో రాముని అర్చన వందనాదులు చెయ్యవలెను. అట్లు గాక మనస్సు ధ్యానం ఇంకొక దానిమీద శరీకమింకొకదానిపైన బెట్టి వేషము భక్తుని వేషమువేస్తే అట్టివానికి జయము (సాక్షాత్కారము) కలుగదు. అని ఉపదేశము.

విశేషము = 'యన్మసా ధ్యాయతి, తద్వాచావదతి, తత్కర్మణాకరోతి' దేనిని మనమున తలచునో దానిని నోటితో చెప్పును. దేనిని చెప్పునో దానిని క్రియారూపమున చేయును' అని సత్పురుషుల (త్రికరణశుద్ధికలవారి) లక్షణము. ఈ లక్షణముతో రామ భజనజేయుటొప్పు. ఇట్లు జేయనివారు జనులకు బాధాకరులు, భగవత్కృపకు దూరులు' అని అయ్యగా రీకృతియందు చెప్పినారు.

145. బృందావనసారంగ = దేశాది

ప॥ కమలాప్తకుల – కలశాబ్ధి చంద్ర– కావవయ్యనను కరుణా సముద్ర॥ కమ॥

అ॥ కమలాకళత్ర కౌసల్యా సుపుత్ర – కమనీయగాత్ర. కామారిమిత్ర॥ కమ॥

చ॥ మును దాసుల బ్రోచిన దెల్ల చాల-విని నీచరణా శ్రితుడైతినయ్య
కనికరంబుననా కభయ మివ్వుమయ్య-వనజ లోచన! శ్రీ త్యాగరాజ నుత॥ కమ॥

తాత్పర్యము :

నన్ను రక్షించుము. పూర్వ మాశ్రయించినవారిని రక్షించిన కథలు విని నిన్నాశ్రయించితిని. నా కభయమిచ్చి రక్షించు. అని ఇంతకన్న విశేషములేదు. తక్కినవి సంబోధనములు మాత్రమే.

146. నాదనామక్రియ = ఆది (దివ్యనామము)

ప॥ కరుణాజలధే-దాశర ధే-కమనీయానన సుగుణనిధే! కరు॥
చ॥ నీమయమేగా ఇలను- ఏమని నేదూరుదును॥ కరు॥
2 నిజదాసుల అనుభవమొకటి-నిను తెలియని జనమతమొకటి॥ కరు॥
3 వలచుచు నామము సేయుదురే-తలచుచు ప్రొద్దుపోగొట్టుదురే॥ కరు॥
4 సుకృతము లొప్పగింతురే ఈ-ప్రకృతిని దెలిసి ఏగింతురే॥ కరు॥
5 మనసారగ బూజింతురే-మాటిమాటి యోజింతురే॥ కరు॥
6 నిను కనులను కనగోరుదురేనవ-నిధులబ్బిన స్వస్థులుగారే॥ కరు॥
7 తమలో మెలగుచునుందురే-తారక రూపుని గందురే॥ కరు॥
8 నీవన్నిటయని వల్కుదురే-నీవే తానని కులుకుదురే॥ కరు॥
9 భాగవత ప్రహ్లాదహిత రామ-భావుక త్యాగరాజనుత॥ కరు॥

తాత్పర్యము :

ఓ కరుణాజలధే = కరుణా సముద్రా! దాశరధే = సద్గుణములకు నిధీ! నీదయ వచ్చుటలేదు. ఈ విషయములో నే నెవరిని నిందింతును? ఈ చరాచర ప్రపంచమంతయును బ్రహ్మమయమే అయినప్పుడు 'కింవచనీయం కిమవచనీయం' = ఏది నిందింపదగినది? ఏది నిందింపతగనిది?' అని శంకరభగవత్పాదుల వారి వచనము. అయ్యగారి మాటకిది స్ఫూర్తి. రామా! నీ నిజదాసుల మతమొకటి. నిన్ను తెలియనివారి

త్రోవ ఒకటి. (అని చెప్పి) తరువాయి చరణములో నిజదాసుల ప్రవృత్తిని వివరిస్తున్నారయ్యగారు). వలచి నామస్మరణమును చేయుదురు. తలచుచు ప్రొద్దులు పుచ్చెదరు. (ఇది అష్టాంగ యోగములలోని ధ్యానయోగము) సుకృతము లొప్పగింతురు. అనగా కర్మయోగము నవలంబించి కర్మలు చేసి కర్మఫలమును భగవదర్పణము చేయుట. ప్రకృతిని తెలిసి ఏగింతురు. అజ్ఞానుల ప్రకృతిని తెలిసి బాధపడెదరు. (సద్గతికి దూరమగుచున్నారే అని) మనసారగా భగవత్పూజలు చేయుదురు. మాటిమాటికిని యోజించెదరు. నవ విధభక్తులయిన శ్రవణ కీర్తన స్మరణ అర్చనవందనాదులను ఒకదాని కొకటి జోడించి ప్రొద్దుపుచ్చెదరు. భగవత్సంబంధము లేక నవరత్ననిధులు వచ్చి లభించినా స్తిమితముగా నుండలేరు. తమలో తాము మెలగుచు నుందురు. అనగా 'బోధయంతః పరస్పరం! మచ్చిత్తా మద్గతప్రాణా స్తుష్యంతిచ రమంతిచ' = భగవద్విషయములను ఒకరికొకరి చెప్పుకొనుచు నాయందు మనసు నిల్పి ఇంద్రియ సుఖమును మానసికానందమును పొందుదురు' అనెడి గీతా వాక్యము ననుసరించి వర్తించెదరు. తారక బ్రహ్మ స్వరూపుడయిన రాముని సాక్షాత్కరింప జేసుకొందురు. 'సర్వం విష్ణుమయం జగత్' = నేనే ఆ బ్రహ్మమును అనెడి అద్వైతానందమునకు వచ్చెదరు. ప్రహ్లోదహిత త్యాగరాజనుత' అని భాగవతపరంపరలో ప్రహ్లోదు డాద్యుడని కడపటి తానని అయ్యగారు సూచించిరి.

147. తోడి = ఆది

ప॥ కరుణ జూడవమ్మ కమలవైరి-కలాధరుని కొమ్మ॥ కరుణ॥

అ॥ ధరను సరియు దొరకని పంచన-దనగరనాయిక ధర్మసంవర్ధని॥ కరుణ॥

చ॥ అనేక జగదాధారివి నీ-వనే మదిని నెర నమ్మితిగా నే
మనేవాడనో యని నీమది నెం-చనే వద్దనుచు నాతని వేడు
దునే నాదుపై వినేచాడి చా-లునే నీదు దయకునే పాత్రుడౌ
దునే కువలయనయనే సువసనజ-ఘనే విధునిభవదనే సంతతము॥ కరుణ॥

2 మదాన దెలియక చేసిన కర్మ-విదారి నీవని నమ్మితి నేనీ
పదారవిందయుగళ భక్తిమ్మ-ని దానమడిగితినే తోచదేమి
ఉదారి నీదయను దాచరాదు ద-రిదాపులేకను సదా మొరలిడవి
నదా చెవులు ఎవరుదా బ్రోతురిక-సదాశివహితే ముదాన సతతము॥ కరుణ॥

3 పరాశక్తి నాయొక చిత్తము తా-మరాకు నీరు వితము తల్లడి
ల్లరాదు అందున కేమిఫలము శం-బరారికి అర్ధ శరీరి
పురాణపురుషుడగు రామునికి ఆ-పురారికిని నీకు రాజధరి మ
చ్చరాన వేరెంచరాదు అను త్యా-గరాజునిక విడువరాదు సతతము॥ కరుణ॥

తాత్పర్యము :

ఇది పంచనదక్షేత్రవాసిని ధర్మసంవర్ధనీ దేవీ పరమగు గేయము. కరుణ జూడవమ్మా! కమలవైరి కలాధరుని = కమలములకు శత్రువు చంద్రుడు చంద్రకళను ధరించిన వాడు శివుడు. ఆయన కొమ్మా = భార్యఅయిన పార్వతీదేవీ! ధరలో సరియు దొరకని = సాటిలేని పంచనదనగర నాయికా = తిరువైయార్ రాణీ!

1) అనేక జగముల కాధారము నీవనే = నీ వనియే మదిలో నెరనమ్మితినిగాని, ఏమనే వాడనోయని నీమదినెంచవద్దు = అనేక జగదాధారివి నీవు కాదని వేరే ఏమనేవాడనో= ఏమి పలికేవాడనో అని నీవు భావించవద్దు. అనుచు, ఆతని వేడుదునో= నీ నాథుడయిన శివుని వేడుకొందునే అమ్మా! అట్టినాపై 'వినేచాడి చాలునే = ఎవరయినా చెప్పిన కొండెము చాలు. నీదు దయకు నే = నేను పాత్రుడ నౌదునే. 'కువలయనయనే' కలువలవంటి కనులు గలదానా! సువసనజఘనే = మంచి వస్త్రము ధరించిన కటి ప్రదేశముగల దానా! విధునిభవదనే = చంద్రుని వంటి ముఖముగలదానా! కరుణజూడు.

2) మదముచేత తెలియకచేసిన కర్మములను ఛేదించుదానివని నమ్మితినే. నీ పదపద్మముల భక్తి నిమ్మని దానమడిగితినమ్మా! తోచదేమి = దానమిద్దామని తోచదా? ఓ ఉదారగుణముగలదానా! నీదయను దాచుకో కూడదు. దరిదాపులేకుండా ఎప్పుడును నిన్ను ప్రార్థిస్తే 'వినదా చెవులు' = వినపడదా అని ఎవరుదా బ్రోతురిక. (ఎవరు రక్షింతురు అని. ఎవరుదా అనేది అరవ సంప్రదాయం) సదాశివునకు హితురాలా! సంతోషముతో కరుణజూడు.

3) ఓ పరాశక్తీ నా మనస్సు తామరాకు నీరువలె తల్లడిల్లకూడదు (నీదయతో అని) నామనస్సు తల్లడిల్లితే నీకేమి ఫలము? 'శంబరారి కర్ధశరీరి' ఓ రాజధరి = చంద్రుని ధరించిన దానా! పురాణ పురుషుడైన రామునకు శివునకు నీకు మత్సరబుద్ధితో వేరుగా భావము చేయరాదు అనుచున్న త్యాగరాజుని నీవిక విడువరాదు. కరుణజూడు అని ప్రార్థన. ఒక సూచన = 'శంబరారి కర్ధశరీరి' అనునది సరిగా లేదు. శంబరారి అంటే మన్మథుడు. ఈ దేవి మన్మథునకు శత్రువగు శివున

కర్ణశరీరముకాని శంబరారికి కాదు. అప్పుడు శంబరారి వైరికర్ణశరీరి అని ఉండవలెను. అట్లైతే కృతిలో ఉద్దేశించిన తాళగతిపోతుంది. అయ్యగారే ఆ పదప్రయోగ సంరంభములో వేగములో అలా వెళ్లిపోయారు. సింహావలోకనము చేసే స్వభావము అయ్యగారికి లేదు. వీరభద్రశాస్త్రిగారు ఇక్కడ ఏమీ వివరించలేదు. శివున కర్ణశరీరమైన దానా! అని తాత్పర్యంతో సాగినారు.

విశేషము = ఈ కృతిని త్యాగయ్యగారు రచించటానికి కారణముగా వీరభద్రశాస్త్రిగారిట్లు తమ గ్రంథమందు వ్రాసిరి. 'త్యాగయ్యగారు షడక్షరిని ఉపదేశమై అనుష్ఠానము పూర్తి అయిన పిదప సదా శ్రీరాముని పరముగా ననేకకృతుల చేసి కీర్తించుచుండగా కొందరసూయాపరులీతనికి శివుడన్నను పరదేవత (పార్వతి) అన్నను అసూయ అనియు కేవల వైష్ణవ సంప్రదాయమునకే చెందిన వాడనియు ఏమేమో నిందల నారోపించిరట. అవి కర్ణాకర్ణికగా త్యాగయ్యగారు విని అట్టి దైవభేద నిమిత్తమయిన నిందను సహించనేరక తన హృదయమందలి సమరస భావముట్టి పడు నట్లు పరమ గంభీరుడగుటచే ఆధర్మ సంవర్ధని దేవత గూర్చియే తన మనోభావమును చెప్పుకొన్నట్లు వాడుకగలదు'. వైష్ణవ సంప్రదాయమును కేవల విష్ణు భక్తులయిన వైష్ణవులను నిందించు వారానాడున్నట్లు తోచుచున్నది. శివునియందే ఏకాగ్ర భక్తిని నిలిపిన శైవులను గాని, విష్ణునియందే ఏకాగ్రభక్తిని నిలిపిన వైష్ణవులను గాని నిందించుట మూఢత్వము. స్మార్తులనెడు మధ్యవర్తులున్నారు. వీరిద్దరిని పూజింతురు. అయినను విష్ణువునకే వైదిక మయిన ప్రాధాన్యము నిచ్చెదరు. సంకల్పమునందు 'శ్రీ గోవింద గోవింద అద్య మహాపురుషస్య విష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య' = గోవింద - మహాపురుషుడైన విష్ణుదేవుని ఆజ్ఞతో ప్రవర్తించుచున్నాను' అనియు 'కేశవాయ స్వాహా నారాయణాయ స్వాహా మాధవాయ స్వాహా' అని విష్ణు నామములతోనే ఆచమనము చేయుదురు. శివ కేశవులిరువురును మాకు సమానమే అని చెప్పు మధ్యవర్తులును పై విధముగనే సంకల్పాచమనములు చేయుదురు. ఆబ్దికములయందును శ్రాద్ధ సంరక్షకునిగా విష్ణుస్థానమునే కాని శంభుస్థానమునుగాని ఇంకే ఇతర దేవునిగాని పెట్టరు. అదియును గాక కర్మకాండలలో రుద్రుని నామమును స్మరింప వలసివచ్చినప్పుడు 'అప ఉపస్పృశ్య' = నీటిని ముట్టుకొని శుద్ధుడయి' అని చెప్పుకొని అవతలి విషయమునకు పోవుదురు. తరువాత కర్మారంభమందు 'తదేవలగ్నం' లక్ష్మీపతి యొక్క అంఘ్రిస్మరణమే సర్వబలము' అని ప్రారంభింతురే కాని ఆచోట వేరొక దేవుని స్మరించుటలేదు. వైష్ణవు లనబడేవారు విష్ణు స్మరణచేస్తే కాని శైవులనబడేవారు శివస్మరణచేస్తే కాని విశేషములేదు. వైష్ణవులని వ్యవహారములేని వారే పైన చెప్పిన విధముగా వర్తింతురు. ఇంకా ఎవరి హృదయమందు విష్ణువు ఉండునో వారికి లాభము జయము. పరాభవముండదు' అనియును

'మంత్రతంత్ర క్రియా లోపములను పూరించునది 'కృష్ణానుస్మరణంపరం' = విష్ణుస్మరణమే అనియును చెప్పుదురు. వీరు తమయింట ఏదైనా నిమిత్తముగా శివశక్త్యాది పూజలు జరిపినప్పుడును మంత్రపుష్పమును 'సహస్రశీరుషందేవం' అని ప్రారంభించి 'నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి తన్నోవిష్ణుః ప్రచోదయాత్' అని విష్ణుగాయత్రీ మంత్రముతోనే మంత్రపుష్పమును చెప్పుచుందురు. మరియు నొక విశేషము. విష్ణు గాయత్రీ మంత్రము వలె కొన్ని ఇటీవల ఆయాదేవతల పేర్లతో వినబడుచున్నవి – అవి అన్నియును గాయత్రీ ఛందస్సుకు సరిపడక సంఖ్యారహి తముగా నుంటున్నవి. దీనిని విష్ణు గాయత్రి వలెవైదికమయిన గాయత్రిమంత్రము ఇతర దేవతలకు లేదా అనిపించుచున్నది. ఇటువంటి బహుకారణములచేత వైదిక కర్మలన్నియును విష్ణుదేవతాకములనియు ఇవి ఇట్లాచరించువారు వైదికులని అనబడుచున్నారు. అందుచేత వీరందరిని వైష్ణవులు అని చెప్పవచ్చును. సంధ్యా వందన పరముగ నున్న గాయత్రీ మంత్రమునకు గూడ సూర్య డధిష్ఠానదైవ మగుటచే తదంతర్యామి అని అందరిచే చెప్పబడు నారాయణునకే ఆమంత్రము గూడ సంక్రమించినది. ఇట్లు కాక ఇతరముగా చేసిన వాదములు వైదికముగను శాస్త్రీయముగను నిరస్తములయినవి. ఈ కర్మానుష్ఠానములలో హరిహరా భేదశ్లోకము లేవయినా పఠించినా అవి వేదమంత్రములు కావు. ఔపచారికములగు పురాణ శ్లోకములే. ఈ విధముగా బ్రాహ్మణులనబడు వారందరును కలసి ఏకగ్రీవముగా తీర్మానించుకొన్న తీర్మానమే విష్ణుదేవతా పరమగు ఈ కర్మనిష్ఠ.

ఇక ఈ కర్మపరిధి దాటితే జ్ఞాననిష్ఠ. జ్ఞాన నిష్ఠలోకి రాముడులేదు కృష్ణుడులేదు, శివుడులేదు, పార్వతిలేదు నామరూపాల ప్రసక్తే ఉండదు. 'సర్వం బ్రహ్మమయం' అనుకుంటు 'సోహం సోహం' అనుకుంటూ కూరుచుండటమే. వైష్ణవము అనే వర్గమునకు కర్మనిష్ఠలోనూ జ్ఞాన నిష్ఠలోను 'సర్వం విష్ణుమయం' అనే భావరూఢియే. ఇది ఇలా ఎందుకు? అనే ప్రశ్నవేసే అధికారము మనకు లేదు.

పైన చెప్పబడిన వైదిక కర్మానుష్ఠాన ప్రాతిపదిక మీద ఒకానొక సమయములో బ్రాహ్మణ్యము మొత్తమంతయు ఏకముగా నుండెడిది. భారతమయిన ఒక వచన మిట్లున్నది. 'బ్రాహ్మణం వైష్ణవం విద్యాత్ న త్వసా వన్యదేవతః' = బ్రాహ్మణుని వైష్ణవునిగా తెలియవలెను. అతడు వేరు దేవతలను కొలుచువాడు కాడు' అని. వైదిక కర్మలన్నియును విష్ణుపరముగా నున్నవి కనుక వైదిక కర్మలను బ్రాహ్మణుడే చేయును కనుక పైనున్న భారత వచనము అన్వయించినది. బ్రాహ్మణుడు వేదపాఠ ప్రారంభమునందు 'హరిః ఓం' అని ప్రారంభించునే కాని మా కిరువురును ఒక్కటే అని 'హరః ఓం' అని ప్రారంభించడు. ఈ విధముగా విష్ణు పారమ్యము తెలిసినా తెలియకపోయినా స్థిరపడి ఉన్నది.

కాలక్రమములో మతత్రయాచార్యులయిన శంకర మధ్వ రామానుజుల ప్రవచనముల ద్వారా ద్వైత – అద్వైత – విశిష్టాద్వైత సిద్ధాంతము లేర్పడినవి. ఈ మూడు వర్గములకును 'నారాయణుడే మోక్షప్రదాత అని, ముముక్షువు (మోక్షేచ్ఛకలవాడు) నారాయణునే ఉపాసింపవలెననే మూల సూత్రమున్నది. ఈ మూడు సిద్ధాంతముల ద్వారా ద్వైతులు, అద్వైతులు, విశిష్టాద్వైతులు అని మూడుగా చీలినారు. ఈ ముగ్గురికి ఉమ్మడిదేవుడు విష్ణువు. వైష్ణవుల విషయము వేరే చెప్పనక్కరలేదు. ద్వైతులది మధ్వమతమనబడును. 'శ్రీమ న్మధ్వమతే హరిః పరతరః' = మధ్వమతమునందు హరియే పరదైవము అని చెప్పబడినది. ఇక శంకరులవారి వాక్యము 'మోక్షమిచ్ఛే జ్జనార్దనాత్' = మోక్షమిచ్చునది నారాయణుడని. మోక్షమిచ్చువాడు పరదైవ మనినట్లే కదా! శంకరాచార్యమతాను యాయులయిన యతీశ్వరులు ముముక్షువులగుటచేత నారాయణ స్మరణమును మాత్రమే చేయుదురు. తక్కిన దేవతల ఉపాసనము కామికము అని సిద్ధాంతము. అందుచే వారు నారాయణ స్మరణమునే చేయుదురు. వారు ఎవరికైనా లేఖ వ్రాసినా 'ఇతి నారాయణ స్మృతయః' అని లేఖను ముగించెదరు. వీరి మతమున 'జ్ఞానాన్మోక్షః' = జ్ఞానము వలన మోక్షము అనియును నారాయణుని వలన మోక్షము అనియును ఈ రెండిటిని అనుసంధించి యుందురు. ఈ యతీశ్వరులను గాని ఈ సంప్రదాయపు గృహస్థులను గాని శైవులని అనరు. శైవులనబడు వర్గము వేరొక టున్నది. వారి మతమందు శివుడు పరదైవము. ఆమూల సూత్రము మీద వారి అనుష్ఠానముండును. వీరి ఆగమము పాశుపతాగమము. పశుపతి = శివుడు చెప్పినది కనుక పాశుపతాగమము అనబడినది. శంకరులవారు వారి సూత్ర భాష్యమున 'పత్యురసామంజస్యం' = పాశుపతాగమము అసమంజసము. అని దానిని నిరసించినట్లు పెద్దలు చెప్పుదురు. వైష్ణవుల ఆగమమయిన పాంచ రాత్రాగమము భారతమున 'పాంచరాత్రస్య కృత్స్నస్యవక్తా నారాయణ స్స్వయం'= పాంచరాత్రాగమమును నారాయణుడు స్వయముగా చెప్పెను' అని పొగడొందినది. ఈ ఆగమమునకు ప్రవర్తకులుగా పెక్కురు సాత్త్విక ఋషులు చెప్పబడియున్నారు.

శంకరాచార్యుల వారు షణ్మతస్థాపకులని ప్రతీతి కలదు. ఈ షణ్మతములలో వారిదేమతము? శైవమతమనుటకు లేదు. శైవ చిహ్నమయిన భూతిని వారు ధరింపలేదని 'నిరస్తభూతిం అనుమార్ధదేహం' = భస్మము ధరింపని, పార్వతి కర్ధశరీర మివ్వని శివుడుగా వారు వర్ణింపబడిరి. కనుక శైవము కాదు. గాణాపత శాక్తేయములును వారిమతములు కావు. పరిశేషన్యాయము చేతను, వారు రచించిన సిద్ధాంత గ్రంథములయందున్న బహుప్రమాణములచేతను 'భజగోవింత స్తోత్ర' 'లక్ష్మీనృసింహ

కరావలంబస్తోత్ర' 'షట్పదీస్తోత్ర' ములవలన వైష్ణవత్వమే కనపడుచున్నది. వారి గోపీచందన ధారణమును దీనిని బలపర చుచున్నది. శంకరులవారి మతమునకు ఆద్యులుగా 'నారాయణం పద్మభువం వసిష్ఠం। శక్తించ తత్పుత్ర పరాశరంచ' నారాయణుడు, బ్రహ్మ, వసిష్ఠుడు, శక్తి, పరాశరుడు, వ్యాసుడు శుకుడును చెప్పబడిరి. వీరందరు విష్ణుభక్తి ప్రవర్తకులేకాని ఇతరులుకారు. పైన మనము క్రోడీకరించిన విషయములను బట్టి విష్ణువు పరదేవతగా, విష్ణు అవతారములు దానితో సమముగా పూజింపబడుట నిర్వివాదాంశములు. విష్ణుదేవుని ఒక్కనినే నమ్మి ఆయనను మాత్రమే స్మరించుట పూజించుట, ఇతరదేవతల ఊసెత్తకుండుట దోషమా? అపరాధమా?

ఇదియునుకాక ఒక అభియుక్తోక్తి ఇట్లున్నది 'ఏకోదేవః కేశవోవా శివోవా। ఏకా నారీసుందరీవాదరీవా' = ఒక్కడే దేవుడుండవలెను, కేశవుడు గాని శివుడుగాని, ఒక్కతే భార్యయుండవలెను, అందగత్తెగానిండు గయ్యాళిగానిండు' అని. కనుక ఏకదేవతోపాసన నింద్యముకాదు. ప్రసక్తానుప్రసక్తంగా ఇంతదూరము వచ్చాము. ప్రస్తుత విషయమునకు వద్దాము. ఇట్టిస్థితిలో త్యాగయ్యగారు ఒక్క రాముని నమ్మి పూజించుటలో ఏమి దోషమున్నదని ఆనాటి వారు అయ్యగారిని నిందించుట? అయితే వీరభద్రశాస్త్రిగారు అసూయతో నిందించిరని వ్రాసినారు. సరిగా సరిపడియున్నది. అసూయ అనగా గుణమునే దోషముగా భావించుట. ఇట్టి అసూయాపరులను ఎవ్వరును దిద్దలేరు. అసూయాపరులెవరో అయ్యగారినివైష్ణవు డని నిందించుట, దానిని భరించలేక ఆయన తప్పుదిద్దుకొని ధర్మ సంవర్ధని మీద కీర్తన వ్రాయుట ఇట్టి కథలు వింతగా ఉండి అనేక ప్రశ్నలకు తావిచ్చును. వీరభద్రశాస్త్రిగారు వ్రాసిన దానిని బట్టి త్యాగయ్యగారు వైష్ణవ సంప్రదాయపువాడనే నిందబాపుకొనుటకు ఇతరదైవములపై కృతులు రచించి రనుటకంటే ఆయాదైవములయందు రామునే చూచుకొంటూ స్తుతి చేసిరి అనుట సముచితము. ఎందుచేతనంటే అయ్యగారినిశైవుడనరు, శాక్తేయుడనరు, వైష్ణవుడనరు. ప్రగాఢ రామభక్తుడనియే అందురు. ఒక్క దేవునియందే భక్తిని నిలుపుట నింద్యమయినట్లయితే 'ఏకభక్తి ర్విశిష్యతే' 'మామేకం శరణం వ్రజ' వంటి వాక్యము లేమయిపోవాలి? ఇంకొక విషయము. ఒక్క విష్ణువునే పూజించుచు ఇతరులను స్మరణకూడ చెయ్యని వారిని వీరవైష్ణవులని అందురు. అట్లేశైవులను కూడ వీరశైవులని అందురు. త్యాగయ్యగారుశైవుడుకాడు, వీరవైష్ణవుడు కాడు. అందుచేత ఇతరదైవములను కీర్తింపవచ్చును. ఎట్లయినను ఆయనను బరులు నిందించు నవకాశములేదు. బొత్తిగా అజ్ఞానులగువారు నిందించినను అయ్యగారు పట్టించుకొనరు. స్థానిక దైవమగు ధర్మసంవర్ధనీ దేవిని రాముని కంటే వేరుగా నెంచక ఆయన కీర్తించినారు. ఇది పరమార్థము.

148. కేదారగౌళ = చాపు

ప॥ కరుణాజలధీ– దాశరధీ। కల్యాణ సుగుణనిధీ॥ కరు॥

అ॥ తరుణారుణ నిభ చరణా సురమద। హరణాశ్రితజనశరణా ద్భుతగుణ॥ కరు॥

చ॥ మనవి వినక యోచన జేసితేనే। విననయ్య శ్రీరామ. ఓపరమపా
వన తారకనామ సుగుణధామ। జనకతనయావన చతుర్ముఖ జనక జనక వచన సుపరిపా
లనముజేసిన వనజలోచన– సనకనుత మాధనము నీవే॥.... కరు॥

2 సురమునివరనుత– సరసముతో నన్ను – కరుణించితే నీదు తండ్రిసొమ్ము
వెరవక పోనేరదు ఎందుకువాదు – హరిగణాధిప పరిచరా గమ
చర పరాత్పర తరముగాదిక– చరణభక్తివి తరణముగ నీ
తరుణమిది శ్రీకర ధరాధిప.... కరు॥

3 ధనమదమునమండు జనులను నేను యా–చన సేయరాలేనురా – త్యాగరాజ
వినుత ఘృణాసాగర సమీర। తనయసేవిత ధనదనుత స
జ్జన మనోహర ఘనరవ స్వన। మనసు చాలా వినదురా నా
తనువు నీదని వినుతి జేసెద.... కరు॥

తాత్పర్యము :

కరుణాజలధీ = కరుణా సముద్రా దాశరధీ =దశరధ కుమారా! కల్యాణ సుగుణనిధీ = మంగళ కరములయిన సుగుణములుగల వాడా! తరుణారుణ నిభచరణ= లేత సూర్యునివలె ఎర్రని పాదములు గలవాడా! అసురమదహరణా = రాక్షసుల మదమును హరించువాడా! శ్రిత జనశరణ =భక్తజనులకు రక్షకుడా! అద్భుతగుణ = ఆశ్చిర్యకరములగు గుణములు గలవాడా! నామనవి నీవు వినక నీవేదో యోచన చేస్తే నేను వినేదిలేదు అని (ఇది రాముని యందున్న చనవుతో బాలుని వలె చూపిన ఒక హఠము) శ్రీరామ. పరమపావన = మిక్కిలి పవిత్రమగు వాడా! తారకనామ = సంసారమును తరింపజేయు పేరుగలవాడ! సుగుణధామ = సుగుణములకు నిలయమగువాడా! జనక తనయావన = సీతా రక్షకుడా! (పతీ అని) చతుర్ముఖజనక= బ్రహ్మకు తండ్రియైనవాడా! జనకవచన సుపరిపాలనము జేసిన = దశరధుని వాక్యమును లెస్సగా పాలించిన వనజలోచన = పద్మములవంటి నేత్రములు గలవాడా! సనక నుత = సనకమునిచే నుతింపబడినవాడా! మాధనము నీవే'. సురమునివరనుత = దేవతలచేతను మునులచేతను నుతింపబడినవాడా! సరసముగా నన్ను రక్షిస్తే నీ తండ్రిసొమ్మేమీ పోదు.

నన్ను రక్షించకపోతే నీకు అపవాదము కలుగును. అదెందుకు? హరిగణాధిప పరిచర= కపిగణములకు ప్రభువయిన సుగ్రీవుడు సేవకుడైన వాడా! ఆగమచర = వేదములయందు సంచరించువాడా! పరాత్పర = నీకంటే గొప్పవాడు లేనివాడా? తరముగాద (నీవు రక్షించకపోతే భరించలేను అని) శ్రీకర = సంపద గలిగించువాడా! ధరాధిప = భూమండలమునకు ప్రభువా! వితరణము = దానగుణముతో, నీచరణ భక్తిని= పాదములపై భక్తిని ఈ తరుణమిది = ఇచ్చే సమయమిది. ధనమదాంధులను నేను యాచించుటకు రాలేను. (నిన్ను తప్ప ప్రాకృతజనులను వేడను అని) త్యాగరాజ వినుత= త్యాగరాజుచే నుతింపబడువాడా! ఘృణాసాగర = కరుణా సముద్రుడా! సమీర తనయ సేవిత = హనుమంతునిచే సేవింపబడినవాడా! ధనదనుత = కుబేరునిచే నుతింపబడిన వాడా! సజ్జనమనోహర = సజ్జన మనస్సులను లోగొన్నవాడా! ఘనరవ స్వర = మేఘ గర్జనమువలె గంభీరమైన కంఠస్వరము గలవాడా! మనము చాలా వినదురా = మనస్సు నాకు స్వాధీనము కాకయున్నది. (నీవు రక్షించకపోవుట చేత వికలమై అదుపుతప్పి ఉన్నదని చెప్పవచ్చును) నా తనువును నీకర్పించి వినుతిచేసేదను. అని వేడికోలు.

149. దేవగాంధారి = ఆది

ప॥ కరుణా సముద్రా రామ-కావవే శ్రీరామభద్ర॥ కరు॥

అ॥ శరణా గత హృచ్ఛిద్ర-శమన నిర్జిత నిద్ర॥ కరు॥

చ॥ నా పాపము నాతో నుంటే-శ్రీప! నీ బిరుదికేమి బ్రతుకు
ఏ పాపుల శాపమో ఎందుకీచలము త్యాగరాజనుత॥ కరు॥

తాత్పర్యము :

కరుణా సముద్రా! రామ! కావవే శ్రీరామభద్ర రక్షింపవయ్యా... శరణాగత హృచ్ఛిద్రశమన = శరణాగతుల హృదయబాధలను తీర్చువాడా! నిర్జిత నిద్ర = నిద్రను జయించినవాడా! ఓ రామా! నీవు 'త్యాగయ్యా! నీకు పాపమున్నది. అందుచేత రక్షింపలేకున్నాను. అని అంటే నా పాపము తీరిపోకుండా నాతోనే ఉంటే రామా! నీవు పాపహరుడవు = పాపములను హరించువాడవు అనే బిరుదు ఎట్లు నిలిచి ఉంటుందయ్యా! (నిలువదు కనుక రక్షించు). నిన్నని ఏమి పనిలే ఏ పాపాత్ముల శాపమో నాకు అడ్డపడి ఉంటుంది. శ్రీప=శ్రీపతీ! లేకపోతే ఎందుకు నీ కోపము. అని పరితాపము.

విశేషము = నిద్రను జయించుట అంటే మందకొడి తనములేక ప్రపంచ కృత్యములను ఏ సమయములో ఏదేది చేయవలెనో దానిని నిర్వహించుట. అదియును గాక రామావతారమున బలాతిబలల ప్రభావము చేత ఆకలి దప్పులను నిద్రను జయించుట.

శ్లో॥ హరి ర్హరతి పాపాని। దుష్ట చిత్తై రపిస్మృతః। అనిచ్ఛయాపి సంస్పృష్టో। దహత్యేవహి పావకః = 'దుష్టులు స్మరించినను హరి వారి పాపములను హరించును. అనుకోకుండా అగ్నిని ముట్టుకొన్నను అది తాకిన వానిని దహించినట్లు' అని శాస్త్రము. ఇదే బిరుదు.

150. సారంగ = ఆది

ప॥ కరుణ జూడవయ్యా మాయయ్య-కావేటి రంగయ్యా! కరుణ॥

అ॥ పరమ పురుషవినుమామా-పాలిపెన్నిధానమా॥
వరద నలుగురిలో-వరమొసగి కరమిడి॥ కరుణ॥

చ॥ చేరడేసి కనులచే చెలంగుభయనా-చ్చారులతో మరిసద్భక్తులతోనా
ళ్వారులతో నీవు వరనైవేద్యము-లారగించువేళల హరి త్యాగరాజునిపై॥ కరుణ॥

తాత్పర్యము :

ఓ కావేటి రంగయ్య కరుణజూడవయ్య! ఓ పరమపురుషా! మా పాలి పెన్నిధానమా! మాప్రార్థనలు వినుమయ్యా! నలుగురిలో ప్రశస్తి కెక్కేవిధముగా వరమిచ్చి కరావలంబన మిచ్చి (చేయూత) రక్షించుము. విశాలనేత్రములుగల ఉభయనాచ్చిమారులు= లక్ష్మీదేవి భూదేవులతో ఇతరభక్తులతో ఆళ్వారులతో చక్కని నైవేద్యము లారగించే సమయములో నన్ను కరుణజూడ వయ్య కావేటిరంగయ్యా అని ప్రార్థనము.

విశేషము = నైవేద్యము లారగించువేళల కరుణజూడుమన్న చోట వీరభద్ర శాస్త్రిగారు 'ఓరంగయ్యా! నీవు సాపాటు (భోజన) ప్రియుడవు అని త్యాగయ్యగారు చమత్కారం చేసిరి అని వ్రాసినారు. నాకట్లు తోచలేదు. ఇదే నిజమయితే త్యాగయ్యగారు 'రఘువీర నీకు పంచభక్ష్యపరమాన్నములను నివేదించెదని. ఆరగింపవే' అని తోడి రాగములో కృతి రచించినారు. అప్పుడు ఓ సాపాటు రామన్నా! అని చమత్కరించినారు అని చెప్పవచ్చునా? అదేమీ లేదు. వైభోగరంగని ఒక కార్యక్రమమును వర్ణించి నారంతే.

విష్ణు సహస్రనామములలో 'అన్న మన్నాద ఏవచ'= అన్నమాతడే, భుజించునది ఆతడే అని ఉన్నది. దీని కేమి చమత్కారము చెప్పుదురు. సరి. శ్రీశాస్త్రిగారు మరియొక వ్యాఖ్యానము జేసిరి. 'ఉభయనాచ్చారులు, ఆళ్వారులు' అని త్యాగయ్యగారు పరసంప్రదాయ ద్వేషములేక ఆ పదముల యందలి లాలిత్యము ననుభవించిరి. అని వ్రాసినారు. ఇందు ద్వేషింప దగిన పరసంప్రదాయమేదో, ఆపదముల యందున్న లాలిత్యమేదో నాకు తెలియలేదు. అక్కడ నున్నవారు ఉభయ నాచ్చిమారులు = లక్ష్మీభూదేవులు- ఆళ్వారులును, ద్రావిడ భాషా ప్రాంతము కనుక అక్కడి వారు ఉభయ నాచ్చిమారులు అందురు. ఆళ్వారులను ఇంకెట్లనవలెను? శ్రీ శాస్త్రిగారికి వారు చెప్పిన పరసంప్రదాయ ద్వేషము బాగా ఉన్నది. నేను అను భవపూర్వకముగా నెరుగుదును. అందుచేత ఇట్టి వ్యాఖ్యానములు వచ్చును. త్యాగయ్యగారి కివేమీ ఉండవు. శ్రీరాముడు తన కులదైవము. రాముని కులదైవము రంగనాథుడు. త్యాగయ్యగారి కిదే పరమార్థము.

151. దీపకం = దేశాది

ప॥ *కళల నేర్చినా మునుజేసినది కాక నేమి అరవైనాలుగు* కళల॥

అ॥ *కలిమి లేములకు కారణంబునీవే- కరుణ జూడవే కడుపు కోసమై* కళల॥

చ॥ *కోరినూల కొండతీసి సింగరిమని- కోరి భుజించెనా-వైరి తమ్ముడు*
సారమైన రంగని ఇల్లు జేర్చెనా? సరస త్యాగరాజనుత బ్రోవవే॥ కళల॥

తాత్పర్యము :

ఓరామా ఎన్నివిద్యలు నేర్చినా, పొట్టకూటికై అరువది నాలుగు కళలు నేర్చినా పూర్వకర్మాను సారంగా అంటేదే అంటుతుంది. అదీకాక సంపదలకు గాని దారిద్ర్యానికి గాని నీవే కారణము. సింగరి అను వాడు తినుటకు నువ్వుల రాశి సంపాదించుకున్నాడు. కాని తినలేక పోయినాడు. ఏదో అడ్డము వచ్చినది. మరియు వైరి తమ్ముడు = విభీషణుడు, రాముడు బహుమానముగా ఇచ్చిన శ్రీరంగ విమానమును తన ఇల్లగు లంకను చేర్చుకోలేక పోయినాడు. కనుక ఎంత ప్రాప్తమో అంతే పూర్వకర్మాను రూపంగా లభ్యం అవుతుంది. కనుక వాటిని గురించిన చింత నాకు లేదు. నీవు నన్ను కరుణింపవలెను రక్షింప వలెనను నదియే అయ్యగారి ప్రార్థన.

విశేషము = చేసుకొన్నవానికి చేసుకొన్నంత. సింగరి ముని విషయము ఏ పురాణము లోనో ఉండు విషయము తెలియదు. గేయములో ఉన్న భావమును బట్టి ఉన్న పదములను బట్టి తాత్పర్యము వ్రాయుట అయినది. విభీషణుడు శ్రీరంగ మందిరమును కొని పోవుచుండగా సంధ్యా వందన సమయమయినది. మందిరమును క్రింద నుంచితే అక్కడ స్థాపితం అవుతుంది. ఆ సమయంలో ఒక వటువు కనిపించినాడు. వీభీషణుడా వటువును పిలచి నేనుసంధ్యా వందనముచేసి వచ్చునంత వరకు దీనిని పట్టుకొనుమని చేతికిచ్చెను. వటువు నేమూడుసార్లు పిలచెదను. నీవు రానిచో ఇక్కడ ఉంచెదను. అని పెట్టుకొని మూడుసార్లు పిలిచి మందరమునక్కడ నుంచెను. అది అచ్చట స్థాపితమయ్యెను. ఆ వటువు శ్రీరంగమందిరము కొరకు తప మాచరించిన వినాయకుడు. ఇట్లు విభీషణుని కోరిక నెరవేరలేదు. ప్రాప్తమును దాటలేమనుటకు పై రెండు కథల నుదాహరించిరి. కర్మ అ చేతనము కనుక దానికి స్వతంత్రముగా ఫలము నిచ్చు శక్తిలేదు. చేతనుడు చేయు కర్మలకు సాక్షియై పరమాత్ముడే కర్మఫలము నిచ్చును. అందుచేత అయ్యగారు 'కలిమి లేములకు కారణంబు నీవే' అని రామునితో విశేషించి చెప్పిరి.

152. కీరవాణి = ఆది

ప॥ కలిగియుంటే కదా కల్గును- కామిత ఫలదాయక కలిగి॥

అ॥ కలిని ఇంగిత మెరుంగక నిన్నాడుకొంటి- చలము సేయక నాతలను చక్కని వ్రాత కలిగి॥

చ॥ భాగవతాగ్రేసరులగు నారద- ప్రహ్లాద పరాశర రామదాసులు
బాగుగ శ్రీరఘు రామ! నీ పదముల- భక్తి జేసిన రీతి త్యాగరాజున కిపుడు కలిగి॥

తాత్పర్యము :

కామిత ఫలదాయక = కోరిన ఫలము లిచ్చేరామా! నా తల వ్రాత సరిగా కలిగి ఉంటే కదా నాకు సత్ఫలితం కలిగేది ? ఈ ఇంగితము తెలియక రామా! నిన్ను ఆడుకొన్నాను (నిందించినాను) శాశ్వతుడైన నారదుడు, కృతయుగపు ప్రహ్లాదుడు, ద్వాపరపు పరాశరుడు, కలిలో రామదాసు వీరందరు నీ పదభక్తి బాగా అబ్బిన భాగ్య శాలురు. వారి తలవ్రాత బాగుగ నున్నది. అట్టి తల వ్రాత నాకు కలిగి ఉంటే కదా! అని అయ్యగారి పరితాపము.

విశేషము = నారదుడు పరిపూర్ణ భగవదను గ్రహము కలవాడు. నారదుడు పూర్వకల్పములో ఒకదాసీ పుత్రుడు. తిండికి లేనివాడు. తల్లి వదలి వేసినది. బాల్యంలో

ఋష్యాశ్రమ ప్రాంతములు తిరుగుచు వారు చేయు బ్రహ్మవాదములు వింటూ వారు తాము భుజింపగా మిగిలిన దింత పెట్టితే కడుపు మాత్రం నింపు కుంటూ వారిసేవ చేస్తూ గడిపినాడు. ఇట్లు పెక్కు కాలముండి అడవిలో దేహము వదలినాడు. శ్రీమన్నారాయణు డాజీవియందు అనుగ్రహముతో మరల కల్ప ప్రారంభము వరకు వాని ఆత్మను తన కడుపున నుంచుకొని కల్పారంభమున వానిని దేవర్షిగా సృష్టించినాడు. భగవదను గ్రహముచేతనే దివ్యజ్ఞానము, నారాయణ స్మరణానందము గలిగి త్రిలోక సంచారియై ప్రహ్లాదునకు గురువై వాల్మీకికి వ్యాసునకు స్ఫూర్తి నిచ్చిన వాడై రామాయణ భాగవత రచనములకు దారి జూపిన వాడయ్యెను. ఇక ప్రహ్లాదుని సంగతి అందరెరిగినదే. పరాశరుడు ఋషి శ్రేష్ఠుడై విష్ణుపురాణమును రచించి విష్ణు భక్తి స్థాపకుడైనాడు. అష్టాదశపురాణములను, బ్రహ్మసూత్రములను రచించిన వ్యాసునకు తండ్రి అయ్యెను. జగ త్ప్రసిద్ధమైన వ్యాసభాగవతమునకు పరాశరుని విష్ణు పురాణమే మూలము. పైన పేర్కొన్న వారందరును మహాభగవద్భక్తులై భగదను గ్రహ పాత్రులై వన్నెకు వాసికి, ఎక్కిన వారు. కలియుగంలో రామదాసు రామునకు సర్వస్వమర్పించి రామాను గ్రహముచేత ఋణ విముక్తుడై బంధమును భవబంధమును బాసినవాడు. వీరి కున్న తలవ్రాత తనకుంటేనే కదా! వారి రీతిలో తనకు భగవదను గ్రహము కల్గుట అని అయ్యగారి భావము.

153. కుంతలవరాళి = దేశాది

ప॥ కలినరులకు మహిమలు – తెలిపేమి। ఫలమనలేదా ॥ కలి॥

అ॥ ఇలను వెలయు వరవృషరాజుల కటు – కులరుచి తెలియు చందముగానీ కలి॥

చ। దారసుతులకై ధనములకై యూరు – పేరులకై బహు పెద్ద తనముకై
సారెకు భక్త వేషము గొను వారికి – తారకనామ శ్రీత్యాగరాజార్చిత కలి॥

తాత్పర్యము :

కలిమానవులకు భగవంతుని మహిమలు తెలిపి ఫలమేమియు లేదు అని పెద్దలమాట కదా! వృషరాజులకు = ఆ బోతులకు అటుకుల రుచి తెలియదందురు కదా ! కుటుంబ పోషణమునకై ధనము కొరకు, పేరు ప్రఖ్యాతులకై గ్రామంలో పెద్ద అనిపించుకొనుటకై భక్తుల వేషం వెయ్యవచ్చును కాని భగవన్నామ రుచి ఈ కలినరులకు తెలిపినా తెలియదు అంటారు త్యాగరాజుగారు.

విశేషము = వృషరాజులు అంటే అటుకులు దంచే కొయ్యరోళ్లు అని ఎక్కడా అర్థములేదు. ఆబోతులు అని అర్థము. ' ఆబోతు కేమి తెలుసు ? అటుకుల రుచి' అనే ప్రసిద్ధమైన సామెత ఉండగా రోళ్లు అనే అర్థమును కల్పించుట తప్పుకదా! మరియును కలినరులకుపమానంగా ఆబోతులను చెప్పినా రయ్యగారు. ఆ సారస్యం చెడగొట్ట బడినది తప్పు అర్థములో.

154. పూర్ణలలిత = ఆది

ప॥ కలుగునా పదనీరజసేవ – గంధవాహ తనయ॥ కలు॥

అ॥ పలుమారు జూచుచు బ్రహ్మానందుడై – పరగే భక్తా గ్రేసరతనకు కలు॥

చ॥ వేకువ జామున నీకరమున నిడి – శ్రీ కాంతు డమృత స్నానము జేసి
పాకములను శ్రీరంగేశుని క–ర్పణము జేసి తాసీ
తాకరములచే భుజించి నిను సా–త్విక పురాణ పఠనము సేయుమనే
సాకేతపతిని సర్వాధారుని – ప్రాకటముగ త్యాగరాజనుతుని కన కలు॥

తాత్పర్యము :

అయ్యగారు హనుమంతుని పిలిచి నీరామసేవాభాగ్యము నాకు కలుగునా అని అడుగుచున్నారు. తనివి దీరగా పలుమారు రాముని చూచుచు బ్రహ్మానంద మనుభవించే ఓ గంధ వాహతనయ = వాయుపుత్రా ! ఉషఃకాలమందు శ్రీరాముడు తన పాదములను నీ చేతుల యందుంచి అమృత స్నానము చేసి తన కులదైవమయిన శ్రీరంగ నాధునకు షడ్రసోపేతములయిన నైవేద్యము లారగింపు పెట్టి పిదప సీత వడ్డింపగా తానారగించి నిన్ను పిలిచి హనుమా! నీ సాత్త్విక పురాణము చేయుమని ఆజ్ఞాపించి వినుచు ఆనందించే ఆ సాకేతపతి (అయోధ్యాపతి) యొక్క పాద పద్మముల సేవ నీవలె నాకు కలుగునా అని అయ్యగారు హనుమంతుని ప్రశ్నించినారు. అనగా భంగ్యంతరముగా ఆసేవ నాకు కలుగ జేయుమని హనుమను ప్రార్థించుటయే.

విశేషము = పురాణములు పదునెనిమిది. ఇవి వ్యాసుడు చేసినట్లు ప్రతీతి కాని అంతకు పూర్వము కూడ కొన్ని యున్నవి. పద్మపురాణ కర్త వసిష్ఠుడు. ఈ పురాణ సముచ్చయములో పూర్వ ఋషులే సాత్త్వికపురాణము లని, రాజస పురాణములని, తామస పురాణములని విభజించిరి. ప్రధానముగా సాత్త్విక దేవుడని ప్రసిద్ధి వహించిన

విష్ణుదేవుని ప్రభావమును చెప్పెడివి సాత్త్విక పురాణములుగా పేర్కొన బడినవి. శ్రీరాముడు హనుమ నుండి వినగోరినవివి అని త్యాగయ్యగారి ఊహ. మాత్స్య పురాణ వచనము. శ్లో॥ 'అగ్నే శ్శివస్య మాహాత్మ్యం। తామసేషు ప్రకీర్త్యతే। రాజసేషుచ మాహాత్మ్య। మధికం బ్రహ్మణో విధుః। సాత్త్వికేష్వథ కల్పేషు। మాహాత్మ్య మధికం హరేః॥ తేష్వేవ యోగ సంసిద్ధాః గమిష్యంతి పరాంగ తిం॥' = కల్పములు తామసకల్పములని, రాజసకల్పములని, సాత్త్విక కల్పములని విభజింప బడినవి. తామసకల్పములలో చెప్పబడిన పురాణములలో అగ్ని దేవుని యొక్కయు శివుని యొక్కయు మహిమ కీర్తింప బడుచున్నది. రాజస కల్పములలో చెప్పబడిన పురాణములలో బ్రహ్మమహిమ చెప్ప బడుచున్నది. సాత్త్విక కల్పములయందు చెప్పబడిన పురాణములలో విష్ణు మహిమ చెప్పబడుచున్నది. యోగసిద్ధులగు వారు సాత్త్వికముల యుందు ఉత్తమ గతిని పొందుదురని' చెప్పబడినది.

155. అరాణ = ఆది

ప॥ కట్టు జేసినావు రామబందు॥ కట్టు॥

అ॥ మట్టుమితము లేనట్టి దేవతా – మతములలో జొరబడుదామంటే కట్టు॥

చ॥ మామతములను లలాటమున పితా–మహుడు వ్రాయలేదనుచును మరి మరి॥
కామమదములకు హితవనుచు ని–ష్కామ త్యాగరాజుకు దోచే॥ కట్టు॥

తాత్పర్యము :

అయ్యగారి కృతిలో తన అనన్యభక్తిని చమత్కారముగా రామునకు తెలుపు కుంటున్నారు. రామా! నన్ను కట్టు చేశావు గదా! ఎటూ పోకుండా బందుకట్టు చేశావు. (నీకరుణ ఒక పట్టాన కలుగుటలేదు) ఇతరదేవతల మతాలలో జొరబడదామా అంటే వాటికి మట్టు = ఆధారములేదు, మితము = పరిమితిలేదు. అదియును కాక ఆమతములన్నీ కామ్యమతములు. మదము కలిగించేవి. నా మార్గము నిష్కామ మార్గము. నా మార్గమునకు ఇతర దేవతా మతములకు లంకె కుదురుటలేదు. ఈ విధముగా బందుకట్టుజేసినావు రామా!అని నివేదనము

విశేషము = రాముడు తన అవతారమందు 'సకృదేవ' = 'ఒక్క పరినాశరణాగతి చేస్తే ఎవనికైనా అభయమిచ్చెదనని' కృష్ణావతారమున 'క్షీణేపుణ్యేమర్త్యలోకం విశంతి' = ఇంద్రాదుల నర్చించి ఆలోకముల కేగి పుణ్యక్షయముచే క్రిందకు వచ్చుచున్నారు. 'తద్ధామ

పరమంమమ' = అన్ని భూతములు అన్ని లోకములు అందరును నశించిన పిదప నశింపక యుండు గొప్ప స్థానము నాది. 'యాంతి మద్యాజినోపిమాం' నన్ను భజించినవారే నా స్థానమును చేరుదురు'. అని ఇట్టి వాక్యము లెన్నో గీతయందు చెప్పుట జరిగినది. ఇదియే బందుకట్టు చేయుట. అవతార భేదము నయ్యగారు భేదముగా పాటించలేదు.

156. తోడి = ఆది

ప॥ కద్దనువారికి కద్దు – కద్దని మొరలనిడు
పెద్దలమాట నేడ – బద్ద మౌనో॥ కద్దను॥

అ॥ అద్దంపు చెక్కిళ్లచే – ముద్దుగారు మోము జూడ
బుద్ధి గల్గినట్టిమా – వద్ద రావ దేమిరా॥ కద్దను॥

చ॥ నిద్దుర నిరాకరించి – ముద్దుగా తంబుర బట్టి
శుద్ధమైన మనసుతో – సుస్వరముతో
పద్దు తప్పకభజియించే – భక్తపాలనముజేయు
తద్దయాశాలివి నీవే – త్యాగరాజ సన్నుత ॥ కద్దను॥

తాత్పర్యము :

కద్దను వారికి కద్దు. భగవంతుడు గలడని విశ్వసించు వారికి కలడు. కలడని చెప్పిన అనుభవజ్ఞుల మాటలూరకేపోవు. ఆ మాటలను విశ్వసించి నిన్నుపాసించుచున్నాను. అద్దమువలె తళతళలాడు చెక్కిళ్లతో ముద్దులుకులికే నీ ముఖము చూడవలెనని నేనువ్విళ్లూరుచున్నాను. కాని, నీవు నావద్దకు రాకున్నావు. నేను గానవిద్యతో నిన్ను ఉపాసించే మార్గమెన్నుకున్నాను. చాలా నియమము లేర్పరచుకొన్నాను. నిద్దురలేకుండా చక్కగా తంబురపట్టి శుద్ధమయిన మనస్సుతో సుస్వరముతో నిన్ను నియమము తప్పక నిన్నుపాడుకొంటున్నాను. ఇట్లు భజించే భక్తులను నీవు పాలించెదవు అని పెద్దలు చెప్పు మాటలను విశ్వసించి నిన్ను పాసించుచున్నానని తాత్పర్యము.

విశేషము = భగవంతుడుండెనా? లేడా? అను ప్రశ్నకు ఉపనిషత్తు ఇట్లు చెప్పినది. ''అసన్నేవ సభవతి। అసద్బ్రహ్మేతి వేదచేత్ అస్తి బ్రహ్మేతి చేద్వేద। సంతమేనంతతో విదుః'' = బ్రహ్మము = భగవంతుడు లేడనువాడు తానే లేనివాడగుచున్నాడు. భగవంతుడున్నాడని తెలుసుకొన్నవాడు ఉన్నవాడగుచున్నాడు అని. ''నిద్దురనిరాకరించి'' అంటే అజ్ఞానమును తొలగించుకొని అని అంతరార్థము.

157. సావేరి = ఆది

ప॥ కన్నతల్లి నీవు నా పాలిగలుగ – గాసిజెంద నేలనమ్మ ॥ కన్న ॥

అ॥ వెన్నయుండనేతి కెవరైన – వెసనబడుదురా త్రిపుర సుందరి ॥ కన్న ॥

చ॥ ఎల్లవారి ధనము లశ్వములు మరి – ఎక్కువైన గట్టి మిద్దెలన్నియు
కల్లగాని కన్నవారలు – గాంచు సుఖము కల్ల యనుచును
ఉల్లమునను బాగ తెలుసుకొంటిని – ఊరకే ధనిక సంభాషణమునే
నొల్లమాయలని దెలిసి రజ్జుపై – ఉరగబుద్ధి జెందనేల నమ్మానను ॥ కన్న ॥

2. పలుకు మంచిగాని బాంధవులు మరి – బావమరది లక్క లన్నదమ్ములు ॥
కలిమి జూచువారు లేమిని – కనుల గానరారు అనుచును ॥
దలచుకొన్న వెనుక వారి మాయల – దగుల జాలనమ్మామరు మరీచి
కలను జూచి నీరని భ్రమసి – కందురా? ఆదిపురవిహారిణీ నను ॥ కన్న ॥

3. కనక భూషణములు బెట్టి మరియు – సొగసు జేసిపాలుబోసిపెంచిన
తనువు సతముగాదు. నిర్మల – తన మించుకలేదు అనుచును
అనుదిన మొనరించు సత్క్రియలనీ – కని పలికిన త్యాగరాజ రక్షకి
వినుమన్నిట నీవనెరిగి వేల్పుల – వేరని యెంచుదురా త్రిపురసుందరి నను ॥

కన్న॥

తాత్పర్యము :

ఇది తిరువత్తియూర్ అనబడే ఆదిపురమునందున్న త్రిపురసుందరీ దేవిని ప్రార్థించుకృతి. ఓ తల్లీ! కన్నతల్లివినీవు నాపాల ఉండగా నాకేమి భయమమ్మా! (లేదని) వెన్న ఉండగా నేతికోసం ఎవరయినా బాధపడుదురా? (పడరని) (వెన్న ఉంటే వెన్నగానూ ఉపయోగపడుతుంది. దానిని కాచితే నెయ్యి అవుతుంది. నెయ్యి ఉంటే వెన్నకాదు) అట్లే సమస్త ఫలములనిచ్చే కన్నతల్లివి నీవుండగా నాకులోపములేదని. ఐహికములైన సమస్తసంపదలు కల్ల. అని తెలుసుకొన్నాను. నేను త్రాడును చూచి పామను భ్రాంతిపడను. దేహ బంధువు లందరును సంపద ఉన్నప్పుడే దగ్గర చేరుతారు. లేకపోతే కనపడరు. ఇది తెలుసుకున్నాను. ఇక వారి మాయలకు చిక్కను. ఎండమావులను చూచి నీరని భ్రమించను. ఎంతపోషించినా ఎంత అలంకరించినా ఈ దేహము శాశ్వతముకాదు. నిర్మలము కాదు. (మాంసం కొవ్వు మొదలయిన అసహ్యపదార్థములతో గూడినదని) తెలుసుకొని నేను చేసే సత్కర్మలను నీ కర్పిస్తున్నాను. సమస్తము నీవు నిండియున్నావని

తెలుసుకొన్నాను. సమస్తము నీవయినప్పుడు దేవతా భేద బుద్ధి కూడ నాకు లేదు. అని అయ్యగారు దేవి సన్నిధిలో విన్నవించు కొన్నారు.

విశేషము = ఈ కృతిలో శంకరా చార్యుల వారు సూచించిన సాధక చతుష్టము యొక్క స్ఫూర్తి ఉన్నది. 1 నిత్యా నిత్య వస్తు వివేకము 2 ఇహాముత్ర ఫల వైరాగ్యము. 3 శమ దమములు. 4 ముముక్షుత్వము. ఇవి సాధన చతుష్టయము. మరియు వేదాంత పరిభాషలో 'రజ్జు సర్ప భ్రాంతి' అని ఒకటున్నది అనగా త్రాడును చూచి పాము అని భ్రమ పడుట. అసత్యము అనిత్యము అగు సంసారమునందు నిత్య సత్య భ్రాంతిని రజ్జుసర్ప భ్రాంతిగా వేదాంతులు చెప్పుదురు. ఈ భ్రాంతి తొలగితే మోక్షమని, అయ్యగారు ఈ భ్రాంతి తనకు లేదని చెప్పినారు.

158. దేవమనోహరి = ఆది

ప॥ కన్న తండ్రినాపై – కరుణ మానకే ॥ కన్న॥

అ॥ నిన్న జేయుపనులు నేడుగాకవే–రెన్న లేదనుచు. వేమారులకు ॥ కన్న॥

చ॥ ఎదురు తాననే ఇంగితం బెరింగి – చెదరనీక పంచేంద్రియ మణచిన్ఓ
వదలలేని ధైర్యశాలి కాదని – మదన కోటిరూప – త్యాగరాజనుత॥ కన్న॥

తాత్పర్యము :

ఓకన్న తండ్రీ! రామా! నాపై కరుణ జూపుట మానవద్దు. ఈ త్యాగరాజు నిన్న చేసే పనులే ఈ రోజు చేస్తున్నాడు. వేరేమి లేదు. (వీని ఆధ్యాత్మిక ప్రవృత్తిలో మార్పులేదని) భావించి నన్ను కరుణ జూచేది మానకు. సమస్తమును తానుగా భావించి, తక్ చక్షు శ్రోత్ర జిహ్వాఘ్రాణములు = చర్మము, కన్ను , చెవి, నాల్క, ముక్కు అనే అయిదింద్రియముల బలమును అణచి, నిన్ను (రాముని) విడచి ఒక్కక్షణమయినా ఉండలేననే భావము కలిగిన ధీరుడు కాడు వీడు, అని భావించి నాపై కరుణ జూపుట మానకు అని అయ్యగారి ఆర్తనివేదనము.

విశేషము = 'ఆత్మవ త్సర్వ భూతాని। యః పశ్యతి సపశ్యతి = ఆత్మ వలెనే సర్వ భూతములను జూచువాడు పండితుడు అని. ఆ పాండిత్యము తనకున్నదని అయ్యగారు చెప్పుచున్నారు. మరియు అయి దింద్రియములు ప్రాకృత విషయములకు ఆకర్షింప బడును. అట్లు పోనీక వాటి బలమును అరికట్టి రాముని యందే ఏకాగ్రము చేయుట.

ఇది తనకు కలదని చెప్పుచున్నారయ్యగారు. శ్రవణ కీర్తనాదులు నవవిధ భక్తులుగా చెప్పబడినవి. అవికాక తాను పూజించుట, ఇతరులను భగవత్పూజకు ప్రోత్సహించుట మొదలయిన అష్టలక్షణములను అష్ట విధములుగా చెప్పిరి. వాటిలో 'యచ్చమాం నో పజీవతి' = భగవంతుని స్మరణము లేక ఒక్క క్షణమైనను తాను జీవింప లేనను భావ మొకటున్నది. 'నిఁ వదల లేని ధైర్య శాలి కాదని' అనిన మాటలో ఈ భక్తి యున్నది.

159. సావేరి = చాపు

ప॥ కర్మమే బలవంతమాయ తల్లి – కాయారోహణ జాయ॥ కర్మ॥

అ॥ నిర్మల మగు నాగపురమున నెలకొన్న – నీలాయతాక్షి ! సకలలోక సాక్షి!॥ కర్మ॥

చ॥ ధరను ధనికుల గోరినానా–పరితాపముల్ దీర్పలేరెరి యని
సరుగున నే బయలు దేరి వచ్చి – పరమ పావని ! నీ సన్నిధి చేరినానా॥ కర్మ॥

2 వారిధి మది గర్వించి ఈ – వసుధకు తా రానెంచి నిన్ను
సారెకు గని తలవంచి యుండు – ధీరతనము గల్గునిను బొడ గాంచినా॥ కర్మ॥

3 కాసాసలేని నామదినీ – కరుణే ధనమని వల్కి నిం
డాసతో వచ్చిసన్నిధికి నిజ –దాసుడైన త్యాగరాజునికి కర్మ॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు ఒకసారి యాత్రలకు బయలు దేరి నాగపట్నం లోనున్న నీలాయతాక్షీదేవిని దర్శించుటకు వెళ్లారు. కాని అక్కడేదో బాధ ఎదురయిన దాయనకు. ఓ కాయారోహణ జాయ! = అచ్చట నున్న శివుని పేరు కాయారోహణేశ్వరుడు. ఆయన సతీమణీ! ధనమదాంధులగు వారి నాశ్రయింపక నిర్మలమయిన నీ సన్నిధికి వచ్చినా నా కర్మము నాతోనే ఉన్నదమ్మా! అమ్మా! సముద్ర తీరమున వెలసి యున్నావు. సముద్రము భూమిని ఆక్రమిద్దామని ముందుకు వచ్చి నీ ఆజ్ఞను స్మరించి తలవంచి వెనుకకు మరలి పోవుచున్నది. ఇటువంటి జగచ్ఛాసనమును చేసే ధీరత్వముగల నీ సన్నిధికి వచ్చినా నా కర్మమే బలముగా నిల్చినదమ్మా ! నీకు నిజ దాసుడనమ్మా! అని అయ్యగా రాదేవిని వేడుకొన్నారు.

160. కల్యాణ వసంతము = రూపకము

ప॥ కనులు తాకని పర – కాంతల మన సెటులో రామ॥ కను॥

అ॥ నన బోణులపై నేరమన – నోరేమి రామ॥ కను॥

చ॥ ఘోర భూతపతిని జూచి – దారుకారణ్యసతులు ॥
మేర మీరి భువిని అప – దూరు గల్గ జేసిరే ॥ కను॥

2॥ మదన మోహనానంద – మద చకోరనయన కుంద
రదన చంద్రవదన సుంద – రాంగ త్యాగరాజవినుత॥ కను॥

తాత్పర్యము :

కల్లూరి వీర భద్ర శాస్త్రిగారు దీనికి తాత్పర్యము గాని ప్రతిపదార్థముగాని వ్రాయలేదు. ఎందుచేత వదలి నారో? కాని కృతిలోని తాత్పర్యము గంభీరముగా నున్నది. ఉన్న పదములతో వాక్యము వాక్యార్థము తేలుట లేదు. భావము నావిష్కరించుటకు ప్రయత్నించెదను. కనులు తాకని పరకాంతలు = రాముడు చూడని పరకాంత లన్న మాట. వారి మనస్సు ఎట్లా ఉంటుందో అని ఒక ఉత్సుకతను అయ్యగారు ప్రకటించారు. అనేకమంది పరకాంతలు రాముని సౌందర్యమును విని ఉందురు. అట్టి రాముడు తమ నొక్కసారి చూడ కూడదా? అని కోరిక పడియుందురు. మరి రాముడు పరాంగనా విముఖుడు. కన్నెత్తి కూడ పరకాంతలను చూడడు. అప్పుడు వారి మన స్సెట్లుండునో? ఇట్లా పరకాంతలు రామునిచూపు మనపైబడిన బాగుండునని వారు భావించుట నేరమంటే అది నోరేమి? = నోరు కాదు. అన్నారయ్యగారు. ఎందుచేతనంటే రాముడు పుంసాం మోహన రూపుడని ప్రసిద్ధి కదా ! (మగవారికే మోహము బుట్టించువాడు) అట్టి రాముని పై పరకాంతలు మోహము గొనుట నేరము కాదని త్యాగయ్యగారు 'ననబోణులపై నేరమన నోరేమి?' అనిరి. దీనిని ఒక కథతో సమర్థిస్తున్నారు. ఘోరరూపము కల భూతపతినే = శివునే దారుకావనంలోని స్త్రీలు కామించి రమించి శివుని అపనింద పాలు చేశారు కదా! (కాముని భస్మము చేసిన కీర్తి కల శివుడు దారుకావనంలో స్త్రీలకు వశమైన అపనింద పొందినాడు. దీనికి కారణము దారుకా వనంలోని స్త్రీలు) అయ్యగారు రెండవ చరణమందు స్త్రీలు మోహించుటకు కారణమయిన రాముని సౌందర్యమును వర్ణించినారు. మదన మోహనానంద = మన్మథునకే మోహము బుట్టించు ఆనంద స్వరూపుడా! మదచకోరనయన = మదించిన చకోర పక్షివంటి కన్నులు గలవాడా! (వెన్నెలలు కురియు కనులు కలవాడా! అని) కుందరదన = మల్లె

మొగ్గల పలువరుస గలవాడా! చంద్రవదన = చంద్రుని వంటి ముఖము గలవాడా! అనే సంబోధనముల ద్వారా రాముని సౌందర్యమును వర్ణించిరి. ఇట్టి సౌందర్యము కల నిన్ను పరకాంతలు కోరుట తప్పుకాదని.

161. కల్యాణి = చాపు (ప్రహ్లాద భక్తి విజయములోనిది)

ప॥ కమల భవుడు వెడలె – కనుగొనరే॥ కమల॥

అ॥ విమల హృదయమున – విష్ణుని దలచుచు॥ కమల॥

చ॥ దండము బట్టి కమండలమును బూని – కొండాడు చును కోదండ పాణిని జూడ॥ కమల॥

2 సారెకు హరినామ–సారము గ్రోలుచు–ధీరుడు నీరధి తీరమునకు నేడు॥ కమల॥

3 ఆజానుబాహుడు–అమరేంద్రవినుతుడు–రాజీ వాక్షునిత్యాగ రాజనుతుని చూడ॥ కమల॥

తాత్పర్యము :

ప్రహ్లాదుడు సముద్ర మధ్యమున ధ్యానమహిమతో శ్రీరాముని సాక్షాత్కార మును పొంద నున్నాడు. ఈ దృశ్యమును చూచుటకు కమల భవుడు = బ్రహ్మవెడలి నాడు. నిర్మల హృదయములో విష్ణువును స్మరించుచు, దండకమండలములను చేత బట్టి త్యాగరాజ వినుతుడయిన రాముని చూచుటకు సముద్రతీరమునకు బయలు దేరినాడు బ్రహ్మ.

విశేషము = బ్రహ్మయేకాదు. సమస్త దేవతలు దేవతా జాతులవారు అందరును ఆదృశ్యమును చూడ గోరి సముద్ర మధ్యమున దిగినారు. ఇది త్యాగయ్యగారు కల్పించిన అతిరమణీయమైన సన్నివేశము

162. పరాళి = ఆది

ప॥ కరుణ ఎలాగంటే నీ విధమే – కల్యాణ సుందర రామ క॥

అ॥ పరమాత్ముడు జీవాత్ముడొకడై – పరగుచుండు భక్త పరాధీనుని॥ క॥

చ॥ అనృతం బాడడు అల్పుల వేడడు – సునృపుల గొలువడు సూర్యుని మరువడు క॥

2 మాంసము ముట్టడు మధువానడు పర - హింసల సేయడు ఎరుకను మరువడు క॥

3 మూడీషణముల వాడడు జీవ - న్ముక్తుడై తిరుగు - ముదమును జూపడు॥ క॥

4 వంచన సేయడు పరులతో బొంకడు - చంచల చిత్తుడై సౌఖ్యము విడువడు॥ క॥

5 సాక్షియని తెలిసి యందు-లక్ష్యము విడువడు కం-జాక్షుని త్యాగరాజ రక్షకుడైన వాని॥ క॥

తాత్పర్యము :

ఓ కల్యాణ గుణములు గల సుందర రామా! నీ కరుణ ఎవరిపై ప్రసరిస్తే వాడు పరమాత్ముడు తాను ఒక్కడని భావిస్తాడు. అబద్ధమాడడు. అల్పులను వేడడు. రాజులను కొలువడు. సూర్యుని మరువడు. అనగా త్రికాలముల యందు సంధ్యా వందనమును వదలడు. మద్యమాంసములను ముట్టడు. పరహింస చేయడు. జ్ఞానముతో ఉండును. వంచన జెయ్యడు చంచల చిత్తుడై ఉండడు. అందుచేత భగవంతుని మీదనే మనస్సు లగ్నమై ఆ సుఖం అనుభవిస్తూ ఉంటాడు. భగవంతుడు సర్వ సాక్షి అని తెలుసుకొని ఆ గురిని తప్పడు. త్యాగరాజ రక్షకుడైన రాముని కరుణ యొక్క రూపములు పైన చెప్పినవి. పైన చెప్పిన లక్షణములన్నీ ఈ జన్మమున జీవన్ముక్తిని కలిగించి చివరకు మోక్షము నిచ్చును.

విశేషము = పైన చెప్పిన లక్షణములు భగవద్గీతయందు దైవ సంపద అని చెప్పబడినది. వీటికి వ్యతిరేకములయినవి ఆసుర సంపద అని చెప్పబడినవి. 'దైవీ సంపద్విమోక్షాయ బంధనాయాసురీమతా' - దైవ సంపద మోక్షమును కలిగించును. ఆసుర సంపద సంసార బంధమును కలిగించును అని దైవ గుణములు రాముని కరుణా రూపములు. అని అయ్యగారి సిద్ధాంతము. ఒక అభి యుక్తోక్తి ఉన్నది. ' ఈశ్వరానుగ్రహాదేవ। పుంసామద్వైతవాసనా' = భగదనుగ్రహము వలననే పురుషులకు అద్వైత భావనా పరిమళము కలుగును. అని ఇదియు నట్లే.

163. వాచస్పతి = దేశాది

ప॥ కంట జూడు మీ ఒకసారి క్రీ॥ గంట॥

అ॥ బంటు డై వెలయు బాగుగాని తప్పు - తంట లెల్లమాను కొన్న నన్ను క్రీ॥ గంట॥

చ॥ అలనాడు సౌమిత్రి పాదసేవ - చెలరేగిసేయువేళ సీతతో
పలికి చూచినంత పులకాంకితుడై - పరగిన యటు. త్యాగరాజుని క్రీ॥ గంట॥

తాత్పర్యము :

ఓ రామయ్యా! ఒక్కసారి నన్ను నీ క్రీగంటితో (కటాక్ష దృష్టితో) చూడవయ్యా! నీదాసుడను నేను అని ఉండుట మంచి లక్షణము. ఇది తప్ప నేను ఇతర భావములను మాను కొన్నాను. అలనాడు లక్ష్మణుడు ఉత్సాహముతో నీ పాద సేవ చేస్తూ ఉంటే అతని సేవను మెచ్చుకొనుచు నీవు సీతవైపు చూచినావు. అది చూచి లక్ష్మణుడు పులకించి పరవశించి నాడు. అదేవిధముగా నను కటాక్షించు రామా ! అని ప్రార్థనము.

విశేషము = దాసుడను అను అధ్యవసాయము వైష్ణవమున చాలా ప్రధానమైనది. దాసభూతా స్సృత స్సర్వే। స్యాత్మానః పరమాత్మనః। నాన్యథా లక్షణం తేషాం। బంధే మోక్షే తథైవచ' ఆత్మలన్నియును పరమాత్మునకు దాసులగుట స్వతస్సిద్ధమయిన లక్షణము. ఆత్మలు సంసార బంధమందున్నను అదే లక్షణము, మోక్షమందున్నను అదే లక్షణము' అని శాస్త్రము. అద్వైతమున కూడ దాస్యభావమున్నది. 'దేహ బుద్ధ్యాతు దాసోహం..... ఆత్మబుధ్యాత్వమేవాహం' = దేహబుద్ధితో నేను దాసుడను..... ఆత్మ బుద్ధితో నీవేనేను' అని.

164. ముఖారి = ఆది

ప॥ కారు బారు సేయు వారలు గలరే – నీవలె సాకేత నగరిని॥ కారు॥

అ॥ ఊరివారు దేశజనులు వరమౌను
లుప్పొంగుచు భావుకుల య్యే॥ కారు॥

చ॥ నెలకు మూడు వానల ఖిలవిద్యల – నేర్పుగలిగి దీర్ఘాయువు గలిగి
చలము గర్వరహితులు గాలేదా – సాధుత్యాగరాజవినుత రామ॥ కారు॥

తాత్పర్యము :

ఓరామా! అయోధ్యను నీవలె పరిపాలించిన వారెవరయ్యా! దేశ జనులు మునులు క్షేమము కలిగి యున్నారు నీపాలనలో. నెలకు మూడు వానలు కురిసి సస్యసమృద్ధి కలిగి, జనులు విద్యావంతులుగా దీర్ఘాయుర్దాయముతో కోపము గర్వము లేక ఉన్నారు. అట్టిపాలన నీకన్న ఎవరు చేయుదరయ్యా! చేయరని.

165. కల్యాణి = ఆది

ప॥ కారు వేల్పులు నీకు సరి॥ కారు॥

అ॥ కారుకు జీల కరసంబా – కంతర మైనట్టుగాని॥ కారు॥

చ॥ దివిటికి దీపముల రీతి – కావేటికి కాలువల రీతిగాని ॥ కారు॥

2॥ తమ్మివైరికి తారకల రీతి – కమ్మవిల్తుని కాంతికి – నరుల రీతిగాని ॥ కారు॥

3॥ సాగరానికి సరసురీతి – త్యాగరాజనుత ధరలో రామ నీకు సరి॥ కారు॥

తాత్పర్యము :

ఓ రామా! ఏదేవతలూ నీకు సాటిగారు ! జీల కర్ర సంబా అనే బియ్యానికి కారుబియ్యము సరికాదు! దివిటీకి (కాగడాకు) దీపము సాటికాదు. కావేరీనదికి పిల్లకాలువలు సాటికావు. మన్మధుని అందానికి మానవులు సాటికారు. సముద్రానికి సరస్సులు సాటికావు. అట్లే నీకు ఏదేవతలును సాటిరారు. అని త్యాగయ్య గారు ఉపమానములు చెప్పుచు కొనియాడినారు.

166. శుద్ధ సావేరి = రూపకం

ప॥ కాలహరణ మేలరాహరే .. సీతారామ॥ కాల॥

అ॥ కాల హరణమేల సుగుణ – జాల కరుణాలవాల॥ కాల॥

చ॥ చుట్టి చుట్టి పశు లెల్ల – చెట్టు వెదకు రీతి భువిని ॥
పుట్టగానె నీపదములు – బట్టుకొన్న నన్ను బ్రోవ॥ కాల॥

2 పాడవున యెంతాడు కొన్న – భూమిని త్యాగంబురీతి
కడువేల్పులమిన్ననీవు – గాక యెవరు నను బ్రోవ॥ కాల॥

3 దినదినమును తిరిగి తిరిగి – దిక్కు లేక శరణు జొచ్చి
తనవు ధనము నీవెయంటి – త్యాగరాజ వినుత రామ॥ కాల॥

తాత్పర్యము :

ఓరామా! హరీ ! నన్ను రక్షించటానికి కాలహరణం (జాగు) ఎందుకు చేస్తావయ్యా! నీవు కరుణగలవాడవు. సుగుణములు గలవాడవు. కాలహరణము చెయ్యకూడదు. ఓ రామా! పగలంతా పక్షులు తిరిగి తిరిగి సాయంకాలానికి ఒక చెట్టును ఆశ్రయించినట్లు నేను పుట్టగానే నీపదా లాశ్రయించాను. ఏవేవో పెద్ద పెద్ద కర్మలు చేసి ఎంత పేరు సంపాదించినా త్యాగమే అన్నిటికన్నా గొప్పది. అట్లే అందరి దేవతలలో నీవు మిన్నవు. (గొప్పవాడవు) ఇట్టి నీవు కాక నన్నెవరు రక్షింతురు? నేను ప్రతిదిన మును రక్షించువారిని వెదకుచు తిరిగి తిరిగి ఎక్కడను దిక్కుదొరకక నిన్ను శరణు జొచ్చి నా సర్వమూ నీవే అని ఉన్నాను. ఇట్టి నన్ను బ్రోచుటకు నీవు జాగుసేయ రాదు. అని త్యాగయ్యగారి వేడి కోలు.

విశేషము = చుట్టి చుట్టి (అనేక జన్మలెత్తి) పక్షులు = రెండు రెక్కలు కలవి. మానవుడు కూడ పక్షివంటివాడే. ' ఉభాభ్యా మేవ పక్షాభ్యాం। ఆకాశే పక్షిణాంగతిః। తధేవ కర్మ జ్ఞానా భ్యాం। తధైవ కర్మజ్ఞానాభ్యాం। వాసుదేవోభి పూజ్యతే' = రెండు రెక్కలతో పక్షులు ఆకాశ గమనము చేసినట్లు మానవుడు కర్మ జ్ఞానము అనే రెండు పక్షములతో (రెక్కలతో) భగవ దారాధనము చేస్తున్నాడు. అని శాస్త్రము. ఈ విధముగా జీవుడు పక్షితో పోల్చబడి నాడు. మరియు చుట్టిచుట్టిన పక్షులు చెట్టును చేరుకుంటాయి. చెట్టు అనగా వాసుదేవుడు. వ్యాసమహర్షి ఇట్లన్నాడు. 'వాసుదేవ తరుచ్ఛాయా। నాతి శీతా నఘర్మదా। నరకాంగారశమనీ। సా కిమర్ధంన సేవ్యతే॥= వాసుదేవుడు ఒక పెద్ద చెట్టు దాని నీడ అంత చల్లనిది కాక అంత వేడిది కాక సమశీతోష్ణముగా నుంటుంది. మరియు ఆ నీడ నరకమనే నిప్పును చల్లార్చుతుంది. అట్టి వాసుదేవతరుచ్ఛాయను ఆశ్రయింప రేల?' అని వ్యాస వాక్యము. దీనిని బట్టి భగవంతుడే వృక్షము. అయ్యగారు దాని నాశ్రయించినారు. త్యాగము అన్నిటికన్న మిన్న అని ఉపనిషద్వాక్యము. 'నకర్మణా నప్రజయా ధనేన! త్యాగేనైకే అమృతత్వమానశుః' = కర్మాచరణము వలన కాదు. ఎక్కువ మంది జనము తన నాశ్రయించి నందువలన కాదు. ఎక్కువ ధనమున్నందు వలన కాదు. కొందరు త్యాగము వలననే ముక్తిని పొందుదురు' అని. దీని వలన త్యాగము ముక్తినిచ్చును కనుక ఇది అన్నిటికన్న మిన్న. అట్లే రాముడు వేల్పులలో మిన్న అని. త్యాగమనగా కర్మత్యాగము కావచ్చును. కర్మఫలత్యాగము

కావచ్చును. ఈ కృతిలో అయ్యగారు 'శరణుజొచ్చి' అని చెప్పారు. 'త్యాగము' యొక్క ప్రసక్తి తెచ్చినారు. ఈ రెండిటిని సమన్వయం చేస్తే సర్వ ధర్మ పరిత్యాగ పూర్వక శరణాగతి (గీతలో చెప్పబడినది) స్ఫురించుచున్నది. అయ్యగారవలంబించిన దిది. తనువు ధనము అయ్యగారికి రాముడే. తనువు ఆత్మకు ఆధారము, తనువును పోషించునది ధనము. ఈ రెండును నీవే అని భావించిన నన్ను రక్షించుటకు కాలహరణము చేయరాదు అని అయ్యగారి ప్రార్థనము.

167. గొలేపంతు = ఆది

ప॥ కాసి చ్చేదే గొప్ప యగురా – కలిలో రాజులకు ॥ కాసి॥

అ॥ హరి ॥ దాసులు సేవింప రనుచు ప్రభువులు– దయమానిరి పరమెంచక పోయిరి॥ కాసి॥

చ॥ రాజాంగము కొరకు నాల్గు జాతుల – రక్షణ పరసుఖమో
రాజసులై సన్మార్గమెరుగక ప– రాకు సేయ ఘనమో
ఆజన్మము కొలిచే విప్రవరుల – కానందము గలదో త్యాగ
రాజివినుత నీమాయ గానినీ– రజనయన సుజనాఘ వివోచన॥ కాసి॥

తాత్పర్యము :

ఈ కలియుగంలో రాజులు ఒక్క పైసదానం చేసి అదే గొప్ప దానమని భావిస్తారు. హరిభక్తులు తమను ఆశ్రయింపరని దయలేక ప్రవర్తిస్తారు. హరి భక్తులను ద్వేషిస్తే పరలోకం ఉండదు అని తలపరు. రాజులు రాజ్యాంగములలో ఒకటి అయిన ప్రజా సమూహమును రక్షించుట పరలోక సుఖమా? కాదని. రాజసగుణముతో సన్మార్గ మేదో తెలియక పరాకుపడి ఉండుట గొప్పతనమా? కాదని. అటువంటి రాజులను జీవితాంతము కొలిచే బ్రాహ్మణులకు ఆనంద మున్నదా? లేదని.

విశేషము = కలిలో రాజులు దానశీలురు కాదు. ఏదో పేరుకోసం పైస ఇచ్చి గొప్పగా భావిస్తారు. 'శ్రద్ధయాదేయం అశ్రద్ధ యాఽ దేయం హ్రియా దేయం భియా దేయం' = శ్రద్ధతో దానం చేయాలి, అశ్రద్ధతో చేయకూడదు. సిగ్గుపడుచు దానం చేయలి. (తానిచ్చేది తక్కువ అయిన దేమోనని) భయంతో దానం చేయాలి'. అని వేదము చెప్పినది. కలిలో రాజులు చేసేదానం వేదవాక్యము నకు వ్యతిరేకముగా నున్నది. రాజ్యసప్తాంగములలో

నున్న ప్రకృతిని (ప్రజలను) పాలించుట వలన పరసుఖమా (మోక్షమా?) కాదు, కాకాపోగా 'రాజ్యాంతే నరకం ధ్రువం = రాజ్యపాలనం అయిన తరువాత నరకము. అని శాస్త్రము. కనుక అది పర సుఖము కాదు. రాజులకయినా హరిభక్తులపై తమనాశ్రయించ లేదన్న ద్వేషము పెంచుకొనుట చేత సద్గతి లేదు. భాగవతులపై ద్వేషముండుట 'అసహ్య పచారము' అనబడినది. అనగా క్షమింపరానిది అని అర్థము. ఇక విప్రులు నీచులయిన ప్రభువులనాశ్రయించి బ్రహ్మానందానికి దూరులగుచున్నారు. అని రాముని సన్నిధిలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

168. దేవమనోహరి = రూపక

ప॥ కుల బిరుదును బ్రోచుకొమ్ము రమ్ము॥ కుల॥

అ॥ ఇలగల భూదేవసురా-దుల కాధారుండవు॥ కుల॥

చ॥ నిగమాగమచర నీకు-నిత్య మంగళము కల్గు॥
వగసేయకు శ్రీరామ-వందిత త్యాగరాజ॥ కుల॥

తాత్పర్యము :

నీ కులబిరుదును రక్షించుకో. రావయ్యా! నీవంశ మూలపురుషుడయిన ఇక్ష్వాకువు నుంచి నీవరకు 'శరణాగత వత్సల' = 'శరణాగతులను దోషము లెంచక రక్షించువారు' అను బిరుదున్నది. దానిని రక్షించుకో. భూమండలంలోనున్న సమస్త జీవులకు ఆధారమయినవాడవు. వేదములు శాస్త్రములు నీకు విహార భూములు. అట్టి నీవు నీ కులబిరుదును రక్షించుకోవటానికైనా నన్ను రక్షించు. అని ధ్వని. నన్నురక్షిస్తే నీకు నిత్యమంగళము. అని మంగళాశాసనము.

169. నాటకురంజి = ఆది (దివ్యనామము)

ప॥ కువలయ దళనయనా-బ్రోవవే
కుందకుట్మల రదనా...। కువలయ॥

చ॥ మమత పెంచినీదు, పైన-మరులుకొన్న నేనెందు, బోదు॥ కువలయ॥

2 కమనీయాననమును-దలచినే - కరగి నిల్వ జూడ వేటిగుణము॥ కువలయ॥

3 మనసు దెలిసి నీవు, నన్ను-మరచి మరవనట్లున్నావు॥ కువలయ॥

4 మహిలో కలిభయమా, రావు-మహిమ లేని దైవమా? నీవు॥ కువలయ॥

5 దేవశిరోమణి, నీవనుచు-ఏవేళ మది బాడుకొంటి ... కువలయ॥

6 అన్యమతము లెరుగ, శ్రీరా-జన్య! భజన జేసితి మదికరగ. కువలయ॥

7 నేను భువిని మాని, నీవు ఘృణా-హీనుడనుచు పేరురాదో యని॥ కువలయ॥

8 బుద్ధి నొసగి త్యాగ, రాజుని-వద్ద నిలచి పూజగొనుము బాగ॥ కువలయ॥

తాత్పర్యము :

కలువరేకులవంటి కనులు గలరామా! మల్లెమొగ్గలవంటి దంతములు గల రామా నన్ను రక్షించు. నీమీద మమకారాన్ని వ్యామోహమును పెంచుకొన్న నే నిప్పుడు నిన్ను వదలి వేరే ఎక్కడకు పోవుదును? పోవను. నీ అందమైన ముఖమును తలచి మనసుగరగి నిశ్చేష్టితుడనై నీ ఎదుట నిలచి ఉన్నావు. నన్ను నీవు చూడకున్నావు. ఇది గుణమా? నామనసు తెలిసి తెలియనట్లున్నాను. నీవు నావద్దకు రాకున్నావు. త్రేతాయుగపువాడవు నీవు కనుక ఈ కలిని జూచి భయపడుచున్నావా? అట్లు కాకూడదు. నీవు కలిని హరించే మహిమ కలిగిన దేవుడవు కదా! దేవతలలో నీవు శిరోమణివని ఏ రోజును నిన్ను పాడుకొంటున్నాను. ఓ శ్రీరాజన్యా! = లక్ష్మీపతీ! నేను ఇతర దేవతామతములలో ప్రవేశించక నిన్నే మనసు కరగునట్లు భజిస్తున్నాను. ఇట్లు నేను నిన్ను భజించుట చేత నాకు మానముగలవాడు (అభిమానము) అని పేరువస్తుంది. నీవు నా కోరిక తీర్చకుంటే నీకు కరుణాహీనుడనే పేరురాదా? వస్తుంది. కనుక నన్ను రక్షించు. నాకు (నిన్ను వదలని) సద్బుద్ధి నిచ్చి నావద్దనిలచి నా పూజలను గ్రహించుము. అని ప్రార్థనము.

170. ఛాయాతరంగిణి = ఆది

ప॥ కృప జూచుటకు వేళరా రామ ॥ ॥ కృప ॥

అ॥ అపరాధములనోర్వవశమా - అనబోకవెసరివారలలో ॥ ॥ కృప ॥

చ॥ పరమార్థమౌమార్గ మెరుగరు - ప్రభువులెల్ల నీచసేవకులు రా
పరలోకభయమెంతగా నరు - వరత్యాగరాజ హృత్సదన ॥ ॥ కృప ॥

తాత్పర్యము :

రామా ! నా మీద కృప జూపటానికి ఇదే సమయము. ఓ త్యాగరాజూ! నీ అపరాధములు క్షమింపరానివి అనబోకు. పాలించే ప్రభువులు పరమార్థ చింతలేని వారుగానున్నారు. ప్రభువులు అల్పులను చేతిలోబెట్టుకొని, తుదుకు వారిని ఆశ్రయించి పాలన సాగిస్తున్నారు. పరలోకభయములేని నాస్తికులుగానున్నారు. కనుక నీకృప చూపుసమయమిదే అని అయ్యగారి నివేదనము.

విశేషము = అయ్యగారు తనపై కృప. జూపమని ప్రభువుల ధర్మలోపమును చెప్పి తనపై కృపజూపమన్నారు. దీని అంతరార్థమేమనగా? ''యథా రాజా తథా ప్రజాః'' = రాజెట్లుండునో ప్రజలట్లుందురని శాస్త్రము. ప్రభువులు ప్రస్తుతము పరమార్థదూరులై (రామభక్తిహీనులై) ఉన్నారు. ప్రజలందరును అట్లే యుందురుకదా! త్యాగయ్యగారి ఆకాంక్ష జనులందరూ రామభక్తులైతే వారి చెలిమి పెంచుకొని అత్యంతానందము పొందుదామని. కనుక రాముడు తనపై కృప చూపితే తన ఆకాంక్ష నెరవేరుట ద్వారా ప్రభువులు కూడా భక్తిమార్గంలో పయనిస్తారని త్యాగయ్య గారి ఆకాంక్ష. అప్పుడు ''అంతారామమయం'' అని ఆనందింపవచ్చునని త్యాగయ్య గారి ఆశాసనపూర్వక అభ్యర్థన.

171. నాద వరాంగిణి = ఆది

ప॥ కృపాల వాల కళాధర శేఖర
కృతాభివందన శ్రీరామ॥ కృపా॥

అ॥ నృపోత్తమా శర-ణాగత జనాఘ
నివారణాబ్జ హితాన్వయ శశాంక॥ కృపా॥

చ॥ అప వర్గఫల కాములను జూచి అడ్డమై
అణిమాది సిద్ధుల మోసపుచ్చె దరయ్యా
సుపవిత్ర రూప సదా కరుణ జూడు
సురపాలక త్యాగరాజ నుత॥ కృపా॥

తాత్పర్యము :

కృపకు పాదు అయినవాడా! శివునిచే అభివందన మందుకొనువాడా! శ్రీరామా! రాజోత్తమా! శరణు జొచ్చిన వారి పాపములు పోగొట్టువాడా! సూర్య వంశము నందు

చంద్రుడా! మోక్షాభిలాషము కలవారిని చూచి దానికి అడ్డమై కుతంత్రములను చూపి కొందరు వారిని మోస పుచ్చుచున్నారయ్యా! పవిత్ర మగు రూపము గలరామా? ముముక్షువులను వారి మోసము పాలు కానీయక కరుణ చూచి రక్షింపవయ్యా? అని అయ్యగారి ప్రార్థనము.

172. పున్నాగవరాళి = చాపు (నౌకా చరితము)

ప॥ కృష్ణా! మాకేమి దోవ బల్కు
కీర్తి గల్గును బాలభావ॥ కృష్ణా॥

చ॥ సరిగె రవికెలెల్ల బోయె, వెర్రి – చలికిమే మోర్వనాయె శ్రీ॥ కృష్ణా॥

2 సరివారిలో సిగ్గు బోయె, నీరు – జాములపై దాకనాయె, శ్రీ॥ కృష్ణా॥

3 సర్వము నేనను కొన్న, నీదు–సామర్థ్యము జూపు బిన్న శ్రీ॥ కృష్ణా॥

4 పాయలేని మమ్ము నీవు, ఏయు – పాయమైన దెల్పి బ్రోవు శ్రీ। కృష్ణా॥

5 మాతో జేరగ ఇంత బాధ, కల్గె – మరతుమా ఇక ప్రాణనాథ, శ్రీ॥ కృష్ణా॥

6 ఇందు కనుచు తల్లి సాకెనో, లేక – ఏ పాపుల కండ్లు తాకెనో, శ్రీ॥ కృష్ణా॥

7 రాకేందుముఖ దయరాదా, త్యాగ – రాజార్చితా బ్రోవరాదా శ్రీ॥ కృష్ణా॥

ఒక సూచన = అయ్యగారు ఈ కృతిని చక్కని అంత్య ప్రాస నియమముతో రచించిరి. చరణము లన్నియు ఆనియమమును పాటించి నడచినవి. అయ్యగారు ఈ నియమమును పల్లవి నుంచే పాటించుట పరిపాటి. కాని వీరభద్ర శాస్త్రి గారు గ్రహించిన ఈ గ్రంధములో పల్లవిలో అది తప్పినది. వ్రాత పొరపాటుగా నేను భావించి ''యాదవబాల'' అని ఉన్న దానిని నేను పరిష్కరించి ''బాలభావ'' అని వ్రాసితిని. సహృదయులు గ్రహింతురని నావిశ్వాసము.

తాత్పర్యము :

గోపికలు, కృష్ణుడు యమునా నదిలో నౌకావిహారం చేస్తున్నారు. గోపికలకు తమ సౌందర్యమునకు కృష్ణుడు వశమైనాడని గర్వము కలుగుతుంది. కృష్ణ సంకల్పము చేత అప్పటికప్పుడు వడగండ్ల వానపడుతుంది. నౌక అల్లల్లాడుతుంది. చిల్లులు కూడ

పడుతుంది. వాటి గుండా నౌకలోకి నీరువస్తుంది. అప్పుడు దిక్కుతోచని గోపికలు ఉపాయము చెప్పమని కృష్ణుని ప్రార్థిస్తారు. కృష్ణా! మాకేది దోవ? పలుకుమయ్యా! నీకు కీర్తి గలుగుతుంది. నీవు చెప్పిన ప్రకారముగా చిల్లులలో పెట్టిన జరీ రవికలు ప్రవాహములో కొట్టుకొని పోయినవి. చలికి ఓర్వలేకున్నాము. నీరు మోకాళ్లవరకును వచ్చినది. ''మీకు సర్వమును నేను'' అని చెప్పుచున్న నీ సామర్థ్యమును వేగముగా చూపుము. నిన్ను ఎడబాయలేని మమ్ము ఉపాయము చెప్పి రక్షించు. ఓ ప్రాణనాథ! మాతో చేరుట చేత నీ కింత బాధ కలిగిన దయ్యో! నీ తల్లి నిన్నిందుకే సాకినదా! ఎవరి కండ్లు నీ మీద పడినవో కదా? నిన్ను మమ్ములను రక్షించవయ్యా! అని గోపికలు కృష్ణుని ప్రార్థించుచున్నారు.

విశేషము = ఆలంకారికులు రస చర్చ చేస్తూ ''ఏకోరసః కరుణ ఏవ''=కరుణ రసమే రసము'' అనిరి. ఇది ఒక పక్షము. ఒక పక్షములో కావ్యమునకు శృంగారరసము ప్రధానమని అందులోనూ వియోగశృంగారము ప్రధానమనిరి. అయ్యగారీ నౌకా చరితములో కరుణ శృంగారములను రెండింటిని సమన్వయించి కడురమ్యముగా రసపోషణ చేసినారు. ఇక నారదభక్తి సూత్రములలో ''గోపికా భక్తి ప్రధానమని చెప్పబడినది. అయ్యగారీ నౌకాచరితమునందు దానికిని స్థానమిచ్చి చరితార్థులైనారు. ఒడలిపై కోకలు లేక నదీ ప్రవాహములో మునిగిపోవుటకు సిద్ధముగ నున్న గోపికలు చేసిన ఒక్క శరణాగతితో యమునా నదిలేదు, నౌకలేదు, గోపికలందరును తమతమ రత్నాంబరములతో ఒడ్డున నుండిరి. ఇది అద్భుత రసము. కనుక నిది నవరస భరిత మని చెప్పవచ్చును. నౌకాచరితము అంటే నౌక యొక్క చరిత్రము అని అభిప్రాయపడువారు కొందరున్నారు. అది కాదు. కృష్ణుడు నౌకయందు ఆచరించిన లీల అని అన్వయించుకొనవలెను.

173. కోకిలధ్వని = ఆది

ప॥ కొనియాడే నాయెడ దయ వెలకు
కొనియాడేవు సుమీ రామ నిను ॥ ॥ కొని ॥

అ॥ అనయమునీ సాగసునుగని పొంగుచు – నంతరమున నతి ప్రేమతో నిను ॥ ॥ కొని ॥

చ॥ వింతవింతమతములలో జొరబడి – వెతజెందగ లేడను నీమనసును
ఇంతతెలిసి త్యాగరాజ సన్నుత – ఏ వేళను నీశుభచరితంబును ॥ ॥ కొని ॥

తాత్పర్యము :

ఓ రామా! నేను నిన్ను కొనియాడుచున్నాను. స్తోత్రముజేయుచున్నాను. ఇట్టి నాపైన దయచూపవలసియున్నది. కాని నీవు నీదయను వెలకు కొనియాడుచున్నావు. (అనగా బేరం జేయుచున్నావని) నీ అందమును చూచి ఉప్పొంగుచు ఎల్లప్పుడు నిన్ను అతి ప్రేమతో నేను కొనియాడుచున్నాను. అనేకములైన వింతవింతమతములున్నాయి. అవి శ్రమ అధికము ఫలమల్పమైన మతములు. అట్టి మతములతో చేరి వీడు శ్రమపడలేడు అని నాయందు జాలితో నీమతమందునన్ను గట్టిగా నిలుపుకొన్న నీ మనస్సెరిగి నేను నిన్ను కొనియాడుచున్నాను. నీవు నా స్తోత్రమునకు నీదయకు వెలకు కొనియాడకుము. (వెలకట్టకుము) అని అయ్యగారి ప్రార్థనము.

విశేషము = కొనియాడుట అనే శబ్దముతో అయ్యగా రొక శబ్దచమత్కృతి చేసినారు. నా స్తోత్రానికి నీ దయకు సరితూచి వెలకట్టవద్దు. నీ మహిమ వాక్కులకు అందనిది. నీ దయవలన మోక్షము అనే మహాఫలము కలుగుతుంది. నేను చేసే స్తోత్రము వలన మోక్షము అనే మహాఫలము కలుగుతుంది. నేను చేసే స్తోత్రము వలన నీ దయకలుగుంది. ఇట్టి పరిస్థితిలో నా స్తోత్రము చాలా తక్కువది. నా మనస్సులోని అతి ప్రేమను నీవు గమనించు. మాటలతో చెప్పలేని ప్రేమ నామనస్సులో నున్నది. కనుక దయ జూపవలసినది అని ప్రార్థనము.

174. తోడి = ఆది

ప॥ కొలువమరెగదా – కోదండ పాణి ॥ కొలు ॥

అ॥ నలువకు పలుకుల – చెలియకు రుక్మిణికి
లలితకు సీతకు – లక్ష్మణున కరుదైన ॥ కొలు ॥

చ॥ వేకువ జామున – వెలయుచు తంబురా
చేకొని గుణముల – చెలువొంద పాడుచు
శ్రీకరునకు శ్రిత – చింతామణికి
ఆకలిదీర పా – లారగింపను జేసే ॥ కొలు ॥

2. వినవయ్య సరిపొద్దు – వేళ నాధునికి
చనువున వన్నీట – స్నానము గావించి

ఘనునికి దివ్యభో-జనమును బెట్టిక
మ్మని విడెమొసగుచు - మరువక సేవించే ॥ కొలు ॥

3. భాగవతులు గూడి - బాగుగా ఘననయ
రాగములచే దీపా - రాధన మొనరించి ॥
వేగమే శ్రీహరి - విరులపై బవళించి
జోగొట్టి త్యాగరాజు - సుముఖుని లేపే ॥ కొలు ॥

తాత్పర్యము :

ఈ కృతియందు త్యాగయ్యగారు తనకు లభించిన రామ సేవా భాగ్యమును తలచుకొని ఆనందపడుచున్నారు. కోదండపాణి కొలువు (సేవ) అమరినది కదా! ఓహో! ఈ భాగ్యము బ్రహ్మకు, సరస్వతికి, రుక్మిణికి, సీతకు, లక్ష్మణునకు లభించలేదు. వేకువ జామున లేచి తంబురాతో రాముని గుణములు పాడుచు ఆయన కాకలి తీరు విధంగా పాలు ఆరగింపచేసే కొలువమరినది. తరువాత సూర్యోదయానికి పన్నీట స్నానం చేయించి చక్కని దివ్యాన్నములు నివేదన చేసి కమ్మని తాంబూలమిచ్చే కొలువమరినది. భాగవతులతో కూడి ఘననయరాగములు పాడుచు శ్రీరాముని పూలపాన్పున నిద్దురబుచ్చి మరల వేకువ జామున మేలుకొలిపే సేవ లభించింది. అని అయ్యగారు ఆనందానుభూతిని వెలువరించినారు.

విశేషము = ఇందు చెప్పబడినవి నిత్యమూచేసే దైనందినోపచారములు. ఇవి చాలమంది భక్తులు చేస్తూనే ఉంటారు. కాని త్యాగయ్య గారి దానిలో ఒక విశేషమున్నది. ప్రతి ఉపచారమునకును సంగీతము అన్వయించి ఉన్నది. తనకు భగవద్దత్తమయినది సంగీతము. ఆ సంగీతాన్ని భగవదుపచారములతో జోడించుకొనే భాగ్యం ఎవరికుంటుంది? తన కున్నది. సంగీతములో సంబంధమున్న బ్రహ్మాదులకే అది లభించలేదు. ''సామవేదా దిదం శాస్త్రం సంజగ్రాహపితామహః॥ అనే ప్రమాణమును బట్టి సంగీత సృష్టికర్త బ్రహ్మ. అట్టి బ్రహ్మకు ''వేకువ జామున వెలయుచు తంబుర చేకొని గుణముల చెలువందపాడుచు - శ్రీకరునకు శ్రితచింతామణి కాకలిదీర పాలారగింపజేసే'' కొలువు లభించలేదు. సరస్వతీదేవి సంగీత కళాధి దేవత. ఆమెకును పై సేవలభించలేదు. లక్ష్మీదేవి కూడ సంగీత కళాధిదేవత అని శాస్త్రమున్నది. ఆ లక్ష్మీదేవి అవరావతారములయిన సీతకు, రుక్మిణికి కూడ పై సేవలభించలేదు. తరువాత ॥ వేత్తి గానరసంఫణీ॥ గానరసము ఫణికి (సర్పమునకు) తెలియునని శాస్త్రము. అట్టి సర్పములకు రాజయిన ఆదిశేషుని అవతారమగు లక్ష్మణుకి కూడ పై సేవలభించలేదు.

భాగవతోత్తములతో కూడి పాడుచు సేవ జేసే భాగ్యమెటువంటిదంటే॥ మద్భక్తా యత్రగాయంతి తత్రతిష్ఠామి నారద ॥ నా భక్తులు కలిసి గానము చేయుచోట నేనుందును॥ అనే భగవద్వాక్యమును బట్టి త్యాగయ్య గారు చేస్తే భక్తబృంద గాన గోష్ఠిలో రాముడు వచ్చి ఉన్నాడన్నమాటే. రాముడు ''గాంధర్వేచ విశారదః'' = సంగీతమున కూడ విశారదుడే. అని చెప్పబడినది. అట్టి రాముడు గోష్ఠియందుండి అయ్యగారి పాటవింటూ ఉపచారాలు స్వీకరిస్తున్నాడు. కనుక బ్రహ్మ మొదలు లక్ష్మణుని వరకు పై భాగ్యము కలుగలేదు. అనునది నిర్వివాదము. ఇతర సేవలు వారికి లభించినవి. కాని, ఇట్టి మహానంద కరమయిన సేవ ఎవరికిని లభించలేదు. ఈ సేవ త్యాగయ్యగారిని బ్రహ్మపదము కంటే పైన కూర్చుండబెట్టినది. ఆ ఆనందము నయ్యగా రనుభవించి చెప్పినారు.

175. భైరవి = ఆది

ప॥ కొలువై యున్నాడే కోదండపాణి॥ కొలువై॥

చ॥ తొలికర్మమణగ జూతాము రారే-తోయజారి రోహిణి గూడిన రీతి॥ కొలువై॥

చ॥ మనసు రంజిల్ల సురసతులు అణి
మాదులు కొలువ వేయివన్నె
కనకశలాకనుగేరు సీతా
కాంతతోను త్యాగరాజ వినుతుడు॥ కొలువై॥

తాత్పర్యము :

ఓ భక్తులారా! శ్రీరాముడు కొలువు దీర్చియున్నాడు. చూతాము రండు. మన ప్రారబ్ధకర్మలు తీరిపోతాయి. వెయ్యివన్నె (చొక్కపు) బంగారు తీగవలెనున్న సీతతో కూడి కొలువై యున్నాడు. ఈ సేవను సేవించుటకై దేవతాస్త్రీలు, అణిమాద్యష్టసిద్ధులు వచ్చి కొలువగా కొలువై యున్నాడు.

విశేషము = అణిమాదు లనగా అణిమాద్యష్ట సిద్ధులని ఎనిమిది. 'అణిమా మహిమాచైవ గరిమా లఘిమాతథా। ప్రాప్తిః ప్రాకామ్య మీశత్వం వశిత్వం చాష్టసిద్ధయః॥' కొంచెమగుట, పెద్ద అగుట, బరువగుట, తేలిక యగుట, కోరిన దానిని పొందగలుగుట, గొప్పదనము కలిగియుండుట, దేనికయినా సామర్థ్యము గలిగి యుండుట, ఇంద్రియ

నిగ్రహము గలిగి యుండుట, ఈ ఎనిమిది గుణములు ఈశ్వరుని అష్టవిభూతులు. ఈ విభూతులు కొలువై యున్న శ్రీరామచంద్రుని ఆశ్రయించినవి. అని. అట్టి శ్రీరాముని దర్శిస్తే ప్రారబ్ధములు తొలగునని అయ్యగారు భక్తులకు స్వాగతం ఇస్తున్నారు.

176. తోడి = ఆది

ప॥ కోటినదులు ధను-ష్కోటిలో నుండగా
ఏటికి తిరిగెదవే - ఓమనసా... కోటి॥

అ॥ సూటిగ శ్యామ - సుందరమూర్తిని
మాటిమాటికిని - జూచే మహారాజులకు॥ కోటి॥

చ॥ గంగనూపుర - మునను జనించెను
రంగని గని కా-వేరి రాజిల్లెను॥
పొంగుచు శ్రీరఘు-నాథుని ప్రేమతో
పొగడే త్యాగరాజు మనవి వినవే॥ కోటి॥

తాత్పర్యము :

ధనుష్కోటి అనే ఒక క్షేత్రమున్నది. ఆక్షేత్రములో అన్ని పుణ్యనదులు చేరి ఉన్నవని ప్రసిద్ధి. అటువంటి ధనుష్కోటి ఉండగా ఓ మనసా! తక్కిన నదులకోసం ఎందుకు తిరిగి శ్రమపడెదవు? శ్రీరాముడు సేతుబంధనమునకు ముందు సముద్రమును ప్రార్థిస్తే సముద్రుడు ప్రసన్నుడు కాలేదు. రామునకు కోపము వచ్చి సముద్రము నంతా శోషింపచేస్తాను అని విల్లెక్కుపెట్టినాడు. ఆ చోటిది. బహుశః ఆ గుర్తుగా ధనుష్కోటిలో ఏదైనా ఉండి ఉండవచ్చును. అది శ్యామ సుందరుడయిన రామునిదయి ఉండవచ్చును. ధనుష్కోటి క్షేత్రములో సూటిగా ఆశ్యామ సుందరమూర్తిని చూచే భాగ్యముగల వారు వేరు క్షేత్రములను దర్శింపనేల? అన్నినదులలోనూ ప్రధానమయినవి రెండు. విష్ణువు యొక్క నూపురము నుండి (కాలి అందెనుండి) జన్మించినగంగ, రంగని తన గర్భమునందు ధరించిన కావేరి. అందెనుండి అంటే కాలినుండి అని లక్షణార్థము. ఆ రెండునదులు అంతర్భవించి ఉన్న ధనుష్కోటిలో సూటిగా శ్యామసుందరుని చూచు మహారాజులు తీర్థాటనములు చేయనేల? ఆనందముతో భక్తితో శ్రీరాముని నుతించే త్యాగరాజు మాటను వినుమా అని త్యాగయ్యగారు మనస్సంబోధము చేసినారు.

విశేషము = భగవద్భక్తి కలవారు తీర్థయాత్రలు చేయనక్కర లేదని శాస్త్రము. ఎట్లంటే 'శ్లో॥ యమో వైవస్వతో రాజా। హృదయస్థో జనార్దనః। తేన చే దవి వాదస్తే। మా గంగాం వా కురూన్ గవుః' = ఓ నరుడా! బుద్ధిని, సర్వేంద్రియములను నియమించువాడై, ప్రకృతిని రంజింపచేయువాడై, సూర్యమండలమందుండి అందరికిని ప్రత్యక్షముగనుండు నారాయణుడు నీ హృదయంలో నెలకొని యున్నాడు. వానితో నీకు వివాదము లేనప్పుడు నీవు గంగకు, కురుక్షేత్రమునకును వెళ్లనక్కరలేదు అని ఆర్షవచనము. వివాదము లేకపోవుట అనగా భగవత్ప్రపన్నుడయి ఉండుటయే. అట్టివానికి గంగకు కురుక్షేత్రమునకు వెళ్లనవసరములేదని. ధనుష్కోటి క్షేత్రములో సర్వతీర్థములుండుటచేత ఇతర నదులకు తిరుగనక్కరలేదని త్యాగయ్యగారు భంగ్యంతరముగా చెప్పిరి. అయ్యగారి ఈకృతిలో ఇంకొక విశేషార్థమున్నది. ధనుష్కోటియనగా భ్రూమధ్య స్థానము (రెండు కనుబొమ్మల మధ్యగా నున్న ముక్కు మొదటి చోటు) కనుబొమ్మలు ధనుస్సు వలెనున్నవి కనుక ఆ రెండింటి కొసలు కలిసిన నాసికాగ్రస్థానమును ధనుష్కోటి అని భావించినారు. అది పరమాత్మ స్థానము. యోగులు ఆ స్థానమందు దృష్టి నిలిపి పరమాత్మ సాక్షాత్కారమును పొందుదురు. 'సూటిగ శ్యామసుందరమూర్తిని మాటిమాటికిని జూచే మహారాజులు' అంటే ఆ యోగులు, వారికి నదుల కొరకు తిరిగుపనిలేదని. ఇంకొక విశేషమేమంటే? నదులన్నియును ఆ విష్ణుస్వరూపమే అని 'జ్యోతీంషి విష్ణుర్భవనాని విష్ణుః। వనాని విష్ణుర్గిరయో దిశశ్చ। నద్య సముద్రాశ్చ స ఏవసర్వం' = నక్షత్రములు విష్ణువు, భువనములు విష్ణువు, వనములు కొండలు దిక్కులు విష్ణువు, నదులు విష్ణువు సముద్రము విష్ణువు'. అని విష్ణు పురాణవచనము. అట్టి విష్ణుదేవుని పాదమందు పుట్టినది గంగ. ఆ దేవుని తన గర్భమున ధరించినది కావేరి. ఈ రెండునదులు ప్రధానముగా అంతర్భవించిన ధనుష్కోటి ఉండగా వేరే తిరుగనేల? ఎన్ని నదులు సేవించినా వాటి ఫలము విష్ణు సాక్షాత్కారమేకదా! ఉన్నచోట పద్మాసనముపై కూర్చుండి నాసాగ్ర దృష్టినిలిపి పరమాత్మ సాక్షాత్కారము పొందినవారికి నదులకై తిరుగనేల? అని అయ్యగారి భావము. దీనిని బట్టి ఒక ఊహ కలుగుచున్నది. త్యాగయ్యగారీ యోగమును సాధించినట్లు.

177. ఖరహరప్రియ = ఆది

ప॥ కోరి సేవింప-రారే - కోర్కులీడేర॥ కోరి॥

అ॥ శ్రీరమణీ కరమో గో-వూరి సుందరేశ్వరుని॥ కోరి॥

చ॥ సురలు వెయి వన్నెబంగరు – విరులచే బూజింపగ–భూ
సురులు సనకాది మౌని–వరులు నుతింపగ
సిరులిత్తు నని కొలువైయుండే – శ్రీ సౌందర్యనాయికా
వరుని శ్రీ త్యాగరాజ – వరదుని పరమాత్ముని హరుని॥ కోరి॥

తాత్పర్యము :

ఇది గోవూరి సుందరేశ పంచరత్నములలో ఒకటి. ఓ భక్తులారా సంపత్కరమయిన గోవూరిలో వెలసియున్న సుందరేశ దేవుని సేవించుటకు రండి. మీ కోరిక లన్నియు నెరవేరుతాయి. దేవతలు బంగారు పూలతో, బ్రాహ్మణులు, సనకాది మునులు స్తోత్రములతో పూజిస్తూ ఉండగా అందరికిని సంపదల నిచ్చెదను అని శ్రీ సౌందర్యనాయికా దేవితో కొలువు తీర్చి ఉండిన శ్రీ సుందరేశ్వరుని సేవించుటకు రండు అని త్యాగయ్యగారు భక్తులను ఆహ్వానించినారు.

178. బేగడ = ఆదితాళం (త్రిశ్రగతి)

ప॥ గట్టిగాను నను చేయి–బట్టే దెన్నటికో॥ గట్టి॥

అ॥ పుట్టిన నాటనుండి – ఇట్టి విధములే గాని॥ గట్టి॥

చ॥ గొప్పతనము మనదని మద–మెప్పటిని దలకెక్కి
తప్పులకు లాడుచు దా–నుప్పతిల్లుచు॥
తెప్పున ఇంగితమెరుగక–మెప్పులకాసించే యా
చప్పని ప్రభువుల కడకును – త్రిప్పట లేలరా యనుచును॥ గట్టి॥

2 వరమైన సజ్జనులను – పరిచారకుల నెల్లను
సరిజేసి దానమొసగి – పరమెంచకను
కరిధనమదములు గలిగిన – నరులను పూజించే యా
తర మెరుగని ధనికుల అను–సరణ మేలరా యనుచు॥ గట్టి॥

3 శివపూజలు మరియును మా–ధవ పూజలు నొనరించుచు
భువినాసరి జోసేవా – రెవరనుచును. ఎంచే

అవివేక ధనమత్తుల – శివశివ వేడగ వద్దని
కువలయ దళలోచన – సువిభవ త్యాగరాజనుత॥ గట్టి॥

తాత్పర్యము :

రామా! నాచెయ్యి నీవు పట్టేది ఎప్పుడయ్యా! పుట్టిన నాటినుంచి ఈ విధంగానే ఉన్నావు. మదమతులకెక్కి తప్పు మాటలాడుచు, మెప్పులు కోరే నీచ ప్రభువులను చేరవద్దు, అని బోధించి నన్ను చెయ్యి పట్టే దెప్పుడు? పాత్రా పాత్రములెరుగక పండితునకు పరిచారకునకు ఒకే విధంగా దానమిచ్చే ధనికులను అనుసరించవద్దు, అని చెప్పినా చెయ్యి పట్టేది ఎప్పుడు? బాహ్యంగా శివకేశవులను పూజిస్తూ తమ అంత భక్తులు లేరని భావించే కపట భక్తులను వేడవద్దని తెలిపి నా చెయ్యిపట్టేది (రక్షించేది) ఎప్పుడు అని అయ్యగారు రామయ్యను ప్రార్థించినారు.

179. శంకరాభరణం = రూపకం (దివ్యనామము)

ప॥ గతమోహా శ్రితపాలా–ద్భుత సీతారమణా॥ గత॥

చ॥ భవ సారస భవమానస – భవనామర వినుతా॥ గత॥

2 భవతారక నవపాలన – భవాశరహరణా॥ గత॥

3 వినతాజగమన రాఘవ–ముని పూజిత చరణా॥ గత॥

4 శతకోటి చరిత మానవ–మత భేదక దమనా॥ గత॥

5 కరశోభిత శరపాపతి – మిరభాస్కర సుగుణా॥ గత॥

6 శరజానన కరుణాకర–వరవారణ శరణా॥ గత॥

7 నతమానస హితకరపా–లిత త్యాగ రాజా॥ గత॥

ఇందు అన్నియు సంస్కృత భాషా సంబోధనములు
కనుక ప్రతి పదార్థము వ్రాయబడుచున్నది.

గతమోహా = మోహము లేనివాడా, శ్రితపాలా = ఆశ్రయించినవారిని పాలించువాడా, అద్భుత = ఆశ్చర్య కరమైనవాడా, సీతారమణా = సీతకు పతియైనవాడా,

భవ-సరసభవ-మానస-భవనా = శివునియొక్క బ్రహ్మ యొక్క మనస్సునందు ఉండువాడా, అమర వినుతా = దేవతలచే నుతింపబడిన వాడా, భవతారక = సంసారమును దాటించువాడా, సవపాలన = యజ్ఞమును రక్షించినవాడా, భవాశరహరణా= సంసారమనెడి రాక్షసుని హరించువాడా, వినతాజ గమనా = గరుత్మంతునిపై పోవువాడా, రాఘవ = రఘువంశమున బుట్టినవాడా, ముని పూజిత చరణా = మునులచే పూజింపబడిన పాదములు గలవాడా, శతకోటి చరిత = అనేకకోట్ల చరిత్రలు గలవాడా, మానవ మత భేదక దమనా = మానవులకు మత భేదములను కల్పించువారిని శిక్షించువాడా, కరశోభిత శర = చేతిలో శోభిల్లుచున్న శరములు గలవాడా, పాప తిమిర భాస్కర = పాపము లనెడి అంధకారమునకు సూర్యుడైన వాడా, సుగుణా= మంచి గుణములు గలవాడా, శరజానన = పద్మము వంటి ముఖముగలవాడా, కరుణాకర= కరణకు స్థానమైనవాడా, వరవారణ శరణా = కరిరాజుకు రక్షకుడైనవాడా, నత మానస హితకర = నమస్కరించే వారి మనస్సునకు మేలు కలుగ జేయువాడా, పాలిత త్యాగరాజా= త్యాగరాజును పాలించినవాడా

180. తోడి = ఆది

ప॥ *గతి నీవని నే గోరి వ-చ్చితి తల్లి పరాకా॥* *గతి॥*

అ॥ *మతిని యెంతో వెదకి స-మ్మతిని శ్రీ ప్రవృద్ధ శ్రీ*
మతి నీపదయుగళమునే నెరన-మ్మితిని బ్రోవుమిక నిజదాసులకు॥ *గతి॥*

చ॥ *వరమౌ శ్రీతపస్తీర్థన-గరమందు నెలకొన్న*
పరమానందీ! పాగడ-దరమా బ్రహ్మకైనను
ధరలో నీసరిగాన-తల్లీ నీవాడను గానా
పరితాపములెల్ల దొలగ యారక-పురనాథుల జతగూడి యభీష్ట
వరములిచ్చు దైవము నీవనుచును-స్థిరమతులై గాంచినారు గనుక॥ *గతి॥*

చ॥ *ఈ పురమున బాగు కాపురముసేయువా-రే పుణ్యము జేసిరో*
శ్రీపురనిలయే-ప్రాపుగోరియున్నానం-బా! పరుల నేను వేడగలేను
జూపు జాగుసేయక నీవేదరి-దాపుగాని అన్యులెవరు నాయెడ
రేపు మాపనక నీ మహిమలు బలు-గోపురంబుగాని సుజనులకు॥ *గతి॥*

చ॥ రాకాశశివదనే - సర్వ-లోకనాయకి వినుమా యనే వేల్పుల
కాదియౌ నీకటాక్షముచేత - ఏకచిత్తమైనందుకు అంబ
ఇంకనిర్దయ ఎందుకు - నీకని ధనధాన్యముల కొరకు యీ
లోకులదే మాటికి మా-టి కడుగుట చొకగాని నీ కీ
ర్తికి నెందాక విన్నవింతు త్యాగరాజుని॥ గతి॥

తాత్పర్యము :

ఈకృతి లాల్‌గుడి అనే క్షేత్రమందున్న శ్రీప్రవృద్ధ అనే దేవి పైది. నీవే గతియని నీ పదములను నమ్మి సమ్మతితో కోరివచ్చినాను తల్లీ! తపస్తీర్థమందు పరమానంద స్వరూపముతో నెలకొని యున్నావు. నిన్ను బ్రహ్మాదులైన పొగడలేరు. నీసరి దైవములేదు. నేను నీ వాడను. యీరకపురము (తపస్తీర్థము)లోని నీ పరివారదేవతలతో కూడి అభీష్టములిచ్చే తల్లివి నీవవి స్థిరమైన నమ్మికగల వారెందరో కలరు. నీక్షేత్రములో వాసము చేయు వారెంత పుణ్యాత్ములో కదా! పరులను నేను వేడను. నీమహిమ లెంతో రహస్యములయినవి. పూర్ణ చంద్రునివంటి ముఖముగలదానా! అన్ని లోకములకు నాయకులారా! దేవతల కందరికిని ఆది మూలమయిన నీ కటాక్షముచేత నేను నీయం దేకచిత్తుడనై (మనస్సులగ్నమై) యున్నాను. ఇక నాపై నిర్దయ వలదు. ఈ లోకులను నీ కొరకు ధనధాన్యములడుగుట నీకీర్తికి లోపము. నిన్నెంతో వేడుకొందును. నా గతి నీవేకదా! అని అంబతో విన్నవించుకొన్నారు త్యాగయ్యగారు.

181. పున్నాగవరాళి = ఆది (నౌకాచరితములోనిది)

ప॥ గంధము పుయ్యరుగా పన్నీరు॥ గంధము॥

అ॥ అందమైన యదునందనుపై-కుందరదన లిరవొందగ పరిమళ గంధము॥

చ॥ తిలకము దిద్దరుగా కస్తూరి-తిలకము దిద్దరుగా॥
కలకలమను ముఖకళగని సొక్కుచు-పలుకుల నమృతములొలికెడు స్వామికి గంధము॥

చ॥ చేలము గట్టరుగా బంగరు-చేలము గట్టరుగా।
మాలిమితో గోపాల బాలురతో-ఆలమేపిన విశాలనయనునకు॥ గంధము॥

చ॥ హారతు లెత్తరుగా ముత్యాల-హారతు లెత్తరుగా।
నారీమణులకు వారము యౌవన-మారక మొసగెడు వారి జాక్షునకు॥ గంధము॥

చ॥ పూజలు సేయరుగా మనసార – బూజలు సేయరుగా
జాజులు మరి విరవాజులు దవనము–రాజిత త్యాగరాజ వినుతునకు॥ గంధము॥

తాత్పర్యము :

'నౌకాచరితము'లో నౌకలో కృష్ణుని చుట్టు చేరి గోపికలు ఒకరినొకరు 'కృష్ణునకు గంధము పూయండే, కస్తూరి తిలకము దిద్దండే, బంగారు వలువ కట్టండే, ముత్యాల హారతు లెత్తండే, పలుపూవులతో పూజచేయండే' అని హెచ్చరించుకొనుచున్నారు.

182. గాన మూర్తి = ఆది

ప॥ గానమూర్తే–శ్రీకృష్ణవేణు–గానలోల త్రిభువనపాల–పాహి॥ గానమూర్తే॥

అ॥ మానినీమణి శ్రీ రుక్మిణీ–మానసాపహారా–మారజనక శూర॥ గానమూర్తే॥

చ॥ నవనీత చోర–నంద సత్కిశోర–నరమిత్రధీర– నరసింహ శూర।
నవమేఘతేజ! నగజాసహజ–నరకాంతకా జ–నత త్యాగరాజ॥ గానమూర్తే॥

విశేషాంశము = సంగీత స్వరూపుడా! శ్రీకృష్ణా! వేణుగానలోల = వేణుగానమందు ఆసక్తుడా! త్రిభువనపాల = ముల్లోకములను పాలించువాడా! పాహి=రక్షించుము. మాననీమణి శ్రీరుక్మిణీమానసాపహార = స్త్రీలలో తలమానికమయిన రుక్మిణీదేవి యొక్క మనస్సు నపహరించినవాడా! మారజనక = మన్మథునకు తండ్రి అయినవాడా! శూరా! నవనీతచోర = వెన్నదొంగా! నందసత్కిశోర = నందుని కొడుకా! నరమిత్ర= అర్జునుని చెలికాడా! ధీరా! నరసింహ = నరసింహుడా! శూర! నవమేఘతేజ = క్రొత్త మబ్బువంటి తేజస్సుకల వాడా! నగజా సహజా = పార్వతికి సోదరుడా! అజ = పుట్టుకలేనివాడా! నరకాంతక = నరకాసురుని అంతమందించినవాడా! నతత్యాగరాజ= త్యాగరాజు భక్తుడైన వాడా! పాహి = రక్షించుము.

183. ఘంట = రూపకం

ప॥ గారవింపరాదా – గరుడ గమన రామ ననుు॥ గార॥

అ॥ శ్రీరమా మనోహరా – శ్రితహృదయ విహార!
చేర రావదేర – శ్రీ రఘువరధీర!

చ॥ పేరుకైన లేదా – పిలిచితే రారాదా! – సరి
వారలాడలేదా–విని–వరద! నమ్మలేదా! గార॥

చ॥ తనయుడాడు మాట తలి–దండ్రులకది యాటగాద
నినుబాడిన పాట విని–నీముద్దునోటయే
మనవల దిచ్చోట–మాధవ ఇక తెరచాట? గార॥

చ॥ రూకలొసగి కొన్న సతి–రూపమెట్లున్న
శ్రీ కరగుణమున్న చెలి–చెలిమి వీడదన్న ప
రాకు నీకు మిన్న త్యాగ–రాజ వినుత! బిన్నా॥ గార॥

తాత్పర్యము :

ఓ గరుడగమనా! శ్రీ రమామనోహరా! = లక్ష్మీదేవికిమనోహరుడా! భక్తుల హృదయమందు విహరించువాడా! నన్ను గార వించుము. నన్ను చేరరమ్ము. నాపై గారవము (ప్రేమ) నామమాత్రముగానైన లేదా? నాసాటి వారైన పూర్వభక్తులు నిన్ను గూర్చి నీవు భక్తులపై ప్రేమగల వాడవని చెప్పిరికదా! నేను దానిని నమ్మియున్నాను కదా! నేను నీపై పాటలు పాడుచున్నాను. తనయుని పలుకులు తలిదండ్రులకు ముద్దయినట్లు నాపాట నీకు కావలెను. నా పాట వినుము గారవించుము. ఇక వేరేమీ అనకు. డబ్బుపెట్టికొన్న ఆలు రూపమెట్లున్నా అది శీలవతి అయితే పతిని విడువదు. అట్లే నేను నీకు. నాయెడ నీకు పరాకు తగదు అని ప్రార్థనము.

184. శహానరాగము = ఆదితాళము

ప॥ గిరిపై నెలకొన్న రాముని॥ గురితప్పగ గంటి॥ గిరి॥

అ॥ పరివారము విరి। సురటులచేనిల
బడి విసరుచు కొసరుచు సేవింపగ॥ గిరి॥

చ॥ పులకాం కితుడై–ఆనందాశ్రు
పులనింపుచు–మాటలాడవలె నని
కలువరింపగ గని–పదిపూటలపై
గాచెదనను త్యాగరాజ వినుతుని॥ గిరి॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు ఇక అయిదురోజులకు శరీరము చాలించెదరనగా కలిగిన ఒక అనుభవమును ఇందు చెప్పుచున్నారు. నేను గిరిపైన నున్న శ్రీరామచంద్రుని చూచినాను. శ్రీరాముని తనపరివార మందరును నేనంటే నేనని నిలువబడి పూల విసనకర్రలు విసరుచు సేవించుచున్నరు. ఇంతలో నేను పులకాంకితుడనై ఆనంద బాష్పములతో తత్తరపడి లేచి రామునితో మాట్లాడవలెనని అనుకొన్నాను. అంతలో శ్రీరాముడే నాకు 5 రోజులకు సాయుజ్య మిచ్చెదను అని చెప్పినాడు. అట్టి రాముని నేను చూచితిని అని చెప్పినారు.

విశేషము = గిరి అంటే భద్రాద్రి అని వ్యాఖ్యానింతురు. ఇది స్వప్నమని చెప్పుదురు. తప్పుకాదు. కాని నా అభిప్రాయమును వివరించెదను. ముక్తిని చెందబోవు ధన్యుడు (జీవుడు) అర్చిరాది అనెడి మార్గమున పయనించును. సుషుమ్నానాడి ద్వారా పయనించు వానికి మొట్టమొదట ఒక సుందర-ఉన్నత పర్వతముపై భగవానుడు కొద్దివంది తన పరివారముతో సాక్షాత్కరించును. దీని శాస్త్రము కౌశీతకి ఉపనిషత్తునందున్నది. ఈ సాక్షాత్కారము త్యాగయ్యగారికి 5 రోజులు ముందుగనే నిరంతర భావనా బలముచే భావరూపమున కలిగినదని చెప్పవచ్చును. వెంటనే అయ్యగారు ముక్తుడయినట్లు కూడ భావింపవచ్చును. ఈ కృతి తరువాత ఇక ఆయన నోట మాటలేదు. బహుశః ఈ 5 రోజులు అయ్యగారు సవికల్పసమాధి వీడి నిర్వికల్ప సమాధిలో నుండి యుందురు.

185. బంగాళ = ఆది

ప॥ గిరిరాజ సుతా తనయ సదయ॥ గిరి॥

అ॥ సురనాథ ముఖార్చిత పాదయుగ
పరిపాలయమా- మిభరాజముఖ॥ గిరి॥

చ॥ గణనాథపరా-త్పరశంకరా
గమవారి నిధి - రజనీకరా॥
ఫణి రాజ కం-కణ విష్ణునివా
రణ శాంభవ శ్రీ-త్యాగరాజ నుత॥ గిరి॥

తాత్పర్యము :

ఇది గణపతి ప్రార్థనము = గిరిరాజ-సుతా-తనయ=పర్వతరాజు కూతురైన పార్వతికి-పుత్రుడా, సదయా! దయగలవాడా! సురనాథముఖా-అర్చిత-పాదయుగ=

ఇంద్రుడు మొదలగు వారిచే- అర్చింపబడిన పాదములు గలవాడా!, పరిపాలయ- మాం= రక్షించుము- నన్ను ఇభరాజముఖ = ఏనుగు ముఖమువాడా! గణనాథ - ప్రమథ గణములకు అధిపతి అయినవాడా! పరాత్పర = పరాత్పరుడా! శంకర = సుఖము కలగ జేయువాడా! ఆగమ- వారినిధి- రజనీకర! = వేదములనెడు సముద్రమునకు చంద్రుడా! ఫణిరాజ కంకణ! = పాములరేడు కంకణమయినవాడా! విఘ్ననివారణ = విఘ్నములను నివారించువాడా! శాంభవ!= శివుని కుమారుడా! శ్రీ త్యాగరాజనుత = త్యాగరాజుచే నుతింపబడినవాడా!

విశేషము = 'గిరిరాజసుతా తనయా' గిరిరాజసుత అంటే గిరిరాజ కవి యొక్క కుమారు డంటే రామబ్రహ్మము. ఆయన యొక్క తనయుడు అంటే త్యాగయ్యగారు. 'గిరిరాజసుతా తనయ' అనే పదమునందు పై విశేషసూచన ఉన్నదని కొందరు పూర్వులు ధ్వాటించిరి. ఇది తప్పు. గిరిరాజ సుతా అని దీర్ఘముండుటచే స్త్రీలింగము. అప్పుడు పార్వతి మాత్రమే అర్థము. దానిని బట్టి పైన చెప్పిన విశేషార్థము పొసగదని. కొందరి అభిప్రాయమేమంటే (నా తీర్పు ఏమంటే) సంగీతములో లఘువు గురువుగా పలుకవచ్చునని శాస్త్రభ్యనుజ్ఞ కలదు. దానిని బట్టి 'సుతా' లోని దీర్ఘమును లఘువుగా భావిస్తే పై విశేషము కుదురుతుంది. అదీ కాక గిరిరాజ సుత (సుతా) తనయ అని ఊరికే శబ్ద మాత్ర సాదృశ్యాన్నే ఇక్కడ చూడవలసి ఉన్నది. అట్లు చూస్తే పైది సరసమగును.

186. సురటి = ఆది

ప॥ గీతార్థము సం- గీతానందము।
నీ తావున జూడరా- ఓ మనసా॥ గీతార్థము॥

అ॥ సీతాపతి చర- ణాబ్జములిడుకొన్న
వాతాత్మజునికి- బాగ దెలుసురా॥ గీతార్థము॥

చ॥ హరిహర భాస్కర- కాలాది కర్మము
లను మతముల మ- ర్మముల నెరింగిన
హరి వరరూపుడు- హరి హయ వినుతుడు
వరత్యాగరాజ- వినుతుడు సుఖిరా గీతార్థము॥

తాత్పర్యము :

ఈ కృతి అర్థము సరియయిన పద్ధతిలో అన్వయించినది లోగడలేదు. ఎక్కువ వాక్య విన్యాసములు అతకని పెద్ద పెద్ద ఉపన్యాసములతో, అనుచిత పదవిభాగముతో అస లర్థము దూరమయినది. సరి అగు అర్థమిది. త్యాగయ్యగారు తనమనస్సునకు హనుమంతుని వైభవమును వర్ణించి చెప్పుచున్నారు. ఓ మనసా గీతార్థమును (జ్ఞానమును) సంగీతానందమును ఈ తావున చూడు. రాముని చరణాబ్జములను చక్కగా మనమున నిలుపుకొన్న హనుమంతునికి పైరెండును బాగా తెలుసును. గీతార్థము సంగీతానందమును అని ను సముచ్చయము. తరువాత ఈ తావున అని పదవిభాగము చేయవలెను. ఏ తావున అంటే హనుమంతుని తావున అని. తరువాతి అనుపల్లవి చరణ విభాగములు హనుమంతునే చెప్పుచున్నవి. విష్ణు, శివ, సూర్య-కాలాది కర్మము లనే మతముల మర్మము లెరిగినవాడు హనుమంతుడు. ఇతడెట్టివాడు? హరి వరరూపుడు= కపిశ్రేష్ఠరూపుడు. హరి హయ వినుతుడు = ఇంద్రునిచేత నుతింపబడినవాడు. త్యాగరాజ వినుతుడు గీతార్థములను సంగీతానందమును తెలిసిన సుఖిరా! ఇందు బాగా గమనింపదగిన విశేష మున్నది. నవవ్యాకరణ వేత్త, సూర్యుని శిష్యుడు అయిన హనుమ గీతార్థముల నెరుగటలో విశేషమేమి? ఉన్నది. హనుమంతుని కాలములో 'గీతార్థములు' అను పేరు కలవి లేవు. ధర్మములు అర్థములు తత్త్వములు మర్మములు కర్మములు ప్రాచీనములే కాని 'గీతార్థములు' సర్వోపనిషత్సారముగా ఒకచోట పెట్టినవిలేవు. వాటిని సాక్షాన్నారాయణుడైన కృష్ణ భగవానునిచే ఉభయ సైన్యమధ్యమున ఉపదేశింపబడినవి. వాటిని సమగ్రముగా అర్థము చేసుకొనే స్థితి అర్జునునకు లేదు. తత్కాలమందు అర్జునుని జెండాపైనున్న కపిరాజునకే గీతార్థములు తెలిసే మహావకాశము లభించినది. అందుచేత ఆ అర్థము మరియు తాను సంగీత కర్త కనుక, సంగీతా నందమునకు పరాకాష్ఠ రామపాద ధ్యానమే అని త్యాగయ్యగారి అనుభవముకనుక అది కూడ సాక్షాత్తుగా హనుమంతునకు లభించినది కనుక 'గీతార్థమును సంగీతానందమును - ఈ తావున జూడుమని త్యాగయ్యగారు మనస్సున కుపదేశించినారు. ఈ కృతియందు హనుమంతుని సుఖ ప్రస్తావమే ప్రధానము.

187. గౌరీ మనోహరి = జంపె

ప॥ *గురులేక ఎటువంటి-గుణికి తెలియగబోదు॥* *గురు॥*

అ॥ *కరుకైన హృద్రోగ-గహనమున గొట్ట స॥* *ద్గురు॥*

చ॥ తనువు సుత ధనదార-దాయాది బాంధవులు
జనియించి చెదరు జా-లిని కరుణతో
మనసునంటక మంచి - మందనుచు తత్త్వబో
ధన జేసి కాపాడు - త్యాగరాజాప్తుడను॥ గురులేక॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు గురువు యొక్క ఆవశ్యకతను చెప్పుచు ఆధ్యాత్మిక గురువు యొక్క విషయమును ఉద్ఘాటించినారు. ఎంత గుణవంతున కయినా గురువులేకుండా విద్య తెలియదు. మానసిక వ్యాధి అయిన ఆధిని పోగొట్టవలెనంటే గురూపదేశము లేక తెలియదు. శరీరము, పుత్రులు, ధన ధాన్యములు, భార్య, దాయాదులు మొదలగు బంధువులు కలిసి విడిపోయే విషయములు, ఇవి విడిపోయిన ప్పుడు ఖేదము పొందకూడదు. అని మనస్సుకు దుఃఖమంటని రీతిగా మందువంటి తత్త్వ బోధన చేసి కాపాడే గురువు లేకపోతే సర్వమును దుఃఖమయమే అని అయ్యగారి ఉపదేశము. ఆ గురువు తనకు త్యాగరాజాప్తుడే = రాముడే అని.

ఒక చిన్న విశేషము = ఇందు తెనుగు వ్యాకరణమును బట్టి ఉకారాంత శబ్దమునకు విభక్తి ప్రత్యయముగా ఉండవలసిన 'వు' లేక 'గురు' అని ప్రాతిపదికమునే త్యాగయ్యగారు వాడినారు. ఇది భాషాపరముగా తప్పే. సంప్రదాయ పాఠమిట్లే వచ్చుచున్నది. ఆ మధ్య ఒక కవి దీనిమీద దాడిచేసి 'గురువు' అని పాడవలెనని తీర్పుచేసి వెళ్లిపోయిరి. కాని అట్లు పాడితే సంగీత శ్రవణ సౌఖ్యము దెబ్బతిన్నది. 'గురు' అని త్యాగయ్యగారు అనుమతించి వాడినది. గాయకులు చేసిన తప్పయితే సవరింపవచ్చును. త్యాగయ్యగారే చేసినది కనుక అది శిరోధార్యము. అరవ కన్నడ భాషలలో ఇట్టి పదములు ప్రత్యయరహితంగా ఉంటాయి. అయ్యగారు దానిని పాటించిరి. ఇట్టిది అయ్యగారు నిత్యరూప అను దర్బారు కృతిలో 'భాను' అని ప్రయోగించినారు. ఇదీ అంతే.

188. రేవగుప్తి = దేశాది

ప॥ గ్రహబల మేమి శ్రీరామాను - గ్రహబలమే బలము॥ గ్రహ॥

అ॥ గ్రహబలమేమి-తేజో మయ విగ్రహమును ధ్యానించువారికి నవ॥ గ్రహ॥

చ॥ గ్రహపీడల బంచపాపముల నా-గ్రహములు గల కామాది రిపుల ని
గ్రహము జేయు హరిని భజించే త్యాగరాజునికి రసికాగ్రేసరులకు గ్రహ॥

తాత్పర్యము :

నవగ్రహముల బలముల కన్న రామానుగ్రహబలమే గొప్పది. తేజోమయ విగ్రహుడగు హరిని ధ్యానించే వారిని నవగ్రహములు ఏమియు చేయలేవు. గ్రహబాధలను, పంచమహా పాతకములను, కామ క్రోధాదులను నిగ్రహించగల త్యాగరాజునకు అట్టి భక్తి రసికులకు రామానుగ్రహ బలమే బలము. అని త్యాగయ్యగారు తమదృఢ విశ్వాసము ద్వారా పరోపదేశమును చేసిరి.

189. సారాష్ట్రము = చాపు (నౌకాచరితములోనిది)

ప॥ ఘుమ ఘుమ ఘుమయని వాసనతో – ముద్దు
గుమ్మలు వెడలిరి చూడరే॥

అ॥ మమతతోను సుర–వరులెల్ల సురతరు
సుమ వానలు గురియింపగ వేడ్కగ॥ ఘుమ॥

చ॥ నలువంక పగలు వత్తులు తేజరిల్లగ
చెలగ సాంబ్రాణి పొగలు గ్రమ్మ గంధ పా
డులు చల్లుచు బయ్యె–దల దీయుచు బన్నీ
రులు చిలుకుచు యదు–కుల వీరునితో॥ ఘుమ ఘుమ॥

2 బంగారు చీరలు–రంగైన రవికలు
ఉంగరములు వెల–యంగ సొగసుగ భు
జంగశయనుడగు – రంగపతిని జూచి
పొంగుచు దనివార–కౌగలించుచును॥ ఘుమ ఘుమ॥

3 వరమైన కనకనూ–పురములు ఘల్లన
నురమున ముత్యాల–సరులెల్ల గదలగ
కరమున సొగసైన – విరిసురటులచే–వి
సరుచు త్యాగరాజ–వరదుని బొగడుచు॥ ఘుమ ఘుమ॥

తాత్పర్యము :

ఇది నౌకా చరితమందు కథకుడైన సూత్రధారుడు గోపికలు కృష్ణుని సేవించు తీరును వర్ణించు గేయము. ముద్దు గుమ్మలు ఘుమ ఘుమ లాడు పరిమళముతో వెడలిరి.

దేవతలు కల్పతరు పుష్పములను వర్షిస్తున్నారు. నాల్గు వైపుల పగటి దివిటీలు వెలుగుచున్నాయి. సాంబ్రాణి పొగలు వ్యాపించుచున్నవి. గంధపు పొడి చల్లుచు పన్నీరు చల్లుచు పైట చెరగులు జారగా బంగారు చీరలు రంగుల రవికలు ధరించి ఉంగరములు ధరించి కృష్ణుని కౌగలించుకొని వెడలిరి. బంగారు అందెలు ఘల్లు ఘల్లనగా – రొమ్మున ముత్యాల సరు లసియాడగా పుష్పపు విసనకర్రలతో విసరుచు కృష్ణుని పాడుచు గోపికలు వెడలిరి.

190. ఖరహరప్రియ = ఆది

ప॥ చక్కని రాజ మార్గమే యుండగ
సందుల దూరనేల – ఓమనసా॥ చక్కని॥

అ॥ చిక్కని పాలు–మీగడయుండగా – చీయనుగంగా సాగరమేలే॥ చక్కని॥

చ॥ కంటికి సుందర–కరమగు రూపము–ము
క్కంటినోట చెలగే–నామమే త్యాగరా
జింటనే నెలకొన్న–దైవమే ఇటు
వంటి శ్రీ సాకేత–రాముని భక్తియనే॥ చక్కని॥

తాత్పర్యము :

ఈ కృతియు మనస్సంబోధమే. చక్కని రాజమార్గమున్నది. సందులలో ఎందుకు తిరిగి శ్రమపడెదవు? చిక్కని పాలుమీగడ ఉండగా చీ అనిపించే మద్యమేల? ఈ చక్కని రాజమార్గమేమిటి? రామభక్తియే. ఈ మార్గము గమ్యము చేరుటకు సుగమముగా నుండును. గమ్యము మోక్షము. రామభక్తి గమ్యమును చక్కగా చేర్చే రాజమార్గము. ఇది ఒక్కటే ఉంటుంది. 'భక్తి రేవైనం గమయతి' = భక్తియే భగవంతుని చేర్చును అని వేద వాక్యము. ఇక కర్మాదులు పెక్కులున్నవి. వీటిని అవలంబించిన యెడల పునర్జన్మ కారణములై మోక్షమును దూరము చేయును. ఆచరణలో శ్రమ కలిగించునవి. అందుచేత ఇవి సందులవంటివి. 'కృష్ణం లోకయ' = కృష్ణుని కనులారా! చూడండి అని ఒక భక్తి సూత్రమున్నది. దాని ప్రకారం ఎంత చూచినా తనివి తీరని చక్కని రాముని రూపమున్నది. శంకరుడు జిహ్వాగ్రమందు నిలుపుకొన్న రాముని నామమున్నది. రాముడు భక్తిని అవలంబించుటయే శ్రేయస్కరము అని త్యాగయ్యగారు భక్తిని, తదితరములను బింబప్రతిబింబ భావముతో చూపి విహిత స్వీకారమును, నిషిద్ధపరి త్యాగమును ఉపదేశించినారు.

191. హరికాంభోజి - ఆది

ప॥ చనితోడి తేవే ఓ మనసా చని॥

అ॥ కనికరముతో నను-కని కర మిడిచిర
కాలము సుఖమనుభవింప వేగమే॥ చని॥

చ॥ పతితుల బ్రోచే-పట్టాధికారిని
పరమార్థమత వసిష్ఠానుసారిని
ద్యుతివినిర్జిత శత శంబరారిని
ధురీణ త్యాగరాజ హృచ్చారిని॥ చని॥

తాత్పర్యము :

ఈ కృతి త్యాగయ్యగారు తన మనసును రాముని తనవద్దకు తీసుకొని వచ్చు సంధానకర్తగా భావించి ప్రార్థించుచున్నారు. త్యాగయ్యగారిది మనస్సుది ఒక సంవాద రూపముగా ప్రశ్నోత్తర రూపముగా చూపబడుచున్నది.

త్యాగయ్య = ఓ మనసా నీవు వెళ్లి నారాముని తోడితేవే!!
(ఇచట చరణమును ముందుకు తేవలెను)

మనస్సు = ఎవరిని తోడితేవలెను?

త్యాగయ్య = నా రాముని

మనస్సు = ఆయన లక్షణము లేవి?

త్యాగయ్య = పతితులను రక్షించే పట్టాధికారి.

మనస్సు = ఇంకా అతని వివరములు చెప్పు.

త్యాగయ్య = పరమార్థమతము నుద్ధరించిన వసిష్ఠుని మతము ననుసరించువాడు. నూరుగురు మన్మథుల సౌందర్యమును జయించిన సౌందర్యము కలవాడు.

మనస్సు = అతడెక్కడ సంచరించును?

త్యాగయ్య = ధురీణుడనగా ముందున్నవాడు. అట్టి త్యాగరాజు అనగా శివుడు. అతని హృదయమందు నా రాముడు సంచరించును!

మనస్సు = త్యాగయ్యా! అతనిని నేను తోడితెచ్చుట ఎందుకు? అతడు నన్ను కనికరముతో చూచి నాకు చేయూతనిచ్చి నాకు శాశ్వత సౌఖ్యమును ప్రసాదించుటకు.

ఇదీ దీని తాత్పర్యము.

192. మార్గహిందోళము - ఆది

ప॥ చలమేలరా – సాకేత రామా॥ చల॥

అ॥ వలచి భక్తి మా–ర్గముతోను నిన్ను॥
వర్ణించుచున్న – నాపై॥ చల॥

చ॥ ఎందుబోదునే – నేమి జేయుదును
ఎచ్చోట నే–మొర బెట్టుదును
తందనాలతో –ప్రొద్దు పోవలెనా
తాళజాలరా – త్యాగరాజ నుత॥ చల॥

తాత్పర్యము :

ఈ కృతి త్యాగయ్యగారి ఆర్తిని తెలుపుతుంది. ఓ రామా! నాపై నీకు చల మెందుకయ్యా! నేను నిన్ను వలచినాను. భక్తి మార్గంతో నిన్ను వర్ణించటము నా ధ్యేయము. నా ధ్యేయమును సాగించి నీ సాక్షాత్కారమును నాకీయవలసినది. నీ సాక్షాత్కారము కొరకు నిన్నే వేడుకొంటున్నాను. వేరే ఎవరి నాశ్రయించను? ఎవరితో మొరబెట్టెదను? అయ్యో రామా! ఈ విధమయిన మొరలు బెట్టుకుంటూ ఈ తందనాలతోనే కాలం గడపవలసినదేనా? ఇక నే తాళలేను. అని త్యాగయ్యగారు రామ సన్నిధిలో తమ ఆర్తిని వెలిబుచ్చారు.

193. వేగవాహిని = ఆది

ప॥ చల్లగనాతో – బల్కు మీరామ॥
సారసవదన – సాధు సంత్రాణ॥ చల్లగ॥

అ॥ ఉల్లమునను నీకే-మరులు కొన్నాను
ఉరగశయన నా-తప్పు లెంచక నీవు॥ చల్లగ॥

చ॥ నిరుపమ శూర - నిఖిలాధార
పరకామినీ దూర-పాప విదూరా -
సరసిజ నేత్ర - శ్యామల గాత్ర
వర త్యాగరాజ హృ-ద్వారిజ మిత్ర॥ చల్లగ॥

తాత్పర్యము :

ఓ సారస వదనా = పద్మమువంటి ముఖము గలవాడా! సాధు సంత్రాణ = సత్పురుషులను రక్షించువాడా! నాతో చల్లగా పలుకుము. నేను మనసునందు నీపై మరులుకొన్నాను. నా తప్పులెన్నకు. (తక్కినవి సంబోధనములు మాత్రమే).

194. ఆహిరి = మిశ్రచాపు

ప॥ చల్లరే రామ-చంద్రునిపై పూల

చ॥ సొంపైన మనసుతో - ఇంపైన బంగారు
గంపలతో మంచి-చంపకములను॥ చల్లరే॥

2 పామరములు మాని-నేమముతోను ర
మామనోహరుపైన - తామరపూల॥ చల్లరే॥

3 ధాతృ వినుతుడైన - సీతా పతిపైన
చేతులతో పారి-జాత సుమముల॥ చల్లరే॥

4 ఈ జగతిని దేవ-పూజార్హమౌ పూల
రాజిలో మేలైన - జాజి సుమముల చల్లరే॥

5 అమిత పరాక్రమ-ద్యుమణి కులార్ణవ
విమలచంద్రునిపై హృ-త్కుముద సుమముల॥ చల్లరే॥

6 ఎన్నరాని జననమ-రణములు లేకుండ
మనసార త్యాగరాజ నుతుని పైన॥ చల్లరే॥

తాత్పర్యము :

దేవపూజకు తగిన సమస్త పుష్పములను రామచంద్రునిపై భక్తులారా మీ రందరును చల్లండి. ఇక జనన మరణరూపమయిన సంసారపు బాధలుండవు. అన్నారు.

విశేషము = 'ఏకః స్వాదు నభుంజీత' = మధురమైన దానిని తానొక్కడే అనుభవింప కూడదని ధర్మశాస్త్రము. త్యాగయ్యగారికి రామునిపై పూలు చల్లి సేవించుట మధురమైనది. కనుక భక్తులను పిలచి ఆమాధుర్యమున పాలుపంచుకొనుడని త్యాగయ్యగారు, భక్తుల నాహ్వానించినారు.

ఇందు రెండు విశేషములున్నవి. రమా మనోహరునిపై తామరపూలు చల్లమన్నారు. రమామనోహరుడనగా లక్ష్మికి నాథుడు. హరికి లక్ష్మి ప్రియమైనది, లక్ష్మికి తామరపూలు ప్రియము. 'పద్మప్రియే పద్మిని పద్మహస్తే' అని చెప్పబడినదికదా! అందుచేత పద్మ ప్రియ అయని లక్ష్మీ నాథునికి పద్మములు చల్లరే అని. 'ద్యుమణి కులార్ణవ విమల చంద్రునిపై' సూర్య కులమనెడి సముద్రమునకు రాముడు చంద్రుడు. చంద్రునకు కలువపూలు ప్రియము. అందుచేత ఆ చంద్రునకు 'హృత్కుముదసుమములను' = హృదయమనెడు కలువపూలను చల్ల మనుట. ఆయన సాక్షాత్తు చంద్రుడు కాడు. సూర్యకులమనెడి సముద్రమునకు చంద్రుడు. అట్టి చంద్రునకు సాక్షాత్తు కలువలుకాని హృదయమనెడు కలువలు చల్లమనుట సరసముగా నున్నది.

195. ఆరభి = ఆది

ప॥ చాల కల్లలాడుకొన్న – సౌఖ్యమేమిరా॥ చాల॥

అ॥ కాలము బోనుమాటనిలచును – కల్యాణ రామ నాతో॥ చాల॥

చ॥ తలిదండ్రినేనుండ – తక్కిన భయమేల రాయని
పలుమారు నీవెన్నో – బాసలు జేసి
ఇలలో సరివారలలో – ఎంతో బ్రోచుచుండి – పె
ద్దలతో బల్కి మెప్పించి – త్యాగరాజునితో॥ చాల॥

తాత్పర్యము :

భక్తుని ఆకాంక్ష భగవంతుడు తనను సంసారము నుండి తప్పించి త్వరగా సాయుజ్యమీయ వలెనను త్వర కలిగియుంటాడు. దీనినే 'ప్రాప్యత్వర' అంటారు. ఒక

కట్టెకు రెండు వైపులా మంట ఉంటే మధ్యలో చిక్కిన చీమవలె భక్తుడు సంసారమందుండి బాధపడునట. దానిని పురస్కరించుకొని భగవంతునితో భక్తుడు కలహము బెట్టుకొనును. ఇది అట్టిదే.

ఓ రామా! నీవు చాల కల్లలాడుచున్నావు. దీని వల్ల నీకు సౌఖ్యమేమిటయ్యా! తల్లిని నేను, తండ్రిని నేను. నేనుండగా భయపడవలదని చెప్పితివి. ఎన్నెన్నో ప్రతిజ్ఞలు చేశావు. పెద్దల వద్ద పలికి వారిని మెప్పించావు. కొందరిని రక్షించావు కూడ. నావద్దకు వచ్చేసరికి అవన్నీ కల్లలయిపోయాయి. వివరము = రామావతారంలో 'ఒకసారి శరణన్నవానిని అభయమిచ్చి రక్షిస్తాను' అని చెప్పావు. కృష్ణావతారములో 'అనన్యచింత కలవారి యోగక్షేమములు వహిస్తాను' ఇత్యాదిగా ఎన్నో చెప్పావు. ఇప్పుడు అవన్నీ కల్లలు చేశావు. ఇవి కల్లలయితే నాకు సౌఖ్యము లేదు. నేను నిలదీసి అడిగితే నీకు సౌఖ్యములేదు. మంచి మాటలు సుగ్రీవాదులయిన పెద్దలవద్ద పలికి మెప్పుపొంది ఇప్పుడిలా చేస్తున్నావు. అని త్యాగయ్యగారు చమత్కారముగా ఈ కృతిని వెలువరించినారు.

196. సావేరి = రూపకం (నౌకాచరితములోనిది)

ప॥ చాలు చాలు నీ–యుక్తులు నడువదు
సారసాక్ష శ్రీకృష్ణా చాలు॥

అ॥ శూలధరాదుల కరుదైన మము గూడి
సుఖము లనుభవింపవే శ్రీకృష్ణా చాలు॥

చ॥ అధరరదనముల–గని సొక్కుచు మే
మాసించి వచ్చితిమి –
బుధ రక్షక శల్య – సారథ్య మొనరించి
బొంకు టెరుగ మైతిమి శ్రీకృష్ణా చాలు॥

2 కండ చక్కెరవంటి పలుకులు విని మేము
కామించి వచ్చితిమి
ఉండియుండి బాలుని గిల్లి మరితొట్ల
ఊచున దెరుగ మైతిమి శ్రీకృష్ణా చాలు॥

3 త్యాగరాజనుతుడని యతిప్రేమచే
తరుణులు వచ్చితిమి.

భోగిశయన మా-మాటలు మీరకు
బుద్ధిశాలి కాదునుమీ - శ్రీకృష్ణా చాలు॥

తాత్పర్యము :

నౌకలో గోపికలు కృష్ణుని చేరి అంటున్నారు. కృష్ణా! నీ యుక్తులు చాలు. నీ యుక్తులు మా వద్ద పనిచేయవు. శివాది దేవతలకు కూడ మా పొందు దుర్లభమైనది. ఇట్టి మాపొందు గూడి సుఖము లనుభవించుము. నీ అధరపానమును మేమాసించి వచ్చితిమి. శల్యసారధ్యంచేసి మా కోరికలను భంగము చేయకు. నీ తియ్యటి మాటలు విని కామించి మేము వచ్చాము. మాకు ఆశ కలిగించి భంగపుచ్చుతున్నావు. ఇది ఎలా ఉన్నదంటే చంటిపిల్లవానిని గిల్లి ఏడిపించి ఉయ్యెలలో బెట్టి ఊపినట్లున్నది. కృష్ణా! మా మొరవిని బుద్ధిమంతుడ వనిపించుకో. అని గోపికలు కృష్ణుని పొందుకోరి ప్రార్థించినారు.

197. ఖరహరప్రియ = ఆది

అ॥ చిత్ర రత్నమయ శేషతల్పమందు
సీతాపతిని ఉంచి ఊచే-సౌ

ప॥ మిత్రి భాగ్యమే భాగ్యము మనసా-సౌ
మిత్రి భాగ్యమే భాగ్యము మనసా॥ చిత్ర॥

చ॥ బాగుగ వింత రాగముల నాలాపము
సేయగా మేను-పులకరించగా
త్యాగరాజ నుతు-డగు శ్రీరాముని
తత్త్వార్థమును పొగడి చూచే సౌ॥ మిత్రి భాగ్యమే॥

తాత్పర్యము :

అనేకములగు రంగులు కలిగిన మణులు పడగలపైనున్న శేషుని పాన్పున రాముని ఉంచి ఊపే లక్ష్మణుని భాగ్యమే భాగ్యము. అనేకములయిన వింతరాగముల నాలాపిస్తూ శరీరము పులకరింపగా రాముని తత్త్వమును పొగడి చూచే లక్ష్మణుని భాగ్యమే భాగ్యమని అర్థము.

విశేషము = 'శేషతల్పమందు' అని అనుట రాముని అవతార మూలమగు నారాయణుని మనస్సు నందుంచుకొని 'ఊచుట' అనునది లక్ష్మణుని కైంకర్య భావమును

మనస్సు నందుంచుకొని 'రాగాలాపములతో తత్త్వార్థమును పాగడి' అని త్యాగయ్యగారనుట తన సేవను లక్ష్మణునియం దారోపించుట. భంగ్యంతరముగా లక్ష్మణుని సేవను త్యాగయ్యగారు తనదనే భావించుట. త్యాగయ్య గారు రామునకు ప్రియమగు పాత్రలను తానుగా భావించుట కొన్ని కృతులలో కలదు.

నోట్ : ఈ కృతిని అనుపల్లవితో ఎత్తుకొనుటయే సంప్రదాయము. సంగీత పద్ధతి అట్లున్నది. దాని ప్రకారమే ఇందు వ్రాయుట అయినది.

198. ముఖారి = ఆది

ప॥ చింతిస్తున్నాడే – యముడు॥

అ॥ సంతతము సుజనులెల్ల –
సద్భజన చేయుట జూచి॥ చింతి॥

చ॥ శూలపాశ ధరభట–జాలముల జూచిమరి మీ
కోలాహలముడిగే – కాలమా యెనే యనుచు॥ చింతి॥

2 వారిధి శోషింపజేయు – క్రూరకుంభజుని రీతి
ఘోరనరకాదులణచే–తారక నామమును దలచి॥ చింతి॥

3. దారి తెలియలేక తిరిగే – వారలైన చాలునంటే
సారమని త్యాగరాజు – సంకీర్తనము బాడేరనుచు॥ చింతి॥

తాత్పర్యము :

యముడు రామభజన చేసే సజ్జనులను చూచి చింతిస్తున్నాడు. వీరందరును మోక్షమునకే పోవుదురు. విష్ణుభక్తులను ప్రాణావసాన కాలములో యమభటులు తాకే అధికారములేదు. అది యముని ఆజ్ఞ కూడ. 'పరిహరమధుసూదన ప్రపన్నాన్ = హరి భక్తులను తాకకుడు' అని భటులకు యముని ఆజ్ఞ. అందుచేత పాపాత్ములను బాధించుటకు శూలములను పాశములను ధరించిన తన భటులను చూచి వీళ్ల కోలాహలము అంతరించే కాలము వచ్చినదని, తరువాత అగస్త్యుడు సముద్రమును శోషింపచేసినట్లు నరకమును శోషింపచేసే రామతారక మంత్రమును చూచి, మరియు మోక్షమార్గ మేదియు తెలియక తిరిగే వారయినా త్యాగరాజుని పాటలు పాడుకుంటే చాలు మోక్షమునకు పోవుదురు అనే విషయమును తలచి యముడు చింతిస్తున్నాడని

భావము.

విశేషము = దీని సారాంశమేమంటే త్యాగరాజకృతులు మోక్షప్రదములని. ఇంకొక చిన్న సూక్ష్మము. సంగీత శాస్త్రమునందు మోక్షమిచ్చే సంగీత ప్రబంధమును 'మద్రక' ప్రబంధమందురు. అని ఒక సూచన మాత్రమున్నది. దీనిని బట్టి, ఈ కృతిలో త్యాగయ్యగారిచ్చిన సూచనను బట్టి త్యాగయ్యగారి గేయములు 'మద్రక' ప్రబంధము లన్నమాట.

199. కళానిధి = దేశాది

ప॥ చిన్న నాడెనా – చేయిబట్టితివి॥ చిన్న॥

అ॥ ఎన్నరాని యూడిగము గైకొని
ఎంతో నన్ను పా–లనము సేతునని॥ చిన్న॥

చ॥ ఇట్టి వేళ విడ–నాడు దామనో
ఏలుకొందునని – ఎంచినావో తెలియ
గుట్టు బ్రోవవే – సుగుణవారినిధీ
గొప్ప దైవమా – త్యాగరాజనుత॥ చిన్న॥

తాత్పర్యము :

ఓ సుగుణ సముద్రా! రామా! నాచిన్ననాడే నాచెయ్యి పట్టుకొన్నావు. (భక్తి నిచ్చినావు అని భావము). అనేక సేవలు నాతో చేయించుకొని నన్ను రక్షించుటకు చూస్తున్నావా? లేక మధ్యలో నన్ను విడిచిపెట్టుదమనుకొన్నావా? గుట్టు తెలియ లేకున్నాను. ఏది ఏమైనా నీవు గొప్ప దైవమవు. అని అయ్యగారు చమత్కరించినారు.

200. ఆరభి - రూపకము

ప॥ చూతాము – రారే – సుద తులార – రంగపతిని॥ చూతాము॥

అ॥ సీతాపతి పూజ్యుండట – శృంగార శేఖరుడట॥ చూతాము॥

చ॥ సరిగంచు శాలువట – చౌకట్ల పోగులట
పరువంపు ప్రాయమట – పరమాత్ముడట రంగని॥ చూతాము॥

2 ముఖనిర్జిత చంద్రుడట – ముద్దుమాట లాడునట
సుఖమొసంగి బ్రోచునట – సుందరాంగుడట రంగని॥ చూతాము॥

3 ఆగమ సంచారుడట – అఖిల జగత్పాలకుడట
త్యాగరాజ సన్నుతుడట – తరుణలార రంగపతిని॥ చూతాము॥

తాత్పర్యము :

అయ్యగారు రంగనాథుని తాను తనివిదీర దర్శించుచు భక్తులను వచ్చి తాము రండని ఆహ్వానించుచున్నారు. రంగనాథుని చూతాము రండు. రంగనాథుడు శ్రీరామునకు పూజ్యుడు. శృంగార రసమునకు స్థానమయినవాడు. యౌవన మందున్నవాడు, పరమాత్ముడైన వాడు, చంద్రుని వంటి ముఖము గలవాడు, ముద్దుమాట లాడువాడు, సుఖమిచ్చి రక్షించువాడు, సుందరాంగుడు, వేదములలో సంచరించువాడు, అన్నిలోకములను రక్షించువాడు. ఓతరుణులారా! రంగని సేవించెదము రండు అని భావము.

విశేషము = సుదతులారా! తరుణలార! అని స్త్రీలను మాత్రము సంబోధించినట్లున్నది. దీని ఆంతర్యమేమంటే భగవంతుని దృష్టిలో పెట్టుకొన్నప్పుడు 'స్త్రీప్రాయ మితరం జగత్' = తక్కినవారందరును స్త్రీలే అని, దానిని బట్టి భక్తులను ఆహ్వానించినట్లు భావింపవలె.

201. పంతువరాళి = చాపు (నౌకాచరితములోనిది)

ప॥ చూడరే చెలులార! యమునాదేవి – సొగసెల్ల సంతోషమున, చూడరే॥

చ॥ ఎఱని పంకేరు హములే, అందు–ఇంపైన భృంగనాదములే చూడరే॥

2 ఇసుక దిన్నెలెంత తెలుపే, మేను–ఇంద్రనీలమువంటి నలుపే॥ చూడరే॥

3 మెటికలు వజ్రంపు శిలలే, అందు–కుటిలమైన చిన్న అలలే॥ చూడరే॥

4 హంసలరవళిచే జాల, దేవి–అదుగో చెలంగే నీవేళ చూడరే॥

5 పాలతులార పాదరిండ్లే, తేనె–లొలుకు ఖర్జూరపు పండ్లే॥ చూడరే॥

6 ఫలముచే ద్రాక్షలతలే, అందు–పచ్చని చిలుకల జతలే॥ చూడరే॥

7 వింత వింతవిరులవానే, మది–కెంతెంతో మరులయ్యేనే॥ చూడరే॥

8 కోకిలములు మ్రోసెనే, మరుడు-కుసుమశరంబుల నేసెనే॥ చూడరే॥

9 చల్లని మలయమారుతమే, కృష్ణ-స్వామిని గూడునది సతమే॥ చూడరే॥

10 రాజవదనలార! కనరే, త్యాగ-రాజ సఖుని మాట వినరే॥ చూడరే॥

తాత్పర్యము :

ఇందు గోపికలు నౌకలో కూరుచుండి యమునానది అందమును పరిసర ప్రాంతముల ప్రకృతి సౌందర్యమును వర్ణించి చెప్పుకొనుచున్నారు. 'చూడండే యమునానది ఎంత అందముగా నున్నదో! ఎర్రని పద్మములు వాటిలో ఘుంకరించుచున్న తుమ్మెదలు! ఇసుక తిన్నెలు తెల్లగానున్నవి, నీరు నల్లగా నున్నది. మెట్లు వజ్రపుమణులు, వాటిపైన వంకర తరంగాలు! నదిలో హంసలెంత బాగున్నవో! ఒడ్డున ఈ పొదరిండ్లు చూడండి, ఖర్జూరపు పండ్లు చూడండి తేనె లొలుకు చున్నవి! ద్రాక్ష తీగలు, వాటిలో పచ్చని చిలుకలు! చెట్టుక్రింద మనము నిలబడితేపూ లవాన! వీటితో మనస్సులో మోహము పెరుగుచున్నది! కోకిల కూతలు, మలయమారుతములు! మన్మథతాపం కలుగుచున్నది! మన మందరము కృష్ణునికూడ వలసి యున్నది! అతని మాటవిన వలసియున్నది' అని గోపికలు ఒకరితో నొకరు చెప్పుకొనిరి.

202. కాపి = చాపు (నౌకాచరితములోనిది)

ప॥ చూతాము రారే యీవేడ్కను-సుదతులారనేడు॥
చూతాము రారే యీవేడ్కను-సుదతులార పురు
హూతాదులక రుదైన యోడలో
యువిదలెల్ల హరిని-గూడి యాడెదరు॥ చూతాము॥

చ॥ ఒకరికొకరు గంధము నలదెదరు - ఒకరికొకరు తిలకము దిద్దెదరు
ఒకరికొకరు వీడెములొసగెదరు - ఒకరికొకరు హారము వేసెదరు॥ చూ॥

2 ఒకరికొకరు వలువలు గట్టెదరు - ఒకరికొకరు రవికెలు దొడిగెదరు
ఒకరికొకరు కౌగిలి గూర్చెదరు - ఒకరికొకరు తమలో సొక్కెదరు॥ చూ॥

3 ఒకరికొకరు పాటలు బాడెదరు - ఒకరికొకరు సరసములాడెదరు
ఒకరికొకరు హరియని చూచెదరు - ఒకరికొకరు కానక భ్రమసెదరు॥ చూ॥

తాత్పర్యము :

కృష్ణుడు గోపికలతో కూడి చేసే నౌకా విహారమును చూచుటకు దేవతలు ఆకసమున కూడి గోపికలు చేసే పనులను వర్ణించుకొనుచున్నారు... తాత్పర్యము సలభము.

203. అఠాణ = ఆది

ప॥ చెడేబుద్ధి మానురా–ఇడే పాత్రమెవరో చూడరా॥ చెడే॥

చ॥ భూవాసికి తగు–ఫలము గల్గునని
బుధులు పల్క వినలేదా మనసా
'శ్రీవాసుదేవ స్సర్వ' మనుచును
చింతించర త్యాగరాజ వినుతుని॥ చెడే॥

తాత్పర్యము :

ఇందు త్యాగయ్యగారు ఐహికముగాను ఆముష్మికముగాను పనికి వచ్చే కొన్ని ఉపదేశాలను చేయుచున్నారు. మొదట చెడే బుద్ధిని మానుమన్నారు. తరువాత ఇడే పాత్రమును తెలియుమన్నారు. తరువాత భూలోకమున నున్న వానికి చేసిన పనికి తగిన ఫలితము వస్తుందని పెద్దలు చెప్పిన మాటలను వినమన్నారు. తరువాత ఈ సర్వము వాసుదేవమయము అని భావించుమని ఉపదేశము చేసినారు. ఈ ఉపదేశములకు పరస్పర సంబంధ మున్నది.

విశేషము = ముందు చెడే బుద్ధి మానవలెను. వేదము కూడ శిక్షావల్లిలో 'యా న్య నవద్యాని కర్మాణి తాని సేవిత వ్యాని – నో ఇతరాణి' = దోషములేని పనులు చేయవలెను– ఇతరములు చేయరాదు అని చెప్పబడినది. ఇదే త్యాగయ్యగారు మొదట చెప్పినది. తరువాత సద్గతి కలిగించు పనులుగా వేదము 'దానేన ఇజ్యయా తపసా'= దానము యజ్ఞము తపస్సు అని చెప్పినది. వీటిలో మొదటి దానము. దీనిని పాత్రమెరిగి చేయవలెను. లేకపోతే విపరీత ఫలము వచ్చును. తరువాత లోకములో ఒక సామెత ఉన్నది. 'చేసుకొన్నవారికి చేసుకొన్నంత మహాదేవా' అని. అది త్యాగయ్యగారు చెప్పిన మూడవది. 'భూవాసికి తగుఫలము' అని. భూలోకము కర్మభూమి. అనగా కర్మలు చేయునది. తక్కిన లోకములు భోగభూములు. అనగా భూలోకమందు చేసిన సుకృత,

దుష్కృతముల ఫలము ననుభవించినది స్వర్గనరకాది లోకములలో. ఇది సామాన్యము. చేసిన సుకృత దుష్కృతములు బాగా ఎక్కువ అయితే వాటి అనుభవము కూడ ఈలోకమందే అని 'అత్యుత్కటైః పుణ్యపాపైః ఇహైవ ఫల మశ్నుతే' చెప్పబడినది. అందుచేత చెడే బుద్ధి మానవలెను. సత్పాత్ర మెరిగి దాన మీయవలెను. ఇది సూత్రప్రాయమైన త్యాగయ్యగారి యుపదేశము. ఇక ఈ సర్వమును వాసుదేవమయము అని జ్ఞానము కలిగియుండుట. దీనికన్న పైన అవలంబింపవలసిన బుద్ధి కలుగ వలసిన జ్ఞానమునులేదు. 'వాసుదేవ స్సర్వమితి సమహాత్మా సుదుర్లభః' = వాసుదేవుడే సర్వము అని భావించు మహాత్ముడగుట దుర్లభమని గీతావాక్యము. ఇది మోక్షవిద్యలో తుదిది. త్యాగయ్యగారు దీనిని కూడ ఉపదేశించినారు.

204. కుంతలవరాళి = ఆది

ప॥ చెంతనే సదాయుంచు కోవయ్యా॥ చెంతనే॥

అ॥ మంతుకెక్కు శ్రీ-మంతుడౌ హను
మంతురీతిగా శ్రీకాంత! చెంతనే॥

చ॥ తలచిన పనులనునే దెలిసి
తలతో నడచి సంతసింతురా
పలుమారు బల్క-పనిలేదురామ
భరతుని వలె-త్యాగరాజనుత॥ చెంతనే॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు రాముని ఒక సాటిలేని కోరిక కోరుచున్నారు. రామా! నన్నెప్పుడును నీ సన్నిధిలో ఉంచుకొనుమయ్యా! ప్రసిద్ధి కలిగి రామసేవ అనే పెద్ద సంపద కలిగిన హనుమంతునివలె నన్ను నీ చెంత నుంచుకో. నీవు మనస్సులో తలచగానే నీపనులను శిరసావహించి సంతోషముతో చేస్తాను. నీకు అంత ఇష్టము కాకపోతే భరతుని మాత్రపు సేవ (పాదుకలను మోయుట) నాకియ్యరాదా? అని అయ్యగారి ప్రార్థనము.

205. యదుకుల కాంభోజ = ఆది (ప్రహ్లాదభక్తి విజయములోనిది)

ప॥ చెలిమిని జలజాక్షుగంటే-చెప్పరయ్యా మీరు
పలుమారు మ్రొక్కెదను దయతో-బలుకరయ్యా॥ చెలిమిని॥

చ॥ శరచాపము కరముననిడి-మెరయునయ్యా ఎంతో
కరుణారసము నిండిన-కన్నులయ్యా॥ చెలిమిని॥

2 చూడచూడ మనసుకరగే-సుముఖుడయ్యా-భక్తుల
జాడ తెలిసి మాటలాడే-జాణుడయ్యా॥ చెలిమిని॥

3 శృంగారుని బాసిమేను-చిక్కినయ్యా, హరి
చెంగట మున్నే నామది - చిక్కినయ్యా॥ చెలిమిని॥

4 నాలోని జాలిని బల్క-జాలనయ్యా, హరిని
మీలో మీరే తెలిసి మర్మ-మీయరయ్యా॥ చెలిమిని॥

5 త్యాగరాజ సఖుడని-దలతునయ్యా, మీరు
బాగుగ నా అంగలార్పు-బాపరయ్యా॥ చెలిమిని॥

తాత్పర్యము :

రాక్షస భటులు ప్రహ్లాదుని నాగపాశములతో కట్టి సముద్రములో పడవేసిరి. సముద్రుడు ప్రహ్లాదునకు స్వాగతమిచ్చి తన మందిరమునకు గొనిపోయి సమస్తోపచారములను జేసినాడు. ప్రహ్లాదుడు హరిని చూచు పెద్ద కుతూహలముతో నున్నాడు, అన్వేషించుచున్నాడు. ఇంతలో ఈ మధుర దృశ్యమును చూచుటకు మునులు దేవతలు వచ్చి సముద్రమున ప్రహ్లాదుని చుట్టుచేరిరి. ప్రహ్లాదుడు వారిని హరిజాడ తెలుపుమని ప్రార్థించుచున్నాడు. ఓ దేవతలారా మునులారా! హరిని మీరు చూచినట్లయితే ప్రేమతో చెప్పండినాకు. మ్రొక్కుతానుమీకు. కరమున ధనుర్బాణములు బట్టి, కరుణారసము జాలువారు కన్నులు గలవాడు - చూచిన కొద్దియు మనసు కరిగే అందగాడు - భక్తుల మనసెరిగి మాటలాడే నేర్పరి - ఆ శృంగార మూర్తిని ఎడబాసి నా శరీరము చిక్కినది, నా మనసు హరికే చిక్కినది. నాలోనున్న పరితాప మెరిగి మీరు హరి జాడ తెలిపి నా అంగలార్పును చల్లార్చండి అని ప్రహ్లాదుని ప్రార్థనము.

విశేషాంశము = ఇది ప్రహ్లాదుని ఆవేదనముగా మనకు కనపడుచున్నది. నిజమే. కాని ఇది త్యాగయ్యగారి ప్రార్థనమే. అయ్యగారు ప్రహ్లాదభక్తి విజయరచనము ద్వారా

తన ఆత్మనే వెల్లడించుట జరిగినది. కనుకనే ఇందలి ప్రహ్లాదుడు తనకాలమునకు చాల అనంతర కాలమున పుట్టబోవు – శరచాపములను ధరించిన రాముని వెదకుచున్నాడు. ఈ విధముగా త్యాగయ్యగారు తన అన్వేషణమును ప్రహ్లాదుని యందారోపించినారు. ఇందులో భాగవతములోని 'నల్లని వాడు పద్మనయనంబులవాడు.... మల్లియ లార మీ పాదల మాటున లేడు గదమ్మ చెప్పరే' అనే గోపికల అన్వేషణము కూడ స్ఫురించుచున్నది. మరియు ఇందలి ప్రహ్లాదుడు తానే. అందుచేతనే ఈ రహస్యమెరిగిన వెంకటరమణ భాగవతార్ (త్యాగయ్యగారి శిష్యుడు) 'వ్యాసో నైగమ చర్చియా' అనే శ్లోకములో 'ప్రహ్లాద ఏవస్వయం' = తాను ప్రహ్లాదుడే అని త్యాగయ్యగారిని వర్ణించినారు.

206. ఖరహరప్రియ = ఆది (దీనిని భైరవియందును పాడుదురు)

ప॥ చేతులార శృంగారము–చేసి చూతును శ్రీరామ॥ చేతులార॥

అ॥ సేతుబంధన–సురపతీ–సర। సీరుహ భవాదులు పొగడనా॥ చేతులార॥

చ॥ మెఱుగుబంగా రందెలు బెట్టి। మేటియౌ సరిగవల్వలుగట్టి॥
సురతరు సుమములు–సిగనిండ జుట్టి।
సుందరమగు మో–మున ముద్దుబెట్టి॥ చేతులార॥

2 మొలను కుందనపు గజ్జెలు గూర్చి)–ముద్దుగా నుదుటను తిలకము దీర్చి)॥
అలకలపై రావిరేకయు జార్చి)–అందమైన నిన్నురమునజేర్చి)॥ చేతులార॥

3 ఆణిముత్యాల కొండెవేసి – హొసుగా పరిమళగంధము బూసి
పాణిసురటిచే విసరగ వాసి–వాసి యనుచు త్యాగరాజనుత అన్నిరోసి॥ చేతు॥

తాత్పర్యము :

ఓ రామా! ఓ సేతుబంధనా! నా చేతులారగా నిన్ను అలంకరించి చూచుకొంటాను. ఓ సురపతీ! బ్రహ్మాది దేవతలందరు నా అలంకారము చూచి మెచ్చే రీతిగా నిన్నలంకరిస్తాను. బంగారు అందెలు పెడతాను, జరీబట్టలు కట్టుతాను, కల్పవృక్షపు పూలు సిగనిండ పెడతాను, ముఖమును ముద్దు బెట్టుకుంటాను, మొలకు బంగారు గజ్జెలు పెడతాను, కస్తూరీతిలకము నుదుటను పెడతాను, ముంగురులలో రావిరేక పెడతాను, నిన్ను కొమ్ముకు హత్తుకుంటాను, ఆణిముత్యాలతో కొండెసిగ చుట్టుతాను, పరిమళ గంధము పూస్తాను, విసరకర్రతో విసురుతాను. వాసివాసి అంటాను. (వాసి వాసి ఓసి

ఓసి అనేది పిల్లలను ముద్దులాడే ధ్వన్యనుకరణ పదములు) ఇతర విషయములన్నిటిని రోసి నిన్నలంకరించుకొని చూచుకొంటాను. అని త్యాగయ్యగారి ఆనందము.

విశేషము = పై అలంకారము సాధారణముగా కృష్ణుని విషయముగా చూచెదము. కృష్ణుని బాల్య విశేషములు వర్ణింపబడుటలో పై అలంకారములు యశోద కృష్ణునకు చేసినది. ఈ కృతిలో త్యాగయ్యగారు బాల రామునకు తాను మాతయై మనసార అలంకరించి పొందిన ఆనందానుభవ మున్నది. పైన త్యాగయ్యగారు చెప్పినవి పెరియాళ్వారు అనే పరమభక్తులు రచించిన పూచ్చుడల్-కాప్పిడల్ - అనే అరవ ప్రబంధముల యందున్నవి.

207. రీతిగౌళ = ఆది

ప॥ చేరరావ దేమిరా - రామయ్య చేర॥

అ॥ మేరగాదురా ఇక మహా-మేరుధీర. శ్రీకర॥ చేర॥

చ॥ తలి దండ్రిలేని బాల-తన నాథుగోరురీతి
పలుమారు వేడుకొంటే - పాలించరాదా॥
వలచుచు నేను నీదు - వదనారవిందమును॥
తలచి కరంగగ జూచి - త్యాగరాజ సన్నుత॥ చేర॥

తాత్పర్యము :

రామా! నన్ను చేరరావేమయ్యా! ఇది నీకు న్యాయము కాదు. మేరుధీరుడవు. శ్రీకరుడవు. తలిదండ్రులులేని అనాథ బాల భర్తను కోరుకొన్నరీతిగా నిన్ను నేను పలుమార్లు వేడినా పాలించుటకు నీవు రాకున్నావు. నీముఖపద్మమును చూచి కరగుచు నిన్ను వలచియున్న నా చెంతకు రావేమి? అని త్యాగయ్యగారి ప్రార్థనము.

208. తోడి = ఆది

ప॥ చేసిన దెల్ల, మరచితివో ఓ రామ రామ॥ చేసిన॥

అ॥ ఆసగొన్నట్టి న-న్నలయించుటకు మున్ను చేసిన॥

చ॥ ఆలో నీకైన భక్తు-రాలో యనుచు నాడు
ప్రాలు మాలక రవి-బాలుని చెలిమియు॥ చేసిన॥

2 భాషతప్పకను వి-భీషణుని కొర కాది
శేషుడగు తమ్ముని-పోషించమని రాజు॥ చేసిన॥

3 రామ! శ్రీ త్యాగరాజ ప్రేమావతార! సీతా
భామ మాటలు దెల్పు-భీమాంజనేయు బ్రహ్మ॥ చేసిన॥

తాత్పర్యము :

రామా! పూర్వము నీవెందరినో రక్షించినావు. ఇప్పుడు నన్ను రక్షింపకున్నావు. పూర్వము చేసిన పనులన్నీ మరచినావా? అని రామునకు త్యాగయ్యగారి ప్రశ్న. సీతనీకు ఆలు మరియు భక్తురాలు కూడ. అట్టి సీతను రక్షించుటకై అలనాడు సుగ్రీవుని చెలిమి చేశావు. విభీషణుని లంకకు రాజును చేసెదనని ప్రతిజ్ఞచేసి, లక్ష్మణుని ద్వారా ఆపని చేయించావు. లంకనుంచి తిరిగి వచ్చిన హనుమంతుని ద్వారా సీతమాటలు విని ప్రత్యుపకారముగా హనుమంతుని భవిష్యద్బ్రహ్మగా చేశావు. నా ప్రేమయే నీరూపమున అవతార మెత్తినదని భావించి నిన్ను ఆరాధించుచున్న నన్ను మాత్రము రక్షింపకున్నావు. అని త్యాగయ్యగారి ఎత్తిపొడుపు.

209. సావేరి = చాపు (దివ్యనామము)

ప॥ జయజయ సీతారామ్ - జయజయ రఘురామ్॥
జయజయ కల్యాణ సుందర కల్యాణ రామ్॥ జయజయ॥

చ॥ శరణాగత వత్సలాగమసార
పరమపురుష! నమ్మితిని మనసార!॥ జయజయ॥

2 పరిపూర్ణకారుణ్య - పారావార
సురముని గణ యోగి-గణపరివార॥ జయజయ॥

3 నీ మర్మమెరుగ బ్రహ్మాదులవశమా
రామచంద్ర! నిజదాస వశమా?॥ జయజయ॥

4 నిశిచరహరణ! ధరాధిపరాకా
శశిముఖ నాపై నీ-కింత పరాకా॥ జయజయ॥

5 కావవేనను సచ్చి-దానందఘనమా
నావంటి దీనుని-బ్రోచుట ఘనమా?॥ జయజయ॥

6 నీవే దైవమని – నెర నమ్మినాను
దేవ నీకు నాదు మేనమ్మినాను॥ జయజయ॥

7 అజముఖ పాలన – నిత్యాగరాజా
త్మజాపతినుత పా–లిత త్యాగరాజా! జయజయ॥

తాత్పర్యము :

తాత్పర్యము సులభము. కాని కఠిన పదముల అర్థము, విశేషమున్న దానిని మాత్రం వ్రాస్తాను. పాఠకులు గమనించుకొన ప్రార్థన. శరణాగత వత్సలుడా! వేదముల సారమైనవాడా! పరిపూర్ణ కరుణా సముద్రుడా! దేవతలు, మునులు, యోగులు పరివారమైన వాడా! నిజదాసులకు వశమైనవాడా! రాక్షసులను హరించువాడా! పూర్ణ చంద్రముఖా! నను బ్రోచుట నీకొక లెక్కా? నిన్ను నమ్మినాను, నీకు నామేను అమ్మినాను (నీదే అని) బ్రహ్మ మొదలగు వారిని పాలించువాడా! నిత్యాగరాజాత్మజా పతినుత = నిత్యమును శివునిచే నుతింపబడువాడా! ఇంతే తాత్పర్యము. జయించుము. అని పల్లవిని కలుపుకోవలెను.

210. గౌరి = ఆది (దివ్యనామము)

ప॥ జయజయ శ్రీరఘురామ, న–జ్జన హృదయార్ణవసోమ॥

చ॥ నమ్మితమున నామేను నీ–సొమ్మని వేడుకొన్నాను॥

2 గతి హీనుడనై అలసి, వ–చ్చితి నీవే కావలసి॥

3 అన్యులనే గోరితినా, రా–జన్య! నిన్ను దూరితినా॥

4 నిన్నే నామది కోర, రామ–నన్నలయించుట మేర॥

5 నను మరువకు శుభకరమా, ని–న్ననుసరింపనాతరమా॥

6 మాకిక నెవ్వరులేదు, చూడ–నీ కిది న్యాయము కాదు॥

7 ఆదరించను వరాకా, ఈ–భేదము లిక నెందాక?

8 విపరీతము లెంచితినో, ఏ–మపరాధము చేసితినో॥

9 నీసరి వేల్పులు లేరు, రామ–నాసరి దీనులు లేరు॥

10 తెలుపగ నెవ్వరు లేదా, నా–కలువరములు వినరాదా॥

11 వాసి లేదను చలమా, నే–జేసిన పూజాఫలమా॥

12 పాదములకు వందనము, నా-మీదనేల దంధనము?

13 తాళజాల ఈకట్టు, రామ-జాలమేల చెయిబట్టు॥

14 నరవరు లీధరలోన, నీ-కరుణలేదనగ వలెనా॥

15 నేర మెంచుటకు పోక, సరి-వారల నవ్వగ నీక॥

16 మానము నీదే సుమ్మీ, అభి-మానమున నేలుకొమ్మీ॥

17 పాపములేగతియంటి, కలి-బాధ తరముగా దంటి॥

18 చక్కని నీరూపమున, గని-సొక్కితి నా హృదయమున॥

19 కటకట పావననామ, మన-సిటు తిరుగనిశ్రీరామ॥

20 ఆసించిన నాపైని, నీ-కాశు నిండదయరాని॥

21 నాభాగ్యము నీదేరా, పద్మ-నాభామర పరివారా॥

22 చాలు చాలు రఘువీరా, న-న్నేలు కోరమనసార॥

23 రాజితనవమణిభూష, త్యాగ-రాజవినుత మృదుభాష॥

తాత్పర్యము :

23 ఏకావృత్త చరణాలది ఇది. చిన్నచిన్న భావాలే వున్న వాక్యాలు కావటం వల్ల తాత్పర్యము సులభమని వ్రాయలేదు.

211. అసావేరి = రూపకం

ప॥ జనక జాసమేత, దు-ర్జనాగపురుహూత! జనక॥

అ॥ సనకాది సుముని గీత-సజ్జనగణ పారిజాత॥ జనక॥

చ॥ దేవ దేవ సకల జీవ-భువనేశా
భావజరిపు భావ సదన-భవ్యగుణమణికోశ॥ జనక॥

2 జలజాప్త కులాంభోనిధి-జలజహర! పరేశా॥
జలజోరుణ చరణాసుర-జలదాశుగ శ్రీశ॥ జనక॥

3 శ్యామసుందరాంగ రంగ-శయన విగతమాయ॥
తామసజన హృద్దూర-త్యాగరాజగేయ॥ జనక॥

తాత్పర్యము :

ఇందు సంస్కృత సంబోధనములు మాత్రమున్నవి. వరుసగా ప్రతి పదార్థము మాత్రము వ్రాయబడుచున్నది. సీతతో కూడినవాడా! దుర్జనులనెడి కొండలకు ఇంద్రుడా! సనకాది మునులచే కీర్తింపబడువాడా! సజ్జనులకు కల్పవృక్షమా! దేవదేవా! అందరికీ ఆత్మ అయినవాడా! లోకములకు ప్రభువా! శివుని హృదయమందుండు వాడా! మంచి గుణములకు కోశమైన వాడా! సూర్యుని కులమనెడి సముద్రమునకు చంద్రుడా! పరాత్పరుడా! పద్మమువలె ఎర్రని పాదములు గలవాడా! రాక్షసులనెడి మేఘములకు గాలి అయినవాడా! శ్రీశా! శ్యామసుందరాంగా! శ్రీరంగనాథా! మాయ అంటనివాడా! తామసజనులకు దూరమయినవాడా! త్యాగరాజుచే కీర్తింపబడువాడా! ఇట్లీకృతి సంబోధన మయముగా నడచినది.

212. శుద్ధ సీమంతిని = ఆది

ప॥ *జానకీరమణ. భక్తపారి-జాత - పాహి సకలలోక శరణ॥* *జానకీ॥*

అ॥ *గానలోల. ఘనతమాల నీల-కరుణాలవాల సుగుణశీల॥* *జానకీ*

చ॥ *రక్తనళిన దళ. నయన నృపాల-రమణీయానన ముకురకపోల॥*
భక్తిహీన జనమదగ జజాల-పంచవదన. త్యాగరాజ పాల॥ *జానకీ॥*

తాత్పర్యము :

జానకీపతీ, భక్తులకు కల్పవృక్షమయినవాడా, సమస్త లోకములకు రక్షకుడయిన వాడా, గానమందు ఆసక్తి కలవాడా, మబ్బువలెను, చీకటి చెట్లవలెను నల్లనైనవాడా, కరుణకు స్థానమయినవాడా, సుగుణములే కలవాడా, ఎర్రనిపద్మమువంటి కనులు గలవాడా, నరపాలుడా, అందమయిన ముఖము గలవాడా, అద్దము వంటి చెక్కిళ్ళు గలవాడా, భక్తి లేని జనులనెడి ఏనుగులకు సింహమయినవాడా, త్యాగరాజును రక్షించువాడా, రక్షించుము. అని తాత్పర్యము.

విశేషము = ఇందు అన్నియు సంస్కృత భాషా సంబోధనములు. క్రియ పాహి అని ఉండుటచేత ఇది త్యాగయ్యగారి సంస్కృత కృతి. సంబోధనాంతములయందు అనుప్రాస అనెడి శబ్దాలంకారము పాటింపబడినది.

213. పూర్వికల్యాణి = రూపకము

ప॥ జ్ఞానమొసగరాదా – గరుడగమన వాదా॥ జ్ఞానమొసగ॥

అ॥ నీ నామముచే నామది–నిర్మలమైనది॥ జ్ఞానమొసగ॥

చ॥ పరమాత్ముడు జీవాత్ముడు–పదునాలుగు లోకములు
నరకిన్నర కింపురుష–నారదాది మునులు॥
పరిపూర్ణ. నిష్కలంక–నిరవధి సుఖ దాయకా
వరత్యాగరాజార్చిత–వారము తాననే॥ జ్ఞానమొసగ॥

తాత్పర్యము :

ఓ గరుడగమనా! రామా! నీ నామస్మరణముచేత నా మనస్సు నిర్మలమైనది. కనుక నాకు ఆజ్ఞాన మొసగుము. ఓ పరిపూర్ణుడా! ఓ నిష్కలంకుడా! అంతులేని బ్రహ్మానంద సౌఖ్యము నొసంగు రామా! ఇక నాతో వాదము చేయకు. పరమాత్ముడు, జీవాత్ముడు, చతర్దశభువనములు, నరులు, సురలు, కిన్నర కింపురుషులు, నారదాది మహర్షులు వీరందరు పరమాత్మతో భేదము లేనివారే. అనగా అద్వైత భావము గలవారే. వీరందరును నేనే అనే అద్వైత జ్ఞానము నాకీయవలసినది అని త్యాగయ్యగారు అర్థించినారు.

విశేషము = పరమాత్మను చేరుటకు రెండు మార్గములున్నవి. భక్తి, జ్ఞానము. 'జ్ఞానాదేవహి కైవల్యం' = జ్ఞానమువలననే కైవల్యము సిద్ధించును' అనికొందరి మతము. 'మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవ గరీయసీ' = మోక్షసాధనములలో భక్తియే గొప్పది' అని కొందరి మతము. జ్ఞానులు జ్ఞానము ఒక సముద్ర మయితే భక్తి దానిలోని ఒక తరంగము అని భావింతురు. భక్తులు భక్తి ఒక సముద్రమయితే జ్ఞానము దానిలోని ఒక తరంగమని భావింతురు. జ్ఞానులు సమస్త ప్రపంచము, ప్రపంచములోని సమస్తమును బ్రహ్మమే. 'సోహం' బ్రహ్మము నేనే అని భావింతురు. భక్తులు పరమాత్ముడు తనకు రక్షకుడు. శ్రవణకీర్తనాది నవ విధరూపమగు భక్తితో పరమాత్ముని భజింపవలెను. దాని వలన ముక్తి అని భావింతురు. అయినను భక్తులు జ్ఞానమును వదలలేదు. జ్ఞానులు భక్తిని వదలలేదు. వేద వ్యాసమహర్షి భాగవత ప్రస్తావమున 'భగవన్నామస్మరణము చేత మనస్సు నిర్మలమగును. నిర్మలమనస్సునందు జ్ఞాన ముద్భవించును' అని చెప్పెను. పైన పేర్కొనిన అన్నిటిని ఎరిగిన త్యాగయ్యగారు జీవితమున ఎక్కువ భాగము భక్తి నవలంబించి భక్తిలోని ఒక భాగమగు నామస్మరణముచే మనో నైర్మల్యమును పొంది జ్ఞానమును ప్రసాదింపు మని రాముని కోరినారు.

214. బేగడ = ఆది

ప॥ తనవారితనము లేదా– తారకాధి పాననా వాదా॥ తన॥

అ॥ ఇనవంశరాజుల కీగుణము– లెన్నడైన గలవా నాదుపై॥ తన॥

చ॥ అలనాడు అన్న మారగించువేళ – బలువానరుల పంక్తి నుంచలేదా॥ తన॥

2 పేర పేరబిలిచి హారములు ప్రేమ– మీర మీరొసగ లేదా నాదుపై॥ తన॥

3 రామ రామ రామ. రచ్చసేయక వే– తామసంబదేల – త్యాగరాజనుత॥ తన।

తాత్పర్యము :

చంద్రుని వంటి ముఖముగల ఓ రామా! నీకు నాయందు వీడు నావాడు అనే అభిమానము లేదా? అట్టి అభిమానముండుట వాదు (నింద) కాదు. నీ మూలపురుషులయిన సూర్యవంశ రాజులకు తనవారిని తనవారుగా భావింపని గుణము ఎప్పుడైనా ఉన్నదా? లేదు. నీకెట్లు వచ్చినది. (సూర్యవంశ ప్రభువులు తమ రాజ్యములోని ప్రజలను బిడ్డలుగా అభిమానించి పరిపాలించిరని ప్రసిద్ధి). నీ మూలపురుషుల వరకు పోనేల. నీవే నీ పట్టాభిషేకానంతరము సజాతి కాని వానరులను భోజన సమయములో తనవారని భావించి పంక్తియందు కూరుచుండబెట్టు కొన్నావుకదా! వానరుల నందరిని పేరు పేర పిలిచి హారములు ఇచ్చినావు కదా! మరి ఈ తనవారితనము నాపై మాత్రము చూపకున్నావు. ఇక రచ్చచేయకు. జాగుచేయకు అని అయ్యగారు శ్రీరాముని ప్రార్థించినారు.

విశేషము = పట్టాభిషేకానంతరము వానరులను రాముడు తన వారుగా భావించి తన పంక్తిన విందు బెట్టినాడు. మరియు అందరికి కానుకలిచ్చుచు ఒక రత్నాల హారమును సీతచేతికిచ్చి 'ప్రదేహి సుభగేహారం యస్యతుష్టాసి భామిని' = సీతా! ఈ హారమును నీ కిష్టమయిన వాని కిమ్ము' అన్నాడు. సీత ఆ హారమును హనుమ కిచ్చినది. త్యాగయ్యగారు ఈ పై విషయములను మనస్సున నుంచుకొని హనుమదాదులయందు జూపిన అభిమానమును నాయందు కూడ జూపుమని రాముని వేడుకొన్నారు.

215. భూషావళి = ఆది

వ॥ తన మీదనే చెప్పుకోవలె గాకను నిన్నాడ బనిలేదురా॥ తన॥

అ॥ చనువున కొంత బల్కేవు ఈ । సున కొంత బల్కేవను నేర మెల్ల॥ తన॥

చ॥ ఒకవేళ నిన్ను ప్రేమమీర మది।నుంచి మంచి పూల పూజింపుచు
ఒకవేళ కోప గించి నిన్ను దూరు। చుంటిగాని రామ త్యాగరాజ నుత॥ తన॥

తాత్పర్యము :

రామా! నీవను కొనుచున్నావు ఏమని? త్యాగరాజా చనవుతో కొన్ని మంచిమాటలు నాతో మాట్లాడుదువు. కొంతసేపటికి కోపముతో కొన్ని మాటలు పలుకుదు వేమి? నాతప్పేమి? అని. రామా! నిన్నేమియు దూషింప కూడదయ్యా! నా కర్మకు నన్నే నేను దూషించు కొనవలెను. నామనస్సులోని చాంచల్యము చేతనే ఒకసారి నిన్ను నిందించు చున్నాను. ఇది నాతప్పేకాని నీ తప్పు కాదయ్యా? అని అయ్యగారు రామునితో నివేదించుకొన్నారు.

విశేషము = భక్తులు భగవంతుని తోడి విరహ సంగమముల వలన కొంత తడవు ఆయనను దూరుదురు, కొంత తడవు ఆయనను పొగడుదురు. తుదకు తప్పంతయు తనదేకాని, తమ దుఃఖ మునకు ఇతరులెవ్వరును కారణము కాదను నిశ్చయమునకు వత్తురు. భరతుడు కేకయపురము నుండి అయోధ్యకు వచ్చును. అప్పటికి రాము డడవి చేరుకొన్నాడు. ఈ తప్పెవరిది ? అని ఆలోచించినాడు. 'నమంధరాయాః' ఇత్యాది= మంధరదికాదు. దశరథునిదికాదు. తన తల్లిది కాదు, అని తలచినాడు, మరెవరిది? 'మత్పాప మే వాత్ర నిమిత్తమాసీత్ వనప్రయాణే రఘునందనస్య' = రాము డడవికి వెళ్లుటకు తన పాపమే కారణము' అని నిశ్చయించుకొన్నాడు. అదేవిధముగా తనమీదనే చెప్పుకోవలె' అని భావించినారు. త్యాగయ్యగారు.

216. గరుడధ్వని = రూపకం

ప॥ తత్త్వ మెరుగ తరమా పర। తత్త్వ మెరుగ తరమా॥

అ॥ 'తత్త్వ మసి' యనే వాక్యా।ర్థము రామ నీవను పర॥ తత్త్వ॥

చ॥ తామ సరాజ సగుణముల। తన్ను కోళ్లు బోవయా
రామభక్తుడైన త్యాగ। రాజవినుత వేద శాస్త్ర॥ తత్త్వ॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు ఒక ఆశ్చర్యాన్ని వెళ్ల బుచ్చుచున్నారు. 'తత్త్వ మెరుగ తరమా' అని. తత్త్వము (యథార్థస్థితి) ఎరుగుట కష్టము. పరతత్త్వము నెరుగుట కూడ కష్టము.

'తత్త్వమసి' అని మహా వాక్యము, ఈ మహావాక్యానికి ఓ రామా! అర్థము నీవే అను అర్థమును ఎరుగుట తరమా? రామభక్తుడైన త్యాగరాజునిచే స్తుతింపబడు ఓరామా! తామస రాజసగుణములతో వాద యుద్ధాలు చేసుకుంటూ కాలం గడుపుతారుకాని తత్త్వాన్ని పరతత్త్వాన్ని ఎవరు తెలుసుకొన లేకున్నారని త్యాగయ్యగారి అభిప్రాయము.

విశేషము = 'తత్త్వమసి' అని ఒక ఉపనిషద్వాక్యమున్నది. ఆవాక్యము ఉద్దాలకుడు శ్వేత కేతువుతో పలికినది. ఓ శ్వేత కేతూ! తత్ = ఆ బ్రహ్మము, త్వం = నీవు, అసి = అగుచున్నావు. అని జీవ బ్రహ్మములకు ఐక్యమునుప దేశించు వాక్యమిది. త్యాగయ్యగారు ఆ వాక్యమును రామపరముగా అన్వయించినారు. ఇట్లు, ఓరామా! తత్ = ఆ బ్రహ్మము, త్వం = నీవు, అసి = అగుచున్నావు. అని.

'తత్త్వమసి యనే వాక్యార్థము రామ నీవు' అని త్యాగయ్య గారు రామపరముగా అన్వయించినారు. అనగా రాముడే పరబ్రహ్మమని, పరతత్త్వమనియు పిండితార్థము. తామసరాజసు లిది ఎరుగ లేక తన్నులాడుకొందురని భావము. రాముడే పరబ్రహ్మమని ఉపనిషద్వా క్యమున్నది. 'రమంతే యోగినోనంతే సత్యానందే చిదాత్మని। ఇతిరామపదే నాసౌ పరంబ్రహ్మ భిధీ యతే' = సత్యానంద స్వరూపుడు, జ్ఞాన స్వరూపుడు అనంతుడు అయిన పరబ్రహ్మయందు యోగులు రమించుచున్నారు కనుక (ధ్యానించి సుఖించుచున్నారు కనుక) పరం బ్రహ్మ రామ అనే పదముతో చెప్పబడుచున్నది. అని. ఆపరం బ్రహ్మమే రాముడు. ఇది తత్త్వము. దీని నెరుగుట సామాన్యులకు తరముగాదని అయ్యగారి అభిప్రాయము.

217. తోడి = రూపకం

ప॥ తప్పి బ్రతికి పోవ తరమా। రామ కలిలో॥

అ॥ ముప్పున విషయ తటాకమున మనుగక దృఢమనసై॥ తప్పి॥

చ॥ కంచు మొదలు లోహా। కనకములను జూచి విస
మంచు మరియు పెంకులనుచు। నెంచి అంటని మనసై॥ తప్పి॥

2॥ నంగనాచుల మానగు। అంగవస్త్రముల బాగగు
ముంగురులను గని అంత। రంగ మునను ఆసింపక॥ తప్పి॥

3॥ జాజి మల్లె మందారస। రోజములను మనసార
రాజ పథముచే త్యాగ। రాజనుతుని పూజించక॥ తప్పి॥

తాత్పర్యము :

మానవుని సద్గతికి పోనీక క్రిందికి గుంజేవి చాలా ఉన్నాయి. శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము ఇవి మానవుని ఆకర్షించి తాము తటాకమై (చెరువు) మానవుని ముంచుతాయి. ఇక కంచు మొదలుకొని బంగారము వరకు కొన్ని లోహములున్నాయి. ఇవి కూడ ఆశ కలిగించి మానవుని అధోగతి పాలు చేస్తాయి. మరియు కపట విలాసములు గల స్త్రీలు, వారు ధరించు రంగుల చీరెలు, వారి ముంగురులను చూచి మానవులు కామ మోహితులై భ్రష్టు లౌతారు. పైన చెప్పిన వాటికి లొంగక బంగారమును చూచి చిల్ల పెంకులని, విషమనియు భావించి, స్త్రీలపై వ్యామోహము చెందక, దృఢమైన మనస్సుతో వాటిని జయించి తప్పి బ్రతుకుట (మోక్షము చెందుట) ఈ కలిలో తరముకాదు. కాని శ్రీరాముని రాజపదముతో (భక్తితో) పూలతో పూజిస్తే కలి విషయములను తప్పించుకొన వచ్చును. ఆ పూజ లేకపోతే వాటిని తప్పి బ్రతుక తరము కాదు. అని అయ్యగారు రామ పూజాప్రభావమును చెప్పినారు.

218. ముఖారి = ఆది

ప॥ *తలచినంతనే నా । తను వైతే జల్లనెరా*

అ॥ *జలజవైరి ధరాది విధీంద్రుల।*
చెలిమి పూజలందిన నిను నే॥ *తలచినంతనే॥*

చ॥ *రోటికి గట్టదగిన నీలీలలు*
మూటి కెక్కువైన నీదు గుణములు
కోటి మదన లావణ్యమైననే
సాటిగాని నీ దివ్యరూపమును *తలచినంతనే॥*

2॥ *నిద్రాలస్య రహిత శ్రీరామ*
భద్రా నిలజ సులభ! సంసార
ఛిద్రార్తిని దీర్చే శక్తిని విధి
రుద్రాది వినుత మౌ చరితంబును॥ *తలచినంతనే॥*

3॥ *పాద విజితముని తరుణీ శాపా*
మోద త్యాగరాజ నుత ధరాపా
నాద బ్రహ్మా నంద రూపా
వేద సారమౌ నామధేయమును॥ *తలంచితనే॥*

తాత్పర్యము :

ఓరామా! బ్రహ్మ రుద్రుల పూజల నందిన నిన్ను, రోటికి గట్టబడిన నీ లీలలను, త్రిగుణాతీతములయిన నీ గుణములను, కోటిమన్మధుల లావణ్యము సాటిరాని నీ దివ్య రూపమును, నిద్ర, మందకొడి తనము లేని ఓ రామ భద్రా! హనుమంతునికి వశమైన వాడా! సంసార బాధలను తీర్చెడి నీ శక్తిని, బ్రహ్మరుద్రులు పొగడెడి నీ చరిత్రమును తలచిన మాత్రముననే నా శరీరము జలదరించు చున్నది. అహల్యాశాపమును దీర్చిన వాడా! సంతోషముకల త్యాగరాజునిచే నుతింప బడువాడా! సంగీత స్వరూపుడా! వేదములలో సారమైన నీ నామధేయమును తలచినంతనే నాఒడలు జల్లు మనుచున్నది. ఈ కృతిలో స్మరణ సౌఖ్యము చెప్పబడినది.

219. బలహంస = ఆది

ప॥ తలిదండ్రులు గల పేరుగాని। ఇల నీ సరిదైవము లెవరే॥

అ॥ ఇలు కలశ సముద్రము గాకను నీ । కిల్లాలు విదేహ తనయ భళీ॥ తలి॥

చ॥ గిరి శాది విధీంద్రార్క శశాంకా। మరకోటులు వానరులై కొలువ
దర చక్రఫణీంద్రులు సోదరులై। తగి వేడగ త్యాగరాజ వినుత॥ తలి॥

తాత్పర్యము :

నీవంటి దేవుడు, నీకు సాటిదేవుడు ఈ భూమిలో లేరు. అని త్యాగయ్యగారన్నారు రామునితో. వెంటనే త్యాగయ్యగారికి రాముని నుండి మాట వినపడినది. త్యాగయ్యా! నేను దేవుడను కాను. మానవుడను. కౌస్యల్యా దశరథుల పుత్రుడను' అని, త్యాగయ్యగారంటున్నారు. రామా! వారు నీ తలిదండ్రులవటం నామ మాత్రమే కాని నిజము కాదు. మరి నిజమేమి? నీవు క్షీర సముద్ర శాయివగు నారాయణుడవు. నీ ఇల్లాలు సాక్షాత్తు లక్ష్మి. ఆమె విదేహ తనయ. ఆమె అయోనిజ, మరి శంఖ చక్రములు, శేషుడెచట నందువా? భరతశత్రుఘ్నులు శంఖచక్రములు. లక్ష్మణుడాది శేషుడు. అదీకాక సమస్త దేవతాకోటులును వానరులై నిన్ను కొలుచుచున్నారు. రామా! ఇదయ్యా! నీ స్వరూపము. అని త్యాగయ్య గారు రాముని అసలు వైభవము నుగ్గడించినారు.

220. పున్నాగ వరాళి - ఆది (దివ్యనామము)

ప॥ తవ దాసోహం తవదాసోహం। తవదాసోహం దాశరథే ॥ తవ॥

చ॥ వరమృదుభాష, విరహిత దోష। నరవర వేష దాశరథే॥ తవ॥

2 సరసి జనేత్ర పరమపవిత్ర! సురపతిమిత్ర. దాశరథే॥ తవ॥

3 నిన్ను కోరితిరా. నిరుపమ శూరా। నన్నేలుకోరా. దాశరథే॥ తవ॥

4 మన వినివినుమా. మరువ సమయమా। ఇనకులధనమా. దాశరథే॥ తవ॥

5 ఘనసమనీలా. మునిజన పాలా। కనక దుకూలా. దాశరదే॥ తవ॥

6 ధర నీవంటి దైవములేదంటి। శరణను కొంటి. దాశరథే॥ తవ॥

7 ఆగమ వినుత. రాగ విరహిత। త్యాగరాజనుత. దాశరథే॥ తవ॥

తాత్పర్యము :

ఓ రామా! నేను నీకు దాసుడను అని తాత్పర్యము, అన్నీ సంస్కృత సంబోధనలు మాత్రమే.

విశేషము = పల్లవి రెండు చరణములు సంస్కృతము, తక్కిన చరణములు తెనుగు. తాత్పర్యము సులభము. ఈ కృతి యందు రెండు భాషలున్నవి కనుక దీనిని మణి ప్రవాళకృతి అనవచ్చు.

221. భైరవి = చాపు (నౌకాచరితము)

ప॥ తనయందే ప్రేమ- యనుచు విరిబోణులు
తల తెలియక నాడెదరు॥

అ॥ అనయము మోహము । మీరగ కృష్ణుడు
అందరి కన్నిరూ । వము లెత్తి యాడగ॥ తన॥

చ॥ కొందరి బంగారు। కొంగులు బట్ట
కొందరి పదములు । బాగుగ నెట్ట
కొందరి సాగసును। కనులార జూడ
కొందరి మనసు। దెలిసి మాటాడ॥ తన॥

2 కొందరి యంక। మునను బవ్వళింప
కొందరి పెదవుల। బలకెంపు లుంచ
కొందరి తనువుల। కరలీల సేయ
కొందరి వెనుక నిలచి జడ వేయ॥ తన॥

3 కొందరి నుదుట కస్తురి బొట్టు బెట్టు
కొందరి తళుకు చె। క్కుల ముద్దు బెట్టు
కొందరి పాలిండ్ల । పన్నీరు చిల్క
కొందరితో త్యాగ। రాజనుతుడు పల్క॥ తన॥

తాత్పర్యము :

కృష్ణుడు గోపికలు నౌకలో విహారం చేస్తున్నారు. అందరికి అన్ని రూపములతో కృష్ణుడు లీలలు చేస్తున్నాడు. కొందరి బంగారు కొంగులు పట్టుకొను చున్నాడు. కొందరి కాళ్లను కాళ్లతో నెట్టు చున్నాడు. కొందరిని బాగా చూచు చున్నాడు. కొందరితో మాటలాడు చున్నాడు. కొందరి తొడల మీద పవ్వళిస్తున్నాడు. కొందరి పెదవులను కొరుకుచున్నాడు. కొందరి మేనిపై చెయ్యి వాల్చుచున్నాడు. కొందరికి వెనుకనిల్చి జడ వేయుచున్నాడు. కొందరికి కస్తూరి బొట్టు పెట్టుచున్నాడు. కొందరి చెంపల మీద ముద్దు బెట్టుచున్నాడు. కొందరి చనులపై పన్నీరు చల్లుచున్నాడు. ఈవిధంగా కృష్ణుడు అనందరికీ అన్ని రూపాలతో ఆనందము కలుగ జేస్తూ ఉంటే ఒక్కొక్క గోపిక కృష్ణునకు తనయందే ప్రేమ అని భావించుచున్నది.

222. దేవగాంధారి = ఆది (ప్రహ్లాద భక్తివిజయము)

ప॥ తనలోనే ధ్యానించి–తన్మయమే గావలెరా॥ తన॥

చ॥ తనగుహలో తానుండెడు – తావును దెలియగ వలెరా॥ తన॥

2 నీ మర్మ మాక్షణమే – నిశ్చయమై తెలుసునురా॥ తన॥

3 ఏనను మాయావేళ – ఏ వంకో తెలియదురా॥ తన॥

4 తొలికర్మమే బలము – తోయ కూడదు విధికి॥ తన॥

5 ప్రకృతి స్వభావములు – ప్రజ్వలించుచు నుండ॥ తన॥

6 లక్ష్యము జేయరు మదిలో – లక్షాంతరములకైనాహా తన॥

7 మ్రింగిన పళ్ళకు రుచుల – మేలు గనే వారరెవరు॥ తన॥

8 భూతము లైదును నీవు । పారల జేయుచున్నావు॥ తన॥

9 నిరవధి శయ్య పై నీవు। నిత్యానందము నున్నావు॥ తన॥

10 శ్రీతాగ్యరాజుని। చేపట్టి రక్షించేవు॥ తన॥

తాత్పర్యము :

సముద్రుని అంతఃపురమందున్న ప్రహ్లాదునకు శ్రీహరి దర్శనమిచ్చి వరము కోరుకొమ్మన్నప్పుడు ప్రహ్లాదుడు కోరినవివి. నాలో నిన్ను ధ్యానించి నేను తన్మయుడను కావలెను. నాహృదయ గుహయందు నీవున్నావు హరీ! నీ స్థానమును నేను తెలియ వలెను. నిన్ను ధ్యానించి నప్పుడే నీ తావు తెలుస్తుంది. మాయ క్రమ్మినప్పుడు నే నెవడనో తెలియదు. అందుచేత ధ్యానించి తన్మయుడనై మాయను తొలగించుకోవలెను. ప్రారబ్ధ కర్మమును బ్రహ్మయును తప్పించుకొనలేడు, నిన్ను ధ్యానించి తన్మయుడనై నా తొలి కర్మముల నణచు కొంటాను. శరీరసంబంధమయిన కామ క్రోధాదులయిన అగ్నులు ప్రజ్వరిల్లుచుంటే నిన్ను లోన ధ్యానించి తన్మయుడనై ఆ అగ్నులను చల్లార్చు కొందను. (తాపత్రయ మన్న మాట) ఈ ఆత్మధ్యాన యోగమును లక్షమందిలో ఒక డయినా పట్టుకొనుట లేదు. తిన్న పండ్ల రుచి యొక్క బాగోగులను ఎవడయిన పట్టించుకొనునా? (అనగా అయిపోయిన దేదో అయిపోయినది) అని. హరీ! పంచభూతములను (నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశములను) నీవు ప్రవర్తింప జేయుచున్నావు. నాహృదయమనే శయ్యయందు నీవు నిదురించుచున్నావు. నన్ను రక్షిస్తావు అని తాత్పర్యము,

Note:7చరణము 'మ్రింగిన పండ్లకు' అని నా పరిష్కారము.

223. భైరవి = ఆది

ప॥ తనయుని బ్రోవ – జనని వచ్చునో
తల్లి వద్ద బాలుడు – బోవునో॥

అ॥ ఇనకులోత్తమా! ఈ రహస్యమును
ఎరిగింపుము – మో । ము ను గనిపింపుము॥ తనయుని॥

చ॥ వత్సము వెంట – ధే! నువు చనునో
వారిదమును గని! పైరులు చనునో
మచ్చెకంటికి విటుడు వెడలునో
మహిని త్యాగరాజ! వినుత! రమ్మ్ తెల్పుము॥ తనయుని॥

తాత్పర్యము :

ఓ రామా! నీవు తల్లివి. నేను నీ కొడుకును. తనయుని రక్షించుటకు తల్లియే వాని వద్దకు వచ్చును కాని, అమ్మా నన్ను రక్షింపుమని తనయుడు రాడు. ఈ రహస్యము నాకు తెలిపి నీ ముఖమును జూపుము. మరియు చాలా ఉదాహరణములు జూపుతాను. దూడవెంట దానిని వెదకుచు ఆవు పోవును గాని ఆవును వెదకుచు దూడవెళ్లదు. మేఘము పైరుల పైకి వ్యాపించి వర్షిస్తుంది కాని పైరులు మేఘము వద్దకు పోవు. అట్లే విటుడు విలాసవతిని వెదకి దానివద్దకు పోవును కాని, విలాసవతి విటుని వెదకుచుపోవదు. అంటే రామా! నీవు నావద్దకు వచ్చి రక్షింపవలసినది. అని ఉపమాన పూర్వకంగా అయ్యగారు రాముని వేడుకొన్నారు.

224. శుద్ధ బంగాళ = రూపకము

ప॥ తప్పగనే వచ్చునా–తనువుకు లంపట నీకృప॥

అ॥ మెప్పులకై కొప్పులుగల–మేటి జనుల జూచి భజన॥ తప్పగనే॥

చ॥ రూకలకై పైకి మంచి–కోకలకాహారమునకు
నూకలకై ధ్యానించితి–త్యాగరాజ నుతుని భజన॥ తప్పగనే॥

తాత్పర్యము :

ఓ రామా! నీ కృప తప్పుటచేత శరీరానికి సంబంధించిన లంపటమంతా చుట్టుకొంటుంది. ప్రఖ్యాతికై, ధనమునకై, వస్త్రాలకై, తిండికై, ధాన్యానికై, లోకంలో గొప్పవా రనుకొన్నవారిని ఆశ్రయించి వేసట పడ్డాను. దీని వలన నీ భజన కూడ తప్పినది. అని అయ్యగారు తన కార్పణ్యమును రామునితో నివేదించినారు.

నోట్ : ఇందు సూటియగు అన్వయము కనపడలేదు. సరిపుచ్చుట అయినది.

225. సావేరి = జంపె

ప॥ తీరునా నాలోని దుగ్ధ

అ॥ సారమౌనీపాద-సారసము నాదు హృద
యారవిందమున బెట్టి కట్టుకోక॥ తీరునా॥

చ॥ కమ్మవిల్తుని గన్న-కాంతి గలిగిన హరే
ముమ్మారు పాలన్న-మును భుజింపగబెట్టి
కమ్మని విడెంబొసగి-కడురత్నముల మెరయు
తమ్మ పడిగెను బట్టి-తానిపుడు నిలువకను॥ తీరునా॥

2 అనుదినము నీదు పా-దాబ్జముల నొత్తుచును
కనక మయమౌ సురటి-కరమునిడి విసరి
ఘనమైన ఫణితల్ప-మున నుంచి పాడుచును
కనులార సేవించి-కాలముల గడపకను॥ తీరునా॥

3 రాజాధిరాజ సుర-రాజవందిత పాద
శ్రీజానకీరమణ-శృంగార జలధే
రాజధరుడగు త్యాగ-రాజ పూజితుడనుచు
రాజిల్లు నీకీర్తి-రాజిగా బొగడకను॥ తీరునా॥

తాత్పర్యము :

రామా! నీ పాద పద్మములను నా హృదయమందు కట్టి వేయక, మన్మధుని గన్న కాంతి కలిగిన ఓ రామా! మూడు పూటల నీకు పాలన్నము బెట్టక, నీకు కమ్మని విడెమీయక, తమ్మపడిగము బట్టి నీవద్ద నిలువక, నీ పాదములొత్తుచు, బంగారు విసనకర్రతో విసరుచు, నిన్ను శేషతల్పమున పరుండబెట్టి పాడుచు, నీ కీర్తి నంతయు పాడుచు కనులార నిను సేవింపక నా ఆశ తీరునా? అని ఆత్మనివేదనము.

226. మాయామాళవగౌళ = రూపకము

ప॥ తులసీ దళముల చేసం-తోషముగా బూజింతు॥

అ॥ పలుమారు చిరకాలము-పరమాత్ముని పాదములను తులసీ॥

చ॥ సరసీరుహ పున్నాగ-చంపకపాటల కురువక
కరవీర మల్లికా సు-గంధ రాజసుమములు
ధరనివి యొక పరియాయము - ధర్మాత్ముని సాకేత
పురవాసుని శ్రీరాముని - వర త్యాగరాజనుతుని॥ తులసీ॥

తాత్పర్యము :

సమస్త పుష్పములతో రాముని పూజించెదను అని తాత్పర్యము. వీటిలో తులసికి ప్రాధాన్యము.

227. సావేరి = రూపకము

ప॥ తులసి జగజ్జననీ - దురితాపహారిణీ॥ తులసి॥

అ॥ నిలవరమగు నీ సరివే-ల్పులు లేరట బ్రోవుమికను॥ తులసి॥

చ॥ చరణ యుగంబును నరులకు-పరమ వైకుంఠమట
సరసిజాక్షి నీ మధ్యము-సకల సురావాసమట
శిరమున నైగమ కోటులు-చెలగుచునున్నవట
సరస త్యాగ రాజాది-వర భక్తులు పాడేరట॥ తులసి॥

తాత్పర్యము :

తులసికి చాలా ప్రాధాన్యమున్నది. లక్ష్మీ అంశమట. అట్టి తులసి మహిమ ఉగ్గడింపబడుచున్నది. ఓ తులసీ! నీవు జగజ్జననివి. సమస్త పాపములను హరించుదానవు. నీసాటి దేవతలు లేరు. నీ పాదములు వైకుంఠమేనట. నీ నడుము సమస్త దేవతలకు స్థానమట. నీ శిరస్సునందు వేదోపనిషత్తు లున్నవట. నిన్ను పరమభక్తులు పాడుదురట. నన్ను రక్షింపుము. అని అయ్యగారు తులసిని వర్ణించి ప్రార్థించినారు.

నోట్ : త్యాగయ్యగారు వర్ణించిన వర్ణనములు తులసి మహిమను దెల్పు పురాణ ఘట్టముల యందున్నవి. మనకు అనుభవములో తులసి తీర్థమును పుచ్చుకొనుట, మరణింపబోవు వారికి మోక్షప్రాప్తికి తులసి తీర్థమిచ్చుట, ఇంటింట తులసి కోట గట్టి రోజూ ముత్తయిదువలు పూజించుట వంటివి ఉన్నాయి.

228. కేదారగౌళ = ఆది

ప॥ తులసీ బిల్వ మల్లికాది – జలజముల పూజల గైకొనవే॥

అ॥ జలజాసన సన–కాది కరార్చిత
జలదాభ! సునాభ విభాకర హృ–జ్జలేశ హరిణాంక సుగంధ॥ తులసీ॥

చ॥ ఉరమున ముఖమున – శిరమున భుజమున
కరమున నేత్రమున–చరణ యుగమ్మున
కరుణతో నెనరుతో – పరమానందముతో
నిరతమును శ్రీ త్యాగరాజు–నిరుపాధికుడై అర్చించు॥ తులసీ॥

తాత్పర్యము :

బ్రహ్మ, సనక సనందనాదుల చేతి పూజలందుకొను ఓ రామా! నేను జేయు తులసి మల్లె, మారేడు, తామరపూల పూజను గైకొనవలసినది. మేఘవర్ణము గలవాడా! మంచి బొడ్డు గలవాడా! (అనగా లోకములను సృష్టించు బ్రహ్మకు ఆశ్రయమైన పద్మమునకు ఆధారమయిన బొడ్డుగలవాడా అని) మరియు సూర్య మండల మధ్యమందు చంద్రునివలె ప్రకాశించురామా! నేను సుగంధ పుష్పములతో నీకరములను ముఖమును పాదములను భక్తితో పరమానందముతో అర్చిస్తాను. అర్చన స్వీకరించు. నేను చేసే ఈ అర్చనలో ఏదో ఒక వంకగాని, దంభముగాని, ఫలాపేక్ష గాని లేదు. 'నిరుపాధికుడై' అనగా ఇది అర్థము. ఇట్లు త్యాగయ్యగారు విన్న వించుకొన్నారు.

229. దేవగాంధారి = ఆది

ప॥ తులసెమ్మ మా ఇంట – నెలకొన వమ్మా శ్రీ॥ తులసెమ్మ॥

అ॥ ఇలలోన నీ సమాన–మెవరమ్మ బంగరు బొమ్మ॥ తులసెమ్మ॥

చ॥ కరకు సువర్ణపు సొమ్ము బెట్టి, సరిగచీర ముద్దు గురియ గట్టి
కరుణ జూచి సిరులను ఒడిగట్టి – వరదుని కరము బట్టి, శ్రీ॥ తులసెమ్మ॥

2 ఉరమున ముత్యపు సరు లసియాడ – సురతరుణులు నినుగనికొని యాడ
వరమును లక్షదిగీశులు వేడ – వరదుడు నిన్ను ప్రేమ జూడశ్రీ॥ తులసెమ్మ॥

3 మరువక పారిజాత సరోజ – కురువక వకుళ సుగంధరాజ
వరసుమములచే త్యాగరాజ – వరదను నిను నేజేతు పూజశ్రీ తులసెమ్మ॥

తాత్పర్యము :

ఓ తులసెమ్మా! నీవు బంగారు బొమ్మవు. నీ సరిసమాన మెవరును లేరమ్మా! అమ్మా! నీవు బంగరు సొమ్ములు ధరించి, జరీ చీరగట్టి, సంపదలను ఒడిగట్టి, శ్రీహరి యొక్క కరమును బట్టి, రొమ్మున ముత్యాల హారాలు కదలుచుండగా, దేవతా స్త్రీలందరును నిన్ను పొగడుచుండగా, మునులు అష్ట దిక్పాలకులు కొనియాడుచుండగా, శ్రీహరి నిన్ను ప్రేమతో చూచుచుండగా మా ఇంట స్థిరముగా నెలకొనవమ్మా తులసెమ్మా! నిన్ను మల్లె మొదలగు పూలతో పూజిస్తానమ్మా అని అయ్యగారు తులసీ ప్రార్థన చేసినారు.

230. గౌళిపంతు = ఆది

ప॥ తెరదీయగ రాదా, నాలోని
తిరుపది వేంకట–ర మణ మత్సరమను॥ తెర॥

అ॥ పరమ పురుష–ధ ర్మాది మోక్షముల
బారద్రోలుచు–న్నది నా లోని। తెర॥

2 మత్స్య మాక లి–గొని గాలముచే
మగ్న మైన రీతి, యున్నది
అచ్చమైన దీప సన్నిధిని మరు
గడ్డపడి చెర–చిన యట్లున్నది॥ తెర॥

3 వాగురయని తెలి–యక మృగ గణములు
వచ్చి తగులు రీతి, యున్నది
వేగమె నీమత–మనుసరించిన
త్యాగరాజ నుత–మదమత్సరమను॥ తెర॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు గోవూరు యాత్రముగించి తిరుపది వచ్చిరి. స్వామి దర్శనమునకు ఆలయమునకు వెళ్లగా అర్చకులు తెరవేసి వెళ్లపోయిరి. స్వామి దర్శనము కాలేదు. మనసు చింతా క్రాంతమైనది. వెంటనే అయ్యగారు వేంకటేశ్వరు నిట్లు ప్రార్థించిరి. ఓ తిరుపది వేంకటేశ్వరా! నీ దర్శనమున కడ్డైన ఈతెరను తొలగింపవయ్యా! అంటే నా మానసిక దోషమేదో యున్నది. అది మత్సరము. అది కూడ దేవదర్శనమునకు అడ్డువచ్చునదే. ఓ పరమపురుషా! మత్సరమనే తెర ధర్మమోక్షాలను దూరం చేస్తుంది. దానిని కూడా నీవే తొలగించు. ఎంతో ఆశపడి నీ దర్శనం కోసం నేను వస్తే నాకు నిరాశ ఎదురైనది. ఇదె ట్లున్నదంటే ఆకలిగొని భుజియించుట ప్రారంభిస్తే మొదటి ముద్దలో ఈగ పడినట్లున్నది. (సంస్కృతంలో ఒకలోకోక్తి ఉన్నది. ఏదయినా ఒకమంచిపని ప్రారంభించినప్పుడు మొదట్లో ఏదయిన ఒక విఘ్నము సంభవిస్తే 'ప్రథమ కబళేమక్షికా పాతః' = మొదటి ముద్దలోనే ఈగపడినది అని) త్యాగయ్యగా రీ లోకోక్తిని ఇక్కడ చూపినారు. మరియు హరిధ్యానమునకు కూరుచున్నప్పుడు మనస్సు చండాలవాటికకు వెళ్లినట్లున్నది. దగ్గరలో దీపం ఉన్నా దానికేదో అడ్డున్నట్లయినది. గింజలు తినుటకు వచ్చిన లేడి వలలో తగిలిన ట్లయినది. నేను నీ మతములోనున్నాను (భక్తిలో). కనుక మదమాత్సర్యము లనెడి తెరను అసలు తెరను కూడ తొలగించుమని ప్రార్థన.

విశేషము = 'యవనికా మాయా జగన్మోహినీ' అనుదాని ప్రకారం జగములను మోహమున ముంచు మాయ ఒక తెర. ఇది 'మాయినంతు మహేశ్వరం' అనుదాని ప్రకారం ఈశ్వరుని అధీనమై ఉంటుంది. 'మా మేవ యే ప్రపద్యంతే మాయా మేతాంతరంతి తే' అనుదానిని ప్రకారం భగవంతు నాశ్రయించినవారు ఈ మాయను తరించెదరు. త్యాగయ్యగారి కథయందు పైన చెప్పిన దంతయు అనుగతమయినది.

231. ధేనుక = ఆది

ప॥ తెలియలేరు రామభక్తి మార్గమును॥ తెలియ॥

అ॥ ఇలనంతట – తిరుగుచు మరి
కలువరించేరే గాని॥ తెలియ॥

చ॥ వేగ లేచి నీట – మునిగి భూతి బూసి
వ్రేళ్ల నెంచి వెలికి – శ్లాఘనీయులై
బాగ పైక మా–ర్జన లోలురై
రే గాని త్యాగరాజ వినుత॥ తెలియ॥

తాత్పర్యము :

అయ్యయో!! లోకంలోని మానవులు రామభక్తి మార్గమును తెలియలేకున్నారే. ఏవో ఏవో కలవరింతలతో భూమి అంత తిరుగుచున్నారే కాని భక్తిని అవలంబించకున్నారు. ఇంకొకరకపు వారున్నారు. ఉషఃకాలంలో నిద్రలేస్తారు. స్నానం చేస్తారు. విభూతి ధరిస్తారు. ఏదో జపిస్తున్నట్లు వ్రేళ్లను లెక్కపెడుతూ ఉంటారు. వీరిని చూచి జనులు చాలా కర్మిష్ఠులని మెచ్చుకుంటూ ఉంటారు. కాని వీరిది దంభాచారమేకాని నిజమయినది కాదు. లోపల డబ్బు మీదనే దృష్టి. ఈ విధంగా భక్తిని తెలియక అందున రామభక్తిని తెలియక ముక్తికి దూరులగుచున్నారే అని త్యాగయ్యగారు కలినరులను చూచి బాధపడుచున్నారు.

విశేషము = ఉదారులు, పరమార్థము తెలియక చెడువారిని చూచి జాలిపడుట, ఆశ్చర్య పడుట సహజము. వేద వ్యాస మహర్షి 'నారాయణేతి శబ్దోస్తి, వాగస్తి వశవర్తినీ, తథాపి నరకేలోకే పతంతీతి కిమర్భుతం?' = నారాయణ అనే నాలుగక్షరముల శబ్దమున్నది. మానవులకు మాట పలుకు శక్తి వశమై యున్నది. అయినను దానిని తలపక ఘోరమగు నరకమున బడుచున్నారే అని ఆశ్చర్యమును వెలిబుచ్చెను. అయ్యగారు నిట్లే.

232. పూర్ణ చంద్రిక = ఆది

ప॥ తెలిసి రామచింతనతో నామము
సేయవె ఓ మనసా॥ తెలిసి॥

అ॥ తలపు లన్ని నిలిపు నిమిషమైన
తారకరూపుని – నిజతత్త్వార్థము॥ తెలిసి॥

చ॥ రామాయన చప–లాక్షుల పేరు
కామాదుల గోరువారు వీరు
రామా యన బ్ర–హ్మమునకు పేరు
ఆ మానవజన – నార్తులు దీరు॥ తెలిసి॥

2 అర్కమనుచు జిల్లెడు నకుపేరు
మర్కట బుద్ధులెట్లు దీరు
అర్కుడనుచు భా-స్కరునకు పేరు-కు
తర్కమనే అంధ-కారము దీరు॥ తెలిసి॥

3 అజమనుచును మే-షమునకు పేరు
నిజకోరిక లేలా గీడేరు?
అజుడని వాగీ-శ్వరునకు పేరు
విజయము గల్గును-త్యాగరాజనుతుని॥ తెలిసి॥

తాత్పర్యము :

రామనామ మున్నది. దానిని ధ్యానించునపుడు ఆనామము యొక్క నిజమయిన అర్థమును తెలిసి ధ్యానిస్తే అది ఫలవంతమగును. ఒక మహా పురుషుని వర్ణించు శ్లోకము. 'మంత్రరత్నా నుసంధాన సంతత స్ఫురితాధరం। తదర్థ తత్త్వ నిధ్యాన సన్నద్ధ పులకోద్గమం' = ఆయన నిరంతరమును మంత్ర రత్నము ననుసంధించును. దానిచే పెదవులు కదలుచుండునట. మరియు ఆ మంత్రము యొక్క అర్థమును తలచుట చేత పులకాంకితు డగునట. అనగా ఆయన మంత్రముయొక్క నిజ తత్త్వార్థమును తెలిసి మంత్రము ననుసంధించు చున్నాడని తేలినది. ఇది ఆవశ్యకము. నామము కూడ నింతే. రామనామ జపము చేయునప్పుడు దాని నిజ తత్త్వార్థమును తెలియవలెను. ఒకప్పుడు ఒకే శబ్దమునకు నానార్థము లుండును. రామ అనే శబ్దమునకు స్త్రీ అని కూడ అర్థము కలదు. రామనామ జపము చేయునప్పుడు యోగీశ్వరుల కానందస్థానమయిన తారక పరబ్రహ్మరామునే భావించిన కార్య సిద్ధి అగును. కాని స్త్రీ అని భావించిన కామాదుల పోరే కలుగును. రాముడని భావించిన యెడల సంసార దుఃఖ నివృత్తి కలుగును. ఇట్లే అర్క అనే శబ్దమునకు జిల్లేడు చెట్లు కూడ అర్థము. సూర్యనమస్కారము చేయునప్పుడు అర్క శబ్దమునకు సూర్యునే భావించవలెను కాని మర్కట బుద్ధితో జిల్లేడును స్మరింపకూడదు. సూర్యుడని భావిస్తే అంధకారము తొలగును. మరియు అజ శబ్దమునకు మేక కూడ అర్థము. అసలర్థము బ్రహ్మ. బ్రహ్మను గూర్చి చెప్పుకొనునపుడు మేకను తలవరాదు. బ్రహ్మ భావన చేస్తే విజయము కలుగుతుంది. రామతత్త్వము రామ తత్త్వార్థము తెలిసి రామనామ చింతన చేస్తే ఫలసిద్ధి అని పిండితార్థము.

విశేషము = 'యదేవ విద్యయా కరోతి తదేవ వీర్యవత్తరం భవతి' = తెలిసి చేసిన పని ఫలవత్తరము. అని మనువు వాక్యము. అయ్యగారు చెప్పినదిదే.

233. శుద్ధ బంగాళ = ఆది

ప॥ తొలినే జేసిన పూజా ఫలము
తెలిసెను నాపాలి దైవ మా॥ తొలి॥

అ॥ పలు విధములనే – తలచి కరగగా
బలుకక నీవటు–నేనిటు కాగా॥ తొలి॥

చ॥ సరివారలలో జొకజేసి ఉ–
దరపోషకులను పారుగుగ జేసి॥
హరిదాస రహిత పురమున వేసి
దరిజూపకుండగ–త్యాగరాజార్చిత॥ తొలి॥

తాత్పర్యము :

నాపాలి దైవమా! రామా! నేను తొలి జన్మలో చేసిన పూజాఫలము తెలిసినదయ్యా! అనేక విధములుగా నేను నీ మనస్సు కరగునని ప్రార్థిస్తున్నాను. అయినా నీవటు నేనిటుగా ఉన్నాము. నాసరి వారలలో నన్ను చులకన చేశావు. ఎట్లనగా? నా చుట్టు ప్రక్కలవారిని భక్తి హీనులుగాను కేవలము ఉదరపోషకులుగాను చేశావు. హరి భక్తులులేని పురంలో నన్ను పడవేశావు. నీదరి జూపకున్నావు. ఇదంతా నా తొలి కర్మల ఫలమని తెలిసినది.

234. బిలహరి = జంపె

ప॥ తొలి జన్మమున జేయు. దుడుకు తెలిసెను రామ॥

అ॥ ఫలమేమొ అరచేతి – పంటికద్దము వలెను॥ తొలి॥

చ॥ రాగిపైరుల చెంత – రమ్యమౌవరి మొలక
రాజిల్ల నేర్చునటరా॥
నాగశయనా త్యాగ–రాజుపాపము తోను
నామ పుణ్యము చెలగునా–నేను॥ తొలి॥

తాత్పర్యము :

రామా! నేను తొలి జన్మలో చేసిన దుడుకు (పాపము) తెలిసినదయ్యా! (ఎట్లు తెలిసినది? అని ఆశంక). అరచేతిలో ఉన్న పండును తెలుసుకొనుటకు అద్దము

కావలెనా? అక్కరలేదు. అట్లే నీదయనాకు రాకుండుట స్ఫుటముగా తెలియు చుండగా దీనికి నా తొలి జన్మపాపము కారణమని తెలియుచున్నది. (నీ నామ జపపుణ్యమే మయినది? అని ఆశంక) సమాధానము. ఓ నాగశయనారామా! చెడుగు ముందర మంచి నెగ్గలేదయ్యా. రాగి పైరు (చోడిపైరు)ల వద్ద అందమయిన ఒకవరిమొలక కనపడుతుందా? అట్లే నేను చేసిన పాపము కొండంతగా ఉంటే నామ జపపుణ్యము దానిముందు ఓడిపోయి పాపమే మిగిలినది. అని అయ్యగారు నిర్వేదపడినారు.

ముఖ్య గమనిక = అనుపల్లవిలో 'నీ మహిమ ఫలమేమొ' అని ఒక అపపాఠము ఎప్పుడు చేరినదో ఎట్లు చేరినదో ఊహింపశక్యముగా కున్నది. దీనివలన సమతాభంగము. ప్రాస భంగము. ఈ దోషములు కలుగును. అర్థరహితమగు ఒక మాట అనావశ్యకమగుట. మరియు 'పుం టికి' అనేది యతిని చెడగొట్టుచున్నది. కల్లూరి వీరభద్రశాస్త్రిగారు ఈ అపపాఠమునే గ్రహించి అతకని తాత్పర్యమేదో వ్రాసిరి. త్యాగయ్యగా రట్లే వ్రాసిరేమో అని ఊహింపకూడనిది. కనుక వీటినన్నిటిని పరిష్కరించి నేను అనుపల్లవిని వ్రాసితిని. నాపరిష్కారమునకు 'అరచేతిపంటి కద్దముకావలెనా' అను లోకోక్తి ఆధారము. 'నీమహిమ' అనుదాని నెత్తివేయుటకు నా ఔచిత్య జ్ఞానము ఛందో జ్ఞానము త్యాగయ్యగారి శైలి ఆధారములు.

235. కోకిలధ్వని = ఆది

ప॥ తొలినేను జేసిన పూజా-ఫల మీలాగే॥ తొలి॥

అ॥ వెలవేసి తీయగవచ్చునా-వెతదీరునా మనసారగ॥ తొలి॥

చ॥ పరమాత్మ నీ కాయాసపడ-పనిలేదురా కరుణాకర॥
వరభక్తవేషము వేయువేళ-వర్జకాలమేమొ త్యాగరాజనుత॥ తొలి॥

తాత్పర్యము :

రామా నేను తొలిజేసిన పూజాఫల మీలాగే ఉన్నది. చెడుచేసి మంచి ఫలము రావాలంటే వస్తుందా? ఇది ఇంతేనయ్యా! పూజా ఫలము బజారులో డబ్బిచ్చి కొంటే వచ్చునా? రాదు వెతదీరదు. ఓ పరమాత్మా! నీవు కరుణా స్వభావుడవు కనుక నేనిట్లు దుఃఖపడుతూవుంటే నీకు ఆయాసము కలుగవచ్చు. ఎవరి కర్మకు ఎవరేమి చేయుదురు. నేను భక్తుని వేషము వేసే సమయములో వర్జ మున్నదేమో. అని నిర్వేదము.

236. బలహంస = ఆది

ప॥ దండము బెట్టేనురా – కో – దండపాణి! చూడరా॥ దం॥

అ॥ అండజవాహన మా – ర్తాండ చంద్రలోచన
కుండలిశయన! బ్ర – హ్మాండనాయక నీకు॥ దం॥

చ॥ పేరుకా ప్రతిష్ఠకా – యూరికా నిను నమ్మితి
ఊరివారు వీధివారు – ఒక జాతివారు కారు
తారితి చెయిబట్టి బ్రోవుము – త్యాగరాజార్చిత నీకు॥ దండ॥

తాత్పర్యము :

ఓ కోదండపాణీ! అండజవాహన=గరుడవాహనా! మార్తాండ చంద్రలోచన= సూర్యచంద్రులు కనులయినవాడా! కుండలి శయన = పాముపై బండు వాడా! బ్రహ్మాండనాయక=సకల బ్రహ్మాండములకు (లోకములకు) ప్రభువైన వాడా! నీకు దండము బెట్టుచున్నాను. చూడుము. నేను నిను నమ్మినది ఊరుకు, పేరుకు, ప్రతిష్ఠకు కాదు. ఊరివారు, వీధివారు, ఒకే పద్ధతివారు కారు. (కనుక వారి జోలినాకు లేదు) నిన్ను నమ్మి సమీపించినాను. నా చేయిబట్టి బ్రోవుము అని ప్రార్థనము.

237. నాయకి = జంపె

ప॥ దయలేని బ్రతుకేమి – దాశరథీ రామ॥

అ॥ వయసు నూరైన – ఈ వసుధ నేలిన గాని॥ దయలేని॥

చ॥ రాజాధి రాజ! రతి–రాజ శతలావణ్య
పూజ జపముల వేళ–పొందుగా నెదుట
రాజిల్లి లోకాంత–రంగ మర్మము దెలిపి
రాజిసేయని త్యాగ–రాజాది వినుత॥ దయ॥

తాత్పర్యము :

ఓ దాశరథీ! రామా! నీ దయలేని బ్రతుకు వ్యర్థము. నూరేళ్ళు జీవించినా, ఈ భూమినంతా ఏక ఛత్రాధి పత్యముతో నేలినా నీ దయలేని బ్రతుకు వ్యర్థము. నిన్ను

పూజించేవేళ నిన్ను జపించేవేళ ఎదుట నిలచి లోకవృత్తములను దెలిపి నీవు సమరసపడని బ్రతుకు వ్యర్థమని అభిప్రాయము. 'మర్మము దెలిపి' 'రాజిసేయని' 'దయలేని' 'బ్రతుకు' అని ఈ నాలుగు పదాలను వరుసగా మనం కూర్చుకుంటే అన్వయము సరిగా నుండును.

238. మోహన = ఆది (దివ్యనామము)

ప॥	దయరానీ దయరానీ - దయరానీ దాశరధీ॥	దయ॥
చ॥	వివరింపదరమా రఘు-వీరా ఆనందము॥	దయ॥
2	తలచితే మేనెల్ల-పులకరించేని రామ॥	దయ॥
3	కనుగొన్నానందమై-కన్నీరు నిండెడిని॥	దయ॥
4	ఆసించువేళ జగ-మంత తృణమయ్యేని॥	దయ॥
5	చరణ కౌగిలి వేళ-చెలగి మైమరచీని॥	దయ॥
6	చెంతనుండగ నాదు-చింతలు తొలగేని॥	దయ॥
7	మర్మహీనుల గూడ-కర్మమన నయ్యేని॥	దయ॥
8	తనకై శ్రీరామావ-తార మెత్తితివో॥	దయ॥
9	నావంటి దాసుల-బ్రోవవెడలితివో॥	దయ॥
10	మూడు మూర్తులకాది-మూలము నీవేరామ॥	దయ॥
11	శ్రీ త్యాగరాజు చెలి-కాడు నీవే రామ॥	దయ॥

తాత్పర్యము :

ఓ దాశరధీ! దయరానీ-దయరానీ-దయరానీ అని మూడు మారులు దయరానిమ్ము అని. ఇంతేకాక దయరా, నీ దయరా, నీ దయరానీ అని కూడ పదచ్ఛేదం చేయవచ్చు. నీ దయ నాపైన ప్రసరిస్తే ఆ ఆనందమును వివరింపలేను. దానిని తలచితే మేను పులకరించుచున్నది. నిన్ను చూచినచో ఆనందము పుట్టి ఆనంద బాష్పములతో కన్నులు నిండుతాయి. నిన్ను ఆసించి ఉపాసించు సమయమందు ఈ ప్రపంచమంతా

నాకు గడ్డిపరకయే. నీ చరణములను నేను కొగిలించినపుడు నేను ఒడలు మరచెదను. నీవు సాక్షాత్కరించి నా చెంత నుండగా నాకితర చింతలుండవు. ఇట్టి సమయంలో భక్తిహీన జనులను కలువవలసి వస్తే నా కర్మ అనుకుంటాను. అదిసరి రామా! నీవు నాకోసమే రామావతార మెత్తినావా? నా వంటి దాసులను రక్షించుటకు దివినుండి భువికి వెడలి వచ్చినావా? రామా నీవు బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు కూడ మూల పురుషుడవైన ఆదిదేవుడవు. అట్టి నీవు నా చెలికాడ వయితివాహా! ఆనందము.

239. గానవారిధి = ఆది

ప॥ *దయ జూచుట కిది వేళర– దాశరధీ॥*

అ॥ *భయవారణ మృగేశ జలజో*
ద్భవార్తి హర మంజులాకార నను॥ *దయ॥*

చ॥ *మును నీవా నతిచ్చిన– వనులాస గొనినే*
మనసారగ– నిదానముగ సల్పినాను వరత్యాగరాజార్చ్యనను॥ *దయ॥*

తాత్పర్యము :

ఓ దాశరధీ! నన్ను దయచూచే సమయమిదేనయ్యా! సంసారభయము ఒక ఏనుగయితే నీవు సింహమై దానిని హరిస్తావు. పరాక్రమంలో సింహము వంటి వాడయినా సౌందర్యనిధివి. బ్రహ్మ మొదలయిన దేవతల ఆర్తి దీర్చువాడవు. ఓ రామా! నీవు వేదాదులను వెలువరించి వాటి ద్వారా బోధించిన ధర్మములను క్రమముగ నాచరించితిని. అని అయ్యగారు నిరహంకారముగా తన ధార్మికతను నివేదించుకొన్నారు.

గమనిక : అను పల్లవి ప్రారంభం కల్లూరి వీరభద్రశాస్త్రిగారు 'భవవారణ' అని వ్రాసినారు. ప్రాసదోషమున్నది కనుక 'భయవారణ' అని నేను వ్రాయుట జరిగినది. గాయకులిట్లే పాడుచున్నారు కూడా.

240. సావేరి = ఆది

ప॥ *దరిదాపులేక వేడితే– దయరాదేమో శ్రీరామ॥*

అ॥ *కరిధనములు గల్గితే– కరుణించి బ్రోతువేమో॥* *దరి॥*

చ॥ అలనాడు నిర్జరవైరి బా-లుని జూచిబ్రోచితివి గాని।
వలచి పదముల నమ్మితే-వరమీదోచదా త్యాగరాజు॥ దరి॥

తాత్పర్యము :

ఓ రామా! ఈ సంసారమందు ఒక దరి దాపు లేక నిన్ను వేడుచున్నాను. దయరాదేమయ్యా! నాకు ఏనుగులు మొదలగు చతురంగ బలము, ధనము కలిగి ఉంటే కరుణించి రక్షించి యుండెడివాడవేమో? అలనాడు దేవతలకు శత్రువయిన హిరణ్యకశిపుని కుమారుడగు ప్రహ్లాదుని చూచి రక్షించినావు కాని నన్నేల రక్షింపవు? నేను ప్రేమతోనే పదములను నమ్మినాను. నాకు వరమియ్యతోచదా. అని ఒక నిష్ఠురపు ప్రశ్న.

విశేషము = భగవానుడు రక్షించిన వారిలో ప్రహ్లాదుడు ముఖ్యుడు. త్యాగయ్యగారు మనస్సులో ప్రహ్లాదుని బెట్టుకొని అతడు అధీశ్వరుని పుత్రుడు కనుక అతని కరిధనములను జూచి రక్షించితివా అని ఒక ప్రశ్న. నేను చేసినది 'వలచిపాదములు నమ్ముట' ఇది చేసిన నాకు వరమీయ తోచలేదు నీకు. నీకు కరిధనములు కావలెననియే తోచినది అని.

241. శుద్ధసావేరి = ఆది

ప॥ దరిని తెలుసుకొంటి త్రిపురసుం
దరి నిన్నే శరణంటి త్రిపుర సుం॥ దరిని॥

అ॥ మరుని జనకుడైన మా దశరథ కు
మారుని సోదరి దయాపరి-మోక్ష॥ దరిని॥

చ॥ అంబా త్రిజగదీశ్వరీ-ముఖ జిత విధు
బింబా ఆదిపురమున నెలకొన్న కన
కాంబరీ నమ్మిన వారి కభీష్ట వ
రంబు లొసగే దీనలోక రక్షకి
అంబుజ భవ పురుహూత సనందన
తుంబురు నారదులందరు నీదుప
దంబున జేరి సదా నిత్యానం
దాంబుధిలో నోలలాడు చుండే॥ దరి॥

2 మహదైశ్వర్య మొసగి తొలి కర్మ
గహనమును గొట్టి ప్రోచుతల్లి
గుహగజముఖ జనని అరుణ పంకే
రు హనయన యోగి హృత్సదనా
తుహినాచల తనయా నీ చక్కని
మహిమాతిశయమ్ములచేతను యీ
మహిలో మునివరులు ప్రకృతివి
రహితులై నిత్యానందులైన॥

దరి॥

3 రాజితమణిగణ భూషణి మదగజ
రాజగమన లోకశంకరి దనుజ
రాజగురుని వాసరసేవ తన
కే జన్మఫలమో కనుగొంటిని
ఆ జన్మము పెద్దలు తమ మదిలో
నీ జపమే ముక్తిమార్గ మనుకొన
రాజశేఖరుండగు శ్రీ త్యాగ
రాజమనోహరి గౌరి పరాత్పరి॥

దరి॥

తాత్పర్యము :

తిరువొత్తియూరునే ఆది పురమంటారు. అక్కడ నెలకొన్న త్రిపుర సుందరీ దేవిని త్యాగయ్యగారు దర్శించుకొన్నారు. భక్తి భావావేశం కట్టలు తెగి ప్రవహించినది. ఈ దివ్య కీర్తన మయినది. అమ్మా త్రిపుసుందరీ! నీ దరికి వచ్చి మోక్షపు దరిని తెలుసు కొన్నాను. నిన్నే శరణన్నాను. మరుని తండ్రి అయిన నా రాముని సోదరి వమ్మా దయాపరివమ్మా! నీ ముఖమును చూచితే చంద్రుడు సాటి రాడనిపించుచున్నది. ముల్లోకములు నీ అధీనములో నుంచుకొని భక్తులకొరకు ఆదిపురమున నెలకొన్న కనకాంబరివి. (బంగరు వలువ దాల్చిన దానవు) భక్తులకు సమస్త కామితములను ప్రసాదించే దీనలోకరక్షకివి. బ్రహ్మ, ఇంద్రుడు, సనక సనందనాదులు, తుంబురు నారదాదులందరు నీ సన్నిధిలో చేరి నిత్యానందమును పొందే ఆ దరి ఈ రోజు నాకు దొరకినది. భక్తులకు మహదైశ్వర్యము లిచ్చి పరమార్థమున కడ్డుగా నున్న తొలికర్మములను తొలగించు తల్లివినీవు. చల్లని కొండకూతురవయిన చల్లని తల్లివి. నీ మహిమ చేత మునీశ్వరులందరు

ప్రకృతిలోని తాపత్రయము తొలగి నీ సేవానందమును పొందే ఆదరి ఈ రోజు నాకందినది. చక్కని మణి భూషణములు ధరించి నీవు నిలచి ఉన్న తీరు చూస్తే మదగజయానము స్ఫురించు చున్నది. అమ్మా పూర్వపుణ్యము చేత ఈ రోజు నాకు నీ 'దనుజరాజగురుని వాసరసేవ' దొరకినది. దనుజరాజగురుడనగా రాక్షస గురుడగు శుక్రుడు. ఆతని వాసరసేవ అనగా శుక్రవారసేవ అని అర్థము. ఈ సేవ చేసి త్యాగయ్యగారు బ్రహ్మానందము పొందిరి. అది ఈ కృతిలో ప్రత్యక్షరమునందును ప్రతిఫలించుచున్నది.

242. కేదారగౌళ = జంపె

ప॥ దర్శనము సేయ తరమా, పరా

అ॥ మర్మించి నీవు నను-మన్నింపవలెను, శివ॥ దర్శనము॥

చ॥ గోపురంబులను కడు-గొప్ప కంబముల భూ
స్థాపితంబగు శిలల - తరుణు లాటలను
దీపాల వరుసలను - దివ్యవాహనములను
పాపహర సేవించి - బహిర్ముఖుడనైతి శివ॥ దర్శనము॥

2 తరలి పదియారు, ప్ర దక్షిణము లొనరించి
వరనిందవచనముల-బాగనాడుచును॥
ఒరుల భామల జూచి - యుప్పొంగితిని గాని
వరశివాక్షరయుగ జ-పము సేయనైతి - శివ॥ దర్శనమ॥

3 హాటకసమంబైన - అద్భుతా కృతిని నే
నాట జేసికొని హృ-న్నాళీక మునను
మాటిమాటికి జూచి-మై మరచియుండేది
ఆటలా త్యాగరా-జార్చిత సుపాద శివ॥ దర్శనము॥

తాత్పర్యము :

త్యాగయ్యగా రిందు శివదర్శనము యొక్క దుర్లభత్వమును వివరించుచున్నారు. ఇందు రామునే సంబోధించి చెప్పుచున్నట్లు తోచుచున్నది. శివదర్శనము నాతరము

కాదయ్యా! నాయొక్క అసమర్థతను నీవు విచారించి నన్ను నీవు మన్నించి రక్షించు. నేను శివాలయమునకు వెళ్లినా పదారు ప్రదక్షిణాలు చేసినా పరులను నిందించుటమానలేదు. పరభామలను చూచి ఉప్పొంగుట మానలేదు. శివ అను రెండక్షరములను జపింపలేదు. గోపురములు స్తంభములు దేవదాసీల నృత్యములను బాహ్యముగా చూచి ఆనందపడితినే గాని చిత్తమును శివునిపై నిలుపలేదు. బంగారు శివలింగమును నా హృదయమందు నిలుపుకొని పరవశించుట తరము కాలేదు. అని త్యాగయ్యగారు ఇతరుల ఆశక్తిని తనయందారోపించుకొని రాముని సన్నిధిలో నిర్వేదపడినారు.

243. యదుకుల కాంభోజి = ఆది

ప॥ దయసేయవయ్య సదయ రామచంద్ర॥

అ॥ దయను కొంచెమైననాడు – దలచుచున్న సీతాసుఖము॥ దయ॥

చ॥ క్షితినాథులరాకయు–స మ్మతి లేక శ్రీసాకేత
పతిరాడేయన వచ్చుననిన – సతికి కల్గిన ఆనందము॥ దయ॥

2 చెలియరో నావలె నాథునకు గలరేమో రాలేదని జాలి
దెలిసి మ్రొక్కుకొని బ్రోవుమని – బలిమిని నెదురైన సుఖము॥ దయ॥

3 కొంచెమీ రూపమా, విల్లు–వంచ కూడకపోవో యని
ఎంచి జాలి జెంద మేను – బెంచి కనిపించినట్లు॥ దయ॥

4 ఎట్టివారికైన దొరక–నట్టి జనకజ బొట్టు
గట్టి కరముబట్టువేళ – కాంతకున్న సుఖము తనకు॥ దయ॥

5 కోరిన వారలను నే–నీరీతి బ్రోతునని సభ
వారలకు దెలియ జేయు–దారి త్యాగరాజునకు॥ దయ॥

తాత్పర్యము :

ఓ రామా! నాడు సీత కిచ్చిన సుఖమును కొంచెమయినా దయతోనా కీయరాదా? శివధనుర్భంగ సమయములో రాజ కుమారు లెందరో సభకు వచ్చియున్నారు. సీత చెలినడిగినది రాముడు రాలేదా? అని. ఆమె వచ్చునని చెప్పినది. అప్పుడు సీత కానందము

కలిగినది. ఆ ఆనందము నాకీయరాదా? స్వయం వర సమయమున రామునకై ఎదురు చూచునప్పుడు సీత కొక సందేహము కలిగినది. రామునకు తన వలె ప్రియరాండ్రు కలరేమో అని. వెంటనే ఆమె మనస్సులో దేవునకు మ్రొక్కుకున్నది. వెంటనే రాముడు కనిపించినాడు. అప్పుడు సీతకు కల్గిన సుఖమును నీవునా కీయరాదా? – కాని రాముని చూడగనే సీత కింకొక శంక గలిగినది. ఇంత చిన్న ఆకారము వాడు శివుని విల్లు ఎక్కు పెట్టగలుగునా అని. అది తెలిసిన రాముడు సీతకు మాత్రము తెలియునట్లు తన విశ్వరూపము జూపెనట. అది చూచినపుడు సీతకు కలిగిన సుఖమును నా కీయరాదా? సీతమెడలో మాంగల్యము గట్టి పాణిగ్రహణమును చేసినప్పుడామెకు కలిగిన సుఖమును నాకీయరాదా? అంతే కాక సుగ్రీవాదుల సభలో, విభీషణుడు వచ్చి శరణుజొచ్చినపుడు 'నన్ను శరణు జొచ్చినవానికి నే నభయమిచ్చి రక్షించుట నావ్రతము' అని చెప్పినట్లు నాకొక ముక్క చెప్పరాదా? అని అయ్యగారి ప్రార్థనము. ఇది పరమైకాంత స్థితి. దీని నయ్యగారు కోరినారు.

విశేషము = ఈ కృతి యందు సీతకు సంబంధించిన భావములు వాల్మీకి రామాయణమున కాక ఇతర రామాయణములయందున్నవి.

244. అసావేరి = ఆది (దివ్యనామము)

ప॥ దశరథ నందన. దానవమర్దన – దయయామాంపాహి॥ దశరథ॥

చ॥ చాలును మాయాజాలము సేయ – చాలను తోయ. జాలయారాయ॥ దశరథ॥

2 మనసుననారీ. మణులను కోరి – జనులతో జేరి. చెప్పనీదారి॥ దశరథ॥

3 ధనికుని నెంచి తనువును బెంచి – వనితలగాంచి వదరుదు పాంచి॥ దశరథ॥

4 నేపరదేశి. నేర్పున గాసి – బాపవేడాసి. పాపను జేసి॥ దశరథ॥

5 సర్వమునీవు. సారెకు రావు – గర్వములు లేవు. గ్రక్కున బ్రోవు॥ దశరథ॥

6 వలచితినీల వర్ణసుశీల – చలమికనేల. స్వామి నేతాళ॥ దశరథ॥

7 సాగరశయన. సారసనయన – త్యాగరాజావన. తారకసుగుణ॥ దశరథ॥

తాత్పర్యము :

దానవమర్దనుడవైన ఓ దశరథనందనుడా! దయతో నన్ను రక్షించు. ఓ తోయజాలయారాయ! = ఓ లక్ష్మీనాథా॥ నీవు మాయా జాలము (ఇంద్రజాలము) చేయుట చాలు. ఇక తాళలేను. మనస్సున నారీ వాంఛ విడువలేకున్నాను. ధనికులనుస్తుతించి శరీరమును పెంచుకొనుచున్నాను. నేను నీకు పరదేశిని (అతిథిని) కనుక నన్నాదరించి, నన్ను డాసి (సమీపించి) పావనుజేసి (పైన చెప్పిన దుర్గుణములను పోగొట్టి) నా ఆర్తిని దీర్చు. నాకు సర్వమును నీవే. నా వద్దకు పలుమారులు రమ్ము. గర్వము లేదునాకు. నన్ను రక్షించు. ఓ నీలవర్ణ! సుశీలా! నిన్ను వలచి ఉన్నాను. ఇంకా చలము చేయకు నేతాళలేను. అని మానవ సామాన్యములగు దుర్గుణములను తన యందారోపించుకొని వాటి నన్నిటిని తీర్చి రక్షించమని త్యాగయ్యగారి వేడికోలు.

245. తోడి = జంపె

ప॥ *దాచుకోవలెనా – దాశరథీ నీదయ॥* దాచుకో॥

అ॥ *చూచువారలలోన – చులకనే నను జూచి॥* దాచుకో॥

చ॥ *కనికరము కాంతపై – కలిగి ముద్దిడువేళ*
జనకజ నామాట – సమయమని పల్కితే॥ దాచుకో॥

2 *కరగి పదముల వ్రాల – గని కరుణ సేయువేళ*
భరతు డెంతో నన్ను – భక్తుడని పల్కితే॥ దాచుకో॥

3 *నేమమున పరిచర్య – నేర్పును బొగడువేళ*
సౌమిత్రి త్యాగరా–జుని మాట బల్కితే॥ దాచుకో॥

తాత్పర్యము :

ఓ దాశరథీ నా సాటివారిలో నన్ను చులకన చేసి నీదయ నా మీద ప్రసరించకుండ దాచుకొనుట న్యాయమా? ఏకాంతమందు నీవు సీతను కనికరించి ముద్దుబెట్టే సమయంలో ఆమె నామాట గుర్తుచేసినా నీవు దయజూపకున్నావు. భరతుడు నీపాదములకు నమస్కరించుచు వీడు నాసాటి భక్తుడు అని చెప్పినా నాపై దయజూపవేమి? అన్నా! త్యాగరాజు నీకు చక్కని పరిచర్య లందించుచున్నాడు అని లక్ష్మణుడు చెప్పినా

నీవు దయజూపవేమి? లేక లక్ష్మణుని పరిచర్యలను నీవు పొగడుచున్నప్పుడు లక్ష్మణుడు నామాట గుర్తుచేసినా నీదయ దాచుకోవలెనా? అని నిర్వేదము.

విశేషము = లక్ష్మీదేవియును, భాగవతోత్తములును ఒక భక్తుని రక్షింపుమని భగవంతునితో పురుషకారము (సిఫారసు) చేయుదురని శాస్త్రమర్యాద. ఈ విషయము నయ్యగారు మనమునందుంచుకొని ప్రార్థించిన ప్రార్థనమిది.

246. తోడి = ఆది

ప॥ దాశరధీ నీ ఋణము దీర్ప నా
తరమా పరమపావన రామా॥ దాశరధీ॥

అ॥ ఆశదీర దూర-దేశములను ప్ర
కాశింపజేసిన - రసిక శిరోమణి॥ దాశరధీ॥

చ॥ భక్తిలేని కవి - జాలవరేణ్యులు
భావ మెరుగలేరని కలలోజని
భక్తి ముక్తి కల్గునని కీర్తనముల
బోధించిన త్యాగరాజకరార్చిత॥ దాశరధీ॥

తాత్పర్యము :

ఓ దాశరధీ! ఓ పరమపావనా! రామా! నీ ఋణము దీర్పలేనయ్యా! నా ఆశదీరునట్లు నన్ను దూరదేశములలో ప్రకాశిపజేసిన రసజ్ఞుడవు. భక్తిలేని కవులు నా కీర్తనములలోని భావమును తెలియలేరని దూరదేశమునకు వెళ్ళి అక్కడసంగీత విద్వాంసుని కలలో కనపడి నాకీర్తనములు వింటే భక్తి, ముక్తి కలుగునని చెప్పినావద్దకు పంపినావే. ఇట్టి నీ ఋణము దీర్పలేను. అని త్యాగయ్యగారు రామునితో కృతజ్ఞతను నివేదించుకొన్నారు.

విశేషము = కాశీలో గణేశభావే అనే సంగీత విద్వాంసుడున్నాడట. అతడును భక్తుడేనట. శ్రీరామ చంద్రుడు అతని కలలోకనపడి తిరువయ్యారులో త్యాగరాజనెడి వాగ్గేయకారశిఖామణి ఉన్నాడు. అతని పాటలు భక్తిముక్తి దాయకములు. నీవు వెళ్లి వినవలసినది అని చెప్పెనట. అతడు తిరువయ్యారు వచ్చి జరిగిన దంతయు చెప్పి త్యాగయ్యగారి పాటవిని వెళ్లెనట. త్యాగయ్య గారప్పుడీ కృతి రచించినట్లు ఐతిహ్యము కలదు.

247. కోకిల ప్రియ = ఆది

ప॥ దాశరథే – దయాశరథే॥

అ॥ ఆశరహరణ ప రాశరగేయక – వీశసుహృదయని వేశఘృణాకర॥ దాశ॥

చ॥ సరసిజనాభా – జలధరశోభా
పరిపాలితేభా – వరభక్తలాభా
పరిచరకీశ – పాపవినాశా
తరణిసంకాశా – త్యాగరాజేశ॥ దాశరథే॥

తాత్పర్యము :

ఇది అంతయు కేవలము సంస్కృత సంభోధనమయము. దాశ రథీ! దయాసముద్రుడా! రాక్షసులను సంహరించువాడా! పరాశరుని చేత గానము చేయబడిన వాడా! కవీశ్వరుల చక్కని హృదయమున నుండు వాడా! దయగలవాడా! నాభియందు పద్మముగలవాడా! మబ్బుకాంతి గలవాడా! ఏనుగును రక్షించిన వాడా! భక్తులకు లాభమయినవాడా! కపులు పరిచరు లయినవాడా! పాపములను పోగొట్టువాడా! సూర్యుని తేజస్సు కలవాడా! త్యాగరాజునకు ప్రభువా! అని శబ్దార్థములు.

248. హరికాంభోజి = ఆది

ప॥ దినమణివంశ – తిలకలావణ్య – దీనశరణ్యా॥

అ॥ మనవిని బాగుగా – మదిని దలంచుచు
చనవున నేలు – చాలుగా చాలు॥ దినమణి॥

చ॥ శర్వవినుతనను – సంరక్షించను
గర్వము లేక – కాచువా రెవరే॥
నిర్వికారగుణ – నిర్మల కరధృత
పర్వత త్యాగరాజ – సర్వస్వమౌ॥ దినమణి॥

తాత్పర్యము :

ఓ రామా! నీవు దీనులకు రక్షకుడవు. నీ అందము సూర్య వంశమునకే తిలకము. మరి నా మనవిని బాగా విని మదిలో తలచి నన్నేలు. నాకు చాలు. శివునిచేత కూడ

నుతింపబడు నీవు కాక నిగర్వముతో నన్నేలు వారెవరున్నారు? ఎవరునులేరు. కృష్ణావతారంలో దీనులను రక్షించుటకై పర్వతమెత్తినవాడవు. నన్ను రక్షించుట నీకు తేలిక. నాకు సర్వస్వమును నీవే. అని అయ్యగారు తన అనన్యగతికత్వమును తెలుపుకున్నారు.

249. భూపాల - చాపు (దివ్యనామము)

ప॥ దీనజనావన శ్రీరామ - దానవ హరణా శ్రీరామ॥
వీన విమాన శ్రీరామ - మీన శరీర శ్రీరామా॥ దీన॥

చ॥ నిర్మల హృదయా శ్రీరామ - కార్ముక బాణ శ్రీరామ॥
కర్మఫల ప్రద శ్రీరామ - కూర్మావతార శ్రీరామ॥ దీన॥

2 శ్రీకర సుగుణా - శ్రీరామా - శ్రీకర లాలిత శ్రీరామా॥
శ్రీ కరుణార్ణవ శ్రీరామ - సూకర రూపా శ్రీరామ॥ దీన॥

3 సరసిజనయనా శ్రీరామ - సురపతి వినుతా శ్రీరామ॥
నరవర వేషా శ్రీరామ - నరహరి రూపా శ్రీరామ॥ దీన॥

4 కామితఫలదా శ్రీరామ - పామర దూరా శ్రీరామ॥
సామజవరదా శ్రీరామ - వామన రూపా శ్రీరామ॥ దీన॥

5 అఘ తిమిరాదిత్య శ్రీరామ - విగళిత మోహ శ్రీరామ॥
రఘుకుల తిలక శ్రీరాయ - భృగుసుతరూప శ్రీరామ॥ దీన॥

6 కుశలవజనకా శ్రీరామ - కుశలద చతురా శ్రీరామ॥
దశముఖ మర్దన శ్రీరామ - దశరథ నందన శ్రీరామ॥ దీన॥

7 కలిమల హరణ శ్రీరామ - జలజభవార్చిత శ్రీరామ॥
సలలిత వచనా శ్రీరామ - హలధరరూపా శ్రీరామ॥ దీన॥

8 సిద్ధ జనప్రియ శ్రీరామ ప్ర-సిద్ధ చరిత్రా శ్రీరామా॥
బద్ధ సువసనా శ్రీరామ - బుద్ధావతార శ్రీరామ॥ దీన॥

9 జయకరనామా శ్రీరామ వి-జయరథసారథే శ్రీరామ॥
భయనాశనహరే శ్రీరామ - హయము ఖరూప శ్రీరామ॥ దీన॥

10 భాగవతప్రియ శ్రీరామ – ఆగమమూల శ్రీరామ॥
నాగసుశయనా శ్రీరామ – త్యాగరాజార్చిత శ్రీరామ॥ దీన॥

తాత్పర్యము :

ఈ కృతిలో కేవలము సంస్కృత సంబోధనలు మాత్రమే. ప్రతిపదార్థము వ్రాయబడుచున్నది. దీనులను రక్షించువాడా. దానవులను హరించువాడా! గరుత్మంతుడు వాహన మయిన వాడా. మీనావతారా! నిర్మలమగు హృదయము గలవాడా. సమర్థమయిన బాణములు గలవాడా (తిరుగులేనివని). కర్మఫలము నిచ్చువాడా. కూర్మావతారా! సంపదలను కలిగించు సుగుణముల వాడా. లక్ష్మీదేవి కరములచే లాలింపబడువాడా. శోభకు దయకు సముద్రమయిన వాడా. వరాహావతారా! పద్మనేత్రుడా. దేవేంద్రునిచే పొగడబడువాడా. రాజవేషుడా. నరసింహరూపా. కోర్కెలొసగు వాడా. పామరులకు దూరమైనవాడా. (అందని వాడా అని) కరిని రక్షించిన వాడా. వామన రూపుడా. పాపములనెడి అంధకారమును పోగొట్టు సూర్యుడా. మోహము లేనివాడా. రఘువంశములో శ్రేష్ఠుడా. పరశురామా. కుశలవుల తండ్రీ. క్షేమములిచ్చువాడా. రావణుని మర్దించిన వాడా. దశరథపుత్రా. కలిదోషములను హరించువాడా. బ్రహ్మచే అర్చింపబడువాడా. లలితముగా మాటలాడువాడా. నాగలిని బట్టినవాడా. దేవ జాతివారైన సిద్ధులకు ప్రియమయిన వాడా. ప్రసిద్ధమయిన చరిత్రకలవాడా. బంగరు వస్త్రమును ధరించినవాడా. బుద్ధావతారా. భక్తులకు జయమును కూర్చుపేరు కలవాడా. అర్జునునకు రథసారథి అయినవాడా. భయమును పోగొట్టువాడా. గుర్రముతో సంబంధము కలవాడా (కలికి అన్నమాట) భాగవతులకు ప్రియమైన వాడా. వేదములకు మూలమయిన వాడా. శేషునిపై పరుండువాడా. త్యాగరాజునిచే అర్చింపబడువాడా.

250. రంజని = రూపకము

ప॥ దుర్మార్గ చరాధములను – దొరనీవన జాలరా॥
అ॥ ధర్మాత్మక ధనధాన్యము – దైవము నీవై యుండగ॥ దుర్మార్గ॥
చ॥ పలుకు బోటిని సభలోన– పతిత మానవుల కొసగే
ఖలులనెచట బొగడను శ్రీ– కర త్యాగరాజ వినుత॥ దుర్మార్గ॥

తాత్పర్యము :

ఓ రామా! నేను దుర్మార్గ చరులయిన అధములను దొర అనలేను. ఎందుచేతనంటే అట్టివారిని స్తుతించుట ధన ధాన్యముల కొరకే కదా! అవి నీవే అయి అంతే కాక దైవము కూడ నీవే అయి ఉండగా అధములను నేను వేడను. అంతే కాక సరస్వతిని భ్రష్టజనులకు సభలలో ఇచ్చే ఖలులను కూడనేను పొగడను. అని తన అనన్యార్హనిష్ఠను నివేదించుకొన్నా రయ్యగారు.

విశేషము = ఈ కృతి పోతనగారి 'కాటుక కంటినీరు' 'బాల రసాలసాల' అనే పద్యములను గుర్తుకు తెస్తున్నది. అదియును గాక 'నాధే నః పురుషోత్తమే త్రిజగతా మేకా ధిపేచేతసా। సేవ్యే స్వస్య పదస్య దాతరి సురే నారాయణే తిష్ఠతి। యంకంచి త్పురుషాధమం కతిపయగ్రామేశ మల్పార్థదం। సేవాయై మృగయామహే వయమహో మూడా వరాకా వయం' = మనకు నాథుడు, పురుషోత్తముడు, ముల్లోక ములకు ఏకాధిపతి, మనస్సుచే (కాయకష్టములేక) సేవింపదగిన వాడు, తన పదమును ఇచ్చువాడు, దేవుడు అయిన నారాయణు డుండగా (అతనిని వదలి) రెండుమూడు ఊళ్లకే అధిపతి అయిన ఎవడో ఒక మానవాధమని ఆశ్రయించుటకు వెతకు చున్నాము. ఎంత మూఢులమో ఎంత దౌర్భాగ్యులమో మనము. అంటారుకులశేఖరులు. త్యాగయ్యగారి ఈ కృతి దీనిని కూడ గుర్తుకు తెస్తుంది.

251. సౌరాష్ట్రం = రూపకం

ప॥ *దేవరామ రామ మహా – దేవ రాఘవ॥*

అ॥ *భావజారి రూప ఖేలా – భావ పావనావ మహా॥* *దేవ॥*

చ॥ *శంకర కరుణాకరాని – శంకర ధృత శర భక్తవ*
శంకర దనుజాహవ ని–శ్శంక రసిక త్యాగరాజ॥ *దేవ॥*

తాత్పర్యము :

ఇది కేవలము సంస్కృత రచన. ఇందు రామరామ రాఘవ అని రాముని సంబోధనములుండి తక్కిన వన్నియు శివసంబోధనములుగా కనపడుచున్నవి. అందుచేత ఆ దేవులిద్దరికి అభేదాధ్యవ సాయముచేసి ఈ కృతి రచించినట్లు భావింపవలెను. ఇందులో ప్రతిపదార్థము వ్రాయుచున్నా. దేవ = దేవుడా! రామరామ = రామా! రెండుపర్యాయ

మనుటలో 'ఆదరా ద్విరుక్తిః' = ఆదరమువలన రెండు పర్యాయము లనుట అనే శాస్త్ర వాక్యమును స్మరింపవలెను. మహా దేవ = గొప్పదేవుడా. ఇది శివునకు రూఢము. రాఘవ= రఘువంశమున బుట్టినవాడా! భావజారి రూప = శివుని రూపమయినవాడా! అవ = రక్షించుము. శంకర = సుఖము కలిగించువాడా! కరుణాకర = కరుణకు స్థానమైనవాడా! అనిశం = ఎల్లపుడును, కరధృతశర = బాణములు చేత ధరించినవాడా! భక్త వశంకర = భక్తులను వశముచేసుకొనెడు వాడా! దనుజాహవ నిశ్శంక = రాక్షసులతో యుద్ధము చేయుట యందు శంకలేనివాడా! రసిక = సంగీత రసజ్ఞుడా! త్యాగరాజ = తిరువారూరులో త్యాగరాజ నామముతో వెలసినవాడా! అవ = రక్షించుము (ఈ క్రియా పదము అను పల్లవిలో నున్నది. అక్కడినుంచి ఈ చోటికి తెచ్చుకోవలెను. అప్పుడు పూర్తియగును).

252. సింధురామక్రియ = ఆది

ప॥ దేవాధి దేవ సదాశివ
దిననాథ-సుధాకర - దహాననయన॥ దేవాధి॥

అ॥ దేవేశపితామహ మృగ్య శమా
దిగుణాభరణ - గౌరీరమణ॥ దేవాధి॥

చ॥ భవ చంద్రకళా-ధర నీలగళ
భానుకోటిసం-కాశ శ్రీశనుత
తవ పాదభక్తిం-దేహి దీనబంధో
దరహాస వదన - త్యాగ రాజనుత॥ దేవాధి॥

తాత్పర్యము :

ఇదియు సంస్కృతకృతియే. శివస్తుతి పరము. ప్రతిపదార్థమును వ్రాయుదును. దేవాధి దేవ = దేవతలందరిలో అధికారము గలదేవా! సదాశివ = ఎల్లపుడును మంగళకరుడా! దిననాథ-సుధాకర-దహన-నయన = సూర్యుడు చంద్రుడు అగ్ని కనులుగా కలవాడా! భవ = సత్తామాత్రుడా! (అనగా పుట్టుట పెరుగుట అనేవిలేక ఉండుట మాత్రమే కలవాడా!) చంద్రకళాధర = చంద్రుని శిరమున ధరించువాడా! నీలగళ = నల్లని కంఠముగలవాడా! భానుకోటి సంకాశ = కోటి సూర్యులవలె

ప్రకాశించువాడా! శ్రీశనుత = విష్ణువుచే స్తుతింపబడువాడా! దీనబంధో = దీనులకు బంధువైన వాడా! దరహాస వదన = మందహాసము ముఖమందు గలవాడా! త్యాగరాజనుత= త్యాగరాజుచే నుతింపబడువాడా! తవ పాదభక్తిం = నీపాదభక్తిని, దేహి= ఇమ్ము, అని త్యాగయ్యగారు శివుని ప్రార్థించినారు.

253. మాయామాళవగౌళ = ఆది

ప॥ దేవి శ్రీతులశమ్మ బ్రోచుట కి
దే సమయమమ్మ - మా యమ్మ॥ దేవి॥

అ॥ పావని బ్రహ్మేంద్రాదులు నీ
భక్తిచే విలసిల్లిరట మహా। దేవి॥

చ॥ నీవులేక శంకరి మారమణుడు
నీరజాదుల నొల్లడట
నీవులేక తీర్థము సేవించుట
నీరనుచు పేరాయెనట
నీవులేక త్రాసున శ్రీహరి సరి
నిల్వక బాసెనట
నీవులేక వన మాలని పల్కేరా
నీ సరెవరే త్యాగరాజ వినుత మహా॥ దేవి॥

తాత్పర్యము :

ఓ మా అమ్మా తులసీదేవీ! నన్ను రక్షించవమ్మా! పరమపావనియైన నీ భక్తివలన బ్రహ్మేందాది దేవతలు వారివారి పదవులయందు విలసిల్ల చున్నారు. ఓ మంగళకరురాలా! నారాయణుడు నీదళ మొక్కటి అయినను లేక పద్మములు మొదలగువాటి పూజను అంగీకరింపడు. నీటిలో నిన్ను చేర్చితే తీర్థమవుతుంది. లేకపోతే వట్టినీరే. సత్యభామ త్రాసులో వేసిన మణుగుల బంగారము కృష్ణుని తూచలేకపోయినది. అమ్మా తులసీ! నీ దళమొక్కటి కృష్ణునకు సరి తూగినది. విష్ణువు ధరించిన మాలకు నీవలన వనమాల అని పేరు కలిగినది. నీసరి ఎవరును కారమ్మా. అని అయ్యగారు తులసిని ప్రార్థించినారు.

254. మధ్యమావతి = త్రిపుట

ప॥ దేవ! శ్రీతపస్తీర్థ పురనివాస-దేహి భక్తిమధునా॥

అ॥ పావన! ప్రవృద్ధ శ్రీమతీ హృ-ద్భవన సకల జగదవన శ్రీమహా॥ దేవ॥

చ॥ పాశహస్త గణేశ హరణ-ప లాశనారినుతేశ వరదకు
శేశయారిధ రాశరేభ మృ-గేశ సప్త ఋషీశ దేవ॥ దేవ॥

2 నీలగళ! సురజాలనుత! నత పాల గిరిశ విశాల ఫాల కృ
పాలవాల సుశీల గౌరీ! లోల శివ మాంపాలయాద్భుత॥ దేవ॥

3 నాగపూజిత నాగదనుజహా - రాగమర్దన వాగధి పవి ను
తాగణితగుణ రాగమదదూ-రాఘహర శ్రీత్యాగరాజ॥ దేవ॥

తాత్పర్యము :

ఇది తపస్తీర్థ క్షేత్రమున వెలసిన ఈశ్వరుని స్తుతిపరము. సంస్కృతి కృతి. దేవ = ఓ దేవా! శ్రీతపస్తీర్థపుర నివాస = శ్రీ తపస్తీర్థపురమున నివసించువాడా! అధునా = ఇప్పుడు భక్తిం=భక్తిని దేహి=ఇమ్ము. పావన = పవిత్రమగువాడా! ప్రవృద్ధ శ్రీమతీ హృద్భవన = ప్రవృద్ధ శ్రీమతి (అచ్చటిదేవి) హృదయమున నుండువాడా! సకల జగదవ న = సమస్త లోకములను రక్షించువాడా! శ్రీమహాదేవ = మహాదేవుడా! పాశహస్తగణేశ హరణ = యముని హరించినవాడా! (మార్కండేయకథ) పలాశనారినుత = దేవతలచే స్తుతింపబడినవాడా! ఈశ = ఈశ్వరుడా! వరద = వరము లిచ్చువాడా! కుశేశయారి ధర = చంద్రుని ధరించినవాడా! ఆశరేభమృగేశ = రాక్షసులనెడి ఏనుగులకు సింహమయిన వాడా! సప్త ఋషీశ = సప్త ఋషులకు ప్రభువా! నీలగళ = నల్లని కంఠమువాడా! సురజాల నుత = దేవతా సమూహములచే నుతింపబడువాడా! నతపాల = నమస్కరించినవారిని రక్షించువాడా! గిరిశ = కైలాసగిరియందు శయనించువాడా! విశాలఫాల = విశాలమయిన నుదురు గలవాడా! కృపాలవాల = కృపకు పాదైనవాడా! సుశీల = మంచిశీలము గలవాడా! గౌరిలోల = పార్వతీ దేవియందు ఆసక్తిగలవాడా! శివ = శివా! పాలయ = రక్షించుము, అద్భుత = ఆశ్చర్యకరుడా! నాగపూజిత = ఏనుగుచే పూజింపబడినవాడా! (కాళహస్తికథ) నాగదనుజ హర = గజాసురుని సంహరించినవాడా, అగమర్దన = కొండను మర్దించినవాడా! (శివకథలలో నుండవచ్చును) వాగధిపవినుత = బృహస్పతిచే

నుతింపబడువాడా! అగణితగుణ = లెక్కలేని గుణములు గలవాడా! రాగమదదూర= రాగము మదములేనివాడ! అఘహర = పాపములను హరించువాడా! శ్రీ త్యాగరాజ = తిరువారూరి త్యాగరాజా! నీ భక్తినిమ్ము రక్షింపుము అనే క్రియలు పల్లవిలో చరణములో నున్నవి. అవి ఇక్కడకు తెచ్చుకొంటే వాక్యంపూర్తి అగును.

255. శహన = ఆది

ప॥ దేహితవ పదభక్తిం-వై-దేహి పతిత పావనిమే సదా॥ దేహి॥

అ॥ ఐహికాముష్మికఫలదే కమ-లాసనానన్యజ వరజనని॥ దేహి॥

చ॥ కలశవారాశి జనితే - కనక భూషణ లసితే॥
కలశజగీత ముదితే - కాకుత్థ్సరాజసహితే దేహి॥

2 అఖిలాండరూపిణి - అలికుల నిభవేణీ॥
మఖసంరక్షక రాణీ-మమ భాగ్యకారిణి॥ దేహి॥

3 శరణాగత పాలనే-శతముఖ మదదమనే
తరుణారుణాబ్జనయనే-త్యాగరాజ హృత్సదనే॥ దేహి॥

తాత్పర్యము :

ఇది సీతాస్తోత్ర పరమయిన సంస్కృతకృతి. శ్రీమహాలక్ష్మితో అభేదము చేసి రచింపబడినది. వైదేహి = ఓ జనకుని కూతురా! పతితపావని = పతితులను పవిత్రులను చేయుదానా! మే = నాకు, సదా = ఎల్లప్పుడును, తవపద భక్తిం = నీపాదభక్తిని, దేహి= ఇమ్ము. ఐహికాముష్మిక ఫలదే = ఇహలోకసంబంధమగు పరలోకసంబంధమునగు రెండు ఫలముల నిచ్చుదానా! కమలాసనానన్యజవరజనని = బ్రహ్మకు, మన్మధునకును తల్లి అయినదానా! కలశవారాశి జనితే = క్షీరసముద్రమందు బుట్టినదానా! కనక భూషణలసితే= బంగారు నగలతో ప్రకాశించుదానా! అగస్త్యుని గీతమునకు సంతోషపడిన దానా! (లక్ష్మీదేవి కథలోనిది యుండవచ్చును) కాకుత్థ్సరాజసహితే = శ్రీరామునితో గూడియున్నదానా! అఖిలాండ రూపిణి = అఖిలలోకములు నీరూపమైనదానా! అలికులనిభవేణీ = తుమ్మెదల బారువంటి జడగలదానా! మఖసంరక్షకరాణీ =

విశ్వామిత్రుని యాగమును రక్షించిన రాముని రాణీ! మమ భాగ్యకారిణి = నాకు భాగ్యము కలిగించుదానా! శతముఖమదదమనే = నూరు తలలు గల మైరావణుని మద మణచిన దానా! తరుణారుణాబ్జనయనే = అప్పటికప్పుడు వికసించిన పద్మమువంటి నేత్రములు గలదానా! త్యాగరాజ హృత్సదనే = త్యాగరాజుని హృదయ మందుండు దానా! అని అయ్యగారు సీతమ్మను వేడుకొన్నారు.

ఒక గమనిక = ఇందు అయ్యగారు 'మఖ సంరక్షక రాణీ' అన్నారు. రాణీ అనునది సంస్కృత భాషాపదముకాదు. దీనిని సంస్కృత పదముతో సమాసము చేసినారు. ఇది చింత్యమే. ఋషిప్రమోగములయందు ఇట్టివేవయిన నున్నప్పుడు 'ఆర్షత్వా త్సాధుః' = ఋషి ప్రయోగము కనుక సాధువే' అని శాస్త్రజ్ఞులు అనుమతించినారు. ఇచ్చట మనకును ఇదియే శరణ్యము.

256. రీతిగౌళ = ఆది

ప॥ ద్వైతము సుఖమా – అ ద్వైతము సుఖమా॥ ద్వైతము॥

అ॥ చైతన్యమా విను– సర్వసాక్షివై
సారముగాను దెల్పుము నాతో॥ ద్వైతము॥

చ॥ గగన పవన తపన– భువనాద్యవనిలో
నగధరాజ శివేంద్రాది సురలలో
భగవద్భక్తవరా గ్రేసరులలో
బాగరమించే – త్యాగరాజార్చిత॥ ద్వైతము॥

తాత్పర్యము :

త్యాగయ్యగారి కొక సందేహము కలిగింది. ద్వైతమని ఒక మతమున్నది. అద్వైతమని ఒక మతమున్నది. ద్వైతమందు జీవుడు వేరు ఈశ్వరుడు వేరు. రెండూ రెండు తత్త్వములు. అద్వైతమందు ఆరెండు ఒకే తత్త్వమని సంప్రదాయము. ఈ రెండు మతములో ఏది సుఖము అని ఆలోచించారు త్యాగయ్యగారు. 'ఏదారి సంచరింతురా' అని రాముని ప్రశ్నకూడవేసినారు. ఆకృతిలోనే రెండిటిలోనూ రెండు విప్రతిపత్తులు చూపినారు. నేను నువ్వు ఒకటే నంటే నన్ను వదలుటకుదరదు. అని అందువు. నన్ను

నీవు రక్షించు అంటే రక్షకుడొక్కడు రక్ష్యుడు ఇంకొకడు అనే ద్వైత భావము ఏర్పడుచున్నది. కనుక ఏ దారి సంచరింపవలెను? ద్వైతము సుఖమా అద్వైతము సుఖమా అనే జిజ్ఞాస అయ్యగారిని వదలలేదు. తనలో చైతన్యమైన సర్వసాక్షిగా ఉన్న రామునే ఈ ప్రశ్న వేయుచున్నారు అయ్యగారు. సర్వసాక్షివై నాలో చైతన్య స్వరూపుడవై త్యాగరాజార్చితుడవైన ఓ రామా! ద్వైతము సుఖమా? అద్వైతము సుఖమా? సారముగా నాకు తెలుపవలసినది. అని రాముని కోరినాడు. ఇట్లు కోరినాడు. పంచ భూతముల యందు, బ్రహ్మ విష్ణు శివ ఇంద్రాది దేవతలలోను, భగవద్భక్తులయందు, భాగవతాగ్రేసరులయందును బాగా రమించే ఓ రామా నాకు తెలుపవలసినది అని. ప్రపంచము జడ పదార్థములయందు సురనరులయందు అంతర్యామియై వెలుగొందు రామా అని సంబోధించినాడు. ఈ భావములు విశిష్టాద్వైత భావములు. కాగా అయ్యగారు. రెండు మతముల పేరెత్తి సందేహించినారు. విశిష్టాద్వైతమును వాచ్యము చెయ్యక వ్యంగ్య మర్యాదతో ధ్వనింపజేసినారు. ఈ ప్రశ్నలలోనే ఆయన సమాధానం చెప్పుకున్నాడు. ఏసందేహము లెట్లున్నా నిస్సందేహముగా భక్తినవలంబించి తనను రక్షింపుమని తాను జీవుడుగా రాముని దేవుడుగా భావించి ప్రవర్తించినాడు. ఈ తాత్పర్య నిర్ణయానికి అయ్యగారు అభ్యాసముగా రచించిన వందలాది కృతులే ప్రమాణము. ఒక అభియుక్తోక్తి ఉన్నది. 'కేచిదద్వైత మిచ్ఛంతి। ద్వైతమిచ్ఛంతి చాపరే। సమంతత్త్వం న జానంతి। ద్వైతాద్వైత వివర్జితం' = కొందరు ద్వైతమును కోరుచున్నారు. కొందరద్వైతమును కోరుచున్నారు. కాని ద్వైతము అద్వైతమును కాని సమతత్త్వము నెరుగలేకున్నారు. అని. త్యాగయ్యగారు సమతత్త్వము నెరిగిన వారని భావింపవచ్చును.

257. బిలహరి = ఆది

ప॥ దొరకునా ఇటువంటి సేవ॥

అ॥ దొరకునా అల్పతప మొనరించిన భూ
సురవరులకైన - సురలకైన॥ దొరకునా॥

చ॥ తుంబురునారదులును సుగుణ కీర్త
నంబుల నాలాపము సేయగా
అంబరీష ముఖ్యులు నామముసే
యంగ జాజులపై చల్లగా

బింబాధరలగు సురవారాళి
వేణులు నాట్యము లాడగా
అంబుజభవ పాకారు విరుగడల
నన్వయ బిరుదావళిని బొగడగా
అంబర వాస సతులు కరకంక
ణంబులు ఘల్లని విసరగ మణిహా
రంబులు గదలగ నూచే ఫణిత
ల్పంబున నెలకొన్న హరిని గనుగొన॥ దొరకునా

2 మరకత సన్నిభదే హంబున
మెరుగు కనక చేలము శోభిల్ల
చరణయుగ నఖావళి కాంతులు
చందురు పిల్లలను గేర
వర నూపురములు వెలుగ కరయుగమున
వజ్రపు భూషణములు మెరయ
ఉరమున ముక్తాహారములు మరియు
ఉచితమైన మకర కుండలంబులు
చిరునవ్వులు గల వదనంబున ముం
గురు లద్దంపు గపోలము ముద్దు
గురియు దివ్యఫాలంబున దిలకము
మెరసే భువి లావణ్యనిధిని గన॥ దొరకునా॥

3 తామస రహిత మునులకు బొగడ
తరముగాక నే భ్రమసి నిల్వగా
శ్రీమ త్కనకపు తొట్లపైన
చెలువందగ కొలువుండగ
కామిత ఫలదాయకి యౌ సీత
కాంతుని గని యుప్పొంగగా
రామబ్రహ్మ తనయు డౌత్యాగ
రాజుతా బాడుచు నూచగ
రాముని జగ దుద్ధారుని సురరిపు
భీముని త్రిగుణా తీతుని పూర్ణ

కామని చిన్మయరూపుని సద్గుణ
ధామని కనులార మదిని గనుగొన॥ దొరకునా॥

తాత్పర్యము :

అతిలోక సుందరమగు ఒక దృశ్యము నూహించి మనస్సులో భావించుకొని సాక్షాత్తుగా దానిని చూచుచు ఆనందమను భవించుచున్నట్లు ఈ సేవా భాగ్యము తనకే లభించినదని అయ్యగారు భావించి పాడిన కృతి ఇది. అల్పతపస్సు చేసిన వారి కీసేవ దొరుకుతుందా? దొరకదు. తుంబురునారదులు గుణకీర్తనములు పాడుచుండగా, అంబరీషాది మహాభక్తులు నామకీర్తనము చేయుచు జాజులు చల్లగా, అప్సరసలు నాట్యమాడు చుండగా, బ్రహ్మ ఇంద్రుడు రెండు ప్రక్కలనుండి శ్రీరాముని వంశ బిరుదులను చదువుచుండగా, దేవతా స్త్రీలు తమ చేతి మురుగులు ఘలు ఘల్లుమన విసరుచుండగా, శేషతల్పమున నున్నహరిని చూచే ఈ సేవ దొరకునా?

ఇంద్రనీలమువంటి శరీర కాంతి, దానిపై బంగారు వలువ కాంతులు, మణిహారముల కాంతులు, చంద్ర ఖండముల వలె నున్న కాలిగోళ్ల కాంతులు, కాలి అందెల కాంతులు, వజ్రపు టుంగరముల కాంతులు, రొమ్మున ముత్యాల హారాల కాంతులు, మకర కుండలముల కాంతులు, అద్దపు చెక్కిళ్ల కాంతులు, తిలకపు తీరు వీటితో కూడిన చిరునవ్వు వెన్నెలలు ఇన్నిటితో గూడి యున్న లావణ్యనిధిని చూచుట దొరకునా?

తామసరహితులయిన మునులకు కూడ వర్ణింపశక్యముగా కున్నది. నేను భ్రమసి చూచుచు నిలచియున్నాను. శ్రీరాముడు బంగారు ఊయెలలో నున్నాడు. కామితఫలదాయకి అయిన జానకి ఉప్పొంగుచు కాంతుని చూచుచున్నది. రామబ్రహ్మం తనయుడనైన నేను పాడుచు ఊచుచున్నాను. ఈ సమయంలో సకల గుణాభి రాముడయిన రాముని కనులార సేవించు భాగ్యము దొరుకుతుందా? అని అయ్యగారు ఆనందతన్మయు లగుచున్నారు.

258. తోడి = రూపకము (ప్రహ్లాదభక్తివిజయము)

ప॥ దొరకునా అని సురల-దొర వెడలెను గనరే॥ దొరకునా॥

అ॥ కరకు బంగారు వల్వ - గట్టి సొమ్ములు బెట్టి
హరిసేవ గనులార - నంతరంగమునను గన॥ దొరకునా॥

చ॥ ఘనమైన హరినామ – గాన మొనరించి
చనువునను – హరిసేవ – సల్ప నెవ్వరికైన॥ దొరకునా॥

2 నేడు తన నోముఫల–మీడేరెనని హరిని
బాడుచును మనసార – వేడుచును సేవింప॥ దొరకునా॥

3 రాజముఖు డవని జా–రమణితో జెలగగ
పూజించు శ్రీ త్యాగ–రాజ సన్నుతుని గన॥ దొరకునా॥

తాత్పర్యము :

ప్రహ్లాదునకు సముద్ర మధ్యమున శ్రీహరి సాక్షాత్కారమైనది. ప్రహ్లాదుడు శ్రీహరిని పూజింపబోవు చున్నాడు. ఈ దృశ్యమును చూడవలెనని కుతూహలముతో 'ఇటువంటి సేవ దొరకునా' అని బంగరు వలువలు సొమ్ములు ధరించి హరినామ గానమొనరించుచు, తన నోములు ఫలించినవని భావించుచు దేవేంద్రుడు బయలుదేరినాడు. ఇది ఆయక్ష గానములో సూత్రధారుని వచనము.

259. వరాళి = ఆది (దివ్యనామము)

ప॥ ధరను నీసరి దైవము గానరా రఘువర॥

చ॥ శ్రీ రాజవందన – సింధు బంధన
శ్రీదశరథ నందన – శ్రితహృచ్చందన॥ ధరను॥

2 పాప విమోచన – పంకజలోచన
ప్రాపగుటకు యోచనా – భక్తపాలన॥ ధరను॥

3 సాల విదారణ – సర్వ లోకావన॥
పాలయ చంద్రానన – పతిత పావన॥ ధరను॥

4 ఇందిరాభాగ్యమా – ఇనకులోత్తమా
చందము కనిపింపుమా–సత్తా మాత్రమా॥ ధరను॥

5 పాదార విందము – భావనా కందము
నీదయ ధన బృందము – నిత్యానందము॥ ధరను॥

6 వాగీశ సన్నుత – త్యాగరాజార్చిత
నాగశయన పాలిత – నతసుచరిత॥ ధరను॥

తాత్పర్యము :

ఓ రఘువరా! ఈ లోకములో నీతో సమానమయిన దైవమును నేను చూడలేదు. శ్రీద = సంపదల నిచ్చువాడా! అజవందన = బ్రహ్మవందనము స్వీకరించువాడా! సింధు బంధన = సముద్రమును బంధించినవాడా! శ్రీదశరథ నందన! = దశరథుని కుమారుడా! శ్రితహృచ్చందన = ఆశ్రయించినవారి మనస్సునకు చందనము వంటివాడా! పాపములనుండి విడిపించువాడా! పంకజలోచన = పద్మములవంటి కనులవాడా! నీవు నాకాశ్రయము. నా కాశ్రయ మగుటకు యోచనా? వద్దు. భక్తపాలనా! సాలవిదారణ = చెట్లను కూల్చినవాడా! (సుగ్రీవునితో మైత్రి చేయునపుడు సుగ్రీవునకు నమ్మకము కలుగుటకు ఏడు చెట్లను ఒక బాణముతో కూల్చినాడు) సర్వలోకావన = సమస్తలోకములను పాలించువాడా! చంద్రానన = చంద్రునివంటి ముఖముగలవాడా! పతితపావన = పతితులను పవిత్రముచేయువాడా! ఇందిరా భాగ్యమా = లక్ష్మీదేవికి భాగ్యమయినవాడా! ఇనకులోత్తమా = సూర్యవంశ శ్రేష్ఠుడా! నీ చందము నొకసారి చూపుము. సత్తా మాత్రమా = పుట్టుట, పెరుగుట, తరుగుట వంటి మార్పులులేక ఉండువాడా! నీ పాదము నా తలపులకు ఆధారము. నీ దయ నాకు ధనరాశి, నిత్యానంద దాయకము. బ్రహ్మచే నుతింపబడువాడా! త్యాగరాజార్చిత! నాగశయన = శేషశయన! పాలిత నత సుచరిత = భక్తుల మంచినడవడికను కాపాడువాడా! పాలయ = రక్షించుము. అని.

260. కేదారగౌళ = జంపె (దివ్యనామము)

ప॥ ధర్మాత్మ నన్నిపుడు–దయజూడవేయన
మర్మమున బల్కునది–మంచిదో॥ ధర్మాత్మ॥

చ॥ పతిత పావనుడని – బాగ పేరైనీకు
మతిలేక యుండునది – మంచిదో॥ ధర్మాత్మ॥

2 గతిలేని నను నీవు – కావవే యంటి స
న్మతిలేక యుండునది – మంచిదో॥ ధర్మాత్మ॥

3 నినుజూడ పదివేల – కనులు గావలెనంటి
మను పక యుండునది – మంచిదో॥ ధర్మాత్మ॥

4 ఏమి నేరను పాద – మే మిగుల గతి యంటి
నా మీద నెపమెంచుట – మంచిదో॥ ధర్మాత్మ॥

5 నీదుమాయల చేత – నిష్కార మేల మ
మ్మాదుకోకను యుండ – మంచిదో॥ ధర్మాత్మ॥

6 నాటి వచనములెల్ల – నయము చేయవె యంటి
మాటలాడకుండునది – మంచిదో॥ ధర్మాత్మ॥

7 రాజనుత శ్రీత్యాగ – రాజరక్షక శ్రితస
మాజ నను మరచునది – మంచిదో రామ॥ ధర్మాత్మ॥

తాత్పర్యము :

ఓ రామా! ధర్మాత్మా! నన్ను దయజూడమంటే నీవు మర్మముగా పలుకుట మంచిదా? పతిత పావనుడని పేరు వహించి నను దయచూచే మతి (ఆలోచన) లేకపోవుట మంచిదా? నాకు వేరొక గతిలేదు రక్షించు మంటే నీవు సమ్మతింపకపోవుట మంచిదా? నిన్ను చూచుటకు పదివేల కన్నులు కావలెనని నేను వర్ణిస్తే రక్షింపకుండుట మంచిదా? ఇతరములేవియు నెరుగను. నీపాదమే దిక్కంటే మాట లాడకుండుట మంచిదా? నీ మాయలతో మమ్ము నిష్కారపెట్టుటమంచిదా? విభీషణాదుల విషయమున ఆనాడు నీవు పలికిన మాటలను నిజము చేయవలసినది అంటే మాటలాడుకుండుట మంచిదా? నన్ను మరచుట మంచిదా? అని అయ్యగారు రాముని నిర్దయను చూపుచు నిలదీసి అడిగినారు.

261. ధన్యాసి = ఆది

వ॥ ధ్యానమే వరమైన గంగా – స్నానమే మనసా రామ॥ ధ్యానమే॥

అ॥ వాననీట మునుగమునుగ లోని
వంచన ద్రోహము – కరగి పోవునా॥ ధ్యానమే॥

చ॥ పరధననారీ – మణులను దూరి
పరనిందల పరహింసల మీరి
ధరను వెలయు శ్రీరాముని కోరి
త్యాగరాజు తెలుసుకొన్న రామ॥ ధ్యానమే॥

తాత్పర్యము :

ఓ మనసా! రామ నామ ధ్యానమే చక్కని గంగా స్నానము. వాననీటిలో ఎక్కువగా మునిగితే లోపలనున్న మానసిక కళంకములు పోవు. ఈ రామధ్యానగంగచేతనే త్యాగరాజు (నేను) పరధనమును, పరనారులను విసర్జించి, పరనిందను పరహింసను చేయక, శ్రీరాముని కోరి రామ ధ్యానమే సమస్త కళంక హరమని తెలుసుకొన్నాను. ఇట్టి రామధ్యానమే – గంగాస్నానము.

262. ఆభేరి = ఆది

ప॥ నగుమోము గనలేని నా జాలిదెలిసి
నను బ్రోవగ రాదా, శ్రీరఘువర నీ॥ నగుమోము॥

అ॥ నగరాజ ధరనీదు పరివారు లెల్ల
ఒగి బోధన జేసే వారలుగారే, అటులుందురె నీ॥ నగుమోము॥

చ॥ ఖగరాజు నీయానతి–వినివేగ చనలేడో
గగనాని కిలకు బహు–దూరంబని నాడో
జగమేలే పరమాత్మ – ఎవరితో మొరలిడుదు
వగజూపకు తాళను నన్నేలుకోరా, త్యాగరాజనుతనీ నగుమోము॥

తాత్పర్యము :

ఓ రామా! నీ నవ్వు ముఖమును చూడక బ్రతుకలేనినా దీనావస్థను తెలుసుకొని నన్ను రక్షించు. (నీ మోమును చూపు). ఓ నగరాజ ధరా = గోవర్ధన మెత్తినవాడా! నీ చుట్టు ఉన్న నీ పరివార జనులు నన్ను రక్షింపుమని నీకు బోధించువారు కారా! అది లక్షణము కాదుకదా! వైకుంఠమందున్న నీవిచటకు రావలెనంటే గరుత్మంతు నెక్కిరావలసియున్నది. అత డేమయినా పరమాకాశమునకు భూమికి చాలా దూరము

కనుక నేను రాను అని నీ ఆజ్ఞను మీరినాడా? నీవు జగమేలే పరమాత్మవు. నీతో కాక ఎవరితో నేను మొరపెట్టుకుందును? వగలు (మాయలు) చూపక నన్నేలు కోవయ్యా! అని నివేదనము.

263. ఖరహరప్రియ = ఆది

ప॥ నడచినడచి చూచే రయోధ్యా నగరముగానరే

అ॥ పుడమిసుతా సహాయుడై చెలంగే
పూర్ణుని ఆత్మారాముని చూడ॥ నడచి॥

చు॥ అట్టే కనులు మూసి తెరచి సూత్రము
బట్టి వెలికి వేషధారులై
పుట్టుచావులేని తావు తెలియక
పాగడేరు త్యాగరాజ వినుతుని॥ నడచి॥

తాత్పర్యము :

ఓ జనులారా! రాముని దర్శింపవలెను అని కొందరు బహుశ్రమకోర్చి నడచినడచి అయోధ్య వస్తారు. అచ్చట సీతతో కూడి పరిపూర్ణుడై యున్న రాముని చూచెదరు. మరికొందరు జపమాలిక చేతబట్టుకొని త్రిప్పుచు, కనులు మూయుచు తెరచుచు బాహ్య వేషధారులై పుట్టుచావులేని ఆ తావు తెలియక పైకి నామజపము చేయు చుందురు.

విశేషము = పైన చెప్పిన రెండును నిరుపయోగమే అని అయ్యగారి భావన. 'యమో వైవస్వతో రాజా। హృదయస్థో జనార్దనః। తేన తే అవి వాదశ్చేత్। మా గంగాం మా కురూన్ గమః = ఓరీ జీవుడా! నీలో నుండి నిన్ను నియమించుచు నిన్ను రంజింపజేయుచు సూర్యమండలాంతర్వర్తి అయిన నారాయణు డున్నాడు. ఆయనతో నీకు వివాదము లేకుండ ఉంటే నీవు గంగకు పోనక్కరలేదు. కురుక్షేత్రమునకు పోనక్కరలేదు అని శాస్త్రవాక్యము. మొత్తము భావ మేమంటే తన ఆత్మలో పరమాత్ముడున్నాడని తెలిసి ఆయన ఆజ్ఞా రూపములయిన యోగములలో ఉత్తమమయిన భక్తి యోగమునవలంబించి అహంకార వర్జితుడై సర్వమును పరమాత్మాధీన మని నమ్మి అంతశ్శుద్ధితో రాముని భజిస్తే శుద్ధ సత్వమయము = పుట్టుక చావులేని ఆవైకుంఠము లభ్యము అని.

264. రీతిగౌళ = చాపు (ప్రహ్లాద భక్తి విజయము)

ప॥ నన్ను విడచి కదలకురా...

అ॥ నిన్ను బాసి అర-నిమిష మోర్వనురా॥ నన్ను॥

చ॥ తరముగాని యెండవేళ కల్ప
తరునీడ దొరకిన-ట్లాయె నీవేళ॥ నన్ను॥

2 అబ్ధిలో మునిగి శ్వాసమును, బట్టి
ఆణి ముత్యము గన్న-ట్లాయె శ్రీరమణ॥ నన్ను॥

3 వసుధను ఖననము జేసి, ధన
భాండమబ్బిన రీతి-కనుగొంటి డాసి॥ నన్ను॥

4 వడలు తగిలియున్న వేళ, గొప్ప
వడగండ్లు కురిసిన-ట్లాయె నీవేళ॥ నన్ను॥

5 బాగుగ నన్నేలుకోరా - వర
త్యాగరాజనుత ఈ-తనువు నీదేరా॥ నన్ను॥

తాత్పర్యము :

ప్రహ్లాదునకు సముద్రుని అంతఃపురమున నుండగా శ్రీహరి సాక్షాత్కరించినాడు. ప్రహ్లాదు డంటున్నాడు. శ్రీహరీ! నన్ను విడచి ఇటనుంచి కదలవద్దు. అరనిమిషమయినా నిన్ను విడచి బ్రతుకలేను. నీ దర్శనము నాకెట్లున్నదంటే భరింపలేని ఎండలో కల్పవృక్షపునీడ దొరకినట్లున్నది. (మామూలు చెట్టునీడ అయితే నీడ మాత్రం ఇస్తుంది. కల్పవృక్షపు నీడ నీడనిస్తూ కావలసిన కోరిన అన్నిటిని ఇస్తుంది. ఇది హరిదర్శనము కుపమానము గాచెప్పబడినది).

శ్లో॥ వాసుదేవతరుచ్ఛాయా। నాతిశీతానఘర్మదా। నరకాంగార శమనీ। సా కిమర్థం న సేవ్యతే'= 'వాసుదేవుడనే వృక్షము యొక్క నీడ చలిని పుట్టించదు, తాపమును పుట్టనివ్వదు. నరకమనెడు నిప్పును చల్లార్చుతుంది. దానిని సేవించుడు' అని వ్యాసమహర్షి వాక్యము. పై ఉపమానము దీనిని గుర్తుకు తెచ్చినది. మరియు ప్రహ్లాదు డంటున్నాడు. దేవా! సముద్రమున మునిగి శ్వాస బట్టి ఆణిముత్యమును దొరకించు

కొన్నట్లున్నది. మంచి తీవ్రమయిన ఎండలో వడగళ్ళవాన కురిసి నట్లున్నది. భూమిని త్రవ్వి ధన భాండమును తీసుకొని నట్లున్నది. నన్నేలుకో. తిరిగి వైకుంఠ ధామమునకు నన్ను విడచి వెళ్లకుము అని ప్రహ్లాదుని ప్రార్థన.

265. ఆభోగి = ఆది

ప॥ నన్ను బ్రోవనీ, కింత తామసమా॥
నాపై నేరమే–మి బల్కుమా॥ నన్ను॥

అ॥ చిన్ననాడె నీ–చెలిమి కల్గ గోరి
చింతించలేదా–శ్రీరామ॥ నన్ను॥

చ॥ నిజదాసవరు–లగు తమ్ములతో
నీవు బాగ వు–ట్టగలేదా
గజరాజ ర–క్షక తన యులను
గనిపెంచలేదా – త్యాగరాజనుత॥ నన్ను॥

తాత్పర్యము :

ఓ రామా! నా నేర మేదయినా ఉంటే చెప్పవలసినది. నాభక్తి ఆరోపితము కాదు. 'ప్రహ్లాదో జన్మవైష్ణవః = ప్రహ్లాదుడు పుట్టిన నాటినుంచి విష్ణుభక్తుడే అనినట్లు చిన్ననాటి నుంచి నీ చెలిమి కోరి నిన్ను ధ్యానించు చున్నాను. (ఇది సఖ్య భక్తిని సూచించుచున్నది) నీ దాసులయిన ఆదిశేషుడు శంఖ చక్రములతో వారిని తమ్ములుగా చేసి నీవు పుట్టితివి కదా! అంతేకాక నీవును కొడుకులను కనిపెంచితివి కదా! ఇన్ని కష్ట సుఖము లెరిగిన వాడవు, దాసులను తమ్ములుగా చూచువాడవు (ఇది భగవంతుని కల్యాణ గుణములలో సౌలభ్యము అనే ఒక గుణము అని సంప్రదాయము) నన్ను బ్రోచుటకు జాగేల? అని అయ్యగారి ప్రార్థనము.

266. మోహన = ఆది

ప॥ నను పాలింప–నడచివచ్చితివో నా ప్రాణనాథ॥ నను॥

అ॥ వనజనయన మో–మును జూచుటే జీ
వన మని నెనరున – మనసుమర్మము తెలిసి॥ నను॥

చ॥ సురపతి నీల–మణినిభ తనువుతో
ఉరమున ముత్యపు–సరులచయముతో
కరమున శరకో–దండకాంతితో
ధరణ తనయతో–త్యాగరాజార్చిత॥ ననుు॥

తాత్పర్యము :

ఓ రామా! నా ప్రాణనాథా! నను రక్షించుటకు నావద్దకు నడచి వచ్చితివా? ఓ వనజనయనా! నీ ముఖమును చూచుటే నా జీవనము అని నా మనస్సులోని రహస్యమెరిగి ప్రేమతో నడచివచ్చితివా! ఇంద్రనీలమణి వంటి శరీరముతో, వక్షస్థలమందు ముత్యాలపేరులతో, చేత విల్లు ధరించి సీతతో కూడ ననుపాలింప నడచివచ్చితివా? అని అయ్యగారి ఆనందము.

విశేషము = దీని కొక ఐతిహ్యము కలదు. త్యాగయ్యగారి కూతురు సీతాలక్ష్మి. ఆమె వివాహములో ఒక శిష్యుడు కోదండ రాముని చిత్రపటమును చిత్రించి అయ్యగారికి బహూకరించెనట. అప్పు డయ్యగారు ఆ చిత్రమందలి కోదండరాముని ఇట్లు తన ధాతుమాతువులతో చిత్రీకరించెనట.

267. సింధుకన్నడ = ఆది

ప॥ ననుు గన్న తల్లీ – నా భాగ్యమా
నారాయణి – ధర్మాంబికే॥ ననుు॥

అ॥ కనకాంగిరమా–పతి సోదరీ
కరుణింపవే–కాత్యాయని॥ ననుు॥

చ॥ కావు కావు మనినే – మొరబెట్టగా
కరుగ దేమి మది – కమల లోచని॥
నీవు బ్రోవకున్న – నెవరు బ్రోతురు స
దావరం బొసగు – త్యాగరాజనుతే॥ ననుు॥

తాత్పర్యము :

ఇది పంచనదక్షేత్రములో నున్న ధర్మసంవర్ధనీ దేవి పరమయిన కృతి. ఓ ధర్మాంబికా = ధర్మమును వర్ధిల్ల జేయుదానా! న ను గన్న తల్లీ! నా భాగ్యమైనదానా!

నారాయణీ! = (నారాయణుని కూతురా! శంకరాచార్యులవారి అర్ధ నిర్వాహము నారాయణస్య అపత్యంస్త్రీ = నారాయణుని యొక్క కూతురు అని ఉన్నది). కనకాంగి= బంగారము వంటి దేహము గలదానా! రమాపతి సోదరీ = విష్ణువు యొక్క సోదరీ! ఓ కాత్యాయనీ = 'కతి అయనాని = మోక్షమార్గములెన్ని' అని విచారించిన వాడు కత్యయనుడు. అతని వంశమున పుట్టినదానా! నన్ను కరుణింపవమ్మా! కావు కావు అని పలుసార్లు నిన్ను వేడుకొన్నా నీమనసు కరుగదేమమ్మా! ఓ కమలలోచనీ = పద్మముల వంటి కనులదానా! నీవు కాక నన్ను రక్షించువారెవరును లేరమ్మా! ఎప్పుడు వరమొసగి రక్షింపవమ్మా!

268. శంకరాభరణం = చాపు

ప॥ నన్ను బ్రోవకను విడువనురా రామ॥ నన్ను॥

చ॥ కాసును వెదుకగ – గన్న రత్నము రీతి
దోసము తొలగింప – దొరికితి గాని॥ నన్ను॥

2 అంబలి తినువేళ – అమృతమబ్బిన రీతి
తుంబురు సన్నుత – దొరకితివి గాని॥ నను॥

3 చెయ్యవలసిన వేళ – తెప్పదొరకిన రీతి
అయ్య నా పాలిట–కమరితివి గాని॥ నన్ను॥

4 ఆడ బోయిన అర్ధ–మెదురైన రీతి
నీడు జోడులేని – ఇష్టుడవైతివి॥ నన్ను॥

5 సిగ్గు బోవు వేళ – చీర లబ్బిన రీతి
డిగ్గి మా ఇంటికి – వచ్చితివి గాని॥ నన్ను॥

6 ఆగమ నిగమచ – యార్థము నీవని
త్యాగరాజనుత – తలచి యున్నాను రామ॥ నన్ను॥

తాత్పర్యము :

ఓ రామా! నన్ను రక్షించకపోతే నిన్ను విడువను. పిల్లకాసును వెదుకబోతే రత్నమే దొరకినట్లయినది. నా దోషములన్నిటిని తొలగజేయుటకు నీవు నాకు లభించినావు. ఓ తుంబురు సన్నుతా! నీవు నాకు దొరకుట అంబలి త్రాగేటప్పుడు అమృతము లభించినట్లున్నది. నదిలో ఈదుచున్నప్పుడు అలపు (ఆయాసము) వస్తే వెంటనే చేతికి

తెప్ప దొరకినట్లున్నది. ఆడబోయిన తీర్థ మెదురయినట్లయినది. ఎవరి కయినా ఏదో కారణము వస్త్రములు జారిపోయి సిగ్గుపోయే సమయమందు ఆకాశమునుంచి వస్త్రములు వచ్చి శరీరాచ్ఛాదనము జేసినట్లు మా ఇంటికి వచ్చితివయ్యా రామా! అని త్యాగయ్యగారు ఆనందమును వెలువరించినారు.

విశేషము = పైన జెప్పిన ఉపమానముల ప్రకారం త్యాగయ్యగారికి, సారహీన మయిన, బాధామయమయిన, సంసారములో రాముడు, రామభక్తియు లభించి సంసారబాధ లంటకుండ జేసినవి. 'భక్తినావం ప్రయచ్ఛ' = సంసారమును దాటుటకు భక్తియనెడు తెప్పను ఇమ్ము అని, 'విష్ణుపోతో నరాణాం' సంసార సముద్రమందు కొట్టు మిట్టాడువారికి విష్ణువే తెప్ప' అని కులశేఖరులు చెప్పినట్లు త్యాగయ్యగారికి రాముడు, రామభక్తియు రక్షకములుగా లభించినవి. ఆ ఆనందమునే చెప్పినారు.

269. దేశికతోడి = త్రిశ్రలఘువు (దివ్యనామము)

ప॥ నమోనమో రాఘవాయ అని-శంనమోస్తు
నమోనమో రాఘవాయ॥ నమోనమో॥

చ॥ శుకనుతాయ దీనబంధవే అని-శంనమోస్తు
సకలలోక దయా సింధవే॥ నమో॥

2 శ్రితదురిత తమోబహురవయే అని-శంనమోస్తు
సతతపాలితాద్భుత కవయే॥ నమో॥

3 నిజసేవక కల్పక తరవే అని-శంనమోస్తు
అజరుద్రా ద్యమర సుగురవే॥ నమో॥

4 దీనమా, నవగణపతయే అని-శంనమోస్తు
దానవాంతకాయ సుమతయే॥ నమో॥

5 ఆయురా, రోగ్యదాయినే అని-శంనమోస్తు
వాయుభోజి భోగశాయినే॥ నమో॥

6 నూతన నవనీత భక్షిణే అని-శంనమోస్తు
భూతలాది సర్వసాక్షిణే॥ నమో॥

7 వరగజకరతులిత బాహవే అని-శంనమోస్తు
శరజిత దానవసుబాహవే॥ నమో॥

8 నాగరాజ పాలనాయ అని-శంనమోస్తు
త్యాగరాజ సేవితాయ॥ నమో॥

తాత్పర్యము :

ఇది సంస్కృత భాషాపదము. ఇందు 'అని శంనమోస్తు = ఎప్పుడును నమస్కారము' 'నమోనమః'= నమస్కారము నమస్కారము'అను అంతయును ప్రతిచరణమునకును అను స్యూతమగుచుండును. రాఘవాయ = రఘువంశ జాతునకు అని శంనమోస్తు నమోనమః. శ్రీశుక మహర్షి చేనుతింపబడువానికి, దీనులకు బంధువైన వానికి సకల లోకములను దయజూచువానికి॥ ఆశ్రితపాపము లనెడి అంధకారమునకు సూర్యుడయిన వానికి, ఎల్లప్పుడును కవులను పాలించువానికి॥ తన సేవకులకు కల్పవృక్షమయిన వానికి, బ్రహ్మ శివుడు మొదలగు దేవతలకు గొప్ప గురువయిన వానికి॥ దీన మానవులను రక్షించువానికి, దాన వాంతకునకు, మంచి బుద్ధి గలవానికి॥ ఆయురారోగ్యముల నిచ్చువానికి, వాయువును భుజించు ఆది శేషుని యందు శయనించువానికి॥ క్రొత్త వెన్నను భక్షించువానికి, అన్ని లోకములకు సర్వ సాక్షి అయిన వానికి॥ చక్కని ఏనుగు తుండమువంటి భుజము గలవానికి, సుబాహువును కూల్చిన వానికి॥ ఏనుగును రక్షించినవానికి, త్యాగరాజుచే సేవింపబడు వానికి ఎల్లప్పుడు నమస్కారము నమస్కారము నమస్కారము.

విశేషము = ఇది త్యాగయ్యగారి మొదటి రచనము అని పూర్వులు చెప్పిన వార్త. ఇందు ప్రతి విశేషణమందును రమ్యమయిన అంత్య ప్రాస కూర్చబడినది. ఇందు సంగీత విద్వాంసులు చేయు ఒక పారపాటును పరిహరించి 'అనిశం నమోస్తు' అని పరిష్కరించుట జరిగినది.

270. అసావేరి = రూపకం (దివ్యనామము)

ప॥ నమ్మకనే మోసపోదు-నటరా నటరాజవినుత॥ నమ్మకనే॥

చ॥ దుర్విషయమ్ములు మనసున-దూరక చేసే నినునెర॥ నమ్మకనే॥

2 ధనతనయ కళత్రాదులు-తమదని బుద్ధీయని నిను॥ నమ్మకనే॥

3 ఇంద్రియముల కాహ్లాద-మిచ్చే రూపము గల నిను॥ నమ్మకనే॥

4 బొమ్మరిండ్లుగాన నెర-నమ్మకు భవమును అనునిను॥ నమ్మకనే॥

5 నెమ్మదిలేని జనన మర-ణమ్ముల తొలగించే నిను॥ నమ్మకనే॥

6 రఘుకులరత్నమా త్యాగ-రాజార్చిత పదయుగనిను॥ నమ్మకనే॥

తాత్పర్యము :

ఓ రామా! నటరాజ వినుతా = నటరాజగు శివునిచే పొగడబడువాడా! నిన్ను నమ్మక నేమోసపోదునా? పోను. నిను నమ్మి బాగుపడుదును. చెడు విషయములను మనసుకంటనీయని నిన్ను నమ్మకుందునా? ధనము భార్యాపుత్రులమీద మమత పెరిగి పతితుడయ్యే బుద్ధిని ఇయ్యని నిన్ను నమ్మకుందునా? సర్వేంద్రియములకును ఆనందమిచ్చే నిన్ను నమ్మకుందునా? (తలచితే మనస్సుకానందము. కీర్తిస్తే నాలుకకానందము. చూచితే నేత్రముల కానందము. పూజిస్తే చేతులకానందము). సంసార సుఖములన్నియును పిల్లలు ఇసుకతో కట్టే బొమ్మరిళ్లవలె క్షణములో కూలిపోయెడివే అని బోధించే నిన్ను నమ్మకుందునా? శాంతిలేని జనన మరణములను తొలగించి శాశ్వతానందము నిచ్చే నిన్ను నమ్మకుందునా? అని అయ్యగారు దృఢ విశ్వాసమును ప్రకటించినారు.

విశేషము = భగవంతు డున్నాడని నమ్మవలెనా వద్దా? ఆస్తికులు నమ్ముదురు. నాస్తికులు నమ్మరు. 'నమ్మి చెడిన వారు లేరు. నమ్మక బాగుపడిన వారు లేరు' తెలుగులో పెద్దల సుద్ది ఉన్నది. శ్రీ శంకరాచార్యుల వారు నాస్తికులతో వాదముచేసి తుదకు ఒక మాటతో వారి వాదమును కూల్చివేసి 'అస్తిచే న్నాస్తికో హతః' = భగవంతుడు లేడని నీ వనుచున్నావు. నీ దియును ఊహయే. ప్రబల ప్రమాణములేదు. ఒకవేళ భగవంతుడు ఉండిన యెడల నాస్తికుడు హతుడగును' అన్నారు. దానితో నాస్తికుని పై వాదములేదు.

271. కల్యాణి = రూపకము

ప॥ నమ్మివచ్చిన నన్ను-నయముగ బ్రోవవే నిను॥ నమ్మి॥

అ॥ కొమ్మని వరముల నొసగే-గోవూరి సుందరేశ॥ నమ్మి॥

చ॥ వేదపురాణాగమ శా-స్త్రాదులు గుమిగూడి
పాదములను గనజాలక-బ్రతిమాలియు వేడ
నాదరూప శ్రీసౌం-దర్య నాయకీ పతే
వాదరహిత త్యాగరాజ-వరదసుందరేశ్వర నిను॥ నమ్మి॥

తాత్పర్యము :

ఓ కో(గో)వూరి సుందరేశ్వరదేవా! తీసుకోరా! అని పిలిచి వరము లిచ్చే నిన్ను నమ్మి వచ్చాను నన్ను రక్షించుము. వేదములు, శాస్త్రములు, ఆగమములు, పురాణములు ఇవన్నియు కలసి వెదకి నీపాదములను తెలుసుకొనలేక అనేక విధముల ప్రార్థించినవి. నీవు నాదరూపుడవు. సౌందర్యనాయకీ నాథుడవు. వాద రహితుడవు. త్యాగరాజ వరదుడవు. నన్ను రక్షించుము.

272. బిలహరి = త్రిపుట

ప॥ నరసింహా నను బ్రోవవే, శ్రీలక్ష్మీ॥ నరసింహా॥

అ॥ కొరమాలిన నరుల-గొనియాడను నేను
పరమ పావన నా-పాలి శ్రీలక్ష్మీ॥ నరసింహా॥

చ॥ నీదు భక్తుడు ప్ర-హ్లాదుడు కనకకశిపు
వాదులోర్వక నిన్ను-ఆదుకోమన గాచినావు॥ నరసింహా॥

2 ఎందుకని సైరింతు నీమనసు-నందు తెలియనిదేది లోకుల
నిందకోర్వక నిన్ను గోరి-నందు కెంతని కరుణ జూపవో॥ నరసింహా॥

3 నీ జపము నీస్మరణ నీ పదపూజ - నీవారి చెలిమి యొసగి
రాజిగా దయచేయు త్యాగ - రాజసన్నుత తరముగాదు॥ నరసింహా॥

తాత్పర్యము :

శ్రీలక్ష్మీనరసింహా! నన్ను రక్షించుము. ఓ పరమపావనా! నాపాలిదైవమా! నేను పనికి మాలిన నరులను వేడను. నీభక్తుడగు ప్రహ్లాదుడు హిరణ్యకశిపుని వాదముల నోర్వలేక నిన్ను శరణుజొచ్చి ఆదుకొమ్మని వేడితే రక్షించితివికదా! నేనిక సైరింపలేను.

నీ నామజపము, నీ స్మరణము, నీపాద పూజ, నీ భక్తులతో చెలిమి, కలుగజేసి నన్ను రక్షింపనిచో ఇక నా తరముకాదు. అని అయ్యగారు లక్ష్మీనరసింహుని వేడినారు.

విశేషము = 'హిరణ్యకశిపుని వాదముల నోర్వలేక' అంటే హరిలేడు, నేనే ఈశ్వరుడను, ఎక్కడపడితే అక్కడ కలడా! ఈ స్తంభమున కలడా? అనే వాదముల నోర్వలేక అని. ప్రహ్లాదుడు, పెట్టిన బాధలనోర్చినాడు. నాస్తిక వాదములనే ఓర్వలేక పోయినాడు.

273. మధ్యమావతి = చాపు

ప॥ నళిన లోచన నీవు-గాక అన్యుల నమ్మి
నరజన్మ మీడేరునా॥ నళిన॥

అ॥ జలజాప్తకుల భూషణ, సుభాషణ స
జ్జన పోషణా, జనక సుతారమణ॥ నళిన॥

చ॥ కొంగవంటి ధ్యానము జేసితే తన
కోరిక లీడేరునా॥
దొంగమగని భక్తి-మీరినమ్మితే మంచి
దోవ జూపనేర్చునా
గంగలోని ఓడను నమ్మి భవసా
గరము దాట వచ్చునా?
నంగనాచుల శర-ణనుట చేత న
నంగుడు జ్ఞానోప-దేశము జేయునా॥ నళిన॥

2 పరమవంధ్యకు పాలు-పెరుగుబోసితే చంటి
పాలుకలుగ నేర్చునా?
నెరయ ధనములు దా-యాదుల కిచ్చితే
నెనరు మాట కల్గునా
ఎరువువేసి యూ-షర భూమి విత్తితే
ఏమైనా ఫలియించునా?
వరమైన పేరుగ-లుగు గంగరావికి
వందన మొనరించి-తే బ్రోవ నేర్చునా? నళిన॥

3 సొగసైన బూ-రుగలను బెంచితే
సురసఫలము లిచ్చునా?
భగవంతుని తిరు-మంజ నవిభవము
పరిచారకుల కబ్బునా?
రాగలోభముతో తపము జేసితే ప
రగతి కలుగ నేర్చునా?
త్యాగరాజసన్నుత సద్గుణ స
త్యస్వరూప నిర్వికార పరాత్పర॥ నళిన॥

తాత్పర్యము :

ఓ నళిన లోచనా = పద్మములవంటి కనులవాడా! నిన్ను కాక ఇతరులను నమ్మితే నరజన్మము ఈడేరుతుందా? (సద్గతిని పొందుతుందా) పొందదు. కొంగ ధ్యానముచేస్తే కోరికలు నెరవేరుతాయా? ఒక స్త్రీ దొంగమగని మరిగితే ఆమె పతివ్రతా ధర్మములు నేర్వ కలుగుతుందా? గంగలో నున్న పడవను నమ్ముకుంటే సంసార సముద్రము దాటుటకు కుదురునా? విలాసముగల స్త్రీలను నమ్మి శరణంటే మన్మథుడు జ్ఞానోపదేశము చేయగలుగుతాడా? గొడ్రాలు పాలు పెరుగు త్రాగితే చంటి బిడ్డకు చనుబాలు ఇవ్వగలుగుతుందా? తనకున్న ధనము దాయాదుల కిస్తే వారికి ప్రేమకలుగుతుందా? చవిటి పర్ర భూమిలో విత్తనాలు చల్లి ఎరువు వేస్తే అది పండుతుందా? గంగరావి చెట్టు పేరు బాగానే వున్నది. దానిలో గంగ అని రావి అని రెండు పేరులున్నాయి. అందుకని గంగలో మునిగిన ఫలము వచ్చునా? రావిచెట్టుకు మ్రొక్కిన ఫలము వచ్చునా? (కొందరు కొన్ని ఫలములను కోరి అశ్వత్థప్రదక్షిణాలు (రావిచెట్టుకు) మ్రొక్కుతారు). గంగ రావిచెట్టుకు మ్రొక్కరు. బూరుగ చెట్టు చూచుటకు సొగసుగా ఉంటుంది. కాని మామిడి పండ్ల వంటి సురసఫలములను ఇస్తుందా? దేవునకు తిరుమంజనముచేసే విధానము ఇంటి నౌకర్లకు కుదురుతుందా? కామముతో తపస్సు చేస్తే మోక్షము అబ్బుతుందా? పైన చెప్పిన అన్నియు కుదరనివే. ఈ దృష్టాంతములను అయ్యగారు చూపి రాముని కాక ఇతరులను వేడితే సద్గతి చేకూరదని స్పష్టపరచినారు.

274. బిలహరి = ఆది

ప॥ నా జీవాధార! నా నోముఫలమా

అ॥ రాజీవలోచన – రాజరాజ శిరోమణి॥ నా॥

చ॥ నా చూపు ప్రకాశమా–నా నాసికాపరిమళమా
నా జపవర్ణరూపమా నాదు–పూజా సుమమా త్యాగరాజనుత॥ నా॥

తాత్పర్యము :

ఓ రాజీవలోచనా = పద్మములవంటి కనులవాడా! రాజరాజ శిరోమణీ! రాజాధి రాజులందరిలో తలమానికమైన వాడా! నాజీవమునకు ఆధారమైనవాడా! (సర్వ భూతముల యందును ఉండి వాటి వాటి జీవనస్థితికి ఆధారముగా పరమాత్ము డుంటున్నాడు. ఉపనిషత్తులు దీనినే చెప్పుచున్నవి). నానోముఫలమా = నేను చేసిన నోములకు ఫలమయినవాడా! (దానేన ఇజ్యయా తపసా అనాశకేన = దానము చేతను, యజ్ఞముచేతను, తపస్సుచేతను ఉపవాసాదివ్రతములచేతను భగవ త్ప్రాప్తి' అని శాస్త్రము). అందుచేత 'నానోముఫలమా' అన్నారు. నా చూపు ప్రకాశమా = నాచూపునకు ప్రకాశమా! (కన్ను ఒక జ్ఞానేంద్రియము. దీని పని చూపు. దీనికి లక్ష్యము ప్రకాశము. ఆ ప్రకాశము అయ్యగారికి రాముడే. అందుచేత అట్లు సంబోధించినారు). నా నాసికా పరిమళమా = నాముక్కునకు పరిమళమా! (పై దాని వలె వివరము) నా జపవర్ణరూపమా! నేను జపించు అక్షరములే రూపమయినవాడా! అనగా వర్ణములు నామములగుచున్నవి. నామములకున్న అర్థముచేత రూపము మనస్సుకు పొడగట్టును. భగవంతుడు నాదరూపుడంటే అదే. నాదు పూజా సుమమా = నా పూజా పుష్పమైనవాడా! అనగా సాధ్యము సాధనము నైనవాడా! (ప్రపన్నులను వారు భగవంతునిగా సాధనముగాను సాధ్యముగాను భావింతురు). ఇవి కేవలము సంబోధనములే. ఈ కృతియందు పిలచిన తరువాత కోరే క్రియాపదములేదు. దీని భావము. ఫలము కోరుట దోషమని అది భగవానుడే చూచుకుంటాడు. అని స్వప్రవృత్తిని వృత్తితో (తన ప్రయత్నము లేకుండుట) ఉండవలెనని ప్రపన్ను లక్షణములలో నొకటి. త్యాగయ్యగారిది సూచించిరేమో. ఒక శంక కలుగవచ్చును. పిలచుట స్వప్రవృత్తికాదా? అని. కాదు. 'రక్ష్యా పేక్షాంప్రతీచ్ఛతే' జీవుని అపేక్షను కోరును' అనుదాని ప్రకారం భగవానుడు జీవునినుండి అంతవరకు కోరునట. కనుక ఇది సమంజసము.

275. దేవక్రియ = ఆది

ప॥ నాటి మాట మరచితివో, ఓ రామ చిన॥ నాటి॥

అ॥ మాటి మాటికి నను-మన్నన జేయుచు
ఏటి కీయోచన-ఈ భాగ్యము నీదను॥ నాటి॥

చ॥ తరుణుల బాగున-ర్తనముల జూచువేళ
చరణమును గనినే-కరగుచు సేవింప
భరతుని కరచా-మరమును నిల్పుచు
కరుణను త్యాగరాజ-వరదుడు పలికిన॥ నాటి॥

తాత్పర్యము :

రామా! అలనాటి మాట మరచినావా? నన్ను మన్ననజేసి ఈ సేవా భాగ్యమంతయు నీదే అని చెప్పినావు. మరచినావా? నీవు సింహాసనమున నున్నపుడు తరుణుల నృత్యములను చూచుచున్నావు. అప్పుడు నేను నీ పాదములను కడుగు చున్నాను. అప్పుడు భరతుడు చామరము వేయుచుండగా నీవు దాని నాపి ఆ చామరము త్యాగరాజునకిమ్ము భరతా. ఆ భాగ్యము వీనిదే అని చెప్పినావు. ఆ నాటిమాట మరచినావా రామా అని అయ్యగారు రామునకు ఒక నాటి మాట గుర్తుకు తెస్తున్నారు.

విశేషము = భక్తులు భగవంతునితో అనేక వార్త లనుభవిస్తారు. ఆయన తనతో కొన్నిమాటలు మాట్లాడినట్లు కొన్ని సుఖముల నిచ్చినట్లు హృదయమును భావనామయము చేసుకొంటారు. అవి నిజములని క్రమముగా భావిస్తారు. నిజానికి ఆది భ్రాంతి (మనదృష్టిలో). కాని ఆభావనా ప్రపంచములో వారి ముఖ కవళికలలో అనేకవికారములు కలుగుతాయి. అందుకనే ''బాలోన్మత్త పిశాచవత్'' = భక్తులు బాలుర వలె, పిచ్చివారివలె, పిశాచముల వలె కనుపింతురట. అట్టి వారు ఆశ్వారులలో నొకరున్నారు. వారిపేరు ''పేయాళ్వారు'' అంటే భ్రాంతుడు, ఉన్మత్తుడు, పిశాచము అని మూడర్థములున్నాయి. ఇది తలితండ్రులు పెట్టిన పేరు కాదు. ఆయన భగవన్మయ ప్రవర్తన వలన లోకులు పెట్టిన పేరు. అట్లే త్యాగయ్య గారు రాముని తోడి భావనా ప్రపంచమున నుండి రచించినది.

276. జనరంజని = త్రిపుట

ప॥ నాడాడిన మాట। నేడు తప్పవలదు
నా తండ్రీ శ్రీరామ। నాడాడిన॥

అ॥ ఏడాడి నాడుగ। ఎడబాయని వాని
పోడిమిగ గా। పాడుదు నని చిన్న॥ నాడాడిన॥

చ॥ తలకు వచ్చిన బాధ । తల పాగకు సేతు
వలచి నమ్మిన వాని। వలలోన దగులుదు
ఇల భక్తి సాగర। మీద జేతునని
తలపోసి బల్కితివే। తాగ్యరాజనుత॥ నాడాడిన॥

తాత్పర్యము :

నా తండ్రీశ్రీరామా! ఒక నాడు నీ వొకమాట పలికి నావు. ఒక సంవత్సరకాలము నన్నెడబాయక పూజించు వానిని చక్కగా రక్షిస్తాను అని. తలకు వచ్చి బాధ తలపాగ అనుభవించే టట్లు చేస్తాను (బాధను పోగొట్టుదును అని భావము) భక్తితో నన్ను నమ్మిన వాని భక్తి పాశంలో చిక్కుకుంటాను, భక్తి సముద్రాన్ని దాటేట్లు చేస్తాను (మోక్షందాకా తీసుకొని వెళ్లుదును అని) పలికి నావు. ఆ మాట తప్పవద్దయ్యా అని అయ్యగారి ప్రార్థనము. ఇదియును భావనామయమే 99 పకృతి వలెనే.

277. భైరవి = ఆది (దివ్యనామము)

ప॥ నాధా బ్రోవవే రఘు। నాధా బ్రోవవే

చ॥ సలలితుడని మును। బలికిన వాల్మీ
కుల వాక్కులు క।ల్లలా యెనా రఘు॥ నాధా॥

2 భయములుగల ముని। చయముల జూచిహ్మా
దయము కరగగన। భయ మొసగిన రఘు॥ నాధా॥

3 వరమగు నుదుటి ముం। గురులను దొలగించి
కరుణను నిజభక్త। వరులను జూచే రఘు॥ నాధా॥

4 అగణిత రిపులకు। వగ లొనరించి స్వ
నగరమునేల వచ్చే। సాగసును జూపురఘు॥ నాధా॥

5 కల కలమను ముఖ। కళగని పురభా
ములు వలచగను త। ల్లుల వలె జూచే రఘు॥ నాధా॥

6 భరతుని గని మది। కరగగ వాని
యురమున జేర్చి। కరమును జూపురఘు॥ నాధా॥

7 నిరుపమ నిర్గుణ। సరసిజలోచన
మరవక త్యాగరాజ। వరద శ్రీరామ రఘు॥ నాధా॥

తాత్పర్యము :

ఓ రఘునాధా! నన్ను రక్షించ వలె నయ్యా! వాల్మీకి నీవు ఎన్నో సలలిత గుణములు కలవాడని చెప్పినాడు. నేడు అవన్నియు కల్లమాట లయినవా? ఆనాడు అరణ్యములో రాక్షస బాధల వలన భయపడిన మునులను చూచి మనసు కరగి వారికి అభయ మిచ్చితివి. ఈనాడు ఆ గుణము కనపడుట లేదు. భక్తులు వచ్చి ముందు నిలచినపుడు ముంగురులు కంటి కడ్డము పడుచుంటే వాటిని పైకి త్రోసుకొని కరుణతో వారి ముఖము చూచే ఆ గుణమేమయిన దయ్యా నేడు? అరణ్యవాసము ముగించుకొని అయోధ్యకు వచ్చినపుడు పురస్త్రీలు నిన్ను చూచి వలచినప్పుడు వారి ని కన్నతల్లులవలె చూచిన గుణవంతుడవు. లెక్కలేని రాక్షసులను సంహరించి అయోధ్య నేలవచ్చే సొగసును జూపిన వాడవు. (అట్లే నన్నేలే సొగసును చూపమని). అయోధ్యకు వచ్చి, నీ విరహముచే కృశించిన భరతుని చూచి మనస్సు కరగి వానిని రొమ్మునకు హత్తుకొని అభయహస్తము చూపే ఆగుణము నాపై చూపవేల? అని త్యాగయ్యగారు వాల్మీకి, రామాయణమున వర్ణించిన గుణములను గుర్తుకు దెచ్చి తనను రక్షించమని కోరుచున్నారు.

278. కల్యాణ వసంతము = రూపకము

ప॥ నాదలోలుడై బ్రహ్మ। నందమందవే, మనసా॥ నాద॥

అ॥ స్వాదు ఫలప్రద సప్త। స్వరరాగ నిచయ సహిత॥ నాద॥

చ॥ హరి హరాత్మ భూ సరపతి। శరజన్మ గణేశాది
వరమౌనులు పాసించరె। ధరత్యాగరాజు తెలియు॥ నాద॥

తాత్పర్యము :

ఓ మనసా! నీవు సంగీతాసక్తి కలిగి నాదోపాసన చేసి బ్రహ్మానందమును పొందుమా అని తనమనస్సున కుపదేశించుచున్నారు. సప్తస్వరములు, వాటి సందర్భములు (కూర్పులు) కలిగి మనోరంజకమై బ్రహ్మానందమును కలిగించే సంగీతోపాసన చేసి ఆనందమును పొందుము. విష్ణువు, శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు, కుమారస్వామి, గణపతి మొదలయిన దేవతలు, మునులు ఉపాసించే నాదమును (సంగీతమును) ఆసక్తితో ఉపాసింపుము. త్యాగరాజున కిది తెలయును. అని మనస్సునకు బోధ చేసిరి.

279. చిత్తరంజని = ఆది

ప॥ నాదతనుమనిశం – శంకరం
నమామి మే మనసా శిరసా॥ నాద॥

అ॥ మోదకర నిగ మోత్తమ సామ
వేదసారం వారం వారం॥ నాద॥

చ॥ సద్యోజాతాది పంచ వక్త్రజ
సరిగమ పదనీ – వరసప్త స్వర
విద్యాలోలం విదళిత కాలం
విమల హృదయ త్యాగరాజపాలం॥ నాద॥

తాత్పర్యము :

ఇది త్యాగయ్యగారు శంకరుని పరముగా సంస్కృతమున రచించిన కృతి. నాదతనుం = నాదశరీరుడైన, శంకరం = శంకరుని, మే = నా యొక్క, మనసా=మనస్సు చేతను, శిరసా = శిరస్సు చేతను (అంటే త్రికరణ శుద్ధిగా అని) అనిశం = ఎల్లప్పుడును, నమామి = నమస్కరించు చున్నాను. మోదకర నిగ మోత్తమ సామవేద సారం = సంతోషమును కలిగించునదియు, వేదములలో నుత్తమమైనదియు అగు సామ వేదము యొక్క సారమయిన వాడగు (శంకరుని) నమామి = నమస్కరించుచున్నాను. సద్యోజాతాది పంచ వక్త్రజ సరిగమ పదని విద్యాలోలం = స ద్యోజాతము మొదలగు అయిదు స్థానముల నుండి పుట్టిన సప్తస్వర విద్యయందు అసక్తి కలవాడును, విదళిత కాలం=యమని విదళించిన వాడును, విమల హృదయత్యాగ రాజ పాలం= నిర్మల

హృదయుడగు త్యాగరాజును పాలించు వాడు అయిన, శంకరుని, వారం వారం= సారెసారెకు నమస్కరించుచున్నాను. అని సంగీత శరీరుడగు శంకరుని ప్రార్థనము.

విశేషము = సంగీత రత్నాకర కారుడు శార్ఙ్గదేవుడు సంగీత రత్నాకర రచనకు చేసే ప్రథమ ప్రార్థనంలో శంకర స్తుతి చేశాడు. ఆ శ్లోకం నాలుగవ పాదం ''వందే నాదతనుం తముద్ధుర జగద్గీతం ముదే శంకరం'' అని. అయ్యగారి ఈ కృతి రచనకు స్ఫూర్తి నిచ్చినది పై శ్లోక పాదము. అయ్యగారు పై పాదములోని నాదతనుం, శంకరం, అనే రెండు పదములనే తీసుకున్నారు. తక్కినది ఆ శ్లోకానికి దీనికిని ఏమీ సంబంధము లేదు. సాధారణంగా అయ్యగారి పద్ధతి ఇదే. ఇతర గ్రంథము నుంచి ఏదో ఒక పదమును గ్రహించినా అంతవరకే అది. తక్కిన భావమంతా సొంతముగా ఉంటుంది. వేదములలో ఉత్తమ మయినది సామ వేదము అన్నారు అయ్యగారు. అనాది నుంచి వైదిక మయిన వ్యవహార మింతే. ఉపనిషత్తులలో సామ వేదానికి సంబంధించిన ఉపనిషత్తుకే విలువ ఎక్కువ. అందుచేతనే కృష్ణ భగవానుడు గీతలో ''వేదానాం సామవేదోస్మి'' = వేదములలో నేను సామ వేదమును'' అని చెప్పినాడు. అట్టిసామ వేదము నుండి సంగీతము పుట్టిన దని శాస్త్రము. అదియే అయ్యగారు ఈ కృతియందు చెప్పిరి. మరియు సద్యోజాతము మొదలయిన ఈశ్వరుని 5 ముఖముల నుండి పుట్టిన సప్తస్వర విద్య అన్నారు. అనగా సంగీతము అని. శరీర మందు నాద ముత్పత్తి అగు స్థానములు అయిదు. అవి సద్యోజాతము, తత్పురుషము, ఈశానము, అఘోరము, వామనము అని. ఈ ఐదును ఈశ్వరుని ముఖములు అని గర్భోనిషత్తు చెప్పినది. ఏ నాదము పట్టినా ఈ 5 ముఖముల నుండియే పుట్టును. అయ్యగారు దీనియం దిదియే చెప్పినారు.

280. ఆరభి = రూపకం

ప॥ నాదసుధారసంబిలను । నరాకృతా యెరా మనస॥ నాద॥

అ॥ వేదాగమ శాస్త్రపురాణాదులకాధార మౌ॥ నాద॥

చ॥ స్వరము లారునొక ఘంటలు। వర రాగము కోదండము
దురనయ దేశ్యము త్రిగుణము। నిరతగతి శరములురా
సరస సంగతి సందర్భము। కలగిరములురా
ధర భజనే భాగ్యమురా। త్యాగరాజు సేవించు॥ నాద॥

తాత్పర్యము :

ఓ మనసా! నాద సుధారసము అనగా సంగీతము, అది నరాకృతి అయినది. అనగా రాముని ఆకారముగా అయినది. ఆనాద సుధారసము ఎట్టిది? వేదములకు పురాణములకు స్మృతులకు ఆధారమైనట్టిది. అవును కదా! నాదములేనిది అక్షరములు లేవు. అక్షరములు లేనిది వేదములు మొదలయినవి లేవు కదా! ఏతావతా నాదమే అన్నిటికి ఆధారము. నాదమే సంగీతము. త్యాగయ్యగారు సంగీతమును అవలంబించి రామోపాసన చేసినారు. ఆయన సంగీత మంతయు రామమయమే. దానివలన సంగీతమే రాముడయినది అని అయ్యగారు భావన చేసినారు. ఆ భావనను సర్వాంగీణముగా నిర్వహించినారు. సంగీతమున సప్త స్వరములున్నవి. అవి రాముని కోదండ మందున్న 7 గంటలు. సంగీతమున రాగమున్నది. ఆ రాగము రాముని కోదండము. సంగీతమందు తుర, నయము, దేశ్యము అని త్రిగుణము లున్నవి. అవి రాముని వింటినారి. రాగమునకు ఎడతెగని గమన ముంటుంది. అది రాముని శరముల గమనము. రాగమునకు సరసమయిన స్వరముల కూర్పు ఉంటుంది. అది అవ్యక్తమధురముగా ఉంటుంది. ఆకూర్పులు రాముని మృదుభాషణములు, అట్టి రాముని భజించుటయే భాగ్యము. అట్టి భజన త్యాగయ్య చేస్తున్నారు. ఇట్లు త్యాగయ్యగారు భిన్నవస్తువుల యందు అభేదాధ్యవసాయము చేసి బింబ ప్రతిబింబ భావము చెడకుండా ఆ ఉత్ప్రేక్షాలంకారమును సమగ్రముగా సమర్థముగా నిర్వహించినారు.

గమనిక = సంగీతమందలి ఒక గుణము(తుర). అనగా ద్రుతగతి, అదిగాయకుల నోట ''దుర''గా మారినదని నా ఊహ.

281. మధ్యమావతి = జంపె

ప॥ నాదుపై బలికేరు। నరులు – శ్రీరామ॥ నాదుపై॥

అ॥ వేద సన్నుత భవము। వేరు జేసితి ననుచు॥ నాదుపై॥

చ॥ పంచశ రజనక ప్ర। పంచమున గల సుఖము
మంచువలె ననుచు మది। నెంచితిని గాని
పంచుకొని ధనము లార్జించుకొని సరి యెవ్వ
రంచు మరిగతియులే। దంచు బల్కితినా? ॥ నాదుపై॥

2 దినము నిత్యోత్సవ। మ్మున కాస జెందితినా
మనుసునను ఇట్లు యొక। టని యంటిగాని
అనుదినము యిరుల మే–లును జూచిన తాళలే
కనురెండు సేయవలె। ననుచు బల్కితినా॥ నాదుపై॥

3 ప్రాణ మేపాటి యని। మానమే మే లంటి
గాని శ్రీరామ పర। మానంద జలధీ
శ్రీనాధ కులములో। లేని దారిని బట్టి
జానె డుదరము నింప। నొరుల వేడితినా॥ నాదుపై॥

4 ఆ జాను బాహు యుగ। శ్రీజాన కీపతి ప
యోజాక్ష శ్రీత్యాగ। రాజనుత చరణా
ఈ జగతిలో నిన్ను। బూజించు వారి న
వ్యాజమున బ్రోచేను। రాజ నీవాడైన॥ నాదుపై॥

తాత్పర్యము :

త్యాగయ్యగారి నిష్కామప్రవృత్తి, నిరంతర సంగీతో పాసనము, ధనార్జనము చేయక పోవుట రుచించని అన్న పంచాప గేశుడు త్యాగయ్యగారిని వేరింటి కాపురము పెట్టమన్నాడు. అయ్యగారి కది తప్పలేదు. కాని తిరువయ్యారు జనులందరును త్యాగయ్యయే సంసారమును వేరు పరచినాడని నిందించారు. అది సంహించని అయ్యగారు తన పరితాపమును శ్రీరామునితో నివేదించుకొంటున్నారు. ఇట్లు ఓ పంచ శరజనక=మన్మథ జనకా! ప్రపంచములోని సుఖములు మంచు కరగి పోవునట్లు పోవునని భావించితిని కాని వాటిని కోరితినా? లేదు. వేరుపడి పంచుకొని ధనమున కాశించి సౌఖ్యముల ననుభవించుద మను కొంటినా? లేదు. ప్రతి దినమును ఏ వేవో ఐహికమయిన వేడుకలు జరుపు కొంద మనుకొంటినా? లేదు. అన్నదమ్ముల మిరవురును కలసి ఒక్క ఇల్లుగానే ఉండెదమను కొన్నాను. ఇతరుల మేలును ఓర్వలేక వేరు బెట్టితినా? లేదు. ప్రాణము కన్న మానము మేలని యెంచితిని. వంశములో లేని పని జేసి, జానెడు పొట్టకై ఇతరులను యాచించితినా? భక్తులను నిష్కపటముగా బ్రోచే నీ వాడను అని [illegible] యున్నాను. ఇంతేకాని ఈ వేరుకాపురమునకు నేను కారణము కాదని [illegible]చు కొన్నారు.

282. బేగడ = ఆది

ప॥ నాదో పాసనచే శంకర
నారాయణ విధులు వెలసిరి ఓ మనసా॥ నాదోపాసన॥

అ॥ వేదోద్ధారులు – వేదాతీతులు
విశ్వ మెల్లనిండి–యుండే వారలు నాదోపాసన॥

చ॥ మంత్రా త్ములు యంత్ర–తంత్రాత్ములు మరిమ
న్వంతరము లెన్నో గలవారలు
తంత్రీలయ స్వర – గాన విలోలురు
త్యాగరాజ వంద్యులు – స్వతంత్రులు నాదోపాసన॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు తాను పట్టినది నాదము. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు నాదాత్ములను భావము. ఓ మనసా! బ్రహ్మవిష్ణు మహేశ్వరులు నాదోపాసన చేతనే వెలసినారు. ఆ ముమ్మూర్తులు వేదముల నుద్ధరించిన వారు. వేదముల కతీతులు. విశ్వమంతయు నిండియుండేవారు. వారు మంత్రాత్మకులు. (మంత్రములతో స్మరింప బడువారు. నారాయణాక్షరి, శివ పంచాక్షరి మొదలగు నవి) యంత్ర తంత్రములు వారి స్వరూపమే. వీణా దివాదన మునందు చతురులు. ''గోపీపతి రనంతోపి వేణునాద వశంగతః'' = గోపికాపతి కృష్ణుడు వేణునాదమునకు వశమైనాడు. ''అనీనద త్పద్మ భవో మృదంగం'' = బ్రహ్మ మృదంగము వాయించెను. '' ననాద డక్కాం నవ పంచవారం'' = నటరాజు పదునాలుగు సారులు డక్క వాయించెను''. ఇత్యాదిగా నున్న వాక్యములచేత త్రిమూర్తులు ఆయా వాద్యముల యందు చతురులు అని ఊహింప వలెను. అట్టి సంగీత చతురులు కనుక త్యాగరాజ వంద్యులు. వారు స్వతంత్రులు, సృష్టి స్థితి లయములు వారిచేతలో నున్నవి కనుక ఆ ముమ్మూర్తులు స్వతంత్రులు. తక్కిన దేవతలు, నరులు వారి వశములో నున్నవారు. అని తాత్పర్యము.

విశేషము = సంగీత రత్నాకర ప్రస్తావ మందు ''నాదోపాసన యా దేవాః। బ్రహ్మ విష్ణు మహేశ్వరాః। భవంత్యు పాసితానూనం। యస్మాదేతే తదాత్మ కాః'' = బ్రహ్మ విష్ణు మహేశ్వరులు నాదోపాసన చేత ఉపాసింప బడుచున్నారు. నాదాత్మకులు''. అనే అర్ధముగల శ్లోకమున్నది. ఆ శ్లోకము త్యా రచనకు స్ఫూర్తి నిచ్చినది. నాదోపాసనచే త్రిమూర్తు నాదాత్మకములగు మంత్రములచే ఉపాసింపబడి సాక్షాత్క

293. శ్రీరాగము = ఆది

ప॥ నామకుసుమములచే పూజించే
నర జన్మము జన్మమురా॥ నామ॥

అ॥ శ్రీమన్మానస – కనక పీఠమున
చెలగ జేసికొని – వరశివ రామ॥ నామ॥

చ॥ నాదస్వర మనే – వరన వరత్నపు
వేదిక పై సకల లీలా వి
నోదుని పరమాత్ముని శ్రీరాముని
పాదములను త్యాగరాజ హృద్భూషణుని॥ నామ॥

తాత్పర్యము :

శివుని గాని రామునిగాని వారి నామముల నెడి పూలతో పూజించినదే జన్మము.సార్థకమైనది. భక్తిగల నిర్మలమైన మనస్సనెడి బంగారు పీఠమందు దేవుని కూరుచుండ బెట్టి నామపుష్పములతో పూజించిన నరజన్మే జన్మ, ఇంకా నాదము స్వరము(సంగీతము) అనెడి నవరత్న వేదిక మీద లీలావినోదుడైన శ్రీరామ పరమాత్మను నెలకొల్పి ఆయన నామము లనెడి పూలతో పూజించేదే జన్మ.

విశేషము = పోతన గారు 'చేతులారంగ శివుని పూజింప డేని। నోరునొవ్వగ హరికీర్తినుడు వడేని। కలుగ నేటికి తల్లుల కడుపు చేటు'' అంటారు. ఈ త్యాగయ్యగారి కృతి తాత్పర్యమిదే.

284. దేవగాంధారి = రూపకము

ప॥ నామొరాల కింప। వేమి శ్రీరామ॥ నా మొర॥

అ॥ నీ మహిమలు వినివిని
నేనెంతో నెరనమ్మితి॥ నామొర॥

చ॥ ఒక వన చరు డలనాడు – స। హోదరు బాధలుతా
ళక మొరలిడ బ్రోచితివి త।నకు సుగ్రీవము గాదా॥ నామొర॥

2 ఒక నిశిచరు డన్నమాట నో। ర్వకనిను శరణనగా
శుక వచనములో నాదు ప-లుకు విభీషణమా॥ నా మొర॥

3 పూసలు గూర్చిన అటువలె। పూని భజింపగా
ఆసలు గల త్యాగరాజు। దాసు డనుచు తెలిసి॥ నా మొర॥

తాత్పర్యము :

త్యాగయ్యగారి దృష్టిలో రాముడు తన మొర మాత్ర మాలకించుట లేదు. ఏల ఆలకింప వయ్యా రామా? కొంత మంది మొరనాలకించిన నీ మహిమలు వినివిని వాటిని నమ్మి నేను మొర పెట్టితే ఆలకింప వేమయ్యా? (ఎవరి మొర విన్నాను? అని రాముడు ప్రశ్నించినట్లున్నది. అయ్యగారు నిరూపిస్తున్నారు) ఆనాడు ఒక వనచరుడు (వానరుడు) తన అన్న అయిన వాలి పెట్టిన బాధలు తాళలేక మొర బెట్టితే రక్షించావు కదయ్యా! మరి ''నా మొరాల కింపవేమి?'' అని అయ్యగారి ప్రశ్న. మరి అటునుంచి జాబు లేదు. త్యాగయ్యగారు కారణం ఊహించారు. ఆమొర బెట్టిన వాడు సుగ్రీవుడు సుగ్రీవుడంటే మంచి కంఠము గలవాడని అర్థము. ఒహో తెలిసినది రామా! వాడు మంచి కంఠము కలవాడని రక్షించావు. నాది సుగ్రీవము = మంచి కంఠము కాదా? అని సుగ్రీవ అనే శబ్దము మీద చమత్కరించి ప్రశ్నించారయ్యగారు. ఇది సరే. మరి ఒక రాక్షసుడు అన్న రావణుని మాటలు భరింప లేక నిన్ను శరణన్నాడు. వాని పేరు విభీషణుడు. విభీషణు డంటే భయంకరుడని అర్థము. రామా! మరి వాని పలుకులు నీకు చిలుక పలుకు లయినవా? మరి నేను వనచరుడను కాను. నిశాచరుడను కాను. నీకు సజాతీయుడను. పూస గ్రుచ్చినట్లు (సమగ్రముగా) నిన్ను భజించుటకు ఆశగలిగిన నీ దాసుడను, నా మొర వినుట కేమి అభ్యంతరము? అని ప్రశ్న.

విశేషము = సుగ్రీవుడును విభీషణుడును అన్నలచే బాధపడి మొర బెట్టిన వారే. ఈ కృతిలో తనతో సమకోటిగా వారిని చెప్పుట చేత తన అన్న పెట్టిన బాధలు వాచ్యము చేయక వ్యంగ్యముగా చెప్పుట అయినది. తనది సుగ్రీవము కాకపోయినా, తాను విభీషణుడు కాక పోయినా అగ్రజ బాధ అనే సామ్యము చేతనయినా తన మొర వినవలసి ఉన్నది అని ధ్వని.

285. ఆరభి = ఆది

ప॥ నా మొరలను విని – యేమరవలెనా
పామరమనుజులలో – ఓ రామ॥ నా మొర॥

అ॥ తోమర నారా – చములై మనసుకు
తోచెనా భక్త – పావని మోచన॥ నా మొర॥

చ॥ ఇభరాజేంద్రుడు – ఎక్కువైన లంచ–మిచ్చిన దేమిరా॥
సభలో మానము బోసమయంబున
సతి ఏమిచ్చెనురా ఓ రామా॥ నా మొరలను॥

2 భాగవతాగ్రేసర రసికావన – జాగరూకుడని పేరే
రాగస్వరయుత ప్రేమ భక్తజన – రక్షక త్యాగరాజ వందిత॥ నా మొరలను॥

తాత్పర్యము :

ఓ రామా! నా మొరలను వింటున్నావు. కాని ఏమరిచి ఉంటున్నావు. నా చుట్టు పట్ల జనులు పామరులు. పామరుల మధ్య నీవిట్లు చేయ తగదు. నా మొరలు, నీ ఔదాసీన్యము (పట్టించుకొనక పోవుట) పామరులు చూచినచో నీ పని నా పని సరి. ఆనాడు గజేంద్రుడు, కౌరవసభలో మానము పోవుచుండగా ద్రౌపదియు మొర పెట్టుటయే జరిగినది. మొర విన్నావు రక్షించావు. మాకింత వరకే తెలుసును. కాని ఆ యిద్దరును ఎక్కువ లంచమేమయినా ఇచ్చారా? స్వరరాగ సుధా రసయుత భక్త జనులను రక్షించుటలో జాగరూకుడవై ఉంటావని నీకు పేరున్నది. ఇప్పుడది ఏదీ. అని త్యాగయ్యగారి ప్రశ్న.

286. నభోమణి = ఆది

ప॥ నా యెడవంచన సేయకురా – ఓ రాఘవ॥
నలుగురికై నమ్మలేదురా – శ్రీ రామచంద్ర॥ నా యెడ॥

అ॥ మాయపు మానవులను జేరి – మత్సరుడై తిరిగితినా॥
దాయాదుల పోరైన గాని నీ–దాసుడనై వేడుకొన్న॥ నా యెడ॥

చ॥ వాదాడుచు బాలురు ఎచ్చటి – వాడవు నిలురా బుద్ధి
లేదా యన తాలిమి గల–వారై తలిదండ్రులు జూచి
మోదముతో తనయులనుచును–ముద్దు బెట్టి కౌగిలి గూర్పు
లేదా అటునేగాదా – బ్రోవవే త్యాగరాజ సన్నుత॥ నా యెడ॥

తాత్పర్యము :

ఓ రాఘవా! నన్ను వంచన చేయకు. నలుగురు నన్ను భక్తుడు అని చెప్పుకొనుటకు నేను నమ్మలేదు. (మనో వాక్కాయ కర్మలతో నిన్ను నమ్మినాను). మాయజేసే మానవులతో నే చేరలేదు. మత్సరుడునుగాను. మా అన్న నీ భక్తిని విడచి ధనార్జన చేయుమని పోరు పెట్టినా నేను నీ దాసుడను అనే బుద్ధి మానలేదు. చిన్నబాలుడు వాదులాడి తూలనాడినా తల్లి దండ్రులు బాలుని కౌగలించుకొని ముద్దుబెట్టుకొందురు. అట్లే నన్ను అపరాధములను క్షమియించి రక్షించుమని ప్రార్థన.

287. దర్బారు = ఆది

ప॥ నారదగురుస్వామీ – ఇకనైనన
న్నాదరింపవేమీ, ఈ కరవేమీ॥ నారద॥

అ॥ సారెకు సంగీత – యోగనైగమ
పారం గతుడైన – పరమపావన॥ నారద॥

చ॥ ఇతిహాస పురా–ణాగమచరితము
లెవని వల్ల గలిగే
పతిని దానమియ్యబుద్ధి సత్య–భామ కెటుల కలిగె
ద్యుతి జితశరదభ్ర – నిను వినాముని
యతులకెవరు సలిగె
క్షితిని త్యాగరాజ వినుత నమ్మితి–చింతదీర్చి ప్రహ్లాదు బ్రోచిన॥ నారద॥

తాత్పర్యము :

భగవదనుగ్రహము కలుగవలెనంటే ముందు భాగవతానుగ్రహము, గురుని అనుగ్రహమును కలుగవలెను. అది ఎరిగి ఆ రెండును అయిన నారదుని స్తుతిస్తున్నారు అయ్యగారు. ఓ నారద గురుస్వామీ! ఇకనైనా నన్నాదరింపవయ్యా! సంగీత విద్యయందు,

వేద విజ్ఞానమందును తుది ముట్టిన జ్ఞానము గలవాడవు. పరమ పావనుడవు. నీ దయకు కరవు బుట్టినదా? ఏమయ్యా? నీ శరీరకాంతి శరత్కాల మేఘము వంటిది. ఇతిహాసపురాణము లన్నియు నీ వలననే పుట్టినవి. సత్యభామకు పతిని దానమిచ్చే బుద్ధి నీవలననే కలిగినది. మునులకు యతులకు నీవే ఆశ్రయము. తొల్లి ప్రహ్లాదుని రక్షించినట్లు నన్ను రక్షింపుము. అని తాత్పర్యము.

విశేషము = సంగీతము ఎట్లును ఉన్నది. వెనుకటి కల్పమందు తొలి జన్మలో నారదుడొక దాసీపుత్రుడు. అప్పుడు చాలా పెద్దకాలము అతడు ఋషివాటికలయందు తిరుగుచు వారు చేయుచున్న వేదవాదములు జ్ఞానోపదేశములు విని మహాజ్ఞాని అయినాడు. నారాయణుని అనుగ్రహమును సంపాదించి ఈ కల్పమందు నారదుడను పేరుతో దేవముని అయినాడు. వాల్మీకికి రామకథ నుపదేశించి రామాయణేతిహాసరచనకు కారణమైనాడు. చింతాక్రాంతుడైన వేదవ్యాసునకు చింతతీరుటకు భాగవతమును రచింపుమని సూచించినాడు. పుణ్యకవ్రతము నుపదేశించి పతిదానమును చేయుమని సత్యభామకు చెప్పి ఆమె గర్వమును పోగొట్టినాడు. లీలావతీ గర్భస్థుడైన ప్రహ్లాదుని వధించుటకు ఇంద్రుడు వస్తే వారించి ప్రహ్లాదునకు గర్భమందే నారాయణ మంత్రముపదేశించినాడు. దానిచేతనే ప్రహ్లాదుడు భాగవతాగ్రేసరుడుగా ఖ్యాతి గాంచినాడు. నారదుని ప్రవేశము లేని ఇతిహాస పురాణములులేవు. నారదు డేపని చేసినా అది లోక కల్యాణ కారకమగుచున్నది. అట్టి నారదుని గురుస్వామిగా భావించి అయ్యగారు ఈ కృతి ద్వారా నారద స్తుతి చేసినారు.

288. అఠాణ = రూపకము

ప॥ నారదగానలోల – నతజన పరిపాల॥ నారద॥

అ॥ నీరదసమనీల – నిరుపమగుణ శీల॥ నారద॥

చ॥ నీవు లేక ఏతనువులు – నిరతముగా నడచును
నీవు లేక ఏ తరువులు – నిక్కముగా మొలచును
నీవు లేక ఏ వానలు – నిత్యముగా కురియును
నీవు లేక త్యాగరాజు – నీ గుణముల నెటు బాడును॥ నారద॥

తాత్పర్యము :

ఇది భగవంతుని సత్తను (ఉనికిని) తెలుపుపాట. ఓ నారద గానలోల = నారదుని గానమున లోలుడా! నమస్కరించువారిని పాలించువాడా! మేఘమువలె నల్లనివాడా! సాటిలేని గుణశీలములు కలవాడా! నీ వలననే సమస్త శరీరములు నడచుచున్నవి. నీవలననే చెట్లు మొలచుచున్నవి. నీ వలననే వానలు కురియుచున్నవి. నీ ఉనికి చేతనే నేను నీ గుణములను పాడుచున్నాను.

విశేషము = వేదము 'సన్మూలాః సదాధారాః సత్ప్రతిష్ఠాః' = మనము చూచు లోకములు లోకములలోని విషయములకు సత్తేమూలము. సత్తే ఆధారము. సత్తే ప్రతిష్ఠ. అని చెప్పినది. సత్తు అనగా దేశకాలములకు పరిమితము కాక ఎల్లప్పుడును ఉండునది అని అర్థము. అది భగవంతుడే. అయ్యగారు ఈ విషయమునే ఈ కృతియందు ప్రతిపాదించినారు.

289. యమునా కల్యాణి = ఆది (దివ్యనామము)

ప॥ నారాయణ హరి-నారాయణ హరి
నారాయణ హరి-నారాయణ హరి॥

చ॥ నశ్వరమైన ధ-నాశ్వములను నే
విశ్వసించ భూ-తేశ్వర హరిహరి॥ నారాయణ॥

2 కోటీశులగని - సాటిలేని వల్కు
బోటి నొసగిము-మ్మాటికి వేడను॥ నారాయణ॥

3 ఆశపిశాచా-వేశము కలుగు ధ
నేశుల గాచే దేశము నేలుదు॥ నారాయణ॥

4 నాలో నేనీ-చేలో జిక్కితి॥
నీ లోభము విడ-వేలో తెలియను॥ నారాయణ॥

5 భూలోకములో-మే లోర్వరు విధి
వ్రాలో నీకౌ-చాలో తెలయను॥ నారాయణ॥

6 దూరే పనులకు-దూరేరు కడ
తేరే పనులకు-తేరే మనసును॥ నారాయణ॥

7 తొలి తాజేసిన – ఫలమే కలదని
ఇల నెంచని మ–ర్త్యుల చెలి మెందుకు॥ నారాయణ॥

8 దూషణ హర–పర–దూషణ జనగణ
భీషణ సుగుణ–వి–భీషణ సన్నుత॥ నారాయణ॥

9 నోరెప్పుడు నీ–పేరే బల్కనీ
వేరే ఎవరు–న్నారే రాఘవ॥ నారాయణ॥

10 మిత్రకులేశ చ–రిత్ర రసిక జన
మిత్రము కోరుదు–వృత్రారి వినుత॥ నారాయణ॥

11 వీన విమాన–క–వీన హృదాలయ
దీన జనావన–దానవ హర శ్రీ॥ నారాయణ॥

12 నా జూపులు మీ–నాజూకు తనము
నే జూడనీ త్యాగ–రాజుల్ల మలరు॥ నారాయణ॥

తాత్పర్యము :

నారాయణా! హరీ .... నశించే స్వభావము కల ధనము మొదలగువానిని నేను విశ్వసించను. ఓ భూతేశ్వరా! కోటీశ్వరులకు నా సరస్వతిని ఇచ్చివేడను. ఆశా పిశాచము బట్టిన ధనవంతులను నేనే ఏలుతాను. (అంటే లెక్కచెయ్యను అని). నీకు నేను వశమైన వాడను అని మనస్సులో నమ్మియున్నాను. నీ లోభగుణము విడువవేమి? (దయ రాముని ధనము. దానిని త్యాగయ్యగారిపై ప్రసరింపజేయక పోవుట లోభము). ఈ లోకములో మేలోర్వరు (ఇతరుల శ్రేయస్సునోర్వరు. విశేషముగా రామభక్తి నోర్వరు). ఇది బ్రహ్మవ్రాతా? లేక నీ యొక్క సంకల్పమా? తెలియలేకున్నాను. నిందా పాత్రములైన పనులలో దూరుతారు కాని సద్గతిని కలిగించే పనులను మనస్సునకు తీసుకొనిరారు. ఐహికములయినవి పూర్వకర్మ ప్రకారము వచ్చునని భావించక వాటి కోసం వెంపరలాడు మానవుల చెలిమి చేయను. దూషణహర = దూషణుని సంహరించినవాడా! (ఖర దూషణల నిద్దరిని సంహరించినాడు) పరదూషణ చేయువారికి భయమైనవాడా! విభీషణునిచే పొగడబడినవాడా! నానోరెప్పుడును నీపేరే పలుకనిమ్ము. ఓ ఇంద్రునిచే పొగడబడువాడా! నేను రామకథా రుచి నెరిగిన వారి చెలిమినే కోరుదును. గరుడ వాహనా! కవుల హృదయమందుండు వాడా! నా చూపులు నీ రూపములే చూడనిమ్ము. ఇది తాత్పర్యము.

విశేషము = 7వ చరణము. శ్లో॥ నాస్థాధర్మే నవసునిచయే నైవకామోప భోగే। యద్యద్భవ్యం భవతి భగవన్ పూర్వకర్మానురూపం। ఏతత్ప్రార్థ్యం మమ బహుమతం జన్మ జన్మాంతరేపి। త్వత్పాదాంభోరుహ యుగ గతా నిశ్చిలా భక్తిరస్తు' = హేభగవన్! నాకు ధర్మముపై కాంక్షలేదు. ధనముపైలేదు. కామోపభోగముపై లేదు. అవి పూర్వకర్మాను రూపముగా వచ్చునవి. కాని నేను కోరుకొనేది ఒకటే ఉన్నది. జన్మ జన్మలకు నీపద భక్తి నాకు కావలెను' అని కులశేఖరుల సూక్తి. పరమ భాగవతులిట్లు భావింతురు. తదితరులు ఇతరముగా భావింతురు. వారి చెలిమి చేయను అని త్యాగయ్యగారు చెప్పిరి.

290. పంతువరాళి = చాపు (ప్రహ్లాదభక్తి విజయము)

ప॥ నారదముని వెడలిన సుగు-ణాతిశయము వినరే॥ నారద॥

చ॥ సారెకు శ్రీహరిపద - సారసముల ధ్యానించుచు
నారాయణ నామములను - పారాయణ మొనరించుచు॥ నారద॥

2 భేదా భేదరహితమగు - వేదాంత రస భరితు డా
హ్లాదము మీరగను ప్ర-హ్లాదునకు శుభము దెలుపగను॥ నారద॥

3 కడు తెల్ల దేహమున ప-సిడి వీణె మెరయగ దా
నెడ బాయని ప్రేమతో - నడుగడుగున వాయించుచు॥ నారద॥

4 రాజిల్లు శ్రీత్యాగ-రాజ సఖుని మర్మములను
ఈ జగతిని విన్నవారి-కేజయము జయ మనుచు॥ నారద॥

తాత్పర్యము :

సముద్రుని అంతఃపురమున నాగపాశముక్తుడైన ప్రహ్లాదుడు శ్రీహరి దర్శనానికై ఉత్కంఠపడినాడు. దీని నెరిగి శ్రీహరి వైకుంఠమునుండి ప్రహ్లాదుని వద్దకు వచ్చుచున్నాడు. ఆరాకను వర్ణించు సూత్రధారుని పాట ఇది. నారాయణ పాదములను ధ్యానించుచు నారదముని వెడలినాడు. భేదాభేదరహితమగు వేదాంత జ్ఞానము గలవాడు నారదుడు (ఈ విషయమును ద్వైతము సుఖమా అనే కృతిలో నేను కొంత వివరించినాను). తెల్లని దేహముతో బంగరు వీణను వాయించుచు హరియొక్క కథలను విన్నవారికే జయమని పలుకుచు నారదుడు బయలుదేరినాడు.

291. శహన = ఆది

ప॥ నిజముగ నీ మహిమ దెల్పలేరు॥

అ॥ భజన సేయుమని – పల్కిరేగాని
అజగజ సింహ సృగా–లాంతరమనే॥ నిజముగ॥

చ॥ బుద్ధియను తల్లిని–విషయ విటులకే
ప్రొద్దు నొసగి–పైకము లార్జించే
సిద్ధులు సుజనుల–సభకు రానేరని
పెద్దలు శ్రీ త్యాగ–రాజవినుత రామ॥ నిజముగ॥

తాత్పర్యము :

రామా! నిజముగా నీ మహిమల నెవ్వరును తెలుపలేరు. రాముని భజించండి అని చెప్పే వాళ్లున్నారు. వాళ్ళందరు నిజ తత్త్వమెరిగి చెప్పేవాళ్లు కారు. బుద్ధిని విషయ భోగములయందే నిలిపి ధనార్జన బాగాచేసుకుంటూ సుజనులు పెద్దలుండే చోటికి రాక ఒరులకు బోధిస్తూ ఉంటారు. వీరు నిజమయిన తత్త్వ బోధకులుకారు. నీ నిజమహిమ నెరిగి బోధించేవారికి వీరికి ఏనుగుకు మేకకు, సింహానికి నక్కకు ఉన్నంత అంతరమున్నది. ఇట్టి బోధకులు కలిలో ఎక్కువగా నుందురని భవిష్య త్పురాణము చెప్పినది. అయ్యగారిదే చెప్పిరి.

292. ఉమాభరణం = ఆది

ప॥ నిజమర్మములను – తెలిసిన వారిని
నీ వలయించే – దేమొకో॥ నిజ॥

అ॥ అజగజరక్షక గజచర్మాంబ
రాదిదైవ భేదముల–లీల గల్గజేసిన॥ నిజ॥

చ॥ శ్రుతి శాస్త్రపురాణ విదాది ష
ణ్మత నిష్ఠుల–నామపరాదుల
క్షితిపతులకు – మతులుగ జేసిన
క్షేమత్యాగరాజనుత–శ్రీమనోహరా॥ నిజ॥

తాత్పర్యము :

ప్రపంచమందు చాలా మతములున్నవి. వాటిలో ప్రధాన దేవతలైన ముగ్గురికి సంబంధించిన మతములు మూడు. ఆ మూడు మతములకు ముగ్గురు దేవతలు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. ఈ దైవ భేదకల్పనము నీలీల. ఇది నీలీల అని నిజమర్మమును తెలిసిన వారిని నీవు ఏమియు శ్రమపెట్టలేవు. వేదపురాణ శాస్త్రములు చదువుకొన్న వారు కొందరు, షణ్మతనిష్ఠగలవారు కొందరు, (సూర్యుడు, శక్తి, విష్ణువు, గణపతి, శివుడు, కుమారస్వామి వీరి మతములు ఆరు. ఇవి షణ్మతము లని వ్యవహారము) నామపరులు కొందరు. (దేవుని పేరు మాత్రము పట్టుకొని ఆనామము యొక్క అర్థము యోగార్థము రూఢార్థము తెలియని వారు). ఇంకా క్షితిపతులు (రాజులు) వీరందరు నీ లీలా తత్త్వము తెలియక వాదములు చేసుకొనుచు కుమతులు (అల్పబుద్ధులు) గానే ఉన్నారు. ఇదియును నీలీలయే. ఇది తెలియనివారు వాదములతో శ్రమపడుదురు. తెలిసినవారు 'ఏక మేవా ద్వితీయం బ్రహ్మ' = బ్రహ్మ మొక్కటే, రెండవది లేదు' అని సుఖింతురు. అని తాత్పర్యము.

విశేషము = బ్రహ్మ విష్ణు మహేశ్వరులను గూర్చిన నిజ తత్త్వమును తెలుసుకొన వలసి యున్నది. శ్రీ భాగవత ప్రస్తావమందు వేద వ్యాసమహర్షి ఇట్లు చెప్పెను. 'సత్త్వం రజస్తమ ఇతి ప్రకృతే ర్గుణాస్తై। ర్యుక్తః పరః పురుష ఏక ఇహాస్యధత్తే। స్థిత్యాదయే హరి విరించి హరేతి సంజ్ఞాః। శ్రేయాంసి తత్రఖలు సత్త్వతనో ర్మృణాంస్యుః' = ప్రకృతి యొక్క గుణములు సత్త్వము, రజోగుణము, తమోగుణము అని మూడు. ఆ మూడు గుణములతో కూడిన పరమపురుషు డొక్కడే సృష్టి స్థితి లయముల కొరకు హరి అని, బ్రహ్మ అని, హరుడని, మూడుపేర్లను ధరించు చున్నాడు. ఆ ముగ్గురిలో సత్త్వగుణ ము కలవాడే మానవులకు శ్రేయస్కరుడు' అని. దీనిని బట్టి త్రిమూర్తులకు నామరూప భేదమే తప్ప వస్తు భేదము లేదని తేలినది. దీని ప్రక్కనే వేదవ్యాస మహర్షి ఇంకొకటి చెప్పినాడు. 'ముముక్షవో ఘోరరూపాన్। హిత్వా భూతపతీంస్తథా। నారాయణ కలాశ్శాంతాః। భజంతే హ్యనసూయవః'= మోక్షాపేక్షకలవారు అసూయలేనివారై ఘోరరూపములు కలిగిన భూతపతులను వదలి శాంతములయిన నారాయణుని కళలనే ఉపాసించెదరు' అని, ఇట్లు నామరూప గుణభేదములను బట్టి వారివారి ఉద్దిష్టఫల భేదమును బట్టి ఉపాసనా భేదములు దైవ భేదము లేర్పడినవి. ఈ భేదములు నారాయణుని లీలలు. ఈ నిజమర్మములను తెలిసినవారిని రామా! నీవు ఏమియు నలయింపలేవు. అని త్యాగయ్యగారు నివేదించినారు.

293. కల్యాణి = త్రిపుట

ప॥ నిధి చాలసుఖమా – రాముని స
న్నిధి సేవ సుఖమా – నిజముగ బల్కుమనసా॥ నిధి॥

అ॥ దధినవనీత క్షీ–రములు రుచో దాశ
రధిధ్యాన భజన సు–ధా రసము రుచో॥ నిధి॥

చ॥ దమశమమను గంగా–స్నానము సుఖమా–క
ర్దమ దుర్విషయకూప–స్నానము సుఖమా
మమతాబంధనయుత–నరస్తుతి సుఖమా
సుమతి త్యాగరాజ–నుతుని కీర్తన సుఖమా॥ నిధి॥

తాత్పర్యము :

నిధి = ధననిక్షేపము (డబ్బు పాతర) సుఖకరమా? శ్రీరాముని సన్నిధి యందు రాముని సేవించుట సుఖమా? చెప్పు ఓ మనసా! వెన్న పెరుగు పాలు రుచికరములా? లేక రామనామ ధ్యానము రుచికరమా? బాహ్యేంద్రియని గ్రహము, మనశ్శాంతి అనెడి గంగా స్నానము సుఖమా? సంసారలంపటము నందున్న చెడ్డ విషయము లనెడి బురదనీటి స్నానము సుఖమా! అహంకార, మమకారములతో బంధింపబడిన నరులను స్తుతించుట సుఖమా? మనస్సును ప్రశ్న వేశారు (ఆలోచించిరి అని). అటునుంచి సమాధానము వచ్చినది. రామసన్నిధి సేవ, రామధ్యానము, దమశమ గంగాస్నానము, రామస్తుతి, సుఖములని.

విశేషము = శంకరాచార్యుల వారు 'భోగే రోగభయం కులేచ్యుతి భయం విత్తేనృపాలాద్భయం। సర్వంచైవ భయాన్వితం క్షితితలే వైరాగ్యమేవాభయం' = ఇహలోకములో బాగా తినుట వలన రోగభయము, పెద్ద కులమందు పుట్టితే కులభ్రంశము కలుగుననే భయము, డబ్బు ఉంటే రాజువలన భయము. ఈ విధముగా అన్నియు భయముతో కూడినవే. వైరాగ్యము (దేనినీ కోరకపోవుట) ఒక్కటియే భయములేనిది. అని చెప్పినారు. త్యాగయ్యగారి ఈ కృతి పై దారిలో నున్నది.

294. కల్యాణి = చాపు

ప॥ నిన్ననవలసినదేమి రామ-నన్ననవలెగాక॥

అ॥ కన్న తండ్రి నీ కన్న వేల్పు లెవ
రున్నారురా ఆ-పన్నరక్షక నే॥ నిన్నన॥

చ॥ కన సైరించని దు-ర్జనుల భాషణలేక
మనసున నెనరున-నిను జూచినానా
అనుదినమును నిను-గన సజ్జనసేవ
వినయమునను నిజ-ముగ జేసినానా॥ నిన్నన॥

2 వినవయ్య మనవిని - సనకాది వినుతనే
ధనమును కొనిన భా-మను ప్రేమమీర
ఎనయక మనసను-వనజమున నతివే
గన పాదమున పూజ-నొనరించి నానా॥ నిన్నన॥

3 కలిమానవులు చేయు-చలకార్యములను నే
ఇలలోన దెలియక-వలచితి గాని
కలలోన గలిగిన - కలుముల వలె నెంచి
వలచక బలు తప-ముల జేసినానా॥ నిన్నన॥

4 జలజాప్త కులవర-తిలక వీనుల నీ క
ధలు విన్న బలుపాప-ములు బోవుగాని
కలుముల పలుకుల-చెలులు వశ్యులుగాని
తొలి జన్మముల పూజా-ఫలమేమో తెలియ॥ నిన్నన॥

5 శరచాప ధర యోగి-వర నుత పరిపూర్ణ
నరరూప నిరతము - వరత్యాగరాజ
పరిపాల సురభూమి-సురులను స్థిరముగ
కరుణించే బిరుదు నీ-కరమున మెరయ॥ నిన్నన॥

తాత్పర్యము :

రామా! నన్నునుగ్రహింపకున్నావు. నీవు కన్న తండ్రివి. ఆపన్న రక్షకుడవు. నీకన్న నాకెవరును వేరు వేల్పులులేరు. అయినా నన్ను రక్షింపకున్నావు. నిన్నన వలసిన పనిలేదు.

నన్నే నేనను కొనవలసియున్నది. చూడటానికి దుర్భరములైన దుర్జన భాషణములే చేశాను కాని నిన్ను ప్రేమతో మనస్సులో నిలుపుకొన్నానా? లేదు. ప్రతిదినమును వినయముతో సజ్జనసేవ చేసితినా? లేదు. కలిమానవులు చేసే మాయాకృత్యములనే వలచిచేసితిని. వాటి వలన వచ్చే ఫలితములు కలలోని సంపదలవంటివని తలచక వాటినే నమ్మియున్నాను కాని మంచి తపస్సులు చే సితినా? లేదు. ఓ సూర్యవంశతిలకా! నీకథలను విని నట్లయితే పాపము లన్నియు పోతాయి. కాని ఆ పనిచేసితినా? లేదు. లక్ష్మీ సరస్వతులు వశము కావాలంటే తొలి జన్మపూజ కావలెను. అది ఏమి చేసితినో తెలియదు. నీవు పరిపూర్ణ మానవరూపములో నుండి దేవతలను బ్రహ్మణులను పరిపాలించే వాడవు అని పెద్ద బిరుదు ధరించి ఉన్నావు. కనుక నిన్నన వలసిన పనిలేదు. నన్నే అనుకోవాలి. అని త్యాగయ్యగారు తనలో లేని అకృత్యములను తనయం దారోపించుకొని భరతునివలె 'మత్పాపమేవాత్ర నిమిత్తమాసీత్' = నా పాపమే కారణము అని నివేదించినారు.

295. కన్నడ = ఆది

ప॥ నిన్నాడనేల – నీరజాక్ష॥

అ॥ కన్నవారిపైన–కాకసేయనేల॥ నిన్నాడ॥

చ॥ కర్మానికి తగినటు–కార్యములు నడిచేని
ధర్మానికి తగినటు–దైవము బ్రోచేని॥ నిన్నాడ॥

2 చిత్తానికి తగినటు–సిద్ధియు కలిగేని
విత్తానికి తగినటు–వేడుక నడిచేని॥ నిన్నాడ॥

3 సత్త్వరూప నిన్ను–సన్నుతి జేసి
తత్త్వము దెలిసిన – త్యాగరాజునికి॥ నిన్నాడ॥

తాత్పర్యము :

రామా! నా దురదృష్టమునకు నిన్ను నిందింపనేల? నీవు నా తల్లివి తండ్రివి! నీపై నేను కాక సేయనేల! తల్లి దండ్రులు పిల్లలను కనెదరుకాని వారి వ్రాతలను కనరు కదా! అందుచేత కన్నవారిపై కాక సేయనేల? కర్మమునకు తగినట్లు కార్యములు నడుస్తాయి. ధర్మానికి తగినట్లు దైవము రక్షించును. మనశ్శుద్ధిని బట్టి కార్యసిద్ధి కలుగుతుంది.

విత్తముకొద్ది వైభవముంటుంది. సత్త్వస్వరూపుడవైన (సత్త్వగుణము కల) ఓ రామా నిన్ను సన్నుతి చేయుటచేత తత్త్వమును (యదార్థమును) తెలుసుకొన్న నాకు నా కర్మమునకు నిన్ను నిందించుట తగదని తోచినది. అని అయ్యగారు రామునకు నివేదించినారు. 'చేసుకొన్న వానికి చేసుకొన్నంత మహాదేవా' అనే లోకోక్తిని అనుసరించి కొన్ని ఉదాహరణముల జూపినారు.

296. తోడి = రూపకము

ప॥ నినువినా-సుఖముగాన - నీరజనయనా

అ॥ మనసు కెంతో ఆనంద-మై మైపులకరించగా॥ నిను॥

చ॥ రూపము, ప్రతాపము, శర-చాపము, సల్లాపముగల॥ నిను॥

2 కరుణారస-పరిపూర్ణ-వరదా మృదు-వార్తలు గల॥ నిను॥

3 రాగరసిక-రాగరహిత-త్యాగరాజ భాగధేయ॥ నిను॥

తాత్పర్యము :

ఓ నీరజనయనా రామా! నాకు నీవు కాక సుఖమేదియును లేదు. నిన్ను చూస్తూ ఉంటే మనస్సుకు ఆనందము, శరీరానికి పులకాంకురములు కలుగుతూ ఉంటాయి. రూపానికి రూపము, ప్రతాపానికి ప్రతాపము, చేతిలో ధనుర్బాణములు, మధురవాక్కులు కలిగిన వాడవు. కరుణారసము నిండిన వాడవు, వరములిచ్చువాడవు, చెవి కింపైన కథలు కలవాడవు, ఐహిక విషయములందు రాగము (కోరిక) లేనివాడవు, సంగీత సంబంధమయిన రాగమునందు ఇష్టము కలవాడవు, త్యాగరాజునకు భాగ్యమయిన వాడవు. ఇట్టి నిన్ను చూచుటకన్న సుఖమేదియును లేదు. అని ఆనంద ప్రకటనము.

విశేషము = రాముడు అరణ్యవాసము నందున్నప్పుడు 'పుంసాందృష్టి చిత్తాపహారిణం' పురుషుల యొక్క చూపును మనస్సును హరించే సౌందర్యముగల రాముని మునులు చూచిరని వాల్మీకము. అయ్యగారు దీనిని భంగ్యంతరముగా, అనుభవ పూర్వకముగా చెప్పిరి.

297. నవరసకన్నడ = రూపకం

ప॥ నినువినా నామదెందు-నిలువదే శ్రీహరి హరి॥ నిను॥

అ॥ కనులకు నీ సొగసెంతో-క్రమ్మియున్నది కనుక॥ నిను॥

చ॥ నీదుకథలు వీనులందు-నిండి యున్నది
నిండియున్నది రామ-నిండియున్నది
శ్రీద నీనామము నోట-చెలగియున్నది కనుక॥ నిను॥

2 నేను ఎచట జూచినను-నీవై యున్నది
నీవై యున్నది రామ-నీవై యున్నది
భానువంశతిలక నీదు-భక్తుడను చుపేరు కనుక॥ నిను॥

3 కపటమో మాటలెల్ల-కమ్మనైనది
కమ్మనైనది రామ-కమ్మనైనది
తపము యోగఫలమునీవె-త్యాగరాజసన్నుత॥ నిను॥

తాత్పర్యము :

రామా నామనస్సు నీమీద తప్ప ఇంక ఎక్కడను నిలచుటలేదు. కనులనిండ నీ సొగసు, చెవులలో నీ కథలు, నోట నీ నామము నిండి యున్నవి కనుక నా ఇంద్రియములు మనస్సు వేరే దేనిమీదకు వెళ్లుటలేదు, నిలచుటలేదు. ఓ సూర్యవంశతిలకా! ఏ వస్తువును నేను చూచినా దానియందు నీవే కనపడుచున్నావు. నేను నీ భక్తుడను కనుక. నీవు కపటమైన మాట చెప్పినా అది కమ్మగా ఉంటుంది. నా తపఃఫలమునీవే. నా యోగఫలము నీవే అని మహానందము.

విశేషాంశములు = హనుమంతుడు అయోధ్యలో రామునితో 'భావోనాన్యత్ర గచ్ఛతి'= నీవు కాక నా భావము దేనిమీదకును వెళ్లుటలేదు. అంటాడు. ఇందు అది గుర్తుకు వచ్చుచున్నది. 'కపటమైన మాటలెల్ల కమ్మనైనది'= అనుదానికి ఒక ఉదాహరణము చెప్పక తప్పదు. విభీషణుడు శరణాగతి చేసినప్పుడు సుగ్రీవ జాంబవదంగదులు విభీషణుని పరిగ్రహింపవద్దని కొన్ని ఉపపత్తులు చెప్పిరి. అవి రామునకు రుచించలేదు. కాని రాముడు మీ మాటలు నాకు రుచించలేదు. అని చెప్పలేదు. మీ మాటలు చాలా శాస్త్ర సమ్మతములుగా నున్నవి. చాలా అనుభవపూర్వకముగా నున్నవి. సుగ్రీవా నీవంటి స్నేహితుడుండడు, భరతునివంటి తమ్ముడుండడు (అని

సుగ్రీవున కొక చురక అంటించి) అని శ్లాఘించి 'శరణాగత రక్షణము నావ్రతము' అని చెప్పి తన ఇష్టప్రకారమే నడచుకుంటాడు. రాముడు చెప్పిన మాటలు ఆ సందర్భము ఎంతో కమ్మగా నున్నవి. ఇట్టి రసవత్తర భావములు త్యాగయ్యగారి యందు నిండియున్నవి.

298. ఆరభి = చాపు

ప॥ నిన్నే నెరనమ్మినాను – నీరజాక్ష నను బ్రోవుము॥

అ॥ కన్నకన్న వారిని వేడు–కొన్నను ఫలములేదని నే॥ నిన్నే॥

చ॥ దారతనయుల ఉదర–పూరణము సేయు కొరకు
దూర దేశములను సం–చారము జేసి
సారమింతైన లేక వే–సారి ఈ సంసారపారా
వారమందు గలుగు ఫలమీ–దారి యని తెలిసి రామ॥ నిన్నే॥

2 సంచిత కర్మము తొల–గించి నన్నేవేళ గరు
ణించి బ్రోచే దైవము నీ–వంచు నాసించి
కొంచెపు నరులనుతి–యించ నావల్లను గా
దంచును దుస్సంగతి చా–లించి సంతతము రామ॥ నిన్నే॥

3 భూతలమున నొకరి–చేతి ధనమపహరించు
ఘాతుకుల పరలోక–భీతియు లేని
పాతకులబట్టి యమ–దూతలు కొట్టెడి వేళ
బ్రోతునని పల్క నెవరి–చేత గాదని శ్రీరామ॥ నిన్నే॥

4 ఎందు నిండియుండే రము–నందన వేగనామనసు
నందు దలచిన యంత–ఆనందమై తోచే
సుందరవదన యోగి–బృంద వందిత పదార
విందయుగ త్యాగరాజ–వందనీయ సంతతము॥ నిన్నే॥

తాత్పర్యము :

నీరజాక్షుడైన ఓ రామా! నేను నమ్మినాను. చూచిన వారి నందరిని వేడుకొంటే ఫలము లేదని తెలిసి నిన్నే నమ్మినాను. ఆలు బిడ్డలను పోషించుటకై ఎక్కడెక్కడో తిరిగి తిరిగి ఈ సంసారములో ఫలమింతే అని తెలిసి నిన్నే నమ్మినాను. సంచిత కర్మను

తొలగించి రక్షించే వాడవు నీవని తెలిసి అల్పమానవులను యాచించక దుష్టుల చెలిమి చాలించి నిన్నే నమ్మినాను. పరలోక భయము లేక పరద్రవ్యము నపహరించే వారిని యమదూతలు బాధించునపుడు వారి బారి నుండి కాపాడగలవాడవు. స్మరించిన మాత్రమున ఆనందకరుడవు. నిన్నే నమ్మియున్నాను.

విశేషము = సకల పాపాత్ముడగు అజామీళుని యమదూతల బారినుండి రక్షించినాడు. సర్వత్ర నిండియుండి ప్రహ్లాదుని రక్షించినాడు. ఇట్టి భగవంతుని దృఢముగా విశ్వసించినట్లీ కృతియం దయ్యగారు చెప్పినారు.

299. నాట = ఆది

ప॥ నిన్నే భజన సేయువాడను

అ॥ పన్నగశాయీ పరుల వేడలేను॥ నిన్నే॥

చ॥ స్నానాది జపతపోయోగ-ధ్యాన సమాధి సుఖ ప్రద-సీ
తానాథ సకలలోక పాలక-త్యాగరాజ సన్నుత॥ నిన్నే॥

తాత్పర్యము :

ఓ పన్నగశాయీ! సీతానాథా! సకలలోక పాలకా! నేను పరులను వేడను, తీర్థస్నానము, నామ జపము, తపస్సు, అష్టాంగ యోగము వీటి వలన ఏఏ సుఖములున్నాయో ఆ సుఖముల నన్నిటిని ఇచ్చే నిన్నే భజించెదను.

విశేషము = 'ఏకైక ఫలదాస్సర్వే దాన యజ్ఞ జపాదయః'.... 'సర్వలాభాయ కేశవః'= దానము యజ్ఞము జపము మొదలైనవి ఒక్కొక్క ఫలమునే ఇచ్చునవి. కేశవుడు (రాముడు) సర్వఫలములను ఇచ్చువాడు'. అని శాస్త్రము. అయ్యగా రీకృతి యందు దాని ననువదించినారు.

300. పంతువరాళి = రూపకము

ప॥ నిన్నే నెర నమ్మినానురా - ఓ రామ రామయ్య॥ నిన్నే॥

చ॥ అన్ని కల్లలనుచు-ఆడిపాడి వేడి
పన్నగశయనా-నా-చిన్నతనము నాడే॥ నిన్నే॥

2 వేద శాస్త్రపురాణాది-విద్యలచే భేద
వాదములు తీరక-భ్రమసే వారల జూచి॥ నిన్నే॥

3 భోగముల కొరకు-భువిలో రాజసమున
యాగాదు లొనరించి-అలసే వారల జూచి॥ నిన్నే॥

4 ఈ జన్మమునందే నిను-రాజిజేసు కోలేక
రాజిల్ల రని త్యాగ-రాజవినుత రాఘవ॥ నిన్నే॥

తాత్పర్యము :

ఓ రామా! ఓ పన్నగశయనా! నిన్నే నేను గట్టిగా నమ్మి యున్నాను. ఇహ లోక సంబంధము లయిన అన్నిటిని కల్లలు అని తెలిసి నిన్ను పాడుతూ వేడుతూ ఆనంద నృత్యము చేస్తూ నిన్ను నమ్మినాను. వేద శాస్త్రములను పురాణాదులను చదువుకొని, భేదవాదములు సంశయములు తీరక భ్రమతో కొట్టుమిట్టాడు వారిని చూచి వాటి జోలికి బోక నిన్ను నమ్మియున్నాను. స్వర్గాది భోగములకోసం రాజస గుణముతో యజ్ఞములు చేసి శ్రమపడేవారిని జూచి వాటి జోలికి పోక నిన్నే నమ్మినాను. దుర్లభమైన ఈ నరజన్మవచ్చినప్పుడే నీతో రాజీపడకపోతే ఇక సద్గతి ఉండదని తెలిసి చిన్ననాటినుండే నిన్ను నమ్మినాను.

విశేషము = 'శాస్త్రజ్ఞానం బహుక్లేశం బుద్ధేశ్చలన కారణం। ఉపదేశాద్ధరింబుధ్వా। విరమే త్సర్వకర్మసు'= శాస్త్రములు చదివి సంపాదించే జ్ఞానము చాలా కష్టసాధ్యము. అదీ కాక ఒకప్పుడు బుద్ధి కూడా దాని వలన చలిస్తుంది. అందువలన గురూపదేశము వలన హరిని తెలుసుకొని అన్ని కర్మలను విరమింపవలెను'. అని శాస్త్రము. మరియు భోగముల కొరకు రాజసయజ్ఞములు చేసి స్వర్గమునందు ఆ భోగమను భవించి 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి' = పుణ్యక్షయము కాగానే మానవలోకమున పడుదురు' అని గీతావాక్యము. అట్టివారి శ్రమను చూచి అటుపోక నీతో రాజీపడి (భక్తినవలంబించి) నిన్నే నమ్మియున్నాను అని త్యాగయ్యగారి ఆత్మ నివేదనము.

301. రవిచంద్రిక = ఆది

ప॥ నిరవధి సుఖద - నిర్మలరూప। నిర్జిత ముని శాప॥

అ॥ శరధి బంధన। నతసంక్రందన
శంకరాది గీయ మాన। సాధు మానస సుసదన॥ నిరవధి॥

చ॥ మామవ మరకత మణి నిభ దేహ
శ్రీమణిలోల శ్రితజన పాల
భీమ పరాక్రమ భీమక రార్చిత
తామస రాజస మానవ దూర త్యాగరాజవినుత చరణ॥ నిరవధి॥

తాత్పర్యము :

అంతములేని సుఖము నిచ్చువాడా! (మోక్షము). నిర్మలమగు రూపము కలవాడా! గౌతముని శాపమును నిర్జించిన వాడా! (అహల్యా శాపవిమోచనము). సముద్రమును బంధించిన వాడా! ఇంద్రునిచే నమస్కరింప బడువాడా! శంకరుడు మొదలగు వారిచే గానము చేయబడిన వాడా! సాధువుల యందుండు వాడా! మరకత మణివంటి దేహము గలవాడా! లక్ష్మీదేవి అనెడు మణియందు ఆసక్తుడా! ఆశ్రయించిన వారిని పాలించువాడా! భయంకరమైన పరాక్రమము గలవాడా! శివుని చేతిలో పూజింప బడువాడా! తామస రాజస జనులకు దూరమయిన వాడా! మామవ = నన్ను రక్షింపుము. అని ఇది సంస్కృత గేయము.

302. భైరవి = చాపు (ప్రహ్లాద భక్తి విజయము)

ప॥ నిజమైతే ముందర – నిలువు మీ వేళ
అజుడైన హరిహయు – డైన నాభక్తియు॥ నిజమైతే॥

చ॥ గాసి జెందుచు నేను – గర్భములో నుండ
దేశికవరు డుప, దేశించిన దెల్ల॥ నిజమైతే॥

2 ఉన్నతము నుండి, పడద్రోసిన వేళ
ఉర్వీదేవి నన్నెత్తి, బ్రోచిన దెల్ల॥ నిజమైతే॥

3 నాగనాగములు, నన్ను బాధించగ
త్యాగరాజనుతుడు, తన్ను గాచిన దెల్ల॥ నిజమైతే॥

తాత్పర్యము :

సముద్రమున హరి దర్శనలాలసుడైన ప్రహ్లాదునకు నారదుడు వచ్చి హరి నీకు దర్శన మిచ్చుటకు వచ్చుచున్నాడని చెప్పినాడు. కాని ఎంతకు స్వామి వచ్చుట లేదు. కాని ఏదో సవ్వడి వినవచ్చినది. శ్రీహరి తన ముందుకు వచ్చి నిలువడు. తాళలేక

ప్రహ్లాదుడు తన భక్తి మీద శపథం చేస్తున్నాడు. నా భక్తియే నిజమయిన దైతే బ్రహ్మ అయినా సరే ఇంద్రుడైనా సరే నా ఎదుట నిలచెదరు గాక. నేను గర్భములో నుండగా నారదుడు వచ్చి నాకుపదేశించిన మాటనిజమైతే, నా తండ్రి నన్ను ఎత్తైన పర్వతము నుండి త్రోయించినప్పుడు నన్ను భూదేవి నన్నెత్తి రక్షించినదే నిజమయితే, ఏనుగులు త్రొక్కి, పాములు కరచి నన్ను బాధించినపుడు శ్రీహరి నన్ను రక్షించినదే నిజమయితే ఈ దాగిన వారెవరో నా ఎదుట నిలచెదరు గాక. అని ప్రహ్లాదుడు శపథము చేసినాడు.

విశేషము = లక్ష్మణుడు విల్లెక్కుపెట్టి 'ధర్మజ్ఞ స్సత్యసంధశ్చ। రామోదాశరధిర్యది। ఆహవే చాప్రతిద్వంద్వః। శరైనం జహిరావణిం = రాముడు ధర్మజ్ఞుడైతే, సత్యసంధుడైతే యుద్ధమందు సాటిలేని వాడైతే ఓశరమా! ఇంద్రజిత్తును వధించుము' అని బాణమువిడచినాడు. అచట ప్రహ్లాదుని శపథము దీనిని గుర్తుకు తెచ్చుచున్నది.

303. కాపి = రూపకం

ప॥ నిత్యరూప ఎవరి పాం-డిత్యమేమి నడచురా॥

అ॥ సత్యమైన ఆజ్ఞ మీర-సామర్థ్యము కలదా॥ నిత్యరూప॥

చ॥ భాను రేయుపగలు రత్న - సాను జుట్టుడా
పూని శేషుడమిత భార-భూమి మోయడా
వీనులందు కాశీపతి-నీ నామము పల్కడా
మాని త్యాగరాజ వినుత-మహిమాస్పద మగు నీముందు॥ నిత్యరూప॥

తాత్పర్యము :

నిత్యరూపుడైన ఓ రామా! నీముందు ఎవరి పాండిత్యముప్రవర్తిస్తుంది? ప్రవర్తించదు. సత్యమైన నీ ఆజ్ఞను మీరటానికి ఎవరికిని సామర్థ్యము లేదు. సూర్యుడు రాత్రింబవళ్ళు ఆగక మేరువుచుట్టు (భూమి చుట్టు) తిరుగుచునే యున్నాడు. ఆదిశేషుడు అమిత భూభారమును మోయుచునే యున్నాడు. ఇవన్నియు తప్పనిసరిగా నడచుచున్నవంటే నీ ఆజ్ఞతో జరుగుచున్నవి కాని వారివారి పాండిత్యము కాదు. అని తాత్పర్యము.

విశేషము = 'యస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసావిధృతౌ తిష్ఠతః' = ఓ గార్గీ! భగవంతుని ఆజ్ఞ చేతనే సూర్యచంద్రులు పరస్పరము గ్రహించి తిరుగుచున్నారు'

అని ఋషి వాక్యము. 'కాశ్యాంతు మరణాన్ముక్తిః' = కాశీలో మరణము వలన ముక్తి' అని శాస్త్రము. అది కాశీపతి మృతుల వీనులయందు రామనామము నుచ్చరించుట చేతనే. ఈ విషయము లిందు స్మరింపదగినవి.

304. బేగడ = త్రిపుట

ప॥ నీకు తనకు ఋణ ఋణీభావము లేదనేరు

అ॥ లేకనీకే దయలేదో శ్రీరామ॥ నీకు॥

చ॥ చిన్ననాడాదిగా-చిత్తమందు నెల
కొన్నవాడవై-నా కోరిక సాగకుంటే॥ నీకు॥

2 కరగి కరగి పాద-కమలమందు వ్రాల
కరుణించెద నని నాపై-కన్నుడ జేసితే॥ నీకు॥

3 ఈ జన్మముల నాదు-పూజలు గైకొని
రాజిల్లి త్యాగ-రాజుని మరచితే॥ నీకు॥

తాత్పర్యము :

ఏమయ్యా రామయ్యా! నీ దయనాపై రాకున్నది. ఇట్లయితే జనులు నీకూ నాకూ ఎట్టి ఋణం లేదనుకుంటారు. (నీకూ నాకూ రుణంలేక పోవటం కాని, రుణం తీరిపోవటం కానీ ఉండదు). ఋణగ్రస్తుడు తనవద్ద డబ్బు లేకపోతే ఋణం తీర్చలేడు. అట్లే నీవద్ద లేదా? నాచిన్న తనమునుంచి నా హృదయంలో తిష్ఠవేసుకొని కూరుచున్నావు. ఇట్టి నీవలన నాకోరిక సాగలేదంటే నీ ఋణము తీరినట్లా? కాదు. జను లట్లనుకొను చున్నారు. ఈ జన్మలో నేను చేసిన పూజలతో ప్రకాశించి నీవు నన్ను మరచితే నీవు నాకు ఋణపడి ఉన్నట్లు. అని త్యాగయ్యగారు అప్పిచ్చినవాడు అప్పుపుచ్చుకొన్న వానిని నిలదీసి నీ బాకీ తీరలేదన్నారు.

విశేషము = భారతయుద్ధానంతరము కృష్ణ పరమాత్మ తనలో ఈ విధంగా బాధపడ్డాడు. శ్లో॥ గోవిందేతి యదాక్రందత్। కృష్ణా మాందూరవాసి నం। ఋణం ప్రవృద్ధమివమే। హృదయాన్నాపసర్పతి॥ = ఆనాడు ద్రౌపది దూరమందున్న నన్నుద్దేశించి గోవిందా అని ఆక్రందనము చేసినది. ఆ ఆక్రందనము వడ్డీతో సహా పెరిగిన పోయిన ఋణము వలె నా హృదయము నుండి తొలగిపోవుటలేదు' అని. దీనిని బట్టి ఆర్తితో

పలికిన భగవన్నామము భగవంతుని ఋణగ్రస్తుని చేయును. దీనిని బట్టి త్యాగయ్యగారు రామా! నీనామములు ఆర్తితో పలికిన నాకు నీవు ఋణ పడియున్నావనే భావమును నేర్పుగా చెప్పిరి.....

305. శుద్ధ సావేరి = ఆది

ప॥ నీకెవరి బోధన?
సాకేతరామ–సన్మనిస్తోమ॥ నీకెవరి॥

చ॥ కలకలమని నాతో–బలుక కున్నావు
తలపు వేరైనది–త్యాగరాజనుత॥ నీకెవరి॥

తాత్పర్యము :

ఓ సాకేత (అయోధ్యా) రామా! సన్మనిస్తోమ = మునులు పరివారమైన వాడా! నీవు నాతో సంతోషముగా మాటలాడుట లేదు. నేననుకొన్నది ఒకటయినది. అయినది వేరైనది. నీకెవరయిన నన్ను గూర్చి దుర్బోధలు చేసినారా! అని అయ్యగారు రాముని ప్రశ్నించినారు.

306. ఆనందభైరవి = ఆది

ప॥ నీకే తెలియకపోతే – నేనేమిసేయుదురా॥ నీకే॥

అ॥ లోకాధారుడవై నా–లోని ప్రజ్వలించే జాలి॥ నీకే॥

చ॥ ఎందెందు చూచిన – ఎందెందు పలికిన
ఎందెందు సేవించిన – ఎందెందు పూజించిన
అందందు నీవని తోచే – టందుకు నీపాదార
విందమును ధ్యానించిన – దెందుకని త్యాగరాజసన్నుత॥ నీకే॥

తాత్పర్యము :

రామా! నేను నిన్ను తప్ప ఇంక ఇతరమేమీ చూడలేను. ఇతరము వినలేను. ఇతరము పలుకలేను. లోకాధారుడవైన నీకు నాలోని ఈ జాలి తెలియకపోతే నేనేమి

చేయుదునయ్యా! నేను ఏది ఏది చూచినా ఎక్కడ ఎక్కడ ఏమేమి పలికినా దేనిని సేవించినా ఎక్కడ ఎక్కడ దేనిని పూజించినా ఆ ప్రతి వస్తువు నీవే అని నాకు తోచవలెను. నీపాదారవిందములను నేను ధ్యానించే దెందుకనుకున్నావు? ఇందుకనే. అని త్యాగయ్యగారు రాముని వేడుకొన్నారు.

విశేషము = ఒక ప్రాచీన భక్తులు భగవంతునిట్లు వేడుకొన్నారు.

శ్లో॥ యోయో జల్ప స్సభవతు విభోనామసంకీర్తనంతే యాయా చేష్టాభవతి భగవన్ సాభవే ద్వందనంతే యాయావృత్తి ర్మనసి మనసా జాయతాం సంస్మృతిస్తే' = భగవన్! నేను ఏది మాట్లాడినా అది నీ నామ సంకీర్తనము అగునుగాక. నేను ఏ చేష్ట చేసినా అది నీవందనమగుగాక. మనస్సులో ఏ సంకల్పము కలిగినా అది నీ మానసిక సంస్మృతి అగుగాక అని. అనగా ఎల్లప్పుడును నీ స్మరణ వందన కీర్తనములే కావలెను అని. త్యాగయ్య గారి కోరికయు నిట్టిదే.

307. నీలాంబరి = చాపు

ప॥ నీకే దయరాక-నే జేయు పనులెల్ల
నెరవేరునా రామ॥ నీకే॥

అ॥ ఏ కోపించక నేను నీవనుజ్ఞాని
కేలాగు సుఖ-మిచ్చునే ఓ రాఘవా॥ నీకే॥

చ॥ మనసు నిల్పనివారు-మాయాజాలముజేసి
మరిముక్తి గొననౌనె॥
కనుసంజ్ఞకు రాని-కాంతను బలిమిని
కరమిడ వశమౌనె-ఓ రాఘవా॥ నీకే॥

2 వాడిక లేని వి-ద్యల చేత సభలోన
వాదించ బోనౌనే
సాడి విన్నమాట-మదిని నిల్పలేని
సరసుని వితమౌనె-ఓ రాఘవా॥ నీకే॥

3 మెప్పులకై బహు-ధర్మము జేసితే
మిగుల బ్రోవదగునే
తప్పుమాటలు గాదు-తారకనామ శ్రీ
త్యాగరాజుని పైని- ఓ రాఘవా॥ నీకే॥

తాత్పర్యము :

రామా! నీ దయలేక నాపనులు ఏవియును నెరవేరవు. భగవంతునితో నీవే నేను అనే జ్ఞానము కలుగ వలెను అంటే ఆ తన్మయీభావము కలిగితే కాని ఆ జ్ఞానము, ఆ సుఖమును కలుగవు. మనసు నిల్పలేక పోతే ముక్తిరాదు. ('నిశ్చల చిత్తే జీవన్ముక్తిః' = నిశ్చల చిత్త మయినప్పుడే జీవన్ముక్తి) అని కదా శంకరుల సూక్తి. కనుసంజ్ఞ చేస్తే వశము కాని స్త్రీ చెయిబట్టి లాగితే వశమగునా? ఆమెకు ఆ పురుషుని యందు అనురాగ ముండినచో వశమగును కాని అనురాగము లేనిచో వశము కాదు కదా! (కవితా వనితా చైవ స్వయమే వాగతా వరా'= కవిత్వము స్త్రీయును తనంత తానుగా వచ్చినవి మేలు' అని కదా లోకోక్తి). అభ్యాసములేని విద్యతో సభలో వాదించి జయము పొందుట కలుగదు. ('అనభ్యాసే విషం శాస్త్రం' = అభ్యాసములేని శాస్త్రము విషమువంటిది. అని కదా లోకోక్తి) ఎవరయినా ఒక చాడీ చెప్పితే అది విన్నవాడు మరచిపోతే చెప్పిన ఉపయోగముండదు. జనుల మెప్పుకోసం చేసిన ధర్మము ఫలప్రదముకాదు. ఇట్లే నీ దయలేకపోతే నా పనులు నెరవేరవు. అని అయ్యగారు దృష్టాంతములతో చెప్పినారు.

308. ధన్యాసి = చాపు

వ॥ నీ చిత్తము నిర్మలము నిశ్చలమని
నిన్నే నమ్మినాను॥ నీ॥

అ॥ నా చిత్తము వంచనా చంచలమని
నను విడనాడకుమీ, శ్రీరామ॥ నీ॥

చ॥ గురువే చిల్లగింజ-గురువే భ్రమరము
గురువే భాస్కరుడు - గురువే పరుసవేది
గురువే భద్రుడగు-గురువే నీవనుకొంటి
ధరను దాసుని బ్రోవు-త్యాగరాజనుత॥ నీ॥

తాత్పర్యము :

రామా! నీ మనస్సు నిర్మలమయినది, నిశ్చలమయినదియును. నామనస్సేమో వంచనతో కూడినది. చంచల మయినదియును. (చంచలం హిమనః కృష్ణ = మనస్సు చంచలమైనది' అని గీతావాక్యము). కనుక శ్రీరామా! నన్ననీవు విడనాడకు. విడనాడక

నన్ను గురువు వయి తీర్చి దిద్దుము. గురువు చిల్లగింజ (చిల్లగింజ అరగదీసి నీటిలో కలిపితే అది నీటిలోని కాలుష్యమును విరిచివేయును). అట్లే గురువు శిష్యుని మనఃకాలుష్యమును పోగొట్టును. గురువే భ్రమరము. భ్రమరము = తుమ్మెద (తుమ్మెద ఒక పురుగును పట్టి ఝుంకారము చేయుచు తిరుగును. కొంతసేపటికి పురుగు తుమ్మెదగా మారిపోవును). అట్లే గురువు శిష్యుని తనంత జ్ఞానిగా తయారుచేయును. గురువే భాస్కరుడు = సూర్యుడు. (సూర్యుడు తన వెలుగుతో చీకటిని పోగొట్టి వస్తువులను కనిపింపజేయును) గురువు అట్లే శిష్యుని అజ్ఞానమును పోగొట్టి సదస ద్వివేకమును కలిగించును. గురువే పరుసవేది. (పరుసవేది అని ఒక చెట్టువేరు. అది ఏ లోహమును తాకినా ఆ లోహము బంగారమగును) అట్లే గురువు శిష్యుని తాను స్పృశించి అజ్ఞానిని జ్ఞానిగా మార్చును. గురువే మంగళప్రదుడు. అట్టి గురువు నాకు నీవే రామా! నన్ను విడనాడక నాకు గురువువయి వంచనాచంచల మయిన నామనస్సును తీర్చి దిద్దుమని అయ్యగారు రాముని ప్రార్థించినారు.

309. విజయవసంతము = ఆది

ప॥ నీ చిత్తము నాభాగ్యమయ్యా
నిరుపాధిక నీవాడనయ్యా నీ॥

అ॥ యోచించి కార్యము లేదనుచు
ఒకసారి శరణనుకొంటినయ్యా॥ నీ॥

చ॥ పరదైవముల జూచినంతనే
భావమందునీవై-పరగెదరయ్య
ధరలోననా-సరివారలలో
దయజూడవయ్య-త్యాగరాజనుత॥ నీ॥

తాత్పర్యము :

ఓ రామా! నీ చిత్తము నా భాగ్యము. ఇది సాధారణముగా నీకు ఏది తోచి నాకిస్తే అదే పెద్ద భాగ్యమను కొంటాను. అనే భావములో ఉంటుంది. కాని ఇక్కడ నీకేది తోచితే అది నాకు మహాభాగ్యము అని. చాలా తొందరగా నిర్ణయము తీసుకొని చేయవలసిన పని విషయములో 'ఆలోచించి పనిలేదు' అని అంటారు. అదే ప్రకారముగా 'యోచించి కార్యము' లేదని ఒకసారి శరణనుకొంటిని అన్నారు త్యాగయ్యగారు. ఇది శరణాగతి.

శరణాగతి చేయుట ఒకేసారి అని శరణాగతి శాస్త్రము. దాని ప్రకారము అయ్యగారు ఒకసారి అన్నారు. రాముడు కూడా విభీషణుని విషయముగా 'సకృదేవ ప్రపన్నాయ = ఒకేసారి ప్రపత్తి జేసిన వానికి' అని అంటాడు. ప్రపత్తి అనగా శరణాగతియే. అయ్యగారట్లే అనిరి. రామభక్తులకు రాముడు కానివారంతా పరదైవములే. కాని వారి భక్తి జ్ఞానరూపముగా పర్యవసించి ఆమూర్తులయందు తమ దైవము యొక్క రూపమే సాక్షాత్కరిస్తుంది. వేద మొకమాట చెప్పినది. 'స బ్రహ్మా సశివ స్సేంద్ర స్సోక్షరః పరమ స్స్వరాట్'= వాడే బ్రహ్మ, వాడే శివుడు, వాడింద్రుడు' ఇత్యాదిగా. మరియు గజేంద్రమోక్ష ఘట్టమున వేదవ్యాసుడు 'తత్రాఖిలామరమయో హరి రావిరాసీత్' = సర్వదేవతా స్వరూపుడయిన హరి అక్కడ ప్రత్యక్ష మయ్యెను' అని చెప్పెను. ఇట్టి విద్య, జ్ఞానము, అధ్యవసాయము కల త్యాగయ్యగారు తమ అనుభవమును వెలువరించిరి. ఇందు రాముని 'నిరుపాధిక' అని అయ్యగారు సంబోధించినారు. ప్రపంచములో ఒకరితో ఇంకొకరికి ఏదో ఒక బంధుత్వమో ఇంకేదో ఉన్నట్లయితే అది ఏదో ఒక కారణమును పురస్కరించుకొని ఏర్పడుతుంది. భగవంతునకు జీవకోటికి ఉన్న సంబంధము అట్టిది కాదు. దానిని నిరుపాధికము అందరు. కనుక అయ్యగారు శ్రీరాముని 'నిరుపాధిక' అని సంబోధించిరి.

310. తోడి = ఆది

వ॥ నీదయరావలెగాక – నేనెంత వాడను రా॥

అ॥ వేద శాస్త్రపురాణము లన్నియు నీ
వేగతి యనుచు మొరబెట్టు గనుక॥ నీదయ॥

చ॥ మారమారమణ – నీర జాప్తకుల
పారావార సు–ధారసపూర॥ నీదయ॥

2 శ్రీహరే వర వి–దేహ జాధిప వి
వాహ దళితరిపు–దేహ వైరిమద
దాహ మౌని హృ–ద్గేహ నాదుపై॥ నీదయ॥

3 ఆది దేవ దే–వాది మృగ్య సన
కాది వినుత కా–మాదిషడ్గుణ హ
రాది మధ్య రహి–తాది త్యాగరా
జాది వందిత వి–వాది మద హరణ నీదయ॥

తాత్పర్యము :

రామా! నాపై నీదయరావలెను. అది లేకపోతే నే నెంతవాడను? అణువంత మాత్రమును కానని భావము. వేదములు శాస్త్రములు పురాణములు అన్నియు తమకు నీవేగతి అని మొరపెట్టుచున్నవి. ఇక నేనెంతవాడను? శ్రీ లక్ష్మికి నాథుడా, సూర్యవంశ మనెడు సముద్రమునకు చంద్రుడా! (చంద్రోదయమును చూచి సముద్రము ఆనందముతో పొంగును) శ్రీహరీ, జానకీనాథా, గరుడవాహనుడా, శత్రుదేహములను విదళించినవాడా! ఆది శేషుని వంటి బాహువులు కలవాడా! సజ్జనుల కాశ్రయమైన వాడా! శత్రువుల మదమును దహించిన వాడా! మునుల హృదయమందు నివసించువాడా! అందరి కన్న మొదటి దేవుడా! దేవతలు మొదలగువారిచే వెదుకబడువాడా! (వారి కందని స్థానముగలవాడని) సనకుడు మొదలగు వారిచే పొగడబడువాడా! కామక్రోధ లోభమోహమద మాత్సర్యములను హరించువాడా! ఆది మధ్యాంతములు లేనివాడా! ఆది త్యాగరాజుచే (తిరువారులో నున్న త్యాగరాజను పేరుగల శివుడు) పొగడబడువాడా! వివాదుల మదమును హరించువాడా! నీ దయలేక నేనెంత వాడను? అని.

విశేషము = వేదములకు, శాస్త్రములకు, పురాణములకు రాముడే గతి అనగా గీతలో భగవానుడు 'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః వేదాంతకృ ద్వేదవిదేవ చాహం' = అన్ని వేదములచే నేనే తెలుసుకొన దగినవాడను. నేను వేదాంతకర్తను. వేదములను తెలిసిన వాడనే నేను', అని చెప్పియున్నాడు. దాని ప్రకారము వేదములకు ఉత్పత్తి స్థానమగుట, వాటిచే తెలియబడుట, వాటిని తెలియుట ఇవియే గతియగుట అంటే. శాస్త్రములు పురాణములకు వేదములే ఆధార మగుటచేత అన్నిటికిని భగవానుడే గతి.

311. వసంతభైరవి = రూపకము

ప॥ నీదయరాదా

అ॥ కాదనువా రెవరు-కల్యాణ రామ॥ నీదయ॥

చ॥ నను బ్రోచే వాడని-నాడే తెలియ
ఇనవంశ తిలక-ఇంత తామసమా॥ నీదయ॥

2 అన్నిటి కధికారి-వనినే బొగడితి
మన్నించితే నీదు-మహిమకు తక్కువా॥ నీదయ॥

3 రామరామ రామ త్యాగ-రాజ హృత్సదనా
నామది తల్లడిల్లగా-న్యాయమా వేగమే॥ నీదయ॥

తాత్పర్యము :

ఈ ప్రకరణం అంతా రాముని దయకొరకే ప్రార్థన. ఏమయ్యా నీ దయరాదా! ఓ కల్యాణ రామా నీదయను నాపై బరపితే కాదనేవా రెవరయ్యా! ఎవరును లేరు. ఓ సూర్యవంశ తిలక! నన్ను రక్షించేవాడవు నీవే అని ఎప్పుడో తెలిసి ఉన్నది. ఇక జాగేల? అన్నిటికిని నీవే అధికారివి అని తెలిసి నిన్ను పొగడినాను. నన్ను రక్షిస్తే నీ మహిమ ఏమయినా తగ్గుతుందా? నీ రక్షణ కరవై తల్లడిల్లు చున్నాను. నను తల్లడ పెట్టుట నీకు న్యాయమా?

విశేషము = మొదటి చరణపు వివరము. జీవునకు భగవానునకు ఉన్న పరస్పర సంబంధములలో రక్ష్య రక్షకసంబంధ మొకటి. (రక్షింపదగినవాడు – రక్షించువాడు అని) ఇది సిద్ధమయిన సంబంధము. ఇది నీకు ఏనాడో తెలిసియుండగా ఉపేక్ష వహించుట న్యాయమా అని అయ్యగారి ప్రశ్న.

312. యదుకుల కాంభోజ - ఆది

ప॥ నీ దయచే రామ-నిత్యానందుడైతి

అ॥ నాదబ్రహ్మ-నందరసా కృతి గల॥ నీదయచే॥

చ॥ వర మృదుభాషసు-స్వరమయ భూష
వరత్యాగరాజ-వాక్చేలావృత॥ నీదయచే॥

తాత్పర్యము :

అయ్యగారు రాముని దయతనకు కలుగుట లేదని ఎంత పరితాపపడినా ఈ కృతియందు రాముని దయ తనకు కలిగినదని ఆనందమును వ్యక్తపరచు చున్నారు. రామా నీ దయచేతనే నేను నిత్యానందమును పొందుచున్నాను. నాద బ్రహ్మానంద రసము (సంగీతము) ఆకారమయిన నీదయచే నిత్యానందము నాకు. నీ ఆకారమయిన సంగీతమును ఉపాసిస్తూ బ్రహ్మానందమునే పొందుచున్నాను. నీవు మెత్తని మాటల వాడవు. ఇట్టి నిన్ను సుస్వరములతో అలంకరించుకొంటున్నాను. నా మాటలనెడి బంగరు బట్టలను ధరింపజేయు చున్నాను. ఇంత కన్న నిత్యానంద మొకటి లేదు. ఇది నీ దయచేతనే నాకు కలిగినది.

313. హమీర్ కల్యాణి = ఆది

ప॥ నీ దాసాను దాసుడనని పేరె ఏమి ఫలము॥ నీ॥

అ॥ పేద దాసులందు – ప్రేమలేక పోయె॥ నీ॥

చ॥ సరివారిలోనను – చొక జేసితివి
కరుణించ లేక – కర్మమనేవు॥ నీ॥

2 రోసము లేదాయె – రుచివాక్కులు పోయె
దాసుల బ్రోచితివట – త్యాగ రాజిలలో॥ నీ॥

తాత్పర్యము :

రామునితో అయ్యగారి ఒక నిష్ఠురము ఇది. రామా! నీ దాసాను దాసుడనని పేరేగాని నాకు ఫలము కలిగినదేదియు లేదు. ఈ పేద దాసుని మీద నీ ప్రేమలేక పోయెనుకదా! సాటివారిలో నన్ను చులకన చేసితివి. కరుణించకపోగా త్యాగయ్యా! నీ కర్మ మింతే అంటావు. నే నిన్నిట్లు మాటాడుచుంటే నీక రోషము కలుగుట లేదు చిత్రము. రోషము లేదు సరే. మంచి రుచి కరమయిన మాటలును పలుకవు. ఎప్పుడో దాసులను రక్షించితివట. ఇప్పుడు నాకు దాసానుదాసుడు అను పేరు మాత్రమే మిగిలినది. అని సానునయ నిష్ఠోక్తి.

విశేషము = ఒక చిన్న చమత్కారము. విష్ణుభక్తులు ''నేను భక్తుడను అని మాత్రమే అనరు''. నీ భక్తుని భక్తుని, భక్తుడను'' అని ఎంత క్రింది శ్రేణికి రావాలో అంతవరకు దిగికూరుచుందురు. ఎందుకంటే? భగవంతుడు చాలా ఎత్తున నున్నాడు. ఆయన దయ నీటి ప్రవాహము వలె క్రిందికి ప్రవహించును. తనకంటే ఇక పల్లము లేదు అని ఉంటే ఆ దయాప్రవాహము తన యందే నిలచి ఉంటుంది. ఈపరిస్థితిలో అసలే భగవంతుని దయ తనపై పడలేదు అనుభావము ఆర్తిని సూచించును. దానిని బట్టి తన దాసాను దాసత్వము నామమాత్రమయినదే అని అయ్యగారు బాధపడినారు.

314. బేగడ = ఆది

ప॥ నీ పదపంకజములను – నే నెరనమ్మినాను॥

అ॥ భూపాలుర గర్వంబు నణచు కొర
కావరమేశ్వరు–చావము ద్రుంచిన॥ నీపద॥

చ॥ కోపముతో మును-తాపసి ఇచ్చిన
శాపమున అహల్య అనుదినము
చాపరాయి తనుతాప మోర్వలే
కాపెను గని పరి-తాపము దీర్చిన॥ నీపద॥

2 వనరుహ తులితన-యన సంక్రందన
తనయుని బాధ సహింపని విరో
చనసుతుమతి గలి-గిన భయ మెగయగ
ఘనతమ దుందుభి-పెనుతల దన్నిన॥ నీపద॥

3 జ్యావరనుత జ్యా-జావర బిడౌ
జావర జాశ్రిత - త్యాగరాజ
జ్యావరాజ రు-ద్రావనీసుర
భావనీయ ముని-జీవన అనిశము॥ నీపద॥

తాత్పర్యము :

రామా! నీ పాదములను నెరనమ్మినాను. రాజుల గర్వమణగునట్లు శివచాపమును విరచిన 'నీపాదములు' గౌతముని శాపము చేత చాపరాయిగా మారి పరితపించుచున్న అహల్య పరితాపము తీర్చిన 'నీపాదము', ఓ పద్మనయనా - ఇంద్రతనయుడగు వాలిచే భయమందిన సూర్యతనయుడగు సుగ్రీవునిభయము తీర్చేందుకు పెద్ద దుందుభి శరీరమును కాలితో తన్నిన 'నీపాదము', భూపతులచే పొగడబడినవాడా! సీతానాథుడా! ఇంద్రునకు తమ్ముడయిన వాడా! (ఉపేంద్రుడు - వామనుడు) త్యాగరాజు ఆశ్రయించినవాడా! భూపతులు, బ్రహ్మరుద్రులు బ్రాహ్మణులు వీరి చేత భావింపదగినవాడా! మునులకు జీవనమయిన వాడా! నీ పాదములు నమ్మినాను. అని తాత్పర్యము.

విశేషము = ఇందు పాదములను నెరనమ్ముట పర్యవసానార్థము. అహల్యాశాప విమోచనము, దుందుభి శరీరము తన్నుట పాదమునకు సంబంధించిన కథలు ప్రస్తావన చేయబడినవి.

315. నాయకి = ఆది

ప॥ నీ భజన గాన రసికుల-నే నెందుగానరా రామ॥ నీభజన॥

అ॥ శ్రీభవ సరోజాసనాదిశ-చీమనోరమణ వంద్య ఇలలో॥ నీభజన॥

చ॥ సగుణ నిర్గుణపు నిజదబ్బరలను
షణ్మతముల మర్మమష్ట సిద్ధుల
వగలు జూప సంతసిల్లి గంటిని
వరాననా త్యాగరాజ వినుత॥ నీభజన॥

తాత్పర్యము :

బ్రహ్మేంద్రాదులకు వంద్యుడైన ఓ రామా! ప్రపంచములో నీ భజన, నీ గుణగానమునందు రుచికలిగినవారు ఎవరును ఎక్కడను కనపడకున్నారు. ఇక బ్రహ్మము నిర్గుణమా? సగుణమా? అనే చర్చ, వాటిలో మంచి చెడ్డలు, షణ్మతముల మర్మముల చర్చ, అష్ట సిద్ధుల రీతులచర్చలు ఇవే కనపడుచున్నాయి. ఈ వగలు చూపి సంతోషపడువారే కనపడుచున్నారు. అయ్యగారు తమ పరితాపమును రాముని సన్నిధిలో నివేదించారు.

విశేషము = కులశేఖరులు ఇట్లే 'వక్తుంసమర్థోపి నవక్తి కశ్చిత్। అహోజనానాం వ్యసనాభిముఖ్యం' = భగవన్నామము లుచ్చరింప సమర్థుడయినను ఎవడు నుచ్చరింపడు. ఆహా ఏమని చెప్పను? జనుల సంసారాభి ముఖ్యమును?' అని పరితాపపడినారు.

316. జయమనోహరి = రూపకం

ప॥ నీ భక్తి భాగ్యసుధా-నిధి నీదేదే జన్మము॥

అ॥ భూభారముగాని, సుర-భూసురులై జన్మించిన॥ నీభక్తి॥

చ॥ వేదోక్తంబౌ కర్మము-వెతగల్గు గతాగతమౌ
నాదాత్మక త్యాగరాజ-నాధా ప్రమేయ సదా॥ నీభక్తి॥

తాత్పర్యము :

ఓ నాదస్వరూపా! త్యాగరాజ రక్షకా! ఓ అప్రమేయా! (కొలత కందనివాడా) రామా! నీ భక్తి అనేది ఒక అమృత సముద్రము. ఆ సముద్రమందు ఈదినదే జన్మము.

దేవ బ్రాహ్మణులై జన్మించినా నీ భక్తిలేకపోతే వారు భూభారమే కాని వారివల్ల ఏ ఉపయోగమును లేదు. బ్రాహ్మణులై జన్మించినా వేదోక్తములయిన కర్మలు (యజ్ఞములు) చేయుట, స్వర్గమున కేగుట, పరిమిత ఫల మేదో అనుభవించుట, పుణ్యక్షయమగుట, మరల భూమిపై జన్మించుట, మరల కర్మలు చేయుట, మరల స్వర్గము, మరల పుణ్యక్షయము ఈ విధముగా 'పునరపి జననం పునరపిమరణం' = మరల పుట్టుట మరల చచ్చుట. ఇట్లే గతాగతములు (రాకపోకలు) జరుగు చుండును. రామభక్తివలన శాశ్వతానంద ప్రదమగు మోక్షము. మోక్షము పొందిన వాడు 'నచపున రావర్తతే' = మరల జన్మకు తిరిగిరాడు. అని వేదము.

317. కమలామనోహరి = ఆది

ప॥ నీ ముద్దు మోము జూపవే॥

అ॥ నామీద నెనరుంచి – నళినదళనయన॥ నీ॥

చ॥ ఉరమున నిన్నుంచుకొనేకాని
ఉరగశయన నా–దుల్లము రంజిల్ల॥ నీ॥

2 పులకరించ నిను – బూజసేతుగాని
కలనైన మరువ చు–క్కలరాయని బోలు॥ నీ॥

3 మరులు కొన్నాను – మదనజనక
ధరాసుతా రమణ – త్యాగరాజునికి॥ నీ॥

తాత్పర్యము :

ఓ నళిన దళనయనా = పద్మ నేత్రా! నామీద దయ ఉంచి నీ ముద్దు మోము చూపవయ్యా రామా! ఓ శేష శయనా! నీ ముద్దు మోమును నా వక్షస్థలముపై చేర్చుకొంటే గాని నా మనస్సు రంజిల్లదు. కనుక నా మనస్సు రంజిల్లే విధముగా నీ ముద్దు మోము జూపుము. నీపై మరులు కొన్నాను. నా మేను పులకించునట్లు నీ పూజ చేసుకొంటాను. నిన్ను మరువలేను. అని ఆనందపూర్వక ప్రార్థనము.

318. తోడి = ఆది

ప॥ నీవంటి దైవమును షడానన-నే నెందు గానరా॥

అ॥ భావించి చూడతరముగాని - బ్రహ్మ పురినిలయ గిరిజాతనయ॥ నీ॥

చ॥ సరిబాలురతో కైలాస-గిరిని శుభాకృతి నాడగను
వెరపులేక ప్రణవార్థము తానము - విధిని కోపగించి
సరగున నవవీరులందొక కిం-కరుని గని ముమ్మారు సెలవిచ్చి
సురలు మురపురారులు విని మెచ్చగ-వరుసగాను సృష్టిశక్తి నొసగిన॥ నీ॥

2 హరిహరాదులకు దిక్పాలకులకు - అలశశి సూర్యులకు
మరి విద్యాధరులకు బ్రహ్మాండము-లను వెలసే వరవీరాదులకు
తరముగాక నిన్నుజత గూడుక-శరణనగా విని సైరించక
పరమద్రోహి యైన శూరపద్మా-సురుని కీర్తిగాను గర్వమణచిన॥ నీ॥

3 మారకోటులందు గల్గిన శృం-గారమెల్ల ఇందు, ముఖ నీకొన
గోరును బోలునె అటువంటి శుభా-కారము సంతతము
సారెకు నామదిని, నిల్పిన కు-మార దయాపర నీరజలోచన
తారకాధిపకళాధరుడగు శ్రీ - త్యాగరాజసన్నుతాశ్రితహితా॥ నీవంటి॥

తాత్పర్యము :

రాముని ముద్దు మోమును స్మరించిన త్యాగయ్యగారి భావ వీధిలో కుమారస్వామి దటుకున సాక్షాత్కరించినాడు. ఆ కుమార స్వామి బ్రహ్మపురి నిలయుడు. త్యాగయ్యగారు స్తోత్రము ప్రారంభించినారు. ఓ షడాననా = ఆరుముఖములు గలవాడా! గిరిజాతనయా = పార్వతీ కుమారా! నీవంటి దైవము ఎక్కడను లేదు. మనస్సులో భావించుటకు కన్నులతో చూచుటకు సాధ్యముకాని ఓ బ్రహ్మపురి కుమారా! అలనాడు నీవు కైలాసగిరిపై తోడి బాలురతో ఆడుచుండగా చతుర్ముఖ బ్రహ్మవచ్చి ఓంకారమునకు నేను అర్థము అనినాడు. అంతట నీవు నీసేవకు నొకనిని బిలిచి వానికి సృష్టిశక్తి నొసగినావు. వాడు సృష్టి మొదలు బెట్టినాడు. బ్రహ్మ గర్వమణగినది. శివకేశవులు, తక్కిన దేవతలు నిన్ను శెబాసనినారు. హరిహరాదులు, విద్యాధరులు, లోకములోని మహావీరులు అందరును వారి తరము గాక అందరు కలిసి నిన్ను శరణనగా లోకద్రోహి అయిన శూర

పద్మాసురుని సంహరించినావు. కోటి మన్మథుల సౌందర్యము నీ కాలి కొనగోటికి సరిపోదు. అటువంటి సౌందర్యమును నా కంటిముందు నిలిపినావు. చంద్ర కళాధరుడగు శివుడే నిన్ను నుతించును. ఆశ్రితులకు హితుడవు. అని అయ్యగారు కుమారస్వామిని స్తుతించినారు.

విశేషము = ఇందు బ్రహ్మ ఓంకారార్థము తానంటే కుమారస్వామి కాదని నిరూపించినాడు. దీనిని విచారింతము. 'ఓంకారము' అనే అక్షరము వేదవాఙ్మయము మొదలు సమస్త వాఙ్మయమునకును మూలము అని శాస్త్రము. దానిని ప్రణవము అని కూడ అందురు. దీనియందు మూడక్షరము లున్నవని వింగడించిరి. అవి అకార-ఉకార-మకారములు. ఈ మూడింటి చేరికచే 'ఓం' అయినది. ఈ ఓంకారమునకు అర్థము భగవంతుడనిరి. త్రిమూర్తులలో ఓంకార వాచ్యుడెవరు? ఎవరి భక్తులు వారి దేవుని ఓంకార వాచ్యునిగా భావించు కొన్నారు. దేవీ భక్తులు దేవిని ఓంకార వాచ్యురాలిగా భావించుకొన్నారు. అందుచేతనే వారికి ప్రతినిధిగా శంకరులవారు 'ఓంకార పంజరశుకీం'= ఓంకారమనెడి పంజరమునందు చిలుక' అని దేవిని భావించినారు. త్యాగయ్యగారు 'జగదానందకారకా' లో శ్రీరాముని 'ఓంకార పంజరకీర' ఓంకార పంజరమందుండు చిలుకగా భావించినారు. ఇంకొక శ్లోకమున్నది. 'యోవేదాదౌ స్వరః ప్రోక్తః వేదాంతే చప్రతిష్ఠితః। తస్య ప్రకృతిలీనస్య। యఃపరస్సమహేశ్వరః'= ఏ స్వరము (ఓంకారము) వేదాది యందు చెప్పబడినదో, మరియు వేదాంతమునందును ప్రతిష్ఠింపబడినదో అట్టి ప్రకృతిలీన మయిన ఆ అక్షరమునకు మహేశ్వరుడు అర్థము అని. అయితే ఈ మహేశ్వరు డెవడు? దీనిని వైష్ణవులును చదువుదురు. వారు మహేశ్వర శబ్దమునకు నారాయణుడర్థము అని నిర్వహించెదరు. శైవులు శివపరముగా నిర్వహించుకొందురు. బ్రహ్మకంటూ ప్రత్యేక భక్తులుగాని ప్రత్యేక మతము కాని లేకపోవుటచేత బ్రహ్మ పరముగా చెప్పుట నేను వినలేదు. ఇక వేదప్రతిపాదితమైన నారాయణాష్టాక్షర మంత్రమున్నది. అది ఓంకారముతో చేరి అష్టాక్షరి అగుచున్నది. వైష్ణవులు ఓంకారమును విష్ణుపరముగా వ్యాఖ్యానించుచు వ్రాసిన బృహద్గ్రంథము లున్నవి. ఓంకార మందు తొలి అక్షరమయిన అకారమునకు 'అకారార్థో విష్ణుః జగదుదయరక్షా ప్రళయకృత్'= లోకసృష్టి స్థితి లయములు చేసే విష్ణువు అర్థము' అని ప్రారంభించి ఆసాంతము నిర్వహించిరి. దీనిని గీత కూడ బలపరచుచున్నది. 'అక్షరాణామకారోస్మి'= అక్షరములలోనేను అకారమును అని భగవద్వాక్యము. ఇక శైవపరముగ మంత్రము శివపంచాక్షరి. దీనిని వేదము ప్రతిపాదించినదో లేదో తెలియదు. ప్రతిపాదించినను

లేకపోయినను సాధారణ దృష్టిలో ఒక ఇది కనిపించుచున్నది. నారాయణాష్టాక్షరి ఓంకారముతో చేరి అష్టాక్షరి అగుచున్నది. దీనినే వేదము 'ఓ మిత్యేకాక్షరం నమ ఇతిద్వే అక్షరే నారాయణాయేతి పంచాక్షరాణి = ఓం అని ఒక అక్షరము. నమః అని రెండక్షరములు. నారాయణాయ అని అయిదక్షరములు. ఇట్లష్టాక్షరముల సంఖ్య కుదిరినది. శివ పంచాక్షరిలో ఓంకారము కలిస్తే ఆ రక్షరము లగుచున్నది. ఓంకారము లేకపోతే మంత్రత్వలోప మని మంత్రజ్ఞులు చెప్పుదురు. సాధారణముగా మంత్రము లన్నియును ఓంకారముతో చేరియే వాటికి నిర్దేశింపబడిన అక్షరసంఖ్యతో నున్నాయి. సాధారణముగా ఆయా మంత్రముల అర్థమును మొదటి నున్న ఓంకారము సూత్రప్రాయముగా చెప్పుతుంది. తరువాత మంత్రశేషము ఓంకారము చెప్పిన అర్థమును వివరిస్తుంది. అష్టాక్షరీ మంత్రమట్లే చేసినది. మరియు శివ పంచాక్షరీ మంత్రము ఏమి చేసినది. అక్షరసంఖ్యను పెంచే ఓంకారమును స్వీకరించి చెప్పినదా? లేక ఈ ఓంకారము నాది కాదు అని విసర్జించినదా? స్వీకరిస్తే అతివ్యాప్తి దోషము. విసర్జించితే ఓంకారమునకు శివుడర్థము కాడు. అప్పుడు త్యాగయ్యగారి ఉద్దేశ ప్రకారము రాముడే ఓంకారమున కర్థము. బ్రహ్మ ఎట్లూ కాడు. గీతలో 'ఓంకారంచపరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్' అని కృష్ణపరముగా నున్నది. కృష్ణ పరముగా నున్నప్పుడు రామపరముగా కాక తప్పదు. 'ఓంకార పంజరకీర' 'నాద సుధారసంబిలను' మొదలగు త్యాగయ్యగారి సూక్తులు రాముడు ఓంకార వాచ్యుడని చెప్పుచున్నాయి.

319. సారంగ = జంపె

ప॥ నీవాడ నేగాన? నిఖిలలోక నిదాన
నిమిషమో ర్వగ గలనా? నీవాడ॥

అ॥ దేవాధిదేవ భూ-దేవవరపక్షరా
జీవాక్ష సాధుజన-జీవన సనాతనా॥ నీవాడ॥

చ॥ సత్యంబు నిత్యంబు-సమరమున శౌర్యంబు
అత్యంత రూపంబు - నమిత బలము॥
నిత్యోత్సవంబుగల - నీకు నిజదాసుడని
తథ్యంబు బల్కు శ్రీ-త్యాగరాజార్చిత॥ నీవాడ॥

తాత్పర్యము :

ఓ నిఖిలలోక నిదానా! = సమస్త లోకములకును మూలకారణమైన రామా! నేను నీవాడను గానా? నీవాడనే అగుదును. నీ ఎడబాటును ఒక్క నిమిషమయినా ఓర్వగలుగుదునా? ఓర్వలేను. దేవులకు అధిదేవా! బ్రాహ్మణ శ్రేష్ఠుల పక్షమయిన వాడా! పద్మనేత్రుడా! సాధుజనులకు జీవనాధారమైనవాడా! కాలపరిమితి లేక శాశ్వతముగా నుండు వాడా! ఎల్లప్పుడు సత్యభాషణము, యుద్ధమందు శౌర్యము, మిక్కిలి సౌందర్యము, అపరిమితమైన బలము, ఎప్పుడును వేడుకగానుండుట ఇవన్నియు కలిగిన నీకు నేను దాసుడనని నిజముబల్కు త్యాగరాజుని పూజలందువాడా! నేను నీవాడను.

విశేషము = జీవుడు ఎప్పుడును భగవంతుని వాడే. అఖిలలోకములను సృష్టించిన భగవంతుని లోకములో నున్న వాడు ఆయనవాడు కాక ఎట్లుండును? మరియును 'దాస భూతాస్స్యుతస్సర్వే హ్యాత్మానః పరమాత్మనః' = జీవాత్మలందరును పరమాత్మకు స్వతస్సిద్ధముగా దాసులు' అని శాస్త్రము. త్యాగయ్యగారు ఈ నిజమునే పలికిరి.

320. బేగడ = చాపు

ప॥ నీవేరా కులధనము సంతతము
నీవేరా జీవము॥ నీవేరా॥

అ॥ ఈవరకును తెలియకున్ననేరము
దేవరా క్షమచేసి - దయతో నేలుకోరా॥ నీవేరా॥

చ॥ మాధవ సీతావరజవర సహిత
మంగళకర వర-మార్ధభూత చరిత॥
గాధి యాగ సం-రక్షక సతత
గతిజాప్త నతజనా-వృత విధి వినుత॥ నీవేరా॥

2 సుజననిచయ పాప-హిమచండసూర్య
సుస్వర జిత ఘన-రవ మాధుర్య
అజముఖారి సమర-నిరుపమశౌర్య
ఆనంద కంద-సుందర సుచర్య॥ నీవేరా॥

3 రాఘవ సర్వోన్నత సుప్రకాశ
రమణీయ కరపాటి తలంకేశ

త్యాగరాజ వర-హృదయ నివేశ
తరణి శశాంకలో-చన జానకీశ॥ నీవేరా॥

తాత్పర్యము :

ఓవీరాధవా! సీతతోను లక్ష్మణునితోను కూడిన వాడా! మంగళకరము పరమార్థమును అయిన చరిత్రము గలవాడా! విశ్వామిత్రయాగమును రక్షించినవాడా! హనుమంతున కాప్తుడా! సుజనుల పాపములనెడి మంచునకు సూర్యుడా! మేఘగంభీరమైన కంఠధ్వని గలవాడా! రాక్షసుల యుద్ధమందు శౌర్యమును చూపినవాడా! ఆనందమునకు మూలమయిన వాడా! ఆనందమయిన చక్కని నడవడికగలవాడా! ఓ రాఘవా! అందరికన్న ఉన్నతమయిన ప్రకాశముగలవాడా! అందమైన చేతితో రావణుని చీల్చినవాడా! త్యాగరాజుని హృదయమందు నెలకొన్నవాడా! సూర్యచంద్రులు నేత్రమయినవాడా! జానకీ నాధా! నీవేనయ్యా నాకులధనమును జీవనమును. అని తాత్పర్యము.

విశేషము = త్యాగయ్యగారు రాముని తన కులధనముగా భావించినారు. (వంశపరంపరగా పూజింపబడుచున్న దైవము). ఇక్ష్వాకు వంశ ప్రభువులు రంగనాధుని తమ అయోధ్యలో ప్రతిష్ఠించుకొని ఆమందిరమును కులధనముగా భావించారు. వేదాంతదేశికులనే భక్తులిట్లన్నారు.

శ్లో॥ 'నాస్తిమే స్వార్జితం విత్తం నాస్తిమే పైతృకంతధా। అస్తిమే హస్తి శైలాగ్రే వస్తు పైతామహంధనం' = నాకు స్వార్జితమైన ధనములేదు. పిత్రార్జితములేదు. కాని నా పితామహ ప్ర పితామహులు సంపాదించిన ధనము కరిగిరిపైన (కంచిలో) నున్నది. అని కంచి వరదరాజ స్వామిని తమ కులధనముగా భావించిరన్న మాట. త్యాగయ్యగారు నట్లే.

321. బిలహరి = చాపు

చ॥ నీవేగాని నన్నెవరు గాతురురా, నీరజదళనయన

అ॥ కావలసిన కోరికలిచ్చి నన్ను-కరుణించి బ్రోచే తల్లిదండ్రివి॥ నీవేగాని॥

చ॥ మను మావంశమున గలుగు పెద్దలు తప
ములను జేసి ఆర్జించిన ధనము

వినవయ్యా బహుజన్మములను నిండారు
విరుల వేల్పులను పూజించిన ఫలము॥ నీవేగాని॥

2 శరణాగత జన పాపజ్వలనమును
శమన జేయు జలపూరిత ఘనము
సుర మునిజన యోగిగణముల హృదయము
సుగృహమౌ సచ్చిదానంద ఘనము॥ నీవేగాని॥

3 సాగర శయన నదులలో మేటైన
స్వర్ణదీస్నానానికి గల్గు ఫలము
త్యాగరాజు వరమని బ్రహ్మాదులకున
త్యము జేసి పల్కిన తారకము॥ నీవేగాని॥

తాత్పర్యము :

రామా! నీవు కాక నన్నెవరు రక్షిస్తారు? రక్షించరు. ఓ పద్మదళ నేత్రా! మావంశ పూర్వపురుషులు తపస్సుచేసి సంపాదించిన ధనము నీవు. బహుజన్మలు నేను సురలను విరులతో పూజించినఫలము నీవు. నిన్ను శరణు జొచ్చిన వారి పాపములు పెద్ద అగ్నిజ్వాలవలె ఉంటే దానిని చల్లార్చే జలపూరిత మేఘము నీవు. సురలు మునులు యోగులు వీరి యొక్క హృదయమందు నివసించు సచ్చిదానంద ఘనము నీవు. ఓ సాగరశయనా! గంగాస్నానఫలము నీవు. త్యాగరాజు శ్రేష్ముడు అని బ్రహ్మాదులతో సత్యము పలికిన తారక మంత్రము నీవు. అన్ని కోరికలిచ్చి రక్షించే తల్లివి తండ్రివి నీవు. ఇట్టి నీవు కాక నన్నెవరు రక్షించెదరు?

విశేషము = ఇందు సమస్తమును నీవే అని అయ్యగారు చెప్పుకొన్నారు. ఒక ప్రాచీన భక్తులు కూడ 'త్వంమే బంధు స్త్వమసి జనకఃత్వం సఖాదేశికస్త్వం। విద్యా వృత్తం సుకృత మతులంవిత్త మప్యుత్తమం త్వం। ఆత్మాశేషీ భవసి భగవన్నాంతర శ్శాసితా త్వం' = నీవు నాకు బంధువు. నీవు నాకు తండ్రివి. సఖుడవు. గురువువు, నీవు నావిద్యవు, నాచరిత్రము, సాటిలేని పుణ్యమవు, ఉత్తమమైన నా ధనము నీవు, నా ఆత్మవు, నా ప్రభువువు, నాలోనుండి నన్ను శాసించువాడవు నీవు' అని అన్నారు. మరియొక విశేషము ఈ కృతిలోని త్యాగరాజు శివుడు. ఈ దేవునకు బ్రహ్మాది దేవతలకు లేని ఒక విశేషమున్నది. 'శ్రీరామరామరామేతి' అని జపము. మరియు 'హస్తేక్షమాలా హృదిరామతత్త్వం। జిహ్వాగ్రమూలే వరరామ మంత్రం। యన్మూర్ధ్ని నారాయణ పాద తీర్థం। శివం మహాభాగవతం స్మరామి' = చేతిలో నలినాక్షమాల, హృదయమందు రామతత్త్వము,

జిహ్వాగ్రమందు రామ తారక మంత్రము, శిరస్సునందు నారాయణుని పాదతీర్థము (గంగ) కలిగిన మహాభాగవతుడు శివుడు. మహాభాగవత లక్షణము ఉంటూ తన అధికారాలు తనకున్నాయి శివునకు. తక్కిన దేవతలకు అధికారాలు మాత్రమే ఉన్నాయి. మరియు భగవానుడు గీతలో విభూతి యోగములో 'రుద్రాణాం శంకరశ్చాస్మి' = రుద్రులలో నేను శంకరుడను' అని చెప్పినాడు. ఇదే రాముడు త్యాగరాజు (శివుడు) శేష్మడని సత్యము పలుకుట.

322. రీతిగౌళ = ఆది

ప॥ నీదయ గల్గుటే భాగ్యమని – నిజముగ నేలదోచదో॥

అ॥ నాదరూప నీరదసన్నిభ దిన–నాధాన్వయభూషణ మృదుభాషణ॥ నీ॥

చ॥ అవివేకులైన దార తనయుల–ననుదినమును గలసి
భవసాగరమును నీదలేక–భవమున చెయ్యలసి
అవనీశుల గాచి సుఖములేక–ఆయాసము సొలసి
వివిధములగు నీ మాయలోపల – దగిలిన తన కీ అవధులను దెలిసి॥ నీదయ॥

2 వేగిలేచి తానతిలోభిజనుల – వెంబడిగా తిరిగి
రోగియై తా గోరిన కోర్కెలు – రోయక మేను కరగి
భోగభాగ్యముల కొరకన్యసురుల – భూసురులగోరి తిరిగి
ఏ గతియులేక యీ సుఖంబు – లిట్లని మది దా నెరిగి॥ నీదయ॥

3 నాగనాయక శయనేందు దిన – నాధనయన సీతాంక
యోగివందిత పదారవింద – యుగ శరణా అకలంక
రాగలోభ మదాదుల గొట్టి – రక్షించే బిరుదాంక
త్యాగరాజ పూజిత రఘునాయక – తారకమని తెలియు నిశ్శంక॥ నీదయ॥

తాత్పర్యము :

అన్ని సంబోధనములున్నవి అవి విడచి వాక్యముల తాత్పర్యము. అవివేకులయిన భార్యాపుత్రులను పోషించలేక అలసి, రాజులను కొలువలేక అలసి సొలసి, నీ

పలుమాయలలో బడి తన చేత గాని తనమును తెలిసి, ఉదయమేలేచి అతిలోభులవెంట తిరిగి, రోగాలలో పడి కోరికలు వదలలేక చిక్కిశల్యమై, క్షణభంగురము లయిన భోగభాగ్యముల కొరకు ఇతర దేవతలను బ్రాహ్మణులను (మంత్రతంత్రముల కొరకు) వెదకి ఆశ్రయించి, ఇవన్నియు నిరుపయోగములని తెలిసి కూడ, నీదయ కల్గుటే భాగ్యమని ఈ నరులకేల తోచదో? అని అయ్యగారి పరితాపము.

323. భైరవి = ఆది

ప॥ నీవంటి దైవము నేగాన, నీరజాక్ష శ్రీరామయ్య॥ నీవంటి॥

అ॥ భావించి చూచు పట్ల, పట్టాభి రామచంద్ర॥ నీవంటి॥

చ॥ ఆడిన నిన్నాడవలెగా, పాడిన నిన్ను పాడవలెగా
కూడిన నిన్ను కూడవలెనీ, జాడదెలిసిన త్యాగరాజునికి॥ నీవంటి॥

తాత్పర్యము :

ఓ నీరజాక్ష! పట్టాభిరామ! నీవంటి దైవమును నేను చూడలేదు. సాధారణ దృష్టితో చూస్తే అన్ని దైవములును ఒకే విధముగా తోచును. కాని భావించి (విమర్శించి) చూస్తే నీ వంటి దైవము లేదు. పొగడితే నిన్నే పొగడవలె, పాడితే నిన్నే పాడవలె, నీజాడ తెలిసిన త్యాగరాజు(నేను) కూడిన నిన్నే కూడవలె. అని త్యాగయ్యగారు తన అనన్యార్హనిష్ఠను నివేదించారు.

324. సావేరి = ఆది

ప॥ నీవు బ్రోవ వలె నమ్మనను, నిఖిలలోక జననీ॥ నీవు॥

అ॥ దేవి శ్రీధర్మ సంవర్ధిని, దివ్య దర్శన మొసగి సంతతము॥ నీవు॥

చ॥ నీవలె కరుణా సాగరి యీజగాన
నే వెతకి కనుగొనగా నెక్కడ గాన
పావనమగు శ్రీమ, త్పంచన దీశ్వరుని రాణి నా

భావములో దొరకొంటి వికమరచెదనా
ఈ వరకును జేసిన నేరములను
నీవెంచక నలుగురిలో తనకిక
కావలసిన కోరిక లొసంగి
కావుము పతిత పావని ధర్మ వర్ధని॥ నీవు॥

2 నాయెడ వంచన సేయక పసిడి శిలా కంజ
సాయకు నన్నిట నీవని యెంచితిగాక
మాయపు భవసాగర బాధలు ఎందాక యెడ
బాయని నీపద భక్తి నొసంగ పరాకా
కాయజజనకుని సోదరినీ యొక్క
మాయలను దొలగ జేయక యుండుట
న్యాయముగాదు దయాపరి శుభఫల
దాయకియౌ ధర్మ సంవర్ధని॥ నీవు॥

3 రాజ శిఖామణి సతియైన శుభాకారి అంబ
రాజరాజేశ్వరి త్రిజగదాధారి స
రోజన యని నీ మహిమలను దెలియ లేరే త్యాగ
రాజాది పరమ భాగవత హృదయాగారే
యీ జగతిని గౌరిపరాత్పరి-అ
వ్యాజ మునను బరిపాలన జేయు
ఓ జగదీశ్వరి నెరనమ్మితి నిను
రాజిగా ధర్మ సంవర్ధని॥ నీవు॥

తాత్పర్యము :

ఓ నిఖిలలోక జననీ! ధర్మ సంవర్ధనీ! నీవే నన్ను రక్షింపవలెను. నీవంటి దయగల తల్లి ఎంత వెదకినా ఎక్కడను కానరాదమ్మా! పావన మైన పంచనద క్షేత్రమందున్న ఈశ్వరుని యొక్కరాణీ! నాకు హృదయ మందు లభించిన దానవు. నిన్ను మరువను. ఇంతవరకు నా నేరములుంటే వాటిని ఎంచక నాక కావలసిన కోరికలు తీర్చి రక్షించు. నాపై వంచన చేయకమ్మా! పతిత పావనీ! పసిడి శిలాకం జసాయకు నన్నిట? క్రింద విశేషమందు దీని గురించి చూడవలెను. మాయ సంసార భాదలు నాకు ఎంత దాక

అమ్మా! నీపదములపై యెడబాయని భక్తి నిచ్చుటకు నీకు పరాకా? అమ్మా అని తాత్పర్యము.

విశేషము = ఇందు రెండవ చరణమందు, ''పసిడి శిలాకంజ జాయకు నన్నిట'' అని ఉన్నది. కల్లూరి వీరభద్ర శాస్త్రిగారు ఒక నోటు ఇచ్చినారు. ''ఇచట ఏవిధముగానూ సమన్వయముగా కున్నది. పాఠాంటర మెచ్చట నూ దొరక లేదు''. అని, నిజమే నా ఊహకు ఒక విధముగా పొడ కట్టినది. తక్కిన మూడు పాదముల యందున్న గాక, దాకా, పరాకా, అనే అంత్య ప్రాసలను బట్టి పసిడి శలాకా, నీ నాయకు నన్నిట అని పరిష్కరించుట జరిగినది. పూర్వపు గ్రంధములో అచ్చుతప్పు పడి ఉండవచ్చు. ఓ పసిడి శలాకా! = ఓ బంగారు తీగా! అని అర్థం చెప్పవచ్చును. నాయకు నన్నిట నీవని యెంచితిని. నీ నాయకుడైన శివునికి అన్నియును నీవని తాత్పర్యము. ఆయన అష్టైశ్వర్యములు శక్తి మొదలయినవి అన్నియు ఆమెయే అని శంకరుల వారి ''సౌందర్యలహరి'' చెప్పినది.

325. సారాష్ట్రం = చాపు

ప॥ నీవే కన్నడ జేసితే। నేనెవరితో దెలుపుదు నయ్య॥

అ॥ భావాభావ మహాను। భావ శ్రీరామ చంద్ర
భావజ జనక నా। భావము దెలిసి యు॥ నీవే॥

చ॥ కోరిన కోరిక లీడేరు ననుచు నిన్ను
ఆ రాధించిన నన్ను ఆరడి బెట్టుట
మేరగాదు నా నేరమేమి యేలు
కోర యీలోకమున నింక॥ నీవే॥

2 భక్తిలో శ్రీరామ। భక్తి మేలని శివ
శక్తి సంతతము వి। రక్తితో నుతి జేయ
శక్తి జూచి నిజ। భక్తులు పొగడగ
వ్యక్తిని జూచి ఆ। సక్తి కలిగెను॥ నీవే॥

3 పతిత పావన స। మ్మతమున సుజనసం
గతి సేయుటకు సమర। హిత రామనామము

సతతము సేయ నీ వ్రతము గోరితి గాని
నత జన కులాబ్ధి హిత త్యాగరాజునిపై॥ నీవే॥

తాత్పర్యము :

నీవు నన్ను రక్షింపక ఉపేక్ష చేస్తే నేనెవరితో చెప్పుకొందునయ్యా ! భావా భావ= ఉన్నవాడా! లేని వాడా! మహాను భావా! మన్మథ జనకా! నా భావము (నిన్ను దప్ప ఇతరుల వేడనని) తెలిసి కూడ నీవు ఉపేక్ష చేస్తే ఎవరితో తెలుపు కొందును? కోరిన ఫలములు నీ విచ్చెదవని నిన్నారాధిస్తూ ఉంటే నన్నారడి బెట్టుట న్యాయము కాదు. ఈలోకములో నీ కన్న నాకెవరును లేరు. భక్తిలో రామ భక్తి మేలని పార్వతీ దేవి నిన్ను నుతి జేసినది. దానిని చూచి నిజమయిన భక్తులు పార్వతీ దేవిని అనుసరించారు. వారిని చూచి నేను ఆసక్తితో నీ భక్తిని అవలంబించాను. ఇది వ్రతముగా పెట్టుకొన్నాను. దీనివలన సజ్జన సాంగత్యము కలుగుతుందని కూడ భావించాను. కాని కరుణ కరవైనది. ఎవరితో చెప్పుకొందును? అని అయ్యగారి వేదన.

విశేషము = భావాభావ = ఉండుట లేకుండుట అయినవాడు. పరాశర మహర్షి విష్ణుపురాణమందు '' వనములు విష్ణువు, లోకములు విష్ణువు, నదులు విష్ణువు, కొండలు విష్ణువు అని చెప్పుచు ''యదస్తి యన్నాస్తిచ'' = ఉన్నదియు విష్ణువు లేనిదియు విష్ణువు'' అని చెప్పెను. దీని నింకొక విధముగాను చెప్పవచ్చును. ''నీకు ఆయుధములు లేవు, రూపము లేదు అయినను ''భక్తానాంత్వం ప్రకాశసే'' = భక్తుల కొరకు నామరూపములతో ప్రకాశించుచున్నావు. అని పురాణ వాక్యము. నమ్మాళ్వారు భగవద్వైభవము చెప్పుచు ''ఉళనల్ల నిల్ల యల్లన్'' = ఉన్నవాడుకాదు. లేని వాడు కాదు'' అని చెప్పిరి. ఇది భావాభావము. ఇక పరమ శివుడు '' శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే'' ఓ పార్వతీ నేను రామ నామ జపముతో ఆనందించు చున్నాను. అని చెప్పుట, ఆమెయు దానిని జపించుట అనేది ప్రసిద్ధము. ఈ కృతి యందు అయ్యగారు ఈ విశేషములను చూపిరి.

326. సింహవాహిని = ఆది

ప॥ నెనరుంచరా-నాపైనిచాల
నీదాసుడను - గాదా శ్రీరామ॥ నెనరు॥

అ॥ సనకాది యోగి-బృందవంద్యపాద
సాకేతవాస-సద్భక్తపోష॥ నెనరు॥

చ॥ తల్లి దండ్రి గురు-దైవము నీవని
తరచుగాను నిన్ను-నమ్మియున్న నే
తల్లడిల్లు చుండ-దరిజూపవేమి
త్యాగరాజ పరి-పాల సుగుణశీల॥ నెనరు॥

తాత్పర్యము :

ఓ శ్రీరామా! నాపై చాల ప్రేమ ఉంచవలెనయ్యా! సననకాది యోగుల సమూహములు నీ ప్రేమకోరి నీకు వందనము లర్పిస్తున్నాయి. అయోధ్యావాసా! నిజభక్తులను పోషించువాడా! తల్లి తండ్రి గురువు దైవమును నీవే అని నమ్మియున్నాను. ఇట్టి నేను ఈ సంసారమందు తల్లడపడుచుండగా ఒక దరి (ఒడ్డు) చూపవేమయ్యా అని తాత్పర్యము.

327. మాకవి = ఆది

ప॥ నెనరుంచినాను అన్నిటికి
నిదాను డని నేను నీదుపై॥ నెనరు॥

అ॥ ఘనాఘ జీమూ తాశుగ జలధి
గంభీరనీ పాదములపై॥ నెనరు॥

చ॥ కలిలో మాటలు నేర్చుకొని
కాంతలను తనయుల బ్రోచుటకు
శిలాత్ముడై పలుక నేరనుర
శ్రీ త్యాగరాజాప్త నీ యెడ॥ నెనరు॥

తాత్పర్యము :

నీ పాదములపై నేను భక్తి నిలిపినాను. ఇహలోక సంబంధమయినవి నీవేవో ఇస్తావని కాదు. వాటికి నేనే కారణము. (నా పూర్వకర్మయే కారణమని) ఘనీభవించిన నా పాపములనెడి మేఘములను చెదరగొట్టు వాయు దేవుడా! సముద్రమువంటి గంభీరుడా! (లోతు తెలియనివాడు) ఈ కలిలో భార్యాపుత్రులను పోషించుకొనుటకై వారిని వీరిని ఆశ్రయించి కల్లబొల్లి మాటలు మాట్లాడుట నా చేతగాదు. అటువంటి గుండె దిటవు నాకు లేదు. సుఖముగా నీపాదములను నమ్మి ఉన్నాను. భారము నీదే.

328. కర్నాటక బేహాగ్ = ఆది

ప॥ నే నెందు వెదకుదురా హరి!

అ॥ ఆనాల్గు మోములవాని మొర
నాలకించి రాని నిన్ను॥ నేనెందు॥

చ॥ కలుషాత్ముడైదు-ష్కర్మయుతుడై
పలుమారు దు-ర్భాషియై
ఇలలో భక్తాగ్రేస
రుల వేషియైన త్యాగరాజ పూజిత॥ నేనెందు॥

తాత్పర్యము :

ఓ హరీ! నేను నిను ఎక్కడ వెదకగలనయ్యా? ఆ నాలుగు ముఖముల బ్రహ్మ మొరల నాలకించి రాని నిన్ను నేను వెదక గలనా? అదీ కాక నామస్సు కలుషమైనది. చేసిన పనులు చెడ్డవి. పలుమారులు నానోటి నుంచి వచ్చేవి దుర్భాషణములే. కాని నా బాహ్యవేషము భక్తుల వేషము. ఇట్టి నేను నిన్ను వెదకగలనా? అని పరితాపము.

329. పరాళి = జంపె

ప॥ నే పాగడకుంటే - నీకేమి కొదవ
నీ మనసు దెలిసె గదరా?॥ నే॥

అ॥ ప్రాపుగల శుక సనక-ప్రహ్లాద నారద
పరమేష్ఠి రుద్రాది-భక్తు లర్చింపగ॥ నే॥

చ॥ భుజియింప బెట్ట సతి-బుధులు సామాజికులు
భజియింప సోదరులు-పవమానసూను
డజ బిడౌజాదిసుర-లాప్తు లైనారు నీ
రజనయన శ్రీత్యాగ-రాజనుత బాలుడగు॥ నే॥

తాత్పర్యము :

ఓ రామా! నేను పాగడపోయినా నీకేమి కొరతలేదు. నీ ప్రాపు సంపాదించి నిన్ను చేరి పొగడేవారు. శుకుడు, సనక సనందనాదులు, ప్రహ్లాదుడు, నారదుడు, పరమశివుడు,

ఏకాదశ రుద్రులు మొదలయిన భక్తులు చేరి కొలుచుచున్నారు. భోజనము తినిపించుటకు సీత ఉన్నది. పండితులందరు నీ సమాజము. ఛత్రచామరాదులు పట్టడానికి తమ్ములున్నారు. హనుమంతుడొక డున్నాడు. (కొండను పిండి చేసి తేగలవాడు) బ్రహ్మ, ఇంద్రాది దేవతలు ఆప్తబంధువులు. నేనా పిల్లవాడిని. నేను నీకేమిలెక్క? అని అయ్యగారు రాముని ఎత్తిపొడుచుచు వైభవ వర్ణనము చేసినారు.

330. రూపవతి = త్రిపుట

ప॥ నే మొరబెట్టితే మదిలోన
నీ కాయా సమేలరా?॥ నే॥

అ॥ ఈ మానవాధములను గోరి
ఎల్లవారలవలె నుండకను॥ నే॥

చ॥ తప మొకటొనర జేసినానో
దానంబొకటి అడిగినాననో
కపటాత్ముడై పలికినాననో
కలిహర! త్యాగరాజనుత॥ నే॥

తాత్పర్యము :

రామా! నేను నీ సన్నిధిలో మొరబెట్టుచున్నాను. నీవేదో శ్రమపడుచున్నట్లున్నావు. ఏవో ఐహిక విషయాలకోసం అల్పమానవులను కోరి వారిని సేవిస్తున్న ఇతరుల వలెనే నుండక నీ వద్ద మొరబెట్టుతున్నాను. నేను తపస్సు చేసితినా? లేదు. ధ్రువాదులు తపస్సు చేసినారు. అప్పుడు నీవు వచ్చి వాళ్ళకు సాక్షాత్కరించే ఆయాసము కలిగినది. నేను నిన్ను ఏదో ఇమ్మని దానమడుగలేదు. ఇక నీ కాయాసమేల? కపటబుద్ధితో నేను నీస్తోత్రం చేయుటలేదు. నీ దారిని నీ వున్నావు. నా దారిని నేను ప్రార్థన జేసుకుంటాను. నీకేల శ్రమ? అని కొంచెం చమత్కారముగా తన పట్ల రాముడు చూపుచున్న ఉపేక్షను అయ్యగారు ఎత్తి పొడిచినారు.

331. సౌరాష్ట్ర = ఆది

ప॥ నేరమా రామరామ నీకిది
ఓ రాజీవాక్ష – నాజీవాధార॥ నేరమా॥

అ॥ మారకోటి సౌందర్యమును గని
మదిలోన సుంత మరచియుంటే నేరమా॥

చ॥ కోరి కోరి నీదు – కొలువు సేయువేళ
సారమైన పద–సారసముల బొం
గార జూచి యుర–మున నుంచు దామో
కనుల నొత్తుదామో యని
కూరిమిని బ్రహ్మా–నంద మొందుచును
కొంత మైమరచి యుంటిగాని
తారకాధి పా–నన పావన సీ
తానాయకా శ్రీ–త్యాగరాజునిపై॥ నేరమా॥

తాత్పర్యము :

ఓ నీరజాక్ష! నా జీవాధారా! ఇది నేరమా? రామా! కోటి మన్మథులను మించిన నీ సౌందర్యమును చూచి, మరియు నిన్ను పూజించు సమయములో దివ్యములైన నీ పాదములను చూచి ఉప్పొంగి ఆపాదములను రొమ్మునకు హత్తుకొందునా కన్నులకు అద్దుకొందునా? అని ఆనంద మెక్కువ అగుటచేత కొంత మైమరచితిని ఇది నా నేరమా? అని ఒక ఆనందానుభవముతో కూడిన విచిత్ర ప్రశ్న.

విశేషము = భగవదారాధన కాండ అంతా అయిన తరువాత 'ఉపచారాపదేశేన। కృతా నహనహర్మయా। అపచారా నిమాన్ సర్వాన్। క్షమస్వ పురుషోత్తమ॥' = ఓపురుషోత్తమా! ఉపచారము లనెడి వంకతో నేను ప్రతిదినమును చేసెడి అపచారములను క్షమియింపుము' అని అనుసంధించి ముగించవలెను. అనగా చేసినవి ఉపచారములే. ఎక్కడయినా ఏదయినా అపచారము జరిగి ఉండవచ్చునని భావన. అట్లే తనకు కలిగిన మైమరపు నేరమేమో అని భావించి రామునే ప్రశ్నించుట జరిగినది.

332. వరాళి = ఆది

ప॥ నోరేమి శ్రీరామ నిన్నాడ నోరేమి॥

అ॥ సారెసారెకును–పావకర్మములు
సల్పుచు నుండు – నావంటివానికి॥ నోరేమి॥

చ॥ పాపులారుగురు – వశ్యులుగాక
పండ్లి గిలించుచు–తరుణులకై సీ
తాపతి! నిజభక్తి తెలియని
త్యాగరాజునికి ఒరులకైన॥ నోరేమి॥

తాత్పర్యము :

రామా! నిన్ను నిందించేవాని నోరు నోరేమి? కాదు. తేపతేపకు అనేక పాపములు చేసే నావంటి వాని నోరు, నోరుకాదు. కామ క్రోధ లోభమోహ మదమాత్సర్యములను జయించలేక స్త్రీజననునకై పండ్లిగిలించేవారై నిజమైన భక్తి తెలియక నిన్ను నిందించే వారి నోరు నోరు కాదు. అని అయ్యగారు వ్యతిరేకరీతిగా చెప్పినారు. దీనినే అన్వయ రీతిలో చెప్పితే నిన్ను భక్తితో కీర్తించువాని నోరే నోరు అని.

333. ఖరహరప్రియ = త్రిపుట

వ॥ ప్రక్కల నిలబడి–కొలిచేముచ్చట–బాగ దెల్పరాదా!

అ॥ చుక్కలరాయని–గేరు మోము గల
సుదతి సీతమ్మ! సౌమిత్రి! రాముని కిరు॥ ప్రక్కల॥

చ॥ తనువు చే వం–దన మొనరించు చున్నారా
చనవున నామకీ ర్తనజేయుచున్నారా
మనసున దలచిమై మరచియున్నారా
నెనరుంచి త్యాగరా–జునితో హరిహరి మీరిరు॥ ప్రక్కల॥

తాత్పర్యము :

అయ్యగారు సీతా లక్ష్మణులను రాముని కొలిచే పద్ధతిని తనకు తెలుపుమని కోరుచున్నారు. చుక్కల రాయని (చంద్రుని) తిరస్కరించు ముఖ సౌందర్యముగల సీతాదేవీ! ఓ లక్ష్మణా! మీరిరువురును రాముని ప్రక్కలనిలబడి సేవించుచున్నారు. ఆ సేవించు పద్ధతి నాకు తెల్పవలసినది. శారీరకముగా వందనము చేయుచున్నారా? వాచికముగా నామసంకీర్తనము చేయుచున్నారా? మానసికముగా స్మరించి మైమరచుచున్నారా? అని ప్రశ్న. అయ్యగారు తాను చేయునదదే. అది సరియైనదే అని వారి సమాధానమును కోరినట్లును భావింపవచ్చును.

విశేషము = త్యాగయ్యగారు సీతా లక్ష్మణులను భాగవత గోష్టిలో చేర్చి తన సందేహమును తీర్చుకుంటున్నారు. 'బోధయంతః పరస్పరం' భాగవతులు చేరి పరస్పరము బోధించుకొందురట. ఇది అదే. మరియు నొక విశేషము. రాముని గోష్టిలో సీతాలక్ష్మణులకే తక్కిన అందరి కన్న ప్రాధాన్యమున్నది. లక్ష్మణుడు 'భవాంస్తు సహ వైదేహ్యా। గిరిసానుషు రంస్యతే। అహం సర్వం కరిష్యామి। జాగ్రత స్స్వపతశ్చతే' = అన్నా! అడవిలో నీవు సీతతో కొండ చరియలపై ఆనందించునప్పుడు నీవు నిద్రించుచున్నను మేల్కొనియున్నను నీకు సర్వవిధ కైంకర్యములను చేయుదును' అని అన్నాడు. సీత 'యస్త్వయాసహ సస్స్వర్గః' = నాథా! నీతో కలసి ఉన్నది స్వర్గము, నీతో లేనిది నరకము' అని చెప్పి అడవికి బయలుదేరినది. కనుక రామునితో నిత్య సంబంధము కలిగి ఆయనను ఎట్లు కొలువవలెనో సీతాలక్ష్మణులకు బాగుగ తెలియును. అందుచేత అయ్యగారు వారినే అడిగినారు.

334. సాళగ భైరవి = ఆది

ప॥ పదవి నీ సద్భక్తియు కల్గుటే

అ॥ చదివి వేద శాస్త్రోపనిషత్తుల
సత్త తెలియలేనిది పదవా॥ పదవి॥

చ॥ ధన దార సుతాగార సంపదలు
ధరణీశుల చెలిమొక పదవా॥ పదవి॥

2 రాగలోభయుత యజ్ఞాదులచే
భోగము లబ్బుట అది పదవా॥ పదవి॥

3 జపతపాది యణి మాది సిద్ధులచే
జగముల నేచుట అది పదవా॥ పదవి॥

4 త్యాగరాజనుత డౌశ్రీరాముని
తత్త్వము తెలియని దొకపదవా॥ పదవి॥

తాత్పర్యము :

లోకములో చాలా పదవులున్నాయి. సింహాసనమెక్కి రాజ్యమేలుట మొదలుకొని ఎన్నో. అయ్యగారు 'అవి ఏవియును పదవులు కావు. రామా నీ భక్తి యొకటే పదవి'

అని నిర్ధరిస్తారు. రామా! వేదములు, శాస్త్రములు, ఉపనిషత్తులు చదివి వాటిలోని సారమును తెలియకపోవుట ఒక పదవా? కాదు. డబ్బు, భార్యా పుత్రులు, ఇండ్లు, ఇతరసంపదలుండుట పదవియా? కాదు. కోరికలతో లోభముతో యజ్ఞాలు చేసి భోగములందుట ఒక పదవియా? కాదు. జపతపములు చేసి అణిమద్యష్ట సిద్ధులను సంపాదించి జనులను బాధించుట ఒక పదవా? కాదు. త్యాగరాజ నుతుడైన శ్రీరాముని తత్త్వము (మహిమ) తెలియక పోవుట ఒక పదవా? కాదు. అని అయ్యగారు నిర్ధరించినారు. రామభక్తి ఒక్కటే పదవి.

విశేషము = సర్వ విద్యల సారము ఇదిట. 'ఆలోడ్య సర్వ శాస్త్రాణి వివిచ్యచ పునఃపునఃి ఇదిమేకం సునిష్పన్నం। ధ్యేయో నారాయణ స్సదా' = వేదాది సర్వ శాస్త్రములను చదివి వాటిని మథించి వివేచించి నందువలన తేలిన సారాంశమేమంటే భగవద్భక్తిని అవలంబింపవలెను' అని.

335. పంతువరాళి = చాపు (దివ్యనామము)

ప॥ పరమపావన గుణశాలీ – నన్ను
పాలింపవే వనమాలీ॥

చ॥ అన్ని నీవై యుండలేదా నీ
వఖిలాండములను బ్రోవలేదా॥ పరమ॥

2 అన్న నీకింక దయరాదా ని
న్నను సరించినవాడ గాదా॥ పరమ॥

3 నీవాడనై యారుదూర – రామ
నీవు నన్నేచేది మేర॥ పరమ॥

4 భావమునను నీవేరా మహాను
భావ మాకితరు లయ్యేరా॥ పరమ॥

5 దేవుడైన యాభాను–కుల
తిలకా నీవాడను నేను॥ పరమ॥

6 దైవమును వేడలేను – నీకు
దగినట్టు లోకువైనాను॥ పరమ॥

7 విత్తములేల వెయివేలు- రామ
సత్తామాత్రము నీవెచాలు॥ పరమ॥

8 భక్తులకోసము నీవు- రామ
శక్తుడవై వెలసినావు॥ పరమ॥

9 రాజసపు చూపు సేయకురా- త్యాగ
రాజపూజిత మరువకురా॥ పరమ॥

తాత్పర్యము :

పరమపావన గుణశాలీ! ఓ వనమాలీ! నన్ను పాలింపుము. జగత్తులో ప్రతి వస్తునందు నిండి, అఖిల బ్రహ్మాండములను పాలించువాడవు కదా! (నన్ను పాలించుట నీకొక లెక్కా?) ఓ అన్నా! నీకింకనూ దయరాదా? నేను నిన్ననుసరించియే యుంటినికదా! నీవాడనైన ననల్లరి పెట్టుట నీకు న్యాయమా? నా భావమంతయు నీవే నిండి యున్నావు. నీ వితరుడ వెట్లగుదువు? ప్రత్యక్షదైవమయిన సూర్యవంశమున శ్రేష్ఠుడవు. నిన్ను తప్ప ఇతరదైవమును వేడలేను. నీకు మాత్రమే నేను వశమైయున్నాను. రూపాయిలు వేలు వేలు ఎందుకు? నీ సత్త (ఉనికి) నాకు చాలు. నీవు శక్తి గలవాడవు అంటే భక్తుల రక్షణము కొరకే. కనుక నీవు రాజసపు దృష్టి నాపై ప్రసరింప చేయక సాత్విక దృష్టి నాపై ప్రసరింప జేయవలసినదని ప్రార్థించినారు.

విశేషము = జాయమానం హిపురుషం। యం పశ్యే న్మధుసూదనః। సాత్త్విక స్సతు విజ్ఞేయ। స్సవై మోక్షార్థచింతకః' = పుట్టుచున్న పురుషుని భగవంతుడు చూచినచో వాడు సాత్త్వికుడై మోక్షమును గూర్చి ఆలోచించువాడగునని శాస్త్రము. అనగా అపుడు భగవంతుని సాత్త్విక దృష్టి పడుచున్న దన్నమాట. శ్రీరాముని, ఆ దృష్టినే ఎప్పుడును ప్రసరింప జేయుమని అయ్యగారి ప్రార్థన.

336. వాగధీశ్వరి = ఆది

ప॥ పరమాత్ముడు వెలిగే ముచ్చట
బాగదెలుసు కోరే॥ పరమా॥

అ॥ హరియట హరుడట - సురలట నరులట
అఖిలాండ కోటు-లట ఇందరిలో ॥ పరమా॥

చ॥ గగనానిలతే జోజల – భూమయమగు
మృగ ఖగనగ – తరుకోటులలో
సగుణములలో విగు–ణములలో సతతము
సాధు త్యాగరా – జార్చితు డిలలో॥ పరమా॥

తాత్పర్యము :

ఇది సర్వ వేదసారమయినకృతి. ఓ జనులారా ! పరమాత్ముని ఉనికిని తెలుసుకొనుడు. హరియందు – హరుని యందు – సమస్త దేవతల యందు – నరుల యందు – అఖిల బ్రహ్మాండముల యందు – ఆకసము నందు – వాయువునందు, అగ్ని యందు – జలమునందు – భూమి యందు – మృగ పక్షుల యందు – కొండల యందు – చెట్ల యందు – సగుణములలో – విగుణములయందు – వీటి అన్నిటి యందును పరమాత్ముడు ఉండి ప్రకాశించుచున్నాడు. అని అయ్యగారు పరమాత్ముని సర్వవ్యాప్తిని చెప్పినారు. '' ఇందుగల డందులేడని'' ప్రహ్లాదుడు చెప్పినదిదే.

337. మందారి = ఆది

ప॥ పరలోక భయములేక భవ
పాశ బద్ధులయ్యేరు॥

అ॥ కరివాజి శృంగారారామ శిబి
కాదు లెల్ల మనకే । కల్గెనవి॥ పరలోక॥

చ॥ కొన్నకాంతలను। కన్నబిడ్డలను
వన్నె చీరలను । వానగుడిసెలను॥
తిన్నగా గని దేవలోకమని
తన్ను కోళ్లలో – త్యాగరాజనుత ॥ పరలోక॥

తాత్పర్యము :

పెక్కు జనులు పరలోక భయములేక సంసార పాశములో చిక్కుకొను చున్నారు. ఏనుగులు, గుర్రములు, ఉద్యానవనములు, పల్లకీలు ఇవన్నియు మనకే ఉన్నాయని పరలోక భయము లేక పాశబద్ధులగుచున్నారు. తమకాంతలను, తమ బిడ్డలను, తమ

రంగుల బట్టలను తుదకు వాన కురిసే గుడిసెలను కూడ మహాభాగ్యములుగా భావించి అధః పతితులగు చున్నారే? అని అయ్యగారి ఆవేదన. ఇందు చక్రవర్తి లాంఛనములు మొదలుకొని వానగుడిసెల వరకు చెప్పబడినవి.

విశేషము = ''బాలస్తావ త్క్రీడాసక్తః తరుణ స్తావ త్తరుణీ సక్తః। వృద్ధ స్తావ చ్చింతాసక్తః। పరమే బ్రహ్మణి కోపి నసక్తః॥ = బాలుడు ఆటలమీద ఆసక్తుడై ఉంటాడు. యువకుడు స్త్రీజనులపై ఆసక్తుడై ఉంటాడు. వృద్ధుడు ముదుసలి నైతినే అని చింతాసక్తుడై ఉంటాడు. కాని పరమాత్మని గూర్చి ఎవడును తలవడే'' అని శంకరాచార్యుల వారు ఆవేదన చూపుతారు. అట్లే త్యాగయ్యగారును.

338. పూర్వికల్యాణి = ఆది

ప॥ పరలోక సాధనమే మనసా

అ॥ స్మర లోభమోహాది పాపులను
స్మరియింపకే – శ్రీరామ భజన॥ పరలోక॥

చ॥ జననాదిరోగ – భయాదులచే
జగమందు గల్గు – దురాశలచే
తనయాది బాంధ వుల భ్రమచే
తగుల నీదు త్యాగరాజనుతుని భజన॥ పరలోక॥

తాత్పర్యము :

ఇది మానస బోధ. మనసా శ్రీరామ భజనము పరలోక సాధనము. ఓమనసా కామ, క్రోధ, లోభ మోహములకు వశము కాక రామ భజన చేయుము. రామ భజనను పట్టుకుంటే జనన మరణ రోగముల భయముండదు. ఆశలు వచ్చి మనస్సు నాక్రమించవు. సతీసతులపై భ్రమను అంటనీయదు. కనుక శ్రీరామ భజన చేయుము. అని అయ్యగారి బోధ.

విశేషము = పరలోక మంటే 'తద్విష్ణోః పరమం పదం' అని చెప్ప బడిన విష్ణులోకము.

339. జుజావులి = ఆది

ప॥ పరాకు జేసిన నీకేమి । ఫలము గల్గెరా పరాత్పరా॥

అ॥ సురావనీ సురాప్త మావరాజ రాఘవ నాయెడ॥ పరాకు॥

చ॥ ముదాన నీదు – పదారవింద। ములను బట్టి మ్రొక్కగలేదా
నిదాన రూప దరిదాపు లేదు ఉదార శ్రీ త్యాగరాజ నుత॥ పరాకు

తాత్పర్యము :

ఓ రామా! నేనెంత ప్రార్థించినా నాయెడ పరాకు జూపు చున్నావు. దీని వలన నీ కేమి ఫలము? దేవ బ్రాహ్మణుల కాపుడా! లక్ష్మీనాథా! నిత్య యౌవనుడా! సంతోషముతో నీ పాదములను నేను మ్రొక్కితిని కదా! అన్నిటికిని మూల కందమయిన వాడా! నా ఆర్తికి దరి దాపు లేదా? ఇక పరాక చేయక నను రక్షింప వలెనని ప్రార్థన.

340. కిరణావళి = ఆది

ప॥ పరాకు నీకేలరా రామ

అ॥ చరాచరమ్ముల – వసియించే మా
సార సాక్షినా వనులంటే యీ॥ పరాకు॥

చ॥ పురాన శబరి మొసంగిన యటునే
భుజించు కొన్న శేషమా రామ
ధరాతలమున గుహుని వలె పత్ర
తల్ప మొనర్చితినా త్యాగరాజునిపై॥ పరాకు॥

తాత్పర్యము :

ఓ రామా నా పనులంటే నీకు పరాకేలనయ్యా? నేను అల్పుడను అనే భావ మేమయినా కలదా? చరాచరము లన్నిటి యందున నీవు నివసించి యున్నావు కదా! ఇది నీచము, ఇది గొప్పది అనే తారతమ్యము లేక అన్నిటి యందు వసించి యున్నావు. అట్టి నీకు పరాకేల వచ్చినదయ్యా! పూర్వము శబరి ఎంగిలి పండ్లిచ్చినదని ప్రతీతి.

నేనట్లు చేసితినా? లేదు. గుహుడు ఆకులతో నీకు ప్రక్కవేస్తే పడుకున్నావు. పై కథలలో ఉచ్చనీచము లెంచక మంచి చెడ్డల నెంచక వారి కోరికలు తీర్చినావు. నేనట్లుకాక క్రొత్త ఫలములను నివేదనము చేసినాను. మృదు పుష్పతల్పమును పరచినాను. వారిపై చూపని పరాకు నాపై ఏల చూపుచుంటివి. అని అయ్యగారి ఆర్తి

341. సావేరి = ఆది

ప॥ పరాశక్తి మను। పరాద నాపై
పరాకేల నమ్మా॥ పరాశక్తి॥

అ॥ పురాణి ధర్మసం – వర్ధనీశ్రీ
పురారీశ్వరీ। రాజశేఖరి॥ పరాశక్తి॥

చ॥ వరాహిధర దే। వరాజ జలజభ
వరాక్షసాదులు వరాలు కోరు
వరాననా నగ। వరాత్మజా – ముని
వరార్చిత నమ్రో। వరాద ఓ॥ పరాశక్తి॥

2॥ విశాల నయనా। కుశాలుగానీ
దుసేవ జేసి త్రి। దశాధిపాదు
లు శాశ్వతులై పర। వశాల నతిసే
య శాంతమున జూచు శాంభవీ ఓ॥ పరాశక్తి॥

3॥ నిరాపరాధుల – నిరాకరించే
దురాత్మకుల నిం। దురాక సేయ
గరాదు వరత్యా। గరాజనుత శుభ
ద రామ సోదరి । ధరాధర సుతా॥ పరాశక్తి॥

తాత్పర్యము:

ఇది పంచనద నివాసిని అయిన ధర్మ సంవర్ధినీ దేవి పైది. అమ్మా! ధర్మ సంవర్ధినీ! పురాణీ! (అనాది అయిన దేవీ!) ఓ పరాశక్తీ! శివుని రాణీ! చంద్రకళాధరీ! నాపై పరాకేల

నమ్మా! నన్ను మనుపవమ్మా! శివుడు, ఇంద్రుడు, బ్రహ్మాది దేవతలు, రాక్షసులును పూజించి వరాలు కోరుకొనే ఓ పర్వత రాజకుమారీ! మునివరులు కొలిచే దేవీ! నన్ను బ్రోవరాదా! ఓ విశాల నేత్రీ! దేవేంద్రాదులు ఉత్సాహముతో నిన్ను సేవించుట చేతనే శాశ్వతులై పారవశ్యంతో నిన్ను నుతి చేస్తూ ఉంటే వారిని శాంత దృష్టితో చూచి రక్షించుచున్నావు కదా! నిరపరాధులను బాధించే దురాత్ములను (రాక్షసులను) నీ సన్నిధికి రానీయకమ్మా! అని అయ్యగారు ప్రార్థించినారు.

342. వనస్పతి = రూపకం

ప॥ *పరిహాసకమా మాట। పదిగురిలో పాగడినది॥*

అ॥ *వెరపునను మానమున। వెసనంబుల చేగోరి*
శరణాగత రక్షకనిను। సంతతము శరణంటే॥ పరి॥

చ॥ *ఒకమునికై ద్రౌపది ద్వా। రకనిలయా శరణనగా*
ఒకమాటకు విభీషణుడు। ఓర్వలేక శరణనగా
సకలేశ్వర ప్రహ్లాదుడు। జాలిచే శరణనగహి
తకరుండై బ్రోచిన। త్యాగరా జుని మాట॥ పరి॥

తాత్పర్యము :

రామా! నేను దాపరికము లేకుండా పదుగురిలో బాహాటముగా ప్రార్థిస్తూ ఉన్నాను. ఇది నీకు పరిహాసముగా నున్నదా? లేక పోతే నన్నేల రక్షింపవు? నీవు శరణాగతులను రక్షింపవా? అంటే ఒకమునికై ద్రౌపది శరణంటే రక్షించావు. అన్న ఆడిన ఒక దుర్భాషకు అభిమాన పడి శరణనిన విభీషణుని రక్షించావు. బాధలతో శరణన్న ప్రహ్లాదుని రక్షించావు. మరి నామాట పరిహాసముగా నున్నదా? నీకు. (పరిహాసపు మాటలను లెక్కలోనికి తీసుకొనరు). నామాట అట్లున్నదా అని త్యాగయ్యగారి ప్రశ్న.

విశేషము = ఇక్కడ ద్రౌపది విషయము వివరింప వలసి యున్నది. పాండవులు ద్వైత వనమందుండగా దుర్యోధనుడు దుర్వాసుని పిలచి ''నీవు ద్వైత వనమునకు వెళ్లి ఓదో ఒక మిషతో పాండవులను శపించి రమ్ము'' అని కోరినాడు. దుర్వాసుడు శిష్యపరివారముతోసహావెళ్లి భోజన సమయమున పాండవులను భోజనము కోరినాడు. ధర్మరాజు స్నానము చేసి రమ్మని చెప్పినాడు. పాండవుల భోజనమయినది. వంటపాత్రలో

ఒక్కమెతుకు ఉన్నా ద్రౌపది కరస్పర్శ తగిలితే అది అన్నపూర్ణమయిన అక్షయపాత్ర అవుతుంది. ఆ ధైర్యముతో ధర్మరాజు దుర్వాసుని రమ్మన్నాడు. దుర్వాసుడు శిష్యులతో స్నానమునకు వెళ్లినాడు. ధర్మరాజు పర్ణశాలలోకి వచ్చి విచారిస్తే ద్రౌపది భోజనము కూడ అయినది. పాత్రములన్నియు శుభ్రముగ కడిగి బోర్లించినది. కడగకుండా ఉంటేనే ఆమె చేతికి అక్షయశక్తి. కడిగితే అక్షయశక్తి ఆనాటికి పోతుంది. అందరు చాలా భయపడినారు. కోపిష్ఠి దుర్వాసుడు డేమి చేయునో అని. గత్యంతరము లేక వెంటనే ద్రౌపది ద్వారకావాసా అని శరణాగతిచేసినది. కృష్ణపరమాత్మ సాక్షాత్కరించినాడు. ద్రౌపదీ నీవు శుద్ధి చేసిన వంటపాత్రకు అంటుకొని ఒక ఆకునలుసు ఉన్నా నాకుపెట్టు అన్నాడు. దైవాద్వాకూర పాత్రలో ఒక ఆకు అంటి ఉన్నది. కృష్ణుడు దానిని తిన్నాడు. అక్కడ చెరువులో స్నానం చేస్తున్న దుర్వాసునికి శిష్యులకు కడుపులు గొంతుకదాకా నిండిపోయి తేన్పులు రావటము ప్రారంభించాయి. దానితో వారు ధర్మరాజు శిబిరానికి రాక చెరువునుంచే పరువులు పెట్టి వెళ్లిపోయారు. ఈ విధంగా పరమాత్మ ఆనాడు రక్షించాడు. ఇది జైమిని భారతము లోనికథ.

343. లీతిగౌళ = ఆది (దివ్యనామము)

ప॥	పరిపాలయ పరిపాలయ। పరిపాలయ రఘునాథ॥	పరి॥
చ॥	తను వేనీ కనువైన సదన మౌరా రఘు నాథ॥	పరి॥
2	స్థిరచిత్తము వరచామీ। కరపీఠము రఘునాథ॥	పరి॥
3	సుపద ధ్యానము సురగంగా। జలమౌరా రఘునాథ॥	పరి॥
4	ఇభ పాలక అభిమానము। శుభ చేలము రఘునాథ॥	పరి॥
5	ఘనకీర్తిని బల్కేవా। సన గంధము రఘునాథ॥	పరి॥
6	హరినామ స్మరణంబులు। విరులౌరా రఘునాథ॥	పరి॥
7	తొలి దుష్కృత ఫలమే గు।గ్గులు ధూపము రఘునాథ॥	పరి॥
8	నీ పద భక్తే ప్రాద్దును। దీపంబగు రఘునాథ॥	పరి॥
9	నే జేయు సుపూజా ఫలము। భోజనమౌ రాఘునాథ॥	పరి॥
10	నిను జూచుటె ఘనదీపారా। ధన మౌరా రఘునాథ॥	పరి॥

11 ఎడబాయని నాయెడగల్గు సుఖము। విడె మొరా రఘునాథ॥ పరి॥

12 పూజావిధి నైజత్యాగ। రాజకృతము రఘునాథ॥ పరి॥

తాత్పర్యము :

అయ్యగారు శ్రీరామున కిందు ఉపచారము లర్పించుచున్నారు. ఓరఘునాథ = ఓ రామా! పరిపాలయ = పరిపాలించుము. నాశరీరమె నీకు తగిన ఇల్లు. నా మనస్సు నీకు బంగారు పీఠము. నేను జేయు నీపాద ధ్యానమే గంగాజల పాద్యము. గజరక్షకా! నా భక్తియే నీకు వస్త్రము. నేను చేసే కీర్తి సంకీర్తనమే సుగంధ చందనము. హరినామములే పుష్పములు. నేను తొలిచేసిన పాపఫలములు గుగ్గిలపుధూపము. నీ పాదములపై నాకున్న భక్తియే దీపము. నేను జేసిన పుణ్యఫలములే నీకు భోజనము నా చూపులే నీకు దీపారాధనము.నిన్ను ఎప్పుడును ఎడబాయని నావలన నీకు కలిగే సుఖమే తాంబూలము, అని.

విశేషము = పనిద్దరాళ్వారులలో మొదటి వారైన పొయ్‌గ ఆళ్వారు ''వయ్యంతగళయాయ్ వార్ కడల్ నెయ్యాగ వైయ కదిరోం విళక్కాగ'' = భూమి అంతయు ప్రమిదగా చేసి సముద్రమును నెయ్యిగా బోసి భక్తిని వత్తిగా వేసి సూర్యుని జ్యోతిగా చేసి భగవాన్! నీకు నీరాజన మిస్తాను'' అన్నారు. త్యాగయ్యగారి ఇందలి భావము దీనిని బోలియున్నది.

344. దర్బారు = చాపు (దివ్యనామము)

ప॥ పరిపాలయ దాశరథే రామ మాం॥ పరి॥

చ॥ కపట నాటక సూత్రధార కన। కపటావృత లోకాధారమాం॥ పరి॥

2 అపరిమితానంద బోధరామ। అపహృత శ్రిత భవబాధ॥ పరి॥

3 మారకోటినిభదేహ సుకు। మార పాలిత వైదేహ॥ పరి॥

4 శరజితాశర సర్వస్వ రామ। శరణాగతాప్త సర్వస్వ॥ పరి॥

5 పామ రజన గణదూర, భూపామరనిచయాధార॥ పరి॥

6 పవనజ ధృత పాదకమల, హృత్తా। పవనకుఠార విమల॥ పరి॥

7 రాజాధిరాజ వేష, త్యాగ । రాజ భూషిత మృదు భాషమాం॥ పరి॥

తాత్పర్యము :

ఇది సంస్కృత కృతి. ఇందు అంతయు సంబోధనములే. ఓకపట నాటక సూత్రధార! (ఈ జగముల సృష్టి రక్షణ విధ్వసంములే కపట నాటకము). బంగరు చేలము కట్టిన వాడా! లోకా ధారుడా! అపరిమిత మయిన జ్ఞానానందములే రూపమయిన వాడా! ఆశ్రితుల సంసార బాధలను పోగొట్టువాడా! కోటి మన్మధుల సౌందర్యము గలవాడా! జనక మహారాజును రక్షించినవాడా! శరణాగతులయిన వారికి సమస్తమును అయిన వాడా! పామరులకు దూరమయిన వాడా! రాజులకు దేవతలకు ఆధారమయిన వాడా! (రాముడుగా రాజులకు, విష్ణువుగా దేవతలకు) హనుమంతుడు పట్టిన పాదముల వాడా! భక్తుల హృదయ తాపములను పోగొట్టువాడా! నిర్మలుడా! రాజాధిరాజవే షుడా। త్యాగరాజుచేత అలంకరింప బడిన వాడా! (రాగ రత్నమాలికలతో) మాం = నన్ను, పరిపాలయ = రక్షించుము. అని ప్రార్థనము.

345. మనోహరి = రూపకం

ప॥ పరితాపము గనియాడిన
పలుకులు మరచితివో॥ పరి॥

అ॥ సరిలేని సీతతో
సర యూమధ్యంబున నా॥ పరి॥

చ॥ వరమగు బంగరు వాడను
మెరయుచు పది పూటలపై
కరుణించెద ననుచు క్రీ
గనుల త్యాగ రాజుని॥ పరి॥

తాత్పర్యము :

రామా! నా పరితాపమును చూచి నీ వనిన మాటలు మరచితివా? సరయూనదీ మధ్యలో బంగారు పడవ మీద సీతతో కూడ నీవు కూరుచుండి క్రీగంట నన్ను చూచుచు పదిపూటలపైన నన్ను కరుణించెద నని(సాయుజ్య మిచ్చెదనని) పలికినావు. ఆ మాటలు మరచితివా? అని పరివేదనము.

విశేషము = ఇది భావసాక్షాత్కారమో స్వప్న సాక్షాత్కారమో అయి ఉంటుంది. బహుశః ఇది చివరి రోజులలో రచించినదయి ఉంటుంది. సరిగా ఈ అర్ధము కలదే (పది పూటలపై కరుణించెదనని) శాసనలో ''గిరిపై నెల కొన్న రాముని గురి తప్పక గంటిని'' అని ఇంకొకటి యున్నది. ఈ రెండు కృతులును నిర్యాణమునకు అభిముఖుడై ఆర్తి పడుచున్న జీవితపు చరమావస్థలో కలిగిన అనుభూతి పరములు.

346. పూర్వికల్యాణి = రూపకము

ప॥ పరిపూర్ణ కామ। భావమున మరచినావ॥

అ॥ పరమ కారుణికోత్తమ। భవ జీవనజభవార్చిత॥ పరి॥

చ॥ సాకేతాధిప నీముఖ – సరసీరుహమును జూపి
సాకే మది లేదేటి। సవరణ రామ॥
ఈ కలి ననుసరించి। హీన జాతి మర్త్యులచే
కాకు పడగ తరమెశ్రీ। కరత్యాగ రాజవినుత॥ పరి॥

తాత్పర్యము :

ఓ పరిపూర్ణ కామా = కోరికలన్నియు నిండిన వాడా! నన్ను మనస్సులో మరచి పోయినావా? ఎక్కువ కరుణ గలవాడా! బ్రహ్మరుద్రులచే అర్చింప బడినవాడా! అయోధ్యాధిపా! నీ ముఖమును చూపించి నన్ను రక్షించే మనస్సులేదు. ఇదెటువంటి సవరణయ్యా? రామా! నీవు నన్ను రక్షించకపోతే ఈ కలియుగపు గుణహీన మానవుల వలన నాకు కలిగే చీకాకు పడుట సాధ్యముకాదు. నీవు కడుపు నిండిన వాడవు. నన్ను మరచినావు. అని అయ్యగారి ఎత్తిపొడుపు.

347. పూర్ణ చంద్రిక = ఆది

ప॥ పలుక వేమినా – దైవమా రామ
పరులు న వ్వేది – న్యాయమా

అ॥ అలుగ కారణమేమిరా రామ నీ
వాడించిన ట్లాడిన నాతో॥ పలుక॥

చ॥ తలి దండ్రులు భక్తి నొసగి రక్షించిరి
తక్కిన వారలెంతో – హింసించిరి
తెలిసి యూరకుండే – ది ఎన్నాళ్లురా
దేవాధిదేవా – త్యాగరాజునితో॥ పలుక॥

తాత్పర్యము :

ఓరామా! ఇని మొరలు నేను పెట్టుచుంటే నీవు ఒక్క పలుకు పలుక వేమయ్యా? నేను పెక్కు పలుకులు పలుకుట నీవు పలుకకుండుట చూచి పరులు నవ్వుకొంటున్నారు. ఈ విధముగా నన్ను నవ్వుల పాలు చేయుట నీకు న్యాయమా? ఒక వేళ నాపై నీ వలిగినావా? అలిగితే అలిగినందుకు కారణము చెప్పుము. నీవాడించినట్లు నేనాడు చున్నాను. (నీ ఆజ్ఞను పాటిస్తూ ఉన్నానని) నా తల్లితండ్రులు నాకు నీభక్తి నిచ్చి రక్షించారు. తక్కిన బంధువులు నన్ను రామభక్తిని విడువ మని హింసిస్తున్నారు. ఈ విషయములన్నియు తెలిసి నీ వూరకుంటున్నావు. ఇదెన్నాళ్లు ? అని అయ్యగారి తీవ్రమయిన ప్రశ్న.

విశేషము = విగ్రహరూపుడయిన రాముడు పలుకుట ఎట్లు? పలుకడు. మరి అయ్యగారి ఈ ప్రశ్న ఏమిటి? రామదాసు ఋణము దీర్చినట్లు ఏదయినా ఒక అద్భుతము భక్తుని విషయములో చూపిస్తే రాముడు పలికినట్లు. త్యాగయ్యగారి విషయమున ఇట్టి దేమియు జరుగలేదు. ఇట్టి దేదయినా జరిగితే ''పరులు నవ్వరు'' అయ్యగారి బాధ ఇది. మరియు అన్న మొదలయిన వాళ్లు హింసిస్తున్నారు. దీనికి రాముని ప్రతిక్రియ ఏమియును లేదు. ఇది అయ్యగారి బాధ. పోనీ భగవదాజ్ఞను మీరిన వానిపై భగవంతునికి అలుక ఉంటుంది.

శ్లో॥ శ్రుతి : స్మృతి ర్మమైవాజ్ఞా । యస్తా ముల్లంఘ్య వర్తతే । ఆజ్ఞాచ్ఛేదీ మమద్రో హీ'' = వేదములు, స్మృతులు నా ఆజ్ఞ. దానిని ఉల్లంఘించిన వాడు నా ఆజ్ఞ చ్ఛేదకుడు నాకు ద్రోహి'' అని భగవంతుని వాక్యము. మరి అయ్యగారు శ్రుతి స్మృతులను ఉల్లంఘింపలేదు. గీతలో చెప్పిన 'అనన్యాశ్చింత యంతోమాం' ఇత్యాది వచనములచేత ఆ అనన్య భక్తిని గట్టిగా పట్టుకొన్నారు. ఇదే 'నీవాడించిన ట్లాడిననాపై' అనే దాని భావము. కనుక రామునకు తనపై అలుక కల్గుటకు కారణములేదు. అయ్యగారు ఇదే ప్రశ్నించారు.

348. నవరస కన్నడ - ఆది

ప॥ పలుకు కండచ – క్కెరను గేరునే
పణతులార చూడరే॥ పలుకు॥

అ॥ కొలువు కూటమునను – కొలుచువారిని
పిలిచి దాశరధి – ప్రేమమీర పలికే॥ పలుకు॥

చ॥ సురల భామినీ – మణుల గానమా
దరణ నాలకించుచును శృంగా
రరసయుక్తవార రమణు లాడ జూచి
సరస త్యాగరాజు – వరునితో పాగడే॥ పలుకు॥

తాత్పర్యము :

ఓ స్త్రీలారా! చూడుడు. రాముని మాటలు కండ చక్కెర కంటే ఎక్కువ తియ్యగా నున్నవి. తన కొలువు కూటములో తనను కొలిచే వారితో ప్రేమతో పలికే మాటల తీపి గొప్పది. సభలో దేవతాస్త్రీలు పాట పాడుచుంటేవిని, అప్సరసలు నాట్యం చేస్తూ ఉంటే చూచి నన్ను పిలిచి నాతో పలికిన పలుకులు చక్కెరను మీరినవి అని అయ్యగారు ఒక భావనను చేసినారు.

విశేషము = ఇందు అయ్యగారు 'పణతులార' అని సంబోధించినారు. ప్రత్యేకించి అయ్యగారు స్త్రీలను ప్రోగుచేసి చెప్పినది కాదు. పురుష భక్తులను కూడ ఉద్దేశించి చెప్పినదే. 'స్త్రీప్రాయ మిత రజ్జగత్' = భగవంతుడొక్కడే పురుషుడు. తక్కిన పురుషులందరును స్త్రీలే' అనే శాస్త్రమును బట్టి పణతులార అని సంబోధించినారు.

349. మంజరి = ఆది

ప॥ పట్టి విడువరాదు – నాచెయి
పట్టివిడువ రాదు ... నాచెయి పట్టి॥

అ॥ పుట్టిననాడే, నిజభక్తిని మెడ
గట్టి గుట్టు చెదరక బ్రోచి చెయి॥ పట్టి॥

చ॥ నిత్యానిత్యము। లను బోధించి
కృత్యాకృత్యము।లను తెలిపించి
ప్రత్యేకుడు నీ। వని కనిపించి
భృత్యుడైన తాగరాజు చెయి॥ పట్టి॥

తాత్పర్యము :

రామా! నాచెయి పట్టినావు. (రామభక్తి కలిగి యుండుటే రాముడు చెయిపట్టుట) ఇప్పుడు విడువ వద్దు. నేను పుట్టిన నాడే నాకు నీ భక్తిని మెడకంట గట్టినావు. అది కూడ గుట్టుగా జరిగినది. (నీవు నా కంట గట్టిన సంగతి చాలా గుట్టుగా జరిగినది) ఆ గుట్టు చెదరి పోకుండా నా చివరిదాకా పట్టిన చెయ్యి విడువకు. నీవు నాకు చెయ్యవలసిన దేమంటే 'నిత్యానిత్య వస్తువివేకము' కలిగించు. చెయ్యవలసిన దేదో, చెయ్యకూడని దేదో వీటిని తెలిపించు. పిదప నీ ప్రత్యేకతతో నాకు సాక్షాత్కరించు. నీ భృత్యుడనైన నా చెయిబట్టి విడువబోకు, అని అయ్యగారి ప్రార్థనము.

విశేషము = శ్లో॥ ఆచార్య స్స హరిస్సాక్షాత్। చరరూపీ న సంశయః। మగ్నా నుద్ధ రతే జం తూన్। కారుణ్యా చ్ఛాస్త్ర పాణినా॥ = గురువు సాక్షాత్ హరియే. సందేహము లేదు. అతడు సంసార మగ్నులయిన జీవులను, దయతో శాస్త్రమనెడి కరావలంబనము (చెయ్యి) ఇచ్చి ఉద్ధరించును'. శంకరులవారు మోక్షసాధనములుగా సాధన చతుష్ట యమును చెప్పినారు. అందు మొదటిది నిత్యానిత్య వస్తువివేకము. నిత్యము బ్రహ్మము. అనిత్యము సంసారము. ఇది తెలియుట. బ్రహ్మమును పాసింప వలెను. సంసారమును విడువ వలెను. ఇవి కృత్యాకృత్యములు. ఇవి బోధించుట ద్వారా తన చెయ్యిపట్ట వలసినది. పట్టిన చెయ్యిని విడువ రాదు. అని అయ్యగారి నిత్య ప్రార్థనము.

350. దర్బారు - చాపు

ప॥ పరిపాలయమాం। కోదండ పాణే
పావన ఆశ్రిత। చింతామణే॥ పరి॥

అ॥ సరసిజ భవ నుత। చరణ సరోజ
సాకేత సదన। దశరథ తనూజ॥ పరి॥

చ॥ శేషాధిపవర। భూషణ వాగ్వి
శేష కృతనామ। ఘోష జనిత సం
తోషక నిజసం। భాషణ నతజన
పోషణ శుభకర వేష నిర్దోష॥ పరి॥

2 సత్యసంధ వర। భృత్యపాలకా
దిత్యకులోత్తమ। సత్య జనావన
అత్యంత సుందర। నృత్య జనప్రియ
స్తుత్య సుచారిత్ర। నిత్యోత్సవ రూప॥ పరి॥

3 సాగర మద దమన। నాగారి నుత చర
ణా గణపతి హృద। యాగార పాలన
జాగరూక శర। ణాగత వత్సల
త్యాగరాజ నుత। నాగారితురగ॥ పరి॥

తాత్పర్యము :

ఇది సంస్కృత కృతి అన్నీ సంబోధనములు మాత్రమే. కోదండ పాణీ, ఆశ్రిత చింతామణీ! బ్రహ్మవినుతా, అయోధ్యావాసా, దశరథసుతా, శివస్తుతనామా! వ్రేపల్లెయందు బుట్టిన వాడా! ఇట్టి వేసంబోధనములు, చివరకు రక్షించుము, అని.....

351. ఆరభి = త్రిశ్రలఘువు

ప॥ పలుకవేమి పతిత పావనా కరుణ
జిలుక వేమి సుజన జీవనా॥ పలుక॥

చ॥ ఓర్చిన తాప మార్చిన అంగ
లార్చిన ఎంత – నేర్చినా॥ పలుక॥

2 తలచిన నిన్ను గొలిచిన ఎంత
వలచిన బాగ పిలిచిన॥ పలుక॥

3 తెలిపిన మనసు నిలిపిన పూజ
సలిపిన మతము కలిపిన॥ పలుక॥

4 కాంచిన నిను భ-జించిన మదము
వంచిన యురమున - నుంచిన॥

5 పట్టిన, ఎంత - తిట్టిన నిన్ను
చుట్టిన, పదము - బట్టిన॥ పలుక॥

6 ఆడిన నిన్ను - బాడిన ఎంత
వేడిన గొని యాడిన॥ పలుక॥

7 కోరిన, మరుగు - జేరిన నిన్ను
దూరిన, ఎంత - పోరిన॥ పలుక॥

8 తెలిసిన బుద్ధి - కలసిన జూచి
సొలసిన, నేను - తెలిసిన॥ పలుక॥

9 మ్రొక్కినా, నీచే। జిక్కిన ఎంతో
సొక్కినా, నీ కే। దక్కినా॥ పలుక॥

10 నాగరా జశయన। వేగరా, శ్రీ
త్యాగరాజ నుత ఘృణా। సాగరా॥ పలుక॥

తాత్పర్యము :

ఓ పతిత పావనా నీవు పలుకవేమి? ఓ సుజన జీవనా నీకరుణను చిలుక వేమి? ఓర్చుకొన్నా బాధ నార్చుకొన్నా, అంగలార్చినా, ఎంత నేర్చినా, నిన్ను తలచినా, కొలిచినా, వలచినా, పిలచినా, మనస్సు తెలిపినా, మనస్సులో నిన్ను నిలిపినా పూజసలిపినా, నీ అభిప్రాయముతో ఏకీభవించినా, నిన్ను చూచినా, భజించినా, నా సంతోషమును నీకు పంచినా, రొమ్మునకు హత్తుకొన్నా, కాళ్లు పట్టు కొన్నా, తుదకు తిట్టినా, ఆడినా, పాడినా, వేడినా, కొనియాడినా, ఎన్ని చేసినా, ఏమిచేసినా పలుకవేమయ్యా అని ప్రశ్న.

352. దేవగాంధారి - ఆది (దివ్యనామము)

ప॥ పాలయ శ్రీరఘు వీర, సుకృ। పాలయ రాజకుమార, మాం॥ పాలయ॥

చ॥ తారాధీశవదన, । తారాధీశ దమన మాం॥ పాలయ॥

2 హిమకరకోటిని భాంగా – ఏ। హి మకర హరణ నిస్సంగ మాం। పాలయ॥

3 రాక్షస జన గణదూర, మక। రాక్ష సమర హర శూర మాం॥ పాలయ॥

4 శ్రీదశరథకుల శరణ, రామ। శ్రీద శరధి మదహరణ మాం॥ పాలయ॥

5 కుమనోజన గణభీమ, రామ। సుమనో వారిధి సోమమాం॥ పాలయ॥

6 జయ విజయాఘవి రామ – రవి। జయమ లాలిత నామా మాం॥ పాలయ॥

7 త్యాగరాజనుత చరణ, నిత్యా గరాజ ధర సుగుణ, మాం॥ పాలయ।

తాత్పర్యము :

ఓ రఘువీరా। కరుణా కరా! రాజకుమార! చంద్రముఖా! వాలి సంహారా! చంద్రుని వంటి ఆహ్లాదకరమైన శరీరము గలవాడా! గజమును రక్షించునపుడు మకరమును సంహరించినవాడా! దేనిమీదను సంగములేనివాడా! రాక్షసులకు దూరమయిన వాడా! (అనగా రాక్షసులు భయము చేత రాముని దగ్గరించరు అని భావము) యుద్ధమందు మకరాక్షుని సంహరించినవాడా! శూరుడా! దశరథుని కులమునకు రక్షణ మయిన వాడా! సంపదల నిచ్చువాడా! సముద్రుని మదము నణచిన వాడా! చెడు మనస్సుగల వారికి భయంకరుడా! దేవతలను పండితులను ఆనంద పరచువాడా! జయవిజయుల పాపమును తీర్చిన వాడా! యముడు ఉచ్చరించు పేరుగల వాడా! త్యాగరాజుచే నుతింప బడువాడా! నిత్యుడా! కొండ నెత్తినవాడా! సుగుణములు కలవాడా! రమ్ము నన్ను రక్షింపుము అని ప్రార్థన, ఇది సంస్కృత కృతి.

353. కాంతామణి = ఆది

ప॥ పాలింతువో। పాలింపవో॥
బాగైన పల్కు పల్కినను॥ పాలింతువో॥

అ॥ ఏలాగు నాడు కొన్ననేర
మెంచ పనిలేదు – నాపైని॥ పాలింతువో॥

చ॥ పరమార్థమగు– నిజ మార్గమును
వరదేశికుం – డానతీయగ
పరిపూర్ణమగు భక్తి – మార్గమేయని
భావించిన – త్యాగరాజుని॥ పాలింతువో॥

తాత్పర్యము :

రామా ! నన్ను రక్షించెదవో రక్షింపవో? తెలియకున్నది. నేను మంచి పలుకులే పలుకుచున్నాను. అయినను రక్షింతువో రక్షింపవో? నేను ఏవిధముగా పలికినను నీవు నేరమెంచే పనిలేదు. పరమార్థమయిన నిజమార్గము నీభక్తియే అని గురు వుపదేశించిన మార్గములో నడచు చున్నాను. కనుక నీకు నేరమెంచ పనిలేదు. నిన్ను నిష్మరములాడినా నేర మెంచపనిలేదు.

విశేషము = భగవంతుని నిత్యమును స్మరించుట వగచేతనైనా పగచేతనైనా అది సద్గతిని కలిగిస్తుంది. మరియు 'కామోత్కంఠత గోపికల్ భయమునన్ కంసుండు వైరక్రియా సామగ్రిన్ శిశుపాల ముఖ్యులు' అనినట్లు కామముతో గోపికలు భయముతో కంసుడు వైరముతో శిశుపాలుడు నిన్ను స్మరించి సద్గతి పొందినారు. అందుచేత ఏలాగు నాడు కొన్న నేరమెంచ పనిలేదు' అని అయ్యగారన్నారు.

354. పున్నాగ వరాళి - చాపు (దివ్య నామము)

ప॥ పాహి కల్యాణ సుందర రామ మాం
పాహి కల్యాణ సుందర రామ॥ పాహి॥

చ॥ చదివిన వాడను గాను రామ
ఇది బుద్ధి యనుచును దెలియలేను॥ పాహి॥

2 భజియించుటకు బుద్ధి లేక, రామ
బతిమాలి తిరిగి తిందాక॥ పాహి॥

3 దిన దిన ముదరము కొరకై రామ
ధనికుల గాచితీవరకై॥ పాహి॥

4 ఆలుసుతుల పైని ప్రేమ, నీప
దాలనుంచ నైతి రామ॥ పాహి॥

5 సంసార సుఖము సతమని, రామ
సార మెఱుగ మరచితిని॥ పాహి॥

6 విషయాదులను నేనురోయ, లేక
విర్రవీగి మోసమాయ॥ పాహి॥

7 నేర మెంతో చేసినాను, ఏమి
నేరమనుచు వేడినాను॥ పాహి॥

8 శుకసన్నుత, నన్ను గన్న – తండ్రి
యొకపారి శరణను కొన్న॥ పాహి॥

9 తమ్మి కన్నుల రఘువీర, నిను
నమ్మిన నన్నేలు కోరా॥ పాహి॥

10 నిను నమ్ము వారిదే మేలు, రామ
నీ పాద సేవ వెయివేలు॥ పాహి॥

11 సాకేత రామ నా మీద, ప్రేమ
లేకుండుటకు మరియాదా? పాహి॥

12 శరణ్య సాకేత రాజ, రామ
పరిపాలిత త్యాగరాజ॥ పాహి॥

తాత్పర్యము :

ఓ కల్యాణ సుందర రామా! నీవు పాలించుము. నేను చదువలేదు. జ్ఞానిని గాను. నిను భజింప లేక బ్రతిమాలు చున్నాను. ఇంత వరకు పొట్టపోసుకొనుటకే తిరిగితిని. అపరాధిని, నా ప్రేమలేదా? ఇది తాత్పర్యసారము.

355. సౌరాష్ట్ర - రూపకం (దివ్యనామము)

ప॥ పాహిమాం హరే మహాను – భావ రాఘవ॥

చ॥ పాహిరామ యను రేయు – పగలు గొలిచితి॥
పాహిరామ నీవను సం–పదను వలచితి॥ పాహి॥

2 పాహి రామ యనుచు బారి – పారికోరితి
పాహి రామ నామముతో – ఫలము లేరితి॥ పాహి॥

3 పాహి రామ యనుచు భువిని – బాగబుట్టితి
పాహి రామ యనుచు గట్టి – పట్టు పట్టితి॥ పాహి॥

4 పాహి రామ యనుచు నీదు – పదము నమ్మితి
పాహిరామ యనుచు మనసు – బాగు గ్రమ్మితి॥ పాహి॥

5 పాహిరామ యనుచు నీదు – పదము బాడితి
పాహి రామ యనుచు పరమ – పదము వేడితి॥ పాహి॥

6 పాహిరామ యనుచు ధ్యాన – పరుడ నైతిని
పాహిత్యాగరాజ వినుత – భక్తుడైతిని ॥ పాహి॥

విశేషము = ఇందు ప్రతి పంక్తియు 'పాహిరామ' అనియే ఉన్నది. రక్షించు రామా! అని అర్థము. తక్కిన తాత్పర్యమంతయు చాల సులభము.

356. వసంతవరాళి = రూపకం

ప॥ పాహిరామ దూత! జగ। త్రాణ కుమార! మాం॥ పాహి॥

అ॥ వాహినీశ తరణ ! దశ। వదన సూను తను హరణ॥ పాహి॥

చ॥ ఘోరాసుర వారాం నిధి। కుంభతనయ! కృతకార్య॥ పాహి॥

2 పారిజాత తరుని వాస! – పవన తుల్య వేగ! పాహి॥

3 పాద విజిత దుష్ట గ్రహ! – పతిత లోక పావన॥ పాహి॥

4 వేద శాస్త్రనిపుణ వర్య! విమల చిత్త! సతతం మాం॥ పాహి॥

5 తరుణారుణ వదనాబ్జ! – తపన కోటి సంకాశ॥ పాహి॥

6 కరధృత రఘువర చరణ! – కలిమాలాభ్రగంధవహ॥ పాహి॥

7 కరుణారస పరిపూర్ణ ! – కాంచనాద్రి సమదేహ॥
పాహి॥

8 పరమ భాగవత వరేణ్య! – వరద! త్యాగరాజ వినుత॥ పాహి॥

తాత్పర్యము :

ఇది హనుమంతునిపై సంస్కృత కృతి. అన్నియు సంబోధనములే, పాహి = రక్షించుము. రామదూతా! వాయుపుత్రా! సముద్రమును దాటినవాడా! అక్షుని వధించిన వాడా! ఘోర రాక్షసులను పీల్చినవాడా! రామ కార్యనిర్వాహకుడా! పారిజాత

వృక్షమూల మున నున్నవాడా! గాలితో సమానమగు వేగము గలవాడా! దుష్ట గ్రహములను కాలితో పోగొట్టువాడా! పతిత పావనా! వేద శాస్త్రముల నేర్పరీ ! నిర్మల చిత్తుడా! లేత సూర్యుని వంటి ముఖము గలవాడా! కోటి సూర్యులతో సమానమగు కాంతి గలవాడా! రాముని పాదములను బట్టినవాడా! కలియుగపు చెడుగులను విసరి వేయువాయు దేవుడా! దయగల వాడా! మేరు పర్వతము వంటి దేహముగల వాడా! పరమ భాగవతులలో శ్రేష్ఠమైన వాడా! వరముల నిచ్చువాడా! త్యాగరాజనుతా! మాం= నన్ను, పాహి = రక్షించుము, అని హనుమ వైభవము వర్ణింప బడినది.

357. ఖరహరప్రియ = త్రిశ్రలఘువు - (దివ్య నామము)

ప॥ పాహి రామ రామ యనుచు। భజన సేయవే॥ పాహి॥

చ॥ కనికరంబు గల్గి సీత – కాంతుని గనగా
మనసు రంజిల్ల బల్కె – మదన జనకుడు॥ పాహి॥

2 వలువ దిద్ది సౌమిత్రి – వలచి నిల్వగా
కలువ రేకులను గేరు – కనుల జూచెను॥ పాహి॥

3 భరతుడా వేళ కరగి – కరగి నిల్వగా
కరము బట్టి కౌగలించె – వరదు డప్పుడు ॥ పాహి॥

4 చండ శత్రుఘ్ను డపుడ – ఖండ వృత్తితో
నుండ సంత సిల్లెకో – దండ రాముడు॥ పాహి॥

5 మనసు దెలిసి కలసి హను – మంతుడుండగా
చనవు మాట లాడు చుండె – సార్వభౌముడు॥ పాహి॥

6 వీరి కరుణ కలిగి ఎపుడు – వెలసి యుందునో
సారమైన భక్తిచే – సన్ను తింతునో॥ పాహి॥

7 ధర్మార్థ కామ మోక్ష – దాన మేలనే
మర్మ మెరుగ లేని ఇంద్ర – శర్మ మేలనే? పాహి॥

8 బాగ కరుణ జేసి ఎపుడు – భవ్య మొసగునో
త్యాగరాజు చేయి బట్టే – దయను జూతునో॥ పాహి॥

తాత్పర్యము :

ఇది ఆత్మబోధ. ఓ మనసా! పాహిరామ రామ అని భజన చెయ్యి. భక్తులపై దయ కల్గి సీత రాముని చూచినది. అప్పుడు రాముడు సీతతో మనసు రంజిల్లు మాట్లాడినాడు. లక్ష్మణుడు వస్త్రము సవరించి ప్రేమతో నిలువగా వానిని కలువ రేకుల వంటి కనులతో చూచినాడు. అట్లే భరతుడు నిల్వగా రాముడు కొగలించినాడు. శత్రుఘ్నుని చూచి ఉప్పొంగి నాడు. మనసు తెలిసిన హనుమంతునితో చనవుగా మాట లాడును. ఇందరి కరుణ నాకు కలిగి దిట్టమయిన భక్తితో నేను రాముని ఎప్పుడు సన్నుతించెదనో? ఇంతకన్న నాకు ధర్మార్థ కామ మోక్షము లక్కరలేదు. అసలు సిలయిన రామ సేవా మర్మమును తెలియని దేవేంద్ర పదవి నాకక్కరలేదు. అని త్యాగయ్యగారు తమ ఆశను వ్యక్తము చేసినారు.

విశేషము = పరాశర భట్టరను వారు రామానుజుల ప్రశిష్యులు. వారు శ్రీరంగ మందు రంగని సేవించుచు తన్మయులై ' రంగా దేహాంతమందు నాకు వైకుంఠమే వచ్చినచో, అచ్చట వైకుంఠ నాథుని యందు నీ సౌందర్యము లేనిచో నేను వైకుంఠమును వదలి ఇచటికే వచ్చెదను!! అన్నారు. అయ్యగారి అధ్యవసాయమును ఇట్టిదే.

358. కాపి = చాపు (దివ్యనామము)

ప॥	పాహి మాం శ్రీరామ చంద్ర ॥	పాహి॥
చ॥	అక్కరతో పాదములకు – మ్రొక్కితి ఏలపరాకు॥	పాహి॥
2	దిక్కు నీవైయుండగాను – గ్రక్కున వేడుకొన్నాను॥	పాహి॥
3	మక్కువతో రామ నీవు – ఎక్కువ జేసి నను బ్రోవు॥	పాహి॥
4	చక్కని నీ ముద్దు మోము – నొక్కసారి కనిపింపుము॥	పాహి॥
5	అన్నిటను నెలకొన్న – నిన్ను మించు వారెవరన్న॥	పాహి॥
6	పన్నగ భూషణుడు చాల – నిన్ను గొనియాడు నేవేళ॥	పాహి॥
7	చిన్న నాడే యనుసరించు – కొన్న వాడనను బాలించు॥	పాహి॥
8	మన్నన జేసేలవయ్యా – పన్నరక్షక రామయ్య॥	పాహి॥
9	పన్నుగ శ్రీత్యాగరాజ – సన్నుత భాస్కరతేజ॥	పాహి॥

తాత్పర్యము :

నన్ను రక్షించు రామచంద్ర. నేను అక్కరతో నీకు మ్రొక్కేను. పరాకేల? నీవే దిక్కని వేడుకొన్నాను. నన్ను ఎక్కువచేసి రక్షించు. నీ మోము చూపించు. విశ్వవ్యాపకుడ వయిన నీసాటి ఎవరు? శివుడు నిత్యమును నీ మంత్రము జపించును. చిన్ననాటి నుంచి నీ భక్తిని అవలంబించి యున్నాను. ఆపన్నరక్షకా! రక్షించు॥ అని అయ్యగారి ప్రార్థనము.

359. యదుకుల కాంభోజి - త్రిశ్రలఘువు (దివ్యనామము)

ప॥ పాహి రామ- చంద్రరాఘ-వా- హరే మాం
పాహి రామ చంద్ర రాఘవా॥ పాహి॥

చ॥ జనకసుతా రమణ కావవే గతినీవు
కనుక నన్ను వేగ బ్రోవవే॥ పాహి॥

2 ఎంత వేడు కొన్న నీకునా, ఇను
మంత దయ లేక యుండనా॥ పాహి॥

3 కష్టములను దీర్పు మంటిని, నీవునా
కిష్టదైవ మనుకొంటిని॥ పాహి॥

4 శోధనలకు నేను పాత్రమా । రామ -య
శోధనులకు నుతి పాత్రమా॥ పాహి॥

5 ఆటలనుచు దోచి యున్నదో లేకనాల
లాటలిఖిత మర్మమెట్టిదో॥ పాహి॥

6 అంబుజాక్షవేగ జూడరా, నీకటా
క్షంబు లేని జన్మ మేలరా॥ పాహి॥

7 నీవు నన్ను జూడ లేవేరా కన్న కన్న
తావులనే వేడ జాలరా॥ పాహి॥

8 నన్ను బ్రోచువారు లేరురా, రామనీ
కన్న దైవ మెందులేదురా॥ పాహి॥

9 రాజరాజ పూజిత ప్రభో, హరేత్యాగ
రాజరాజ - రాఘవ ప్రభో॥ పాహి॥

తాత్పర్యము :

రాఘవా! హరే! రక్షించు నా గతినీవు. ఎంతో వేడుకొంటున్నా ఇసుమంత దయ చూపకుండుట న్యాయమా? కష్టములను తీర్చు ఇష్టదైవము నీవన్నాను. పరీక్షించుటకు నేనే దొరికితినా? బాగా యశస్సు కలిగిన నీకు ఇంకా నాపొగడ్తలు కావలెనా! నా కష్టములను తీర్చక పోవుట నీకు ఆటలవలె నున్నదా? లేక నా నుదుటి వ్రాత ఇంతేనా? అని అయ్యగారి అంగలార్పు.

360. వరాళి - ఆది (దివ్యనామము)

ప॥ పాహిరమారమణ మాం। పాహి సద్గుణ గణ హరే రామ॥ పాహి॥

చ॥ చింతమాననీదు, ఇసు। మంత కరుణ రాదు హరేరామ॥ పాహి॥

2 ఎంతని సైరింతు నఎన్నెంతని వేగింతు హరే రామ॥ పాహి॥

3 అహహ చిలుక కూన బ్ర హ్మోన్మ్రమునకు దగునా హరేరామ॥ పాహి॥

4 చేతి మల్లెపూవు గుం। డ్రాతి కోర్వబోదు - హరే రామ॥ పాహి॥

5 దోసపండు కెట్టు రామ। తోచు నినుప కట్టు హరేరామ॥ పాహి॥

6 దేవ దేవ వెన్న, కత్తి। దెబ్బ కోర్చు కొన్న, హరేరామ॥ పాహి॥

7 తల్లి దండ్రి బ్రోవ, కుంటే। తనయునకేత్రోవ హరేరామ॥ పాహి॥

8 రాజ వర్య శరణ, త్యాగ। రాజవినుత చరణ హరేరామ॥ పాహి॥

తాత్పర్యము :

ఓ రమారమణ! హరేరామ! నన్ను రక్షించుము. నామనస్సు నన్ను నీ చింత (ధ్యానము) మాననీయదు. నీ దయ రవ్వంతైనా రాదు. నన్ను నీవు వేధిస్తున్నావు. ఎంత అని ఓర్చుకొందును? చిలుక మీద బ్రహ్మోన్మ్రము వేయుచున్నావు. దోసపండుకు ఇనుప కట్టు కట్టుచున్నావు. వెన్నను కత్తితో కోయుచున్నావు. తల్లియు తండ్రియు నైన

నీవు నన్ను రక్షింపకుంటే నాకేది త్రోవ? అని అయ్యగారు పై ఉపమానములతో తనను రాముడు రక్షింప కుండుటను పోల్చినారు.

361. కాపి = ఆది

ప॥	పాహికల్యాణ రామ । పావన గుణరామ॥	పాహి॥
చ॥	నాజీవాధారము । నాశుభాకారము॥	పాహి॥
2	నా నోము ఫలము – నా మేను బలము॥	పాహి॥
3	నా వంశ ధనము । నా ఐదోతనము॥	పాహి॥
4	నా చిత్తానందము। నా సుఖ కందము॥	పాహి॥
5	నా మనోహరము। నాదు శృంగారము॥	పాహి॥
6	నా పాలిభాగ్యము। నాదు వైరాగ్యము॥	పాహి॥
7	నాదుజీవనము। నాదు యౌవనము॥	పాహి॥
8	ఆగమసారము। ఆశర దూరము॥	పాహి॥
9	ముల్లోకాధారము। ముత్యాల హారము॥	పాహి॥
10	దేవాది దైవము। దుర్జనా భావము॥	పాహి॥
11	పరమైన బ్రహ్మము। పాపేభ సింహము॥	పాహి॥
12	ఇది నిర్వికల్పము। ఈశ్వర జన్మము॥	పాహి॥
13	ఇది సర్వోన్నతము। ఇది మయాతీతము	పాహి॥
14	సాగర గుప్తము। త్యాగరాజాప్తము॥	పాహి॥

తాత్పర్యము :

ఓ కల్యాణ రామ నన్ను రక్షింపుము. నా నోముల పంట నీవే. నా శుభాకారము, నా జీవాధారము, నాదేహబలము, నా మూలధనము, నాముత్తైదువ తనము, నా ఆనందము, సుఖము, నా శృంగారము, నా భాగ్యము, నావైరాగ్యము, నా యౌవనము, అన్నియు నీవే అని అయ్యగారు రామునితో నివేదించినారు. సాగరగుప్తము అనగా రత్నము.

విశేషము = ఇందు నీవే అను పదము లేదు. ఆ పదమును అధ్యాహారము చేసుకొనవలెను. (అవసరమునకు లేని పదమును వేసుకొనుట). ఇక అయ్యగారు తన ఐదవతనమును రాముడే అన్నారు. రాముడు వరుడు, జీవుడయిన త్యాగయ్యగారు వధువు. రాముడు త్యాగయ్యగారి మెడకు కట్టిన భక్తియే మంగళ సూత్రము. ఆధ్యాత్మికముగా ఇట్టి ఉపమానములున్నవి. వైష్ణవుల శాస్త్రములో నారాయణాష్టాక్షర మంత్రము మంగళ సూత్రముగా రూపకము చేయబడినది.

362. వరాళి = ఆది (దివ్యనామము)

ప॥ పాహి పరమాత్మ సతతం మాం పాహి॥

చ॥ రామ సకల రిపు। భీమ మునిమనో
ధామ త్రిజగ దభి। రామ॥ పాహి॥

2 భాగ్యదాయకా। రోగ్య కరమువై
రాగ్య భక్త జన। యోగ్య॥ పాహి॥

3 రామ చంద్రనీ । నామ మందు నిజ
ప్రేమలేని బ్రతు। కేమి? పాహి॥

4 సంతతంబు తన। యంతరంబుననీ
చింత లేని వా। డెంత? పాహి॥

5 దొరక రాని నీ । చరణ భక్తియే
మరిన మానవు డ। సురుడె॥ పాహి॥

6 ఆరుశత్రువులను । దూరు జేసి నను
గారవించు వారు । లేరు॥ పాహి॥

7 మనసున నొకటి వచనమున వేరై
వినయములాడు కొని। నానా? పాహి॥

8 బాగుగాను శ్రీ । త్యాగరాజనుత
నాగరీక నను । వేగ॥ పాహి॥

తాత్పర్యము :

పరమాత్మ! నన్నెపుడును రక్షించుము. శత్రువులకు భీకరుడా! మునుల మనస్సుల నెల కొనువాడా! ముల్లోకములకును అభిరాముడా! ఆయురారోగ్య భాగ్యముల నిచ్చువాడా! వైరాగ్యము కలవాడా! భక్తులతో యోగము గలవాడా! నీ నామమందు ప్రేమలేనిది బ్రతుకే కాదు. నీ ధ్యానము లేని వాడెంత? దుర్లభమయిన రామభక్తిని మరచిన వాడు రాక్షసుడే. కామ క్రోధాలను దూరం చేసి నన్ను గౌరవించే వాడే లేదు. మనస్సులో ఒకటి మాటలో వేరొకటి కలిగి వినయ వచనము లాడినానా? రామా! లేదు. నను వేగపాహి అని అయ్యగారు తెనుగుతో సంస్కృత మయిన పాహికి ముడి పెట్టినారు. ఇదొక చమత్కారము.

363. సౌరాష్ట్ర = జంపె(దివ్యనామము)

ప॥	పాహిపాహి దీన బంధో మాం – పాహి పరానంద సింధో॥	పాహి॥
చ॥	తారకాసుర వైరి నుత రామ– తారక శుభకరచరిత॥	పాహి॥
2	బ్రహ్మరుద్రాది సభేశ అరీభ – సింహ ఆనన జిత భేశ॥	పాహి॥
3	శక్రారిజనక సంహరణ శంఖ। చక్రాది ధరాశ్రిత శరణ॥	పాహి॥
4	రాఘవాన్వయసుప్రదీప సుక। రాఘవనకుఠార రూప॥	పాహి॥॥
5	శరధర జగదాధార అఖిలా। శర శరదాశుగ ధీర॥	పాహి॥
6	కువలయ దళసమనేత్ర పాలిత। కువలయ దళితా మిత్ర॥	పాహి॥
7	కమలా హిత గుణ భరిత రామ। కమలా హిత ధర వినుత॥	పాహి॥
8	త్యాగరాజనుత చరణ ని। త్యాగరాజ ధర సుగుణ॥	పాహి॥॥

తాత్పర్యము :

ఇది సంస్కృత కృతి, అన్నియు సంబోధనములే. పాహి పాహి = రక్షించుము రక్షించుము. (ఇది అన్ని సంబోధనముల చివర చేర్చు కొనవలెను). ఓ దీన బంధువా! ఆనంద సముద్రుడా! కుమారస్వామిచే పొగడబడిన వాడా! సంసారమును తరింప జేసే శుభచరితము కలవాడా! బ్రహ్మ రుద్రాదుల సభయందు అగ్రగణ్యుడా! శత్రువులనెడు

ఏనుగులకు సింహమా? ముఖకాంతితో చంద్రుని జయించిన వాడా! శంఖ చక్రాదులను ధరించినవాడా! ఆశ్రిత రక్షకా! రఘువంశ దీపమా! పాపములనెడు అడవికి గొడ్డలి అయిన వాడా! శరములు ధరించిన వాడా! జగదాధారుడా! రాక్షసులనెడు మేఘములకు గాలి యైన వాడా। ధీరుడా! కలువ రేకులను బోలు కనుల వాడా! భూవలయమును పాలించినవాడా! శత్రువులను చీల్చిన వాడా! లక్ష్మీదేవికి హితమైన వాడా! గుణభరితుడా! చంద్రధరుడైన శివునిచే పొగడ బడినవాడా! త్యాగరాజనుత చరణ! నిత్యమైనవాడా! కొండ నెత్తిన వాడా! అని అర్థములు.

364. శంకరాభరణం = ఆది (దివ్యనామము)

ప॥ పాహి రామ చంద్ర – పాలిత సురేంద్ర॥
పరమ పావన సద్గుణ గణ సాంద్ర॥ పాహి॥

చ॥ నీరద నీల ము । నీంద్ర హృదయ
నారదసేవిత। సారస నయన॥ పాహి॥।

2 శ్రీకర రూప సు । ధాకర వదన
శోక నివారణ । సుందర రదన॥ పాహి॥

3 నిర్మల రూప। నిందిత మదన
శర్మద సకలే । శార్ణవ సదన॥ పాహి॥

4 రాజరాజనుత। రాఘవ త్యాగ
రాజహృదాలయ । రక్షిత నాగ॥ పాహి॥

తాత్పర్యము :

ఇదియు సంస్కృతమే. సంబోధనములే. సంబోధనలు విశేషణములు అగుటచేత సాధారణము. ఎన్నో కృతులలోనివి అన్నియు పునరుక్తము లగుచుండును.

రామచంద్రా! ఇంద్రుని రక్షించిన వాడా! పరమ పావనుడా! సద్గుణ గణములచే దట్టమగు వాడా! మేఘ శ్యామలా! మునులకు హృదయమయిన వాడా! నారదునిచే సేవింప బడిన వాడా! పద్మ నేత్రా! శ్రీకరమగు రూపము కలవాడా! చంద్రవదనా!

శోకము నివారించు వాడా! అందమయిన పలువరుస గలవాడా! నిర్మల రూపడా! మన్మధుని మించిన వాడా! సుఖము నిచ్చువాడా! అన్నిటికిని అధిపతి అయిన వాడా! సముద్రమున నుండు వాడా! రాజరాజుల చేత లేక కుబేరుని చేత నుతింప బడినవాడా! (తనకు పగవాడైన రావణుని సంహరించుట చేత), రాఘవా! త్యాగరాజ హృదయమున నుండువాడా! గజేంద్రుని రక్షించిన వాడా! నన్ను రక్షించుము. అని.

365. శూలిని = ఆది

ప॥ ప్రాణనాథ బిరాన బ్రోవ వే॥

అ॥ వేణుగానము చే – పది యారు
వేల గోపికల – పాలింప లేదా॥ ప్రాణ॥

చ॥ వెన్న మీగడలు – వేడ్కమీరగను
కన్నపిన్నవారి – కడుపు నించి
తిన్నగా వెలయు – దివ్య రూపమా
చిన్ని కృష్ణ దయ – చేసి త్యాగరాజ॥ ప్రాణ॥

తాత్పర్యము :

ఒక్కసారి అయ్యగారి హృదయంలో చిన్ని కృష్ణుడు సాక్షాత్కరించినాడు. నా ప్రాణనాథా! నన్ను వేగమే రక్షించు. వేణు గానముచేత పదియారువేల గోపికలను రక్షించ లేదా? అట్లే నన్ను రక్షించు. నీతో ఉన్న పిల్లవాండ్ర కడుపులు వెన్న మీగడలతో నింపిన వాడవు. దివ్య రూపముతో ఈ లోకమున వెలసిన వాడవు. నాకు ప్రాణనాథుడవు. నన్ను రక్షించుము. అని అయ్యగారు చిన్ని కృష్ణుని వేడుకొన్నారు.

366. స్వరావళి = జంపె

ప॥ పారబ్ధ మిట్లుండగా నొరుల నన
బనిలేదు నీవుండగా॥ ప్రారబ్ధ॥

చ॥ బాలగుణశీల జన। పాల వరద కృపాల
వాల కాలాతీత । శూల ధరవినుత నా॥ ప్రారబ్ధ॥

2 ఉపకారి నేనైతే । అపకారు లయ్యేరు
కృప జూచితే మిగుల । నెపము లెంచేరయ్య॥
చపల చిత్తులు భక్త। వేషులైనను జూచి
శత్రులయ్యేరు శ్రీ। త్యాగరాజాప్త నా॥ ప్రారబ్ధ॥

తాత్పర్యము :

ఓ బాలా! సుగుణములే శీలముగా కలవాడా! జనులను రక్షించి వరము లిచ్చువాడా! కృపకు పాదు అయిన వాడా! కాలమునకు అతీతుడా! శివునిచే నుతింప బడిన వాడా! నే నొకరికి ఉపకారము చేస్తే వారు నాకపకారము తలపెట్టు చున్నారు. నేను దయదలచితే వారు నాపై నెపములు వేయుచున్నారు. చపల చిత్తులు కొందరు భక్త వేషము వేసుకొని నన్ను చూచి నాకు శత్రువులగుచున్నారు. నా ప్రారబ్ధ మీ విధముగా నుంటే ఒరులను అననేల? అని అయ్యగారు ఒక తాత్కాలికపు బాధను నివేదించు కొన్నారు.

367. ఘంట = ఆది (నౌకాచరితము)

వ॥ పెరుగు పాలు భుజియించి తనువులు
పెంచిన దెల్లనిందుకా॥ పెరుగు॥

అ॥ నిరవధి సుఖదాయక మావయసు
నీటను గలయుటందు కా॥ పెరుగు॥

చ॥ అత్తమామలతో నీకై మేమెదు
రాడిన దెల్ల యిందుకా॥
సత్తగలిగి యికనైన నుందుమని
సంతసిల్లిన దిందుకా?॥ పెరుగు॥

2 ఆసదీర నీ సేవ వలయునని
అరసిన దెల్ల నిందుకా?

పాసి యుండ నేరక పెద్దలచే
బాముల జెందిన దిందుకా? పెరుగు॥

3 స్నాన పానములు జేయువేళ నిను
ధ్యానము జేసిన దిందుకా?
మేను నీ సామ్మి జేయుటకై
మే మల్లాడిన దిందుకా? పెరుగు॥

4 తలిరు బోణులై యమునా నదిలో
తల్లడిల్లు టందుకా?
వలచుచు తొలి జన్మపు రామునిచే
వరములు బడసిన దిందుకా? పెరుగు॥

5 కోటి జన్మములు తపములు జేసి
కోరిన దెల్ల నిందుకా?
సాటిలేని నీ లీలలు మనసున
సైరించు యున్న దిందుకా? పెరుగు॥

6 ఆగమనిగమపురాణ చారుడని
అనుసరించిన దిందుకా?
త్యాగరాజ నుత – తారక నామనీ
తత్త్వము తెలసిన దిందుకా? పెరుగు॥

తాత్పర్యము :

కృష్ణుడు, గోపికలు యమునానదిలో నౌకా విహారం బయలు దేరినారు. నౌక నదిలో వెళ్లుచున్నది. కృష్ణుడు తమకు వశమైనాడని గోపికలకు గర్వము హెచ్చినది. అప్పుడు కృష్ణ సంకల్పము చేత మబ్బులు గాలి వాన వచ్చి యమున అల్లకల్లోలమైనది. నౌక మునిగిపోవుటకు సిద్ధమైనది. అప్పుడు గోపికలు కృష్ణునితో మొర పెట్టుచున్నారు.

అపరిమిత సౌఖ్య ప్రదుడగు ఓ కృష్ణా! మేముపాలతో పెరుగుతో పెంచిన మా శరీరములకు ఇదా? ఫలము, మాయౌవనమునకు ఇదా ఫలము? నిన్ను కలియుటకు అత్తమామలతో ఎదురాడి వారు పెట్టిన బాధలను భరించినందుకు మాకిది ఫలమా? ఆశదీరేటట్లు నీతో సుఖ మనుభవింప వలెనని భావించిన మాకిది ఫలమా? స్నానపాన

భోజన సమయ ములందును నిన్నే మేము ధ్యానించిన దిందుకా? మా శరీరములు నీ సొమ్ము చేయుటకు మే మల్లాడిన దిందుకా? తొలి జన్మలో రాముడు మా కిచ్చిన వరముల కిది ఫలమా? కోటి జన్మల మాతపస్సున కిది ఫలమా? వ్రేపల్లెలో నీవు మాపై ఎన్నో లీలలు చూపినావు. వాటి నన్నిటిని మనసార భరించాము. ఇందుకా? నీవు వేదాగమ సంచారి అయిన పరమ పురుషుడవని తెలిసి నిన్ననుసరించితిమి. నీ తత్త్వమును తెలుసుకొంటిమి. ఇందుకా? అన్నియు ఈ నాడు ఏటిలో కలిసి పోవుచున్నవి. కృష్ణా అని గోపికల పరిదేవనము.

విశేషము = నాలుగవ చరణపు వివరము. రామావతారమున అడవిలో ప్రవేశించినపుడు మునులు రాముని దివ్య సౌందర్యమును చూచి మోహించిరి. రాముడు దీని నెరిగి 'మును లారా! రాబోవు అవతారమున నేను కృష్ణుడ నగుదును. మీరు గోపికలగుదురు. అప్పుడు నా ఆలింగన సుఖము మీకు కలుగును'. అని మునులకు మనస్సులో వరమిచ్చినాడు. ఇప్పుడు గోపికలు దానిని స్మరించుకొని బాధపడుచున్నారు. పైన చెప్పబడిన విషయము 'రామ రహస్యోపనిషత్తు' నందున్నది.

368. తోడి = చాపు

ప॥ పొద్దు పొయ్యేని శ్రీరాముని
వూని భజించవే మనసా॥ పొద్దు॥

అ॥ నిద్దుర చేత గొన్నాళ్లు విషయ
బుద్ధుల చేత గొన్నాళ్లు మనసా॥ పొద్దు॥

చ॥ పొద్దున లేచి త్రి – తాపములను నరుల
పొగడి పొగడి కొ–న్నాళ్లు పట్టి
ఎద్దురీతి కన్న – తావున భుజియించి
ఏమి తెలియక కొ–న్నాళ్లు
ముద్దుగ దోచే భవసాగరమున
మునిగి దేలుచు గొన్నాళ్లు
పద్దు మాలిన పామరజనులతో వెర్రి
పలుకు లాడుచు గొన్నాళ్లు ఓ మనసా॥ పొద్దు॥

2 ముదమున ధనతనయాగారముల జూచి
మదము చేత కొన్నాళ్లు అందు
చెదరిన యంత శోకార్ణవ గతుడై
జాలి చెందుటయు గొన్నాళ్లు
ఎదటి పచ్చ జూచి తాళలేక తా
నిలను తిరుగుట కొన్నాళ్లు
ముది మది తప్పిన వృద్ధుతనమున
ముందు వెనుక తెలియ కనె కొన్నాళ్లు॥ పొద్దు॥

3 యాగాది కర్మములను సేయవలెనని
అలసట చేత కొన్నాళ్లు అందు
రాగలోభములతో నపరాధముల జేసి
రాజు సమున గొన్నాళ్లు
బాగుగ నామకీర్తనలు సేయుటె
భాగ్యమనక కొన్నాళ్లు
త్యాగరాజనుతుడైన శ్రీరాముని
తత్త్వము తెలియకనే కొనాళ్లు॥ పొద్దు॥

తాత్పర్యము :

ఓ మనసా! ఊరకే వృథాకాల క్షేప మవుచున్నది. అట్లు చేయక పట్టుదలతో శ్రీరాముని భజించు. ఆయుర్దాయములో నిద్దుర చేత సగము ప్రొద్దు, నిదుర లేచిన తరువాత తాపత్రయములతో దాతలయిన మనుష్యులను పొగుడుటతో కొంత కాలము పోవుచున్నది. చూచిన తావులలో ఎద్దువలె పట్టి భుజించుచు అజ్ఞానముతో కొన్నాళ్లు, ముద్దుగా కనిపించే సంసార సాగరములో మునిగి తేలుటతో కొంతకాలము, పనికి మాలిన పామర జనులతో వెర్రివెర్రి మాటలు మాట్లాడుచు కొంత కాలము, తన ధనమును సంతానమును ఇల్లను చూచుకొన్న మదముతో కొన్నాళ్లు, అవి రుణము తీరి దూరమై పోగానే ఏడుపుతో కొన్నాళ్లు, ఎదటివారి బాగును ఓర్వలేక కుమిలి పోవుటతో కొన్నాళ్లు, ఇవి కాక యజ్ఞాలు చెయ్యవలెనని సంకల్పించి అలసటపడి రాగలోభాలతో యజ్ఞమందు మంత్ర తంత్ర క్రియా భక్తిలోపములచే కర్మభ్రష్టుడయి కొన్నాళ్లు, రామనామ కీర్తన భాగ్యము తెలియక, రామతత్త్వము తెలియక కొన్నాళ్లు కాలమంతయు వృథా అయి మొత్తము జీవితమంతయు వృథా అయిపోయే ఆపద ఉన్నది కనుక తెలివి తెచ్చుకొని రాముని భజించుము అని అయ్యగారి ప్రబోధము.

369. ఝంకార ధ్వని = ఆది

ప॥ ఫణిపతి శాయీ మాంపాతు
పాలితాబ్ధి పాయీ॥ ఫణి॥

అ॥ మణిమయ మకుట విరాజమనో
మన్మథకోటి సమానః ॥ ఫణి॥

చ॥ గజవరగమనః కమనీయానన
సుజన గణావన సుందర వదనః ॥
గజముఖ వినుతః కరుణాకర శ్రీ
రజనయన త్యాగరాజ హృత్సదనః ॥ ఫణిపతి॥

తాత్పర్యము :

ఇది సంస్కృత కృతి. ప్రతి పదార్థము వ్రాయబడుచున్నది. ఫణి పతిశాయీ = ఆదిశేషు నిపై పవళించువాడు, మాం = నన్ను, పాతు = రక్షించుగాక. పాలితాబ్ధి పాయీ= అగస్త్యుని రక్షించిన వాడును, మణిమయ మకుట విరాజ మానః = మణికిరీటముతో ప్రకాశించువాడును, మన్మథ కోటి సమానః = కోటి మన్మథులతో సమానమయిన వాడును, గజ వరగమనః = ఏనుగు వంటి నడక గలవాడును, కమనీయాననః = అందమగు ముఖము గలవాడును, సుజనగణావనః = సుజనులను రక్షించువాడును, గజముఖవినుతః = గణపతిచే పొగడబడిన వాడును, కరుణా కరః = దయకుస్థానమయిన వాడును, శరజనయనః = పద్మనేత్రడును, త్యాగరాజ హృత్సదనః = త్యాగరాజుని హృదయమందుండు వాడును అయి ఫణిపతి శాయి = ఫణిపతి శాయి నన్ను రక్షించును గాక అని మొదటి వాక్యముతో చేర్చుకొనవలెను.

విశేషము = ఇందు ' అగస్త్యుని రక్షించిన వాడు' అనే దాని వివరము. వన వాసమందు రాముడు సీతా లక్ష్మణులతో అగస్త్యాశ్రమమునకు వెళ్లి ఆయన ఆతిథ్యమును స్వీకరించెను. ఇది అగస్త్యుని రక్షించుట అని చెప్పవచ్చును. లేక ఇంకొక కథ యున్నది. అగస్త్యుడు ద్రావిడము అను భాషను సృష్టించెను. అది విశ్వకర్మ శాపము చే పిశాచ భాష అయినది. దానిచే అగస్త్యుడు వెయ్యేండ్లు నారాయణుని గూర్చి తపస్సు చేసెను. నారాయణుడు ప్రత్యక్ష మయ్యెను. అగస్త్యుడు తన భాషకు వేదముతో సమాన ప్రతిపత్తి కావలెనని కోరెను. నారాయణుడు తథాస్తు అనెను. కాలక్రమమున స్వామి సంకల్పముచే

పన్నిద్దరు ఆళ్వారులు అవతరించి ద్రావిడ బాషయందు నాలుగు వేల పాశురములను రచించిరి. తదాది శ్రీరంగాది పుణ్య క్షేత్రముల యందే కాక అన్ని రాష్ట్రముల యందును వైష్ణవాలయముల యందు ఆళ్వారుల పాశురములు వేదముతో సమానముగా అధ్యయనము చేయబడుచున్నవి. ఈ కథ యొక్క అంకురములు భవిష్య త్పురాణము నందు, పూర్తి వివరము నారాయణ ప్రోక్తమయిన పాంచరాత్రాగమమునందును, కలవు. ఇది అగస్త్యుని రక్షించిన విధము.

370. హంసనాదం = ఆది

ప॥ బంటు రీతి కొలు – వియ్యవయ్య రామ॥ బంటు॥

అ॥ తుంట వింటి వాని – మొదలైన మదా
దుల బట్టి నేల – గూల జేయు నిజ॥ బంటు॥

చ॥ రోమాంచ మనే – ఘన కంచుకము
రామ భక్తి యనే – ముద్ర బిళ్ల యును
రామ నామ మనే – వర ఖడ్గ మివి
రాజిల్లు నయ్య– త్యాగరాజునికి॥ బంటు॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు రాముని కొలువులో ఒక యుద్ధ భటుని కొలు విమ్మని కోరుచున్నారు. ఆ భటునకు కావలసిన పరికరములు యోగ్యతలు తనకు కలవని చెప్పుచున్నారు. కామ క్రోధాదులయిన అంతశ్శత్రువులను కొట్టి నేల కూల్చే శక్తి నాకున్నది. అంతేకాక నీ స్మరణ చేత నాకు పులకాంకురము కలుగుతుంది. అదే నాకు కవచము. రామభక్తి అనే ముద్ర బిళ్ల యున్నది. (ఇది రాముడంగీకరించుటకు యోగ్యతా పత్రము). తరువాత రామనామ మనే ఖడ్గ మున్నది. ఈ సామగ్రితో నేను నీ శత్రువులను కూల్చగలను. కనుక బంటు రీతిగా కొలువు ఇమ్ము. అని త్యాగయ్యగారి దరఖాస్తు ఫారము

371.సావేరి = రూపకం

ప॥ బలము కులము ఏలరామ। భక్తి కారణము
వెలయు సకల సిద్ధులెల్ల। వెంట వచ్చుగాని మేను॥ బలము॥

చ॥ నీట కాకి మీను మునుగ। నిరత ముదయ స్నానమా?
తేట కనులుకొంగ గూర్చు। దేవదేవ ధ్యానమా॥ బలము॥

2 పత్రములను మేయు మేక। బలమైన యు పాసమా?
చిత్ర పక్షులెగయ సూర్య। చంద్రులతో సామ్యమా? బలము॥

3 గుహల వేషకోటులుంటే। గుణము కల్గు మౌనులా
గహనమునను కోతులుంటే। ఘనమౌవన వాసమా? బలము॥

4 జంగమములు పలుకకుంటే। సంగతిగా మౌనులా
అంగముమయ్యని బాలురు। అపుడు దిగంబరులా॥ బలము॥

5 వలచు త్యాగరాజ వరదు। వరభక్తులు సేయుభక్తి
చెలగు సకల జనుల కెల్ల। చెల్లిన కాసాను గా॥ బలము॥

తాత్పర్యము :

శరీరము శరీరబలము, కులము ఇవి ఏవియు రక్షించవు. రక్షించేది భక్తి యొక్కటే. నీటిలో కాకి మునుగుతుంది. అది కర్మిష్ఠులు చేసే ప్రాతఃస్నాన మవుతుందా? కొంగ కనులు మూయును. అది దేవ ధ్యాన మవుతుందా? మేక ఆకులు తింటుంది. అది ఉపవాస మవుతుందా? పక్షులు ఆకాశమున ఎగురును. అది సూర్యచంద్రుల గమన మవుతుందా? కపట వేషధరులగు బైరాగులు గుహలలో నుంటారు. వారు మునులగుదురా? అడవిలో కోతులుండును. అది వానవాస మగునా? స్థావర పదార్థములు మాట్లాడవు. అది మౌనవ్రత మగునా? బట్టకట్టని చిన్న పిల్లలు దిగంబరు లనబడుదురా? ఇవి ఏమియు అవికావు. అట్లే కులము బలము వంటివి కులము కాదు బలముకాదు. రామభక్తియే కులము, బలము. అని అయ్యగారు చక్కని ఉపమానములతో భక్తి యొక్క ప్రశక్తిని చెప్పినారు.

విశేషము = నమ్మాళ్వారు 'కులంతరుం శెల్వం తరుం' = భక్తియే కులమును సంపదను ఇచ్చును' అని చెప్పిరి. ఇదియునట్టిదే.

372. చంద్రజ్యోతి = ఆది

ప॥ బాగా యెనయ్య నీ మాయ లెంతో॥
బ్రహ్మకైన గొనియాడ తరమా॥ బాగాయె॥

అ॥ ఈ గారడము నొనరించుచును
నే గాదను చు – బల్కే దియును॥ బాగాయె॥

చ॥ అలనాడు కౌర–వుల నణచమన
అలరి దోస మనే – నరుని జూచి పాప
ఫలము నీకు తనకు లేదని చక్కగ
పాలింపలేదా – త్యాగరాజ నుత॥ బాగాయె॥

తాత్పర్యము :

రామా! నీ మాయలు చాలా బాగున్నవయ్యా. (ఇది ఒక రకమయిన ఎకసక్కెపు ధోరణి). నీ మాయలు బ్రహ్మకైన కొనియాడతరముగాదు. ఈ మాయ చేయుచునే ఇది చేయునది కాదు అని చెప్పుదువు. ఆనాడు కౌరవులను వధించుట పాపమని భయపడిన అర్జునుని చూచి 'అర్జునా! కౌరవులను వధించు. ఇప్పటికే నా చేతిలో వాళ్లు చంపబడినారు. అందుచేత పాపఫలము నీకు అంటదు. నాకు అసలు ఏదీ అంటదు. అని బోధించి అర్జునుని రక్షించితివి కదా! ఆహా ఏమి నీ మాయ? అని ఆశ్చర్య ప్రకటనము.

373.రీతిగౌళ = ఆది

ప॥ బాలే బాలేందు భూషణి – భవరోగ శమని॥ బాలే॥

అ॥ ఫాలలోచని శ్రీధర్మసం వర్ధని సకలలోక జనని॥ బాలే॥

చ॥ శీలే నమరక్షింపను జా। గేలే పరమ పావని సుగుణ
జాలే నత జన పరిపాలన । లోలే కనక మయసుచేలే
కాలవైరికి ప్రియమైన ఇ। ల్లాలవై ఇందు వెలసినందుకు
శ్రీలలితే! నీ తనయుడ నినను కు। శాలుగా బిలువ వలెనమ్మా॥ బాలే॥

2 సారే సకలనిగమ వనసం । చారే చపలా కోటిని భశ
రీరే దేవతాంగనా పరి । వారే పామర జనదూరే

కీరవాణి శ్రీ పంచన దపురవి। హారివై వెలసినందు కిక
నేరకోటుల నెల్ల సహించి । గారవింప వలెనమ్మ శివే॥ బాలే॥

3 రామే! ప్రణ తార్తి హరాభి। రామే దేవ కామినీల
లామే! త్యాగరాజ భజన స। కామే దుర్జన గణభీమే
నామనసు నీ చరణముల సదా । నేమమున బూజసేయనీ శ్రీ
రామ సోదరివై వెలసిన శ్రీ । శ్యామలే – ధర్మ సంవర్ధనీ॥ బాలే॥

తాత్పర్యము :

ఇందులో సంబోధనము లన్నియు సంస్కృతము. వాక్యములు తెలుగు. పంచన దక్షేత్ర ధర్మ సంవర్ధని స్తుతి పరము. ఓ బాలా! అర్ధ చంద్రుడు భూషణమైన దానా! సంసార రోగమును శమింప జేయుదానా! నుదుటి కన్నుగలదానా! శ్రీ ధర్మ సంవర్ధనీ! అన్ని లోకములకు తల్లీ! శీలవంతురాలా! నన్ను రక్షించుటకు జాగు వద్దు. పరమ పావను రాలా! సుగుణముల ప్రోగయిన దానా! నమస్కరించువారిని పరిపాలించు దానా! బంగారు వలువ దానా! శివునకు ప్రియ భార్యవై ఈ క్షేత్రమందు వెలసి నందుకు నన్ను నీ పుత్రుడని పలుకుము. సారమయిన దానా! వేదముల యందు సంచరించుదానా! కోటి మెరపు తీగెల వంటి శరీరము గల దానా! దేవతా స్త్రీలు పరివారమయిన దానా! పామరుల కందని దానా! చిలుక పలుకుల దానా! పంచనంద క్షేత్రమున వెలసినందుకు నేను చేయు నేరములను సహించి గౌరవించ వలసినది. ఆనంద స్వరూపిణీ! భక్తుల ఆర్తి దీర్చు అందము గలదానా! దేవతా స్త్రీలలో మేటి అయినదానా! త్యాగరాజుచేయు పూజలయందు కోరిక గలదానా! దుర్జనులకు భయంకరు రాలైనదానా! నీ పాదములను సదానన్ను పూజింపనిమ్ము. రాముని సోదరివి. శ్యామలవు.

374. శంకరాభరణం = చాపు

ప॥ బుద్ధిరాదు బుద్ధి రాదు – పెద్దల సుద్దులు వినక॥ బుద్ధి॥

అ॥ బుద్ధిరాదు బుద్ధిరాదు – భూరివిద్యల నేర్చిన॥ బుద్ధి॥

చ॥ ధాన్య ధనముల చేత – ధర్మ మెంతయు జేసిన అ
నన్య చిత్తభక్తుల వా–గమృత పానము సేయక॥ బుద్ధి॥

2 మానక భాగవతాది రా। మాయణముల చదివిన
మానుషావతార చరిత। మర్మజ్ఞుల జతగూడక॥ బుద్ధి॥

3 యోగము లభ్యసించిన। భోగము లెంతో కల్గిన॥
త్యాగరాజనుతుడౌ రామ। దాసుల చెలిమి సేయక॥ బుద్ధి॥

తాత్పర్యము :

మానవునకు అనేకమున్నా బుద్ధి కలిగి యుండుట చాలా ముఖ్యము. పెద్దల మాటలు వినక బుద్ధిరాదు. ఎన్ని విద్యలు నేర్చినా, ధన ధాన్యములతో ఎన్ని ధర్మాలు చేసినా, రాముని యందు అనన్య భక్తి కలిగిన వారి మాటలు వినక బుద్ధిరాదు. భారత భాగవత రామాయణములు చదివినా విష్ణుని దేవుని అవతార రహస్యము లెరిగిన పెద్దల సేవ చేయక బుద్ధిరాదు. యోగము లభ్యసించినా, భోగములనుభవించినా రామభక్తుల స్నేహము చేయక బుద్ధిరాదు.

విశేషము = పోతన్నగారు ''నీ పాదార్చకులతోడి నెయ్యము'' కావాలంటారు. (బుద్ధి కొరకే). కృష్ణపరమాత్మ అర్జునునితో ప్రత్యేకించి ''బుద్ధి యోగం దదామ్యహం''= నీకు బుద్ధి నిచ్చుచున్నాను'' అంటాడు. కనుక బుద్ధి ఆవశ్యకము. దీనికి పెద్దల సేవ, వినికిడి, భక్తులతో చెలిమి అవసరము. ''ఆత్మబుద్ధి స్సుఖంచైవ। గురుబుద్ధి ర్విశేషతః'' తన బుద్ధి సుఖకరమే. కాని పెద్దల బుద్ధి మరిసుఖకరము'' అని శాస్త్రము. ఈ విశేషమునే త్యాగయ్యగారు చెప్పినారు.

375. తోడి = రూపకం

ప॥ బృందావనలోల! గో। వింద। అరవిందనయన॥ బృందావన

అ॥ సుందరాంగ! ధృతరధాంగ। సుజనారి తిమిర పతంగ॥ బృందా॥

చ॥ మామవ శ్రీరమణీ మణి। మదనా శ్రిత మిత్ర॥
రామ దాస దాస త్యాగ। రాజనుత చరిత్ర॥ బృందా॥

తాత్పర్యము :

ఇది సంస్కృత. రచన ప్రతి పదార్థము వ్రాయబడుచున్నది. బృందావనలోల! బృందావన మందు ఆసక్తి కలవాడా! గోవింద = గోవులను కాపాడు వాడా! అరవిందనయన = పద్మము వంటి కనులు గలవాడా! సుందరాంగ = సుందరాంగుడా!

ధృత రధాంగ= చక్రమును ధరించిన వాడా! సుజనారి తిమిర పతంగ=సుజనులకు ద్రోహము చేయువారిని పోగొట్టు వాడా! శ్రీరమణీ మణి మదన = లక్ష్మీ దేవికి మన్మధుడా! ఆశ్రిత మిత్ర = ఆశ్రితులకు మిత్రుడా! రాముని దాసులకు దాసుడైన త్యాగరాజుచే నుతింప బడిన చరిత్ర కలవాడా! మామవ = నన్ను రక్షించుము.

విశేషము = చివరి విశేషణ వివరము. పరమ భక్తులు రాముని దాసుల మనుట కన్నా రాముని దాసులకు దాసుల మను కొనుట యే మేలుగ భావింతురు. కుల శేఖరులు ''త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్యస్య భృత్య ఇతి మాం స్మరలోక నాథ'' = ఓ లోకనాథా ! నన్ను నీ దాసుని దాసును దాసుని దాసునిగా తలవ వలసినది అని ప్రార్థిస్తారు. ఇదియు నట్టిదే.

376. శ్రీరంజని = ఆది (దివ్యనామము)

ప॥ *బ్రోచే వారెవరే – రఘు పతీ॥*
బ్రోచేవా రెవరే – నిను వినా॥
బ్రోచే వారె వరే – శ్రీరామా నెనరున
బ్రోచే వారెవరే – సకల లోకనాయక
బ్రోచే వారె వరే – నరవర నీ సరి॥ బ్రోచే॥

1 *దేవేంద్రాదులు మెచ్చుటకు లంక – దయతో దాన మొసంగి సదా॥* బ్రోచే॥

2 *ముని సవంబు జూడ వెంట జనిఖల–మారీచాదుల హతంబు జేసి॥* బ్రోచే॥

3 *వాలినొక్క కోలనేసి రవి బా–లుని రాజును గావించి చూచి॥* బ్రోచే॥

4 *భ వాబ్ధి తరణోపాయము నేరని త్యాగరాజుని కరంబిడి॥* బ్రోచే॥

తాత్పర్యము :

నీకన్న రక్షించు వారెవరున్నారయ్యా అని విభీషణుని కిచ్చిన లంకా దానము, విశ్వామిత్రయాగ సంరక్షణము, వాలి వధము, సుగ్రీవ పాలనమును ఈ కృతి యందు చెప్పబడినవి.

377. బహుదారి = ఆది

ప॥ బ్రోవ భారమా – రఘురామ
భువన మెల్ల నీవై–నన్నొకని॥ బ్రోవ॥

అ॥ శ్రీవాసుదేవా – అండకోట్లకు
షిని యుంచు కోలేదా ... నన్ను॥ బ్రోవ॥

చ॥ కలశాంబుధిలో దయతో నమ
రుల్‌కై యది గాక గోపి
కల్‌కై కొండనెత్త లేదా
కరుణాకర త్యాగరాజుని॥ బ్రోవ॥

తాత్పర్యము :

రఘురామా! నన్ను బ్రోచుట నీకు భారమా? కాదు. ఏలనన? నీవు భువన మంతయు నీవై యున్నావు కనుక నన్నొకని బ్రోచుట నీకు భారమా? కాదు. అంతేకాక దేవతల కోసం మందర పర్వతమును, గోపికల కోసం గోవర్ధనమును ఎత్తిన వాడవు నన్ను రక్షించుట భారమా అని జావాబీయలేని త్యాగయ్యగారి ప్రశ్న.

విశేషము = ఇందు పల్లవిలో భువన మెల్లనీవై అని భువనముల లోపల రాముడు వసించి ఉండుట చెప్ప బడినది. అను పల్లవిలో ''కుక్షిని యుంచు కోలేదా? అని భువనములు తనలోపల నుండుట చెప్పబడినది. ఈ రెండిటి మధ్యలో శ్రీవాసుదేవా! అని సంబోధన యున్నది. వాసుదేవ శబ్దమున కర్థము – జగత్తుల యందు వసించి ప్రకాశించు వాడనియును, జగత్తులు తనయందు వసించి ప్రకాశించు వాడనియును. భగవానుని బహిరంత ర్వ్యాప్తులను చెప్పి ఆరెండిటి మధ్యలో 'శ్రీవాసుదేవ' అని సంబోధించుట విశేషము. మరియు వాసుదేవ శబ్దమునకు వసుదేవుని కొడుకు అని కూడ అర్థము. దానిననుసరించి చరణములో వసుదేవ పుత్రుడు చేసిన గోవర్ధనోద్ధరణము చెప్పబడినది. ఈవిధముగా ఈకృతిలో పల్లవి అను పల్లవి చరణములకు ఒక విధమయిన పరస్పర సంబంధము కలదు. శ్రీవాసుదేవ అనేది సాభిప్రాయ విశేషణమే కాని ప్రాస కోసము చేసిన పదము మాత్రమే కాదు. ఇది ఇందలి విశేషము. పల్లవిలో ''రఘురామ'' అను సంబోధన మున్నది. పైన చెప్పిన ఇద్దరి వాసుదేవులకును మధ్య అవతారము రఘురాముడు. దీనిని బట్టి ఈ రఘురాముడు వాసుదేవుడేయని సూచించుట జరిగినది.

378. శంకరాభరణం - రూపకం

ప॥ భక్తి బిచ్చమియ్యవే – భావుకమగు సాత్త్విక॥ భక్తి॥

అ॥ ముక్తి కఖిల శక్తికి త్రి – మూర్తుల కతి మేల్మిరామ॥ భక్తి॥

చ॥ ప్రాణము లేని వానికి – బంగారు పాగ జుట్టి
ఆణి వజ్ర భూషణ ముర – మందు బెట్టు రీతి
జాణలకు పురాణాగమ – శాస్త్ర వేద జవప్రసంగ
త్రాణ గల్గి ఏమి భక్త – త్యాగరాజ నుత రామ॥ భక్తి॥

తాత్పర్యము :

ఓ రామా! నాకు భక్తి భిక్ష పెట్టవయ్యా! ఆ భక్తి క్షేమకరమైన సాత్త్విక భక్తి కావలెను. ముక్తికి సమస్త శక్తులకు కారణమా భక్తి. త్రిమూర్తులకును ఆ భక్తి కావలసినదే. వేద శాస్త్ర పురాణాగమాలు చదివిన జాణలకు కూడా సాత్త్విక భక్తి కావలెను. అన్ని చదివి ఆ భక్తి లేకపోతే శవానికి బంగారు తలపాగ జుట్టి, రత్నాల హారాలు వేసినట్లే ఉంటుంది.

విశేషము = భక్తిలో సాత్త్విక భక్తి అంటే ఐహిక ఫలాపేక్ష గాని ఇంకా ఇతర ఫలాపేక్ష గాని లేక మోక్షము కొరకే అవలంబించిన భక్తి. తక్కినవి రాజస తామస, భక్తులవుతాయి. ''ఆర్తోజిజ్ఞాసు రర్థార్థీ'' = ఆర్తులు అర్థార్థులు కూడ భగవంతుని భజిస్తారు. అర్థార్థులురాజస భక్తులు. పరులకు హాని చేయుటకు కూడ కొందరు భక్తిని అవలంబింతురు. అది తామస భక్తి. త్యాగయ్యగారు కోరినది సాత్త్విక భక్తి.

379. సురటి = రూపకం

ప॥ భజన పరులకేల దండ। పాణి భయము మనసారామ॥ భజన॥

అ॥ అజరుద్రసు రేశులకై ఆ స్థాన మెసంగు రామ॥ భజన॥

చ॥ అండ కోట్లు నిండిన కో
దండ పాణి ముఖమును హృ
త్పుండరీ కమునను జూచి
పూజ సల్పుచు

నిండు ప్రేమతో కరంగు
నిష్కాములకు వరవే
దండపాలు దాసుడైన
త్యాగరాజు సేయు రామ ॥భజన॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు మనస్సుకు బోధ చేస్తున్నారు. ఓ మనసా! యముని దలచి భయపడు చుంటివా? అక్కరలేదు. బ్రహ్మరుద్రేంద్రులకు ఆశ్రయమిచ్చే రాముని భజన చేయువారు యమునకు భయపడ నక్కరలేదు. విశ్వవ్యాపకుడగు రాముని ముఖమును హృదయమందు చూచుకొనుచు పూజించుచు నిండు భక్తితో కరగుచు నిష్కామ ప్రవృత్తిలో నున్న వారికి, త్యాగరాజుచేసే రామ భజన చేసేవారికి యమభయ మక్కరలేదు. అని త్యాగయ్యగారు మనస్సు కభయమిచ్చినారు.

విశేషము = కుల శుఖరులు కూడ సరిగా ఇట్లే అనిరి. ''మాభీర్మంద మనో విచింత్య బహుధా యామీశ్చిరం యాతనాః । ఆలస్యం వ్యపనీయ భక్తి సులభం ధ్యాయస్వ నారాయణం॥'' ఓ మంద మనమా! యమ యాతనలను తలచి భయపడకుము. జాగుచేయక భక్తి సులభుడగు నారాయణుని ధ్యానించుము'' అని. మరియు విష్ణుపురాణ వాక్యము. ''నిజభట మభి వీక్ష్య పాశహస్తం । వదతి యమః కిల తస్య కర్ణమూలే। పరిహర మధుసూదన ప్రపన్నాన్। ప్రభురహమన్య నృణామవైష్ణవానాం॥'' = యుముడు పాశము బట్టి యున్న తన భటుని చూచి వాని చెవిలో ఓరీ! నీవు విష్ణు భక్తులను వదలి వేయుము. వారిపై నా అధికారము లేదు'' అని చెప్పెనట. త్యాగయ్యగా రిట్టి విశేషము లన్నియు నెరిగి స్వాను భవమును జోడించి ఇట్టి కృతులు వ్రాయుట పరిపాటి.

380. అఠాణ = రూపకం

ప॥ భజన సేయరాదా

అ॥ అజ రుద్రాదులకు సతత
మాత్మ మంత్ర – మయిన రామ॥ భజన॥

చ॥ కరకు బంగారు వల్వ
కటి నెంతో మెరయగా

చిరునవ్వులు గల మొగమును
చింతించి చింతించి॥ భజన॥

2 అరుణా భాధరమును
సురుచిర దంతా వళిని
మొరయుక పోల యుగంబును
నిరతముగను తలచి తలచి॥ భజన॥

3 బాగుగ మానస భవ
సాగరమును తరియించి
త్యాగరాజు మనవిని విని
తారక మగు – రామనామ॥ భజన॥

తాత్పర్యము :

ఓరీ మానవా! రామభజన చేయరాదా! ఆ భజనము బ్రహ్మరుద్రాదులకు ఆత్మ మంత్రము. కరకు బంగారు చేలము కట్టి చిరునవ్వుతో అలరారు చున్న రాముని ముఖమును ధ్యానించి ధ్యానించి భజన చేయరాదా? ఎర్రని క్రింది పెదవి చక్కని పలువరుసతో మెరసే రాముని చెక్కిళ్లను తలచి తలచి భజన చేయరాదా? నామనవిని విని కామమనే సముద్రమును దాటి తారక మయిన రామ నామమును భజింపరాదా అని అయ్యగారి ఉపదేశము.

381. కల్యాణి = రూపకము

ప॥ భజన సేయవే – మనసా
పరమ భక్తితో శ్రీరాముని ॥ భజన॥

అ॥ అజరుద్రాదులకు భూసు
రాదుల కరు –దైన రామ॥ భజన॥

చ॥ నాద ప్రణవ సప్తస్వర – వేద వర్ణ శాస్త్రపురా
ణాది చతుష్షష్టి కళల – భేదము కలిగే
మోదకర శరీర మెత్తి –ముక్తి మార్గమును దెలియక
వాద తర్కమేల శ్రీమ
దాది త్యాగ– రాజనుతుని॥ భజన॥

తాత్పర్యము :

ఓ మనసా! రాముని భజన చెయ్యి! బ్రహ్మరుద్రాదులకు బ్రాహ్మణులకును అరుదయిన రామభజన చెయ్యి. ఈ మానవ శరీరమును అరుదయినదే. (దుర్లభమే) ఈ శరీరముతో నాదానందమును పొందవచ్చును. ఓంకారానందమును, శాస్త్ర పురాణాదులయిన చతుష్షష్టి కళల ఆనందమును ఈ శరీరముతో పొందవచ్చును. కాబట్టి ఆనంద స్థాన మయిన దేహమందు జన్మించి వాదతర్కములతో పొద్దుగడప వద్దు. ఆది త్యాగరాజయిన శివునితో నుతింపబడు రాముని భజింపుము అని అయ్యగారి మానస భోద.

విశేషము = అజరుద్రాదులకు రామభజన అరుదేమిటి. బ్రహ్మాదులు నారాయణుని అవతారములను దర్శించి భజించినారు. రామావతారము తక్కిన అవతారముల వంటిది మాత్రముకాదు. సంపూర్ణ మానవత్వముతో కల్యాణ గుణములతో పుంసాంమోహన రూపమై ఆయోధ్యలో నున్నది. మీదు మిక్కిలి సులభమై యున్నది. అజరుద్రాదులు ఆయనను వచ్చి భజించెదము అనుకుంటే ఆయన మానవత్వము పోయి దేవుడగును. దేవుడయితే రావణుడు చావడు. అందుచేత రాముని మాయా మానుషత్వమును పోషించుట బ్రహ్మరుద్రాదుల కావశ్యక మయినది. అందుచేత రాముని భజనము వారి కరుదయినది. ఆ నాటి భూసురలకును రాముని దేవత్వము అంతగా తెలియలేదు. అందుచేత వారికిని రామభజనము అరుదయినది.

382. కన్నడ = చాపు

ప॥ *భజరే భజ మానస రామం*

అ॥ *భజరే భజ మానస రామం*
అజముఖ సురవినుతం శుభ చరితం॥ *భజరే॥*

చ॥ *నిర్మితలోకం నిర్జిత శోకం*
పాలిత మునిజన మధునా నృషపాకం॥ *భజరే॥*

2 *శంకర మిత్రం శ్యామల గాత్రం*
కింకర జనగణ తాపత్రయతమోమిత్రం॥ *భజరే॥*

3 భూసమశాంతం భూజాకాంతం
వార మఖిలదం త్యాగ – రాజ హృద్భాంతం॥ భజరే॥

తాత్పర్యము :

ఇది సంస్కృత కృతి. దీని ప్రతి పదార్థము వ్రాయబడుచున్నది. మానస = ఓ మనమా! అజముఖ సుర వినుతం = బ్రహ్మ మొదలగు సురలచే నుతింప బడువాడగు, శుభ చరితం = శుభమయిన చరిత్రగల వాడగు, నిర్మితలోకం= లోకములను నిర్మించిన వాడగు, నిర్జిత శోకం = శోకమును జయించిన వాడగు, నృషపాకం= రాజకుమారుడగు, శంకర మిత్రం = శంకరునకు మిత్రుడగు, శ్యామలగాత్రం = నీలశరీరుడగు, కింకరజన తాపత్రయ తమోమిత్రం = తన దాసుల కష్ట ములనెడు చీకట్లను తొలగించు సూర్యుడగు, భూసమశాంతం= భూదేవితో సమానమగు ఓర్పు గలవాడగు, భూజాకాంతం= సీతకు పతియగు, అఖిలదం= సమస్తమును ఇచ్చువాడగు, త్యాగరాజ హృద్భాంతం = త్యాగరాజుని హృదయమందు ప్రకాశించు వాడగు రామం = రాముని, అధునా= ఇప్పుడు, వారం = మాటి మాటికిని భజ = భజించుము.

383. కల్యాణి = ఆది (దివ్యనామము)

ప॥ భజరే రఘువీరం శర
భరిత ధశరధకుమారం॥ భజరే॥

చ॥ నీవు దురాశల రోసి – పర
నిందల నెల్లను బాసి॥ భజరే॥

2 పంచేంద్రియములన ణచు ప్ర
పంచ సుఖము విస మనుచు॥ భజరే॥

3 కామాదుల నేగించి – నీ
కార్యములను సాధించి॥ భజరే॥

4 అన్నియు పని కొదిగేనా – ఇటు
నటు దిరిగిన తెలిసేనా॥ భజరే॥

5 వేరే పనులకు పోక – గోముఖ
వ్యాఘ్రపు చందము కాక॥ భజరే॥

6 తప్పు తంటలను మాని – భవ
తరణమున మతి బూని॥ భజరే।

7 కర్మము హరికి నొసంగి స
త్కార్యములం దుప్పొంగి॥ భజరే।

8 భక్తి మార్గమును దెలిసి – నిజ
భాగవతుల జత గలసి॥ భజరే॥

9 మాయారహితుని గొలిచి – నీ
మనమున రాముని దలచి॥ భజరే॥

10 రాజాధిపుగా వెలసి–త్యాగ
రాజ వరదుడని తెలిసి॥ భజరే॥

తాత్పర్యము :

ఇందు కృతి అంతా తెలుగు. కర్మ, క్రియమాత్రం సంస్కృతము. ఇది పల్లవి. రఘువీరుని భజింపుము. అనే పదములు సంస్కృతము. ఓ మానవా! నీవు దురాశలను వదలి, పరనిందను మాని రఘువీరుని భజింపుమా. అయిదు ఇంద్రియములను వశములో పెట్టుకొని ప్రపంచ సుఖములను విషముగా తలచి రఘువీరుని భజించుము. కామ క్రోధాదులను జయించి నీ పనులను సాధించి రాముని భజింపుము. వేరేతలపులకు పోయి గోముఖ వ్యాఘ్రము కాకుము. తప్పులు మాని తరణోపాయము నాలోచించుము. కర్మను (నీవు చేసిన పనిని) హరి కర్పించి మంచి పనులకు సంతసించుము. భక్తి మార్గమును తెలసుకొని భక్తులతో చెలిమి చేయుము. మాయారహితుడు, శరములు ధరించిన వాడు, దశరథ కుమారుడు, త్యాగరాజ వరదుడు అయిన రఘువీరుని భజింపుము అని అయ్యగారి బోధ.

విశేషము = 7వ చరణపు వివరము. వైదిక సంబంధమగు కర్మలు చేసి తుదకు ''కాయేన వాచా మనసేం ద్రియైర్వా। బుధ్యా త్మనావా ప్రకృతే స్స్వభావాత్ । కరోమి యద్య త్సకలం పరస్మై। నారాయణాయేతి సమర్పయామి''= శరీరముతో గాని, వాక్కుతో గాని, మనస్సుతో గాని, స్వభావముచేత గాని, ఏ కర్మము చేయుచున్నానో అది అంతయు నారాయణునకు సమర్పించుచున్నాను'' అని ఇప్పటికిని కర్మాంత మందు నారాయణునకు కర్మ ఫల సమర్పణము చేయుట కలదు. అయ్యగారు తమ బోధలలో దీనిని కూడ విధించిరి.

384. మోహన = ఆది

ప॥ భవనుత! నాహృదయమున రమింపుము॥
బడలిక దీర..... భవనుత॥

అ॥ భవతారక నాతో బహు పల్కిన
బడలిక దీర... కమల సం॥ భవనుత॥

చ॥ పవన సుత ప్రియ ! తనకైతిరిగిన
బడలిక దీర....
భవనము జేరి నను వెరపించిన
బడలిక దీర..... కమల సం॥ భవనుత॥

2 వరగమగు నైవేద్యములను సేయని
బడలిక దీర.....
పరవలేక సరిపోయిన ట్టాడిన
బడలిక దీర – కమల సం॥ భవనుత॥

3 ప్రబల జేసినను బ్రోవను కొన్న
బడలిక దీర.....
ప్రభువు నీవు త్యాగరాజునికి
బడలిక దీర..... కమల సం॥ భవనుత॥

తాత్పర్యము :

ఓ రామా! భవనుతా = శివునిచే పొగడబడిన వాడా! నా హృదయములో, నీ బడలిక దీరేలాగున ఆనందముతో నివసించు, ఓ భవతారకా! సంసారము నుండి తరింప జేయురామా! నీవు నాతో పెక్కుమాటలు మాట్లాడి నావు. ఆ బడలిక తీరునట్లు నా హృదయ మందు నివసించు. పవన సుత ప్రియా=హనుమంతునకు ప్రియమయిన ఓ రామా! నా ఇంట జేరి నను భయపెట్టిన బడలిక దీరే విధముగా నా హృదయ మందు రమించుము. నీకు తగిన నై వేద్యములు నేను పెట్టలేను. ఆ బడలిక దీరే రీతిగా నా హృదయమందు విశ్రాంతి తీసుకొనుము. నైవేద్యము చాలక పోయినా చాలినట్లు పలికిన బడలిక దీరేటట్లు నా హృదయమందు నివసించు, నన్ను అభివృద్ధిలోనికి తెచ్చి రక్షించావు. ఆ బడలిక దీరునట్లు నా హృదయమున రమింపుము. నాకు నీవు ప్రభువవు. కనుక నా హృదయమందు బడలిక దీర్చుకొని ఆనందించు.

విశేషము = తన భవనము జేరి తనను వెరపించుట, అనగా? అయోధ్యలో రాజభోగములతో, పెద్దపరివారముతో నున్న రాముడు తన ఇంట నున్నాడు. అట్టి రామునకు తన ఇంట ఏ కొరత కలుగునో? ఏ ఆపద కలుగునో? అనే భయము. ''ప్రేమ పశ్యతి భయాన్యపదేషు'' =తాను ప్రేమించిన వారి యెడ ప్రేమ వలన వారికే కీడు కలుగునోయని కారణము లేక పోయినను భయము కలుగును''. అని శాస్త్రము, అట్టి భయము రామని యెడ త్యాగయ్యగారికి కలుగుట భక్తసహజ లక్షణము. అట్టి భయము తీరునట్లు నా హృదయమందు సుఖముగా నుండుము అని.

385. బేగడ = ఆది

ప॥ భక్తుని చారిత్రము వినవే
మనసా సీతారామ॥ భక్తుని॥

అ॥ ఆ॥ సక్తిలేక తాగోరుచు, జీవ
న్ముక్తుడై యానందము నొందు॥ భక్తుని॥

చ॥ జపతపములు దా– జేసితి ననరాదు అదిగాకమరి
కపటాత్ముడు మనమై వల్కరాదు.
ఉపమ తనకు లేక యుండ వలెనని
ఊర ఊర తిరుగగ రాదు
చపల చిత్తుడై ఆలుసుతులపై
సారెకు భ్రమ కారాదనే హరి॥ భక్తుని॥

2 భవ విభవము నిజమని యెంచగరాదు అది గాక మరి
శివ మాధవ భేదము జేయగ రాదు
భువన మందు దానే యోగ్యుడనని
బొంకి పొట్టు సాకగ రాదు
పవనాత్మజ ధృత మౌసీతాపతి
పాదములను ఏమర రాదను హరి ॥ భక్తుని ॥

3 రాజసతామస గుణములు గారాదు అదిగాకను మరి అ
వ్యాజమునను రాలేదనగా రాదు

రాజ యోగ మార్గమున చిత్తము
రాజూచుట విడువగ రాదు
రాజ శిఖామణి యైన త్యాగ
రాజసఖుని మరవ రాదనే హరి॥ భక్తుని॥

తాత్పర్యము :

అయ్యగారు భక్తుని నడతలు, భావములు ఎట్లుండ వలెనో చెప్పుచున్నారు. ఓ మనసా! భక్తుని చరిత్రము వినవలసినది. కర్మలయందు ఆసక్తిలేక ఫలము నందు ఆసక్తుడు కాక అవి చేస్తూనే అసక్తుడై జీవన్ముక్తుడగును. నేను జపతపములు చేయుచున్నానని అని భావింప రాదు. మనసులో ఒకటి మాటలో నింకొకటి కాకూడదు. తనకు సాటియైనవా డింకొకడుండ రాదని, పేరు ప్రతిష్ఠలకై ఊరూరు తిరుగ రాదు. ఆలు బిడ్డలపై మమ కారము పెంచుకోరాదు. తన గొప్ప చెప్పుకొని పొట్ట పోషించుకొన రాదు. హనుమంతుడు పట్టిన శ్రీరామ పాదములను మరువ రాదు. అని చెప్పే భక్తుని మాటను వినవలెను.

పైన చెప్పిన వాటిలో కొన్ని వివరములు. ''కుర్యా ద్విద్వాన్ తథా అసక్తః'' = జ్ఞాని కర్మయందు సక్తుడు కాకుండ చేయును'' అని గీతావాక్యము. ఇది జీవన్ముక్తిని కలిగించును. తాను చేసిన జపములు చెప్పరాదు. పరమ కర్మిష్ఠులు, పరమజ్ఞానులు, పరమ భక్తులును అయిన యామునులు భగవత్స్తన్నిధిలో 'నధర్మనిష్ఠోస్మి నచాత్మవేదీ। న భక్తిమాన్ త్వచ్చరణారవిందే' = ఓ భగవన్! నేను ధర్మనిష్ఠుడను కాదు. ఆత్మ జ్ఞానిని కాను. నీపాద భక్తి యున్నవాడను కాను.' అని నైచ్యానుసంధానమును (తన తక్కువ దనమును చెప్పుకొనుట) చేసిరేకాని ఇంకొకటి చెయ్యలేదు. శివ కేశవ భేదమును చేయరాదు. 'శివస్య హృదయం విష్ణుः విష్ణోశ్చ హృదయం శివः' 'శివాయ విష్ణు రూపాయ। శివరూపాయ విష్ణవే' = శివుని హృదయము విష్ణువు. విష్ణువు యొక్క హృదయము శివుడు. విష్ణురూపముతో నున్న శివునకు, శివరూపముతో నున్న విష్ణువునకు నమస్కారము' ఇత్యాది వాక్యములు శివకేశవుల భేద బుద్ధి చేయరాదు అను విషయమునకు ప్రమాణములు.

386. నారాయణి = ఆది

ప॥ భజన జేయు మార్గము జూపవే
పరమభాగవత భాగధేయ॥ భజన॥

అ॥ అజుడు రుద్రు-డాఖండల పవనజ
విజయాదులు గుమిగూడి నీదు చరణ॥ భజన॥

చ॥ సకల వేద శాస్త్ర పురాణాది దీప
సకల మంత్రతంత్రరూప సీతాప
సకల దేవ రిపు సమర ప్రతాప
సాధు త్యాగ రాజనుత శ్రీరామ॥ భజన॥

తాత్పర్యము :

పరమ భక్తులకు భాగ్యమైన ఓ రామా! నీ భజన చేసే మార్గము చూపవయ్య. బ్రహ్మ రుద్రేంద్రాది దేవతలు హనుమత్ అర్జునాది భక్తులును గుమిగూడి చేసే నీపాద భజన మార్గము నాకు తెలుపుము. వేద శాస్త్ర పురాణాదులకు నీవు దీపమైన వాడవు. సకల మంత్ర తంత్ర స్వరూపుడవు. సీతా పతివి. రాక్షసయుద్ధములలో చండప్రతాపుడవు. త్యాగరాజ వినుతుడవు. నాకు భజన మార్గము చూపుమని అయ్యగారి ప్రార్థనము.

387. హుసేని = ఆది (దివ్యనామము)

ప॥ భజరామం సతతం మానస భజ॥

చ॥ అమితశుభాకరం పాప-తిమిర విభాకరం॥ భజ॥

2 శతమఖనుత గీతం సకలా-శ్రిత పారిజాతం॥ భజ॥

3 పాలిత లోకగణం వరమ క-పాలి వినుత సుగుణం॥ భజ॥

4 సరోజ వరనాభం. యమ-పురారాతి లాభం॥ భజ॥

5 పరానందకందం నత-సురాది మునిబృందం॥ భజ॥

6 కమనీయ శరీరం ధీరం-మమ జీవనాధారం॥ భజ॥

7 కరధృత శరచాపం రామం-భరిత గుణ కలాపం॥ భజ॥

8 భవ జల నిధి పోతం. సారస-భవముఖ నిజతాతం॥ భజ॥

9 వాతాత్మజ సులభం-వర-సీతావల్లభం॥ భజ॥

10 రాజరవినేత్రం-త్యాగ-రాజవరమిత్రం॥ భజ॥

తాత్పర్యము :

ఇది సంస్కృత కృతి. తెలుగు ప్రతిపదార్థము మాత్రము వ్రాయబడుచున్నది. ఓ మనమా! మితిలేని శుభములకు స్థానమయిన, పాపములనెడి చీకట్లకు సూర్యుడయిన, ఇంద్రునిచే పాడబడు, ఆశ్రితులకు కల్పవృక్షమైన, కపాలి చేనుతింపబడిన, లోకగణములను పాలించిన, పద్మము నాభియందు కలిగిన, శివునకులాభమయిన ఎక్కువ ఆనందమునకు మూల మయిన, దేవతలు మునులును నమస్కరించు, అందమయిన శరీరముగల, ధీరుడయిన, నాజీవనాధార మయిన, చేతి యందు విల్లమ్ములు ధరించిన, సద్గుణములను భరించిన, సంసార సముద్రను దాటు తెప్ప అయిన, బ్రహ్మకు తండ్రి అయిన, హనుమంతునకు సులభమయిన, సీతకు వల్లభుడైన, సూర్య చంద్రులు కన్నులయిన, త్యాగరాజునకు మంచి మిత్రుడైన రాముని భజింపుము.

388. వరాళి = ఆది

ప॥ భవసన్నుత నాదఘమెంత ఘనీభవమో

అ॥ భవనీరధి తారక! సుగుణ! నా క
భయ మియ్యను దోచనందు కబ్బు॥ భవ॥

చ॥ పాపహరణ! శ్రీరఘువర! మధురా
లాప! దీన జనధన! పావన! నీ
దాపు కలుగ గోరి దొరకని పరి
తాపము గని మనసు కరుగ నందుకు॥ భవ॥

2 కరుణాకర! నీ చరణము శిలను
వరనారిగ జేసినది కాకను
శర మసురుని గాచెనే నీకునా
దురితములను బోగొట్టి బ్రోచుటకు॥ భవ॥

3 ఇవ్విధమున నుండు నను జూచి
యవ్వన గర్వము మించిన నరులు
నవ్వగాను రోసమేల రాదో
ఎవ్వరి తోడను విన్నవింతురాదీని॥ భవ॥

4 ఈ జన్మమునను మోసబోకను
నీ జపములకు విఘాతమైన భవ
వ్యాజము లెల్లను రోసిన త్యాగ
రాజుపైని దయ రానందుకు॥ భవ॥

తాత్పర్యము :

ఓ భవసన్నుతా = శివుని పొగడ్తగన్న రామా! నాపాపము ఎంత గడ్డకట్టికూర్చున్నదో అర్థమయినది. నాకభయమియ్య తోచలేదు. అందుచేత నా పాపమెంత ఘనమైనదో తెలిసినది. పాపములు హరించే కరుణాకరుడవైన నీ ప్రాపుగోరి అది దొరకని నాపరితాపమును చూచియు నీ మనసు కరగుటలేదు. నా పాప మెంతదో? అహల్యను రక్షించితివి. అపకారి అయిన కాకాసురుని రక్షించావు. నా పాపములను బోగొట్టి రక్షింపవైతివి. నేను నిన్ను ప్రార్థించుట, నీవు నన్ను చూడకుండుట చూచి యువకులు నవ్వుచున్నారు. నీకు రోషము వచ్చుటలేదా? దీనిని ఎవ్వరితో చెప్పుకొందును. నేను తొలిజన్మలో ఏమి చేసితినో తెలియదు. ఈ జన్మలో మోసపోక నీ స్మరణచేస్తూ దానికి విఘాతము కలిగించే సంసారపు పనులను రోసి ఉన్నాను. ఈ పరిస్థితిలోను నీవు నాకభయమియ్యక ఉన్నావు. నా పాపమెట్టిదో అని పరితాపము.

389. శ్రీరంజని = అది

ప॥ భువనీ దాసుడనే పేరాసచే
బొంకులాడితినా– బుధమనోహరా॥ భువి॥

అ॥ అవివేకమానవుల కోరి కోరి
అడ్డు త్రోవ ద్రొక్కితినా బ్రోవవే॥ భువి॥

చ॥ చాల సౌఖ్యమో కష్టమో నేను
జాలి జెందితినా – సరివారిలో
పాలముంచినా నీటముంచినా, నీ
పదములేగతి – త్యాగరాజనుత॥ భువి॥

తాత్పర్యము :

బుధమనోహరా! పండితులకు మనోహరమయిన ఓ రామా! నా తప్పులేమయ్యా! ఈ ప్రపంచములో నేను పెద్ద ఆశకలిగి నీ దాసుడను అని అందరి దగ్గర గొప్పకోసం అబద్ధము లాడితినా? అవివేకులయిన మానవులను కోరి వారి నాశ్రయించిన అడ్డుత్రోవ ఏదయినా త్రొక్కితినా? లేదు. నిన్నాశ్రయించాను. కష్టమో నిష్ఠురమో నా బాధ నేనే పడుతున్నాను. కానీ నా సరివారితో నా జాలి నేను చెప్పుకోలేదు. సరే ఇదంతయు ఎందుకు? నీవు పాల ముంచినా నీట ముంచినా నీపాదములే దిక్కు అని దృఢముగా నమ్మియున్నాను అని అయ్యగారు తమ అనన్యగతికత్వమును రామునివద్ద విన్నపించుకొన్నారు.

390. కోలాహలము = ఆది

ప॥ మదిలోన యోచన పుట్టలేదా
మహారాజ రాజేశ్వరా॥ మది॥

అ॥ పది వేసములలో – రామవేషము
బహుబాగనుచు కోరునన్ను బ్రోవ॥ మది॥

చ॥ ఇట్టివేళ నీ కెట్టు తోచునని
ఇల్లాలితో ముచ్చటాడెదు
రట్టు నీమనసు కెట్టుతోచెనో
రక్షించుటకు త్యాగరాజనుత॥ మది॥

తాత్పర్యము :

ఓ మహారాజా! రాజేశ్వరా! రామా! నీ దశావతారములలో నీ అవతారమే చాలా మేలయినదని భావించి నిన్నేకోరిన నన్ను రక్షించే ఆలోచన నీ మనస్సులో ఏల కలుగదయ్యా? రామా! నేను మొరలు పెట్టుచుంటే ఇటు చూడక సీతతో ముచ్చటలాడుచుంటి వేమయ్యా? ఈ విధంగా నన్ను రట్టు చేయుచుంటివేమయ్యా! అని ఆర్తి.

391. వర్ధని = రూపకం

ప॥ మనసా మన సామర్థ్యమేమి ఓ॥ మనసా॥

అ॥ విను సాకేతరాజు – విశ్వమనే రథమునెక్కి
తన సామర్థ్యముచే – తానే నడిపించెనే॥ మనసా॥

చ॥ అలనాడు వసి ష్ఠాదులు పట్టము గట్టే పలు
కులు విని వేగమె భూషణ–ముల నొసగిన కైకను
పలుమారు జగమ్ములు క–ల్లలనిన రవిజుని మాయ
వలవేసి త్యాగరాజ–వరదుడు తాచనగలేదా॥ మనసా॥

తాత్పర్యము :

ఓ మనసా! ప్రపంచములో అన్నీ జరుగుచున్నవి. ఇదంతా మన సామర్థ్యమే అని అనుకుంటాము. కాదు. సాకేతరాజు (రాముడు) ఈ విశ్వమనెడి రథమునెక్కి తానే అంతా నడిపిస్తూ ఉంటాడు. మనము చేయుచున్నామనేది కల్ల. అలనాడు త్రేతాయుగంలో వసిష్ఠాదులు రామునకు పట్టాభిషేకము చేద్దామనుకున్నారు. ఆవార్త విని చెప్పిన దాసికి సంతోషముతో రత్నాల హారమిచ్చినది. తుద కేమయినది? శనిమాయ అనిపించి రాముడు అడవికే వెళ్లినాడు. దీని కొరకే కదా రామావతారము. అందుచేత కైకద్వారా పట్టభంగము చేయించి అంతయు తన సంకల్ప ప్రకారము నడిపినాడు.

విశేషము = 'అన్యథా చింతితం కార్యం దైవ మన్యత్రచింతయేత్' = మానవుడు ఒక విధముగా అనుకొన్నదానిని దైవము (భగవానుడు) మరొక విధముగా నడుపును' అని శాస్త్రము. 'ఈశ్వర స్సర్వభూతానాం। హృద్దేశేర్జున తిష్ఠతి। భ్రామయన్ సర్వ భూతాని। యంత్రా రూఢాని మాయయా' = సర్వేశ్వరుడు సర్వ భూతములను తన మాయతో యంత్రపు బొమ్మల వలె త్రిప్పుచు సర్వ భూతముల హృదయమందు ఉంటున్నాడు' అని గీతావాక్యము. వీటినే అయ్యగారు చెప్పినారు.

219. మలయమారుతం = రూపకం

ప॥ మనసా ఎటు లోర్తునే – మన విని చేకొన వే॥ మనసా॥

అ॥ దినకరకుల భూషణుని – దీనుడవై భజనజేసి
దినము గడుపు మనిన నీవు – వినవదేల గుణ విహీన॥ మనసా॥

చ॥ కలిలో రాజసతామస-గుణములు గలవారి చెలిమి
కలసి మెలసి తిరుగుచు మరి-కాలము గడపకనే
సులభముగా కడతేరను-సూచనలను దెలియజేయు
ఇలను త్యాగరాజు మాట-వినవదేల గుణవిహీన॥ మనసా॥

తాత్పర్యము :

అయ్యగారు రాముని భజింపుమని మానస బోధ జేయుచున్నారు. ఓ మనసా! నే నోర్వలేను. నా మనవిని వినుము. సూర్యవంశ తిలకుడైన శ్రీరాముని ఆర్తితో భజించి రోజులు గడుపుమని నాబోధ. వినవేమి? ఇది కలియుగము. ఇందు రాజస తామసగుణములుగలవా రెక్కువ. వారితో చెలిమి చేసి వారితో తిరుగవద్దు. నేను చెప్పినట్లు చేస్తే సులభముగా తరింపవచ్చును. లేకపోతే అధోగతియే. అని అయ్యగారి ఉపదేశము.

విశేషము = 'ఊర్ధ్వంగచ్ఛంతి సత్త్వస్థాః। మధ్యే తిష్ఠంతి రాజసాః। అధోభ్రశ్యంతి తామసాః' = సత్త్వగుణముగలవారు ఊర్ధ్వమగు భగవల్లోకమును చేరుదురు. రాజసులు మధ్యమము లగు స్వర్గాదిలోకములు చేరుదురు. తామసులు నరకాది అధో లోకములు చేరుదురు. అందుచేత వారి చెలిమిని అయ్యగారు నిషేధించిరి. ఈ సూచనలు చేయుటయే నాపని అని చెప్పిరి.

393. మారరంజని = ఆది

ప॥ మనసా శ్రీరాముని దయలేక-మాయమైన వితమేమే॥ మనసా॥

అ॥ ఘనదురితముల - కొడిగట్టి నా
కార్యమును చెరచితివో॥ మనసా॥

చ॥ పరదారల పరధనముల కాస-పడి చెడి తిరిగితివో లేక
పరజీవాత్ముల హింసించితివో-వరత్యాగరాజనుతుని మరచితివో॥ మనసా॥

తాత్పర్యము :

అయ్యో మనసా శ్రీరాముని దయకు దూరమై నీవు మాయమైపోయిన (తరించకపోయిన) విధ మెటువంటిదో చెప్పుము. పెద్దపాపములు చేసి నాపని కాస్తా చెడగొట్టినావు. ఇతరుల భార్యలకు, ఇతరుల ధనములకు ఆశపడి చెడు తిరుగుళ్లు

తిరిగితివా? లేక పరజీవులను హింసించితివా? లేక శ్రీరాముని ఏనాడు స్మరింపక మరచితివా? అని అయ్యగారు మనస్సును నిలువదీసి అడిగినారు.

విశేషము = 'మన ఏవ మనుష్యాణాం। కారణం బంధమోక్షయోః' = మనుజుడు బంధములో పడుటకైనా, మోక్షము పొందుటకైనా మనస్సే కారణము' = అని. అయితే ఈ బంధమోక్షములు ఎవరికి? ఆత్మకు. మనస్సు ఆత్మ వేరు వేరు పదార్థములు. మనస్సు సత్సంకల్పమును గాని దుస్సంకల్పమునుగాని సంకల్పిస్తుంది. శరీరము దానిని ఆచరణములో పెట్టుతుంది. ఆత్మ బంధ మోక్షరూపములయిన కర్మఫలితములను అనుభవిస్తుంది. అందుచేత అయ్యగారు మనస్సును వేరుచేసి తనను ఆత్మగా భావించి 'దురితముల కొడిగట్టి నా కార్యమును చెరచితివి' అని అనిరి.

394. ఈశమనోహరి = ఆది

ప॥ మనసా శ్రీరామచంద్రుని-మరువకే ఏమరకేఓ॥ మనసా॥

అ॥ మును పుట్టను పుట్టిన ముని కృతమున
మూడు నారధ్యాయముల జూచుకో॥ మనసా॥

చ॥ సృష్టి పుష్టినష్టి జేయు పనులు ని
కృష్టమనుచు త్రిమూర్తుల కొసగి
తుష్టులైపరగే-సద్భక్తమనో
భీష్టము దీర్చే-త్యాగరాజనుతుని॥ మనసా॥

తాత్పర్యము :

ఓ మనసా! శ్రీ రామచంద్రుని మరువవద్దు. ఏమరవద్దు. మరవకుండా ఏ మరకుండా ఉండాలంటే వాల్మీకి రచించిన రామాయణమును నిత్యమును పఠిస్తూ ఉండు. జగత్తు యొక్క సృష్టి, రక్షణము, విలయములు అనే మూడు పనులు తక్కువ పనులు అని వాటిని బ్రహ్మ విష్ణు మహేశ్వరుల కిచ్చి తాను సర్వోత్కృష్టమయిన భక్తరక్షణమును చేపట్టినాడు రాముడు. వాల్మీకి రామాయణములో మూడవకాండమును (అరణ్యకాండమును) ఆరవ కాండమును (యుద్ధకాండమును) చూచుకో' అని అయ్యగారి మానసబోధ.

విశేషము = త్యాగయ్యగారి దృష్టిలో రాముడే త్రిమూర్తులకు మూలకందమయిన పరబ్రహ్మము. 'ఇతి రామ పదేనాసౌ। పరబ్రహ్మాభిధీయతే' = పరబ్రహ్మము 'రామ' అనే పదముతో చెప్పబడుచున్నాడు' అని ఉపనిషద్వాక్యము. ఆ పరబ్రహ్మము సృష్టి స్థితిలయములను తక్కువగా తలచి తన అంశము కలిగిన త్రిమూర్తుల కిచ్చినాడు. ఉత్తమ మగు సంతుష్ట భక్త రక్షణమును తాను గ్రహించి రామావతారమెత్తినాడు. అరణ్య కాండములో మునులు వచ్చి రాక్షసబాధలు తీర్చుమని రాముని వేడుకొన్నారు. రాముడు అభయమిచ్చినాడు. మాట ప్రకారము విరాధ, ఖరదూషణాదులను వధించి మునులను రక్షించినాడు. యుద్ధ కాండమున పట్టాభిషేకము రాజ్యపాలనము వర్ణింపబడినవి. ఆయన రాజ్యపాలనములో 'రామో రామో రామ ఇతి! ప్రజానా మభవన్ కథాः' = ప్రజలందరును సుఖముగా పాలింపబడుచు రాముని కథలనే చెప్పుకొనేవారట. అని వర్ణింపబడినవి. అందుచేత అయ్యగారు మూడు ఆరు కాండలను చూడమని బోధచేసినారు. అవి చదివితే రాముని మరచుట ఏమరుట ఉండబోవని. మూడవకాండము లోను, ఆరవ కాండములోను వాల్మీకి చెప్పినది శ్రీరాముని భక్తరక్షణమునే. త్యాగయ్యగారికి కావలసినది రాముని ఆ గుణమే.

395. ఆభోగి = ఆది

ప॥ మనసు నిల్ప శక్తిలేక పోతే॥
మధురఘంట విరుల పూజేమి జేయును॥ మనసు॥

అ॥ ఘనదుర్మదుడై తామునిగితే
కావేరి మందాకిని-ఎటుబ్రోచును మనసు॥

చ॥ సోమిదమ్మ సొగసు-గాండ్రగోరితే
సోమయాజి స్వర్గార్హుడౌనో
కామ క్రోధుడు తపంబొనర్చితే
కాచిరక్షించునె త్యాగరాజనుత॥ మనసు॥

తాత్పర్యము :

అయ్యగారు తమకు కలిగిన ఒక భావమును రాముని వద్ద విన్నపంచేస్తున్నారు. మానవుడు విగ్రహముల వద్ద కూరుచుండి ఘంటానాదం చేస్తూ పూలతో పూజిస్తాడు. బాగున్నది. కాని ఇదంతయు మనస్సు నిలిపి చేస్తున్నాడా? నమ్మకము లేదు. అట్టి పూజ

వ్యర్థము. ఇక తనలోని కామ క్రోధమదాదు లన్నీ తనలోనే ఉంటూ కావేరి, గంగ, మొదలయిన పుణ్య తీర్థాలలో స్నానము చేసినా వ్యర్థమే. అన్ని క్రియా కలాపములలో యజ్ఞము ముఖ్యము. ఇందు యజమానుడు సోమయాజి, ఆయన భార్య సోమిదమ్మ. ఆమె యజ్ఞసమయమున మనోనిగ్రహమును కోల్పోయి పరపురుషుని కోరితే యజ్ఞమంతయు ధ్వంసమై సోమయాజి స్వర్గానికిపోడు. కామ క్రోధములతో తపస్సు చేసినా వ్యర్థమే. మనశ్శుద్ధితో పైవి చేస్తే ఫలప్రదము లగును. లేకపోతే అంతయు వ్యర్థమే. అని అయ్యగారి నివేదనము.

విశేషము = 'ఆత్మాయజమానః శ్రద్ధా పత్నీ' = ఆత్మ సోమయాజి. శ్రద్ధ వాని పత్ని' అని ఉపనిషద్వాక్యము. దీనిని బట్టి ప్రతివాడును తాను చేయు దేవపూజ అను యజ్ఞమును శ్రద్ధతో చేయవలె ననునది సిద్ధాంతము. ఇంకొక విషయము. 'యమోవైవస్వతో రాజా హృ దయస్థో జనార్దనః। తేన చే దవివాదస్తే। మాగంగాం మా కురూన్ గమః' = ఓరీ మానవా! నీలోపలనుండి నిన్ను నియమించుచు సూర్యమండలాంతర్గతుడై నిన్ను రంజింప జేయు జనార్దను డున్నాడు. వానితో నీవు వివాదము చేయక రాజీపడితే (భక్తి కలిగియుంటే అని) గంగకును, కురుక్షేత్రమునకును నీవు పోనక్కరలేదు' అని శాస్త్రము. ఈ కృతియందు అయ్యగారు ఈ సూచనమును కూడ చేసిరి.

396. హిందోళము = ఆది

ప॥ మనసులోని మర్మమును తెలుసుకో
మానరక్షకా! మరకతాంగ నా॥ మనసు॥

అ॥ ఇనకులాప్త నీ వేగాని వే
రెవరు లేరు ఆనంద హృదయ॥ మనసు॥

చ॥ మునుపు ప్రేమగల దొరవై సదా
చనువు నేలినది – గొప్ప గాదయ్యా
కనికరమ్ముతో నీ వేళనా
కరముబట్టు త్యాగ–రాజ వినుత॥ మనసు॥

తాత్పర్యము :

మరకతమణివంటి దేహముగల రామా! నీవు నా మనస్సులో నున్న మర్మమును తెలుసుకోవలెనయ్యా! నీవు స్వభావసిద్ధముగా ఎదటివారి హృదయంలో నున్న

మర్మమెరిగి వారి అభిమానమును రక్షించావు. (విశ్వామిత్ర అహల్య జనక సుగ్రీవ విభీషణాదులు దీనికి సాక్షులు) ఆనాడు వారిని చనవుతో ప్రేమగల దొరవై ఏలినావు. అది గొప్పకాదు. వారంతా త్రేతాయుగపురుషులు. ఈవేళ నాకరము బట్టి నామనసు మర్మమెరిగి నా అభిమానమును కాపాడుము. అని నివేదనము.

397. నాటకురంజి = ఆది

ప॥ మనసు విషయ నటవిటుల కొసంగితే
మా రాముని కృప గల్గునో మనసా॥ మనసు॥

అ॥ తన తలు పాకరింటికి తీసిపెట్టి
తా కుక్కలు దోలు రీతిగాదో॥ మనసు॥

చ॥ తవుటికి రంకాడబోతే కూటి
తపిల కోతి కొంపోయినటు కాదో
చెవిటికి యుపదేశించినటు గాదో
శ్రీ త్యాగరాజునుతుని దలంపక॥ మనసు॥

తాత్పర్యము :

ఇది మనస్సును సంబోధిస్తూ మనస్సును గురించి చెప్పినది. ఓరీ మానవా! నీ మనస్సును ఇంద్రియములనెడి నటులకు విటులకు వప్పగిస్తే రాముని కృప కలుగుతుందా? కలుగదు. మనస్సును ఇంద్రియభోగములకు వప్పగించి ఆ రాముని కృపకోసం అర్రులు చాచితే తన ఇంటి తలుపును తీసి ఇంకొకరి ఇంటికి పెట్టి తనయింటి ద్వారంలో కూరుచుండి కుక్కలను త్రోలినట్లు ఉంటుంది. ఒక ఆడుది తన పశువు కోసం తవుడు సంపాదింపవలసియున్నది. దాని కొరకు తనపొట్టకోసం అన్నపు తపేలా తీసుకొని బయలుదేరినది. దారిలో ఒకడు తారసిల్లి తన కామము తీర్చితే తవుడిస్తానన్నాడు. ఆస్త్రీ అన్నపు తపేల నొక చోట బెట్టి వానితో రంకాడబోయినది. అన్నపు తపేలాను కోతి ఎత్తుకొని పోయినది. ఆ స్త్రీ అన్నిటను చెడ్డది. మనసును రామునిపై నుంచక ఇతర విషయములపై నుంచితే నరునకు పై గతియే పడుతుంది. ఇట్లే చెవిటికి హితోపదేశం చేస్తే ఎంత వ్యర్థమో మనస్సును రామునిపై పెట్టకపోతే మానవ జన్మ అంత వ్యర్థము. అని అయ్యగారు చేసిన హితోపదేశము.

398. జయనారాయణి = ఆది

ప॥ మనవిని వినుమా–మరువ సమయమా

అ॥ కనుగొనగోరి దు–ష్కల్పన మాని॥
కనికరమున నిను–బాడుచున్ననా॥ మనవిని॥

చ॥ పరులకు హితమగు – భావన గాని
చెరచు మార్గములు – చింతింపలేను
పరమ దయాకర – భక్తమనోహర
ధరాధిప కరార్చిత! త్యాగరాజు॥ మనవిని॥

తాత్పర్యము :

రామా! నామనవిని వినుమయ్యా! ఇది నన్ను మరచే సమయముకాదు. నన్నొకసారి చూడగోరుము. నామీద చెడ్డకల్పన లేమియు చేయక నామనవిని వినుము. నీమీద కనికరముతో నిన్ను పాడుచున్నాను. ఇతరులకు హితమైన భావనయే చేయుదును గాని పరులకు కీడు కలిగించే మార్గమాలోచించను. అని ఆత్మనివేదనము.

విశేషము = భగవానుడు భక్తుల గానమునకు నిరీక్షించును. భక్తుల గానమే లేకపోతే భగవంతుని సత్తకే భంగము. అందుచేత అయ్యగారు నిన్ను కనికరముతో పాడుచున్నా నన్నారు.

399. నళినకాంతి = ఆది

ప॥ మనవి యాలకించరాదటే
మర్మమెల్లదెల్పెదనే మనసా॥ మనవి॥

అ॥ ఘనుడైన రామచంద్రుని
కరుణాంతరంగమును తెలిసిననా॥ మనవి॥

చ॥ కర్మకాండమతా కృష్టులై భవ
గహన చారులై–గాసి జెందగా
కని మానవావతారుడై
కనిపించినాడే–నడత త్యాగరాజు॥ మనవి॥

తాత్పర్యము :

మనస్సున కుపదేశము. మనసా! నామనవిని వినుము. నీకు రహస్య మంతయు తెలుపుతాను. రాముని దయాంతరంగమును తెలిసిన నామనవిని వినుము. కర్మకాండములచేత ఆకర్షింపబడి జనులు కర్మ ఫలముగా సంసారమున బడిగాసి చెందుతూ ఉంటే జాలి దలచి తాను మానవావతారుడై మానవుడెట్లు నడువవలెనో చేసి చూపినాడు. కనుక నా మనవిని వినుమని త్యాగయ్యగారి బోధ.

విశేషము = మానవుడెట్లు నడువవలెను? అనేదానికి శ్రుతి స్మృతులు పండితుల ఉపదేశములు ఆధారములు. అవెట్లున్నవంటే 'శ్రుతిశ్చభిన్నా స్మృతయశ్చభిన్నాః। మహాబుధానాం మతయశ్చ భిన్నాః। ధర్మస్యతత్త్వం నిహితం గుహాయాం। మహాజనో యేన గత స్సపంథాః' = 'వేదములు పరస్పర భిన్నములుగా నున్నవి. స్మృతులు ఒకదాని కింకొక దానికిని పొత్తులేదు. మహాపండితుల అభిప్రాయములు కలవక భిన్న భిన్నముగా నున్నవి. ఇట్లగుటవలన ధర్మము యొక్క నిజ తత్త్వము గుహలోనే ఉండిపోయినది. ఇకగతిఏమి? అంటే మహాపురుషుడు ఎట్లు నడచెనో అది దారి' అని శాస్త్రము. దీని ననుసరించి రాముడు మానవావతారుడై ధర్మముల నాచరించి చూపెను. ఇది ఐహిక సంబంధముగా. ఇక తన దేవత్వమును ప్రకటించుకొని విభీషణాగమన సమయమున శరణాగత ధర్మము నుపదేశించి తద్వారా విభీషణుని రక్షించి తన సర్వలోక శరణ్యత్వమును చూపినాడు. ఇది త్యాగయ్యగారు 'కనిపించినాడే నడత' అని చెప్పిన దాని భావము. ఈ మర్మమాయనకు తెలిసినది.

40. వరాళి = ఆది

ప॥ మరకతమణి వర్ణ రామా-నన్ను
మరవకు నాయన్నా ... మరకత॥

అ॥ పరమపురుష - బిన్నా బ్రోవుము
దేవరా శరణను కొన్నా॥ మరకత॥

చ॥ వరభక్త సువర్ణ-వాహన
కరుణారస పరిపూర్ణా॥
ధరణితనయకున్న - ప్రేమరసము
త్యాగరాజున కీ వన్నా మరకత॥

తాత్పర్యము :

మరకతమణివంటి శరీర వర్ణముగలరామా! నన్ను మరువకయ్యా! ఓ పరమపురుషా! వేగమే బ్రోవవయ్యా! ఓ దేవా! నిన్నే నేను శరణమనుకొన్నాను. గొప్పభక్తులు కలవాడా! గరుత్మంతుడు వాహనమైన వాడా! కరుణనిండినవాడా! సీతపై నున్న ప్రేమను నాపై చూపవయ్యా! అనిప్రార్థనము.

విశేషము = 'అరయశంతను పుత్రుపై విదురుపై అక్రూరుపై కుబ్జపై! వరవ కల్గిన నీ కృపారసము నాపై కొంత రానిమ్ము' అని ఒక భక్తుడు కృష్ణని ప్రార్థించినాడు. అట్లే అయ్యగారు కూడ సీతపైన ప్రేమ తనమీద చూపమనినారు. ఇది భాగవత మందలి పద్యము.

401. కేదారం = ఆది

ప॥ మరచేవాడనా నిను–మదన జనక॥ మరచే॥

అ॥ మరకతాంగనీ–మది నెంచవలదు॥ మరచే॥

చ॥ కాని మానవులు–కరుణలేక నాపై
లేని నేరము – లెంచిన గాని
శ్రీనిజముగ నా–చెంత చేరిన గాని
రాని నీదయ త్యాగ–రాజనుత॥ మరచే॥

తాత్పర్యము :

ఓ మదనజనకా! మరకతాంగా! రామా! నేను నిన్ను మరచెదనా? మరువను. ఆ విధముగా నీవు మనసున భావింపవద్దు. శత్రువులు నాపై నిందలు వేసిన కాని కాలమందయినా, నాకు పెద్ద సంపద కలిగిన కాలమందయినా నిన్ను మరువ నని నివేదనము.

విశేషము = కష్టములు కలిగినప్పుడు భగవంతుని స్మరించుట, సంపదలు కలిగినప్పుడు భగవంతుని మరచుట లోకసహజము. అట్లు కాక సంపదాపదల యందును నిన్ను మరువనని అయ్యగారు చెప్పుకొన్నారు. భక్తులు ఈ మరువకుండుటను ప్రధానముగా కోరుకొందురు. కులశేఖరులు 'అవిస్మృతి స్తవ్చరణారవిందే! భవేభవే మేస్తు

భవత్ప్రసాదాత్' = ఓ ముకుందా! నీ అనుగ్రహము వలన నేను! నీ పాదములను మరువకుందును గాక' అని వేడుకొన్నారు.

402. దేవగాంధారి = ఆది (దివ్యనామము)

ప॥ మరువకురా నవ-మన్మధరూపుని॥ మరువకు॥

చ॥ నీటో మెల్లని మాటో కన్నుల
తేటో మరి వలె-వాటో మనసా॥ మరువకు॥

2 కులుకో పావల-గిలుకో కపురపు
పలుకో చెక్కుల తళుకో మనసా॥ మరువకు॥

3 విల్లో ఘంటల-ఘల్లో సుమముల
ఇల్లో సేసపు-కొల్లో మనసా॥ మరువకు।

4 కేలో ఉంగ-రాలో బంగరు
య్యాలో చెంతని-ల్లాలో మనసా॥ మరువకు॥

5 శరమో కనకాం-బరమో శ్రీకర
యురమో బ్రోచే-దురమో మనసా॥ మరువకు॥

6 ఆజీవము హృ-ద్రాజీవముతో
పూజింతుర త్యాగ-రాజనుతుని మనసా॥ మరువకు॥

తాత్పర్యము :

ఇందు రామునిసర్వాంగీణమగు సౌందర్యము వర్ణింపబడినది. నవమన్మధరూపుడయిన రాముని ఓ మనసా! ఎప్పుడును మరువకు. ఏమి ఆనీటు!! ఏమి ఆ మెల్లని మాట!! ఏమి ఆకన్నులతేట!! ఏమి ఆ ఉత్తరీయపు వల్లెవాటు? ఆహా-ఎంతటి కులుకో!! ఆ పాదుకల ధ్వని ఎంతబాగున్నది. రాముని చూచుట కర్పూరపు పలుకువలె నున్నది. ఏమి ఆ చెక్కిళ్ల తళుకు? ఆ విల్లు చూడు!! ఆ వింటి గంటల గలగల వినుఁ!! ఈపరిసరమంతయు పువ్వుల ఇల్లుగా నున్నది. అక్షతల జల్లుగా నున్నది!! మనసా! రాముని ఆ ఉంగరాల వేళ్లు చూడు!! ఆ బంగరు ఊయెల!! దానిపై సీతాకాంత!! ఏమి మనోహర దృశ్యము?? ఆశరము, ఆ కనకాంబరము, ఆ ఉరము,

భక్తులను రక్షించు ఆ త్వర!! మనసా! వీటిలో దేనినీ మరువకుము. నేను బ్రతికి యున్నంత కాలమును నా హృదయ మనెడు పద్మముతో రాముని పూజించుకొంటాను. అని అయ్యగారి పెల్లుబికిన ఆనందము.

విశేషము = 'రాముని రూపము కప్పురపు పలుకు' చంద్రా లోకమను అలంకార శాస్త్రమునందు ఒకడు తన ప్రేయసిని 'కర్పూరంతీ దృశోర్మమ' = నా కన్నులకు కర్పూరము వలె నున్నది' అన్నాడు. అయ్యగారు రాముని విషయముగా ఈ ఆలంకారిక సూక్తిని వాడినారు. కృతి చరణములన్నియు యమకాలంకారము కలిగి (నీటో తేటో వంటివి) కడు మనోహరముగా నడిచినవి.

403. కాంభోజి = ఆది

ప॥ మరి మరి నిన్నే – మొరలిడ నీ
మనసున దయరాదు॥ మరిమరి॥

అ॥ కరిమొరవిని సరగున చన నీకు
కారణమేమి? సర్వాంతర్యామీ॥ మరిమరి॥

చ॥ కరుణతో ధ్రువుని–కెదుటనిల్చిన
కథ విన్నానయ్యా
సురరిపు తనయునకై నరమృగమౌ
సూచన లేమయ్యా
మరచియున్న వనచరుని బ్రోచిన
మహిమ తెలుపవయ్యా
ధరను వెలయు త్యాగరాజ నన్నుత
తరము గాదికనే–విననయ్యా॥ మరిమరి॥

తాత్పర్యము :

రామా! మరీ మరీ నిన్ను వేడుకొంటున్నాను. కానీ నీ దయ వచ్చుటలేదు. కారణము? నిర్దయుడవా? కాదు. కరిని, ధ్రువుని ప్రహ్లాదుని, మరచిపోయిన సుగ్రీవుని ఇతమందిని రక్షించితివి. నాపై నిర్దయయా! కారణము చెప్పుమని అయ్యగారు నిలువదీసినారు. మాయకా డేమేమో చెప్పునని ఇంతలోనే ఊహించి నీవేమి చెప్పినా నేను వినను అని శఠించినారు.

విశేషము = 'మరచిన వనచరుని బ్రోచిన' వివరము. వాలి వధము రాముని ప్రతిజ్ఞ. సీతాన్వేషణము సుగ్రీవుని ప్రతిజ్ఞ. సింహాసన మెక్కిన సుగ్రీవుడు తన ప్రతిజ్ఞను

మరచినాడు. రాముడు లక్ష్మణుని ద్వారా ప్రతిజ్ఞను గుర్తుచేసి సుగ్రీవునకు సుకృతమును కలుగ జేసినాడు. ఇదియే సుగ్రీవరక్షణము. 'అంగీకృతం సుకృతినః ఖలు పాలయంతి' = అంగీకరించిన దానిని పుణ్యవంతులు పాలించెదరు' అని శాస్త్రము. ఆ పుణ్యమును సుగ్రీవునకు కలుగ జేసి రక్షించినాడు. ఇట్లర్థము చెప్పుట ఇచ్చట యుక్తము.

404. శంకరాభరణము = ఆది

ప॥ మరియాద గాదురా॥

అ॥ కరుణాకర వారిని వీరిని
సరిజేసి చూచుచుండేది॥ మరియాద॥

చ॥ రాగము తాళము – రక్తి భక్తి జ్ఞాన
యోగము మరియును రాగములేని
భాగవతులు దర – శమనులే గాని
త్యాగరాజార్చిత – తారకచరిత॥ మరియాద॥

తాత్పర్యము :

రామా! నీవు అల్పులను అధికులను సమానముగా చూచుట మర్యాదకాదు. రాగతాళములు, రక్తి భక్తి, జ్ఞానము, నీపై అనురాగము (రామభక్తి) వీటిని అవలంబించినట్లు కనిపించే బాహ్యవేషలు కేవలము పొట్టనింపుకొందురు. అట్లుగాక నిజభక్తులు కొందరుందురు. రామా! వారిని వీరిని సరిపోల్చి చూచుట నీకు మర్యాదకాదు. అని అయ్యగారి విన్నపము. అనగా తనను దాంభిక భక్తులతో సరిచూడవద్దు. నిజభక్తులతో సరిచూడవలయునని.

405. భైరవము = ఆది

ప॥ మరియాదగాదయ్యా. మనుపవదేమయ్యా మరియాద॥

అ॥ సరివారిలో నన్ను-చౌకజేయు టెల్ల శ్రీ
హరిహరి నీవంటి – కరుణా నిధికి॥ మరియాద॥

చ॥ తనవార లన్యులనే- తారతమ్యము మును
ఘనుడైన దాశరథికా- కలదని కీర్తికాదా
నిను బాయనేరని- నను బ్రోవకుండేది
ధన దసఖుడగు- త్యాగరాజ పూజిత॥ మరియాద॥

తాత్పర్యము :

నన్ను రక్షింపవేమయ్యా! హరి హరీ! నా సరివారలలో నన్ను తేలిక పరచుట నీవంటి కరుణానిధికి మరియాదకాదు. అంతేకాక నావాడు పరాయివాడు అనే తారతమ్యబుద్ధి రామునకు లేదని నీకు కీర్తి. ఇప్పుడు దానిని పోగొట్టుకొనుట మర్యాదకాదు. ఒక వేళ ఆ భేదబుద్ధి ఉంటే నన్ను తనవానిగా భావించు. ఎందుచేతనంటే నిన్ను ఎడబాయలేనివాడను. అపుడు నీ వాడను కాదా? అని భావము.

విశేషము = విభీషణాగమన సమయందు సుగ్రీవాదులు వాడు శత్రువు తమ్ముడు. కనుక పరిహరింపదగినవాడు. అని అంటే రాముడు వాడు నా వాడే అని స్వీకరించినాడు. కనుక రామునకు స్వపరభేదము లేదనే కీర్తి ఉన్నది. అట్టి నీవు నన్ను బ్రోవకుండుట మరియాద కాదని అయ్యగారి ప్రార్థనము.

406. జయంతశ్రీ = ఆది

ప॥ మరుగేలరా - ఓ రాఘవా॥ మరు॥

అ॥ మరుగేల చరా-చరరూప పరా
త్పర! సూర్యసుధా-కరలోచనా॥ మరు॥

చ॥ అన్ని నీవనుచు-అంతరంగమున
తిన్నగా వెదకి-తెలుసుకొంటినయ్య
నిన్నె గాని మది-నెన్నజాల నొరుల
నన్ను బ్రోవవయ్య-త్యాగరాజనుత॥ మరు॥

తాత్పర్యము :

ఓ రామా! మరుగేలనయ్యా! నీసాక్షాత్కారము నాకు కావలసియున్నది. నీవు మరుగగుచున్నావు. కాని ఈ చరాచరములు నీ రూపము. సూర్యచంద్రులు నీకనులు. ఇక నీమరుగెట్టిది. నాకు నీవే అన్నియునని అన్వేషించి తెలుసుకొన్నాను. నిన్ను దప్ప

ఇతరులను నేను వేడలేను, పాడలేను. నన్ను బ్రోవవలసినది నీవే. అని అయ్యగారి ప్రార్థనము.

విశేషము = 'అన్ని నీవనుచు' వివరము. 'పితాచ రక్షక శ్శేషీ! భర్తా జ్ఞేయో రమాపతిః। స్వా మ్యాధారో మమాత్మాచ భోక్తా చాద్య మనూదితః' = భగవంతుడు తండ్రి, రక్షకుడు, ఆజ్ఞాపించువాడు, భరించువాడు, తెలియదగినవాడు, ప్రభువు, ఆధార మయినవాడు, ఆత్మ అయినవాడు, అనుభవించువాడు, ఇన్ని సంబంధములు జీవునకు దేవునకు మధ్యనున్నవి.

407. ఋషభప్రియ = ఆది

వ॥ మహిమదక్కించుకోవయ్య – మహిని సత్యస్వరూపుడను॥
మహారాజరాజేశ్వరనీ॥ మహిమ॥

అ॥ విహితమార్గభక్తులు – మహాత్ములు
వెలయంగవినలేదా – స్వకీయ॥ మహిమ॥

చ॥ పనికిరాని పనులు–జేసి శరణను
వారి వెతలు దీర్చి–బ్రోచితివే
తనివి దీర నమ్మి–నాడనుచు శ్రీ
త్యాగరాజ నుత–తప్పులాడకు॥ మహిమ॥

తాత్పర్యము :

రామా! సత్యస్వరూపుడు అనే మహిమ నీకున్నది. మహారాజ రాజేశ్వరుడవను మహిమ ఉన్నది. దీనిని దక్కించుకోవయ్యా! వేదము చెప్పిన ధర్మమార్గమున నడచిన భక్తమహాత్ములు నీకు లేరా? ఇట్లుండగా పనికి రాని పనులు చేసి నిన్ను 'శరణు' అన్నవారిని రక్షించితివే? నేను తనవి దీర నిన్ను నమ్మియున్నాను. నన్నేల బ్రోవవు? బ్రోచి నీ మహిమను దక్కించుకొమ్ము. అని అయ్యగారి హెచ్చరిక.

విశేషము = రాముడు రాజుగా మహారాజరాజేశ్వరు డగుట మాత్రమే కాదు. నారాయణానువాకమందు. 'రాజాధిరాజాయ ప్రసహ్యసాహినీ' 'మహారాజాయనమః' అని అది ప్రతి పాదింపబడియున్నది. రామావతారమందును అది అనుస్యూతమై వచ్చినది. కాకాసురుడు 'పనికిరాని పని' చేసి శరణన్నాడు. వానిని రాముడు రక్షించినాడు. రాముని

వాక్యము కూడ నున్నది. 'దోషోయద్యపి తప్యస్యాత్। సతామేత దగర్హితం' = దోషి అయినను వానిని రక్షించెదను. సత్పురుషులు శరణనువాని దోషమును గర్హింపరు' అని. కనుక రామా ఇవన్నియు నాలోచించి నన్ను రక్షించి నీ మహిమ దక్కించు కొనుమని అయ్యగారి హితబోధ.

408. శంకరాభరణం = చాపు

ప॥ మనసు స్వాధీనమైన యాఘనునికి
మరి మంత్రతంత్రములేల

అ॥ తనువు తాను గా దని ఎంచు వారికి
తపసు జేయనేలా – దశరథబాల మనసు॥

చ॥ అన్ని నీవని యెంచిన వానికి
ఆశ్రమ భేదము లేల
కన్నుగట్టు మాయలని యెంచువానికి
కాంతల భ్రమలేల– దశరథ బాల మనసు॥

2 ఆ జన్మము దుర్విషయ రహితునికి– గ
తాగతములేల
రాజరాజేశ– నిరంజన నిరుపమ
రాజవదన త్యాగ– రాజవినుత॥ మనసు॥

తాత్పర్యము :

మనస్సు స్వాధీనమై ఉన్నవానికి మంత్రతంత్రములతో పనిలేదు. తనువే తానుకాదు అని తెలిసినవానికి తపస్సు అవసరము లేదు. ఓ దశరథ కుమారా! అన్నియు నీవే అని ఎంచేవానికి వేరే సన్యాసాశ్రమ మక్కరలేదు. ప్రపంచమంతయు ఇంద్రజాలము అని తెలిసిన వానికి స్త్రీలపై భ్రమ ఉండదు. పుట్టినది మొదలుకొని దుర్విషయము లేని వానికి కడచినది– రాబోవునది అనే భేదముండదు. ఇది తాత్పర్యము

విశేషము = పై విషయము లెట్లున్నా రామభక్తి మాత్రముండవలెను అని త్యాగయ్యగారి ప్రధానాశయము.

409. కాంభోజి = చాపు

ప॥ మహిత ప్రవృద్ధ శ్రీమతి గుహగణపతి జనని

అ॥ పాహి వదన జితసుధాకరే శ్రీకరే॥
పాహి సుగుణరత్నాకరే॥ మహిత॥

చ॥ దేహి చరణభక్తి – మఖిలదేహిని సదాశుభపల
దే హిమగిరితనయే వై–దేహీపస హోదరి॥ మహిత॥

2 వాహినీశసన్నుతే న–వాహి భూషవల్లభే భ
వాహి నీలకంఠి–సింహ–వాహిని జనని॥ మహిత॥

3 పార్థ సన్నుత ప్రియే ప–దార్థ పుణ్యదూరే కామి
తార్థఫలదే శ్రీతప–స్తీర్థ పురనివాసిని!॥ మహిత॥

4 రాజశేఖరాత్మభూ వి–రాజరాజ సన్నుతే స
రోజదళని భాషి త్యాగ–రాజ భాగ్యదాయకి॥ మహిత॥

తాత్పర్యము :

ఇది తపస్తీర్థనివాసిని (లాల్‌గుడి) అయిన ప్రవృద్ధ శ్రీమతీ దేవి స్తుతిపరమయిన సంస్కృతకృతి. ప్రతి పదార్థము మాత్రము వ్రాయబడుచున్నది. గుహ గణపతి జనని = కుమార స్వామికి గణపతికి తల్లీ! వదన జితసుధాకరే = ముఖకాంతితో చంద్రుని జయించిన దానా! శ్రీకరే = సంపదనిచ్చుదానా! సుగుణ రత్నాకరే. సుగుణముల గని యైనదానా! చరణభక్తిం = నీపాద భక్తిని, దేహి = ఇమ్ము అఖిలదేహిని = సమస్తమును నీ దేహమైనదానా! సదా శుభపలదే = ఎపుడును శుభముల నిచ్చుదానా! హిమగిరి తనయే = హిమవంతుని కూతురా! వైదేహీపసహోదరి = సీతాపతి అయిన రాముని చెల్లెలా! వాహినీ శసన్నుతే = సముద్రునిచే స్తుతింపబడినదానా! నవాహిభూషవల్లభే! క్రొత్త సర్పములను ధరించిన శివుని రాణీ! భవాహినీలకంఠి = సంసార మనెడు సర్పమునకు నెమలి అయినదానా! సింహవాహని = సింహము వాహనమైన దానా! జనని = తల్లీ! పార్థసన్నుతప్రియే = అర్జునుడు స్తుతించిన శివునకు ప్రియురాలా! పదార్థ పుణ్యదూరే= వాగర్థములకు పుణ్యములకును దూరమైనదానా! (చెప్పుటకు అతీతమైన దానా)

పుణ్యములచే సాధింపలేనిదానా!) కామితార్థ ఫలదే = కోరిన ఫలము నిచ్చుదానా! శ్రీతపస్తీర్థపురనివాసినీ! రాజశేఖరాత్మ భూవిరాజ రాజ సన్నుతే = శివునిచే బ్రహ్మచే విష్ణువుచే సన్నుతింపబడినదానా! సరోజ దళాక్షి = తామరరేకుల వంటి కనులుగల దానా! త్యాగరాజ భాగ్యదాయకి = త్యాగరాజునకు భాగ్యములొసగు దానా! పాహి పాహి = రక్షించు రక్షించు.

410. రవిచంద్రిక = ఆది

ప॥ మాకేలరా విచారము
మరుగన్న శ్రీరామచంద్ర॥ మాకేల॥

అ॥ సాకేతరాజ కుమార
సద్భక్త మందార – శ్రీకర॥ మాకేల॥

చ॥ జితగూర్చి నాటక సూత్రమును
జగమెల్ల మెచ్చగ – కరముననిడి
గతితప్పకాడించేవు సుమీ
నత త్యాగరాజ గిరీశ వినుత॥ మాకేల॥

తాత్పర్యము :

మన్మథుని గనిన రామా! అయోధ్యాధిపా! భక్తులకు కల్పవృక్షమయిన వాడా! మాకు విచారమేల? నీవు ఈ జగములను అన్నిటిని చేర్చి జగన్నాటకమనే సూత్రముతో బిగించి నీచేత పెట్టుకొని గతి తప్పకుండా ఆడిస్తావు. జనులందరు మెచ్చేటట్లు ఆడిస్తావు. నీవు ఆడించినట్లు నేనాడుతాను. ఇక మాకు భయము కాని ఆలోచనకాని అవసరములేదు. అని నిర్భరత్వాను సంధానము. (మనదేమియు లేదు. అంతయు పరమాత్ముడే చూచుకుంటాడు అని తలచుట).

విశేషము = 'భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా' = సర్వభూతములను మరబొమ్మల వలె త్రిప్పుచున్నాడు భగవానుడు' అని గీతా ప్రమాణము.

411. కాంభోజి = ఆది

ప॥ మా జానకి చెట్టబట్టగ-మహారాజువైతివి॥ మాజానకి॥

అ॥ రాజరాజ వర-రాజీవాక్ష! వినుము
రావణారియని-రాజిల్లు కీర్తియు॥ మాజానకి॥

చ॥ కానకేగి ఆజ్ఞ - మీరక మాయా
కారమునిచి శిఖి చెంతనే యుండి
దానవుని వెంట-నే చని అశోక
తరుమూలమున నేయుండి
వాని మాటలకు-కోపగించికంట
వధియించకనే-యుండి
శ్రీనాయకా-యశము నీకే గల్గ
జేయలేద త్యాగ-రాజపరిపాల॥ మాజానకి॥

తాత్పర్యము :

రాముడు ఎన్ని విధముల ప్రార్థించినను తనను రక్షింపకున్నాడు. అనే అభిప్రాయము అయ్యగారి కున్నది. దీనితో రామునితో అనేక రూపములతో అయ్యగారు మాట్లాడినారు. అందులో ఈ కృతి ఒక్కటి. రామా! నీ గొప్పతన మేమియు లేదులే. అనుచున్నారు. రామా! మా జానకి నిన్ను చెట్టుపట్టుట చేత నీవు గొప్పవాడ వయ్యావు. రావణుని సంహరించిన నీ కీర్తి కూడ ఆమె వలననే నీకు దక్కినది. వివరములు చెప్పెద వినవయ్యా! నీతో అడవికి వచ్చినది. అడవిలో నీ యాజ్ఞమీరలేదు. రావణుడు కొనిపోవునపుడు తన మాయాకారమును రావణుని వశము చేసి తన నిజరూపమును అగ్ని యం దుంచినది. రావణుని వెంటవెళ్లి అశోక వృక్షమూలమం దున్నది. రావణుని కంటిచూపుతో వధింపక యున్నది. ఇవన్నియు నీకు కీర్తి కలుగుటకొరకే ఆమె చేసినది. అందు చేతనే రావణారి అనే కీర్తి నీకు దక్కినది. అని అయ్యగారు రాముని లఘూకరించినారు.

విశేషము = రావణుడు ఒక ఉషఃకాలమందు సీతవద్దకు వచ్చి తనను వరింపుమని కోరినాడు. అప్పుడు ఒక గడ్డి పరకను మధ్యలో బెట్టుకొని 'అసందేశాత్తు రామస్య। తపసశ్చాను పాలనాత్। న త్వాం కుర్మి దశగ్రీవ। భస్మ భస్మార్హ తేజసా' = ఓరీ రావణా!

నేను నాపాతివ్రత్యతేజస్సుతోనిన్నిప్పుడే భస్మము చేయగలను. కాని రాముని ఆజ్ఞలేకపోవుటచే ఆ పని చేయలేకున్నాను బ్రతికిపోయితివి. అని అన్నది. అట్టి శక్తి ఆమె కున్నది. దీనికి రుజువు హనుమంతుని తోకకు నిప్పంటినప్పుడు 'శీతోభవ హనూమతః' = ఓ అగ్నిదేవా! హనుమంతునకు చల్లబడుము' అన్నది. అగ్నిదేవుడు చల్లబడినాడు. ఇది ఆమె శక్తికి నిదర్శనము. అది ఉండియు రాముని ఆజ్ఞలేదని ఊరకున్నది. అయ్యగారు 'ఆజ్ఞమీరక' అనినదాని వివరము. హనుమంతుడు తన భుజమెక్కిరమ్మని నప్పుడు 'తత్తస్యసదృశం భవేత్' = రాముడు రావణుని వధించి నన్ను కొనిపోవుటయే ఆయన పౌరుషమునకు తగినది' అన్నది సీత. ఇదంతయు రామునకు కీర్తి కలిగించుటకే కాదా! ఈ వాల్మీకములను బట్టియే అయ్యగారు 'మా జానకి చెట్టబట్టగ మహారాజువైతివి' అని అన్నారు. ఇది రావుదాసుగారి 'రావా నీ చేతేమి కాదుగా! సీతాభామకైనను చెప్పరాదుగా' అనే దానిని తలపించుచున్నది.

412. నీలాంబరి = ఆది

ప॥ మాటాడవేమినాతో – మాధుర్యపూర్ణాధర॥ మాటాడ॥

అ॥ సాటి దొరకని రామ–స్వామి! మది రంజిల్ల॥ మాటాడ॥

చ॥ ఎదురెదురె చూచి ఎందుగానక నా
హృదయాని కెంతో హితవు లేక
సదయుడ నేనుండగ– సముఖము దొరికితే–నీ
రదవర్ణ! త్యాగ–రాజార్చిత! ముద్దుగా॥ మాటాడ॥

తాత్పర్యము :

ఓ మాధుర్యపూర్ణాధరా! తియ్యని పెదవులు కలవాడా! సాటి దొరకని = సాటిలేని రామస్వామీ! నా మనస్సు రంజిల్లు నట్లుగా నాతో మాటాడవేమయ్యా! ఎదురుతెన్నులు చూచిచూచి నీదయరాక హితములేక దయమాలిన వాడనై ఎదురుగా కూరుచుండి వినేవాడను నేను దొరికితినికదా! ఏలమాటలాడవు? నావలె నీ మాటలు వినుటకు ఎవ్వడును దొరకడు అని భావము.

విశేషము = 'న తత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే' = భగవంతునితో సాటివాడు, అధికుడును ఎచ్చటను లేడు' అని వేదవాక్యము. దానిని బట్టి అయ్యగారు 'సాటిదొరకని రామస్వామి' అని అన్నారు.

413. మోహన = త్రిపుట

ప॥ మాటిమాటికి దెల్పవలెనా ముని
మానసార్చిత చరణ రామయ్య నీతో॥ మాటిమాటికి॥

అ॥ నూటికొక్కటె మాట చాలదా
నాటిమొదలుకొని సాటిలేని నీతో॥ మాటిమాటికి॥

చ॥ పంకజవదనా-సరసవినోదా
సంకటములను వేగమె దీర్పరాదా
శంకర ప్రియ! సర్వాంతర్యామివి గాదా॥
ఇంక నామది నీకు తెలియగ లేదా॥ మాటిమాటికి॥

2 కరుణా సాగర పరిపూర్ణ నీకు
సరి వేల్పులు లేరనుచు నీవరకు
మొర బెట్టిన నాపై ఏల పరాకు
వరులు జూతురు భాండమున కొక్కమెతుకు॥ మాటిమాటికి॥

3 శృంగార శేఖర-సురవైరి రాజ
భంగ! సుజన హృత్కుముద భరాజ
మంగళ కర రూప జితరతిరాజ
గంగా జనక పాలిత త్యాగరాజ॥ మాటిమాటికి॥

తాత్పర్యము :

ముని మానసార్చిత చరణ=మునుల మనస్సులచే అర్చింప బడిన పాదములు గలవాడా! ఓ రామా! నేను నీకు మాటిమాటికిని తెలుప వలెనా? ఎంత కాలము నుంచి యో నీతో ఎన్నో నూరుల మాటలాడినాను. నేను మాటలాడిన మాటలలో నూటి కొకమాట నీవు మాటాడితే నాకు చాలు. (తరువాత విశేషణ సంబోధనము లెక్కువ యున్నవి అవి అన్నియు ముందు వ్రాసెదను). పంకజవదనా =పద్మము వంటి ముఖము

గలవాడా! సరస వినోదా! = ఈ లోక సృష్టియే సరస వినోదమయిన వాడా! శంకరునకు ప్రియ మయిన వాడా! సర్వాంతర్యామీ! కరుణాసాగరుడా! పరిపూర్ణుడా! శృంగార వంతులలో శేఖరుడా! రావణుని భంజించిన వాడా! సజ్జనుల హృదయము లనెడి కలువలకు చంద్రుడా! మంగళ కరమగు రూపముతో మన్మథుని జయించిన వాడా! గంగకు తండ్రి అయిన వాడా! త్యాగరాజును పాలించిన వాడా! నీసరి వేల్పులు లేరని తెలిసి ఇంతవరకు నీతోనే మొరబెట్టుకొన్న నాపై పరాకా? తెలివి కలవారు అన్న మంతయు పట్టి చూడరు. ఒక్క మెతుకును పట్టి చూచి అన్న ముడికినదని తెలుసు కొందురు. అట్లే నన్నింకను పరీక్షింపక నాభక్తి పాకమును తెలుసు కొనుమని ప్రార్థనము.

414. అమీర్ కల్యాణి = ఆది

ప॥ మానము లేదా? తనవాడనే అభి॥ మానము॥

అ॥ కానురానీ వలె నిర్మోహిని॥
గాన రుచి తెలియు– కుశలవజనక॥ మానము॥

చ॥ నీ సముఖాన రవి– తనయుడు నిన్ను
బాసలు బల్కగ – రోసముతో సిం
హాసనాధి పతి– జేసిన నీకు
దాసుడైన త్యాగ– రాజకరార్చిత॥ మానము॥

తాత్పర్యము :

ఓ రామా! నా మీద నీకు ప్రేమాభిమానములు లేవా? తనవారిపై ప్రేమ చూపలేని నీ వంటి నిర్మోహిని (మోహము లేని వానిని) ఎక్కడను చూడబోము. గాన రుచి తెలిసిన వాడవు. కుశలవులకు తండ్రివి అనుకొన్నాము. కాని ఇంత ప్రేమ రహితుడవు అని అనుకొనలేదు. ఆనాడు నీ ఎదురుగా సుగ్రీవుడు బాసలు పలికినాడు. నీవు రోషముతో వాలిని వధించి సుగ్రీవుని సింహాసన మెక్కించినావు. అట్టి నీకు నేను దాసుడను, అర్చకుడను, నాపై నీకు మానాభిమానములు (వీడు నావాడనే భావములు) లేవని అయ్యగారి నిర్వేదము.

విశేషము = అలనాడు కుశలవులు రాముని సభకు వచ్చి రాముని ఎదుట రామాయణ గానము చేయగా, రాముడు రంజిల్లి సింహాసపు మెట్లు దిగి వచ్చి కుశలవులను చాలా అభిమానించినాడు. ఈనాడు త్యాగయ్యగారు చేసినదియు రామగుణ

గానమే. కాని కుశవులపై చూపిన అభిమానమును తనపై చూపలేదు అని అయ్యగారి భావము. ఆ భావాను గుణముగా ఈకృతి వచ్చినది. సుగ్రీవుని మాత్రమైనా నన్నభిమానించ లేదనియు అయ్యగారి నిర్వేదము.

415. జగన్మోహిని = ఆది

ప॥ మామవ సతతం రఘునాథ॥ మామవ॥

అ॥ శ్రీమదినాన్వయ సాగర చంద్ర॥
శ్రితజన శుభ ఫలద– సుగుణ సాంద్ర॥ మామవ॥

చ॥ భక్తి రహిత శాస్త్రవి దతి దూర
పంకజ దళనయన–నృపకుమార
శక్తి తనయ హృదాలయ – రఘువీర
శాంత నిర్వికార.....
యుక్త వచన కనకాచల ధీర
ఉరగ శయన మునిజన పరివార
త్యక్త కామ మోహమద గంభీర
త్యాగ రాజరిపు జలద సమీర॥ మామవ॥

తాత్పర్యము :

ఇది సంస్కృత కృతి. అన్నియు సంబోధనములే. అర్థము వ్రాయబడుచున్నది. ఓ రఘునాథా! శోభాకరమయిన సూర్యవంశమనెడి సముద్రమునకు చంద్రుడా! ఆశ్రితులకు శుభఫలము లిచ్చువాడా! సుగుణములు కలవాడా! భక్తిని చెప్పని శాస్త్రములు తెలిసిన వారికి చాలా దూరమైన వాడా! భక్తిలేక శాస్త్రములు చదువు కొన్నవారికి చాలదూరమైన వాడా! (అని కూడ చెప్పవచ్చును) పద్మముల వంటి కనులు గలవాడా! రాజకుమారుడా! పరాశర మహర్షి మనమందుండు వాడా! రఘువీరుడా! శాంతమగు వాడా! సంపదాపదలయందు మానసికమగు మార్పు లేని వాడా! యోగ్యమగు మాటల వాడా! మేరు పర్వతము వంటి ధీరుడా! శేషునిపై పవ్వళించువాడా! మునులు పరివారమైన వాడా! కామ మోహమదములను త్యజించినవాడా! గంభీరమైన వాడా! త్యాగరాజుని శత్రువులనెడి మేఘములకు గాలి యయిన వాడా! మాం=నన్ను, సతతం= ఎల్లప్పుడును, అవ=రక్షించుము. అని ప్రతి పదార్థము.

416. సారంగ = రూపకం (దివ్యనామము)

ప॥	మామవ రఘురామ। మరకతమణిశ్యామ॥	మామవ॥
	పామరజన భీమ। పాలిత సుత్రామ॥	మామవ॥
చ॥	దురితంబులు పోదు। దునుమ మనసు రాదు॥	మామవ॥
2	కలశాంబుధిలోన। కరుణ కరగి పోయెనా॥	మామవ॥
3	వినుమరి సమరమున। విధిశరము విరిగెనా॥	మామవ॥
4	కలసత్యము సుగుణా। కాననమున నిలచెనా॥	మామవ॥
5	దివ్య నరాపఘ నా। దైవత్వము బోయెనా॥	మామవ॥
6	రాజధిప త్యాగ। రాజవినుత! బాగ॥	మామవ॥

తాత్పర్యము :

ఇది పల్లవి మాత్రము సంస్కృతము, చరణములన్నియు తెలుగు. ఓ రఘురామా! మరకతమణి వంటి నల్లనివాడా! పామర జనులకు భయంకరుడా! దేవేంద్రుని పాలించిన వాడా! నా పాపములు వాటి అంతట అవి పోవు. పోగొట్టునే మనసు నాకు రాదు. పాపాత్ములనయిన రక్షించే కరుణనీకున్నది. మరి ఆ కరుణ ఇప్పుడు సముద్రములో కలసి పోయినదా! ఇంకా వినురామా! నీకున్న సత్యము అడవి నిలచి పోయినదా? నీ దివ్య శరీరము, నీ దైవత్వము పోయినవా? రఘురామా! మాం= నన్ను అవ= రక్షించుము. ఇది తాత్పర్యము.

విశేషము = 'శరచాపముల శక్తి తప్పెనా? నీశౌర్యము జలధిలో జొచ్చెనా' అనే రామదాసు గారి పాటను ఇది గుర్తుకు తెస్తున్నది.

417. శ్రీరంజని = ఆది

ప॥	మారు బల్క కున్నావేమిరా – మామనోరమణ॥	మారు॥
అ॥	జార చోర భజన జేసితినా – సాకేత సదన॥	మారు॥
చ॥	దూరభారమందు నాహృద–యార విందమందు–నెలకొను దారి నెరిగి సంతసిల్లి నట్టి–త్యాగరాజనుత॥	మారుబల్క॥

తాత్పర్యము :

ఓ మామనోరమణా! = లక్ష్మీరమణా! నేనెంత పిలచినా మారు బలుక వేమయ్యా? నా తప్పులయినా చెప్పవచ్చును కదా! జారులను చోరులను భజన చేసి తిరిగితినా? నీవు దూరమందున్నావు, నా హృదయంలోనూ ఉన్నావు. ఈ దారి నాకు తెలిసినది. తెలిసి సంతసిల్లినాను. ఇట్టి త్యాగరాజునిచే పాగడబడు రామా! మారు బలక వేల, అని ప్రశ్న.

విశేషము = జార చోర భజన? 'అన్యథా సంత మాత్మానం। యోన్యథా పతిపద్యతే। కింతేన నకృతం పాపం। చోరేణాత్మా పహారిణా' = ఒక విధముగా నున్న ఆత్మను మరొక విధముగా ఎవడు భావించునో అట్టివాడు ఆత్మాపహారి అయిన చోరుడు. వాడు చెయ్యని పాపము లేదట. (అన్ని పాపములను చేసినట్లే) అని శాస్త్రము. 'స్వత్వ మాత్మని సంజాతం। స్వామిత్వం బ్రహ్మణిస్థితం' = ఈ ఆత్మ సొత్తు. భగవానుని సొత్తు. అనియును శాస్త్రము. 'ఇట్లున్న ఆత్మ నా సొత్తే అని భావించి కర్తృత్వ భోక్తృత్వాదులను భగవదధీనములు అనుకొనక తనవిగా భావించువాడు ఆత్మ నపహరించిన చోరుడు. ప్రతి వస్తువును తనదిగా భావించువానిని జారుడన్నది శాస్త్రము. త్యాగయ్యగా రిట్టి జార చోరుల భజన చెయ్యలేదని చెప్పినారు. బ్రహ్మమును గూర్చి 'తద్దూరే తదంతికే' = అది దూరమున నున్నది, అది సమీపమున నున్నది'! అని ఉపనిషద్వాక్యము. అనగా ఈ బ్రహ్మాండాది సప్తావరణములు దాటి పైను జీకటి కవ్వల నున్నది వైకుంఠము. అది దూరభారము. హృదయమందు ఉన్న అంతర్యామి సమీపము. ఈ రహస్య మెరిగి సంతసిల్లు వాడు త్యాగయ్యగారు. 'అనేన జీవేనాత్మనాను ప్రవిశ్య' = అ జీవునితో కూడ నేను దేహము నందు అను ప్రవేశము చేయుచున్నాను. అని భగవంతుని వేద వాక్యము.

418. పున్నాగవరాళి = చాపు (దివ్యనామము)

ప॥ మానస సంచర రే రామే॥ మానస॥

చ॥ వరముని భక్తలోక చయార్యే
పరమ పావన నిర్జర వర్యే
ముఖజిత భార్యే॥..... మానస॥

2 స్వరజిత ఘనరవ మాధుర్యే
సుర వైరినిచయతమ స్సూర్యే
నిరుపమ శౌర్యే ..... మానస॥

3 వికసిత సరసీరు హనేత్రే
మకరాంక కోటి సన్నిభ గాత్రే
కౌశికమిత్రే..... మానస॥

4 శుక ముఖవినుత సుచారిత్రే
అకలంక సీతా సుక ళత్రే
కరుణా పాత్రే..... మానస॥

5 అగణితలో కాధారే
నగవైరి రిపుజలదసమీరే
దుర్జన దూరే..... మానస॥

6 విగళిత మదహృదయా గారే
నిగ మాగమ సంచారే- హరి పరివారే॥ మానస॥

7 కమలా సన నుత గుణ గ్రామే
కమలారి శేఖర ప్రియరామే-వారిద శ్యామే॥ మానస॥

8 కమలా హృదయ కుముద సోమే
అమల చిత్త జనరిపు భీమే - గోపికాకామే॥ మానస॥

9 వాగీ శేంద్రరు ద్రాధీశే
రాగలో భమద వినాశే-సకలాధీశే॥ మానస॥

10 రాజ రాజ పూజిత రమేశే, త్యాగ
రాజ హృదయ నివేశే- సాకేత పురీ శే॥ మానస॥

తాత్పర్యము :

ఇది సంస్కృత కృతి. దీని సమూహార్థము సమస్త సుగుణములు సమస్త వైభవములు, సమస్త మహిమలు కలిగిన రాముని స్మరింపుమా మనమా అని. ఇది అర్థ సారము.

419. అసావేరి = ఆది

ప॥ మాపాల వెలసి యిక
మము బ్రోవ గరాదా - శ్రీరామ చంద్ర॥ మాపాల॥

అ॥ నీ పాదముల భక్తి -నిండారగ నిచ్చి
కాపాడు శక్తి నీ- కరమున నుండగ॥ మాపాల॥

చ॥ పాప సంహార నా పరితాపములను దునుమ
నేపాటిరా కరుణా పయోనిధి వైన- శ్రీపతీ విధృత
చాపబాణ ఈ పాపమతి నరులా పదల నునే
నే పని జూతును ఆ పద్భాంధవ కాపాడనీకీ పరాకేల॥ మాపాల॥

2 దీన రక్షక భక్తా ధీన సాకేత నగరీశ నామది పద
రిస సుజన మానాభిమాన పాలన సమాన రహిత రో
సాన నీదు దాసానుదాసుడను దాన వాంతకము
దాన నారద సుగాన లోల దరిగాన సంతతము మాపాల॥

3 నాగాధిప వినుత నాగారిరథ నినువినాగతి నెరుగ
నాగ రాజ హృత్సాగ రాబ్జ భవసాగరాంతకా, సు
రాఘహర కన కాగ ధీర! సు నాగగమన- శర
ణాగతాప్త శ్రీ- త్యాగరాజనుత॥ మాపాల॥

Note:- దీనికి తాత్పర్యము వ్రాయుట లేదు. కృతిని కల్లూరి వీర భద్రశాస్త్రిగారి గ్రంధము నుండి ఉన్నది ఉన్నట్లుగా వ్రాయడమైనది. పల్లవి అనుపల్లవియు సరిగా నున్నవి. చరణము కొంచెం గజిబిజిగా నున్నది. అన్వయమును ససిగా కనిపించుటలేదు. తాళ బంధమునకు కూడ సరిగా లేని అనుమానమున్నది. రెండవ చరణం మొదటి పంక్తి చివర రెండవ పంక్తి మొదలు చేరి 'పదరిస' అని స్వరాక్షరాలున్నవి. ఇది కొంత చెడగొట్టినది. సాహిత్యమందును కొన్నిలోపములు పొడగట్టుచున్నవి. పరిష్కారము చేసే సాహసమునకు పూనుకొనలేదు. మనదేశమున కొద్దిమంది విద్యాంసులు దీనిని పాడుదురు. వారి పాటతో సరిచూచి దీనిని సవరింప వలసి యున్నది. అప్పుడు తాత్పర్యము విశేషము చూడ వచ్చును. విభాగములు సరియయిన పద్ధతిలో లేవు.

420. ముఖారి = ఆది

ప॥ మురిపెము గలిగె గదా- రామ-స
న్మనినుత కరివరద-శ్రీరామ॥ మురిపెము॥

అ॥ పరమ పురుష జగ-దీశ వరమ్మిదు
భాష సుగుణ మణి-కోశ నీకు॥ మురిపెము॥

చ॥ ఈడులేని మలయ మారుతము చే
గూడిన కావేరీ తటమందు
మేడల మిద్దెలతో శృంగారము
మించు సదనములలో.....
వేడుచు భూసురు లగ్నిహోత్రులై
వేద ఘోషముల చేనుతి యింప
చూడ శివుడు గోరు యోగ్యమైన
సుందరమగు పురము దొరికె ననుచు॥ మురిపెము॥

2 సకల సుగంధ రాజ సుమములు
సలలిత మగు కోకిల నాదమ్ములు
శుక ముఖ సన కాదుల నుత మైన
సుర తరువులు కలిగి
నికట మందు వాణి కొల్వ సురపతి
నీల మణినిభ శరీర! నేడు
ప్రకటమైన నవరత్న ఖచిత హా
టక మంటపవాసము గలిగెననుచు॥ మురిపెము॥

3 ఈ మహిలో సాగసైన చోళ
సీమ యందు వర మైన పంచనద
ధామని చెంతను ని వసించుటకై
నీ మది నెంచగా.....
కామ జనక త్యాగరాజ సన్నుత
నామ! పవన తనయ విధృత చరణ
క్షేమముగా వర్ధిల్లు పురి సీతా
భామ సౌమిత్రి ప్రక్క గొలుతురని॥ మురిపెము॥

తాత్పర్యము :

సంబోధనల అర్థమును వదలి తాత్పర్యము మాత్రము వ్రాయబడుచున్నది. రామానీకు మురిపెము కలిగినది కదా! నీవు నా ఇంట వెలసినావు. ఇది పంచన

దక్షేత్రము, చక్కని మలయ మారుతము వీచే కావేరీ తటము. పురము నందు చక్కని మేడలు మిద్దెలు ఇండ్లు. బ్రాహ్మణులు వేదఘోషలతో నిన్ను నుతిస్తూ ఉంటారు. పంచనద క్షేత్రాధిపడయిన శివుడు కూడ నిన్ను సేవిస్తున్నాడు. సుగంధ పుష్పములు, కోకిల నాదములతో విరాజిల్లు పారిజాతాది వృక్షములు. సరస్వతి సమీపమున నుండి కొలుచు చున్నది. శ్రీ శుకుడు మొదలయిన మహర్షులు కొని యాడిన క్షేత్రమిది. ఇటువంటి పురమందు మంటపమున నీ నివాసము. అతిలోక సుందరమయిన చోళమండల మందు నీవు నివసించుటకు సంకల్పించినావు. నీ మురిపెము తీరినది. సీతాభామ లక్ష్మణుడు నీ కిరుప్రక్కల సేవ జేయు చున్నారు. ఇట్టి క్షేమముతో వర్ధిల్లుచున్న పంచనద పురము నీకావాసమయినది. అని అయ్యగారి ఆనందము.

విశేషము = అయోధ్యా వాసములో రాముడు సుఖపడినది తక్కువ. రాముడచట క్షేమముగా లేడు. సీతాభామా వియోగము కలిగినది. అందుచేత త్యాగయ్యగారు 'క్షేమముగా వర్ధిలు పురి' అనినారు.

421. మధ్యమావతి = ఆది

ప॥ ముచ్చట బ్రహ్మాదులకు దొరకునా
ముదిత లార చూతాము రారే॥ ముచ్చట॥

అ॥ పచ్చని దేహిని-పరమ పావనిని
పార్వతిని దలచుచు హరుడే గెడు॥ ముచ్చట॥

చ॥ చల్లరె వేల్పుల రీతి విరుల కర
పల్లవ ములను త-ళుక్కనుచు బిరుదు
లెల్ల మెరయ నిజ భక్తులు పొగడగ
ఉల్లము రంజిల్ల.....
తెల్లని మేనున నిండు సొమ్ములతో
మల్లె హారములు మరి శోభిల్లగ
చల్లని వేళ సకల నవరత్నపు
పల్లకిలో వేంచేసి వచ్చు॥ ముచ్చట॥

2 హితమైన సకల నైవేద్యముల స
మ్మతమున అడుగడు కారగింపుచు

మితములేని యుపచారములతో
అతి సంతోషమున సతతము జ
పతపముల నొనరించు
నత జనుల కభీష్టము లవ్వారిగ
వెతకి మొసగె దననుచు పంచనదీ
పతి వెడలి సాగను మీరగ వచ్చు॥ ముచ్చట॥

3 భాగవతులుహరి నామ కీర్తనము
బాగుగ సుస్వరములతో వింత
రాగములను యాలాపము చేయువై
భోగములను జూచి
నాగ భూషణుడు కరుణానిధియై
వేగము సకల సుజన రక్షణమున
జాగ రూకుడై కోర్కెల నొసగు
త్యాగరాజు తాననుచును వచ్చు॥ ముచ్చట॥

తాత్పర్యము :

పంచనదీశ్వరుని వీధి యుత్సవమును వర్ణించిన కృతి ఇది. దీనిని దర్శించే ముచ్చట బ్రహ్మా దులకైనా దొరుకుతుందా? ఆహా!! స్త్రీలారా! వచ్చి చూడండి. పచ్చని శరీర కాంతి కలిగిన పార్వతీ దేవిని స్మరించుచు శివుడు బయలు దేరినాడు. భక్తులందరు తన బిరుదులను పల్కుచుండగా మీరందరు దేవతల వలె పూవులు చల్లుచు ఆనందముగా ఈ ముచ్చట చూడుడు. తన తెల్లని శరీర మందు నగలు మల్లెదండలు ధరించి పంచన దీశుడు పల్లకిపై వచ్చుచున్నాడు. అర్చకులు నైవేద్యము లర్పించుచుండగా ఆరగించుచు, జపతపములు చేయు భక్తులు ఉపచారములు చేయుచుండగా వారికి అభీష్టముల నిచ్చెదను అని పలుకు పంచన దీశ్వరుడు వెడలి నాడు. భాగవతోత్తములు హరినామ కీర్తనలు చేయుచు రాగాలాపములు జేయుచు వచ్చుచున్నారు. ఆవైభోగములను చూచి పంచనదీశ్వరుడు లోకములను చల్లగా రక్షించుట యందు జాగరూకుడై త్యాగరాజును నేను అనుచు వచ్చుచున్నాడు. ఈ ముచ్చట బ్రహ్మాదుల కూడ అరుదు. వచ్చి సేవించుకొనుడు అని భక్త బృందములను అయ్యగారు ఆహ్వానించినారు. ముదిత లార! అనునది వ్యాజము మాత్రమే.

విశేషము = తిరువారూరులో వెలసిన శివుడు త్యాగరాజు. ఈ ఉత్సవపు పంచన దీశ్వరుడును శివుడే, అందుచేత నేనే త్యాగరాజును అని అనుచున్నాడు. కాకర్ల

త్యాగరాజును నేనే అనినట్లు అయ్యగారు ఆ వాక్యమును రెండు విధములగు అర్థముతో ప్రయోగించినారు. బహుశః ఇది కల్యాణోత్సవ మను కొందును.

422. సరసాంగి = ఆది

ప॥ మేను చూచి మోసపోకుమీ మనసా
లోని జాడ లీలాగు గాదా! మేను॥

అ॥ హీనమైన మలమూత్ర రక్తముల
కిరవంచు మాయామయమైన చాన॥ మేను॥

చ॥ కనుల నేటి అంపకోల చేత గుచ్చి
చనులనెడు గిరుల శిరము నుంచి
పనులు జేతురట త్యాగరాజనుతుని
బాగనీవు భజన జేసికొమ్మి స్త్రీల॥ మేను॥

తాత్పర్యము :

ఓ మనస్సా! నీ శరీరము యొక్క పైపస చూచి మోసపోకు. స్త్రీల యొక్క మేనిపస చూచి మోసపోకుము. లోపల నున్న దేమో తెలుసునా? మలమూత్రములు, రక్తమాంసములు. స్త్రీలు కనుచూపు లనెడి బాణాలు గుచ్చుతారు. తమ చనులనెడి కొండలను నెత్తిమీద మోపుతారు. ఇట్టివే అనేకములయిన పనులు చేసి నరుని క్రిందకు గుంజి వేస్తారు. కనుక మనస్సా! స్త్రీలను చూచి మోసపోకు. రామ భజన చేసి బ్రతుకు చరితార్థము చేసుకో. అని మానస బోధ ద్వారా మానవులకు బోధ.

విశేషము = మొదటి పంక్తిలో సాధారణముగా తన మేనును చూచి అనినట్లుంటుంది. రెండవ పంక్తి చివర 'చాన' అని స్త్రీశరీరమును విశేషించినారు. కులశేఖరులు ఇదే భావమును భంగ్యంతరముగా చెప్పినారు. ' ఇదం శరీరం పరిణామ పేశలం। పతత్య వశ్యం శ్లథ సంధి జర్జరం। కిమౌ షధైః క్లిశ్యసి మూఢ దుర్మతే। నిరామయం కృష్ణరసాయనం పిబ' = ఈ శరీరము మారి మారి క్రింద రాలిపోవును. ఈ శరీరమును రక్షించుటకు మందులతో శ్రమ మెందెద వేల మానవా! నిరామయమైన కృష్ణ నామరసాయనమును సేవింపుము, అని.

423. మాయామాళవ గౌళ = ఆది

ప॥ మేరు సమాన ధీర వరద రఘు
వీర చూతాము రారా మహా॥ మేరు॥

అ॥ సార సార వయ్యారపు నడలను
నీరద కాంతిని నీ తీవిని మహా॥ మేరు॥

చ॥ అలకల ముద్దును-తిలకపు తీరును
తళుకు చెక్కులతో-దనరు నెమ్మోమును
గళమున శోభిల్లు-కనక భూషణములను
దళితదుర్మానవ-త్యాగరాజార్చిత॥ మేరు॥

తాత్పర్యము :

మేరు సమానధీరుడవగు రఘు వీరా! మేమందరము నిన్ను చూచెదము రావయ్యా! చక్కని వయ్యారపు నడకలతో రావయ్యా! నీ నీలమేఘ చ్ఛాయను, నీ తీవిని (దర్జా) ముంగురులు వ్రేలాడుచున్న నీ ముద్దు మోమును, నీ అద్దపు చెక్కిళ్లను, వక్షస్థలమున శోభిల్లు నీ బంగారు భూషణములను అన్నిటిని సమగ్రముగా దర్శించెదము. రావయ్యా అని స్వాతంత్ర్యముతో కూడిన ఒక విశేష ప్రార్థనము.

విశేషము = పరమ భక్తుల ప్రార్థనము లిట్లేయుండును. గోదాదేవి 'మారిమలై ముళంజిల్' = ఓ కృష్ణా! నీవు, పర్వతగుహలో నిద్రించి మేల్కొని జూలును విదల్చి నాలుగు దిక్కులను చూచి ఒడలంతయు ఒక్కవరి నిక్కించి గుహనుంచి వెలువడుచున్న సింహము మాదిరిగా ఈ ధర్మ సింహాసనము వద్దకు రావలెనయ్యా! అని ప్రార్థించినది. ఇదియు నట్టిదే.

424. సౌరాష్ట్రము = ఆది

ప॥ మేలు మేలు రామనామ సుఖ-మీధరలో మనసా॥

అ॥ ఫాలలోచన వాల్మీకాది-బాలానిల జాదులు సాక్షిగ॥ మేలుమేలు॥

చ॥ నిండు దాహము గొన్న మనుజులకు. నీరుద్రాగిన సుఖంబు కంటే
చండ దారిద్ర మనుజులకు ధన. భాండమబ్బిన సుఖంబు కంటే॥ మేలు॥

2 తాపము సైరించని జనుల కమృతవాపి అబ్బిన సుఖంబు కంటే॥
దాపులేక భయమందు వేళల. ధైర్యము గల్గు సుఖంబు కంటే॥ మేలు॥

3 ఆకలి వేళల పంచ భక్ష్య పర మాన్న మబ్బిన సుఖంబు కంటే॥
శ్రీకరుడౌ శ్రీరాముని మనసున చింతించు సుఖంబు కంటే॥ మేలు

4 సారహీనమౌ క్రోధసమయమున. శాంతముగల్గు సుఖంబు కంటే॥
నేరని మూఢులకు సకల విద్యాపారము దెలియు సుఖంబు కంటే॥ మేలు॥

5 రామునిపై నిజభక్తి కలిగి గాన. రసము దెలిసిన సుఖంబు కంటే॥
పామరచెలిమి సేయనివారి భావములోని సుఖంబు కంటే॥ మేలు॥

6 చేయదగు వేదాంత విచారణ సేయగ గల్గు సుఖంబు కంటే॥
బాయకనిర్గుణ భావముగల పరబ్రహ్మానుభవ సుఖంబు కంటే॥ మేలు॥

7 రాజసతామసగుణములు లేని. పూజల గల్గు సుఖంబు కంటే॥
రాజ శిఖామణి అయిన త్యాగ రాజు కొసంగు సుఖంబు కంటే॥ మేలు॥

తాత్పర్యము :

ఇందు రామ నామ ప్రభావము చెప్పబడినది. రామనామము ప్రపంచములో అన్ని యోగముల కన్న చాలా చాల మేలయినది. దీనికి సాక్షులు, శివుడు, వాల్మీకి, బాలాంబ, ఆంజనేయుడు. దప్పిక గొన్నవాడు నీరు త్రాగిన సుఖముకన్న, కడుదరిద్రునకు ధన భాండము దొరికిన దానికన్న, ఎండతాపముతో బాగా బాధపడువానికి స్నానము చేయుటకు చల్లని అమృతపు బావి దొరకిన సుఖము కన్న, భయపడే సమయమున గట్టి ధైర్యము కలిగిన సుఖము కన్న, బాగా ఆకలి వేసినప్పుడు పంచ భక్ష్య పరమాన్నములు లభించిన సుఖము కన్న, శ్రీరాముని మనస్సులో ధ్యానించే సుఖము కన్న, కోపము వచ్చి ఒడలు పెదవులు బాగా వణకే సమయములో తటాలున శాంతము వచ్చిన సుఖము కన్న, చక్కని రామభక్తి కలిగి గానరసము తెలిసిన సుఖము కన్న, వేదాంత విచారణ చేయునప్పుడు కలిగిన సుఖము కన్న, సత్త్వగుణముతో పూజ చేయు సుఖము కన్న, శివున కిచ్చిన సుఖము కన్నను రామ నామసుఖము చాల మేలని అయ్యగారి ప్రబోధము.

విశేషము = దీనిలో ' ఇతరములయిన స్వల్ప విషయములను చెప్పి, వాటికంటే రామనామము మేలు అని చెప్పుట వరకు బాగుగనే యున్నది. తరువాత మనస్సులో రాముని చింతించుటకన్న, నిజభక్తి గాన రసజ్ఞానము కన్న, వేదాంత విచారణ కన్న,

రాజసతామస రహిత పూజ కన్న, రామనామము మేలని చెప్పబడినది. ఈ చెప్పుటలో ధ్యానాదులు అల్పములని చెప్పిన ట్లయినది. ఇది సరియా? అనే ప్రశ్న ఎదురగు చున్నది. నిజమే. ధ్యాన పూజాదులు రాముని గూర్చినవి శ్రేయస్కరములే. ఆరూపములలో రామనామ స్మరణ మొకటి. ఇది వాటి అన్నిటిలో మేలు అని భావము. వ్యవహారములో కూడ నామ సుఖమనెదరు కాని పూజా సుఖము, భక్తి గాన రసజ్ఞాన సుఖము అని ఎవరును అనలేదు. అయ్యగారి భావనలో కూడ 'స్మరణే సుఖము రామనామ స్మరణేసుఖము' ఇత్యాది కృతులలో రామనామ స్మరణమునకు పెద్దపీట. దాని మహిమను చెప్పునది ఈ కృతి. తక్కిన వాటిని నిందించుట కాదు. 'నహి నిందాన్యాయము' అని ఒకటున్నది. ఒకదాని యొక్క గొప్పతనమును చెప్పునప్పుడు తక్కిన కొన్నిటిని తక్కువగా చెప్పుట తక్కిన వాటిని నిందించుట కాదు' అనేది 'నహినిందా న్యాయము' ఇక్కడ ఇది వర్తిస్తుంది. మరియొక విశేషము. నామము గొప్పదా? నామి(ఆనామము కల దేవుడు) గొప్పవాడా? అని చర్చ వచ్చినపుడుపిళ్లలోకాచార్యుల వారిట్లు చెప్పిరి. నామికన్న నామమే గొప్పది. నామి ఎక్కడో దూరభారమందుంటాడు. నామము తన వద్దనే (తన నోటిలోనే) ఉంటుంది. ద్రౌపదికి ఆ ఆపదలో వస్త్రము నిచ్చినది నామమే కదా' అని అన్నారు. 'గోవిందా' అన్నది ఆమె, ఆ నామమే కృష్ణుని చెవికి సోకినది. వెంటనే ఆమె ఆర్తి తీరినది. పూజ చెయ్యాలంటే పూజా ద్రవ్యములు కావలెను. గానరసమునకు తంబురాదులు కావలెను. మానసిక ధ్యానము నందు మనస్సు నిలువక ఆ ధ్యానము భగవానున కందునో లేదో? నామమయితే ఉచ్చారణము చేత భగవానున కందుట తథ్యము. శబ్దమునకు శక్తి కలదు కదా! మరియొక మహావిశేషము.'శివున కొసంగు సుఖము కంటే' అనిరి అయ్యగారు. దీని వివరము. 'శ్రీరామ రామ రామేతి' అనే ప్రమాణమును బట్టి శివునకు నామసుఖమున్నది. కీటకముల ఆనందము కన్న తిర్యగ్జంతువుల ఆనందము వేయి రెట్లు అధికము. దానికన్న మానవానందము వేయిరెట్లు. దానికన్న దేవతల ఆనందము వేయిరెట్లు. దానికన్న గంధర్వానందము వేయి రెట్లు, దానికన్న బ్రహ్మానందము వేయిరెట్లధికమని శాస్త్రము. దీనిని బట్టి శివుని ఆనందము దేవానందము. అదియును కాక శివునకు సంధ్యానృత్యము, ఉద్ధతతాండవము, పార్వతితో నాట్యము, భక్త సంరక్షణము వంటి ఇతర కార్యక్రమములతో కూడ ఆనంద మున్నది. దీని వల్ల రామనామ స్మరణము పదిలో పదకొండయినది. అదియు గాక రామనామస్మరణము శివుని ఒకరూపమయిన కాశీ విశ్వనాథునకే పరిమితము. కాకర్ల త్యాగరాజున కట్లు కాదు. రామనామ మాయనకు ప్రాణము జీవనమే కాక దానితో

ఆయన గంధర్వానందమును (సంగీతానంద రూపమగు మానవా నందమును) పొందుచు, సాక్షాత్కార రూపమగు సర్వోత్తమ మయిన బ్రహ్మానందమును పొందుచున్నారు. కేదార కృతిలో 'వాగీ శానందమందు' అని బ్రహ్మానందమును పొందుచున్నట్లు చెప్పిరి. ఈ కారణముల చేతనే 'యోరామామృత పాన నిర్జిత శివః = రామ నామామృత పానము చేత త్యాగయ్యగారు శివుని నిర్జించిరి' అని వర్ణింప బడిరి. అని యూహించుట తప్పుకాదు. అదియుగాక దేవుడు దేవానందమును పొందుట కన్న మానవుడు బ్రహ్మానందమును పొందుట మహా విశేషము. దీనిని బట్టి త్యాగయ్యగారట్లు వ్రాసిరని భావింప వలెను.

425. సూర్యకాంతము = ఆది

ప॥ ముద్దు మోము ఏలాగు చెలంగెనో
మను లెట్లు కని మోహించిరో॥ ముద్దు॥

అ॥ కద్దనుచు చిర-కాలము హృదయము
కరగి కరగి నిల్చువారి కెదుట రాముని॥ ముద్దు॥

చ॥ మనసు నిర్మల మగు భూసుర కృతమో
మంచి పూజా ఫలమో తొలుతటి తపమొ
ఘననిభ దేహుని జనన స్వభావమొ
ధనపతి సఖుడైన -త్యాగరాజార్చితుని॥ ముద్దు॥

తాత్పర్యము :

అయ్యగారు తనలో ఇట్లు భావించుకొనిరి. ఆహా! ఆనాడు రాముని ముద్దు మోము ఎట్లున్నదోకదా! అరణ్యవాసమందు మును లాముద్దు మోమును చూచియే కదా మోహించిరి. రామునియందు విశ్వాసము కలిగి ఆమునులు హృదయములో ధ్యానించి ధ్యానించి మనసు కరగి యుండగా రాముడు వారి ఎదుట నిలచినాడు. దానికి వారి మనో నిర్మలత్వము కారణమా? బ్రాహ్మణాశీర్వాద ఫలమా? పూజాఫలమా? పూర్వతపః ఫలమా? రాముని అవతార స్వభావమా? ఏది ఏమైనను ఆనాడు ఆ ముద్దు మో మెట్లుండెనో? అని అయ్యగారి ఊహకందని ఒక వితర్కము.

విశేషము = రాముని ముద్దు మోము ఆనాడేవిధముగా నుండెనో? అది అనూహ్యము. 'యతోవాచో నివర్తంతే-అప్రాప్య మనసా సహ' = 'రాముని సౌందర్యాదులు వాక్కులకును మనస్సుకును అందదు' అని వేదములు. అట్టి మోము ఆనాడెట్లున్నదో అని ఆశ్చర్యపూరితమైన ప్రశ్న. ఆమునులు ఆముద్దు సాక్షాత్కారము నెట్లు పొందగలిగిరో అని కూడ ఆశ్చర్యము. 'నాహం వేదై ర్నత పసా। న దానేన న చేజ్యయా। శక్య ఏవం విధో ద్రష్టుం' = నన్ను చూచుట వేదపఠనము వలన గాని, తపస్సు వలనగాని, యజ్ఞము వలన గాని శక్యము కాదు' అని భగవద్వాక్యము. ఇట్టి స్థితిలో ఆనాడు రాముని ముద్దు మోమును ఆమునులు ఏకారణముచే చూడగలిగిరో? అని కూడ ఆశ్చర్య మిందున్నది. మరియు 'ఘన నిభ దేహుని జనన స్వభావమో?' అను దాని వివరము. జనన మనగా అవతారము. ఇది దేనికొరకో భగవానుడు 'పరిత్రాణాయ సాధూనాం' = సజ్జనులను రక్షించుటకు ప్రతియుగము నందును జన్మించెదను' అని చెప్పినాడు. దీని ప్రకారము భగవానుని జనన స్వభావము సాధు రక్షణమే, దానిలో ఒక భాగముగా మునుల కానాడు రాముడు తన ముద్దు మోమును చూపినాడు. దానిచేత అయ్యగారు 'జనన స్వభావమో?' అని కూడ చర్చించిరి.

426. దర్బారు = ఆది

ప॥ ముందువెనుక నిరు ప్రక్కల తోడై
ముఖరహార రారా రారా॥

అ॥ ఎందుగాననీ అందమువలె రఘు
నందన వేగమే. రారా రారా॥ ముందు॥

చ॥ చండభాస్కరకులాబ్ధి చంద్ర-కో
దండపాణి రారా రారా॥
అండగొలుచు సౌమిత్రి సహితుడై
అమిత పరాక్రమ-రారా రామ॥ ముందు॥

2 ఓ గజరక్షక-ఓ రాజకుమార
ఓంకార సదన-రారా రారా॥
భాగవతప్రియ-బాగబ్రోవవయ్య
త్యాగరాజనుత-రారా రామ॥ ముందు॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు ఒక యాత్రలో గోవూరునుంచి రాత్రి బయలుదేరి పల్లకీలో వస్తూండగా మధ్యలో దొంగలు అటకాయించారు. అప్పుడు శ్రీరామరక్షకోసం పాడిన కృతి ఇది. ఓ మురఖరహరా! రామా! ముందు వెనుక రెండు ప్రక్కలను రక్షకుడవై తోడురావయ్యా! ఓ రఘునందనా! నీ అందమువంటి అందమును ఎక్కడను చూడలేదు. నన్ను రక్షించుటకు వేగమే రావయ్యా! ఓ సూర్యవంశ చంద్రుడా! నీవు కోదండము చేపట్టి, లక్ష్మణుడు నీతో నుండగా తోడురావయ్యా! నీవు గజరక్షకుడవు. రాజకుమారుడవు. రక్షకుడవు. భాగవతులయందు ప్రీతి గలవాడవు రావయ్యా! అని ఆహ్వానము.

విశేషము = అయ్యగారు అట్లు ఆహ్వానింపగానే ఈ కృతిలో వర్ణించిన రూపముతోనే రామలక్ష్మణులు దొంగలకు ఆకాశమందు కనపడినారు. వాళ్ల ప్రయత్న మాగిపోయినది. త్యాగయ్యగారి ప్రయాణము సురక్షితముగా సాగినది. దొంగలు అయ్యగారి పాదములపై బడిరి. ఈ కృతిలోని వర్ణనమునకు ఒక శ్లోకము మూలము. 'అగ్రతః పృష్ఠతశ్చైవ। పార్శ్వతశ్చ మహాబలౌ। ఆకర్ణపూర్ణధన్వానౌ। రక్షేతాం రామలక్ష్మణౌ' = మహాబలులు, వింటినారిని చెవివరకు లాగిన రామలక్ష్మణులు ముందు వెనుక పార్శ్వముల యందును నిలచి రక్షించెదరు గాక' అని అర్థము. ఈ శ్లోకము వాల్మీకి రామాయణమున నున్నదని కల్లూరి వీరభద్రశాస్త్రి గారు వ్రాసిరి. ఇందు 'ఓంకారసదనా' అను సంబోధన మున్నది. దీనికి కూడ ఒక స్ఫూర్తినిచ్చు శ్లోకమున్నది. సీతారామ లక్ష్మణులు అడవిలో నడచుచున్నారు. శ్లో॥ అగ్రతః ప్రయయౌ రామః। సీతా మధ్యేసుమధ్యమా। పృష్ఠ తశ్చి ధనుష్పాణిః। లక్ష్మణోనుజ గామ హ' = ముందు రాముడు నడచినాడు. మధ్యలో సీత ఉన్నది. వెనుక విల్లుబట్టిన లక్ష్మణుడు అనుగమించినాడు. ఇది వాల్మీకము. ఇందున్న దృశ్యము ఓంకారము వలె నున్నదట. ఓంకారమందు అ-ఉ-మ అను మూడక్షరములున్నవి. 'అ' కు రాముడర్థము. 'ఉ' కు సీత అర్థము. దీనికి ప్రమాణము 'ఉకారేణోచ్యతే లక్ష్మీః' = ఉకారమునకు అర్థము లక్ష్మిఅని, మకారమునకు జీవు డర్థము'. మకారో జీవవాచకః' అనునది ప్రమాణము. ఇందు జీవుడు లక్ష్మణుడు. అడవిలో నడచుచున్న రామ సీతా లక్ష్మణుల చేరిక ఓంకారము వలె నున్నదని వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించిరి. ఈ కృతియందు సీత లేకపోయినను ముందు వెనుక అనే పదముల చేతను, 'కోదండ పాణియై' అనే పదము చేతను పై శ్లోకము అయ్యగారి మనస్సుకు వచ్చి 'ఓంకార సదనా' అను సంబోధనమును చేసినారు. మరియొక విశేషము. ఇందు రామకృష్ణుల విశేషములు రెండును ఒక సంబోధనమందే చెప్పబడినవి. మురాసురుని

హరించినవాడు కృష్ణుడు. ఖరాసురుని హరించిన వాడు రాముడు. అయ్యగారు దీనిని మనస్సున నుంచుకొని 'మురఖరహర' అని సంభోధించినారు. ఈ రెండు అవతారముల లక్ష్యము సాధుసంరక్షణము, దుష్టశిక్షణమే. వీటికి సమయ మిపుడు. అని 'మురఖర హర' అని సంబోధించినారు.

427. బంగాళ = ఆది

ప॥ మునుపే తెలియక పోయెనా
మునినుత దయలేదాయెనా॥ మునుపే॥

అ॥ అను విసుమంత లేదనుచును న
న్నలయించి వేడుక జూచుటకు॥ మునుపే॥

చ॥ ఆనాటి మంచి నడతను జూచినీ
వత్యంత కృప సేయలేదా
ఈనాడు నామది – ఇట్లొనని నీ
కినకుల తిలక శ్రీ–త్యాగరాజ నుత॥ మునుపే॥

తాత్పర్యము :

రామా! నీ కింతకుమునుపు తెలియలేదా? (నన్ను రక్షింపవద్దని) లేక ఉన్నట్లుండి నీదయాగుణము మాయమైనదా? నాకు రవ్వంత అయినను వీలులేదనుచు (రక్షించుటకు) నన్ను ఇపుడు చాల శ్రమపెట్టుచున్నావు. వేడుక చూచుచున్నావు. నేను శ్రమపడుట నీకు వినోద మయినదా? ఆనాడు నామంచి నడతను చూచి నీవు చాలా కృప చూపినావు. ఈనాడు నా బుద్ధి ఏదో మారినదని నన్ను శ్రమ పెట్టుచున్నావు. నా బుద్ధి ఇట్లొనని నీకు ముందే తెలియలేదా? అని దైన్యపూర్వక ప్రార్థనము.

విశేషము = 'జంతూనాం నరజన్మ దుర్లభ మతః పుంస్త్వం తతో విప్రతా' = జన్మలలో మానవ జన్మ దుర్లభము. అందును పురుషుడగుట, అందును బ్రాహ్మణుడగుట, అందును సాధన చతుష్టయజ్ఞానము కలిగియుండుట దుర్లభము' అని శంకరాచార్యసూక్తి. మరియు 'ఈశ్వరానుగ్రహాదేవ, పుంసా మద్వైతభావనా' = భగవదనుగ్రహము వలననే మానవులకు అద్వైతభావము కలుగును' అని పెద్దల సూక్తి. అయ్యగారికి మానవజన్మ వచ్చినది. పురుషుడుగా పుట్టినాడు, బ్రాహ్మణుడుగా పుట్టినాడు, నిత్యానిత్యవస్తువివేకము

కలిగినది. అద్వైతభావన కలిగినది, రామభక్తి కలిగినది. వీటి అన్నిటికి రాముని 'అత్యంత కృపయే' కారణము. ఈ కృపకు 'ఆనాటి మంచినడత' = (తొలిజన్మలోని మంచి నడత) రాముని కృపకు కారణము. 'జన్మాంతర సహస్రేషు। తపోజ్ఞాన సమాధిభిః। నరాణాం క్షీణ పాపానాం। కృష్ణే భక్తిః ప్రజాయతే' = పూర్వజన్మలలో చేసిన తపస్సు మొదలయిన వాటిచేత పాపములు క్షయమై భగవద్భక్తి కలుగును' అని. ఇవి 'ఆనాటి మంచినడతలు'. వీటిని చూచి కృపతో ఈ భక్త్యాదుల నిచ్చితివి. దానివలన నీ భక్తిలో పడ్డాను. ఇప్పుడు నన్ను పట్టించుకొనకుండ ఉన్నావు. రామా! నా కేమయినా బుద్ధిలోపము కలిగినదా? ఇట్లగునని ఆనాడే నీకు తెలియదా? నీ మీద విడువలేని రుచిపుట్టించి నా బుద్ధిలోపమెంచి నన్ను విడనాడుట ఏమి. అని నిర్వేదము.

428. తోడి = జంపె

ప॥ మున్ను రావణబాధనోర్వక విభీషణుడు
మొరబెట్టగా రామచంద్ర॥ మున్ను॥

అ॥ మన్నింతు వనుచు కుల బిరుదులను బొగడిన
మాట మరచితివో శ్రీరామచంద్ర॥ మున్ను॥

చ॥ మును వజ్రిసుతు బాధ నోర్వజాలకను
ఇనజుండు నిను రామచంద్ర॥
కొనియాడ పరితాపమును జూచి వాని మది
కొదవదీర్చిన రామచంద్ర॥ మున్ను॥

2 మును హేమకశిపుబాధల సహింపగలేక
మురహరా యన రామచంద్ర
చనువుతో ప్రహ్లాదు సంతాపమును దీర్చి
సౌఖ్య మొసగిన రామచంద్ర॥ మున్ను॥

3 మున్ను నీ మహిమ నే-విన్నదేకాని స
న్మని వంద్య శ్రీరామ చంద్ర
పన్నగాధిపశయన - పాలించి నావెతలు
పరిహరించవే - రామచంద్ర॥ మున్ను॥

4 రాజ రాజ విరాజవాహా! రవికులజలధి
రాజ రాఘవ రామచంద్ర
రాజీవనేత్ర జలజోద్భవస్తుత త్యాగ
రాజ వందిత రామ చంద్ర॥ మున్ను॥

తాత్పర్యము :

రామా! రావణుని బాధనోర్వని విభీషణుడు మొరబెట్టితే రక్షించావు. వాలి బాధ నోర్వని సుగ్రీవుడు కొనియాడితే కొదవదీర్చినావు. ప్రహ్లాదుడు పిలిచితే వాని సంతాపమును దీర్చినావు. నేను నీకుల బిరుదులను పొగడినను మన్నింపకుంటివి. అని ఎత్తిపొడుపు. చివరిచరణమంతయు సంబోధనములే.

429. అఠాణ = ఆది

ప॥ ముమ్మూర్తులు గుమిగూడి పొగడే
ముచ్చట వినుకోరే॥ ముమ్మూర్తులు॥

అ॥ సమ్మతిగ రాజు కొడుకనంగ విని
సంశయము దీ-రక శ్రీరాముని॥ ముమ్మూర్తులు॥

చ॥ రోసముతో రఘు-రాముని గుణముల
రూఢిగ దమగుణ-ములనటు వ్రాసి
త్రాసున నిడ-సరి నిల్వలేదని
త్యాగరాజనుతు-డెవ్వడోయనుచును॥ ముమ్మూర్తులు॥

తాత్పర్యము :

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు చేరి శ్రీరాముని నుతించే ఆ ముచ్చట వినుడు జనులారా! నేను రాజు కొడుకును అన్నాడు రాముడు. వారు సంశయము తీరక రాముని నుతించిరి. వారు రామునియందు తమ గుణములను మాత్రమే వ్రాసి తమ గుణములను త్రాసున బెట్టిరి. అప్పుడు రాముని గుణములతో తక్కినవి సరితూగలేదు. అపుడు ఈ రాము డెవ్వడో అని ముమ్మూర్తులును గుమిగూడి ఆయనను పొగడిరి. అది వినుడని అయ్యగారు భక్తులను పురి కొల్పినారు.

విశేషము = పైన చెప్పినది కృతిలో నున్న పదములకు వ్రాసిన శుద్ధ తాత్పర్యము. దీనిలో అంతర్భవించియున్న కథ ఇది. రావణవధానంతరము దేవతలు మునులును రాముని వద్దకు వచ్చి నీవు సాక్షా ద్భ్రీమన్నారాయణుడవు అని వినుతించిరి. అప్పుడు రాముడు వారిని వారించి 'ఆత్మానం మానుషం మన్యే। రామం దశరథాత్మజం' = నేను కేవలము మానవ మాత్రుడను, దశరథుని కుమారుడననియే అనుకొనుచున్నాను. అన్నాడు. అయ్యగారీ విషయమును ఈ కృతియందు సూచించిరి. మరియు నారాయణుడు అనంత కల్యాణ గుణభరితు డనియు, షడ్గుణైశ్వర వంతుడనియు, ఆది మధ్యాంతరహితు డనియు, సృష్టి స్థిత్యంత కారకుడనియు, విశ్వమయుడనియు వేద పురాణములు ఏకగ్రీవముగా చెప్పినవి. తక్కిన దేవతల నిట్లు చెప్పలేదు. నారాయణుడు తన అవతారములయందును పైన చెప్పిన గుణవైభవములను పట్టుకొనియే ఉండుననుదానికి 'ప్రకృతింస్వా మవష్టభ్య। సంభవా మ్యాత్మమాయయా' = నా అసలు స్థితిని విడువకయే నేను నా మాయచే పుట్టుచుందును' అని భగవానుడు చెప్పిన గీతా వాక్యము ప్రమాణము. అందుచేత తక్కిన దేవతలగుణములు భగవానుని గుణములకు సరితూగవు. రాముడైనను ప్రకృతిగుణములు ఆయనను వదలవు. ఆప్రకారము రాముడు తన మాయచే దేవతలను తబ్బిబ్బు పెట్టగలవాడు. వాళ్లు నారాయణుడ వన్నారు. రాముడు కానన్నాడు. అప్పుడు వాళ్లు 'ఎవ్వడవో' అని ఆశ్చర్యపడిరి. ఇది ఆశ్చర్యార్థకము. అయ్యగారి కృతిలో పై విషయమంతర్భవించి యున్నది.

430. గౌళిపంతు = ఆది

ప॥ మోసపోకు వినవే సత్సహ-వాసము విడువక వే॥ మోసపోకు॥

అ॥ దాసజనార్తి హరుని శ్రీరాముని-వాసహృదయ నివాసుని తెలియక॥ మోస॥

చ॥ అల్పాశ్రయమున గల్గు వెసనములు
కల్పాంతరమైన బోదు శేష
తల్పశయనుని నెరనమ్మితే సం
కల్పమెల్ల నీడేరును మనసా॥ మోసపోకు॥

2 ధన తరుణుల కాసించుటెల్ల
వెనుక తనువు కలుగుటే గాని

మనసు చేత సేవ్యుని దలచితే సు
మనసత్వము నొసగునే మనసా॥ మోసపోకు॥

3 గౌరవ హీనధనికుల గాచుటయు
నేరములకు నెడమౌనుగాని
గారవించు త్యాగరాజహృదయా
గారుని లోకాధారుని దలచక॥ మోసపోకు॥

తాత్పర్యము :

అయ్యగారు మనసుకు ఏది త్యాజ్యమో ఏది గ్రాహ్యమో ఉపదేశము చేస్తున్నారు. ఓ మనసా నీవు సత్సహవాసము (భక్తులతో స్నేహము) మానకుము. శ్రీరాముని తెలుసుకొనుము. లేకపోతే మోసపోదువు. అల్పులను ఆశ్రయించకు. అట్లు ఆశ్రయిస్తే దానివలన కలిగే ఆపదలు (జనన మరణములు) కల్పాంతమయినా నిన్ను వదిలిపెట్టవు. కనుక శేషతల్పముపై పవ్వళించిన భగవానుని నమ్మితే నీ సంకల్పము (మోక్షము) నెరవేరుతుంది. కాంతా కనకములను నమ్మితే పునర్జన్మమే వస్తుంది. మనస్సుతో భగవానుని సేవిస్తే దైవత్వము వస్తుంది. గౌరవ హీనులయిన ధనికులను సేవిస్తే తప్పులెన్నో చేయట మగును. (దానివలన అధఃపతనము). మనను గౌరవించే శ్రీరాముని తలపక మోసపోవద్దు అని బోధ.

విశేషము = 'సత్సంగత్వే నిస్సంగత్వం' 'సత్సంగాత్ భవనిస్పృహః' అనే వాక్యములచేత సత్సహవాసము మోక్షమునకు మొదటి మెట్టు. దీనిని విడువరాదు. శ్రీరాముని తెలియకపోవుట అంటే ఆయనను ద్వేషించినట్లే. 'తానహం ద్విషతః క్రూరాన్। సంసారేషు నరాధమాన్। క్షిపామ్యజస్రమశుభాన్। సురిష్వేవ యోనిషు' = నన్ను ద్వేషించు క్రూరులను నరాధములను సంసారమందు విసరివైచి రాక్షస జన్మల నెత్తించెదను' అని భగవానుని ప్రతిజ్ఞ. అందుచేత శ్రీరాముని తెలియనివానికి కల్పాంతమైనను వ్యసనము తప్పదు. మరియు 'నను మనస్సున నుంచినవానిని నేను మనస్సున నుంచుకొనెదను' అని భగవానుడు చెప్పిన గీతావాక్యము. ఇదే భగవానుడు మనను 'గౌరవించుట'.

431. మోహన = ఆది

ప॥ మోహనరామ! ముఖజితసోమ-ముద్దుగా బల్కుమా! మోహన॥

అ॥ మోహనరామ! మొదటి దైవమా!
మోహము నీపై-మొనసి యున్నదిరా॥ మోహన॥

చ॥ ధరమను జావతార మహిమను విని
సురకిన్నర కింపురుష విద్యాధర
సురపతి విధి విభాకరచంద్రాదులు
కరగుచు ప్రేమతో
వరమృగ పక్షి వానర తనువులతో
గిరిని వెలయు సీతావర! చిరకాలము
గురి తప్పక మై మరచిసేవించిరి
వరత్యాగరాజ వరదాఖిలజగ॥ నోహన॥

తాత్పర్యము :

అయ్యగారు రామునిని ముద్దుగా బల్కవలసినదని కోరుచున్నారు. నీవు మోహనరాముడవు. నీవు మొదటి దేవుడవు. ఒక్కసారి నాతో ముద్దుగా పల్కరాదా! నీవు మనవావతారములో రాముడవై అతి జగన్మోహనా కారముతో వెలసెదవని తెలిసి దేవతలు దేవజాతులవారును, దేవేంద్రుడు, బ్రహ్మ, సూర్యచంద్రులు మృగ, పక్షి, వానరశరీరములతో భువియందు పుట్టి నీయెడ ప్రేమ కలిగి, ప్రేమతో కరగుచు కొండయందున్న నిన్ను చిరకాలము సేవించిరి కదా! అట్లే నీ సేవను నేను కోరుచున్నాను. నాతో పలికి నాకు వరమిమ్ము అని ప్రార్థనము.

విశేషము = రావణబాధితులయిన దేవతలు తమ బాధను తీర్చమని క్షీరసాగరమందున్న నారాయణుని ప్రార్థించిరి. నారాయణుడు వారి కభయమిచ్చి మీమీ అంశములతో మీరందరు భూమియందు వానరులుగా పుట్టి నాకు పరివారముగా ఉండుడని ఆజ్ఞాపించినాడు. దాని ప్రకారము దేవతలు భూమిపై ఆయా స్త్రీల ద్వారా వానరులుగా పుట్టిరి. కృతయుగంలోనే బ్రహ్మ ఆవలించితే జాంబవంతుడు పుట్టినాడు. అతడు మృగజాతి, తక్కినవారంతా వానరులు. ఇంద్రుని కొడుకువాలి, సూర్యుని కొడుకు సుగ్రీవుడు. వాయుదేవుని కొడుకు హనుమంతుడు. ఇట్లే వానరులందరును ఆయా దేవతల పుత్రులే. వీరందరును ఋశ్యమూకగిరి యందున్న రాముని చిరకాలము సేవించిరి. ఇదే మృగవానర తనువులతో దేవతలు రాముని సేవించుట. మరి అయ్యగారు 'పక్షి' అని ఒకటి చెప్పిరి. అది జటాయువు, సంపాతియును కావచ్చునని నా ఊహ. జటాయువు రావణుడు చేసిన సీతాపహార వృత్తాంతమును చెప్పి రాముని సేవించి సహాయపడినాడు. సంపాతి లంకలోని సీతజాడను చెప్పి సహాయపడినాడు. అయ్యగారు చెప్పిన పక్షి శబ్దమునకు జటాయు సంపాతులు అర్థము కావచ్చును.

432. సారమతి = ఆది

ప॥ మోక్షము గలదా భువిలో జీవ
న్ముక్తులు గాని వారలకు॥ మోక్షము॥

అ॥ సాక్షాత్కార నీ సద్భక్తి
సంగీత జ్ఞానవిహీనులకు॥ మోక్షము॥

చ॥ ప్రాణానల సంయోగమువల్ల
ప్రణవనాదము సప్తస్వరములై పరగ
వీణా వాదనలోలుడౌ శివమనో
విధ మెరుగరు త్యాగరాజ వినుత॥ మోక్షము॥

తాత్పర్యము :

అయ్యగారు ఒక సిద్ధాంతము నిందు చూపు చున్నారు. జీవన్ముక్తి అని ఒక ముక్తి ఉన్నది. ఆ జీవన్ముక్తిని పొందనివారికి ముక్తి కలుగదని అభిప్రాయము. రామా! నీ సాక్షాత్కారము, నీయందు భక్తి, సంగీత జ్ఞానములేనివారికి కూడ మోక్షములేదు. ప్రాణము, అగ్ని కలియుటచేత ఓంకారనాదము సప్తస్వరములైనది. ఇది వీణావాదనలోలుడైన శివుని అభిప్రాయము.

విశేషము = జీవన్ముక్తి అనగా సర్వేంద్రియములు. మనస్సు బ్రహ్మయందు లీనమై బాహ్యప్రపంచ ప్రసక్తి లేకుండుట. ఈ జీవన్ముక్తి భగవత్సాక్షాత్కారము, భగవద్భక్తి, సంగీతజ్ఞానమువలన కలుగుతుంది. దానివలన దేహాంతమందు మోక్షము. అని సూచన. సంగీతము సప్తస్వరాత్మ కమయినది. ఈ సప్తస్వరములకు మూలము ఓంకారము. ఆ ఓంకారము దేహములోనున్న అగ్నివాయువుల సంయోగము చేత సంగీత సప్తస్వరములుగా మారినది. 'నకారం ప్రాణనామానం। దకార మనలం విదుః। ప్రాణానలసమాయోగా న్నాద నామాభిధీయతే' = నకార మనగా ప్రాణము. దకారమనగా అగ్ని. ఈ రెండిటి కలయిక చేత బుట్టినది నాదమన బడుచున్నది. అని శాస్త్రకారుల నిర్వచనము. అదియుగాక 'ఆత్మా వివక్షమాణోయం మనః ప్రేరయతే మనః। దేహ స్థంవహ్ని మాహంతి। సప్రేరయతి మారుతం। ఆహతో మా రుతశ్చాధ। క్రమాదూర్ధ్వపదేచరన్। హృద్యూర్ధ్వలగ్ననాడీ షు। ఆవిర్భావయతిధ్వనిం' ముందు ఆత్మ ఒకటి మాట్లాడ దలచిలేక ఒక గానము చేయదలచి మనస్సును ప్రేరేపిస్తుంది. మనస్సు

దేహమందున్న అగ్నిని (శక్తిని) ప్రేరేపిస్తుంది. అగ్ని ప్రాణవాయువును ప్రేరేపిస్తుంది. ఆవాయువు హృదయమందు లగ్నమై యున్న నిలువు నాడుల యందు నిలువుగా పయనించి వాటియందు ధ్వనిని పుట్టిస్తుంది. అది హృదయ కంఠ జిహ్వాల ద్వారా ఆత్మతలచిన మాటగానో పాటగానో బహిర్గత మౌతుంది. ఇది సంగీతమైతే జీవన్ముక్తిని కలిగిస్తుంది. ఇది కలిగిన వారికి ముక్తి అని శివుని ఆశయము అని త్యాగయ్యగారు పారిమార్థిక దృష్టితో పైన చెప్పిన శాస్త్ర విషయమును సూత్రప్రాయముగా తెలిపినారు. ఆత్మతలచుట లోపలి ప్రయత్నములు జరుగుట మాటో పాటో బయటపడుట ఇవన్నియు ఒక్క క్షణములోనే జరిగిపోవును.

433. జయమనోహరి = ఆది

ప॥ యజ్ఞాదులు సుఖ మనువారికి సము
లజ్ఞానులు గలరా ఓమనసా॥ యజ్ఞాదులు॥

అ॥ సుజ్ఞాన దరిద్రపరంపరు ల
సుర చిత్తులు జీవాత్మహింస గల॥ యజ్ఞాదులు॥

చ॥ బహుజన్మంబుల వాసనయుతులై
అహివిషసమ విషయాకృష్టులై
బహిరాననులై త్యాగరాజు
భజియించే రాముని దెలియక॥ యజ్ఞాదులు॥

తాత్పర్యము :

యజ్ఞములు చేయుటవలన సుఖఫలితము వచ్చునని భావించే వారి యంత అజ్ఞానులు మరియొక రుండరు. వారు సుజ్ఞాన దరిద్రులు. రాక్షసచిత్తులు. ఎందుచేతనంటే యజ్ఞమని జీవహింస చేస్తున్నారు కనుక. వీరు అనేక దుర్విషయములచేత ఆకర్షింపబడినవారై, అనేకపూర్వజన్మల వాసనలను వదలిపెట్టలేక అంతర్ముఖులై లోనున్న రాముని తెలుసుకొనలేక యజ్ఞాలు సుఖమనుకొంటున్నారు.

విశేషము = 'త్రైవిద్యా మాం సోమపాః పూతపాపాః। యజ్ఞైరిష్ట్వా సద్గతిం ప్రార్థయంతే। తే పుణ్య మాసాద్య సురేంద్రలోకం। 'క్షీణేపుణ్యేమర్త్యలోకం విశంతి' = వేదము చదివినవారు సోమపానముచేసి, కొంతపాపము నశించి యజ్ఞములు చేసి ఏదో ఒక సద్గతిని

కోరుకొని స్వర్గమునకు వెళ్లి అక్కడ పుణ్యక్షయము కాగానే మానవలోకమున ప్రవేశించి పిదప 'గతా గతా్ కామ కామా లభంతే' = ఆ కామకాముకులు స్వర్గము నుంచి భూమికి మరల భూమినుంచి స్వర్గమునకు రాకపోకలతో శ్రమపడుదురు. 'యోంతస్సు ఖోంతరారామః। బ్రహ్మ నిర్వాణం।బ్రహ్మ భూతోధిగచ్ఛతి' = అంతర్ముఖుడైన వాడు బ్రహ్మానందమును పొందును' = అని గీతావాక్యములు. కనుక యజ్ఞములు సుఖమనుకొనువా రజ్ఞానులు. అంతర్ముఖులైన వారు సుఖవంతులు' అని అయ్యగారు చెప్పినారు.

434. శ్రీ రాగము = ఆది

ప॥ యుక్తముగాదు నను రక్షింపక
యుండేది రామ॥ యుక్తము॥

అ॥ భక్తవత్సల పతితపావనా త్రి
శక్తియు కలిగిన దేవుడు నీవై॥ యుక్తము॥

చ॥ తొలి దుష్కృతముల నణచే నీబిరు
దిలను దడుసుకొనెనో॥
పలికి బొంకడను నీ కీర్తియునే
బాగులే దనెనో॥
తెలిసి తెలియని నీ దాసుల బ్రోవ
దేవ దయరాననెనో మును
వెలసిన భక్తులకే నీ శక్తియు
సెలవైపోయెనో తెల్పుము॥ యుక్తము॥

2 వద్దనుండు జనకాత్మజ పల్కగ
వద్దనెనో లేక
నిద్దురజితు డతికోపముతోడను
నీకేమి వినిచెనో॥
ముద్దుగ భరతు డానంద బాష్ప
ముల గనుల నించెనో
పద్దున పవనసుతుడు వద్దని నీ
పదము పట్టుకొనెనో తెల్పుము॥ యుక్తము॥

3 చల్లని నీ భక్తి లేదని విధి
కల్లలాడుకొనెనో – నా
వల్లగా దని పలుకు చెలి మిక్కిలి
వార్తలాడుకొనెనో
ఉల్లమునను శ్రీత్యాగరాజు ని
న్నుంచుకొన మరచెనో
చెల్లెలైన ధర్మసంవర్ధని
చేరబోకు మనెనో తెల్పుము॥ యుక్తము॥

తాత్పర్యము :

రామునిపై వేయు ఒక నెపము ఇది. రామా నన్ను రక్షింపకుండుట యుక్తముకాదు. కారణమేమో చెప్పుము. త్రి శక్తి కలిగిన దేవుడవు నీవు. నన్ను రక్షింపకుండుట యుక్తము కాదు. పూర్వపాపముల నశింపజేయు వాడవు అనే నీ బిరుదు జడిసినదా? రాముడు పలికి బొంకడు అనే నీ కీర్తి నన్ను బాగుగలే డనినదా? త్యాగరాజు తెలిసి తెలియని వాడు అని చెప్పి నీదయ తాను రా ననినదా? లేక నీ దయాశక్తి పూర్వభక్తులను రక్షించుటకు ఖర్చైపోయినదా? నీ సన్నిధిలో నున్న సీత త్యాగయ్యతో మాటాడ వద్దనినదా? 14 ఏండ్లు నిద్రను జయించిన లక్ష్మణుడు నాపై కొండెములు చెప్పెనా? నన్ను నీవు రక్షింపకుండటచే ఆనందపడి భరతుడానంద బాష్పములు రాల్చెనా? హనుమ నన్ను రక్షింపవద్దని నీ కాళ్లు గట్టిగా పుట్టుకొనినాడా? నావద్ద చల్లని భక్తి లేదని బ్రహ్మ కల్లలాడినాడా? సరస్వతి త్యాగయవల్ల భక్తి కుదరదని నాపై అతివాదము లేమైన చేసినదా? లేక రామా! నా మనస్సులో నిన్ను ధ్యానించుట మరచినానా? లేక నీ చెల్లెలైన ధర్మసంవర్ధనీదేవి త్యాగయ్యవద్దకు పోకుమనినదా? అని అయ్యగారు రాముని సమాధానములు చెప్పలేని ప్రశ్నలు వేసినారు. దీనికి ప్రాప్యత్వరయే కారణము.

విశేషము = 'త్రిశక్తి గలదేవుడు' అనగా ఏవనికయినా దేనికయినా మూడు శక్తులు కావలెను. 1. ఉత్సాహశక్తి, 2. క్రియాశక్తి, 3. జ్ఞానశక్తి. ఏపనిచేయవలెననినా ముందు ఉత్సాహము కావలెను. అది మొదటి శక్తి. తరువాత చేయగలశక్తి. అది క్రియా శక్తి. ఈ రెండుమాత్రముంటే చాలదు. ఆ విషయమునకు సంబంధించిన పూర్తి ఎరుక కావలెను. అది జ్ఞానశక్తి. వీటిని త్రిశక్తులందురు. రాముడు త్రిశక్తులు కలిగిన దేవుడని అయ్యగారు కీర్తనయందు చెప్పినారు.

435. దర్బారు = ఆది

ప॥ యోచనా కమల–లోచనా నను బ్రోవ॥ యోచనా॥

అ॥ సూచన తెలియక నొరుల। యాచన జేతుననుచు నీకు
తోచెనా ద్యుతివిజితాయుతవి। రోచనా నన్ను బ్రోవనింక॥ యోచన॥

చ॥ కేచన నిజభక్తనిచయ పాపవి
మోచన గల బిరుదుల్లెల్ల గొని న
న్నేచనా కృతవిపిన చరవరాభి
షేచనా త్యాగరాజ పూజిత॥ యోచన॥

తాత్పర్యము :

కమలలోచనా! రామా! నన్ను రక్షించుటకు నీకింకనూ యోచనా? నీవు చేసిన సూచనను తెలుసుకొనక నేను నీకన్న నితరులను ఆశ్రయించి ఇతరవరముల నిమ్మని యాచించితినని నీకు తోచినదా! పదివేల సూర్యులను మించిన కాంతి కలిగిన ఓ రామా! నీకింక యోచనవద్దు. రక్షింపుము. కొంతమంది భక్తుల పాపము లణచి రక్షించిన బిరుదులు వహించి ఇప్పుడు నన్ను బాధించుట తగదు. నీవు వానరుడైన సుగ్రీవునే రాజ్యాధిపతిని జేసితివి. నన్ను రక్షించుటకు యోచించుట (రక్షింతునా? మానుదునా? అని) తగదు. అని.

విశేషము = 'అంతవత్తు ఫలంతేషాం। తద్భవ త్యల్పమేధసాం। దేవాన్ దేవయజోయాంతి। మద్భక్తాయాంతి మామపి'= ఇతర దేవతలను పూజించి ఇతరఫలములను కోరువారు తెలివితక్కువ వారు. వారికి వచ్చు ఫలముకూడ నశించిపోవును. నన్నాశ్రయించినవారు నన్నే పొందుదురు'. ఇదీ గీతావాక్యము. ఇది భగవానుని సూచన. ఇది మీరలేదు నేనని అయ్యగారు చెప్పినారు. 'దివి సూర్యసహస్రస్య। భాసస్తస్యమహాత్మనః' = నారాయణునితేజస్సు ఆకాసమందు వెలుగు వేలసూర్యులతో సమానము' అని ప్రమాణము. అయ్యగా రీ కృతియందీ భావముల నిమిడ్చినారు.

436. శుద్ధదేశి = ఆది

ప॥ రఘునందన రాజమోహన
రమియింపవలె – నామనసున॥ రఘు॥

అ॥ నగజానిలజ-నారదాది హృ
న్నాళీకవాసు-డైన గాని శ్రీ॥ రఘు॥

చ॥ చిత్తమందు ని-న్నుంచి ప్రేమతో
చింతించు స-ద్భక్తుల
ఉత్తమోత్తము-లంచునామది
నుంచి పూ-జింపలేదా
తత్తరంబు దీర్చు-కారణంబునీవే
తాళజాల నిక-త్యాగరాజనుత॥ రఘు॥

తాత్పర్యము :

ఓ రఘునందనా! ఓ రాజమోహనా! నా మనస్సునందు నీవు నివసించి ఆనందించుము. నామనస్సుకంటే పరిశుద్ధములైన పార్వతి, హనుమంతుడు, నారదుడు మొదలయినవారి హృదయములయందు నీవు నివసించియున్నావు. ఐననూ నామనస్సున కూడ నివసింపుము. నిన్ను చిత్తాన నిలిపి ధ్యానించినవారు ఉత్తమోత్తములని తలచి వారిని నా చిత్తమందు నిలిపి పూజించితినికదా! నామనస్సున నీ పరివారమైన వారందరును ఉండిరికదా! ఇక నామనస్సున నీవుండి ఆనందిపవచ్చును. నీవు నామనస్సున వసింపకపోతే నాకు తత్తరపాటు కలుగుతుంది. ఆ తత్తర తీర్చగలవాడవు నీవే.

విశేషము = 'ఆరాధనానాం సర్వేషాం। విష్ణో రారాధనంపరం। తస్మాత్పరతరం ప్రోక్తం। తదీయారాధనం నృప' = అన్ని ఆరాధనములలో విష్ణు నారాధనము గొప్పది. దానికన్న భక్తులను ఆరాధించుట మరీ మిన్న అని శ్రీశుకుని వాక్యము. అందుచేత అయ్యగారు హనుమన్నారదాదులను కూడ స్తుతించుట. అయ్యగారు నారదాదులతో సామ్యమును కోరుకొనుచున్నారు. కనుక వారి హృదయమందు నివసించు భగవానుని తన హృదయమందు నివసింపుమని కోరుచున్నారు.

437. కేదారగౌళ = రూపకం (దివ్యనామము)

ప॥ రఘునందన రఘునందన - రఘునందన రామ॥ రఘు॥

చ॥ పాడుదునిను వేడుదుకొని-యాడుదు శ్రీరామ॥ రఘు॥

2 కోరితినిను చేరితి నను-దూరకుమీ రామ॥ రఘు॥

3 ఏమోయని నీమనసున-ఏమరకే రామ॥ రఘు॥

4 గతిలేదని పతినీవని-మతినే శరణంటి॥ రఘు॥

5 జాలము నీకేలను నే-తాళను శ్రీలోల॥ రఘు॥

6 గట్టిగనిను బట్టిన తన-కిట్టి వెతలేల॥ రఘు॥

7 నీకేదయ నీకేదమ-నీకెవరే సాటి॥ రఘు॥

8 నిను దెలసిన ఘనులను నే-దినదినమును దలతు॥ రఘు॥

9 ముల్లోకము లల్లాడిన-ఇల్లేగతి గాని॥ రఘు॥

10 ఇలనంతట గలవానకు-జలధే గతిగాని॥ రఘు॥

11 గుణములలో నణిగుంటే-గుణియే గతిగాని॥ రఘు॥

12 ఎన్ని వితము లున్నాను - నన్నే చేరవలె॥ రఘు॥

13 శ్రితమానవహితకర-పా। లితత్యాగరాజ॥ రఘు॥

తాత్పర్యము :

సులభము. రఘునందనా రామా! నిన్నే పాడుదును, వేడుదును, ఆడుదును. నిన్నే కోరితిని, చేరితిని, నను నిందింపకు. నన్ను నీమనసున ఏమరకుము. గతిలేదని నిన్ను పతియని నిన్ను శరణుజొచ్చితిని. నీవు జాగుచేయకు. గట్టిగా నిన్ను పట్టుకొన్న నాకిట్టి బాధలేల? దయలోగాని ఇంద్రియనిగ్రహమందుగాని నీకు నీవేసాటి. నిన్ను తెలిసిన ఘనులను నేను స్మరించెదను. మూడులోకాలు తిరిగినా ఇల్లే గతియైనట్లు ఎటుతిరిగినా నీవేగతి. ఎక్కడవానపడినా దానికి సముద్రమే గమ్యమైనట్లు నీవే గమ్యము. ఐహిక విషయములయందు మునిగితే అవియే గతి. కనుక వాటిలో మునుగక నీయందే మునిగి యుండెదను. యోగము లెన్నో ఉన్నాయి. కాని వాటిని పట్టక నిన్ను చేరేదే చూడవలె.

438. హంసధ్వని = ఆది

ప॥ రఘునాయకా-నీపాదయుగ
రాజీవముల-నే వీడజాల॥ రఘు॥

అ॥ అఘజాలముల-బారద్రోలి న
న్నాదరింప నీవే-గతి గాద శ్రీ॥ రఘు॥

చ॥ భవసాగరము-దాటలేక నే
బలుగాసి పడినీ-మరుగుజేరితి
అవని జాధి పా-శ్రిత రక్షకా
ఆనంద కర శ్రీ-త్యాగరాజనుత॥ రఘు॥

తాత్పర్యము :

ఓ రఘునాయకా! నీ పాదములను పట్టుకొన్నాను. నేను నీపాదాలను విడువలేను. నా పాపములను పోగొట్టి నన్నాదరించే గతి నీదే. ఈ సంసారములో బాగా బాధపడి దీనిని దాటలేక నీ మరుగు జొచ్చితిని. అని నివేదనము.

439. శహన = రూపకం

ప॥ రఘుపతే రామ-రాక్షసభీమ॥ రఘు॥

అ॥ భృగుసుత మదహరణా ముని-బృందవందితచరణ॥ రఘు॥

చ॥ సరసీరుహనయనా-సజ్జనహృదయనికేతన॥
ధరణీధరధీర సీ-తామనోహరా॥
నిరవధిసుఖదాప్రమేయ - నిరుపమనారదసుగేయ
కరధృతశరజాల! నీల-ఘనవర్ణామరపాల॥ రఘు॥

2 తరుణారుణనిభచరణా-తరణివంశ విభూషణ
వరుణాలయ మదదమనా-వారణావన!
కరుణాకర! గిరిశచాప-ఖండన నిర్జితతాప॥
పరిపూర్ణావతార-పరభామినీ దూర॥ రఘు॥

3 హరిహయ పంకజభవనుత-పురవైరిపరాశరహిత।
నరవరవేషా! తారక-నామధేయ॥
స్వరజితఘనరవ పరేశ-శతభాస్కరసంకాశ
పరిపాలిత త్యాగరాజ-పాహిభక్త సమాజ॥ రఘు॥

తాత్పర్యము :

ఇందు అన్నియు సాధారణ సంస్కృత సంబోధనములే యున్నవి. అందుచేత దీని తాత్పర్యము వ్రాయుట విరమించట మయినది. లోగడ కృతులలో వచ్చిన సాధారణ సంబోధనములే.

440. పంతువరాళి = ఆది

ప॥ రఘువర నన్ను-మరవతగునా॥ రఘు॥

అ॥ నగధర భక్తజ-నాఘనివారణ॥ రఘు॥

చ॥ తల్లిదండ్రులన్న-దమ్ములు నున్న
పాలతికి నొకడు-పురుషుండౌనా॥ రఘు॥

2 పరదైవములు-బాగుగ సొమ్ములు
సురనుత మంగళ-సూత్రమౌనా॥ రఘు॥

3 చేసిన పుణ్య-చయము బ్రహ్మణ్య!
ఆస నొసంగితి అనుపమ లావణ్య! రఘు॥

4 మనసున నీకే-మరులుకొన్నాను స
జ్జనహిత త్యాగరాజ-వినుత! రామ॥ రఘు॥

తాత్పర్యము :

రఘువర! = రఘుకులశ్రేష్ఠుడా! నగధర = గోవర్ధనము నెత్తినవాడా! భక్తుల పాపములను నివారించువాడా! నన్ను నీవు మరచుట తగునా? తగదు. స్త్రీకి తలిదండ్రులు అన్నదమ్ములు-ఎంతమంది ఉన్నా ఒక భర్త అవుతారా? మరియు బాగా దేవపూజలు చేసినా బాగా నగలెన్నో ధరించినా ఒక మంగళసూత్రం అవుతుందా? అట్లే నాకు నీదయలేక ఇతరములు ఏవి ఉన్నా నిష్ప్రయోజనములే. కనుక నన్ను మరువవద్దు. ఓ బ్రహ్మణ్య! = బ్రహ్మ కాశ్రయమైనవాడా! నేను చేసిన పుణ్యములను నీకే అర్పించాను. నీపై మరులుకొన్నాను. నన్ను మరువవలదు.

విశేషము = 'నమోబ్రహ్మణ్య దేవాయ। గోబ్రాహ్మణ హితాయచ।జగద్ధితాయ కృష్ణాయ।గోవిందాయనమోనమః' = బ్రహ్మణ్య దేవుడయిన, గోబ్రాహ్మణ హితుడయిన, జగద్ధితుడయిన, కృష్ణునకు గోవిందునకు నమస్కారము అని వైదిక శ్లోకము.

441. హుసేని = రూపకం

ప॥ రఘువీర-రణధీర-రారా రాజకుమార॥ రఘు॥

అ॥ భృగుసూను మదవిదార-బృందారకాధార॥ రఘు॥

చ॥ రావణ ఘటకర్ణబలా-రాతి నగనగారీ॥
స్థావరజంగమ రూప-త్యాగరాజహృచ్చారీ॥ రఘు॥

తాత్పర్యము :

ఇది కేవలము సంస్కృత సంబోధనములు.

442. శంకరాభరణం = ఆది

ప॥ రమారమణ రారా ఓ॥ రమారమణ॥

అ॥ సమానమెవరు వినుమా నామనవి
తమాము పొగడద-రమాహివతికిని॥ రమారమణ॥

చ॥ బుధాద్యవన దశ-రధార్భక మనో
రధం బొసగు సుమ-ర ధ్వార్హ సద్గుణ॥ రమారమణ॥

2 కలార్ధభూష! స-కలార్ధ శశధర
కలాధర నుత వి-కలార్తి సంహర॥ రమారమణ॥

3 రణాధిశూర! శ-రణాగతాత్మచ
రణంబు భవతా-రణంబు చేయును॥ రమారమణ॥

4 ముఖాబ్జమును శత-ముఖాది జూపు స
ముఖాన గొలుతు దు-ర్ముఖాసుర హరణ॥ రమారమణ॥

5 బిరాన బ్రోవ-గరాద? శ్రీమద
గరాజధర! త్యా-గరాజ సన్నుత॥ రమారమణ॥

తాత్పర్యము :

ఓ రమారమణా! నీ సమాన మెవరునులేరు. నామనవిని వినుము. నిన్ను ప్రత్యేకముగా పొగడ శేషునకయినా తరమా? నామ నోరథ మీడేర్చవలసినది. నీముఖమును

చూపుము. నన్ను వెంటనే బ్రోవుము. అని తాత్పర్యసారాంశము. తక్కిన దంతయు సంస్కృత సంబోధనమయమే.

443. వసంత భైరవి = ఆది

ప॥ రమారమణ భారమా నన్ను బ్రోవ శ్రీకర

అ॥ పుమానుడని గాదని నాతో దె
లుమా నరోత్తమ – సమాన రహిత॥ రమా॥

చ॥ సరినీ కెవ్వరు దొరకని గర్వము అదియుగాక
ధరలో జనులు మర్మ
మెరిగి నమ్ముకోరంటి ధర్మాది మోక్ష
వరము లొసంగి భక్తి
పరుల గాచిన కీర్తి వింటి మరిమరి నన్నిం
దరిలో జెయిబట్టి బ్రోవ
శరణుజొచ్చితి నయ్య దరి నీ వనుకొన్నాను
చరణమే గతియంటి॥ రమా॥

2 స్మరణ దెలిసి యేలే – పరమాత్ముడు నీవేయన్నాను పా
మరులతో సరిపోయినటువలెగో
చరములనే బల్కుకొన్నాను నామాటల్లెల్ల
గరుణతో నిజముజేయ వరదా దండములిడినాను
పరమపావన శ్రీరామరామ – శరజలోచన నన్నా
దరణ జేయుటకింత కరువైన విధమేమి ॥ రమా ॥

3 వ్యాజములకు నేను – రాజాలనంటేను
గోపాల గతిలేక నీతో
నాజాలి దెలుపబోతే
లాజములు వేగగ నేల శ్రీరామ రామ
ఆజాను బాహ రాజరాజ సకలలోకపాల విను భక్తత్యాగ
రాజుని యింట నీవు రాజిల్లినావు కనుక
నీ జపమునునీదుపూజ విడువజాల ॥ రమా ॥

తాత్పర్యము :

ఓరమారమణా! శ్రీకరా! నన్ను బ్రోవ భారమా? నేను నీకు రక్షింపదగిన పురుషుడుగా తోచుటలేదా? అట్టి పురుషుడను జొనని లేక కావని నూటిగా చెప్పుము. నీవు నరోత్తముడవు, సాటిలేనివాడవని గర్వమా? అదియుగాక ఈలోకపు జనులు నీ మర్మమెరిగి నిన్ను నమ్మికొనకున్నారు. అని నేననుచున్నాను సరి. నీవు పెక్కుమంది భక్తులను బ్రోచిన కీర్తినివిన్నాను. వారందరితో సమానముగా నాచెయిబట్టి రక్షించుటకు నిన్ను శరణుజొచ్చినాను. దరి = ఒడ్డు నీవని భావించి నీ చరణములు గతి అనుకొన్నాను. నా స్మరణమును తెలుసుకొని ఏలేవాడవు నీవన్నాను. నీ మహిమలను నేను సమగ్రముగా నెరుగను. అయినను పామరులవలె నాకు తెలిసిన వాటినే పలికినాను. ఓవరదా! నా కోరికలను సఫలముచేయుము. ఓ పరమపావనా! పంకజలోచనా! నాపై నీ ఆదరము కరువైనది. కారణమేమి? కపటపద్ధతిని నేనవలంబింపలేక ఓ గోపాలా! నా జాలి నీవద్ద తెలుపుకొనబోతే మాయపేలాలు వేయించుచున్నావు. నీవు నా ఇంట వెలసి యున్నావు కనుక నీ జపమును విడువను, నీ పూజను విడువను. అని అయ్యగారు మిక్కుటమగు తన భక్తిని ఆర్తిని నివేదించుకొన్నారు.

విశేషము = ఇందు అయ్యగారు పురుషునకు పర్యాయపదముగా ''పుమాంసుడు'' అనుటకు ''పుమానుడు'' అని అన్నారు. ఇది వారి స్వాతంత్ర్యము. ''గోచరములనే పలికినానన్నారు. భగవానుని గుణములు సమగ్రముగా బొగడుట కందనివి అని ''యతోవాచోనివర్తంతే! అప్రాప్య మనసాసహ॥ భగవంతుని గుణములు వాక్కుల కందనివి, మనస్సునకు నందనివి అని వేదవాక్యము. నిజానికి భగవంతునకు అనంతకల్యాణ గుణములు అని ప్రసిద్ధి. ఈ పరిస్థితిలో ఎరిగినవాడు భగవద్గుణములను సమగ్రముగానెరిగి పలుకుచున్నాననడు. రామాయణమున నున్న గుణములయినా సమగ్రములనుటకు లేదు. నారదుని నుండి వాల్మీకికి గోచరములు. వాల్మీకి నుండి (రామాయణము) నుండి అయ్యగారికి గోచరములు.

444. సుపోషిణి = రూపకము

ప॥ రమించువారెవరురా– రఘూత్తమా నినువినా॥

అ॥ శమాది సద్గుణగణ– సకల భువన జనులలో॥ రమించు॥

చ॥ 'రము'యనే సుమర్మము- రామయనే శర్మము. లస
దమరవరుల కబ్బెనో- త్యాగరాజ నన్నులా॥ రమించు॥

తాత్పర్యము :

ఈ సమస్త ప్రపంచములో నీకన్న రమించువారు (ఆనందించువారు, క్రీడించువారు) ఎవరయ్యా! ఎవరునులేరు. శమాది సద్గుణము కలరామా! 'రము' అనే ఒక మర్మమున్నది. రామ అనే ఒక సుఖమున్నది. ఇది ఏ దేవతలకో అబ్బును కదా!

ఇందు ఒక వ్యాకరణ సంబంధమున్నది. సంస్కృత మందు ప్రతి శబ్దమును ఒక ధాతువు నుండి పుట్టును. దాని ప్రకారము 'రామ' అనే శబ్దము 'రము' అనే ధాతువు నుండి పుట్టిన శబ్దము. 'రము' అనే ధాతువున కర్థము 'రము క్రీడాయాం' అనే సూత్రమును బట్టి క్రీడించుట అని అర్థము. జగత్తును క్రీడా పరికరముగా చేసుకొని ఆనందించువాడని తేలిన అర్థము. 'రావెూరమయతాంవరః' = రాముడు ఆనందింపచేయు వారిలో శ్రేష్ఠుడు. అను పురాణవాక్యానుసారముగా ఆనందింపజేయు వాడు రాముడు. మరియు 'రమంతే యోగినోఽనంతే। సత్యానందే చిదాత్మని। ఇతి రామపదేనాసౌ। పరం బ్రహ్మాభిధీయతే'= సత్యానంద స్వరూపుడు, జ్ఞానస్వరూపుడు, అనంతుడు అయిన పరబ్రహ్మమును ధ్యానించి యోగులు రమించెదరు కనుక పరబ్రహ్మమునకు 'రామ' అను శబ్దము పేరయినది. ఇది ఉపనిషద్వాక్యము. ఇది మర్మము (రహస్యము). రామ నామము సుఖప్రదము. ఈ రహస్యము దేవతలకు తెలిసి రామ పరబ్రహ్మమును ధ్యానించి సుఖింతురు. వారికీసుఖము కలిగినది కదా అని త్యాగయ్యగారి ఆశ్చర్యము.

445. టక్కరాగము = ఆది

ప॥ రాకాశశివదనా- ఇంకపరాకా॥ రాకా॥

అ॥ నీకాగుణము కారాదవ- నీకాంత! కరుణాస్వాంత॥ రాకా॥

చ॥ నమ్మియున్న నిజదాసులకు నమ్మికలనొసగి మరతురా!
తమ్మికనుల నొకసారి నను- దయజూడరాదా? మరియాదా? రాకా॥

2 పారిపారి నిన్ననుదినము- కోరికోరిన వారిని ఈ
దారి బ్రోచితివా మాయా- ధారి రారా ఏలుకోరా॥ రాకా॥

3 నీవే తెలుసుకొందువనుచును- భావించుచు నేను నీపద
సేవ జేసితి మహాను- భావ! త్యాగరాజునిపై॥ రాకా॥

తాత్పర్యము :

ఓ పూర్ణిమ చంద్రునివంటి ముఖముగల రామా! నా విషయమున నీకు పరాకా? భూమికి ప్రభువు, దయామయుడవు అయిన నీకు పరాకు తగదు. ఎవరయిన తమదాసులను నమ్మించి మరచిపోవుదురా? పోరు. నీ పద్మనేత్రములతో నన్నొకసారి చూడుము. అది మర్యాద. నీకొరకు పరుగెత్తుకొని వచ్చి కోరి సేవించినవారిని ఇలాగే రక్షించావా? లేదు (ఇందు విభీషణుడని ధ్వని). నేనింత మొరపెట్టనవసరము లేక నీవే తెలుసుకొందువని భావించి నీపద సేవచేయుచున్నాను. నాపై పరాకు వలదని ప్రార్థనము.

446. ఆందోళిక = ఆది

ప॥ రాగసుధారస పానము చేసి- రంజిల్లవే ఓమనసా॥ రాగ॥

అ॥ యాగయోగ త్యాగ- భోగఫల మొసంగే॥ రాగ॥

చ॥ సదాశివమయమగు- నాదోంకారస్వర
విదులు జీవన్ముక్తు- లని త్యాగరాజు తెలియు॥ రాగ॥

తాత్పర్యము :

ఓ మనసా! రాగమనెడి అమృతమును పానము చేసి రంజిల్లుము. ఇది బహుళార్థసాధకము. యాగఫలము, యోగఫలము, త్యాగఫలము, భోగఫలము ఇన్నిటి నిస్తుంది. నాదము సదాశివాత్మకము. అది ఓంకార రూపమున నుండి సప్తస్వరాత్మకమై రాగమయినది. ఈ రహస్యమెరిగినవారు జీవన్ముక్తులు. ఇది త్యాగరాజు (నేను) తెలుసుకొన్న రహస్యము.

విశేషము = 'యజపూజాయాం' అనే సూత్రమును బట్టి యాగమనగా భగవత్పూజ. 'యోగశ్చిత్తవృత్తినిరోధః' = యోగ మనగా మనస్సు ఇతర సంకల్పములను చేయక భగవంతుని యందే తగిలియుండుట. 'న కర్మణా నప్రజయా ధనేన, త్యాగేనైకే అమృతత్వమానశుః' = కర్మచేత కాదు, సంతానముచేత కాదు, ధనముచేత కాదు. కొందరు ఆత్మార్పణముచేత ముక్తిని పొందుదురు' అని ఉపనిషద్వాక్యము. ఆత్మార్పణమే

త్యాగము. భోగమనగా భగవద్గుణములను అనుభవించుట. మరియు 'గీతిగానేన యోగస్స్యాత్। యోగాదేవ శివైక్యతా' = సంగీతము పాడుటచేత యోగము కలుగును. యోగము వలననే శివైక్యము కలుగుతుంది అని సంగీతశాస్త్రము. ఈపైన చెప్పిన విషయము లన్నిటిని అయ్యగారు రాగము ద్వారానే అనుభనించినారు. అయ్యగారు పలికిన మాటలకు రాగమే వాహకము. దీని ద్వారానే అయ్యగారు యాగ, యోగ, భోగ, త్యాగఫలముల ననుభవించినారు. అదియే ఈ కృతియందు చెప్పినారు. ఇది స్వానుభవ వచనము.

447. లీతిగౌళ = రూపకం

ప॥ రాగరత్నమాలిక చే-రంజిల్లునట హరి శత॥ రాగ॥

అ॥ బాగసేవించి సకల-భాగ్యము నొందుదము రారే॥ రాగ॥

చ॥ నైగమషట్శాస్త్రపురా-ణాగమార్థ సహితమట
యోగివరులు ఆనందము-నొందే సన్మార్గమట
భాగవతోత్తములు గూడి-పాడే కీర్తనములట
త్యాగరాజు కడతేరను-తారకమని చేసిన శత॥ రాగ॥

తాత్పర్యము :

రాగములనెడు రత్నములచే కూర్పబడిన మాలిక. అనగా అయ్యగారు రచించిన కృతుల మాలిక. ఈ కృతులు వంద లున్నాయి కనుక శతరాగ రత్నమాలిక అని అయ్యగారు ఒక రూప కల్పన చేసినారు. ఆ రాగరత్నమాలికచే అలంకరింపబడిన హరి మిక్కిలి ప్రకాశించుచున్నాడు. ఈ ప్రకాశించు హరిని బాగుగ సేవించి సకల భాగ్యములను పొందుదము రండు అని అయ్యగారు భక్తులను ఆహ్వానించుచున్నారు. చరణమున నున్న నాలుగు పాదములతో అయ్యగారు ఆరాగరత్నమాలిక యొక్క విశేషములను వర్ణించినారు. ఆ మాలిక వేదముల, ఆరు శాస్త్రముల, పురాణముల, ఆగమముల అర్థములతో కూడినదట. యోగీశ్వరులు ఆనందించే సన్మార్గము లందున్నవట. భాగవతోత్తములు బృందములుగా కూడి పాడుకొను కీర్తనము లామాలికయం దున్నవట. ఇట్టి రాగరత్నమాలికచే హరి రంజిల్లు చున్నాడు. సేవించుదము రండు. అని ఆహ్వానము. (ఈ కృతిమాలిక యందున్న పై విశేష లక్షణములు ఇతరులచే వర్ణింపబడినవి కనుక

అయ్యగారు వాటిని అట, అట, అట అని వినయమును చూపినారు). ఇక తమ మాటగా త్యాగరాజు కడతేరుటకు తారకము అని చేసిన శతరాగరత్నమాలిక అని చెప్పినారు. పైన చెప్పిన లక్షణము లన్నియు అయ్యగారి కృతులయం దున్నవి.

448. తోడి = రూపకము

ప॥ రాజు వెడలె జూతాము–రారే! కస్తూరిరంగ॥ రాజు॥

అ॥ తేజినెక్కి సామంత–రాజులూడి గములు సేయ॥ రాజు॥

చ॥ కావేరీ తీరమునను–పావనమగు రంగపురిని
శ్రీవెలయు చిత్రవీధి–లో వెలయుచు రాగ
సేవలు గని సురలు విరుల–చే ప్రేమను పూజించగ
భావించి త్యాగరాజు–పాడగ వైభోగ రంగ॥ రాజు॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు శ్రీరంగయాత్ర చేసినప్పుడు శ్రీరంగములో రంగనాథుని తిరువీధి ఉత్సవమును చూచి దానిని వర్ణించిన కృతి. ఓ భక్తులారా! రంగరాజు వెడలినాడు చూతము రండు. గరుత్మంతునెక్కి సామంతరాజులు సేవలు చేయుచుండగా కస్తూరి రంగడు బయలుదేరినాడు. కావేరీ తీరమందు పావనమైన శ్రీరంగములో చిత్రవీధిలో బయలుదేరినాడు. ఈ సేవను చూచుటకు దేవతలు దివినుండి భువికివచ్చి భక్తితో పూవులు చల్లుచున్నారు. దీని నంతయు చూచిన త్యాగరాజు భావన జేసి పాడుచుండగా వైభోగరంగనాథుడు వెడలినాడు రండు. చూడుడు అని అయ్యగారు భక్తుల నాహ్వానించినారు.

449. మణిరంగు = అది

ప॥ రానిది రాదు సు–రాసురులకైన

అ॥ పోనిది పోదు–భూసురుల కైన॥ రానిది॥

చ॥ దేవేంద్రునికి సు–దేహము పూర్వ
దేవుల కమృతమ–భావమే కాని

ఆవనచరబాధ- లామునులకే కాని
పావన త్యాగరాజ- భాగ్యమా శ్రీరామా॥ రానిది॥

తాత్పర్యము :

త్యాగయ్యగారి భావనలో రాముడు తనను బ్రోచుటలేదు. రామానుగ్రహము తనపై వచ్చుటలేదు. తాను ఎన్నో మొరలు పెట్టుచున్నాడు. ఈ ప్రాతిపదికమీద అయ్యగారికి ఒక వైరాగ్యము నిరాశ కలిగినది. రానిది రాదు పోనిది పోదు అని. అదే పల్లవి అయినది. ఎంతో శక్తియుక్తులు కలిగిన దేవతలకైనా ఎంతో బలముకల రాక్షసులకైనా తపశ్శక్తి కలిగిన బ్రాహ్మణులకయినా అంతే రానిది రాదు, పోనిది పోదు. దేవేంద్రుడు అహల్య కాశపడ్డాడు. కాని తుదకేమయినది? గౌతమ శాపము చేత ఒడలంతయువేయి కళ్లయినవి. ఇంద్రునకు మాత్రం అవి కనులుగా కనపడవు. జుగుప్సాకరముగా కనపడును. అహల్యాసంగమ మడియాస అయినది. ఒడలంతయు కనులు మిగిలినవి. రాక్షసులు దేవతలతో చేతులు కలిపినారు. సముద్రమును మథించినారు. చాలా శ్రమపడినారు. ఓమయినది? జాతికి మొత్తం చుక్క అమృతము లభింపలేదు. త్రేతాయుగములో మునులు సామాన్యులా? కాదు. ఒక్కశాపవాక్కుతో అరణ్యములో తమను బాధించే రాక్షసులను, మృగములను నిర్మూలింపగలరు. కాని ఆ బాధలు వారికి తప్పలేదు. ఈ దృష్టాంతములలో రానిది రాలేదు. పోనిది పోలేదు. ఇది అయ్యగారి హితబోధ.

450. సావేరి = అది

ప॥ రామబాణత్రాణ శౌర్య- మేమని పొగడుదురా ఓ మనసా। రామ॥

అ॥ భామకాసపడు రావణు మూల- బలముల నేలగూలజేయు॥ రామ ॥

చ॥ తమ్ముడు బడలిన వేళ సురరిపు- తెమ్మని చక్కెర బంచీయగ గని
లెమ్మనుచును ఇంద్రారి బల్క సమ- యమ్మని లేవగా
సమ్మతితో నిలబడి కోదండపు- జ్యాఘోషము లశనుల చేసితా
నెమ్మదిగల తోడును జూచెను రా
నిజమైన త్యాగరాజనుతుడగు॥ రామ॥

తాత్పర్యము :

రామబాణము యొక్క రక్షణ శక్తిని వర్ణించుచున్నారు. ఓ మనసా! రామబాణము యొక్క త్రాణశౌర్యము (రక్షణ శౌర్యము) ను ఏమని పొగడుదును. భామకు (సీతకు) ఆశపడిన రావణుని మూలబలము నేలగూల్చుటతో పాటు సీతారక్షణము జరిగినది. అదిత్రాణ శౌర్యము. రావణుడు వేసిన శక్తితో లక్ష్మణుడు మూర్ఛిల్లినాడు. రావణుడు ఆనందముతో తనవారికి చక్కిరపంచి పెట్టినాడు. రావణుడు మూర్ఛిల్లిన లక్ష్మణుని లెమ్మని భుజమున వేసుకొని లంక చేర్చుటకు ప్రయత్నించినాడు. ఆప్రయత్నములో రావణుడుండగా రాముడు లేచి నారి సారించి ధనుష్టంకారము చేసినాడు. అది పిడుగులను గురిసినది. లక్ష్మణుడు నెమ్మదిగా లేచి కూరుచున్నాడు. అట్టి తోడును చూచుకొన్నాడు రాముడు. అది ఆ రామ బాణము యొక్క త్రాణ శౌర్యముకదా!

విశేషము = రావణుని శక్త్యాయుధముతో లక్ష్మణుడు మూర్ఛిల్లినాడు. రాముడు చాల వగచినాడు. 'దేశేదేశే కళత్రాణి। దేశేదేశేచ బాంధవాः। తంతు దేశం నపశ్యామో। యత్రభ్రాతా సహోదరः' = ప్రతిచోటను భార్యలు దొరకుదురు. చుట్టములు దొరకుదురు. కాని సహోదరుడు ఎచ్చటను దొరకడు. అని వగచినాడు. తుదకు విజృంభించి ధనుష్టంకారముతో తమ్ముని రక్షించుకొన్నాడు.

451. శుద్ధ బంగాళ = ఆది

ప॥ రామ భక్తిసామ్రాజ్య-మే మానవుల కబ్బెనో మనసా॥ రామ॥

అ॥ ఆమానవుల సందర్శన-మత్యంతబ్రహ్మానందమే మనసా॥ రామ॥

చ॥ ఈలాగని వివరింపలేను-చాల స్వానుభవవేద్యమే
లీలాసృష్ట జగత్త్రయమనే-కోలాహల త్యాగరాజనుతమౌ॥ రామ॥

తాత్పర్యము :

రామభక్తి అనేది ఒక సామ్రాజ్యము. ఈ సామ్రాజ్యము మబ్బినవారి సందర్శనము అత్యంత బ్రహ్మానందము. ఈ ఆనందమును ఇట్టిదని నేను వర్ణింపలేను మాటలతో. కేవలము అనుభవైకవేద్యము. మరి ఈ జగత్సామ్రాజ్యపు మాట ఏమిటి? అంటే. ఇది శాశ్వతము కాదు. ఈ జగత్తులు భగవంతుడు తన లీలకొరకు సృష్టించినది. ఇది కేవలము పక్షుల కలకలము వంటిదే. అని అయ్యగారు రామభక్తి యొక్క ఆనందమును అనుభవపూర్వకముగా చెప్పినారు.

విశేషము = భర్తృహరి 'సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్' = చక్కని కవిత్వ మబ్బినచో రాజ్యమేల' అన్నాడు. త్యాగయ్యగారు రామభక్తిని సామ్రాజ్యముగా రూపకముచేసి దానిని బ్రహ్మానందముగా నిరూపించినారు. అది శాశ్వతానందప్రదము. జగత్సామ్రాజ్యము భగవల్లీల మాత్రమే. కోలాహలమాత్రమే. అన్నారు. 'కోలాహలః। కలకలః తిరశ్చాం వాసితం రుతం' = కోలాహల మనగా పక్షుల కలకలమని. జగత్సామ్రాజ్యమింత మాత్రమే అని భావము. కవిత్వము రాజ్యమాత్రమైతే రామభక్తి సామ్రాజ్య మనియును. 'రాజ్యాంతే నరకం ధ్రువం' = రాజ్యాంతమునందు రాజునకు నరకము తప్పదని శాస్త్రము. రామభక్తి సామ్రాజ్యము వలన మోక్షసామ్రాజ్య సుఖమనియును.

452. ధన్యాసి = ఆది

ప॥ రామాభిరామ! మనసు-రంజిల్ల బల్కగ రాదా॥ రామాభి॥

అ॥ ఈ మహిని వెలసిన-దేమి సదానాతో॥ రామాభి॥

చ॥ బంగారు మేటి పాన్పుపై-భామామణి-జానకి
శృంగారించుకొని-చెలువొందగా-నిన్నుగని
పొంగుచు మల్లెవిరుల-పూజించువేళ శ్రీహరి
సంగీతము బాడుమని-స్వామీ త్యాగరాజునితో॥ రామాభి॥

తాత్పర్యము :

రామాభిరామా! = మిక్కిలి మనోహర మగువాడా! నామనస్సు ఆనందించునట్లు నాతో ఒక్కమాట పల్కరాదా! రామా! అసలు ఈ భూమిపై నీవు అవతరించిన దెందుకో? గుర్తుకు తెచ్చుకొని నాతో ఎప్పుడును మాటలాడుము. హరీ రామా! ప్రత్యేకమైన కోరిక ఒకటున్నదయ్యా! అది తీర్పుమయ్యా! రామా! భామామణి సీత శృంగారించుకొని నీబంగరు పాన్పుపై నిన్ను ఆనందముతో చూచుచు ఉప్పొంగుచు మల్లెపూలతో పూజించుచుండగా నన్ను పిలిచి 'త్యాగయ్యా! సంగీతము పాడరా' అని ఒక్కమాట పలుకరాదా! అని అయ్యగారి ఆంతరంగిక ప్రార్థనము.

విశేషము = రాముడు ఈ భూమిపై వెలసిన దెందుకు? వైకుంఠము మూలస్థానము. 'వైకుంఠేతు పరే లోకే। శ్రియాసార్ధం జగత్పతిః। ఆస్తే విష్ణు రచింత్యాత్మా। భక్తైర్భాగవతైస్సహ' = అచింత్యాత్ముడు, జగత్పతి అయిన విష్ణువు పరమోత్తమ

లోకమయిన వైకుంఠమునందు లక్ష్మీదేవితో కూడి ముక్తులతోను, నిత్యులతోను కూడ నున్నాడు' అని ప్రమాణము. అయితే ఆయనకు అనంతకల్యాణగుణము లున్నవి. వాటిలో సౌలభ్యమను గుణమొకటి. సౌలభ్యమనగా చాలా గొప్పవాడు తనకన్న చాల తక్కువ వాళ్లతో కూడియుండి సంభాషించుట. ఇది అనగా సౌలభ్యము. వైకుంఠమందు ప్రకాశింపలేదు. ఎందుచేతనంటే అచ్చట నున్నవారందరు విష్ణు సారూప్యము కలిగిన మహామహులు. అందుచేత వారితో మాటలాడినా విష్ణువు యొక్క సౌలభ్యము అక్కడ ప్రకాశించదు. అందుచేత స్వామి భూమి యందవతరించి సౌలభ్యగుణమును ప్రకాశింపజేసినాడు. దానినే అయ్యగారు 'ఈ మహిని వెలసినదేమి' అన్నారు.

453. దర్బారు = చాపు

ప॥ రామాభిరామ-రమణీయనామ॥

అ॥ సామజరిపు భీమ-సాకేత ధామ॥ రామాభి॥

చ॥ వనజలోచన నీ-వలసి యలసితి నీ
మనసున దయలేదు-మల్లాడి ఫలమేమి॥ రామాభి॥

2 మనసను చెలి నీకే-మరులుకొన్నది కాని
చనవున చెయిబట్టి-సంరక్షించవు॥ రామాభి॥

3 కమనీయమగు పాన్పు-గావించితి నందు
రమియింపక నన్ను-రచ్చచేసేవు॥ రామాభి॥

4 కోరికోరినిన్ను-కొలువగ నీకు
దారి వేరే అని-ధాతన్రాతేమో॥ రామాభి॥

5 దిక్కు నీవని నేను-దినదినమును నమ్మ
ఎక్కు తక్కువలందు-ఎనసేగుణమేమో॥ రామాభి॥

6 నీకే దయబుట్టి-నీవే బ్రోవవలె
రాకేందుముఖ త్యాగ-రాజ రక్షక శ్రీ॥ రామాభి॥

తాత్పర్యము :

రామా అభిరామా! ఆనంద స్థానమయిన నామము కలవాడా! అయోధ్యావాసా! శత్రువులకు సింహము వలె భయంకరుడా! ఓ వనజలోచనా నా మొరలను వినివిని

అలసినావేమో? నేను ఎంతమల్లాడినా నీ దయ రవంతయు వచ్చుటలేదు. నామనస్సనెడి చెలి నీపై మరులుకొనియున్నది. దాని చెయిబట్టి రక్షించుము. నామనస్సునందు నీకు చక్కని పాన్పు అమర్చినాను. ఆ పాన్పునందు ఆనందముతో శయనింపుము. నేను కోరికోరి కొలుచుచున్నాను. కాని నీదారి వేరుగా నున్నది. ఇది నాతల వ్రాత ఏమో? నీవే దిక్కని దినమంతయు నిన్ను నమ్మి యున్నాను. నీవు నన్ను తక్కువ చూపు చూచుచున్నావు. నాలో ఎక్కువ తనమేమియూలేదు. నీకు అవ్యాజముగా దయబుట్టి రక్షింపవలెనయ్యా! అని ప్రార్థనము.

454. సావేరి = జంపె

ప॥ రామాభిరామ రఘురామ

అ॥ తామసములేల సీ-తామనోరమణ॥ రామాభి॥

చ॥ పగజేయుటేలనా-పాలనీదు
వగలేల విడజాల-వుగజేంద్రపాల॥ రామాభి॥

2 నీ సొమ్ము నేనడుగ-లేదు-నిండు
మోసమౌ ప్రాపంచ-మం దాసలేదు.॥ రామాభి॥

3 నీ సరిసమాన మెవ-రిలలో రామ
నీరజదళాక్ష చి-క్కితిరనీ వలలో॥ రామాభి॥

4 ఆస నీయెడ విడగ బోదు నిజ
దాసరక్షక నిను వి-నాగతి లేదు॥ రామాభి॥

5 కల్లలాడని తెలియ-లేరా-నీ
వల్ల నేరముగాని నేనీకు వేరా॥ రామాభి॥

6 శ్రీపతీ ననుమరువ-దగునా-ఇది
పాపమేగాని యెడ-బాయ మనసగునా॥ రామాభి॥

7 ఆజాను బాహుకర మీరా శ్రీత్యాగ
రాజుని భవాబ్ధి దా-టించి పరమీరా॥ రామాభి॥

తాత్పర్యము :

ఓ రామాభిరామా! రఘురామా! సీతామనోరమణా! ఇక నన్ను రక్షించుటకు జాగుచేయకు. నేను నిన్ను నీ సొమ్ము లేమియు అడుగలేదు. ప్రాపంచిక సుఖము లిమ్మని అడుగలేదు. నీ సరిసమానమయిన దైవములేదని నమ్మి నీవలలో చిక్కినాను. నీపై ఆశవిడువలేను. నేను కల్లమాటలాడనని నీకు తెలియదా? తెలుసును. తెలిసియు నన్ను రక్షింపకుండుట నీనేరము. నన్ను వేరు చేయకుము. నన్ను మరువకుము. నీవు నన్ను మరచుట నా పాపము. అయినా నామనసు నిన్నెడబాయదు. నీ ఆజానుబాహువును (మోకాళ్లవరకు కరముండుట మహాపురుష లక్షణము) నాకందించి నీస్థానము నాకిమ్ము. అని అయ్యగారి ప్రార్థనమ.

455. సావేరి = ఆది

ప॥ రామం భజేహం సదా- రాక్షసకుల భీమం॥ రామం॥

అ॥ శ్యామం సకలసుజన హృదయజలధి
సోమం జనకసు తాభిరామం॥ రామం॥

చ॥ సుందరముఖ మర-విందనయన మఘ
బృంద పర్వతపు-రందర మనఘ స
నందన నుత మానంద జలధి మహి
బృంద సుభూషణ వందిత చరితం॥ రామం॥

2 ధీరం సురపరి-వారం భువనా
ధారం సుగుణా-కారం సమలం
కారం దుర్జన-దూరం శ్రీరఘు
వీరం మే హృది-వారం వారం॥ రామం॥

3 రాజం నతసుర-రాజం స్తుతగజ
రాజం శ్రుత విను-తాజం సుతరతి
రాజం తురగవి-రాజం సుజనస
మాజం త్యాగ-రాజ రాజం॥ రామం॥

తాత్పర్యము :

ఇది అంతయు సంస్కృత విశేషణములు. గుణవైభవ వర్ణనము.

456. గౌళీపంతు = ఆది (దివ్యనామము)

ప॥	రామ రామ కృష్ణయనరే–రాతిరి పగలు మా సీతా॥	రామ॥
చ॥	ఇతర మార్గసౌఖ్యములకు–అతని హృదయమే సాక్షియు॥	రామ ॥
2	కాని పనులు కోరికోరి–కరగుచుండే మానవులు॥	రామ॥
3	కుత్సితపు మాటలకు–కుత్తుకో పారలేటి జనులు॥	రామ॥
4	ఎదుటి పచ్చచూడలేక–హితపు మాటలాడే జనులు॥	రామ॥
5	చాల శాస్త్రము లన్నిచదివి–ఆసదాసులైనవారు॥	రామ॥
6	చల్లని వాక్కులు బల్కి–స్వాంతమనలమైనవారు॥	రామ॥
7	పలుకనేర్చి అడుగబోతే–తెలివికి హానియైన వారు॥	రామ॥
8	జాతిహీనులైనవారు–జాణలైనారదే సాక్షి॥	రామ॥
9	పాము పంది గజపిశాచ–పాతకాగ్రేసరులై సాక్షి॥	రామ॥
10	త్యాగరాజు తెలుసుకొన్న–తారక మిహపర సాధనము॥	రామ॥

తాత్పర్యము :

రామకృష్ణ నామస్మరణము చేయుమని త్యాగయ్యగారి బోధ. ఇతర మార్గములో కలిగే సౌఖ్యము నశించునదని స్మరించువాని మనస్సు తెలియును. చేయకూడని పనులు చేసి కరగిపోయే మానవులు, కుత్సితపు మాటలాడుటకు పారలాడే మనుష్యులు, ఇతరుల సంపదను చూచి ఓర్వలేక పైకి మంచి మాటలు మాటలాడే ఈర్ష్యాళువులు, చాల శాస్త్రములు చదివియు ఆశను జయించలేనివారు, మనస్సులో ఈర్ష్య అనే అగ్నిని పెట్టుకొని పైకి చల్లని మాటలు మాటలాడేవారు, మాటలాడ కలిగియు ఎవరైనా ఏదో తెలియగోరి ప్రశ్నిస్తే ఎదుటివారిని హానిలోనికి లాగేవారు, ఇట్టివారందరును రామకృష్ణనామమును పలుకవలెను. జాతిహీనులైనవారు జాణలగుట సాక్షి రామనామ ఫలితమునకు. మరియు పాము సాక్షి. పందిసాక్షి. ఏనుగు సాక్షి. పిశాచము సాక్షి. పాపులు సాక్షి.

విశేషము = రామనామ స్మరణము చేత మనస్సు నిర్మలమగునని వ్యాసమహర్షి వాక్యము. త్యాగయ్యగారి వాక్యము 'నీ నామముచే నామది నిర్మలమైనది' అని. నామస్మరణముచేత మనస్సు నిర్మలమయి ఈ కృతిలో చెప్పబడిన దుర్లక్షణము లన్నియు తమంత తాము నశించునని సిద్ధాంతము. అందుచేత ప్రత్యేకించి దుర్లక్షణములవారు రామకృష్ణ నామ స్మరణము చేయవలసినదిగా చెప్పబడినది'. 'హర్షిర్హరతి పాపాని। దుష్ట చిత్తైరపి స్మృతః' = దుష్ట చిత్తులు స్మరించినా హరి వారి పాపములను హరించును' అని శాస్త్రము. 'జాతి విహీనుడు' గా పరిగణింపబడిన వాల్మీకి మునులు చెప్పినట్లు రామనామము పలికి 'జాణ' ఆదికవి అయినాడు. పాము కాళహస్తిలో సద్గతి పొందినది. పంది కథ విచార్యము. ఏనుగు 'రావే ఈశ్వర కావవే' అని ప్రార్థించి ముక్తిని పొందెను. ఒక అడవిలో పిశాచము ఒకదాసరి తాను చేసిన భగవన్నామస్మరణ ఫలితమును కొంత ధారపోస్తే పిశాచత్వము పోయి ముక్తి నందినది. ఈ కథ కృష్ణదేవరాయల ఆముక్తమాల్యదయం దున్నది. 'పాత కాగ్రేసరులెసాక్షి' అనుదానికి. ఒక అడవిలో ఒక దొంగల గుంపు బ్రాహ్మణులను అటకాయించినది. బ్రాహ్మణులు బెదరి వారి భాషలో (సంస్కృతములో) దొంగలను మీరేమి చేయుదురు? అని ప్రశ్నించిరి. దొంగలు సంస్కృతములోనే వనే చరామః = అడవిలో తిరుగుదుము– వసు చాహరామః = డబ్బును దోచుకొందుము – నదీస్తరామః= నదులను దాటుదుము – నభయంస్మరామః = భయమును తలపము అని జవాబు చెప్పిరి. ఆ నాలుగు వాక్యములలో చివర రామః అని ఉండుటచేత వాళ్లు రామనామము పలికినట్లయివారికి ముక్తి వచ్చినదట. ఈ విషయము లన్నియు దృష్టిలో పెట్టుకొని ఈ కృతి వ్రాసిరి.

457. సౌరాష్ట్రము = ఆది (దివ్యనామము)

ప॥ రామ రామ గోవింద– రక్షించు ముకుంద॥ రామ రామ॥

చ॥ కలియుగ మనుజులు– నీకు మాహాత్మ్యము
కలదు లేదనే– కాలమాయెగా॥ రామ॥

2 కామని దాసులు– నా పలుకుల విని
కావలసినటుల– నాడనాయె గద॥ రామ॥

3 పామరులను గని– సిగ్గుపడుచుమరి
మోము మరుగుజేసి– తిరుగ నాయెను॥ రామ॥

4 క్రొవ్వుగల నరుల-గొనియాడగ జిరు
నవ్వులతోనను-జూడనాయెగద॥ రామ॥

5 మతిహీనులు శ్రీ-పతి దాసుల కీ
గతి రారాదని-బల్కనాయెగద॥ రామ॥

6 నమ్మినాడనే-పేరుకైన నీ
తమ్మునితోనైన-వైతివి॥ రామ॥

7 కార్యాకార్యము-సమ మాయెను నీ
శౌర్య మెందు దా-చుకొంటి వయయో॥ రామ॥

8 రాగ రాగ బ్రతు-కిట్లాయెను శ్రీ
త్యాగరాజనుత-తరుణము గాదు॥ రామ॥

తాత్పర్యము :

రామా రామా! గోవిందా! రక్షించవలసిన తరుణము వచ్చినదయ్యా! కలియుగపు మానవులు నీకు మహిమ కలదా లేదా? అనే సందేహకాలము వచ్చినదయ్యా! నేను రామదాసుడను. కామదాసులు నామాటలు విని వాళ్ల ఇష్టము వచ్చినట్లు ఆడిపోసుకొనే కాలము వచ్చినది. పామరులను చూచి సిగ్గుపడి ముఖమును చాటుచేసుకొని పోవలసిన కాలము వచ్చినది. మదమత్తులను నేను కొలువగా ఇతరులు నన్ను చూచి వారిలో వారు నవ్వుకునే స్థితి వచ్చినది. మతి హీనులైన వారు రామదాసుల కడగళ్లు చూచి వీరి కిట్టిగతి పట్టకూడదని జాలి చూపేస్థితి వచ్చినది. నేను నిన్ను నమ్మి ఆశ్రయించినాను. నన్ను రక్షింపుమని నీ తమ్మునితోనైన చెప్పరాదా? రామా! చెయ్యరాని పని, చెయ్యదగిన పని అనే తేడా లేక రెండును సమ మయిన కాలము వచ్చినది. నీ పరిపాలన కాలములో ఇట్టి పరిస్థితిలో నీ శౌర్యమును చూపి చక్కదిద్దినావు కదా! ఆ శౌర్యమేమయినది? రాగా రాగా ఇవన్నియు చూచుచు బ్రతుకును నెట్టవలసి వచ్చుచున్నది. నీవు జనులను ఆదుకోవలసిన తరుణమయ్యా. అని అయ్యగారి ప్రార్థనము.

విశేషము = 'అభ్యుత్థాన మధర్మస్య। తదాత్మానం సృజామ్యహం' = అధర్మము తల ఎత్తినప్పుడు నా ఆత్మశక్తిని సృజించెదను' అని భగవానుని వాక్యము. దానిని అయ్యగారు రామునకు గుర్తుజేసినారు.

458. ఆనందభైరవి = ఆది (దివ్యనామము)

ప॥ రామ రామా! నీవారము-గామా సీతా
రామ రామా సాధుజన-ప్రేమారామా॥ రామ॥

చ॥ మెఱుగు చేలము గట్టుకో-మెల్ల రారా రామ
కఱకు బంగారు సొమ్ములు-కదల రారా॥ రామ॥

2 వరమైనట్టి భక్తాభీష్ట-వరద రారా రామ
మరుగుజేసుకొనేదె ట్టి-మహిమ రామా॥ రామ॥

3 మెండైన కోదండకాంతి-మెరయరారా కనుల
పండువుగ నుండు ము-ద్దండరామా॥ రామ॥

4 చిరునవ్వుగ మోము-జూపరారా రామ
కరుణతో నన్నెల్లప్పుడు-గావ రారా॥ రామ॥

5 కందర్పసుందరానంద-కంద రారా నీకు
వందనము జేసెద గో-వింద రారా॥ రామ॥

6 ఆద్యంతరహిత వేద-వేద్య రారా-భవ
వైద్య నే నీవాడనైతి-వేగరారా॥ రామ॥

7 సుప్రసన్న-సత్యరూప-సుగుణ రారా రామ
అప్రమేయ త్యాగరాజు-నేల రారా॥ రామ॥

తాత్పర్యము :

దీని సారము రాముని రమ్మని ఆహ్వానించుట. రామా! మేము నీ వారము కామా? అగుదుము. సీతారామా! సాధుజన ప్రేమారామా = సత్పురుషుల భక్తికి ఆరామమైనవాడా! బంగారు వలువధరించుటకు బంగరు నగలు గలుగల్లన రారా! భక్తా భీష్టవరదా! నిన్ను నీవు కనపడనీయక మరుగు చేసుకొనుట ఏమి గొప్పయ్యా? కోదండ కాంతి మెరయుచుండగా చిరునవ్వుమోము చూపి నన్నుగావ రారా! మన్మథసుందరా! ఆనందదాయకా! నీకు వందనము చేసెదను రమ్ము. ఆద్యంతములు లేనివాడవు. వేద వేద్యుడవు. సంసారమ నెడిరోగమును హరించు వైద్యుడవు. నన్నేల రారా! అని ఆహ్వానము.

459. ఖరహరప్రియ = రూపకం

ప॥ రామ! నీ సమాన మెవరు। రఘువంశోద్ధారక॥ రామ॥

అ॥ భామ మరువంపు మొలక। భక్త్యను పంజరపుచిలుక॥ రామ॥

చ॥ పలుకు పలుకులకు తేనె। లొలుకు మాటలాడుసోద
రులు గలహరి! త్యాగరాజ। కులవిభూష! మృదుసుభాష॥ రామ॥

తాత్పర్యము :

రామా! రఘువంశోద్ధారకా! నీ సమాన మెవరున్నారు? లేరు. నీ భామసీత ఒక మరువపు మొలక. అనగా సుగుణ పరిమళము కలది అని. మరియు నీ భక్తి అనెడు పంజరమునందున్న చిలుక. ఇక తమ్ములా? లక్ష్మణ భరత శత్రుఘ్నులు. వారు పలుకుతూ వుంటే తేనె చినుకులవలె ఉంటాయట. అటువంటి భామ, ఇటువంటి సోదరులు కలిగిన నీతో సమాన మెవరును లేరు. అని అయ్యగారు రాముని సాటిలేని తనమును వర్ణించినారు.

460. ఖరహరప్రియ = ఆది

ప॥ రామా నీయెడ-ప్రేమరహితులకు
నామరుచి తెలుసునా! ఓ సీతా॥ రామా॥

అ॥ కామినీ వేషధారికి సాధ్వినడత
లేమైన దెలుసునా-ఆరీతి సీతా॥ రామా॥

చ॥ తన సౌఖ్యము తానెరుగక యొరులకు
తగు బోధన సుఖమా॥
ఘనమగు పులి గోరూపమైతే త్యా
గరాజనుత! శిశువు పాలు గల్గునా?॥ రామా॥

తాత్పర్యము :

ఓ రామా! నీపై నిజమైన భక్తిగలవారికి గానీ నీ నామరుచి తెలియదు. భక్త వేషధారులకు ఆంతరంగికమైన నామరుచి తెలియదు. నాటకములలో స్త్రీ వేషధారి అయిన పురుషునకు సాధ్వి అయిన స్త్రీ యొక్క ఆంతరంగిక ప్రవృత్తి కలుగుతుందా?

కలుగదు. తన సౌఖ్యము (నామసౌఖ్యము) తానెరుగక ఇతరులకు ఉపదేశించుట సుఖమా? కాదు. ఆవు చర్మము కప్పిన పులి ఆవువలె కనపడవచ్చును. కాని దానివద్ద ఆ ఆవు దూడకు పాలుదొరకవు. అట్లే నిజభక్తిలేనివారికి రామనామరుచి తెలియదు. అని అయ్యగారు చేసిన బోధనము.

461. మధ్యమావతి = ఆది (దివ్యనామము)

ప॥ రామనామ భజరే మానస॥ రామ॥

చ॥ దొంగరీతి తిరుగంగనేల శ్రీరంగని పదముల కౌగలించుకొని॥ రామ॥

2 దేహమెత్తి సం-దేహపడక వై-దేహి భాగ్యమా! దేహిదేహియని॥ రామ॥

3 ఎక్కడైన హరి యొక్కడనుచు మది-చక్కదనముగని సొక్కి సంతతము రామ॥

4 ఎందుబోక రాకేందుముఖుని నీ-యందు జూచి ఫలమందుకోర శ్రీ॥ రామ॥

5 సాధుసజ్జనుల బోధచేత భవ-బాధమానవలె సాధకమ్ముతో రామ॥

6 రాగరహిత జనభాగధేయుని వి-నాగతి ఎవ్వరె త్యాగరాజనుత రామ॥

తాత్పర్యము :

ఇందు పల్లవి సంస్కృతము. చరణము లన్నియు తెలుగు. పల్లవి 'ఓ మనసా రామనామమును భజింపుము' అని. దొంగవలె తిరుగకు రంగని పాదములు పట్టుకో. దుర్లభమయిన మానవదేహము లభించినది కనుక సందేహము వదలి 'సీతాపతీ' నాకు నీ నామమిమ్ము అని నామభజనము చెయ్యి. ఎక్కడైనా హరి ఒక్కడే రక్షకుడని ఆయన చక్కదనము చూచి పరవశించి నామభజనము చేయుము. వేరే ఇతరములకు పోక ఆచంద్రముఖుని నీ అంతరాత్మలో దర్శించి సాక్షాత్కారఫలమును పొందుము. సజ్జనుల బోధలు విని సంసారబాధను రామనామము యొక్క అభ్యాసముతో నెట్టుకొనుము. రాముడు తప్ప ఇంకెవరు గతిలేరని తెలిసి రామనామమును భజింపుము. అని అయ్యగారు మనస్సు పేరుతో మానవజాతికి చేసిన బోధ.

462. మధ్యమావతి = ఆది

ప॥ రామకథా సుధా-రసపానమొక-రాజ్యముచేసునే రామ॥

అ॥ భామామణి జానకి-సౌమిత్రి
భరతాదులతో-భూమి వెలయు శ్రీ॥ రామ॥

చ॥ ధర్మా ద్యఖిల ఫలదమే మనసా
ధైర్యానంద సౌఖ్యనికేతనమే
కర్మబంధజ్వల నాబ్ధ పోతమే
కలిహరమే త్యాగ-రాజ వినుతుడగు॥ రామ॥

తాత్పర్యము :

రామకథ అనే అమృత రసపానమే రాజ్యము చేయుచున్నది. సీతతో లక్ష్మణ భరతశత్రుఘ్నులతో భువి నవతరించిన రాముని కథ రాజ్యము చేయుచున్నది. రామకథ ధర్మఫలము నిస్తుంది. ధైర్యమునకు ఆనందమునకు సుఖమునకు అది స్థానము. మనసు బాధించే కర్మబంధమనే అగ్నిని చల్లార్చే చిరు మేఘము. కలిదోషమును హరిస్తుంది. అని రామకథను తరచి తరచి అయ్యగారు మనకిచ్చిన సారము.

463. కాపి = చాపు

ప॥ రామ రఘుకుల జలనిధి-సోమ లోకాభి॥ రామ॥

అ॥ తామర చూలికైనను-నీ మహిమలు తెలియవశమా॥ రామ॥

చ॥ శరణాగత జనరక్షక-సురపాల ముఖజితసుధా
కర! నిన్ను విభీషణుడు-శరణనగానే
సురముని జనవైరి సహో-దరు డనుచును ఎంచక నీ
బిరుదును బొగడుచు లంకా-పురపతిగా జేసిన శ్రీ॥ రామ॥

చ॥ సురపూజిత పదనీదు-వరరూపము గనజాలక
గిరిజా, రిపుమర్దన శం-కర సౌమిత్రి
ధరజా నిలతనయ విభా-కరసుత దశవదనానుజ
భరతులు పొగడగ తొమ్మిది-గురికి దివ్యదృష్టిచ్చిన॥ రామ॥

2 జలజారుణ చరణాసుర–జలదాశుగ శ్రీరఘుకుల
తిలకాద్భుత శుభగుణములు–గల త్యాగరాజ
కులపావన కలియుగమను–జులకును నీ తారకము ని
టలనేత్రుని చేతను వీ–నుల బల్కనుగా జేసిన॥ రామ॥

తాత్పర్యము :

రామా! రఘుకుల జలనిధి సోమా = రఘువంశ మనెడి సముద్రమునకు చంద్రుడా! లోకాభిరామా! బ్రహ్మకైన నీమహిమ తెలియతరము కాదు. శరణాగతులను రక్షించువాడా! దేవతలను పాలించువాడా! చంద్రుని కాంతిని మించిన ముఖముగలవాడా! విభీషణుడు శరణుజొచ్చిన వెంటనే వాడు సురలకు మునులకు కంటకుడైన రావణుని తమ్ముడని ఎంచక రక్షించి లంకకు రాజును జేసి బిరుదును నిలువబెట్టుకొన్నావు. నీ రూపము గనలేని పార్వతికి, శత్రుఘ్నునకు, శంకరునకు, లక్ష్మణునకు, సీతకు, హనుమంతునకు, సుగ్రీవునకు, విభీషణునకు ఈ తొమ్మిది మందికి దివ్యదృష్టి నిచ్చితివి కదా! పద్మములవలె ఎఱ్ఱని పాదములు గలవాడా! రాక్షసులనెడు మేఘములను చెదరగొట్టుగాలియైన వాడా! రఘుకుల శ్రేష్ఠుడా! శుభములు అద్భుతములునైన గుణములు గలవాడా! త్యాగరాజ కులదైవమా! కలియుగ జనులు తరించుటకు నీ తారకమును (రామతారక మంత్రమును) శివునిచేత జనుల చెవులయందు పలికింపజేసిన రామా–రఘుకుల జలనిధి సోమా! అని సంబోధనము.

విశేషము = తొమ్మిది మందికి దివ్యదృష్టి నిచ్చుట అనగా ఆయా కారణములచేత వారి మనస్సున రాముడు నిలచి వారు రాముని ఆజ్ఞానువర్తులయి యుండుట. 'శ్రీరామ రామరామేతి' పార్వతికి చెప్పుటయే శివుడు జనుల వీనులయందు బల్కుట. మరియు కాశీలో మరణింపబోవు జనుల చెవిలో అనుట.

464. కాపి = చాపు (దివ్యనామము)

ప॥ రామ పాహి మేఘ – శ్యామ పాహి గుణ
ధామ మాంపాహి ఓ రామ॥ రామ॥

చ॥ మూడు లోకములలో – ఈడు లేదని నిన్ను
వేడు కొంటిని నేను ఓ రామ॥ రామ॥

2 లోకుల నెరనమ్ము – కోక నేనీకే
లోకువ నేనైతి – నోరామ॥ రామ॥

3 ఏ వేళ నాపాలి– దేవాది దేవుడు
నీవే యనుకొంటిని– ఓ రామ॥ రామ॥

4 అన్ని కల్లలని – నిన్నే నిజమను
కొన్న వాడనైతిని – ఓ రామ॥ రామ॥

5 తలచినంత నేమేను – పులకరించగ నీపై
వలచి నీవాడైతిని – ఓరామ॥ రామ॥

6 దుర్జన గణముల – వర్జించుటకు నామ
గర్జనే గతియంటిని – ఓ రామ॥ రామ॥

7 మనసున నిత్యనూ – తన మైన చక్కని
తనమును కనుగొంటిని – ఓరామ॥ రామ॥

8 అవని సుతా ధవ – భవమున నెవ్వరి
కెవరు లేరను కొంటిని – ఓ రామ॥ రామ॥

9 మంచి కృత్యములు నీ – కంచు ఇచ్చితినా
పంచ భూత సాక్షిగా – ఓ రామ॥ రామ॥

10 వనజ నయన నావ – చనము లెల్ల సత్య
మనుచు నాలకించుమా – ఓ రామ॥ రామ॥

11 ఇకనైన శంకర – శుక బ్రహ్మానంద
సుఖ సాగరా బ్రోవుమా – ఓ రామ॥ రామ॥

12 ఆజానుబాహ స–రోజానన త్యాగ
రాజ సన్నుత చరితా – ఓ రామ॥ రామ॥

తాత్పర్యము :

ఇది తెలుగు సంస్కృతము కలగలుపు. చరణములన్నియు తెలుగు. రామా నన్ను రక్షించు. మూడు లోకముల యందును నీకు సాటిలేరని నిన్ను వేడు కొన్నాను. నిన్ను తప్ప ఇంకెవరిని నమ్మ లేదు. నా దేవుడవు నీవే. ''బ్రహ్మ సత్యం జగ న్మిధ్యా'' = నీవు సత్యము. జగత్తు కల్పనము. అని తెలుసు కొన్నాను. నిన్ను స్మరించి పరవశించుచున్నాను. దుర్జనులతో పొత్తు వదలవలెనని నీ నామగర్జనమే శరణ్యము. నీ చక్కదనము నిత్య

నూతనము. సీతా నాథా! ఈ ప్రపంచములో ఎవరి కెవ్వరును లేరు. అందరికిని అన్నియును నీవే. నా పుణ్యకర్మల నన్నిటిని నీ కర్పించితిని. నా మాటలు నూరు పాళ్లును సత్యము.

465. దర్బారు = ఆది

ప॥ రామ లోభమేల నను – రక్షించు పట్ల నీ కింత శ్రీ॥ రామ॥

అ॥ సోమార్క లోచన సుగుణ సు–త్రా మాదు లెల్ల నవ్వరా॥ రామ॥

చ॥ శరణను కొన్న కాకా – సురుని రావణుని సో
దరుని బ్రోవలేదా సరగున – కరిని గాచిన శ్రీ ॥ రామ॥

2 గతిలేని వేళ ద్రౌపది వే – గమె కృష్ణాయన
అతి ప్రేమతో వేంచేసిన – మతి నేడెందు బోయెనో॥ రామ॥

3 డేగకై మేనొసంగు – రాఘవాన్వయమున
బాగ జన్మించి శ్రీకర – త్యాగ రాజంటే రామ॥

తాత్పర్యము :

రక్షణ ప్రార్థనము : రామా! నన్ను రక్షించుటకు ఇంత లోభ గుణము చూపుచున్నావేమి. (నన్ను రక్షిస్తే నీది ఏమయినా ఖర్చగునని లోభించు చున్నావా?) ఇట్లు చేస్తే ఇంద్రాది దేవతలు నిన్ను చూచి నవ్వరా? శరణు రామా అనిన కాకాసురుని, విభీషణుని జాగుచేయక గజరాజును రక్షించితివి కదా! అలనాడు వేరుగతిలేక ద్రౌపది కృష్ణా అని పిలిచితే అతి ప్రేమతో కౌరవసభలోనికి వచ్చి ఆమెను రక్షించిన ఆ బుద్ధి నేడెందు బోయిన దయ్యా? ఆకలి గొన్న డేగకు శరీరం కోసి ఇచ్చిన శిబిచక్రవర్తి వంశమున జన్మించిన నీకు నేనంటే ఇంత నిర్దయ ఎట్లు వచ్చిన దయ్యా? అని అయ్యగారు రాముని నిలదీసినారు.

466. హుసేని = ఆది

ప॥ రామా నిన్నే నమ్మినాను – నిజముగా సీతా॥ రామ॥

అ॥ కామ జనక! కమనీయ వదన! నను
కావవే కరుణాజలధే ॥ రామ॥

చ॥ సార! సామాది వేద – సార! సంతత బుధవి
హారా! రాజితముక్తా రామ॥

మి॥ హార! కనకకే – యూరధర! సుగుణ
పారావార! సురారాధి తపద॥ రామా॥

చ॥ ధీరా! సుజన హృత్పంజర
కీరా! మదనసుందరా – కార దనుజసం రామా॥

మి॥ హార! దుష్ట జన దూర రఘుకులో
ద్ధారో దారాశ్రి॥ రామా॥

చ॥ రాజ రాజవందిత! భూజానాయక నురస
మాజ శ్రీకర త్యాగ రామా॥

మి॥ రాజ మానస సరోజ కుసుమ దిన
రాజ పంక్తి రథ రాజ తనయశ్రీ రామా॥

తాత్పర్యము :

రామా! నేను త్రికరణ శుద్ధిగా నిన్ను నమ్మియున్నాను. ఓ మన్మథ జనకా! సుందర వదనా! నన్ను రక్షించ వలసినది. ఓ కరుణా సముద్రా! సామవేదసారా! పండితుల హృదయమందు ఎప్పుడును విహరించువాడా! ముత్యాలహారములతో రాజిల్లువాడా! బంగారు భుజకీర్తుల వాడా! గుణములకు సముద్రుడా! దేవతలచే ఆరాధింపబడు పాదముల వాడా! ధీరా! సజ్జనుల (భక్తుల) హృదయ మనెడి పంజరము నందు చిలుకగా నున్నవాడా! ఇత్యాది సంబోధనములు మాత్రమున్నవి.

467. హుసేని = రూపకం (దివ్యనామము)

వ॥ రామ రామ రామసీతా – రమణ! పాపహరణ॥ రామ॥

చ॥ చెంత రాకయుండు టెవరి – చెలిమో నిండు కలిమో॥ రామ॥

2 మనమేచేమనుచు నింత – మదమా కామదమా॥ రామ॥

3 ననువినా గతి ఎవరనుచు – నగవో లేక బిగువో॥ రామ॥

4 కరుణ జూతు ననుచు పలుకు కరావా? బ్రోవ బరువా॥ రామ॥

5 ఇల రక్షణ సేయలేని – కులమా? వ్యాకులమా? రామ॥

6 రామాయని మొరలిడ మది – రాయా? దేవరాయా? రామ॥

7 ఇన్ని విన్నపములకు మది – ఇనుమా? మాట వినుమా॥ రామ॥

8 శశిముఖ నన్నే చేది – యశమా? నాదు వశమా? రామ॥

9 భళి భళి తన కర్మమెంత – బలమో లేక చలమో॥ రామ॥

10 వలచి పాడి ఇంత పల్క – వలెనా? తాళగలనా? రామ॥

11 లేమి దెల్ప పెద్ద లెవరు – లేరో? నీదు పోరో? రామ॥

12 ఉండి నను నిన్ను బో – లుందురె? యీడు కొందురే॥ రామ॥

13 వశము గాదు త్యాగరాజ – వరద! కుందసురదా॥ రామ॥

తాత్పర్యము :

నేనెంత వేడుకొన్నా నా చెంతకు రాకున్నావు. ఇది ఎవరి చెలిమి నీవు చేసిన ఫలము. లేక నీవు సర్వ సంపత్పరిపూర్ణుడవు. దాని ఫలమా? ఓ కామదమా! = కామమును వశమునం దుంచుకొన్న ఓరామా! ఆశ్రయించిన వానిని బాగా బాధించుచున్నా మని మదమా? ఈ త్యాగయ్యకు నేను గాక వేరు గతిలేదని నవ్వులాటగా నున్నదా? లేక గట్టి పట్టుతో నున్నావా? ఓ త్యాగయ్యా నిన్ను కరుణతో చూచెదను అని ఒక్క పలుకు కరవైనదా? లేక నన్ను రక్షించుట నీకు బరువైనదా? ఆశ్రయించినవారిని రక్షించని కులమా? నీది. లేక ఏదైనా వ్యాకులతతో నున్నావా? రామా! ఓ దేవతా శిఖామణీ! రామా అని పలుసారులు మొరలు పెడితే వినవు. నీ మనస్సు రాయా? ఇనుమా? ఇన్ని మారులు వేడుకొంటే వినక పోవుట నీకు కీర్తియా? నీవు ఇట్లుంటే ఇక నా వశములో ఏమియు లేదు. నీ విట్లుండుటకు కారణము నా కర్మ బలమా? నీ కోప బలమా? నిన్ను దలచినే నింతగా పాడవలెనా? నీ విట్లుంటే నేను తాళ గలనా? నాయొక్క దీన స్థితిని నీకు తెలిపే పెద్దలు ఎవరును లేరా! లేక నాతో నీకు పోరా! ఇంకెవరినయినను ఆశ్రయించుదుమా అంటే నిన్ను బోలినవారున్నారా? ఉన్నా వారు నీతో నా స్థితిని చెప్పుదురా? అని అయ్యగారు పరమార్తితో వేడుకోలు.

468. హరికాంభోజ = రూపకము.

ప॥ రామనన్ను బ్రోవరా! వేమెకో లోకాభి॥ రామ॥

అ॥ చీమలో బ్రహ్మలో । శివ కేశవాదులలో
ప్రేమ మీర మెలగుచుండే । బిరుదు వహించిన సీతా॥ రామ॥

చ॥ మెప్పులకై కన్నతావు । నప్పుబడక విర్రవీగి
తప్పు పనులు లేక యుండే। త్యాగరాజ వినుత సీతా॥ రామ॥

తాత్పర్యము :

రామా నన్ను రక్షింపరావేమయ్యా! లోకమునకు అభిరాముడవు. నన్ను ఉపేక్షింపతగదు. పిపీలికాది బ్రహ్మపర్యంతము శివకేశవాది దేవతల యందు సర్వాంత్యర్యామియై యున్న బిరుదు కలనీవు నన్ను రక్షింపకుండుట తగదు. లౌకిక విషయములలో మెప్పును సంపాదించుటకై ఏవేవే చేయుటకై చూచిన చోట్ల నెల్లా అప్పు చేసి నా అంత వాడు లేడని విర్రవీగుట వంటి తప్పు పనులు లేవు నావద్ద. నిన్ను నమ్ముట తప్ప ఇంకొక గతిలేదు. కనుక నన్ను రక్షింపజూడుము. అని అయ్యగారి ప్రార్థనము.

469. సురటి = ఆది

ప॥ రామచంద్ర నీ దయ – రామ ఏల రాదయ॥ రామ॥

చ॥ కామకోటి సుందర – కరధృతమందరా
ప్రేమమీర ముందర – బిల్వరాక యుందురా॥ రామ॥

2 కాననంబు తాపమో – కైక మీద కోపమో
నేను జేయుపాపమో – నీకు శక్తి లోపమో॥ రామ॥

3 ఆడదన్న రోసమో – అలనాడు పాసమో
మేడలేని వాసమో – మేము జేయు దోసమో॥ రామ॥

4 కల్లనైన నేయమా – కంటె నీకు హేయమా
తల్ల డిల్ల న్యాయమా – త్యాగరాజ గేయమా॥ రామ॥

తాత్పర్యము :

రామ చంద్రా – నీ దయ ఏలరాదయ్యా! కారణమేమి? ఓ కామకోటి సుందర! = కోటి మన్మథుల సౌందర్యము కలవాడా! కరధృత మందర = మందరము నెత్తిన వాడా! నీవు ప్రేమతో పిలిచితే నేను వచ్చి నీ ముందర ఉండక యుందునా? నన్ను నీవు రక్షించుట లేదు. అరణ్యవాసము చేసిన తాపమా? దానికి కారణమైన కైక మీద కోపము నాపై జూపుచున్నావా? లేక నేను చేసిన పాపమా కారణము? నీకు రక్షణ శక్తి లోపించినదా? ఆడదన్న రోషమా? దశరథుడు పట్టాభిషేకమును ప్రకటించినపుడు ఉపవాసము చేసినావు. ఈనాడు నాపై దయచూపక పోవుట దాని ఫలితమా? అరణ్య వాసమందు మేడలేక పర్ణశాలయందు వాసము చేసితివి. దాని ఫలితమా? మా దోషమా? అబద్ధమునకైనా నీవిట్లు చేయుట తగునా? నీ దయ రాక నేనిట్లు తల్ల డిల్ల చేయుట నీకు న్యాయమా? నన్ను చూస్తే నీకు అసహ్యమా? అని అయ్యగారి ప్రశ్న పరంపర.

విశేషము = ''ఆడదన్న రోసమా'' అనుదాని వివరణము రాముడరణ్య వాసమునకు బయలుదేరినప్పుడు సీత తానును వచ్చెదనన్నది. అరణ్యవాసము భయంకరమన్నాడు రాముడు. అప్పుడు సీత ''కింత్వామన్యత వైదేహః। పితామే మిథిలా ధిపః। రామజామాతరం ప్రాప్య। స్త్రియం పురష విగ్రహం॥ = నాథా! నా తండ్రి జనకుడు నిన్నే మనుకొన్నాడో? కాని నీవు పురుష స్వరూపముతో నున్న స్త్రీవి'' అనినది. అట్లనిన సీతపై రోషమును నాపై చూపుచున్నావా? అని అయ్యగారి ప్రశ్న. ''త్యాగరాజ గేయమా'' అని అయ్యగారు రాముని నపుంసక లింగముతో సంబోధించినారు. భాగవతమందలి పద్యము'' స్త్రీ నపుంసక పురుషమూర్తియును గాక'' అని. గజేంద్ర మోక్ష ఘట్టమున. స్త్రీ మూర్తి కాడు, నపుంసకమూర్తి కాడు. పురుషమూర్తియును కాడు అని. అనగా భగవానుడు అన్ని మూర్తుల వాడు అని సారము. దానిని బట్టి అయ్యగారు త్యాగరాజగేయమా'' అని నపుంసకలింగము వేసినారు. అదియును గాక ''బ్రహ్మ'' అనిన పుంలింగము. ''బ్రహ్మ'' అనిన నపుంసకలింగము. ఈ రెండును ఆయనకు వర్తించును.

4హె. సురటి = రూపకం

ప॥ రామ దైవమా రాగ। రాగ లోభమా॥ రామ॥

అ॥ మోము జూపుమా॥ జగ।న్మోహన్మోహన కరమా॥ రామ॥

చ॥ దొంగజాడ లేల ఇల్లు। బంగరాయెనా
రంగడా విభీషణునికి। పంగనామ మిడిన రీతి॥ రామ॥

2 వెన్న తా భుజించి గోప। కన్నెముఖమున॥
తిన్నగా నలందినట్టు। దీన రక్షక సీతా॥ రామ॥

3 నేర్పు జూపుమా అంగ। లార్పు బాపుమా
ఓర్పు గల్గు త్యాగరాజు ఒకసారి శరణంటే॥ రామ॥

తాత్పర్యము :

ఓ రావుదైవవమా! రాగా రాగా నీ లోభగుణ మెక్కువ అగుచున్నదా? జగన్మోహనకరుడా! (అనుటకు కరమా అని నపుంసక లింగముగా నున్నది. వివరము దీనికి పైనున్న కృతికి ఇవ్వబడినది). నీ ముఖమును చూపక దొంగాట లెందుకయ్యా! రంగనాథుడు విభీషణునికి పంగనామములు పెట్టినట్లున్నది నీపని. కృష్ణావతారములో నీవు వెన్నతిని గోపిక ముఖమున వెన్న పూసితివి. రక్షణ కృత్యములో నీ నేర్పు చూపి నా అంగలార్పును మానుపుము. నీవు నన్నెంత అలయించినా ఓర్పు గల్గియున్నాను. శరణన్నాను. ఇప్పుడు నీకే లోభము వచ్చినది? అని ఆర్తి పూర్వక ప్రార్థనము.

విశేషణము = సాధారణముగా మోసగించినా డనుటకు పంగనామములు పెట్టినా డందురు. రామచంద్రుడు తమ కులధనమగు రంగనాథుని విభీషణున కిచ్చెను. విభీషణుడు లంకలో ప్రతిష్ఠించుకొందామని తీసుకొని వెళ్లుచుండగా కావేరి ఒడ్డున ఆ మందిరమును విభీషణుడు దింపవలసి వచ్చినది. రంగనాథుడు నా కిచ్చట నివాసమే ఇష్టమయినదని చెప్పి అక్కడనే నెలకొనెను. విభీషణుడు హతాశుడయ్యెను. ఇదియే ''రంగనాథుడు విభీషణునికి పంగనామమిడుట''. ఈ జాతీయము నయ్యగా రిచట నతికిరి. అయ్యగారి భావనలో రాముడు తనకు పంగనామము బెట్టినట్లు. దయ జూపక పోవుట లోభము అని త్యాగయ్య గారి భావము.

471. మోహన = చాపు (దివ్యనామము)

ప॥ రామ రామా రామా। రామ యనినంత
రాజస చూపేలరా – ఓరామా॥ రామ॥

చ॥ ఏటి జన్మమిది – ఏటి బ్రతుకు రామ।
ఏ మెంచు కొన్నావో – ఓ రామ॥ రామ॥

2 ఆటలైన నాదు – పాటల వినుచు
మాటలాడ వెందుకో – ఓ రామా॥ రామ॥

3 సరివారిలో నన్ను – కరుణజూచి నాదు
కరము బట్ట వెందుకో – ఓ రామ॥ రామ॥

4 ఆస గొన్న నాదు – గాసి దీర్పలేక
వాసి ఏమి కల్గెనో – ఓ రామా॥ రామ॥

5 దయతో నను శేష – శయన ఇందరిలోన
నయము సేయ దక్కువా – ఓ రామ॥ రామ॥

6 పతితపావన నీకు – హితులైన వారి
జత గూడక బోతినా – ఓ రామా॥ రామ॥

7 నాటి భక్తులు నీ – కేటి వావులో కొంచ
పాటి లేకపోయెనా – ఓ రామ॥ రామ॥

8 అలనాడు నీవారు – కొలిచినట్లు నాదు
తలపు గాక పోయెనా – ఓ రామా॥ రామ॥

9 బ్రోచి బ్రోవకను – చూచి చూడకను
ఏచుటకే తోచెనా – ఓ రామ॥ రామ॥

10 ఓ జగదవన సరోజనయన త్యాగ
• రాజ రక్షక సుగుణ – ఓ రామా॥ రామ॥

తాత్పర్యము :

ఓ రామా! నేను రామ రామ అని పిలుచుచున్నాను. పిలిచిన కొద్దీ నీవు రాజస దృష్టితో నన్ను చూచుచున్నావు. ఏమి జన్మమో ఏమి బ్రతుకోనాది? నీవు ఏమి చేయదలచుకొన్నావో? నేను పాటలు పాడటము నీ కాటలుగా నున్నది. లేకపోతే పలుక వేమి? నా సరివారివలె చూచి నా చెయ్యి బట్టు ఆశతో ఉన్న నా బాధ తీర్చుకుంటే నీకు కలిగే కీర్తి ఏమిటి? నీకు హితమైన వారిలో నేను చేరలేదా? ఇది వరలో కొందరిని రక్షించినావు. వారు నీకు చేసిన దేమి? నేను చేయని దేమి? వారు నిన్ను కొలిచినట్లు నేను కొలువలేదా? రక్షించినవాడవు కాదు. రక్షించని వాడవు కాదు. చూచినవాడవు

కాదు, చూడనివాడవు కాదు. నన్ను బాధించుటకే తోచినదా నీకు? అని అయ్యగారు గుక్క త్రిప్పుకోలేని ప్రశ్నలు కురిపించినారు.

472. బలహంస = రూపకం (దివ్య నామము)

ప॥ రామ ఏవ దైవతం – రఘుకుల తిలకో మే॥ రామ॥

చ॥ విగత కామ మోహమదో – విమల హృదయ శుభ ఫలదో॥ రామ॥

2 జిత గౌతమ కృత శాపో – నతవరద స్సీతా పో॥ రామ॥

3 భక్త చిత్త తాపహరో – భావుకదాన చతురో॥ రామ॥

4 సురతారాగణ చంద్రో – మురనరకేభ మృగేంద్రో రామ॥

5 హరి పద్మజశర్వేశో – హరి దశ్వసు సంకాశో॥ రామ॥

6 త్యాగరాజ హృత్సదనో – నాగరాజ వర శయనో॥ రామ॥

తాత్పర్యము :

ఈ కృతి అంతయు సంస్కృతము. ప్రతి పదార్థము మాత్రము వ్రాయబడుచున్నది. రఘుకుల తిలకుడగు రాముడే నాకు దైవము. కామము మదము, మోహము లేని, నిర్మలహృదయులకు శుభము లిచ్చు, అహల్యాశాపము తీర్చిన, భక్తులకు వరములిచ్చు, సీతాపతియైన, భక్తుల తాపము హరించు, శుభములిచ్చుటయందు నేర్పుగల, దేవతలనెడు నక్షత్రములలో చంద్రుడయిన, మురాసురునకు నరకాసురునకు సింహమయిన, విష్ణువుకు, బ్రహ్మకు శివునకును ప్రభువయిన, సూర్యతేజస్సు కల, త్యాగరాజు హృదయమందున్న, శేషుని యందు పవ్వళించు రాముడే నాకు దైవము.

473. బలహంస = ఆది (దివ్యనామము)

ప॥ రామ సీతా రామ రామ – రాజతనయ ! రామ దశరథ॥
రామ సీతా రామ రామ – రఘుకులాబ్ధి సోమ॥ రామ॥

చ॥ ఉరగములు పెనగిన – ట్లున్నది నా మనసు
కరుణజేసి కంట జూచి – కరము బట్టు రామ॥ రామ॥

2. కల్పభూజమున తీగ – గట్టు రీతి మనసు
కల్పము లెన్నైన విడచి – కదలదు శ్రీరామ॥ రామ॥

3 సత్సతి పతి సేవ జేయు – చందాన నామనసు
ఉత్సవములు సేయుట – కుప్పొంగేని రామ॥ రామ॥

4 అద్వైత సామ్రాజ్యములు – అబ్బినట్టు రామ
సద్వైరాగ్యము నిదియు – సాయుజ్యమె రామ॥ రామ॥

5 ఆగమ నిగమములకు నిది – అర్థమిది రామ।
త్యాగరాజుచే జేయించి – భోగ మొందు రామ॥ రామ॥

తాత్పర్యం :

రామా! రాజ తనయా! దశరథ రామా! (నీవు నన్ను బ్రోవకుండుట) ఒంటిమీద పాములు ప్రాకినట్లున్నది. కరుణ చూడు. వృక్షమునకు తీగె పెనవేసుకొని యున్నట్లు నామనస్సు నిన్నే పెనవేసుకొనియున్నది. ఈ బంధము కల్పాంతమైనా వదలదు. పతివ్రత పతిసేవ చేయుటకు ఉత్సాహపడినట్లు నా మనస్సు నీ ఉత్సవములు చేయుటకు ఉత్సహించుచున్నది. నీ ఉత్సవములు చేయుటలో ఇతర విషయముల యందు వైరాగ్యము కలిగి తదేక భావన వలన నీసాయుజ్యము కలుగుతుంది. అద్వైత సామ్రాజ్యము కలిగినంత తృప్తి కలుగుచున్నది. వేదముల శాస్త్రముల అర్థమే ఇది. ఈవిధముగా నాచే జేయించి వశపరచుకొని భోగములను అనుభవించుము అని ప్రార్థనము.

474. నారాయణి = ఆది

ప॥ రామా నీవే గాని నన్ను। రక్షించేవారెవరురా॥ రామా॥

అ॥ సోమ సూర్యలోచనా – సుందరవదన – శ్రీ రామా॥

చ॥ తాతవచన పరిపాల పురు। హూతాద్యమర పారి
జాత! సౌమిత్రితో – సీతారమణితో వెలసిన॥ రామ॥

2 ధారా ధరాభ శరీర – భావజసుకు
మార సాకేత పుర వి – హార! నన్నేలు కోర॥ రామ॥

3 నాగశయనా ముని – యాగపాలన! భక్త
భాగధేయ పావన – త్యాగరాజ వినుత॥ రామ॥

తాత్పర్యము :

రామా! నీవు కాక రక్షించేవారులేరు. నీవు సూర్యచంద్రులు నేత్రములు కలవాడవు. సుందరవదనుడవు. నిన్ను వీడలి ఇతరుల నాశ్రయించలేను. పితృవాక్యమును పరిపాలించిన వాడవు. ఇంద్రుడు మొదలగు దేవతల అభీష్టములన్నియు తీర్చువాడవు. లక్ష్మణునితో సీతతో కూడి అవతరించినవాడవు ఓ మేఘవర్ణా! మన్మధసుందరా! అయోధ్యావాసా! నన్నేలుకొనుము. శేషశయనా! విశ్వామిత్రుని యాగమును పాలించినవాడవు. భక్తుల భాగ్యమయినవాడవు. పావనమైనవాడవు. నీవు గాక నను రక్షించువారు లేరు. అని అయ్యగారు తన అనన్యగతికత్వమును రామునివద్ద నివేదించుకొన్నారు.

475. జంఝూటి = రూపకం (దివ్యనామము)

ప॥ రామ రామ రామరామ రారా సీతారామా॥ రామ॥

చ॥ సంతతంబు పదముల న-ర్చింతు సీతారామ-ఏ
కాంతముననునిన్నారా-ధింతు సీతారామా॥ రామ॥

2 తనివిదీర నిన్ను కౌగ-లింతు సీతారామా నాదు
దాహమెల్ల దీర సే-వింతు సీతారామ॥ రామ॥

3 కనులు చల్లగాను నిన్ను-గందు సీతారామ।
తనువు పులకరించ మెచ్చు-కొందు సీతారామ॥ రామ॥

4 అడుగడుగుకు మడుపుల నం-దిత్తు సీతారామా, ని
న్ననుసరించి మెల్ల బల్క-నిత్తు సీతారామా॥ రామ॥

5 కనుల జాడలను దెలిసి-నడతు సీతా రామ -
కడమ వాని దూరమునను-విడుతు సీతారామ॥ రామ॥

6 పామర విషయాదులనే -మరతు సీతారామ।
నీ మనసున చెలిమి జేసి-కరతు సీతారామ॥ రామ॥

7 కొసరి కొసరి సన్నిధినే - కొలుతు సీతారామ॥
కోరి సురటిచే విసరుచు - పిలుతు సీతారామ॥ రామ॥

8 తొడరి మేనొసంగి తొడల-నునుతు సీతారామ, ని
న్నెడబాయక భావమునను - దలతు సీతా రామ॥ రామ॥

9 సమ్మతమున నిత్తును చెయి-వ్రాలు సీతారామ।
కమ్మని విడెమిమ్మని న-న్నేలు సీతారామ॥ రామ॥

10 ఇట్లు దొరకునా బ్రహ్మ-కైన సీతారామ, నే
నిలను వెలసి నీవే నే-నైన సీతారామా॥ రామ॥

11 నిక్కముగా తాళజాల - రట్టు సీతారామ-రామ
ఎక్కువగా నాదు చెట్ట-బట్టు సీతారామ॥ రామ॥

12 జాడల విన్నపము తెలుసు - కోరా సీతారామ, నీ
వాడుగాక త్యాగరాజు - వేరా సీతారామ॥ రామ॥

తాత్పర్యము :

ఈ కృతియందు ప్రతి పాదాంతమందు సీతారామ అని సంబోధనమున్నది. మానసిక, వాటిక, కాయిక సమస్తోప చారములను చేయుదును అని చెప్పి, విశేషముగా సమ్మతితో చేవ్రాలు చేసి ఇచ్చెదను అని చెప్పినారు. ఇంకా విశేషముగా నేను భూమిపై వెలసి నీవే అయినాను అని తన అద్వైతస్థితిని అయ్యగారు తెలిపినారు.

విశేషము = అట్లు చెప్పుట చేత దేవజాతి గంధర్వుడు త్యాగరాజుగా భువిని జన్మించినట్లు మన మూహింపవచ్చును. ఇత డనుభవించినది గంధర్వానందము తోడి బ్రహ్మానందము కదా!

476. శంకరాభరణము = రూపకం

వ॥ రామ నిను వినా, నను - రక్షింప నొరుల గాన॥ రామ॥

చ॥ తల్లిదండ్రి అన్నదమ్ములు - దైవము నీవని
ఉల్లమునను అన్నిటనిను - చల్లగ బాగుగ జూచెద॥ రామ॥

2 పావన నీభక్తి సదా - పాలించును మోక్షమొసగు
మావర నీ సన్నిధిని ప్ర-మాణము జేసి పల్కెద॥ రామ॥

3 సత్వ గుణమునను యుపా-సన జేసిరి పెద్దలు
తత్వము దెలిసెను. ఇక భవ-తరణోపాయము నీవని॥ రామ॥

4 లోకులు నిజదాసు లగని - లోపడుదు రసూయలతో
శ్రీకర నిను దూషించిన - చెడిపోలేరు గాని॥ రామ॥

5 కోరిన కోరిక లొసగే-శ్రీ రమణా నిన్ననిశము
చేరితి శరణనుకొంటిని - శ్రీ త్యాగరాజ వినుత॥ రామ॥

తాత్పర్యము :

రామా నీవుగాక నన్ను రక్షించువారిని ఇతరులను నేను చూడలేదు, చూడను. నీవే తల్లి తండ్రి అన్నదమ్ములని నిన్ను మనస్సులో బెట్టుకొని చల్లగా బాగుగా చూచుకొంటాను. నీ భక్తి ఇహలోకమందు రక్షించి పరలోకమందు మోక్ష మిచ్చునని ప్రమాణము చేసి చెప్పెదను. పూర్వులు సత్త్వగుణుడైన నిన్ను ఉపాసన చేసినారు. ఈ తత్త్వము నాకు తెలిసినది. ఇక నా తరణోపాయము నీవే. లోకులు భగవద్భక్తులను చూచి అసూయకు లోబడుదురు. అట్టివారు చెడిపోదురు. నిన్ను చేరి శరణంటిని, నా కోర్కెలు దీర్పుము అని శరణాగతి చేసి నారయ్యగారు.

విశేషము = నీ భక్తి మోక్ష మొసగునని అయ్యగారు ప్రమాణము చేసి పల్కెద ననినారు. తమ కత్యంతము విశ్వాసము కలిగిన విషయమును ప్రమాణముచేసి చెప్పుదురు. వేద వ్యాస మహర్షి 'హే పుత్ర శిష్యా శ్రృణుత। ఉద్ధృత్యభుజముచ్యతే। వేద శాస్త్రాత్పరం నాస్తి। నదైవం కేశవాత్పరం' = ఓ పుత్రులారా! శిష్యులారా! వినుడు. వేదము కన్న మిన్న శాస్త్రములేదు. కేశవుని కన్న మిన్నయగు దైవములేడు' అని ప్రమాణ పూర్వకముగా భుజమెత్తి చెప్పెను. అట్లే త్యాగయ్యగారును ఈ చరణమందు చెప్పిరి. ఇంకొక విశేషము. అసూయ అనగా గుణమునే దోషముగా భావించి దూషించుట. లోకులు భగవద్భక్తులపై ఇట్టివే చేసెదరు. ఒక శాస్త్రమున్నది. భగవంతుని దూషించినా ముప్పులేదట గాని భగవద్భక్తుల దూషణము మహాపాతకమని చెప్పబడినది. అయ్యగారు నాలుగవ చరణములో దీనిని సూచించిరి.

477. కేదారము = ఆది

ప॥ రామా నీపై తనకు - ప్రేమ బోదు - సీతా॥ రామ॥

అ॥ తామరస నయనా నీ-దేమో మాయగాని॥ రామ॥

చ॥ మనసు నీ పదములనే చేర-కనులు నీ రూపమునే కోర।
వినునీ పేరునకే నోరూర-తనపై ఇది నీకరుణేర॥ రామ॥

2 జననీ జనకాప్తులన్యులు - ధనకనక గురువేల్పులు
దినము నీవేయని మాటలు - అనఘ ఇవి నా భూషణములు॥ రామ।

3 భోగానుభవములందు - బాగుగ బుద్ధి నీయందు।
త్యాగరాజుని హృదయమందు - వాగీశా నందమందు॥ రామ॥

తాత్పర్యము :

రామా! నీయందు నా ప్రేమ పోదు. నీ మాయ ఏమోకాని నీ ప్రేమయందు తగిలి ఉన్నాను. మనసు నీ పాదములను చేరుటకు, కన్నులు నీ రూపమునే చూచుటకు, చెవులు నీ నామశ్రవణమునకే ఉవ్విళ్ళూరుచున్నవి. ఇది కూడ నీకరుణేకదా! తల్లి తండ్రి, ఇతర బంధువులు, గురువులు, ధనకనకాదులు అన్నియు నాకు నీవే అనే మాటలు నాకు భూషణములు. నేను భోగము లనుభవించుచున్నా నాబుద్ధి నీయందే ఉంటున్నది. నేను బ్రహ్మానంద మనుభవించుచున్నా నా హృదయము నీయందే ఉంటున్నది. ఈ విధముగా నాప్రేమ నీయందు స్థిరపడి ఉన్నది. అని అయ్యగారు తన నిర్విరామ రామభక్తిని నివేదించుకొన్నారు.

478. వరాళి = ఆది (దివ్యనామము)

ప॥ రామ శ్రీ రామ జయరామ గత కామ॥ రామ॥

చ॥ దేవ ఏమిదోవ నన్ను - బ్రోవవేగ రావ॥ రామ॥

2 బాల భక్తపాల సుగుణ - శీల తాళజాల॥ రామ॥

3 ధీరా సుశరీర నిర్వి-కార ఏలుకోర॥ రామ॥

4 ఆదరింపరాదా నమ్మ-లేదా మరియాదా॥ రామ॥

5 ఆరురిపుల పోరు దీర్చు - వారెవరున్నారు॥ రామ॥

6 రాయా మనసు రాయాముని-గేయా తాళదాయ॥ రామ॥

7 వాదు కారాదు ఇక-మీదు గతిలేదు॥ రామ॥

8 చింత దీర్చుట కెంతసే-పింత శ్రీరామ॥ రామ॥

9 బిన్న బ్రోచే నన్న బ్రోవ-కున్న విడనన్న॥ రామ॥

10 పద్దు తప్ప వద్దు ఏ-పొద్దు మఱువ వద్దు॥ రామ॥

11 శ్రీ జానకీ రాజా త్యాగ-రాజ కృత పూజ॥ రామ॥

తాత్పర్యము :

తాత్పర్యము సులభము. అందుచేత వ్రాయలేదు.

479. కల్యాణి = ఆది (త్రిశ్రగతి)

ప॥ రామ నీవాదు కొందువో కొనవో తొలి మా
నోము ఫల మెటులనో॥ రామ॥

అ॥ నా మనసున నీయందున-ప్రేమ మీరగను
నమ్మి నామనుచు చాల-తిరిగేముగాని నిజమనుచు॥ రామ॥

చ॥ భవసాగరమున గలుగు-బాధ లంటకయుండుట
కవివేకమానవుల చెలిమి - అబ్బకుండుటకు
అవనియందు గలుగువే - దాగమమర్మము దెలిసి
నవనీరదనిభ! నమ్మి-నది చాలుననుచు॥ రామ॥

2 పద్దు తప్పకను ఉండే - భక్తులకు నిత్య సుఖము
కద్దనుచు బల్కిన - పెద్దల నమ్మి
ముద్దుగాను నీ రూపము - మోదమున ధ్యానించుచునే
ప్రొద్దు పొగడినాము కాని - పూర్ణ శశివదన శ్రీ॥ రామ॥

3 నీజపమే దిక్కుగాని - నీరజలోచన మాకు
వాజికరి ధనములు - వరము గాదురా
జాజి సుమధర భూ-జామనోహర శ్రీత్యాగ
రాజనుత బహురవి-తేజ నా తప్పులెంచక॥ రామ॥

తాత్పర్యము :

రామా! నేను సంసార సముద్రములో మునిగి ఉన్నాను. నీవు చెయ్యి ఇచ్చి ఆదుకొందువా? ఆదుకొనవా? మేము నీయందు నిజమయిన భక్తి కలిగి నిన్ను నమ్మియున్నామని విశ్వాసముతో తిరుగుచున్నాము. కాని మానోము ఫలమెట్లున్నదో? వేద పురాణ శాస్త్రముల మర్మమిదేనని (నిన్ను నమ్మియుంటే నీవు రక్షించెదవని) ఉన్నాను. సంసారపు బాధలు అంటకుండుటకు, అవివేక మానవుల చెలిమి కలుగకుండుటకు నిన్ను నమ్మియుండుట చాలునని యున్నాను. నిర్విరామముగా నీ భజన చేస్తే బ్రహ్మానంద మబ్బునని పెద్దలు చెప్పిన దానిని నమ్మి నీ ముద్దుమోమును ధ్యానించుచునే యున్నాను. నీజపమే మాకు పెద్ద వరము కాని చతురంగ బలములు ధనములు కాదు. నా తప్పులెంచక నన్నాదుకొందువో లేదో అని అయ్యగారు తన శంకను రాముని వద్ద వెలిబుచ్చుచు తన శుద్ధాంతరంగమును తెలుపుకొన్నారు.

480. యమునా కల్యాణి = ఆది (దివ్యనామము)

ప॥ రామ రామ రామ మాంపాహి॥ రామ॥

చ॥ వనమున జని ముని జనగణమును గను
గొని నెనరున ఘనముగ బాలించిన॥ రామ॥

2 వనజనయన నిను – మనసున దినదిన
మును గనుగొన ననుఁ – ననఘుని సేయనే॥ రామ॥

3 సరసిజభవ సురపతి వందిత పద
పురహరనుత పా–లిత త్యాగరాజ॥ రామ॥

తాత్పర్యము :

పల్లవి మాత్రము సంస్కృతము. చరణం తెలుగు. ఓ రామా! నన్ను రక్షింపుము. వనవాసమున మునులను చూచి పాలించినావు. అట్లే నను పాపరహితునిగా చేయుము. సమస్త దేవతలవందనములు గొనిన వాడా! నన్ను రక్షించుము. అని ప్రార్థనము.

481. అసావేరి = ఆది (ప్రహ్లాదభక్తి విజయము)

ప॥ రార మాయింటిదాక రఘు
వీర సుకుమార మ్రొక్కేరా॥ రార॥

అ॥ రారా దశరథకు మారా నన్నేలు
కోరా తాళలేరా రామ॥ రార॥

చ॥ ప్రొద్దున లేచి పుణ్యముతోడి
బుద్ధులు చెప్పి బ్రోతువుగాని
ముద్దుగాను నీ మోమును జూచుచు
వద్దనిలిచి వారము పూజించెద॥ రార॥

2 కోరిన కోర్కులు కొనసాగకనే
నీరజనయన నీదారిని గని వే
సారితి గాని సాధుజనా వన-
స్వారి వెడలి సామి నేడైన॥ రార॥

3 దిక్కులేదనుచు - తెలిసి ననుబ్రోవ
గ్రక్కున రావు - కరుణను నీచే
జిక్కి యున్న దేల - మరతురా
శ్రీ త్యాగరాజుని - భాగ్యమా॥ రారా॥

తాత్పర్యము :

సముద్ర గర్భమున ప్రహ్లాదునకు హరి దర్శన మిచ్చినాడు. ఆచోట ఆదర్శనము చాలలేదు ప్రహ్లాదునకు. ఓ దశరథ కుమారా! మా ఇంటిదాకా వచ్చి నన్నేలుకో. నీవు రాకుంటే నేను తాళలేను. మా ఇంటికి వచ్చి ప్రొద్దున లేచి పుణ్యబుద్ధులను బోధించు. నీ ముద్దు మోమును సారె సారెకు చూచుచు నిన్ను పూజించుకుంటాను. కోరిన కోర్కెలు నెరవేరక నీకోసం నిరీక్షించి నిరీక్షించి విసిగి వేసారినాను. అలా ఒకసారి విహారముగా బయలుదేరి మా ఇంటిదాక రావయ్యా! నీకన్న నాకు దిక్కులేదు. ఇది తెలిసి నన్ను రక్షించుటకు నీవు వేగముగ వచ్చుట నీచేతిలోని పని. దీనిని నీవు మరచితి వేల? మా ఇంటిదాక రారా! అని ప్రహ్లాదుడే తానైన త్యాగయ్యగారి పరితాపముతోడి ప్రార్థనము.

విశేషము = ఈ పలుకులు త్యాగయ్యగారు సృష్టించిన ప్రహ్లాదుడు పలికినవి. ఇందలి ప్రహ్లాదుడు 'రారా దశరథకుమారా' అని సంబోధించినాడు. కృతయుగపువాడు ప్రహ్లాదుడు. త్రేతాయుగపు వాడు దశరథకుమారుడు? ప్రహ్లాదుడు ఇట్లు సంబోధించుట కుదురునా అని శంక కలుగును. దీనికి పరిహారము. ప్రహ్లాదుడు నాడు సంబోధించినది. హరియని, నారాయణ అని విష్ణు అని. త్యాగయ్యగారి భావనలో రామునకు నారాయణునకును భేదము అనే భావనలేదు కనుక త్యాగయ్యగారు అట్లు పలికించినారు. అదియును కాక ఈ కల్పమందు ప్రహ్లాదుడు, రాముడు పుట్టిరి. 'ధాతా యథా పూర్వమ కల్పయత్' = బ్రహ్మ ప్రతి కల్పమును ఒకే విధమయిన చరిత్రతో చారిత్రక పురుషులతో సృష్టి చేయును' అనే వాక్యానుసారముగా ఈకల్పము కన్న ముందటి కల్పమున కూడ కృతయుగమున ప్రహ్లాదుడు, త్రేతాయుగమున రాముడును అవతరించెదరు. అప్పుడు ఈ కల్పపు ప్రహ్లాదునకు కల్పపు రాముడు నారాయణుడుగానే భాసించును. అప్పుడు రాముని విశేషణము లన్నియును నారాయణునకే చెల్లును. అదియును గాక ఈ రచన త్యాగయ్యగారిది. 'నిరంకుశాః కవయః' కవులు నిరంకుశులు' – 'అపారే కావ్యసంసారే। కవిరేవ ప్రజాపతిః' = అంతులేని కావ్యమనెడి ప్రపంచ సృష్టిలో కవియే బ్రహ్మ' అనే వాటి ప్రకారము త్యాగయ్యగారు నిరంకుశుడు, బ్రహ్మ. త్యాగయ్యగారు తన ఈ కావ్యములో (ప్రహ్లాదభక్తి విజయము) సుకుమారుడైన ప్రహ్లాదునకు చూపించినది లోకాభిరాముడగు రామునే కాని, చతుర్దశభువన భయంకరమగు నరసింహరూపమును కాదు. ఇదిత్యాగయ్యగారి ఉపజ్ఞ. ఇది ఇంతే.

482. హిందోళవసంతం = రూపకం

ప॥ *రార సీతా – రమణీ మనోహర*

అ॥ *నీరజనయన। యికము-ద్ధీర ధీరముంగల॥* రార॥

చ॥ *బంగారు వలువలునే – బాగుగ గట్టెద మరి*
శృంగారించి సేవ-జేసి కౌగిట జేర్చెద॥ రార॥

2 *సారెకు నుదుటను క-స్తూరి తిలకమును బెట్టెద*
సారమైన ముక్తా-హారముల నిక దిద్దెద॥ రార॥

3 యోగము నీపై అను-రాగము గాని వే
రేగతి ఎవరు శ్రీ-త్యాగరాజ వినుత॥ రార॥

తాత్పర్యము :

రారా! సీతా రమణీమనోహరా! ముందుగా ఒక్క ముద్దీయరా! నీకు బంగరు బట్టలు కట్టెదను. నిన్ను అలంకరించి కొగిలించుకొంటాను. కస్తూరీ తిలకము దిద్దుతాను. ముత్యాలహారాలు వేసెదను. నాకు ఇదే యోగము. నీపై అనురాగము (ప్రేమ-భక్తి) కన్న నాకు వేరే గతిలేదు. అని త్యాగయ్యగారు రాముని ముడేండ్ల ముద్దుబాలుని జేసి తల్లివలె లాలన చేయుచున్నారు.

483. అఠాణ = ఆది

ప॥ రారా రఘువీర వెంట రారా తోడు॥ రారా॥

చ॥ అనుదినమును నిను - మనసున గనుగొని
ఆనందమాయె దయాళో॥ రారా॥

2 సకలసుజనులు - గొలుచు సన్నిధి గని
చల్లనాయె దయాళో॥ రారా॥

3 వలువిధముల దు-ర్విషయచయములెడ
బాయనాయె దయాళో॥ రారా॥

4 తొడరి అడుగడుగు-కిది బుధ్యని సం
తోష మాయె దయాళో॥ రారా॥

5 సుముఖమునను తిల-కము చెలగగ గని
సొక్కనాయె దయాళో॥ రారా॥

6 కనుగొని భవనము - పారలక నీదే
కార్యమాయె దయాళో॥ రారా॥

7 దశరధతనయ శు-భచరిత పాలిత
త్యాగరాజ దయాళో॥ రారా॥

తాత్పర్యము :

అయ్యగారు రఘువీరుని తనవెంట తోడుగా రమ్మని కోరుచున్నారు. ఇందు 'దయాళో' దయా స్వభావుడా! అని ప్రతి చరణమందును సంబోధనమున్నది. ప్రతిదినమును నిన్ను మనస్సునందు సాక్షాత్కరింప జేసుకొని ఆనందము పొందితిని. సద్భక్తులు కొలిచే నీ సన్నిధిని చూచి మనస్సు చల్లనయినది. ఈ మంచి బుద్ధి కలిగినందుకు సంతోషము కలిగినది. తిలకముతో శోభిల్లు నీముఖమును చూచి పారవశ్యము కలిగినది. ఈ సంసారమందు చిక్కి ఈ బురదయందు పొరలుచు నుండక నీ సేవాకార్యక్రమము నాకు దక్కినది. అని ఆనందముతో అయ్యగారు రామునివద్ద ఆత్మ నివేదనము చేసుకొన్నారు.

విశేషము = అయ్యగారు 'బుద్ధ్యని' అన్నారు. తెలుగులో ఈ సంధి 'బుద్ధియని' ఉండవలెను. కాని అయ్యగారు సంస్కృత భాషా విధిననుసరించి 'బుద్ధ్యని' అని యణాదేశ సంధి చేయుట పరిపాటి. ఇట్టివి చాలా ఉన్నాయి. వీటిని అయ్యగారి స్వాతంత్ర్యమునకు వదలివేయుట మంచిది.

484. భైరవి = ఆది (దివ్యనామము)

ప॥ రామా కోదండ రామ – రామా కల్యాణ రామ॥ రామ॥

చ॥ రామా సీతాపతి – రామా నీవేగతి
రామా నీకు మ్రొక్కితి – రామా నీచేజిక్కితి॥ రామ॥

2 రామా నీకెవరు జోడు – రామా క్రీగంట జూడు
రామా నేను నీవాడు – రామా నాతో మాటాడు॥ రామ॥

3 రామ నామమే మేలు – రామ చింతనే చాలు
రామా నీవు నన్నేలు – రామరాయడే చాలు॥ రామ॥

4 రామా నీకొక మాట – రామా నాకొక మూట
రామా నీపాటే పాట – రామా నీ బాటే బాట॥ రామ॥

5 రామా నేనెందైనను – రామ వేరెంచలేను
రామా ఎన్నడైనను – రామా బాయగలేను॥ రామ॥

6 రామా విరాజ రాజ-రామ ముఖజిత రాజ
రామా భక్తసమాజ - రక్షిత త్యాగరాజ॥ రామ॥

తాత్పర్యము :

తాత్పర్యము సులభము. చివరి చరణము సంస్కృత విశేషణములు మాత్రము. విరాజ రాజ = గరుత్మంతునకు ప్రభువైన వాడా, చంద్రుని మించిన ముఖకాంతి గలవాడా! భక్తుల సమాజము కలవాడా! త్యాగరాజును రక్షించినవాడా! అని సంబోధనములు.

విశేషము = వైకుంఠమందు అనంత, గరుడ, విష్వక్సేనాది నిత్యసూరులందరును శ్రీమన్నారాయణుని పరిచారక వర్గము. అందుచేత నారాయణునకు రామునకును అభేదము చేసి గరుత్మంతునకు ప్రభువైనవాడా! అనినా రయ్యగారు. మరియొక విశేషము. ఇంద్రజిత్తు యుద్ధంలో నాగపాశబద్ధుడయిన రాముని నాగపాశముల మోచనము చేసినది కూడ గరుత్మంతుడు పైనచెప్పిన సంబంధమును పురస్కరించుకొనియే.

485. ఖరహరప్రియ = చాపు

ప॥ రామ కోదండరామ పాహి - రామ పట్టాభిరామ॥ రామ॥

చ॥ ఇమ్మహిని బొమ్మలాటజూచి - కమ్మగాను ఒకమాటలేదా॥ రామ॥

2 పాలుగారు మోము జూప, నీకు - పాలుమాలిక యేల శ్రీప॥ రామ॥

3 ఆశించినామేను కరగ, గనినీ-వాశునరాకుండెడి దెరుగ॥ రామ॥

4 మరులు కొంటిని యిందాక, ఏపా-మరులు శపించిరో లేక॥ రామ॥

5 చైబట్టి నలుగురిలోన, ఉరము - జేర్చు పాత్రుడనుగాన॥ రామ॥

6 జగము ఒల్లననుకొంటి, భు-జగశయన! నిను నమ్మికొంటి॥ రామ॥

7 ఎదుట నిలచి బ్రోవు రాజ, ముఖ-సదయ! పాలిత త్యాగరాజ॥ రామ॥

తాత్పర్యము :

ఓ రామ! పట్టాభిరామ! కోదండరామ! పాహి = రక్షించుము (ఈ ఒక్క పదము సంస్కృతము). ఈ జగత్తులో జరిగే బొమ్మలాట (మాయానాటకము) చూచి ఒక మాటమాట్లాడవా? నీమద్దు మోము నాకు చూపుటకు నీకు మందకొడితనమేలనయ్యా.

నిన్నాశించి నామేను కరిగిపోయినది. నీవు నన్ను రక్షించుటకు శీఘ్రముగ రావనెడిది నేనెరుగను. నేను నీపై వ్యామోహము చెంది యున్నాను. నీవు రావు. నాకు ఏదుర్జనుల శాప మున్నదో? నాచేయిబట్టి నీవు నన్ను రొమ్ము చేర్చుకొనుటకు పాత్రుడను కానా? నాకు యీ మాయజాగత్తుతో పనిలేదు. దీనిని ఒల్లను. నిన్నే నమ్ముకొని యున్నాను. ఓ చంద్రముఖా! నా ఎదుట నిలచి నన్ను రక్షించుము. అని అయ్యగారి ప్రార్థనము.

486. మోహన = ఆది

ప॥ రామానిను నమ్మిన వారము – గామా సకలలోకాభి॥ రామ॥

అ॥ పామరజనదూర–వరగుణ ఘృణా
పాంగ శుభాంగ–ముని హృదయాబ్జ భృంగ॥ రామ॥

చ॥ వాలాయముగాను రాను జా–గేల సుగుణ దశరథ నృ
పాల హృదయా నందకర శ్రీ–లోలపాల వెలయు మిక
ఫాలలోచన హృదయాల–యాప్తజనపాల కనకమయ
చేల ఇక పరాకేల ఇపుడు మ–మ్మేల నీదు మనసేల రాదు॥ రామ॥

2 నీవే గతియంటిని గాని – నే వేరేమి యెరుగను ముందర
రావే నీ పదపంకజభక్తి–నీవే భావజారినుత
దేవ నీదు పదసేవ ఫలము మము–గావునే–పతిత
పావనా త్రిదశభావనీయ ముని–జీవనానిశము బ్రోవవేలశ్రీ॥ రామ॥

3 ధారాధరని భదేహా, జనా–ధారా దురితౌఘ జలదస
మీరా త్యాగరాజ హృదయా–గారా సార హీన సం
సారమంది వేసారి నిన్ను మన–సార నమ్ముకొనలేనినే
నూరక. ఇక విచారమందుటకు–మేరగాదు శ్రీరామ॥ రామ॥

తాత్పర్యము :

రామా మేమందరమును నిన్ను నమ్మియున్నవారమే. ఓలోకాభిరామా! పామరజనులు నిన్ను దరిజేరలేరు. నీవు గుణములరాశివి. మంగళ దివ్యవిగ్రహుడవు.

ముని హృదయము లనెడి పద్మములకు నీవు భృంగరాజమవు (తుమ్మెదవు). ఓ దశరథ బాలా! అందముగా నీవు నా చెంతకు వచ్చెదవని నిరీక్షించుచున్నాను. నీవు జాగు చేయుచున్నావు. శివుని హృదయమున నివసించుచు ఆప్తులను పాలించే పీతాంబరధారివి. మమ్మేల నీకు పరాకేల? నీవే గతియని నమ్మి యున్నాను కాని ఇతర మేమియు నెరుగను. (నీ అనాదరణమూలముగా) నేను విచారమొందుట ఇకన్యాయము కాదు. అని ప్రార్థనము.

487. కల్యాణి = చాపు

ప॥ రామ రామ రామ నాపై నీదయ
రాక యుండవచ్చునా – ఓ రామ॥ రామ॥

చ॥ తనయుని ఏ జాతియైన – బ్రోవని
తల్లియు భువిని గలదా? ఓరామ॥ రామ॥

2 తనకు దానువం–చన చేసుకొను
ధనవంతుడు గలడా? ఓ రామ॥ రామ॥

3 ఇలను నిశ్చయముగ – నీవు లేని తా
వెందైనను గలదా? ఓ రామ॥ రామ॥

4 బ్రహ్మనిష్ఠుడై–నట్టి యా ఘనునికి
ప్రబలవంచన కలదా? ఓరామ॥ రామ॥

5 తొల్లి జేయు కర్మ–మను భవించకను
తోయు వారలు కలరా? ఓరామ॥ రామ॥

6 కనక తరుణులాసలేని సంసారులు
కలనైనను గలరా?– ఓ రామ॥ రామ॥

7 నిర్వికార శ్రీత్యాగరాజునికి
నిన్ను వినాగలరా? ఓరామ॥ రామ॥

తాత్పర్యము :

రామా! నీదయనాకు వచ్చుటలేదు. అట్లు రాక యుండవచ్చునా? ఈ స్థితి విపరీతము. కొడు కెట్టివాడయినా పోషించని తల్లి ఉండదు. ఒక ధనవంతుడు తనను తనకు తాను మోసము చేసుకొనడు. ఈ భూప్రపంచములో నీవు లేని చోటు ఉండదు. బ్రహ్మ నిష్ణుడైన వానిని ఈ జగత్తు వంచింపలేదు. తొలి చేసిన కర్మఫలమును ఎవ్వడును త్రోయలేడు. ధనమునకు స్త్రీ జనమునకు ఆశపడని సంసారి ఉండడు. ఓ నిర్వికారుడైన రామా! త్యాగరాజునకు నీవు తప్ప వేరే గతి ఉండదు.

విశేషము = ఈ కృతియందు త్యాగరాజునకు రాముడు వినా వేరేగతిలేదు అని చెప్పుట ప్రధానాంశము. త్యాగరాజునకు వేరే గతి ఉండుట అసంభవము. అయ్యగారు అసంభవమయిన 5, 6 విషయములను ఉదాహరణముగా దృష్టాంతముగా చూపినారు. అసంభవమయిన విషయములలో కొడుకు ఎట్టి వాడయినా తల్లి వానిని బ్రోవకుండుట ఒకటి. దీనికి శంకరభగవత్పాదుల వారి సూక్తి. 'కుపుత్రోజాయేతక్వచిదపి కుమాతాన భవతి' = చెడ్డ కొడుకు పుట్టును కాని ఎచ్చటను చెడ్డతల్లి (కొడుకును పోషించని తల్లి) ఉండదు' అని. అయ్యగారు మొదట చరణమున దీనినే చెప్పినారు.

488. ఘంట = జంపె (దివ్యనామము)

ప॥ రామ రామ రామచంద్ర శ్రీ
రామ రామ గుణసాంద్ర॥ రామ॥

చ॥ ఘల్లు ఘల్లున కరముబట్టి క్రీ
గన్నుల గంటే మున్న దితరము॥ రామ॥

2 నా చూపు నీచూపు సరిగా జేసితే చేయు
నా సుఖము ఎవరికి ఎరుక॥ రామ॥

3 ఇది బుద్ధి యనుచు నానతియ్యవేరే
వేల్పు లేటికి తనకు రామయ్య॥ రామ॥

4 చెట్టబట్టని నాభీతి రామ
బొట్టుగట్టని కన్యకరీతి॥ రామ॥

5 ఎవరికి దగునే బాగ రాజూ
పువలె రామ త్యాగరాజ పరిపాల॥ రామ॥

తాత్పర్యము :

ఓ గుణసాంద్రుడవైన రామచంద్రా! నీవు ఘల్లు ఘల్లున వచ్చి నీ చేయి అందించి నీకడగంటి చూపులతో నన్ను చూచితే ఇంతకన్న కావలసిన దేమున్నది? నీ చూపు నాచూపును రెండు కలిస్తే ఆ సుఖము ఎవరికి తెలియును? ఇది దారి అని నాకు బుద్ధి చెప్పుటకు ఇతర దేవతలు నాకేల? నీవే. నీవు నాచెట్ట పట్టక పోతే మంగళసూత్రము లేని కన్యకరీతిగా నుండును నాపని. నావద్దకు రాజూచువారు నీవలె వేరెవరునులేరు. అని అయ్యగారు హృదయనివేదనము చేసినారు.

489. శంకరాభరణం = ఆది

ప॥ రామ సీతా రామ రామ-రామ సీతారామరామ॥
రామ సీతా రామ రామ-రామ సీతా రామ రామ॥ రామ॥

చ॥ తప్పులెన్నబోతే మాకు-గొప్పతనము రాదు మా
అప్ప దయచేసి కండ్ల-గప్పుకొని పాలింపవే॥ రామ॥

2 దాపులేక నేను నీదు-ప్రాపుగోరు కొంటిగాని
రేపు మాపనుచు దోవ-జూపగరాదయ్య॥ రామ॥

3 నీలవర్ణ! పాపముల-కాలయ మైతిని నాదు
జాలి దీర్చి భయము నీ-కేల యని ఆదుకోవే॥ రామ॥

4 వాలాయముగా కృపాల-వాల! రక్షించు కనక
చేల ఇందరిలో నా చే-యీలాగియ్య సమయము॥ రామ॥

5 ఇతరులందు మనసుబోదు-వెతలు నీకు తెలియరాదు।
గతియు ముమ్మాటికి లేదు-క్షితి నెవ్వరిని వేడబోదు॥ రామ॥

6 రామ రామ నిత్య శత్రు-భీమ! భీమనుత! గత
కామ! కామవైరినుత-నామ! నామదిని రావే॥ రామ॥

7 దేవ దేవార్చిత సర్వ-జీవ జీవన మహాను
భావ! భావజ రూప! శ్రీ-పావ పావన రాఘవ॥ రామ॥

8 మాయ మాయెడ వద్దురా-ధ్యేయ ధ్యేయ విషయాలేల
రోయరో ఎప్పుడు దేవ-రాయ, రాయ ఈ దేహము॥ రామ॥

9 రాజ రాజ వందిత, వి-రాజరాజ. హరే దిన
రాజ రాజ నయన త్యాగ-రాజ రాజ దశరథ॥ రామ॥

తాత్పర్యము :

రామ, సీతారామా! నీవు మా తప్పుల నెన్నదలచితే మాకు ఉన్న గొప్పతన మేమీ ఉండదు. కనుక మా తప్పుల నెన్నక నీ కనులలో బెట్టుకొని మమ్ము రక్షించు. దరి దాపులేక నీ ఆశ్రయము చేరినాము. కానీ నీవు రేపు మాపు అనుచు కాలక్షేపము చేయకు. ఓ నీలవర్ణా! రామా! నేను పాపములకు స్థానమైనాను. 'త్యాగయ్యా! నీకు భయములేదు' అని అభయమిచ్చి నన్నాదు కొనుము. నాకు నీవు చేయూత నీయవలసిన సమయమిది. నిన్ను తప్ప ఇతరుల నాశ్రయించుటకు నా మనసొప్పదు. నీకు మా బాధలు తెలియరావు ముమ్మాటికి చెప్పుచున్నాను నీవు తప్ప మాకు గతిలేదు. ఎవ్వరిని వేడగా బోను. రామ! నిత్య శత్రువులైన కామక్రోధ లోభమద మాత్సర్యములకు భయంకరుడా! భీమునిచే పొగడబడినవాడా! కామవైరి అయిన శివునిచే పొగడ బడినవాడా! నా మనసున నిలువుము. నీ మాయను మాపై చూపవద్దు. మాంసమేదో స్థిమయమైన ఈ శరీరమును ఏవగించుకొని నిన్ను నమ్మి యుండరేల జనులు? ఈ దేహము రాయికాదు. (శాశ్వతము కాదు. మరణ శీలమయిన దని). చివరిచరణ మంతయు సంబోధనమే. శ్రీప = లక్ష్మీనాథా! అవ = రక్షించుము. (ఈ వాక్యము మధ్యలో సంస్కృతము).

విశేషము = నిత్యశత్రు భీమ - భీమనుత॥ గత కామ - కామవైరినుతనామ॥ నామదిని॥ మహానుభావ - భావజరూప॥ శ్రీపావ-పావన॥ వీటిలో ముందర ఉన్న పదములలో చివరిపదములతో తరువాతి వాక్యమును గాని పదమును గాని ఎత్తుకొనుట జరిగినది. ఇది ముక్తపదగ్రస్తము అను శబ్దాలంకారము.

490. మధ్యమావతి = ఆది

ప॥ రామ! సమయము బ్రోవ-రా నాపాలి దైవమా॥ రామ॥

చ॥ రామ! దనుజగణ - భీమ! నవఘన
శ్యామ! సంతతము-నామ కీర్తనము

ఏమఱకను అతి-నేమముతో చే
సే మహాత్ములకు-కామితఫలదా॥ రామ॥

2 దాంత సంరక్షణాగ-మాంత చర! భాగవ
తాంతరంగ శ్రీ-కాంత కమనీయగు
ణాంతకాంతక హి-తాంతరహిత ముని
చింతనీయ వేదాంత వేద్య! సా-మంత రాజనుత
యాంతభాంత నిశాంత సుకురుణా-స్వాంత నీకిది॥ రామ॥

3 బృందారకాది ముని-బృందార్చిత పదార
వింద సద్భక్త జీవా-నందకర సూర్యకుల
చందనారి హర-నందకాయుధ స
నందనాది నుత-కుందరదన వర
మందర ధరగో-వింద ముకుందా
సందేహము నీ-కెందుకు నాపై॥ రామ॥

4 ఈ జగతిని నీవ-వ్యాజ కరుణా మూర్తివని
పూజ జేసితి గజ-రాజరక్షక త్యాగ
రాజవందిత ఇభ-రాజవందన ఫణి
రాజశయన విన-రా జగత్పతీ
భూజానాయక-రాజిత మకుటధ
రాజసన్నుత సు-రాజ ఇపుడే॥ రామ॥

తాత్పర్యము :

నా పాలిదైవమగు రామా! నన్ను రక్షించే సమయమిది. రాక్షస భయంకరుడగు రామా! నీలమేఘ శరీరా! నిన్ను ఏమరకభజించే మహాత్ముల కోరికలు దీర్చువాడా! నన్ను రక్షించు సమయమిది.

విశేషము = మొదటి చరణము తప్ప తక్కిన అన్ని చరణములు సంస్కృత సంబోధనములు ఎక్కువ కనుక ప్రతి పదార్థము వ్రాయబడుచున్నది. దాంత సంరక్షణ= బ్రహ్మ వేత్తలను రక్షించువాడా! ఆగమాంతచర! = వేదాంతములయందు చరించువాడా! భక్తులకు అంతరంగమైన వాడా! శ్రీకాంత = లక్ష్మీనాథా! కమనీయగుణ = రమ్య గుణములు కలవాడా! అంతకాంతక హిత = శివునకు హితమైనవాడా! అంతరహిత = నాశము లేనివాడా! ముని చింతనీయ = మునులు ధ్యానింప దగినవాడా! వేదాంతవేద్య

= ఉపనిషత్తుల ద్వారా తెలుసుకొన దగినవాడా! సామంత రాజనుత = సామంత రాజులచే పొగడబడినవాడా! (యాంతభాంత నిశాంత అనునది అర్థరహితముగా నున్నది. ఇది వ్రాతలో వచ్చినదని నా ఊహ. అందుచేత పరిష్కారము చూపుచున్నాను. వీరభద్రశాస్త్రిగారు దీనిని వదలినారు. 'శాంత దాంత నిశాంత'= అంతరింద్రియ బహిరింద్రియములను నిగ్రహించిన వారి యందు నివసించువాడా! అని అర్థము) సుకరుణా స్వాంత = మంచి కరుణగల వాడా! బృందారకాది మునిబృందార్చిత పదారవింద = దేవతల చేతను మునులచేతను అర్చింపబడిన పాదపద్మములు గలవాడా! సద్భక్త జీవానంద కర = భక్తుల ప్రాణముల కానందము కలిగించువాడా! సూర్యకులచందన = సూర్యవంశమందు చల్లనివాడా! అరిహర = శత్రువులను సంహరించు వాడా! నందకాయుధ = నందకమనెడు ఖడ్గముగలవాడా! సనందనాదినుత = సనక సనందులచేత పొగడబడినవాడా! కుందరదన = మల్లెమొగ్గలవంటి దంతములు కలవాడా! వర మందరధర = మందర పర్వతమును మోసినవాడా! గోవిందా, ముకుందా! నాపై నీకు సందేహమెందుకు? రక్షించు సమయమిది. నీవు అవ్యాజకరుణామూర్తివి (ఏ కారణమును లేకనే దయ జూపువాడు) అని నిన్ను పూజించితిని. ఓ గజరక్షకా! గజముచే నమస్కరింపబడినవాడా! త్యాగరాజనుత. శేషశయనా! జగత్పతీ! సీతానాయకా! అజవందిత = బ్రహ్మచే నమస్కరింపబడినవాడా! ప్రకాశించు కిరీటమును ధరించినవాడా! చక్కని రాజా ఇదే రక్షించు సమయము. అని అయ్యగారు నివేదించుకొన్నారు.

491. కేదారగౌళ = ఆది

ప॥ రాముని మరువకవే ఓమనసా॥ రాముని॥

చ॥ రాముని యాగము గాచిన పావని
రాముని సద్గుణ-ధాముని సీతా॥ రాముని॥

2 ధీరుని దైత్య వి-దారుని లోకా
ధారుని వంశో-ద్ధారుని సీతా॥ రాముని॥

3 ధ్యేయుని మునిజన - గేయుని ఘననిభ
కాయుని దేవ-రాయని సీతా॥ రాముని॥

4 వాసవహృదయని-వాసుని బహురవి
భాసుని శుభకర-వేసుని సీతా॥ రామునిll

5 గీతప్రియుని వి-ధాతృనుతుని కం
జాత బంధుకుల-జాతుని సీతా॥ రామునిll

6 ఈ జగతిని అ-వ్యాజము నాప్త స
మాజము బ్రోచుజగ-ద్రాజును సీతా॥ రామునిll

7 దాన వహారు నీ-శాన వినుతుని స
దా నరోత్తముల-మాన రక్షకుని॥ రామునిll

8 శోభనదుని గిరి-జాభావ్యుని దురి
తేభహరిని బహు-ప్రాభవుని సదా॥ రామునిll

9 శీలిని సద్గుణ-శాలిని ఘనుని క
పాలినుతుని వన-మాలిని సీతా॥ రామునిll

10 శ్రీగురుచరణము-లేగతియనిన స
దాగతిజహితుని - త్యాగరాజనుతుని రామునిll

తాత్పర్యము :

రాముని విశేషణములను, గుణములను, మహిమలను ఎన్నిటినో చెప్పి అట్టిరాముని మనసా మరువకు మని ఉపదేశము.

విశేషము = ఇందు వివరింపదగినవి చాల ఉన్నాయి. మొదటి చరణములో 'రాముని యాగము' అంటే విశ్వామిత్రుని యాగము. రాజరాజు అనుటకు 'జ' లోపించి 'రారాజు' అయినట్లు 'రాజమునిలో 'జ' లోపించి 'రాముని' అయినది. విశ్వామిత్రుడు క్షత్రియుడుగా పుట్టి ముని అయినాడు. అందుచేత 'రాజమునిని'. 'జ' లోపించి 'రాముని' అయినది. 'రాముని యాగము' = రాజమునియాగమును గాచిన పాపవిరాముని = పాపములను హరించు వానిని, సద్గుణ ధాముని సీతారాముని. (ప్రతి చరణమున చివర నున్న 'సీతా' తో పల్లవి మొదట నున్న 'రాముని' అనేది కలిసి 'సీతారాముని' అని ఏక పదమగుచున్నది. ఇందు ఇదొక విశేషము. రెండు మూడు చరణములు సులభము. 4వ చరణములో 'శుభకరవేసుని' త్యాగయ్యగారి స్వాతంత్ర్యమునకు వదలి వేయాలి. 'శుభకరవేషుని' ఒప్పు. గీత ప్రియుని = సంగీతప్రియుని, విధాతృనుతుని = బ్రహ్మచే

పొగడబడిన వానిని, కంజాతబంధుకుల జాతుని = సూర్యకులమున పుట్టినవానిని, 6వ చరణము వీరభద్రశాస్త్రిగారి పుస్తకమున త్యాగయ్యగారి హృదయానుసారముగా లేకపోవుటచేత ఇందున్నది నా పరిష్కారము. 8వ చరణములో 'గిరిజా బాహుని' అనేది అర్థరహితముగా నుండుటచేత అయ్యగారి హృదయానుసారముగా 'గిరిజా భావ్వుని' అని నా పరిష్కారము. వీరభద్రశాస్త్రిగారు పైదానిని వదలినారు కూడ. దీనిలోనే 'బహుప్రభావుని' అనేది సరిగాలేనందున 'బహుప్రాభవుని' అని నా పరిష్కారము. శోభనదుని = మంచి నిచ్చువానిని, దురితేభహరిని = పాపములనెడు ఏనుగులకు సింహమైన వానిని, శీలిని = శుద్ధమైన చరితముగలవానిని, కపాలి నుతుని = శివునిచే పొగడబడిన వానిని, వనమాలిని, రాముని గురువుగా భావించి ఆగురుచరణములే గతి అని నమ్మిన హనుమంతునకు హితుడయిన సీతారాముని మరువకు మనసా అని అయ్యగారి మానసబోధ.

492. సారాష్ట్రము = చాపు

ప॥ రారానన్నేలు కోరా శ్రీ-రఘువీర నన్నేచమేరా?

అ॥ సారాసారోదార, అఖిలా
ధారాద్భుతగుణ-ధారాళముగ॥ రారా॥

చ॥ ధారాధరాభశ-రీరా నాయెడనీవు
నేరమెన్నక ఆదు-కోరా॥ శ్రీరామ సం
సారా కానన వి-హారుడైన నాకు
సారమౌ నామమే-తారక మౌర॥ రారా॥

2 సీతా హృత్కమల ఖ-ద్యోతాప్తజనపారి
జాతా ఘవననిధి - పోతాబ్జహితకుల
జాత రక్షించు వి-ధాతృజనక ఇష్ట
దాతవైన సా-కేతా గారా॥ రారా॥

3 రా జాగేల? ధ-రాజామాతవై
నా జాలెరిగి ఓ ఆజానుబాహు వి
రాజమాన! ద్విజ-రాజానన! సుర
రాజార్చిత! త్యాగ-రాజనుతాజ॥ రారా॥

తాత్పర్యము :

రఘువీరా! రారా! నన్ను బాధించుట న్యాయమా? సారాసారో దార = మంచి వర్షమువలె ఉదారమైన వాడా! అఖిలాధార! = అన్నిటికి ఆధారమైనవాడా! అద్భుతగుణ= ఆశ్చర్యకరగుణములు కలవాడా! వర్షాకాల మేఘము వంటి శరీరము కలవాడా! నానేరముల నెన్నక నన్నాదుకొనుము. సంసారమనెడి అడవిలో కొట్టుమిట్టాడుచున్న నాకు నీతారకనామమే శరణ్యము. సీతా హృత్కమల ఖద్యోత = సీతా హృదయమనెడి పద్మమునకు సూర్యుడా! ఆప్తజన పారిజాత = ఆప్తులకు కల్పవృక్షమా! అఘవననిధిపోత! పాపములనెడు సముద్రమును దాటుటకు నావ అయినవాడా! అబ్జహితకుల జాత = సూర్యవంశమున బుట్టినవాడా! విధాతృజనక = బ్రహ్మకు తండ్రి అయినవాడా! కోరిక లిచ్చు అయోధ్యావాసుడవు. రక్షించుము. వచ్చుటకు జాగేల? భూదేవికి అల్లుడవు. నాదీన స్థితి నెరుగుము. ఓ ఆజానుబాహూ = పిక్కల వరకు వ్రేలాడు భుజములవాడా! రమ్ము. నన్ను రక్షింపుము. అని ప్రార్థనము.

493. దేశికతోడి = ఆది

ప॥ రూకలు పదివేలున్న చేరెడు – నూకలు గతిగాని మనసా॥ రూ॥

అ॥ కోకలు వెయ్యున్న కట్టు–కొనుట కొకటే గాని ఓమనసా॥ రూ॥

చ॥ ఊరేలిన తాబండుటకు మూడు–మూరల తావుగాని
నూరు భక్షణము లబ్ధిన–నోటికంతగాని
ఏరు నిండి పారిన పాత్రకు తగు–నీరు వచ్చుగాని
సారతరుని హరిని త్యాగరాజు–నన్నుతుని మరవకే మనసా॥ రూ॥

తాత్పర్యము :

రూకలు (రూపాయిలు) పదివేలు కష్టపడి సంపాదించినా తినేది చేరెడు నూకలే. చాల కష్టపడి కోకలు వెయ్యి సంపాదించినా కట్టుకొనేది ఒక్కటే. తాను కష్టించి జమీ సంపాదించి ఊరు ఏలినా తాను పడుకొనుటకు మూడు మూరల చోటే. కష్టించి నూరు భక్ష్యములు సంపాదించినా నోట పట్టేది ఒక భక్ష్యమే. ఏరు పూర్తిగా నిండి ప్రవహిస్తూ ఉన్నా తాను తీసుకొని వెళ్లిన కుండెడు నీరే వస్తుంది. పై విషయములన్నియు సంపాదించుటకు కాలమంతయు వృధాచేసినా అంటేది చాలా తక్కువ. కనుక సారములేని

తక్కిన విషయములను కోరక సారమైన రాముని నామమును మరువవద్దు. అని అయ్యగారి మానస బోధ.

విశేషము = 'అసార మల్పసారం చత్యక్త్వాసారతమంభజేత్' = సారములేని దానిని, కొద్ది సారము కలదానిని విడచి మిక్కిలిసారము కలదానిని గ్రహింపవలెను' అని శాస్త్రము. మిక్కిలి సారముకలది భగవద్భక్తి అని పెద్దల వచనము. త్యాగయ్యగారు ఆసారములకు కాలము వృధా చేయక సారమైన రామభక్తిని గ్రహించుడని ఉపదేశించినారు.

494. తోడి = రూపకం (దివ్యనామము)

ప॥	రే మానస చింతయ-శ్రీరామం॥	రేమానస॥
చ॥	సాకేతనగరనాథుని-సమానరహితమావరుని॥	రేమానస॥
2	గతకామ హృదయార్ణవ-కలాధరుని ఇలాధిపుని॥	రేమానస॥
3	భక్తాఘ పయోధర-ప్రభంజనుని-నిరంజనుని॥	రేమానస॥
4	వినతాతనయార్తి తమో - విభాకరుని శుభాకరుని॥	రేమానస॥
5	దేవేశ సమారాధ్యుని - దిగంబరుని చిదంబరుని॥	రేమానస॥
6	వందారు బృందారక-వరాభయదుని - రాఘవుని॥	రేమానస॥
7	వరత్యాగరాజార్చిత - పదాంబుజుని సదాహితుని॥	రేమానస॥

తాత్పర్యము :

రేమానస చింతయ శ్రీరామం = ఓ మనమా శ్రీరాముని ధ్యానింపుము. శ్రీరాముడెట్టివాడు? సాకేత నగరనాథుడు. సాటిలేని లక్ష్మీనాథుడు. వైరాగ్యవంతుల హృదయమునకాహ్లాదకరుడు. భూమి కధిపతి. భక్తుల పాపములను చెదరగొట్టువాడు. నిర్వికారుడు. గరుత్మంతుని ఆర్తి దీర్చినవాడు. శుభములకు స్థానమైనవాడు. ఇంద్రునకు పూజ్యుడు. దిగంబరుడు. చిదంబరుడు. నమస్కరించు దేవతలకు వరములను అభయమును ఇచ్చువాడు. రఘువంశమున బుట్టినవాడు. త్యాగరాజర్చించు పాదములవాడు. ఎప్పుడును హితము చేయువాడును అయిన శ్రీరాముని ధ్యానింపుము మనసా అని తాత్పర్యము.

విశేషము = ఈ కృతి అంతా ఏకవాక్యము. శ్రీరాముని ధ్యానింపుము. అనే అర్థముగల పల్లవి మాత్రము సంస్కృతము. తక్కిన ద్వితీయావిభక్తి విశేషణములన్నియు సంస్కృతపదములే. అయినను సమాసఘటితములయి తెలుగు తత్సమములయినవి. వాక్యమునందు కర్త కర్మ క్రియ సంస్కృతము, కర్మపదవిశేషణములన్నియు తెనుగన్నమాట. రెండు భాషలు కలిసి ఇందున్నవి కనుక ఈ విశేషమును మణి ప్రవాళమందురు. అనగా మణులు పగడములు కలిసియుండుట. గరుత్మంతుని ఆర్తిదీర్చుట అనగా అతని తల్లి అగువినతకు దాస్య విముక్తిని కలిగించుటలో అతనికి విజయము కల్గుట. ఇది సిద్ధింపచేయుట భగవత్సంకల్పమే కదా! మరియు గరుడుని వాహనముగా స్వీకరించుటయును. దిగంబరుడనగా సమస్త దిగంతములను వ్యాపించినవాడని. చిదంబరుడనగా జ్ఞానస్వరూపుడని మరియు విభాకరుని శుభాకరుని, దిగంబరుని చిదంబరుని అనేవి శబ్దసంబంధమగు యమకాలం కారము.

495. భైరవి = ఆది

ప॥ లలితే శ్రీ ప్రవృద్ధే శ్రీమతి–లావణ్యనిధిమతి॥ లలితే॥

అ॥ తెలివిని వర్ధిల్లు శ్రీతప–స్తీర్థనగర నిలయే॥ లలితే॥

చ॥ తెలియని బాలుడగాదా, అంబ–తెలివి నీసొమ్ముగాదా
చలముసేయ మరియాదా–చల్లని మాటలు బల్కరాదా॥ లలితే॥

2 బ్రోచువారిలను లేక–చూచి చూడక పరాకా
ఈ సుజనుల వేడగలేక నే–దాసుడనీవే గతిగాక॥ లలితే॥

3 కన్నతల్లి! శుభవదనే! మీ–అన్న దయకు పాత్రుడనే
తిన్నగ శరణుజొచ్చితినే–త్యాగరాజమానస సదనే॥ లలితే॥

తాత్పర్యము :

ఈ కృతి లాల్‌గుడిలో వెలసిన శ్రీమతి అనే దేవిస్తుతి పరమగు కృతి లాల్‌గుడికి తపస్తీర్థమనికూడ పేరుకలదు. ఈ దేవి పార్వతీ దేవి అంశ. ఓ లలితా! శ్రీప్రవృద్ధే = సంపదలతో వృద్ధి పొందినదానా! శ్రీమతీ దేవీ! లావణ్యనిధిమతి! సౌందర్యనిధీ! (ఈ సంబోధనములన్నియు సంస్కృత పద్ధతిలో నున్నవి. చరణములన్నియు తెలుగే) జ్ఞానముతో వర్ధిల్లునట్టి తపస్తీర్థవాసినీ! నేను తెలియని బాలుడను. తెలివి నీ సొమ్ము

కనుక తెలివిలేని నాపై కోపము చూపుట న్యాయము కాదు. చల్లని మాటలు పలుకుము. ఈ భువిలో బ్రోచు వారు లేక ఈసు జనులను = ఈర్ష్యకలజనులను వేడలేక నీ దాసుడనైతిని. నీవే నాగతివి. ఓ కన్నతల్లీ! శుభవదనే = శుభమగు ముఖముకలదానా! మీ అన్న అయిన రాముని దయకు నేను పాత్రుడనైతిని. త్యాగరాజ మానస సదనే = త్యాగరాజు మనసున నుండుదానా! నిన్ను శరణు జొచ్చినాను. అని ప్రార్థన.

విశేషము = అనుపల్లవి పంక్తిని యతిని అనుసరించి ఆవిధముగా విభజించి వ్రాయుట మయినది. ఇందు రెండువ చరణమున ప్రాసశుద్ధిలేదు. దీనినీ అయ్యగారి స్వాతంత్ర్యమునకు వదలి వేయుటయే అయినది.

496. శుద్ధ సావేరి = ఆది

ప॥ లక్షణములు గల రామునికి ప్ర
దక్షిణ మొనరింతాము రారే॥ లక్షణ॥

అ॥ కుక్షిని బ్రహ్మాండము లున్నవట వి
చక్షణుడట దీక్షాగురుడట శుభ॥ లక్షణ॥

చ॥ లక్షణ లక్ష్యముగల శ్రుతులకు ప్ర-త్యక్షం బౌనట
శిక్షబడి సభను మెప్పించు భక్త-రక్షకుండౌనట
అక్షరస్థులైన భజనపరులకే-అంతరంగు డౌనట
సాక్షియై వెలయు త్యాగరాజ-పక్షుండౌనట ముప్పది రెండు॥ లక్షణ॥

తాత్పర్యము :

రామునకు ప్రదక్షిణమొనరించుటకు అయ్యగారు భక్తుల నాహ్వానించినారు. లక్షణములుగల రాముడట. ఏమాలక్షణములు? పరబ్రహ్మ లక్షణములు. కుక్షిలో బ్రహ్మాండములుండుట పరబ్రహ్మలక్షణము. ఏ శుభదీక్ష మనము తీసుకున్నా 'విష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య' = విష్ణువు యొక్క ఆజ్ఞతో ప్రవర్తించుచున్నావు' అని సంకల్పము చెప్పెదము. ఇదియే ఆయన దీక్షాగురుడగుట. వేదమునందు పరమాత్ముని లక్షణములు 'సహస్రశీర్షాపురుషః' = వేయి శిరస్సులవాడు ఇత్యాదిగా చెప్పబడినవి. 'విశ్వం నారాయణం దేవం' = నారాయణుడు సమస్తమును' అని నారాయణుడు లక్ష్యముగా, సాక్షి మొదలయిన లక్షణములు పరమాత్మునివే. చరణములోని రెండవపంక్తి రాముని సూచించుచున్నది. విశ్వామిత్రుని యాగరక్షణకు వెంటబయలుదేరినాడు. ఆ

సమయమున విశ్వామిత్రుడు రామునకు బలాతిబలలను, జృంభకాద్యస్త్రములను ఉపదేశించినాడు. ఇదే శిక్షపడుట. శిక్ష అంటే గురువునుంచి ఒక విద్యను గ్రహించుట. రాముడు వసిష్ఠుని వద్ద తరువాత విశ్వామిత్రునివద్ద అస్త్రవిద్యాశిక్ష పొందుట జరిగినది. తరువాత విశ్వామిత్రుని యజ్ఞసంరక్షణలో సుబాహుమారీచాదుల విక్షేపాదులలో ముని సభఅంతయు రాముని చూచి మెచ్చినది. ఇదే అయ్యగారనిన శిక్షబడి సభను మెప్పించిన అనుదాని భావము.

విశేషము = అయ్యగా రీకృతిలో చెప్పిన ముప్పది రెండు లక్షణములు వాల్మీకములో సుందరకాండలో 35వ సర్గలో సీతకు గుర్తుగా హనుమంతునిచే చెప్పబడినవి.

శ్లో॥ రామః 1. కమల పత్రాక్షః, 2. సర్వ సత్త్వమనోహరః। 3. రూపదారక్షిణ్య సంపన్నః, 4. ప్రసూతో జనకాత్మజే॥5. తేజసాదిత్యనంకాశః, 6. క్షమయా పృధి వీసమః। 7. బృహస్పతిసమో బుద్ధ్యా, 8. యశసా వాసవోపమః॥ 9. రక్షితా జీవలోకస్య, 10. స్వజనస్యాభిరక్షితా।11. రక్షితా స్వస్య వృత్తస్య, 12. ధర్మస్యచ, 13. పరంతపః॥ 14. రామో భామిని లోకస్య, 15. చాతుర్వర్ణ్యస్య రక్షితా।16. మర్యాదానాంచ లోకస్య కర్తా, 17. కారయితా చసః॥18. అర్చిష్మా, 19. నర్చితోత్యర్థం, 20. బ్రహ్మచర్యవ్రతే స్థితః। 21. సాధూనా ముపకారజ్ఞః, 22. ప్రచారజ్ఞశ్చ కర్మణాం॥ 25. శ్రుతవా్, 26. శీలసంపన్నః, 27. వినీతశ్చ పరంతపః॥ 28. యజుర్వేదవినీతశ్చ, 29. వేదవిద్భి స్సుపూజితః। 30. ధనుర్వేదేచ, 31. వేదేషు, 32. వేదాంగేషుచ నిష్ఠితః॥

ప్రతిపదార్థము = 1. తామరరేకులవంటి కనులవాడు, 2. అన్ని సత్త్వములకు నుమనోహరుడు (ఆకర్షకుడు), 3. రూపము శక్తియు గలవాడు, 4. మంచికులమున బుట్టినవాడు, 5. తేజస్సున సూర్యునితో సముడు, 6. ఓర్పులో భూమితో సముడు, 7. బుద్ధిలో బృహస్పతితో సముడు, 8. కీర్తిలో ఇంద్రునితో సముడు, 9. జీవులను రక్షించువాడు, 10. స్వజనులను రక్షించువాడు, 11. తననడతను రక్షించుకొనువాడు, 12. ధర్మమును రక్షించువాడు, 13. శత్రువులను తపింపజేయువాడు, 14. లోకమును రంజింపజేయువాడు, 15. చతుర్వర్ణముల వ్యవస్థను రక్షించువాడు, 16. జనుల హద్దులను కూర్చువాడు, 17. కూర్పించువాడు, 18. కాంతిగలవాడు, 19. బాగా పూజింపబడినవాడు, 20. బ్రహ్మ చర్యవ్రతమందున్నవాడు, 21. సత్పురుషుల ఉపకారము నెరిగినవాడు, 22. కర్మముల ప్రచారము నెరిగినవాడు, 23. రాజవిద్యను నేర్చినవాడు, 24. బ్రాహ్మణుల నుపాసించువాడు, 25. శాస్త్రములు విన్నవాడు, 26. మంచి శీలముగలవాడు, 27. వినయముగల వాడు, 28. యజుర్వేదము నేర్చినవాడు, 29. వేదవేత్తలచేత పూజింపబడువాడు, 30. ధనుర్వేదమునందు నిష్ఠగలవాడు, 31. వేదములయందు నిష్ఠగలవాడు, 32. శిక్షా వ్యాకరణాదులయిన వేదాంగములయందు నిష్ఠగలవాడు.

సూచన = హనుమంతు డీషుట్టమునందు చెప్పిన లక్షణములు మాత్రమే 32 సంఖ్యకు సరిపోవుచున్నవి. దీనికి అనుబంధించి శరీరమును, అవయములను వర్ణించిన శ్లోకములగుటచేత వాటిని గ్రహింపలేదు. పై శ్లోకములలో 'జనకాత్మజే' అనునది 'భామిని' అనునదియును సీత సంబోధనములు. 'పరంతపః' అనుపదము రెండు సార్లు వచ్చినది. ఒక్క దానినే గ్రహించినాను. అప్పుడే 32 అగును.

497. పూర్ణషడ్జము = రూపకం

ప॥ లావణ్యరామ కన్ను-లార జూడవే అతి॥ లావణ్య॥

అ॥ శ్రీవనితా చిత్తకుముద-శీతకర! శతానన్యజ॥ లావణ్య॥

చ॥ నీ మనసు నీ సాగసు - నీ దినుసు వేరే రామ
తామసమత దైవమేల - త్యాగరాజ వినుత! దివ్య॥ లావణ్య॥

తాత్పర్యము :

లావణ్య మనగా సౌందర్యము. అది కలిగిన రాముడు లావణ్యరాముడు. ఓ లావణ్య రామా! నన్ను కన్నులార చూడవయ్యా! అతి లావణ్యరామ = మిక్కిలి సౌందర్యముగల రామా! (ఈ విధముగా ఆ వృత్తమందలి చివరి పదముతో ఇంకొక ఆ వృత్తమందలి మొదటి పదమును ముడిపెట్టుట త్యాగయ్యగారి రమ్యశైలిలో ఒకటి) ఓరామా! నీ మనసువేరు. నీ సాగసు వేరు. నీ పద్ధతి వేరు. సర్వసౌందర్య సంపూర్ణుడవు నీవుండగా తామసమతపు దేవుని ఆశ్రయించుట ఏలకు? దివ్య లావణ్యరామ, శ్రీవనితా చిత్తకుముద శీతకర = లక్ష్మీదేవి యొక్క మన స్సనెడి కలువకు చంద్రుడా! శతానన్యజ = నూరుగురు మన్మథులు. ఈ పదముతో లావణ్య అను పదమును అయ్యగారు సంధించినారు. కాగా 'శతానన్యజలావణ్య' = నూరుగురు మన్మథులు లావణ్యము కలిగిన రామా అని అర్థము సిద్ధించినది.

విశేషము = త్రిమూర్తులలో విష్ణువుది సత్త్వగుణ మనియు, తక్కిన ఇద్దరి గుణములు రజస్తమోగుణములనియును వైదిక ఆర్ష విభజనము. అందరు దేవతలు సమానమనే భావించు భక్తులును వారి మనస్సు సత్త్వగుణమందున్నప్పుడు సత్త్వగుణుడగు విష్ణువుకు ఆధిక్యమిచ్చి తామసమత దేవులను అల్పముగా భావింతురు. ఇంతమాత్రమున ఇది ఇతర దేవతా దూషణముకాదు. దీనిని 'నహినిందా న్యాయ' మందురు. ఒకదాని గొప్పతనమును చెప్పునప్పుడు రెండవదానిని తక్కువగా చెప్పుట నింద కాదని దాని అర్థము.

498. దుందుభి = దేశాది

ప॥ లీలగాను జూచే-కులశీలుల నా
పాలగల్గజేసి - పాలింతువయ్యా॥ లీల॥

అ॥ పాలు మాలిన - పామరుల నొల్ల
పరమాత్మ యీ లోకముల॥ లీల॥

చ॥ నర కిన్నర కిం-పురుషాసురని
ర్జరరాజ శివా-దిరమాపతుల
తరుభూధరా-నేకాండముల
త్యాగరాజనుత - శ్రీరామ నీ॥ లీల॥

తాత్పర్యము :

లీలగా చూచే జ్ఞానులను నాకు కలుగజేసి నీవు నన్ను పాలించెదవయ్యారామా! (లీలగా చూచుట దేనిని?) ఈ లోకములను నీ లీలగా చూచుట. ఈ జ్ఞానము కలవారు కులశీలురు. వీరి సాంగత్యము తనకు కలుగజేయుమని అయ్యగారి ప్రార్థన. పై జ్ఞానము లేనివారు పాలుమాలిన పామరులు. అయ్యగారు వారిని ఒల్ల నన్నారు. దేవతలు, కిన్నర కింపురుషులు రాక్షసులు, శివాదులు, చెట్లు, కొండలు, లోకములు ఇవన్నియు లీలగా చూచే వారిని తనపాల కలుగ జేసి రక్షించెదవు రామా! అని అయ్యగారి ఆనందము.

విశేషము = మనదేశమున ప్రధానముగా రెండు మతములు కనపడుచున్నవి. అద్వైతము, విశిష్టాద్వైతము అని. అద్వైతసిద్ధాంతమున ఈ లోకములు ఈ జీవులు ఇవి అన్నియు మాయాకల్పితము లని భావము. అనగా మన అవిద్యచేత లేనివాటిని ఉన్నవిగా భావించుచున్నాము. కనుక ఇవి ఏమియులేవు. బ్రహ్మము మాత్రము నిజము. జగత్తు మిథ్య. 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా' అని. దీనిని మిథ్యావాదము, మాయావాదము అని అందురు. ఇక విశిష్టాద్వైతులను వైష్ణవులని అందురు. వీరి సిద్ధాంతమున ఈ లోకములు ఈజీవులు అన్నియును ఉన్నవస్తువులే. వీటిని ఈశ్వరుడు (నారాయణుడు) తన లీలకోసం సృష్టించుకొన్నాడు. (త్యాగయ్యగారు కూడా 'రామభక్తి సామ్రాజ్యము' అనే కృతిలో 'లీలా సృష్ట జగత్త్రయము' అన్నారు). మరియు విశిష్టాద్వైతులు పరమాత్మునకు ఉభయవిభూతులున్నవి. ఒకటి అన్ని ఆవరణములు దాటిన అవ్వల నున్న వైకుంఠము 'భోగవిభూతి'. సత్యలోకమునుంచి క్రింద ఉన్న సమస్తలోకములు, సమస్త జీవులును రెండవ 'లీలావిభూతి' వైకుంఠమున నున్న వస్తువులు ప్రతిదీ నిత్యసత్యములు,

నిర్వికారములు. జీవులు జరామరణములు లేని నిత్యసూరులు. పరమాత్మకు ఈ విభూతితో నిత్యానందము. అదియే భోగము. దీనికి ప్రమాణముగా 'తద్విష్ణోః పరమంపదం' అనే వేదమును చూపుదురు. ఇక తక్కిన క్రింది లోకము లన్నియు పరమాత్ముడు తన క్రీడకై (లీలకై) సృష్టించుకొన్నది. అందుచేత దీనికి లీలా విభూతి అనిపేరు. మొత్తం అంతటిలో భోగవిభూతి మూడు వంతులని లీలావిభూతి నాలుగవ వంతు అని చెప్పుదురు. దీనికి పురుషసూక్తములోని 'త్రిపాదూర్ధ్వ ఉదై త్పురుషః - పాదోస్యేహాభవత్పునఃి' అనే మంత్రమును ప్రమాణముగా చూపుదురు. లీలా విభూతిలోని లోకములు ఉత్పత్తి వినాశములు కలిగి ఉండును. జీవులు సురనర తిర్యగ్విశేషములు. ఇవి జననమరణములు, జరావ్యాధులు, సుఖ దుఃఖములనెడి సంసార బాధలు కలిగి యుండును. ఇదియే లీల అందురు. భగవద్గీతలో' ఆ బ్రహ్మ భువానాల్లోకాః పునరావృత్తినోర్జున' = బ్రహ్మలోకము వరకు ఉన్న ప్రతిలోకము జీవునకు పునర్జన్మ కలిగించునదే అని. అనగా అవి శాశ్వతములు కావని. శాశ్వతముకాని ఈ లోకము లన్నియు 'లీల'లో చేరును. లీల యొక్క సిద్ధాంతమిది. ఈ లీలనెరిగిన కులశీలుర సాంగత్యము కలుగజేసి పాలించువాడు రాముడని అయ్యగారి అభినందనము. భోగవిభూతిని నిత్యవిభూతి అని కూడ అందురు. లీలా విభూతి రెండవది. ఈ రెండిటిని కలిపి ఉభయ విభూతులందురు. పరమాత్ముడు ఉభయవిభూతి నాయకుడు. విభూతి అనగా ఐశ్వర్యము. ఈ సిద్ధాంతమున లీలావిభూతి కూడ నిత్య సత్యమైనదే. ప్రవాహ రూపముతో నిత్యమని సిద్ధాంతము.

499. అసావేరి = ఆది

ప॥ లేకనా నిన్ను చుట్టుకొన్నారు
ఏక హృదయులై నిత్యానందము॥ లేకనా॥

అ॥ శ్రీకరా కరుణా-సాగర నిరుపమ
చిన్మయ శ్రిత చిం-తామణి నీయెడ॥ లేకనా॥

చ॥ సౌందర్యములో - సుఖము సీతమ్మకు
సౌమిత్రికి కను-జూడలో సుఖము॥ లేకనా॥

2 సుందరముఖమున - సుఖము భరతునికి
సుజ్ఞానరూపమున - సుఖము రిపుఘ్నునికి॥ లేకనా॥

3 చరణయుగమునందు – సుఖమాంజనేయునికి
వరగుణ! త్యాగరాజవరదా నందము॥ లేకనా॥

తాత్పర్యము :

'వామే భూమిసుతా పురస్తు హనుమాన్‌ పశ్చాత్సు మిత్రాసుతః శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళయోఃః' = ఎడమ భాగమున సీత, ముందు హనుమంతుడు, వెనుక లక్ష్మణుడు, ఇరుప్రక్కల భరతశత్రుఘ్నులు రాముని పరివేష్టించి యున్నారు. ఈ దృశ్యములో అయ్యగారు ఒక విశేషము నూహించి రామునితో అంటున్నారు. శ్రీకరా! కరుణాసాగరా! నిరుపమ = సాటిలేనివాడా! శ్రితచింతామణి = ఆశ్రియించిన వారికి సమస్తము నిచ్చువాడా! ఓ రామా సీతా హనుమ లక్ష్మణ భరత శత్రుఘ్నులు నిన్ను చుట్టుకొని యున్నారు. నిన్ను చేరి ఉండుటలో వారందరికి ఒక సుఖము ఆనందము ఉండి నిన్ను చుట్టి ఉన్నారు.

అయితే ఒక్కొక్క దానిలో ఒక్కొక్కరికి ఆనందము. రామా! నీ సౌందర్యములో సీతకు సుఖము. నీ కనుజాడలలో లక్ష్మణునకు సుఖము. 'అహం సర్వం కరిష్యామి జాగ్రత స్స్వపతశ్చితే' = అన్నా! నీవు మేల్కని ఉన్నా నిదురించి యున్నా నీకు సర్వమును చేయుదును' అని చెప్పిన లక్ష్మణునకు నీ కనుసంజ్ఞలను గుర్తించి నీకు కైంకర్యము చేయుటలో సుఖమున్నది. ఇక భరతుడు నీముఖమును చూడక పాదుకల యందు నిన్ను చూచుకొనుచు నీ ముఖమును చూచుటకు ముఖము వాచి ఉన్నాడు. ఇపుడు పట్టాభిషిక్తుడ వైనావు. పదునాలుగు సంవత్సరముల కరవు తీరునట్లు నీ ముఖమును చూచుచు సుఖము ననుభవించుచున్నాడు. 'శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నః' అనుదాని ప్రకారముగా శత్రుఘ్నుడు కామ క్రోధ లోభ మోహమద మాత్సర్యములను జయించినవాడు. దీనికి సుజ్ఞానము కారణము. ఇది రామునియందు సంపూర్ణముగా నున్నది. శత్రుఘ్నుడు దానిని చూచి ఆనందము ననుభవించు చున్నాడు. హనుమంతుడు పాదసేవలో సుఖమనుభవించు చున్నాడు. అని అయ్యగారు ఆ సుఖములు, ఆ ఆనందములు తాము మానసికముగా అనుభవించుచున్నారు. ఈ వరమును నాకిచ్చినవాడవు రామా! అని అయ్యగారి నివేదనము.

500. నవనీతము = ఆది

ప॥ లేమిదెల్ప పెద్దలెవరు లేరో॥ లేమి॥

అ॥ ఆమహిమ లెల్లమాని – ఈమహిని బుట్టిరో॥ లేమి॥

చ॥ నీ రూపమున బూని మనసు – నిర్మలులై యుండలేదా
ధారాధరాభశరీర – త్యాగరాజ వినుత॥ లేమి॥

తాత్పర్యము :

రామా! నీ అనుగ్రహము నాపై ప్రసరింపక పోవుట ఒక దారిద్ర్యము. అదియే లేమి. నా లేమిని నీకు తెలిపే పెద్దలు ఎవరును లేరా? పూర్వము నీవద్ద ఉండేవారు. వారు ఆ గుణములు మానుకొని ఇప్పుడీ కలియుగానికి తగినట్లు ఈ భూమిని పుట్టి ఉండిరా? అట్టివారు అయినా నీ రూపమును చూడగోరి నిర్మల మనస్సు గలవారెవరును లేరా?

విశేషము = రామాయణమున రాము డరణ్యమునకు బయలుదేరు సమయమున రాముని విరహమును భరింపలేని లక్ష్మణుడు తాను కూడ వచ్చెదనని కోరినాడు. సీత లక్ష్మణుని కోరికను తీర్చుమని రామునితో చెప్పినది. తరువాత విభీషణ శరణాగతి సమయమున సుగ్రీవాదులు కొంతమంది శత్రుపక్షీయుడు కనుక విభీషణుడు చేర్చతగినవాడు కాడని చెప్పిరి. అపుడు హనుమంతుడు విభీషణుడు ధార్మికుడు కనుక చేర్చతగినవాడు. అతని ధార్మికత్వమును నేను ప్రత్యక్షముగా చూచితిని. అని చెప్పెను. దాని నాధారముగా తీసుకొని రాముడు విభీషణుని స్వీకరించాడు. అట్లే హనుమంతుని వాక్యములచే సుగ్రీవుని కూడ స్వీకరించాడు. అట్లు నా బోటి దీనుని స్వీకరించమని చెప్పు పెద్దలెవరను లేరా? అని అయ్యగారు రాముని ప్రశ్నించినారు.

501. బేగడ = ఆది

ప॥ లోకా వనచతురా – పాహిమాం॥ లోకా॥

అ॥ సాకేతాధిప – సరసగుణాప్రమేయ
సరసిజాసన సనందన వందితాంఘ్రి
యుగ పదనిర్జిత ముని శాప॥ లోకా॥

చ॥ రాకాబ్జ ముఖ ప – రాకా చెంతకు
రాక తన కోర్వ తరమా?
పాకారి వినుత నీకాసించితి
గాక నేనన్యమెంచను నీదువాడనయ్య రామయ్య॥ లోకా॥

2 నీలా కృతి గల – నీలావణ్యము
నీలా గని కనిపింపవే
బాలార్కాభ సుచేలావృతన
న్నేలుకో మనసు రాదిక – తాళజాలన్యాయమారామ॥ లోకా॥

3. చేపాదిగ పది రూపాలను గొను
చాపాలంకృత సుందర అవ
నీ పాద్భుతమగు నీపాద మెగతి
శ్రీపతే వరద పాలిత త్యాగరాజ సార్వభౌమా॥ లోకా॥

తాత్పర్యము :

ఇందు పల్లవి మాత్రం సంస్కృతము. లోకావన చతురుడా నన్ను రక్షించు. అయోధ్యాపతీ, మంచిగుణముల వాడా, కొలత కందని వాడా, బ్రహ్మ సనందనాదులచే నమస్కరింపమడు పాదములవాడా! పాదముతో గౌతమ శాపమును తీర్చిన వాడా, చంద్రవదనా, నా చెంతకు వచ్చుటకు నీకు పరాకా? నీవు రాక నేనోర్వగలుగుదునా? ఇంద్రవినుతా! నిన్ను దప్ప అన్య మెరుగను. నీ అందము నొక్కసారి చూపించుము. నన్నేలుకో నీ మనసురాదా? చేప మొదలు పది రూపములు దాల్చిన వాడా, ధనుర్ధారీ, భూపాలా, ఆశ్చర్యకరమగు నీ పాద మేగతి అని నివేదనము.

502. షణ్ముఖ ప్రియ = ఆది

ప॥ వద్దనే వారు లేరు॥ వద్దనే॥

అ॥ అద్దంపు మోమును జూడనే– ననయ మంగలార్భితే చూచి॥ వద్దనే॥

చ॥ కోరిక లిలలో దివిలో – కొంచమైన లేని నామనసు
దారి తెలియు దైవము నీవు సుమీ॥
త్యాగరాజ హృద్భూషణ! నినువినా॥ వద్దనే॥

తాత్పర్యము :

రామా! నీ ముఖము చూచే ఆశ కలిగి అది తీరక నిరంతరమును దుఃఖ పడుచున్నాను. దుఃఖపడవద్దని ఆదరించువారు లేరు. ఈ లోకములో కాని స్వర్గములో కాని దేనినీ కోరను. ఈ నామనసు తెలిసి నా మనసు నందున్న నీవు తప్ప నన్నాదరించువారు లేరు. అని గారి విజ్ఞాపనము.

503. వరాళి = చాపు.

ప॥ వద్ద యుండేదే బహుమేలు – వారి జాఱ॥ వద్ద॥

అ॥ అద్దంపు మోముగల రంగ అనుపమ మోహనాంగ॥ వద్ద॥

చ॥ బంగారు పూల బూజింతు – బాగుగా నిన్ను సేవింతు
శృంగారించి కౌగిలింతు – చిరకాల మారాధింతు॥ వద్ద॥

2 ముంగలనే నటియింతు – ముద్దు మాటల దేలింతు
సంగీతము వినిపింతు – సారెకు నే సంతోషింతు॥ వద్ద॥

3 సత్తామాత్రమా నీ యందు – చిత్తముగాని పోదెందు
తత్తరము దీర్చుకొందు – త్యాగరాజ సఖుడందు॥ వద్ద॥

తాత్పర్యము :

రామా! నీవు నీ అద్దపు చెక్కిళ్లుగల ముఖముతో మోహనాంగుడవై నా వద్ద ఉండుట చాలమంచిది. బంగారు పూలతో నిన్ను పూజిస్తాను. సేవిస్తాను. నిన్ను అలంకరించి కౌగలించుకొంటాను. ఆరాధిస్తాను. నీ ముందు నృత్యం చేస్తాను. మంచి మాటలు చెప్పుతాను. సంగీతం వినిపిస్తాను. నేను సంతోషిస్తాను. నీకు సంతోషం కలిగిస్తాను. నా కింతకన్న ఏమి కావాలి? నీ కంతకన్నా ఏమి కావాలి. నీవు సత్తా మాత్రుడవు. త్యాగరాజ సఖుడవు.

విశేషము = సత్తా మాత్రుడనగా భగవంతుని స్వభావము సత్తా మాత్రమే = ఉండుట ఒక్కటే గుణము. దానిని శుద్ధసత్త్వము అని కూడ అందురు. తక్కిన అందరు దేవతలకు పుట్టుట పెరుగుట మారుట తుదకు నశించుట కలవు. నారాయణునకు మాత్రము పుట్టుట గిట్టుట పెరుగుట మారుట లేక ఉండుట మాత్రమే కలదు. అందుచేత ఆయన సత్తామాత్రుడు. చతుర్ముఖ బ్రహ్మకు నారాయణుని నాభి పద్మమున పుట్టుట కలదు. రాబోవు కల్పమందు అతడుండడు. హనుమంతుడు బ్రహ్మ అగునని ప్రసిద్ధి. శివుడును ''లలాటాత్ త్ర్యక్షః శూలపాణి స్సమభవత్'' = విష్ణువు యొక్క నుదుటి నుండి మూడు కనులతో శూలపాణి పుట్టెను॥ అని వేదవాక్యము. కనుక శివుడును సత్తామాత్రుడు కాడు. అందుచేతనే అయ్యగారు చాలచోట్ల'' సత్తా మాత్రమా'' అని సంబోధించినారు రాముని. మరి అవతరించుట అవతారము చాలించుట కలవుకదా అనిన? వాటిని ఋషులు చావుపుట్టుకలుగా చెప్పలేదు. ఆవిర్భావ తిరోధానము లన్నారు. ఆ రెండును ఆయన

సంకల్పములన్నారు. అవతార మనగా దిగుట అని అర్థము. ఆలోకము నుంచి ఈ లోకమునకు దిగినాడంతే. గీతలో ''ప్రకృతిం స్వామవష్టభ్య సంభవామ్యాత్మ మాయయా'' = నేను నా సహజ ప్రకృతిని పట్టుకొనియే నామాయతో నేను సంభవించుచున్నాను అని చెప్పుటచే అవతారములయందును ఆయన సత్తామాత్రుడే.

504. శహన = ఆది (ప్రహ్లాద భక్తి విజయము)

ప॥ వందనము రఘు – నందనా సేతు
బంధనా భక్త – చందనా రామ॥ వందనము॥

చ॥ శ్రీదమా నాతో – వాదమా నే
భేదమా ఇది – మోదమా రామ॥ వందనము॥

2 శ్రీరమాహృ – చ్చారమా బ్రోవ
భారమా రాయ – బారమా రామ॥ వందనము॥

3 వింటిని నమ్ము – కొంటిని శర
ణంటిని ర – మ్మంటిని రామ॥ వందనము॥

4 ఓడను భక్తి – వీడను ఒరుల
వేడను నీ – వాడను రామ॥ వందనము॥

5 కమ్మని విడె – మిమ్మని వరము
కొమ్మని పలుక – రమ్మని రామ॥ వందనము॥

6 న్యాయమా నీకా – దాయమా ఇంత
హేయమా మని – గేయమా రామ॥ వందనము॥

7 చూడు మీ కా – పాడుమీ మమ్ము
పోడిమిగా – కూడుమీ – రామ॥ వందనము॥

8 క్షేమము దివ్య – ధామము నిత్య
నేమము రామ నామము రామ॥ వందనము॥

9 వేగరా కరుణా – సాగర శ్రీ
త్యాగరాజహృ – దాకరా రామ॥ వందనము॥

తాత్పర్యము :

ఇందు ప్రహ్లాదుడు సాక్షాత్కరించిన హరికి రామభావనతో వందన మర్పించు చున్నాడు. ఓ రఘునందనా, ఓ సేతు బంధనా! ఓ భక్త చందనా = భక్తులకు చల్లనివాడా! వందనము. సిరుల నిచ్చువాడా! నాతో నీకు వాదమా? నేను నీకు భేదమా? ఇట్లుండుట నీకు సంతోషమా? లక్ష్మి హృదయమందు సంచరించువాడా! నన్ను రక్షించుట నీకు భారమా? నీకు నాకు మధ్యలో రాయబారమా? నిన్ను విన్నాను, నమ్ముకొన్నాను, శరణన్నాను, రమ్మన్నాను. నేను ఓడిపోను, భక్తిని విడువను, ఇతరులను వేడుకొనను, నీ వాడను. కమ్మని తాంబూలమిమ్మని నన్ను అడుగుము. వరము తీసికొమ్మని నాతో పలుకుటకు రమ్మని వందనము. నన్ను బ్రోవకుండుట న్యాయమా? ఇట్లుంటే నీకేమైనా లాభమా? నేనింత హేయమా? మునులచే గానము చేయదగువాడా! నన్ను చూడు, కాపాడు, ననుగట్టిగా కూడు, నీ రామనామము నాకు క్షేమము, క్షేమమే కాదు దివ్యధామము, నేను విడువని నియమము. ఓ కరుణాసాగరా! త్యాగరాజ హృదయనివాసా! వేగముగా రమ్ము. అని అయ్యగారు రూపొందించిన ప్రహ్లాదుడు స్వామిని వేడుకొన్నాడు.

విశేషము = ఇందు చక్కగా అంత్యప్రాసలు కూర్చబడినవి. ఇందు అన్వయపూర్తి కొరకు 2,3, చోటల అధ్యాహారము లవసరమైనవి. = పదములు చేర్చుట. ''శ్రీదమా'' హృచ్చారమా'' ''మునిగేయమా'' అని రాముని నపుంసకలింగముతో సంబోధించినారు. ఇది ఉపనిషన్మర్యాదగా భావించవచ్చును. ''సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ'' ఏక మేధాద్వితీయం బ్రహ్మ'' ఇత్యాది వాక్యముల యందు మనస్సున ఉద్దిష్టము పుంలింగ మయినను నపుంసకముగనే చెప్పబడినది.

505. స్వర భూషణి = రూపకం

ప॥ వరదరాజ నిన్నే కోరి – వచ్చితిరా మ్రొక్కేరా

అ॥ సురలు మునులు భూసురులు – చుట్టి చుట్టి సేవించే॥ వరద॥

చ॥ వరగరి వైకుంఠమట – వర్ణింపదరము గాదట – ని
ర్జరులను తారకములలో – చంద్రుడై మెరయుదువట
వరత్యాగరాజ వినుత – గరుడ సేవ జూడ॥ వరద॥

తాత్పర్యం :

త్యాగరాజ స్వామి కంచి వెళ్లినారు. ఆనాడు వరద రాజస్వామి యొక్క గరుడోత్సవము. అనగా గరుడ వాహనం మీద స్వామి ఊరేగుట. ఆ సమయంలో ఆలయంలో అయ్యగారు స్వామిని దర్శించి తన్మయులై పాడిన పాట ఇది. ఓవరదరాజా! నిన్ను దర్శింప కోరి వచ్చాను. మొక్కుచున్నాను. ఈ కంచి, దేవతలు మునీశ్వరులు, బ్రాహ్మణులు చుట్టి చుట్టి సేవించే మహా దివ్య క్షేత్రము. ఈ కొండయే వైకుంఠము. దీనిని వర్ణింపతరము కాదు. నీ చుట్టూ ఉన్న దేవతలు నక్షత్రములు. నీవు ఆ నక్షత్రములలో చంద్రుడవు. ఇట్టి నీగరుడసేవను దర్శించుటకు వచ్చినాను. అని. ''కంచిగరుడసేవ'' అని ఒకమాట జనం వాడుకలో నున్నది. అనగా అది అంత ప్రధాన మన్నమాట.

విశేషము = భూమిపై నున్న విష్ణుక్షేత్రాలలో కంచి మొట్ట మొదటిది. ''కృతే వరదరాజశ్చ- త్రేతాయాం రంగమందిరం। ద్వాపరే శ్రీ జగన్నాధః కలౌ వేంకటనాయకః'' = కృతయుగంలో కంచి వరదరాజ స్వామి, త్రేతా యుగములో శ్రీరంగనాధుడు, ద్వాపర యుగంలో జగన్నాధుడు, కలియుగంలో వేంకటేశ్వరుడు అని. బ్రహ్మ భూమికి వచ్చి చేసిన అశ్వమేధ యజ్ఞ ఫలంగా విష్ణు దేవుడు బ్రహ్మకు సాక్షాత్కరించినాడు. బ్రహ్మ ఆదేవునక్కడ ప్రతిష్ఠించి చాలా కాలం ఆరాధిస్తూ ఉండిపోయి అనేకము లయిన ఉత్సవములను అక్కడ నెలకొల్పినాడు. వాటిలో గరుడోత్సవ మొకటి. అందుచేత దానికంత ప్రాధాన్యము. కల్యాణోత్సవము కూడ బ్రహ్మ మొదలు పెట్టినదే. అనంతర కాలములో తక్కిన విష్ణు ఆలయాలయాల వారు దాని ననుసరించినారు. అందుచేతనే ఆ ఉత్సవమును ''బ్రహ్మోత్సవము'' అని అందురు. ఇట్టి వరద రాజును దర్శింప వచ్చి అయ్యగారు పాడిన పాట ఇది.

506. విజయశ్రీ = ఆది

ప॥ వరనారద – నారాయణ – స్మరణానందానుభవము గల॥ వర॥

అ॥ శరదిందు నిభావ ఘనానఘ – సారముగాను బ్రోవు మిక॥ వర॥

చ॥ సకలలోకములకు సద్గురు వనుచు – సదా నేనతడనుచు హరియు
ప్రకటంబుగ కీర్తి నొసంగెనే – భావుక త్యాగరాజనుత॥ వర॥

తాత్పర్యం :

ఇది నారదుని స్తుతించు కృతి. శ్రేష్ఠుడైన ఓ నారదా! నారాయణ స్మరణములోని ఆనందము నను భవించు ఓ నారదా! శరదృతువునందు చంద్రుని వలె తెల్లని దేహము గల ఓ నారదా! అనఘా పాపము లేని వాడా! నన్ను చక్కగా రక్షింపుము. నారదుడనగా జ్ఞానము నిచ్చువాడని అర్థము. అందుచేత సకల లోకములకును నీవు సద్గురుడవు. హరి ''నేనే నారదుడను'' అని నీకు కీర్తి నిచ్చినాడు. అట్టి మంగళకరుడైన ఓ నారదా! నన్ను రక్షింపు మని అయ్యగారు నారదుని ప్రార్థించిరి.

విశేషము = నారదుడనగా జ్ఞానము నిచ్చువాడని అర్థమును బట్టి నారదుడు సమస్త లోకములకును గురువు. గురు వనగా ఆచార్యుడు. ''ఆచార్య స్సహరి సాక్షా।చ్ఛరరూపీ నసంశయఃఁ = ఆచార్యుడనగా మన కనులముందు తిరుగాడే ఆ హరియే. సంశయములేదు''. అనే శాస్త్ర వాక్యమును బట్టియు, ఇంకా గీతలో విభూతి యోగంలో ''దేవర్షీణాంచ నారదఃఁ = దేవర్షులలో నేను నారదుడను = అని భగవానుడు చెప్పినాడు. ఈ భావమునే త్యాగయ్యగారు ''సదానే నతడనుచు హరియు'' అని చెప్పినారు.

507. సుప్రదీపం - ఆది

ప॥ వరశిఖి వాహన – వారిజలోచన
కురు శం తనుజిత – కుసుమ శరాయుత॥ వరశిఖి॥

అ॥ శరజ భవాంబుద – వాహనాది
సురనుత పాద – సుగుణ కుమార॥ వరశిఖి॥

చ॥ తారక సూరప – ద్మాసురతూల
దహన భూధర సుతా – నందన ధీర
శ్రీ రఘు వర భాగి – నేయాప్తమం
దార! గుణాకర – త్యాగరాజార్చిత॥ వరశిఖి॥

తాత్పర్యము :

ఇది కుమారస్వామి స్తుతి పరమయిన సంస్కృతకృతి. ప్రతి పదార్థము వ్రాయబడుచున్నది. వరశిఖివాహన = చక్కని నెమిలి వాహన మైనవాడా! తనుజిత కుసుమశరా యుత = పదివేల మన్మథులను జయించిన శరీర శోభకలవాడా!

శరజ----సురనుతపాద = బ్రహ్మ ఇంద్రుడు మొదలగు దేవతలు నుతించు పాదముల వాడా! గుణములవాడా! కుమారా! తారక ---- దహన = తారకాసురుడు సూరపద్ముడనెడి దూది పింజలకు నిప్పైనవాడా! భూధర సుతానందన = పార్వతీ సుతా! ధీరుడా! శ్రీ రఘు వరభాగినేయ = రాముని మేనల్లుడా! ఆప్త మందార = ఆప్తులకు కల్పవృక్షమా! సుగుణాకర = సుగుణముల గనీ! త్యాగరాజార్చితా! శం = సుఖమును కరు = కలిగించుము. అని ప్రార్థనము.

508. ఘుర్జరి = ఆది

ప॥ వరాలందు కొమ్మని - నా యందు
వంచన సేయ న్యాయమా॥ వరా॥

అ॥ సురా సుర వినుత రామ నామన
సు - భక్తినె కోరియుండగ నను॥ వరా॥

చ॥ మనసున నిజముగ నమ్మిన వారి
మనసు కొంచె ఫలమాసించగరా
దనుచు ఘనుని జేసిన నీ బిరుదుకు
కనక కశిపు సుతుడు సాక్షిగాదా॥ వరా॥

2 అవివేకముతో - తెలిసి తెలియకను
భవసుఖముల కాసించిన గాని
ధ్రువమైన ఫలమొసంగు నీ శక్తికి
ధ్రువుడు సాక్షిగాడా రామనను॥ వరా॥

3 చరా చరాత్మక - సురపూజిత ఇక
వరాకు లేకను సతతము నీద
యరావలె ననుచు కోరిన శ్రీత్యా
గరాజునిపై కృప లేక నను॥ వరా॥

తాత్పర్యము :

రామా! వరాలందుకో అని చెప్పి ఇప్పుడు నన్ను వంచన చేయుట న్యాయమా? సురాసుర వినుత = దేవతల రాక్షసుల పొగడ్త కన్నవాడా! రామా! నా మనస్సు ఎప్పుడును

నీ భక్తినే కోరుచున్నది. నన్ను వంచించుట న్యాయమా? నిన్ను నిజముగా నమ్మిన వారి మనస్సు కొద్దిపాటి ఫలములను కోరదు. ఇట్టివారిని రక్షించే నీ బిరుదుకు ప్రహ్లాదుడు సాక్షి. తెలిసో తెలియకనో ధ్రువుడు సంసార సంబంధ సుఖములకు నిన్ను గూర్చి తపస్సు చేశాడు. వానికి ధ్రువ (శాశ్వత) పదం ఇచ్చావు. ఇట్టి నీ శక్తికి ధ్రువుడు సాక్షి. చరాచరములన్నియు నీ రూపమే అయిన, దేవతల పూజలందు ఓరామా! ఇక పరాకు చేయక నీ దయనే కోరిన నాపై దయజూపక నన్ను వంచన చేయవద్దు అని ప్రార్థనము.

విశేషము = ''వరాలందు కొమ్ము'' అని అనుట ధ్రువ ప్రహ్లాదులను రక్షించుటయే. సహజ భక్తితో ఇతర అల్ప ఫలములను కోరక శాశ్వత సుఖప్రదమైన పదమునే కోరిన ఉత్తమ భక్త శ్రేణికి చెందిన వాడు ప్రహ్లాదుడు. అల్పమైన తండ్రి తొడ దొరకలేదనే కాంక్షతో తపస్సు చేసిన వాడు ధ్రువుడు. ఇరువురకు వరములిచ్చాడు భగవానుడు. ఈ వరదానమే అందుకొమ్మని చెప్పుట. అది తనపై చూపుట లేదు. ఇదే వంచన జేయుట. ఇది న్యాయము కాదని నిర్బంధ ప్రార్థనము.

509. హరి కాంభోజి = రూపకం

ప॥ వల్ల గాదనక సీతా – వల్లభా బ్రోవుమునా వల్ల॥

అ॥ అల్లనాటి భక్త చరిత – మెల్ల వ్రాయనేల రా॥ వల్ల॥

చ॥ స్తంభమునను తరుమరుగున – డింభుడై యశోదయొడిని
దంభుడైన ముచికుందుని – డాసి మరుగుచు
సంభవించి యుగయుగమున – సరస త్యాగరాజ వినుత
కుంభక రేచక విధులను – కోరి బ్రోచినావు–నా॥ వల్ల॥

తాత్పర్యము :

రామా! నావల్ల కాదు అనకుండా నన్ను రక్షించు. వల్ల కాదు అందువా? నీకు వల్ల కానిది లేదు. నీ పూర్వ చరిత్రలను వ్రాయు మందువా? స్తంభమున పుట్టి ప్రహ్లాదుని గాచితివి. చెట్టు చాటున నిలచి వాలిని వధించి సుగ్రీవుని బ్రోచితివి. యశోద ఒడిలో శిశువువై కూరుచుంటివి. ముచికుందునిడాగి, రక్షించితివి. ఇట్లే అనేక శక్తులతో యుక్తులతో ప్రతియుగమందు నవతరించి ప్రాణాయామధ్యానాది అష్టాంగ యోగములు తెలిసిన వారిని రక్షించితివి. ఇక నీవల్ల కాని దేమియు లేదు కనుక అట్లనక నన్ను బ్రోవుము.

విశేషము = ఇందు అయ్యగారు చాల కష్టసాధ్యములైన భగవానుని కృత్యములను ఉదాహరించినారు. సత్యభామ తండ్రి అయిన సత్రాజిత్తునకు కృష్ణుడు శమంతకమణి నిచ్చినాడు. సత్రాజిత్తు మేనల్లుడు సత్యభామను తన కీయ లేదను కోపముతో ఒకనాటి రేయి సత్రాజిత్తును చంపి శమంతకమణిని చేజిక్కించుకొని పరారీ అయినాడు. ఇది తెలిసి కృష్ణుడు వానిని వెంటాడినాడు. వాడొక వైపుగా ముందు పరుగిడుచున్నాడు. వెంటాడుచున్న కృష్ణుడు ఒక పర్వతగుహలో దూరినాడు. దానిలో అంతకు ముందు ముచికుందుడను భక్తుడు యోగముతో భగవానుని పెక్కుకాలము పాసించి నిదురపోవుచున్నాడు. కృష్ణుడందు దూరి ముచికుందుని వెనుక దాగి ఉన్నాడు. ముచికుందునికి ఒక వర మున్నది. అతడు నిదురలేచు సరికి అతని కన్నుల ముందు ఎవడుండునో వాడు భస్మమగును. సత్రాజిత్తు మేనల్లుడు ఒకవైపు నుంచి వచ్చి ఆ పర్వత గుహలో దూరినాడు. అదే సమయమున ముచికుందుడు నిదురలేచినాడు. ద్రోహి వాని కంటబడి వెంటనే భస్మమయినాడు. కృష్ణుడు భక్తుడగు ముచికుందుని ముందుకు వచ్చి మోక్ష మిచ్చినాడు. భగవానుడు అద్భుతమైన యుక్తితో ద్రోహిని భస్మము చేయించినాడు. భక్తుని బ్రోచినాడు. ఇట్టివానికి వల్లగాని దేమున్నది.

510. కల్యాణి = ఆది (ప్రహ్లాద భక్తి విజయము)

ప॥ వచ్చును హరి నిన్ను జూడ – వచ్చును హరి నిన్ను జూచి
మెచ్చును హరి నిన్ను జూచి॥ వచ్చును॥

అ॥ కుచ్చిత విషయాదుల – చిచ్చురీతి నెంచి నీవు
హెచ్చుగాను మాస్వామిని – మచ్చికతో నుతియింపుము॥ వచ్చును॥

చ॥ ధీరుని, సీతారామావ – తారుని, సకలలోకా
ధారుని, నిజభక్తమం – దారుని నుతియింపవయ్య॥ వచ్చును॥

2 ధన్యుని వేల్పులలో మూ – ర్ధన్యుని ప్రతిలేని లా
వణ్యుని, వరమకా – రుణ్యుని నుతియింపవయ్య॥ వచ్చును॥

3 ఏ జప తపములకు రాడు – యాజనాదులకు రాడు
రాజిగానుతించు త్యాగ – రాజనుతుని నీ వేళ॥ వచ్చును॥

తాత్పర్యము :

వారిధి మధ్యలో భగవద్దర్శనమునకు తహతహ పడుచున్న ప్రహ్లాదునితో సముద్రుడనుచున్న మాటలివి. ప్రహ్లాదా! నిన్ను చూచుటకు హరి వస్తాడు. నిన్ను మెచ్చుకొంటాడు. నుతిస్తూ ఉండు. కుచ్చితములైన ఐహిక విషయాలను నిప్పుగా తలచి నీవు మచ్చికతో స్మరిస్తూ ఉండు. ధీరుడు, సీతారామావతారుడు, సకలలోకాధారుడు, భక్తమందారుడు, ధన్యుడు, దేవతా శ్రేష్ఠుడు, అతిసుందరుడు, పరమ కరుణ గలవాడు, అయిన స్వామిని నుతిస్తూ ఉండు. జప తపాలకు చిక్కడు, యజ్ఞములకు చిక్కడు, అట్టి త్యాగరాజనుతుడు (రాముడు) ఒక నామస్మరణకే వచ్చి దర్శన మిస్తాడు కనుక, నామస్మరణము చేస్తూ ఉండు. అని నారదుని ఉపదేశము. ఇందు స్మరణ ప్రాధాన్యము సూచింపబడినది.

511. రాగపంజరం - చాపు తాళం

ప॥ వరదా! నవనీతాశా! పాహి – వరదానవమదనాశా! ఏహి॥ వరదా॥

అ॥ శరదాభ! కరవిధృత శరా శర – శరదాశుగ!–సుమశరదా శరహిత॥ వరదా॥

చ॥ ద్విర దాద్భుతగమన పురదహన నుత! స్మర దాభరణా! జరావనపర!
గరదా శన తురగరధా! ద్యుతిజిత వరదా సజనాగ్రే సర త్యాగరాజ॥ వరదా॥

తాత్పర్యము :

ఇది సంస్కృతకృతి. కనుక ప్రతి పదార్థము వ్రాసెదను. వరదా=వరము లిచ్చువాడా, నవనీతాశా=వెన్న తిన్న వాడా, పాహి=రక్షించుము, వరదానవమదనాశా=దానవుల మద మణచిన వాడా, ఏహి=రమ్ము. శరదాభ=మేఘపు కాంతివాడా, కరవిధృత శర=చేత బాణములు బట్టినవాడా, ఆశరశరదాశుగ=రాక్షసుల నెడు మేఘములకు గాలి అయిన వాడా, సుమ శరదా=మన్మధుని ఇచ్చిన వాడా (మన్మధుని తండ్రీ అని భావము) ఆశ రహిత=ఆశలేని వాడా, (ఇందు ఆకారాంత శబ్దమగు ఆశా శబ్దము అకారాంతముగా నున్నది. ఇది అయ్యగారి స్వాతంత్ర్యము). ద్విరదాద్భుత గమన=ఏనుగువంటి ఆశ్చర్యమైన నడక కలిగినవాడా? పురదహన నుత=త్రిపురములను దహించిన శివునిచే నుతింపబడిన వాడా! స్మరదాభరణా=మెరయుచున్న ఆభరణములుగలావాడా! అజరా వనపర=దేవతలను రక్షించుటయం దాసక్తుడా! గరదాశన తురగరధా=సర్పములను

భక్షించుగరుడుడు రథమైన వాడా! ద్యుతిజిత వరదాసజనా గ్రేసర= నీ కాంతిచే పరవశులైన భక్తా గ్రేసరులు కలవాడా! త్యాగరాజవరదా= త్యాగరాజునకు వరము లిచ్చిన వాడా! రమ్ము రక్షించుము. అని ప్రార్థనము.

512. ధరజు = చాపు

ప॥ వరమైన నేత్రోత్సవమును గనుగొన
తరణి వెడలె చూడరే॥ వర॥

అ॥ ధరను విధీంద్రులు – కరచామరములను
నిరుగడలను మెఱయ
నిరతము గగనమున – సురల చేతి
విరుల వాన కురియ॥ వర॥

చ॥ పరమ భాగవత చయములు – బాగుగా
హరి నామములు సేయ
దురమున ప్రహ్లా – దుడు కనికరమున
హరియని తలపోయ॥ వర॥

2 వారిధి రాజు నా – రద సనకాదులు
సారెకు నుతియింపగా
వారము శ్రీ త్యాగ – రాజ వరదు డల్ల
వారల గని బ్రోవగా॥ వర॥

తాత్పర్యము :

ఇది బహుశః ప్రహ్లాద భక్తి విజయము లోనిది కావచ్చు. ప్రహ్లాదునకు సముద్రాంతర మందు హరి దర్శన మిచ్చాడు. ఆ కనుల పండుగను చూచుటకు సమస్త దేవతలును వచ్చిరి. అందు సూర్యుడు వచ్చుట ఆశ్చర్యము. అందుచేత దీనినే ప్రత్యేకముగా తీసుకొని అయ్యగారు ''తరణి వెడలె చూడరే'' అనినారు. బ్రహ్మ , ఇంద్రుడు చామరములు పట్టి హరికి రెండు ప్రక్కల విసరు చున్నారు. దేవతలు ఆకసము నుండి పుష్ప వృష్టి కురుస్తున్నారు. పరమ భాగవతులు కూడి హరి నామ సంకీర్తనము చేస్తున్నారు. ప్రహ్లాదుడు కరగి స్మరణము చేస్తున్నాడు. ఇంతే కాక సముద్రుడు, సనక సనందనాదులు స్తోత్రములు

చేస్తున్నారు. ఇందరిని హరి అనుగ్రహించి చూస్తున్నాడు. ఈ నేత్రోత్సవం చూచుటకు సూర్యుడు వచ్చినాడు.

విశేషము = ఈ వర్ణన మంతయు అయ్యగారి ఊహ. ఈ వర్ణనమును అతిశయోక్తి అలంకార మనవచ్చును. సమృద్ధి మద్వర్ణన రూపమగు ఉదాత్తాలంకార మనవచ్చును. ప్రహ్లాదుని భక్తిని బట్టి స్వభావోక్తి అలంకార మన వచ్చును. ఇంత అలంకార సమ్మేళనముతో అయ్యగారా దృశ్యమును మన కన్నులకు గట్టినారు.

513. చెంచు కాంభోజి = ఆది

ప॥ వరరాగలయజ్ఞులు తామనుచు
వదరేరయ్యా---- వర॥

అ॥ స్వర జాతి మూర్ఛన భేదము
స్వాంతమందు దెలియక యుండిన॥ వర॥

చ॥ దేహోద్భవంబగు నాదముల్
దివ్యమౌ ప్రణవాకారమనే
దాహం బెరుంగని మానవుల్
త్యాగరాజనుత ఏ చేరు రామ॥ వర॥

తాత్పర్యము :

అయ్యగారు తన కాల మందున్న సంగీతజ్ఞులను విమర్శించుచున్నారు. సూక్ష్మంగా చెప్పవలసి వస్తే ఏమియు తెలియక పోయినా అన్నీ మాకే తెలుసును అని వదరుతూ ఉంటారు. అని. సంగీతానికి మూల పదార్థములు స్వర, జాతి, మూర్ఛనా భేదములు వీటి స్వరూపములు లక్షణములు, నిరుక్తులు. ఇవి ఏమియు తెలియకనే మా అంత వాళ్లులేరని అహంకరిస్తూ ఉంటారు. దేహములో పుట్టిన నాదములు అన్నిటికిని మూలములు. నాభియందు పుట్టినది పర। హృదయమున పుట్టినది పశ్యంతి। కంఠమున బుట్టినది మధ్యమ। జిహ్వాయందు బుట్టినది వైఖరి। ఇవన్నియు ఓంకార స్వరూపములు, ఓంకారమూలకములు। ఈ విషయములు తెలుసుకొనే దాహము కూడ లేనివారు ఇటువంటి వారు జగత్తుకు బాధాకరులు. అని అయ్యగారి ఆవేదనము.

514. శంకరాభరణం = త్రిశ్రలఘువు (దివ్యనామము)

ప॥ (వర) లీల గానలోల । సురపాల సుగుణ జాల
భరిత – నీల గళ హృదాలయా శ్రుతిమూల సు
కరుణాలవాల పాలయాశుమాం॥ వర॥

చ॥ సుర వందితాప్తత బృంద
వర మందర ధర సుందర కర కుం
దరద నేందు ముఖ సనంద ననుత
నంద నంద నేంది రావనా వర॥

2 (ముని) చింతనీయస్వాంత నర కాంతక నిగ
మాంత చరణ సుకాంత కుశల
వాంత రహిత దాంత కుజనా
నంత సంతతాంతకస్తుతా॥ వర॥

3 (వర) పూష వంశ భూష నత పోషణ మృదు
భాషణ రిపు భీషణ వర
వేష నగపేషణ
వర శేష భూష తోషితానఘ॥ వర॥

4 (సుక) వీశ హృన్నివేశ జగదీ
శకుభవపాశ రహిత శ్రీశ సురగ
ణేశ హిత జలేశ శయన
కేశవా శమీశ దుర్లభ॥ వర॥

5 (రణ) ధీర సర్వసార సుకుమార బుధవి
హార దనుజ నీరధరస
మీరణ – కరుణారస పరిపూర్ణ
శూర జార చోర పాహిమాం॥ వర॥

6 (నర) రక్షక నీరజాక్ష వరరాక్షస మద
శిక్షక సురయక్షా వన
ఋక్ష పతి నుతా క్షహరణ
పక్ష దక్ష శిక్షకప్రియా॥ వర॥

7 (రఘు) రాజ త్యాగరాజ నుత
రాజ దివసరాజ నయన భో
జగదవనా జనకరాజసుతావి
రాజ రాజ రాజ పూజితా॥ వర॥

తాత్పర్యము :

ఇది సంస్కృత కృతి. విశేషణ రూపములో నున్న సంబోధన ములే అన్నియును. అందుచేత ప్రతి పదార్థము వ్రాయబడుచున్నది. వరలీల = శ్రేష్ఠమైన లీలలు గలవాడా! గానలోల = గానమందాసక్తి గలవాడా, సురపాల = దేవతలను పాలించువాడా, సుగుణజాల భరిత= గుణసమూహమును భరించిన వాడా, నీలగళ హృదాలయా= శివుని హృదయము నివాసమైనవాడా, శ్రుతిమూల= వేదమునకు మూలపురుషుడా, సుకరుణాల వాల= మంచి కరుణకు స్థానమైన వాడా, ఆశు= శీఘ్రముగా, మాం= నన్ను, పాలయ= రక్షించుము. సురవందిత= దేవతలచే నమస్కరింపబడినవాడా, ఆప్తబృంద= ఆప్తబృందము కలవాడా, వర మందర ధర = గొప్ప మందరమును ధరించిన వాడా, సుందరకర= అందమయిన హస్తము వాడా, కుందరదన= మల్లెల వంటి పల్లు కలవాడా, ఇందుముఖ= చంద్రుని వంటి ముఖము వాడా, సనందన నుత= సనందనునిచే పొగడబడిన వాడా, నందనందన= నందుని కొడుకా, ఇందిరావన= లక్ష్మీ దేవిని రక్షించువాడా. మునిచింతనీయ స్వాంత= మునుల చేత ధ్యానింప దగిన మనస్సు కలవాడా, నరకాంతక= నరకాసురుని సంహరించిన వాడా, నిగమాంత చరణ= వేదాంతముల యందు చరించువాడా, సుకాంత కుశలవ= కుశలవుల నిష్టపడినవాడా, అంతరహిత= నాశము లేనివాడు, దాంత కుజన= దుర్జనుల నడచినవాడా, అనంత= అంతులేని మహిమలవాడా, సంతతాంతకస్తుతా= ఎల్లప్పుడు యమునిచే స్తుతింప బడువాడా. వరపూష వంశభూష= గొప్ప సూర్య వంశమునకు ఆభరణమైన వాడా, నతపోషణ= నమస్కరించినవారిని రక్షించువాడా, మృదు భాషణ= మెత్తగా భాషించువాడా, రిపు భీషణ= శత్రువులకు భయంకరుడా, నరవేష= మానవుని వేషము వాడా, నగ పేషణ= చెట్లను కూల్చిన వాడా, వర శేష భూష= శ్రేష్ఠుడైన శేషునకు భూషణమైనవాడా, తోషితానఘ= పాపము లేని వారిని సంతోష పెట్టువాడా. సుకవీశ హృన్నివేశ= మంచి కవుల హృదయ మందుండు వాడా, జగదీశ= జగములకు ప్రభువా? కుభవపాశరహిత= చెడు సంసార బంధము లేనివాడా, శ్రీశ= లక్ష్మీ పతీ, సురగణేశ హిత= దేవేంద్రునకు హితమైన వాడా, జలేశ శయన = సముద్రమందు శయనించువాడా, కేశవా= కేశవుడా, శమీశ దుర్లభ= ఇంద్రియ నిగ్రహము చేసిన వారికిని దుర్లభమగువాడా, రణధీర= యుద్ధ మందు

చాక చక్యము కలవాడా, సర్వ సార=అన్నిటిలోను సారవంతుడా, సుకుమార=సుకుమారుడా, బుధ విహార=పండితుల హృదయమందు విహరించువాడా, దనుజ నీర ధర సమీ రణ=రాక్షసులనెడు మేఘములకు గాలి అయిన వాడా, కరుణా రస పరిపూర్ణ=దయనిండిన వాడా, శూరుడా, జారుడా, చోరుడా, మాం=నన్ను పాహి=రక్షించుము. నరరక్షక=నరులను రక్షించువాడా, నీరజాక్ష=పద్మము వంటి నేత్రములవాడా, వర రాక్షస మదశిక్షక=గొప్ప రాక్షసుల మదమును అణచిన వాడా, సుర యక్షావన=దేవతలను యక్షులను రక్షించువాడా, ఋక్షపతి నుతా=జాంబవంతుని చే నుతింపబడినవాడా, అక్షహరణ పక్ష=అక్షుని సంహరించిన హనుమంతుని పక్షమైన వాడా, దక్ష శిక్షక ప్రియ=దక్షుని శిక్షించిన శివునకు ప్రియమయిన వాడా, రఘురాజ=రఘువంశమున పుట్టిన రాజా, త్యాగరాజనుత=త్యాగరాజుచే నుతి చేయబడిన వాడా, రాజ దివస రాజ నయన=చంద్రుడు సూర్యుడు నేత్రములైన వాడా, భో జగదవన=ఓ జగద్రక్షక, జనక రాజసుతా విరాజ=సీతతో ప్రకాశించువాడా, రాజ రాజ పూజిత=కుబేరునిచే పూజింపబడిన వాడా.

విశేషణము = ఇందు ఒక సంబోధనము జార, చోర=జారుడా చోరుడా అని ఉన్నది. జారుడనగా ఇతర స్త్రీల ననుభవించువాడని అర్థము. ఇది గోపికలతో రమించుట. చోరుడనగా దొంగ. ఇది వెన్న దొంగిలించుట. ఇవి లీలలుగా జూపినవాడు. వాడు చూపిన లీలలను అయ్యగారు గ్రహించినారు. మరియు ఈ కృతిని అయ్యగారు ఇంగ్లీషు వారి బ్యాండు స్వరమును విని దాని ననుసరించి రచించినది. మన సంగీతములో లేని స్వరములు దానిలో లేవు. మన సంస్కృతాది భాషల లోనున్న అకారాది క్షకారాంతము లయిన అక్షరములే ఇంగ్లీషులోనున్నవి. అట్లే మన సంగీతంలోని స్వరములే ఇంగ్లీషు సంగీతములో నున్నవి. మన శంకరాభరణ స్వరములను Major Scale అంటారు ఇంగ్లీషువారు. దానిని తీసుకొని దాని పద్ధతిలో రచించా రయ్యగారు.

515. కైకవశి = ఆది

ప॥ వాచామ గోచరమే మనసా
వర్ణింప దరమె రామ మహిమ॥ వాచా॥

అ॥ రేచారి మారీచుని బడగ బెట్టి
రెండో వాని శిఖి కొసంగెనే॥ వాచా॥

చ॥ మానవతి మదెరింగి చా
మరమగుట కస్త్రము నేయ గని॥
మానంబుకై మెడదాచగ
మాధవుండు కని కరగి వేగమే
దీనార్తి భంజనుడై ప్రాణ
దానంబొసగ మున్ను చనిన
బాణంబునటు చెదర సేయలేద
గానలోల త్యాగరాజనుతు మహిమ॥ వాచా॥

తాత్పర్యము :

ఓ మనసా! రాముని మహిమ మాటలతో చెప్పుట కుదరనిది. వర్ణించుటకు వీలుకానిది. (ఎటులనో కథలు చెప్పుచున్నాను వినుము) విశ్వామిత్రుని యాగ సంరక్షణము రాముడు చేయవలసి యున్నది. యజ్ఞ ధ్వంసమునకు మారీచ సుబాహులు వచ్చారు. వచ్చి ఆకసమున నుండి ఘాత కార్యములు చేస్తున్నారు. రాముడు మానవాస్త్రముతో సుబాహుని వధించినాడు. మారీచుని వధించుటకు వీలు లేదు. వాడు బ్రతికి యుండవలెను. ప్రస్తుతము వాడు యజ్ఞమును భంగపరచుచున్నాడు. వధింపవలెను. వధింప కూడదు. రామాయణమున వాడు కీలక పాత్ర. వాని వలననే సీతా పహరణము తద్వారా రావణ వధము జరుగ వలసియున్నవి. కనుక వాడు బ్రతుక వలసి యున్నది. బ్రతికితే యజ్ఞము సాగదు. కనుక వానిని ఎగుర గొట్టవలెను. ఏ బాణము వధించునో అట్టి బాణమునే రాముడు మారీచునిపై ప్రయోగించినాడు. కాని ఆ బాణము రాముని మన సెరిగి వానిని సముద్రమున పడవైచినది. వాడు బ్రతికి పైకివచ్చి అనంతర కాలమున తన కార్యమును నెర వేర్చినాడు. ఇంకొక కథ. అరణ్య వాస సమయంలో ఒక చమరీమృగమునకు ఒక వ్యాధుడు బాణమును గురి పెట్టినాడు. అది దానితోకకు పెట్టినాడు. చమరీమృగము యొక్క తోకతో చామరములు చేసి కిరాతులు రాజుల వద్ద విక్రయించి బహుధనము నార్జింతురు. దానికై వాడు తోకకు గురి పెట్టినాడు. కాని ఆచమరీ మృగము అభిమానవతి. వాలము పోవుట సహింపలేదు. ప్రాణము పోయినను సరే అని ఆ మృగము తోకకు తన తల నడ్డు పెట్టినది. వ్యాధుడు బాణమును విడచినాడు. క్షణంలో మృగం యొక్క తలపోతుంది. ఇదంతయు గమనించిన రాముడు వెంటనే బాణమును వదలినాడు. ఆ బాణము వ్యాధుని బాణమును చెదరగొట్టినది. మృగము బ్రతికినది. దానికి తలా, తోకా, రెండు దక్కినవి. వ్యాధుడు బెదరి పారిపోయినాడు. ఇది రాముని అద్భుత మహిమ కదా!

విశేషము= ఇందు రెండవ కథ వాల్మీకమున నున్నట్లు లేదు. మహానాటకము మొదలగు రామాయణ కథల నుండి దేని నుండియో అయ్యగారు గ్రహించి యుండవచ్చును.

516. పంతువరాళి = ఆది

ప॥ వాడేరా దైవము మనసా॥

అ॥ ఆడిన మాటలు తప్పడనుచును
ఆ చంద్రార్కముగ కీర్తి గల్గిన॥ వాడేరా॥

చ॥ దండి రక్కసుల మదమణచను ఆ
ఖండలాది సురకోటులను భూ
మండల సుజనుల బాలింపను కో
దండపాణి రూపముతో వెలసిన॥ వాడేరా॥

2 దారి తెలియలేని అజ్ఞులకు భవ
నీరధి దాటి – మోక్షమందుటకు
నీరజారిధరు – డుపదేశించే
తారక నామము – తోను వెలసిన॥ వాడేరా॥

3 ధాతృ వినుతుడైన త్యాగరాజుని
చేత పూజలంది బాగుగ ప్ర
ద్యోతనాన్వయమునను జనించి
సీతా పతియని పేరు గలిగిన॥ వాడేరా॥

తాత్పర్యం :

వాడే ఆరాధ్య దైవము. ఎవడనగా? సత్యవాక్య పరిపాలకుడని శాశ్వత కీర్తి కన్నవాడు. మరియు పెద్ద రాక్షసుల మదమణచుటకు, స్వర్గలోక మందలి దేవతలను, భూలోక మందలి సాధువులను రక్షించుటకును కోదండమును ధరించిన రూపముతో అవతరించినవాడు. మరియు, సంసార సముద్రమును దాటి మోక్షము పొందుటకు దారి తెలియని వారికి శివుడుపదేశించిన తారక నామముతో (రామ) భువినవతరించినవాడు. మరియు, బ్రహ్మవినుతింపగా సూర్యవంశమున జన్మించి సీతాపతియై నేడు త్యాగరాజుతో వినుతింపబడుచున్న వాడే దైవము అని అయ్యగారు మనస్సును పిలచి చెప్పినారు.

విశేషము = అయ్యగారు పల్లవి యందు ఏమియు నిర్దేశము లేక ''వాడేరా'' అని ప్రారంభించినారు. మొదటి చరణములో ''కోదండపాణి'' అని రూపనిర్దేశము చేసినారు.

రెండవ చరణములో ''తారక నామము'' అని నామనిర్దేశము చేసినారు. చివరి చరణములో సూర్య వంశమును, సీతా పతిత్వమును నిర్దేశించి తనను కూడ నిర్దేశించి రాముని సంపూర్ణ స్వరూపమును మనకు కనుల గట్టినారు. ''నాన్యం దైవం నైవ జానే నజానే'' = ఇంకొక దైవమును ఎరుగనే ఎరుగను'' అని ఒక భక్తుడు చెప్పినట్లు ''వాడేరా'' అని అవధారణము చేసి తమ అనన్య భావమును వెల్లడించినారు. అయ్యగారి అభ్యాసము ఒకటున్నది. సాధారణముగా కవులు మనస్సును ''మానసమా నీవు మానకే హరి భక్తి'' ఇత్యాదిగా సపుంసకలింగముగా వ్యవహరిస్తారు. త్యాగయ్య గారు ఒక పురుషుని వలె మనస్సును ''రా'' కొట్టి సంబోధిస్తారు. సదా శివ బ్రహ్మేంద్ర సరస్వతిదికూడ ''మానస సంచరరే'' ''పిబరే రామరసం'' ఇత్యాదిగా ఇదే మార్గము.

517. కేదార గౌళ = ఆది (దివ్యనామము)

ప॥ వారిజనయన నీవాడను నేను
వారము నను బ్రోవు వారిజ॥

చ॥ స్వల్ప ఫలదులగు – వేల్పులు ఏచిన
అల్పుడనుచు న – న్నందరు బలికిన॥ వారిజ॥

2 సరివారలు ఈ – ధరలో నవ్విన
పరి పరి విధముల – బాధలు పెట్టిన॥ వారిజ॥

3 కష్టము రాని – ఇష్టము రాని
దుష్టు డనుచునను – దూరిన గాని॥ వారిజ॥

4 పాపులు నాపై – మోపిన నేరము
శ్రీపతి నీ పద – చింతనే గాని॥ వారిజ॥

5 బాగుగ నీవే – భాగ్యముగాని
రాగరహిత! త్యాగ – రాజ వినుత హరే॥ వారిజ॥

తాత్పర్యము :

ఓ వారిజనయనా = పద్మనేత్రా! నేను నీ వాడను. నన్ను బ్రోవుము. కొద్దిపాటి ఫలముల నిచ్చే దేవతలు, తమను నేను పూజింప లేదని బాధించినా, లోకులు నన్ను అల్పుడని అనినా నేను నీవాడనే. త్యాగయ్య రాముని ఒక్కనే పట్టుకొని వ్రేలాడు చున్నాడని నలుగురు నవ్వినా నేను నీవాడనే. నాకు కష్టము రానీ, సుఖము రానీ, నన్ను దుష్టుడని పలువురు నిందించనీ నేను నీవాడను. పాపాత్ములు నేను నీ పాద చింతనమే చేయుట నేరమందురు. నేను నీవాడనే ఓరాగరహిత= రాగద్వేషములు లేని వాడా! త్యాగరాజనుత! హరీ! నాభాగ్యము నీవే. అని అయ్యగారు తన అనన్యనిష్ఠను తెలుపుకొన్నారు.

విశేషము = ''నీ వాడను'' అనుమాట విభీషణ శరణాగతి సమయమున రాముడు ''సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ = ''నీవాడను'' అనినవానికి అభయమిచ్చెదను'' అని పలికిన దానిలోనిది. నీ వాడను (నీ సొత్తును) అని ఆత్మ సమర్పణ చేయుట శరణాగతి. ''స్వత్వమాత్మని సంజాతం। స్వామిత్వం బ్రహ్మణి స్థితం=సొత్తు అగుట ఆత్మ స్వభావము, దానికి సొంతదారుడగుట భగవానుని స్వభావము. ఈ శాస్త్రమును బట్టి ఆత్మ సమర్పణము చేసి ''అనన్యాశ్చింతయంతోమాం'' అనే గీతా వాక్యమును బట్టి అనన్య చింతగల వారిని చూచి పరిహసించుట, నిందించుట మొదలయిన వాటిని త్యాగయ్యగా రెదుర్కొన్నారన్నమాట. వాటిని లెక్క చేయక అయ్యగారు తమ అనుభూతిని రామునకు నివేదించుకొన్నారు.

518. తోడి = చాపుతాళం (ప్రహ్లాద భక్తి విజయము)

ప॥ వారిధి నీకు వందన మొనరించెద॥ వారిధి॥

అ॥ సారెకు నీ హృద – యార విందమునను
మారమణుడు గూడు – దారి దెల్పుము నాతో॥ వారిధి॥

చ॥ నా యెడ దయ యుంచి – సాకు మీ యెడ
బాయకుండు దారి – దెల్పుమీ ముని
ధ్యేయునితో మాట – బల్కుమీ ఏయు
పాయమైన జేసి – ప్రాణము నిల్పుమీ॥ వారిధి॥

2 దనుజ బాధల నెల్ల – దలచను భోగ
ధన సంపదలకు చెయి – జాచను – నా
మనమున హరిని నేమరను నా
కనులార నాధుని – గన దెల్పుము నాతో॥ వారిధి॥

3 ఆ జన్మ మసురబా – ధాయెను – జల
రాజ! ప్రాయము లైదా – రాయెను – త్యాగ
రాజ సఖుడు రా – డాయెను – వినుమా
జానుబాహుడు – అగుపడ దెల్పుమీ॥ వారిధి॥

తాత్పర్యము :

రాక్షసులు ప్రహ్లాదుని నాగపాశములతో బంధించి సముద్రములో పడవైచినారు. అప్పుడతడు ధ్యాన సమాధిలో నున్నాడు. సముద్రుడు ప్రహ్లాదుని మహాభక్తుడు వచ్చినాడని తన అంతఃపురమునకు కొనిపోయి స్వాగత సత్కారాలు చేసి, గరుత్మంతుని పిలిచి నాగపాశాలను విడిపింపచేశాడు. ప్రహ్లాదుడు ధ్యాన సమాధినుండి తేరుకొని ఎదుట నున్న సముద్రుని చూచి అంటున్నాడు. ఓ సముద్రా! నీకు వందనము. నీ హృదయమందు హరిని చేర్చుకున్నావు. (హరి సముద్రమున శయనించి యుండుటయే హృదయమందు చేర్చుకొనుట). ఆ దారిని నాకు తెలుపవలసినది సముద్ర మహాశయా! నాపై దయఉంచి రక్షించుము. హరి నిన్నెడబాయక ఉన్నట్లే నన్నెడ బాయకుండు విధము తెల్పుము. ఆ హరితో ఒకమాట చెప్పు. ఏ విధముగానైన సరే హరి నన్నెడ బాయకుండునట్లు చేసి నాప్రాణము నిల్పుము. రాక్షసులు పెట్టిన బాధలను నేను తలచను. ధనసంపదలకు నేను చేయిచాచను. మనస్సులో హరిని మరువను. కనులార హరిని నేను చూచుకొనే విధము నాకు తెలుపుము. పుట్టినది మొదలు రాక్షస బాధలే అనుభవించాను. వయస్సు 5,6, సంవత్సరాలయినవి. త్యాగరాజసఖుడు (హరి) రాడాయెగదా! ఓ సముద్రుడా! ఆజానుబాహుడైన హరి కనిపిస్తే నాకు దర్శన మిమ్మని చెప్పు. అని ప్రహ్లాదుడు సముద్రుని వేడుకొన్నాడు.

519. కల్యాణి = ఆది

ప॥ వాసుదేవయని వెడలిన యీదొ
వారికుని గనరే---
వాసు॥

అ॥ వాసవాది సురపూజితుడై
వారిజనయనుని – మదిని దలచుచును॥ వాసు॥

చ॥ నీరు కావి దోవతులను గట్టి
నిటలమునను శ్రీ చూర్ణము బెట్టి
సారి వెడలి యీ – సభలో జుట్టి
సారెకు బంగరు కోలను బట్టి॥ వాసు॥

2 మాటి మాటికిని మీసము దువ్వి
మన్మథ రూపుడు – తానని క్రొవ్వి
దాటి దాటి తాపడుచును నివ్వి
ధంబున బలుకుచు పక పక నవ్వి॥ వాసు॥

3 బాగు మీర నటనము జేయుచును
పతిత పావనుని తావేడుచును
రాగతాళగతులను బాడుచును
త్యాగరాజ సన్నుతుని పొగడుచును॥ వాసు॥

తాత్పర్యము :

దౌవారికుడు = ద్వారపాలుడు. వాడు వాసుదేవ అని బయలు దేరినాడు చూడుడు. వానిని ఇంద్రాది దేవతలు పూజించున్నారు. అతడు హరిని తలచుచు వచ్చుచున్నాడు. అతడు నీర్కా విధోవతులు కట్టినాడు, నుదుట శ్రీ చూర్ణమును బెట్టినాడు, బంగారు బెత్తము బట్టినాడు. ఈ సభలో దేవుని ఉత్సవము చూచుటకు బయలుదేరి సభను చుట్టి వచ్చుచున్నాడు. మీసములు ద్రువ్వుచున్నాడు. మన్మథునంత అందగాడనని గర్వపడుచున్నాడు. పక పక నవ్వుచు వచ్చుచున్నాడు. రాగతాళ గతులతో నృత్యంచేస్తూ హరిని వేడుచు వస్తున్నాడు చూడుడు. అని దౌవారికుడే హెచ్చరిక చెప్పుకొంటూ సభలో ప్రవేశించుచున్నాడు.

విశేషము = ప్రహ్లాద భక్తి విజయము యక్షగానము. కూచిపూడి భాగవతులు ప్రదర్శించినవి ఈ జాతి ప్రబంధములే. ఇందు ఒక పాత్ర ప్రవేశిస్తూ తనను, తన పాత్రను, ప్రథమ పురుషలో బెట్టుకొని వర్ణించుకొంటూ ప్రవేశిస్తుంది. అనగా ''రాజు వెడలె సభకు–రవితేజములలరగ'' అని ఆరాజే గీత నృత్యాలతో ప్రవేశిస్తాడు. అప్పుడు సభికులకు ఆ పాత్ర ఎవరో తెలుస్తుంది. త్యాగయ్యగారు ఈ పద్ధతిని ప్రహ్లాదభక్తి విజయములో ప్రవేశ

పెట్టినారు. ఒక ద్వారపాలకుని కల్పించి చేర్చినారు. వానిది ఈ పాట. నీరు కావి ధోవతులు= ప్రతిదినమును నీటిలో తడిపి పిండి ఆరవేసి కట్టుకుంటూ వుంటే క్రమముగా ఆ బట్టలకు కొంచెం ఎర్ర రంగు వస్తుంది. అవి నీరు కావిధోవతులు.

520. కేదార గౌళ = ఆది

ప॥ వారిజనయన నీ – వాడను నేను
వారి జాననా బ్రోవు॥ వారిజ॥

అ॥ సారెకు మాయా సాగర మందు
నేరక మునిగెడు – నేమము లేదు॥ వారిజ॥

చ॥ ధన కనకములను – దారపుత్రులగై
కొని మరవగ రవి – తనయుడగాను॥ వారిజ॥

2 వాజిరథములను – వారము గైకొని
రాజుల నడచుపా – ర్థరాజు నే గాను వారిజ॥

3. నీ జపములు నవ – నిధులౌ త్యాగ
రాజ వినుత యీదు – రాశల తగలను॥ వారిజ॥

తాత్పర్యము :

పద్మము వంటి ముఖము కనులు కలిగిన ఓరామా! నేను నీవాడను. నన్ను రక్షించుభారము నీదే. మాయామయమైన యీ సంసారసాగరములో మునిగే నియమము నాకు లేదు. ధన కనకములను భార్యాపుత్రులను చేపట్టి నిన్ను మరచుటకు నేను సుగ్రీవుడను గాను. చతురంగ బలమును సంపాదించి రాజులతో యుద్ధము చేసి వారిని అణచే అర్జునునినాను. ఓ త్యాగరాజ వినుతారామా! నీ జపము చేయుటయే నాకు నవనిధులు. పైన చెప్పిన దురాశలలో నేను చిక్కుకొనను. అని అయ్యగారి విజ్ఞాపనము.

521. బిలహరి = ఏకతాళం

ప॥ వాసు దేవ వరగుణ మామవ
వాసవ హృదయ నివాస చిద్విలాస॥ వాసు॥

చ॥ సాగర శయన భవ – సాగర తారక॥ వాసు॥

2 నీరజ నయన ఘన – నీల సుజన పాల॥ వాసు॥

3 భాగవత ప్రియ – త్యాగరాజార్చిత ॥ వాసు॥

తాత్పర్యము :

సర్వత్ర నిండిన, గొప్ప గుణములు గలిగిన ఓ దేవా! మామవ= నన్ను రక్షింపుము. వాసవ హృదయనివాస= ఇంద్రుని హృదయమున వసించువాడా! చిద్విలాస= జ్ఞాన స్వరూప, సాగర శయన= సముద్రమున శయనించువాడా, భవసాగర తారక= సంసారమను సముద్రమును దాటించువాడా, నీరజనయన= పద్మనేత్రా, ఘననీల= మేఘవర్ణుడా, సుజనపాల= సజ్జనులను రక్షించువాడా, భాగవత ప్రియ = భక్తులను ఇష్ట పడువాడా, త్యాగరాజార్చిత= త్యాగరాజు పూజలందు వాడా, మామవ= నన్ను బ్రోవుము అని ప్రార్థనము. ఇది సంస్కృత కృతి.

522. జనరంజని = ఆది

ప॥ విడజాలదురా నా మనసు – వినవేరా॥ విడ॥

అ॥ అడియాసలచే దగిలినే
నార్తిబడి నీ పదంబులను॥ విడ॥

చ॥ తనువే పనులకు జనినా మరి
కనరానిది కనుగొనినా
నినుగా భావించి సంత
సిల్లితి శ్రీత్యాగరాజనుత॥ విడ॥

తాత్పర్యము :

అయ్యగారు రాముని ''వినవేరా'' అని రాకొట్టి సంబోధించినారు. ఇది అయ్యగారికి రాముని యందున్న స్వాతంత్ర్యమును తెలుపును. ఓరామా! వినుము. ఈసంసారములో చిక్కుకొని ఎన్నో అడియాసలకు లోనై ఉన్ననూ నా మనసు నీపాదస్మరణమును విడనాడదు. శారీరకముగా ఏపనులు చేస్తూ ఉన్నా, చూడరాని దేనిని చూస్తూ ఉన్నా అది అంతయు నీవే అని భావించి సంతోష పడుచున్నాను. అని తన అనుభూతిని తెలిపినారు.

విశేషము = ''కిం వక్తవ్యం? కిమవక్తవ్యం? కిం వచనీయం? కిమవచనీయం? సర్వం బ్రహ్మమయం'' ఏది చెప్పదగినది? ఏది చెప్పదగనిది? ఏది దోషమైనది? ఏది దోషము కానిది? అంతయు బ్రహ్మమయమే'' అని వేదాంతసూక్తి ఉన్నది. దానిని బట్టి జ్ఞానులకు సదసద్విభేదము లేక అంతయు బ్రహ్మమయముగా గోచరిస్తుంది. అయ్యగారి అనుభూతిని రాముని వద్ద నివేదించుకొన్నారు.

523. మాయామాళవ గౌళ = ఆది

ప॥ విదులకు మ్రొక్కెద – సంగీతకో॥ విదులకు॥

అ॥ ముదమున శంకరకృత సామనిగమ
విదులకు నాదాత్మక సప్తస్వర॥ విదులకు॥

చ॥ కమలా గౌరీ వాగీశ్వరీ విధి
గరుడధ్వజ శివనారదులు
అమరేశ భరత కాశ్యప చండీ
శాంజనేయ గుహ గజముఖులు
సుమృకండుజ కుంభజ తుంబురు వర
సోమేశ్వర శారఙ్గదేవ నంది
ప్రముఖలకు త్యాగరాజ వంద్యులకు
బ్రహ్మానంద సుధాంబుధి మర్మ॥ విదులకు॥

తాత్పర్యము :

సంగీత కోవిదులకు (తెలిసినవారికి) మ్రొక్కెదను. శంకరుడు తయారు చేసిన సామవేద వేత్తలకు, నాదాత్మకమయిన సప్తస్వర వేత్తలకు మ్రొక్కెదను. లక్ష్మి, పార్వతి, సరస్వతి, బ్రహ్మ, విష్ణువు, శివుడు, నారదుడు, దేవేంద్రుడు, భరతముని, కాశ్యపముని, చండీశ్వరుడు, ఆంజనేయుడు, కుమారస్వామి, విఘ్నేశ్వరుడు, మార్కండేయుడు, అగస్త్యుడు, తుంబురుడు, సోమేశ్వరుడు, శారఙ్గదేవుడు, నంది మొదలయిన బ్రహ్మానందామృతము యొక్క రహస్య వేత్తలకు మ్రొక్కెదను. అని తన భక్తి వెల్లడించిరి.

విశేషము = ఇందు దేవతలున్నారు, దేవర్షులున్నారు, ఋషులున్నారు, సంగీత శాస్త్రకర్తలున్నారు, ఉపాసకు లున్నారు. వీరందరును సంగీత కోవిదులే. అందరికిని అయ్యగా రిందు మ్రొక్కిరి.

524. సారాష్ట్రం = చాపు

ప॥ వినయమునను కౌశి–కుని వెంట చని నంఘ్రు
లను జూచే దెన్నటికో ----అందు
వెనుక రాతిని నాతి – జేసిన చరణము
లను జూచే దెన్నటికో
ఘనుడైన శివు చాప – మునుద్రుంచిన పాద
మును జూచే దెన్నటికో
జనక రాజు పాల – గడిగిన ఆకా
ళ్లను జూచే దెన్నటికో వినయ॥

చ॥ చనువున సీతకు బొట్టుగట్టిన కర
మును జూచే దెన్నటికో ---కోప
మున భృగు సుతు చాప–బలమందు కొన్న బా
హును జూచే దెన్నటికో
వనమున జని విరా – ధుని చంపిన చేతు
లను చూచే దెన్నటికో – అల్ల
ముని జనులను గని – అభయమిచ్చిన హస్త
మును జూచే దెన్నటికో॥ వినయ॥

2 తనకు దానే కాకా – సురుని గాచిన శర
మును జూచే దెన్నటికో -- క్షణ
మున బహురథముల –బొడి జేసిన అస్త్ర
మును జూచే దెన్నటికో---
ఘన బలుడైన వా – లిని జంపిన బాణ
మును జూచే దెన్నటికో –ఆ
వననిధి మదగర్వ – మణచిన సాయక
మును జూచే దెన్నటికో॥ వినయ॥

3 కనికరమున విభీ – షణుని జూచిన కన్ను
లను జూచే దెన్నటికో– రావ
ణుని గొట్టి పేదక – పులులేవ జూచు దృ
ష్టిని జూచే దెన్నటికో

వనచరాధిపుని చ – ల్లగ జూచిన నేత్ర
మును జూచే దెన్నటికో – అను
దినము లంక వర్థి – ల్లను జూచు లోచన
మును జూచే దెన్నటికో॥ వినయ॥

4 ఘనమైన పుష్పక – మునరాజిల్లిన సాగ
సును జూచే దెన్నటికో – భర
తుని గని చేయిబట్టు – కొని వచ్చిన వేడు
కను జూచే దెన్నటికో॥
కనక సింహాసన – మున నెలకొన్న ఠీ
విని జూచే దెన్నటికో – వర
మునులు రాజులు గూడి సేయునలంకార
మును జూచే దెన్నటికో॥ వినయ॥

5 ఆగమ వినుతుని – ఆనందకందుని
బాగ జూచే దెన్నడో – పరమ
భాగవతప్రియుని – నిర్వికారుని
రాగ జూచే దెన్నడో
సాగర శయనుని – కరుణా జలధిని
వేగ జూచే దెన్నడో – వర
త్యాగరాజాది దే – వతలు పొగడు కొన్న
లాగు జూచే దెన్నడో॥ వినయ॥

తాత్పర్యము :

వినయముతో విశ్వామిత్రుని వెంట జనిన ఆ పాదముల నెప్పుడు చూతునో. రాతిని అహల్యగా చేసిన ఆ పాదముల నెప్పుడు చూచెదనో. శివధనుస్సును విరచిన ఆ పాదము నెప్పుడు చూచెదనో. జనకుడు పాలతో కడిగిన ఆకాళ్లను ఎప్పుడు చూచెదనో. సీత మెడలో మంగళ సూత్రము కట్టిన ఆ చేతి నెప్పుడు చూచెదనో. కోపముతో పరశురాముని వింటి బలమును గ్రహించిన ఆ బాహువును చూచే దెప్పుడో. అడవిలో విరాధుని బట్టి వధించిన ఆ చేతి నెప్పుడు చూచెదనో. మునుల కభయమిచ్చిన ఆచేతిని ఎన్నటికి చూచెదనో. అపరాధి అయిన కాకాసురుని తనకు తానే రక్షించిన ఆ బాణమును చూచే దెప్పుడు? లంకా యుద్ధ మందు వేలకొద్ది రథములను చూర్ణము చేసిన ఆ బాణమును చూచేదెన్నటికో? వాలిని జంపిన, సముద్రమదమణచిన ఆ బాణము నెప్పుడు జూచెదను.

విభీషణుని కనికరముతో చూచిన ఆ కంటి నెపుడు జూతును. రావణుని వధించిన పిదప మృతులయిన కపులు లేచి కూరుచుండగా చూచిన కనులను, సుగ్రీవుని చల్లగా చూచిన కనులను లంకను వర్దిల్లునట్లుగా చూచిన కనుల నెప్పుడు చూచెదనో. పుష్పక విమాన మందు కూరుచండిన ఆ సొగసును, భరతుని చేయిబట్టి పుష్పకము దిగివచ్చిన ఆ తీరు నెప్పుడు చూతును. బంగారు సింహాసనముపై కూరుచుండిన ఠీవిని, మునులు రాజులు అలంకరించిన అలంకార మెన్నడు చూతునో కదా! వేదములు వినుతించు ఆనంద స్వరూపుని, పరమ భాగవతప్రియుని, వికార రహితుని, సాగరశయనుని, కరుణానిధిని నావద్దకు నడచి వచ్చుచుండగా చూచేదెప్పుడో. శివాది దేవతలందరును వర్ణించే ఆ తీరును చూచే దెన్నటికో గదా. అని అయ్యగారు రాముని యొక్క సమస్తాంగముల సౌందర్యమును దర్శించుటకు ఉత్కంఠను జూపినా రిందులో.

విశేషము = ఇది బహు దీర్ఘములయిన చరణభాగములు (ఎనిమిది) కలిగియున్నది. చివరి చరణము తప్ప పల్లవితో సహా నాలుగు చరణములను ఏకాక్షర ప్రాసతో నడిపిరి. చివరి చరణము ''త్యాగరాజ'' అను ముద్రకొరకు ప్రాస మారినది. ఇందలి ''త్యాగరాజ'' అను పదము ప్రత్యేకించి తిరువారూరు త్యాగరాజ దేవుని ఉద్దేశించి ప్రయోగించినది. పల్లవిని విశ్వామిత్రుని వెంట జనుటతో ప్రారంభించి నాల్గవ చరణములో సింహాసనా రోహణముతో ముగించుట చేత రామాయణ కథ అంతయు చెప్పినట్లయినది. చివరి చరణమునందు రామావతారమునకు మూలకందమయిన విరాట్పురుషుని చెప్పుట జరిగినది.

525. జయంత సేన = ఆది

ప॥ వినతా సుత వాహన శ్రీ రమణా
మనసారగ సేవించెద రామా॥ వినతా॥

అ॥ నిను సారెకు జూ – డని బ్రతుకేలే
మనుజులనేచే – జీవన మేలే॥ వినతా॥

చ॥ మత భేదమనే శకనాస్తికస
మ్మతవాక్కులు బల్కుట సుఖమా
క్షితిలో సత్సం – గతి సౌఖ్యము పా
లిత త్యాగరా – జామర పాల॥ వినతా॥

తాత్పర్యము :

వినతా సుత వాహన = గరుడవాహనా! శ్రీ రమణా! నిన్ను మనసారా సేవించెదను. ఓ రామా! నిన్ను తడవ తడవకు దర్శించని బ్రతుకు వ్యర్థము. నీ భక్తి లేక మనుజులను బాధించు జీవనము వ్యర్థము. (భక్తిలో సర్వ సద్గుణములు అంతర్భవించి, భూత దయ కూడ అంతర్భవించుటచే మనుజులను బాధించరు భక్తులు. భక్తి లేక పోతే భూత దయాది గుణములు లోపించి బాధకులగుదురు). మతభేదమనే పేరుతో శాక్యుల, నాస్తికుల వాక్కులు వల్కుట సుఖము కాదు. సుఖమేమంటే భగవంతుని విశ్వసించిన సత్పురుషుల యొక్క సాంగత్యమే. అని అయ్యగారు నిరీశ్వరవాదమును అనాదరించి, ఆస్తిక మతమును సమర్థించినారు.

విశేషము = పరమాత్ముడు, పరమాత్ముని జగత్కారణ తాది గుణములు ఇవన్ని కలవని నమ్మి పరమాత్ముని యెడ భక్తిని బోధించు మతములు వైదిక మతములని భావన. వీని కన్న వేరు మతములు అవైదిక మతములని శంకరాది పూర్వాచార్యులు నిర్ధరించిరి. అయ్యగారు వారి మార్గమున సంచరించిరి.

526. ప్రతాపవరాళి = ఆది

ప॥ వినానాసగొని యున్నానురా – విశ్వరూపుడ నే॥ విన॥

అ॥ మనసార వీనుల విందుగా – మధుర మైన వల్కులు॥ విన॥

చ॥ సీతా రమణితో ఓమన గుంటలాడి గెలచుట
చేత నొకరి కొకరు సా
కేతాధిప! నిజమగు ప్రేమతో బల్కుకొన్న ముచ్చట
వాతాత్మజ భరతులు విన్నటుల – త్యాగరాజ సన్నుత॥ విన॥

తాత్పర్యము :

ఓ విశ్వరూపా రామా! నీ తియ్యని మాటలు వినుటకు నేను ఆశపడుచున్నాను. సీతతో నీవు ఓమన గుంటలాడి గెలిచినావు. అప్పుడు మీ ఇద్దరి ప్రేమ అధికమైనది. అప్పుడు మీరిరువురును మాటలాడుకొన్నారు. అవి హనుమంతుడు, భరతుడు విన్నారు. ఆవిధంగా నాకు విన నాస కలుగుచున్నది. అని అయ్యగారు నివేదించినారు.

విశేషము = తన మనస్సులో తోచిన ఒక భావమును అయ్యగారు రాముని వద్ద నివేదించుకొన్నారు. ఈ నివేదనమునే నవవిధ భక్తులలో చివరిదయిన ''ఆత్మ నివేదనము'' గా భావింపవచ్చును.

527. దేవగాంధారి = ఆది

ప॥ వినరాద నా మనవి। వినరాద నామనవి॥ విన॥

చ॥ కనకాంగ కావేటి రంగ శ్రీ
కాంత! కాంత లెల్ల – కామించి పిలిచితే॥ విన॥

2 తేజినెక్కి బాగ – తెరువున రాగ
రాజసతులు జూచి – రమ్మని పిలిచితే॥ విన॥

3 భాగధేయవై – భోగరంగ శ్రీ
త్యాగరాజ నుత – తరుణులు పిలిచితే॥ విన॥

తాత్పర్యము :

అయ్యగారు శ్రీరంగమునకు వెళ్లినప్పుడు తిరువీధి ఉత్సవమునకు రంగనాథుడు గరుడవాహనారూఢుడై లేక అశ్వవాహనా రూఢుడై వెడలినప్పుడు అయ్యగారు ఆ ఉత్సవమూర్తిని సంబోధించి పాడిన పాట. ఓ బంగారు మేను గల కావేటి రంగా! శ్రీకాంతా! కాంత లెల్లరును నిన్ను కామించి పిలచుచున్నారు. రాజసతులు రమ్మని పిలచుచున్నారు. తరుణులు పిలచుచున్నారు. ఇందరు తరుణులలో నే నొక తరుణిని, కాంతను, నామనవి విని నన్ను రక్షింపరారాదా అని వేడుకొన్నారు.

విశేషము = ఉత్సవమునందు పాల్గొన్న వారిలో పురుషులే ఎక్కువగా నుందురు. అందరూ రంగని ఆహ్వానిస్తూ ఉన్నారు. అయ్యగారు వారిని ''కాంతలు'' ''రాజసతులు'' ''తరుణులు'' అని నిర్దేశించారు. ''స్త్రీప్రాయమితరం జగత్'' అనే శాస్త్రమును బట్టి భగవంతుడొక్కడే పురుషుడు. తక్కిన ఆత్మలన్నియు స్త్రీలు అని. దీనిని బట్టి శ్రీరంగోత్సవమునందు పాల్గొనిన అందరిని అయ్యగారు స్త్రీలుగా భావించినారు.

528. వివర్ధని = రూపకం

ప॥ వినవే ఓ మనసా – వివరంబుగ – నే దెల్పెద॥

అ॥ మనసెరింగి – కుమార్గమున – మరిపారలుచు – చెడవలదే॥ వినవే॥

చ॥ ఈనడతలు పనికిరాదు – ఈశ్వరకృప – కలుగబోదు।
ధ్యాన భజన సేయవె వర – త్యాగరాజు మనవిని॥ వినవే॥

తాత్పర్యము :

ఇది అయ్యగారు చేసిన మానస బోధము. ఓ మనసా! వివరముగా చెప్పెదను వినుము. భక్తి మార్గము కానిది కుమార్గము (చెడుమార్గము). అట్టి మార్గములో పడి పారలి చెడిపోకుము. ఇట్టి మార్గములో నడిస్తే భగవత్కృప కలుగదు. అందుచేత రాముని ధ్యానించు, భజించు అని అయ్యగారి బోధ.

విశేషము = ''రామస్మరణా దన్యోపాయం నహిపశ్యామో భవతరణే'' రామహరే కృష్ణహరే తవ। నామ వదామి సదా నృహరే॥ = సంసారమును దాటుటకు రామస్మరణము కన్న వేరు ఉపాయము లేదు. కనుక నీ నామములను స్మరించెదను అని ప్రాచీన గేయ సంపుటి ఒకటి ఉన్నది. దాని భావమే ఇది.

529. యమునా కల్యాణి = రూపకం

ప॥ విధి శక్రాదులకు దొరకునా ఇటువంటి స
న్నిధి వేడుక చూతాము రారె॥ విధి॥

అ॥ బుధ జనరక్షకి ధర్మాం – బుధిశాయి సేవజూడ॥ విధి॥

చ॥ ఉడు పతి ముఖు లెల్ల వరుస – గా బిరుదులను బట్టి
అడుగడుగున జయ జయ జయ – మనగా యా వేల్పుల వెల
వడుచులు నిజనాట్యమాడ – గా సమయమున – బ
సిడి సుమవర్షము గురియగ – వడివడిగా మరకోటులు
తడబడగా భూమిని – దండము లిడగా సం
తసమునను కడగంటిని – జూచే సాగసు॥ విధి॥

2 శ్రీ రమణిని జూచి పల్కగ నవరత్నాల
హారపుసరు లల్లాడగ – ఆ మొలక నగవు
గౌరవమంతటను మెరయ – గా నావేళ సనక
నారదాదు లెల్ల బొగడ – గా కరమునను
కీరమును బూని సరిగ – చీర కాంతి మెరయగ శృం
గారి కొలువుండు శుక్ర – వారపు సొగ సెల్ల జూడ॥ విధి॥

3 తరుణారుణ వదన కమలి–నిll అత్యంతమైన
కరుణారస పూర్ణ నేత్రి – నీll శ్రీపంచనద
పురమున నెలకొన్న తల్లి – నీll శ్రీత్యా
గరాజ పరిపాలినిని – స్వరూపిణిని
శరణాగత వత్సలిని – వరమణులు ధగధగయని
మెరయ కంకణయుత కర – పర దేవిని సేవింప॥ విధి॥

తాత్పర్యము :

తిరువయ్యారు క్షేత్ర నివాసిని అయిన ధర్మ సంవర్ధనీ దేవి కొలువును వర్ణించు కృతి ఇది. ఇటువంటి సన్నిధి, ఇటువంటి ఉత్సవము సేవించుట బ్రహ్మేంద్రుల కయినా దొరకునా? కనుక భక్తులారా చూతము రండు. బుధ రక్షకి = పండితులను రక్షించు ధర్మాంబిక సేవను చూడరండు. చంద్రుడు మొదలగు దేవతలు బిరుదులను బట్టి జయ జయ ధ్వానాలు చేస్తూ ఉండగా, అప్సరసలు నాట్యమాడుచుండగా, దేవతలు బంగరు పూల వాన గురియుచు నేలపై బడి దండము లిడుచుండగా ఆ దేవి కడగంటి చూపులు ప్రసరింపజేసే ఆ సొగసును చూడరండు. మధ్యలో ధర్మాంబిక శ్రీలక్ష్మీ దేవిని చూచి పలుకరించుచున్నది. నవరత్న హారము లల్లలాడుచున్నవి. చిరునవ్వు మెరపు మెరయుచున్నది. సనక నారదాదులు పొగడుచున్నారు. దేవి చేతిలో చిలుకను బట్టినది. ఆమె కట్టిన జరీ చీర కాంతి మెరయు చున్నది. ఆవిధంగా దేవి శుక్రవారపు కొలువు దీర్చియున్నది. చూతము రండు. లేత ఎర్ర తామర వంటి ముఖము కల దేవిని, మిక్కిలి దయ తొణికిసలాడు కనులు గల దేవిని, శ్రీపంచనద క్షేత్రమును నెలకొన్న తల్లిని, త్యాగరాజును రక్షించుదేవిని, జగమంతయు రూపమైన దేవిని, శరణాగతులపై దయగల దానిని, ధగధగ మెరసే మణి కంకణములను ధరించిన పరదేవిని సేవింప భక్తులారా రండు. అని అయ్యగారి ఆహ్వానము.

530. హుసేని =ఆది (ప్రహ్లాద భక్తి విజయము)

ప॥ వినతాసుత రారానా – వినుతిని గైకొనరా॥ వినతా॥

అ॥ ఘన నాగ పాశముల – ఖండించ రారా॥ వినతా॥

చ॥ అమరేశుని గెలిచి నీ – వమృతమును దెచ్చి
విమల కీర్తి వహించి – విల సిల్లిన వీరా॥ వినతా॥

2 హరికి వాహన మౌమా – అయ్యా వేగరారా, నీ
సరియౌ భక్తుని బ్రోవ – సమయ మిది రారా॥ వినతా॥

3 త్యాగరాజ నుతుని – దాసుడౌ ధీరా
నాగాశన నినువి – నాగ ఎవ్వరురా॥ వినతా॥

తాత్పర్యము :

రాక్షసులు ప్రహ్లాదుని నాగపాశాలతో బంధించి సముద్రమున పడవేసినారు. సముద్రుడు ప్రహ్లాదునకు స్వాగతమిచ్చి ప్రహ్లాదుని నాగపాశములను ఖండించుటకు గరుత్మంతుని ఆహ్వానించుచున్నాడు. ''ఓ వినతాసుత = గరుత్మంతుడా! నా ప్రార్థనను విని ఈ ప్రహ్లాదుని నాగ పాశములను ఖండించుటకు రమ్ము. తల్లి దాస్యవిముక్తికై ఇంద్రుని గెల్చి అమృతమును దెచ్చిన ఘనకీర్తి సంపాదించిన వాడవు. హరికి వాహన మైన వాడవు. నీకు సాటియైన భక్తుని (ప్రహ్లాదుని) రక్షింపవలసిన సమయమిది. భగవంతుని దాసుడైన ధీరుడవు. నీవు నాగాశనుడవు (పాములను భక్షించువాడవు). నీవు తప్ప ఎవరును ఈ పని చేయలేరు .అని సముద్రుడు చేసిన గరుడుని ఆహ్వానము.

విశేషము = ఈ కథ అసలు భాగవతమందున్న కథ కాదు. అసలు భాగవతమందు సముద్రమందు పడవేయబడిన ప్రహ్లాదుని సముద్రుడు తన తరంగ హస్తములతో ఒడ్డునకు విసురుతాడు. అయ్యగారికి ఇది ఉచితముగా తోచలేదు. తన వద్దకు వచ్చిన మహా భాగవతోత్తమునకు స్వాగత సత్కారములు చేయుట సముద్రునకు విధి. ఒడ్డునకు విసరుట భాగవత తిరస్కారమగును. అదియును గాక సముద్రము కూడ విష్ణుస్థానము. విష్ణుస్థానమును చేరినవాడు ''నచపునరావర్తతే'' మరల తిరిగి భూమికి రాడు అనే వేదము ప్రకారము భూమికి రాడు. అసలు కథలో ఇదే జరిగినది. ఇది త్యాగయ్య గారికి రుచింపక ''ప్రహ్లాద భక్తి విజయము''ను రచించారు. ఇందు ప్రహ్లాదునకు సముద్రుడు స్వాగత సత్కారాలు జరుపుతాడు. కథాక్రమములో అక్కడకు వైకుంఠము కదలి వస్తుంది.

ప్రహ్లాదుడు హరిని దర్శించి పరవశిస్తాడు. అంతటితో కథాంతమగును. ఇందు ప్రహ్లాదుడు తానే యగును. కనుకనే శిష్యుడైన వాలాజీపేట వేంకట రమణ భాగవతులు అయ్యగారిని ''ప్రహ్లాద ఏవ స్వయం'' = ప్రహ్లాదుడు తానే'' అని కీర్తించుట జరిగినది. ఇట్లయితే ప్రహ్లాద భక్తికి విజయము. లేకపోతే అపజయమే అని అయ్యగారి భావము. అందుచేతనే సముద్రమున చేరిన ప్రహ్లాదుని ఒడ్డుకు చేర్చిక వైకుంఠము నచ్చట కల్పించి ప్రహ్లాదునకు అపునరావృత్తిని కల్పించి అయ్యగారు ప్రహ్లాదుని భక్తికి విజయము చేకూర్చినారు. చాల రసవత్తరమైన గేయనాటక మిది.

531. శంకరాభరణం = రూపకము (ప్రహ్లాద భక్తి విజయము)

ప॥ విష్ణు వాహ నుండిదిగో – వెడలె జూడరే॥ విష్ణు॥

అ॥ కృష్ణ చరణ భక్తులలో – కీర్తిగల్గు భాగ్యశాలి॥ విష్ణు॥

చ॥ రంగపతిని బొంగుచు హృ – ద్రంగమునను దలచి
బంగరు సరిరంగుగల ప – తంగరాజు తాననుచును॥ విష్ణు॥

2 వరుణాలయు మొరలనువిని – కరుణా పూరితుడై
హరి భక్తుల పరితాపము – హరియింతుననుచు వేడ్క॥ విష్ణు॥

3 రాజిల్లు విరాజాధిపు – డీ జగమున కేగి అహి
రాజ రాజి భోజి త్యాగ – రాజనుతుని దాబొగడుచు॥ విష్ణు॥

తాత్పర్యము :

ఇది నాగపాశములను ఖండించుటకు ప్రార్థించిన సముద్రుని ప్రార్థనము విని వెడలిన గరుత్మంతుని వర్ణనము. విష్ణువాహనుడు = గరుత్మంతుడు బయలు దేరినాడు. చూడుడు. ఇతడు శ్రీహరి భక్తులలో చాల పెద్ద కీర్తి గల్గిన భాగ్యశాలి. శ్రీరంగనాథుని తన హృదయమందు తలచుచు బంగారు రంగు గలిగిన పక్షిరాజును నేనే అనుచు బయలుదేరినాడు. సముద్రుడు ప్రార్థింపగా హరి భక్తుల (ప్రహ్లాదుని, సముద్రుని) పరితాపమును తీర్చుదునని బయలు దేరినాడు. విరాజాధిపుడు= పక్షిరాజు (గరుత్మంతుడు), అహిరాజరాజి భోజి=సర్పముల రాసులను మ్రింగెడివాడు శ్రీహరిని స్మరించుచు ఈ లోకమునకు వచ్చుటకు బయలు దేరినాడు.

532. మధ్యమావతి = ఆది

ప॥ వినాయకుని వలెను బ్రోవవే నిను
వినా వేల్పులెవ రమ్మా॥ వినాయకుని॥

అ॥ అనాధరక్షకి – శ్రీ కామాక్షి సు
జనాఘ మోచని – శంకరి జనని॥ వినాయకుని॥

చ॥ నరాధములకును – వరాలొసగనుం
డరాములై భూ – సురాది దేవత
లు రాయిడిని జెం – దరాదు దయజూ
డరాద కాంచీ – పురాధి నాయకి॥ వినాయకుని॥

2 పితామహుడు జన – హితార్థమై ని
న్ను తాదెలియ వే – డితా లిమిగల య
వతార మెత్తిన – కతామసము సే
యతాళజాలము – నతార్తిహారిణి॥ వినాయకుని॥

3 పురాణి దయచే వరాలు మాకుని
కిరాజేసి బ్రో – చురాజధరి త్యా
గరాజుని హృదయ – సరోజ మేలే
మురారి సోదరి – పరాశక్తి నను॥ వినాయకుని॥

తాత్పర్యము :

ఇది కంచి కామాక్షిదేవి ప్రార్థనము. ఓ కామాక్షిదేవీ! నీ కుమారుడైన వినాయకుని వలె నన్ను రక్షించువారు నీవు గాక ఎవరున్నారమ్మా? నీవు దిక్కులేని వారిని రక్షించుదానవు. సుజనుల పాపములను పోగొట్టుదానవు. సమస్త జగత్తులకు తల్లివి, సుఖము కలిగించుదానవు. నరాధములకు కూడ నీవు వరాలిచ్చే దానవయి యుండగా బ్రాహ్మణులు దేవతలు – వ్యధ చెందరాదు కదా! కనుక దయచూడము. ఓ కాంచీపురాధి నాయకీ! బ్రహ్మ జనుల హితము కొరకు నిన్ను తెలియగోరి తానువేడగా దయాగుణము కలిగిన అవతార మెత్తినావు కదా! ఇక నీవు మమ్ము రక్షింపకపోతే తాళలేము. ఓపురాణీ! దయతో వరాలు మాకు వచ్చేటట్లు చేసి రక్షించే చంద్రధారిణివి. త్యాగరాజు యొక్క హృదయ పద్మమును ఏలెడి దానవు. శ్రీహరి యొక్క సోదరివి – పరాశక్తివి. నన్ను నీ వినాయకుని వలె రక్షింప వలసినది అని ప్రార్థనము.

533. బలహంస = ఆది

ప॥ విరాజ తురగ రాజ రాజేశ్వర॥
నిరామయుని జేయవే విరాజ॥

అ॥ జరాది రోగయుత తనువు చే
నరాధములు ఏమి సాధించిరి॥ విరాజ॥

చ॥ నిరంతరము సకలవిషయ దుఃఖ
పరంపరలచే జివుకగ మదిలో
దురంత కామమదము బాధింపగ
దుర్మతియౌ త్యాగరాజ సన్నుత॥ విరాజ॥

తాత్పర్యము :

విరాజ తురగ=గరుడవాహనా! రాజ రాజేశ్వర=రాజాధి రాజా! రామా నన్ను నిరామయుని చేయుము. (రోగము లేని వానినిగా జేయుము). జర = ముసలితనము మొదలగు రోగములతో కూడిన ఈ శరీరముతో నరాధములు=భక్తిహీనులు ఏమి సాధింప గలిగినారు? ఏమియు సాధింపలేదు. సమస్త ఇంద్రియముల సంబంధించిన దుఃఖములు ఎడతెగక శరీరము చివికిపోగా అనేక కోరికలు బాధించుచుండగా బుద్ధి భ్రంశముతో మానవుడు నశించునుకదా!

విశేషము=పర్యవసానముగా త్యాగయ్యగారు రోగములేని శరీరమును కోరుకొన్నారు. శ్యామశాస్త్రికూడ ''కృప జూచి సంతత మరోగదృఢ శరీరముగను సలుపునను'' అని కామాక్షీదేవిని రోగములేని బలమయిన శరీర మిమ్మని కోరుకున్నారు. ''శరీర మాద్యంఖలు ధర్మసాధనం''=ధర్మ సాధనములలో శరీరము మొదటిది'' అని శాస్త్రము. అందుచేత భక్తులు కూడ తమ ధర్మమయిన భక్తిని, భక్తి కార్యములను కొనసాగించు కొనుట కొరకు వ్యాధిలేని దృఢశరీరమును కోరుకొందురు. త్యాగయ్యగారు చేసిన దిదే. ఇంద్రియముల సంగము వలన కామము, దాని వలన క్రోధము, దాని వలన సమ్మోహము, దాని వలన బుద్ధినాశము, దాని వలన ఆత్మనాశము సంభవించును. అయ్యగారు వీటినుండి కూడ తప్పించమని రాముని ఈ కృతియందు కోరిరి.

534. కేదార గౌళ = రూపకం

ప॥ వేణుగాన లోలుని గన – వేయి కన్నులు కావలెనే॥ వేణు॥

అ॥ (అలి) వేణు లెల్ల దృష్టి చుట్టి – వేయుచు మ్రొక్కుచురాగ॥ వేణు॥

చ॥ వికసిత పంకజ వదనలు – వివిధ గతుల నాడగ॥
నొకరి కొకరు కరమున నిడి – యోరగనుల జూడగ॥
శుకరవములు గల తరుణులు – సొగసుగాను బాడగ
సకల సురలు త్యాగరాజ – సఖుడని వేడగ వచ్చే॥ వేణు॥

తాత్పర్యము :

వేణుగాన లోలుని ఒక లీలను భావించి అయ్యగారు దాని తీరును వర్ణించిన దిది. ఆహా!! ఈ వేణుగాన లోలుని చూచుటకు వేయి కన్నులు కావలెను కదా! గోపస్త్రీలు తమ కన్నులతో చుట్టివేస్తూ మ్రొక్కుచు వస్తున్నారు. కొందరు నాట్యమాడుచున్నారు. ఒకరి నొకరు చేతులతో కృష్ణుని పట్టుకొని ఓరచూపుల చూచుచున్నారు. చిలుకలవంటి కంఠస్వరము కల తరుణులు సొగసుగా పాడుచున్నారు. ఆకసమందు ఈ దృశ్యమును చూచుటకు చేరిన దేవతలు వేణుగానలోలుని త్యాగరాజ సఖుడని పాడుచున్నారు. ఇన్నిటి మధ్య విలసిల్లు వేణుగాన లోలుని కనుటకు వేయి కన్నులు కావలెనని వర్ణనము.

535. మోహన = చాపు (నౌకాచరితము)

ప॥ వేదవాక్యమని యెంచిరియీ
వెలదు లెల్ల సమ్మతించిరి॥ వేద॥

చ॥ చీరలన్నియు వద – లించిరి ఎంతో
సిగ్గు చేత నందు నుంచిరి॥ వేద॥

2 అందున నిలువక పోయెను – మేను
లందరికి తడవ నాయెను॥ వేద॥

3 కనుగొందురో యని సరగున బాలింక్ష
కరముల మూయ మరగునా॥ వేద॥

4 మానములను మూసుకొందురో – తమ
ప్రాణములను గాచుకొందురో వేద॥

5 చెలుల నోరెండగ నాయెను – నీరు
చిలు చిలుమని యెక్కువాయెను-- వేద॥

6 వల్వలు కానక పోయెను – సతుల
వదనము లటు స్రుక్కినాయెను॥ వేద॥

7 కరగి కరగి అంగలార్చిరి – చెలులు
కమలాక్షు నురమున జేర్చిరి॥ వేద॥

8 కనుల కాటుక నీరు కారగా, జూచి
కాంతు డెంతో ముద్దు గారగా॥ వేద॥

9 రమణుల మదమెల్ల జరిగెను త్యాగ
రాజనుతుని మది కరగెను॥ వేద॥

తాత్పర్యము :

కృష్ణుడు గోపికలు కలసి యమునలో నౌకా విహారం చేస్తున్నారు. కృష్ణుడు తమ వశమైనాడని గోపికలకు గర్వము హెచ్చినది. ఇంతలో కారు మేఘములు క్రమ్మి వడగండ్లతో పెద్దగాలివాన మొదలయినది. అంతే కాక వడగండ్లతో నౌక చిల్లులు పడినది. గాలికి నౌక ఊగిపోతున్నది. చిల్లులగుండా నీరు నౌకలోని కెక్కుచున్నది. అప్పుడు కృష్ణుడు గోపికలను తమ చీరలను విప్పి నౌకారంధ్రములను పూడ్చమని ఉపాయము చెప్పినాడు.

గోపికలు కృష్ణుని మాటను వేద వాక్యముగా నమ్మి సిగ్గు పడుచునే చీరలు విప్పి నౌకారంధ్రములలో నుంచారు. ఆ చీరలు రంధ్రములలో నిలువక కొట్టుకొని పోయినవి. ఒడలంతయు తడసినది. కృష్ణుడు చూడకూడదని స్తనములను, రహస్యాంగమును చేతులతో మూసుకున్నారు. కాని అవి మరుగు పడలేదు. ఒకవైపు మానము, ఒకవైపు ప్రాణము. గోపికలు సందిగ్ధావస్థలో పడ్డారు. నోరెండిపోతున్నది. క్రింద నీరు నిండిపోతున్నది. చీర లసలు కనిపించలేదు. అప్పుడు గోపికలు కృష్ణుని రొమ్మునకు హత్తుకొనిరి. కాటుక కన్నీరుగా కారిపోవుచున్నది. అప్పటికి వాళ్ల మదము జారిపోయినది. కృష్ణుని మనసు కూడ కరిగినది. ఇది త్యాగయ్యగారి స్వకపోల కల్పితమైన ''నౌకాచరితము''లోని ఒక ఘట్టము.

విశేషము = ఇది భాగవతములోని గోపికా వస్త్రాపహార కథను త్యాగయ్యగారు కొద్ది మలుపు త్రిప్పి గోపికా గర్వాపహారము చేసిన కథ. ఇందు ధ్వని. యమునా ప్రవాహము సంసారము, గోపికలు, జీవులు. నౌక భక్తి (అది సంసారమును దాటించునది). ఐహిక విషయములు రంధ్రములు. చీరలు మానవుని ఆవరించు అహంకారాదులు. ఆ ఆవరణములు తొలగితే భగవదనుగ్రహము. నౌకాచరిత ప్రబంధము ఈ పై విషయమును ధ్వనింపజేయు వస్తుకావ్యము. గోపికలు, నౌక, ప్రవాహము ఇవి వాచ్యములు మాత్రమే. ఈ ప్రబంధమందు రసములు శృంగార కరుణములు. శృంగారము అంగిరసము. కరుణము అంగరసము. ఆశృంగారమే భక్తి రసము. అయ్యగారు ''నౌకాచరితము'' అనే పేరుతో వస్తు కావ్యమును రచించినారు కనుక ''వరోవస్తు కవిః'' అనే శాస్త్రము ప్రకారము వాగ్గేయకార శ్రేష్ఠుడు.

536. మధ్యమావతి = ఆది

ప॥ వేంకటేశ నిను సేవింపను పది
వేల కనులు కావలెనయ్య॥ వేంక॥

అ॥ పంకజాక్ష పరిపాలితమునిజన
భావుకమగు దివ్యరూపమును గొన్న॥ వేంక॥

చ॥ ఎక్కువ నీవని దిక్కుల బొగడ
అక్కర గొని మది సొక్కి కనుంగొన
నిక్కము నీవే గ్రక్కున బ్రోవు – త
ళుక్కని మెరసే చక్కదనము గల॥ వేంక॥

2 ఏనోము ఫలమో – నీ నామా మృత
పానము అను సో – పానము దొరకెను
శ్రీ నాయక వర – మానంద నీ సరి
గానము శోభాయ – మానాంఘ్రులు గల॥ వేంక॥

3 యోగి హృదయ నీ – వే గతియను జన
భాగధేయ వర – భోగీశ శయన
భాగవత ప్రియ – త్యాగరాజనుత
నాగా చలముపై – బాగుగ నెలకొన్న॥ వేంక॥

తాత్పర్యము :

అయ్యగారు ఒక యాత్రలో తిరుపది (తి) వెళ్లారు. దర్శనానికి అవరోధముగా తెర ఉన్నది. ''తెరదీయగరాదా'' అని ప్రార్థించారు. తెర తొలగినది. దివ్య సాక్షాత్కారము కలిగినది. ఆ అనుభూతియే ఈ కృతి. ఓ వేంకటేశా! నిన్ను సేవించుటకు (చూచుటకు) పదివేల కన్నులు కావలెనయ్యా! మంగళ కరమయిన దివ్యరూపము నీది. నీవు సర్వాధికుడవని నీ కీర్తి దిక్కుల దిక్కుల ప్రాకినది. నా అవసరముతో నేను వచ్చి సేవించినాను. నను బ్రోవుము. ఆహా! ఏమి నీ కనుల అందము? తళుక్కున మెరయుచున్నవి. నీ నామామృతము నానోము ఫలముగా దొరకినది. ఇది మోక్షమనే సౌధమునకు మొదటి మెట్టు. నీ పాదములు దివ్యముగా శోభిల్లుచున్నవి. యోగి హృదయముల నుండు వాడవు. నాగాచలముపై (శేషాచలము) నెలకొన్నవాడవు. భక్తులకు భాగ్యమవు. ఇట్టి నిన్ను సేవింప పదివేల కనులు కావలెనని అయ్యగారు పరవశించి పాడినారు.

537. సురటి = ఆది

ప॥ వేరెవ్వరే గతి మాకు – వేమారులకు సీతాపతి॥ వే॥

అ॥ ఈరేడు లోకములకా – ధారుడగు నినువినా॥ వే॥

చ॥ బృందారక బృంద సనకస – నందన శ్రీనారదార
వింధోద్భవ – భవపు
రందరులకు త్యాగ – రాజునికి నినువినా॥ వే॥

తాత్పర్యము :

ఓ సీతాపతీ! ఈ పదునాలుగు లోకములకును ఆధారమయిన నీవు కాక బ్రహ్మ, శివ, ఇంద్రాది దేవతలకు, నారద సనకాదిమునులకు, మాకును వేరెవ్వరును గతిలేరు.

538. పంతువరాళి = రూపకము

ప॥ శంభో మహాదేవ – శంకర గిరిజా రమణ॥ శంభో॥

అ॥ శంభో మహాదేవ – శరణాగత జనరక్షక
అంభోరుహలోచనప – దాంబుజ భక్తిందేహి॥ శంభో॥

చ॥ పరమ దయాకర మృగధర – హర గంగాధర ధరణీ
ధర భూషణ త్యాగరాజ – వరహృదయని వేశా॥
సుర బృంద కిరీట మణీ – వర నీరాజిత పద – గో
పురవాస సుందరేశ – గిరిశ పరాత్పర భవహర॥ శంభో॥

తాత్పర్యము :

ఇది గోవూరు సుందరేశ్వరుని స్తుతి పరమయిన సంస్కృతకృతి. ప్రతి పదార్థము వ్రాయబడుచున్నది. శంభో, మహదేవ, శంకర, గిరిజారమణ=పార్వతీరమణా, శరణాగత జన రక్షక=శరణుజొచ్చిన వారిని రక్షించువాడా! అంభోరుహలోచన పదాంబుజ భక్తిం=పద్మాక్షుడయిన విష్ణువు పాదములపై భక్తిని, దేహి=ఇమ్ము. పరమదయాకర=ఎక్కువ దయగలవాడా, మృగధర=లేడిని ధరించినవాడా, హర=హరుడా, గంగాధర=గంగను ధరించినవాడా, ధరణీ ధర భూషణ=కైలాస పర్వతమునకు భూషణమైన వాడా, త్యాగరాజ వర హృదయ నివేశ=త్యాగరాజుని హృదయమందు నివసించువాడా, సురబృంద---పద=దేవతల కిరీటముల మణులతో నీరాజనము చేయబడిన పాదములు గలవాడా, గోపురవాస=గోవూరియందు వసించువాడా, సుందరేశ=సుందరేశ్వరుడా, గిరిశ=కైలాసగిరియందు శయనించువాడా, పరాత్పర=మిన్న కన్న మిన్న అయినవాడా, భవహర=సంసారమును హరించువాడా, విష్ణుభక్తి నొసంగుము.

విశేషము = బ్రహ్మవైవర్త పురాణమందు శివుడు పార్వతితో ''వైష్ణవానామహం శ్రేష్ఠః''=విష్ణుభక్తి కలిగిన వారిలో నేను శ్రేష్ఠుడను అని చెప్పును. కనుక విష్ణుభక్తిని నాకొసగుము. అని అయ్యగారు సుందరేశ్వరుని కోరినారు.

539. శంకరాభరణం = రూపకం

ప॥ శంభో శివ శంకర గురు – అంభోరు హనయన॥ శంభో॥

చ॥ ధరణీ ధరవర భూషణ – సురసేవిత చరణ॥ శంభో॥

2 తరుణారుణ కిరణాభసు – చరణా మదహరణా॥ శంభో॥

3 కమనీయ నిగమ సన్నుత – హిమగిరిజా రమణా॥ శంభో॥

4 శమనాంతక విమలాంగ ప– రమ కారుణ్య నిధే॥ శంభో॥

5 సమలంకృత కమలాహిత – కమలాసుత హరణా॥ శంభో॥

6 నత పోషణ హితభాషణ – ధృతచారుకురంగ॥ శంభో॥

7 మత భేద పతిత మానవ – మదసంతత భంగ॥ శంభో॥

8 సుతపోధన హితకర పా – లిత త్యాగరాజ॥ శంభో॥

తాత్పర్యము :

ఈ కృతి అంతయు సంస్కృత సంబోధనములే. వాక్యమును పూర్తిజేయు క్రియలేదు. అవసరమని తోచిన వాటి ప్రతిపదార్థము వ్రాసెదను. అంభోరుహనయన= అగ్నినేత్రముకలవాడా! తరుణా---కిరణాభ=లేత సూర్యుని కిరణముల కాంతి గలవాడా, కమనీయ---సన్నుత=చక్కని వేదవములచే నుతింపబడువాడా, శమనాంతక=యమునికి అంతకుడా, సమ---హిత=చంద్రుని అలంకరించుకొన్నవాడా, కమలాసుత హరణ=మన్మధుని హరించినవాడా, ధృత చారుకురంగ=చక్కని లేడిని చేత బట్టిన వాడా, దుర్మతములయందు పడిన వారి మదమును హరించువాడా.

540. కుంతలవరాళి = ఆది

ప॥ శర శర సమరైక శూరా – శరధిమదవిదారా॥

అ॥ సురరిపుమూల బలమను తూల – గిరులకనల సమమౌ శ్రీరామ॥ శర॥

చ॥ తొలిజేసిన పాప వన కుఠారమా
కలనైనను జేయగలేని
బలు విలును విరచి – దెలసిన శ్రీరఘు
కులవర బ్రోవుము – త్యాగరాజనుత॥ శర॥

తాత్పర్యము :

శర----శూరా=ఒక్కొక్క బాణముతో చిత్ర యుద్ధము చేయుట యందు శూరుడా, శరధి--విదారా=సముద్రుని మదమును అణచిన వాడా, రావణుని మూలబల మనెడి దూది కొండలకు నిప్పయినవాడా, నేను చేసిన పాపము లనెడి అడవికి గొడ్డలి అయిన వాడా, కలలో నైనను ఊహింపలేనట్లు శివధనస్సును విరచిన రఘుకుల శ్రేష్ఠుడా రక్షించుము అని ప్రార్థనము

541. చంద్రజ్యోతి = ఆది

ప॥ శశివదన భక్తజనావన – శంకరనే దాళగలనా॥

అ॥ పసిదన మందే – ముని యాగమున నీ
బాహు పరాక్రమ – మునెరుంగనా – రాకా॥ శశి॥

చ॥ దిన దిన మౌపాసన జపతపోధ్యాన
మను యాగము వేళ – మనసున బుట్టిన
ఘన దంభునితో – డను మారీచుని
పని చెరచిన యా – త్యాగరాజార్చిత॥ శశి॥

తాత్పర్యము :

శశి వదనా!=చంద్రవదనా! భక్తులను బ్రోచువాడా! సుఖకరుడా! (నీవు రక్షించకపోతే) నేను తాళగలనా? పసి తనములోనే విశ్వామిత్రుని యాగమును కాచిన నీ బాహుపరాక్రమమును నేనెరుగనా? నేను చేయునది కూడ ఒక యాగమే. నీ జపము, నిన్ను గూర్చి తపము, నీ ధ్యానము, ఇవన్నియు ఒక యాగము. దీనిని చెడగొట్టుటకు దంభమను మారీచుడు నామనస్సులో పుట్టుచున్నాడు. కనుక ఈ మారీచుని పనిని ధ్వంసము చేయుమని అయ్యగారి ప్రార్థనము.

విశేషము = దంభమనగా మనశ్శుద్ధి లేక బాహ్యమునకు చేయు జపము మొదలయినవి. ఈ దంభము (దంభుడని కూడ అందురు) విశ్వా మిత్రుని యాగమును చెరచుటకు వచ్చిన మారీచుని వంటివాడు. వానిని పడగొట్టినట్లే వీనిని కూల్చి నా జప యజ్ఞమును నిర్విఘ్నముగా కొనసాగజేయుమని ప్రార్థనము.

542. మధ్యమావతి = ఆది

ప॥ శరణు శరణనుచు – మొరలిడిననా
గిరములన్ని పరి – యాచకమౌనా శరణు॥

అ॥ శరజన యనా పరమపురుష నిన్ను
సరణతో కరుణతో మరి మరి॥ శరణు॥

చ॥ శరము తరుమ తరముగాక కాకా
సురుడు సురుల నరయ వేడగాను – ద
శరధ వరకుమా – రుని బాణమనుచు
వెరచి జరగ మరల తాను గని గా
బరపడి నరగున శరణను మాత్రము
నిరవుగను రజత – గిరినాధాదులు
వరమగు బిరుదున సరసత మెచ్చను
కరుణను స్థిరముగ – వరమిచ్చిన నిను॥ శరణు॥

2 మునుపు మనసున న – సూయలను తపో
ధనుడు వినయమున – ను ద్రౌపదిని శో
ధనము ఘనముగ నిజమున సేయ ధృఢ
మునను తన మదిని శరణన గానే
కనికరమున వేగన నీవెంతో
చనవున మునులు సు – జనులుసురాసుర
గణము లవని పా – లవరులు బొగడను
వనజనయన – లఘువున – బ్రోచిన నిను॥ శరణు॥

3 మదిని బెదరు సుద – తిని గని నీదు
పదములు దయను ధరలోను బ్రోచే
గదర మదజనద – ళనా పఘన జిత
మదన బుధజన ధన – త్యాగ రాజ
హృదయ నిలయ జలధర సంహనన
రిదమన సదమల రదన మునిమన
స్పదన శుభద నను ముదమున బ్రోవుము
సదయుడ కొదవల సడలింపుము నిను॥ శరణు॥

తాత్పర్యము :

రామా! నిన్ను అనుసరించి నేను మరీ మరీ నిన్ను శరణని పలికిన నా పలుకులన్నీ నీకు పరిహాసములైనవా? నీ గుణము శరణన్న వానిని రక్షించు గుణముకదా! అపరాధి అయిన కాకాసురునిపై బాణము వదలితివి. అది వానిని తరిమినది. వాడు దేవతలనందరిని కాపాడుడని అర్థించినాడు. వారు రామ బాణమును మేము మరల్పలేము

అనిరి. వాడు వేరుగతి లేక నిన్ను శరణని నాడు. అప్పుడు సకల దేవతలు మెచ్చగా వానిని కాపాడినావు. ఇటువంటి నిన్ను శరణనినాను. మరియు పాండవులు అరణ్యవాసము చేయుచుండగా దుర్వాసు డసూయతో వచ్చి ద్రౌపదిని పరీక్షింపబోగా ద్రౌపది నిన్ను ధృఢమనస్సుతో శరణన్నది. అపుడు సమస్తలోక వాసులు మెచ్చునట్లు ఆమెను రక్షించినావు. అట్టి నిన్ను శరణుజొచ్చినాను. శాపగ్రస్తురాలయిన అహల్యను పాదములతో రక్షించినావు. నా కొరతలను దీర్చి నన్ను రక్షింపుము. అని వేడికోలు.

విశేషము = పాండవులు ద్వైతవనంలో నుండగా దుర్యోధనుని ప్రేరణతో దుర్వాసుడు వచ్చి అన్న మడిగినాడు. అందరు భుజించిరి. అన్నము లేదు. ముని పరివారముతో వచ్చినాడు. అన్నము పెట్టనిచో దుర్వాసుడు శపించును. పరివారముతో స్నానము చేసి తిరిగి వచ్చును. దిక్కుతోచక ద్రౌపది కృష్ణని శరణని స్మరించినది. హరివచ్చి ''ద్రౌపదీ నీవు కడిగిన పాత్రలో అంటు కొనిన ఒక్క మెతుకు ఉంటే పెట్ట మనినాడు. ఆమె అట్లే చేసినది. స్నానము చేయుచున్న దుర్వాసునకు శిష్యులకును ఒక్క మెతుకుకు కూడ చోటు లేని విధముగా కడుపులన్నియు బాగా నిండిపోయినవి. దుర్వాసుడు సిగ్గుపడి శిష్యులతో సహాపరారి అయినాడు. కృష్ణ శరణాగతితో ఆనాడు పాండవులు రక్షింపబడినారు. ఈ కథ జైమిని భారతము లోనిది.

543. పంతువరాళి = ఆది

ప॥ శివ శివ శివ యన రాదా ఓరీ
భవ భయ బాధల నణచుకోరాదా॥ శివ॥

చ॥ కామాదుల దెగగోసి పర
భామల పరుల ధనముల రోసి
పామరత్వము నెడబాసి – అతి
నేమముతో బిల్వార్చన జేసి॥ శివ॥

2 సజ్జన గణముల గాంచి ఓరీ
ముజ్జగదీశ్వరులని మతి నెంచి
లజ్జాదుల దొలగించి తన
హృజ్జలజమునను పూజించి॥ శివ॥

3 ఆగమముల నుతియించి బహు
బాగులేని భాషలు చాలించి
భాగవతులను పోషించి ఓరీ
త్యాగరాజ సన్నుతుడని యెంచి॥ శివ॥

తాత్పర్యము :

ఇది శివుని పూజ జేయుమని మానస బోధము. ఓరీ జీవా శివ శివ అని స్మరించరాదా? సంసార బాధలను అణచుకోరాదా? కామ క్రోధములను తెగగోయుము. పరభావములను పర ధనములను రోయుము. పామరత్వమును పోగొట్టుకొని అతినియమముతో శివునకు బిల్వార్చన చేయుము. సజ్జనులను చూచి వారిని భగవంతునిగా భావింపుము. పూజ చేయుటలో సిగ్గు పడకు. హృదయములో శివుని నిల్పి పూజించుము. వేదమంత్రములతో శివుని నుతించు. చెడ్డ మాటలను చాలించు. భాగవతులను ఆతిథ్య మిచ్చి సత్కరించు. త్యాగరాజ నుతుడని శివుని పరిగణించు. అని శివ పూజను బోధించిరి.

544. కల్యాణి = ఆది

ప॥ శివే పాహిమా మంబికే – శ్రిత ఫలదాయికే॥ శివే॥

అ॥ కవేర జోత్తర తీర వాసిని – కాత్యాయని ధర్మ సంవర్ధని॥ శివే॥

చ॥ స్వభావమౌనీ – ప్రభావము మహా
నుభావు రాలైన భారతికి పాగ
డ భారమై యుం డ భావజారా
తిభామ నేనంత భాగ్యదాయకి॥ శివే॥

2 కలార్ధమిది శశి – కలాధరీ – ఉప
బలారి మాయా విలాసినీ స
కలాగమనుతే భలారియన శుభ
ఫలా లొసగు పర – మలాలనమ్మున॥ శివే॥

3 చరా చరమయీ – కరార విందము
న రామ చిలుకను – బిరాన బూని

పరాకుగా జూ – డరాదు శ్రీ రఘు
వరాప్తుడగు త్యా – గరాజ వినుతే॥ శివే॥

తాత్పర్యము :

శివే= ఓ పార్వతీ!, అంబికే= తల్లీ, శ్రిత ఫలదాయికే= ఆశ్రితులకు ఫలములిచ్చుదానా, మాం= నన్ను, పాహి= రక్షించుము. కవేరజోత్తరతీరవాసిని= కావేరి ఉత్తర తీరమందు వసించుదానా, కాత్యాయని= ఓ కాత్యాయనీ! ధర్మ సంవర్ధని= ధర్మమును వృద్ధి పొందించుదానా! (ఈ మూడు సంబోధనములను ''మాంపాహి'' కన్న ముందు చెప్ప వచ్చును. ఇది పల్లవి అనుపల్లవి. ఇంతవరకు సంస్కృతము). స్వత స్సిద్ధమయిన నీ ప్రభావము వర్ణించుటకు మహానుభావురాలైన సరస్వతికే కష్టము. ఇక నేనెంత? అయినా నే చెప్పినది ఒక కలార్ధము. అంటే చాలా స్వల్పమన్నమాట. ఓ చంద్ర కలాధరీ! ఓ విష్ణు మాయా విలాసినీ! ఓ వేద వినుతురాలా! అందరును భలే అనునట్లు నన్ను లాలించి శుభ ఫలము లిమ్ము. ఓ చరాచర స్వరూపు రాలా! కరమున చిలుకను ధరించిన దానవు. నన్ను పరాకుగా చూడరాదమ్మా అని ధర్మ సంవర్ధనిని ప్రార్థించినా రయ్యగారు

545. సామరాగం = ఆది తాళం

ప॥ శాంతము లేక సౌఖ్యము లేదు – సారస దళనయనా॥ శాంతము॥

అ॥ దాంతునికైన వే – దాంతుని కైన॥ శాంతము॥

చ॥ దారసుతులు ధన– ధాన్యములుండిన
సారెకు జపతప – స్సంపద కలిగిన॥ శాంతము॥

2 యాగాది కర్మము – లన్నియు జేసిన
బాగుగ సకల హృ – ద్భావము దెలిసిన॥ శాంతము॥

3 ఆగమ శాస్త్రము – లన్నియు చదివిన
భాగవతులనుచు – బాగుగా పేరైన॥ శాంతము॥

4 రాజాది రాజశ్రీ – రాఘవ త్యాగ
రాజ వినుత సాధు – రక్షక తన కుప॥ శాంతము॥

తాత్పర్యము :

ఓ సారస దళనయనా! = పద్మ దళ నేత్రా రామా! శాంతమనేది లేకపోతే సౌఖ్యము లేదు. బాహ్యేంద్రియములను జయించినవానికైనా, వేదాంతము చదివిన వానికైనా, భార్యాపుత్రులు ధన ధాన్యములు కలవానికైనా, జప తపములు చేసిన వానికైనా, యాగములు చేసినా వానికైనా, అందరి హృదయములు తెలిసిన వానికైనా, వేదశాస్త్రములు చదివిన వానికైనా, భాగవతుడని పేరు పొందిన వానికైనా, ఓ రామా! మానసికమయిన ఉప శాంతి లేని వానికి సౌఖ్యము లేదని పరమ సత్యమును అయ్యగారు ఈ కృతియందు తెలిపిరి.

546. సురటి = ఆది (నౌకాచరితము)

ప॥ శృంగారించుకొని వెడలిరి – శ్రీ కృష్ణునితోను॥ శృం॥

అ॥ అంగరంగ వైభోగముతో – గో
పాంగనామణులెంతో సాగసుగ॥ శృం॥

చ॥ నవ్వుచు గులుకుచు నొకతె ... కొప్పున
బువ్వులు ముడుచుచు నొకతె
దువ్వుచు గురులను నొకతె – కృష్ణుని
రవ్వజేయుచు నొకతె – వేడ్కగ॥ శృం॥

2 మగడు వీడనుచు నొకతె– రవికయు
బిగువున జేర్చుచు నొకతె –
తగును తన కనుచు నొకతె – పాద
యుగమున నొత్తుచు నొకతె – వేడ్కగ॥ శృం॥

3 సొక్కుచు సోలుచు నొకతె – కృష్ణుని
గ్రక్కున ముద్దిడు నొకతె –
ప్రక్కకు రమ్మను చొకతె – మడుపుల
నక్కర నొసగుచు నొకతె – వేడ్కగ॥ శృం॥

4 పరిమళ మందుచు నొకతె – శ్రీ
హరి హరి యనుచును నొకతె

యురమున జేర్చుచు నొకతె – పయ్యెద
జరిపి వేడుకొను చొకతె – వేడ్కగ॥ శృం॥

5 సారసాక్ష యనుచొకతె – కను
సైగను బిలుచుచు నొకతె –
రారాయనుచును నొకతె – త్యాగ
రాజ సఖుడనుచు నొకతె – వేడ్కగ॥ శృం॥

తాత్పర్యము :

ఇది నౌకాచరితములోనిది. కృష్ణుడు గోపికలు ఆనందముగా నౌకలో నెక్కిరి. గోపికలు కృష్ణునితో చేసిన విలాసము లిందు వర్ణింపబడినవి. శృంగారించుకొని అంగరంగవైభోగములతో బయలుదేరినారు. ఒకతె నవ్వుచు కులుకుచు, ఒకతె కృష్ణుని కొప్పున పూలు ముడచున్నది. ఒకతె నీవేనా మగడ వనుచున్నది. ఒకతె రవిక బిగించుచున్నది. ఒకతె పాదము లొత్తుచున్నది. ఒకతె కృష్ణస్పర్శచేత పరవశించుచున్నది. ఒకతె ముద్దు బెట్టుకొనుచున్నది. ఒకతె తన ప్రక్కకు రమ్మనుచున్నది. ఒకతె తాంబూలమిచ్చుచున్నది. ఒకతె చందన మలదు చున్నది. ఒకతె హరినామము లుచ్చరించుచున్నది. ఒకతె పైట జార్చుచున్నది. ఒకతె రొమ్మునకు హత్తుకొనుచున్నది. ఒకతె 'సారాసాక్షా' అని పిలుచుచు కనుసైగ చేయుచున్నది. ఈ విధముగా గోపికలు కృష్ణుని శృంగార లీలా విలాసములు జూపుచు బయలుదేరినారు.

విశేషము = అంగరంగవైభోగ మనగా? ఇందు అంగ–రంగ–వైభోగ అను మూడు పదములున్నవి. ఇది మహావైభవమనుటకు పర్యాయపదము. రంగనాథునకు వైభోగ మెక్కువ. రంగ డయిన కృష్ణుని భోగమునకు అనువుగా అంగములంకరించుకొని రన్నమాట. గోపికలు పలువురు, కృష్ణుడొక్కడే ఒక్కొక్క తె కొక్కొక్కడుగా భాసించు చున్నాడు. 'కృష్ణ కర్ణామృతము' 'అంగనా మంగనా మంతరే మాధవః। మాధవం మాధవం చాంతరే చాంగనా। ఇత్థ మాకల్పితే మండలే మధ్యగః। సంజగౌ వేణునాదేవకీ నందనః' = గోపికకు గోపికకు మధ్యలో కృష్ణుడు. కృష్ణునకు కృష్ణునకు మధ్యలో గోపిక. ఇట్లు కల్పింపబడిన మండలము యొక్క మధ్యలో కృష్ణుడు వేణువును వాయించుచున్నాడు. అని లీలాశుకుడు కృష్ణుని రాసలీలను వర్ణించినాడు. ప్రస్తుతము అయ్యగారి వర్ణనము దీనిని బోలియున్నది. అందు కర్తగా కృష్ణునకు ప్రాధాన్యము. ఇందు గోపికలకు ప్రాధాన్యము. భక్తి విషయములో గోపికాభక్తి ప్రధానమైనది. ఆ ఉద్దేశ్యముతో అయ్యగారిందు గోపికలకే ప్రాధాన్యమిచ్చిరి. 'నౌకాచరిత' మంటే ఇదే.

547. ధన్యాసి - రూపకం

ప॥ శ్యామ సుందరాంగ సకల – శక్తియు నీవేరా॥ శ్యామ॥

అ॥ తామస రహిత గుణసాంద్ర – ధరను వెలయు రామచంద్ర॥ శ్యామ॥

చ॥ దుష్ట దనుజమద విదార – శిష్ట జన హృదయ విహార
ఇష్ట దైవము. నీవేరా – ఇలను త్యాగరాజు వేరా॥ శ్యామ॥

తాత్పర్యము :

నల్లని అందమయిన శరీరము కలవాడా! నాకు సకల శక్తులు నీవే. తామస గుణము లేని గుణ సాంద్రుడవై భూమిని అవతరించిన ఓరామ చంద్రా! దుష్ట రాక్షసుల మదమణచిన వాడవై సాధు జనుల హృదయమందు విహరించు నీవు నా ఇష్ట దైవమవు. నన్ను వేరుగా తలపవలదు. అని ప్రార్థనము.

548. సా రాష్ట్రం = ఆది

ప॥ శ్రీ గణపతిని సేవింప రారే – శ్రితమానవులారా॥ శ్రీ॥

అ॥ వాగధి పతిను పూజల జేకొని – బాగ నటింపుచును వెడలిన॥ శ్రీ॥

చ॥ పనస నారికేళాది జంబూ – ఫలముల నారగించి
ఘనతరంబుగను మహిపై పదములు – ఘల్లు ఘల్లన నుంచి
అనయము హరి చరణయుగళము హృద – యాంబుజమున నుంచి
వినయమునను త్యాగరాజ వినుతుడు – వివిధగతుల ధీత్తళాంగు మని వెడలిన॥శ్రీ॥

తాత్పర్యము :

ఈ కృతి త్యాగయ్యగారి ఒక గేయ నాటక ప్రబంధములో గణపతి ప్రవేశమును వర్ణించునది. ఓ భక్తులారా! గణపతి వెడలినాడు. దర్శింప రండు. బ్రహ్మ చేయు పూజల నందుకొని నటించుచు వెడలినాడు. పనస, కొబ్బరి, నేరేడు పండ్లను భక్షించి గజ్జెలు ఘల్లు ఘల్లనగా భూమిపై పదవిన్యాసం చేస్తూ హరిని స్మరిస్తూ వివిధ లయ విన్యాసములతో ''ధీత్తళాంగు మనుచు వెడలినాడు శ్రీ గణపతి. సేవింపరండు'' అని.

549. భవప్రియ = ఆది

ప॥ శ్రీకాంత! నీ యెడ బలాతి బల – చెలగంగలేదా వాదా॥ శ్రీకాంత॥

అ॥ పాకారి నుత! నీవరి బలా – బలముల దెలియంగలేదా॥ శ్రీకాంత॥

చ॥ కాక దైత్యునేక శరమున నేయ – కంజ జాస్త్రమై పరగంగలేదా!
శ్రీకర! ద్విజులై – దారెరుంగలేని
చింతనీకు లేదా – త్యాగరాజనుత॥ శ్రీకాంత॥

తాత్పర్యము :

ఓ శ్రీకాంతా! శ్రీరామా! నీకు బలాతి బల విద్యలు తెలుసును కదా! పాకారిసుత=దేవేంద్రునిచే నుతింపబడినరామా! నీవు బలాతి బలవిద్యచేత అరిబలమును=శత్రువుల బలాబలములను తెలుసుకొన్నావు కదా! నీవు ఒక్క దర్భను వేస్తే అది బ్రహ్మాస్త్రమై అపరాధి అయిన కాకాసురునిముల్లోకములు త్రిప్పినది కదా! (ఇది బలాతి బల విద్యా ప్రభావమే కదా) ఈనాడు బ్రాహ్మణులై పుట్టి కూడ ఈ మంత్రపు ప్రభావమును తెలుసుకొనలేకున్నారు. ఈ చింత నీకు లేదా అని అయ్యగారు రాముని ప్రశ్నించినారు.

విశేషము = బలాతి బలవిద్య అంటే మరేదో కాదు. గాయత్రీ మంత్రమే. విశ్వామిత్రుడు తాటకా సంహారమునకు ముందు రామున కుపదేశించినదిదే. దీని వలన ఆకలి దప్పులు శ్రమము ఉండవు. దీనివలన శత్రువుల బలమెంతో దుర్బలమెంతో తెలుస్తుంది. కనుక కృతిలో ''నీవరిబలమును తెలియంగ లేదా'' అని ఉంటుంది. గాయకులు ''వ''ను దీర్ఘం చేసి ''నీవారి బలము'' అని తప్పుపాడుట, అర్థము చెప్పువారు దానికి తగిన అర్థము చెప్పుట పరిపాటి అయినది. కనుక దీనిని సవరించుట జరిగిన దిందులో. ఇక ప్రస్తుతము. ఈ మంత్రము శత్రువుల బలాబలములను తెలుపుతుంది. నారాయణుడు మధుకైటభులను సంహరించినది ఈ మంత్ర బలముతోనే. తరువాత ఈ మంత్రము యొక్క ప్రచారము తగ్గి యుండ వచ్చును. కాలక్రమంలో దీనిని విశ్వామిత్రుడు పైకి తీసినాడు. అందుచేతనే గాయత్రీ మంత్రమునకు అనుష్టుప్ ఛందః (శ్లోక వృత్తపు పేరు) విశ్వామిత్రో ఋషిః''=అనుష్టుప్ వృత్తము విశ్వామిత్రుడు కనుగొన్నవాడు'' అని చెప్పబడినది. ఈ విషయములు ''సావిత్ర్యు పనిషత్తున చెప్పబడియున్నది. ఉపనిషత్తు చివర ''అమృత రసకరా ర్ద్రాతౌ బలాతీ బలౌచ'' ఆ బల

అతిబలలు అమృత రసముతో తడిసిన చేతులు కలవారు అని చెప్పబడినది. ఇదే రామునకు విశ్వామిత్రుడు చెప్పినది. ఇదే గాయత్రీ మంత్రము. విశ్వామిత్రుని నుండి ఈ మంత్రము బ్రాహ్మణులకు సంధ్యావందనంలో ప్రధానమై పరంపరగా వస్తూ బ్రహ్మత్వమును నిలువ బెట్టుచున్నది. నేటి కాలమున బ్రాహ్మణులు సంధ్యావందన దూరులై గాయత్రీ దూరులయి ఉండుటకు చింతించి రామా వీరిని మంచిమార్గమునకు త్రిప్పవా అని ప్రార్థించినా రయ్యగారు.

550. కలకంఠి = ఆది

ప॥ శ్రీజనక తనయే – శ్రిత కమలాలయే
అ॥ రాజన్నవమణి భూషణే – శ్రీ రఘు
రామ సఖి సతతం --- మామవ శ్రీజనక॥

చ॥ శతవదనాద్యా – శర జల దానిలే
నతమానవమా – నసనత్సదనే
శతమఖ మకుటల – సన్మణి నీరా
జిత చరణే త్యా – గరాజార్చితే॥ శ్రీజనక॥

తాత్పర్యము :

ఇది సీతాదేవి స్తుతి పరమయిన సంస్కృతకీర్తన. శ్రీ జనక తనయే=శ్రీజనకుని కూతురా! కమలమును గృహమును ఆశ్రయించిన దానా! రాజన్నవమణి భూషణే= ప్రకాశించుచున్న నవరత్నపు నగలదానా! శ్రీరఘురామసఖి=శ్రీ రఘు రాముని చెలీ! శతవదనాద్యా శరజలదానిలే=శతకంఠ రావణుడు మొదలగు రాక్షస మేఘములను చెదరగొట్టు గాలియైన దానా! నతమానవ మానససత్సదనే= నమస్కరించు మానవుల మనస్సనెడు మంచి గృహము కలదానా! శతమఖ మకుట లసన్మణి నీరాజిత చరణ=ఇంద్రుని కిరీటము నందు వెలుగుచున్న మణులచే నీరాజనముకల పాదములు కలదానా! త్యాగరాజార్చితే=త్యాగరాజుచేత అర్చింపబడుదానా! సతతం=ఎల్లప్పుడు, మామవ=నన్ను రక్షించుము. అని సీతా ప్రార్థనము.

551. ఈశమనోహరి = దేశాది

ప॥ శ్రీ జానకీ మనోహరా – శ్రీరాఘవా శ్రీ॥

అ॥ నా జాలి నీవే తెలిసి నమ్మా
ననుడొట కేమి కారణము॥ శ్రీ॥

చ॥ నే సేయుదు – ష్మర్మదేవత
నీ సన్నిధిని – నిల్వసాగెనో
నీ సేవని – ల్పగ నేలరా
నీరజాక్ష! త్యాగ – రాజ సన్నుతా॥ శ్రీ జానకీ॥

తాత్పర్యము :

ఓ జానకీ మనోహరా! రాఘవా! నా దీనస్థితి తెలిసి నీవు తలవంచిన కారణమేమయ్యా? నేను చేసిన దుష్కర్మ దేవత నీ వద్ద నిలచి నన్ను చూడకుండ తలవంచుకొనునట్లు చేసినదా? నీ ముఖమును నీవు చూపక నా సేవ నిలిపినావు. అని అయ్యగారు జాలిగా ప్రార్థించిరి.

552. కానడ = రూపకం

ప॥ శ్రీ నారద నాదసర – సీరుహ భృంగ! శుభాంగ॥ శ్రీ॥

అ॥ దీన మాన రక్షక! జగ – దీశ! భేశసంకాశ॥ శ్రీ॥

చ॥ వేద జనిత వరవీణా – వాదన తత్త్వజ్ఞ
ఖేదకరత్రి తాపరహిత – ఖేచర వినుతా॥
యాదవకుల జాప్త సదా – మోదహృదయ మునివర్య
శ్రీద! త్యాగరాజవినుత – శ్రీకరమాం పాలయ॥ శ్రీనారద॥

తాత్పర్యము :

ఇది నారదుని స్తుతించు సంస్కృత కృతి. శ్రీ నారద= ఓ నారదా! నాదసరసీరుహ భృంగ=సంగీత నాద మనెడి పద్మమందు తుమ్మెద అయినవాడా! శుభాంగ=శుభకరమైన దేహము గలవాడా! దీనమాన రక్షక= దీనులయిన వారి అభిమానమును రక్షించువాడా!

జగదీశ=జగత్తులకు ఈశ్వరుడా! (ముల్లోకములను వశము చేసుకొని తిరుగువాడా అని భావము) భేశ సంకాశ=చంద్రుని వలె ప్రకాశించువాడా! వేద జనిత వరవీణా వాదన తత్త్వజ్ఞ=వేదమునందు పుట్టిన వీణను వాయించు తత్త్వమెరిగిన వాడా! ఖేదకరత్రి తాపరహిత=ఖేదము కలిగించు మూడు తాపములు లేనివాడా! ఖేచర వినుత=ఆకసమందు చరించు దేవతలచే నుతింపబడువాడా! యాదవకుల జాప్త=యాదవకులమందు పుట్టిన కృష్ణునకు ఆప్తుడా! సదామోద హృదయ=ఎప్పుడును ఆనందముతోడి హృదయము కలవాడా! (హరిస్మరణముచే) మునివర్య=మునులలో శ్రేష్ఠుడా! (దేవ ముని కనుక) శ్రీద=శుభమిచ్చువాడా! త్యాగ రాజవినుత=త్యాగరాజుచే నుతింపబడువాడా! శ్రీకర=హరిభక్తియను సంపదను కలిగించువాడా! మాం=నన్ను, పాలయ=రక్షింపుము.

విశేషము=ఖేదము కలిగించు మూడు తాపములను ''తాపత్రయము'' అంటారు. ఆది భౌతికము అని, ఆధి దైవికము అని, ఆధ్యాత్మికము అని మూడు ఆది భౌతికమంటే శరీరమునకు కలిగే వ్యాధి వంటిది. ఆధి దైవికమంటే గాలివాన అగ్నిప్రమాదము వంటిది. అధ్యాత్మిక మంటే మనస్సుకు సంబంధించిన చికాకు. ఇవి నారదునకు లేవు. సంసారులకు ఇవితప్పవు. తరువాత ఇందులో ''శ్రీకర'' అనుదానికి హరిభక్తి కలిగించువాడా అని అర్థము వ్రాయుట జరిగినది. శ్రీ అనగా సంపద అని అర్థము. ఐహికముగా ఈ అర్థము ధన కనకాదులకు వర్తిస్తుంది. నారదుడు కలిగించు సంపద హరిభక్తియే. ఈవిషయమున పెద్దల నిర్వాహములు చాల కలవు.

553. ఫలమంజరి = ఆది

ప॥ శ్రీనారసింహ! మాంపాహి। క్షీరాబ్ధి కన్యకారమణ॥ శ్రీ॥

అ॥ దీనార్తి నివారణ భవ్యగుణ। దితితనయ తిమిర సూర్య త్రినేత్ర॥ శ్రీ॥

చ॥ ప్రహ్లాద పరాశర నారద హృ। త్పంకేజ నీరజ బంధో
ఆహ్లాదకరాశుభ రోగ సం। హార వరద త్యాగరాజాది వినుత॥ శ్రీ॥

తాత్పర్యము :

ఇది నరసింహ స్తుతి పరమైన సంస్కృత కృతి. శ్రీనార సింహ= ఓ నరసింహదేవా! క్షీరాబ్ధి కన్యకా రమణ=క్షీరసముద్రుని కూతురయిన లక్ష్మీదేవి భర్త అయినవాడా! దీనార్తి నివారణ =దీనుల బాధలను తొలగించువాడా! భవ్యగుణ=శుభగుణములు గలవాడా!

దితితనయ తిమిర సూర్య = రాక్షసులనెడి అంధకారమును పారద్రోలు సూర్యుడా! త్రినేత్ర = సూర్యచంద్రులు అగ్ని అను మూడు నేత్రములు కలవాడా! ప్రహ్లాద ..... నీరజబంధో = ప్రహ్లాదుడు పరాశరుడు నారదుడు వీరి హృదయమనెడి పద్మమునకు సూర్యుడా! ఆహ్లాదకర = ఆహ్లాదమును కలిగించువాడా! అశుభరోగసంహార = అశుభములను రోగములను హరించువాడా! వరద = వరములిచ్చువాడా! త్యాగరాజాది వినుత = త్యాగరాజు మొదలగువారిచే వినుతింపబడినవాడా! నన్ను, పాహి = రక్షింపుము. అని అర్థము.

554. నాగస్వరావళి = ఆది

ప॥ శ్రీపతే నీపద – చింతనే జీవము శ్రీపతే॥

అ॥ నే పరదేశి నా గాసి – బాపవే చనువున దయజేసి॥ శ్రీపతే॥

చ॥ రాజాధిరాజ– రవికోటితేజ। పూజించి నిన్నింద్రాదులు ది
గ్రాజులై వెలయలేదా। రాజిల్లు శ్రీత్యాగరాజునికి॥ శ్రీపతే॥

తాత్పర్యము :

ఓ శ్రీపతీ! నీపదచింతనమే నాకు జీవనము. ఓ రామా! నేను నీకు పరదేశినా? కాదు. దయజేసి ప్రేమజూపి నా గాసిని (ఆర్తిని) బాపుము. ఓ రాజాధిరాజా! ఓ రవికోటి తేజా = కోటిసూర్యుల తేజస్సుగలవాడా! ఇంద్రాదిదేవతలు నిన్ను పూజించి దిక్పతులైనారుకదా! నాగాసి బాపుటకేమి.

విశేషము = 'శక్రః ప్రవిద్వాన్ ప్రదిశశ్చితస్రః' 'నారాయణా ద్బ్రహ్మాజాయతే, నారాయణా దింద్రోజాయతే' ఇత్యాది వేద వాక్యములచే నారాయణుని వలననే (ఆయనను పూజించుట చేతనే) ఆయాపదములయందు ఇంద్రాదులు నిలచి ఉన్నారని తెలియుచున్నది. అయ్యగా రీవిషయమునే చెప్పిరి.

555. పూర్ణ షడ్జము = ఆది

ప॥ శ్రీ మానినీమనోహరా – చిరకాలము మాటయొకటేరా॥
వేమారు బల్కజాలరా॥ శ్రీ॥

అ॥ శ్రీమంతులౌ. నీ సోదరులు। సేయురీతి పాద-సేవకోరితిని॥ శ్రీ॥

చ॥ ధర్మాధ్యఖిల - పురుషార్థములు। దాశార్హ నీ-రూపమబ్బిన
మర్మంబువే-రే యున్నది। మన్నించుమిక త్యాగరాజనుత॥ శ్రీ॥

తాత్పర్యము :

శ్రీమానినీమనోహరా! = లక్ష్మీ మనోహరా! ఎంతకాలమయినా నామాట ఒక్కటే. వెయ్యిసారులు పలుకలేను. (నా కోరిక ఒక్కటే) నీ భక్తిసంపద కలిగిన నీ సోదరులు చేసినట్లు నీపాదసేవనే కోరియున్నాను. ఓ దాశార్హా = దశావతారములవాడా! ధర్మము మొదలయిన నాలుగు పురుషార్థములు నీరూపమయి యున్నవి. ఈ మర్మము వేరే ఉన్నది. ఇక నన్ను మన్నించు. అని కొంచెం ఎత్తిపొడుపు.

విశేషము = దాశార్హుడనగా దశావతారములనెత్తినవాడు. ఈ అవతారములనెందుకెత్తెను? ధర్మసంస్థాపనమునకే అని. అందుచేతనే 'రామోవిగ్రహవాన్ ధర్మః' = రాముడు మూర్తిభవించిన ధర్మము' అని, కృష్ణుడు 'కృష్ణం ధర్మం సనాతనం= కృష్ణుడు సనాతన ధర్మము' అనియును చెప్పబడినది. మరి భగవానుని అవతార ప్రయోజనము 'పరిత్రాణాయ సాధూనాం' = సాధువులనగా భక్తులు భక్తులను రక్షించుటకు అని. ఇట్లుండగా అర్థ కామములనే పురుషార్థములు కూడా నీవే అయి అర్థకామ పరాయణులకు వరము లిచ్చువాడవై అవి నీవే అయి సద్ధర్మపరాయణులగు నా బోంట్ల విషయములో మర్మము చూపుచున్నావు. సాధుపరిత్రాణము నీ ధర్మమయి నీ రూపముతో నుండవలసియుండగా అది నాపట్ల వేరయినది. ఇట్లన్నందుకు మన్నించుమని ఎత్తిపొడుపు.

556. భైరవి = ఆది

ప॥ శ్రీరఘువర సుగుణాలయ-సరసిజలోచన విరోచనాభ॥ శ్రీరఘు॥

అ॥ తరానలేని పరాకులేటికి-బిరాననను బ్రోవరాదవాదా॥ శ్రీరఘు॥

చ॥ కమలాహిత నతకమలాహిత ధర
మమత దెలిసినను - మన్నించరాదా॥ శ్రీరఘు॥

2 కలశజలధిలో - లక్ష్మితో నాడే
కలకాలమునీ-సేవ రాజేసే॥ శ్రీరఘు॥

3 కనికరమున నను-కని కరముననిడి
చనువున నొకమన-విని బల్కరాదా॥ శ్రీరఘు॥

4 ఆగమమూలా-అవనిజాలోల
వేగమే తెలుసుకో-త్యాగరాజార్చిత॥ శ్రీరఘు॥

తాత్పర్యము :

ఓ రఘువర, సుగుణములకు నిలయమైనవాడా! పద్మనేత్రములు గలవాడా! సూర్యకాంతి గలవాడా! ఆశ్రిత రక్షణములో ఏతరములోను లేని పరాకు నీకెట్లువచ్చినది? నన్ను బ్రోవరాదా! నన్ను బ్రోచుట నీకు వాదా? కమలాహిత = లక్ష్మీదేవికి హితమైనవాడా! నతకమలాహితధర = నీకు నతుడైన శివుడు కలవాడా! మమత (నామమత) తెలిసి నన్ను మన్నించరాదా? క్షీర సముద్రములో లక్ష్మీ దేవితో చిరకాలము నీవాడుకొనే ఆ క్రీడను నాకు సేవింపజేసే ఓ రఘురామా! కనికరముతో నన్ను కని నీచేత నుంచుకొని చనువుతో ఒక మాట మాట్లాడరాదా? వేదములకు మూలకారణమైన వాడా! సీతాపతీ! నన్ను వేగముగా తెలుసుకొని రక్షింపు అని ప్రార్థన.

నోట్ : కల్లూరి వీర భద్రశాస్త్రిగారు గ్రహించిన గ్రంథములో రెండవ చరణములో అతకని ఒక ఆవర్తసాహిత్యమున్నది. అది తాళానికి ఎక్కువ అయి అన్వయములేక సమతను చెడగొట్టుచున్నది. అందుచేత నేను దానిని వదలి పెట్టటమయినది.

557. కాంభోజి = ఆది

ప॥ శ్రీరఘువరా ప్రమేయ! మామవ శ్రీరఘు॥

చ॥ శ్రీ రఘుకుల జలనిధిసోమ! శ్రీరామ పాలయ॥ శ్రీరఘు॥

2 సారసహితకులాబ్జభృంగ! సంగీతలోల॥ శ్రీరఘు॥

3 విరోచనకులేశ్వర - స్వరలయాది
మూర్ఛనోల్లసిత నారద వినుత॥ శ్రీరఘు॥

4 శ్రీ భాస్కర కులాద్రి దీప-శ్రీ భాగవతవినుత సుచరిత॥ శ్రీరఘు॥

5 సీతా భాగధేయ త్యాగరా
జనుతానిలసుతాప్త సుగుణాభరణ॥ శ్రీరఘు॥

తాత్పర్యము :

ఇది రామస్తుతి పరమగు సంస్కృతకృతి. అన్నియు విశేషణ సంబోధనములే. ప్రతిపదార్థము వ్రాయబడును. శ్రీరఘువర = రఘుకుల శ్రేష్ఠుడా! అప్రమేయ = కొలత కందనివాడా! మామవ = నన్ను రక్షించుము. శ్రీరఘుకుల జలనిధిసోమ = రఘుకుల మనెడి సముద్రమునకు చంద్రుడా! సారసహితకులాబ్జభృంగ = సూర్యవంశమనెడి పద్మమందు సంచరించు భృంగమా! సంగీతలోల = సంగీతమందు ఆసక్తుడా! విరోచనకులేశ్వర = సూర్యవంశమునకు ప్రభువయినవాడా! స్వరలయాది మూర్ఛనోల్లసిత నారద వినుత = స్వరలయములు స్వరమూర్ఛనలు తెలిసి ప్రకాశించునారదునిచే నుతింపబడువాడా! శ్రీభాస్కరకులాద్రి దీప = సూర్యవంశమనెడి పర్వతమునకు దీపమయినవాడా! భాగవతులు వినుతించు మంచి చరిత్రము కలవాడా! సీతకు భాగ్యమయిన వాడా! త్యాగరాజనుత = త్యాగరాజుచే పొగడబడువాడా! అనిలసుతాప్త = హనుమంతునకు ఆప్తుడా! సుగుణాభరణ = సుగుణములే ఆభరణములైనవాడా! పాలయ = రక్షించుము.

విశేషము = ఇందు పల్లవికాక తక్కినఐదు భాగములు సంగీత విద్వాంసులు పంచరత్న పద్ధతిలో స్వరసాహిత్యములు పాడుట సంప్రదాయముగ నున్నది. ఈ కృతియందు రాముని సంగీత ప్రియత్వము ప్రసక్తమైనది.

558. హంసధ్వని = ఆది

ప॥ శ్రీరఘుకులమందు బుట్టి సీతను చేగొనిన రామచంద్ర॥ శ్రీ॥

అ॥ ఆరామమందు మునులకోరిక - లీడేర జేయ బూనుకొన్నరామ॥ శ్రీ॥

చ॥ వరరత్న పీఠమందు మజ్జనము. పుడమి సురులచేత గైకొన్న రామ
పరమభక్తులను పాలనంబు జేయ సాకేతవాస త్యాగరాజనుత॥ శ్రీ॥

తాత్పర్యము :

శ్రీ రఘుకులంలో పుట్టి సీతను చేకొని అరణ్యములో మునుల కోరికలు తీర్చి బ్రాహ్మణులతో పట్టాభిషేకముపొంది పరమభక్తులను పాలనము చేసిన అయోధ్యావాసా! అని సంబోధనములతోనే ముగిసినది. వాక్యమును పూర్తిజేయు క్రియా పదములేదు.

నన్ను బ్రోవుమని అధ్యాహారము చేసుకొన వలసియుండును. ఇందు జననము, సీతా కల్యాణము, మునిరక్షణము, పట్టాభిషేకమును ప్రసక్తములై మండూక ప్లుతిన్యాయముగా రామాయణకథ అంతా వచ్చినది. దీనిని సంక్షేపరామాయణము అనవచ్చును.

559. జయమనోహరి = ఆది

ప॥ శ్రీ రమ్యచిత్తా లం-కార స్వరూపా-బ్రోవుము॥

అ॥ మారారిదేవేంద్రపితా-మహాద్యష్టది క్పాలకసేవ్య॥ శ్రీరమ్య॥

చ॥ సురేశారి జీవాపహర వర-సోదరా ధరాప శ్రీప॥
నరానందనేనీ వలెగా - నరాత్యాగరాజార్చితపద॥ శ్రీరమ్య॥

తాత్పర్యము :

శ్రీరమ్య చిత్తాలంకార స్వరూపా = లక్ష్మీదేవి యొక్క అందమైన మనస్సునకు అలంకారమయిన స్వరూపము కలవాడా! బ్రోవుము. శివుడు ఇంద్రుడు బ్రహ్మ మొదలగువారికి, అష్టదిక్పాలకులకు సేవింప దగినవాడా! సురేశారి జీవాపహర = ఇంద్రుని శత్రువుల ప్రాణముల పహరించిన వాడా! వరసోదరా = మంచి తమ్ములు కలవాడా! ధరాప = భూమిని పాలించువాడా! శ్రీప = లక్ష్మీనాథా! నరానంద = మానవావతారమెత్తి మానవానందమును పొందువాడా! నీవంటి వానిని నేను చూడను.

విశేషము = కీటకముల ఆనందముకంటే పశుపక్ష్యాదుల ఆనందము వెయ్యి రెట్లధికము. వాటికంటే మానవానందము వెయ్యిరెట్లధికము. దానికంటే గంధర్వానందము వెయ్యిరెట్లధికము. దానికంటే దేవానందము వెయ్యిరెట్లధికము. దానికంటే బ్రహ్మానందము వెయ్యిరెట్లధికము. రాముడు తాను పరబ్రహ్మము. పరబ్రహ్మము యొక్క ఆనందము కొలత కందనిది. అటువంటి రాముడు భక్తరక్షణమునకై అవతరించి మానవానంద మనుభవించినాడు. ఇట్టి నీవంటి వానిని నేను కాననురా. అని అయ్యగారు ఆశ్చర్యము ననుభవించినారు. 'దిదేవిషతి మానవస్సచ తితద్విభూషత్యసౌ। శిశర్విషతి' = మానవుడు దేవుడగుటకోరును. అది చేకూరిన దేవేంద్రుడుకా గోరును. అది సిద్ధించిన శివుడుకా గోరును' ఇట్లు ప్రతివాడును తనకున్నదానికంటే ఎక్కువను కోరుకొనును. రాముడు తాను పరబ్రహ్మమై ఎంతో తక్కువ అయిన మానవానందమును కోరి భక్తులకై దిగివచ్చినాడు. దీని ఆశ్చర్యము నయ్యగా రనుభవించినారు.

560. ధన్యాసి = చాపు (దివ్యనామము)

ప॥ శ్రీరామదాసదాసోహం - అవ
నీరజనే త్రనీ--కేల సందేహం॥ శ్రీరామ॥

చ॥ గట్టుగానరాని గుంట రామ
పట్టుక దాట నీ- పేరు తెప్పంట॥ శ్రీరామ॥

2 చలచిత్తమను నలలకును- రామ
చెలగు నీవామహస్తము వైరియగును॥ శ్రీరామ॥

3 కామాదులను నక్రబాధ- దీర్ప
రామయ్య నీచేతి-చక్రము లేదా॥ శ్రీరామ॥

4 అహమును జడత్వమడచి- బ్రోవ
సహజమౌ నీ చేతి-శరములు లేవ॥ శ్రీరామ॥

5 దుష్కర్మమనుకొండలెగయ- రామ
నిష్కల్మషానిలజు-డుండెను-సదయ॥ శ్రీరామ॥

6 జనన మరణమను సుడిని- నిల్ప
ఘనమైన నీయాజ్ఞగాదను- వడిని॥ శ్రీరామ॥

7 జాతి కొకరు గూడినారం- ప్రీతి
చేత తెలుసుకొంటిమి- నామ సారం॥ శ్రీరామ॥

8 వన్నుగ భవమతి ఘోరం- రామ
నిన్ను వినా అన్య-దైవము గోరం॥ శ్రీరామ॥

9 మదమత్సరములను గజము-లకునీ
పదకమలాంకుశ-రేఖ అంకుశము॥ శ్రీరామ॥

10 శోకాదులను పర్వతము-లకు
నీ కరాంకిత వజ్ర-రేఖవజ్రము॥ శ్రీరామ॥

11 వరగుణ రాజాధిరాజ-రామ
పరమపావన పా-లిత త్యాగరాజ॥ శ్రీరామ॥

తాత్పర్యము :

ఇందులో పల్లవిలో మొదటి పంక్తి మాత్రము సంస్కృతము. శ్రీరామదాసుల దాసుడను నేను. రక్షించుము. నీకు సందేహమేల? ఈ సంసారమనేది అవ్వలి ఒడ్డుకానరాని పెద్దకుంట. దీనిని దాటించే తెప్ప నీనామము. చలచిత్తమునందు పుట్టు అలలకు నీ యెడమచేయి శత్రువు. కామక్రోధాదులనెడి మొసలిపెట్టు బాధను సంహరించుటకు నీచేతి చక్రము లేదా? నాలోని అహంకారమును అణచుటకు నీ శరములు లేవా? నాపాపము లనెడు కొండ లెగసిపోవునట్లు చేయుటకు నిష్కల్మషుడైన హనుమంతుడు ఉన్నాడు కదా! జనన మరణరూపమయిన సంసారపుసుడిని ఆపుటకు నీ ఆజ్ఞ చాలును. జాతి కొక్కరుగా మేము కూడితిమి. ప్రీతితో నీనామసారమును తెలుసుకొంటిమి. ఈ సంసారమతి ఘోరము. ఇది తొలగుటకు నిన్ను కాక ఇతరులను కోరము. నాలోని మదమత్సరము లనెడు ఏనుగులకు నీపాదమందున్న అంకుశరేఖయే అంకుశము. శోకము లనెడు పర్వతములకు నీచేతిలో నున్న వజ్రరేఖయే వజ్రము. (వజ్రము ఇంద్రాయుధము. ఇది పర్వతములను ఛేదించినది). చివరిచరణము సంబోధనములు మాత్రమే.

విశేషము = 7వ చరణమునకు వివరణము. రాక్షసజాతి విభీషణుడు, వానరజాతి హనుమంతుడు, మానవజాతి త్యాగరాజు, అందులో శబరస్త్రీజాతి శబరి. ఇందరు కూడి రామనామసారమును తెలుసుకొన్నారు. 9, 10 చరణములలోని విషయములకు ప్రమాణము. 'కదాపున శ్శంఖ రథాంగ కల్పక। ధ్వజారవిందాంకుశ వజ్రలాంఛనం। త్రివిక్రమ త్వచ్చరణాంబుజ ద్వయం। మదీయ మూర్ధాన మలంకరిష్యతి' = ఓ త్రివిక్రమా! శంఖము, చక్రము, కల్పవృక్షము, జెండా, పద్మము, అంకుశము, వజ్రము, ఇవి రేఖలుగా ఉన్న నీపాదములు నా శిరస్సును అలంకరించుట ఎన్నడో కదా' అని భక్తుల ఆకాంక్ష. అంకుశము, వజ్రము పాదరేఖలుగా ఉండుటకు ఇది ప్రమాణము. చేతియందు వజ్రలాంఛన ముండుటకు ఇది ఉపలక్షణమగును.

561. సావేరి = ఆది (దివ్యనామము)

ప॥ శ్రీరామ రామ రామ – సీతాహృజ్జలధి సోమ॥ శ్రీరామ॥

చ॥ నీపాదములభక్తి – నిండారగా నొసగి
కాపాడు నాపాప–మేపాటి రామ॥ శ్రీరామ॥

2 పలికి కొన్నాళ్లిపుడు-పలుకకుంటే విడతునా?
కులమర్మములన్నెల్ల - దలచి నను బ్రోవవయ్యా॥ శ్రీరామ॥

3 పలుమారు నిన్ను బాడి-పాడి వేడుకొన్నాను
కలకలమని నాతో - బలుకవేమయ్యా ఇపుడు॥ శ్రీరామ॥

4 లోకుల నెరనమ్మి-కోక నీపాదము లిం
దాకను మదినించ-క్రీగంట జూడవేమి॥ శ్రీరామ॥

5 రాజశేఖర దేవ-రాజ రాజీవభవ
పూజ్యార్థ శ్రీత్యాగ-రాజుని మొరాలించు॥ శ్రీరామ॥

తాత్పర్యము :

శ్రీరామ రామ రామ! సీత హృదయమనెడి సముద్రమునకు చంద్రుడా! (చంద్రుని చూచి సముద్రము ప్పొంగును) నీపాదభక్తి నిండుగా ఇచ్చి కాపాడుము. నాపాపము లేపాటి? నీవు కాపాడదలచితే. ఇంతకు ముందు నాతో పలికి ఇప్పుడు పలుకకుంటే నిన్ను విడువను. నీకులకీర్తి నొకసారి స్మరించి నన్ను రక్షించు. పలుసారులు నిన్ను పాడి పాడి వేడుకొన్నాను. కలకలమని నాతో మాట్లాడు. నేను లోకులనెవరిని నమ్ముకోక నీపాదములపై మన సుంచాను. కడగంటితో నైనను చూడవేమి? శివ ఇంద్ర బ్రహ్మల పూజకు తగిన రామా! నా మొర ఆలకించుము. అని ప్రార్థనము.

562. సావేరి = ఆది (దివ్యనామము)

ప॥ శ్రీరామ చంద్రరాఘవ .... సకలలోకా
ధార త్వమేవ మామవ॥ శ్రీ॥

చ॥ కంటి కెదురుగ రారా.... శ్రీరామానీ
వంటి దైవము గానరా॥ శ్రీ॥

2 వింటే ఏడకు బోదురా.... శ్రీరామా నాపే
రంటే నీకెంత వాదురా॥ శ్రీ॥

3 వేసట తోచదాయెనా.... నామాట పరి
హాసకముగ బోయెనా॥ శ్రీ॥

4 పతి కోపించితే మాన- వతియైన నిజ
సతి రీతి నడచుకోనా॥ శ్రీ॥

5 తల్లి కొట్టితే సరగున ... బాలుడు పద
పల్లవముల విడచునా॥ శ్రీ॥

6 అకలంక గుణసాంద్ర... నాపై కపటమెం
చకుమయ్య రామచంద్ర॥ శ్రీ॥

7 పతి నీవు పరమపావన .... శ్రీరామ స
ద్గతి నీవు సుందరానన॥ శ్రీ॥

8 చాపధరా బ్రోవ యోచనా... నిజభక్త
పాపతిమిర విమోచనా॥ శ్రీ॥

9 దాసుడౌ త్యాగరాజ ... రక్షక చిద్వి
లాస సాకేతరాజ॥ శ్రీ॥

తాత్పర్యము :

ఇందులో పల్లవి మాత్రము సంస్కృతము. శ్రీరామచంద్రా, రాఘవా! అన్ని లోకములకును ఆధారమయిన వాడా! త్వమేవ = నీవే, మామవ = నన్ను రక్షించుము. తాత్పర్యము సులభము.

563. అమృత వాహిని = ఆది

ప॥ శ్రీరామ పాదమా- నీకృప చాలునే- చిత్తానికి రావే॥ శ్రీరామ॥

అ॥ వారిజభవ- సనక సనందన
వాసవనారదాదు- లెల్ల పూజించే॥ శ్రీరామ॥

చ॥ దారిని శిలయై- తాపము తాళక
వారము కన్నీరును రాల్చగా
శూర! అహల్యను - జూచి బ్రోచి
తారీతి ధన్యజేయవె - త్యాగరాజ గేయమా॥ శ్రీరామ॥

తాత్పర్యము :

ఇది శ్రీరామపాద స్తుతి. బ్రహ్మ సనకసనందనులు దేవేంద్రుడు నారదాదులు పూజించే ఓ శ్రీరామ పాదమా! నీదయ నాకు చాలును. నామనస్సునకు వచ్చి నివశింపుము. మిథిలాపురం దారిలో తాపముతో కన్నీరు కార్చుచు శిల అయి పడి ఉన్న అహల్యను రక్షించినట్లు ఓ రామ పాదమా! నన్ను రక్షించవలసినది అని అయ్యగారి ప్రార్థనము.

విశేషము = వాల్మీకి రామాయణములో అహల్య శిలయై ఉన్నట్లులేదు. అదృశ్యమై ఉన్నది. అయితే 'మహానాటకం' అనే రామ చరిత్రలో 'శిలాకంపం ధత్తే శివశివ వియుంక్తే కఠిన తాం। అహోనారీ చ్ఛాయామయతి' = రాయి కదలు చున్నది. శివశివా! (ఆశ్చర్యార్థము). కఠినత్వమును బాయుచున్నది. ఆహా! స్త్రీ రూపమును పొందుచున్నది'అని కవి రవ్యమైన కల్పన జేసినాడు. అప్పటి నుంచి ఈ కథ జనబాహుళ్యంలో కొనసాగుచున్నది. అయ్యగారు దీనిని గ్రహించి రామపాదమును ప్రార్థించినారు.

564. మధ్యమావతి = ఆది

ప॥	శ్రీరామ జయరామ – శృంగార రామ॥	శ్రీరామ॥
చ॥	గారవమున బ్రోవు–కరుణా సముద్ర॥	శ్రీరామ॥
2	నాలోని జాలి నీ–కేల తోచదు రా॥	శ్రీరామ॥
3	మనసిచ్చి నాతోను – మాటాడెదెవుడు॥	శ్రీరామ॥
4	తాళ నీవేళ నింక – జాలమా రామ॥	శ్రీరామ॥
5	బలిమిని వలచితే – చలమా రామ॥	శ్రీరామ॥
6	ఈ సౌఖ్యమే భాగ్యమెందైన గలదా॥	శ్రీరామ॥
7	జపమేమొ తపమేమొ–అపరాధమేమొ॥	శ్రీరామ॥
8	పంకజనయన నా–కుంకుమ నీవే॥	శ్రీరామ॥
9	అవని జాధిప నాసాగ–సెవరిదేరామ॥	శ్రీరామ॥

10 నీవు నిమిషములేని-భావుక మేలే॥ శ్రీరామ॥

11 తోషింపకెనాళ్లు-తోచునే రామ॥ శ్రీరామ॥

12 ఎల్లసౌఖ్యములు మన-సొల్లదే రామ॥ శ్రీరామ॥

13 పాయగా మేను సగ-మాయెనో రామ॥ శ్రీరామ॥

14 ఈ యంద మీచంద-మెందైన గలదా॥ శ్రీరామ॥

15 కూర్చు వెతలార్చు కడ-తేర్చవే రామ॥ శ్రీరామ॥

16 మిక్కిలి మ్రొక్కి చే-జిక్కితి రామ॥ శ్రీరామ॥

17 రాజిల్లు శ్రీత్యాగ-రాజాది వినుత॥ శ్రీరామ॥

తాత్పర్యము :

ఓ శ్రీరామా! జయమిచ్చురామా! శృంగార రూపుడగు రామా! ఓకరుణా సముద్రా! ఆనందముతో బ్రోవుము. నాదీన స్థితి నీకు తెలయదేమి? మనసు విప్పి నాతో ఎప్పుడు మాట్లాడుదువు? నేను నీవు బ్రోవకున్న తాళలేను. ఇంకా కపటమా? నేను గాఢముగా ప్రేమిస్తే నీకు నాపై మత్సరమా? నీ భక్తితో డి సౌఖ్యము, భాగ్యము వేరొకచోట కలదా? నాజపము, తపము నిన్ను గూర్చియే. నా అపరాధమేమున్నది? ఓ పద్మనయనా! నా కుంకుమ నీవే (నా సౌభాగ్యమునీవే). ఓ సీతానాధా! నా సొగసెవరిదయ్యా? (నీదే) నిమిషము నీవు లేకపోతే తక్కిన శుభములు నాకేల? నీ అనుగ్రహము కలిగి సంతోషించవలెను. ఈ సంతోషము లేక నాకుతోచదు. నీ సేవకాని ఇతర సౌఖ్యములను నామనసంగీకరించదు. నీ యెడబాటుతో నామేను సగమయినది. నీ అందము చందము వేరెక్కడను లేదు. నీ దయను నాకు కూర్చుము. నా బాధల నార్పుము. ననుకడతేర్చుము. నీకు బాగా మ్రొక్కి నీ చేతిలో చిక్కి ఉన్నాను. అని అయ్యగారు రాముని వద్ద ఒకనాయిక నాయకుని వద్ద విరహోత్కంఠితయై చెప్పుకున్నట్లు స్వాతంత్ర్యముతో చెప్పుకున్నారు.

565. యదుకుల కాంభోజి = జంపె (దివ్యనామము)

ప॥ శ్రీరామ జయరామ-శృంగార రామయని
చింతించరాదె ఓ-మనసా॥ శ్రీరామ॥

చ॥ తళుకు చెక్కులముద్దు- బెట్ట కౌసల్యమును
తపమేమిజేసెనో- తెలియ॥ శ్రీరామ॥

2 దశరథుడు శ్రీరామ- రారయని పిలువమును
తపమేమి జేసెనో- తెలియ॥ శ్రీరామ॥

3 తనివార బరిచర్య- సేయ సౌమిత్రిమును
తపమేమి జేసెనో- తెలియ॥ శ్రీరామ॥

4 తనవెంట జనజూచి- యుప్పొంగ కౌశికుడు
తపమేమి జేసెనో- తెలియ॥ శ్రీరామ॥

5 తాపమణగి రూప- వతి యౌట కహల్య
తపమేమి జేసెనో- తెలియ॥ శ్రీరామ॥

6 ధర్మాత్ము చరణంబు- సోక శివచాపమును
తపమేమి జేసెనో- తెలియ॥ శ్రీరామ॥

7 తన తనయ నొసగి కను- లారగన జనకుండు
తపమేమి జేసెనో- తెలియ॥ శ్రీరామ॥

8 దహరంబు కరగ కర- మును బట్ట జానకి
తపమేమి జేసెనో- తెలియ॥ శ్రీరామ॥

9 త్యాగరాజార్తయని- పొగడ నారదమౌని
తపమేమి చేసెనో- తెలియ॥ శ్రీరామ॥

తాత్పర్యము :

అయ్యగారు శ్రీరామధ్యానము చేయుమని మనస్సుకు బోధించుచున్నారు. ఓ మనసా! శ్రీరామ జయరామ శృంగార రామ అని ధ్యానింపరాదా? రామ శబ్దమును (నామమును) స్మరించుట, రామసంబంధము కలిగియుండుట చాల తపః ఫలము. బాల్యములో రాముని బుగ్గలు ముద్దు బెట్టు కొన్న కౌసల్య ఏమి తపము చేసినదో కదా! మనకు తెలియదు. రారా రామా అని పిలచుటకు దశరథుడు తపమేమి చేసెనో? 'అహం సర్వం కరిష్యామి' = నేను అన్నియును చేయుదుని అని పలికి, తనివిదీర కైంకర్యము చేసిన లక్ష్మణుడే తపము జేసెనో? రాముడు తనవెంట వచ్చుచుండగా ఉప్పొంగిన విశ్వామిత్రుడు డేమి తపము జేసెనో? తన పరితాపము తీరి తన రూపమును పొందిన అహల్య ఏమి తపము జేసెనో? రాముని పాదము సోకిన శివధనుస్సు ఏమి తపము చేసెనో?

కూతురు నిచ్చి కనులార చూచిన జనకు డేమి తపము చేసెనో? తన మనస్సు కరగగా పాణిగ్రహము జేసిన సీత ఏ తపము జేసెనో? త్యాగరాజాప్త అని నారదుడు పొగడుటకు ఏతపము చేసెనో!

విశేషము = ఈ తపములు తెలియను అంటున్నారయ్యగారు. కృష్ణుని పుత్రునిగా పొందుటకు పృశ్ని, సుతపుడు (మంచి తపస్సు జేసిన వాడు అని) అను దంపతులు చాలపెద్ద తపస్సు చేసి భగవంతుడు ప్రత్యక్షమైతే నీవు మాకు కొడుకు కావలెను అని వరముకోరిరి. భగవంతుడట్లే అనుగ్రహించినాడు. ఆ దంపతులు మాకు తనవి తీరలేదంటే వారిని మరు జన్మలో దేవకీ వసుదేవులుగా పుట్టించి తాను మరల వారికి పుత్రుడైనాడు. దీనికి కారణము ఆ దంపతుల పూర్వ జన్మతపస్సే. కౌసల్యాదశరథుల విషయములో ఇట్టి పూర్వగాథ ఏదీలేదు. 'పితరంరో చయామాస। తదా దశరథం నృపం' = భగవానుడు అప్పుడు దశరథుని తండ్రిగా ఇష్టపడినాడు' అని మాత్రమే ఉన్నది వాల్మీకి వాక్యము. ఫలితము కనుపించుచున్నది, ఆచరణము కనుపించుటలేదు. అందుచేత ఆశ్చర్యముతో 'తెలియ' అన్నా రయ్యగారు. అందరి విషయము ఇట్టిదే. భోజమహారాజు తనరామాయణ చంపువులో 'యోగేన లభ్యోయః పుంసాం। సంసారాపేత చేతసాంసోయం పిత్రనిదే శేన। రామః కౌశిక మన్వగాత్' = ఐహిక వాంఛలు లేక అష్టాంగాది యోగములచేసిన పురుషులకు మాత్రము లభ్యుడగు రాముడు ఒక్క తండ్రిమాటతో విశ్వామిత్రుని వెంట వెళ్లెను. ఆహా!! అంటాడు. భోజరాజు దీనికిని ఆశ్చర్యపడినాడు. విశ్వామిత్రుడు వసిష్ఠునితో యుద్ధము చేసి 'ధిక్ క్షత్రియబలం' అని క్షత్రియబలమును ఈసడించినాడు. బ్రహ్మర్షి ననిపించుకొనుటకు తపస్సుచేసి ఆ ఫలితమును పొందుటచే దానిని కొంత తగ్గించుకొన్నాడు. త్రిశంకువును స్వర్గానికి పంపి కొంత తపశ్శక్తిని కోలుపోయినాడు. మేనకా సంగమముతో కొంత పోగొట్టుకొన్నాడు. తరువాత చేసిన తపస్సు మాత్రం జాగ్రత్తపెట్టు కొనుటకు ఇప్పుడు రామ సహాయ మడిగినాడు. ఇప్పుడే కొంత జాగ్రత్తపడినాడు. ఇంతకు ముందును బ్రహ్మ సాక్షాత్కారము కొరకు తపస్సు చేసినట్లు లేదు. అందుచేత భోజరాజాశ్చర్యపడినాడు. అట్లే త్యాగరాజు ఆశ్చర్యపడి వారు చేసిన తపము లేవో తెలియక సర్వసిద్ధి కరమయిన రామమంత్రమును ధ్యానించమని ఉపదేశించినారు. 'శ్రీరామ జయరామ జయజయరామ' అనునది శ్రీరామ త్రయోదశాక్షర మంత్రమని రామరహస్యోపనిషత్తు చెప్పినది. ఇకనారదుడు పూర్వ జన్మమున (పూర్వకల్పమున) దాసీపుత్రుడు. ఋషి వాటికల వెంట తిరిగి ఋషులు చెప్పుమాటలు వింటూ వారు పెట్టు ఉచ్ఛిష్టాన్నము భుజించుచూ నిరాధారముగా తనువు చాలించినాడు. ఇంతకన్న ఏతపము చేయలేదు. భగవానుడు ప్రళయమందు తన కడుపులో నుంచుకొని వానిని ఈ కల్పమందు దేవర్షిగా పుట్టించినాడు. సాధారణముగా

నామస్మరణము చేయుచు ముల్లోకములు తిరుగుచు ఏదో ఒక మంచికి తోడుపడుచు ఉండుటయేకాక స్థిరముగా కూరుచుండినారదుడు ఏ తపస్సును చేసినట్లు చరిత్రలేదు. కాని రామాయణ ప్రస్తావములో 'తప స్స్వాధ్యాయ నిరతం' తపస్సు, వేదా ధ్యయము నందు నిరతుడు అని చెప్పబడినాడు. నామాను సంధానమునే తపస్సుగా చెప్పవచ్చునేమో? సరి. అట్టి నారదుడు 'త్యాగరాజాప్త అని పొగడుట' ఏమిటి? త్యాగరాజాప్తుడంటే రాముడు. వాల్మీకికి రామకథను నారదుడు చెప్పటమే 'త్యాగరాజాప్త' అని పొగడుట. దీనికై నారదుడు చేసిన తపస్సులేదు. కాని నారదుడు చెప్పిన గుణముల ఆధారంతో వాల్మీకి కొండలు సముద్రములున్నంతవరకు నిలిచే రామాయణము రచించేడు. ఆ కృతజ్ఞతా సూచకముగా ఈ కృతిలో అయ్యగారు నారదుని ప్రస్తావించినారు. తాను పలికే 'త్యాగరాజాప్త' వంటి వాక్యములు కూడ నారదుడు పలికించినవిగా అయ్యగారు భావించుట సహజము. నారదుని గురువుగా భావించి ఆయన ప్రేరణ చేతనే తనను ద్వారముగా చేసుకొని తనకృతులు వెలికి వచ్చుచున్నట్లు అయ్యగారి భావమని చెప్పవచ్చును. ఈ భక్తి సంపద (శ్రీ) ఈభావ సంపద (శ్రీ) నారదుడే ఇచ్చినట్లు భావించుట చేత అయ్యగారు 'శ్రీనారద' అనే కృతిలో నారదుని 'శ్రీద' అని సంబోధించినారు.

566. శహన = ఆది (దివ్యనామము)

ప॥	శ్రీరామ శ్రీరామ – శ్రీ మనోహరమా॥	శ్రీ॥
చ॥	ఏలరా నీదయ – ఇంతైన రాదయా॥	శ్రీ॥
2	చాలదా సదయ – సామి తాళనయా॥	శ్రీ॥
3	ఇప్పుడే లేదట – ఇంక బ్రోతువట॥	శ్రీ॥
4	ఇంక ఈ కర్మమా – ఇది నీకు ధర్మమా॥	శ్రీ॥
5	పంకజవదనమా – బాగుగా జూడుమా॥	శ్రీ॥
6	ఏ జన్మ పాపమో – ఎవ్వరి శాపమో॥	శ్రీ॥
7	ఏనాటి కోపమో – నెరియదా పాపమో॥	శ్రీ॥
8	ఎన్నాళ్లీ దీనత – ఇది నీకు యోగ్యతా?	శ్రీ॥
9	పలికి బొంకవట – పరమశాంతుడవట॥	శ్రీ॥

10 భక్త కాంతుండట – పద్మ నేత్రుండటా॥ శ్రీ॥

11 సర్వము నీ వట – సత్య రూపుండట॥ శ్రీ॥

12 రాగవిరహిత – త్యాగరాజనుత॥ శ్రీ॥

తాత్పర్యము :

ఓరామా! శ్రీమనోహర – మాశ్రీరామా! నీ దయ ఇంతైన రాదేమయా? ఓ సదయా! (నీ నిర్దయ) చాలదా? నేతాళలేను. ఇప్పుడు రక్షించలేని వాడివి ఇంకేమి రక్షిస్తావు? ఇంకా నాకీ కర్మమా? నన్ను పేక్షించుట నీకు ధర్మమా? ఓ పంకజవదనా! నన్ను బాగుగా జూడుము (నీ దయ రాకుండుట) ఏ జన్మ పాపమో? ఎవరి శాపమో? (నీకు నామీద) ఏనాటి కోపమో? నా పాపము తగ్గదా? (నీదయ రాక) నా కెన్నాళ్లు ఈ దీనత్వము? (నాపై దయచూపకుండుట) నీకు యోగ్యతా? నీవు ఆడి తప్పవట. పరమ శాంతుడవట. భక్తులకు అందమైన వాడవట. పద్మ నేత్రుడవట. అంతా నీవేనట. సత్యస్వరూపుడవట. ఇన్ని సద్గుణాలతో వినపడిన నీవు నన్ను రక్షింపకుండుట న్యాయము కాదని అయ్యగారి దైన్యము తోడి ప్రార్థనము.

విశేషము = భగవానుడు నిగ్రహానుగ్రహ సమర్థుడని యుండుట చేత అయ్యగారిందు రెండింటిని వర్ణించినారు.

567. దేవగాంధారి = ఆది

వ॥ శ్రీ తులసెమ్మ మాఇంట – నెలకొనవమ్మ

అ॥ ఈ మహిని నీ సమాన – మెరవమ్మ బంగారు బొమ్మ॥ శ్రీ॥

చ॥ కరకు సువర్ణపు – సొమ్ములు బెట్టి
సరిగ చీరముద్దు – గురియగ గట్టి
కరుణ జూచి సిరు – లను ఒడిగట్టి
వరదుని గరమునను బట్టి॥ శ్రీ॥

2 ఉరమున ముత్యపు – సరు లసియాడ
సురతరుణులు నిన్ను – గని కొనియాడ
వరమును లక్షది – గీశులు వేడ
వరదుడు నిను – ప్రేమజూడ॥ శ్రీ॥

3 మరవక పారి – జాత సరోజ
కరువక వకుళసు – గంధరాజ
వరసుమములచే – త్యాగరాజ
వరదా! నినునే – జేతు పూజ॥ శ్రీ॥

తాత్పర్యము :

ఇది తులసీ స్తోత్రము. ఓ తులసెమ్మా! మాఇంటిలో నెలకొనవమ్మా! ఓ బంగారు బొమ్మా! నీ సమాన మెవ్వరును లేరమ్మ. ఓ దేవీ! నీవు బంగారు నగలు ధరించి, జరీ చీర ధరించి మాపై దయ జూపి సంపదలను ఒడిలో పెట్టుకొని శ్రీహరి యొక్క కరమును బట్టుకొని, రొమ్మున ముత్యాలహారము లల్లాడగా, దేవతాస్త్రీలు నిన్ను పొగడు చుండగా మునులు అష్టదిక్పాలకులు నిన్ను ప్రార్థించుచుండగా, శ్రీహరి నిన్ను ప్రేమతో చూచుచుండగా మా ఇంట నెలకొను దేవీ! మంచి పరిమళము కలిగిన వివిధ పుష్పములతో నిన్ను పూజ చేస్తాను. మా ఇంట నెలకొనుము.

568. భైరవి = ఆది

ప॥ శ్రీనారద మునీ. గురురాయ కంటి
మేనాటి తపమో గురురాయ॥ శ్రీనారద॥

చ॥ మనసార గంటి గురురాయ నేడు
కనులార గనుగొంటిమి గురురాయ॥ శ్రీనారద॥

2 మీ సేవ దొరకెను గరురాయ భవ
పాశము దొలగెను గురురాయ॥ శ్రీనారద॥

3 నీవె సుజ్ఞానసుఖి గురురాయ
నీవె అజ్ఞానశిఖి గురురాయ॥ శ్రీనారద॥

4 రాజిల్లు వీణెగల గురురాయ – త్యాగ
రాజును బ్రోచిన సద్గురురాయ॥ శ్రీనారద॥

తాత్పర్యము :

అయ్యగారు నారద మంత్ర జపమును పూర్తిచేసిన పిదప నారద సాక్షాత్కార మయినది. అయ్యగారికి నారదుని యందు గురుభావ మేర్పడినది. ఆ పరిస్థితిలో వ్రాసిన

కృతి ఇది. ఓ గురురాయా నిన్ను కనులార కంటిమి. (భార్య కూడ చూచెనని). ఏనాటి తపఃఫలమో ఇది. నీ సేవ దొరకినది, సంసారపాశము తొలగినది. నీవు సుజ్ఞానముతో (బ్రహ్మజ్ఞానముతో) సుఖమునను భవించువాడవు. మా బోంట్ల అజ్ఞానమునకు శిఖివి=అగ్నివి. వీణను ధరించినవాడవు. నన్ను బ్రోవుము అని అయ్యగారు నారదుని ప్రార్థించిరి.

విశేషము = నారదుని గురువుగా భావించినారు. ''గుశబ్ద స్త్వంధకారస్స్యాత్। రు శబ్ద స్తన్నిరోధకః'' = గు అంటే అజ్ఞానాంధకారము. రు అంటే ఆ అంధకారమును పోగొట్టువాడు అని గురు అనే శబ్దానికి పెద్దలు చెప్పిన నిర్వచనము. దాని ప్రకారము ''నీవే అజ్ఞాన శిఖివి'' అని అయ్యగారు చెప్పిరి.

569. అరాణ = ఆది

ప॥ శ్రీ పప్రియ సంగీతో పాసన – జేయవే ఓ మనసా॥ శ్రీప॥

అ॥ తాపస జనమానస ధనము – త్రి
తాపరహిత సప్తస్వరచారి॥ శ్రీప॥

చ॥ రంజిల జేసెడు – రాగంబులు
మంజుల మగు నవతారము లెత్తి
మంజీరము ఘల్లని నటించు
మహిమ తెలియు త్యాగరాజనుతుడగు॥ శ్రీప॥

తాత్పర్యము :

ఓ మనసా! విష్ణు దేవునకు ప్రియమయిన సంగీతమును ఉపాసించుము. మునుల మనస్సునకు ధనము (అనగా జీవింప జేయునది అని). తాపత్రయమునకు దూరమయినది. సప్తస్వరములతో సంచరించునది అయిన సంగీతోపాసన చేయుము. మదిని రంజింప జేసే రాగములు, ఈ రాగములతో మిశ్రము చేసి భగవంతుని అవతారకథలను పాడుచు, అందెలు ఘల్లు ఘల్లనగా నటించుచు భక్తులు పాడుచుండగా దీని మహిమ నెరిగినవాడు విష్ణువు. కనుక ఆయనకు ప్రియమైన సంగీతోపాసన చేయుమని అయ్యగారు ఆదర్శము.

విశేషము = ''చేతులారంగ శివుని పూజింపడేని నోరు నొవ్వంగ హరి కీర్తినుడు వడేని'' అను దానిని బట్టి శివపూజ, హరి గుణ గానము సుఖకరము. అని ధ్వనించుచున్నది. మరియు ''కలౌ గాన ప్రియో హరిః'' = కలియుగమందు విష్ణువు సంగీత ప్రియుడని చెప్పబడినది. ఈవిషయములు మనసు నందుంచుకొని అయ్యగారీ కృతిని రచించిరి.

570. దేవగాంధారి = ఆది

ప॥ శ్రీ రఘు వర కరుణాకర నీ పద – చింతనమే జీవనము॥ శ్రీ రఘు॥

అ॥ వారణ రక్షక – భక్త జనాఘని
వారణ సన్మృదు – భాషణ సద్గుణ॥ శ్రీ రఘు॥

చ॥ మార మార నుత – నా మనవిని వినుమా రమా రమణ! మరువకురా సుకుమార మారసన – మున నీ నామము
మాఱు మాఱు బ-ల్కను దయ సేయుము॥ శ్రీ రఘు॥

2 వారి వారి మంచికి దగినట్టు
వారి వారి భాగ్యము లీవా? దే
వారి వారి దానిల శంబరారిజీ
వారి వారి జాసన జనక హరే॥ శ్రీ రఘు॥

3 రాజ రాజ వందిత పదయుగ దిన
రాజ రాజ నయన పాలితామర
రాజ రాజ పూజిత శ్రీ త్యాగ
రాజ రాజ! రాఘవ నను బ్రోవుము॥ శ్రీ రఘు॥

తాత్పర్యము :

శ్రీ రఘువరా! కరుణాకరా! నీ పదధ్యానమే నాకు జీవనము. వారణ రక్షక=ఏనుగును రక్షించినవాడా! భక్త జనాఘ నివారణ=భక్తుల పాపములను నివారించువాడా! సన్మృదు భాషణ=చక్కని మృదు భాషణము కలవాడా! సద్గుణ=మంచి

గుణముల వాడా! మార మారనుత= మన్మథుని వధించిన శివునిచే నుతింపబడినవాడా! నా మనవిని వినుము. రమారమణ= లక్ష్మీనాథా, నను మరువవద్దు. సుకుమార= సుకుమారుడా! మానాల్కతో నీ నామము పలుమారు పలికేటట్లు అనుగ్రహింపుము. వారి వారి పుణ్యమునకు తగినట్లు వారి వారికి ఫలము లియ్యవా? (ఇచ్చెదవు. అట్లే నా నామఫలము నాకిమ్మని) దేవారి వారి దానిల= రాక్షసులనెడి మేఘములకు గాలి అయిన వాడా! శంబరారి జీవారి – వారిజాసన జనక= మన్మథుని జీవమును హరించిన శివునకును, బ్రహ్మకును తండ్రి అయిన వాడా! హరీ! రాజ రాజవందిత పదయుగ= కుబేరునిచే నమస్కరింపబడిన పాదములు వాడా! దినరాజ రాజనయన = సూర్యచంద్రులు నేత్రములుగా కలవాడా! పాలితామర రాజ= దేవేంద్రుని పాలించినవాడా! రాజ పూజిత= రాజులచే పూజింపబడినవాడా! త్యాగరాజ రాజ= త్యాగరాజునకు ప్రభువా! రాఘవా! నన్ను బ్రోవుము అని ప్రార్థనము.

విశేషము = నారాయణుడు బ్రహ్మకు తండ్రి అగుట ప్రసిద్ధమే. ''నారాయణా ద్రుద్రోజాయతే'' ''లలాటా త్త్ర్యక్షశ్శూలపాణి స్సమజాయత''= నారాయణుని వలన రుద్రుడు పుట్టుచున్నాడు. నారాయణుని నుదుటి నుండి మూడు కనుల శూలపాణి పుట్టెను. అనే వేద వాక్యముల చేత నారాయణుడు శివునకు తండ్రియని తెలియుచున్నది.

571. శంకరాభరణం = ఆది (దివ్యనామము)

ప॥ శ్రీ రఘువర దాశరథే – రామ॥ శ్రీ॥

చ॥ వందిత సురముని బృంద! పరాత్పర
మందర ధర శ్రీ సుందర రామ॥ శ్రీ॥

2 శ్రీకర కోటి విభాకర భాసను
ధాకర వదన ఘృణాకర రామ॥ శ్రీ॥

3 సారాత్సార పురారినుతాఖవి
దారణ శ్రీరఘు వీర హరే రామ॥ శ్రీ॥

4 పాలిత సుజన విశాల నయన గో
పాల విధృత శర జాల హరే రామ॥ శ్రీ॥

5 అగణిత గుణ గణ విగళిత మోహవి
హగరాజ వరతురగ శ్రీరామ॥ శ్రీ॥

6 కాయజజనకవి – నాయకనుత వర
దాయక శ్రీరఘు – నాయక రామ॥ శ్రీ॥

7 భావజ దమన విభావిత దనుజా
భావ మహోను భావ హరే రామ॥ శ్రీ॥

8 సనకాది వినుత – కనకాంబర ధర
ఇనకుల తిలక – జనక సుతా రామ॥ శ్రీ॥

9 రాక్షస గణమద – శిక్షక దేవా
ధృక్ష సారసదళాక్ష హరే రామ॥ శ్రీ॥

10 శంకర సఖ నిశ్శంక ముఖజితశ
శాంక సుగుణ సీతాంక హరే రామ। శ్రీ॥

11 రాజానిల దిన రాజ సునయనవి
రాజిత త్యాగ – రాజనుత రామ॥ శ్రీ॥

తాత్పర్యము :

ఇది సంస్కృత రచన. అన్నీ సంబోధనలు మాత్రమే. శ్రీరఘువర= రఘుకుల శ్రేష్ఠా, దాశరథే= దశరథుని పుత్రుడా! వందిత సురముని బృంద= దేవతల, మునుల బృందములచే వందనము గొన్నవాడా! పరాత్పర= నీకంటే ఎక్కువవాడు లేని వాడా! మందర ధర= మందరగిరిని ధరించినవాడా! సుందర రామ! శ్రీకర= అన్ని విధములగు సంపదను కలిగించువాడా! కోటి విభాకర భాస= కోటి సూర్యుల తేజస్సు గలవాడా! సుధాకర వదన = చంద్రుని వంటి ముఖము వాడా! ఘృణాకర= దయకు నిలయమైనవాడా! సారాత్సార= సారము కన్న సారమగు వాడా! పురారినుత= శివునిచే పొగడబడినవాడా! అఘ విదారణ= పాపములను ఛేదించువాడా! పాలిత సుజన= సుజనులను పాలించినవాడా! విశాలనయిన= విశాలమగు కనులు కలవాడా! గోపాల= గోవులను పాలించు వాడా! విధృత శరజాల= బాణములను ధరించినవాడా! అగణిత గుణగుణ= లెక్కింప శక్యముగాని గుణములు కలవాడా! విగళిత మోహ= మోహములేని వాడా! విహగరాజ వరతురగ= పక్షిరాజు గుర్రమైన వాడా! కాయజ జనక= మన్మథుని తండ్రీ! వినాయకనుత=

వినాయకునిచే నుతింపబడిన వాడా! వరదాయక=వరములిచ్చువాడా! శ్రీ రఘునాయక= రఘు వంశమనెడి హారమునందు నాయకమణి (హారమధ్యమణి) అయిన వాడా! భావజదమన విభావిత=మన్మథుని అణచిన శివునిచే విశేషముగ భావింపబడినవాడా! దనుజా భావ=దనుజులను నిర్మూలించినవాడా! మహానుభావా! సనకాది వినుత=సనకాదులచే పొగడిక గన్నవాడా! కనకాంబర ధర=బంగారు వలువ దాల్చిన వాడా! ఇనకుల తిలక=సూర్య వంశశ్రేష్ఠుడా! జనక సుతారామ=సీత కానందము కలుగ జేయువాడా! రాక్షస గణ మదశిక్షక=రాక్షసుల మద మణచువాడా! దేవాధ్యక్ష=దేవతలకు అధ్యక్షుడా! సారసదళాక్ష=తమ్మిరేకుల వంటి కనులు గలవాడా! శంకరసఖ = శివుని చెలికాడా! నిశ్శంక = సందేహము లేనివాడా! (సర్వజ్ఞుడా అని) ముఖజిత శశాంక = ముఖకాంతితో చంద్రుని జయించినవాడా! సుగణా! సీతాంక=సీత తొడయందు గలవాడా! రాజా నలదిన రాజసునయన=చంద్రుడు, అగ్ని సూర్యుడు కనులైన వాడా! అని ప్రతి పదార్థము.

విశేషము = ఇందులో 3వ చరణములో ''సారము కన్న సారమగువాడా!'' అని ఉన్నది. ఎప్పుడయినా ఎవరయినా అల్పసారములను వదలి సారమగుదానిని, అధిక సారమగు దానిని గ్రహింపవలెను. సారముకన్న సారము అంటే భగవానుడే. అట్టి వానిని అయ్యగారు గ్రహించినారు. ''అనంత శాస్త్రం బహు వేదితవ్యం। అల్పశ్చ కాలో బహవోపి విఘ్నాః।యత్సార భూతం తదుపాసితవ్యం। హంసోయథా క్షీరమివాంబు మిశ్రం''= తెలియదగిన శాస్త్రము చాల ఉన్నది. జీవిత కాలము స్వల్పము. విఘ్నములా పెక్కులు. కనుక నీరు కలిసిన పాలనుండి హంస పాలనే గ్రహించినట్లు ఏది సారమైనదో దానిని ఉపాసింపవలెను'' అని శాస్త్రము. అటు దేవ పరముగా చూచినా గుణపరముగా చూచినా రాముడు సారముకన్న సారమగువాడు. తాను సారాత్సార మగురాముని ఉపాసించి అయ్యగారు దానినే ఇందు చెప్పిరి.

గమనిక : ఈ కృతి రూపకతాళమని గ్రంథమున వ్రాసి ఉన్నది. గేయము తీరు ఆది తాళము వలె కనపడుచున్నది.

572. వరాళి = చాపు (దివ్యనామము)

ప॥ *శ్రీరామ జయరామ – శ్రిత జనరిపు భీమ*
శృంగార గుణధామ – ఓరామా॥ శ్రీరామ॥

చ॥ చూచిన వారికి – చులకన దోచ – న
న్నేచుట కిక న్యాయమా ఓ రామ॥ శ్రీరామ॥

2 దుర్జన భూయిష్ఠ – మున దగిలిననే
సజ్జను డెట్లౌదునో – ఓరామ॥ శ్రీరామ॥

3 ఏదారి బోయిన – నాదారి కడ్డము
వాదాడెదరు గాని – ఓ రామ॥ శ్రీరామ॥

4 కలిమానవులు వెర్రి – చలమున తత్త్వము
తెలియలేరు సుమ్మీ – ఓరామ॥ శ్రీరామ॥

5 తామరాకు నీరు విధము ప్రపంచము
తత్త్వము కాదు సుమీ – ఓరామ॥ శ్రీరామ॥

6 నేనొక టెంచిన – నీ మనసు వేరగుట
కే నేరమో తెలియ – ఓ రామా। శ్రీరామ॥

7 గజ్జి ముండ్లమీద – దగులు కొన్న బట్ట
గ్రక్కున దీయ వశమా – ఓరామ॥ శ్రీరామ॥

8 అచ్చుగ భవమున – దగులుకొన్న మది
వచ్చునా నీ వద్దకు – ఓరామా॥ శ్రీరామ॥

9 అహిరాజశయన నీ – కనుచు జేసిన పను
లహితముగ దోచెనా – ఓరామా॥ శ్రీరామ॥

10 మహిజరీతిని నన్ను – మన్నించిన నీదు
మహిమ కేమి తక్కువ – ఓ రామా॥ శ్రీరామ॥

11 బాగుగ సతతము – నీ గుణములు బల్కు
త్యాగరాజ వినుత – ఓ రామ। శ్రీరామ॥

తాత్పర్యము :

శ్రీరామా – జయరామా– శ్రితజనరిపు భీమ= భక్తుల శత్రువులకు భయంకరుడా! శృంగార గుణధామ= అందమైన గుణములకు స్థానమైన వాడా! చూచేవారికి చులకనతోచే టట్లు నన్ను బాధించుట నీకు న్యాయమా? (భక్తుని రక్షింపకపోవుట నీకు చులకనయే.

నాకును చులకనయే). దుర్జనులు మిక్కుటముగా నున్న ఈ సంఘములో చిక్కుకొన్న నేను సజ్జను డగుట ఎట్లు? ఈ దుర్జనులు నేనే దారిన బోయినా నామీద నిందలేస్తూనే ఉంటారు. కలిమానవులు కదా వీళ్లు. వీళ్లకు నిజతత్త్వము తెలియదు కదా! తామరాకు మీదనున్న నీరు నిలవదు క్షణంలో జారిపోతుంది. అట్లే ఈ ప్రపంచము. ఇది సత్యము కాదు. నేను నిన్ను గూర్చి ఒక విధముగా ఎంచితే నీ మనసు వేరొక విధముగా నున్నది. నానేరమేమో తెలియుటలేదు. ముండ్ల కంప మీద బట్ట తగులు కుంటే వెంటనే తీయకలమా? (అట్లే దుర్జన సాంగత్యము - అపరాధములనే ముండ్ల కంచలో దగిలిన నేను ఇట్టే నీవు చేపట్టే విధముగా కాగలనా? కనుక నా నేర మెంచక నన్ను రక్షింపుమని) అచ్చముగా సంసారములో చిక్కిన నా బుద్ధి నీ వద్దకు వేగముగా రాకలదా? ఓ అహిరాజశయనా=శేషునిపై పవ్వళించు వాడా! నీ కొరకు నేను చేసిన పనులన్నియు నీకు అనిష్టముగా తోచినవా? సీత నాదరించినట్లు నన్నాదరిస్తే నీ గొప్ప తగ్గుతుందా? ఎప్పుడును నీ గుణములను నేను పల్కుచున్నాను కదా! అని ప్రార్థనము.

విశేషము = 5వ చరణములో ''బ్రహ్మసత్యం జగన్మిథ్యా'' = బ్రహ్మము సత్యము జగత్తు అసత్యము'' అనే శంకరాచార్యుల వారి సూక్తి ఉన్నది.

573. పూర్ణ చంద్రిక = జంపె (దివ్యనామము)

ప॥ శ్రీరామ రామ జగదాత్మక రామ॥
శ్రీరామ రఘురామ పాహి పరమాత్మ॥ శ్రీరామ॥

చ॥ జోతిర్మయాఖండరూప - రామ
భూతేశవినుతాపహృత భక్త తాప॥ శ్రీరామ॥

2 సర్వ గ్రహాధార భూత - రామ
గీర్వాణ మునివంద్య సుజనేష్ట దాత॥ శ్రీరామ॥

3 యోగిజన హృదయాబ్జ మిత్ర - రామ
భోగిశాయీ ఘృణా - రస పూర్ణ నేత్ర॥ శ్రీరామ॥

4 శ్రీదాంత శాంత నిర్వాణ - ఫలద
వేదాంత వేద్యావనీసు రత్రాణ॥ శ్రీరామ॥

5 త్వాం వినా నాన్యత్ర జానే - రామ
త్వాం వినా కోగతి ర్జాన కీ జానే॥ శ్రీరామ॥

6 ధీర! భవ సాగరో – త్తరణా రామ
సారతర శ్రీత్యాగ రాజనుత చరణ॥ శ్రీరామ॥

తాత్పర్యము :

ఇది సంస్కృతరచన. ఇవి సంబోధనములే. కాని 5వ చరణమున సంస్కృత వాక్యము పూర్ణముగా కల్పింపబడినది. రామనామ సంబోధనములు తరువాత. జ్యోతిర్మయా ఖండరూప=తేజోమయమగు అఖండమగు రూపము గలవాడా! భూతేశ వినుత=శివునిచే నుతింపబడినవాడా! అపహృత భక్తతాప=భక్తుల తాపములను హరించిన వాడా! సర్వగ్రహాధార భూత=అన్ని గ్రహములకును ఆధారమయిన వాడా! గీర్వాణముని వంద్య=దేవతలకు మునులకు నమస్కరింప దగినవాడా! సుజనేష్ట దాత=సుజనులకు ఇష్టముల నిచ్చువాడా! (ఇందు దాతః అని ఉండవలెను. కాని అయ్యగారిని పరిష్కరింప దలచలేదు) యోగి జన హృదయాబ్జమిత్ర=యోగుల మనస్సనెడు పద్మములకు సూర్యుడా! భోగిశాయి=సర్పమునందు శయనించువాడా! (ఇందు శాయీ అని ఉండవలెను. అయ్యగారిని పరిష్కరింప దలచలేదు. దాతః అనుచోట శాయిన్ అనుచోటను తాత్కాలికముగా అయ్యగారి మనసులో తెలుగు ఉన్నది) ఘృణా రసపరిపూర్ణ నేత్ర=దయనిండిన కనులవాడా! శ్రీదాంత=శ్రీ దేవిని నియమించువాడా! శాంత మనస్సును నియమించువాడా! నిర్వాణ ఫలద=మోక్షమనెడి ఫలము నిచ్చువాడా! వేదాంత వేద్య=వేదాంతములచే తెలియ దగినవాడా! అవనీసురత్రాణ=బ్రాహ్మణులను రక్షించువాడా! రామ=ఓరామా! త్వాం వినా=నిన్ను కాక అన్యత్ర=వేరొక విషయమును, న జానే=ఎరుగను. జానకీ జానే=ఓ సీతానాథా! త్వాం వినా=నీవుగాక, కోగతిః=ఎవడు దిక్కు? (ఎవడును లేడని) ధీర=ధీరుడా! భవసాగరోత్తరణా – సంసారసముద్రము నుండి తరింప జేయువాడా! సారతర=మిక్కిలి సారమగువాడా! త్యాగరాజనుత చరణ=త్యాగరాజు నుతించినపాదములు కలవాడా! అని సంబోధనముల తరువాత 5వ చరణముతో వాక్యపూర్తి చేసుకొనవలసియుండును.

విశేషము = సర్వగ్రహములకు భగవానుడాధార మనుటకు ''ఏతస్యవా ప్రశాసనే గార్గి సూర్యా చంద్రమసౌ విధృతౌ తిష్ఠతః''=ఓ గార్గీ భగవానుని ఆజ్ఞ చేతనే సూర్యచంద్రులు ఒకరి నొకరి పట్టుకొని యున్నారు'' అనిన వాక్యము కొంత ఆధారము.

574. సావేరి = చాపు (దివ్యనామము)

ప॥ శ్రీరామ రామా శ్రితులము గామా
నేరమా బ్రోవ భారమా॥ శ్రీరామ॥

చ॥ మనసా నామాట విని సారెకు
మంచి దనుమీ ముక్తి గనుమీ॥ శ్రీరామ॥

2 పలు విధ కర్మము లందు మర్మము
తెలుసుకో హరిని కలుసుకో॥ శ్రీరామ॥

3 లోకులు తమత్రోవ ఏకమందురు ఒప్పు
కోక వే మోసపోకవే॥ శ్రీరామ॥

4 మాటి మాటి నూనె రోటి యెద్దులు తిరుగు
ధాటిరా మతమేపాటిరా॥ శ్రీరామ॥

5 ఆ మతముల యందు నేమము – స
త్యము ఏమర బోకు పామర॥ శ్రీరామ॥

6 గత్యంతరము లేదు ప్రత్యేకమున జూడు
నిత్యుని, కృత కృత్యుని॥ శ్రీరామ॥

7 తొలి భవ నాటకముల జేయు పాపము
తొలగును సుఖము కలుగును॥ శ్రీరామ॥

8 నాదలపున నుండు శ్రీదుని మనసెందు
మీదనో, ఎవరి బోధనో॥ శ్రీరామ॥

9 జూడ దెలుసుకొని వేడుకొన్న నన్ను
జూడడు మాటలాడడు॥ శ్రీరామ॥

10 క్రోధ లోభములతో – బాధించిన ఆ
రాధనో లేక శోధనో॥ శ్రీరామ॥

11 సదయుని చిరునవ్వు వదనుని పదభక్తి
వదలను యెందు గదలను॥ శ్రీరామ॥

12 నేమముగ తొలి నోమున దొరికిన
రాముని జితకాముని॥ శ్రీరామ॥

13 శీలుని సద్గుణ – శాలిని జూచుటే
చాలును ఆలస్య మేలను॥ శ్రీరామ॥

14 వలరాజ జనకుని వలచుదునని పేర
గొలుతును యముని గెలుతును॥ శ్రీరామ॥

15 నాజయమును త్యాగరాజుని – రాజాధి
రాజునకు గూర్తు రాజిని॥ శ్రీరామ॥

తాత్పర్యము :

శ్రీరామా! రామా! మేము ఆశ్రితులము కామా? (అగుదుము) నానుంచి ఏదైనా నేరము కలదా? నన్ను రక్షించుట నీకు భారమా? (కాదు)

గమనిక : పైది పల్లవి. అంతవరకు రామునితో చెప్పినది. తరువాత చరణముల లన్నియు అయ్యగారు మనస్సుతో చెప్పినవి.

ఓ మనసా! నా మాట విని మంచిదని మోక్షమును గనుము. (భక్తితో ముక్తిని గొనుమని). అనేక కర్మములున్నవి. వాటి మర్మము తెలుసుకొని హరిని కలుసుకొనుము (ఏ కర్మము నాచరించినా వాటి గమ్యము హరియే అని తెలుసుకొని భక్తితో నుండుమని) లోకులు తామేదో మార్గము నాశ్రయించి తమదే మార్గమని చెప్పుచు తమ మార్గములోనికి ఇతరులను లాగుటకు చూతురు. ఒప్పుకొనకుము. మోసపోకుము. (అనన్యార్హమగు రామ భక్తియే మార్గముకాని తక్కినవి కుహనా మార్గములని) ఆ మార్గములకు పోతే గానుగ ఎద్దు తిరిగినట్లే. అనగా ఎన్నిసార్లు తిరిగినా తిరిగినదే తిరుగుతుంది. కాని మోక్షములేదు. అని ఉపదేశము. ఓపామరమగు మనసా! ఆ మతములలో నియమ నిష్ఠలధికము. వాటిలో ఏలోపము జరిగినా అధఃపతనమే. (రామభక్తి ఒక్కటే శ్రమము తక్కువ, ఫల మత్యధికమైన మోక్షము అని) మోక్షమునకు నిత్యుడు కృతకృత్యుడు అయిన రాము నాశ్రయించుటే కాని వేరొక గతిలేదు. రామునాశ్రయిస్తే పూర్వజన్మ పాపములు తొలగి మోక్ష సుఖము కలుగును. నా తలపు రామునిపై నున్నది. రాముని తలపు మాత్రము నాపైన లేదు. ఎచ్చటనో ఉన్నది. ఇది ఎవరి చేసిన బోధనమో (అని పరితాపము) భక్తి మార్గమును నేను తెలుసుకొని నేను ప్రార్థిస్తూ ఉంటే నన్ను చూడడు నాతో మాట్లాడడు. నా మనస్సులో నున్న క్రోధము లోభముతో రాముని బాధించుట

అగును. క్రోధలోభములు పోగొట్టు కొనక చేసినది ఆరాధనమగునా? కాదు. అది శోధన మగునా? కనుక నేను చిరునవ్వు మోముగల రాముని పాదభక్తిని వదలను. ఇతరమయిన ఏ చోటకు పోను. తొలి జన్మ పుణ్యము చేత లభించిన రాముని వదలను. అట్టి సుశీలుని సుందరుని చూచుటయే చాలును. ఆలస్యము లేక రామునాశ్రయించి వదలను. మన్మథ జనకుడగు రాముని వలచెదను, కొలిచెదను, యముని గెలిచెదను. నా జయము నంతయును నాకు రాజాధి రాజయిన రామునకు సమర్పించెదను.

విశేషము : 3, 4, 5 చరణములు, 11, 12, 13 చరణములను మూడు చరణములను కలిపితేనే కాని, సమగ్రార్థము కలిగిన వాక్యము కాదు. దేనికది పాడితే అర్థము కాదు. ఈ పద్ధతిని సంస్కృతములో ''కుళక'' మందురు. అయ్యగారీ పద్ధతిని ఇందు ప్రవేశపెట్టిరి. మనస్సును సంబోధించుచు మొదలు పెట్టిన చరణములతో రాముని సంబోధించిన పల్లవి కలుప వలసి యున్నది. అప్పుడు అన్వయము భేదించును. ఈపద్ధతి ఎచ్చటను లేదు. ఇది ప్రత్యేక శిల్పమని భావింపవలసినదే. ''రామ+ఆశ్రితులము'' అనుచోట సవర్ణ దీర్ఘ చేయుట, ''వలరాజ జనక'' అను ప్రయోగము అయ్యగారి నిరంకుశత్వమును చాటును.

575. వరాళి = ఆది (దివ్యనామము)

ప॥ శ్రీరామ శ్రీరామ – జిత రామ గత కామ॥
దేవ ఏమి దోవ నన్ను – బ్రోవ వేగ రావా॥ శ్రీరామ॥

చ॥ బాల భక్త పాల సుగుణ – శీల తాళ జాల శ్రీరామ॥

2 ధీర సుశరీర నిర్వి – కార ఏలుకోరా॥ శ్రీరామ॥

3 ఆదరించరాదా నమ్మ – లేదా మరియాదా॥ శ్రీరామ॥

4 ఆరురిపులపోరు దీర్చు – వారు ఎవరున్నారు॥ శ్రీరామ॥

5 రాయ మనసు రాయ ముని – గేయ తాళదాయ॥ శ్రీరామ॥

6 వాదు కారాదు ఇక – మీదు గతి లేదు॥ శ్రీరామ॥

7 చింత దీర్ప నెంత నే – వింతా? శ్రీకాంత॥ శ్రీరామ॥

8 శ్రీనా ధావనిలోన ఇట్లు గాన నిజమేనా?॥ శ్రీరామ॥

9 పద్దు తప్ప వద్దు ఏ – ప్రొద్దు మరువ వద్దు॥ శ్రీరామ॥

10 బిన్న బ్రోవు మన్న బ్రోవకున్న విడనన్న॥ శ్రీరామ॥

11 శ్రీ జానకీ రాజ త్యాగ – రాజ కృత పూజ॥ శ్రీరామ॥

తాత్పర్యము :

శ్రీరామ! శ్రీరామ! జితరామ=పరశురాముని జయించినవాడా! గతకామ=ఐహిక వాంఛలు లేనివాడా! దేవా! నన్ను వేగముగా బ్రోవరాదా? ఓ బాలుడా! (కృష్ణుడు లేక బాలరాముడు) భక్తపాల=భక్తులను రక్షించు వాడా! సుగుణశీల=సుగుణములే స్వభావమైన వాడా! నీవు రక్షించకపోతే నేను తాళలేను. ఓ ధీరుడా! సుశరీర=మంచి శరీరము గలవాడా! నిర్వికార=వృద్ధిక్షయాది వికారములులేని వాడా! ఏలుకోరా! నన్ను ఆదరింపరాదా? నన్ను నమ్మలేదా? నన్ను ఆదరింపకుండుట నీకు మర్యాదా? నా లోని ఆరు శత్రువుల ఓ ప్రభువా! నీ మనసు రాయా? మునిగేయ=మునులచే గానము చేయబడువాడా! ఇకమీదట నీ మీద వాదు (నన్ను బ్రోవలేదనే నింద) రాకూడదు. నీకన్న నాకు గతిలేదు. నా చింత దీర్చుట నీకెంతపని? నేను వింతగా నీక తోచుచుంటినా? శ్రీకాంతా! శ్రీనాథా! ఆశ్రయించిన భక్తుని రక్షించక పోవుటనే నెక్కడను చూడలేదు. ఇది నిజమేనా? పద్దు తప్పక నన్ను రక్షించు. ఎప్పుడును నను మరువవద్దు. బిన్న=శీఘ్రముగా, బ్రోవు మన్నా! బ్రోవకపోతే నిన్ను విడువను. శ్రీ జానకీనాథా! త్యాగరాజకృత పూజ=త్యాగరాజుని పూజలు కలవాడా! అని ప్రార్థనము.

గమనిక : 7,10 చరణము లిందు పరిష్కరించి వ్రాయుట అయినది.

576. జగన్మోహిని = రూపకం

ప॥ శోభిల్లు సప్తస్వర – సుందరుల భజింపవే మనసా॥ శోభిల్లు॥

అ॥ నాభిహృత్కంఠ రసనా – నాసాదుల యందు॥ శోభిల్లు॥

చ॥ ధరణి క్ష్మాదులలో–వరగాయత్రీ హృదయమున
సురభూసుర మానసమున – శుభత్యాగరాజుని యెడ శోభిల్లు॥

తాత్పర్యము :

సప్తస్వరముల నెడు సుందరులను భజింపుము మనసా! నాభి, హృదయము, కంఠము, నాల్క, ముక్కు అనే స్థానముల యందు శోభిల్లు సప్త స్వరములను భజింపుము. ఋక్సామాది వేదములలో, గాయత్రి హృదయములో, దేవ బ్రాహ్మణుల మనస్సులో, త్యాగరాజుని లోనూ శోభిల్లు సప్తస్వరములను భజింపుము అని తాత్పర్యము. సంగీతము పాసింపుమని పర్యవసానార్థము

విశేషము = ఇందు అయ్యగారు సప్తస్వరములను ''సుందరు'' లన్నారు. దీనికి మూలము. పూర్వమొకప్పుడు నారదుడు తుంబురుని సంగీతాతిశయమును పరీక్షింపగోరి తుంబురుని ఆశ్రమమునకు పోయెను. తుంబురుడు లోపల నున్నాడు. అతని వీణమాత్ర మివతల నున్నది. నారదుడు ఇవతల నిరీక్షించు చున్నాడు. ఇంత ఒక వాయువు వీణకు తగిలినది. వాయువీవనము వలన వీణా తంత్రులు మ్రోగి సప్త స్వరములు చెవికి వినబడుటయే కాక సుందరుల వలె కంటికి కనిపించినవి కూడ. నారదుడు నిర్విణ్ణుడై తుంబురుని పాదములపై బడినాడు. ఇది లింగపురాణాంతర్గత కథ. ఇది తెలియుట వలన అయ్యగారు ''సప్తస్వర సుందరులు'' అన్నారు. సప్తస్వరములను నాభీ ప్రదేశము వద్ద బ్రహ్మ గ్రంధి వద్ద పుట్టి హృదయ – కంఠ – జిహ్వా నాసికా స్థానములను స్పృశించి ముఖము నుండివైఖరీ రూపముతో బహిర్గత మవుతాయి. ఈ శాస్త్ర విషయము నయ్యగారిందు చెప్పిరి. ఋగాది వేదములలో కూడ ఉదాత్త–అనుదాత్త – స్వరితము లనే స్వరములున్నాయి. సామవేదములో ఇంకకొన్ని స్వరములున్నాయి. ఇక గాయత్రీ హృదయమున ''అనగా'' తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి దియో యోనః ప్రచోదయాత్'' ఇది గాయత్రీ మంత్రము. దీనిలో Underline చేసిన అక్షరాలలో సప్తస్వరస్ఫూర్తి ఉన్నది. ''ణ్యం'' అనే అక్షరమును 'ణియం' అని 'ణి'ని నిషాదముగా భావింతురు. ఇది పెద్దల నిర్వాహము. త్యాగయ్యగారు ఈ విషయములను దృష్టిలో నుంచుకొని దీనిని రచించిరి. త్యాగయ్యగారు తమ హృదయములోని సంగీతమును కూడ మనసున నుంచుకొని ముద్రతో కృతిని ముగించిరి.

577. ధన్యాసి = ఆది

ప॥ సంగీత జ్ఞానము భక్తి వినా – సన్మార్గము గలదే మనసా॥ సంగీత॥

అ॥ భృంగినటేశ సమీరజఘటజమ – తంగనారదాదులు పాసించే॥ సంగీత॥

చ॥ న్యాయాన్యాయము తెలుసును జగములు
మాయామయమని తెలుసును దుర్గుణ
కాయజాది షడ్రిపుల జయించే
కార్యము తెలుసును – త్యాగరాజునికి॥ సంగీత॥

తాత్పర్యము :

అయ్యగారు దీని యందు తమ అనుభవమును చెప్పుచున్నారు. భక్తి సహితమైన సంగీత జ్ఞానమే సన్మార్గము. (ముక్తి మార్గమని). భృంగి, నటరాజు, హనుమంతుడు, అగస్త్యుడు, మతంగుడు, నారదుడు మొదలగు వారుపాసించే సంగీత జ్ఞానము రామభక్తి తోడిదై సన్మార్గమగుచున్నది. త్యాగరాజునకు న్యాయాన్యాయములు తెలుసును. ఈ జగములు మాయామయములని తెలుసును. (వేదాంతము తెలుసును). దుర్గుణము లయిన కామక్రోధాదులను జయించే పద్ధతియు తెలుసును. అయినను వీటి వలన సన్మార్గము లేదు. భక్తి సహిత సంగీత జ్ఞానమే సన్మార్గ దాయకము. అని తన అనుభవమును చెప్పినారు.

విశేషము = ''న కర్మణా నప్రజయా ధనేన। త్యాగే నైకే అమృతత్వ మానశుః''= కర్మ చేత కాదు. సంతానము చేత కాదు. ధనము చేత కాదు. త్యాగముతో కొందరు ముక్తిని పొందుదురు. అని ఒకటి. ''నాయమాత్మా ప్రవచనేన లభ్యః। నమేధయన బహునా శ్రుతేన శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః''= ఈ ఆత్మ ప్రవచనము చేత లభ్యము కాడు. బుద్ధిచేత లభ్యము కాడు. ఎక్కువ చదువుకొనుట చేత లభ్యము కాడు. వినదగిన వాడు. మననము చేయదగిన వాడు. బాగా ధ్యానింప దగిన వాడు'' అనిన ఉపనిషద్వాక్యములున్నవి. వీనివలె త్యాగయ్యగారు న్యాయాన్యాయజ్ఞానము, మాయా జ్ఞానము ఇవి సన్మార్గములు కావు. భక్తి సహిత సంగీత జ్ఞానము భగవత్ప్రాప్తి కరము అని చెప్పినారు.

578. ముఖారి = ఆది

ప॥ సంగీత శాస్త్ర జ్ఞానము – సారూప్య సౌఖ్యదమే మనసా॥ సంగీత॥

అ॥ శృంగార రసా – ద్యఖిల సారపూ
రిత రామకథా నందాబ్ధి యుత॥ సంగీత॥

చ॥ ప్రేమ భక్తి సుజన వాత్సల్యము
శ్రీమద్ర మావర కటాక్షము
నేమ నిష్ఠయశో ధన మొసంగునే
నేర్పు గల్గు – త్యాగ రాజు నేర్చిన॥ సంగీత॥

తాత్పర్యము :

ఇందు కూడ తమ అనుభవమును చెప్పుచున్నారు. సంగీత శాస్త్రజ్ఞానము సారూప్య సౌఖ్యదము. (భగవంతుని రూపమును పొందిన సౌఖ్యము నిచ్చునది). శృంగార వీర కరుణాది రసములతో కూడిన రామకథా సముద్రము కూడిన సంగీత శాస్త్రజ్ఞానము సారూప్య సౌఖ్యదము. దీని వలన ప్రేమ, భక్తి, సుజనులయందు భక్తి, నియమము, నిష్ఠ, కీర్తి చాతుర్యమును త్యాగరాజు నేర్చిన సంగీత శాస్త్ర జ్ఞానము వలన కలుగునని తాత్పర్యము.

విశేషము = సాధారణముగా సంగీతమే సౌఖ్య ప్రదము. అందులోను త్యాగయ్యగారు నవరసభరితమగు రామకథను సంగీతముతో జోడించి ఉపాసించినారు. ఇక సౌఖ్యమున కేమిలోపము? లోపములేదు. ఆ సౌఖ్యమే రస మనబడును. ఆ రసము భగవత్స్వరూపమే. ''రసోవై సః. రసగ్గు హ్యేవాయం లబ్ధ్వా ఆనందీ భవతి'' రసమే ఆ భగవంతుడు. ఉపాసించుపురుషుడు రసమునే పొంది ఆనందము కలవాడగుచున్నాడు''. అను దాని ప్రకారము అయ్యగారు రామకథను తీసుకొని సంగీతముతో జోడించి ఉపాసించి ఆ సారూప్య జ్ఞానమును పొందిరి. తద్వారా రాముని గుణములగు ప్రేమను, భక్తిని, సుజన వాత్సల్యమును, నియమనిష్ఠలను కూడ అవలంబించి యశోధనులైనారు. ఈ అనుభవము నిందు చెప్పినారు.

579. రామప్రియ = ఆది

ప॥ సందేహమును దీర్పవయ్య – సాకేత నిలయ! రామయ్య॥ సందేహ॥

అ॥ నందార్చితా – పదయుగములు మేలో
నాగరీకమగు పాదుకాయుగంబు మేలో॥ సందేహ।

చ॥ వరమౌను లెల్ల – చరణంబులను
స్మరియింప నీదు – పదమొసంగెనే
భవతార్చిన చే పాదుకలు
ధరనిన్నొసంగె – త్యాగరాజు భాగ్యమా॥ సందేహా॥

తాత్పర్యము :

త్యాగయ్య గారి కొక సందేహము కలిగినది. రాముని పాదములు మేలా? రాముని పాదుకలు మేలా? అని ఓ సాకేత నిలయా=అయోధ్యావాసా! ఒక సందేహమును దీర్చవయ్యా! ఓ నందార్చితా! = నందుడను వైకుంఠ పారిషదునిచే అర్చింపబడినవాడా! నీ పాదములు (అడవిలో సంచరించిన పాదములు)మేలా? అయోధ్యా నగర మందే ఉండి నాగరికములు అయిన పాదుకలు మేలా? ఈ సందేహము దీర్చవయ్యా! ముని శ్రేష్ఠులందరును నీ పాదములను స్మరిస్తే నీ పదమును (స్థానమును) ఇచ్చావు. భరతుడు పాదుకల నర్చిస్తే నిన్నే ఇచ్చావు. ఈ రెండిటిలో ఏవి గొప్పవి? అని అయ్యగారు రాముని ప్రశ్నించారు. రాముడు ఈ ముడి విప్పలేదు. అయ్యగారి ప్రశ్నలలోనే ఒకతార తమ్యమున్నది. దీనిని బట్టి మనమే చిక్కు ప్రశ్నముడిని విప్పుకోవలెను.

విశేషము = రాముడు మునులకు ఎవరికిని మోక్షమిచ్చినట్లు లేదు. కాని చరణములను స్మరించినారు. ఆ సమయములో రాముడు సీతా లక్ష్మణులతో అడవికి వచ్చినాడు, చిత్ర కూటమున నున్నాడు. మునులందరును రాముని చూచుటకు అచటికి వచ్చినారు. అదియే రాముడు మునులకు తన పద మొసగుట. ఎట్లనగా అరణ్య ప్రయాణ సమయమున సుమిత్ర లక్ష్మణునితో ''రాముని విష్ణువుగా నెరుగుము'' అనినది. ఎందుకంటే లక్ష్మీనారాయణులున్నచోటు వైకుంఠమే కదా! ఇది ''రామందశరథంవిద్ధి'' అనే శ్లోకమునకు పెద్దలు చెప్పిన మహదర్థము. దీని ప్రకారముగా చరణములను స్మరించిన మునులకు రాముడు తన పద మొసగి నట్లయినది. ఇక భరతునకు పాదుకలను తనకు ప్రతినిధిగా నిచ్చెను. భరతుడు సింహాసనము నందుంచి అభిషేకించి సర్వ విషయములను పాదుకలకు నివేదించుచు రాజ్యము చేసినాడు. భరతుడు పాదుకలను పాదుకలుగా భావింపక రామునిగానే భావించినాడు. ఇదియే ''తన్నొసంగుట''. పదమొసంగుట కన్న తన్నొసంగుట మేలని భావించవచ్చును. ఇది అయ్యగారి భావనా పరాకాష్ఠకు తార్కాణము.

580. సావేరి = ఆది

ప॥ సంసారులైతే నేమయ్యా – శిఖిపించవ
తంసు డెదుట నుండగ॥ సంసారు॥

అ॥ హింసాదు లెల్ల రోసి – హంసాదుల గూడి ప
శంస జేయుచు నే ప్రొద్దు – కంసారిని నమ్మువాడు ॥ సంసారు॥

చ॥ జ్ఞాన వైరాగ్యములు – హీన మైనట్టి భవ
కాననమున దిరుగు – మానవులు సదా
ధ్యాన యోగయుతులై – నీ నామము బల్కుచు
నానా కర్మ ఫలము – దానము సేయువారు॥ సంసారు॥

2 క్రూరపు యోచనల – దూరుజేసి తన
దారపుత్రుల పరి – చారకుల జేసి॥
సారరూపుని పద – సారసయుగమును
సారె సారెకు మన – సార పూజించు వారు॥ సంసారు॥

3 భాగవతుల గూడి – భోగము లెల్ల హరి
కే గావింపుచు వీ – ణాగానములతో
ఆగమ నుతుని శ్రీ – రాగమున బాడుచు
త్యాగరాజ నుతుని – బాగుగ నమ్మువారు॥ సంసారు॥

తాత్పర్యము :

సంసారములో నుంటే ఏమి తక్కువ? నెమిలి పించము శిరమున ధరించిన కృష్ణుడు ఎదుట సాక్షాత్కరించినప్పుడు. (ధ్యానముచే నతడు సాక్షాత్కరించును). పరహింస చేయక హంసలను (భక్తులను) కూడుకొని హరిని స్తుతిస్తూ ఆయనను నమ్మి ఉంటే సంసారి అయితే నేమి? జ్ఞాన వైరాగ్యములు లేక సంసారారణ్యములో తిరుగుచున్నా భగవంతుని ధ్యానించుచు, నామస్మరణము చేస్తూ తాను చేసిన వివిధ కర్మముల ఫలమును భగవదర్పణము చేస్తూ ఉన్నవారు సంసారులయితే నేమి? దుష్ట ఆలోచనలను దూరము జేసి, భగవంతుని పాదములను మనసార స్మరిస్తూ భగవంతుని పూజించుచు, తాము జేయు పూజకు తమ భార్యాపుత్రులను పరిచారకులుగా వినియోగించుకొనువారు సంసారులయితే ఏమి? భాగవతులను కూడి హరికి భోగములు జేయుచు వీణా గానములతో హరిని శ్రీరాగముతో పాడుకొనువారు సంసారులయితే ఏమి?

విశేషము = సన్యాసులయి మహావాక్యోపదేశమును పొందితే మోక్షార్హుడౌతాడు. అని శాస్త్రమున్నది. కాని నవవిధ లక్షణములు కలభక్తితో ప్రధానముగా భక్త సాంగత్యము, శ్రవణ కీర్తన స్మరణములతో పూజించువాడు సంసారి అయిన నేమి?

విశేషము = భగవత్ప్రాప్తికి అనేక కర్మలు చెప్పబడినవి. అవన్నియు శ్రమసాధ్యములు. కొద్దిలోపమేదయినా జరిగితే అధఃపతనహేతువులు. అందుచేత ''కలౌస్మరణాన్ముక్తిః''= కలిలో భగవన్నామస్మరణము వలన ముక్తి'' అన్నారు. మరి కలియుగములో సన్యాసము నిషిద్ధము. ''అశ్వాలంభం గవాలంభం। సన్యాసం పలపైతృకం। దేవరాచ్చసుతోత్పత్తిం। కలౌ పంచ వివర్జయేత్''=అశ్వమేధము, గోమేధము, సన్యాసము, మాంసముతో తద్దినము పెట్టుట, స్త్రీ బావమరదుల వలన సంతానమును కనుట అనునవి కలియుగములో నిషేధము'' అని శాస్త్రమున్నది. దీని ప్రకారము సన్యాసము లేదు. మరి సద్గతి ఎట్లు? ఈ కృతిలో చెప్పబడినవి ఉంటే మోక్షమే. మొదట ''నానా కర్మఫల దానము'' చెప్పబడినది. ''అనాశ్రితః కర్మఫలం। కార్యం కర్మ కరోతియః। ससన్యాసీచ యోగీచ''=కర్మఫలమును కోరక (భగవదర్పణము చేసి) చేయదగిన కర్మను చేసినవాడు సన్యాసియే. యోగియే'' అని గీతా వాక్యము. ఇక సంసారి అయితే నేమి? ఇక ''శ్రీరాగము వీణాగానము'' అంటే రాగములలోని శ్రీరాగముకాదు. శ్రీఅనగా భగవద్భక్తి. దాని యందు రాగముతో (ఆసక్తితో) అని భావింప వలసి యున్నది. ఇది కూడ అయ్యగారి అనుభవము. గానధ్యానములతో కృష్ణుడు అయ్యగారి ఎదుట నర్తించెనేమో?

581. ఫలమంజరి = ఆది

ప॥ సనాతనా పరమ పావనా – ఘనా ఘన వర్ణ – కమలానన॥ సనాతనా॥

అ॥ తన వాడనే – అభిమానము
దైవమైననీ – కేల గల్గదు॥ సనాతనా॥

చ॥ రాజాన్వయా ధిపసాగర – రాజు నీవై విలసిల్లితే
తేజరిల్లగా కృప జూతువే – ఈ జగాన త్యాగరాజసన్నుత॥ సనాతనా॥

తాత్పర్యము :

ఓ శాశ్వతుడా! పరమపావనుడా! బాగ వర్షించు మేఘము వంటి వర్ణము గలవాడా! పద్మము వంటి ముఖముగలవాడా! త్యాగరాజు నావాడు అనే అభిమానము దేవుడ వయిన

నీ కేల కలుగదయ్యా? నీవు రాజకులములో శ్రేష్ఠుడ వయితే లోకులు మెచ్చునట్లుగా నన్ను దయజూచి యుందువు. అని అయ్యగారి పొత్తిపాడుపు.

విశేషము = సాధారణ మానవులకైతే వీడు నావాడు. వీడు నావాడు కాడు. అనే భేదభావ ముండును. 'అయం నిజః పరోవేతి। గణనాలఘుచేతసాం। ఉదారచరితానాంతు। వసుధైవ కుటుంబకం' = వీడు నావాడు, వీడు పరాయివాడు, అనే భావన అల్పబుద్ధులకు. ఉదారులకు భూజనులందరును తనకుటుంబమే. దేవుడవు నీవు భక్తుడనునేను. మరి నీకు నాపై ఆ అభిమానము కలిగినట్లు లేదు. ఇదీ కాక ప్రభువులు ప్రజలను కన్న బిడ్డలవలె చూచుట పరిపాటి. మరి నీవు రాజాధిరాజువే అయితే అట్లే ఉండాలి. అని ఎత్తి పొడుపు తోడి ప్రార్థనము.

582. అసావేరి = చాపు

ప॥ సమయము దెలిసి పు-ణ్యము లార్జించని
కుమతి యుండి యేమి ... పొయ్యేమి॥ సమయము॥

అ॥ శమతతోడి ధర్మము జయమేగాని
క్రమముతో మనవిని - వినవే మనసా॥ సమయము॥

చ॥ సారమౌ కవితల - విని వెర్రివాడు
సంతోషపడి ఏమి - పడకేమి
చేరడేసి గుడ్డి కన్నులు బాగ
తెరచి యేమి తెరువ-కున్ననేమి॥ సమయము॥

2 తురకవీధిలో విభు-నికి పానకపూజ
నెరయ జేసి యేమి - చేయకుంటే యేమి
ధరలోన ధనకో-ట్లకు యజమానుడు
దయ్యమైతే నేమి-లోభైతే నేమి॥ సమయము॥

3 పదము త్యాగరాజ-నుతునిపై గానిది
పాడియేమి ఏడ్చితేనేమి
ఎదను శ్రీరామ భ-క్తియులేని నరజన్మ
ఎత్తిఏమి మృగమైతే నేమి॥ సమయము॥

తాత్పర్యము :

సమయము తెలిసి పుణ్యము చెయ్యని దుర్మతి ఉండి ఏమి? (ఉండి ఉపయోగములేదు. చస్తే వచ్చిన నష్టము లేదు. ఈ విధంగా చివరి చరణం వరకు కలుపుకొనవచ్చును) ఓ మనసా! శాంతితో ధర్మము చేయుట జయము. క్రమముగా చెప్పుచున్నాను వినుము. మంచి కవిత్వమును విని వెర్రివాడు సంతోషపడితే ఏమి, సంతోషపడకపోతే ఏమి? చేరెడంత విశాలముగా నున్న గ్రుడ్డికనులు బాగా తెరచితే ఏమి, తెరవకపోతే ఏమి? కోటీశ్వరుడు లోభి అయినా ఒకటే దయ్యమైనా ఒకటే. రాముని మీద కాని పాట పాడినా ఒకటే ఏడిచినా ఒకటే. రామభక్తి లేని నరజన్మమైనా ఒకటే, మృగజన్మమైనా ఒకటే. ఈ విధముగా గుణహీనము భక్తిహీనము అయిన ప్రతి విషయమును ఉంటే లాభము లేదు. లేకపోతే నష్టములేదని నిరసించినా రయ్యగారు.

విశేషము = ఈ కృతి 'చేతులారంగ శివుని పూజింపడేని। నోరు నొవ్వంగ హరి కీర్తి నొడువడేని। దయయు సత్యంబు లోనుగా దలపడేని। కలుగనేటికి తల్లుల కడుపుచేటు' అనే పోతనగారి పద్యమును గుర్తుకు తెచ్చుచున్నది.

583. కల్గడ = ఆది

ప॥ సమయము ఏమరకే మనసా॥ సమయము॥

అ॥ సుమతులౌ నరులను చేరి నిజ
సుఖమనుభవిం-చుటకు నీకిదే॥ సమయము॥

చ॥ అంతరంగమున-గలుగు భయమ్మున
ఆంతరిక భక్తి-మార్గమును దెలసి
దాంత సంరక్షకు-డైన శ్రీ
త్యాగరాజ స-న్నుతుని జూడ॥ సమయము॥

తాత్పర్యము :

ఓ మనసా! మంచిసమయము నీకు లభించినది. (నరజన్మము) దీనిని ఏమరకుము. సజ్జన సాంగత్యముతో సుఖమనుభవించే సమయము ఇది. ఏమరకుము. లోపల సంసారమును భయపడి దానిని పోగొట్టు కొనుటకు మానసిక భక్తిని అభ్యసించి

భక్తరక్షకుడైన రాముని చూచే సమయమిది. చూచుట అనగా సాక్షాత్కారసాకార మయిన అనుభవమును మనసుతోపొందుట.

584. కోకిల వరాళి = ఆది

ప॥ సముఖాన నిల్వగల్గునా–కమలాననా సముఖాన॥

అ॥ క్షమగల్గు భూ–తనయా లక్ష్మణా
దిమహాత్ములకే–గాని అన్యులకు॥ సముఖాన॥

చ॥ కమలాసనా–ద్యమర దిక్పతులు
కలశవార్ధిలో–జూడనేరక
గుమిగూడి మెర–లిడ కార్యములు
కొనసాగెనట–త్యాగరాజ వినుత॥ సముఖాన॥

తాత్పర్యము :

రామా! నీ సముఖములో ఎవరు నిలువగలుగుదురయ్యా? ఎవరును నిలువలేరని. క్షమారూపిణి అయిన సీతకు, ఆదిశేషుని అంశగల లక్ష్మణునకు కాక ఇతరులకు నీ సముఖమున నిలువ శక్యమా? బ్రహ్మాది దేవతలు, దిక్పాలకులును, క్షీర సముద్రములో నిన్ను దరిజేరి చూడలేక వారందరు ఒకచోట గుమిగూడి మొరబెట్టు కున్నారు. వారి కార్యములు కొనసాగినవి. అని రాముని అసన్నిధేయత్వమును వర్ణించినా రయ్యగారు.

ఒక సూచనము : దేవతలు రావణ బాధితులై నారాయణుని ప్రార్థించుటకు క్షీరసముద్రమునకే వెళ్లిరి. నారాయణుని ప్రార్థించిరి. ఆయన రాముడనై పుట్టి రావణుని వధించునట్లు అభయమిచ్చి పంపెను. ఇది కథ. అయ్యగారు కొంచెం వేరుగా చెప్పిరి. అయ్యగారు స్వతంత్రులు. దేవతలకైనను రాముడు అప్రధృష్యుడని చెప్పుట ప్రధానము.

585. జనరంజని = ఆది

ప॥ స్మరణే సుఖము – రామనామ
నరుడై పుట్టినందుకు రామ॥ స్మరణే॥

అ॥ వరరాజ యోగ నిష్ఠలౌ
వారి కానంద-మయ్యేటట్లు॥ స్మరణే॥

చ॥ రామనామ శ్రవణమువల్ల
నామరూపమే-హృదయంబునిండి
ప్రేమ పుట్ట సేయగ లేదా-ని
ష్కామ త్యాగరాజు-సేయు రామ॥ స్మరణే॥

తాత్పర్యము :

ఇది అయ్యగారు జనులకు స్వానుభవము చెప్పుట. నరుడై పుట్టినందుకు రామనామస్మరణము చేయుటే సుఖము. ఇదే రాజయోగము. ఈ రాజయోగము నవలంబించిన వారి కానందము కలిగేటట్లు రామనామ స్మరణము చేయుట సుఖము. ఆ నామ శ్రవణము వలన రాముని నామ రూపములు మనస్సంతయు నిండి ప్రేమ పుట్టును. ఈ విధముగా త్యాగరాజు (తను) చేసే రామనామస్మరణము స్మరించువారికి అది వినువారికిని సుఖకరము.

విశేషము = 'కలౌస్మరణాన్ముక్తిః' = కలియుగములో స్మరణము వలన ముక్తి' అనే సూక్తిని అయ్యగారు అనుభవ పూర్వకముగా ఇందు తెలిపిరి.

586. కాపినారాయణి = అది

వ॥ సరససామదాన-భేదదండచతురా
సాటి దైవమెవ్వ-రే బ్రోవవే॥ సరస॥

అ॥ వరమశాంభ వా-గ్రేసరుండనుచు
బల్క రావణుండు-తెలియలేకపోయె॥ సరస॥

చ॥ హితవు మాటలెంతో - బాగ బల్కితివి
సతముగా నయోధ్య-నిచ్చే నంటివి
నత సహోదరుని - రాజు జేసి రాక
హతము జేసితివి - త్యాగరాజనుత॥ సరస॥

తాత్పర్యము :

సరసమైన సామదాన భేదదండములను నాలుగు ఉపాయముల యందు నేర్పుగల ఓ రామా! నీసాటి దైవములేదు. నన్ను బ్రోవుము. సామ పూర్వకమయిన హితవు మాటలు హనుమంతుని ద్వారా అంగదుని ద్వారా రావణునకు చెప్పినావు. (ఇది సామము) అయోధ్యనిచ్చెద నన్నావు. (ఇది దానము). నతుడైన విభీషణుని (సోదరుని) రాజుచేసి రాక హతమొనరించినావు. (ఇది దండము). ఇటువంటి చతురుపాయ చతురుడవగు నిన్ను పరమశివభక్తుడవని చెప్పుకొనే రావణుడు తెలుసుకోలేక పోయినాడు.

విశేషము = శత్రువును ముందుగానే దండించుట రాజనీతి కాదు. నాలుగు ఉపాయములను వరుసగా ప్రయోగింపవలసి యున్నది. రాముడు హనుమంతుని ద్వారా సామవచనములను చెప్పిపంపినాడు. పని కాలేదు. తరువాత విభీషణుని గ్రహించినాడు. ఇది భేదము. ఇది క్రమములో కాక ముందు జరిగినది. విభీషణుని లంకకు రాజుగా అప్పటికప్పుడు చేసినాడు. రావణుడు రాజీకి వస్తే అప్పుడేమి చేయుదువు? అని సుగ్రీవుడు ప్రశ్నింపగా రాముడు 'విభీషణోవా సుగ్రీవ। యదివా రావణ స్స్వయం' = రావణుడు స్వయముగా వస్తే - నా అయోధ్యను వానికిస్తాను' అన్నాడు. ఇది ఆంతరంగికమైన దానము. ఇది వాడు తెలియలేదు. రాలేదు. తుదకు దండమే విధియై రావణుని హతము చేయుట జరిగినది. అయ్యగారు దీనినంతయు భావించి 'సరససామదాన భేదదండచతురా' అని ప్రస్తుతించిరి.

587. ముఖారి = ఆది

వ॥ సరసీరుహాననా - సమయము బ్రోవ చిద్ఘన॥ సరసీ॥

అ॥ పరభామల న-ర్భించి అన్నమిడి
పగలు రేయు సరస-మాడు వారి నొల్ల॥ సరసీ॥

చ॥ బ్రాహ్మణీకము - బాయ నీచుల
బ్రతుకాయె నది-గాక ఈ కలిలో
బ్రాహ్మమైన మా-టలు నేర్చుకొని
పరగే రయ్యా - త్యాగరాజనుత॥ సరసీ॥

తాత్పర్యము :

ఓ పద్మముఖా, ఓ జ్ఞానపరిపూర్ణా! రామా, నన్ను రక్షించే సమయమయ్యా ఇది. పరభామల నాశించి వారికి అన్నపానాదులు గూర్చుచు పగలు రాత్రియు వారితో సరస సల్లాపాలు చేసేవారిని నెనొల్లను. బ్రాహ్మణీకము పోయినది. అల్పుల బ్రతుకైనది. ఈ కలిలో ప్రతివాడును ఏవో కొన్ని మాటలు నేర్చుకొని బ్రహ్మ వేత్తవలె ఉపన్యసిస్తూ ఉంటాడు. ఇటువంటి దుష్కాలము నుండి నన్ను రక్షింపవలసినది. అని అయ్యగారి ప్రార్థనము.

విశేషము = పూర్వము శాస్త్రాభ్యాసము, గురుశుశ్రూష, అధీతి బోధా చరణ ప్రచారణములు= చదువుట, తెలుసుకొనుట, ఆచరించుట, ప్రచారము చేయుట అను నాలుగు ఉండెడివి. ఇప్పుడవి పోయి 'కలౌ వేదాంతిన స్సర్వే' = కలిలో అందరును వేదాంతులే' అనే పరిస్థితికి అయ్యగారు వగచినారు.

588. బిలహరి = చాపు

ప॥ సరసీరుహనయనా॥ నీ కటాక్షమే-చాలు సజ్జనజీవన॥ సరసీ॥

చ॥ మీన మర్భకుల కామించికన్నట్లు
దానమీ లంకను దయజూచినట్లు॥ సరసీ॥

2 సాధుసంగతి నేను-సలిపిన యట్లు
మాధుర్యభోజన - మటుజేసినట్లు॥ సరసీ॥

3 ధనకనకము లెల్ల - దగిలిన యట్లు
దినము దురాశలు - దీరినయట్లు॥ సరసీ॥

4 సింహాసనమున - జెలగిన యట్లు
బ్రహ్మేంద్ర పట్టానుభవ మందినట్లు॥ సరసీ॥

5 నాలుగొక్కపది - భువన మేలినయట్లు
కలుగు కులమెల్ల - కడతేరినట్లు॥ సరసీ॥

6 రాజీవభవనుత - రమణీయ చరిత
రాజిల్లు శ్రీత్యాగ-రాజవినుత॥ సరసీ॥

తాత్పర్యము :

ఓ నరసీరుహనయనా = పద్మనయనా, సజ్జన జీవన = సజ్జనులకు జీవనమైనవాడా! నీ కటాక్షమే చాలు. చేపలు తమ పిల్లలను చూపులతోనే పెంచుతాయి. విభీషణునకు లంకను దానమిచ్చావు. ఇది నీ కటాక్ష ఫలితమే. నీ కటాక్షమంటే సజ్జన సాంగత్యము కలిగినట్లే. చాలా కమ్మని భోజనము చేసినట్లే. ధనకనకములు వచ్చి పడినట్లే. ఆశలు తీరినట్లే. సింహాసనముపై కూరుచుండినట్లే. కులమంతయు కడతేరినట్లే. ఈ విధముగా రాముని కటాక్షమును అయ్యగారు వర్ణించినారు.

589. శంకరాభరణం = ఆది

ప॥ స్వరరాగసుధా రసయుత భక్తి
స్వర్గాపవర్గమురా... ఓ మనసా॥ స్వర॥

అ॥ పరమానందమనే - కమలముపై
బక భేకముల చెలగేమి మనసా॥ స్వర॥

చ॥ మూలాధారజనాద మెరుగుటే
ముదమగు మోక్షమురా...
కోలాహల సప్తస్వర గృహముల
గురుతే మోక్షమురా - ఓ మనసా॥ స్వర॥

2 మర్దల తాళగతులు తెలియకనె
మర్దించుట సుఖమా
శుద్ధమనసులేక - భజన సేయుట
సూకరవృత్తిరా... ఓ మనసా॥ స్వర॥

3 బహుజన్మములకు - పైన జ్ఞానియై
బరగుట మోక్షమురా
సహజ భక్తితో రాగజ్ఞాన
సహితుడు ముక్తుడురా - ఓ మనసా॥ స్వర॥

4 రజత గిరీశుడు - నగజకు దెల్పిన స్వ
రార్ణవ మర్మములు .....

విజయమగల త్యాగరాజుడెరుగే
విశ్వసించి తెలుసుకో ... ఓ మనసా॥ స్వర॥

తాత్పర్యము :

అయ్యగారిందులో సంగీతముతో కూడిన భక్తి స్వర్గాపవర్గమన్నారు. స్వర్గమంటే స్వర్గము. అపవర్గమంటే మోక్షము. ఈ క్రమమును బట్టి స్వరరాగసుధ (సంగీతము). స్వర్గము అనగా సుఖమని అర్థము చేసుకోవచ్చును. స్వరరాగముల వలన సుఖము కలుగుట సాధారణము. అయ్యగారీ సుఖమును స్వర్గమన్నారు. ఇక దీనితో కూడిన భక్తిమోక్షము. అనగా మోక్షదాయకమని. ఇది పరమానందమనే కమలము. సంగీతమొక కమలము. సామాన్యగాయకులు భక్తివిహీనులై గానము చేయుదురు. ఇది కమలముచెంత కప్పలు కొంగలు తిరిగినట్లే. అవి మకరందరుచి నెరుగవు. కమలము వలన వాటికి సుఖములేదు. (కమలము నందు మకరంద రసాస్వాదము చేయగలిగినవి తుమ్మెదలు). స్వరరాగముతో భక్తిని జోడించుకుంటే వాడు తుమ్మెద అగును. మూలాధార మందు బుట్టిన నాదమెరిగి ఒక్కటే ముద్దగా నున్న నాదమునుంచి అవ్యక్తముగా కలగాపులగముగా నున్న శ్రుతులనుండి సప్తస్వరములను విభజించుకొని సంగీతోపాసన చేస్తే ఆనందమను మోక్షము కలుగుతుంది. మృదంగము లయతాళము లెరుగక మర్దించుట సుఖములేదు. శుద్ధ మనస్సుతో కాక వేరుగా భజించుట సూకర (పంది) వృత్తి. ఎక్కడ పడితే అక్కడ తిరిగి ఏది పడితే అది తింటుంది అది. అట్లు కాకూడదు. స్వరములగుర్తెరిగి లయతాళములు జోడించి భగవద్భజనము చేస్తే అది స్వర్గాపవర్గముల నిస్తుంది. బహు జన్మములలో పుణ్యములు చేసి ఫలముగా జ్ఞాని అగుట మోక్షము. సహజమైన భక్తి కలిగి రాగజ్ఞానము కలవాడు ముక్తుడు. శివుడు పార్వతికి తెలిపిన సంగీతమర్మములు నాకు తెలుసును అని స్వానుభవమును చెప్పినా రయ్యగారు.

విశేషము = ఇందుకొన్ని రహస్యము లున్నవి. సంగీత శాస్త్రమందు 'సంగీత జ్ఞానము ధర్మార్థ కామ మోక్షములకు సాధన' మని చెప్పుచు – 'నిష్కామ స్తదనుష్ఠానా। న్మోక్షమాప్నో త్యసంశయం' = సంగీతమును నిష్కామ ప్రవృత్తితో అనుష్ఠిస్తే తప్పక మోక్షము' అని చెప్పినది. నిష్కామ ప్రవృత్తి అనగా భగవద్భక్తి కలిగి సంగీతోపాసనా ఫలమును భగవదర్పణము చేయుటే. అయ్యగారు చేసినదిది. దీని సుఖము ననుభవించి చెప్పినారు. ఇంకొకటి, 'మోక్షసాధన సామగ్ర్యాంభక్తి రేవగరీయసీ' = మోక్ష సాధనములలో భక్తియే గొప్పది' అని శాస్త్రము. అయ్యగారీ రెండిటిని ఎరిగి అవలంబించిరి. మరియొకటి 'బహూనాం జన్మనామంతే। జ్ఞానవాన్ మాంప్రపద్యతే' =

బహుజన్మల తరువాత జ్ఞానవంతుడై నన్ను భజించును' అని గీతావాక్యము. అయ్యగారు మూడవ చరణమున దీనిని కూడ సూచించిరి. ఈ కృతి 'సర్వశాస్త్రమయి గీతా' అన్న రీతిలో నున్నది.

590. భిన్నషడ్జము = ఆది

ప॥ సరివారి లోన – చౌక జాలదాయెనా॥ సరి॥

అ॥ పొరుగింట్ల వారల చేతి–పూజజూచి చల్లనాయెనా॥ సరి॥

చ॥ తారుమారుగా – బలుకు వారలు
తత్తరించగా – జూడన్యాయమా
పారమార్థికుల – దుఃఖ జాలముల
బాపలేదా – శ్రీ–త్యాగరాజనుత॥ సరి॥

తాత్పర్యము :

నా సరివారలలో నన్ను చౌక జేయుచున్నావు. ఇంకా చాలదా? నా పొరుగింట్లవారు చేసే పూజచూచి నీ మనసు చల్లబడినదా? నన్ను గురించి తారుమారుగా పలుకు పలుకులను విని నేను తత్తరపడుచుండగా చూచుట నీకు న్యాయమా? పరమార్థభక్తుల దుఃఖములు లోగడ నీవు బాపితివి కదా! నా దుఃఖమును బాపవా? అని.

591. శ్రీరంజని = ఆది

ప॥ సరి యెవ్వరే – శ్రీ జానకీ నీ॥ సరి॥

అ॥ పరమాత్మునిపై – గడిదేరి సదా
సిరులిచ్చుటకు – చేరికొలిచిన నీ॥ సరి॥

చ॥ వనమందు భయం–కరమైన తా
వున నిల్తునని–మనసు దెలిసి
కనకాంగి అందం–దున రాజసుఖం
బును గల్గజేయ–త్యాగరాజనుతే॥ సరి॥

తాత్పర్యము :

ఓ జానకీ దేవీ! నీసరి ఎవరమ్మా? (ఎవరును లేరని). పరమాత్ముడే సిరు లిస్తాడు. అని వ్యవహారము. కాని అమ్మా! నీవు ఆయన కన్నా గడిదేరినావు. భక్తులకు సిరులిచ్చుటకే నీవు రాముని చేరి కొలిచినావు. రాముడు సీతను మిథిల యందో, అయోధ్యయందో ఉండవని అరణ్య ప్రయాణమునకు ముందు చెప్పినాడు. అప్పుడు సీత 'రామజామాతరం ప్రాప్య, స్త్రియం పురుష విగ్రహం' = మా తండ్రి జనకుడు పురుషుని వలె కనిపించు స్త్రీని అల్లుడుగా పొందినాడు' అని రాముని తన అరణ్యవాసమునకు అంగీకరింపజేసినది. ఇది అయ్యగారు స్మరించి 'గడిదేరి' అని అన్నారు. సీత ఇంకొక మాట అన్నది 'యస్త్వయాసహ సస్స్వర్గః। నిరయోయస్త్వయా వినా' = రామానాకు నీతోడిది స్వర్గము, నీవులేనిది నరకము' అన్నది. అని బయలు దేరినది. బయలుదేరి రామునకు రాజసౌఖ్యము నిచ్చినది. సీత ఒకచోట 'పర్యాయేణ ప్రసుప్తశ్చి। మమాంకే భరతాగ్రజః' రాముడు వంతు ప్రకారంగా నాతొడపై సుఖ గాఢనిద్ర పోయినాడు' అని చెప్పును. ఇది రామునకు రాజసుఖము కాదా? అయ్యగారి ఈకృతి పై భావములు కలిగినది.

విశేషము = కొన్ని విశేషములు తాత్పర్యములోనే చెప్పబడినవి. ఇక్కడ కొన్ని రామావతారము భక్తులకు సిరులిచ్చుటకు అని ప్రసిద్ధి. సిరులిచ్చుట అంటే రక్షించుట అనియే ప్రధానము. ఈ రక్షించుటలో 'పరమాత్మునిపై గడిదేరినది' అని కదా త్యాగయ్యగారి భావము. దీనికొక రమ్యమగు పూర్వాచార్యుల సూక్తి ఒకటి ఉన్నది. 'మాతర్మైథిలి! రాక్షసీస్త్వయి తదైవార్ద్రాపరాధాస్త్వయా। రక్షన్త్యాఃపవనాత్మజా ల్లఘుతరా రామస్యగోష్ఠీకృతా।కాకం తంచ విభీషణం శరణ మిత్యుక్తిక్షమౌరక్షతః।' = ఓ సీతాదేవీ! అప్పటికప్పుడు నీయెడ ఘోరాపరాధములు చేసిన రాక్షసస్త్రీలను చంపవద్దని చెప్పి హనుమంతుని నుండి రాక్షస స్త్రీలను నీవు రక్షించావమ్మా! మరి రాముడో 'శరణుజొచ్చితిని' అని నోటితో చెప్పగలిగిన కాకాసురుని, విభీషణుని రక్షించినాడు. దీని వలన రాముని కథ నీకథముందు తేలిక అయినది' అని 'శ్రీగుణ రత్నకోశ'మందు పరాశరభట్టార్యుల సూక్తి ఇది. అయ్యగారును ఈ కృతియం దీభావమునే ఆవిష్కరించిరి.

592. తీవ్రవాహిని = ఆది

ప॥ సరిజేసి వేడుక జూచేది – సాకేతరామా న్యాయమా॥ సరి॥

అ॥ ధరలోన నీ పరివారులను – దర్పకాదుల నిజదాసులను॥ సరి॥

చ॥ కొక్క శాస్త్ర విదులు నరసన్నుతిచే – గొప్ప బహుమతుల నందేరయ్యా
చక్కగాను భక్తి – శాస్త్రసంవిదులు – చాలరని నవ్వేరుత్యాగరాజనుత॥ సరి॥

తాత్పర్యము :

రామా! నీ భక్తులయిన రామదాసులను, కామ దాసులను, ఒకే విధముగా నీవు చూచుట న్యాయమా? కొక్కోకము (కామశాస్త్రము) వంటి అతినీచ శాస్త్రములు చదివి గౌరవింపబడుచున్నారు. భక్తి శాస్త్రవేత్తలు పరిహసింప బడుచున్నారయ్యా? నీ విది చూచి ఓర్చుట న్యాయమా?

593. నాగానందిని = ఆది

ప॥ సత్తలేని దినములు వచ్చెనా
అ॥ సత్త మాత్రమా సచ్చిత్తశాయి – సాకేత నిలయా – దైవ॥ సత్త॥
చ॥ కలిలోన ప్రథమ పాదమ్ములో – తలిదండ్రి గురుభక్తియు లేక
పలుమారుదుష్కృత్యం బొనర్ప – వలెనా త్యాగరాజ వినుత॥ సత్త॥

తాత్పర్యము :

ఓ సత్తా మాత్రమా! సచ్చిత్త శాయీ=సత్పురుషుల హృదయమందుండువాడా! దైవ సత్త=దేవబలము లేని రోజులు వచ్చాయి కదా!! కలియుగ ప్రథమ పాదములోనే మాతా పితృగురుభక్తిలేక దుష్కృత్యములు ఎక్కువైన రోజులు వచ్చెననే పరితాపమును రాముని వద్ద అయ్యగారు చెప్పుకున్నారు.

విశేషము = ఉపనిషత్తులలో భగవంతుడు ''సత్'' అనే పదముతో చెప్పబడినాడు. సత్ అంటే పుట్టుక, పెరుగుదల, తరుగుట, నశించుట లేక ఒక్క ఉండుట మాత్రము కాలదని. దానినే ఈ కృతిలో అయ్యగారు 'సత్తామాత్రమా' అని రాముని సంబోధించినారు.

594. భైరవి = ఆది

ప॥ సర్వాంతర్యామి నీవనే – సామ్రాజ్యము నిజమే రామ॥ సర్వా॥
అ॥ నిర్వాహములేని ఈ జనులగని – నిర్మలాత్మ లెటు సైరించిరోగాని॥ సర్వా॥

చ॥ దారి దెలియలేరు కొందరు – దరిద్రులైనారు – సుదురహం
కారులై పరమనికృష్టమతా – చారులైనారు
జారులైనా రదిగాక తారు – మారుపనుల జేసేరు సం
సారులైనారు త్యాగరాజ – స్వాంతసదన! కపట మేమో తెలియ॥ సర్వా॥

తాత్పర్యము :

త్యాగరాజ స్వాంత సదన = త్యాగరాజుని హృదయ మందుండు వాడా! నీవు సర్వాంతర్యామి=అన్నిటిలోపల నుండువాడవు నీవు అనే సామ్రాజ్యము నిజమేనా? మంచి ధర్మమును నిర్వహించుకోలేని ఈ జనులను చూచి నిర్మలాత్ములైన పెద్దలు తట్టుకోలేకున్నారు. జనులు కొందరు మంచి దారి తెలియలేని దరిద్రులైనారు. కొందరు బాగా దురహంకారులు. కొందరు నీచమతాచారులు. కొందరు దేహపరముగానూ, ఆత్మపరముగాను వ్యభిచారులు. కొందరు ధర్మాన్ని తారుమారు చేసి ఆచరించేవారు. రామా! మరి ఈ మాయ ఏమిటి? అని అయ్యగారు పరితాపపడి ఇది నీ సామ్రాజ్యమేనా? అని అడిగినారు.

విశేషము = వాల్మీకములో రావు రాజ్యమిట్లు లేదు. అందరు ధర్మము ననుసరించినవారే. ఎవరయినా విపరీతమార్గములో నడిస్తే రాముడు శిక్షించి ధర్మ మార్గమున నడిపెడివాడని ''రామో రామో రామ ఇతి। ప్రజానామభవన్ కథాః''=ప్రజలు రాముని కీర్తిని వర్ణించు కొనెడువారు'' అని యున్నది. ప్రస్తుత పరిస్థితి వ్యతిరేకముగా నున్నందున అయ్యగారి పరితాపమిది.

595. హుసేని = త్రిశ్రలఘువు (దివ్యనామము)

వ॥ సర్వలోక దయానిధే – సార్వభౌమ దయానిధే॥ సర్వ॥
చ॥ పంచభూతములకు నాథు – డంచునే దెలుసుకొంటి॥ సర్వ॥
2 భూసుతాకరమును బట్టి – భూమి వెలయు వాడు నీవు॥ సర్వ॥
3 నీరధిపై బాగయోగ – నిద్ర సేయువాడు నీవు॥ సర్వ॥
4 కమలబంధుకులజవరుల – కడతేర్చినవాడు నీవు॥ సర్వ॥
5 పవమానకుమారకుండు – బంటైన వాడు నీవు॥ సర్వ॥
6 అంతరిక్ష కేశనుతా – నంతనామ రూప రహిత॥ సర్వ॥

7 జ్ఞానవైరాగ్య భక్తి – దాన మొసగు వాడవీవు॥ సర్వ॥

8 ఆగమ నిగమా తీత – త్యాగరాజ వినుత చరిత॥ సర్వ॥

తాత్పర్యము :

సర్వ జనులకు దయజూచు దేవా! సార్వభౌమా! రామా! నీవు పంచభూతములకు రక్షకుడవని తెలుసుకొన్నాను. నీవు సీతను చెట్ట బట్టిన (పట్టుటకు) భూమి నవతరించిన పరమ పురుషుడవు. సముద్రమందు యోగనిద్ర బోయినవాడవు నీవు. సూర్యకులమందవతరించి ఆ వంశ ప్రభువులను కడతేర్చిన వాడవునీవు. హనుమంతుని బంటుగా గొన్నవాడవునీవు. అంతరిక్ష కేశ = శివునిచే పొగడబడిన అనంతనామములు గలవాడవు. రూపరహితుడవు. జ్ఞానభక్తి వైరాగ్యముల నిచ్చువాడవు. వేద శాస్త్రముల కతీతుడవు. ఈ విధముగ అయ్యగారు పరతత్త్వ ప్రతిపాదనముతో రామకథను జోడించి ఆపరమాత్మను కీర్తించినారు.

విశేషము = తమ వంశములో ఒక భక్తుడు జన్మిస్తే మనను తరింపజేసేవాడు మనవంశమున జన్మించెనని వంశపూర్వులు ఆనందనృత్యం చేస్తారని శాస్త్రము. సాక్షాత్పరబ్రహ్మమే రాముడు జన్మించి వారిని కడతేర్చినాడని.

596. కన్నడ = రూపకం

ప॥ సాకేతనికేతన – సాకే ననగ లేదా॥ సా॥

అ॥ నీకే మరులైతిని – నీకేల ఈ గుణము॥ సా॥

చ॥ రాకేందుముఖ! ఇంతవ– రాకేమి నెనరుననీ
రాకేమిగుల కోరితి– రా, కేశిహరణ
రాకేమైన చెప్పకు – రాకేకలు వేతును
రా కేశవ శ్రీ త్యా– రాజనుత శుభచరిత॥ సాకేత॥

తాత్పర్యము :

సాకేతనికేతన! అయోధ్యావాసా! రామా! నీవు నన్ను కాసేను = రక్షించెదను అని అనలేదా? (అనలేదని పరితాపము). నేను నీయందే మరులుగొని ఉన్నాను. నీకిదేమిగుణము? (నన్ను రక్షింపకుండుట). రాకేందు ముఖ = నిండుపున్నమి చంద్రుని

వంటి ముఖముగలవాడా! నీకింత పరాకేమి? నేను నీ రాకనే కోరితినిరా! (స్వాతంత్రముతో రాకొట్టుట). కేశి హరణ = గుర్రపు రూపముతో వచ్చిన కేశియను రాక్షసుని సంహరించినవాడా! (కృష్ణావతారమున). రాకుండ ఏమైన అడ్డు చెప్పకురా! నీవు రాకపోతే నేను కేకలు వేస్తానురా! కేశవ = బ్రహ్మరుద్రులకు జన్మస్థానమైనవాడా! అని కడుపెంకెతనముగా ప్రార్థించి రయ్యగారు.

విశేషము = ఇందు తాళము మొదట సగములో సాకే సాకే అని, అనుపల్లవిలో నీకే నీకే అని, చరణమంతయు రాకే అని 7 సార్లు అర్థభేదముతో ఒకే పదము ప్రయోగింపబడినది. అందుచేత నిది యమకమను శబ్దాలంకారము.

597. హిందోళము = ఆది

ప॥ సామజవరగమ-నా - సాధుహృ
త్సారసాబ్జపాల కా-లాతీత విఖ్యాత॥ సామజ॥

అ॥ సామనిగమజ సుధామయ గానవి
చక్షణ గుణశీల ద-యాల వాల మాంపాలయ॥ సామజ॥

చ॥ వేదశిరోమాతృజ సప్తస్వర
నాదాచల దీ-పా॥ స్వీకృత
యాదవకుల మర-ళీ వాదనవి
నోద మోహన కర-త్యాగరాజ వందనీయ॥ సామజ॥

తాత్పర్యము :

ఇది సంస్కృత కృతి. ప్రతిపదార్థము వ్రాయబడుచున్నది. సామజవరగమన = ఏన్గువంటి చక్కని నడక గలవాడా! సాధుహృత్సారసాబ్జపాల = సత్పురుషుల హృదయమనెడి పద్మమునకు సూర్యుడా, కాలాతీత = కాలపరిమాణమును అతిక్రమించిన వాడా! విఖ్యాత = బాగ ప్రసిద్ధిగలవాడా, సామనిగమజసుధామయ గానవిచక్షణ = సామవేద మందు బుట్టిన సంగీతామృతమును బాగ ఎరిగినవాడా! గుణశీల= సుగుణములే స్వభావమైన వాడా! దయాలవాల = దయకు పాదు అయినవాడా! మాం = నన్ను, పాలయ = రక్షించుము. వేదశిరోమాతృజ సప్తస్వర నాదాచల దీపా = ఉపనిషత్తులనెడి మాతృకల నుండి పుట్టిన సంగీత మనెడి పర్వతమునకు

దీపమయినవాడా! (అనగా సంగీతమును ప్రకాశింపజేయుచు దానియందు ప్రకాశించువాడని). స్వీకృత యాదవకుల = అవతరించుటకు యాదవవంశమును స్వీకరించినవాడా! మురళీవాదన వినోద మోహనకర = మురళీవాదనముతో వినోదింపజేసి మోహింపజేయువాడా!

విశేషము = అయ్యగారి సంస్కృత కృతులలో ఒక తమాషా ఉన్నది. సంస్కృత విశేషణములతో కూడిన సంబోధనములుండును. తెనుగు పాట అయినను సంబోధనము లిట్లే యుండును. ఇవి అకారాంత సంబోధనము లయితే హ్రస్వాంతములుగా సంస్కృతమున నుండవలసి యుండును. అయితే ఒకవేళ అవి దీర్ఘములయినను 'ఏక శ్రుతి ర్ద్విశ్రుతి స్స్యాత్। గీతే తాళానుసారతః' = ఒకమాత్రాకాలపు అక్షరమయినను పాటయందది ద్విమాత్రాకాలముగా తాళము ననుసరించి పాడవచ్చును' అనే శాస్త్రాభ్యనుజ్ఞను బట్టి ఆపాట సంస్కృతమైనా తెనుగుగానే వినపడుతుంది. 'సామజవరగమనా' వంటి చోట 'నా' అనేది చాలా మాత్రలు నిలుస్తుంది. 'దూరాద్దూతేచ' అను వ్యాకరణ సూత్రమును బట్టి 'న' అనే అంత్యాక్షరము ఎక్కువ మాత్రము లయినా తత్సమముగా వినపడును. ఇక ఎక్కడో ఒకచోటనున్న 'మాంపాలయ' 'మామవ' వంటి సంస్కృత క్రియాపదము చేతనే అది సంస్కృతకృతి అని భావింపవలసి ఉంటుంది. ఆ భావమయినా సంస్కృత భాష తెలిసిన వారికే కలుగుతుంది. మరొక చిత్రము. 'మామవ' 'నమస్తే' 'సుఖీభవ' 'శుభమస్తు' 'దాసోహం' వంటి కొన్ని క్రియలు సంస్కృత మనిపించక తెలుగులో కలిసిపోయినవి. అందుచేత అయ్యగారి సంస్కృత కృతులను సంస్కృతకృతులుగా ఏరి పట్టుకొనవలసి యుండును.

598. బేగడ = చాపు

ప॥ సామికి సరిజెప్ప-జాల వేల్పుల రామ॥ సామికి॥

అ॥ నా మనసతని పై-నాటి యుండగ నొరుల॥ సామికి॥

చ॥ ఏటి యోచన చాలు - ఎవరికెటులోర్వాలు
మాటలాడేదే మేలు-మదికిదే పదివేలు॥ సామికి॥

2 తనకంటికెంతో ముద్దు - తప్ప డాడిన పద్దు
చనవు చేయు నేప్రొద్దు-చల్లని చూపు కద్దు॥ సామికి॥

3 అన్ని వేల్పులలోన – అతనికి సరిగాన
తన్ను బ్రోచిన ఘన–త్యాగరాజ సఖుడైన॥ సామికి॥

తాత్పర్యము :

సామికి = స్వామికి ఇతరదేవతలను సాటి చెప్పలేను. నా మనసు రామస్వామిపైననే నాటుకొని ఉన్నది కనుక ఒరుల నాయనకు సరి అని చెప్పలేను. ఓ మనసా! ఇతర యోచనలు చేయుట చాలు. (చెయ్యకుమని). కష్టసుఖములు ఏవయినా కలిగితే అది నుదుటి వ్రాత అని భావించుకొని రాముని కంటే వేరో ఎవరో రక్షిస్తారని భావించకు. నేను చెప్పుచున్నదే మేలు. ఇదే పదివేలు. రాముడు నా కంటికి ముద్దు. అతడాడినది తప్పడు. ఎప్పుడును భక్తులపై చనవు కలిగి ఉంటాడు. ఆయన చూపు చల్లనిది. దేవత లందరిలోను అతనికి సాటి చూడను. నన్ను బ్రోచిన సఖుడు రాముడు. అని అయ్యగారు చేసిన ఉపదేశమిది.

విశేషము = 'నత త్సమశ్చాభ్యదికశ్చ దృశ్యతే' = భగవంతునితో సమానుడులేడు. అధికుడునులేడు' అని వేదవాక్యము. మరియు 'మత్సఖా రామచంద్రః' రాముడు నా సఖుడు' అని పూర్వభక్తుల భావన. 'సఖ్య మాత్మనివేదనం' = భగవంతునితో సఖ్యము చేయుట నవవిధమగు భక్తిలో నొకటి' అనిన వాక్యముల పునరుక్తియే ఈ కృతియందలి భావము.

599. రాగపంజరము = ఆది

ప॥ సార్వభౌమ సాకేతరామ మన–సార బల్కరాదా దేవతా సార్వ॥

అ॥ పార్వతీరమణార్చిత పాద! రమా–పతి వంద్య పరాత్పర దీనబంధో సార్వ॥

చ॥ ముద్దుముద్దుగా. మాటలాడునది – ముందురాక సదా వెత బెందుచును
కద్దు కద్దనుచు చిరకాలమును – కరగుచుండవలెనా త్యాగరాజనుత॥ సార్వ॥

తాత్పర్యము :

ఓ సార్వభౌమా! ఓ అయోధ్యారామా! మనసార నిన్ను రక్షించెదను అని పలుకరాదా? (పలుకుమని). పార్వతీ రమణార్చిత పాద = శివుడర్చించిన పాదము వాడా! రమాపతి వంద్య = విష్ణువునకు వంద్యుడా! పరాత్పర = పరునికంటే పరుడా!

దీనబంధో= దీనులకు బంధువైనవాడా! ఓ రామా! నీవు ముద్దుగా మాట్లాడుచు నాముందు ప్రత్యక్షము కాక నేను వెత జెందుచు, రామునకు దయకలదు కలదు అనుచు విశ్వసించి ఎంతో కాలము నేను కరిగిపోవుచు ఉండవలసినదేనా (ఇంతేనా? నా కర్మము) అని అయ్యగారి పరితాపము.

విశేషము = ఇందులో రామున కొక విశేషణముగా 'రమాపతి వంద్య' = విష్ణువునకు వంద్యుడా! అని చెప్పబడినది. త్రిమూర్తుల మధ్యలో నున్న విష్ణువు 'మధ్యేవిరించిగిరిశం ప్రథమావతారః' అనే శాస్త్రవాక్య ప్రకారము నారాయణుని ప్రథమావతారము. తరువాత జరిగిన అవతారములలో ఒకటి రామావతారము. రాముని రమాపతి పంద్య అని అయ్యగారి సంబోధనము. ఇదెట్లనిన? అయ్యగారి భావనలో మూలమూర్తి అయిన విష్ణువు కంటే రాముడే శ్రేష్ఠుడు. అయ్యగారి 'మనసా శ్రీరామచంద్రుని' 'ఎందుండి వెడలితివో' వంటి కొన్ని కృతులలో పైభావము కనపడుతుంది. దానిని బట్టి విష్ణువు తక్కువ. రాముడెక్కువ. తక్కువవాడు ఎక్కువవానికి వందనము చేయవచ్చును కదా! అదియునుగాక 'స ఉశ్రేయాన్ భవతి జాయమానః' = భగవానుడు పుట్టినవాడై శ్రేష్ఠుడగు చున్నాడు అని ఒక వేదవాక్యమున్నది. ఈ పర్యాలోచనముచేత రాముడు రమాపతి వంద్యుడని అయ్యగా రన్నారు. ఇది స్థితగతి చింతన రూపమగు సమర్థనము.

600. బంగాళ = ఆది

ప॥ సాక్షిలేదనుచు సాధింపకే - సత్యసంధ. సద్భక్తపాలక॥ సాక్షి॥

అ॥ వీక్షకాదులెల్ల నవ్వరా జగ-త్సాక్షి వంశనీరధి పూర్ణచంద్ర॥ సాక్షి॥

చ॥ శక్తినీయెడ నిండార లేదా పరా-శక్తి బ్రోవలేదా విషయమందు వి
రక్తిగల్గు శ్రీ త్యాగరాజుని నిజ-భక్తి నీవెరుగలేవా మానవుల॥ సాక్షి॥

తాత్పర్యము :

సత్యప్రతిజ్ఞగలవాడా! భక్తరక్షకా! నా భక్తికి సాక్ష్యము లేదని నన్ను సాధింపకయ్యా! చూచేవారు నవ్వరా? నీవు జగత్సాక్షి అయిన సూర్యవంశచంద్రుడవు. నన్ను రక్షించు శక్తి నీయందు నిండుగాలేదా? పరాశక్తి నిన్ను బ్రోచినది కదా! (వశమైయున్నది కదా అని). ఇహలోక విషయములందు విరక్తి, నీ భక్తి నాకున్నవని స్వతః సర్వసాక్షివి, జగత్సాక్షి= సూర్యవంశజుడవు అయిన నీవెరుగవా? ఈ విషయమున నీకు మానవుల సాక్ష్యము కావలెనా? అని అయ్యగారి ఆర్తి.

601. యమునా కల్యాణి = రూపకం (ప్రహ్లాదభక్తి విజయము)

ప॥ సాగరుండు వెడలెనిదో – సారెకు గనరారే॥ సాగరుండు॥

అ॥ బాగుగ ప్రహ్లాదుని వర–యోగిని కౌగిటజేర్చి॥ సాగ॥

చ॥ మందరధరు డానంద–కందుడు తన హృదయార
విందమున నెలకొన్న–సౌందర్యములను దలచుచు॥ సాగ॥

2 వారణములపై భేరీ–వాద్యంబులు మ్రోయగ సుర
వారస్త్రీల నాట్యపు–వరుసల జూచుచు వేడ్కగ॥ సాగ॥

3 రాజిల్లిన శ్రీత్యాగ–రాజసఖుని మనసార
పూజించుచునుండు దనుజ–రాజ కుమార సహితుడై॥ సాగ॥

తాత్పర్యము :

ఇది ప్రహ్లాదభక్తి విజయ యక్షగానములో సముద్రుని ప్రవేశదరువు. ఓ భక్తులారా! సముద్రుడు వెడలిన విధమును చూడుడు. ధ్యాన యోగమందున్న ప్రహ్లాదుని కౌగిట చేర్చుకొని బయలువెడలినాడు. తన మధ్యలో శ్రీహరి శయనించి ఉన్న అందమును తలచుకొనుచు బయలుదేరినాడు. ఏనుగుల మీద భేరీ వాద్యములు మ్రోగుచుండగా అప్సరలు నాట్యమాడుచుండగా చూచుచు బయలుదేరినాడు. త్యాగరాజ సఖుని = శ్రీహరిని మనసార పూజించుచున్న ప్రహ్లాదునితో కూడి బయలుదేరినాడు.

విశేషము = ఈ కథలో – రాక్షస భటులు ప్రహ్లాదుని సముద్రములో వైచినారు. సముద్రుడు మహాభక్తుడు వచ్చినాడని ప్రహ్లాదునకు భేరీ వాద్యములతో అప్సరసల నాట్యముతో ఎదురేగి స్వాగతమిచ్చి తన పురము తీసుకొని పోవు ఘట్టమిది. ఇది అయ్యగారి రమ్యమయిన స్వకపోల కల్పనము.

602. పంతువరాళి = చాపు

ప॥ సారమేగాని అన్యమార్గ వి–చార మేటికే ఓ మనసా॥ సార॥

అ॥ వారు వీరు తెలియలేక వల్క–వార్తవిననేలే రామనామము॥ సార॥

చ॥ మారకోటి లావణ్యుడైన రఘు-వీరుని నామ సుధారసమును
సారెకు పానము జేసి జగద్వి-హారుడై వెలయు నారాయణ
నారాయణయనుచును - వారము శరదంబుద నిభుడౌ శ్రీ
నారదముని వల్మీకజాతునికి-కూరిమి నుపదేశించలేదా॥ సార॥

2 పరమపావనుని శరణాగత జన-పరిపాలన బిరుదాంకితుని - సీతా
వరుని నామసుధారసపానము. నిరతమునను జేసి హరి హరి
హరియనుచు సంతతంబును. సరియులేని కీర్తిగాంచి దేహము
పరవశంబుజెంది శుకబ్రహ్మ-పరీక్షిత్తుకొసగలేదా వాదా॥ సార॥

3 సామగానలోలుడౌ రజతగిరి-ధాముడైన త్యాగరాజశివు డతి
నేమముతో నామామృతపానము - ఏమరకను జేసి రామరామ
రామ యనుచు సతతము - శ్రీమదాదిగౌరికి శృంగారికి
ఆ మహిమల నారహస్యములనతి ప్రేమనుపదేశించ లేదా॥ సార॥

తాత్పర్యము :

ఇందు అయ్యగారు భగవన్నామము యొక్క ఆవశ్యకత్వమును, మహిమను తెలిపినారు. ఓ మనసా! సారమైన దానిని గూర్చి ఆలోచించుము. నిస్సారములయిన ఇతర చింతలు చెయ్యకు. తెలియని వారు వీరు చెప్పేవి వినకు. నేను చెప్పుచున్నాను. రామనామము సారమయినది. మన్మథకోటి సుందరుడైన రాముని నామమును జపించుచు లోకములందు విహరించుచు శరత్కాలపు మేఘపు వర్ణము కలిగిన నారదుడు వాల్మీకికి ఉపదేశించిన దిదే కదా! పరమపావనుడగు హరిని స్మరించుచు పరవశుడైన శ్రీ శుకబ్రహ్మ పరీక్షిత్తున కుపదేశించినది భగవన్నామమే కదా! సామగాన లోలుడైన త్యాగరాజ శివుడు (శివుడే) అతినియమముతో రామనామామృతమును పానముచేసి రామ రామ రామ అను జపమును చేసి శ్రీమదాదిగౌరికి (పార్వతికి) ఆనామమహిమను, నామరహస్యమును ఉపదేశించినాడు కదా! ఇక వేరు చింతలేల? అని అయ్యగారి ఉపదేశము.

విశేషము = రామనామ రహస్యము నుపదేశించుట. చాలాకాలమునకు దంభుడు పులోముడు అను రాక్షసు లిరువురు అత్యంతము విష్ణుభక్తులై ఉండి దేవతలపై దండెత్తుట మానలేదు. విష్ణుభక్తి మహిమ చేత వాళ్లకే జయము కలుగుతూ ఉండేది. దేవతలు విష్ణువు నాశ్రయించారు. దంభపులోములు తన భక్తులు కనుకతాను వధించుటకు లేదు. ఉపాయ

మాలోచించినాడు విష్ణువు. వాళ్ల హరిభక్తిని సడలించి వేరు మార్గమును పట్టించాలి. అప్పుడు దేవతలు వాళ్లను సులభముగా జయించెదరు. అని ఆలోచించి తన ప్రియ మిత్రుడగు శివునితో 'శివా! నీవు 'పాశుపతము' = శివమతమును సృష్టించి ఆమతమునందు వాళ్లు ప్రవేశించునట్లు వాళ్లకు ఉపదేశించి వ్యామోహపరచుము' అని కోరెను. ఒక పట్టాన శివుడంగీకరింపలేదు. 'నేను నీ భక్తుడను కదా! నేను దేవుడను అని నీకు ప్రతికోటిగా నేనెట్లు నిలువను? నాకు దోషమంటదా?' అనెను. అప్పుడు విష్ణువు నీకు ఏదోషమూ అంటకుండుటకు 'శ్రీరామ రామ' అనెడి రామతారకమును నిత్యమును జపించుము' అని చెప్పెను. శివుడు దాని ననుసరించెను. ఇది రామనామ రహస్యము. ఈ వృత్తాంతము వరాహపురాణములయం దున్నది. ఈ రహస్యమే పార్వతికి శివుడు చెప్పినది. ఇందు 'ఆది గౌరికి' అన్నా రయ్యగారు. దీని విషయము శివుడు చతుర్విధపురుషార్థములను భక్తులకు త్యాగము= దానము చేసినవాడు కనుక ఆయనకు త్యాగరాజు అనిపేరు కలిగినది. తిరువారూరుక్షేత్రముతో ఆపేరుతో శివుడు వెలసినాడు. ఆపేరు తనకు వచ్చినది. అందుచేత అయ్యగారు అవసరమగు చోట ఆయనను 'ఆది త్యాగరాజు' అని వాడుదురు. అట్లే ఆదిగౌరి అన్నారు. అంటే అవతారములయిన కామాక్షి మొదలయినవి కాక సాక్షాత్పార్వతి అన్నమాట. ఈ రామనామ రహస్యమును ఆది శివుడు ఆదిగౌరి కుపదేశించినాడని అర్థము.

603. అసావేరి = ఆది

ప॥ సారి వెడలిన ఈ కావేరిని జూడరే॥ సారి॥

అ॥ వారు వీరనుచు జూడక తాన
వ్వారి గాభీష్టముల నొసంగుచు॥ సారి॥

చ॥ దురమున నొకతావున గర్జనభీ
కర మొకతావున నిండు కరుణతో
నిరతముగా నొక తావున నడచుచు
వరకావేరీ కన్యకామణి॥ సారి॥

2 వేడుకగా కోకిలలు మ్రోయగను
వేడుచు రంగేశుని జూచి మరియూ

రేడు జగములకు జీవనమైన
మూడు రెండు నదినాథుని జూడ॥ సారి॥

3 రాజరాజేశ్వరియని పొగడుచు
జాజి సుమముల ధరామరగణములు
పూజలిరుగడల సేయగ త్యాగ
రాజ సన్నుతు రాలై ముద్దుగ॥ సారి॥

తాత్పర్యము :

అయ్యగారు కావేరిని వర్ణించుచున్నారు. యుద్ధయాత్రకు బయలుదేరి నట్లున్నదట. వారు వీరు అనక అందరికి అభీష్టము లిస్తుంది. వేగముగా గర్జనలతో భయంకరముగా నొకచోట, శాంతముగా నిండుకరణతో మందముగా నొకచోట ప్రవహించుచున్నది. ఒడ్డున నున్న చెట్లపై కోకిలలు వేడుకతో కూయుచుండగా రంగనాథుని చూచుచు ప్రవహించుచున్నది. 14 లోకములకు జీవనమైనది. మరియు 'మూడురెండు నదినాథుని' పంచనదేశ్వరుని చూచుటకు బయలుదేరినది. బ్రాహ్మణోత్తములు రాజరాజేశ్వరియని పొగడుచు వివిధ పుష్పములతో పూజచేయగా బయలు దేరినది.

విశేషము = అగస్త్యుడు వైకుంఠపు పాలిమేరలో నున్న విరజా నదీ తీర్థమును తనకమండలువు నందు గ్రహించితీసుకొని వచ్చాడు. వచ్చి ఆశ్రమము చెంత నుంచి తాను చెప్పునంతవరకును ఇవతలకు రావద్దని నియమించి ఎటకో వెళ్లినాడు. అంతవరకు ఆ తీర్థమాగలేదు. ఆ ప్రదేశము నంతయును పుణ్య క్షేత్రమయము చేయవలెను. అచటి జనులను పావనము చేయవలెను. అనే ఉత్కంఠ ఎక్కువ అయి అగస్త్యుని ఆజ్ఞకు నిరీక్షించలేదు. బహుత్వరతో బయలు దేరినది. శ్రీరంగము, తిరువయ్యారు మొదలయినవి బయలుదేరిన ప్రదేశము. అందుచేత అచట కావేరి ఉరుకు పరుగులతో నుండును. ఆ వేగమును అయ్యగారు సారివెడలిన (యుద్ధమునకు వెడలిన) రీతిగా ఉత్ప్రేక్షించినారు. తిరువైయారు వద్ద ఈ ప్రవాహమునందు వేరు నదులు నాలుగు వచ్చి కలసినవి. మొత్తం అయిదైనవి. అందుచేత తమిళములో ఐ+ఆర్ = అయ్యార్ అయినది. అర్థం అయిదు ఏరుల సంగమము అని. గౌరవార్థముగా 'తిరు' చేర్చితే 'తిరువయ్యార్' అయినది. దీనిని సంస్కృతీకరిస్తే పంచనద మయినది. దీనిని అయ్యగారు చమత్కారముగా పంచనదీశుని తెలుగులో 'మూడు రెండు నదినాథుడు' అన్నారు. ఆనదీ వేగము పంచనదీశుని చూచుటకు అని ఉత్ప్రేక్షించినారు. పైన తెలిపిన కావేరీ వృత్తాంతము ఆగ్నేయపురాణము నందున్నది.

604. కేదారగౌళ = జంపె

ప॥ సిగ్గుమాలి నావలె ధర నెవ్వరు – తిరుగజాలరయ్యా॥ సిగ్గు॥

అ॥ ముగ్గురిలో మేలైన రామా! మా–ముఖాబ్జదినరమణ! నిను నమ్మి సిగ్గు॥

చ॥ ముందర దయతో బలికిన దింక–ముందు రాకపోయె
తందనాలతో దినములు గడిపే–దారి తెలిసిపోయె
అందరిచేతను నా బ్రతుకు లిపుడు – నిందల కెడమాయె
మందర ధర! నాజీవుడు జీవన–మిందు సేయనాయె అని తెలిసి॥ సిగ్గు॥

2 ఎల్లవారివలె భవసాగరమును–ఈదమనసురాదు –
ఉల్లమునను గని నీవే నేనై – యుండతెలియలేదు
ఒల్లని పనులకు పొయ్యేటి వ్యసన – మోర్వదరముగాదు
తల్లడిల్లుచున్నది నామనసు – తాళదింక మీదు అని తెలిసి॥ సిగ్గు॥

3 నిన్నాడను నామన సెపుడైన – నిజముగ రాలేదు
వెన్నవంటి నీ చిత్తానికి నా–వెతలు దెలియలేదు॥
పన్నగశయనా. నీ దయకునే–పాత్రుడు గాలేదు
కన్నతండ్రి త్యాగరాజున కింక–కరుణ జూడలేదు. అని తెలిసి॥ సిగ్గు॥

సూచన : కల్లూరివారు గ్రహించిన గ్రంథమందు ఈకృతి జంపెతాళమని యున్నది. దానిని బట్టి నేను పైన అట్లే వ్రాసితిని. కాని కృతి శిల్పము ఆదితాళమునకే సరిపడియున్నది.

తాత్పర్యము :

రామా! నావలె సిగ్గుమాలి ఎవ్వడూ తిరుగలేడయ్యా! ఎందుచేతనంటే నిన్ను నమ్మినాను. నీ కరుణ రావటములేదు. ఇది సిగ్గుచేటుకదా! (నేను సిగ్గుమాలి తిరుగుచున్నాను) త్రిమూర్తులలో గొప్పవాడవయిన ఓ రామా! లక్ష్మి ముఖమునకు వికాసకారణమైనవాడా! నీవు పూర్వము భక్తుల విషయమై ఆడిన మంచిమాటలు ఇంతవరకు నా విషయములో ముందుకు రాకపోయె. ఇట్లాగే తందనాలతో (పనికి మాలిన వాటితో) కాలం గడచిపోతున్నట్లు తెలిసిపోయె. అందరిలోనూ నా బ్రతుకిపుడు నిందపాలైనది. ఈ పరిస్థితిలో నాజీవు డీసంఘములో జీవించుచున్నాడు. తక్కిన అందరివలెనే ఈ సంసారమునిట్లే ఈదుదమంటే మనసు రాకున్నది. (పరమార్థవేత్తకు

అందరివలెనే గడపుటకు మనసురాదు). మనస్సులో నిన్ను దర్శించి నీవే నేనై = (సోహం సోహం) = బ్రహ్మమే నేను అనే జ్ఞానము కలుగలేదు. ఇక ఐహికముగానే ఎవరినో ఒకరిని ఆశ్రయించుట వంటివి ఒల్లని పనులు ఇవిచేయుట దుఃఖకరము. ఈ భావములచే నామనసు తల్లడిల్లుచున్నది. ఇక తాళలేను. ఈ పరిస్థితిలో నేను నిన్నేమియు అనలేను. నీ మనస్సు వెన్నవంటిది. దానికి నా బాధలు తెలియరావు. నీ దయకు నేను పాత్రుడను కాలేదు. ఓ కన్న తండ్రీ! నాకు నీకరుణ కలుగలేదు. అని అయ్యగారు పరమార్తితో విన్నవించుకున్నారు.

605. లలిత = రూపకం

ప॥ సీతమ్మ మాయమ్మ – శ్రీరాముడు మాకు తండ్రి॥ సీతమ్మ॥

అ॥ వాతాత్మజ సౌమిత్రి–వైన తేయ రిపుమర్దన
ధాత భరతాదులు సో–దరులు మాకు ఓ మనస॥ సీతమ్మ॥

చ॥ పరమేశ వసిష్ఠ పరా–శరనారద శౌనకశుక
సురపతి గౌతమలంబో – దరగుహసనకాదులు
ధర నిజభాగవతాగ్రే–సరు లెవరో వారెల్లరు
వర త్యాగరాజనకు – పరమబాంధవులు మనస॥ సీతమ్మ॥

తాత్పర్యము :

అయ్యగారు సీతమ్మను తల్లిగాను శ్రీరాముని తండ్రిగాను భావించినారు. తరువాత శివుడు మొదలగు కొందరు దేవతలను, కొందరు భక్తులను భరతలక్ష్మణ శత్రుఘ్నులను హనుమంతుని సోదరులుగా భావించినారు. తరువాత కొందరిని చెప్పి, నిజభాగవతాగ్రేసరులని వారిని పరమ బాంధవులుగా భావించినారు. ఇంతవరకు సాధారణమే.

విశేషము = భక్తులను రెండు విధములుగా పెద్దలు విభజించినారు. భక్తి = హృద్యభక్తి, సభ్యభక్తి. హృద్యభక్తి నిజముగా హృదయమందు పుట్టిన భక్తి. సభ్యభక్తి నటన భక్తి. కొందరు రెండవ దానిని అవలంబించిన వారీకాలమున నుండిరి. హృద్య భక్తి కలవారే 'నిజభక్తులు'. వారు ఇప్పుడు కనపడకపోవచ్చు. ఎవరో ఎచ్చట నున్నారో తెలియక పోవచ్చు. అందుచేత అయ్యగారు వారిని కూడ కలిపి పరమబాంధవులలో చేర్చి కొనియాడిరి.

606. రీతిగౌళ = చాపుతాళం (దివ్యనామము)

ప॥	సీతానాయక! శ్రితజనపోషక-శ్రీరఘుకుల తిలక॥	సీతా॥
చ॥	నిరుపేదభక్తుల కరికోతపడలేక- గిరిపై నెక్కుకొంటివో॥	సీతా॥
2	అంగలార్పుజూచి రంగపురమున చె-లంగగ బండితివో॥	సీతా॥
3	కాచిన భక్తుల జూచి యా బలినే-యాచింప వెడలితివో॥	సీతా॥
4	ఆశమించి నిన్నాశు జేరేరని-కీశుల జేరితివో॥	సీతా॥
5	జాలితో వచ్చుకు. చేలుని గని-గోపీ చేలము లెత్తితివో॥	సీతా॥
6	ఇంగిత మెరిగి యు ప్పొంగుచు బ్రోచే-బంగారు దొరవైతివో॥	సీతా॥
7	నీ గుణములగుట్టు బాగుగ దెలిసెను-త్యాగరాజ వినుతా॥	సీతా॥

తాత్పర్యము :

ఓ సీతానాయకా! శ్రితజన పోషక = ఆశ్రితులను పోషించువాడా! శ్రీరఘుకుల తిలకా! నిరుపేదలయిన భక్తులు పెట్టే మొరల కోత పడలేక కొండ ఎక్కియున్నావా? భక్తుల అంగలార్పులు వినలేక శ్రీరంగమందు పరుండియున్నావా? ఇదివరలో రక్షించిన భక్తులను చూచి వారిని పోషించుటకై బలిచక్రవర్తిని యాచించితివా? అవసరమయితే చాలా వేగముగా వచ్చి చేరగలరని వానరుల నాశ్రయించినావా? దీనుడై వచ్చిన కుచేలునికై (చినుగుబట్టవాడు) గోపికల వస్త్రము లపహరించితివా? భక్తుల ఇంగితము (మనస్సు) ఎరిగి బ్రోచే బంగారు దొరవు (బంగారు తండ్రి వన్నట్లు) అయితివా?

విశేషము = 'గిరినెక్కుకొంటివో' అనుదానికి వీరభద్రశాస్త్రిగారు భద్రగిరి అని చెప్పినారు. రామపరముగా కృతి గ్రహింపబడినది కనుక అది సమంజసమే. తరువాత శ్రీరంగమును ఎత్తుకొనుటచే 'తిరుమల శ్రీరంగము' అని ఆ రెండు క్షేత్రములు సహపఠితములగుటచేతను, 'శ్రీరంగమంగళమణింకరుణా నివాసం। శ్రీ వేంకటాద్రి శిఖరాలయ పారిజాతం' అని కూడ సహపఠిత మగుటచేతను 'గిరి' అనుదానిని 'తిరుపది' గా భావింపవచ్చును.

607. ఖమాస్ = ఆది

ప॥ సీతాపతే నామనసున॥
సిద్ధాంతమని యున్నానురా॥ సీతా॥

అ॥ వాతాత్మజా–దుల చెంతనే
వర్ణించిన నీ–పలుకు లెల్ల॥ సీతా॥

చ॥ ప్రేమ జూచినాపై–పెద్ద మనసుజేసి
నీ మహిమ లెల్ల–నిండార జూపి
ఈ మహిని భయ–మేటికన్నమాట
రామచంద్ర! త్యాగ–రాజనుత॥ సీతాపతే॥

తాత్పర్యము :

ఓ సీతాపతీ! రామా! హనుమంతుడు మొదలయిన వారివద్ద నీవు పలికిన మాటలన్నియు సిద్ధాంతమని మనసున నమ్మియున్నాను. నా మీద ప్రేమచూపి, నా మీద పెద్దమనసు చేసి అభయమిచ్చిన నీమాటలు నాకు సిద్ధాంతమని నమ్మియున్నాను. అని తాత్పర్యము.

విశేషవివరము = విభీషణుడు రాముని శరణుజొచ్చుటకు వచ్చినాడు. సుగ్రీవాదులు విభీషణుని స్వీకరింపవద్దని చెప్పినారు. అప్పుడు రాముడు 'సకృదేవ ప్రపన్నాయ। తదాస్మీతిచ యాచతే। అభయం సర్వభూతేభ్యో। దదామ్యేత ద్వ్రతంమమ' = ఒక్క పర్యాయము నేను నీవాడను అని శరణుజొచ్చిన వానికి అభయమిచ్చుట నావ్రతము' అని చెప్పెను. చెప్పి విభీషణుని స్వీకరించెను. ఇప్పుడు వాతాత్మజాదుల చెంత పలికిన పలుకులుగా స్వీకరించినవి పైన చెప్పిన శ్లోకములోని పలుకులే. అవే అయ్యగారికి సిద్ధాంతము. ఇంకొక విశేషము. అయ్యగారు 'తనపై ప్రేమ జూపి' నట్లు చెప్పిరి. అనగా ఆనాడు ఆప్రేమ విభీషణపరముగా నుండినా ఈనాడు తనపరముగా భావించినారు. 'ఈ మహిని భయమేటి కన్నమాట' అంటే శ్లోకములో నున్న 'అభయం సర్వభూతేభ్యోదదామి' = సర్వభూతముల నుండి అభయ మిచ్చెదను' అన్న మాటే. మరియు తనను మానవ మాత్రుడుగానే భావించుచు ఏ భగవన్మహిమనూ ఇంతవరకును చూపించని రాముడు ఆశ్రయించిన వానికి ఏ భూతము నుండియు భయములేకుండ చేయుదును అనుటయే 'మహిమలెల్ల నిండారజూపుట'. ఈ విధముగా అయ్యగారు విభీషణ శరణాగతి ఘట్టమును సమగ్రముగా మనస్సున నుంచుకొని ధ్వని – ప్రధానముగా రచించిన కృతి ఇది.

608. శంకరాభరణం = ఆది

ప॥ సీతాపతి కావవయ్య॥ సీతా॥

అ॥ నతాఘహరణవి-నతాసుతగమన॥
కృతాపరాధి సు-కృతం బెరుగనే॥ సీతా॥

చ॥ సదా గతి జహిత - సదా శివప్రియ
ముదాన మనుపు-ము దానవహరా॥ సీతా॥

2 ధరావన ధురం-ధరాజ భవసా
గరార్తిహర త్యా-గరాజ వినుతా॥ సీతా॥

తాత్పర్యము :

సీతాపతీ! నతాఘహరణ = భక్తుల పాపములు పోగొట్టువాడా! వినతా సుత గమనా= గరుత్మంతునిపై చరించువాడా! కృతాపరాధిని = అపరాధముచేసిన వాడను. సుకృత మెరుగని వాడను. సదాగతి జహిత = హనుమంతునకు హితమైనవాడా! సదాశివప్రియ= శివునకు ప్రియమైన వాడా! సంతోషముతో రక్షించుము. దానవహరా = దానవులను హరించువాడా! ధరావన ధురంధరా = భూమిని రక్షించు భారమును వహించువాడా! అజ = పుట్టుకలేనివాడా! భవసాగరార్తిహర = సంసార సముద్ర బాధను పోగొట్టువాడా! త్యాగరాజవినుతా - పల్లవిలో నున్న 'కావవయ్య'ను కలుపుకోవలెను.

విశేషము = దీనిలో అన్నీ సంస్కృత సంబోధనములే. 'కావవయ్య' వంటి 2, 3 తెనుగుపదాలవలన ఇది తెనుగుకృతి అని భాసిస్తుంది. అలాగే ఇటునుంచి అటుకూడ ఉంటుంది. ఈ విషయం 'సామజవరగమన'లో చర్చించుకున్నాము.

609. దేవగాంధారి = ఆది

ప॥ సీతావర సం-గీత జ్ఞానము॥
ధాత వ్రాయవలెరా॥ సీతా॥

అ॥ గీతా ద్యఖిలో పనిషత్సార
భూత! జీవన్ముక్తుడౌటకు॥ సీతా॥

చ॥ ఆకాశ శరీరము బ్రహ్మమనే
ఆత్మారామునితో సరిజూచుచు
లోకాదులు చి-న్మయమనే సుస్వర
లోలుడౌ త్యాగరాజ సన్నుత॥ సీతా॥

తాత్పర్యము :

గీతా = ఉపనిషత్తులచే ప్రతిపాదింపబడి వాటి సారమైన ఓ సీతావరా = రామా! మానవుడు జీవన్ముక్తుడు కావలెనంటే సంగీత జ్ఞానము కావలెను. సంగీత జ్ఞానము బ్రహ్మ నుడుట వ్రాయనిదే రాదు. మరియు 'ఆకాశ శరీరం బ్రహ్మ' = బ్రహ్మమునకు ఆకాశము శరీరము' అని వేదము. ఆ బ్రహ్మమే ఆత్మారాముడు. బ్రహ్మమును ఆత్మను ఏకముగా అనుసంధించుచు, లోకములన్నియు బ్రహ్మము యొక్క జ్ఞానరూపములు అని భావించుచు సంగీతముతో అనుసంధించి ఉపాసన చేస్తే జీవన్ముక్తి. సంగీత జ్ఞానము బ్రహ్మ లిఖిస్తే కానిరాదు. ఇది స్థితి.

విశేషము = సంగీతము అన్ని విద్యల వంటిదికాదు. భాషలవంటి విద్యలు మాటలతో బోధించుటకు వీలే. కొన్ని బోర్డు మీద వ్రాసి చెప్పవచ్చును. సంగీతము ఇటువంటి వాటివలన బోధపడేదికాదు. కేవలము మనస్సుకు సంబంధించినది. సంగీతము నేర్చుకునే విద్యార్థి మనస్సులో శ్రుతి జ్ఞానము ఉంటేనే పట్టుపడుతుంది. అదే 'ధాతవ్రాయవలెను' అంటే. ఇక 'ఆకాశ శరీరము బ్రహ్మము' అనే విషయము. బ్రహ్మము ఆకాశమందు ఉండునని. కాని ఆ ఆకాశము పంచభూతములలోని మహదా కాశముకాదు. హృదయ పుండరీకమందున్న దహరాకాశము. ఈ దహరాకాశమందున్న బ్రహ్మమును యోగులు పాసించెదరు. ఇందుకు ప్రమాణము. దహరాకాశమును గూర్చి చెప్పి 'తస్మిన్ యదంతస్త దుపాసితవ్యం' = దాని లోపల ఏది కలదో దాని నుపాసింపవలెను' అని ఉపనిషద్వాక్యము. ఈ ఉపాసన మందు బ్రహ్మమే తాననే అద్వైతానుభవము కలుగును. ఇదే 'ఆత్మారామునితో సరి జూచుచు' అని అయ్యగా రనిన దాని భావము. అయ్యగారీ అనుభవమును సంగీతము ద్వారా పొందుచున్నారు. ఇక జీవన్ముక్తి. 'అతీతాననుసంధానం। ఆగామ్యనను చింతనం।ఔదా సీన్యం వర్తమానే। జీవన్ముక్తస్యలక్షణం' = జరిగిన దానిని గూర్చి తలపకపోవుట, రాబోయెడి దానిని గూర్చి ఆలోచించకపోవుట, జరుగుచున్న దానిని గూర్చి పట్టించుకొనకపోవుట జీవన్ముక్తుని లక్షణము' అని శాస్త్రవచనము. ఇట్టి జీవన్ముక్తి సంగీత జ్ఞానము వలన కలుగునని, అది బ్రహ్మ వ్రాయవలెనని అయ్యగారి అనుభవము.

610. రామమనోహరి = ఆది

ప। సీతామనోహర – శృంగార శేఖర॥ సీతా॥

అ॥ వాతాశనారి వర వాహన –
వారి జాసనాది – వందిత పాద॥ సీతా॥

చ॥ తొలి జన్మములను – జేసిన పూజా॥
ఫలమే లేక – నీదు కటాక్ష
బలమో నీవా–డని లోకులు
పల్కేరు గా–ధన్యుడైతిని॥ సీతా॥

2 దీనలోకసం – రక్షకా దైవా
ధీనముగ నీ–రూపము నాదు
మానసాబ్జమున–నాటి యుండగా
నే నెంతటి–భాగ్యశాలినో॥ సీతా॥

3 దిట్టతనమునను – భక్తి స్థిరమౌ
నట్టుగా శ్రీరామ – ఎన్నటికి
గట్టిగాను త్యాగ–రాజును చెయి
బట్టి రక్షించి – ఏలుకోవయ్య॥ సీతా॥

తాత్పర్యము :

సీతామనోహరా! శృంగార శేఖర = అందగాడా! వాతాశనారి వర వాహనా! = పక్షిరాజు వాహనమైన వాడా!, వారి జాసనాది వందిత పాద = బ్రహ్మాదులు నమస్కరించిన పాదముల వాడా! నా పూర్వపుణ్యముచేత, నీ అనుగ్రహముచేతను లోకులు నన్ను నీభక్తుడని చెప్పుకొంటున్నారు. ధన్యుడను. ఓ దీనరక్షకా! దైవవశము చేత నీ దివ్యరూపము నా మనస్సులో నాటుకొని యున్నది. ఎంతభాగ్యశాలినో కదా!! ఈ భక్తిని ఈ కీర్తిని ఈ సాక్షాత్కారము స్థిరముగా నిల్చేటట్లు చేసి కరావలంబన మిచ్చి రక్షించుము. అని అయ్యగారి ఆనందముతోడి ప్రార్థనము.

విశేషము = ఇందు అయ్యగారు తన భక్తిని లోకులు చెప్పుకుంటున్నారని సంతోషము వెలిబుచ్చినారు. ఇది కీర్తి కాంక్షకాదు. రామానుగ్రహము చేత అది

లభించినదని ఆనందము. మరియు కీర్తియందు కోరిక ఉండుటయు సత్పురుషుల లక్షణమే. 'యశసి మహతాంచాభి రతిః = మహాత్ములకు కీర్తియందు కాంక్ష ఉండును' అని భర్తృహరి సుభాషితము. అదియును ఒక వేదసూక్తి ఉన్నది. 'యోవైతాం బ్రహ్మణోవేద, అమృతే నావృతాంపురీం, తస్మై బ్రహ్మచబ్రహ్మోచ ఆయుః కీర్తిం ప్రజాందదుః' = దీని స్థూలార్థమిట్లు చెప్పవచ్చును. ఎవడైతే బ్రహ్మజ్ఞానముగల్గి (భక్తికలిగి) ఉండునో అతనికి బ్రహ్మ ఆయుస్సును కీర్తిని ఇచ్చును అని. అట్టి కీర్తిని రామబ్రహ్మమే ఇచ్చెనని రాముని వద్ద అయ్యగారి కృతజ్ఞతా నివేదనమిది.

611. కానడ = ఆది

ప॥ సుఖి ఎవ్వరో రామనామ॥ సుఖి॥

అ॥ సుఖి ఎవ్వరో సు-ముఖి ఎవ్వరో
అఖిల సారమగు తారక నామ॥ సుఖి॥

చ॥ సత్యము దప్పక-సకల లోకులకు
భృత్యుడై దైవ-భేదములేక
నిత్యమైన సు-స్వరగానముతో
నిరంతరము త్యాగరాజ నుత రామ॥ సుఖి॥

తాత్పర్యము :

రామ నామ జపముతో సుఖమును అనుభవించే సుముఖి ఎవ్వరో కదా! రాముని తారకనామము అఖిలసారము. దానిని జపిస్తూ, సత్యము తప్పకుండ, భగవద్భక్తులకు భక్తుడను అను భావము కలిగి, ఇతర దైవములను చేరక, విడువక సుస్వరగానముతో రామనామమును అనుసంధించి సుఖి అయినవా డెవడో కదా! ఇట్టి వాడు చాలా అరుదు.

విశేషము = అయ్యగారు తన సుఖానుభూతినే ఇందు చెప్పినారు. కాని 'సమహాత్మా సుదుర్లభః' = అట్టి మహాత్ముడు దొరకడు అన్నట్లు చెప్పినారు.

612. చక్రవాకము = రూపకం

ప॥ సుగుణములే చెప్పుకొంటి – సుందర రఘురామ॥ సుగుణ॥

అ॥ వగలెరుంగ లేక ఇటు– వత్తువనుచు దురాశచే॥ సుగుణ॥

చ॥ స్నానాది సుకర్మంబులు – దానాధ్యయనంబులెరుగ
శ్రీనాయక క్షమియింపుము – శ్రీత్యాగరాజ వినుత॥ సుగుణ॥

తాత్పర్యము :

ఓ సుందర రఘురామా! నేను నీ సుగుణములనే వర్ణించుకొన్నాను. ఎందుకంటే? నీవు నావద్దకు వచ్చి దర్శనమిచ్చెదవని. కాని అది తీరని ఆశే అయినది. నీవగలు నేనెరుగ నయితిని. స్నానము మొదలయిన మంచిపనుల నెరుగను (తీర్థయాత్రలు). దానము వంటి వాటిని, వేదా ధ్యయనమును ఎరుగను. ఇట్టి పనులను నేనెరుగ కుండుటను క్షమింపుము శ్రీనాయకా! అని అయ్యగారి వేడికోలు.

విశేషము = స్నానము చేయుట నిత్యవిధి. 'స్వాధ్యాయా న్నప్రమదితవ్యం = వేదా ధ్యయనము మానకుము' అని బ్రాహ్మణునకు వేదానుశాసనము. 'శ్రద్ధయాదేయం' = శ్రద్ధతో దానము చేయవలెను అనియు వేదానుశాశనము. అయ్యగారు ఈ కృతియందు వీటిని దేనినీ ఎరుగనన్నారు. దీనిలో ఒక ఆంతర్యమున్నది. 'ఆమ్నాయాభ్యసనా న్యరణ్యరుదితం వేదవ్రతా న్యన్వహం మేదశ్చేదఫలాని పూర్తవిధయ స్సర్వే హుతం భస్మని తీర్థానా మవగాహనానిచ గజస్నానం వినాయత్పద ధ్యానాంబోరుహ సంస్మృతిః' = వేదాభ్యాసము అరణ్యరోదనము. వేదములలో చెప్పబడిన ఉపవాసాది వ్రతముల ఫలము ఒంటిలోని కొవ్వు కరగుట మాత్రమే. చెరువు త్రవ్వించుట వంటివి బూడిదలో హోమము చేసినట్లే. తీర్థములలో స్నానము చేయుట ఏనుగు స్నానము చేయుటవంటిదే. అనగా ఏనుగు సరస్సులో పూర్తిగా దిగి తుండముతో తలనిండుగా స్నానము చేస్తుంది. వెంటనే ఒడ్డునకు వచ్చి తుండముతో దుమ్ము ఒంటినిండా చల్లుకొంటుంది. ఇది ఏనుగు స్నానము. ఇందు చెప్పిన వేదా ధ్యయనాదులన్నియు నిష్ఫలము లని. అయితే ఎప్పుడు? భగవన్నామధ్యానము (భగవద్భక్తి) లేకుండా చేసినప్పుడు. అయ్యగారు స్నానమెరుగను, వేదాధ్యయన మెరుగను, అని చెప్పినది భక్తిలేని ఆపనుల నెరుగను అని. అందుకనే 'సుగుణములను చెప్పుకొంటి' అని కృతి ప్రారంభించారు. అయ్యగారు స్నానాది నిష్ఠాపరులు. వేదాధ్యయనపరులు. ఇవి ఎరుగను అని చెప్పిన దాని అంతరార్థము పైన చెప్పినది. స్నానము బాహ్యశుద్ధి కొరకు. భగవత్స్మరణము అంతశ్శుద్ధి కొరకు. 'అపవిత్రః

పవిత్రోవా। సర్వావస్థాం గతోపివా। యస్స్మరేత్పుండరీ కాక్షం। సబాహ్యాంభ్యంతరే శుచిః' = అపవిత్రుడు గానీ, పవిత్రుడు గానీ, ఏ స్థితిలో ఉన్నవాడుగానీ, హరిస్మరణము చేసిన వాడు బాహ్య - అంతరములయందు పరిశుద్ధుడగును' = అని స్మృతి వాక్యము. ఈ కృతియందు పై విశేషములు ప్రతిపాదింపబడినవి.

613. కమాస్ = రూపకం

ప॥ సుజన జీవన... సుగుణ భూషణ... రామ॥ సుజన॥

అ॥ భుజగ భూషణార్చిత - బుధజనావన
అజవందిత-శ్రితచందన - దశతురంగ - మామవ॥ సుజన॥

చ॥ చారునేత్ర శ్రీకళత్ర-శ్రీరమ్యగాత్ర
తారకనామ సుచరిత్ర-దశరధ పుత్ర
తారకాధిపానన - ధర్మపాలన
తారయ రఘువర నిర్మల-త్యాగరాజ సన్నుత॥ సుజన॥

తాత్పర్యము :

ఇది సంస్కృతము. సుజన జీవన = సజ్జనులకు జీవనమైనవాడా! సుగుణ భూషణ= సుగుణములే భూషణమైనవాడా! భుజగ భూషణార్చిత = శివునిచే అర్చింపబడినవాడా! బుధజనావన = పండితులను రక్షించువాడా! అజవందిత = బ్రహ్మచే నమస్కరింపబడిన వాడా! శ్రిత చందన = ఆశ్రయించినవారికి చల్లనివాడా! దశతురంగ = పక్షివాహనమైన వాడా! మామవ = నన్ను రక్షింపుము. చారు నేత్ర = అందమైన కనులు గలవాడా! శ్రీకళత్ర = లక్ష్మీదేవి భార్య అయిన వాడా! శ్రీరమ్యగాత్ర = శోభతో రమ్యమైన శరీరము గలవాడా! తారకనామ = భక్తులను సంసారమునుండి తరింపజేయు నామము గలవాడా! సుచరిత్ర= మంచి చరిత్ర గలవాడా! దశరధపుత్రా! తారకాధిపానన = చంద్రునివంటి ముఖము గలవాడా! ధర్మపాలన = ధర్మమును పాలించువాడా! తారయ = నన్ను తరింపజేయుము. రఘువర = రఘుకుల శ్రేష్ఠా! నిర్మల త్యాగరాజ సన్నుత = నిష్కల్మషుడగు త్యాగరాజుచే నుతింపబడినవాడా! అని ప్రతిపదార్థ తాత్పర్యములు. అను పల్లవిలోని 'మామవ' చరణములోని 'తారయ' అనునవి సంస్కృత క్రియా పదములు. ఈ రెండిటి చేతనే ఇది సంస్కృతకృతి.

614. ఆరభి = చాపు

ప॥ సుందరి నిన్ను వ-ర్ణింప బ్రహ్మాది
సురలకైన తరమా॥ సుందరి॥

అ॥ కుందరదన-సనందనాది-వందిత నే నెంత త్రిపుర॥ సుందరి॥

చ॥ కలకలమను ముఖ-కళలను గని కలు
వలరాజు భువికి రాడాయె.
చెలగు నీలా వణ్యమును గని
అలనాడే వలరాజు-గానక పోయె
నిలువరమగు నీ-గంభీరమును గని
జలరాజు జడవేషు- డాయె।
బలమైన ధీరత్వ-మును గని కనకా
చలుడు తా శిలారూపు-డాయె త్రిపుర॥ సుందరి॥

2 కనులను గని సిగ్గు-పడి గండు-మీనులు
వనధి వాసము సేయనాయె
జననీ నీ చిరునవ్వి-కాంతి సోకి శివు
డనుపమమౌ శుభ్రుడాయె.
మినుకు సొమ్ముల చేల-కాంతుల మెరపులు
గని నిమిషము నిలువ దాయె.
కనకాంగి నీ స్వర-మును వినివాణి మ
గని జిహ్నను దా-నునికాయె త్రిపుర॥ సుందరి॥

3 పావనము సేయు - బిరుదును గని భక్త
పాపము పారిపో నాయె
ఏ వేళ నీదయ-చేత సత్కవులెల్ల
కావ్యములను సేయనాయె॥
మావరునికి చెల్లె-లని సంతోషమున
దేవి పెద్దలు బల్క-నాయె
భావించి నీపాద-మున త్యాగరాజు
భావుక మనుకో-నాయె... త్రిపుర॥ సుందరి॥

తాత్పర్యము :

ఓ త్రిపురసుందరీ దేవీ! కుందరదన = మల్లెలవంటి పలువరుస గలదానా! సనందనాదులచే నమస్కరింపబడినదానా! బ్రహ్మాదులు నిన్ను వర్ణింపలేరు నేనెంత? కల కలలాడు నీ ముఖకళలను చూచి చంద్రుడు ఓడిపోయి భూమికి దిగలేక పోవుచున్నాడు. నీ సౌందర్యమును చూచి ఆనాడే మన్మథుడు కనపడకుండ పోయినాడు. (శివుని కంటిమంటతో శరీరము కోలుపోయినాడు కదా). నీ గాంభీర్యమును చూచి సముద్రుడు జడవేషుడైనాడు. నీ ధీరత్వమును చూచి మేరు పర్వతము రాయి అయినది. నీ కనుల సొబగును చూచి చేపలు ఓడిపోయి సముద్రవాసము చేస్తున్నాయి. ఓ తల్లీ! తెల్లని నీ చిరునవ్వు కాంతిసోకి శివుడు తెల్లబడినాడు. మినుకు మినుకమనే నీ నగల, చీరల కాంతికి ఓడిపోయి మెరపుతీగ ఒక్క క్షణము కన్న నిలువలేక పోవుచున్నది. నీ కంఠస్వరమును విని సరస్వతి ఓడిపోయి భర్త అయిన బ్రహ్మ జిహ్వను ఆశ్రయించినది. పతితపావని అనే నీ బిరుదును విని భక్తుల పాపములు పారిపోవుచున్నవి. నీ దయచేత సత్కవులు కావ్యములు రచించుచున్నారు. పెద్దలు నిన్ను విష్ణువు యొక్క సోదరి అని పలుకుచున్నారు. త్యాగరాజు నీ పాదము తనకు శుభప్రదమని భావించినాడు. ఇది తాత్పర్యము.

విశేషము = ఇందు అయ్యగారు చక్కని కవితను చూపినారు. ఆయా ఉపమాన వస్తువుల (చంద్రాదుల) సహజస్థితిని త్రిపుర సుందరీ దేవి యొక్క సౌందర్యాది గుణములతో ఓడిపోయి ఆయా దశలను పొందినట్లు ఉత్ప్రేక్షించినారు. ఇది 'అసంబంధే సంబంధ రూపమనే ఉత్ప్రేక్షాలంకారము'. మూకుడు (మూగవాడు) అనుకవి దేవీ అనుగ్రహముచేతనే 'మూకపంచశతి' అనుమహాకావ్యమును రచించినాడు.

615. బేగడ = రూపకం

ప॥ *సుందరి నన్నిందరిలో – జూచి బ్రోవవమ్మ త్రిపుర॥* *సుం॥*

అ॥ *సందడియని ఇందుముఖి–జాలము వద్దమ్మ త్రిపుర॥* *సుం॥*

చ॥ *బాలే; పాలితసుర జాలే; గమన జితమ*
రాళే; స్వకృతాఖిల–లీలే; తిరకాంకిత
ఫాలే; నీ భక్తియు–మేలే; నీదయ రా
దేలే తల్లీ త్రిపుర॥ *సుందరి॥*

2 వాణీ వినుతే; శుక-పాణీ; వరశేష
వేణీ; లలితే క-ల్యాణీ; సాంబశివుని
రాణీ; మాధుర్య-వాణీ; నమ్మితి పూ
బోణీ తల్లి త్రిపుర॥ సుందరి॥

3 వారీ; శస్తుత గం-భీరీ; ఆదిపురవి
హారీ; దీనజనా-ధారీ; నగరాజకు
మారీ; దుష్కర్మవి-దారీ; త్యాగరాజు
కోరి యున్న త్రిపుర॥ సుందరి॥

తాత్పర్యము :

ఓ త్రిపుర సుందరీ దేవీ! నీ అందరి భక్తులలో నన్ను కూడ చూచి రక్షించు. నీ భక్తుల సందడిలో ఆలస్యము చేయవద్దు. బాలే = ఓ బాలా! పరిపాలిత సురజాలే = దేవతాగణములను పరిపాలించినదానా! గమన జితమరాళే = నడకలచేత హంసను జయించినదానా! స్వకృతాఖిల లీలే = అన్నిలీలలను చేసినదానా! తిలకాంకిత ఫాలే = నుదుట తిలకము ధరించిన దానా! నీ భక్తి మేలు కదా! నీ దయరాదేల? వాణీ వినుతే = సరస్వతి చేత పొగడబడినదానా! శుకపాణీ = చిలుకను చేతధరించిన దానా! వరశేషవేణీ= ఆదిశేషుని వంటి జడగల దానా (సర్పవేణీ అన్నమాట) లలితే = లలితా! కల్యాణి = మంగళప్రదురాలా! సాంబశివుని రాణీ! మాధుర్యవాణీ! = తియ్యని మాటలు గలదానా! పూబోణీ = పువ్వువంటి మార్దవముకల దానా! వారీశస్తుత గంభీరీ = సముద్రము పొగడిన గాంభీర్యము కలదానా! ఆది పురవిహారీ = ఆది పురమందు విహరించుదానా! దీనజనా ధారీ = దీన జనుల కాధారమైన దానా! నగరాజ కుమారీ = హిమవంతుని కూతురా! దుష్కర్మ విదారీ = పాపములను ఛేదించు దానా! త్యాగరాజు కోరిన త్రిపుర సుందరీ దేవీ రక్షించుము అని తాత్పర్యము.

విశేషము = ఇది పల్లవి తెలుగు. చరణాలలో సంస్కృత సంబోధనములు. వాటిలోనే చిన్న తెలుగు వాక్యములు కల సంకీర్ణ కృతిగా నున్నది. విహారీ, విదారీ, మొదలయిన పులింగ విశేషణములను స్త్రీపరముగా వాడుట అయ్యగారి స్వాతంత్ర్యము.

616. పంతువరాళి = ఆది

ప॥ సుందరతర దేహం వందేహం రామం॥ సుందర॥

అ॥ కుందరదన మాప్త-కుముద శశాంకం
కందర్పశత కోటి కాంతి మతి నిష్కలంకం॥ సుందర॥

చ॥ పతిత జనపావనం - పరిపాలిత భువనం
శ్రుతినికర సదనం - శుభకర వదనం॥
యతివర జీవనం - ఇభరాజ పాలనం
దితిజమద దమనం - దీనజనావనం॥ సుందర॥

2 నవ దూర్వాదళ నీలం - నందితామర జాలం
అవనత సుర పాలం - అద్భుత లీలం
భవభయహరణ కాలం - భక్తజన వత్సలం
శివ మద్వైతమమలం - శ్రీమత్కనకాభచేలం॥ సుందర॥

3 ఆగమసంచారం - అఖిలలోకాధారం
వాగధిపకుమారం - వరవీర వీరం
రాగాది సంహారం - రాఘవ ముదారం
త్యాగరాజ హృచ్చారం - కారుణ్యపారావారం సుందర॥

తాత్పర్యము :

ఇది సంస్కృత రచనము. సుందరతర దేహం = మిక్కిలి అందమైన దేహముగల, కుందరదనం = మల్లెమొగ్గల వంటి పలువరుసగల, ఆప్తకుముదశశాంకం = భక్తులనెడి కలువలకు చంద్రుని, కందర్పశతకోటి కాంతిం = నూరుకోట్ల మన్మథుని కాంతిగలిగిన, అతి నిష్కలంకం = చాల పరిశుద్ధుడైన, పతిత జనపావనం = పతితులయిన జనులను పవిత్రము జేయు, పరిపాలిత భువనం = లోకములను పరిపాలించిన, శ్రుతినికర సదనం= వేదములయం దుండు వాడైన, శుభకరవదనం = శుభములను కలిగించు ముఖము గల, యతివరజీవనం = యతీశ్వరులకు జీవనమైన, ఇభరాజ పాలనం = ఏనుగు రాజును రక్షించిన, దితిజమదదమనం = రాక్షసులమద మణచిన, దీన జనావనం = దీనులను రక్షించు, నవదూర్వాదళ నీలం = పచ్చిగరిక వలె నల్లని, నందితామర జాలం = దేవతా సమూహము నానంద పరచిన, అవనతసురపాలం = నమస్కరించిన దేవతలను పాలించిన,

అద్భుతలీలం = ఆశ్చర్యకరములగు లీలలు గలిగిన, భవభయ హరణ కాలం = సంసారభయమునకు యముడైన, భక్తజన వత్సలం = భక్తుల దోషములను గుణములుగా చూచు, శివం = మంగళకరుడైన, అద్వైతం = సర్వజీవులు తానే అయిన, అమలం = శుద్ధమైన, శ్రీమత్కనకాభచేలం = కాంతిమంతమైన బంగారు వలువను ధరించిన, ఆగమసంచారం = వేదములయందు సంచరించు, అఖిలలోకాధారం = అన్నిలోకములకు నాధారమయిన, వాగధిపకుమారం = బ్రహ్మ కొడుకుగా కలిగిన, వరవీరవీరం = వీరాధివీరుడయిన, రాగాదిసంహారం = కామక్రోధాదులను హరించు, రాఘవం = రఘువంశమందు బుట్టిన, ఉదారం = గొప్పవాడయిన, త్యాగరాజ హృచ్చారం = త్యాగరాజు హృదయమందు చరించు, కారుణ్యపారావారం = కరుణా సముద్రుడయిన, రామం = రాముని, వందేహం = నేను నమస్కరించుచున్నాను.

617. కల్యాణి = ఆది

ప॥ సుందరి. నీ దివ్యరూపమును–జూడ తనకు దొరకెనమ్మ॥ సుందరి॥

అ॥ మందగమన. నీదు కటాక్ష బలమొ
ముందటి పూజాఫలమో – త్రిపుర॥ సుందరి॥

చ॥ భువిలో వరమో శ్రీమదాది
పురమున నెలకొన్న నీ సాగసు విని
సువివేకులైన బ్రహ్మాది. సురలు గుంపుగూడి
కవి వాసరపు సేవ కనుగొన
కలుగునాయని కరగుచుమదిలో
దివి తత్తరము పడుచుండగా
దీన జనార్తిహారిణి – త్రిపుర॥ సుందరి॥

2 కలిలో దీనరక్షకి యని సభ
కలిగిన తావున–బొగడు దునమ్మా
సలలితగుణ కరుణాసాగరి! నీ
సాటి ఎవరమ్మా
అలసి వచ్చి నందుకునా మనసు

హాయి జెందునాయని యుండగ మరి
కల కలమని సురసతులు వరుసగా
కొలువ శుక్రవారపు ముద్దు త్రిపుర॥ సుందరి॥

3 ననుగన్న తల్లి నా జన్మము
నాడు సఫలమాయె నమ్మా ఇపుడు
ఘనదరిద్రునికి పైకము వలె- కనుల పండువాయె
వనజనయన! ఎండుపైరులకు జలము
వలె శుభదాయకి - కామ
జనకుని సోదరి. శ్రీత్యాగ- రాజ మనోహరి. గౌరి శ్రీ త్రిపుర॥ సుందరి॥

తాత్పర్యము :

ఓ త్రిపురసుందరీ దేవీ! నీ దివ్యరూపమును చూచే భాగ్యము నాకు కలిగినదమ్మా. ఓ మందగమనా = మెల్లని నడక కలదానా! నీ దర్శనము లభించుట నీకటాక్షబలము చేతనో నా పూర్వపుణ్య ఫలముచేతనో? భూలోకమందు శ్రేష్ఠమైన ఆది పురమందు నెలకొని యున్న నీ దివ్యరూపవైభవమును విని బ్రహ్మాది దేవతలు కవిసారపు సేవ = శుక్రవారపు సేవకై ఆకాశమున గుంపులుగా కూడి నీ దర్శనమునకై మనస్సు కరగి తత్తరపడుచుండగా ఆ సేవనాకు దొరకినది. నా భాగ్యము. ఈ కలియుగములో దీనులను రక్షించు దేవివి నీవని నలుగురు కూడియున్న సభలో నేను చాటి చెప్పెదను. ఓ సలలితగుణ = మృదువైన గుణములుగల కరుణా సాగరీ! నీ సాటి ఎవరును లేరు. నీ శుక్రవారపు సేవ కావలెనని అలసి వచ్చినాను. వచ్చినందుకు, కలకల లాడుచు దేవతాస్త్రీలందరు వచ్చి నిన్ను కొలుచుచుండగా నీ శుక్రవారపు సేవ లభించినది. ఓ తల్లీ! నా జన్మము పుట్టిననాడే సఫలమైనది. (దేవిని సేవించుకొనగలుగు జన్మము లభించిననాడే). ఇప్పుడు పేదకు పెన్నిధి దొరకినట్లు, ఎండిన పైరుపై వర్షము పడినట్లు నా మనస్సుకెంతో హాయి చేకూరినది. అని దేవి శుక్రవారపు సేవలభించినందుకు మహానందము ననుభవించినారయ్యగారు.

విశేషము = ఇందు అయ్యగారి దేవీ భక్తి, దర్శనానందము పరాకాష్ఠ నందుకొన్నవి.

618. సింధురామక్రియ = ఆది

ప॥ సుధామాధుర్య భాషణ – సుధాకరాననా సుధా॥

అ॥ కథా మృతముచే – బహుకాలము ఆ
కలి దీరియున్నాను బ్రోవుము॥ సుధా॥

చ॥ దురాత్ములగు భూ–కిరాతకుల జే
రరాదనుచు సుం–దరాకార! నీ
పరాయణుల చెలి–మి రాగోరు త్యా
గరాజనుత ఓ–పరాత్పర! సుగుణ॥ సుధా॥

తాత్పర్యము :

ఓ సుధామాధుర్య భాషణా = అమృతము వలె తియ్యని మాటలవాడా! సుధాకరాననా = చంద్రుని వంటి ముఖము వాడా! (రావా) నీమాటలు అమృతమయములు, నీ ముఖము అమృతమయము, నీ కథలు అమృతమయములు. ఇటువంటి నీ కథలనెడి అమృతమును అనుభవించి నేను చాల కాలమునుండి ఆకలి తీరి ఉన్నాను. నన్ను రక్షించుము. దురాత్ములయిన భూకిరాతకుల = హింసాపరులను చేరకుండ, నీ పరాయణుల = భక్తుల స్నేహమును కోరుచున్నాను. ఈవరమును నాకిచ్చి రక్షించుము. అని అయ్యగారి ప్రార్థనము.

619. కాపి = ఆది (దివ్యనామము)

ప॥ సుందర దశరథనందన – వందన మొనరించెదరా ॥ సుం॥

చ॥ పంకజలోచన ధరజ–యంకము వెలుంగగ గని॥ సుం॥

2 పరమ దయాకర శుభకర – గిరిశమనోహర శంకర॥ సుం॥

3 కరమున గొడుగిడుకొని సో–దరు భరతుడు కరగ గగని॥ సుం॥

4 సుగుణ డనిల తనయుడు–గవయగవాక్షులు గొలువగగని॥ సుం॥

5 ఘటజవసిష్ఠ మృకండుజ–గౌతమాదులు బొగడగని ॥ సుం॥

6 అకళంకముఖ త్యాగరాజుని బ్రోచిన అవ్యాజ కరుణాసాగర ॥ సుం॥

తాత్పర్యము :

సుందరుడా! దశరథతనయా! ఓ పంకజలోచనా! సీత నీ తొడపై కూరుచుండి ఉండగా, భరతుడు నీకు ఛత్రము బట్టి యుండగా, హనుమంతుడు, గవయగవాక్షులు నిన్ను కొలిచి యుండగా, అగస్త్య, వసిష్ఠ, మార్కండేయ గౌతమాదిమునులు నిన్ను పొగడుచుండగా నీకు వందన మొనరించెదను.

విశేషము = 'వామే భూమిసుతా పురస్తు హనుమాన్ పశ్చాత్సు మిత్రాసుతః। శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళ యోర్వాయ్వాది కోణేషుచ। సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్ తారాసుతో జాంబవాన్। మధ్యే నీల సరోజ కోమలరుచిం రామంభజేశ్యామలం' = ఎడమవైపున సీత, ఎదుట హనుమంతుడు, వెనుక లక్ష్మణ భరత శత్రుఘ్నులు, తక్కిన కోణములయందు సుగ్రీవుడు, విభీషణుడు, అంగదుడు కొలిచి ఉండగా మధ్యలో నల్లకలువ కాంతితో ప్రకాశించుచున్న రాముని భజించెదను' అని రాముని సమగ్ర సభను వర్ణించు ప్రాచీన శ్లోకమున్నది. అయ్యగారు దీని ననుసరించిరి.

620. శంకరాభరణం = ఆది

ప॥ సుందరేశ్వరుని – జూచి సురల – జూడమనసు వచ్చునా॥ సుందర॥

అ॥ అందముగల వరకాశికి సమాన–మైన గోపుర
మందు వెలయు మా॥ సుందర॥

చ॥ చరణములను బంగారు నూపురములు
కరముల వరకంకణ యుగములు శ్రీ
కరముఖమున కస్తూరి తిలకము
మెరయుచు నుండు లావణ్యముగల॥ సుంద॥

2 ఒకచో బ్రహ్మాదిసురలు – ఒకచో నిర్జర వారతరుణులు
ఒకచోతుంబురు నారదులు – ఒకచో భక్తులెల్ల బాడు॥ సుంద॥

3 రాజ రాజునకు చెలికాడయిన – రాజశేఖరుని గోపుర నిలయుని
రాజసగుణ రహితుని శ్రీత్యాగ – రాజ పూజితుని రజతగిరీశుని॥ సుంద॥

తాత్పర్యము :

గోవూరు సుందరేశ్వర దేవుని వర్ణించు కృతి ఇది. సుందరేశ్వరుని చూచి తరువాత ఇతరదేవతలను చూడ మనసు రాదు. అందమైన కాశితో సమానమైన గోవూరునందు వెలసియున్న సుందరేశుని చూచినచో వేరు దేవతల చూడమనసు రాదు. కాళ్ల కండెలు, చేతికి కంకణములు, ముఖమున కస్తూరి, ఒకవైపున అప్సరసలు, ఒకవైపున తుంబురు నారదులు, ఒకవైపున ఇతర భక్తులు పాడుచున్న సుందరేశ్వరుడు. కుబేరునకు చెలికాడు, చంద్రుని ధరించినవాడు, గోవూరునందు నెలకొన్నవాడు, రాజసగుణములేనివాడు, త్యాగరాజుచే పూజింపబడువాడు, కైలాస వాసుడు అయిన సుందరేశ్వరుని చూచినచో ఇతర దేవతలను చూచుటకు రుచించదు.

విశేషము = హనుమంతుడు 'భావో నాన్యత్ర గచ్ఛతి' = రాముని చూచిన తరువాత నా మనస్సు వేరొక చోటికి పోవుటలేదు' అంటాడు. ఈ కృతి అట్లున్నది.

సూచన : సుందరేశ్వర దేవుని క్షేత్రము 'గోవూరు'. ఇది గోవు + వూరు. ఇది అరవభాషలోనైనా తెలుగులోనైనా ఇంతే. తమిళుల ఉచ్చారణ గో అనవలసినచోట కో అని ఉచ్చరిస్తారు. దానివల్ల కోవూరుగా మారిపోయినది. అది సరికాదు. గోవూరు రైటు. దీనికి సంస్కృతము 'గోపురం' అని. ఈ పాటలో ఇది రెండు సార్లు వచ్చినది. దీనికి గోవూరు అర్ధము.

621. శ్రీరంజని = రూపకం

ప॥ సాగసుగా మృదంగ తాళము జతగూర్చి నిను
జొక్కజేయు ధీరుడెవ్వడో॥ సాగసు॥

అ॥ నిగమశిరోర్ధము గల్గిన – నిజవాక్కులతో – స్వరశుద్ధముతో॥ సాగసు॥

చ॥ యతివిశ్రమ సద్భక్తి వి–రతి ద్రాక్షారస నవరస॥
యుతకృతిచే భజియించే–యుక్తి త్యాగరాజుని తరమా శ్రీరామ॥ సాగసు॥

తాత్పర్యము :

ఓ రామా! అందముగా మృదంగ తాళగతులను జతగూర్చుకొని గానము చేసి నిన్ను పరవశింపజేయు బుద్ధిమంతుడెవ్వడో కదా! ఉపనిషదర్ధములు గల యధార్ధ

వాక్కులతో, యతి, విశ్రాంతి, విరతి, మొదలయిన కవితా శిల్పముతో, దాక్షాపాకముతో, నవరస భరితమైన భక్తి యుతమయిన కృతితో నిన్ను భజించే నేర్పు నాతరమా? అని భావనము వెలువరించినా రయ్యగారు.

విశేషము = నిజానికి పై విశేషము లన్నియు త్యాగయ్యగారికే కలవు. కాని అయ్యగారి భావములో 'ఆధీరుడెవడో'. అయ్యగారి భావములో కృతి రచనము ఉపనిషద్దర్థములతో ఉండవలెను. భగవన్మహిమలను ప్రతిపాదించినవి ఉపనిషత్తులే కనుక. అవి నిజవాక్కులు. లోక సంబంధమయినవి లోకములవలెనే మిథ్యా భూతములు. సంగీతముతోడివి కనుక స్వరశుద్ధి లయశుద్ధిని సూచించినారు. కవితకు సంబంధించినది కనుక యతి, విరతి విశ్రాంతులు శిల్పము కవసరము. ఇక చెవికి సోకగానే సంగీతము కాని సాహిత్యముగాని సుఖాన్వయముగా తోచుట ద్రాక్షా పాకమన బడును. ప్రమాణము 'ద్రాక్షాపాక స్సకథితో।బహిరంత స్సుస్థిరద్రసః' = ద్రాక్షాపాకమనగా లోపల వెలుపలను రసము కలిగినది' అని అలంకారిక వచనము. దీనినే అయ్యగారు 'ద్రాక్షారస' అన్నారు. రాముని కథలో శృంగారాది నవరసములు నున్నవి. కనుక నవరసములు నిందున్నవి. కృతిరచన యొక్క ఆదర్శము నిందు తెలియజేసినా రయ్యగారు.

622. కన్నడ గౌళ = రూపకం

ప॥ సాగసుజూడ తరమా... నీ॥ సాగసు॥

అ॥ నిగనిగమనుచు కపోల – యుగముచే మెరయు మోము॥ సాగసు॥

చ॥ అమరార్చిత పదయుగమో – అభయప్రదకర యుగమో
కమనీయ తనునిందిత – కామ! కామరిపునుత నీ॥ సాగసు॥

2 వరబింబ సమాధరమో – వకుళ సుమంబుల యురమో
కరధృతశర కోదండ – మరకతాంగ! వరమైన॥ సాగసు॥

3 చిరునవ్వో? ముంగురులో – మరి కన్నుల తేటో
వరత్యాగ రాజార్చిత – వందనీయ! ఇటువంటి॥ సాగసు॥

తాత్పర్యము :

ఓ రామా! నీ సాగసు జూడ నా తరమా? నిగనిగమని కళలీనే చెక్కిళ్లతో మెరసే నీ ముఖ సౌందర్యము చూడ నా తరమా? (ఆ భాగ్యము నాకు కలదా? అని).

కమనీయతను నిందిత కామ = సుందరమగు శరీరముచే మన్మథుని జయించినవాడా! కామరిపునుత = శివునిచే నుతింపబడినవాడా! నీ పాదములు దేవతలచే అర్చింపబడినవి. నీ చేతులు భక్తుల కభయమిచ్చేవి. కరధృతశరకోదండ = చేత విల్లమ్ములు బట్టిన వాడా! మరకతాంగ = మరకత మణిరంగు శరీరమువాడా! నీ పెదవి దొండపండు. పాగడపూలచే వక్షస్థలము వెలుగుచున్నది. కనులు తేటగా ఉన్నాయి. నీ చిరునవ్వు నేమని చెప్పను? ముంగురులతీ రేమి? ఇన్ని సొబగులతో నున్న నీ సొగసు చూడ తరమా?

విశేషము = అయ్యగారు ఇందు దాదాపుగా ప్రత్యంగ వర్ణనము చేసిరి. 'కస్తూరీ తిలకం లలాట ఫలకే వక్షస్థలే కౌస్తుభం' అనే శ్లోకము ఇందు స్ఫురించుచున్నది.

623. యమునా కల్యాణి = ఆది

ప॥ హరి దాసులు వెడలే ముచ్చట – ఆనందమాయె దయాళో॥ హరి॥

అ॥ హరి గోవిందనర హరి– రామకృష్ణయని
వరుసగ నామము కరుణతో జేయుచు॥ హరి॥

చ॥ సంగతిగాను మృదంగ ఘోషములచే
పొంగుచు వీధుల–కేగుచు మెరయుచు॥ హరి॥

2 చక్కని హరిచే – జిక్కితిమని మది
జొక్కుచు నామమె – దిక్కని పొగడుచు ॥ హరి॥

3 దిట్టముగా నడుకట్టుతో నడుగులు
బెట్టుచు తాళము – బట్టిగల్ గలనగ॥ హరి॥

4 జ్ఞానముతో రామ – ధ్యానముతో మంచి
గానముతో మేను – దానము సేయుచు॥ హరి॥

5 రాజ రాజునిపై – జూజులు చల్లుచు
రాజిల్లుచు త్యాగ – రాజునితో గూడి॥ హరి॥

తాత్పర్యము :

ఓ దయాళో = దయాస్వభావము కలిగిన రామా! హరిదాసులు వెడలిన అందము చూస్తే ఆనందము కలుగుచున్న దయ్యా. హరినామము లుచ్చరించుచు, మృదంగధ్వనితో,

వీధుల వెంట తిరుగుచుంటే, చక్కగా హరికి వశమైతిమని భావించుచు హరినామమే దిక్కని నమ్మి పరవశమగుచు, తాళములు చేతబట్టి, అవి గల్ గల్ అనగా, నడుము బిగగట్టి నృత్య సరణిలో అడుగులు వేస్తూ, జ్ఞానగాన ధ్యానములతో తమ శరీరములను భగవదర్పణము చేసి నామ నామమునకు జాజిపూలు చల్లుచు నాతో కూడి హరిదాసులు వెడలిన ఈ ముచ్చట ఆనందమయినదని పాడినా రయ్యగారు.

విశేషము = త్యాగయ్యగారు శిష్యులతో కలసి వీధులలో గానం చేస్తూ ఉంఛవృత్తి సాగించేవారని, గృహస్థులు వారికి తోచిన వస్తు సామగ్రిని అయ్యగారి జోలెలో వేశేవారని పరంపరగా వస్తున్న కథ. ఈ కథకు ఈ కృతి అద్దము పట్టుచున్నది. సంక్రాంతి రోజులలో కొంతమంది (ఒకవర్గము) అక్షయపాత్ర నెత్తిన బెట్టుకొని బొట్లు పెట్టుకొని చిడతలతో హరికీర్తనము పాడుకుంటూ ఇల్లిల్లూ తిరిగి గృహస్తులు వేసే బియ్యముతో కాలక్షేపము చేసే ఆ వర్గమును అందరును హరిదాసులనుట కలదు. అయ్యగారు ఆ మాటనే వాడినారు. అయితే దీనిని నిఘంటు కారులు ''ఉంఛవృత్తి'' అనలేదు. ఉంఛవృత్తి అంటే గృహస్థులు బియ్యం కోసం రోటిలో ధాన్యం దంచుతున్నప్పుడు క్రిందపడిన ధాన్యమును బియ్యమును ఏరుకొని జీవించుట ఉంఛవృత్తి. అయ్యగారి దిదికాదు. భక్తితో గృహస్థులు వేసినది కనుక భిక్షాటనము కాక, లేకి తనము కాక గౌరవభంగము కాకుండా అయ్యగారి విధముగా నామ సంకీర్తన ప్రధానముగా జీవనము సాగించినట్లూహింప వలసియున్నది.

624. తోడి = ఆది (దివ్య నామము)

ప॥ హరియను వారికి సరియెవరే

చ॥ పలు విధముల తలపులరోసి – నిలువరమగు భక్తియు జేసి
మలయని మతభేదము గోసి – కరగుచు మదిలో గామించి హరి॥

2 హరి చరణములను హృదయము నుంచి – వరశుకముఖ ధనమని యెంచి హరి॥

3 ఈ సుఖమెరుగని జన చెలిమి॥ హరి॥
వాసుకి విసమే మరికొలిమి నిజ
దాసుల సంభాషణ బలిమిన్॥ హరి॥

4 నీ జపమున హృదయము వేగ
రాజిల్లను జేసిన త్యాగ – రాజనుతుని పేరుల బాగ॥ హరి॥

తాత్పర్యము :

హరీ అని స్మరించినవారికి సరివారు లేరు. పలువిధములగు ఇతరములగు తలపులను ఏవగించి, స్థిరమగు హరిభక్తితో, మత భేదమునకు తావీయక, మది కరగి, హరినే కామించి, శ్రీశుకుడు మొదలగు వారికి ధనమయిన హరిపాదములను హృదయములో నుంచి, హరిభక్తి సుఖము నెరుగని వారి కలయికను పాము విషముగా, నిప్పుల కొలిమిగా భావించి, హరిదాసుల చెలిమితో, రామా! నీ జపముతో మనస్సు రాజిల్లుచుండగా హరినామస్మరణము చేయువారి కెవరును సరికారు అని తాత్పర్యము.

విశేషము = త్రికరణ శుద్ధిగా హరిభక్తి తత్పరులయిన వారి మహిమ ఇందు తెలుపబడినది.

625. పున్నాగవరాళి = ఆది

ప॥ హరి హరి నీ యొక్క దివ్యపా – దారవింద మీయవే॥ హరి॥

అ॥ ధరను గల్గు భోగ – భాగ్యము లెల్లను
తథ్యము గాదుసుమా – శ్రీకృష్ణ॥ హరి॥

చ॥ సనక సనందన శ్రీశుకా
ర్జునమును లెల్లను తించు
వనజనయన బ్రహ్మాది సంక్రందన
ఘను లెల్ల సేవించు॥
మునువేదపురా – ణాగమ శాస్త్రవి
ద్యల నెల్ల చరించు
ఘన సమనీల ని – రంజన నిర్గుణ
కనికరమున త్యా – గరాజు భావించు॥ హరి॥

తాత్పర్యము :

హరి హరీ! నీ పాద పద్మములను నా కీయవలసినది. ఓ శ్రీ కృష్ణా! ఈ లోకములో చూచుచున్న భోగభాగ్యము లన్నియు సత్యము కావు. కనుక నీ పాదముల నిమ్ము. ఓ వనజనేత్రా! శ్రీ శుకుడు, సనకసనందనాది మునులు, అర్జునుడు, బ్రహ్మేంద్రులు నుతించి సేవించే నీ పాదము లిమ్ము. మేఘశ్యామా! నిరంజన= ఐహికవిషయము లంటని నిర్గుణుడా! భక్తితో నేను భావించే నీ పాదములు నాకిమ్ము అని ప్రార్థనము.

విశేషము = ''హరి హరి'' అని పాట ప్రారంభించినది. సాధారణముగా ఈ శబ్దము వినగానే ఏదయినా వినకూడని మాట వినినప్పుడు ''హరి హరి'' అనే భావము స్ఫురించును. కాని ఇక్కడ అది కాదు. ''ఆదరా ద్ధ్వీరుక్తిః'' = అత్యాదరము వలన రెండు సార్లు పలుకుట'' అనే సంస్కృతసూక్తిని అన్వయింపజేయవలెను. ఇందు ''అర్జునుడు నుతించు'' పాదము అనియున్నది. దీని మూలము హరివంశపురాణమున నిట్లున్నది. అర్జును డొకసమయమున శ్రీహరి పాదములయందు పుష్పమాలికను సమర్పించినాడట. అది తరువాత అర్జునునకు శివలింగముపై కనిపించి ఆశ్చర్యపడినాడట. ఈవిషయము నమ్మాళ్వారుల తిరువాయిమొళిలో ''తీర్థనుల గళంద శేవడి మేల్ పూందామం'' అనే పాశురములో చెప్పబడినది.

626. ముఖారి = ఆది

ప॥ క్షీణమై తిరుగ జన్మించే – సిద్ధి మానురా ఓ మనసా॥ క్షీణమై॥

అ॥ గీ। ర్వాణ నాటకాలంకార వేదపు
రాణయజ్ఞ జపతపాదుల ఫలము॥ క్షీణమై॥

చ॥ ఎది చేసిన జగ–న్నాథుడు శిరమున
హృదయమున వహించి
పదిలమైన తత్పదము (సత్పదము) నొసంగే
బాట త్యాగరాజవినుతుని భజనరా॥ క్షీణమై॥

తాత్పర్యము :

ఏవో కర్మలు చేసి ఏవేవో లోకములు పొంది పుణ్యము క్షీణమై తిరిగి జన్మించే సిద్ధి మానుమురా! అని అయ్యగారి ఉపదేశము. సంస్కృతనాటకాలంకార పాండిత్యం సంపాదించినా వేదపురాణాలలో చెప్పబడిన యజ్ఞ, జప, తపస్సులు చేసినా స్వర్గాదిలోకములు చేరి వాటి ఫలములు క్షీణించగానే మానవలోకములోనే పుట్టుదురు. కనుక ఇటువంటి సిద్ధిని కోరకు. జగన్నాథుడయిన హరి నిన్ను నెత్తిన బెట్టుకొని, హృదయములో నుంచుకొని పునర్జన్మము లేని శాశ్వతానందము నిచ్చు పదమును ఎదిచేస్తే ఇస్తాడో ఆ బాటను సంచరించు. ఆబాట రామభజనమే.

విశేషము = వేదములలో పురాణములలో ఫలాని కర్మ చేస్తే ఫలాని లోకం వస్తుందని చెప్పబడి ఉన్నది. ఆ కర్మలు చేస్తే ఆలోకాలను పొంది పుణ్యఫలము క్షీణించగానే ఈ లోకాన పునర్జన్మమే. గీతలో ''త్రైవిద్యామాం సోమపాః పూతపాపాః। యజ్ఞై రిష్ట్వా సద్గతిం ప్రార్థయంతే।'' ---''తేతం భుక్త్వా స్వర్గలోకం విశాలం। క్షీణే పుణ్యే మర్త్య లోకం విశంతి''=వేదములకు సంబంధించిన వాళ్లు యజ్ఞములు చేసి పాపరహితులై సద్గతిని గూర్చి నన్ను ప్రార్థించుచున్నారు. దాని ప్రకారము వాళ్లు ఆ విశాలమయిన స్వర్గలోకము ననుభవించి పుణ్యము క్షీణింపగనే మనుజలోకమందు పుట్టుచున్నారు''. అని గీతా వాక్యము. అయ్యగారు ఇట్టి సిద్ధి వద్దు. ''మాముపేత్యతు కౌంతేయ। పునర్జన్మన విద్యతే''=అర్జునా! నన్ను భజించి నట్లయితే పునర్జన్మ లేక నన్నే పొందుదురు'' అనే గీతా వాక్యము ప్రకారము రాముని భజింపుము. అని అయ్యగారి ఉపదేశము. అయ్యగారు సంస్కృత నాటకాలంకార సాహిత్యము కూడ ''పదిలమైన సత్పదము'' నొసగ దని చెప్పినారు. ఇది కావ్యకోటిలో చేరుతుంది. కావ్యమును గూర్చి ఆలంకారికులు ఇట్లు చెప్పిరి. ''కావ్యం యశసేర్థకృతే। వ్యవహారవిదేశివే రక్షతయే। సద్యః పరనిర్వ్రతయే। కాంతాసమ్మిత యోపదేశయుజే''=కావ్యము కీర్తికి, ధనమునకు, లోకవ్యవహారము తెలియుటకు, అమంగళమును నివారించుటకు (ఐహికముగా) చదువు నపుడు తాత్కాలికానందమునకు, ప్రియురాలి వలె ఉపదేశించుటకు (ధర్మార్థకామములనెడు త్రివర్గపు ఉపదేశమునకు)'' అని. కనుక ముముక్షువైన వానికి రామభజనమే. అని అయ్యగారి ఉపదేశము.

627. ఆనందభైరవి = జంపె

ప॥ *క్షీరసాగరవిహారా. అపరిమిత। ఘోరపాతక విదార*
క్రూర జనగణ విదూరా. నిగమసం। చార సుందరశరీరా॥ *క్షీర॥*

చ॥ *శత మఖా హితవిభంగ. శ్రీరామ శమనరిపుసన్నుతాంగ*
శ్రితమాన వాంతరంగ. జనకజా। శృంగార జలజ భృంగ॥ *క్షీర॥*

2 *రాజాది రాజవేష. శ్రీరామ। రమణీయకరసుభూష*
రాజసుత లలితభాష శ్రీత్యాగ। రాజాది భక్తపోష॥ *క్షీర॥*

తాత్పర్యము :

అన్ని దీనిలో సంస్కృత సంబోధనములు మాత్రమే. సులభముగానే యున్నవి. ప్రతిపదార్థము మాత్రము వ్రాయబడుచున్నది. క్షీర సముద్రమందు విహరించువాడా! ఘోర పాపములను ఛేదించువాడా! క్రూరులకు దూరమయిన వాడా! వేదముల యందు సంచరించువాడా! అందగాడా! రాక్షసులను భంజించువాడా! శ్రీరామ! శివుని చేపాగడబడినవాడా! భక్తుల మనస్సులో నుఃడు వాడా! సీత శృంగారము ననుభవించువాడా! రాజాధిరాజ వేషము వాడా! శ్రీరామ! అందమయిన నగలవాడా! రాజులు పొగడువాడా! చక్కని మాటలవాడా! త్యాగరాజు మొదలగు భక్తులను పోషించువాడా! ఇది అర్థము.

628. దేవగాంధారి = ఆది

ప॥ క్షీరసాగరశయనా నన్ను – చింతలు బెట్టవలెనా రామ ॥ *క్షీర॥*

అ॥ వారణ రాజును బ్రోవను వేగమే వచ్చినది విన్నాను రామ॥ *క్షీర॥*

చ॥ నారీ మణికి చీరలిచ్చినది – నాడే విన్నానురా రామ॥
ధీరుడౌ రామ దాసుని బంధము – దీర్చినది విన్నానురా రామ।
నీరజాక్షికై – నీరధి దాటిన – నీ కీర్తిని విన్నానురా రామ।
తారకనామా – త్యాగరాజనుత – దయతో నేలుకోరా రామ॥ *క్షీర॥*

తాత్పర్యము :

అయ్యగారి ఒక బాధ ఇది. ఓ క్షీర సాగర శయనా? (నీవు సుఖముగా క్షీరసాగర మందుశయనించి ఉన్నావని) నన్ను మాత్రం చింతలలో (సంసారపు) పడవేసినావు. (న్యాయమా అని) మరి నీవు దయలేని వాడవా? కావు. కరి రాజును రక్షించుటకు అతి వేగముతో నీవు వచ్చినది నేను విన్నాను. మరియు ద్రౌపదికి చీర లిచ్చినది విన్నాను. రామదాసుని చెరవిడిపించినది విన్నాను. సీత యొక్క ఆర్తిని తీర్చుటకు నీవు సముద్రమును దాటిన కీర్తిని విన్నాను. ఓ తారకనామా! రామా! నన్ను కూడ దయతో ఏలుకొనవయ్యా! అని అయ్యగారి ఆర్తి ప్రార్థనము.

విశేషము = అయ్యగారికి రామదాసుగారాదర్శ పురుషుడని దాఖలాలున్నాయి. అయ్యగారి ఈ కృతిలో రామదాసుగారి భావస్ఫూర్తి కనపడుతుంది రామదాసుగారిది ''పాహిమాం శ్రీ రామాయంటే - పలుకవైతివి - ॥ ఇబ్బంది జెంది యాకరి బొబ్బబెట్టి నంతలోనే గొబ్బున గాచితివంట. జబ్బుసేయక. నిబ్బరముతో నేనెంతో - కబ్బమిచ్చి వేడుకొంటే-తబ్బిబ్బు జేసేవు రామ. అబ్బబ్బబ్బబ్బబ్బబ్బబ్బ '' ఇట్లు కరిని గాచిన విషయము ప్రస్తావించుట జరిగినది. కాకపోతే శిల్పభేదము మాత్రమున్నది.

సూచన : కల్లూరి వీరభద్రశాస్త్రిగారు ఇంతటితో గ్రంథమును ముగించినారు. అసలు గ్రంథమే అట్లున్నదేమో? తరువాత ఒక చూర్ణికతో ప్రారంభించి కొన్ని కృతులు లాలులు జోలలు మంగళహారతులతో అనుబంధముగా చేసి గ్రంథమును పూర్తిచేసిరి. ఈ అనుబంధములో ఉన్న కృతులు అక్షరానుక్రమణిక ప్రకారం ఇంతకు ముందే అయిపోవలసినవి. కాని ఇవి అనుబద్ధములయినవి. నేనును దీనినే అనుసరించితిని. సంస్కృత చూర్ణికతో తరువాత భాగము ప్రారంభమగును. ఈ భాగము ఉత్సవసంప్రదాయ కీర్తనములు.

629. చూర్ణిక (సంస్కృతము)

జయతు జయతు (1) సకల నిగమాగమ కుశల కిన్నర కింపురుష సిద్ధ విద్యాధరగీయమాన బహుజగదుదయ రక్షణ లయహేతుభూత చతురానన హరిహర ప్రభృతి చింత్యమాన మణి ద్వీపే, (2) జితసాధుహృత్తాపే, (3) సకలసురముని నికర భక్త జననిచయ హృదయ కామిత సంతానసౌభాగ్య ధనకనక వాహనా ద్యష్టైశ్వర్యదాయక చింతామణిమయ మహావైకుంఠనగరే, (4) నేత్రానందకరే, (5) చండ మార్తాండమండల విలసిత సప్తహేమ ప్రాకార శోభాయమాన భానుకోటి సమాన వజ్రస్తంభాయుత సహిత సువర్ణమంటపాంతరే, (6) శుభతరే, (7) నవరత్నఖచిత కనకమయ హంస తూలికాతల్పే, (8) శరచ్చంద్రకోటినిభశేషతల్పే, (9) సురనాయకా ద్యష్టదిక్పాలమకుట మణిగణ నీరాజిత పదారవిందః, (10) జగదానందః, (11) ఉభయ పార్శ్వోజ్జ్వలిత కర్ణకుండలనిందిత చంద్రమండలః, (12) సేవిత • మునిమండలః, (13) భక్తత్రాణపరాయణః, (14) శ్రీమన్నారాయణః, (15) లక్ష్మీరమణః, (16) భగవాన్.

ప్రతిపదార్థము 2 = సజ్జనుల హృదయతాపమును హరించు, 1 = సమస్తవేదశాస్త్రమలయందును నిపుణులైన కిన్నర కింపురుష సిద్ధ విద్యాధరులచేత పాడబడుచు, అనేక లోకముల సృష్టి రక్షణ విలయములకు కర్తల బ్రహ్మ విష్ణు మహేశ్వరుల చేత ధ్యానింపబడుచున్న మణిద్వీపమందు, 3 = సమస్త దేవతలు, మునులు, భక్తులును హృదయమందు కోరుకొను సంతానము సౌభాగ్యము మొదలగు అష్టైశ్వర్యములనిచ్చు చింతామణిమయమగు మహావైకుంఠ నగరమందు, 4 = కంటికానందకరమగు, 5 = తీక్ష్ణమయిన సూర్యమండలమువలె ప్రకాశించు, ఏడు బంగారు ప్రాకారములతో శోభిల్లుచు, కోటి సూర్యులవలె వెలుగు పదివేల వజ్రస్తంభములతో కూడిన బంగారు మంటపము లోపల, 6 = శుభకరమయిన, 7 = నవరత్నములు కూర్చిన బంగారు మంచముపై హంసతూలికా తల్పమందు, 8 = కోటిశరచ్చంద్రులతో సమానమమగు శేష తల్పమునందు, 9 = ఇంద్రుడు మొదలగు అష్టదిక్పాలకుల కిరీట మందున్న మణికాంతులచే మిక్కిలి ప్రకాశించు పాదాబ్జములు గలవాడును, 10 = లోకముల కానందమైనవాడును, 11 = రెండు వైపుల ప్రకాశించుచున్న చెవికుండలములతో చంద్రమండలమును జయించినవాడును, 12 = మునిమండలము చేత సేవింపబడువాడను, 13 = భక్తులను రక్షించుట ముఖ్య వృత్తి అయినవాడును, 15 = లక్ష్మీనాథుడును, 16 = షడ్గుణ పూర్ణుడును, అగు 14 శ్రీమన్నారాయణుడు, జయతుజయతు = సర్వోత్కృష్టుడై ప్రకాశించుగాక.

సూచన = ఇది వైకుంఠవర్ణనము. ప్రహ్లాదభక్తి విజయములోనిది. అంకెలు మాత్రము ఇచ్చి అన్వయ క్రమప్రకారము ప్రతిపదార్థము వ్రాయుట జరిగినది.

630. యదుకుల కాంభోజి = జంపె

ప॥ హెచ్చరికగారార – హేరామచంద్రా
హెచ్చరికగా రార – హేసుగుణసాంద్ర॥ హెచ్చరిక॥

అ॥ పచ్చవిల్తుని తండ్రి – పాలిత సురేంద్ర॥ హెచ్చరిక॥

చ॥ కనకమయమౌ మకుట – కాంతి మెరయగను
ఘనమైన కుండలయు – గంబు కదలగను
ఘనమైన నూపురయు – గంబు ఘల్లనగ
సనకాదు లెల్ల గని– సంత సిల్లగను హెచ్చరిక॥

2 ఆణిముత్యాల సరు – లల్లలాడగను
వాణీ పతీంద్రు లిరు–వరుస పాగడగను
మాణిక్యసోపాన – మందు మెల్లగను
వీణ పలుకుల వినుచు – వేడ్కచెల్లగను॥ హెచ్చరిక॥

3 నినుజూడవచ్చు భగి–ని కరంబు చిలుక
మన సురంజిల్లనీ – మహిమలను బలుక
వినువాసు లెల్ల విరు–లను చాల చిలుక
ఘనత్యాగరాజు కను–గొన ముద్దు గులుక॥ హెచ్చరిక॥

తాత్పర్యము :

ఇది నిత్యార్చనలో చిట్టచివరి ఉత్సవమయిన హెచ్చరిక. హే రామచంద్ర! హేసుగుణసాంద్ర! హెచ్చరికగా రావయ్యా! ఓ మన్మథుని తండ్రీ! ఇంద్రుని రక్షించిన వాడా! నీ బంగారు కిరీటపు కాంతి మెరయుచుండగ, నీ కుండలము లాడుచుండగా, అందెలు గలగలలాడుండగా, సనకాది మునులందరును సంతోషపడుచుండగా, వక్షస్థలముపై ముత్యాలహారము లల్లలాడుచుండగా, బ్రహ్మ, ఇంద్రుడును ఇరు పార్శ్వము లందును నుతించుచుండగా, మాణిక్యపు మెట్లను మెల్లగాదిగుచు, గాన భక్తులు వాయించే వీణను వినుచు, మరియు నిను సేవించుటకు వచ్చిన నీ చెల్లెలు మీనాక్షి భుజమందలి చిలుక నీ మహిమలను పల్కుచుండగా, దేవతలు ఆకాశమునుండి పుష్పములు కురియుచుండగా, నేను చూచుచుండగా ముద్దులు కులుకుచు రావయ్యా! అని హెచ్చరికలు చెప్పినా రయ్యగారు.

విశేషము = ఆలయములయందు నిత్యోత్సవములలో రాత్రి ధూపదీప నైవేద్యము లయిన తరువాత ఇట్లు 'హెచ్చరిక' చెప్పుట ఒక ఉపచారము. అయ్యగారు తన పంచాయతన పూజలో దీని నన్వయింపజేసిరి. బ్రహ్మాందులు కైవారముచేయుట, సనకాదుల సన్నిధి, సురలు విరులు గురియుట, మీనాక్షి చిలుకతో వచ్చుట ఇవన్నియు అయ్యగారి భావనా మయములు.

631. దేవగాంధారి = ఆది

వ॥ కొలువై యున్నాడే – కోదండపాణి॥ కొలువై

అ॥ సలలితమతులై – సారెకు శీలులై
వలచుచు కోరివచ్చి – సేవింపగ॥ కొలువై॥

చ॥ జనక జభరతాదులతో మంచి, నైవేద్యంబుల
చనువున వేడుక నారగించి, మెరపుకోట్ల గేరు
కనకపటము సామ్ములను ధరించి, వేదోక్తమైన
సనకవచనములతో సంతోషించి, శ్రితులపోషించి ॥ కొలువై॥

2 వరమగు వాసనలు పరిమళింప, సన్నిధిలో వెలుగుచు
సురవారసతులు బాగనటింప, అదిగాక పరా
శరనారదమును లెల్లరు నుతియింప, ఎంతెంతో నెనరున
సురపతివాగీశులు సేవింప, మేను పులకరింప॥ కొలువై॥

3 ఉడురాజముఖుడు శేషశయ్య, పైన జెలంగగ గని
పుడమికుమారి సుగంధము పుయ్య, నమ్మినవారలకే
కడగంటిని కోరినవర మియ్య, త్యాగరాజు నెనరున
అడుగడుగుకు మడుపుల నందియ్య, శ్రీరామయ్య ॥ కొలువై॥

తాత్పర్యము :

శ్రీరామచంద్రుడు కొలువు దీరియున్న వర్ణనమిది. కోదండపాణి కొలువు దీరియున్నాడు. ఎంతోమంది సలలితమతులు = మంచిబుద్ధి గలవారును, మంచిశీలము కలవారును రాముని కోరివరించి వచ్చి సేవించుచుండగా కొలువుదీర్చి యున్నాడు. సీత భరతాదులతో కూడి మంచినైవేద్యము లారగించి, మెరపుతీగ కాంతుల బంగారు వలువను ఆభరణములను ధరించి, సనకాదిమునులు వేదమంత్రములతో స్తుతి చేస్తూ ఉండగా, ఆశ్రితులను పోషిస్తూ, మంచి సుగంధములు గుబాళిస్తూ ఉండగా అప్సరసలు సభలో నృత్యము చేస్తూ ఉండగా పరాశరనారదాదులు పొగడుచుండగా, బ్రహ్మేంద్రాదులు సేవించుచుండగా, మేను పులకరింపగా కొలువైయున్నాడు. చంద్రముఖుడైన రాముడు శేషశయ్యపై చేరగా చూచి సీతగంధము పూసినది. తనను నమ్మిన భక్తులకు కడగంటి చూపులతోనే కోరిన వరము లిస్తూ, త్యాగరాజు అడుగడుగునకును మడుపు లందించు చుండగా కోదండపాణి కొలువై యున్నాడని తాత్పర్యము.

విశేషము = 'అడుగడుగునకును మడుపు లందించుట' అని ఒకటి ఇందున్నది. అనగా 'వెంట వెంట తాంబూలమడుపులందించుట' కాదు. చాలా పూజ్యులయినవారు ఒక భక్తుని ఇంటికి వచ్చినప్పుడు భక్తుడు తన ఇంటిముందు గురువులకు పీటమీద పాదప్రక్షాళనము చేసి మడుపులను (మడివస్త్రములను) పరచి ఆ గురువులను మడుపుల మీదుగా నడిపించి ఇంటిలోనికి తీసికొని పోవును. ఇది భక్తితో కూడిన ఒక ఉపచారము.

ఎవడయినా ఒకనియందు చాలా భక్తితో ఉంటే 'అడుగులకు మడుగులొత్తుచున్నాడు' అని లోకోక్తి కూడ ఉన్నది కదా! పైన చెప్పిన ఆచారము ఒక విషయములో వైష్ణవసంప్రదాయంలో ఉన్నది. మడుపులంటే మడివస్త్రములని నిఘంటువు కూడ చెప్పినది. కనుక త్యాగయ్యగా రీ ఉపచారమును భావనా రూపమున అందించుటే. తాంబూల మందించుట తప్పుకాదు కాని ఇక్కడ ఈ శబ్దమున కిది అర్థము. తాంబూలమందించుట సామాన్యోపచారము. అడుగడుగునకు మడుపు లందిచుట అత్యంత భక్తితో చేసెడి విశేషోచారము. ఇది అయ్యగారి భావనా రూపము మాత్రమే.

632. శంకరాభరణం = ఖండలఘువు (పెండ్లిపాట)

ప॥ సీతా కళ్యాణవైభోగమే॥ రామకల్యాణ వైభోగమే॥

చ॥ (1) వవన జస్తుతి పాత్ర – (2) పావన చరిత్ర
(3) రవిసోమ వరనేత్ర – (4) రమణీయగాత్ర॥ సీతా॥

చ॥ (5) భక్తజనపరిపాల – (6) భరితశరజాల
(7) భుక్తి ముక్తిద లీల – (8) భూదేవ పాల॥ సీతా॥

చ॥ (9) పామరాసురభీమ – (10) పరిపూర్ణకామ
(11) శ్యామ (12) జగదభిరామ – (13) సాకేత ధామ॥ సీతా॥

చ॥ (14) సర్వలోకాధార – (15) సమరైకవీర
(16) గర్వమానవదూర – (17) కనకాగ ధీర॥ సీతా॥

చ॥ (18) నిగమాగమ విహార – (19) నిరుపమశరీర
(20) నగధరాఘవిదార – (21) నతజనాధార॥ సీతా॥

చ॥ (22) పరమేశనుత గీత – (23) భవజలధిపోత
(24) తరణికుల సంజాత – (25) త్యాగరాజనుత॥ సీతా॥

తాత్పర్యము :

సీతా కల్యాణవైభవమును చెప్పినారిందులో విశేషమేమీలేదు. సంస్కృత సంబోధనలు మాత్రమే. అంకెల వరుసలో ప్రతిపదార్థము 1 = హనుమంతుని స్తోత్రమునకు పాత్రమయినవాడా! 2 = పవిత్రమగు చరిత్రముగలవాడా! 3 = సూర్యచంద్రులు

కనులయినవాడా! 4 = అందమయిన శరీరముగల వాడా! 5 = భక్తులను పాలించువాడా! 6 = బాణములు ధరించినవాడా! 7 = భుక్తిని ముక్తిని ఇచ్చు లీలలు కలవాడా! 8 = బ్రాహ్మలను రక్షించువాడా! 9 = పాపాత్ములయిన రాక్షసులకు భయమైన వాడా! 10= అన్ని కోరికలును నిండినవాడా! 11 = నల్లనివాడా! 12 = లోకములకు చూడ సుందర మయినవాడా! 13 = అయోధ్యావాసా! 14 = అన్నిలోకలములకు ఆధారమైన వాడా! 15 = యుద్ధమున సాటిలేని వీరుడా! 16 = గర్వించినవారికి దొరకనివాడా! 17 = మేరుపర్వతమువలె స్థిరమైనవాడా! 18 = వేదశాస్త్రమలయందు విహరించువాడా! 19=సాటిలేని శరీర సౌందర్యము కలవాడా! 20 = కొండనెత్తినవాడా, పాపములను ఛేదించువాడా! 21 = నమస్కరించినవారి కాధారమగువాడా! 22 = విఘ్నేశ్వరునిచేత గానము చేయబడినవాడా! 23 = సంసారమనెడి సముద్రమును దాటుటకు తెప్ప అయినవాడా! 24 = సూర్యవంశమున బుట్టిన వాడా! 25 = త్యాగరాజుచే పొగడబడినవాడా! అని రాముని సంబోధించి సీతాకల్యాణ వైభోగమే అని మాత్ర మన్నారు.

633. శంకరాభరణం = ఆది (నలుగుపాట)

ప॥ నాపాలి శ్రీరామ – భూపాలకస్తోమ॥
కాపాడ సమయము – నీపాదము లీర॥ నా॥

చ॥ భళిభలి భక్తుల పూజా – ఫలమునీ వనుకొంటి
నళినలోచన నీకు – నలుగు బెట్టేరా॥ నా॥

2 కోటి మన్మథులైన – సాటిగా నీ సొగసు
నాటి యున్నది మదిని – మేటి శ్రీరామ॥ నా॥

3 తొలిపూజాఫలమేమొ – కలిగెనీ పదసేవ
నలువకైనను నిన్ను – తెలియగ దరమా॥ నా॥

4 పతిత పావన నీవు – పాలించకుంటేను
గతి మాకెవరు మమ్ము – గ్రక్కున బ్రోవు॥ నా॥

5 కోరి నీ పదసేవ – సారెకు సేయను దలచి
మారమణ నాలోనే – మరులు కొన్నాను॥ నా॥

6 నిరుపేద కబ్బిన – నిధిరీతి దొరకితివి
వరత్యాగరాజునికి – వరద మ్రొక్కేరా॥ నా॥

తాత్పర్యము :

నాకు అన్నివిధముల రక్షకు డయినరామా! రాజసమూహములచే చుట్టబడినవాడా! నన్ను కాపాడే సమయము. కనుక నీపాదములు నాకిమ్ము. (పాదములు రక్షకములని) ఓ పద్మ నేత్రా! నీవు భక్తులకు పూజాఫలము. నీకు నలుగు బెట్టెదను రమ్ము. కోటి మన్మథులకు సాటి అయిన నీ సొగసు నా హృదయములో నాటుకొని యున్నది. నా పూర్వపుణ్యము వలన నీపాదసేవ లభించినది. బ్రహ్మ కూడ నీ మహిమ నెరుగ లేడు. పతితపావనా! మమ్ము నీవు బ్రోవకుంటే మాకు వేరుగతి లేదు. నీ పదసేవ జేయ దలచి నా మనసులో నీపై మరులుకొని యున్నాను. నిరుపేదకు నిధి దొరకినట్లు నాకు నీవు దొరకినావు. అని అయ్యగా రానందమును నివేదించినారు.

విశేషము = ఇందులో నలుగుబెట్టెద రమ్మని పిలచుట ప్రధానము. విష్ణుచిత్తులను పరమ భక్తులు బాలకృష్ణుని స్నానము చేయించుటకు 'నారణా నీరాడవారాయ్' = నారాయణా నీరాడరమ్ము' అని మకుటముతో పది తమిళ పాశురములను రచించినారు. ఇట్టిదే అయ్యగారి భావనము కూడ. విష్ణుచిత్తులవారి ప్రబంధము పేరు 'నీరాట్టం'...

634. మధ్యమావతి = ఆది

ప॥ నగుమోముగలవాని – నామనోహరుని
జగమేలే శూరుని – జానకీ వరుని॥ నగు॥

చ॥ దేవాధి దేవుని – దివ్యసుందరుని
శ్రీవాసుదేవుని – సీతా రాఘవుని॥ నగు॥

2 సుజ్ఞాననిధిని సోమ – సూర్యలోచనుని
అజ్ఞానతమమును – అణచు భాస్కరుని॥ నగు॥

3 నిర్మలాకారుని – నిఖిలాఘహరుని
ధర్మాది మోక్షంబు – దయచేయు ఘనుని॥ నగు॥

4 బోధతో పలుమారు – పూజించినేనా
రాధింతు శ్రీత్యాగ – రాజ వినుతుని॥ నగు॥

తాత్పర్యము :

నగుమోముగలవాడు, నా మనస్సు హరించినవాడు, జగములనన్ని ఏ లేశూరుడు, జానకీపతి, దేవతలందరిలో అధిదేవుడు, దివ్యసుందరమయినవాడు, అన్ని వస్తువుల యందును లోపల బయట వెలుగువాడు, సీతకుభర్త, మంచి జ్ఞానమునకు నిధి అయినవాడు, సూర్యచంద్రులు నేత్రము లయినవాడు, అజ్ఞానమనే చీకటిని హరించు సూర్యుడు, నిర్మలమైన ఆకారము గలవాడు, అన్ని పాపములను పోగొట్టువాడు, ధర్మము మొదలు మోక్షము వరకు ఉన్న నాలుగు పురుషార్థముల నిచ్చువాడును అయిన రాముని నేను బోధతో పూజించి ఆరాధించెదను. అని అయ్యగారు భక్త జనులకు చెప్పినారు.

విశేషము = ఇందులో 'సీతా రాఘవుని' అని ఒక క్రొత్త ప్రయోగము చేసినారు. రాముడు అంటే ఆయనపేరు. రాఘవుడు అంటే రఘువంశములో పుట్టినవాడు అని అర్థము. అయినా అది రాముని పేరుగా చాలా కాలమునుండి స్థిరపడినది. తరువాత సీతా-రావు శబ్దములు రెండును కలిసి 'సీతారాముడు' అయినది. 'శ్రీమన్నారాయణుడు' అనినట్లు ఇది సరిపోయినది. అదియును కాక రామ శబ్దములోని అర్థమహిమ చేత సీతారాముడు' అంటే సీతతో ఆనందపడువాడు, సీతను ఆనందపెట్టువాడు అనే అర్థములు కుదిరి సీతాపతి అనే భావములో సీతారాముడు అని స్థిరపడినది. ఇది సార్థకముగా నున్నది. దేవతలలో స్త్రీలతో కలిపినప్పుడు లక్ష్మీపతి - గౌరీపతి - వాణీపతి - అని ఉద్దిష్ట వ్యక్తిని తెలుపుచున్నవి. అంతే కాని లక్ష్మీవైకుంఠుడు, గౌరీ శివుడు, వాణీ బ్రహ్మ, అని ప్రయోగము లుండవు. అయ్యగారు ఈ కృతిలో 'సీతారాఘవుని' అని చేసిన ప్రయోగము క్రొత్తది. మరియు ఉద్దిష్ట వ్యక్తిని తెలుపునట్టి పదముతో ఇంకొక వ్యక్తిని తెలుపు పదము ముందు చేరినప్పుడు ఆ వ్యక్తికి ప్రాధాన్యముండును. 'దశరథ రాముడు' అంటే దశరథునకు ప్రాధాన్యము వచ్చినది. 'సీతారాఘవుని' లో అయ్యగారు సీతా ప్రాధాన్య వివక్షచేసి యుండవచ్చును. 'రాఘవ' అనే శబ్దములో రఘువునకు ప్రాధాన్యము. రాఘవుడు అనుదాని కన్న రాముడు అనుదానిలో ఉద్దిష్ట వ్యక్తి ప్రాధాన్యమున్నది. 'సీతారాఘవ' అనుదానిలో 'సీతాయాశ్చరితం మహత్' = రామాయణము - సీత యొక్క గొప్పచరిత్రము. అనినట్లు సీత ప్రాధాన్యము రాముని అప్రాధాన్యమును ద్యోతక మగుచున్నవి. మరియును 'సీతారాఘవ' అనే దానిలో సీతయొక్క అయోనిజత్వము, రాముని సాధారణ జననము స్ఫురించుచున్నవి. ఎందుచేతనంటే సీత అంటే నాగటిచాలు, రాఘవ అంటే రఘువంశమున బుట్టినవాడు అనే అర్థస్ఫూర్తిచేత. రామాయణమున 'ఇయంసీతా మమసుతా' అనేదాని గోవిందరాజ వ్యాఖ్య ననుసరించి పై విధముగా వివరించుట అయినది.

635. ఘంటారాగము - జంపె (మంగళహారతి)

ప॥ (1) జయమంగళం - (2) నిత్యశుభమంగళం॥ జయ॥

చ॥ (3) కరుణా రసాక్షాయ - (4) కామారి వినుతాయ
(5) తరుణారుణాతిసుం - దరపదాయ
(6) నిరుపమశరీరాయ - (7) నిఖిలాగమచరాయ
(8) సురవినుత చరితాయ - (9) సువ్రతాయ॥ జయ॥

చ॥ (10) కుంద సుమరదనాయ - (11) కుంభజనుగే యాయ
(12) మందరాగధరాయ - (13) మాధవాయ
(14) కందర్పజనకాయ - (15) కామిత సుఫలదాయ
(16) బృందారకారాతి - భీకరాయ॥ జయ॥

చ॥ (17) సర్వలోక హితాయ - (18) సాకేత సదనాయ
(19) నిర్వికారాయ - (20) మా-నితగుణాయ
(21) సార్వభౌమాయ - (22) పోషిత త్యాగరాజాయ
(23) నిర్వాణ ఫలదాయ - (24) నిర్మలాయ॥ జయ॥

తాత్పర్యము :

ఇది సంస్కృత రచనము. 1 = జయమంగళము, 2 = నిత్యమును శుభమంగళము, 3 = కరుణ కలిగిన కన్నుల వానికి, 4 = శివునిచే పొగడ బడినవానికి, 5 = ఎఱ్ఱని లేత తామర పూలవంటి అందమైన పాదములవానికి, 6 = సాటిలేని శరీరము కలవానికి, 7=అన్ని వేదముల యందు చరించువానికి, 8 = దేవతలు నుతించు చరిత్రము గలవానికి, 9 = మంచినియమములు గలవానికి, 10 = మల్లెలవంటి పలువరుసగల వానికి, 11=అగస్త్యునిచే పొగడొందిన వానికి, 12 = మందర పర్వతము మోసిన వానికి, 13 = లక్ష్మీదేవి భర్త అయినవానికి, 14 = మన్మధుని తండ్రికి, 14 = కోరిన మంచి ఫలము లిచ్చువానికి, 16 = రాక్షసులకు భయంకరుడైన వానికి, 17 = అన్ని లోకములకును హితమగువానికి, 18 = అయోధ్యావాసునకు, 19 = మార్పులు లేనివానికి, 20 = పూజింపబడిన గుణములు గలవానికి, 22 = త్యాగరాజును పోషించినవానికి, 23 = మోక్షఫలము నిచ్చువానికి, 24 = నిర్మలునకు, జయమంగళము నిత్య శుభమంగళము.

636. సురటి = ఆది (మంగళ హారతి)

ప॥ పతికి హారతీరే సీతా॥ పతి॥

అ॥ అతిమృదుతర సత్యభాషణునికి – అఖిలాండనాథునికి సీతా॥ పతి॥

చ॥ బంగరురంగు భుజంగుని పైన చె
లంగుచును మరక–తాంగుడు మెరపు తె
రంగున మెరయు త–నంగనతో బలు
కంగ జూచి యు–ప్పొంగుచు సీతా॥ పతికి॥

2 అక్కరతో నిరు – ప్రక్కల నిలచి త
ళుక్కని మెరయగ – చక్కని మోమున
చుక్కల రాయని – మక్కువతో సరి
ముక్కెర కదలగ – గ్రక్కున సీతా॥ పతికి॥

3 రాజ విభాకర – రాజధరామర
రాజ కురాజ వి–రాజులు చూడగ
రాజమానమగు – గాజులు ఘల్లన
రాజిత త్యాగ – రాజ సుతునికి శ్రీ॥ పతికి॥

తాత్పర్యము :

హారతి రామున కిమ్మని అయ్యగారు స్త్రీలను పిలచుచున్నారు. ఇది సాధారణమైన పద్ధతి. బంగారు రంగుగల శేషశయ్యపై రాముడు కూరుచుండి మెరపు తీగవలెనున్న సీతతో మాటలాడుచుండగా హారతి ఇడుడు. ఓ స్త్రీలారా! మీ ముఖము ముక్కు పుడకకాంతితో మెరయుచుండగా మీ గాజులు చప్పుడగు చుండగా సీతాపతికి హారతి ఇవ్వండి. రాజ = చంద్రుడు, విభాకర = సూర్యుడు, రాజధర = శివుడు, అమరరాజ= ఇంద్రుడు, కురాజ = భూమినేలే రాజులు, విరాజులు = పక్షి రాజులు వీరందరు చూచుచుండగా హారతు లిండు అని తాత్పర్యము.

637. వంతువరాళి = త్రిపుట

ప॥ వదనద్యుతి జిత సోమా – వసుధామానసకామ॥
మదమానవ గుణ భీమా – మాంపాహి శ్రీరామ॥

చ॥ జనకసుతా హృద్రమణ – జమదగ్నిజమదహరణ॥
ప్రణతా ఘనల వరుణ – పాహిమాం ముని శరణ॥

2 విగళిత మోహపాశ – విధుకోటి సంకాశ
భగవన్ సకలాధీశా – పాహిపాప వినాశా॥

3 వరత్యాగరాజనుతా – వారిజసంభవ తాత
పరమ కల్యాణయుత – పాహిమాంశుభ చరిత॥

సూచన : ఇది శోభనపు పాట అనే ఒక సూచనతో అచ్చు పుస్తకంలో పాటకు ముందు 'శోభానే' అని ఉన్నది. కాని పాట సంస్కృతము. సంస్కృత సంబోధనము లుండి 'మాంపాహి' = నన్ను రక్షించుము' అని మాత్రమున్నది. విశేషమేమియులేదు. సంబోధనము లన్నియు చాలా చాలా పునఃపునరుక్తములే. మరియు ఇది త్రిపుట అని యున్నది. రూపకతాళమునకు సరిపడి యున్నది.

638. ఆహిరి = త్రిశ్రలఘువు (పవ్వళింపు పాట)

ప॥ పూలపాన్పుమీద బాగ–పూర్ణ పవ్వళించు॥

అ॥ నీలఘన శ్యామహరే – నిరుపమ రామయ్య మల్లె॥ పూల॥

చ॥ మధుశర్కర నానుబ్రాలు – మది యారగించి
విధుముఖ కమ్మని విడెము – వేసి కటాక్షించి॥ పూల॥

2 పరిమళగంధమ్ము మేన – బాగుగాను బూసి
మెరయగ సుమహారములను – మెడనిండను వేసి॥ పూల॥

3 ఆగమోక్తమైన శయ్య – నంగీకరించి
త్యాగరాజ కృతములెల్ల – తధ్యమని సంతోషించి॥ పూల॥

తాత్పర్యము :

ఓ పరిపూర్ణా! ఓ నీలమేఘశ్యామా! రామా! మల్లె పూల పాన్పుపైన పవ్వళించుము. ఓ చంద్రముఖా! తేనె శర్కర కలిపిన నానుబ్రాలు (నాన బోసిన బియ్యము) ఆరగించి కమ్మని తాంబూలము వేసుకొని మమ్ము కటాక్షించి పూల పాన్పుపై పవ్వళించవయ్యా! పరిమళ చందనము ఒడలి నిండ పూసుకొని పూలదండలు మెడనిండ ధరించి

శాస్త్రమందు చెప్పబడిన శయ్య నంగీకరించి నేను చేసిన ఉపచారములన్నియు నిజమని సంతోషించి పూలపాన్పుపై పవ్వళించు రామా! అని.

విశేషము = దీనిని 'పవ్వళింపు సేవ' అంటారు. ఈ సేవ లన్నియు సాధారణముగా దేవాలయముల యందు నిత్యవిధిగా జరుగుతాయి. కల్పశాస్త్రములో ఈ సేవ లన్నియు విధింపబడినవి. ఈ కృతిలో నున్న ఉపచార వాక్యములు సంస్కృతములో ఉంటాయి. మంగళహారతి కూడ సంస్కృతంలో శ్లోకాల రూపములో నుంటుంది. ఉదాహరణకు 'శ్రియఃకాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినాం।శ్రీ వేంకటనివా సాయ శ్రీనివాసాయ మంగళం' ఇది మంగళ శ్లోకము. ఇది అందరు నెరిగినదే. కాని ఇది మంగళహారతి అని అనుకొనరు. శ్లోకములో నుండుటచేత. ఇట్టి ఆలయసేవ లన్నిటిని అయ్యగారు తన ఇంట రామ పంచాయతనమునకే తన గానము చేత నెరవేర్చు కొంటున్నారు.

639. లీతిగౌళ = ఆది

ప॥ *బడలిక దీర పవ్వళించవే*

అ॥ *సడలని దురితములను దెగదోసి*
సార్వభౌమ సాకేతరామ॥ *బడలిక॥*

చ॥ *పంకజాసమని – పరితాపముగని*
పంకజాప్తకుల – పతివై వెలసి
పంక జాక్షితో – వనమున కేగి
జింకను వధియించి...
మంకు రావణుని – మదమణచిని
శ్రీంకు డొవిభీషణునకు బంగరు
లంక నొసగి సురల బ్రోచిన నిష్క
ళంక! త్యాగరాజనుత... రామ॥ *బడలిక॥*

తాత్పర్యము :

ఓ సార్వభౌమా! సాకేత రామా! నీ బడలిక తీరేటట్లు పవ్వళింపవయ్యారామా. రావణ బాధలు చూచి పరితాపము కొనిన బ్రహ్మపరితాపమును చూచి, సూర్య వంశమందు పుట్టి సీతతో వనవాసమునకు పోయి, జింకను (మాయలేడిని) వధించి,

గట్టి పట్టుదల కలిగిన రావణుని మదమణచి (వధించి), భయమును బాసిన విభీషణుని బంగారు లంకకు రాజును చేసి, దేవతలను రక్షించిన ఓ నిష్కళంక చరిత్రా రామా! బడలిక దీరగా పవ్వళింపవయ్యా అని అయ్యగారి ప్రార్థనము.

విశేషము = బ్రహ్మ పరితాపమును చూచుట మొదలుకొని చెప్పిన పనులన్నియును బడలిక అని, అది తీరేటట్లు నిదురింపమని అయ్యగారి భావనము.

640. నీలాంబరి = జంపె

ప॥ ఉయ్యాల లూగవయ్య – శ్రీరామ॥ ఉయ్యాల॥

అ॥ సయ్యాట పాటలను – సత్సార్వభౌమ॥ ఉయ్యాల॥

చ॥ కమలజా ద్యఖిలసుర–లు॥ నిను గొల్వ
విమలులైన మునీంద్రు–లు॥ ధ్యానింప॥
కమనీయ భాగవతు–లు॥ గుణకీర్త॥
నముల నా లాపంబు–లు॥ సేయగ॥ ఉయ్యాల॥

2 నారదాదులు మెరయు–చు॥ నుతియించు
సారముల బాగవిను–చు॥ నిను నమ్ము
వారల సదా బ్రోచు–చు॥ వేద
సార సభలను జూచు–చు॥ శ్రీరామ॥ ఉయ్యాల॥

3 నవమోహనాంగులై–న॥ సురసతులు
వివరమ్ముగా బాడ–నా॥ భాగ్యమా
నవరత్న మంటపము–న॥ త్యాగరా
జవినుతా కృతిబూని–న॥ శ్రీరామ॥ ఉయ్యాల॥

తాత్పర్యము :

త్యాగయ్యగారు నిదురలేచినది మొదలు నిదురించువరకు చేయు నిత్యసేవలలో ఈ ఉయ్యాలసేవ చివరిది. తమ పంచాయతనమును (అనగా సీతారామ లక్ష్మణభరత శత్రుఘ్నుల అయిదుగురి సంపుటము గలిగిన దేవతార్చన ఆయతనము) ఊయెలలో పరుండబెట్టి పాడే పాట ఇది. దీనిని లాలిపాట జోలపాట అనవచ్చును. ఓ

సత్సార్వభౌమా! మంచి పరిపాలనమును చేసిన సార్వభౌముడా! సయ్యాట పాటలతో ఉయ్యాల లూగవయ్యా! కమలజ ఆది అఖిల సురలు = బ్రహ్మ మొదలైన అందరు దేవతలు నిన్ను కొలుచుచుండగా, వివులులైన మునీంద్రులు నిన్ను ధ్యానించుచుండగా, అందమయిన భాగవతులు నీ గుణములను గానము చేయుచుండగా, నారదాది మహర్షులు నుతించే సారములను బాగుగ వినుచు, నిన్ను నమ్మినవారిని రక్షిస్తూ, వేదముల సారములైన పఠనములను వినుచు కనుచు ఉయ్యాలలూగు. నవరత్నములు పొదిగిన ఉయ్యాలలో నవమోహనాంగులయిన అప్సరసలు చక్కగా పాడుచుండగా నేను కీర్తించుకొన్న ఆకారమును ధరించిన ఓరామా! ఉయ్యాల లూగవయ్యా అని త్యాగయ్యగారు పాడినారు.

విశేషాంశములు = 'సయ్యాట పాటలను' ఇరువురి కన్న నెక్కువయినవారు గూడి చేయు నృత్యగానములను సయ్యాటపాట లందురు. పంచాయతనములోని మీ అయిదుగురు సయ్యాటపాటలతో ఊగండి అని భావము. 'కమలజా ద్యఖిలసురలు' బ్రహ్మాదిదేవతలు భగవదుత్సవములను దర్శించుటకు వత్తురు అని సంప్రదాయము. వారు దర్శనమాత్ర కుతూహలులే. ఇక మునీంద్రులు తమ హృదయమును పరిశుద్ధముగా నుంచుకొని మౌనముగా ధ్యానింతురు. వీరిది ధ్యానయోగము. 'యోగి హృద్ధ్యానగమ్యం' అనినట్లు వారు ధ్యాన గమ్యమైన భగవన్మూర్తిని దర్శించుకొంటూ మిక్కిలి రమించెదరు (ఆనందించెదరు). అందుచేతనే 'రమంతే యోగినోనంతే। సత్యానందే చిదాత్మని। ఇతి రామపదేనాసౌ పరబ్రహ్మభిధీయతే' = అనంతుడు, సత్యానందమయుడు, జ్ఞానస్వరూపుడు నగు పరబ్రహ్మమునందు యోగులు మనసునిప్పి రమించెదరు కనుక (ఆనందమునొందుదురు కనుక) ఆ పరబ్రహ్మ 'రామ' అను శబ్దముతో చెప్పబడు చున్నాడు అని ఉపనిషత్తు చెప్పినది. ఓ రామా! అట్టి మునీంద్రుల ధ్యానమును గమనించుచు ఉయ్యాల లూగుము. ఇక భాగవతులు భగవద్గుణములను గానముతో కీర్తింతురు. అందుచేతనే ఇది 'కమనీయ'మైనది. వేదపఠనము లెవరికి అర్థముకావు. మౌనీంద్రుల ధ్యానము వారికి మాత్రమే అనుభవయోగ్యము. భాగవతుల గుణకీర్తనాలాపములు అందరినీ ఆకట్టుకొనును. అందుచేత 'కమనీయ భాగవతులు' అని చెప్పిరి. ఇక నారదాదుల 'నుతిసారములు' ఒక పదార్థమునందు అంతయును సారముగాదు. తరచగా తరచగా వ్యర్థమయి నది అంతా పోయి మిగిలేది సారము. మనము తెలుసుకొన వలసిన సారమేది అనే ప్రశ్నకు సమాధానముగా 'అనంతశాస్త్రం బహు వేదితవ్యం। అల్పశ్చకాలో బహవశ్చ విఘ్నాః। యత్సారభూతం తదుపాసితవ్యం। హంసోయథా క్షీర మివాంబుమిశ్రం॥ = శాస్త్రములు చదువుదామంటే అనంతములయిన

శాస్త్రములు చాలా ఉన్నాయి. ఆయుర్దాయము చాలా స్వల్పము. విఘ్నములు పెక్కులు. కనుక హంస నీటితో కలిసిన పాలలో నీటిని వదలి పాలను స్వీకరించినట్లు పై విషయములలో ఏది సారమో దానిని ఉపాసింపవలెను' అని శాస్త్రము. అన్ని శాస్త్రముల సారము భగవద్ధ్యానమే అని 'శ్లోకపాదేన వక్ష్యామి। సర్వశాస్త్రార్థసంగ్రహం। కిమన్యై శ్శాస్త్ర విస్తరైః। ధ్యేయో నారాయణస్సదా' = శ్లోకములోని ఒకపాదముతో సర్వశాస్త్రముల సారమును చెప్పుచున్నాను. తక్కిన శాస్త్రములన్నీ ఎందుకు? నారాయణ ధ్యానమును సదా చేయుము' అని ఋషి ప్రోక్తము. కృతయుగమున ప్రాధాన్యము వహించిన ధ్యానమే కలియుగమున 'కలౌ సంకీర్త్యకేశవం' = కలియందు కేశవసంకీర్తనము' గా మారినది. అందుచే నుతులు సారము అనే భావముతో అయ్యగారు 'నారదాదులు నుతియించు సారము' అని చెప్పినారు. 'త్యాగరాజ వినుతా కృతిని బూనిన' అనిన దాని విశేషము. 'నతే రూపం నచాకారో।.... నాయుధానిచ।... తథాపి। భక్తానాంత్వం ప్రకాశసే॥' = ఓ దేవా! నీకు రూపములేదు. ఆకారములేదు. ఆయుధములు లేవు. కాని భక్తులకొరకు నీవు రూపాకారములతో ఆయుధములతో ప్రకాశించుచున్నావు' అని. మరియు 'యేయథా మాంప్ర పద్యంతే। తాంస్తథైవ భజామ్యహం' ఎవరు ఎట్లు నన్ను పొందుదురో వారి నట్లు నేను భజింతును అని భగవద్వాక్యము. దాని ననుసరించి త్యాగయ్యగారు వినుతించు ఆకారమును శ్రీరాముడు పూనియున్నాడు. అని భావము. త్యాగయ్యగారి ఒక్కమాట సూత్రమయితే దాని కింత భాష్యముండును.

641. హరి కాంభోజి = ఆది (లాలిపాట)

ప॥ లాలి లాలియని యూచేరా – వన
మాలి మాలిమితో – జూచేరా॥ లాలి॥

చ॥ దేవదేవయని పిలిచేరా, మహాను
భావ భావమున దలచేరా॥ లాలి॥

2 రామ రామయని పలికేరా, ని
ష్కామ కామరిపు – నుత రారా॥ లాలి॥

3 కోరి కోరి నిను గొలిచేరా మాయా
ధారి! దారి స–ధ్భజనేరా॥ లాలి॥

4 రాజరాజ యని – పొగడేరా – త్యాగ
రాజ రాజ యని – మ్రొక్కేరా॥ లాలి॥

తాత్పర్యము :

రామా! నిన్ను ఊయెలలోనుంచి లాలి లాలి యని ఊపుచు పాడుదును. ఓ వనమాలీ! అని ప్రేమతో చూచెదను. దేవదేవా! మహానుభావా! అని తలచి పిలిచెదను. ఓ నిష్కామా! శివనుతనామా! నిన్ను రామ రామ అని పిలిచెదను. కోరి కోరి నిన్ను కొలిచెదను. ఓ మాయాధారీ! నాకుదారి నీ భజనమే. రాజ రాజా = రాజులకు రాజా అని పొగడుదును. త్యాగరాజ రాజ = త్యాగరాజునకు ప్రభువైన వాడా! అని మ్రొక్కుదును. అని అయ్యగారు లాలి పాడిరి.

విశేషము = 'మాయాధారి' అని సంబోధనము. మాయను ధరించినవాడా! శ్లో॥ మాయాంతు ప్రకృతిం విద్యాత్। మాయినంతు మహేశ్వరం' = మాయ అనగా ప్రకృతి అని తెలియవలెను. దీనికి ప్రభువు మహేశ్వరుడని తెలియవలెను' అని శాస్త్రము. అనగా మాయను ధరించిన వాడనియు, మహేశ్వరుడనగా ఇచ్చట రాముడనియును గ్రహింపవలెను. మాయాధారి అంటే మాయా మానుష విగ్రహు డనియును చెప్పవచ్చును. ఇది డోలారోపణోత్సవము = ఊయెలలో స్వామి నుంచి ఊపుచు లాలి పాడుట.

642. కేదారగౌళ = జంపె

ప॥ లాలి గుణశాలి వన – మాలి సుహృదయన
లాలి మృదుతర హంస–తూలికాశయన॥
లాలి లాలయ్య లాలి॥

చ॥ ఇనవంశమందున జ–నించిన ఘనాభ॥
కనకమయచేల దిన–కరకోటి శోభ
వనజనయనా క్రూర – వరదాబ్జనాభ
సనకాది నుత సకల – సద్భక్తసులభ॥ లాలి॥

2 కరకలితశరచాప – ఖరశిరో హరణ
అరుణాబ్జనిభచరణ – అసుర మదహరణ
పురివైరి వినుత సం–పూర్ణ శశివదన
కరుణారసాక్ష గత–కామ ముని శరణ॥ లాలి॥

3 పుడమి వరదా నాదు-పూజ గైకొనుమా
కడునమ్మువారింట - కలుగు శ్రీకరమా
కడగంటి చూపు నీ-కది చాల ఘనమా
ఎడబాయజాల న-న్నేలు కులధనమా॥ లాలి॥

4 కోటి సూర్యప్రభల - గేరు మంటపము
చాటుగ నలంకరిం-చినది నెలకొనుము
సాటి దొరకని సాధు-జన వంద్య విడెము
మాటి మాటికి నొసగి - మరవక గొలుతుము॥ లాలి॥

5 అందు మధ్యంబునను - అపరంజితోను
సుందరం బైన మం-చము వేసి నాను
అందుపై జాజులను - అమర పరచాను
అందమై నీపాద-యుగము బట్టే ను॥ రాలి॥

6 అసమాన శూర ము-క్తావళులు మెరయ
అసమాన గిరిమధ్య - కుసుమములు గురియ
బిసరుహభవాది సుర-బృందకో ట్లరయ
అసలైన బిరుదు లిడి - యూచెదను సదయ॥ లాలి॥

7 భాగవత సేవలో - బడలి యున్నావు
రాగవిరహిత ననుమ-రవగ బొయ్యేవు
బాగైన జనక జా-భాగ్యమా నీవు
త్యాగరాజుని నిండు-దయజూచి బ్రోవు॥ లాలి॥

తాత్పర్యము :

ఓ గుణశాలీ! వనమాలీ! సుహృదయన = మంచి హృదయుగల వారికి గతి అయినవాడా! మృదుతరహంస తూలికా శయన = మెత్తని హంస తూలికాతల్పమందు శయనించినవాడా! లాలి. సూర్యవంశమున బుట్టిన నీలమేఘశరీరా! కనకచేల! కోటి సూర్యుల కాంతిగల వాడా! పద్మనేత్రా! అక్రూరవరదా! పద్మనాభా! సనకాది వినుతా! భక్తసులభా! చేత విల్లమ్ములు బట్టినవాడా! ఖరాసురుని తలద్రుంచినవాడా! ఎర్రని తమ్మివంటి పాదముల వాడా! రాక్షసమదహరణా! శివుని పొగడ్త కన్నవాడా! పూర్ణచంద్రముఖా! దయగల చూపులవాడా! కోరికలు లేనివాడా! మునులకు రక్షకుడా!

నా పూజ గైకొనుము. నమ్మినవారింట సిరులు గలిగించు వాడా! ఒక్కపరి నన్ను కడగంటితో నీవు చూచుట పెద్ద పనియా? నా కులధనమా? నన్నేలుము. నిన్నెడబాయలేను. కోటి సూర్యులకాంతి కలిగిన ఈ మంటపము నలంకరించాను. మంటపమధ్యమందు అందమైన మంచము వేసినాను. దీనియందు నెలకొనుము. తాంబూల విడియమిచ్చి సేవ చేస్తాను. నీపాదము లొత్తెదను. ఓ సాటిలేని శూరుడా! నీకు వసించుటకు కొండ ఇష్టముకదా! ఈ మంటపమునే కొండగా భావించుము. ఈ శయ్యనే కొండగా తలచుము. ఈ కొండపై జాజిపూలు చల్లితిని. బ్రహ్మాది దేవతలందరును చూచుచుండగా సత్యములయిన నీ బిరుదులు పొగడుచు నీ ఊయల ఊచెదను. భాగవతుల సేవలో బడలి యున్నావు. ఓ సీతా భాగ్యమా! నన్ను నిండు దయతో రక్షింపుము. అని ప్రార్థనము.

643. శంకరాభరణం = ఆది

ప॥ రామా శ్రీరామ లాలీ ఊగుచు ఘన
శ్యామా నను బ్రోవు – లాలీ॥ రామ॥

చ॥ చాల పాలింతు లాలీ మీగడవెన్న
పాలు తాగింతు లాలీ.. శయ్యపై మల్లె
పూలు బరచెద లాలీ – పరమైన వి
డేల నొసగెద లాలీ – ఓ వనమాలీ॥ రామ॥

2 కాచి సేవింతులాలీ – శేషతల్పము
నూచి పాడుదు లాలీ – ఏకాంతమున
దాచి పూజింతు లాలీ – ఆవేళ నిన్ను
జూచు చుప్పొంగే లాలీ – ఓ వనమాలీ॥ రామ॥

చ॥ వేద వేద్యమా లాలీ... కన్నుల జూడ
వే దయానిధీ లాలీ... నా దురమున నీ
పాదము లుంచు లాలీ – శ్రీ త్యాగరాజ
మోదరూపమా లాలీ... ఓవనమాలీ॥ రామ॥

తాత్పర్యము :

శ్రీరామా! లాలి = నిదురబొమ్ము ఊగుచు నిదురబొమ్ము. పాలు వెన్న మీగడ త్రాగించెదను. విడెమిచ్చెదను. నిన్ను పాలించెదను. ఓ దయానిధీ! నన్ను దయజూడు. నా రొమ్మున నీపాదము లుంచి నిదురబో.

విశేషము = మన తెలుగునాట చాలా అనాదికాలంలో ఒక తల్లి బిడ్డను నిదురబుచ్చే ప్రయత్నములో ఒక సంగీతముతో కూడిన ఏవో అవ్యక్తమయిన అక్షరాలు నోటినుండి వెలువడినవి. అవి సాధారణముగా లకారమే అవుతాయి. లాలి అనునది ఆ విధంగా వచ్చినదే. తల్లి ఉద్దేశ్యములో అది నిదురబొమ్ము అని. కాలక్రమములో ఆ పదము పల్లవి అయి దైవ సంబోధనపర మయి, కొన్ని చరణములతో కూడి ఒక పూర్ణస్వరూపమును సంతరించుకొన్నది. సంగీతము సులభ శైలిలోనుండును. అయ్యగా రిందు రాముని తన బిడ్డగా భావించినారు. అందుచేతనే పాలించి, దాచి, కాచి అని పాడినారు. అందును రాముని పరత్వమును వీడలేక 'వేద వేద్యమా' దయానిధీ! మొదలగు సంబోధనములతో 'వనమాలీ' అని మకుటము చేసినారు. 'వనమాలీ' అనునది విష్ణుసహస్ర నామములలో నొకనామము.

644. నీలాంబరి = రూపకము

ప॥ లాలి యూగవే,, మా-పాలి దైవమా॥ లాలి॥

అ॥ లాలి యూగవే,, మును-గాలి దిండి పాన్పుపైని॥ లాలి॥

చ॥ పమ్మిన వేడుకమీర-తమ్ములతోను॥
కమ్మని విడె మొసగు ఆ-జనకాత్మజ తోను॥ లాలి॥

2 బొమ్మ దేవర తండ్రి - భూమీశులతోను
సమ్మతమున త్యాగరాజు-సన్నుతి సేయగ॥ లాలి॥

తాత్పర్యము :

రామా ఊగుము. నునుగాలి దిండి పాన్పుపైన = శేష శయ్యపైన ఊగుము. నీతమ్ములతోను, సీతతోను, నీ పరివారమైన రాజులతోను ఊగుము. ఓ బొమ్మదేవర తండ్రీ = బ్రహ్మ దేవుని తండ్రీ! నేను పాటపాడుచుండగా సమ్మతితో వినుచు శేషశయ్యపై ఊగుము. అని వేడికోలు.

విశేషము = గాలిని తినునది సర్పము. కనుక అచ్చతెలుగులో గాలి తిండి అయినది. సరళాదేశముతో గాలిదిండి అగును. నును గాలి దిండి పాన్పు = మెత్తని పాము పాన్పు అని.

645. నీలాంబరి = జంపె

ప॥ శ్రీరామ రామ రామ – శ్రీమానసాబ్ధిసోమ॥ శ్రీ॥

అ॥ నారాయణాప్త కామ–నళినాక్ష పవ్వళించు॥ శ్రీ॥

చ॥ పల్లవాధర వరేణ్య – పాపేభసింహధన్య।
మల్లికాతల్పమందు – మాధవా పవ్వళించు॥ శ్రీ॥

2 ధారాధరాభ దేహా – తారాధి పానన సదా
నీరాక కోరియుంటి – శ్రీరామ పవ్వళించు॥ శ్రీ॥

3 జనకరా జింట బుట్టి – జానకి చెట్టబట్టి
కనక మౌ సురటి బట్టి – కాచినది పవ్వళించు॥ శ్రీ॥

4 వర్ణింపదరముగాని – స్వర్ణంపుమేను సీత
పూర్ణమౌభక్తితోను – పూజించు పవ్వళించు ॥ శ్రీ॥

5 ఆశుగాశన సుశయనా – అంభోజ పత్రనయన
ఆశతో త్యాగరాజు – అర్చించు పవ్వళించు ॥ శ్రీ॥

తాత్పర్యము :

శ్రీరామ.... లక్ష్మీదేవి మనస్సునకు చంద్రుడా! నారాయణా! కోరికలు నిండినవాడా! పద్మనేత్రా! పవ్వళించుము. చిగురుటాకు వంటి పెదవి కలవాడా! పాపములను హరించువాడా! ఓ మాధవా! మల్లెపూల పాన్పుపై పవ్వళించుము. నీలమేఘ శరీరా! చంద్రముఖా! నీరాక కోరియున్నాను. బంగరు శరీరముకల సీత బంగరు విసనకర్రబట్టి సంపూర్ణ భక్తితో నిరీక్షించు చున్నది. పవ్వళించు. ఆశతో నేనును అర్చించెదను. పవ్వళించుము.

646. శహన = చాపు

ప॥ రామ రామ రామ – లాలి శ్రీరామ॥
రామ రామ లావణ్య లాలి॥ రామ॥

చ॥ దొరకరాని నిధిరారా! దొరకు
దొరవు నీవు తొట్లలో రారా॥ రామ॥

2 వరమైనట్టి నాపట్టి రారా వర
సురులకు అరుదైన – సుందర రారా॥ రామ॥

3 తొలిజేసిన నోము – ఫలమా రామ
ఇలను వెలయు – ఇనకుల ధనమా॥ రామ॥

4 కల కలమని రావు చెంత ఆ
కలిగొంటివో లేక – కరుణా స్వాంత॥ రామ॥

5 మదగజ గమనా నా స్వామీ ఓ
సదయుడ నీ జాలి దెల్పుమీ॥ రామ॥

6 సరిబాలులాడ రమ్మనిరా ఆడి
వరద నీవు రా వద్దనిరా॥ రామ॥

7 ఎవరు నిన్ను ఏమనిరి, రా
ఘవ నీతప్పుగని రావద్దనిరి॥ రామ॥

8 కనులు మూసి ఆడినారు కర
మున కణగని నేత్రమని కసరెదరు॥ రామ॥

9 కలువరేకుల బోలు కనులు
కలగ నేల నన్ను గన్న దయాళూ॥ రామ॥

10 నుదుటను శ్రమ జలమేల ఆ
కథ ఏమి తెలుపవే – కరుణాలవాల॥ రామ॥

11 చింతచే దాగుదు వేరే మేని
కాంతిచే దగిలిన కర్మ మనేరే॥ రామ॥

12 ముత్యాల సరుల చిక్కేమీ – ఓ
సత్యసంధ పాద సరుల నొక్కేమీ॥ రామ॥

13 ముదమున నేపట్టువేళ – నా
పదమున వ్రాలెదరు,, పలుమా రావేళ॥ రామ॥

14 నిన్నేమని పిల్చుకొనిరి రామ
మన్ననతో ఏమని ఎంచుకొనిరి॥ రామ॥

15 బాగ సాక్షి రమ్మనిరి – వర
త్యాగరాజ నుత – దైవమా అనిరి॥ రామ॥

తాత్పర్యము :

అయ్యగారు ఇందు ప్రధానముగా రాముని చిన్న వానిగా భావించి అనునయిస్తున్నారు. రామా! లావణ్య రామా! లాలి. నీవు దొరకరాని నిధివి. నీవు దొరకు దొరవు (రాజాధిరాజువు). తొట్ల లోనికి రమ్ము. నాముద్దుల పట్టీరారా! దేవతలకైనను అరుదైన అందగాడా! రమ్ము. నా పూర్వపుణ్య ఫలమా! సూర్యవంశపు ధనమా! కలకలమని నవ్వుచు నా వద్దకు రావు. ఆకలిగా నున్నావా! ఓ మదగజగమనా! స్వామీ! నీ బాధ ఏమిటో తెలుపుము. నీతోడి బాలురు నిన్ను ఆటకు పిలిచు వద్దు పొమ్మనిరా? నాకు తెలిసినదిలే. నీమీద తప్పులెన్ని నిన్ను రావద్దనిరి. నీకనులు మూయుటకు ప్రయత్నించిరి. నీవు విశాలనేత్రుడవు కనుక నీ కనులు మూయుటకు వాళ్ల చేతులు చాలలేదు. కనుక నిన్ను కసురుకొనియుందురు. కలువరేకుల వంటి నీ కనులు కలగినవేల? నుదుట ఈ చెమట ఏమిరా నాయనా? అసలు కథ ఏమిటో చెప్పుము. చింతతో దాగుదువు. కాని ఒడలి కాంతులు నిన్ను దాగ నియ్యవు. వాళ్లు నిన్ను పట్టుకొందురు. ఇది నీమేని కాంతులు చేసిన కర్మము. ముత్యాలహారాలు చిక్కుపడిన వేమి? నీ కాలి అందెల కీ నొక్కులేమి? నేను నీపదములను పట్టునప్పుడు వాళ్లే వచ్చి నీ పదములపై వాలెదరులే. నిన్నేమని పిలిచిరి? ఏమని తలచిరి? నాకు తెలుసునులే. నిన్ను రమ్మనిరి. నీవు రానంటే దైవమా!! అనిరి.

విశేషము = పిల్లలు 'దాగుడు మూతలు' అనే ఆట ఆడుదురు. కన్నులు మూసుకొన్నవాడు ఎదుటివాని పేరు చెప్పితే వాడు దొంగ. అప్పుడు వాని కనులు మూయుదురు. ఇట్లు ఆ ఆటలో చెలిమి చేసెదరు. కలహించుకొనెదరు. తిట్టుకొనెదరు. కొట్టుకొనెదరు. కొందరు సంతోషపడుదురు. కొందరు బాధపడుదురు. పరమపురుషుడైన రాముని అయ్యగారు 'దాగుడుమూతల' ఆటలో కలత పడినవానిగా భావించి రాముని నిదురపుచ్చుటకు బుజ్జగించిన లాలిపాట ఇది.

647. రీతిగౌళ = ఆది (జోలపాట)

ప॥ జోజో రామ! ఆనందఘన॥ జోజో రామ॥

అ॥ జోజో దశరథ బాలరామ – జోజో భూజాలోలారామ॥ జోజో॥

చ॥ జోజో రఘుకుల తిలక రామ–జోజో కుటిలతరాలక రామ॥ జోజో॥

2 జోజో నిర్గుణ రూపరామ – జోజో సుగుణకలాప రామ॥ జోజో॥

3 జోజో రవిశశినయనా రామ – జోజో ఫణిపతిశయనా రామ॥ జోజో॥

4 జోజో మృదుతర భాషా రామ – జోజో మంజుల వేష రామ॥ జోజో॥

5 జోజో త్యాగరాజార్చిత రామ – జోజో భక్త సమాజ రామ॥ జోజో

తాత్పర్యము :

జోజో అనుపదము తప్ప తక్కినవన్నియు సంబోధనములే. రామా! గొప్ప ఆనందము గలవాడా! దశరథ బాల! సీతయందు ఆసక్తుడా! రఘుకుల తిలక! వంకర ముంగురులవాడా! నిర్గుణ రూపుడా! మంచి గుణములు కలవాడా! సూర్యచంద్రులు కనులైన వాడా! శేషశయనా! మెత్తని మాటలవాడా! అందమైన వేషమువాడా! త్యాగరాజార్చిత! భక్తుల సమాజము కలవాడా! జోజో!

సూచన : పసిబిడ్డను బోర్లపడుకోబెట్టి అరచేతితో వీపుమీద కొట్టుచు నోటినుంచి వెలువడిన శబ్దము 'జో' దీని బహుళవచనము 'జోలు' వాటి పాట 'జోల పాట'. ఇట్లే శబ్దము క్రమముగా పాటలోనికి దిగినది. ఇందు భగవత్సంబోధనములే ఉంటాయి. అయ్యగారు దీనిని కూడ ఉపయోగించుకొన్నారు. ఇక్కడికి లాలులు జోలలు అయినవి.

648. బౌళి = జంపె (మేలుకొలుపు)

ప॥ మేలుకోవయ్య మ–మ్మేలుకో రామ॥

అ॥ మేలైన సీతా స–మేత నా భాగ్యమా॥ మేలుకో॥

చ॥ నారదాదులు నిన్ను–గోరి నీ మహిమల న
వారిగా బాడుచు – న్నారిపుడు – తెల్ల

వారగా వచ్చినది – శ్రీరామ! నవనీత
క్షీరములు బాగుగా – నారగింపను వేగ॥ మేలుకో॥

2 ఫణిశయన అనిమిషర – మణు లూడిగము సేయ
అణకువగను నిండారు – ప్రణుతి జేసెదరును
మణిమయాభరణుతా – యణిమాదు లిడుదీప
మణులు తెలుపాయెను త– రణి వంశవరతిలక॥ మేలుకో॥

3 రాజ రాజేశ్వర భ– రాజముఖ సాకేత
రాజ సద్గుణ త్యాగ – రాజనుత చరణా
రాజన్య విబుధగణ – రాజాదు లెల్ల నిను
పూజింప గాచినా – రీజగము బాలింప॥ మేలుకో॥

తాత్పర్యము :

ఓ మేలైన సీతాపతీ! నాభాగ్యమా! మేలు కోవయ్య. నారదాదిములులందరూ వచ్చి నీ మహిమలను విస్తారముగా పాడుచున్నారు. తెలవార వచ్చినది. వెన్నపాలు ఆరగించే సమయమైనది మేలుకో. ఓ శేష శయనా! దేవతాస్త్రీలు నీకు అణకువతో సేవలు చేసి నుతులు చేయుదురు మేలు కొనుము. ఓ సూర్యవంశ తిలకా! మంచి మణులు ధరించిన అణిమా దృష్ట సిద్ధులు పెట్టిన మణిదీపములు తెల తెలబోవుచున్నవి. (తెల వారుటకు గుర్తు) రాజరాజేశ్వరా! చంద్రముఖా! అయోధ్యానాథా! పండితులు ప్రభువులు వచ్చి నిన్ను పూజించుటకు వేచియున్నారు. ఈ లోకములను పాలించుటకు మేలుకోవయ్యా అన్నా రయ్యగారు.

విశేషము = ఈ మేలు కొలుపుకు నాంది సాహిత్యపరముగా రామాయణమున ప్రారంభము. విశ్వామిత్రుడు యాగరక్షణమునకు రాముని కొనిపోవుచు ఒకనాటి ప్రభాత సమయమందు 'కౌసల్యా సుప్రజా రామ। పూర్వా సంధ్యాప్రవర్తతే। ఉత్తిష్ఠ నరశార్దూల। కర్తవ్యం దైవ మాహ్నికం' అని మేలుకొలిపినాడు. ఆ విధముగా ప్రారంభమై ఆలయములలో 'సుప్రభాతము' గా ఆయా దేశభాషలలో మేలుకొలుపులుగా కాలక్రమములో నెలకొన్నది. తమిళములో విష్ణునారాయణులు ప్రత్యేకించి 'తిరుప్పళ్ళియెళుచ్చి' అని పది పాశురములలో 'అరంగత్తమ్మా ప్పళ్ళియెళుందరుళాయే' = రంగనాథా మేలుకొనుమా అని మకుటముబెట్టి రచించినారు. అయ్యగారు వీటికి తన పూజావిధానములో స్థానమిచ్చినారు. దైనందిన రామసేవలో ఇది మొదటిది.

649. సౌరాష్ట్ర = రూపకం

ప॥ మేలుకో దయానిధీ – మేలుకో దాశరథీ

అ॥ మేలుకోదయానిధీ – మిత్రోదయమౌ వేళ॥ మేలుకో॥

చ॥ నారదాది మునులు సురలు – వారిజభవు డిందుకలా
ధారుడు నీసన్నిధినే – కోరి కొలువు గాచినారు॥ మేలుకో॥

2 వెన్నపాలు బంగారు – గిన్నెల నేనుంచినాను
తిన్నగారగించి తేట–కన్నులతో నన్ను జూడ॥ మేలుకో

3 రాజ రాజాది ది–గ్రాజులెల్ల వచ్చినారు
రాజనీతి తెలియ త్యాగ–రాజ వినుత నన్ను బ్రోవ॥ మేలుకో॥

తాత్పర్యము :

ఓ దయానిధీ! దాశరథీ! సూర్యోదయ మగుచున్నది. మేలుకొనుము. నారదాది మునులు బ్రహ్మ శివుడు నీ సన్నిధిలో వేచియున్నారు. వెన్నపాలు బంగారు గిన్నెలో సిద్ధము చేసి యుంచినాను. అవి ఆరగించి తేటకన్నులతో నన్ను చూచుటకు మేలుకో. కుబేరుడు మొదలయిన దిక్పాలకు లందరును రాజనీతి నీ నుంచి తెలియుటకు వచ్చినారు. నన్ను రక్షించేపని ఒకటి యున్నది. మేలుకొనుము.

విశేషము = చివరి చరణమున అయ్యగారు రాముని రాజ నీతిజ్ఞతను సూచించినారు.

650. భైరవి = ఆది

ప॥ రక్షబెట్టరే దొరకు – రక్షబెట్టరే॥

అ॥ వక్షస్తలమున వెలయు–లక్ష్మీరమణునికి సాయ॥ రక్ష॥

చ॥ సీతా కరమును బట్టి – చెలగిన దొరకు
వాతాత్మజునికి చెయి–వశమైన దొరకు–పురు
హూతాదుల రక్షింప బా–హుజుడైన దొరకు – సం
గీత ప్రియ త్యాగరాజ–గేయుడైన దొరకైశ్వర్య॥ రక్ష॥

తాత్పర్యము :

ఓ భక్తులారా రండు మనదొరకు రక్షబెట్టండి. వక్షస్థలమందు లక్ష్మీదేవి వెలసియున్న దొరకు సహాయరక్ష బెట్టండి. సీత చెయి బట్టిన దొరకు, హనుమంతుని చేతికి వశమైన దొరకు, (భక్త సులభుడని) దేవతలను రక్షించుటకొరకు క్షత్రియుడై అవతరించిన దొరకు, సంగీత ప్రియుడైన త్యాగరాజు చేత గానము చేయబడు దొరకు ఐశ్వర్యరక్ష బెట్టండి అని అయ్యగారు భక్తుల నాహ్వానించినారు.

విశేషము = స్త్రీలు చంటి బిడ్డకు స్నానము చేయించి 'శ్రీరామ రక్ష' అని రక్ష బెడతారు. ఇప్పుడయ్యగారు చేసినదిది. యశోదాదిగోపస్త్రీలు బాలకృష్ణునకు 'బోరు కాడించి హరిరక్ష బొమ్మటంచు' = స్నానమాడించి నీకు 'హరి రక్ష' అని రట. (పోతన భాగవతము). ఇప్పుడయ్యగారు రాముని బాలుని చేసి చేసినదిది. దేవేంద్రాదులను రక్షించుటకు బాహుజుడు = క్షత్రియుడైన దొరయట. పురుషసూక్తము 'బాహూరాజన్యఃకృతః' = విరాట్పురుషుని బాహువునుండి క్షత్రియుడు పుట్టెను' అని సంప్రదాయార్థము. 'క్షతాత్త్రాయత ఇతి = క్షత్రియః' క్షతము = దెబ్బనుండి ప్రజలను కాపాడువాడు కనుక క్షత్రియుడు' అని నిర్వచనము. రావణుని క్షతమునుండి దేవతలను కాపాడుట తన విధి కనుక దాని ననుసరించి క్షత్రియుడైన దొర – అని నారయ్యగారు. దేవత లందరును రాముని ప్రజలు కదా!

651. సురటి = చాపు (మంగళారతి)

ప॥ మాకులమున కిహపర మొసగిన నీకు
మంగళం శుభమంగళం॥

అ॥ మాకుల బ్రోచిన – మదన జనకనీకు
మంగళం శుభ మంగళం॥

చ॥ మదగజగమన మానితసద్గుణా నీకు
మంగళం శుభమంగళం
మద మోహరహిత మంజుల రూపధరనీకు
మంగళం శుభమంగళం॥

2 మన సిజవైరి మానస సదనా నీకు
మంగళం శుభమంగళం
మనవిని విని మ-మ్మేలు కొన్న నీకు
మంగళం శుభమంగళం॥

3 మా మనసున నెల-కొన్న రామ నీకు
మంగళం శుభ మంగళం।
మామనోహర పాలిత - త్యాగరాజ
మంగళం శుభ మంగళం॥ మాకుల॥

తాత్పర్యము :

అయ్యగారు ఇందు రాముని సంబోధించే మంగళము చెప్పుచున్నారు. ఓరామా! మాకులమునకు (భక్తకులమునకు) ఇహపరసౌఖ్యము లిచ్చిన నీకు శుభము. ఓ మదన జనకా! మాకులను = చెట్లను బ్రోచిన నీకు మంగళము. మదగజగమన = గున్న ఏనుగు వంటి నడక గలవాడా! మదమోహములు లేనివాడా! అందగాడా! నీకు శుభమంగళము. శివుని హృదయమందు నివసించువాడా! మా మొరలు విని మమ్మేలిన నీకు మంగళము.

విశేషము = 'మాకుల బ్రోచుట' అనగా? కృష్ణావతారమున యశోద రోటికి కట్టినది. కృష్ణుడారోటిని రెండు మద్దిచెట్ల మధ్య నుండి ఈడ్చుకొని పోయినాడు. చెట్లు రెండును కూలి శాపము తీరి తమ గంధర్వ రూపమును పొంది కృష్ణునకు నమస్కరించి తమలోకమునకు పోవుట జరిగినది. ఇదే 'మాకులను బ్రోచుట'.

562. ధన్యాసి = ఆది

ప॥ జానకీ నాయక నీకు - జయమంగళం నృప
సూను సుందరమునకు - శుభమంగళం హరే॥ జానకీ॥

చ॥ ఫాలమునకు నీదుక-పోలయుగమునకు మంగళం
నీలవర్ణ నీపలు వజ్రాల జాలమునకు మంగళం॥ జానకీ॥

2 యౌవనమునకు చిరు - నవ్వులకు మంగళం
దువ్విన అలకల మీది-పువ్వులకు మంగళం॥ జానకీ॥

3 మాటలకు రత్నాలకి – రీటమునకు మంగళం
నాటక సూత్రధార నీ–తేట కండ్లకు మంగళం॥ జానకీ॥

4 బాణమునకు కుసుమ–బాణజనక మంగళం
జాణతనమునకు లోక–త్రాణమునకు మంగళం॥ జానకీ

5 ఉంగరమునకు నీ దృ–ష్టాంగమునకు మంగళం
పొంగుచు పదములనుండు – గంగకును మంగళం॥ జానకీ॥

6 నీ గుణ జాలమునకు – నిత్యశుభ మంగళం
నాగశయనా పాలిత – త్యాగరాజ మంగళం॥ జానకీ॥

తాత్పర్యము :

ఓ జానకీ నాయకా నీకు శుభమంగళము, నీ రాజకుమార సౌందర్యమునకు శుభమంగళము. నీ నుదుటికి, చెక్కిళ్లకు, నీ వజ్రాలవంటి పలువరుసకు, నీ యౌవనమునకు, చిరునవ్వుకు, నీ ముంగురులపైని పువ్వులకు, నీ మాటలకు, రత్నాల కిరీటమునకు, ఓ జగన్నాటక సూత్రధారీ! నీ కనులకు ఓ మన్మథజనకా! నీ బాణములకు, నీ గడుసు దనమునకు, నీలోక రక్షణమునకు, నీ ఉంగరమునకు, నేను చూచే నీ శరీర శోభకు, నీ పాదము నుండి పొంగుచు ప్రవహించే గంగకు, నీ గుణములకును, నిత్య శుభమంగళము అని అయ్యగారు రాముని సర్వావయములకు, వాటికి సంబంధించిన సర్వ శోభలకును మంగళాశాసనము జేసినారు.

విశేషము = ఇందు ప్రత్యేకించి గమనింపవలసినవి. బాణమునకు, ఉంగరమునకు, గంగకు అనునవి. ఉంగరము = అంగుళీయకము సీత ప్రాణములను నిలిపినది. బాణము రావణాదులను సంహరించి లోకములను రక్షించినది. గంగ త్రివిక్రమావతార సమయమున నారాయణుని పాదమున బుట్టి క్రిందికి వచ్చి ఇప్పటికిని జనులను పవిత్రము చేయుచున్నది. వీటికి అయ్యగారు మంగళాశాసనము చేసినారు.

653. కేదార గౌళ = ఆది

ప॥ మా రామ చంద్రునికి – జయమంగళం

అ॥ ఘోరభవనీరనిధి – తారకునకు మంగళం॥ మారామ॥

చ॥ మారుని గన్న రాజకు–మారునికి మంగళం
మారులేని హరికి ము–మ్మారు జయమంగళం॥ మా రామ॥

2 బాహులేయాప్తునికి సు - బాహ్వైరికి మంగళం
బాహుజశూరు డా జాను - బాహునికి మంగళం॥ మా రామ॥

3 బృందావన స్థిత మౌని - బృందావనునికి మంగళం
బృందాలోలునికి పాలిత - బృందారకునికి మంగళం॥ మా రామ॥

4 రాజవేషునికి రాజ-రాజార్చితునికి మంగళం
రాజధరుడగు త్యాగ-రాజనుతునికి మంగళం॥ మా రామ॥

తాత్పర్యము :

మారామ చంద్రునకు మంగళము. సంసార సముద్రమును తరింపజేయు వానికి, మన్మధుని కనిన రాజకుమారునకు, తనకు మారుగా ఇంకొకరు లేని హరికి, ముమ్మారు మంగళం. (1) కుమారస్వామి కాప్తుడైన వానికి, (2) సుబాహుడను రాక్షసుని సంహరించినవానికి, (3) క్షత్రియులలో శూరుడు (4) మోకాలివరకు వ్రేలు బాహువులు గల వానికి (మహాపురుష లక్షణము) (5) బృందావన మందున్న మునులను రక్షించినవానికి, (6) తులసీ లోలునకు, (7) దేవతలను రక్షించిన వానికి మంగళము అని.

విశేషము = (5) బృందావనమున మునులు గోపికలే. రామావతారమున రాముని చూచి మోహించిన మునులు రామానుగ్రహముచే మరుజన్మమున గోపికలైరి. రాముడు కృష్ణుడయ్యెను. ఇదే బృందావనమున మునులను రక్షించుట. ముని వృత్తి కృష్ణమననము. గోపికలు చేసిన దదేకదా! (6) జలంధరుడను ఒక రాక్షసుని భార్య బృంద. ఆమె విష్ణు భక్తురాలు. మరు జన్మమున తులసిగా పుట్టి విష్ణుదేవునకు ప్రియమైన పూజా పత్రముగా పుట్టినది. విష్ణుదేవుని పూజావ పత్రములలో తులసి స్థానమే పెద్దది. తులసిలేని విష్ణుపూజ ఉండదు.

654. సౌరాష్ట్రము = ఆది

ప॥ నీ నామ రూపములకు - నిత్య జయమంగళం॥ నీ॥

చ॥ పవమాన సుతుడు బట్టు - పాదారవిందములకు॥ నీ॥

2 పంకజాక్షినెలకొన్న-యంకయుగమునకు॥ నీ॥

3 నవముక్తాహారములు - నటియించే యురమునకు॥ నీ॥

4 నళినారి గేరు చిరు– నవ్వుగల మోమునకు॥ నీ॥

5 ప్రహ్లాదనారదాది – భక్తులు పొగడుచుండే॥ నీ॥

6 రాజీవనయన త్యాగ– రాజవినుతమైన॥ నీ॥

తాత్పర్యము :

ఓ రామా! నీ నామమునకు రూపమునకును నిత్యజయమంగళము. ఆంజనేయ స్వామి భక్తితో పట్టెడి నీ పాద పద్మములకు నిత్య జయమంగళము. సీతాదేవి అధివసించు నీతొడలకు మంగళము. క్రొత్తముత్యాల హారము లల్లలాడే నీ వక్షస్తలమునకు మంగళము. చంద్రుని తిరస్కరించుచు చిరునవ్వుతో వెలయు నీ ముఖమునకు మంగళము. ప్రహ్లాదనారదాది భక్తులు పొగడెడి నీ నామ రూపములకు నిత్య మంగళము. ఓ రాజీవనయనా! త్యాగరాజు వినుతించే నీ నామరూపములకు నిత్యమును జయమంగళము అని అయ్యగారు మంగళాశాసనము చేసినారు.

విశేషము = ఇందు ప్రథమగ్రహణముచేత నామ రూపములు ప్రధానములు. పరబ్రహ్మము నామ రూపగుణములు లేనిది అని చెప్పెడి ఒక సంప్రదాయమున్నది. త్యాగయ్య గారికి రాముడు పరబ్రహ్మమే. ఆ పరబ్రహ్మము నామరూపగుణ రహితము కాదని అయ్యగారి మతము. ఆయన నామ రూపములతోడి ఉపాసనమే చేసినారు. ఇందు నామరూపములు మాత్రమే చెప్పబడినవి. నామము అనగా నామములని బహువచనమే. నామమును చెప్పుటచేత గుణములను చెప్పినట్లే. నామములు గౌణములని 'యాని గౌణాని నామాని' అని చెప్పబడినది. అనగా భగవంతుని నామములు గుణములను బట్టి వచ్చినవే అని. కనుక అయ్యగారు గుణములకును మంగళమును చెప్పినట్లే. మరి నిర్గుణునిగా చెప్పిన వేదవాక్యముల మాట ఏమిటి? అని ప్రశ్నము వచ్చును. సమాధానము. సగుణుడని చెప్పిన వేదవాక్యము లున్నవి. ఈ రెండిటికిని పరస్పర విరోధము రాకుండ రామానుజాచార్యుల వారు నిర్గుణుడనగా హేయగుణ రహితుడని సమన్వయము చేసిరి. అట్టి నామరూప గుణములకు అయ్యగారు మంగళాశాసనము చేసిరి. సర్వావయవములకును వాటి విశేషణములను కూర్చి చేసిరి. అయ్యగారి మంగళ గీతములలో దీనికి చాలా ప్రాధాన్యమున్నది. సభానంతరము దీనిని పాడనివా రుండరు.

655. మోహన = జంపె

ప॥ జయమంగళం నిత్య – శుభమంగళం॥ జయ॥

చ॥ మంగళం మంగళం – మారామ చంద్రునకు॥
మంగళం మంగళం – మాధవునకు॥ జయ॥

2 నిజదాస పాలునకు – నిత్య స్వరూపునకు
అజరుద్ర వినుతునకు – నగధరునకు॥ జయ॥

3 నిత్యమై సత్యమై – నిర్మలంబైన యా
దిత్యకుల తిలకునకు – ధీరునకును॥ జయ॥

4 రాజాధిరాజునకు – రవికోటి తేజునకు–త్యాగ
రాజ నుతునకు రామ–రత్నమునకు॥ జయ॥

తాత్పర్యము :

మా రామచంద్రునకు, మాధవునకు = లక్ష్మీపతికి, తన దాసులను రక్షించువానికి, నిత్యమైన స్వరూపము గలవానికి, బ్రహ్మ రుద్రులచే పొగడబడినవానికి, కొండనెత్తిన వానికి, నిత్యుడు, సత్యము, నిర్మలుడునైన సూర్యవంశ తిలకునకు, ధీరునకు, రాజాధిరాజునకు, కోటి సూర్యతేజునకు, రామ రత్నమునకు జయమంగళము, నిత్య శుభమంగళము.

విశేషము = అయ్యగారు ప్రయోగించిన రాముని విశేషణములలో బ్రహ్మరుద్రులచే పొగడబడినవాడు అన్నది లేకుండ ఉండదు. దీనిని గూర్చి విష్ణు వాక్యముగా ఒక పురాణ సూక్తికలదు. 'రుద్రం సమాశ్రితాదేవాః। రుద్రో బ్రహ్మాణ మాశ్రితః। బ్రహ్మా సమాశ్రితో మాంచ నాహం కంచిదుపాశ్రితః' = ఏదయినా అవసరము వచ్చినపుడు దేవతలందరు రుద్రుని ఆశ్రయించెదరు. రుద్రుడు బ్రహ్మను ఆశ్రయించును. బ్రహ్మ నన్నాశ్రయించును. నే నెవనినీ ఆశ్రయించను' అని. దీనిని బట్టి విష్ణువును అందరును ఆశ్రయించి పొగడుదురు. దీనికి పురాణ కథలు చాలా నున్నవి. ఇందు అయ్యగారు 'రామరత్నము' అను ఒక విశేషమయిన విశేషణమును వాడినారు. రత్నమనగా 'రత్నంస్వజాతి శ్రేష్ఠేచ' = రత్నమనగా నవరత్నములలో నొకటి మాత్రమే కాక, ఒక వర్గమందు శ్రేష్ఠమయిన వ్యక్తికిని అర్థము అనికోశము. ఉదాహరణమునకు. కవిరత్నము = కవులలో శ్రేష్ఠుడు ఇత్యాదులు. రామరత్నమనగా దేవరత్నము, రాజరత్నము, ధార్మిక రత్నము, ధీరరత్నము, వీరరత్నము అని అయ్యగారి భావన. దీనితో మంగళారతిభాగము సమాప్తము.

నిగమనము

ఇక్కడికి ఈ గ్రంథము సంపూర్ణమయినది. ఇందు తాత్పర్యము వ్రాయుట జరిగినది. అయ్యగారి కృతులలో సాధారణముగా ఏదో ఒక విశేషము లేక ఉండదు. నాబుద్ధికితోచిన ఆ విశేషములను వదలక గ్రంథమందు పొందు పరచినాను. ఈ చివరి సమయములో కొంత కాలము పరమార్థప్రదములైన అయ్యగారి కృతులతో వ్యాసంగము చేయుట నా అదృష్టమని తలచినాను.

''అనారంభో మనుష్యాణాం। ప్రథమం, బుద్ధిలక్షణం'' అనినట్లు దేనినీ ఆరంభింపని తత్త్వమునాది. ఈ పరిస్థితిలో నా శిష్యుడైన చి॥ యమ్. యస్. యన్. మూర్తి ప్రోత్సాహముచేత ఈ పనికి దిగి అయినది అనిపించాను. ఇందలి గుణదోషములకు ప్రాజ్ఞులే ప్రమాణము. ఈ పనియందు ఏదైనా సుకృతమున్నచో॥ కర్తాకారయితా॥ అనిన ప్రకారము నా శిష్యునకు కూడ సుకృతమునందు భాగము సంక్రమింపవలెనని నా ఆశాసనము.

ఉ॥ త్యాగయగారి కీర్తనలయందు వెలింగిన అర్థ సంపదన్
బాగుగ వెల్వరించు ప్రతిభానము గూర్చిన అయ్యవారికిన్
మాగురువర్యులైన అసమానయశో నిధులైన సన్మహా
భాగులకున్ ప్రణామముల భంగురభక్తి నిసంతరించెదన్

వివరణకర్త గురించి ...

పూర్తి పేరు	నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు
తల్లితండ్రులు	వేంకటరమణమ్మ, జగన్నాథ తిరువేంకటాచార్యులు
జననం	1924, కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట
విద్యాభ్యాసం	తండ్రిగారివద్ద తర్క-వ్యాకరణ మీమాంసాది శాస్త్రాలు; చిలకమఱ్ఱి కేశవాచార్యులు, పారుపల్లి రామకృష్ణయ్యపంతులుగారి వద్ద సంగీత శిక్షణ
ఉద్యోగం	1948 నుండి 1983 వరకు విజయవాడ ఆకాశవాణిలో నిలయ విద్వాంసులుగ.
బిరుదులు	గానకళాప్రపూర్ణ (ఆంధ్రప్రదేశ్ సంగీత అకాడమీ), సంగీత సాహిత్య కళానిధి, హరికథా చూడామణి, సంగీత కళాసాగర.
పురస్కారాలు	తెలుగు విశ్వ విద్యాలయం వారిచే విశిష్ట వ్యక్తి పురస్కారం. ఆకాశవాణి స్వర్ణోత్సవాల సందర్భంగా విశిష్ట వ్యక్తి పురస్కారం - నవంబర్ 1998
రచనలు - ముద్రితములు తెలుగులో	1. గోదాస్తుతి 2. బిడాల మోక్షం 3. పరకాల విలాసం 4. త్యాగరాజ చరితం 5. నారాయణ శతకం 6. నృసింహతాండవం (హరికథ) 7. త్యాగరాజ అష్టోత్తరం 8. ఆలయములు ఆళ్వారులు 9. దుర్మోహ నిర్మూలనము 10. ప్రాచీన భగవద్గీతా పరామర్శము 11. ఆరావముదు ఖండనము 12. కృష్ణమాచార్య సంగీత కృతులు 13. స్వరరాగ సుధ (వ్యాస సంకలనం) 14. సంప్రదాయ వాఙ్మయ సౌరభం (రచనా సంకలనం)
సంస్కృతములో	1. రామాయణ కథాయాం వ్యపదేశాः 2. మృత సంజీవనమ్ (నాటకమ్) 3. శతగోపచరితమ్ 4. నౌకా చరితమ్
అముద్రితములు	రామాయణ, భక్త జయదేవాది సంస్కృత హరికథలు 10 యామునాచార్య చరితము, వరదాభ్యుదయము, భక్త రామదాసాది తెలుగు హరికథలు. విప్రనారాయణ (వేదాంతం వారిచే ప్రదర్శితమయేది) యక్షగానం